రమణ పెరియ పురాణం

(శ్రీరమణ భక్త విజయం)



—

రమణ పెరియ పురాణము

విషయ సూచిక

సంపాదకుని పలుకు - సురేష్‌కైలాష్

పరిచయము - వి. గణేశన్

1. అమ్మఅళగమ్మాళ్ 13
2. పళనిస్వామి 18
3. పెరుమాళ్ స్వామి 21
4. రామనాథ బ్రహ్మచారి 24
5. గంభీరమ్ శేషయ్య 26
6. శివప్రకాశం పిళ్ళై 28
0. జగజ్జనని 33
7. రత్నమ్మాళ్ 34
8. మీనాక్షి అమ్మాళ్ 35
9. దేశూరమ్మాళ్ 36
10. ఎచ్చెమ్మాళ్ 38
11. ముదలియార్‌పాటి 40
12. కావ్యకంఠగణపతి ముని 41
13. సాధు నటనానంద 48
14. మానవాసి రామస్వామిఅయ్యర్ 51
15. ఫ్రాంక్ హంఫ్రీస్ 56
16. మస్తాన్ స్వామి 59
17. విలాచెరి రంగఅయ్యర్ 64
18. సాబ్‌జాన్ 71
19. టి.కె.సుందరేశ అయ్యర్ 73
20. వెంకటేశ శాస్త్రి 82
21. రాజా అయ్యర్ 90
22. జి. రామస్వామి పిళ్ళై 94
23. కుంజుస్వామి 100
24. నిరంజనానందస్వామి 119
25. బి.వి.నరసింహస్వామి 129
26. శుద్ధానంద భారతి 133
27. కృష్ణభిక్షు 135
28. దేవరాజముదలియార్ 137
29. విశ్వనాథస్వామి 145
30. అణ్ణామలైస్వామి 153
31. మురుగనార్ 161
32. జగదీశశాస్త్రి 173
33. దైవరాత 175
34. కె.పి.లక్ష్మణశర్మ 178
35. మునగాల వెంకటరామయ్య 182
36. కె.కె.నంబియార్ 188
37. ప్రొఫెసర్ జి.వి.సుబ్బరామయ్య 192

38. పాల్‌బ్రంటన్ 198
39. మేజర్ చాడ్విక్ 208
40. మారిస్ ఫ్రిడ్‌మన్ 220
41. ఎస్.ఎస్.కోహెన్ 228
42. ఎన్. బలరామరెడ్డియార్ 236
ఆశ్రమంలో వంట చేసే స్త్రీలు 243
43. శాంతమ్మాళ్ 245
44. శంకరమ్మాళ్ 250
45. సుబ్బలక్ష్మి అమ్మాళ్ 254
46. సంపూర్ణ అమ్మాళ్ 259
47. లోకమ్మాళ్ 262
48. టి.పి.రామచంద్రయ్యర్ 265
49. స్వామి మాధవతీర్థ 274
50. చగన్‌లాల్. వి. యోగి 280
51. ప్రొఫెసర్. ఎన్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్ 285
హాలులోని పరిచారకులు 292
52. జి. దొరైస్వామి అయ్యర్ 294
53. శివానంద స్వామి 295
54. రామకృష్ణ స్వామి 296
55. వైకుంతవాసర్ 298
56. డాక్టర్. ఎం. అనంతనారాయణరావు 299
57. సాధు బ్రహ్మణియమ్ 301
58. యోగిరామయ్య 303
59. డాక్టర్ ఎం.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్ 306
60. డాక్టర్ హాఫీజ్ సయ్యద్ 311
61. సబ్‌రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్ 314
62. డాక్టర్ టి.ఎన్. కృష్ణస్వామి 322
63. ప్రేమ్‌జీ దొరాబ్జీ 328
64. హెచ్. సి. ఖన్నా 332
65. శివరామ రెడ్డియార్ 338
66. జానకీ మాత 343
67. ఎలినార్ పాలిన్‌నోయా 347
68. సూరి నాగమ్మ 350
69. ఆర్థర్ ఆస్‌బోర్న్ 356
70. పాపాజీ 369
71. రాబర్ట్ ఆడమ్స్ 379
72. లక్ష్మణస్వామి 386
73. యోగిరామ్ సూరత్‌కుమార్ 389
74. వోల్టర్ కీర్స్ 398
75. నాగలక్ష్మి 407
కృతజ్ఞతతో 414
శ్రీ గణేషన్ 416

పీఠిక

సంపూర్ణ సద్గురువు, పరమ దయాళువు, జ్ఞానప్రదాత, అయిన శ్రీరమణులు, జనన మరణములకు అతీతులై ఉండికూడా, కేవలము మానవాళి పట్ల కరుణతో, మానవులు తమ యొక్క స్వస్వరూపమును తెలుసుకుని, అందులో నిష్ఠులై ఉండుటకు తోడ్పడుటకై మానవ రూపము ధరించి భువికేతెంచిన కరుణారసమూర్తి.

సద్గురువును గురించిన మిక్కిలి ఆకర్షణీయమైన విషయమేమిటంటే, వారి బోధలను నిజాయితీతో, శ్రద్ధతో, పట్టుదలతో అనుసరించిన ఏ వ్యక్తి అయినా, వారి వలెనే పరిపూర్ణ స్థితిని అందుకొనగలరు.

ఏ పనిని చేపట్టినా, అది ఐహికమైనదైనా, లేక ఆధ్యాత్మికమైనదైనా, ప్రేమ పూర్ణమైన శ్రద్ధతో చేయబడినప్పుడు అది సత్ఫలితాన్ని ఇస్తుంది. దానికై పడిన శ్రమ కూడా, సుఖదాయకంగా, మధురంగా, అనిపిస్తుంది.

ఈ శరీరము సజీవ ఈశ్వరాలయము. సద్గురుబోధను శ్రద్ధతో ఆచరించుట ద్వారా, గురుకృపను పొందగల్గిన వారు, హృదయములోని చైతన్యమును గుర్తించి, అందు నిష్ఠులై, జననమరణాల విషవలయంనుండి, సహజముగా ముక్తులై భవసాగరమును దాటగలరు. సద్గురువు జ్ఞానసంపన్నులు. సర్వసమర్థులు. శిష్యుని కర్తవ్యం, తనను తాను సిద్ధపరచుకోవటమే.

మన ప్రియతమ రమణుల జీవితకాలములో, ఆయనకు భక్తులై, ఆయనను తమ ఆధ్యాత్మిక సద్గురువుగా భావించి, ప్రేమ, భక్తి, అంకిత భావములతో ఆయనకు పరిపూర్ణ శరణాగతి చెంది, తమ జీవితములను సఫలము చేసుకొన్న భాగ్యశాలురైన అనేకమంది మహనీయులకు, వారి సద్గురువైన శ్రీరమణమహర్షితో గల వ్యక్తిగత అనుబంధమును వివరిస్తుంది, శ్రీ గణేశన్‌చే రూపొందించబడిన, **'రమణ పెరియ పురాణమ్'** అనే ఈ ఆంగ్ల గ్రంథము. ప్రకృతిలోని ప్రతి పువ్వు తనకొక సున్నితమైన సౌందర్యమును కలిగి ఉన్నట్లే, ఈ భక్తులు ప్రతి ఒక్కరూ ఒక విశిష్టమైన స్వభావము కలిగి ఉన్నారు. వారిలో ప్రతి ఒక్కరికి ఎవరికి వారికే ప్రత్యేకముగా వారి వారి స్వభావములననుసరించి, ఎవరికి తగిన సాధనను వారికి సూచించి, ప్రేమతో, అంతులేని ఓర్పుతో, అవసరమైన చోట కాఠిన్యముతో, కరుణతో, వారిని ఆధ్యాత్మిక పథములో నడిపించి, వారు వారి అంతరంగములోని సత్యమును దర్శించి, ఆత్మనిష్ఠులై ఉండుటకు భగవాన్ శ్రీరమణ మహర్షి తోడ్పడ్డారు.

ఆధ్యాత్మికతలోని లోతైన సమస్యల గురించి అధికారపూర్వకంగా, ప్రామాణికంగా మాట్లాడగలిగిన మహాత్ముడు ఆయన.

భగవాన్‌చే రచించబడిన 'ఉన్నది నలుబది'ని ఇంగ్లీషు లోనికి, సంస్కృత భాషలోనికి అనువదించిన శ్రీలక్ష్మణశర్మ గ్రంథపరిచయములో తమకు, తమ సద్గురువుపట్ల గల ఆరాధనాభావమును, ఇలా వెల్లడిచేశారు. "అరుణాచల రమణుల యొక్క బోధలతోనూ, ఆయన జీవితముతోనూ, సరిపోలి ఉండుట వలననే, ప్రాచీన వేదాంత గ్రంథములు, ఉపనిషత్తులు, ప్రామాణికతను సంతరించుకున్నవి మా దృష్టిలో. ప్రపంచములో ఏ మూలనున్న వారైనా సరే, భగవాన్ శిష్యులకు ఆదిగ్రంథములు ఆయన బోధలే.

స్వయముగానే పండితులు, బహుభాషా కోవిదులైన సుందరేశఅయ్యర్, కావ్యకంఠ గణపతిమునిగారి, అత్యంతవిశిష్ట పాండిత్య ప్రతిభను తిలకించి ఆశ్చర్యముతో తలమునకలైపోగా, కావ్యకంఠులవారు, "సుందరేశా! భగవాన్ అనుగ్రహము లేనిదే, వేదములలోని మర్మములు గ్రహించుట మనకు అసాధ్యము," అని వినయశీలియై పలికారు.

సున్నిత మనస్కుడు, ఉత్సాహవంతుడు, సజ్జనుడు అయిన చగన్‌లాల్ వి.యోగి స్వాతంత్ర్యము రాక పూర్వము తన చుట్టూ ఉన్న సంఘములోని దౌర్జన్యము, అవినీతి, అరాచకత్వము, దుర్మార్గము మొదలైన వాటిని చూచి చలించిపోయి, వికలమనస్కుడై, మిక్కిలి సంశయశీలిగాను, నిరాశావాదిగాను మారి దేవుడు లేడు, మహాత్ములు, సాధువులు అనబడువారందరూ ఈ సంఘమునకు పట్టిన చీడపురుగులు అంటూ మహర్షి వద్దకు వెళ్ళమని మిత్రులు చెప్పిన సలహాని త్రోసిపుచ్చారు. విధివశాత్తూ (గుర్వనుగ్రహముచే) శ్రీరమణుల వద్దకు వెళ్ళి, ఆయనచెంత, మూడు రోజులు గడిపిన చగన్‌లాల్ పరిపూర్ణముగా మార్పుచెంది ఈ విధంగా అనుకున్నారు. తన మూర్ఖత్వముతోనూ, అజ్ఞానముతోనూ, అనేక బాధలకూ, గాయములకూ గురౌతున్న ఈ మానవాళి, కేవలము ఈ భూమిపై మహర్షి యొక్క ఉనికి వలననే ఉద్ధరించబడుతుంది, కాపాడబడుతుంది అని నాకు అన్పించింది.

భగవాన్ ప్రముఖ శిష్యులైన శ్రీమురుగనార్, శ్రీరమణ అనుభూతిలో ఇలా అన్నారు:

"ఈ శరీరమే నేను", అనే భయంకరమైన భ్రమ తొలగిపోయే సరికి, సద్గురువు పవిత్ర పాదముల వద్ద, స్వచ్ఛమైన 'కాంతి' అనే పుష్పము వికసించి, నా ప్రేమతోపాటు, దాని ప్రకాశము కూడా మరింత ఉజ్వలంగా వృద్ధి చెందసాగింది. చివరకు హృదయములో 'నేను', 'నేను' అని ఎడతెగక స్ఫురించే చైతన్యమును, మచ్చలేని పరిపూర్ణ ఆత్మజ్ఞానమును గుర్తించేవరకు.

భ్రమలో చిక్కిన వాడనై, మనసుయొక్క కలలు అనే చిక్కుదారులలో, ఇటు అటు పరుగెత్తుతూ, ఇది కావలెను, అది కావలెను, అని కోరుకుంటూ, గడిపిన నేను, హృదయములోని చైతన్యములో, ఐక్యమై ఆనందమును పొందినపుడు, నా శరీరము, అవధులు లేని దివ్యజ్ఞాన ప్రకాశములో కలిసి కరిగిపోయింది. నా హృదయము గాఢమైన అంతర ప్రకాశముతో నిండిపోయింది.

రమణుల దృష్టిలో గతము, భవిష్యత్తు లేవు. ఉన్నది నిరంతరమైన ప్రస్తుతమే. గతములోనికి, భవిష్యత్తులోనికి, బాహ్య విషయములపైకి దృష్టిని మరలనీయక, ప్రస్తుతములో ఉండి, హృదయములో ఉండి దృష్టిని మరల్చక రమణుల అనుగ్రహమునకు పాత్రులమగుదముగాక.

ఈ గ్రంథము తెలుగువారికి ఉపయోగపడవలెనన్నది భగవాన్ సంకల్పము. వారు ఉపయోగించుకున్న ఈ పరికరములోని దోషముల వలన, గ్రంథములో దోషములు దొర్లిన, సహృదయులు తెలియపరచిన సవరింపబడతాయి.

శ్రీరమణులకు అర్పించునది ఎవరు?

ఇది ఆయన ప్రసాదమే కదా!

ఈ శ్రీరమణమహర్షి భక్తులగు మహనీయులందరినీ, భక్తిశ్రద్ధలతో, ఓర్పుతో సేవించి, వారి కృపకు పాత్రులై వారినుండి ఈ చక్కని విషయములను సేకరించి, ఎంతో శ్రమకోర్చి ముముక్షువులకు కానుకగా అందించిన శ్రీ గణేశన్‌కు సాధకులమైన మనమెంతో ఋణపడి ఉంటాము.

వారికి కృతజ్ఞతాంజలి.

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

జగత్పావన చారిత్రం భాసమానం స్వతేజసా

వందే నిష్కర్మ నిరతం రమణం మునిపుంగవం



అమ్మ అళగమ్మాళ్ దేవాలయం
(మాతృ భూతేశ్వర ఆలయం)



అమ్మ అళగమ్మాళ్

అది 1879వ సంవత్సరము. స్థలము 'దక్షిణ భారతదేశములోని తమిళనాడు రాష్ట్రములోని మారుమూల గ్రామము. ఆ రోజు ఆరుద్ర దర్శనము. అరుణాచలేశ్వరుడు ఆదిమమైన, అనంతమైన జ్యోతిస్తంభము నుండి వెలువడి, అహంకారముతో పోట్లాడుకుంటున్న దేవతల అహంకారమును నాశనము చేసి, వారికి జ్ఞానమును ప్రసాదించిన రోజు.

ఆ శుభదినమున అర్ధరాత్రివేళ, తిరుచ్చుళిలోని ప్రసిద్ధిగాంచిన భూమి నాథేశ్వర ఆలయములో, ఈశ్వరుడు ఊరేగింపును ముగించుకుని గుడికి తిరిగి వచ్చిన వేళ, ఆ ఊరిలోని ఉత్తరవీధిలోని ఒక చిన్న గృహములో ఒక పసికందు రోదన విన్పించింది. మాతృదేవి అళగమ్మాళ్ ఒక మగబిడ్డని ప్రసవించింది. ఆ పసిబిడ్డే కాలాంతరములో, భగవాన్ శ్రీరమణ మహర్షిగా ప్రఖ్యాతి గాంచారు. ఆయన చిన్ననాటి పేరు వెంకట రామన్. ఆయన జీవితమంతటిలోనూ, అగ్ని, కాంతి యొక్క అంశములు ముఖ్యపాత్ర వహించినవి. భగవాన్ తల్లి ఎన్నిసార్లు గర్భవతిగా ఉన్నప్పటికీ భగవాన్ ఆమె కడుపులో ఉన్నపుడు మాత్రమే మంటలు ఆమెను బాధించేవి. ఆ బాధ నుండి ఉపశమనము పొందు టకు వేప ఆకులు, మారేడు ఆకులు గుజ్జుగా నూరి పొట్టకు రాయవలసి వచ్చేది. తర్వాత బాలుడు జన్మించినపుడు, గ్రుడ్డిదైనటువంటి మంత్రసాని, ఒక గొప్ప వెలుగును చూసింది.

చాలా చిన్నతనములోనే భగవాన్ హృదయ స్ఫురణను వినగలిగే వారు, రోజంతా స్ఫురణ శబ్దము వింటున్నప్పటికీ, ఆ శబ్దమేమిటో ఆయనకు తెలియదు. తదుపరి ‹ ᵕ గున సద్గురువుగా వెల్లడి అయినపుడు "మీరు ఆ హృదయ స్ఫురణ గురించి ఎవరినైనా అడిగి, ఎందుకు దాని వివరములు తెలుసుకొనలేదు?" అని ఎవరో ప్రశ్నించగా "ఎవరైనా ఇతరుల వద్దకు వెళ్ళి వారు శ్వాస పీలుస్తున్నారా లేదా? అని పరిశీలిస్తారా? చిన్నతము నుండి అది నా శరీరములో అలాగే ఉన్నది. అది అందరికీ అలాగే ఉంటుందని నేను అనుకున్నాను" అన్నారు. (ఆ విధంగానే స్వామి వివేకానంద కూడా చిన్నప్పుడే తన కనుబొమ్మల మధ్యన నీలికాంతిని చూస్తుండేవారు. "మీరు ఎవరినీ ఈ విషయమై ఎందుకు ప్రశ్నించలేదు?" అని ఎవరో ఆయనను అడిగినపుడు, ఆయన "అందరికీ ఆ విధంగానే కన్పిస్తుంటుందని నేను అనుకున్నాను" అన్నారు. ఇది తప్ప, మిగిలిన విషయములలో వెంకటరామన్ సామాన్యబాలుడే. ఆయన గొప్ప మహర్షిగా మారబోతున్నారనే విషయములేవీ అప్పట్లో ఆయనలో కన్పించేవి కావు. తండ్రి చనిపోయిన తర్వాత రమణుల కుటుంబము విడిపోవలసి వచ్చింది. భగవాన్ తల్లి, మానా మధురై లోని తన మరిదిగారింట్లో ఉండసాగారు. వెంకటరామన్‌ను తిరుచ్చుళికి ముప్పదిమైళ్ళ దూరములో ఉన్న మధురైకు పంపారు. వెంకటరామన్ అక్కడ అమెరికన్ మిషన్ స్కూలులో చదివారు. ఆయన వేదాంత గ్రంథములేవీ అప్పట్లో చదవలేదు. ఆయన 'పెరియపురాణం' అనే పుస్తకమును మాత్రమే చదివారు. పెరియపురాణము 63 మంది గొప్ప శివభక్తులైన నాయనమార్ల భక్తి గాథలను కలిగి యున్నది. "అప్పట్లో నాకు వేదాంతము గురించి గానీ, ఆధ్యాత్మికత గురించి గానీ ఏ విధమైన పరిజ్ఞానమూ లేదు. బ్రహ్మ, ఆత్మ, సమాధి, జ్ఞానము, జీవుడు, మనసు అనే పదములు కూడా తెలియదు," అని అన్నారు రమణులు.

మధురైలో ఆయనకు పదహారేళ్ళ వయసులో 'మృత్యు అనుభవం కలిగింది. తండ్రి అరుణాచలేశ్వరుడు, వెంకటరామన్‌ను తిరిగి తన సన్నిధికి చేర్చుకొనదలచి ఆయనకు మరణానుభవము కల్గించారు. ఆ సమయంలో ఆయనకు తన శరీరము, మనసు కూడా కాలిపోయినట్లు స్ఫురించింది. తన శరీరమును స్మశానమునకు తీసికొని వెళ్ళి దహనం చెయ్యటము ఆయనకు కన్పించింది. మధురైని వీడి, తిరువణ్ణామలైకు పారిపోయి, అరుణాచలేశ్వరుని ఆలయంలో అగ్ని లింగమును వాటేసుకుని (ఆలింగనము చేసుకుని) "నీ మాటపై నేనిక్కడకు వచ్చేశాను. నీ ఇచ్ఛయే నెఱవేఱుగాక" అని పలికే వరకూ ఆ మంటల వేడి ఆయనను వీడలేదు.

భగవాన్ ఇల్లు వీడిన తర్వాత ఆయన ఎక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియదు. ఆయన తల్లికి ఈ విషయం తెలిసినపుడు, ఆమె దుఃఖ భారముతో ఆయనను వెదికించే ప్రయత్నములు చేశారు. కానీ అవి అన్నీ వృథా అయినవి. వెంకటరామన్ దక్షిణాదిలో 'కేరళలోని తిరువనంత పురంలో ఉన్నట్లు వార్తలు చేరినవి. ఒక బ్రాహ్మణ కుఱ్ఱవాడు అక్కడ వీధులలో తిరుగుతున్నట్లు ఎవరో కబురు

అందించారు. భగవాన్ తల్లి తిరువనంతపురం చేరి, ఆ పిల్లవానిని కనుగొని, తనతో రమ్మనీ, కనీసం ఒకసారైనా తనవైపు చూడమనీ ప్రాధేయపడ్డారు. కానీ ఇవేమీ పట్టించుకొనకుండా ఆ కుఱ్ఱవాడు పారిపొయ్యాడు. ఆ కుఱ్ఱవాడే తన వెంకటరామన్ అని ఆమె భావించారు. ఆమె ఈ విధముగా దుఃఖిస్తూ కాలము గడపుతుండగా, ఎవరో తిరువణ్ణామలైలో తన పేరు 'తిరుచ్చుళి వెంకటరామన్' అని వ్రాసిన వ్యక్తిని తాను కలిసానని చెప్పారు. ఈ వార్త విని, ఆశతో మెత్తని మనసు గల తన మరిదిని తిరువణ్ణామలైకు పంపారు. ఆయన తిరిగి వచ్చి, ఈ వార్తను రూఢి చేశారు. "అవును. నేను వెంకటరామన్‌ను చూశాను. ఆయన గాఢ ధ్యానంలో మునిగిఉన్నారు. తిరిగి రమ్మని నేనెంతగా వేడినా, ఆయన ఏమీ బదులివ్వకుండా రాతివలె కూర్చుని వున్నారు" అన్నారు.

తన మాటను తనయుడు తీసివెయ్యలేడనే నమ్మకముతో, తనే వెళ్ళి ప్రాధేయపడి ఎట్లాగో ఆయనను తీసుకుని వద్దామని నిశ్చయించుకున్నారు తల్లి అళగమ్మాళ్. అది 1898వ సంవత్సరము. భగవాన్ మధురై వదిలి తిరువణ్ణామలైకు వచ్చి, అప్పటికి రెండేళ్ళు అయినది. అపుడు భగవాన్ పవళక్కున్రు, అనే చిన్న కొండపై ఒక బండరాయి మీద కూర్చుని ఉన్నారు. అక్కడకు చేరిన తల్లి ఆయనను ఈ విధంగా ప్రాధేయపడ్డారు. "నాయనా! ఇంటికి వచ్చేసెయ్యి. నిన్ను ఏ మాత్రమూ ఇబ్బంది పెట్టము. నీకు ఇక్కడ చూసేవారు ఎవరూ లేరు కదా. నేను నీకు భోజనము పెట్టి, నీ శరీర పోషణను చూసుకుంటాను. నీ వ్యవహారములో జోక్యము చేసుకోను. నీ ఆధ్యాత్మిక సాధనను అక్కడ కొనసాగించు కొనవచ్చును. దయచేసియింటికి తిరిగిరా" కానీ, భగవాన్ నుండి ఏ విధమైన సమాధానము రాలేదు. ఆయన ఒక బండరాయి వలె కదలక మెదలక ఉండి పోయారు. (మురుగనార్ అంటుండేవారు. అరుణాచలంపై ఉన్న పెద్ద గండశిల అయినా ఎప్పుడైనా కదులుతుందేమో గానీ, భగవాన్ మాత్రము కదలరు. మీరు భగవాన్‌ను కదిలించలేరు అని)

ఒకరోజు తిరువణ్ణామలైలో ఉండే కొందరు వ్యక్తులు, ఆ వృద్ధురాలు ఏడుస్తూ, కొండపైకి క్రిందకు తిరగటము చూసి, ఆ బాలస్వామిని ఈ విధంగా నిలదీశారు. "మీరు సమాధానమెందుకు ఇవ్వరు? అవుననో, కాదనో, తేల్చి చెప్పవచ్చును గదా! మూడు రోజులుగా ఈమె కన్నీటితో ఇంతగా ప్రాధే[illegible]డుతున్నా, మీరు సమాధానము ఎందుకివ్వరు?" కొంచెము మెత్తబడిన రమణులు, ఒక చిన్న కాగితముపై ఇలా వ్రాశారు. "అన్ని వేళలా అంతటా నిండి వున్న సృష్టికర్త, జీవులందరినీ, వారి వారి ప్రారబ్ధానుసారము ఆడిస్తూ ఉంటారు. ఎవరు ఎంతగా ప్రయత్నించినా జరుగనిది జరుగనే జరుగదు. ఎవరు ఎంతగా అడ్డుపడినా, జరిగేది జరుగక మానదు. ఇది సత్యము, తథ్యము. అందువలన మౌనమే శరణ్యము".

పైకి చూచుటకు ఇది తల్లి విన్నపమును త్రోసి పుచ్చినట్లు కనపడినా, ఈ పదములకు లోతైన అర్థమున్నది. జరుగరానిది ఎంతగా ప్రయత్నించినా జరుగనే జరుగదు. జరుగవలసినది జరిగి తీరుతుంది. అయితే మరి వ్యక్తియొక్క బాధ్యత ఏమిటి? ప్రతిపనీ ఎలా జరుగవలసినదీ ముందుగానే నిర్ణయింపబడినట్లయితే, ప్రతి ఒక్కరూ తమ ప్రారబ్ధాను సారమే నడచుకుంటున్నట్లయితే, మరి వ్యక్తి యొక్క ఉనికి సత్యమేనా? ఈ సందేహముతోటే ప్రాథమిక ప్రశ్న అయిన "నేనెవరు?" తలెత్తుతుంది. తరువాత వాక్యములో 'ఇది నిశ్చయము' అని దానికి అధికార ముద్ర వేశారు. మనసుకు 'నిశ్చయము' అనే లంగరు అవసరము. చివరగా ఊరక ఉండుటయే ఉత్తమము అన్నారు. మౌనముగా విధిని అంగీకరించుట శరణాగతికి ముందడుగు. మౌనంగా శరణాగతి చెందుటయే ఆత్మాన్వేషణకు దారి చూపిస్తుంది. అలజడి చెందిన మనసుతో ఎవరూ శరణాగతి చెందలేరు. కావున మనము ఈ మొదటి ఉపదేశములో నిబిడీకృతమైయున్న జ్ఞానమును గురించి లోతుగా ఆలోచించాలి. మనము ఒక మహాత్ముని జీవితాన్ని గురించి ఒక నవల లాగానో, చారిత్రక కథనం లాగానో కాక, భక్తి శ్రద్ధలతో చదివినట్లయితే, అందులోని ఒక వాక్యము లేదా ఒక మాట, మనకు దారి చూపించవచ్చును. మాతృదేవి అళఘమ్మ ద్వారా పొందబడిన ఉపదేశమే చాలా ముఖ్యమైనది, శక్తివంతమైనది.

ఏసుక్రీస్తు తన తల్లితో ఇలా అన్నారు. "అమ్మా! స్త్రీవైన నీతో నాకేమి పని? నేను నా తండ్రి ఆదేశమును నిర్వర్తించుటకై వచ్చాను. భగవాన్ కూడా తన చర్యల ద్వారాను, చీటీ ద్వారాను, ఈ విధంగానే తన తల్లితో చెప్పినట్లు కన్పిస్తుంది. "ప్రతి ఒక్కరి నిజస్థితి, అతని హృదయంలో దాగియున్న మౌనమేనని, మానవాళి మరచిపోయిన సత్యాన్ని తిరిగి మానవాళికి జ్ఞప్తికి తెచ్చి, ప్రతివారి హృదయంలోను "నేను", "నేను" అని స్ఫురించే 'ఎఱుక'యే అరుణాచలేశ్వరుని నిజ స్వరూపమని, అది మనసుచే ఆవరింపబడి యుండుటచే మరుగైయున్నదని, ఆ ఆవరణను తొలగించినట్లయితే ఆ వైభవంగా ప్రకాశిస్తున్న సత్యాన్ని దర్శించగలమని, అందరికి తెలియజేయుటయే నా తండ్రి, నాకు అప్పగించిన పని. కావున ఓ మాతృమూర్తీ! అళగమ్మాళ్! మీరు కూడా దీనిని అంగీకరించండి."

భగవాన్ తల్లి నిస్పృహతో మిగిలిన కుటుంబ సభ్యుల చెంతకు వెళ్ళిపోయారు. భగవాన్ ఇంతటి మహోన్నతమైన ఉపదేశమును తన తల్లికి 1898వ సంవత్సరములోనే అందించినా, తదుపరి పదిహేను సంవత్సరముల వరకూ, ఆమె కుటుంబ వ్యవహారములలోనే చిక్కుకుపోయారు. 1913 నాటికి గొప్ప విపత్తు సంభవించింది. తన చిన్న కుమారుడు, కుమార్తె తప్ప మిగిలిన దగ్గర బంధువులందరినీ ఆమె కోల్పోయింది. ఆమె విచారంలో మునిగిపోయింది, ఇక వారసులెవరూ ఉండరేమో? అని. భగవాన్ అన్నగారు తన 22వ ఏట మరణించారు. అప్పటికి ఆయన భార్యకు నిండా 20 సం॥లు కూడా లేవు. వారికి బిడ్డలు లేరు. భగవాన్ బ్రహ్మచారిగా మిగిలిపోయారు. ఆయన చెల్లికి కూడా సంతానం లేదు. భగవాన్ తమ్మునికి వివాహమైనప్పటికీ, ఆయనకూ సంతానం లేదు. 1913లో తల్లి అళగమ్మాళ్ తన చిన్నకోడలిని, కుమారుని విరూపాక్ష గుహలో ఉన్న భగవాన్ వద్దకు తీసుకొని వచ్చి, వారికి ఒక పుత్రుని ప్రసాదించవలసినదిగా భగవాన్‌ను వేడుకున్నారు. ఆ మరుసటి సంవత్సరమే వారికొక పుత్రుడు కలిగాడు. భగవాన్ పట్ల కృతజ్ఞతతో వారతనికి వెంకటరామన్ అని పేరు పెట్టారు. అప్పటికి ఆయన ఒక్కడే భగవాన్ కుటుంబానికి వారసుడు.

1914లో ఇంకా కుటుంబ వ్యవహారాలలో చిక్కుకుని మునిగి ఉన్నపుడు తల్లి అళగమ్మాళ్ విరూపాక్ష గుహలోని భగవాన్ వద్దకు వచ్చింది. ఆమె తీవ్రమైన జ్వరంతో వచ్చింది. ఆ జ్వరము టైఫాయిడ్‌గా గుర్తించబడింది. భగవాన్, అరుణాచలేశ్వరుడిని ఈ విధంగా ప్రార్ధించారు. "జ్ఞాన జ్వాలాగ్నియైన ఓ అరుణాచలా! నీ తేజస్సులో ఆమెను ముంచి నీలో ఐక్యం చేసుకో". అళగమ్మాళ్ గారు స్వస్థురాలైంది. ఆయన ప్రార్ధన కేవలం తన తల్లికోసమే కాదు, మనందరి కోసమూ. మనము ఆత్మవిచారణ చేసినట్లయితే మనము కూడా అరుణాచలేశ్వరుని జ్ఞానాగ్నిలో మ్రింగి వేయబడతాము.

1916లో చిన్న కోడలు మరణించింది. ఆమె కుమారుడు భగవాన్ సోదరికి అప్పగించబడ్డాడు. భగవాన్ తల్లి ఈ ప్రాపంచిక వ్యవహారాలతో విరక్తి చెంది భగవాన్ చెంత ఉండడానికి విచ్చేశారు. ఆమెను ఆధ్యాత్మికంగా పరిపక్వ స్థితికి తీసుకుని రావడానికి ఆయనకు ఎనిమిది సంవత్సరాలుపట్టింది. భగవాన్ తన తల్లిని ఎలామార్చారో తెలిపే అందమైన కథలు చాలా ఉన్నాయి. బ్రాహ్మణ స్త్రీగా సనాతన సంప్రదాయాన్ని బాగా జీర్ణించుకున్న, ఆమె మూఢాచారాలను తొలగించాలి. బ్రాహ్మణ సంప్రదాయాలలో వారి దుస్తులు, వంటిల్లు, ఆహారము, వాడుకునే వస్తువులు మొదలైన వాటిని కేవలం బ్రాహ్మణులు మాత్రమే అంటుకోవడం, శుభ్రం చెయ్యడం వంటివి చెయ్యాలి. లేనిచో అపవిత్రమైనట్లు భావిస్తారు. నిమ్న కులస్తులు గానీ, కుక్కలు గానీ వారిని తాకితే, సంప్రదాయ బ్రాహ్మణులు వెంటనే స్నానం చేసి శుద్ధి చేసుకుంటారు. స్కందాశ్రమంలోను, విరూపాక్ష గుహలోను ఆ రోజుల్లో చాలా కుక్కలు వుండేవి. పర్యవసానంగా ఒకో రోజు ఆవిడ పదిసార్లు స్నానం చెయ్యవలసి వచ్చేది. ఆమె మీద జాలితో, గొప్ప పండితుడైన కావ్యకంఠ గణపతి ముని ఆమెతో యిలా చెప్పారు. "హిందూ శాస్త్రాల ప్రకారం మీరు ఒక జ్ఞానిని గనుక ముట్టుకున్నట్లయితే మీకంటిన మైల తొలగిపోతుంది. అప్పుడిక మీరు స్నానం చెయ్యవలసిన పని లేదు". అప్పటి నుండి ఎప్పుడైనా, ఆవిడ తనవైపుకు రావడం చూస్తే, దానికి గల కారణాన్ని భగవాన్ వెంటనే గుర్తించేవారు. ఆమె తనను తాకి అవతలకు వెళ్ళగానే, మందహాసంతో ఆయన ఇలా అనేవారు. "ఏదో కుక్క ఆమెను తాకి ఉంటుంది".

బ్రాహ్మణులు నీరుల్లిపాయలు, వెల్లుల్లి పాయలు తినరు. ఒక రోజు భగవాన్ చిన్నఉల్లిపాయను తీసికునితల్లి వద్దకు వెళ్ళి ఇలా అన్నారు. "జాగ్రత్త సుమా! ఇది స్వర్గ ద్వారమునకు అడ్డుగా నిలబడి, నిన్ను బయటకు నెట్టివేస్తుంది". ఇలాంటి విమర్శలతో ఆమెలోని ఛాందస భావాలను ఆయన తొలగించారు.

బంధువుల పట్ల మమకారం తొలగిపోయింది. కానీ భగవాన్ పట్ల కన్న మమకారము ఇంకా మిగిలి ఉంది. భగవాన్‌కు లోగడ అప్పడములంటే ప్రీతి అని, అక్కడి వారిని అడిగి,అప్పడం చెయ్యడానికి కావలసిన సరుకులు తెప్పించుకున్నారు ఆమె. ఒక దినమున అప్పడములు ఒత్తడానికి కూర్చుంటూ భగవాన్‌ను "నువ్వు కూడా ఈ పనిలో నాకు సాయం చెయ్యవచ్చును గదా!" అని అడిగారు. బిడ్డ మీద మమకారంతో కళ్ళు మూసుకునిపోయి, ఆయన చిన్నప్పటి కోరికలను తీర్చాలనుకున్నారు. అది అర్ధం చేసుకుని భగవాన్ "నీవు నీ అప్పడములను గుహ లోపల తయారు చేసుకో. నేను నా అప్పడములను బయట చేసుకుంటాను"' అన్నారు. ఈ విధంగా అప్పడము పాట తయారైంది. భగవాన్ ఆ పాటలో అప్పడములలో వాడే ప్రతి దినుసును గురించి ఆధ్యాత్మిక దృక్పథంతో వర్ణించి చెప్పారు. పాటలో అప్పడములు వత్తే విధానము, ముక్తినొందే ఆధ్యాత్మిక సాధనతో పోల్చబడినది. 'అహంకారమును', 'ఆత్మవిచారణ' అనే తిరుగలిలో వేసి తిప్పి, సత్సంగముతో కలిపి మెత్తనిముద్దలా చేసి, పలుచగా ఒత్తి, బ్రహ్మము అనే నేతిలో జ్ఞానము అనే అగ్నితో వేయించి, ఆత్మకు ఆహారముగా అర్పించాలి. ఈ పాటలో జీవుడు ఎలా పరిపక్వత సాధించాలి? పిండి దంచినట్లుగా అహంకారమును

ఎలా దంచి అణగకొట్టాలి, అన్నిటికీ సమాధానము "నేనెవరను" అను ఆత్మవిచారణ ద్వారానే అని ఉన్నది. ఆపాట ఆయన తల్లి హృదయమును సూటిగా తాకి, ఆమెలో మార్పును తీసుకుని వచ్చింది.

ఆమె తనకున్న కొద్దిపాటి సామానునూ గట్టిగా బందోబస్తు చేసుకునేవారు. భగవాన్ ఆమెలోని ఈ గుణమును కూడా మార్చివేశారు. ఒక రోజు, స్కందాశ్రమములో ఉండే, పవిత్ర జీవనమును గడిపే సభాపతి అనే పేరుగల సన్యాసి చిరిగిపోయిన చాలీచాలని బట్ట కట్టుకుని ఉన్నారు. అమ్మ, ఆయనను "సభాపతీ! ఎందుకిలా చిరిగిన వస్త్రము ధరించావు?" అన్నారు. అందుకతడు నవ్వుతూ సరదాగా "అమ్మా! మీరేమో పెద్ద చీరను కట్టుకుని ఉన్నారు. అది తొమ్మిది గజాల పొడవుంది. అందులో నుండి నాకు కొంత ఇవ్వవచ్చును గదా!" అన్నారు. అమ్మ వెంటనే తనచీరలో నుండి రెండు గజాల ముక్కను చింపి సభాపతికి ఇచ్చారు. ఆ విధంగా ఆమెకు తన స్వంత వస్తువులపై గల మమకారము కూడా తొలగిపోసాగింది.

ఒక రోజు కొందరు కట్టెలు కొట్టేవాళ్ళు స్కందాశ్రమమునకు వచ్చి "భగవాన్! మాకందరికి ఆకలిగా ఉన్నది" అని అడిగారు. అమ్మ అళగమ్మాళ్ ముందు తను తింటే గాని బయటి వారికి పెట్టరు. వేరేవాళ్ళు ముందు భుజిస్తే మడికి భంగం కలుగుతుందని ఆమె ఉద్దేశము. ఇది భగవాన్‌కు తెలుసు. అయినా ఆయన కుంజుస్వామిని పిలిచి "అమ్మతో ఆమె వండిన భోజనం తెచ్చి, వీళ్ళకు ఇవ్వమని చెప్పు" అన్నారు. ఆమె సందేహిస్తూ "నేనింకా భోజనం చెయ్యలేదని భగవాన్‌కు చెప్పు" అని గట్టిగా చెప్పారు. కుంజుస్వామి వెళ్ళి ఈ విషయమును భగవాన్‌కు చెప్పినపుడు, ఆయన లోపలున్న అమ్మ దగ్గరకెళ్ళి ఈ విధంగా నిష్కార మాడారు. "అదన్న మాట సంగతి. వాళ్ళు నీకంటే భిన్నంగా ఉన్నారనుకుంటున్నావా? ఒక్కసారి వచ్చి చూడు. వాళ్ళంతా అక్కడ నుంచుని ఉన్నారు". ఆమె వారిని చూడగానే ఆయన ఇలా అన్నారు. "వారంతా అరుణాచల స్వరూపమే. అరుణాచలుని రూపాలే." ఆయన అంటరానివారు అనే పదమును వాడలేదు. ఆ క్షణం నుండి బేధ భావమును వదిలివేసి, ఆమె అందరిలో అరుణాచలేశ్వరుడినే చూడసాగారు. ఆమెకు తనకూ, ఇతరులకూ బేధమేమీ కనపడకుండా పోయింది. భగవాన్ తల్లి పట్ల పుత్రుడుగా తన బాధ్యతలనన్నింటినీ చక్కగా నెరవేర్చేవారు. అప్పటికే భగవాన్ ఎంతో పేరు పొందినప్పటికీ, కొద్దిమంది మాత్రమే ఆయనకు సాయం చెయ్యడానికి ఉండేవారు. వారు ఆయన కొరకు నీటిని తోడి కష్టపడి కొండపైకి మోసుకుని వచ్చేవారు. కానీ తల్లి కొరకు మాత్రము భగవానే నీటిని తీసుకుని వచ్చేవారు. రెండు పెద్ద పాత్రలనిండా నీటిని తీసుకుని వచ్చి, తల్లిని కూర్చోబెట్టి, స్నానం చేయడానికి నీటిని ఆమెపై పోసేవారు. ఆమె దుస్తులు కూడా ఆయనే ఉతికేవారు. ఆమె భౌతిక అవసరములన్నీ తీరుస్తూ ఆమె పట్ల ప్రేమతో ఉన్నప్పటికీ, ఆమెలో ఏదైనా విషయంలో మార్పు తీసుకుని రావాలనుకున్నపుడు అవసరమైతే కఠినంగా ఉండగలిగేవారు. ఎనిమిదేళ్ళ కాలంలో నెమ్మదిగా, నిశ్చయంగా, ఆమెలోని సంకుచిత దృక్పథమునూ, పురాతన సంప్రదాయములనూ, మూఢ నమ్మకాలనూ, సాంఘిక ఆచారములనూ దూరం చేశారు, దరిదాపుగా తొలగించి వేశారు. అంత గొప్ప మహర్షి అత్యంత సమీపములో ఉండి, మాతృదేవి ఎడల ప్రేమతో ఎంతగానో ప్రయత్నించినా, ఆమెలో పరిపక్వత తీసుకుని వచ్చుటకు ఎనిమిది సంవత్సరములు పట్టింది. ఇందులోని విశేషమేమిటంటే, ఆమె పూర్తి శరణాగతి భావంతో తనలో మార్పు రావడానికి సహకరించింది. (ఇక్కడ మనము నేర్చుకొనవలసిందేమిటంటే మనం కొద్ది సంవత్సరములు సాధన చేసి, సాధనలో ప్రగతి సాధించలేదని విచారించగూడదు)

ఒక రోజు భగవాన్ చెల్లెలు తల్లి వద్దకు వచ్చి "అమ్మా! నీకు ఒంట్లో బాగా లేదు. మాయింటికి వస్తే అక్కడ నీకు సౌకర్యంగా ఉంటుంది" అన్నారు. అందులకు ఆమె నిరాకరించి, భగవాన్ వైపు తిరిగి ఇలా అన్నారు. "నేను నీ చేతుల మీదుగానే చనిపోవాలనుకుంటున్నాను. నేను చనిపోయిన తర్వాత, ఈ శరీరమును ముళ్ళపొదలలోనికి విసిరేసినా సరే, నేను బాధపడను". ఇది జరిగిన తర్వాత కొద్ది రోజులకే ఆమె తీవ్రంగా జబ్బుపడ్డారు. చివరి రోజున భగవాన్ ఆమె ప్రక్కనే కూర్చుని, తన ఎడమచేతిని ఆమె తలమీద, కుడి చేతిని ఛాతీపై కుడిప్రక్కన ఉంచారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ఆయన అలాగే ఉండిపోయారు. అక్కడ చేరిన భక్తులందరకు ఆమెకు మరణ సమయం ఆసన్నమయిందని తెలిసిపోయింది. ఒక కుమారుడు, తన తల్లిలో, చైతన్యములో విభజనలున్నట్లు కన్పింప చేసే పరిమితులన్నిటినీ పూర్తిగా తొలగించి, తన తల్లి ఆత్మను అనంత పరమాత్మలో ఐక్యము చేయుటకు సల్పిన కృషిలోని పవిత్రతనూ, ఔన్నత్యమును, అక్కడ ఉన్నవారంతా తిలకించారు. ఆ సమయంలో అక్కడే వున్న కుంజుస్వామి, అక్కడున్న అందరూ, అనంతము లోనికి ఆత్మ ప్రయాణించుటను భౌతికంగా తిలకించినట్లు భావించారని అన్నారు. తర్వాత, ఒక జ్వాల నుండి వెలుగు వేడి వ్యాపించినట్లయింది అన్నారు ఆయన. జీవాత్మ, మనసు హృదయంలో పూర్తిగా లీనమైపోయినవని నిర్ధారించుకున్న తర్వాత, భగవాన్ తన చేతులను, ఆమె శరీరముపై నుండి తీసివేసి "ఎప్పుడైతే అహంకారము పూర్తిగా నాశనమైపోయి, జీవాత్మ హృదయములో ఐక్యమైపోతుందో, అపుడు ఒక మృదువైన ఘంటానాదము వంటిది తెలుస్తుంది" అన్నారు.

సామాన్యంగా జరిగేదేమిటంటే, ఎక్కడైనా మరణం సంభవిస్తే, ఆచారము ప్రకారము అక్కడున్న వారందరూ స్నానము చేస్తారు. భగవాన్ తల్లిగారి విషయంలో అటువంటిదేమీ అవసరము లేదని అన్నారు. ఆమె చనిపోలేదు. ఆమె అరుణాచలునిలో ఐక్యమైనారు. కావున మనకు మైల లేదు అన్నారు. తదుపరి అక్కడ వున్న భక్తులు "మీరు ఆమె శిరస్సు మీదా, హృదయం మీద చేతులు పెట్టి ఏమి చేశారు? అపుడు ఖచ్చితంగా ఏమి జరిగింది?" అని భగవాన్‌ను ప్రశ్నించారు. అంతర్గతమైన వాసనలు, గత అనుభవముల తాలూకు సూక్ష్మ తరమైన స్మృతులు ఏవైతే తిరిగి కర్మల ననుభవింపజేసేవిగా ఉంటాయో అవి నేనామెపై చేతులుంచినపుడు వేగవంతమైనవి. ఒక్కొక్క దృశ్యము ఆమె సూక్ష్మ మనసులో వరుసగా ప్రత్యక్షమైనవి. అప్పటికే ఆమె బాహ్య ఇంద్రియములు పని చెయ్యడం లేదు. అందువలన ఆమె జీవాత్మ వీటినన్నిటినీ అనుభవించినట్లయి, ఆ వాసనలకు లేదా కర్మలకు పునరావృత్తి, ఆమెకు పునర్జన్మ లేకుండా పోయి, ఆమె మనసు హృదయములో ఐక్యమైపోయేటట్లు చేసినవి. ఆ జీవాత్మ నుండి సంస్కారములన్నీ తొలగింపబడి, తన అంతిమ లక్ష్యమైన తిరిగి మాయకు వశపడనటువంటి 'అనంత శాంతి' అనే ముక్తి ధామానికి చేరుకుంది.

తన తల్లిగారి ద్వారా భగవాన్ మనకిచ్చిన సందేశమేమిటి? ఆయన బోధనల సారాంశమేమిటి? అని ఆయననే అడిగితే "నేనెవరు?" అని ఆత్మ విచారణ అయినాచెయ్యి లేదా శరణాగతి చెందు. అవి రెండూ ఒకే నాణెమునకు రెండుముఖముల వంటివి" అనేవారు. 'ఆత్మ విచారణ' ద్వారా లాభం పొందటమును భగవాన్, అనేకమంది భక్తుల విషయంలో చూపించారు. తన తల్లి ఉదాహరణ ద్వారా, 'శరణాగతి' వలన ముక్తి పొందటమును చూపించారు. అమ్మ పూర్తిగా ఆయనకు శరణాగతి చెందారు కాబట్టి, శరణాగతి ద్వారా ముక్తి పొందగలిగారు. భగవాన్ అనుగ్రహముతో, పూర్తిగా ఆత్మవిచారణలో మునిగిపోయి, పూర్తి మౌనస్థితిలోనికి వెళ్లినపుడు, అమ్మకు మరణ సమయములో జరిగిన అనుభవము వంటిదే జరుగుతుంది. సాధకునిలో, అంతర్గతంగా దాగియున్న వాసనలు, భవిష్యత్తులో పునరావృత మవడానికి అవకాశమున్న గత అనుభవముల తాలూకు సూక్ష్మ స్మృతులు విజృంభిస్తాయి. ఆత్మవిచారణలో పూర్తిగా మునిగి మౌనంలోనికి వెళ్ళినపుడు ఇలా జరగటము మొదలవుతుంది. ఆ దశలో సాధకుడు నేను ప్రగతిని సాధించలేకపోతున్నానే నిస్పృహతో సాధన వదిలి వెయ్యాలనుకుంటాడు. "ఆమె సూక్ష్మ మనసులో ఒకదాని తర్వాత ఒకటిగా దృశ్యాలు ప్రత్యక్షమవసాగాయి. అప్పటికే బాహ్యేంద్రియములు పనిచెయ్యటము మానివేసినవి." ఎప్పుడైతే లోతుగా ఆత్మవిచారణ జరుపుతారో అప్పుడు అంతరంగంలోని ద్వారములు తెరుచుకుంటవి. "జీవాత్మ అసంఖ్యాకమైన అనుభవములను పొంది, పునర్జన్మకు రావలసిన అవసరమును తొలగించుకుని మనస్సు హృదయములో ఐక్యమవటము జరుగుతుంది. ఆత్మ విచారణలో ముందుకు సాగుతున్నపుడు మనస్సు, హృదయములో మునుగుటకు ఘర్షణ పడుతుంది. అపుడు మనస్సును, హృదయంలో ఐక్యం చెందించడానికి గురువుగారి మార్గదర్శకత్వము, అనుగ్రహము చాలా ముఖ్యము. 'ఎప్పుడైతే జీవాత్మ యొక్క సంస్కారములన్నీ తొలగి అంతిమ లక్ష్యమైన ముక్తి ధామంలోనికి చేరుకుంటుందో, అప్పుడిక మాయాజాలంలో తిరిగి చిక్కుకోదు'. ఈ ఉపదేశమే సాధకుడు పొందబోయే అనుభవాన్ని తెలియజేస్తుంది. మాతృదేవి అళగమ్మ మనకు మార్గం చూపారు. సంపూర్ణ విశ్వాసాన్ని ఉంచు. ఆత్మవిచారణ మార్గమును అనుసరించు, లేదా సర్వోత్కృష్ట శక్తికి శరణాగతి చెందు, ఈ రెండు మార్గములలోనూ అహంకారమునకు తావుండదు. 'అహంకారము' లేకపోతే 'నేను', 'నాది' అనేవి ఉండవు. ఇక అప్పుడు నడిపించేది అరుణాచలుడే. భగవాన్ చెప్పినట్లు అరుణాచలుడే హృదయము, ఆత్మ. 'నేను' అనే చైతన్య స్ఫురణ. అది హృదయములోనికి ప్రవేశించుట కాదు. అదే హృదయము.

అరుణాచలుని జేరుకొనుట అనేది దేశకాలములలో జరిగేపని కాదు. అది ఎల్లప్పుడూ ఇక్కడే ప్రస్తుతములోనే ఉన్నది. నీవు చెయ్యవలసిందంతా దానివైపు నీ దృష్టిని మరల్చడమే. మాతృదేవి అళగమ్మాళ్ తన దృష్టిని భగవాన్‌పై నిల్పింది. భగవాన్ అన్నట్లు, బాహ్య గురువు పని మనసును బాహ్య విషయముల నుండి మళ్ళించి లోనికి నెట్టటము. అంతర గురువు పని, మనసును, పూర్తిగా లోనికి లాగెయ్యడము. అరుణాచలుడు బాహ్య గురువై మన మనస్సును లోనికి నెడితే, మన హృదయకుహరంలో చైతన్యరూపులై యున్న రమణులు అయస్కాంతము వలె దానిని లోనికి లాగుతారు. సరే, సాధకుడు చెయ్యవలసినదేమిటి? లొంగిపోవడమే. ఎక్కడ ఉన్నప్పటికీ మనము హృదయములోనే ఉండిపోవాలి. పవిత్రత అంటే మౌనంలో మునగడమే. ఆ పవిత్రతే అరుణాచలుడు. అరుణాచలుడంటే ఒక హిందువుల దేవుడు కాదు. ఆయనే సత్యం, శివం, సుందరం. సత్యమై, సర్వవ్యాపియైన కేవల ఉనికి, మనం దేహాత్మ బుద్ధితో మనలను పరిమితులుగా భావించుకొనుట వలన, 'నీవు' అనబడే దానికి తావే లేదు. అక్కడ ఉన్నది కేవలము 'నేను' 'నేను' అను అహంస్ఫురణ మాత్రమే అని తెలియజేయుటకు అరుణాచలుడు, రమణుల రూపములో వచ్చారు.

పళని స్వామి



భగవాన్ అరుణాచలమునకు వచ్చిన మొదటి రోజునే “తండ్రీ! నీ ఆజ్ఞపై యిక్కడకు వచ్చాను. నీ ఇచ్ఛయే నెఱవేఱుగాక” అన్నారు. ఆ క్షణము నుండి ఆయన జీవితము మొత్తము పరమాత్మకు అంకితమైనది. అరుణాచలేశ్వర ఆలయములో ఉన్న ఆరునెలల కాలము ఆయన సమాధి స్థితిలోనే ఉండేవారు. ఆశ్చర్యమేమిటంటే, అప్పటి వరకూ, ఆయన ‘సమాధి’ అనే పదమును గానీ లేదా తన స్థితిని తెలియజేసే ఏ యితర పదజాలమునూ వినియుండలేదు. ఆయన గాఢమైన, శరీర స్పృహ లేని ఎఱుక కలిగిన విశ్రాంత స్థితిలో ఉండేవారు. అరుణాచలేశ్వర ఆలయంలో చీకటిగానూ, తేమగానూ ఉండే పాతాళ లింగం వద్ద చెదలు, కీటకములు,ఆయన శరీరమును విందు భోజనం చేసేవి. అపుడాయన బాహ్య స్పృహ అనేదే లేక పరమాత్మలో పూర్తిగా లీనమై ఉండేవారు. అరుణాచలుడు తన కుమారుని శరీరమునకు హింస జరిగితే భరించగలడా? అందుకే ఈయన శేషాద్రిస్వామి అనే మహాత్ముని, వెంకటాచల ముదిలి, ఉద్దండి నాయనార్, అన్నామలై తంబిరాన్ అనే వారిని ఆయనకు బాసటగా పంపారు.

శేషాద్రిస్వామి భగవాన్ శరీరమును పాతాళ గుహలో నుండి బయటకు తీసికుని వచ్చారు. మిగిలిన వారు కూడా భగవాన్ యొక్క సమాధి స్థితికి ఆటంకములు రాకుండా, ఎవరు చేయగలిగినవి వారు చేశారు. ఏమైనప్పటికి అజ్ఞానులైన అల్లరి మూకలు ఆలయంలో భగవాన్‌ను ఇబ్బంది పెట్టడం మానలేదు. అమాయకులైన ప్రజలు గుంపులుగా వచ్చి ఆయన ప్రశాంతతకు భంగం కల్గించేవారు. పర్యవసానముగా అన్నామలై తంబిరాన్ అనే అతని పర్యవేక్షణలో నున్న “గురుమూర్తము” అనే ఒక మహాత్ముని మందిరమునకు, భగవాన్‌ను తీసికుని వెళ్ళారు. గురుమూర్తంలో కూడా చీమలూ, ఇతర కీటకములూ దండిగా ఉండేవి. అయినప్పటికీ భగవాన్ శరీరమునకు అతీతంగా ఉండేవారు. ఆయన శరీరమునకు స్నానము లేదు. జుట్టు ఒత్తుగా, పొడుగ్గా అట్టలు కట్టుకుని పోయింది. గోళ్ళు పొడవుగా పెరిగి వంకరలు తిరిగి పోయినవి. ఆయన దాదాపుగా నిరాహారిగా ఉండుట వలన ఆయన శరీరము చిక్కిపోయి, అత్యంత బలహీనమైపోయింది. దీనినంతటినీ అరుణాచలుడు ఎలా సహించగలరు? అందుకని ఆయన నందియైన పళనిస్వామిని రమణుల వద్దకు పంపారు. (అరుణాచలుని నైఋతి సానువులో, ఒక రాయి అచ్చు నంది యొక్క శిరసు వలె ఉంటుంది. భగవాన్ తొలినాటి శిష్యులైన విశ్వనాథస్వామి, కుంజుస్వామి ఆ నందిని చూపించి, అదుగో పళనిస్వామి, రమణుల యొక్క నంది” అనేవారు)

పళనిస్వామి ఏకాంతవాసి అయిన సాధువు. ఆయన తిరువణ్ణామలైలోని ఒక కొలను ఒడ్డున గల గణేశుని అత్యంత భక్తితో ఆరాధించేవారు. ప్రతి దినము ఆయన ఉప్పుగాని, కూరలు గాని లేని వట్టి అన్నమును ఒక్క పూట మాత్రము భుజించేవారు. సాదాసీదాగా ఉండే ఈ సన్యాసికి ‘సత్యాన్వేషణ’ అనేది ఒకే ఒక ఆశయం. ఒక రోజు ఆయన స్నేహితులొకరు ఆయనతో “ఈ రాతి విగ్రహమును పూజించి లాభమేమిటి? దీని వలన నీవు సాధించగలిగిందేమీ లేదు. అక్కడ గురుమూర్తంలో మానవ శరీరమును ధరించిన భగవంతుడు ఉన్నారు. పురాణములలో వర్ణించబడిన, ఒంటికాలిపై నిలుచుని తపస్సు చేసిన, అయిదు సంవత్సరముల బాలుడైన, ధృవుని వలె, అక్కడ ఒక బాలుడైన మహాత్ముడు పూర్తిగా సమాధి నిష్ఠలో ఉన్నారు. వెళ్ళి ఆయనను సేవించండి. మీ జన్మ సఫలమవుతుంది,” అన్నారు.

పళనిస్వామి గురుమూర్తానికి వెళ్ళారు. అక్కడ ఎప్పటి వలెనే భగవాన్ సమాధి స్థితిలో ఉన్నారు. ఆ మొదటి చూపే పళనిస్వామిని కూకటి వేళ్ళతో సహా కుదిపివేసింది. ఆయనకు బాలస్వామిలో దైవమే కాదు, తన గురువు కూడా కన్పించారు. అప్పటి నుండి ఆ మహోదాత్తమైన బాలస్వామి తప్ప పళనిస్వామికి వేరే ప్రపంచమే లేకుండా పోయింది. తానే ఒక సాధువు అగుట వలన బాలుడైన ఆ మహాత్ముని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని, శరణాగతిని ఆయన గ్రహించగలిగారు. తనలో తానే ఇలా ప్రతిన పూనారు. “నా బొందిలో ప్రాణము ఉన్నంత వరకు ఈ మహాత్ముని సేవించుకుంటాను”.

పళని స్వామి భగవాన్‌ను సేవించటము ఆరంభించారు. భగవాన్ సమాధి స్థితిలో ఉన్నపుడు ప్రజలు వచ్చి ఆయనను తాకి కుదిపి, ఆయనతో మాట్లాడుటకు ప్రయత్నించేవారు. ఆ భౌతిక శరీరమును కాపాడుట, ఆ అత్యున్నత ఆధ్యాత్మిక స్థితికి భంగం రాకుండా

చూడడం, పళనిస్వామి తన బాధ్యతగా భావించారు. కీటకములు కూడా తమ స్వామి శరీరమును బాధించకుండా చూసేవారు. లభించిన భిక్షలో నుండి చిన్న (కప్పు) గిన్నెడు ఆహారమును భగవాన్‌కు నివేదించేవారు. ఈ విధంగా భగవాన్ ప్రతిరోజూ కొద్దిగానైనా ఆహారమును తీసుకోవడం జరిగింది. ఆయన భగవాన్ చుట్టూ ఒక కంచె వంటిది ఏర్పాటు చేసి, దానికి ఒక గేటు కూడా పెట్టారు. పళనిస్వామి బయటకు వెళ్ళవలసి వచ్చినపుడు ఆ గేటుకు తాళము వేసి వెళ్ళేవారు. అప్పుడు ఎవరూ లోనికి ప్రవేశించుటకు వీలుండేది కాదు. ఈ విధంగా ఆయన పదునెనిమిది నెలలు రాత్రింబవళ్ళు భగవాన్ సేవ చేశారు.

కొంతకాలమైన తర్వాత భగవాన్ ఆ పరిసరములను విడిచిపెట్టవలసివచ్చింది. ప్రక్కనున్న స్థలములో ఒక మామిడి తోట ఉండేది. ఆ తోట యజమాని తన మామిడి తోటలోని కొబ్బరి ఆకులతో వేసిన పూరిగుడిసెలో ఉండవలసినదిగా పళనిస్వామిని, భగవాన్‌ను ప్రార్థించారు. తర్వాత మజిలీ ఆ మామిడితోటలోనికి మారింది. పళనిస్వామి, భగవాన్, ఆరు నెలల పాటు ఏ ఇబ్బందీ లేకుండా అక్కడ గడిపారు. తోట యజమాని ఇతరులెవ్వరినీ లోనికి రానివ్వనందున వారికా వెసులుబాటు కలిగింది. అదే సమయంలో భగవాన్‌లోని మరో కోణము వెలుగు చూసింది. పళనిస్వామి భగవాన్ కంటే ముప్పది సంవత్సరములు పెద్ద. ఆయన భగవాన్‌ను పితృవాత్సల్యంతో చూసేవారు. దైవమే తనకు పుత్రుని వలె లభించారని భావించే పళనిస్వామి టౌన్‌కు వెళ్ళి స్వామి కొరకు కొన్ని గ్రంథములను తెచ్చేవారు. ఈ విధంగా భగవాన్ మొదటి సారిగా కైవల్య నవనీతము, వేదాంత చూడామణి, ఆధ్యాత్మ రామాయణము, యోగ వాశిష్టము, ప్రభులింగ లీలలు, ఇంకా అనేక గ్రంథములు చదవడము తటస్థించింది. కొన్ని అద్వైత మరియు వేదాంత గ్రంథములను చదివిన మీదట భగవాన్ తన పదహారవ ఏట జరిగిన అనుభవమునే అవి వర్ణిస్తున్నాయని గుర్తించారు. ఇక్కడే ఆయన సమాధి, మాయ, ఆత్మ, సంసారం అనే మాటలను తెలుసుకున్నారు. భగవాన్ ఎప్పుడూ సహజ సమాధిలో ఉంటూ, "నిర్గుణ, నిరాకార బ్రహ్మమే, హృదయ చైతన్యముగా ప్రతిజీవిలోనూ భాసిస్తున్నదని మానవాళికి ఎరుక పరచవలెనని," అరుణాచలేశ్వరుని ఇచ్ఛ అయి ఉంటుంది. తన అమూల్యమైన జ్ఞానమును మానవాళికి అందించుటకు ఈ విధమైన పుస్తక పరిజ్ఞానము తప్పని సరి. భగవాన్‌కు గల అద్వైత, వేదాం. పురాణ పరిజ్ఞానమంతా ఈ సమయములో మొదలైనదే.

కొంతకాలమైన పిదప మామిడితోట యజమాని తన తోట వదలివెళ్ళమని వారిని కోరారు. అపుడు వారు అరుణగిరి నాధర్‌గుడికి మకాము మార్చారు. అప్పుడు భగవాన్, పళనిస్వామితో "నీవు ఆ వైపునకు భిక్షకు వెళ్ళు. నేను ఈ వైపునకు వెళ్తాను" అని చెప్పారు. భగవాన్ ఏదో ఒక ఇంటి ముందు నిలచి రెండుసార్లు చప్పట్లు చరచేవారు. కొంచెము తడవు వేచి ఉండేవారు. ఆ ఇంటి యజమాని ఏమైనా భిక్ష ఇచ్చినట్లయితే తన దోసిలితో తీసుకుని, వెంటనే తినేసేవారు. చేతులు కడుగుకునే బదులు వానిని తన జుట్టుకు తుడిచి వేసేవారు. భగవాన్, "నేనా పనిని చేసేటపుడు నేను ఈ ప్రపంచంలోనే ఏకైక చక్రవర్తిని, అన్పించేది" అన్నారు. అందుకనే భగవాన్ "నిజమైన సన్యాసమంటే, నేను యజమానిని అనే భావనను వదలుటయే కాదు, ఎవరిపైనా దేనిపైనా ఆధారపడకుండా ఉండుట" అనేవారు. ఆయన ఒక్కసారి భిక్ష తీసుకున్న ఇంటిలో రెండసారి భిక్ష తీసుకునే వారు కాదు. ఈ విధంగా ఆయన తిరువణ్ణామలై లోని అన్ని వీధులలోనూ, ఇళ్ళలోనూ బిచ్చమెత్తారు.

అరుణగిరినాధర్ ఆలయంలో కూడా ప్రజలు భగవాన్‌ను విసిగించడం ప్రారంభించారు. అపుడు పవళక్కున్ను అనే చిన్నకొండపైకి మకాం మార్చారు పళనిస్వామి, భగవాన్. పళనిస్వామి, భగవాన్‌తో అనుబంధం కలిగి ఉన్నన్ని రోజులూ భగవాన్ శరీరాన్ని కాపాడుతూ ఆయన సమాధి నిష్ఠకు భంగం కలగకుండా చూసేవారు. భగవాన్ యొక్క ఇతర చర్యలలో తలదూర్చేవారు కాదు. నెమ్మదిగా భగవాన్ ఖ్యాతి పట్టణంలో వ్యాపించి కొద్దిమంది 'పవళక్కున్ను'కు కూడా రావడం ప్రారంభించారు. పళనిస్వామి మరొక ప్రదేశము కోసము వెదకి, అరుణాచల సానువులలోని విరూపాక్ష గుహను కనుగొన్నారు. భగవాన్ "మేము మొదట విరూపాక్ష గుహకు వెళ్లినపుడు, అక్కడ ఒక కుండ తప్ప ఇంకేమీ లేదు" అని చెప్పారు. కొన్ని సంవత్సరముల తర్వాత కొందరు భక్తిగల స్త్రీలు పగటిపూట అక్కడకు ఆహారమును తీసికుని వచ్చి భగవాన్‌కు సమర్పించడము మొదలు పెట్టారు. కొంత కాలమునకు మిగిలిన పరిచారకులైన పెరుమాళ్ స్వామి, అయ్యాస్వామి, కందస్వామి, మొదలైన వారు వచ్చి చేరినప్పటికీ పళనిస్వామి ఎప్పటికీ ప్రధమ సేవకుడిగానే మిగిలారు.

అక్కడే భగవాన్ మళయాళం నేర్చుకున్నారు. మలయాళంలోని 'ఆధ్యాత్మ రామాయణం'లో ఒక పేజి చదివితే గానీ, తాను తీసుకునే ఒంటిపూట భోజనం తీసికోను అని పళనిస్వామి నియమం పెట్టుకున్నారు. తనకు తానే విధించుకున్న ఈ నియమాన్ని ఆయన

జీవితాంతం వరకు పాటించారు. పళనిస్వామి మాతృభాష మలయాళమైనప్పటికీ, ఆయన మళయాళము సరిగా చదవలేకపోయేవారు. అందుకని ఆయన ఆ పేజీ చదవడానికి చాలా సమయం పట్టేది. పళనిస్వామి కోసం మిగిలిన భక్తులందరూ వేచి ఉండవలసి వచ్చేది.

ఒకరోజు భగవాన్ పళనిస్వామిని ఈ విధంగా ప్రశ్నించారు. "మీ నియమం ప్రకారం రోజూ ఆధ్యాత్మ రామాయణం మీరే చదవాలా? లేక ఎవరైనా చదివితే వింటే సరిపోతుందా?" అని పళనిస్వామి ఎవరు చదివినా ఫర్వాలేదు అని ఒప్పుకున్న పిమ్మట భగవాన్ తానే ఆ పనిని చేపట్టారు. భగవాన్ మాతృభాష తమిళము. ఆయనకు మళయాళము తెలియదు. అందుకని తనకు మళయాళం నేర్పవలసినదిగా భగవాన్ పళనిస్వామిని కోరారు. అతి కొద్దికాలంలోనే భగవాన్ మళయాళం చదవడం, వ్రాయడం అర్థం చేసుకోవడం నేర్చుకున్నారు. అప్పటి నుండి భగవాన్ దయవల్ల పళనిస్వామి, ఆధ్యాత్మ రామాయణము వినటం జరిగేది. ఇతర భక్తులు అందుకొరకు వేచి ఉండవలసిన అవసరం తప్పింది. వారు వేళకు భోజనం చెయ్యగలిగేవారు. (భగవాన్ ఏక సంథాగ్రాహి, భగవాన్ ఏదైనా విషయాన్ని ఒకసారి చదివితే మరల దాని కోసం తడుముకోవలసిన అవసరం ఎప్పటికీ ఉండేది కాదని కుంజుస్వామి నాతో చెప్పారు)

ఒకరోజు ఎవరో ఒక వినాయకుడి ప్రతిమను, విరూపాక్ష గుహలోని గూటిలో పెట్టారు. ఆనందంతో పళనిస్వామి భగవాన్‌ను 'మీరు గణేశునికి ఏమైనా సమర్పించవచ్చు గదా? " అని అడిగారు. భగవాన్ సమర్పించేది నైవేద్యము, పూలదండలు, పూల రూపంలో గాక ఒక పద్య రూపంలో ఉండేది. అపుడు భగవాన్ తొలిసారిగా పద్యం వ్రాశారు. "ఓ గూటిలోఉండే బొజ్జ గణపతి స్వామి! నీవు నీ తండ్రిని, భిక్షాటనానికి వెళ్ళనిచ్చావు. ఇప్పటికైనా ఆ తండ్రి కొడుకునేయైన నా మీద దయ చూపించుము"

సాయంత్రం వేళల్లో భగవాన్ సేవకులు, వీధుల్లో భిక్షాటన చేసేవారు. వాళ్ళు ప్రాచుర్యంలో వున్న ఆదిశంకరాచార్యుల కీర్తన అయిన "సాంబసదాశివ, సాంబసదాశివ సాంబసదాశివ సాంబశివోమ్" అను పాటను పాడుతూ బిచ్చమెత్తేవారు. పుర ప్రజలు ఆ పాటను వినగానే భగవాన్ సేవకులు వస్తున్నారని గ్రహించి భిక్షతో సిద్ధంగా ఉండేవారు. ఇది గమనించి కొందరు అల్లరి మూకలు అదే పాటను పాడుతూ భగవాన్ భక్తుల కంటే ముందే భిక్ష గ్రహించి వెళ్లిపోవటం మొదలు పెట్టారు. అందుకని భిక్ష తీసుకుని రావడానికి తమకై ప్రత్యేకంగా ఒక పాట వ్రాయమని సేవకులు భగవాన్‌ను కోరారు. భగవాన్ తమ మామూలు ధోరణిలో మౌనంగా ఉన్నారు. మరునాడు వారు గిరిప్రదక్షిణ చేసేటపుడు, పళనిస్వామి భక్తులందరిలోకీ విద్యావంతుడైన అయ్యాస్వామిని పిలిచి, భగవాన్ ఏదో చిన్నగా పలుకుతున్నారు. బహుశా ఏవో పద్యాలు అల్లుతుండి ఉంటారు. ఈ పేపరు, పెన్సిల్ తీసుకుని సిద్ధంగా ఉండు అని చెప్పారు. ఆ ఒక్క ప్రదక్షిణలోనే భగవాన్ నూట ఎనిమిది పద్యాలు వ్రాశారు. అయ్యా స్వామి శ్రద్ధగా దానిని వ్రాసుకున్నారు. "అక్షర మణమాల' లేదా 'అక్షర వరమాల' అని పేరిడబడిన, హృదయాలను కదిలించే ఆ పద్యాలు ఆధ్యాత్మికంగాను, భక్తి పాటలలోను సాటిలేనివి. (తాను మూడు వేల పద్య కావ్యాలను ఇంగ్లీషు భాషలో చదివాననీ, వానిలో ఎక్కువశాతం భక్తి ప్రధానమే అయినప్పటికీ, భక్తిలో గాని, జ్ఞానంలో గానీ 'అక్షరమణమాల'తో సాటిరాగలవి వాటిలో లేవని, ఆర్థర్ ఆస్‌బోర్న్ నాతో చెప్పారు)

కొంతకాలం పిమ్మట భగవాన్ కొండపై ఇంకొంచెం ఎగువన ఉన్న స్కందాశ్రమానికి వెళ్ళారు. పళనిస్వామి గూడ కొన్నాళ్ళు అక్కడ గడిపారు. కానీ వృద్ధాప్యం వలన వచ్చిన బలహీనత వలన స్కందాశ్రమం వరకూ రోజూ ఎక్కలేకపోయారు. అందువలన విరూపాక్ష గుహలో ఉండుటకు భగవాన్ అనుమతిని కోరారు. ప్రతిరోజూ భగవానే విరూపాక్ష గుహకు వెళ్లి, పళనిస్వామితో కొంత సమయం గడిపేవారు. స్కందాశ్రమంలో వుండగా ఒక నాడు, విరూపాక్ష గుహ నుండి వింత ధ్వనులు చేస్తూ ఒక నెమలి ఎగిరి రావడం భగవాన్ గమనించారు. ఆయన వెంటనే, "పళనిస్వామికి అవసాన కాలం సమీపించింది," అంటూ వేగంగా విరూపాక్ష గుహకు వెళ్ళారు. ఆయన విరూపాక్ష గుహకు జేరుకునేటప్పటికే పళనిస్వామి అతికష్టంగా శ్వాస పీల్చుకుంటున్నారు. ఒక కుమారుని వలె భగవాన్ పళనిస్వామి తలను తన ఒడిలో ఉంచుకున్నారు అతను ప్రాణం విడిచి పెట్టేవరకు ఆయన తలను తన ఒడిలో ఉంచుకున్నారు. (హిందువుల ఆచారం ప్రకారం మరణావస్థలో ఉన్న తండ్రి తలను పుత్రుడు తన ఒడిలో ఉంచుకోవాలి. పురాణాల ప్రకారం అటువంటి అవకాశం ఉన్న తండ్రి స్వర్గానికి వెళ్తాడు) పళనిస్వామి చాలా సంవత్సరాల పాటు నిస్వార్థంగా తన యజమానికి సేవ చేశారు. ఇప్పుడు భగవాన్ యొక్క నంది, దేవుని నివాస స్థలమైన అరుణాచలానికి తిరిగి వెళ్ళవలసిన సమయం వచ్చేసింది.

పెరుమాళ్ స్వామి



ధృఢమైన శరీరము, కఠినమైన ప్రవర్తన గల పెరుమాళ్‌స్వామిని పదును తేలిన అంచులు గల పెద్ద కొండరాతితో పోల్చవచ్చును. ఆయన విరూపాక్ష గుహలోనున్న భగవాన్ సన్నిధికి 1914లో వచ్చారు. ఆయన తిరువణ్ణామలైలో పేరున్న వ్యక్తి. ఆయనకు తిరువణ్ణామలైలో చాలామంది ధనవంతులైన స్నేహితులున్నారు. సాధువు జీవితాన్నే గడిపినా, ఏ లోటూ లేకుండా దర్జాగా బ్రతకడానికి అతనికి వీలై ఉండేది. ఎందువల్లనంటే అతడి స్నేహితులు అతడిని బాగా చూచుకునేవారు. మొదటిసారి భగవాన్‌ను దర్శించినపుడే ఆయన సంభ్రమాశ్చర్యాలకు లోనైనారు. ఆయన భగవాన్‌ను గురువుగా స్వీకరించి ఆయన కొరకు తిరువణ్ణామలై వీధులలో బిచ్చమెత్తడానికి సిద్ధపడ్డారు.

ఆయన భగవాన్‌కు ఎన్నో దుర్ఘటనలు జరగకుండా అడ్డుకున్నారు. ఒకప్పుడు పెరుమాళ్‌స్వామి, పళనిస్వామి భగవాన్‌ను ఒంటరిగా గుహలో వదిలి పట్టణంలోకి వెళ్ళినపుడు, భయంకరంగా కనిపించే బైరాగి సాధువుల బృందమొకటి కత్తులు, ఈటెలతో అక్కడకు వచ్చింది. వాళ్ళు భగవాన్‌తో ఇలా అన్నారు. "మేము సిద్ధుల రాజ్యమైన పోతిగై కొండల నుండి వచ్చాము. సిద్ధుల పెద్ద, మాతో ఇలా అన్నారు. అరుణాచలంలో పరిపక్వస్థితికి వచ్చిన వ్యక్తి ఒకరు ఉన్నారు. ఆయనకు తుది ఉపదేశము ఇవ్వవలసిన అవసరం వుంది. కావున మీరు వెళ్లి ఆయనను ఇక్కడకు తీసుకుని రమ్మని మమ్ములను ఆజ్ఞాపించారు. కావున మీరు అంగీకరించినా, లేకున్నా మిమ్ములను పోతిగై కొండలకు తీసుకుని వెళ్తాము". భగవాన్ నిశ్చలంగా, మౌనంగా కూర్చుని ఉన్నారు. కొంతమంది గొఱ్ఱెలు కాచే కుఱ్ఱవాళ్ళు ఈ గొడవ విని పెరుమాళ్‌స్వామికి తెలియజెయ్యడానికి పరుగెత్తారు. పెరుమాళ్‌స్వామి శీఘ్రంగా విరూపాక్ష గుహకు వచ్చి ఒక్క చూపుతో విషయాన్ని అర్థం చేసుకున్నారు. నేను ప్రక్కన గల పల్లెటూరి నుంచి వచ్చాను. క్రిందటిరాత్రి నా కలలో పోతిగై కొండలలోని సిద్ధుల పెద్ద కనబడి ఇలా అన్నారు. "రేపు నా శిష్యులు విరూపాక్ష గుహకు వస్తారు. నీవు అక్కడకు వెళ్ళి ఒక పెద్ద బానతో నూనెను సిద్ధం చెయ్యి. వాళ్ళను ఆ నూనెలో వేయించి, ఆ వేగిన శరీరాలను నా దగ్గరకు తీసుకునిరా!" పెరుమాళ్‌స్వామి అక్కడున్న గొఱ్ఱెలు కాచే పిల్లలతో "మీరు వెళ్ళి కఱ్ఱలు తీసుకుని రండి. నేను పట్టణంలోనికి వెళ్ళి పెద్ద బానను, నూనె డబ్బాలను తీసుకుని వస్తాను. అప్పుడు మనం వీళ్ళని అందులో వేసి వేయించవచ్చు" అన్నారు. ఆ బైరాగి వాళ్ళు కాళ్ళకు బుద్ధి చెప్పారు.

పళనిస్వామిలో లేని కార్యనిర్వహణ సామర్థ్యం పెరుమాళ్‌స్వామిలో ఉండేది. కానీ ఉద్రేక స్వభావము కలవాడు కాబట్టి అతడిలో కొన్ని లోపాలు ఉండేవి. భగవాన్ తల్లి, విరూపాక్ష గుహలో వుండడానికి వచ్చినపుడు పెరుమాళ్‌స్వామికి అది నచ్చక పెద్దగా అరిచాడు. "బయటకు వెళ్ళండి. మీరు ఇక్కడ ఉండడానికి వీలు లేదు" అని. తీవ్రంగా బాధపడినప్పటికీ ఆమె తలవంచింది. తనకున్న ఒక్క చీరను మడిచి చంకలో పెట్టుకుని విచారంగా బయటకు నడిచారు. బయట కూర్చుని ఉన్న భగవాన్ లేచి నిలబడి "పద వెళ్దాం. మనం అక్కరలేని చోటి నుండి వేరే చోటకు వెళదాం" అన్నారు. వెంటనే పెరుమాళ్‌స్వామి భగవాన్ కాళ్ళమీద పడి వెళ్ళవద్దని ప్రాధేయపడ్డాడు.

భగవాన్ స్కందాశ్రమానికి వెళ్లినపుడు పెరుమాళ్‌స్వామి గూడా ఆయనతో వెళ్ళారు. భగవాన్ పరిచారకులలో ఒక యల్పణి, శ్రీలంక నుండి వచ్చి ఉండేవారు. (శ్రీలంకను 'యల్పణమ్' అని, శ్రీలంక పౌరుణ్ణి 'యల్పణి' అని అంటారు). ఆయన చాలా పరిశుభ్రంగా ఉండే వ్యక్తి. ఆయన రోజూ స్కందాశ్రమాన్ని ఊడ్చి, ప్రతి వస్తువును చక్కగా సర్దిపెట్టేవారు. ఆయన పేరు, కీర్తి కూడా మచ్చలేనివి. భగవాన్ స్కందాశ్రమమునకు వచ్చినపుడు చెట్ల ఆకులు చెల్లాచెదరుగా పడి ఉంటే "యల్పణి లేరా?" అని అడిగేవారు. ఒకనాడు యల్పణి స్కందాశ్రమం నేలను, ఆవుపేడతో అలికారు. స్కందాశ్రమానికి అధికారిలాగా వ్యవహరించే పెరుమాళ్‌స్వామి వచ్చేటప్పటికి ఆ నేల ఇంకా తేమగా, కాలుపెడితే జారేటట్లుగా ఉంది. దాంతో ఆయన కోపంతో "యల్పణీ!

స్కందాశ్రమం నుండి బయటకు వెళ్ళు" అని అరిచారు. యల్పణి భగవాన్ పట్ల చాలా శ్రద్ధ గలవారు. ఆయన భగవాన్‌ను వీడలేకపోయారు. అలాగే అధికారి మాటలను పాటించాలి అనుకున్నారు. చాలా తెలివిగలవాడు కావున ఏదో ఒక ఉపాయం కనుక్కోవాలనుకున్నారు. స్కందాశ్రమంలో ఒక పొడుగాటి కొబ్బరి చెట్టు ఆశ్రమ పరిసరాలను దాటి వంగి ఉన్నది. యల్పణి త్వరగా ఆ చెట్టెక్కి చెట్టు చివర కూర్చున్నారు. ఇప్పుడు లెక్క ప్రకారం ఆయన స్కందాశ్రమం వీడకుండానే స్కందాశ్రమం బయట ఉన్నారు. ప్రతిఒక్కరూ ఆయనను దిగి రమ్మని అడిగినా, ఆయన దిగి రాలేదు. మధ్యాహ్న భోజన సమయంలో యల్పణి లేకపోవడాన్ని భగవాన్ గమనించారు. అప్పుడు మిగిలిన భక్తులు జరిగినదంతా భగవాన్‌కు చెప్పారు. అపుడు భగవాన్ కొబ్బరి చెట్టు దగ్గరకు వెళ్ళి "యల్పణీ! దిగి వచ్చి భోం చెయ్యి" అని అన్నారు. ఆయన ఎంత మృదువుగా చెప్పారంటే ఈ యల్పణి చిన్నపిల్లవాడి వలె చెట్టుదిగి వచ్చి భోజనం చెయ్యడం మొదలుపెట్టారు. మరొక రోజు భగవాన్ ఇలా అన్నారు. "నా వద్ద ఒక నోటు పుస్తకం ఉండేది. అందులో నేను కొన్ని పద్యాలు వ్రాశాను. ఉత్తర కాశీ నుండి వచ్చిన ఒక వ్యక్తి ఆ పుస్తకం తీసుకుని ఎన్నో నెలలు గడిచినా తిరిగి ఇవ్వలేదు. నాకిపుడు పుస్తకం అవసరం" యల్పణి ఉత్తర కాశీవెళ్ళి, ఆ వ్యక్తి నుండి ఆ పుస్తకము తీసుకొచ్చి భగవాన్‌కు యిచ్చారు. భగవాన్ చాలా సంతోషించారు. గురువు గారి కోర్కె తీర్చడానికి ఒక్క నిమిషంకూడా విశ్రాంతి లేకుండా చాల రోజులు శ్రమించాల్సి వచ్చిందని, ఆయన ఇతర భక్తులతో చెప్పారు. ఆయన భగవాన్‌పైన అచంచలమైన, ఏకాగ్రమైన భక్తికల్గి ఉండేవారు.

స్కందాశ్రమంలో సిపాయిస్వామి అని యింకొక భక్తుడు ఉండేవారు. (ఆయన సైన్యంలో పనిచేసి రిటైర్ అయ్యారు. సిపాయి అంటే సైనికుడు అని అర్థం) అందుకని ఆయన మిలటరీ పద్ధతులకు అలవాటు పడ్డారు. భగవాన్ పట్ల అత్యంత భక్తి కలిగిన ఆయన భగవాన్‌కు రక్షక భటుడిగా ఉండటం తన కర్తవ్యంగా పెట్టుకున్నారు. ఎప్పుడు భగవాన్ స్కందాశ్రమంలో ఉన్నా, పొడవాటి కఱ్ఱను తుపాకీలా ఎత్తి పట్టుకుని 'అటెన్షన్' పొజిషన్‌లో ఆయన వెనుక నిలబడే వారు. భగవాన్ అక్కడ ఉన్నంత సేపు, ప్రతి నిమిషం ఎవరి వంకా చూడకుండా, మౌనంగా కాపలా కాస్తూ, ధ్యాన నిమగ్నుడై ఉండేవాడు. పెరుమాళ్‌స్వామికి ఒకరోజు విసుగొచ్చి ఇలా అరిచారు. "నువ్వు ఏం చేస్తున్నావిక్కడ? డ్రామా ఆడుతున్నావా? వెంటనే స్కందాశ్రమము విడిచి వెళ్ళు". సిపాయిస్వామి ఆ ఆజ్ఞను పాటించాలనుకున్నారు గానీ, భగవాన్‌ను విడిచి వెళ్ళలేక పోయారు. అందుకని స్కందాశ్రమం బయట నిలబడి భగవాన్‌కు కాపలా కాయడం మొదలు పెట్టారు. ఆయనకు భగవాన్ ఈ విశ్వానికే సార్వభౌముడైన చక్రవర్తిలా అన్పించేవారు. భగవాన్‌కు ఇవ్వవలసినంత గౌరవం ప్రజలు ఇవ్వటల్లేదని ఆయన భావన. ఆయనకు భగవాన్ పట్ల గల అపార గౌరవం, భగవాన్‌కు గుఱ్ఱాలు అవసరం అని ఆయన భావించేలా చేసింది. అందుచే ఆయన ఇంటికి వెళ్ళి, తన ఆస్థినంతా అమ్మివేసి కొన్ని గుఱ్ఱాలను కొని స్కందాశ్రమానికి తెచ్చారు. వాటిని ఎలా పోషించాలో ఆయనకు తెలియకపోవడంతో ఆ గుఱ్ఱాలన్నీ ఒకదాని వెనుక ఒకటి కొంతకాలానికి చనిపోయాయి. తార్కిక చర్చలోకి వెళ్ళకపోతే ఆ సిపాయి స్వామి భక్తిని మనము మెచ్చుకోవచ్చును.

భగవాన్ తల్లి అంటే పెరుమాళ్‌స్వామికి ఇష్టం లేకపోయినప్పటికీ, 1922లో ఆమె చనిపోయినపుడు, ఆమె శరీరాన్ని ప్రస్తుత రమణాశ్రమం వరకు తీసికొని రావడానికి ఆయన సాయం చేశారు. శరీరాన్ని క్రిందకు దించిన తర్వాత బస్తీకి వెళ్ళి సమాధి నిర్మాణానికి కావలసిన వస్తువులన్నీ తీసికొని వచ్చారు. కానీ భగవాన్, తల్లి సమాధి వద్ద, పూరి గుడిసెలో వుండడం, ఆయనకు నచ్చలేదు. ఆయనకు భగవాన్ సోదరుడైన నిరంజనానందస్వామి అంటే చాలా అసహ్యం. రమణాశ్రమ నిర్వహణాధికారి పదవి చిన్నస్వామికి అప్పచెప్పబడినపుడు, ఆయన గట్టిగా వ్యతిరేకించారు. ఆయన కోర్టుకెళ్ళి, భగవాన్‌పై దావా వేసి, భగవాన్‌ను కోర్టుకు ఈడ్చాలని చూశారు. ఆయన భగవాన్ విగ్రహాన్ని తయారు చేయించి పట్టణంలో మరొక ఆశ్రమాన్ని నెలకొల్పి, అదే అసలైన రమణాశ్రమం అన్నారు. ఇంతేగాక, తాను దానికి సెక్రటరీనని చెప్పుకున్నారు. అసలు రమణాశ్రమానికి చిన్నస్వామి సెక్రటరీ. పోస్టు వచ్చినపుడు టౌన్ పోస్టాఫీసులో వీరిద్దరికీ మధ్య ఘర్షణ జరిగేది. అపుడు భగవాన్ చాలా తేలికగా ఈ సమస్యను తీర్చారు. "వచ్చిన టపా అంతా పెరుమాళ్ స్వామికి ఇవ్వండి. ఆయనకు కావలసినవి ఆయన ఉంచుకుంటారు. ఆయనకు అవసరం లేనివి మనం తీసుకుందాం. తగాదా ఎందుకు?" అన్నారు భగవాన్.

పెరుమాళ్ళ స్వామి భగవాన్ పట్ల క్రోధంతో ఉన్న సమయంలో భగవాన్ కుంజుస్వామి ద్వారా ఆయనకు, ఆధ్యాత్మిక సాధన నుండి వైదొలగవద్దని కబురు పంపారు. పెరుమాళ్ళ స్వామి భగవాన్ మాటలను పెడచెవిన పెట్టినప్పటికీ, భగవాన్ ఆయనను వదలలేదు. కోర్టు కేసులో ఓడిపోయినపుడు, ఆయన అవమానభారంతో, జబ్బు పడ్డారు. ఆయన భగవాన్‌కిలా కబురు చేశారు. "భగవాన్! నేను మీ వద్దకు వచ్చి క్షమార్పణ వేడుకోవాలనుకుంటున్నాను. నేను పాపము చేశాను". మిగిలిన ఆశ్రమ వాసులు ఈ విధంగా అన్నారు. "భగవాన్! అలా చెయ్యడానికి వీల్లేదు. అతను మీకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్ళాడు. అతనిని లోపలకు రానివ్వకూడదు" అది విని భగవాన్ ఇలా అన్నారు. "మీ రెందుకు అలా అంటారు? అతను మన పెరుమాళ్ స్వామి. ఆయనను రానివ్వండి." పెరుమాళ్ స్వామి లోనికి వచ్చినపుడు, ప్రతి ఒక్కరూ అతనిని క్రోధంతో చూశారు. పెరుమాళ్ స్వామి "భగవాన్! నేను మహా అపరాధం చేశాను. నేను తప్పక నరకానికి వెళతాను.

భగవాన్ నవ్వుతూ, "నేను కూడా నీతోపాటు అక్కడ ఉండనా?" అన్నారు.

దానితో పెరుమాళ్‌స్వామి జీవితం ఒక మలుపు తిరిగింది. ఆయన శేషాద్రిస్వామి ఆశ్రమం దగ్గర ఒక గుహను చూచుకొని, అందులో ధ్యానం, సాధన చేసుకుంటూ ఉండసాగారు. భగవాన్ చనిపోయిన తర్వాతకూడా, రమణాశ్రమ ప్రసాదాన్నే తీసుకోవాలని కోరుకున్నారు. అందుకని కుంజుస్వామి ప్రతి దినమూ, రెండుసార్లు, అన్నమూ, రసమూ తీసుకొని వెళ్ళి పెరుమాళ్‌స్వామికి ఇచ్చేవారు. ఆ విధంగా భగవాన్ ఆయనపట్ల ఆదరం చూపించారు. ఆయన పదునుగా ఉండే కఠినశిల అయినా కూడా భగవాన్ ఆయనను ఆదరించారు. అరుణాచలమనే దివ్యశాంతి లోనికి, నిశ్చలత్వము లోనికి ఆయన గూడా గ్రహించబడ్డారని మనం భావించవచ్చును.



రామనాథ బ్రహ్మచారి

భగవాన్ ఒకసారి ఇలా అన్నారు, "నాకు ఇద్దరే ఇద్దరు వ్యక్తులంటే భయం. ఒకరు రామనాథ బ్రహ్మచారి, రెండవ వారు మొదలియార్‌పాటి." ఆయన అలా ఎందుకన్నారంటే, ఆ ఇద్దరు సాధువులూ గూడా భగవాన్‌ను అత్యంత నిస్వార్థ భక్తితో సేవించారు.

రామనాథబ్రహ్మచారి, పట్టణంలోని వేదపాఠశాల విద్యార్థి, ఆయన, భగవాన్‌ను కలిసినపుడు, ఆయన మనసు, హృదయము వికసించి ఆయన పూర్తిగా గాఢమౌనంలో (నిశ్శబ్దంలో) మునిగిపోయినట్లనిపించింది. భగవాన్‌తోటి ఎంతకాలం వీలైతే అంతకాలం ఉండిపోవాలని అప్పటికప్పుడే ఆయన నిర్ణయించుకున్నారు. పాఠశాల ఉచిత భోజన వసతి సదుపాయాలను సమకూర్చినప్పటికి, యువకుడైన రామనాథుడు భగవాన్‌తో ఉండిపోవడానికి మొగ్గుచూపారు. ఆయన వీధులలో బిచ్చమెత్తి, లభించిన ఆహారాన్ని భగవాన్‌కు సమర్పించి, ఆయనతోపాటు దొరికిన దానిని తృప్తిగా భుజించేవారు. ఆయన విధేయత అంత అపురూపంగా ఉండేది. భగవాన్ తల్లి అప్పటికింకా సనాతన ఆచారాలను పాటించుట వలన బ్రాహ్మణ బాలుడైన ఈయన సేవలను అంగీకరించేవారు. ఆయన గిన్నెలను కడగటమే కాకుండా, ఆవిడ దుస్తులను కూడా ఉతికేవారు. ఆమె ప్రతి పనికీ రామనాథా! రామనాథా! అని పిలుస్తుండే వారు. ఆమె పిలుపులు వింటూ, "మా తల్లి గారి జపం మళ్ళీ మొదలైంది," అని భగవాన్ హాస్యమాడేవారు.

ఒకనాడు భగవాన్, రామనాథతో, "ఆత్మను సాక్షాత్కరింపజేసుకొనుటలో నువ్వు సఫలీకృతుడవైనావు," అని చెప్పారు. రామనాథ నమ్మలేకపోయారు. రామనాథ పదే పదే 'ఆ మాట నిజమేనా?' అని భగవాన్‌ను అడుగసాగారు. భగవాన్ చాలాసార్లు, "అవును రామనాథా! నీవు ఆత్మసాక్షాత్కారం పొందావు," అని చెప్పారు. అయినా అతనికి ఇంకా నమ్మకం కుదరలేదు. భగవాన్ లేచి నుంచొని అతని తలమీద చిన్నగా మొట్టి, "అవును రామనాథా! నీవు సాక్షాత్కారం పొందావు," అన్నారు. ఆ అమాయక భక్తుడు, పారవశ్యంతో గది బయటకు పరుగెత్తి, కన్పించిన ప్రతి ఒక్కరితో ఇదిగో ఇక్కడే భగవాన్ నా తలపై మొట్టికాయ వేశారు అని చెప్పసాగారు. భగవాన్ ప్రేమగా మొట్టికాయ వెయ్యడమే, సాక్షాత్కారం కంటె ఎక్కువగా కన్పించింది ఆయనకు.

ఈ అమాయక శిష్యుడు, భగవాన్‌కే కాకుండా, ఆయన ఇతర శిష్యులకు గూడ సేవ చేసేవారు. ఆయన పల్లాకొత్తులో ఉండడం ప్రారంభించినపుడు, కావ్యకంఠ, మురుగనార్, పాల్‌బ్రంటన్, కోహెన్, విశ్వనాథస్వామి, కుంజు స్వామి కూడా అక్కడే ఉండేవారు. వాళ్ళ ఏకైక లక్ష్యము, భగవాన్‌తో వీలున్నంత ఎక్కువసేపు గడపడమే. వాళ్ళే కనుక ఆశ్రమ ఆఫీసులో పనిచేస్తున్నట్లయితే ఇది సాధ్యమయ్యేది కాదు. ప్రతిరోజు సాయంత్రం, తనకు తానుగా రామనాథ బ్రహ్మచారి ఎంతో అంకితభావంతోను, శ్రద్ధాభక్తులతో వారందరి కుటీరాలను చిమ్మి శుభ్రం చేసి, వాళ్ళ దీపాలను కూడా శుభ్రం చేసి పెట్టేవారు. పగటిపూట బస్తీకి వెళ్ళి, వాళ్ళకు కావలసిన సరుకులు తెచ్చి పెట్టేవారు. ఈ పనులన్నీ చేస్తూ కూడా భగవాన్ సన్నిధిలో కాలం గడపడానికి కావలసినంత సమయం ఉండేది ఆయనకు. భగవానే ఆయనకు సర్వస్వము.

పల్లాకొత్తులో నివాసముండే వారు, ఈయన సేవలను గురించి భగవాన్‌కు చెప్పలేదు. ఒకనాడు, విశ్వనాథ స్వామికి ఒక పోస్టుకార్డు వచ్చింది. దానిపైన "దయచేసి పల్లాకొత్తు సర్వాధికారికి, నా ప్రణామాలు తెలియచేయండి," అని ఉన్నది. భగవాన్ కొన్నిసార్లు స్వయంగా, పోస్టులో వచ్చిన ఉత్తరాలను, ఎవరివి వారికి ఇచ్చేవారు. ఆయన విశ్వనాథ స్వామికి ఉత్తరం ఇస్తూ, "ఈ పల్లాకొత్తు సర్వాధికారి ఎవరు?" అని నవ్వుతూ అడిగారు. అప్పుడు హాలు చివర ఎక్కడో ఉన్న రామనాథబ్రహ్మచారి లేచి నుంచుని, చేతులు కట్టుకుని, "వాళ్ళకు కావలసిన పనులు చేసి పెడతాను కాబట్టి వాళ్ళు నన్ను పల్లాకొత్తు సర్వాధికారి అని అంటారు. వాళ్ళు ఈ సేవలన్నీ చేయటానికి అనుమతించి, దానిని ఆమోదిస్తూ అంగీకారంగా, నన్ను పల్లాకొత్తు సర్వాధికారి అని పిలుస్తారండి," అని చెప్పారు. భగవాన్ ఎంతో సంతోషంతో, "నిజమైన సర్వాధికారి ఇలా ఉండాలి," అన్నారు.

మరొక సందర్భంలో పొడవుగా, దృఢంగా ఉండే దండపాణిస్వామి అనే ఆశ్రమవాసి, ప్రతివాళ్ళు తనకు అణిగిమణిగి ఉండాలనుకునే అతను, రామనాథ బ్రహ్మచారితో తగాదా పెట్టుకున్నారు. బలహీనుడైనాగానీ, రామనాథస్వామి కూడా ఏమాత్రం తగ్గలేదు. దండపాణిస్వామి రామనాథను క్రిందకు పడేటట్లుగా తోసి తన భుజబలం యొక్క దర్పంతో, "నేనెవరో తెలుసా నీకు?" అని అడిగాడు. రామనాథ బ్రహ్మచారి నేలపై పడి ఉండి, చేతులు జోడించి, వినయంగా, "దండపాణిస్వామీ! మనమందరం ఇక్కడకు వచ్చింది 'నేనెవరు?' అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకొనే ఉదాత్తమైన ఉద్దేశంతోనే కదా!" అన్నారు. "నేనెవరు?" అనే మాటలు వినగానే దండపాణిస్వామికి ఆవేశం దిగిపోయి, తన దురుసు తనానికి క్షమాపణ వేడుకొన్నారు. అప్పుడు వారిద్దరూ భగవాన్ వద్దకు వెళ్ళగా, దండపాణిస్వామి స్వయంగా జరిగినదంతా భగవాన్‌కు తెలిపారు. భగవాన్ నవ్వేశారు.

ఒక వ్యక్తి, లక్ష్మి అని భగవాన్‌చే పేరుపెట్టబడ్డ ఆవుదూడను ఆశ్రమంలో ఉంచడానికి తీసుకుని వచ్చారు. అక్కడ లక్ష్మి బాగోగులు చూడడానికి ఎవరూ లేరు. చిరుతపులులూ, పెద్దపులుల నుండి ప్రమాదం ఉంది. అందుకని ఇక్కడ ఉంచుకోలేము అని చెప్పారు భగవాన్. చిన్నగా, నాలుగున్నర అడుగులు ఎత్తు ఉండే రామనాథ, "భగవాన్! నేను లక్ష్మిని చూచుకుంటాను," అన్నారు. అప్పుడే రమణాశ్రమ గోశాల మొదలైంది.

తిరువణ్ణామలైకి, రైలు రోజూ రాత్రి ఎనిమిదిన్నరకు రావడంతో, బయట ఊళ్ళనుండి వచ్చేవారు ఆశ్రమానికి వచ్చేటప్పటికి బాగా పొద్దుపోయేది. రమణాశ్రమంలో అందరూ ఏడుగంటలకల్లా రాత్రి భోజనం ముగించుకుని, ఏడున్నరకల్లా నిద్రించేవారు. భగవాన్‌కు రాత్రిపూట ఆలస్యంగా వచ్చే అతిథులను ఎవరైనా చూసుకుంటే బాగుండునని ఉండేది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. రామనాథ, "భగవాన్! వారిని నేను చూచుకుంటాను," అన్నారు. ప్రతి రాత్రీ ఆయన మేలుకుని ఉండి, అతిథుల అవసరాలను చూచుకునే వారు. మర్నాటి ఉదయం భగవాన్, రామనాథను చూచి నవ్వుతూ, "అయితే వారిని తీసుకొని వచ్చి, వారి అవసరాలను తీర్చావన్నమాట. మంచిది. మంచిది. మంచిది," అనేవారు.

ఒకరోజు భగవాన్, రామనాథతోను, మిగిలిన ఇతర భక్తులతోనూ కలిసి గిరిప్రదక్షిణలు చేస్తున్నపుడు, ప్రతివారు ఒక ఆధ్యాత్మిక అంశంపై మాట్లాడవలసి వచ్చింది. రామనాథ భక్తిపారవశ్యంతో భగవాన్‌ను ఈశ్వరునితోనూ, ఆయన భక్తులను, శివుని భూతగణాలతోనూ పోల్చిచెప్పారు. తర్వాత భగవాన్ ఇతర భక్తులు కోరగా, తాను చెప్పిన దానిని తమిళ పద్యాలుగా వ్రాశారు. అందులో మొదటి పద్యం ఈ విధంగా ఉంది : "నేను తిరుచ్చుళి ఈశ్వరుని చూచి తిరిగి వచ్చే పనిలేకుండా నిలచిపోయాను." దాని అర్థం ఏమిటంటే నేను సాక్షాత్కారం పొందాను. నాకిక దేహభ్రాంతి లేదు. నా ప్రభువు నాకీ సాక్షాత్కారాన్ని అనుగ్రహించారు."

భగవాన్‌యొక్క మంచి భక్తులలో ఒకరైన మా తల్లిగారు, రామనాథ బ్రహ్మచారిని ఎంతో ప్రేమగా చూసేవారు. "మురుగనార్, సాధుఓం, శివప్రకాశం పిళ్ళై ఇతర భక్తులందరిలో ఎవరు వ్రాసిన పాట నీ కన్నిటికంటె ఇష్టమైనది?" అని నేనామెను అడిగినపుడు, రామనాథ బ్రహ్మచారి వ్రాసిన గీతం నాకెంతో ఇష్టమైనది అని ఆమె అన్నారు. ఆ పాట భావమిలా ఉంటుంది. "నేను తిరుచ్చుళి నాథుణ్ణి చూశాను. వెనుదిరగలేక అక్కడే స్థిరపడి పోయాను. చిదంబరంలో నర్తిస్తూ నిస్సహాయులను కాపాడే నటరాజు ఆయనే. ఆ తిరుచ్చుళి నాథుడే పవిత్ర తిరువణ్ణామలైలోని కొండమీద విరూపాక్ష గుహలో దైవమై వెలిసాడు. కాయాపురి (దేహము)లో కరణాలే (జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు) ప్రజలుగా, అహంకారమే మంత్రిగా అధర్మ పరిపాలన చేస్తున్నాడు. కొంతకాలం తర్వాత జీవుడు 'భగవంతుని అనుగ్రహము' అనే ఖడ్గమును తీసికొని, అహంకారమనే తన మంత్రి తలను నరికేశాడు. అలా మంత్రి తల త్రెంచి దహరాలయమనే గుహలో నాట్యము చేస్తున్న దేవునిలో ఐక్యమయ్యారు. ఆయనే ఈ తిరుచ్చుళి నాథన్. ఆయనను చూచిన నేను తిరిగి వెళ్ళలేక అక్కడే నిలిచిపోయాను.

1946లో రామనాథ బ్రహ్మచారి జబ్బుపడ్డారు. చికిత్స కోసం చెన్నై తీసుకొని వెళ్లగా అక్కడ చనిపోయారు. ఆ వార్త భగవాన్‌కు చేరి ఆయన పూర్తి మౌనం వహించారు. ఆ 1946వ సంవత్సరములో అలా చాలా అరుదుగా జరిగేది. చుట్టూ వందలాది మంది ప్రజలున్నప్పటికీ ఆయన సమాధి నిష్ఠలో ఉండిపోయారు.

రామనాథ బ్రహ్మచారి వంటి భక్తులు, ఒక జ్ఞానిని మనమెలా ప్రేమించాలో, ఎలా ఆయనను అనుసరించి ఈ జన్మలోనే ముక్తులవవచ్చో తెలిసేటట్లు చేస్తారు.

గంభీరం శేషయ్య

హిందూమతంలో భగవంతుని మొదటి పని సృష్టిచెయ్యడం. అందుకనే అరుణాచల శివుడు మానవరూపం దాల్చి అరుణాచల రమణునిగా అవతరించారు. భగవంతుని రెండవ గుణము రక్షించడం. దానికొరకై, ఆయన అమ్మ అళగమ్మాళ్, రామనాథ బ్రహ్మచారి, ఇంకా ఇతర భక్తులనెడి కొండరాళ్ళను, భగవాన్ యొక్క శరీరమునూ, పరిసరములనూ కాపాడుటకు పంపించారు.

ఆయన మూడవ పని ఉన్నతమైన జ్ఞానోపదేశంలో, ఆత్మసాక్షాత్కారమునకు అడ్డుగా ఉన్న దేహాత్మ భావనను, ఇతర అడ్డంకులను తొలగించడం. దీని కొరకు, అరుణాచలుడు, గంభీరం శేషయ్య, శివప్రకాశం పిళ్ళై అనే మేధావులను భగవాన్ వద్దకు పంపారు. తమిళ వేదాంత గ్రంథమైన వేదాంత చూడామణిలో; 'ఒక శిష్యునియొక్క విధులన్నిటిలోకి, తన గురువు యొక్క బోధలను పదిలపరచడం అనేది అతి ముఖ్యమైనది,' అని ఉన్నది. భగవాన్ తరచుగా ఆ గ్రంథములోని వాక్యములను ఉదహరిస్తుండేవారు.

ఇందుకొరకే గంభీరం శేషయ్యగారు భగవాన్ జీవితంలోనికి ప్రవేశించారు. గంభీరం అనేది పేరు కాదు. అది ఆ కుటుంబానికి ఇవ్వబడ్డ బిరుదు. ఆయన ముత్తాత ఒక రాజు క్రింద పనిచేస్తూ 'గంభీరమ్' అనే బిరుదును పొందారు. 'గంభీరం' అంటే ఠీవి, ఔన్నత్యము కల్గి గొప్ప వంశమునకు చెందిన ఉద్యోగి అని అర్థము. విధివశాత్తూ భగవాన్ తిరువణ్ణామలైలో భిక్షకు వెళ్ళిన తొలి ఒకటి రెండు రోజులలో ఒక ఇంటి ముందు నిలబడ్డారు, భిక్ష కొరకు. అక్కడ నలుగురు మనుషులు జూదము, చీట్లపేక ఆడుతున్నారు. ఆ ఇంటిముందు నిలబడి భగవాన్ చప్పట్లు కొట్టగానే ఇంటి పెద్ద సిగ్గుతో ఇంటినుండి భిక్షతెచ్చి భగవాన్‌కు ఇచ్చారు. ఆ వ్యక్తి గంభీరం శేషయ్య గారి సోదరుడు గంభీరం కృష్ణఅయ్యర్. ఆయన ఆనాటినుండి తిరిగి ఎన్నడూ జూదం జోలికి పోలేదు.

ప్రభుత్వాధికారి అయిన గంభీరం శేషయ్యగారు మంచి వేదాంత పరిజ్ఞానం కలవారు. 1900సం॥లో ఆయన తిరువణ్ణామలైకు బదిలీ చేయబడ్డారు. అక్కడ ఆయన విరూపాక్షగుహలో సన్యాసజీవితం గడుపుతున్న బ్రాహ్మణ బాలకుని గురించి విన్నారు. వేదాంత విషయాల మీద కుతూహలం కొద్దీ ఆయన, భగవాన్‌ను దర్శించారు. భగవాన్ యొక్క ఒక్క చూపుతోనే ఆయనకు వశుడై పోయారు. తాను చదివిన వేదాలలోని సారము, ఇంతెందుకు తాను అన్వేషిస్తున్న సత్యమే, (ఆత్మయే) మానవరూపం ధరించి ఎదుట నిలిచినట్లనిపించింది.

యోగము మీద వేదాంతము మీద ప్రత్యేకించి వివేకానందుడిచే రచించబడ్డ గ్రంథాలను ఆయన చదివారు. ఆయనకు చాలా సందేహాలున్నాయి. ఆయన ఆ గ్రంథాలను భగవాన్ వద్దకు తెచ్చి, అవిచూచి తన సందేహాలను తీర్చవలసిందిగా కోరారు. భగవాన్ మౌనాన్ని పాటిస్తున్నారని ఆయన అనుకున్నారు. అందుకని ఆయన తన ప్రశ్నలను కాగితంపై వ్రాస్తుండేవారు. ఆ గ్రంథాలను జాగ్రత్తగా పరిశీలించి భగవాన్ కూడా వ్రాతపూర్వక సమాధానాలు ఇచ్చేవారు. చాలాకాలం తర్వాత భగవాన్ నవ్వుతూ ఇలా అన్నారు, "నేను ఎప్పుడూ మౌనంగా ఉండాలనే నియమం పెట్టుకోలేదు. అయినా నేను మౌనంలోనే ఉంటాను. నేనెప్పుడూ ఉపవాస నియమం కూడా పెట్టుకోలేదు. ఎవరూ భిక్ష ఇవ్వనప్పుడు నేను అభోజనంగా ఉన్నాను. అప్పుడు వాళ్ళు, "మన స్వామి ఉపవాస దీక్షలో ఉన్నారు," అన్నారు. ఎవరూ నాతో మాట్లాడే వారు కాదు. అందుకని నేను మాట్లాడక ఉండే వాణ్ణి. అప్పుడు ప్రజలు, "స్వామి మౌనంలో ఉన్నారు. ఆయనను ఇబ్బంది పెట్టవద్దు," అనుకునే వారు.

గంభీరం శేషయ్యగారు అద్భుతమైన ప్రశ్నలు అడగడమే కాకుండా, కఠినతరమైన భాగాలను క్లుప్తంగా, సులభశైలిలో వ్రాసి ఇమ్మని, భగవాన్‌ను అభ్యర్థించేవారు. అనేక విషయాలు చర్చించబడేవి. వాటికన్నిటికీ తేలికైన పరిభాషలో హిందూపురాణాలలోని పదజాలంతో వివరణ ఇవ్వబడేది. వానిలో కొన్ని ప్రశ్నలు ఆత్మవిచారణకు సంబంధించినవి కాగా, ఎక్కువ భాగం హిందూవేదాంతంలోని, యోగ, సాధన, ఏకాగ్రత, ధ్యానము, దైవము, ప్రపంచము, అహంకారము, ముక్తి, ప్రాణాయామము, అష్టాంగయోగము, మొదలైన వానికి సంబంధించినవి. అష్టాంగయోగంతో సహా, ఇతర మార్గాలలోని మర్మాలను (క్లిష్టమైన విషయాలను) వివరించి చెప్పినప్పటికీ, భగవాన్ ఎప్పుడూ సూటి మార్గమైన, జ్ఞానమార్గము యొక్క విశిష్ఠతను నొక్కి

చెబుతుండేవారు. "యోగమార్గము, మనసనే పొగరుబోతు గిత్తను, తాళ్ళతో బంధించి బలవంతంగా లొంగతీయుటవంటిది. జ్ఞానమార్గము ఆ ఎద్దును, మొదట పచ్చగడ్డి వేసి శాంతపరిచి, నెమ్మదిగా దారిలోనికి తెచ్చుటవంటిది," అని భగవాన్ అనేవారు. గంభీరంశేషయ్య గారి వలన, భగవాన్ యోగ, వేదాంత ఇతర ఆధ్యాత్మిక మార్గాలకు చెందిన గ్రంథాలను చదవడం జరిగింది. దానితో ఆయనే, ఒక వేదాంత విశ్వవిద్యాలయం లాగా తయారయ్యారు. ఈ అనుభవము తదుపరి కాలంలో బాగా ఉపయోగపడింది. వేదవాఙ్మయములో మంచి పాండిత్యముగల కావ్యకంఠగణపతి మునితోనూ, విద్యావంతులైన విదేశీయులు పాల్‌బ్రంటన్, ఫ్రాంక్‌హంఫ్రీస్, ఇస్లామ్ మత పండితుడైన డాక్టర్ హాఫీజ్‌సయ్యద్ గార్లతోనూ చర్చలు జరపడానికి ఆ అనుభవం ఉపయోగపడింది. ఈ చర్చలు సజావుగా జరగడానికి గంభీరం శేషయ్యగారు ఒక సాధనంగా ఉపయోగపడ్డారు.

గంభీరంశేషయ్యగారు, తన ప్రశ్నోత్తరాలున్న చీటీలను, నోటు పుస్తకాలను భగవాన్ యొక్క భావితరాల భక్తులకు అందించడానికి కారణభూతులైనారు. వీనిలోని సమాచారమే తమిళంలో 'విచార సంగ్రహం' అనే పేరుతో రమణ బోధలను కల్గిన ప్రథమ గ్రంథంగా ప్రచురించబడింది. ఈ గ్రంథం తదుపరి ఆంగ్లంలోనికి 'ప్రశ్నోత్తర విచారణ' అనుపేరుతో అనువదించబడినది. ఆ పేరును తదుపరి "ఆత్మవిచారణ" గా మార్చారు.



శివప్రకాశం పిళ్ళై

శివప్రకాశంపిళ్ళై 1902లో భగవాన్ సన్నిధిలోనికి వచ్చినపుడు వేదాంతంలో ఉన్నతవిద్యను అభ్యసించిన ప్రభుత్వ అధికారిగా ఉండేవారు. ఆయన కళాశాలలో ఉండే సమయంలోనే, అంతర్ముఖులై, 'నేనెవరిని?' అని విచారణ జరుపుతుండేవారు. అది ఒక నిలకడలేని ఆలోచనగా నాకన్పించేది అని ఆయన అన్నారు. ఆయన భగవాన్‌ను విరూపాక్ష గుహవద్ద కలిశారు. గంభీరంశేషయ్యగారి వలెనే ఈయన కూడా భగవాన్ యొక్క ప్రథమ వీక్షణంలోనే, ఆయనకు వశీభూతులైనారు. ఆయన తన గురువును, దైవాన్ని, భగవాన్‌లో చూడగలిగారు. వివేకవంతుడు క్రియాశీలియైన ఈయన భగవాన్‌ను తొలిసారిగా, "స్వామీ! నేనెవరను?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్న, ఉపదేశమనే ప్రవాహానికి గేట్లు తెరిచినట్లయింది. ఈనాటికీ ఆ ప్రవాహం ప్రపంచంలోని ఆధ్యాత్మిక సంస్కృతిని ప్రభావితం చేస్తుంది. ఆయన భగవాన్ బోధలపట్ల ఆచరణశీలిగా ఉండేవారు. శివప్రకాశంపిళ్ళై, భగవాన్‌ను, పధ్నాలుగు ప్రశ్నలు అడిగారు. భగవాన్ ఆ ప్రశ్నలకు సమాధానాలను, పలక మీద, ఇసుక మీద వ్రాశారు. ఆ జవాబులు వెంటనే తుడిచి వేయబడేవి. తన జ్ఞాపకశక్తి ఆధారంగా, శివప్రకాశంపిళ్ళై వాటికి సమాధానాలను తిరిగి వ్రాశారు.

శివప్రకాశంపిళ్ళై : స్వామీ! నేనెవరను? ముక్తికి మార్గమేది?

భగవాన్: "నిరంతరం నేనెవరను?" అని జరిపే ఆత్మవిచారణ ద్వారా, నిన్ను నీవు తెలుసుకొని ముక్తినొందుతావు.

ప్ర : నేను ఎవరిని?

జ : నిజమైన 'నేను' లేదా 'ఆత్మ' ఈ శరీరమూ కాదు. ఐదు జ్ఞానేంద్రియాలు కాదు. వాని ద్వారా గ్రహింపబడే విషయములు కావు. కర్మేంద్రియములు కాదు, ప్రాణము కాదు, మనసు కాదు. ఇవి ఏమీ పని చెయ్యని గాఢ నిద్రాస్థితికాదు.

ప్ర : ఇవేమీ 'నేను' కాకుంటే మరి 'నేను' ఏమిటి?

జ : వీటిలోని ప్రతి ఒక్కదానినీ నేను కాదని త్రోసిపుచ్చితే, చివరకు మిగిలేదే 'నేను'. అదే 'చైతన్యము' లేదా 'ఎఱుక'.

ప్ర : ఆ చైతన్యము యొక్క స్వభావమేమి?

జ : అదే సత్ చిత్ ఆనందము. ఏ స్థితిలోనైతే 'అహంకారము' లేశమాత్రము కూడా ఉండదో అదే చైతన్యము. దీనినే 'మౌనము' అనియు, 'ఆత్మ' అనియు కూడా అంటారు. అది ఒక్కటే ఉనికిగల్గి ఉన్నది. ప్రపంచము, అహంకారము, దేవుడు అనే త్రిపుటి ఒకదానికొకటి వేరువేరుగా ఉన్నవని భావిస్తే, అవి భ్రమలే. ముత్యపుచిప్పలోని వెండిలాగా, దైవము, అహంకారము, ప్రపంచము అన్నీ నిజానికి శివస్వరూపమే (లేదా) ఆత్మస్వరూపమే.

ప్ర : మేము వానినెలా గుర్తించాలి?

జ : చూడబడే వస్తువులన్నీ లేకుండా పోయినపుడు 'ద్రష్ట' లేదా 'కర్త' వ్యక్తమవుతాడు.

ప్ర : బాహ్య వస్తువులను చూస్తూనే దానిని గుర్తించలేమా?

జ : లేదు. ఎందుకనగా చూసే వాడు, చూడబడేది కూడా, 'తాడు' దానిపై ఆరోపించబడిన సర్పమువంటివి. అది 'సర్పము' అనే భ్రాంతిని నీవు తొలగించుకోనంతవరకు, ఉన్నది కేవలం తాడు మాత్రమేనని నీవు గుర్తించలేవు.

ప్ర : ఎప్పుడు బాహ్యవిషయములు అంతరించి (కనపడకుండా) పోతవి?

జ : అన్ని ఆలోచనలకు, కార్యములకు కారణభూతమైన మనస్సు ఎప్పుడైతే అంతరించి పోతుందో, అప్పుడు బాహ్యవిషయములన్నీ కూడా అంతరించి పోతాయి.

ప్ర : మనసు యొక్క స్వభావము ఏమిటి?

జ : 'మనసు' అనేది కేవలము ఆలోచనల సముదాయమే. అది ఒక విధమైన శక్తి. మనస్సే ప్రపంచంగా రూపం

దాలుస్తుంది. ఎప్పుడైతే మనస్సు ఆత్మలో మునిగి లీనమైపోతుందో అప్పుడే ఆత్మసాక్షాత్కరిస్తుంది. మనస్సు ఆత్మను వీడి, బాహ్యములోనికి వచ్చినపుడు ఈ జగత్తు గోచరిస్తుంది. ఆత్మ మరుగున పడుతుంది.

ప్ర : మనసు ఎలా అంతరిస్తుంది?

జ : "నేనెవరను?" అను విచారణ ద్వారానే, కేవలము మనస్సు అంతరిస్తుంది. ఈ విచారణ కూడా మనస్సు యొక్క ప్రక్రియే అయినప్పటికీ, అది మనస్సు యొక్క ఇతర ప్రక్రియలను నాశనం చేసి తను కూడా నశించిపోతుంది. ఎలాగంటే చితిలోని కట్టెలను మండించటానికి ఉపయోగించిన కట్టె, చితి, చితిలోని శవము కాలి భస్మమై పోవు సరికి తానుకూడా ఎలా బూడిదగా మారుతుందో అలాగ. అప్పుడే ఆత్మ సాక్షాత్కరిస్తుంది. 'నేను' అనే భావం ఎప్పుడైతే నశించిపోతుందో, శ్వాస, మిగిలిన జీవనాన్ని తెలిపే చిహ్నాలు గూడ అణిగిపోతవి. అహంకారానికి, ప్రాణమునకు ఒకటే జన్మస్థానము. నీవు ఏ పనిచేస్తున్నా కూడా, అహంకార రహితంగా, కర్తృత్వభావం లేకుండా అంటే 'నేను చేస్తున్నాను' అనే భావన లేకుండా చెయ్యి, ఎప్పుడైతే మానవుడు ఆ స్థితికి చేరుకుంటాడో, అతనికి తన భార్య కూడా 'జగజ్జనని' లాగానే కన్పిస్తుంది. అహంకారాన్ని పూర్తిగా ఆత్మకు అర్పించి వెయ్యడమే నిజమైన భక్తి.

ప్ర : మనస్సు నశించుటకు ఇతర మార్గములు లేవా?

జ : 'ఆత్మవిచారణ' తప్ప, అంత పటిష్టమైన విధానం ఇంకొకటి లేదు. వేరే ఏ మార్గంతోనైనా మనస్సును కొంతసేపు శాంతిపజేస్తే, అది కొద్దికాలం పాటు శాంతించి, పిదప మరల విజృంభించి, మొదటికొస్తుంది.

ప్ర : ఎప్పుడు మాలో అహంకారమును పరిరక్షించే చిత్తవృత్తులు, వాసనలు (అహంకారమును పరిరక్షించుకొనునవి) అణచివేయబడతాయి?

జ : నీవు ఎంతెంతగా అంతరంలోనికి, ఆత్మలోనికి చొచ్చుకొని పోతావో, అంతగా ఈ సంస్కారాలు క్షీణించి చివరకు నశించిపోతాయి.

ప్ర : ఎన్నో జన్మలనుండి మాలో పాతుకుపోయిన సంస్కారాలనన్నిటినీ వేర్లతోసహా పెకలించి వేయటం నిజంగా సాధ్యమేనా?

జ : ఇటువంటి సందేహాలకు నీ మనస్సులో ఎన్నడూ తావివ్వక దృఢనిశ్చయంతో ఆత్మలోనికి మునుగు. మనస్సును నిరంతము ఆత్మవిచారణ ద్వారా ఆత్మవైపు మళ్ళించినట్లయితే, దానంతటదే నశించిపోయి, ఆత్మరూపం తెలుస్తుంది. నీకు ఏదైనా సందేహం వచ్చినపుడు దానిని తీర్చుకోవడానికి ప్రయత్నించక, 'ఈ సందేహం వచ్చింది ఎవరికి?' అని విచారించు.

ప్ర : ఇలా విచారణ ఎంతకాలం సాగించాలి?

జ : ఆలోచనలకు మూలమైన సంస్కారాలు, నీ మనస్సులో ఏ కొద్దిగానైనా దాగి ఉన్నంతవరకు. కోటలో శత్రువులున్నంత వరకూ దాడి చెయ్యటానికి ప్రయత్నిస్తుంటారు. ఒకొక్కరు బయటకు వచ్చిన వెంటనే చంపేస్తుంటే, చివరకు కోట నీ వశమవుతుంది. ఆ విధంగానే, ప్రతిసారీ నీలో ఏదైనా ఆలోచన తలెత్తిన వెంటనే దానిని, ఈ విచారణతో అణచివెయ్యి. ఆలోచనలన్నింటినీ వాటి పుట్టుక చోటునే అణచివెయ్యడాన్నే వైరాగ్యమంటారు. ఆత్మసాక్షాత్కారమగు వరకు, విచారణ తప్పనిసరి. ఏ విధమైన అంతరాయము లేని నిరంతర ఆత్మస్మరణయే కావలసినది.

ప్ర : ఈ జగత్తుకూ దానిలో జరిగే కార్యక్రమమంతటికీ కూడా దైవసంకల్పమే కదా కారణము. దైవము ఎందుకలా సంకల్పించాలి?

జ : దైవానికి ఏ ఉద్దేశమూ లేదు. ఆయన ఏ కార్యము చేత బద్ధుడు కాదు. ఈ జగత్తులోని కార్యక్రమమేదీ, ఆయనను ప్రభావితం చెయ్యలేదు. ఉదాహరణకు సూర్యుణ్ణే తీసుకో. సూర్యుడు, ఏ కోరికా, ఉద్దేశమూ ప్రయత్నమూ లేకుండానే ఉదయిస్తాడు. కానీ సూర్యుడు ఉదయించగానే అనేక కార్యక్రమములు ఈ భూమిమీద ప్రారంభమవుతవి. సూర్యకిరణ మార్గంలో ఉంచబడిన కటకము (లెన్సు / భూతద్దము) దాని కేంద్రము ద్వారా కిరణమును పరావర్తన చెందించి, వేడిని, మంటను పుట్టిస్తుంది. కలువ వికసిస్తుంది. నీరు ఆవిరిగా మారుతుంది. ప్రతి జీవీ ఏదో ఒక కార్యక్రమమును ఆరంభించి,

నిర్వహించి, ముగిస్తుంది. అటువంటి కార్యక్రమములవల్ల ఏ మాత్రమూ ప్రభావితం గాకుండా, తన స్వాభావిక ధర్మాన్ని అనుసరించి, ఉద్దేశరహితంగా కేవలం సాక్షీభూతుడిగానే సూర్యుడుంటాడు. దైవము కూడా అంతే. లేదా ఆకాశమును (స్పేస్)ను ఉదాహరణగా తీసుకుంటే, భూమి, నీరు, అగ్ని, వాయువు అన్నీ అందులోనే ఉండి, వాటికవి ఎన్నో మార్పులు చెందుతుంటాయి. ఆ మార్పులేవీ ఆకాశమును (స్పేస్)ను ప్రభావితం చెయ్యలేవు. దైవమూ అంతే. జీవులయొక్క సృష్టి, స్థితి, లయ, ముక్తి, వగైరాలన్నీ ఆయన పనులే అయినప్పటికీ, వాటిని నిర్వహించడంలో ఆయనకే విధమైన కోరిక కానీ ఉద్దేశం కానీ లేవు. జీవులు తమ తమ ప్రారబ్ధ ఫలములను, దైవము యొక్క ధర్మసూత్రములను అనుసరించి అనుభవిస్తారు. వారు చేసిన కర్మ ఫలితములకు వారే బాధ్యులు. కానీ దైవము కాదు. దైవము ఏ కార్యము వలన ప్రభావితం కాదు.

పిమ్మట శివప్రకాశంపిళ్ళై మరొక పదునాలుగు ప్రశ్నలను అడిగారు. భగవాన్ వాటికి గూడా సమాధానమిచ్చారు. ఈ ఇరువది ఎనిమిది ప్రశ్నలూ, వాని సమాధానములూ కలిపి, సాధకులకు ఎంతో ఉపయోగపకరంగా ఉండే "నేనెవరు?" అనే చిన్న పుస్తకముగా వెలువడ్డవి. మనము కూడా ఆ ఆత్మయేననీ, శ్రీరమణమహర్షిలో ఏ చైతన్యమైతే నిండి ఉండేదో, అది ఈనాడూ, ఈ జగత్తంతా, అనాదియైన, కల్మషరహితమైన సత్యముగా (చైతన్యముగా) వ్యాపించి ఉన్నదనీ మనము గుర్తించేటట్లు చేస్తుందీ పుస్తకము. మిగిలిన పధ్నాలుగు ప్రశ్నల సారాంశము ఈ దిగువన ఇవ్వబడింది.

ఈ భౌతిక దేహంలో 'నేను' అని మొదలయ్యేది మనస్సు. ఈ 'నేను' అనే భావన హృదయం నుండీ, లేదా జీవుని కేంద్రమునుండీ వెలువడుతుంది. 'నేనెవరను?' అనే ఆత్మవిచారణ ద్వారా, మన దృష్టి అంతర్ముఖమై, ఆలోచనలనుండి, మళ్ళింపబడుతుంది. ఈ అభ్యాసాన్ని పట్టుదలతో చేస్తే, మనస్సుకు మూలంలోనికి వెళ్ళడానికీ, ఆత్మలో విలీనమై పోవడానికీ కావలసిన దృఢత్వాన్నిస్తుంది. సాత్వికసూత్రాలను ఆచరించుట, అనగా సాధారణమైన పోషక విలువలు కల్గిన ఆహారాన్ని తగు మోతాదులో మాత్రమే తీసుకోవడం, మంచి నడవడిక కల్గియుండడం, మనస్సు స్వచ్ఛంగా, నిర్మలంగా మారటానికి ఎంతో దోహదకారి అవుతుంది. ఈ నిర్మలమైన మనస్సు లోపల ఏ విధమైన అలజడీ లేకుండా, నిరంతరాయంగా, ఆత్మవిచారణ కొనసాగడానికి తోడ్పడుతుంది. సాధకుడు, దృష్టిని దృఢంగా, నిరంతరం హృదయంమీదే కేంద్రీకరించి ఉంచాలి. సాధకుడు, గురువు ఉపదేశాన్ని నిరంతరం ఏమాత్రం ఏమరుపాటు లేకుండా అభ్యాసం చెయ్యాలి. ఆత్మే అనంతము. గాఢనిద్రలో ఉన్నపుడుగానీ, సమాధిలో ఉన్నపుడు గానీ, ఏదైనా కోరుకున్న వస్తువు లభ్యమైనపుడుగానీ ఆనందం ఎందువల్ల లభ్యమవుతుందంటే మనస్సు తన కోరికను వీడి, ఆత్మలో మునగడం వల్లనే. వివేకవంతుడైన మనుష్యుడుఎప్పుడూ చెట్టునీడను వీడి తీవ్రమైన ఎండలోనికి వెళ్ళనట్లే, సాధకుడు ఎల్లవేళలా అంతర్ముఖుడై ఆత్మపైనే దృష్టినుంచి బాహ్యవిషయాలలోనికి మనసును పోనీయరాదు. సూర్యునివలెనే ఆత్మకూడా, తానే ఆధారముగా గల జీవుల చర్యలవలన ఏమాత్రమూ ప్రభావితము కాదు. నిరంతరము మనస్సును అంతర్ముఖం చేసి, ఆత్మగా నుండుటయే ఆత్మవిచారణ, మనస్సు అణిగితే ఇతరములన్నియు అణుగును. కేవల ఉనికిగా, లేదా హృదయములోనే ఉండిపోవుట, లేదా స్వస్వరూపముగా ఉండిపోవటాన్నే 'ముక్తి' లేదా 'మోక్షము' అంటారు.

శివప్రకాశంపిళ్ళై ఈ బోధలన్నిటికీ ప్రతిరూపంగా నిలిచారు. సాధకులు ఎలా అంతర్ముఖులై సత్యాన్వేషణ సాగించాలో ఆయన చూపారు. ఆయన భగవాన్‌ను ఆరాధించారు. ఆయన బోధనలన్నిటిని సంపూర్ణంగా అవగాహన చేసుకుని ఆచరణలో పెట్టారు. కానీ ఒక్కొక్కసారి, భగవాన్ ఉపదేశాలను ఆచరించేటప్పుడు, భక్తుడు పొరపాటు పడే అవకాశమున్నది. ఉదాహరణకు భగవాన్ త్యాగాన్ని, వైరాగ్యాన్ని గురించి గొప్పగా చెప్పారని, వాటి అర్థం సన్యాసం స్వీకరించడమని ఆయన అపోహపడ్డారు. ఆయన ఇంటికి వెళ్ళి గుండు చేయించుకుని, జంధ్యాన్ని తీసిపారవైచి, ఒక ధోవతి మాత్రమే కట్టుకుని వచ్చారు. భగవాన్ ఆయనను చూసి, "నువ్వు ఎందుకు గుండు చేయించుకున్నావు? నీవు మామూలుగానే జుట్టుపెంచుకుని జంధ్యం ధరించి ఉండు," అన్నారు. ఉపదేశాన్ని ఆచరణలో పెట్టేటప్పుడు, అంతరంగంలో మనస్ఫూర్తిగా ఆచరిస్తే చాలని, బాహ్యవేషభాషలలో మార్పులు చెయ్యవలసిన అవసరం లేదని భగవాన్ ఉద్దేశమని, పిళ్ళై అర్థంచేసుకున్నారు. బాహ్య జగత్తు పట్ల, దానియందలి వస్తువుల పట్ల ఆసక్తి ఏమాత్రం మనసులో లేకుండా చూచుకోవాలే కానీ, బయటకు ప్రదర్శనతో పనిలేదు.

శివప్రకాశంపిళ్ళై తరచుగా, భగవాన్‌తోపాటు విరూపాక్ష గుహలోనో, స్కందాశ్రమంలోనో ఉండేవారు. తన గురువుకు

సమీపంలో ఉండుట వల్ల, ఆయన బోధలను జీర్ణించుకోవడం వల్ల, ఆయనలో ఆధ్యాత్మిక పరిపక్వత రాసాగింది. ఆయన తన ఉద్యోగాన్ని వదలి పూర్తిగా ఆత్మవిచారణలోనే గడపాలనుకున్నారు. కానీ భగవాన్ దానికి అనుమతించలేదు. మూడేళ్ళ పిమ్మట, తానిక ఉద్యోగం చెయ్యలేనని, పనిలో ఉండే సమయంలో గూడా ఆత్మవిచారణలో మునిగిపోయి తన ఉద్యోగవిధులను సరిగా నిర్వర్తించలేక పోతున్నాననీ, మరల భగవాన్‌తో చెప్పారు. అప్పుడు భగవాన్, ఉద్యోగ విరమణకు ఆయనకు అనుమతిచ్చి, ఆయన స్వగ్రామానికి వెళ్ళి సాధన కొనసాగించవలసిందిగా చెప్పారు.

పిళ్ళై గారు తన స్వగ్రామము యొక్క శివార్లలోని పురాతన గణేశుని ఆలయంలోనూ, దగ్గరలో ఉండే అడవిలోనూ ఏకాంతంగా గడిపారు. ఆయన నిరంతరం ఆత్మవిచారణ చేసే వారు. ఆ సమయంలో ఆయన ప్రవర్తనలో ఆకస్మికంగా మార్పువచ్చింది. ఏ కారణం లేకుండానే నవ్వడమూ, తమిళంలోని మంత్రాలను పెద్దగా ఉచ్చరించటమూ, తనకు కన్పించిన రూపాలన్నిటికీ ప్రణమిల్లడం, గోచీకి ఒక విభూతి సంచిని తగిలించుకొని ఉండటమూ చేసేవారు. ఇంతకుపూర్వము భగవాన్ ఆ విభూతి సంచిని పిళ్ళైగారికిచ్చి, ఆ విబూదిని వంటినిండా రాసుకోమని చెప్పారు. (నాకు తెలిసినంత వరకు భగవాన్ ఎవరైనా భక్తుని పవిత్ర విబూది ధారణ చెయ్యమని చెప్పడం ఇదొకటే) శివప్రకాశంపిళ్ళై తన శరీరాన్నంతటికీ విబూది రాసుకుని, ఒక చిన్న దండాన్ని ధరించి, కులబేధాలను మరిచి తరచు, స్మశానానికి, నిమ్న కులస్తులనబడే వారుండే ప్రదేశాలకు వెళ్ళసాగారు. ఈ స్థితిలో ప్రక్కనే ఉన్న పట్టణాలలోకి కూడా కాలినడకన వెళ్ళివస్తుండేవారు. దారిలో ఎవరైనా గంజిగానీ, సద్ది అన్నంగానీ ఇస్తే స్వీకరించేవారు. తిరిగి తన స్వగ్రామానికి వచ్చిన పిదప మామూలు స్పృహలోనికి వచ్చేవారు. తర్వాత, ఆయన చాలాసార్లు భగవాన్ వద్దకు వచ్చేవారు. ప్రతిసారీ పదిహేను రోజులుండే వారు. ఆ కాలంలో బాహ్యగురువు ఆయన మనసును లోనికి నెడితే, అంతర గురువు, మరింతగా లోనికి లాగేవారు. ఆత్మవిచారణ ఎక్కువకాలం సాగేది. తరచుగా, ఆనంద పారవశ్యంలో పిళ్ళై చాలా పద్యాలు వ్రాసేవారు. భగవాన్ వాటిని మెచ్చుకునేవారు. వానిలో కొన్ని పద్యాలను భగవాన్ నిత్యపారాయణలో చేర్చారు.

ఇవి పిళ్ళై పద్యాలలో నాలుగు :

1. ఉదయంనుండి రాత్రివరకు నా సమయాన్ని వృథామాటలతో గడిపేస్తాను. ఒక్క క్షణం కూడా 'నేనెవరిని?' అని ఆలోచించను. ఓ ప్రభూ! ఒక మాట మాట్లాడితే, అది ఎన్నో మాటలకు దారితీస్తుందని మీరు నాకు చెప్పారు. రమణదేవా! నేను మీ శిష్యుడిగా నటిస్తున్నానే గానీ ప్రవర్తించుట లేదు.

2. ఇతరుల తప్పుడు పనులను గురించి వింటూ, వాటి గురించి మాట్లాడుతూ సమయాన్ని వృథాచేసుకునే పాపిని నేను. నాలో ఎన్నో అవగుణాలున్నప్పటికీ ఇతరులు వాటి గురించి మాట్లాడితే, నా మనసు కోపంతో రెచ్చిపోతుంది. చిన్న చిన్న అబద్ధాలు చెప్పినా పెద్దగా హాని జరుగబోదని, చిన్న అబద్ధాలు చెప్పటానికి సందేహించను. ఓ రమణదేవా! (ఇవన్నీ చేస్తూ కూడా) నీ భక్తునివలె నీ కాళ్ళపై పడడం, గొప్ప నాటకం కాదా!

3. నేను వయసులో పెద్దవాడినైనా, అనేక జబ్బులతో బాధపడుతున్నా, స్త్రీలపట్ల కాంక్షపోలేదు. వాళ్ళ అందమైన ముఖాలను చూడాలనీ, వాళ్ళతో మాట్లాడి, తేనెలాంటి వాళ్ళ పలుకుల్ని వినాలని, నా మనసనే దెయ్యం కోరుకుంటున్నది. అలా చెయ్యవద్దని, నేను నా మనసుకు సలహా ఇచ్చినా కూడా, అది అణగకుండా, వాటి వైపే వెళ్తున్నది. రమణదేవా! ఎపుడీ భ్రమ తొలగి నా మనసు స్థిరంగా నిలుస్తుంది?

4. నీకు తెలుసు నా గుణాలూ, నడవడీ నిమ్నమైనవని, పూర్తిగా దోషాలతో నిండిన అజ్ఞానులలో నేను అధముణ్ణనీ నీకు తెలుసు. ఇవన్నీ తెలిసి కూడా, నీవు నన్ను వెతికి నీ సంరక్షణలోనికి తీసుకొన్నావు. ఓ రమణదేవా! ఈ ఆశ్చర్యకరమైన విషయాన్ని నేనెలా వివరించాలి?

ఒక భక్తుడు, ఒకప్పుడు భగవాన్‌ను ఇలా అడిగారు. "భగవాన్, శివప్రకాశంపిళ్ళై ఎంతటి గొప్ప సన్యాసి. ఆయన మీ ఉపదేశాలను కించిత్తు కూడా పొల్లుపోకుండా ఆచరించేవారు. ఆయన ఇంతటి నిమ్నస్థితిలో ఉంటే, ఇక నా సంగతి ఏమిటి?" భగవాన్ ఈ మాటలకు చక్కటి సమాధానమిచ్చారు. భగవంతుని స్తుతించేటప్పుడు, ఆదిశంకరాచార్యుల వారూ,

ఇతర మహాత్ములూ కూడా వాళ్ళని తక్కువ చేసుకుని ఇలాగే పలికారు. ఈ విధంగా మహాత్ములు సాధకులను హెచ్చరిస్తూ, వారికి మార్గనిర్దేశం చేస్తారు.

విశ్వనాథస్వామి, శివప్రకాశంపిళ్ళై హాలులోనే ఉన్నారని తెలిసి ఆయనెవరో చూపించమని భగవాన్‌ను కోరారు. హాలంతా భక్తులతో నిండి ఉంది. బహుశా అది పర్వదినమై ఉంటుంది. భగవాన్ తన వేలితో దూరాన, మూలన ఉన్న వ్యక్తిని చూపించి, "అదిగో చూశావా! చేతులు కట్టుకుని, చొక్కా లేకుండా, ఒక చదువురాని పల్లెటూరివాడిలాగా వెనుకెక్కడో ఉన్నాడే, ఆయనే మన శివప్రకాశంపిళ్ళై. ఇక్కడ ఆయన ఒక పెంపుడు పిల్లి వలె ఉంటారు. ఎవరైనా, ఆయన ఆఫీసులో ఆయనను చూడాలి. అక్కడ గొప్ప సింహం లాగా ఉంటారు. ఆయన నిజాయితీ, న్యాయానికి కట్టుబడి ఉండడం, కష్టించి పనిచెయ్యడం అనే గుణాలు, ఇతరులు ఆయనను భయంతోటి, గౌరవంతోటి చూసేటట్లు చేస్తాయి.

శివప్రకాశంపిళ్ళై వృద్ధుడై, జబ్బుపడి, తన ఊరినుండి కదలలేని స్థితిలో ఉన్నారని విని, అంతవరకూ ఆయనను చూడని మా తండ్రిగారు, చిదంబరం లోని పిళ్ళై గారి స్వగ్రామానికి తనను తీసుకుని వెళ్ళవలసినదిగా కుంజుస్వామిని కోరారు. పవిత్రంగా నిరాడంబరంగా, అణకువతో ఉన్న ఆయన రూపం వర్ణించలేము. ఆయన శరీరం ఆధ్యాత్మిక పరిపక్వతతో పుటం పెట్టిన బంగారంలా మెరిసేది. ఆయనను, మా తండ్రిగారికి పరిచయం చేస్తూ, కుంజుస్వామి మనస్ఫూర్తిగా గౌరవపూర్వకంగా పిళ్ళై గారిని ఇలా ప్రశంసించారు, "ఎంతో అణకువగల పండితుడైన భక్తుడు ఈయన. భగవాన్ యొక్క సూటిమార్గము యొక్క బోధను వెలికితీసింది ఈయనే." శివప్రకాశంపిళ్ళై ఎంతో వినయంతో ఉప్పొంగే ప్రేమతో కుంజుస్వామి చేతులను పట్టుకొని తన తలమీద, కళ్ళమీద ఉంచుకొన్నారు. తన కళ్ళ వెంట నీరు కారుతుండగా, "ఈ పవిత్రమైన హస్తాలు, నా గురువుగారి పవిత్ర శరీరాన్ని తాకి సేవచేసే మహద్భాగ్యానికి నోచుకున్నాయి. అటువంటి భాగ్యము నాకెప్పుడూ కలుగలేదు. మీరెంతో గొప్పవారు, అదృష్టవంతులు కూడా," అన్నారు పిళ్ళై కుంజుస్వామితో. ఈ సంఘటన గురించి తెలుపుతూ కుంజుస్వామి నాతో ఇలా అన్నారు, "ఈ విధంగా నిజమైన గొప్ప మహాత్ములు, ఇతరుల విలువను పెంచడానికి తమను తాము తగ్గించుకొని చెప్పుకుంటారు. వారికి ఇతరులెవరు ఉంటారు కనుక, ప్రతివారూ అదే పరమాత్మ స్వరూపమే."

1948లో శివప్రకాశంపిళ్ళైకి అంత్యసమయం ఆసన్నమయిందని భగవాన్‌కు తెలియజేయబడింది. భగవాన్ చాలాసేపు మౌనంగా ఉన్నారు. పిమ్మట, ఆయన మరణవార్త తెలియగానే, "శివప్రకాశం శివప్రకాశం అయినారు," అన్నారు. అంటే శివప్రకాశంగారు శివునిలో ఐక్యమైనారు. ఈ దివ్యపురుషుడు అరుణాచలునిలో శాశ్వత ఐక్యం చెందారు.



విరూపాక్ష గుహ

జగజ్జనని

"నేనెవరు?" అనే పుస్తకంలో భగవాన్ ఏమంటారంటే, ఎవరి అహంకారమైతే పూర్తిగా నశించిపోయిందో, వారికి ప్రతి స్త్రీ జగజ్జననిలాగే కన్పిస్తుంది. ఈ జగజ్జనని తన కుమారుణ్ణి ఎలా కాపాడుకుంది?

మధురైలో తన మరణానుభవం తరువాత, భగవాన్ తమ ఇంటి దగ్గరలోనే ఉన్న మీనాక్షిదేవి ఆలయానికి తరచు వెళ్తుండేవారు. ఆయన గంటల తరబడి ఆమె విగ్రహం ముందు నిలబడి, ఆమె కళ్ళలోకి చూస్తుండే వారు. ఆయన కళ్ళనుండి కన్నీరు కారుతుండేవి. మీనాక్షి అంటే మీనముల వంటి అనగా చేపల వంటి కన్నులు కలది అని అర్థము. హిందూ ధర్మశాస్త్ర ప్రకారం మూడురకాలైన ఆధ్యాత్మిక దీక్షా విధానాలున్నాయి. అందులో ఒకటి చేపవలె నుండుట. అనగా చేప తన గుడ్లను కేవలం కంటిచూపుతోనే పొదిగి పిల్లలను చేస్తుందట. అంటే మీనాక్షి పేరులోని నిగూఢార్థమేమిటంటే మీనాక్షిదేవి చూపుతోనే భక్తులకు దీక్షను అనుగ్రహిస్తుంది అని. దాదాపుగా ప్రతి రమణభక్తుడూ, ఆయన మొదటి చూపుతోనే తమను హృదయంలోనికి వెళ్ళునట్లు చేసి ఆనందంతో, శాంతిలో, మౌనంలో ముంచేశారని చెప్తారు. అందువల్లనే భగవాన్ తన అంతిమ దినాన కూడా, భక్తులను తన దర్శనానికి అనుమతించమని, వారిపై కడసారి తన అనుగ్రహదృష్టి ప్రసారం చేశారు.

మధురైనుండి తిరువణ్ణామలైకు వచ్చినపుడు, భగవాన్ అంతరాయం లేని సహజసమాధిలో ఉండేవారు. అరుణాచలేశ్వరుని ఆలయంలోని చీకటిగా, తేమగా ఉండే పాతాళలింగ గుహలో పూర్తిగా సమాధి స్థితిలో ఉన్నపుడు, ఆయనైతే నిరాహారిగాను, శరీర ధ్యాస లేకుండాను ఉన్నారు గానీ, అచట గల చెదలు, ఇతర కీటకాలు, ఆయన శరీరాన్ని విందు ఆరగించినవి. ఆ దివ్యజనని అనుగ్రహవశాత్తు రత్నమ్మాళ్‌ను మొదటగా భగవాన్ వద్దకు పంపింది.



రత్నమ్మాళ్

రత్నమ్మాళ్ సమాజంచే చిన్నచూపు చూడబడిన ఒక యువ నర్తకి. ఒకనాడు కొందరు అల్లరిమూకలు, పాతాళలింగ గుహలోనికి రాళ్ళు విసరటం రత్నమ్మాళ్ చూసింది. ఆమె లోనికి వెళ్ళి మసక చీకట్లో, పల్చటి వెలుగుతో ఆవరించబడిన ఒక ఆకారాన్ని చూసింది. "ఈ యువ సన్యాసి ఎలా బ్రతుకుతాడా?' అనే ఆదుర్దాతో, ఆయనకు ఆహారాన్ని, దుస్తులనూ తీసుకని వచ్చి, గుహద్వారం వద్ద వదిలి వెళ్ళింది. భగవాన్ సమాధిలోఉండుట చేత, ఆమె తెచ్చిన పదార్థాలను ఆయన అంటనేలేదు.

పిమ్మట శేషాద్రి స్వామి, భగవాన్‌ను చూచి, వెలుపలికి తీసుకొని వచ్చి భగవాన్‌కు పాలు ఇవ్వవలసినదిగా ఆలయ పూజారికి చెప్పారు. ఆ పూజారి అరుణాచలేశ్వరుని ఆలయం నుండి గాక, ప్రక్కనే వున్న అపీతకుచాంబాదేవి గుడి నుండి అమ్మవారికి అభిషేకించబడి పసుపు, శీకాయ, నెయ్యి కలిపిన పాలను తెచ్చి ఇచ్చారు. అదే జగన్మాతచే ఆయన కివ్వబడిన మొదటి ప్రసాదం. అప్పటిఇంకా భగవాన్ సమాధి స్థితిలోనే ఉండి, బాహ్యస్పృహలో లేనందున (ప్రతిజీవికి) మొదటగా ప్రాణాలు నిల్పడానికి తోడ్పడే తల్లిపాలను ఆయన నోరు తెరచి నోటిలో పోశారు. భగవాన్‌కు బాహ్య స్మృతి కల్గిన తర్వాత ఆయన ఆ ఆలయ పరిసరాలలో ఒక (ఇప్పచెట్టు) వృక్షం క్రింద సమాధి స్థితిలో ఉండిపోయారు. ఎప్పుడో గాని ఆయన బాహ్యస్పృహలోకి వచ్చేవారు కాదు.

ఒకనాడు రత్నమ్మాళ్ నాట్య ప్రదర్శన ఇవ్వడానికి వెళుతూ దారిలో భగవాన్ అక్కడ కూర్చుని ఉండటం చూచి, తల్లివైపు తిరిగి ఇలా అన్నది. 'ఈ స్వామికి ఆహారాన్ని ఇచ్చేదాకా, నేను ఆహారం ముట్టుకోను" అని. వారు భగవాన్‌ను స్పృహలోనికి తీసుకుని రావడానికి ప్రయత్నించారు. కానీ వారి ప్రయత్నం వృథా అయింది. అందుకని వారు ఆయన నోటిని తెరచి అందులో ఆహారాన్నుంచేవారు. కొన్నిసార్లు ఆయన దానిని మ్రింగేవారు. కొన్నిసార్లు ఆహారం ఆయన నోట్లో అలాగే ఉండిపోతే మర్నాడు వారు శుభ్రం చేసేవారు. భగవాన్ తర్వాత జగన్మాతే రత్నమ్మాళ్ రూపంలో వచ్చింది అన్నారు. ఒకసారి సూరినాగమ్మ గారితో కూడా రత్నమ్మాళ్ పవిత్రమైనది అన్నారు భగవాన్. దాని అర్థము నైతికమైన, భౌతికమైన పవిత్రత అని కాదు, ఆ రోజుల్లోనే దివ్యత్వాన్ని ఆమె గుర్తించగలిగింది. ఈ విధంగా జగజ్జనని ఆయనను పోషించింది. ఆలయాన్ని వదిలి గురుమూర్తానికి వెళ్లేటప్పుడు, ఆయన రత్నమ్మాళ్‌తో "నీవు అంత శ్రమ తీసుకుని అంతదూరం రావద్దులే" అంటే సరేనని ఒప్పుకున్నారామె.



మీనాక్షి అమ్మాళ్

భగవాన్ గురుమూర్తానికి వెళ్ళినపుడు, మీనాక్షి అమ్మాళ్ అనే ఆవిడ ఆయనను సేవించడం మొదలు పెట్టింది. ఆమె బయటకు చూడడానికి రాక్షసి వలె కన్పించినా, ఆమె హృదయం నిర్మలమైనది, పవిత్రమైనది. ప్రతిరోజూ ఆమె గిరి ప్రదక్షిణ చేసి, ఇంటికి వెళ్ళి, భోజనం తయారు చేసి తీసుకుని వచ్చి భగవాన్‌కు భోజనం పెట్టేవారు. తనతో పాటు మరికొందరు స్త్రీలకు కూడా ఆమె తీసుకుని వచ్చేవారు. వారిలో ప్రతి ఒక్కరూ భగవాన్‌కు భిక్ష పెట్టాలని కోరుకునే వారు. వారి వలన భగవాన్‌కు ఆహారం ఎక్కువయ్యేపరిస్థితి వచ్చేది. భగవాన్ ఎప్పుడూ దేనినీ వృధాచెయ్యడం ఇష్టపడేవారు కాదు. అందుకని ప్రక్క స్థలంలోని ఒక మామిడితోపు లోనికి మకాం మార్చారు. ఆ తోట యజమాని భగవాన్‌ని పళని స్వామిని తప్ప ఇతరులెవ్వరినీ లోపలికి రానిచ్చేవాడు కాదు.

భగవాన్ తిరువణ్ణామలైకు వచ్చిన తర్వాత తొలిసారిగా ఆయనకు నూనెతో అభ్యంగన స్నానం చేయించిన ఘనత మీనాక్షి అమ్మాళ్‌కే దక్కుతుంది. ఆ ఉదంతాన్ని భగవాన్ మాటలలోనే విందాం. ఒకరోజు గురుమూర్తంలో ఉండగా మీనాక్షి అమ్మాళ్ ఒక పెద్ద గిన్నె తెచ్చి నీళ్ళు కాయడం మొదలు పెట్టింది. భగవాన్ ఇలా అన్నారు. "ఆవిడ ఏదో వండుతుంది కాబోలనుకున్నాను. తర్వాత ఆమె తన సంచీ నుండి నూనె, శీకాయ పొడి తీసి "స్వామీ! రండి మీకు స్నానం చేయిస్తాను అన్నది". భగవాన్ తన మామూలు ధోరణిలోనే మౌనంగా ఉన్నారు. అప్పుడామె ఆయన చెయ్యి పట్టుకుని లాగి, కూర్చోబెట్టి బలవంతంగా నూనె రాయడం మొదలు పెట్టారు. భగవాన్ నవ్వుతూ అన్నారు. "ఆమె నా జుట్టు ముట్టుకున్నపుడు అందులో రాళ్ళు, దుమ్ము ఉన్నాయి." తిరువణ్ణామలైకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత ఆయనకు యిటువంటి మంచి స్నానం జరిగింది. అప్పటి వరకు ఆయన శరీరం మొత్తం స్నానం లేక, దుమ్ముతో, ధూళితో నిండిపోయి ఉన్నది. ఆ జగజ్జనని పంపగా మీనాక్షి అమ్మాళ్ భగవాన్‌కి ఈ విధంగా స్నానం చేయించారు.

పిమ్మట భగవాన్ ఇంకా గురుమూర్తంలో ఉండగానే, పళనిస్వామితో "భిక్ష కొరకు మనము చెరోక వైపుకు వెళదాం" అన్నారు. భగవాన్ తిరువణ్ణామలైలోని వీధుల గుండా వెళ్తూ, ఒకో ఇంటిముందూ నిలబడి చప్పట్లు కొట్టేవారు. దానికి సమాధానంగా ఆ ఇంటి ఇల్లాలు భిక్ష తెచ్చి భగవాన్‌కు ఇచ్చేది. ఈ విధంగా ప్రతిరోజూ, ప్రతి వీధిలోనూ, ప్రతి ఇంటిలోనూ భగవాన్ భిక్షమెత్తారు. ఆ విధంగా ఆ ఊరిలోని స్త్రీలందరి నుండి ఆయన భిక్ష పొందారు. సందేహించకుండా ఆ జగజ్జననే ఆ స్త్రీలందరి రూపంలో తన కుమారుణ్ణి పోషించుకుంది.



దేశూరమ్మాళ్



భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నపుడు అఖిలాండమ్మాళ్ అనే స్త్రీ 'దేశూర్' అనే గ్రామం నుండి వచ్చింది. భగవాన్, ఇతరులు కూడా అఖిలాండమ్మాళ్ అనే పేరు కష్టంగాఉంది కనుక ఆమెను దేశూరమ్మాళ్ అని పిలిచేవారు. 1896లో భగవాన్ గుడిలో సమాధి నిష్ఠులై ఉండగా, పూజారి ఆయన నోరు తెరచి అందులో పాలు పొయ్యడం దేశూరమ్మాళ్ చూసింది. భగవాన్ కనులు మూసుకుని ఉండడంతో ఆయన ఆశీర్వాదం తీసుకోకుండానే ఆమె తన ఊరు వెళ్ళిపోయింది. తిరిగి ఏడు సంవత్సరాల తర్వాత దూరంగా ఉండలేక ఆమె తిరువణ్ణామలై వచ్చేసింది. ఆమె గొప్ప భక్తురాలు. ఆమె శేషాద్రిస్వామి, పోలూరుకు చెందిన విఠోబాస్వామితో సహా మహాత్ములందరికీ భోజనం సమర్పించేది.

1903లో ఆమె తిరిగి వచ్చింది. అరుణాచల పర్వతపాదం వద్ద ఆమె పూలు కోసుకుంటుండగా, కొందరు గుంపుగా, విరూపాక్ష గుహకు దిగువలో వున్న మామిడిచెట్టు గుహ (చూతగుహ)కు వెళ్ళటం చూసి "మీరు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగింది. వారిలో ఒకరు ఇలా అన్నారు. "అక్కడ ఒక బాల సన్యాసి మౌనంగా కదలక, మెదలక ఉన్నాడు. కానీ ఆయన వద్ద ఎంతో శాంతి దొరుకుతుంది". అప్పుడు దేశూరమ్మాళ్ కూడా ఆగుహకు వెళ్ళింది. అక్కడ కూర్చుని ఉన్న భగవాన్‌ను ఆమె చూసింది. ఆమె భగవాన్ గురించి ఇలా అన్నారు. "ఆయన స్నానం లేక దుమ్ముకొట్టుకొని పోయి ఉన్నప్పటికీ, ఆయన శరీరం బంగారుకాంతులీనుతుంది. చిక్కి శల్యమై ఉన్న ఆ బాల సన్యాసిని చూడగానే నా హృదయం ద్రవించి, కన్నీరు ఉబికి వచ్చింది. ఆ మహాత్ముడపుడు కళ్ళు తెరచి దయతో నావైపు చూశారు. వెంటనే నేనాయనకు శరణాగతి చెంది, జీవితాంతం వరకు ఆ జ్ఞానికి భోజనం సమర్పించుకోవాలని ఒట్టుపెట్టుకున్నాను". భగవాన్ విరూపాక్ష గుహకు వెళ్ళినపుడు, ఆమె అక్కడకు భోజనం తీసుకుని వెళ్ళేది. భగవాన్ ఎప్పుడూ ఒంటరిగా తినేవారు కాదు. అందుకని ఆమె భగవాన్‌తో పాటు పళనిస్వామి, పెరుమాళ్ స్వామికి కూడా భోజనం తెచ్చేది. మొదట్లో వారు భిక్ష తెచ్చుకునే వారు. దేశూరమ్మాళ్ అమ్మ వచ్చిన పిదప భగవాన్ భోజనానికి ఏ పాటి కొరతా ఉండేది కాదు. ఆవిడ భగవాన్ సన్నిధానాన్ని (సాన్నిధ్యాన్ని) యెంతగా ఇష్టపడేదంటే, ఒక్క రోజు కూడా ఆమె భిక్ష తేవడం మానేది కాదు.

పిదప, ఎచ్చమ్మాళ్, మొదలియార్ పాటి అనే పేర్లు గల ఇద్దరు స్త్రీలు కూడా భగవాన్‌కు భిక్ష తీసుకుని రాసాగారు. భిక్షకు లోటు లేక మిక్కుటంగా ఉండుసరికి దేశూరమ్మాళ్ 1914లో తన గ్రామానికి వెళ్ళి అక్కడ ఒక రమణకేంద్రాన్ని స్థాపించారు. దానిని 'రమణానంద మఠాలయమ్' అని పిలిచేవారు. ఆమె భక్తి ఎంత గాఢమైనదంటే ఆమె ఎల్లప్పుడూ అక్కడే వుండి భగవాన్ ఉపదేశాలను పాటించుతూ, అనుభవ పూర్వకమైన వివరణ ఇస్తుండేవారు ఎప్పుడైనా సరే. భగవాన్ భక్తులెవరైనా విరూపాక్ష గుహలో జబ్బు పడితే, ఆమె వారిని దేశూరుకు తీసుకువెళ్ళి, మందులిప్పించి, వారి ఆలనా పాలనా చూసేవారు. వారు పూర్తిగా కోలుకున్నాక, ఆమె వారిని వెంటబెట్టుకుని విరూపాక్ష గుహకు తీసుకుని వెళ్ళేవారు.

దేశూరమ్మాళ్ ఎప్పుడు అరుణాచలానికి వచ్చినా ఎవరైనా భగవాన్‌కు భిక్ష తెస్తున్నా సరే తాను కూడా భిక్ష తెచ్చేవారు. భగవాన్ ఆమె అంటే ఎంతో ఇష్టంగా ఉండేవారు. తొలుతగా ఆమె భగవాన్‌లో గమనించిందేమిటంటే, ఆయనకివ్వబడిన భిక్షను, అక్కడున్న అందరితో సమానంగా పంచుకుని తీసుకునే వారాయన. ఆ లక్షణం ఆయన ఒక్కరిలోనే ఆమె చూసింది. ఆమె గమనించిన రెండో విషయం ఏమిటంటే... ఆయన తనచుట్టూ ఉన్న మనుషులతోనే గాక, అక్కడున్న కుక్కలు, కోతులూ, పక్షులూ (పశుపక్ష్యాదులన్నింటితోనూ) అన్నిటితోను తన ఆహారాన్ని పంచుకునే వారు. ఆమె 'నొండి' అనే కోతి గురించి ఒక హాస్య ఉదంతం చెప్పారు. నొండికి యెప్పుడూ భగవాన్ ప్రక్కనే జాగాను ఇచ్చేవారు. ఒక రోజు దేసూరమ్మ గారు భగవాన్‌కు భోజనం వడ్డిస్తుండగా నొండి ఆమె వైపు గుర్రుగా చూసింది. భగవాన్ నొండినిలా చివాట్లేశారు. "ఏయ్! ఆమె కూడా మనలో ఒకరే. మన వంశంవారే. నోర్మూసుకుని ఉండు". అప్పటి నుండి నొండి దేసూరమ్మగారిని కూడా తమలో ఒక్కరిగా చూసేది.

భగవాన్ తనకు భిక్షనొసగిన వారి పట్ల కృతజ్ఞత చూపటమే గాక వారి బంధనాలన్నీ పూర్తిగా వీడిపోయేటట్లు పవిత్రమైన బోధ కూడా చేసేవారు. ఒక రోజు దేశూరమ్మాళ్, స్కందాశ్రమానికి వచ్చినపుడు అచటి సాధువు ఒకరు ఆమెతో ఇలా అన్నారు. "ఈ రోజు పౌర్ణమి. దీక్ష తీసుకోవటానికి ఇవాళ చాలా యోగ్యమైన రోజు. భగవాన్ గొప్ప జ్ఞాని. అందుకని భగవాన్‌ను ఇవాళ దీక్ష ఇమ్మని వేడుకో". భగవాన్ సామాన్యంగా దీక్ష ఇచ్చేవారే కాదు. ఆ సాధువు ప్రేరణతో దేశూరమ్మగారు, భగవాన్‌కు సాష్టాంగపడి "భగవాన్! నాకు ఇవాళ మంత్రదీక్ష ఇవ్వండి అని అడిగారు. "ఓ దేశూరమ్మా! నీకు మంత్రం ఇవ్వమంటావా?' అన్నారు. ఆ తర్వాత గంభీరంగా మారి తమిళంలో ఇలా అన్నారు. "ఉన్నాయ్ విడాధుయిరు" దాని అర్థమేమిటంటే "ఆత్మను వీడకుండా ఉండు" అలా అని వెళ్ళిపోకుండా ఆయన ఆమె వైపు చూసి మౌనంగా తన అనుగ్రహాన్ని ఆమెపై ప్రసరింపజేశారు. దాదాపు ఒక గంటసేపు తన దృష్టిని ఆమెపైనుండి మరల్చకుండా ఆమెకు హృదయాన్ని వీడకుండా ఎల్లప్పుడూ అంటిపెట్టుకునే విధంగా ఆమెకు లోదృష్టిని ప్రసాదించారు.

భగవాన్ కొండదిగువన ఉన్న రమణాశ్రమానికి వచ్చిన పిమ్మట కూడా ఆమె ప్రతిరోజూ భోజనం తీసుకుని వచ్చేది. భగవాన్ ఆమెతో ఇక్కడ కావలసినంత భోజనమున్నది అంటే ఆమె ప్రాధేయపడుతూ "భగవాన్! నాకు మీకు భిక్ష ఇవ్వాలని ఉన్నది" అన్నారు. అప్పుడు భగవాన్ "అయితే మీ సరుకులు తీసుకొని వచ్చి వంటశాలలో ఇవ్వండి. వారు వండుతారు. మనమందరం కలసి భోజనం చేయవచ్చు" అన్నారు. అప్పటినుండి ఆమె ఎప్పుడు వచ్చినా, బియ్యము, పప్పు తీసుకొని వచ్చి వంటశాలలో ఇచ్చేవారు.

భగవాన్ అంతిమ దినాలలో, భగవాన్ దేహాన్ని చాలించే సమయానికి దేసూరమ్మ 90 సంవత్సరాలు పైబడి ఎంతో బలహీనంగా ఉన్నారు. అయినా ఆయనను చివరగా దర్శించుకోవడానికై ఈతల్లి ఆయన వద్దకు వెళ్ళారు. భగవాన్ అప్పుడు ప్రస్తుతం 'నిర్వాణగది' అని పిలువబడుతున్న గదిలో ఉన్నారు. ఆశ్రమ నిర్వహణ సిబ్బంది అంతా మారిపోవుట వల్ల ఎవరూ దేసూరమ్మాళ్‌ను గుర్తించలేదు. అందుచే ఆమెను లోనికి అనుమతించలేదు. అదృష్టవశాత్తు కుంజుస్వామి ఆమెను చూసి, ఆమె రాకను భగవాన్‌కు ఎరుకపర్చారు. ఆయన ఆశ్చర్యంతో "దేశూరమ్మాళ్! ఆమెనిక్కడకు తీసుకుని రండి. ఆమెను లోనికి తీసుకుని రండి" అన్నారు. లోనికి వెళ్ళగానే భగవాన్ శారీరక స్థితిని చూసి, ఆమె భోరున ఏడ్చింది. అప్పుడు భగవాన్ "అశాశ్వతమైన ఈ శరీరాన్ని గురించి ఎందుకు బాధ పడతావు? నేను ఎప్పటికీ నీ భగవాన్‌నే" అన్నారు.

ఈ జ్ఞానబోధ, దేశూరమ్మాళ్‌కు మాత్రమే పరిమితం కాదు. భగవాన్‌ను ఎవరైతే తన తండ్రిగానో, తల్లిగానో, గురువుగానో భావించి ఆయనను ఆరాధిస్తారో వారందరికీ ఆయన ఈ విధంగా అభయమిచ్చినట్టే.



ఎచ్చెమ్మాళ్

ఎచ్చెమ్మాళ్ తన బిడ్డలతోనూ, భర్తతోనూ కలసి, తిరువణ్ణామలైకి సమీపంలోనే ఉంటుండేవారు. ఒకనాటి రాత్రి గోచీ ధరించి గుండు గీయించుకుని ఉన్న ఒక యువకుడైన సన్యాసి ఆమె కలలో కన్పించి ఏదో చెప్పారు. అది ఆమెకు అర్థం కాలేదు. ఈ స్వప్నం వచ్చిన కొలది దినాలలోనే ఆమె తనభర్తను, కుమారుని, ఇద్దరు కుమార్తెలలో ఒకరిని కోల్పోయింది. కొద్దిరోజుల పిమ్మట ఆయనే మరల ఆమె స్వప్నంలో కన్పించి, ఒక సంస్కృత మంత్రాన్ని చదివారు. అది ఆమెకు అర్థం కాలేదు. స్వప్నాలను వివరింపగల వారి దగ్గరకు ఆమె వెళ్ళి, తన కల గురించి చెప్పగా, వారందరూ ఒకే మాట చెప్పారు. "దైవం మిమ్ములను అనుగ్రహిస్తున్నారు" మిక్కిలి విచారంతో మిగిలినొక కుమార్తెనూ తీసికుని ఆమె తన పుట్టింటికి వెళ్ళాలనుకుంది. వెళ్తూ ఉండగా, ఆమెకు మూడవ స్వప్నం వచ్చింది. మూడవ కలలో మళ్ళీ అదే బాలుడు కన్పించి, కొండకు వచ్చి మాయమైపో. నీవు అనుభవించాల్సిన జీవితాలను అనుభవించావు. నీ మూడు జన్మలూ పూర్తయినయ్యి. తన వద్దకు ఇంకా రాకముందే, ఆమె అనుభవించాల్సిన మూడు జన్మలను సమాప్తం చేశారు భగవాన్.

ఆమె తన గ్రామానికి వెళ్ళగానే పది, పదకొండు సంవత్సరాల వయసుగల ఆ రెండవకుమార్తె కూడా మరణించింది. ఆమె ఆ దుఃఖ భారాన్ని భరించలేక పోయింది. కొందరు బంధువులామెకు యాత్రలకు వెళ్ళమని సలహా ఇచ్చారు. దుఃఖ నివృత్తికై ఆమె ఉత్తర భారతదేశానికి యాత్రలకు వెళ్ళారు. ఆమె అక్కడి సాధువులను కలుసుకుని, వారిని సేవించి, భిక్షనిచ్చారు. వారిలో ఒక సాధువు ఆమెకు అష్టాంగయోగదీక్షనిచ్చారు. ఆయన ఆమెకొక మంత్రాన్ని ఇచ్చి, భ్రూమధ్యంలో దృష్టి నిలుపమని చెప్పారు. కానీ ఇవేమీ పనిచెయ్యలేదు. ఆమె దుఃఖ భారమేమీ తొలగలేదు. ఆమె తిరిగి స్వగ్రామానికి వచ్చినపుడు, ఒక బంధువు ఆమెతో, "అరుణాచలంలో ఒక యువసన్యాసి ఉన్నారు. ఆయన మాట్లాడక పోవచ్చును గానీ, మీరు ఆయన సమీపంలో ఉండి ఆయనను సేవించుకుంటే, మీరు ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చును," అన్నారు. ఆ మర్నాడే ఆమె తిరువణ్ణామలై వెళ్ళారు. అది 1906 సంవత్సరము. అప్పుడు భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నారు. ఆమె భగవాన్ దర్శనానికై వెళ్ళగా ఆయన ఆమె వైపు దాదాపు ఒక గంటసేపు చూశారు. కన్నీటి ధారలు కారుతుండగా ఆమె భగవాన్ ఎదురుగా నిలుచున్నారు. ఆయన కళ్ళ వెంబడి కూడా కన్నీరు కారింది. వారిద్దరి మధ్యా చిన్న మాట కూడా జరుగలేదు. కానీ ఆమె ఎంతో శక్తిని పొందినట్లూ,ఏదో నిగూఢమైన శక్తి ఆమెను చలనరహితంగా చేసినట్లూ భావించింది. అద్భుతమైన విషయమేమంటే, ఆమెలో కించిత్తు కూడా దుఃఖం మిగులలేదు. ఆయన అనుగ్రహాన్ని అనుభవించిన ఆమె, తన జన్మంతా ఆ సన్యాసికి భిక్ష నిస్తానని ప్రతిన పూనింది. ప్రతిరోజూ తప్పని సరిగా ఆమె భగవాన్‌ను సేవించేది. ఏది ఏమైనప్పటికి ఆమెకింకా స్వల్పంగా ప్రాపంచిక వ్యవహారాలపై మమకారం మిగిలి ఉంది. భగవాన్ అనుమతితో, ఆమె చెల్లమ్మాళ్ అనే పేరు గల బాలికను దత్తత తీసికున్నది. ఎచ్చమ్మాళ్, తన కుమార్తె చెల్లమ్మాళ్ ద్వారా భగవాన్‌కు భిక్ష పంపేది. చెల్లమ్మాళ్ ఒక రోజు భగవాన్‌కు భిక్ష తీసికుని వెళుతుండగా,ఆమెకు సంస్కృత భాషతో ఉన్న ఒక అచ్చు కాగితం దొరికింది. ఆమె దానిని భగవాన్ వద్దకు తీసుకుని వెళ్ళింది. భోజనాల సమయంలో ఆమెను భోజనం చెయ్యమని కోరగా 'లేదు, లేదు. నేను ఇవాళ భోజనం చెయ్యను. నేను ఏకాదశి వ్రతం చేస్తున్నాను. మా ఇంట్లో ఎవరమూ భోంచెయ్యకూడదని మా తల్లిగారు చెప్పారు' అన్నది. భగవాన్ ఏ విధమైన భావాన్నీ వ్యక్తపరచక, మామూలుగా "నీ చేతిలో ఉన్న దేమిటని అడిగారు. ఆ కాగితంలో శ్రీమద్భాగవతంలోని ఒక శ్లోకమున్నది. మహాత్ముల సాన్నిధ్యాన్ని ప్రేమించడం, సత్సంగాన్ని ఇష్టపడడం, నేర్చుకున్న వారికి నియమ నిబంధనలతో పని ఏమిటి? చల్లని దక్షిణపు గాలి వీస్తుండగా విసనకఱ్ఱతో పని ఏమి? నీవు సత్సంగంలో ఉన్నపుడు, నియమాలతో కూడిన కర్మకాండలతో పనిలేదు. ఈ శ్లోకం యొక్క అర్థాన్ని వివరిస్తూ, భగవాన్ ఆమెను భోం చెయ్యమని మరల మరల చెప్పారు. (బుజ్జగించి). కొంతకాలానికి చెల్లమ్మాళ్‌కు వివాహం జరిగి, ఒకకుమారుడు జన్మించాడు. ఆమె ఆ బాలునికి రమణ అని పేరు పెట్టుకుంది. శిశువు జన్మించగానే, ఆ బాలుని ఎచ్చమ్మాళ్ భగవాన్ ఒడిలో ఉంచి

దీవించమని కోరింది. దురదృష్టవశాత్తు కొద్దికాలానికే చెల్లమ్మాళ్ చనిపోయింది. ఈ సంఘటనతో బాగా కుదిపివేయబడినప్పటికి భగవాన్ సాన్నిధ్యంలో ఉండడం వలన ఎచ్చమ్మాళ్ ఎలాగో కుదుట పడింది.

ఒకరోజు భగవాన్ ఆమెతో "కేవలం ధ్యానం చెయ్యి" అని చెప్పారు. ఆమె అష్టాంగ యోగమార్గంలో ధ్యానం చేసేది. ఆమె భగవాన్‌తో ధ్యానంలో నాకు వెలుగులు కన్పిస్తున్నవి అని చెప్పింది. భగవాన్ ఆమెతో ఇలా అన్నారు. "చూడబడే (వస్తువులైన) వెలుగులు నీ గమ్యం కాదు. నీవు నీ ఆత్మని సాక్షాత్కరింపజేసుకోవాలి. కానీ ఇతరములను కాదు". ఆ రోజు నుండి ఎచ్చెమ్మాళ్ ఆత్మవిచారణ ప్రారంభించి భగవాన్ చెప్పిన విధంగా నడుచుకొనసాగింది. అయినప్పటికీ వాసనలు ఆమెను బాధిస్తూనే ఉన్నాయి. ఒకసారి లక్ష మారేడు దళాలతో భగవాన్ ఫోటోకు పూజ చెయ్యాలని సంకల్పించింది. కేవలం 50 వేల దళాలు మాత్రమే సంపాదించగల్గి "నేను ఈ పూజ పూర్తి చెయ్యాలనుకున్నాను. కానీ కేవలం 50 వేల ఆకులే లభించాయి." "అన్ని చెట్లనూ చూశావా" అని అడిగారు భగవాన్. "అవును భగవాన్! అన్ని చెట్ల నుండి కోసినా కేవలం 50 వేల ఆకులే దొరికాయి". భగవాన్ ముఖం మారిపోయింది. "పోనీ నీ శరీరంలో నుండి మాంసాన్ని గిల్లి, దానిని అర్పణ చెయ్యక పొయ్యావా?" అన్నారు భగవాన్. భగవాన్ సరదాకు అంటున్నారనుకుందామె. "శరీరాన్ని నేనెలా గిల్లుకోను? నెప్పి వేస్తుంది కదా!" అన్నదామె. భగవాన్ ఆమె వైపు చూచి అన్నారు, "నీ శరీరాన్ని గిచ్చితే నెప్పి వేస్తుందని తెలిసినపుడు చెట్టుయొక్క ఆకులు కోస్తే, చెట్టుకు నెప్పి అని తెలియదా? అది నీకు నేను చెప్పాలా?" ఇది ఆమెను పూర్తిగా మార్చివేసింది.

రమణాశ్రమంలో కూడా, భగవాన్‌కు ఆమె భిక్ష తీసుకుని వచ్చేది. ఒకరోజు ఆమె భగవాన్‌కు భోజనం తెచ్చినపుడు, ఇక పిమ్మట ఆమె భోజనం తీసుకు రానవసరం లేదని తెలియజేయబడింది. మిక్కిలి విచారంతో ఆమె భగవాన్‌తో, "భగవాన్ నేను పెద్దదాన్నయి పోయాను. నా సర్వస్వాన్నీ మీకర్పణ చేశాను. దానికిదేనా ప్రతిఫలం? అరుణాచలుడిలాగా నువ్వు కూడా రాతిలాగా మారిపోయావా? తిరిగి వెళ్ళిపోక నేనేం చేస్తాను?" అంటూ ఇంటికి వెళ్ళిపోయింది. ఆశ్రమంలో మధ్యాహ్నభోజనానికి గంట కొట్టారు. భగవాన్ సోఫాపైనే ఉండిపోయారు. ప్రతివారూ, ఆయన భోజనశాలకు వెళ్తారని ఎదురుచూస్తున్నారు. 5 నిమిషాలు, 10 నిమిషాలు, 15 నిమిషాలు గడిచిపోయాయి. భగవాన్ చిరునవ్వుతో కూర్చునే ఉన్నారు. ఒక తెలివిగల సేవకుడు విషయం అర్థం చేసుకున్నారు. అతను ఆఫీసు వారికి తెలియజేశారు. వారు పరుగుపరుగున ఎచ్చెమ్మాళ్ వద్దకెళ్ళి క్షమించమని కోరారు. ఆమె వారితోపాటు రావడానికి నిరాకరించగా, ఆమె లేకుండా భగవాన్ భోజనం చెయ్యరని వారు వాదించారు. అది వినగానే ఆమె వెంటనే భగవాన్ వద్దకు పరుగున వెళ్ళింది. మరొకరోజు తాను వెళ్ళలేక, వేరొకరితో భోజనం పంపింది. దానిని వంటశాలలో పెట్టి, భగవాన్‌కు వడ్డించడం మరచారు. భోజనశాలలో మిగిలిన అందరికి ముందు వడ్డించి, భగవాన్‌కు చివరన వడ్డించేవారు. అపుడు భగవాన్ తల ఊపితే అందరూ భోంచెయ్యడం ప్రారంభించే వారు. మామూలుగానే భగవాన్‌తో పాటు అందరికీ వడ్డించారు. భగవాన్ మౌనంగా కూర్చున్నారు. ఆయన మామూలుగా, తల ఊపక పోయేటప్పటికి, ఒక చురుకైన సేవకుడు వంటవాళ్ళను "ఎచ్చెమ్మాళ్ భోజనం వడ్డించారా?" అని అడిగారు. "లేదు. మేము మరచిపోయాము" అన్నారు వాళ్ళు. ఎచ్చెమ్మాళ్ భోజనం వడ్డించబడిన తర్వాతే ఆయన భోంచెయ్యడం మొదలుపెట్టారు.

చివరిదశలో ఎచ్చెమ్మాళ్ రెండు రోజులపాటు స్పృహలో లేరు. మొదటి రోజు, ఆమె ఊపిరి తీసుకోవడానికి కష్టపడుతున్నపుడు, భగవాన్ 5,6 గంటలపాటు శిలాప్రతిమ వలె, గాఢసమాధిలో ఉండిపోయారు సోఫాలోనే. చాలామంది భగవాన్‌ను ఆ విధంగా ఎన్నడూ చూడలేదన్నారు. తర్వాత ఎప్పుడో వారికి ఎచ్చెమ్మాళ్ పరిస్థితి గురించి తెలిసింది. తర్వాత ఆమె కోమాలోనికి వెళ్ళిపోయిందని డాక్టర్లు అన్నారు. నిస్సందేహంగా, ఆమె అప్పటికే భగవాన్ దయవలన ఆత్మలో స్థిరపడి పోయి ఉంటారు. మర్నాడు, ఆమె చనిపోబోయే ముందు, ఆమె చుట్టూ ఉన్న స్త్రీలు ఆమెను పరీక్షించాలనుకున్నారు. అందులో ఒకరు పెద్ద గొంతుతో, "ఏమిటి భగవాన్‌కు ఇంకా భోజనం పంపినట్లు లేరే!" అన్నారు. వెంటనే ఆమె కళ్ళు పెద్దవిగా తెరచిచూచింది. ఆమె మాట్లాడలేకపోయినా, ఆమె ముఖకవళికలు, "ఏమయింది?" అని అడుగుతున్నట్లున్నవి. "ఏమీలేదు, హాస్యానికి అన్నాము. భగవాన్‌కు ఇందాకే భోజనం పంపేశారు," అన్నారు. అది వినగానే, ఆమె కనులు మూసుకుని చిరునవ్వుతో శరీరాన్ని వదిలివేసింది. అది వినగానే భగవాన్, "ఎచ్చెమ్మాళ్ తన భారాన్ని వదిలించుకుంది. కానీ నా భారం ఇంకా మిగిలి ఉంది," అన్నారు.

ముదలియార్ పాటి

ముదలియార్ పాటి అని ఒక చక్కటి స్త్రీ ఉండేది. (పాటి అంటే అమ్మమ్మ లేక నాయనమ్మ అని అర్థం). ఆమె తన కుమారుని తోనూ, కోడలితోనూ, తన గ్రామంలో ఉంటూ అక్కడొకసాధువును సేవిస్తుండేది. ఆ సాధువు మరణించేటప్పుడు ఆమె ఆయనను, "ఇప్పుడు మేమేమి చెయ్యాలి?" అని అడిగింది. "అరుణాచలానికి వెళ్ళండి. అక్కడ ఒక మహాత్ముడున్నాడు. ఆయనను సేవించండి. మీజన్మ ధన్యమవుతుంది," అన్నారాయన.

ముదలియార్పాటి భగవాన్ వద్దకు వచ్చేటప్పటికే కడు వృద్ధురాలు. ఆమె 1910లో భగవాన్‌ను విరూపాక్ష గుహలో చూశారు. భగవాన్ యొక్క మొదటి చూపే ఆమెకు ఆనందకరమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని కలుగజేసింది. అక్కడికక్కడే ఆమె, నా చివరిరోజు వరకూ, భగవాన్‌కు భోజనం సమర్పించుకుంటాను అనుకున్నది. వీలైనప్పుడల్లా తన గ్రామం నుండి, ధనాన్నీ, సరుకులను తీసుకుని వచ్చేవారామె. భగవాన్ సేవకొరకై తన యావదాస్తినీ క్రమంగా అమ్మేశారామె. ఆస్థి మొత్తం హరించుకుని పొయ్యాక, బజారులో నువ్వులు తీసుకునివచ్చి దంచి నూనె తయారుచేసి బజార్లో అమ్మేవారు. వచ్చిన కొద్దిపాటి లాభంతో సరుకులు కొని భగవాన్‌కు భోజనం తయారుచేసేవారు.

భగవాన్ ఒకసారి అన్నారు, "నాకు ఇద్దరు వ్యక్తులంటే భయం. ఒకరు మొదలియార్ పాటి. రెండవ వారు రామనాథబ్రహ్మచారి." ఎందులకీ భయం? అది నిజానికి భయం కాదు. నిస్వార్థసేవకు, సంపూర్ణ శరణాగతికి, అంతులేని భక్తికి ఆయన బానిసయ్యారు. వీరిద్దరూ ఆ కోవకు చెందినవారే. ఆమె జీవితంలోని ఎన్నో సంఘటనలు, ఆమె ప్రగాఢ భక్తిని వెల్లడిస్తాయి. రమణాశ్రమానికి భగవాన్ వచ్చిన పిదప కూడా, ఆమె తన స్వహస్తాలతో భోజనమివ్వడం మానలేదు. వృద్ధాప్యం వల్ల ఆమె సగం కంటి చూపును కోల్పోయింది. ఒకరోజు భగవాన్‌కు భోజనం వడ్డించేటపుడు, ఆమె ఆయన విస్తరిపై కాలువేసింది. చెంతనే ఉన్న పరిచారకుడు, "ఏయ్! నీకంత కళ్ళు కనపడనపుడు ఎందుకు వస్తావు? నువ్వు భగవాన్‌ను చూడలేనప్పుడు, ఇక్కడకు వచ్చి అందరినీ ఎందుకు ఇబ్బంది పెడతావు?" అన్నారు.

మొదలియార్పాటి ఈ విధంగా సమాధానమిచ్చారు, "నేను భగవాన్‌ను చూడలేకపోతే నేమి? ఆయన దృష్టి నామీద పడుతుంది. ఆయన అనుగ్రహం నాపై ఉంటుంది అదిచాలు.

మొదటి శస్త్ర చికిత్స తర్వాత భగవాన్ ఆరోగ్యము క్షీణిస్తున్నదని విని, ఆమె ఆయనను చూడాలనుకున్నది. అప్పటికి ఆమె పూర్తిగా అంధురాలైంది. అయినా భగవాన్‌ను చూడాలని పట్టుపట్టింది. ఆమెను హాలులోనికి తీసుకుని రాగానే ఆయనను చూడాలని కళ్ళు చికిలించి ఎంతో కష్టపడింది. భగవాన్ ఆమెనిలా ఓదార్చారు, "అవ్వా! నేను బాగానే ఉన్నాను. నాశరీరము బాగానే ఉన్నది". ఆమెకు పూర్తి తృప్తి కలుగలేదు. ఆమె హాలు బయటకు వచ్చి ద్వారం వద్ద నిలబడింది. భగవాన్ బయటకు రాగానే, "భగవాన్ ఆగండి," అని, తన చేతులతో ఆయన శరీరాన్ని తలనుండి పాదం వరకు తడిమి చూసింది. ఆమె ఒక్కరే భగవాన్‌చే అలా తాకటానికి అనుమతింపబడిన స్త్రీ. ఆమె తన మనసారా భగవాన్‌ను చూసిన తర్వాత, "ఇపుడు మీకు తృప్తి అయిందా?" అన్నారాయన.

ఈ మహానుభావురాలు, తన అంతిమదినాలను రమణాశ్రమానికి కొద్దిదూరంలో ఉన్న రమణనగర్‌లో గడిపారు. భగవాన్, ఆమెను, ఆమె ఆరోగ్యాన్ని చూసుకోవడానికి కుంజుస్వామినీ, విశ్వనాథస్వామినీ, సూరినాగమ్మ గారినీ పంపేవారు. వారు ఆమె కొరకు రమణనగర్‌లో ఒక కుటీరాన్ని నిర్మించారు. ప్రతిరోజూభగవాన్ ఆమె యోగక్షేమాలను విచారించేవారు. 1949 నాటికి, మొదలియార్ పాటి బాగా వృద్ధురాలై పోయి, కంటిచూపును, తన కోడలిని, తన సమస్తాన్నీ పోగొట్టుకున్నారు. అయినా భగవాన్ కొరకు వంట చేసేవారు. ఆవిడ చివరిరోజు గూడా, భగవాన్‌కు భోజనాన్ని తయారుచేసి, అదిభగవాన్‌కు చేరేలాగ జాగ్రత్త తీసుకున్నారు. భగవాన్ భోజనం పూర్తవగానే, తనకు తెలియజేయవలసిందిగా కోరారు. ఆ కబురుచేరగానే, ఆమె సంతోషం తో కనులు మూసుకుని శరీరాన్ని వదిలేశారు. భగవాన్ ఆమె భౌతిక కాయాన్ని, ఆత్మసాక్షాత్కారం పొందిన వారికి (అనగా శేషాద్రిస్వామి, అళగమ్మాళ్) వలె పూడ్చి పెట్టవలసినదిగా కుంజుస్వామినీ, ఇతరులనూ కోరారు. అంతకు పూర్వము, ఎచ్చెమ్మాళ్ చనిపోయినపుడు, "మొదలియార్పాటి యింకా జీవించే ఉన్నారు" అన్నారు భగవాన్. మొదలియార్ పాటి చనిపోయినప్పుడు, నా భుజాలమీదనుండి పెద్ద భారం దిగిపోయింది అన్నారు.

జగజ్జనని, అళగమ్మాళ్ రూపం దాల్చి భగవాన్ శరీరానికి జన్మనిచ్చింది. రత్నమ్మాళ్, మీనాక్షి అమ్మాళ్, దేసూరమ్మాళ్, ఎచ్చెమ్మాళ్, మొదలియార్పాటి రూపాలలో భగవాన్‌కు భోజనమిచ్చి, ఆయన శరీరాన్ని పోషించింది. భగవాన్ కూడా వారికి ఆత్మసాక్షాత్కారాన్ని ప్రసాదించడం ద్వారా, తన కృతజ్ఞత చూపారు. ముదలియార్పాటి చనిపోగానే భగవాన్ ఆరోగ్యం మరింత క్షీణించింది. కొద్ది మాసాలలోనే ఆయన కూడా శరీరాన్ని విడిచిపెట్టారు.

కావ్యకంఠ గణపతి ముని

అది 19వ శతాబ్దపు చివరిభాగము. బెంగాల్‌లోని నవద్వీప్‌లో, అనేకమంది పండితులు, గణితశాస్త్ర వేత్తలు, కవులు ఒక సంగీత విద్వాంసుడు, ఒక ఖగోళశాస్త్రజ్ఞుడు, ఇంకా ఇతరుల మధ్య ఒక పదునాల్గేండ్ల పిల్లవాడు కూర్చుని ఉన్నాడు. గణితశాస్త్రజ్ఞులు ఒక ఆరు అంకెలుగల సంఖ్యను, వేరొక ఆరు అంకెలు గల సంఖ్యచే గుణకారము (హెచ్చవేత) చెయ్యమన్నారు. ఒక కవి, ఒక పద్యములోని చివరి రెండు పాదములు చెప్పి, ఆ పద్యము మొదటి రెండు పాదాలను, అదే ఛందస్సుతో పూరించమన్నాడు. రెండవ కవి, ఒక విషయమునిచ్చి, దానిపై వెంటనే సంస్కృతములో నాలుగు పంక్తులుగల పద్యాన్ని ఆసువుగా చెప్పమన్నాడు. ఖగోళ శాస్త్రజ్ఞుడు ఒక క్లిష్టమైన గ్రహాల స్థానాలు గల పటాన్నిచ్చి దాని పర్యవసానం ఎలా ఉంటుందో చెప్పమన్నారు. ఒక సంగీత శాస్త్రవేత్త ఏనాడో మరుగున పడిపోయిన (సంగీత) రాగాన్ని చిన్నగా పలికి, ఆ రాగమేదో గుర్తించమని ఆ బాలుని కోరారు. ఇంకొొక వ్యక్తి ఏదో పాత తారీఖు ఉదాహరణకు ఫిబ్రవరి 18, 1756, ఆ రోజు ఏ వారమో తెల్పమన్నారు. ఇవన్నీ చాలదన్నట్లు, వేరొక వ్యక్తి, ఆ బాలుని వెనుక నిలబడి చిన్న గులక రాళ్ళను అతని వీపు పైకి విసురుతుంటాడు. వాళ్ళంతా ఆ సమస్యలన్నీ ఇస్తున్నపుడు, ఎన్ని గులకరాళ్ళు విసరబడ్డాయో, ఈ బాలుడు లెక్క గుర్తుంచుకోవాలి. ఆ బాలుడు, వారందరికీ, వెంటనే తడుముకోకుండా, ఖచ్చితంగా, తెలివిగా, సరియైన జవాబులు ఇచ్చి ఆశ్చర్యంలో మునిగిన ప్రేక్షకుల అభినందనలను అందుకున్నాడు.

ఆ అద్భుత బాలుడే కావ్యకంఠ గణపతి ముని. ఆ బాలుడు అచిరకాలం లోనే భారతదేశమంతటా పేరు పొందాడు. ఆయనే తర్వాత కాలంలో రమణమహర్షి ప్రముఖ శిష్యులలో ఒకరైనారు. ఆయన పుట్టకముందు, వారి తల్లితండ్రులకు సంతతి లేదు. ఆయన తండ్రి కాశీకి వెళ్ళి, అచటి విఘ్నేశ్వర ఆలయంలో ప్రార్థన చేశారు. గణేశుని ప్రతిమ జీవం పోసుకుని, తన వద్దకు కదిలివచ్చి, తనలో ఐక్యమయిపోయినట్లుగా ఆయనకు తోచింది. అదే సమయానికి ఆయన భార్యకు, ఆ ఊరి ఆలయంలోని అమ్మవారు వెలుగుగా మారి తనలోనికి ప్రవేశించినట్లు కనిపించింది. కొలది కాలంలోనే వారికి ఒక కుమారుడు కలిగాడు. గణేశుని పట్ల కృతజ్ఞతా సూచకంగా వారా బాలునికి గణపతి అని పేరుపెట్టారు.

కానీ, ఆ బాలుడు ఏమీ మాట్లాడక పోవుటచే తల్లితండ్రులు నిరాశచెందారు. 5 సంవత్సరాల వరకు, ఏ హావభావాలు లేకుండా, మాటలు లేకుండా ఉండిపోయాడా బాలుడు. అంతేగాక, మూర్ఛలతో సహా, అనేక రకాలైన రోగాలు అతనిని బాధించేవి. నిస్సహాయస్థితిలో ఆ వ్యాధి నయం చేయడానికి, ప్రాచీనకాలంగా వస్తూ ఉన్న పద్ధతిలో ఇనుపకడ్డీని ఎఱ్ఱగా కాల్చి ముద్రవేశారు. దీనితో చాలా మార్పు వచ్చింది. ఈ పనివలన, బాలునిలో నిద్రాణంగా ఉన్న ప్రతిభాపాటవాలు వెలుగు చూశాయి. ఆ బాలుడు, అద్భుతమైన ప్రజ్ఞాపాటవాలు కలవాడయ్యాడు. ఆయన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఏది చదివినా చక్కగా అర్థం చేసుకుని తిరిగి పొల్లుపోకుండా చెప్పగలగడం, ఎన్నో రెట్లు పెరిగాయి. 9 సంవత్సరాల వయస్సు వచ్చుసరికి, సంస్కృత భాషపై పట్టుసాధించారు. 11 సంవత్సరాల వయసుకు వేదాలు, ఉపనిషత్తులు ఔపోసన పట్టారు. పధ్నాలుగేళ్ళ వయసులో ఆయన సంస్కృతంలో ఒక నాటకాన్ని రచించారు. అది ఇప్పటికీ గూడా ఆ భాషలో పేరెన్నికగన్న నాటకాలలో ఒకటిగా ప్రశంసింపబడుతుంది.

ప్రాచీన పురాణాలు ఋషులు తపస్సు చేస్తే, భగవంతుడు వారికి ప్రత్యక్షమై, వరాలను ప్రసాదించారని తెలుపుతాయి. వీటి వలన తీవ్రంగా ప్రభావితులైన కావ్యకంఠులు తాను కూడా అట్టిది సాధించాలి అనుకున్నారు. పద్దెనిమిదేళ్ళ వయసులో వివాహం చేసుకున్నప్పటికీ, దైవదర్శన ఆకాంక్ష ఆయనలో తీవ్రతరమైంది. ఆయన సుదీర్ఘమైన తీర్థయాత్ర ప్రారంభించి, అనేక ఆలయాలను, గంగవంటి పవిత్ర నదులను సందర్శించి తపస్సు చేశారు. ఆయన తపశ్చర్య చాలా తీవ్రమైనది. మౌనంగా, నిశ్చలంగా, నిరాహారంగా దీర్ఘకాలంపాటు తపస్సు చేశారు. శాస్త్రోక్తమైన సిద్ధాంతాలన్నిటినీ ఖచ్చితంగా పాటించి సంప్రదాయం ప్రకారం తపస్సు చేసినా దేవుడాయనకు ప్రత్యక్షమవలేదు.

ఒకమార్గంలో తపస్సునాచరిస్తే దైవదర్శనం కాకపోతే, వేరొక మార్గాన్ని ఎంచుకుని, అందులోనూ అంతే తీవ్రంగా తపస్సు చేశారు. ఏ మార్గమూ ఫలితాన్ని ఇవ్వకపోయేసరికి, చిట్టచివరి మార్గంగా, పరమశివుని యొక్క పంచభూతాలు, భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశములకు సంబంధించిన ప్రదేశాల్లో తపస్సు చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ అయిదు క్షేత్రాలనూ,

ఒక నిర్ణీత క్రమంలో దర్శించి, చివరకు అగ్నిక్షేత్రమయిన అరుణాచలానికి రావాలి. తేజోలింగం అయిన ఈయన సన్నిధిలో తపస్సు ఫలిస్తుందని వాడుక. కావ్యకంఠులు ప్రతిచోటా అవసరమైన పూజాది క్రతువులు అన్నీ చేసి చిట్టచివరకు 1904లో అరుణాచలానికి కొండపైకి భగవాన్ దర్శనానికి వెళ్లగా, కనులు మూసుకుని సమాధినిష్ఠలో ఉన్న భగవాన్‌ను చూశారు. ఆయన మౌనం వీడకపోవడంతో నిస్పృహచెంది, క్రిందకు వెళ్ళిపోయారు.

తిరువణ్ణామలైకు దగ్గరలో ఉన్న 'వెల్లూరు' అనే ఊరిలో ఉపాధ్యాయునిగా చేరి, తన సాధన కొనసాగించారు. 1907లో ఆయన తీవ్రంగా నిరాశచెంది, విరక్తితో తన జీవితమే వ్యర్థమని తలచారు. ఆయన వేదాలు, పురాణాలను క్షుణ్ణంగా చదివినిప్పటికీ, కుండలినీ శక్తి అనుభవం పొందినప్పటికీ, ఆ శక్తియొక్క మూలంలో స్థిరంగా నిలవడం ఇంకా ఆయనకు చేతకాలేదు. శృతులలో చెప్పబడిన ప్రకారం, దైవాన్వేషణకు, చిట్టచివరి మజిలీ అరుణాచలమే. అందుకని, నేను తిరిగి అరుణాచలం వెళ్తాను. ఈసారి గనుక దైవదర్శనం జరుగకపోతే వేదాలు, ఉపనిషత్తులు, హిందూపురాణాలు, కవుల ప్రేలాపనలే అని చాటుతాను అని నిశ్చయించుకుని ఆయన అరుణాచలానికి వచ్చారు. అరుణగిరి ప్రదక్షిణ మార్గంలో ఎనిమిది దిక్కులలోనూ ఎనిమిది శివాలయాలు ఉన్నాయి. తన శక్తికొలదీ తీవ్రంగా తపస్సు చేయాలనే దృఢనిశ్చయంతో, ఆయన నైఋతి దిక్కున ఉన్న నిరుధి లింగం ఆలయాన్ని జేరుకున్నారు. ఆ కాలంలో ఆ గుడిచుట్టూ అరణ్యం ఉండేది. ఒక పెద్ద ఎండిపోయిన వృక్షము యొక్క తొఱ్ఱలో కూర్చుని అన్నపానీయాలు లేకుండా, మౌనంగా తపస్సు ప్రారంభించారు. అయిదారు రోజుల తర్వాత, దివ్యజనని ఆయనతో ఇలా అన్నారు, "నీకు గురువు లేకుండా, నీ లక్ష్యాన్ని సాధించలేవు. నీ గురువు ఆ కొండపై ఉన్నారు. నీవు ఆయన పవిత్రమైన పాదాలచెంత శరణాగతి చెందితే, నీకాయన అనుగ్రహం లభిస్తుంది. ఇప్పుడే వెళ్ళు".

కావ్యకంఠులు ఒక్క ఉదుటున తొఱ్ఱలోనుండి బయటకు వచ్చారు. అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంట అయింది. ఎండ తీవ్రంగా ఉంది. కార్తీక దీపోత్సవ సమయం కనుక వందలాది మంది గిరి చుట్టూతా ఉన్నారు. దేనినీ లెక్కచెయ్యక, విరూపాక్ష గుహకు పరుగులిడుతూ వెళ్ళారాయన. అక్కడ భగవాన్ ఒంటరిగా గుహ బయట కూర్చుని ఉండడంచూశారు. భగవాన్ తన అనుగ్రహ వీక్షణాలను ఆయనపై ప్రసరింపజేశారు. మిగిలిన భక్తుల వలెనే ఈయన కూడా భగవాన్‌నుండి చూపు మరల్చుకోలేక స్థాణువై నిలబడ్డారు. గొప్ప పండితులైనటువంటి కావ్యకంఠులు ఇంతకు మునుపు, ఏ మానవుని ముందూ ప్రణమిల్లలేదు. తన ప్రమేయం లేకుండానే, ఆయన ఆ యువసన్యాసి పాదాలముందు సాగిలపడ్డారు. ఆయన భగవాన్ పాదాలను గట్టిగా పట్టుకుని ఇలా ఆక్రోశించారు, "చదువవలసినవన్నీ చదివాను. వేదాంతాన్ని పూర్తిగా అధ్యయనం చేశాను. హృదయం తృప్తి పడేటట్లుగా జపం చేశాను. అయినా 'తపస్సు' అంటే ఏమిటో నాకు అర్థం కాలేదు. అందుకని మీ పాదాలచెంతకు శరణార్థినై వచ్చాను. దయచేసి తమరు, తపస్సు యొక్క స్వభావమేమిటో విశదపరచండి. సంస్కృతంలో 'తపస్సు' అనే పదానికి అర్థం 'సత్యాన్ని' అనుభవంలోనికి తెచ్చుకోవడం కోసం కఠోర నియమాలతో మనస్సు, శరీరాలతో శ్రమించడం అని సాధారణ అర్థం. కానీ భగవాన్ ఆ మాట యొక్క గూఢమైన అర్థాన్ని, కావ్యకంఠుల వారికి చెప్పాలనుకున్నారు. భగవాన్ ఆయన కళ్ళలోకి చూసి కొంచెం సేపటి తర్వాత ఇలా అన్నారు, "'నేను' అనేది ఎక్కడ నుండి పుడుతుందో గమనిస్తే, మనస్సు దానిలో మునిగిపోతుంది. అదే తపస్సు." కావ్యకంఠుల వారు ప్రతిదినము తాను వేలకు వేల మంత్ర జపం చేస్తాను అని చెప్పగా, భగవాన్, "మంత్రాన్ని ఉచ్చరించేటపుడు శబ్దము ఎక్కడనుండి పుడుతుందో గమనిస్తే, మనస్సు అందులో మునిగిపోతుంది. అదే తపస్సు", అన్నారు.

ఈ బోధ కావ్యకంఠుల వారిని ఎంతో ఆనందపెట్టింది. చిట్టచివరకు ఆయన, క్రియాపూర్వకంగా 'సద్వస్తువు' లేదా 'సత్యము' తోటి ఎలా అనుసంధానమవ వచ్చునో అర్థం చేసుకున్నారు. పరమానందము, తెరలు తెరలుగా ఆయనలో గంటల తరబడి ప్రవహించింది. మహాత్ముని సన్నిధిలో ఎట్టకేలకు ఆయన కనులు తెరచి, ప్రక్కనే ఉన్న పరిచారకుడైన పళనిస్వామిని, ఆ మహాత్ముని పేరేమిటని అడిగారు. అప్పుడు ఆయన బ్రాహ్మణస్వామిగా పిలువబడుతున్నప్పటికీ ఆయన అసలు పేరు వెంకటరామన్ అని తెలుసుకున్నారు. కావ్యకంఠుల వారు భగవాన్ అసలు పేరునుండి 'రమణ' అనే పదాన్ని, ఆ స్వామిలో తాను భగవంతుని చూశారు గనుక 'భగవాన్' అని, (సంస్కృతంలో భగవాన్ అంటే దేవుడు అని అర్థం), 'తపస్సు' అనే పదానికి ఏ వేదమూ ఇవ్వలేనంత స్పష్టంగా అర్థాన్ని తెలియచెప్పారు కనుక వేదఋషి అనీ, కావ్యకంఠుల వారికి భగవాన్ సామాన్య ఋషి కారు, మహాఋషి కనుక 'మహర్షి' అనిన్నీ, వీటన్నిటినీ కలిపి భగవాన్ రమణమహర్షి అని ఆయన పేరుపెట్టారు. (ఋషి అనే పదము 'ద్రష్ట' అనే ధాతువునుండి తయారైనది. ద్రష్ట అంటే చూచువాడు, భౌతిక నేత్రములతో గాక అంతర నేత్రముతో చూచినవాడు అనియూ, ఎన్నటికీ చెక్కు చెదరని సద్వస్తువుతో అనుసంధానమైన వాడని అర్థము). ఏ నామమైతే ఉచ్ఛరించగానే, అసంఖ్యాక

జనులను, మౌనమైన, నిశ్చలమైన సత్యంలోనికి పట్టి లాగుతుందో, ఆ 'భగవాన్ రమణమహర్షి' అనే నామము మహామేధావి అయిన కావ్యకంఠ గణపతి మునిగారిచే ఇవ్వబడింది. అప్పటికే గణపతి ముని గారికి, మహా పండితులైన దైవరాతుడు, కపాలిశాస్త్రి వంటి వారితో గూడి రెండు వందల మందికి పైగా శిష్యులున్నారు. ఆయన తన శిష్యులకు లేఖ వ్రాస్తూ, "నేను నా గురువును కనుగొన్నాను. ఇటుపై నేను గురువును కాదు. మనకందరికీ భగవాన్ రమణ మహర్షియే గురువు" అని వ్రాశారు. మరుసటిరోజు, ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్! నన్ను స్వీకరించండి" అన్నారు. భగవాన్ ఆయన విన్నపాన్ని దయతో అంగీకరించి, విరూపాక్ష గుహ దగ్గరలో ఉన్న మామిడితోపు గుహ (చూతగుహ) లో ఆయనను ఉండమన్నారు. ఆ మామిడి తోపు గుహ, (చూతగుహ) విరూపాక్ష గుహకు దగ్గరలో ఉండుటచే, గురుశిష్యులకు ప్రతి దినము ఒకరినొకరు కలుసుకోవడానికి అనుకూలముగా ఉండేది. భగవాన్ తన అనుగ్రహంతో గణపతి ముని గారు ఆధ్యాత్మికంగా పరిణితి చెందడానికి దోహదపడ్డారు.

భగవాన్, కావ్యకంఠుల వారినెంతో గౌరవంగా చూస్తూ, మరింత గౌరవంగా సంబోధిస్తుండేవారు. ఒకరోజు, కావ్యకంఠుల వారు భగవాన్ పాదాలను పట్టుకుని, "భగవాన్! దయచేసి నన్నలా గౌరవపూర్వకంగా పిలువకండి. నేను మీ శిష్యుణ్ణి మీ బిడ్డను. నన్ను అలాంటి పెద్దపెద్ద గౌరవపూర్వకమైన మాటలతో పిలువవద్దు" అని వేడుకున్నారు. కానీ భగవాన్ అలాగే పిలిచేవారు. తర్వాత, కావ్యకంఠుల వారి అభిమానులు ఆయనను 'నాయన' అని సంబోధిస్తారని తెలుసుకుని, భగవాన్ కావ్యకంఠులతో, "ఇకనుండి నేను మిమ్ములను 'నాయన' అని పిలుస్తాను," అన్నారు. (సంస్కృతంలో నాయన అంటే తండ్రియని అర్థము. తెలుగులో నాయన అంటే బిడ్డ, శిష్యుడు అని అర్థము) దానికి గణపతిముని ఒప్పుకొన్నారు.

ఇంకోవిశేషమేమిటంటే, కావ్యకంఠులవారు అప్పటివరకూ, గొప్ప శివభక్తుడిగా ఉంటూ, అరూపమైన, భగవంతుని పితృభావంతో ఆరాధించేవారు. ఆయన ఇదివరకెన్నడూ, దైవాన్ని తల్లిభావంతో ఆరాధించలేదు. కానీ ఎప్పుడైతే అమ్మవారు, ఆయనకు గురువును చూపించిందో, అప్పటినుండి ఆమెకు కూడా భక్తుడిగా మారిపోయారు. (అరుణగిరిలో అరుణాచలేశ్వర ఆలయం ఉన్న భాగాన్ని 'ముందు భాగమనీ', నిరుధిలింగం నుండీ ఈశాన్యలింగం వరకూ గల గిరి భాగాన్ని 'వెనుక భాగమనీ' అంటారు. ఒక రహస్యమేమిటంటే గిరి ముందు భాగాన్ని తండ్రి స్వరూపమనీ, వెనుకభాగాన్ని మాతృస్వరూపమనీ భావిస్తారు. మానసికమైన, మార్మికమైన, భౌతికమైన, ప్రాపంచికమైన అద్భుతాలన్నీ, మాతృస్వరూపం నుండే జరుగుతాయి. భగవాన్ భక్తుల జీవితాలలో జరిగిన అద్భుతాలన్నీ నిరుధిలింగంనుండీ, ఈశాన్య లింగం మధ్యలో జరిగినవే. కావ్యకంఠులు కూడా, నిరుధిలింగం వద్ద (జగజ్జనని) మాతృరూపం వల్లనే త్రోవ చూపించబడ్డారు.)

గణపతిముని, అమ్మవారిని పొగుడుతూ వెయ్యి సంస్కృతపద్యాలను వ్రాసి, ఆమెకు కృతజ్ఞత తెలుపుకోవాలనుకున్నారు. ఆయన భగవాన్‌ను వేడుకుని, ఆయన సమ్మతితో రచన ప్రారంభించారు. ఒక పర్వదినం నాటికి ఈ వెయ్యి పద్యాలను పూర్తిచేయాలనుకున్నారు. దురదృష్టవశాత్తూ ఆయన జబ్బుపడి తాను నిర్ణయించుకున్న గడువుముందు రోజు రాత్రికి, కేవలం 700 పద్యాలను మాత్రమే పూర్తిచేశారు. ఆయన విరూపాక్ష గుహలోని భగవాన్ వద్దకెళ్ళి తన సమస్యను విన్నవించుకున్నారు. భగవాన్, ఆయనను ప్రోత్సాహపరుస్తూ, "దిగులు చెందకు, నేను వచ్చి నీతోపాటు కూర్చుంటాను," అన్నారు.

అది ఒక అద్భుతమైన దృశ్యం. యువకుడైన గురువుగారు కూర్చుని మౌనాన్ని ప్రసరింపచేస్తుంటే, ఆయనకంటే ఎంతో పెద్దవాడైన శిష్యుడు, ఆశువుగా ప్రవాహం వలె పద్యాలను చెప్పుకుంటూ పోతుంటే, ఆయన శిష్యులు దీపం చుట్టూ కూర్చుని పొద్దుపోయే వరకూ వ్రాయడం. కావ్యకంఠుల వారు, మొదటి పద్యంలోని మొదటి పంక్తిని, ఒక శిష్యునికి, రెండవ పద్యంలోని మొదటి పంక్తిని రెండవ శిష్యునికి, మూడవ పద్యంలోని మొదటి పంక్తిని మూడవ శిష్యునికీ, వరుసగా ఇలా చెప్పుకుంటూ పోయి, తిరిగి, ప్రతి ఒక్కరికీ రెండవ పంక్తినీ, నిర్విరామంగా చెప్పుకుంటూపోయి, రాత్రి 1.30కు వెయ్యిపద్యాలను పూర్తిచేశారు. అప్పటివరకూ శిలాప్రతిమ వలె మౌనంగా ఉన్న భగవాన్ కళ్ళు తెరిచి, "ఏమి, నేను చెప్పినదంతా వ్రాసుకున్నావా?" అని అడిగారు. కావ్యకంఠుల వారు భగవాన్ పాదాలపై బడి, "అవును భగవాన్, అవన్నీ మీరు చెప్పిన పద్యాలే," అన్నారు. ఈ పద్యసంగ్రహాన్ని 'ఉమాసహస్రం' అంటారు. 'ఉమ' అంటే జగజ్జనని, సహస్రం అంటే సంస్కృతంలో 'వెయ్యి' అని అర్థం. అందుకని "జగజ్జననిని పొగుడుతూ వెయ్యి పద్యాలు' అని ఆ శీర్షిక అర్థం. కావ్యకంఠులవారు, అందులోని మొదటి ఏడువందల పద్యాలను అనేకమార్లు సవరించారు గానీ, భగవాన్‌చే చెప్పబడినవిగా, తాను భావించిన చివరి మూడు వందల పద్యాలను మాత్రం కదిలించలేదు.

నేను రమణాశ్రమమునకు తిరిగి వచ్చిన పిదప నేను ఎంతగానో గౌరవించే కొందరు, గణపతిముని గురించి చెడుగా మాట్లాడుతుండేవారు తరచుగా. ఆయన చెప్పే అనుభవాలన్నీ, ఆయన ఊహలకు రూపాలే (కల్పనలే) అనే వారు వాళ్ళు. నామీద వారి ప్రభావం పడింది. నేను, గొప్ప పండితులూ, భగవాన్ సంభాషణలను గ్రంధస్థం చేసిన వారిలో ఒకరూ అయిన మునగాల వెంకటరామయ్యగారి వద్దకు వెళ్ళి ఈ విషయమై వారినడిగాను. మునగాలవారు కావ్యకంఠులవారిని చూచియుండలేదు. అందువలన ఆయన తటస్థంగా ఉన్నారు. "ఎందుకు ఈ మనుషులు కావ్యకంఠుల వారిని ఇంతగా దిగజారుస్తున్నారు?" అని అడిగి, ఆయనపై ఉన్న ఆరోపణలనన్నిటినీ వరుసగా ఏకరువు పెట్టసాగాను. "గణేశన్, ఆగు!" అన్నారాయన ఆశ్చర్యంతో. "నీకివన్నీ ఎలా తెలుసు?" అని నన్నడిగారు. నాకు చెప్పిన పేర్లన్నిటినీ ఏకరువు పెట్టాను. "వారు ఒక అభిప్రాయాన్ని చెప్పారు. నీవు స్వీకరించావు. అవి సత్యమేనని నీకు దృఢంగా తెలుసా?" అన్నారు. నేను తికమకపడ్డాను. "ఎవరి అభిప్రాయం నిజమో మనమెలా తెలుసుకోగలం?" అన్నాను నేను. మునగాల వారన్నారు. "గణేశన్! ఈ రహస్యం నీకు తెలియదా? భగవాన్ ఏది చెబితే అది సత్యం. మిగిలిన వారెవరు చెప్పేదైనా, వారి అభిప్రాయం మాత్రమే."

నాకు ఇంకా సంతృప్తి కలుగలేదు. కావ్యకంఠులవారికింకా అనేక సంకల్పాలు ఉండుటచే వారు, ఆత్మసాక్షాత్కారం పొందినవారు కారు అనే 'సంవాదాన్ని' నేను చదివాను. ఆయనను విమర్శించే వారెపుడూ, ఈ సంవాదాన్ని ఉదహరించేవారు. మునగాల వారు ఇలా అన్నారు, "నేను, భగవాన్‌ను ఈ విషయమే ప్రశ్నించాను. కావ్యకంఠులవారికి సాక్షాత్కారం కలుగలేదని ఫలానా గ్రంథంలో వ్రాయబడింది కదా," అని. భగవాన్ నాతో ఏమన్నారంటే, "అవి నేను చెప్పిన మాటలు కావు. ఆ లేఖకులు నేనావిధంగా అనాలని అనుకుని ఉంటారు." మునగాల వారు నాకిలా సలహానిచ్చారు. "భగవాన్ ఏమి చెబితే దానిననుసరించు. సత్యానికి చేరువ అవుతావు. ఇతరుల అభిప్రాయాలు అందులోనూ మనుష్యుల మధ్యవిభేధాలు కల్గించే వాటిని, మహాత్ముల గురించి గానీ, మరెవరి గురించిగానీ, నువ్వు లెక్కచెయ్యవద్దు. సాధకులు, ఏ మహాత్ముని పైనా కువిమర్శలను పట్టించుకోరాదు. నువ్వు ప్రగతి సాధించాలంటే గుర్తుంచుకోవలసిన మొదటి సూత్రమిది. విమర్శకులు చెప్పేవి వారి అభిప్రాయాలే. నీవు వాటిని నమ్మితే నీ మనస్సుకే బందీవైపోతావు"

కావ్యకంఠుల వారికి చాలా ఉన్నతమైన సంకల్పాలుండే మాట నిజమే. కానీ అవి వట్టి సంకల్పాలు కావు. సత్సంకల్పాలు. సంకల్పమంటే దేనినో సాధించాలనే గాఢమైన కోరిక. 1908లో కావ్యకంఠులవారు భగవాన్‌ను ఇలా అడిగారు, "నా సంకల్పాలన్నీ నెరవేరాలంటే, "నేను" అనే ఆలోచనకి మూలాన్ని వెదికితే సరిపోతుందా లేక మంత్రజపమూ, సామూహిక మంత్రోచ్చారణ అవసరమా?" అని అడుగగా, "నేను అనే తలంపుకు మూలాన్ని అన్వేషించితే చాలు, సరిపోతుంది" అని భగవాన్ అన్నారు. భగవాన్ మొదటనే ఈ సలహానిచ్చినప్పటికీ కావ్యకంఠులవారు తన వాదనను కొనసాగించి, "మరి నా ఆశయాలూ, సంకల్పాలూ మాట ఏమిటి?" అన్నారు. భగవాన్ అప్పుడు, "మీరు ఆ భారాన్నంతటినీ భగవంతునిపై ఉంచితే మంచిది. మీరు స్వేచ్ఛగా ఉండవచ్చును. ఆయన పని ఆయన చూసుకుంటారు. కొంతమంది ఇంతవరకు మాత్రమే ఉటంకిస్తారు. తర్వాత ఏమి జరిగిందో భగవాన్ నాతో చెప్పారు. తొలుత కావ్యకంఠులవారు, భగవాన్ సలహాలోని నిగూఢమైన అర్థాన్ని గ్రహించలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆయన భగవాన్ వద్దకు వచ్చి, భగవాన్! నా సంకల్పాలన్నిటినీ మీ పవిత్రమైన పాదాలకు అర్పించి వేస్తున్నాను అన్నారు. ఆయనకు భగవాన్‌ను మించిన దేవుడు లేడు."

కావ్యకంఠులవారు, ఆయన శిష్యులు గూడా అదేపనిగా భగవాన్‌ను ప్రశ్నిస్తుండేవారు. ఆ సమాధానాలను వెంటనే వ్రాసిపెట్టక పోయినప్పటికీ, నాయనకు గల అద్భుతమైన జ్ఞాపకశక్తితో, ఆయన భగవాన్ సమాధానాలను పద్యముల రూపంలోనికి మార్చి ఇది రమణగీతలోని మూడవ అధ్యాయములోనిది. ఇది రమణగీతలోని రెండవ అధ్యాయంలోని ఎనిమిదవ పద్యము. అప్పటికి ఆయన రమణగీత ఇంకా వ్రాయలేదు. ఆయన చెప్పే మాటలకు వినేవారు ఆశ్చర్యపోతుండేవారు. చివరకు ఒకరోజు ఆయన సావధానంగా కూర్చుని, మూడువందల పద్యాలు గల రమణగీతను సంపూర్ణంగా వ్రాసేశారు. ఆయన ప్రశ్నలను, సమాధానాలను, వ్రాసి భగవాన్‌కు చూపించగా, ఆయన వాటిని పరిశీలించి నూటికి నూరుపాళ్ళు సరిగా ఉన్నాయని అన్నారు.

రమణగీతలో స్త్రీలను గూర్చిన ప్రశ్నలలో ఒక దానికి భగవాన్ ఇచ్చిన సమాధానం ప్రబోధాత్మకంగా ఉంది. నాయన, భగవాన్‌ను, "ఏమి స్త్రీలు, పురుషులతో సమానం కాదా?" అని అడుగగా, భగవాన్, "స్త్రీయైతే నేమి, పురుషుడైతేనేమి? అది దేహానికి సంబంధించినది. ఆత్మకు ఏ బేధాలు ఉండవు" అన్నారు. కావ్యకంఠులవారు, "స్త్రీలు వేదములలో పాండిత్యం సంపాదించగలరా?"

అని ప్రశ్నించగా, "నిస్సందేహంగా", అని భగవాన్ సమాధానమిచ్చారు. "స్త్రీలు ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలరా? వారు జ్ఞానులు కాగలరా?" అని కావ్యకంఠులవారు ప్రశ్నించగా, "నిస్సందేహంగా కాగలరు. ఒక జీవి ఆత్మసాక్షాత్కారం పొందడానికి భౌతికమైన భేదాలు అడ్డురావు" అన్నారు భగవాన్.

1922లో భగవాన్, తల్లిగారు మహాసమాధి చెందినప్పుడు, భగవాన్ ఆమెను సమాధి చేసి, దానిపై సమాధిని, గొప్పగా ఆలయాన్ని నిర్మించాలని అనుకోలేదు. "శృతులప్రకారం, రమణగీతలోని మీ వచనాల ప్రకారం ఆమె సాక్షాత్కారం పొందిన జీవి. అందుకని, ఆచారప్రకారం ఎంతో పవిత్రంగా సమాధి చెయ్యబడాలి," అన్నారు కావ్యకంఠులవారు. ఆమెకు జ్ఞానులకు వలె సమాధి నిర్మించడం, దానిపై ఆలయాన్ని నిర్మించడం, కార్యరూపం దాల్చడం, ఆయన పట్టుదల వల్లనే జరిగింది. ఆలయానికి 'మాతృభూతేశ్వర ఆలయం' అని పేరు పెట్టింది కూడా ఆయనే. మాతృభూతేశ్వరుడు అంటే మాతృరూపం దాల్చిన ఈశ్వరుడు అని అర్థం. ఈ విధంగా మాతృభూతేశ్వరాలయం, అది కేంద్రంగా రమణాశ్రమం నిర్మించబడటము అనే సంకల్పం ఆయననుంచి వచ్చిందే.

కావ్యకంఠులవారు మహాపురుషులు. ఆయన తీవ్ర తపశ్చర్య వలన ఆయనకు కుండలిని జాగృతమైంది. శృతుల ప్రకారం, కుండలిని తలలోని సహస్రారంనుండి వెలువడి సూర్యుని జేరుతుంది. కావ్యకంఠులవారికి అలా జరగడం ఇష్టంలేదు. ఆయన భగవాన్ శిష్యులు కావున, భగవాన్ చేతిని తన తలపై (శిరస్సుపై) ఉంచవలసిందిగా కోరారు. తర్వాత కావ్యకంఠులు ఇలా అన్నారు, "భగవాన్ వారి చేతులను నా శిరస్సుపై ఉంచగానే, చల్లని వెన్నెల నాపై వర్షించినట్లనిపించింది. నెప్పి పూర్తిగా ఉపశమించింది. ఇలా జరుగడానికి ముందు ఆయన శిష్యులు, ఏదో ఆవిరి వంటిది పల్చగా ఆయన శిరస్సు పైభాగం నుండి వెలువడడం చూసినట్లు చెప్పారు.

మా గురువుగారు, టి.కె.సుందరేశఅయ్యర్, కుంజుస్వామి, విశ్వనాధస్వామి, భగవాన్, కావ్యకంఠులపై అనుగ్రహం చూపిన సంఘటన మరొకటి చూశారు. ఒకానొకప్పుడు, చెన్నై దగ్గరలోని తిరువత్తియూర్‌లో గణేశుని ఆలయంలో తపస్సు చేసుకుంటుండగా, ఆధ్యాత్మిక పురోగతి లభించుట లేదని కావ్యకంఠులవారు భావించారు. "నాకు సాయం చెయ్యండి. సాయం చెయ్యండి," అని ఆయన భగవాన్‌ను ప్రార్థించారు. దానికి సమాధానంగా, భగవాన్ ఆయన ముందు ప్రత్యక్షమై, తన చేతిని ఆయనపై ఉంచి, ఆధ్యాత్మిక పురోగతిలోని అవరోధాన్ని తొలగించి, అంతర్ధానమై పోయినట్లు అన్పించింది. వెంటనే కావ్యకంఠులవారు జరిగినదానిని, తన శిష్యులకు వివరించారు. అదే సమయంలో రమణులు స్కందాశ్రమంలో ఇలా చెప్పారు, "నేను పడుకుని ఉండగా నా శరీరం అకస్మాత్తుగా గాలిలో తేలసాగింది. నేను 'తిరువత్తియూర్' అనే పేరు విన్నాను. నేను ప్రధాన వీధి గుండా నడుస్తూ, అచట వినాయకుని గుడి చూసి, అందులోకి వెళ్ళాను. తర్వాత అకస్మాత్తుగా స్కందాశ్రమంలో ఉన్నాను. అది 'నాయన' సంకల్పం. వెళ్ళాలనేది, నా కోరిక కాదు. సిద్ధులు, పురాణలలోని మునులు, మహాత్ములు, ఆకాశగమనం ఎలా చేసేవారన్నది ఈ అనుభవంతో నాకర్థం అయింది. అదే నా విషయంలో కూడా జరిగి ఉంటుంది. అది నా కోరికవల్ల జరిగింది కాదు. కావ్యకంఠుల వారి కోరిక వల్లనే అలా జరిగి ఉంటుంది.

ఒకనాడు భగవాన్, నాయన, సుందరేశఅయ్యర్, మిగిలిన భక్తులు కొండపైనుండి క్రిందకు దిగివస్తుండగా, భగవాన్ అకస్మాత్తుగా ఆగి, "నాయనా! ఇప్పుడు నావైపు చూడు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు అన్నీ నా నడుముచుట్టూ ప్రదక్షిణం చేస్తున్నవి." అక్కడున్నవారికి ఆ దృశ్యం కనబడలేదుకానీ, భగవాన్ శరీరం గొప్ప తేజస్సుతో వెలిగిపోవటం వారు చూశారు. సంభ్రమాశ్చర్యాలతో భక్తులందరూ, భగవాన్ ఎదుట సాష్టాంగపడి, పురుషసూక్తం చదివారు. పురాతనకాలంలో, ఋషులు, సూర్యచంద్రులు నేత్రములుగా గల సర్వేశ్వరుడు అయిన శ్రీమన్నారాయణుని స్తుతిస్తూ, పురుషసూక్తాన్ని పఠించేవారు.

భగవాన్ అనుగ్రహం వల్ల కుండలిని, తిరువత్తియూర్, సంఘటనల తర్వాత, ఒక విద్యుత్ ప్రవాహము కావ్యకంఠులవారి శరీరం గుండా ప్రవహిస్తున్నట్లుగా నిర్ధారణ చేసుకొన్నారు. అందుమూలంగా ఆయన పాదరక్షలు లేకుండా, నేలమీద నడిస్తే, విద్యుదాఘాతం తగిలేది. (ఎలక్ట్రిక్ షాక్) అందుకని ఆయన కొయ్యతో చేసిన పావుకోళ్ళు వేసుకోవడం ప్రారంభించారు. కాని భగవాన్ సమక్షంలో ఆయనపై గౌరవంకొద్దీ వాటిని దూరంగా విడిచిపెట్టేవారు. భగవాన్, కావ్యకంఠులపై దయతో, "నాయన వస్తున్నారు. ఆయన చెప్పులు లేకుండా నడవలేరు. ఆయన కూర్చోవడానికి చెక్కపలకను వేసి, నడవడానికి ఉన్ని దుప్పటి పరచండి," అని చెప్పేవారు.

మనము భగవాన్‌కు కావ్యకంఠులకు మధ్యగల అనుబంధాన్ని గౌరవించాలి. గురువు శిష్యునిపై ఎటువంటి అభిప్రాయము కలిగి ఉన్నారనేది ముఖ్యము కాని ఒక శిష్యుడు, తోటి శిష్యునిపై ఎటువంటి అభిప్రాయం కలిగి ఉన్నారనేది అనవసరం. భగవాన్ అంతటి మహనీయులు, నాయనను ఎంతగా అభిమానించేవారో భగవాన్ శిష్యులు, సాధకులు గమనించవలసిన విషయం. భగవాన్ భక్తులు, కావ్యకంఠగణపతి మునికెంతో ఋణపడి ఉంటారు. మొదటగా, గురువుగారికి అంత ప్రశస్తమయిన, పవిత్రమైన నామధేయాన్ని ఒసగారు. రెండవది గురువుగారు మౌనాన్ని వీడి మాట్లాడేటట్లు చేసింది ఆయనే. అంతకుముందు, గంభీరంశేషయ్యగారు, శివప్రకాశం పిళ్ళెగారు, ఇతరులు, భగవాన్ మౌనదీక్షలో ఉన్నారనుకొని, వ్రాతపూర్వకంగా ప్రశ్నోత్తరాలు కొనసాగించేవారు. తొలుతగా, కావ్యకంఠులవారికే మౌఖికమైన సమాధానాలు ఇవ్వడం ప్రారంభించారు. సంస్కృతంలో ఆర్యఛందస్సులో ఒక పద్యం వ్రాయమని భగవాన్‌ను పట్టుబట్టింది ఆయనే. ఆర్యఛందస్సు సూత్రాలను వివరించి పద్యం వ్రాయమని నాయన పదే పదే భగవాన్‌ను కోరారు. మరుసటి దినము వారికి ఆశ్చర్యం కలిగేటట్లు,ఏ విధమైన తప్పులు లేకుండా రెండు పద్యాలను వ్రాసి చూపించారు భగవాన్. ఆమర్నాడు, మరొక మూడు పద్యాలను వ్రాశారు.

ఈ అయిదు పద్యాలు "అరుణాచల పంచరత్నము" అనే పేరుతో భగవాన్ సమాధిముందు ప్రార్థనాగీతంగా పాడబడుతున్నాయి.

అరుణాచల పంచరత్నము

1. కరుణా పూర్ణసుధాబ్దే
కబళిత ఘన విశ్వరూప కిరణావల్యా
అరుణాచల పరమాత్మన్
అరుణోభవ చిత్త కంజ సువికాసాయ ॥

కంII కరుణాపూర్ణ సుధాబ్ధీ
కరనికరముచే నిఖిలము కబళించెడి యో
యరుణాచల పరమాత్మా
అరుణుడగుమ సువికసింప నంబుజమనమున్

2. త్వయ్యరుణాచల సర్వమ్
భూత్వా స్థిత్వా, ప్రలీనమేతచ్చిత్రం ।
హృద్యహ మిత్యాత్మతయా
నృత్యసిభో స్తే వదన్తి హృదయం నామ ॥

కంII జనన స్థితి విలయము లె
ల్ల నగుచు జిత్ర మరుణాచలా నీలోనే ।
కను నాత్మవై హృదిని న
ర్తన మాడుటను వెలసితి హృదయమను పేరన్ ॥

3. అహమితి కుత ఆయాతీ
త్యన్విష్యాన్తః ప్రవిష్టయాత్యమలధియా
అవగమ్య స్వం రూపం
శామ్యత్యరుణాచల! త్వయి నదీవాబ్ధౌ

కంII నేనని యెందు వెడలునని
లో నమలమనిషచే విలోకింపంగా
తా నగు రూపమెఱిగి నీ
లో నరుణాద్రి నది యబ్ధి లోవలె నెనయున్ ॥

4. త్యక్త్వా విషయం బాహ్యమ్
రుద్ధ ప్రాణేన రుద్ధ మనసా అంతస్త్వామ్ ।
ధ్యాయన్ పశ్యతి యోగీ
దీధితి మరుణాచలా త్వయి మహీయన్తే ॥

కం॥ పోనాడి వెలి విషయముల
ప్రాణ నిరోధమున మనసు బంధించి నినున్।
ధ్యానించు యోగి కాంచును
లోన ననూనమగు నీ వెలుగు నరుణాద్రీ ॥

5. త్వయ్యర్పిత మనసా త్వామ్
పశ్యన్ సర్వం తవాకృతి తయా సతతమ్
భజతే అనన్య ప్రీత్యా
స జయత్యరుణాచల! త్వయి సుఖేమగ్నః ॥

కం॥ మనసు నీకర్పించి య
రుణాద్రి సర్వమును నీదు రూపుగ నెపుడున్
గనుచు ననన్య ప్రీతిన్
నిను గొలువ జయించు మునిగి నీ సుఖ మందున్ ॥

1. దయచే నిండిన సముద్రమా! కిరణపంక్తిచే మింగబడిన గొప్ప ప్రపంచరూపము గలవాడవైన అరుణాచల పరమాత్మా హృదయపద్మము మిగుల వికసింప చేయుటకై సూర్యుడవగుమా!

2. అరుణాచలుడా, నీయందీ చిత్రమంతయుబుట్టి, నిలచి లయమగుచున్నది. ఆత్మ స్వరూపుడ వగుట చేత, హృదయమునందు 'నేను' అని, ఓయీ నాట్యమాడుతున్నావు గదా! దానివలన నీకు హృదయమనే పేరు కలిగెననుచున్నారు.

3. ఆ 'నేను' అనునది ఎచ్చటనుండి వచ్చుచున్నది యని లోపల ప్రవేశించిన నిర్మలమగు బుద్ధిచే వెదకి తనదియగు రూపమును తెలిసికొని, అరుణాచలుడా! సముద్రమునందలి నది వలె నీయందే చేరుకున్నాడు.

4. ఓయీ! అరుణాచలుడా! బాహ్యవిషయమును వదలి నిరోధించిన ప్రాణముచే, నిరోధింపబడిన మనస్సుచే యోగి నిన్ను ధ్యానించుట చేత నీ యందలి వెలుగును చూచుచున్నాడు. ఈ నీ వెలుగు గొప్పది.

5. నీయందర్పించిన మనస్సుచే సర్వమును నీ యాకారముగ నెప్పుడును చూచుచున్నవాడై, అనన్యమగు భక్తి చేత నిన్నెవడు ధ్యానించుచున్నాడో, ఓయీ! అరుణాచలుడా! వాడు సుఖస్వరూపుడవగు నీయందు మునిగిన వాడై విజయము నందుచున్నాడు.

కావ్యకంఠ గణపతి ముని

సాధు నటనానంద

కావ్యకంఠ గణపతిముని ఒక మహోన్నతమైన విగ్రహము అనుకుంటే, సాధునటనా నందను, కుందేలు, తాబేలు కథలోని తాబేలుతో పోల్చవచ్చును. ఆయన ఒక అసాధారణమైన ఆధ్యాత్మిక మహాపురుషుడు. సాధారణ ప్రాధమిక పాఠశాల ఉపాధ్యాయుడి నుండి, గొప్ప జ్ఞానము కలిగి, సాక్షాత్కారము పొందిన వానిగా ఎదిగారాయన. సాధునటనానంద, 'ఆధ్యాత్మిక ప్రభోదము' (స్పిరిచ్యుయల్ ఇన్‌స్ట్రక్షన్) అనే పేరుగల ఆధ్యాత్మిక సాధకులకు ఎంతో ఉపయోగరకమైన గ్రంథాన్ని వ్రాశారు.

ఈ సామాన్య ఉపాధ్యాయుడు రామకృష్ణ పరమహంస యొక్క బోధలను, స్వామి వివేకానంద రచనలను, వేదాలను చదివారు. కేవలం సద్గురువు మార్గదర్శకత్వంలో మాత్రమే సద్వస్తువును (సత్యాన్ని) సరిగ్గా అర్థం చేసికొనడం సాధ్యమని, ఆయన అర్థం చేసుకున్నారు. అందుకని, ఆయన గురువు కోసం పరితపించారు. అరుణాచలముపై నున్న యువసన్యాసి, ఆయనకు మార్గాన్ని చూపగలరని, ఆయన స్నేహితులాయనకు చెప్పారు. అప్పట్లో నటేశముదలియార్ అని పిలువబడే ఆయన, స్కందాశ్రమంలో భగవాన్‌ను దర్శించుకుని ఆయనవద్ద కూర్చున్నారు. ఆయన వేదాలను, శృతులనూ బాగా చదివినారు గనుక, గురువు మాట్లాడిన పిదప మాత్రమే తాను మాట్లాడాలనుకున్నారు. కానీ భగవాన్ ఎవరైనా, ఏదైనా ప్రశ్నిస్తే తప్ప, ఎక్కువగా మాట్లాడేవారు కాదు. కొన్ని గంటల పాటు భగవాన్ వద్ద మౌనంగా గడిపిన తర్వాత నిరాశతో ముదిలియార్ ఇంటికి తిరిగివెళ్ళారు. బహుశా ఈయన మహాత్ముడై ఉండకపోవచ్చును. నేను ఇతర మహాత్ముల వద్దకు వెళ్తాను అనుకొన్నారు. ఆయన అనేకమంది ఇతర సాధువుల (సన్యాసుల) మహాత్ముల వద్దకు వెళ్ళి నిరాశతో తిరిగి వచ్చారు. "ఎందుకు భగవాన్ వద్దకు వెళ్ళడం మానివేశావు? తిరిగి ఆయన వద్దకే వెళ్ళు" అని స్నేహితులాయనను మందలించారు. తనపై ఆయన అనుగ్రహాన్ని కురిపించమని ప్రార్థిస్తూ, ఆయన భగవాన్‌కు లేఖలు వ్రాయడం మొదలుపెట్టారు. ఆయన భగవాన్‌కు ఒక రిజిష్టర్డ్ లెటర్‌కూడా పంపారు. అందులో ఈ విధంగా వ్రాశారు. "మీరు గనుక నాపై అనుగ్రహం చూపకపోతే, నేను సాక్షాత్కారం పొందకుండానే చనిపోతాను. మరుసటి జన్మలో కూడా మిమ్ములను, మీ అనుగ్రహం కోసం అర్థిస్తూనే ఉంటాను. నాకు ఆత్మసాక్షాత్కారాన్ని ప్రసాదించడం కోసం, మీరు తిరిగి జన్మించవలసి ఉంటుంది. అంత కష్టం మీకెందుకు? ఈ జన్మలోనే మీరు దానిని నాకివ్వవచ్చును గదా!"

భగవాన్ ఆయన స్వప్నంలో కన్పించి, మీరు నా నుండి అనుగ్రహాన్ని కోరుతున్నారు. మీరు ముందు నంది వాహనుడైన ఈశ్వరుని పూజించాలి అని చెప్పారు. ఆయన ఉండే చిన్న గదిలో నంది వాహనుడైన ఈశ్వరునిపటము ఉండేది. నటనానంద కొన్నాళ్ళ పాటు ఆ పటానికి పూజ చేసినా కానీ, ఆయనకు ఆనందము కలగలేదు. ఆయన తిరిగి తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని ఆలయానికి వెళ్ళారు. బహుశా భగవాన్ కలలో నన్నిక్కడకు వెళ్ళమని స్వప్నంలో సూచించి ఉంటారు అనుకున్నారు ఆయన. ఈసారి కొందరు "ఆ మౌనస్వామి వద్దకు వెళ్ళవద్దు. ఆయన మీతో మాట్లాడరు" అన్నారు. ఆయన మొండి ధైర్యము, పట్టుదల, దీక్ష గల వ్యక్తి. అందువల్లనే మురుగనార్ "కఠినమైన నియమ నిష్ఠలే ఆయన ఆయుధాలు" అన్నారు.

నిరాశ చెందకుండా, ఈ బడిపంతులు గారు భగవాన్ వద్దకు మరల వెళ్ళి, "భగవాన్ నాకు మీ జ్ఞాన అనుగ్రహ అనుభవం పొందాలని ఉంది. దయచేసి నా కోరిక తీర్చండి" అని ప్రాధేయపడ్డారు. భగవాన్ ఆయనవైపు పదిహేను నిమిషాల పాటు తదేకంగా చూశారు. భగవాన్‌ను ఏదైనా ప్రశ్న అడిగినపుడు, ఆయన వెంటనే సమాధానమివ్వకుండా, ముందు మౌనంతో శాంత పరచి, తర్వాత సమాధానం ఇచ్చేవారు. దానివల్ల ప్రశ్నించిన వానికి అది ప్రత్యక్ష అనుభవంగా నిలిచిపోయేది. ఆయనకు ప్రశ్నమీద కంటే ప్రశ్నించిన వాని పట్ల ఎక్కువ ఆసక్తి ఉండేది. ఆయన నటనానందుల వారిని తదేకంగా చూచి "అనుగ్రహాన్ని కోరుకుంటున్నది. నా ఎదురుగా వున్న శరీరమా లేక దానిలోనున్న చైతన్యమా? అది చైతన్యమే (ఎరుకే) అయితే, తనను తాను శరీరంగా భావించుకుని కాదా ఈ ప్రశ్న అడుగుతున్నది? అలా అయినట్లయితే, ఆ చైతన్యాన్ని తన స్వరూపాన్ని గుర్తించమనండి. అది అప్పుడు దైవాన్నీ, అనుగ్రహాన్నీ దానంతట అదే గుర్తిస్తుంది. ఆ సత్యాన్ని ఇప్పుడే, ఇక్కడే గుర్తించవచ్చును. ఆనందపారవశ్యం

అలలు, అలలుగా నటనానందులలో ప్రవహించింది. ఆయన భగవాన్ సన్నిధిలో గంటల తరబడి ఉండిపోయారు. ఆయన కూడా, భగవాన్ యొక్క చక్షుదీక్షతో అనుగ్రహించబడ్డారు.

నటనానంద ఒకసారి నాతో భగవాన్ దృష్టి నన్ను పూర్తిగా సంతృప్తి పరచలేదు. నేను ఎంత నియమ నిష్ఠలతో ఉన్నప్పటికీ, నాకు ఇంకా కొన్ని వాసనలు మిగిలి ఉన్నవి అన్నారు. ఒకప్పుడు నటనానందుల వారు భగవాన్ సన్నిధిలో ఉన్నప్పుడు కావ్య కంఠులవారూ, ఇతర పండితులూ అక్కడ హిందూ శృతులను గూర్చి చర్చించుకుంటున్నారు. అటువంటి ఉన్నతమైన విషయాలను గూర్చి చర్చించబడుతున్నపుడు అందులో ఒక్కమాట కూడా తనకు అర్థము కానందున, నిస్పృహతో ఆయన కళ్ళవెంట ధారాపాతంగా కన్నీరు కారసాగింది. ఆయన కళ్ళు తెరచేటప్పటికి, తక్కిన వారందరూ వెళ్ళిపోయారు. భగవాన్ మాత్రమే అక్కడ ఉన్నారు. భగవాన్ జాలితో ఆయన వంక చూస్తూ "ఎందుకిలా కృంగిపోతారు? మీరు ఆత్మసాక్షాత్కారానికి ఈ జన్మలో అనర్హులైతే, ఇచ్చటికి రాగల్గేవారే కాదు. (ఇది మనందరికీ వర్తిస్తుంది) ఏ శక్తి మిమ్మల్ని ఇక్కడకు లాక్కుని వచ్చిందో, అదే మీరు ఆత్మసాక్షాత్కారం పొందేటట్లు చేస్తుంది. ఇవాళ కాకుంటే మరొకసారి దాని బాధ్యతను అది నిర్వర్తించి తీరుతుంది. మీరు నిస్పృహతో కృంగిపోవలసిన అవసరమూ ఏమీ లేదు. ఇది సాధు నటనానందలోని లోపాలన్నింటినీ తొలగించి, ఆయనలోని అజ్ఞానాన్ని పూర్తిగా నాశనం చేసింది. దీనితో ఆయన కూడా ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన మహనీయుడైనారు.

తనకు సాక్షాత్కారం లభ్యమైందని గ్రహించిన రోజున, లేదా తన స్వస్వరూపంగా తాను మిగిలిన రోజున ఆయన మరుగున పడిపోయారు. మరుగునపడి ఉండుటయే ఆయన సాక్షాత్కారం పొందారనటానికి బాహ్య చిహ్నంగా మిగిలింది. ఆయన ఏకాంతంగా, తన ఆత్మలో తాను రమిస్తూ ఉండేవారు. భగవాన్ మహాసమాధి చెందిన తర్వాత 1950 నుండి 1967 వరకూ చాలామందికి ఆయన బ్రతికి ఉన్న విషయమే తెలియదు. ఆయన తిరువణ్ణామలైలోనే ఒకకుటీరంలో ఉన్నప్పటికీ, ఆయన ఎక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియదు. చాలామంది పాతభక్తులలాగానే నేను కూడా, ఆయన చనిపోయారనే అనుకున్నాను.

నేను ఆశ్రమంలో ఏడు సంవత్సరాలు గడిపిన పిమ్మట నా స్నేహితులు దోరాబ్ ఫ్రేమ్‌జీ గారు "సాధునటనానంద గారు జీవించి ఉన్నారనే విషయం మీకు తెలుసా?" అన్నారు. ఆయన గ్రంథము "ఆధ్యాత్మిక ప్రభోదము" నాకెంతో ప్రియమైన గ్రంథము కాబట్టి, ఆయన జీవించి ఉన్నారని వినగానే నేను సంతోషంతో గంతులు వేశాను. ఆయన ఎంత నిరాడంబరులంటే ఆయన గదిలో కొన్ని గోచీ గుడ్డలుతప్ప వేరేమీ లేవు. ఆయన నన్ను ఆశీర్వదించి "మీరు ఏమిచేస్తున్నారు? ఆత్మ విచారణ అభ్యాసం చేస్తున్నారా?" అని అడిగారు. "నాకంత సామర్థ్యం లేదు. నేను కేవలం అరుణాచల శివ, అరుణాచల శివ అని జపం చేస్తుంటాను" అని నేను చెప్పగానే కోపంతో ఆయన ముఖం జేవురించింది. నేను అవాక్కయ్యాను. ఎందువల్లనంటే అది ఆయనతో నా మొదటి సమావేశం. అప్పటి వరకు నాకు కలసిన వారంతా నాతో కాలక్షేపం చేసేవారు. కానీ నటనానంద అలా చేయలేదు. ఆయన చాలా ఖచ్చితమైన, గంభీరముగా ఉండే వ్యక్తి. ఆయన కోపంతో మండి పడ్డారు. "నువ్వెంత మూర్ఖుడివి? నువ్వు భగవాన్ వద్దకు ఎందుకు వచ్చాననుకుంటున్నావు? ఆయన ఏ ప్రయోజనం కొరకు నిన్ను ఎన్నుకున్నారు? అది తనలాగా నిన్ను తయారుచేయడానికి కాదా? ఆయన సద్వస్తువు మీద రచించిన "ఉన్నది నలుబది" చదివి ఆత్మవిచారణ అభ్యాసం చెయ్యి. ఆత్మగా ఉండు. అందుకే నీవు ఎన్నుకోబడ్డావు." నేను మై మరచిపోయాను.

ఆయన పదుగురిలోనికి రావడానికి గానీ, ఆశ్రమానికి రావడానికి గానీ ఇష్టపడలేదు. దోరబ్‌ఫ్రేమ్‌జీ, ఆస్‌బోర్న్ ఇంటి ప్రక్కన గల ఒక కుటీరాన్ని ఆయనకొరకు చూశారు. నటనానంద అందులో 1981 వరకు ఉన్నారు. నాకు వెళ్ళాలనిపించినపుడు, ఆయన వద్దకు వెళ్ళటానికీ, ఆయనతో మాట్లాడటానికీ, నాభాగ్యం కొద్దీ నన్ను అనుమతించారు. ఒకసారి నేను ఆయనను, ఆయన గీసుకున్న గిరి నుండి బయటకు లాగి నేను ఆశ్రమం కోసం తయారుచేసే ఒక పత్రికోసం, ఒక వ్యాసం వ్రాసి ఇవ్వవలసినదిగా కోరాను. ఆయన అంగీకరించి, వ్యాసాన్ని నా చేతికి అందించారు. దురదృష్టవశాత్తూ దానిని నేను పోగొట్టుకున్నాను. నేను ఆయన వద్దకెళ్ళి "స్వామీ! నన్ను క్షమించండి. మీరు వ్రాసి ఇచ్చిన వ్యాసాన్ని పోగొట్టుకున్నాను. మీ ప్రతి (కాపీ) ఉంటే ఇవ్వండి. నేను జాగ్రత్తగా వ్యాసాన్ని కాపీ చేసుకుని, తిరిగి మీప్రతిని మీకు ఇచ్చివేస్తాను" అన్నాను. ఆయన నన్ను చూసి నవ్వి, గణేశన్, ఒకసారి నీ చుట్టూ ఏమున్నదో చూడు. నా గదిని చూడు. అందులో ఏమీ లేవు. పుస్తకాలూ, బట్టలూ, గిన్నెలూ, ఏ ఒక్క వస్తువూ లేదు". నేను ఆశ్చర్యంతో అడిగాను. "మీరేమంటున్నారు స్వామీ" అని. ఆయన ఇలా బదులిచ్చారు. "గణేశన్, నేను భగవాన్ మీద అనేక పద్యాలు వ్రాశానని నీకు తెలిసే ఉంటుంది. అవన్నీ అచ్చు వేయించబడినప్పటికీ, ఇక్కడ నీకు ఒక

పుస్తకమైనా కన్పిస్తుందా? భగవాన్ పట్ల నాకు కల్గిన ఆరాధనా భావాన్ని, వచన రూపంగా కానీ, పద్యరూపంగా కానీ వ్యక్తపరచగానే, దానిని భగవాన్ పాదాల చెంత అర్పించి వేస్తాను. నాకు సంబంధించినంతవరకూ అంతటితో నా పని అయిపోయినట్లే. భగవాన్ శరీరాన్ని వదలి వేసిన తర్వాత, నీలాగా కొద్దిమంది నన్ను వ్యాసాలు వ్రాసి ఇమ్మని కోరారు. నేను అలాగే తయారు చేసి, ఆశ్రమ యాజమాన్యానికి అప్పజెప్పేవాణ్ణి. నా బాధ్యత అంతటితో అయిపోయేది". చివరకు, మరల నాకు వ్యాసాన్ని వ్రాసి ఇచ్చారు. దానిని 1967లో అచ్చు వేయబడిన "Ramana Pictorial Souvenir" లో చూడవచ్చును.

నేను ఒకప్పుడు భగవాన్ పేరును ప్రచారం చేస్తున్న ఒక కుటుంబాన్ని ఆయన వద్దకు తీసుకెళ్ళాను. భగవాన్ యొక్క ఖ్యాతిని విస్తరింపజేయడానికి వారు చేస్తున్న కృషిని గూర్చి ఆయనకు చెప్పాము. నటనానంద కోపంతో ఉగ్రులైనారు. "ఏమి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు మీరు? మా గురువు గారి ఖ్యాతిని వ్యాప్తిచేయగలమని మీరు అనుకుంటున్నారా? మీరు అలా చెయ్యగలిగేది మీరు స్వయంగా స్వస్వరూపంలో నిలిచిపోవడం ద్వారానే. ఆయన బోధనలను, ఇప్పుడే ఇక్కడే ఆచరణలో పెట్టడం మొదలు పెట్టండి. అదే మీరు గురువు గారికి చెయ్యగలిగిన గొప్ప సేవ. మన గురువుకూ, ఆయన బోధకూ తేడా లేదు. భగవాన్ పట్ల మీకు గల భక్తిని వెల్లడి చెయ్యడానికి, ఆయన బోధనలను ఆచరణలో పెట్టడమే ఉత్తమ మార్గము. ఆ కుటుంబం భయపడిపోయి, మరల ఎన్నడూ నటనానందుల వారిని కలవడానికి వెళ్ళలేదు.

నటనానందుల ఆఖరి క్షణాలో, సాధుఓమ్, కుంజుస్వామి, కొంతమంది ఇతరులు, నేను, ఆయన ఎదురుగా ప్రార్ధన చేశాము. భక్తులు వారి యొక్క మరణసమయమంలో వారి శరీరంపై ఎటువంటి ధ్యాస లేకుండా ఉండడం నేను చూశాను. (ఆయన) నటనానంద, శరీరాన్ని వదిలి వేసే ముందు "స్వామి మీరెలా ఉన్నారు?" అని అడిగాను. "సంతోషంగాఉన్నాను" అని వారన్నారు. భౌతికంగా ఆయన తీవ్రమైన బాధలో ఉన్నారు. ఆయనను చూసిన ప్రతి వైద్యుడూ కూడా ఆయన తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్నారని అన్నారు. అయినప్పటికీ ఆయన నేనెంతో ఆనందంతో ఉన్నానన్నారు. అందుకని నేను ఆశ్చర్యంతో "ఆనందంతో ఉండటమంటే మీ ఉద్దేశ్యమేమిటి స్వామీ?" అని అడిగాను. "భగవాన్ ఫోటోను చూస్తే మీకే అర్థమవుతుంది" అని నటనానందులు అన్నారు. అవే ఆయన చివరి మాటలు. ఆయన నా దృష్టిని భగవాన్ వైపునకు మళ్ళించి, సంతోషంతో కళ్ళు మూసుకుని శరీరాన్ని వదిలివేశారు. ఈ జ్ఞాని యొక్క సమాధిని, దోరబ్ ఫ్రేమ్‌జీ వారి గృహ ఆవరణలో నిర్మించే భాగ్యం నాకు దక్కింది.



సాధు నటనానంద కు సంతాపం తెలియజేస్తున్న గణేశన్

మానవాసి రామస్వామి అయ్యర్



"1908లో మా తండ్రి గారు, నేను అరుణాచలానికి వెళ్ళాము. కార్తీక దీప ఉత్సవాల సమయం కాబట్టి పట్టణమంతా రద్దీగా ఉంది. విరూపాక్ష గుహలో ఉన్న బ్రాహ్మణ స్వామిని గురించి విని, మేమచటకు వెళ్ళాము. మేము గుహ వద్దకు జేరునప్పటికి ఒక ధృఢకాయుడైన వ్యక్తి ద్వారం వద్ద నిలబడి మమ్ములను లోనికి వెళ్ళనివ్వలేదు. "మాకు ప్రవేశము నిరాకరించడానికి, నీకేమి అధికారం వున్నది"' అని నేను ఎదిరించాను. అదృష్టవశాత్తూ స్వామి అప్పుడే బయటికి వచ్చారు. ఆయనను చూసి నేనెంతో సంతోషించాను. నన్ను నిరంతరం బాధిస్తున్న భౌతికమైన బాధల నుండి మానసిక దుఃఖం నుండి నన్ను విముక్తుడిని చేయవలసినదని ఆయనను కోరవలసినదిగా నాలో ఏదో ప్రేరణ కలిగింది. స్వామి నేను వైద్యుడినీ కాదు, జ్యోతిష్యుణ్ణీ కాను అని దూరంగా తొలగిపోసాగారు. పట్టువదలకుండా నేనాయన వెంటబడి ఇలా అన్నాను. "మీరు గొప్ప ఆధ్యాత్మిక స్థితిని పొందారని విని మీ చెంతకు వచ్చాను. ఈ బాధల నుండి విముక్తి అనేది నా ప్రారబ్ధంలో లేదు కాబోలు. అకస్మాత్తుగా స్వామి నడవటం ఆపి, నావైపు తిరిగి నిశితంగా చూస్తూ "ఇటువంటి సవాళ్ళను, నిబ్బరంగా స్వీకరించాలి. అనే ధృఢ నిర్ణయాన్ని మనసులో వృద్ధి చేసుకోవాలి. అప్పుడు ఏదీ నిన్ను బాధించలేదు. తర్వాత ఆశీర్వాద పూర్వకంగా ఆయన కుడి చేతిని పైకెత్తారు. అందులో నుండి కాంతి కిరణాలు ప్రసరింపబడి, నన్ను చుట్టుముట్టినట్లు నాకన్పించింది. ఒక మహోన్నతశక్తి తప్పని సరిగా నన్ను కాపాడుతుంది అనే ఉద్దేశ్యంతో భవిష్యత్తులో రాబోయే సవాళ్ళను స్వీకరిస్తాను అనే ధైర్యం నాలో నిండింది.

ఈ విశిష్టమైన భక్తుడే మానవాసి రామస్వామి అయ్యర్. పుట్టుకతోనే సవాళ్ళను ఎదుర్కొనే స్వభావం గల ఆయనకు 'అసాధ్యము' అనే మాటకు అర్థం తెలియదు. అది ఆయన పదకోశంలో లేదు. ఆయనలో ఉన్న ఈ సహజ లక్షణాన్నే భగవాన్ ప్రథమ పరిచయంలోనే ధృఢ పరిచారు. ఆధ్యాత్మిక సాధకులుగా, జబ్బుల వంటి భౌతిక సమస్యలు, సందేహాలనే మానసిక సమస్యలను మన జీవితంలో ఎదుర్కోవలసి ఉంటుంది. ఇక్కడ రెండు విషయాలు చాలా ముఖ్యమైనవి. సమస్యలను ధైర్యంగా, ఉన్నవి ఉన్నట్లుగా ఎదుర్కోవడం ఒకటి, రెండవది దైవము లేక గురువు అనబడే ఉన్నత శక్తి పట్ల విశ్వాసము, ఆయన మనకు మార్గం చూపుతారు, రక్షిస్తారు అనే నమ్మకం.

అయ్యర్ గారికి, ఆ యాత్ర చాలా ముఖ్యమైనది. ఆయన అక్కడకు కేవలం సందర్శకుడిగా వెళ్ళారు. కానీ ఆయన కొండపై నుండి క్రిందికి దిగిరాగానే, నాలుగు ఆలయ ముఖద్వారాలూ, పవిత్రమైన అరుణగిరి, అచటనున్న మహాత్ముని గొప్ప ఆధ్యాత్మిక శక్తి, ఆయను ఎంతగా ప్రభావితం చేశాయంటే, ఆయన అక్కడికే తన మకాం మార్చి,. దానినే తన స్థిర నివాసం చేసుకుందామని నిశ్చయించుకున్నారు. అపుడు భగవాన్ వద్ద ఒకరిద్దరు మాత్రమే ఉండుటచే, అక్కడ ఏ విధమైన ఆంక్షలూ ఉండేవి కావు. నిత్యమూ సాయంత్రంపూట భగవాన్ వద్దకెళ్ళి, రాత్రిపూట అక్కడే ఉండిపోయేవారు. సంగీతంలో అయ్యర్‌కు గల అభిరుచిని గుర్తించి, కృతులను ఎలా వ్రాయాలో భగవాన్ ఆయనకు నేర్పించారు.

ఇది కొత్తరకమైన తోలుబొమ్మలాటకు ప్రారంభమన్న మాట. మామూలు తోలుబొమ్మలాటలో తోలుబొమ్మలనాడించు వ్యక్తి దారాలను లాగడం ద్వారా, తన గానానికి అనుగుణంగా, తోలుబొమ్మల నాడించే వారు, ఈ నూతనమైన తోలుబొమ్మలాటలో గురువుగారు తాడులాగుతుంటే, అయ్యర్ గారు ఆడటం కాకుండా భగవాన్ గొప్పతనాన్నీ, భగవాన్ బోధలనూ వివరించే సంగీత విలువలు కల్గిన కృతులను వ్రాసేవారు.

ఒకరోజు పని పూర్తయ్యాక, అయ్యర్ గారు విరూపాక్ష గుహకు వచ్చి ఇంగ్లీషులో "స్వామీ జీసస్ క్రైస్ట్, బుద్ధుడు, ఇతర మహాత్ములు, పాపులను ఉద్ధరించడానికే ఈ లోకానికి వచ్చారు. నేను కూడా ఆశపెట్టుకోవచ్చునా?" అన్నారు. భగవాన్ ఆయనవైపు నిలకడగా చూసి, ఇంగ్లీషులో నిలకడగా అన్నారు. "అవును. ఆశ ఉన్నది?' ఈ సమాధానంతో చలించిపోయి,

అంతరాళాల్లో ఉప్పొంగిపోయిన ఆయనలో నుండి ఒక తమిళ కృతి పెల్లుబికింది. 'రమణా నీవు తప్ప నన్ను రక్షింపగల అన్యులెవరూ లేరు. (శరణాగతి). ఈ పాట తమిళ భక్తులలో ఇవాళ కూడా మంచి ప్రాచుర్యంలో ఉన్నది.ఒక రాత్రి విరూపాక్ష గుహలో, భగవాన్ దాదాపు అరగంట పాటు తన దృష్టిని అయ్యర్‌పై ప్రసరింపజేశారు. దానితో ఒక ఉష్ణ ప్రవాహం తనలోనికి ప్రవహించినట్లుగా ఆయనకు అనుభవమయింది. ఆయన మనస్సు అంతర్ముఖమై హృదయంలో విలీనమైపోయింది. మొదటి సారిగా, భగవాన్ ఒక సాధారణ సన్యాసి స్వామి కారనీ, ఒక అత్యంత శక్తివంతమైన ఆధ్యాత్మిక శక్తి కేంద్రమనీ అయ్యర్‌కు అర్థమయింది. ఈ ఆధ్యాత్మిక అనుభవం, ఆయనకు భగవాన్ పట్ల మరింత విశ్వాసాన్ని పెంచింది. అయ్యర్ అజీర్ణ రోగి. ఆయన జీర్ణశక్తి చాలా తక్కువగా ఉండేది. ఆయన ఈ విషయాన్ని భగవాన్‌తో చెప్పినపుడు, భగవాన్ ఆయన వైపు దృష్టిప్రసరింపజేశారు. అయ్యర్‌కు, తన మెదడు భాగం చల్లబడినట్లనిపించింది. తర్వాత కొద్దినాళ్ళలోనే పర్వదినాల్లో, ఎచ్చెమ్మాళ్ ఎన్నో రకాలైన బలకరమైన వంటకాలు, పిండివంటలు, నేతితోనూ, పంచదారతోనూ తయారుచేసిన తీపి వంటకాలూ భగవాన్ కొరకు తీసుకుని వచ్చింది. తన చుట్టూ ఉన్నవారందరితోనూ ఆహారాన్ని పంచుకునే అలవాటున్న భగవాన్ ఎచ్చమ్మాళ్‌తో, అయ్యర్‌ను పిలవమన్నారు. తన అజీర్తితో భయము చెందిన అయ్యర్, ఆ ఆహారాన్ని తీసికోవడానికి అంగీకరించక, "దయచేసి భగవాన్‌తో నన్ను క్షమించమని చెప్పండి. నేను అంత బలమైన ఆహారాన్ని తినలేను," అన్నారు. కానీ భగవాన్ వచ్చి, "నాతో పాటు తిందువు గాని" అనిపట్టుపట్టారు. భగవాన్ మాటకు తలొగ్గి, వేరే ఆలోచన లేకుండా, ఆ ఆహారాన్ని తీసుకున్నారు. దాని తర్వాత అజీర్తి పూర్తిగా తగ్గిపోయింది. తన జబ్బు నయం చేసిన భగవాన్ పట్ల కృతజ్ఞతతో, తన రెండవ గీతాన్ని వ్రాశారు. "దయతో నాకు స్వస్థతను ప్రసాదించినందుకు, నేనెలా కృతజ్ఞత తెల్పుకోగలను?" అని. అప్పటివరకు ఆయన ప్రతిరాత్రి భగవాన్‌తో గడపడానికి అభ్యంతరపెట్టిన ఆయన కుటుంబ సభ్యులు, ఈ అద్భుత సంఘటన జరిగిన తర్వాత భగవాన్‌పై విశ్వాసము పెంచుకున్నారు. అనతి కాలములో అయ్యర్‌కు ఉత్తర భారతదేశములోని బెహ్రమ్‌పూర్‌కు బదిలీ అయింది. బరువెక్కిన హృదయంతో, ఆయన అక్కడకు వెళ్ళారు. అక్కడ ఆయన పాదములు నెప్పి కల్గించే పుండ్లతో నిండిపోయాయి. ఎన్ని రకాలుగా వైద్యము చేయించినా, చివరకు శస్త్రచికిత్స చేయించినా గుణం కన్పించలేదు. అంతబాధలోనూ, ఆయన ఆఫీసు విధులకు హాజరు కావలసివచ్చింది. ఆయన ఆర్తితో భగవాన్ సాయం కోసం ప్రార్థించారు. మర్నాడు ఎవరో ఆయన తలుపుతట్టారు. ఆయన తలుపులు తెరచినపుడు ఇద్దరు సాధువులు నిలబడి ఉన్నారు. "మేము యాత్రలు చేస్తున్నాము. మేము అరుణాచలము నుండి వచ్చాము. మేము బయల్దేరే ముందు భగవాన్, బెహ్రామ్‌పూర్ వెళ్ళి మిమ్ములను కలవమని చెప్పారు. ఆయన వారికి సాదరంగా ఆతిథ్యమిచ్చారు. అయ్యర్ వ్రణాల నెప్పితో బాధపడడం గమనించి వారు చింతపండుతోనూ, సాంబ్రాణితోనూ, ఒక గుజ్జును తయారు చేసి ఆయన పుండ్లపై వ్రాశారు. ఆ మర్నాడే ఆయనకు పూర్తిగా నయమై పోయింది. ఈ అద్భుతంతో భగవాన్ పట్ల భావోద్వేగపూరితమైన భక్తి పాట రూపంలో ఒక్కసారిగా పెల్లుబికింది. అదే ప్రస్తుతం భగవాన్ భక్తులకు అత్యంత ఇష్టమైన శరణాగతి పాట. "మీకు నా శరణాగతి. మీకు తప్ప వేరెవరికి నేనుశరణాగతి చెందగలను? భక్తులకు మోక్షాన్నిచ్చే అరుణాచలేశ్వరునిలో పరిపూర్ణంగా ఐక్యమైన ఓ రమణా! కరుణను వర్షించే మేఘమా! నీ కృపా దృష్టిని నాపై ప్రసరింపజేయుటకు ఇది తగిన సమయము కాదా? నీవు ఆలస్యము చేస్తే నేనేమి చెయ్యాలి? నా ప్రియతమా! నా దుఃఖమును పోగొట్టి, నాకు ఆనందమును ప్రసాదించు. నీ నిర్లక్ష్యాన్ని నేను ఏ మాత్రమూ భరించలేను. బ్రహ్మమే అయిన మీకు నా శరణాగతి".

నేను అయ్యర్ గారితో బాగా సన్నిహితంగా ఉండేవాడిని. ఆయన ఈ పాట గురించి ముచ్చటిస్తూ, నాతో ఇలా అన్నారు. "గణేశన్, దీనిలోని చక్కదనాన్ని చూడు, ఈ పాట వలన జబ్బు నయమవలేదు. అప్పటికే జబ్బు నయమైపోయింది. నా స్వశక్తితో నేను ఈ పాట వ్రాసి ఉంటే, నా జబ్బును నయం చేసినందుకు కృతజ్ఞతతో భగవాన్‌కు ధన్యవాదములు తెలుపుతూ వ్రాసి ఉండేవాడిని. ఆ పాటను చూడు "నీ కృపాదృష్టిని నాపై ప్రసరింప జేయుటకు ఇది సరియైన సమయం కాదా? నీవు ఆలస్యము చేస్తే నేను ఏమి చెయ్యాలి? నా ప్రియతమా నా దుఃఖమును పోగొట్టి, నాకు ఆనందమును ప్రసాదించు. నీ నిర్లక్ష్యమును, నేను ఏ మాత్రము భరించలేను" ఇది ఆ అద్భుతం జరిగిన తర్వాత వ్రాయబడినది. మీరాబాయి, తుకారామ్ వంటి వారల కవితలో కూడా ఈ విధంగానే ఉండడం గురించి ఆయన నాతో చెప్పారు. వారు "ఈ నీచమైన కుక్కను

అనుగ్రహించు అని వ్రాశారు. దైవం వారిని అనుగ్రహించిన తర్వాతనే వారిటువంటి కవితలు వ్రాశారు. ఆ తర్వాత ఆయన భగవాన్, అరుణాచలునిపై వ్రాసిన పదకొండు పద్యములను ఉదహరించారు. "ఓ అరుణాచలా! పేరైనా పూర్తిగా తలచక ముందే పట్టి లాగితివి. వెంటనే నన్ను చంపెయ్యాలనుకున్నావు. నాలాంటి బలహీనులు తప్పు చేశారని, ఆపనిని అసంపూర్తిగా వదిలి వేశావు? నువ్వు నన్ను చంపివెయ్యలేదు. ఆ పనిని సగములో వదిలి వేశావు. ఇప్పటికైనా ఆ పనిని పూర్తి చెయ్యి ప్రభూ!" అయ్యర్ అన్నారు. "అదంతా భగవాన్‌కు ఎప్పుడో జరిగిపోయింది. అయినా దీనిని భగవాన్ ప్రార్థనగా వ్రాశారు. "నేను మహాపాపిని. నన్నుకాపాడు" అని మాణిక్యవాచగర్ ఎందుకు వ్రాయాలి? ఆ ప్రార్థన వలన భగవంతుడు వచ్చి ఆయనను కాపాడలేదు. తన అక్షరమణమాలలో నేను నిన్ను విడిచి పెట్టకుండా మరణించేటట్లు నన్ను అనుగ్రహించు. లేనిచో నా ప్రారబ్ధ కర్మ బాధాకరంగా ఉంటుంది. నీ చేతిని నా తలపై ఉంచి నీ అనుగ్రహాన్ని నేను పొందునట్లు చెయ్యి. ఓ అరుణాచలా! నాతో ఐక్యమయి, మన భిన్నవ్యక్తిత్వాలను రూపుమాపి, నాకు నిరంతర పరమానందస్థితిని అనుగ్రహించు. ఇది ప్రార్థన వలె కన్పిస్తుంది. చాలామందికి ఈ సందేహం వచ్చి భగవాన్‌ను అడిగారు. 'మీరు ఒక జ్ఞాని. మీరెందుకు "నన్ను కాపాడు. పతనమైపోకుండా చూడు" అని వ్రాశారు? దానికి జవాబు, "అది అప్పటికే జరిగిపోయింది. మనము ముందుగానే భగవత్కృప కోసం ప్రార్థించాల్సింది. భగవంతుడు దయామయుడు కనుక తన అనుగ్రహాన్ని ముందుగానే ఇచ్చి, తర్వాతే మన ప్రార్థనను స్వీకరిస్తారు. మనం ఆలస్యంగా ఇచ్చినా గూడా," అని చెప్పారు భగవాన్.

1922లో భగవాన్, అయ్యర్‌ను మృత్యువు నుండి కాపాడారు. ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన కపాలి శాస్త్రి తన గ్రంథంలో వ్రాశారు. "మహర్షి స్కందాశ్రమంలో ఉండేవారు. మాలోకొంతమందిమి మహర్షితో పాటు గిరి ప్రదక్షిణ చేసేవారము. అలాంటి ఒక రోజు మా గిరి ప్రదక్షిణ ప్రారంభించబోయే ముందు, సూపర్‌వైజర్ రామస్వామి అయ్యర్ అకస్మాత్తుగా జబ్బుపడి విరూపాక్ష గుహ వద్ద ఉన్నారని కబురు వచ్చింది. మహర్షి కొండ దిగి, అయ్యర్ పడుకుని ఉన్నచోటుకు వెళ్ళారు. ఆయన హృదయ కంపనాలు (గుండె అపసవ్యంగా కొట్టుకోవడం) తీవ్రంగా ఉన్నాయి. మహర్షి ఆయన వద్ద కూర్చుని తన చేతిని ఆయన తలపై ఉంచారు. అయిదునిమిషాలలో అయ్యర్ పూర్తి స్వస్థత చెంది లేచి కూర్చున్నారు. మహర్షి మాత్రం గంట తర్వాత కూడా కూర్చునే ఉన్నారు. స్కందాశ్రమంలోని నా సంచిలో ఆలివ్ నూనె ఉన్నది. నేనువెళ్ళి ఆ నూనె తీసుకుని వచ్చి మహర్షి తలపై రుద్దాను. తర్వాత మేమందరం స్కందాశ్రమానికి వెళ్ళాము. నేనా విషయమై అడుగగా, మహర్షి అతి సాధారణంగా "అవును అయ్యర్ పైకి లేచారు. నేనుకూర్చునే ఉన్నాను. తలమీద నూనె రుద్దబడినపుడు సుఖంగా అన్పించింది" అన్నారే గానీ, తను చేసిన అద్భుతాన్ని గురించి మాట్లాడలేదు.

తర్వాత 1942లో గూడా అయ్యర్ మృత్యువాత పడకుండా కాపాడబడ్డారు. ఒక రోజు ఆయన భార్య, మహర్షి వద్దకు పరుగున వచ్చి ఇంటివద్ద స్పృహ లేకుండా పడి ఉన్న తన భర్తను కాపాడమని ఆయను ప్రార్థించింది. సరిగ్గా అదే సమయానికి అయ్యర్ ఇంటి వద్ద లేచికూర్చున్నారు. కొన్నిసంవత్సరాల తర్వాత నేను దానిని గురించి విన్నాను. నాకు కొద్దిగా సందేహం (అపనమ్మకం) ఉన్నది. అందుకని నేను అయ్యర్ గారితో అన్నాను. "ఏమిటండీ! ప్రతిసారీ మీరు తీవ్రంగా జబ్బు పడడం, భగవాన్ మిమ్ములను మృత్యువు నుండి కాపాడటం. ఇది ఎలా సంభవం?". ఆయన జవాబు ఇచ్చారు. "ఏమి చేస్తాం గణేశన్? ఆయన కేవలం నన్ను మాత్రమే కాపాడలేదు. నిజాయితీ గల ఇతర భక్తులను కూడా మృత్యువు కోరల నుండి కాపాడారు." అని ఆయన నాకు ఒక జాబితా ఇచ్చారు. ఆయన కుమార్తె, ఆయన స్నేహితుడు సుబ్రమణి అయ్యర్ కుమార్తె, జగదీశ శాస్త్రి, భగవాన్ సోదరి భర్త, ఇంకా నాకు తెలియని వ్యక్తుల పేర్లు ఆ జాబితాలో ఉన్నవి.

అయ్యర్ గార్కి అయిదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భగవాన్, అయ్యర్ కుటుంబం పట్ల శ్రద్ధ కలిగి ఉండేవారు. అయ్యర్ కుటుంబంలోని ప్రతివ్యక్తీ, భగవాన్ పట్ల పూర్తి భక్తి కలిగి ఉండేవారు. నేను ఆశ్రమానికి వచ్చినపుడు వారి గురించీ, భగవాన్‌తో వారికి గల అనుబంధం గురించీ తెలుసుకోవాలనుకున్నాను. అందుకని మౌంటెన్ పాత్ పత్రిక కొరకు, ఆమెను ఇంటర్వ్యూ చేయడం కోసం బొంబాయిలో ఉంటున్న అయ్యర్ గారి కుమార్తెలలో ఒకరి ఇంటికి వెళ్ళాను.

ఆమె పేరు లలితా వెంకటరామన్. ఆమె ఒక పేరుగాంచిన సంగీత కళాకారిణి. భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నప్పటి నుండి తమ కుటుంబ సభ్యులకు, భగవాన్‌కు గల అనుబంధాన్ని గురించి ఆమె చెప్పారు. వారందరికీ భగవానే దైవము. ప్రతిసారీ, వారు అరుణాచలాన్ని విడిచి వెళ్ళేటప్పుడు, వారందరూ భగవాన్ ఎదుట నిలిచి ముక్తకంఠంతో శరణాగతి పాట పాడేవారు. దానివల్ల ఈ పాట రెండు దశాబ్దాల పాటు పదేపదే భగవాన్ సన్నిధిలో పాడబడేది. అందువల్లనే మా తండ్రిగారు "శరణాగతి రామస్వామి అయ్యర్" లేదా 'శరణాగతి తాత' అని పేరుపొందారు. మా భర్తగారు ఉద్యోగరీత్యా ఉత్తర భారతదేశంలో ఉండుట వల్ల నేను చాలా అరుదుగా మాత్రమే తిరువణ్ణామలై రాగలిగేదాన్ని. నేను ఆశ్రమంలో ఉన్నపుడల్లా వీణవాయించుతూ పాడుతుంటే, భగవాన్ చిరునవ్వుతో వింటుండేవారు. ఒకసారి చాలా కాలం తర్వాత తిరువణ్ణామలై వచ్చి, ఆశ్రమంలోనికి ప్రవేశించినప్పటికీ, భగవాన్ "చూడండి. ఇవాళ ఉదయమే మనము రేడియోలో ఆమె గొంతు విన్నాము. ఇప్పుడామె ఇక్కడ ఉన్నారు" అన్నారు. అక్కడ నేను భగవాన్ మీద రెండు పాటలు రికార్డు చేశాను. వాటిలో ఒకటి ఆ రోజు ఉదయం ప్రసారము చెయ్యబడి ఉంటుంది.

నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు, విరూపాక్ష గుహలో భగవాన్‌తో ఆడుకునే దాన్ని. కానీ నాసోదరి రాజం, భగవాన్‌చే ఎక్కువ దగ్గరకు తీయబడేది (ముద్దు చెయ్యబడేది). ఆయన ఆమె జడవేసేవారు. వారిద్దరూ ఆమె బొమ్మలతో ఆడుకునే వారు. నా సోదరికి, భగవాన్ అంటే ఎంత ఇష్టమంటే, ఆమెకెప్పుడైనా ఇంటి వద్ద ఏదైనా రుచికరమైన పదార్థం లభ్యమైతే, దానిని తీసుకుని విరూపాక్ష గుహకు పరుగున వెళ్ళి, భగవాన్‌తో కలసి దానిని పంచుకునేది. ఒక రోజు ఒకప్రత్యేకమైన రకం వడ్లను మా ఇంటికి తీసుకునివచ్చి దంచుతున్నారు. వాటి నుండి వచ్చే తవుడు రుచిగా, తియ్యగా ఆరోగ్యకరంగా ఉండేది. దంచే ఆవిడ ఈ విషయాన్ని మా సోదరితో చెప్పగానే ఈమె గుప్పెళ్ళ నిండా ఆ తవుడు తీసికొని భగవాన్ వద్దకు పరుగెత్తింది. ఆమె ఆ సమయంలో అక్కడకు రావడం చూచి "నా కోసం ఏమైనా తెచ్చావా?" అన్నారు భగవాన్. ఆమె ఆయనకు ఆ తవుడు ఇచ్చింది. వారిద్దరూ దానిని తిన్నారు. కొన్ని ఇతర దినుసులతో కలిపి తింటే ఆ తవుడు మరింత రుచిగా ఉంటుందని భగవాన్ ఆమెతో అన్నారు. భగవాన్‌తో కలసి, ఇటువంటి విషయాలు ఆనందించినప్పటికీ, అనుక్షణం తాను భగవంతుడితోనే ఉన్నానని ఎఱుకతో ఉండేది. తన జీవితమంతా ప్రతి క్షణం ఆయనను పూజించేది.

కొద్దిసేపు తరువాత ఆమె అన్నారు "మా అక్క రాజమ్ చాలా మంచి చిత్రకారిణి (పెయింటర్). ఆమె ఎప్పుడూ ఎవరి వద్దా, ఏ పాఠశాలలోనూ రంగులతో బొమ్మలను చిత్రీకరించటం నేర్చుకోకపోయినప్పటికీ, ఆమె గీసిన చిత్రాలూ, పెయింటింగులూ కూడా జీవకళ ఉట్టిపడుతూ ఉండేవి. ఆమె పెద్దయిన తర్వాత ఆమె దేవతల చిత్రాలను రంగులతో చిత్రీకరించేది. వాటిని ఆమె భగవాన్‌కు చూపగా ఆయన వాటిని మెచ్చుకునేవారు. ఒకప్పుడు రాజం, వివాహిత స్త్రీలు పూజించే వరలక్ష్మీదేవి చిత్రపటాన్ని అందంగా రంగులతో చిత్రీకరించింది. ఆమె ఆ చిత్రాన్ని భగవాన్‌కు చూపించినపుడు భగవాన్ వాటిని అచ్చువేయించి పంచి పెట్టమని చెప్పారు. రాజం, అడుక్కుని అప్పు చేసి డబ్బు సంపాదించి, దానిని ప్రింటు వేయించింది. 1940లోను 1950లోనూ చాలామంది (పూజా గృహాలలో) సనాతన సంప్రదాయ పరులైన బ్రాహ్మణుల పూజా గృహాలలో ఆ చిత్రం ఉండేది. లలితా వెంకట్రామన్, నన్ను వాళ్ళ మేడ మీద ఉన్న పూజాగదిలోనికి తీసుకొని వెళ్ళి రాజంచే చిత్రీకరింపబడిన రెండు అందమైన చిత్తరువులను చూపించింది. ఒకటి మధుర మీనాక్షిది, రెండవది త్యాగరాజస్వామిది. అప్పుడు రమణులు నెమలి మీద కూర్చుని ఉన్నట్లుగా ఉండి, క్రింద రాజమ్మాళ్ అని సంతకం చేయబడిన, స్కందాశ్రమంలో ఉన్న చిత్తరువు గుర్తునకు వచ్చింది.

తన జీవిత పర్యంతము, ఒక అంకిత భక్తుడుగా అయ్యర్ ఉండిపోయారు. 'భగవాన్' అనే మాట వినగానే, ఆయన కళ్ళ వెంట నీరు కార్చేవారు. 1922లో అమ్మ అళగమ్మాళ్ స్కందాశ్రమంలో ముక్తినొందినపుడు అక్కడ ఉండే భాగ్యం అయ్యర్ గారికి దక్కింది. భగవాన్ తల్లి చెంత కూర్చుని, ఆమెకు మోక్షం కల్గించడానికై తన పవిత్ర హస్తాలను, తల్లి శిరస్సు మీద, గుండెల మీద ఉంచినపుడు, అయ్యర్ రామ నామాన్ని ఉచ్చరిస్తూనే ఉన్నారు. అమ్మ అళగమ్మ శరీరాన్ని పై నుండి క్రిందకు తెచ్చిన వారిలో అయ్యర్ ఒకరు. అమ్మ భౌతిక కాయాన్ని సమాధి చేసే వరకు, సమాధి చెయ్యడం పూర్తయే వరకు అయ్యర్,

భగవాన్‌తోనే ఉన్నారు. పదవ రోజున ఒక లింగాన్ని ఆ సమాధిపై ప్రతిష్ఠించారు. బుద్ధుడు, జీసస్‌క్రైస్ట్, ఆది శంకరాచార్యులు మొదలగు వారి తల్లుల కంటె, అమ్మ అళగమ్మాళ్ గొప్పది అని స్తుతిస్తూ, కావ్యకంఠ గణపతి ముని ఒక ప్రార్థనా గీతాన్ని సంస్కృతంలో ఆశువుగా చెప్పారు. జన సమూహంలో ఒక మూలనెక్కడో కూర్చుని ఎంతో శ్రద్ధగా ఆ పాటను వింటున్న అయ్యర్‌ను భగవాన్ పిలిచి, తమిళంలో ఒక కృతిని వ్రాయమని ప్రోత్సహించారు. దుఃఖంలో మునిగి ఉన్నప్పటికీ అయ్యర్ ఆ మాటను శిరసావహించారు. అప్రయత్నంగా ఒక కృతి ఆయన నుండి వెలువడింది. దానిని ఒక కాగితంపై వ్రాసి భగవాన్‌కిచ్చారు. భగవాన్ ఆ కృతినిపాడమని అయ్యర్‌ను కోరారు. దానిని ఆలపిస్తున్నపుడు ఆ కృతి ఎంత బాగా వచ్చిందో ఆయనకు అర్థం అయింది.

భగవాన్ 1950లో మహా నిర్యాణం చెందినపుడు, తోకచుక్క లాంటి వెలుగు పైకెగసి అరుణాచలంలో ఐక్యమవడాన్ని ఆయన చూశారు. ఆయనకు సన్నిహితంగా ఉండే ఆయన అభిమానులైన కి.వా. జగన్నాథన్ వంటి వారు అయ్యర్ గారిని జ్ఞానిగా గౌరవిస్తారు. 1960లో తమిళనాడులో బాగా పేరుపొందిన రచయిత ఒకరు, తనను అయ్యర్‌గారింటికి తీసుకుని వెళ్ళమని నన్ను కోరారు. అప్పుడు ఆశ్రమానికి ఎదురుగా ఉన్న ఇంటిలో వుంటున్న అయ్యర్ జబ్బుతో మంచాన ఉన్నారు. ఆ రచయిత అయ్యర్‌ను చూడగానే చేతులు పైకెత్తి, శిరస్సుపై జోడించి, ఈశ్వరా, ఈశ్వరా అంటూ ఆయన మంచం చుట్టూ కన్నీరు కారుస్తూ తిరుగసాగారు. ఆయన అప్పుడు అయ్యర్‌ను పొగుడుతూ ఆసువుగా పద్యాలు చెప్పసాగారు. అది ఒక అద్భుత దృశ్యము. మనుషులు భావోద్రేకం లోకి వెళ్ళి కన్నీరు కారుస్తారని విన్నానే కానీ ఇప్పటి వరకూ చూడలేదు. ఆ రోజు అదినేను చూడడం జరిగింది. మేము తిరిగి వచ్చేటప్పుడు, కి.వా. జగన్నాథన్ నాతో అన్నారు. గణేశన్ ఆయనను ఆరాధించు (గౌరవించు). ఆయన ఆశీర్వాదాన్ని పొందు. ఆయన సాధారణత్వము అనే ముసుగు కప్పుకున్న ఆత్మసాక్షాత్కారం పొందిన మహనీయుడు. ఆయన ఆశీర్వాదాన్ని పొందే అవకాశం పోగొట్టుకోబాకు. అవి నిన్ను ఆధ్యాత్మిక మార్గంలో ఎంతో దూరం తీసుకుని వెళ్తాయి. ఆయన సలహా వల్ల నాకు అయ్యర్ గారి ఆశీర్వాదాన్ని తీసుకునే భాగ్యం కల్గింది.

అయ్యర్ చెన్నైలో మరణించారు. ఆయన ఆఖరి క్షణాలు ఎంతో ప్రశాంతంగా గడిచిపోయాయి. అరచేతులను హృదయం మీద పెట్టుకుని కనుకొలకుల నుండి ఆనంద భాష్పాలు కారుతుండగా, భగవాన్‌నే ఆయన తన హృదయంలో చూస్తున్నారని అందరికీ అర్థమైంది. నెమ్మదిగా ఆయన శ్వాస నిలిచిపోయింది. ఇప్పుడిహ మానవాసి రామస్వామి అయ్యర్ అరుణాచలంలో శాశ్వతంగా ఐక్యమైనారు.



భగవాన్‌తో మానవాసి వారి కుటుంబం

ఫ్రాంక్ హంఫ్రీస్



ఒకప్పుడు ఒక వ్యక్తి భగవాన్‌ను చూచుటకు విరూపాక్ష గుహకు వచ్చారు. ఆయన వారం రోజులు మాత్రమే ఉన్నారు. ఆ సమయంలో ఆయన భగవాన్‌ను పొగుడుతూ నాలుగు పాటలు పాడారు. ఆయన తన పేరు వెంకట్రామ అయ్యర్ అనీ, తిరువణ్ణామలై సమీపంలోని సత్యమంగళం నుండి వచ్చానని చెప్పారు. తర్వాత ఆయన 'రమణ సద్గురు' అనే బాగా ప్రశస్తమైన పాటను, ఐదవ పాటను పంపించారు. రమణులు ఆ అయిదు పాటలను చదివినపుడు వాటి అందానికి ముగ్ధులైనారు. అప్పటి నుండి తమిళం మాట్లాడే భక్తులందరూ, ఆ పాటలను పాడుకుంటూనే ఉన్నారు. విచిత్రమేమిటంటే కొందరు పాత భక్తులు వెంకట్రామ అయ్యర్‌ను కలుసుకోవడానికి సత్యమంగళం వెళ్ళి వాకబు చెయ్యగా, ఆ గ్రామస్తులెవరికీ ఆయన గురించి తెలియదని చెప్పారు. తర్వాత కాలంలో భక్తులు ఈ విషయమై చర్చించుకొనుచుండగా, దేవరాజ ముదలియార్ ఇలా అన్నారు. "విరూపాక్ష గుహలోనున్నపుడు అరుణాచలుని స్తుతిస్తూ భగవాన్ అయిదు పద్యాలు వ్రాశారు. తండ్రి అరుణాచలేశ్వరుడు తన కృతజ్ఞత తెల్పుకోవడానికై వెంకటరామన్ అయ్యర్ పేరుతో మానవరూపంలో ఇచటికి వచ్చి భగవాన్‌పై అయిదు పద్యాలు పాడారు".

వాటిలో ఒక పద్యంలో కోట్లకొలది జీవులకు ముక్తిమార్గాన్ని చూపటానికై జెండా ఎగురవేశావు. కోటి అంటే ఎంత? ఒకటి తర్వాత కొన్ని సున్నాలు. విలువలేని సున్నాలనుతీసివేస్తే, ఉనికే లేని కోటి అహంకారాలనూ రూపుమాపితే మిగిలేది ఒకటే ఒకటి. అదే అరుణాచలుడు, అదే రమణులు. అదే ప్రతి ఒక్కరూ. అంతేకానీ రామ్, రహీమ్, రోనాల్డ్ అని మనలను మనము భావించుకునేవి సత్యములు కావు.

మన యొక్క స్వస్వరూపమును, దివ్యత్వమును మనకు గుర్తు చెయ్యడము కొరకే రమణులు అరుదెంచారు. పురుషులు గాని, స్త్రీలు గాని జంతువులు గాని, ఏ ఒక్క జీవి కూడా, ఆయన అనుగ్రహమునకు పాత్రులు కాకుండా ఉండలేరు. అప్పటివరకూ ఆయన భక్తులందరూ హిందువులు. ఇటుపై ఆయన బోధలు, దేశము, మతము అనే పరిధులను దాటి, విస్తరించవలసిన సమయము వచ్చింది. అలాగే విస్తరించింది కూడా. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే వేలాది మంది సాధకులకు, వారి వారి విశ్వాసము లను వారు వదలుకునే అవసరము లేకుండా, భగవాన్ బోధ అందజేయబడింది.

ఫ్రాంక్ హంఫ్రీస్ అనే ఆయన ఒక యువకుడైన బ్రిటీష్ పోలీస్ ఆఫీసరు.ఆయన కాథలిక్ మతస్థుడు. ఇంగ్లండు నుండి ముంబైకు బదిలీ గావింపబడ్డ ఆయన వచ్చీ రావడముతోనే జ్వర తీవ్రతతో ఆస్పత్రిలో జేర్చబడ్డారు.

అతీంద్రియ శక్తులను కలిగియున్న ఫ్రాంక్ హంఫ్రీస్ ఆ శక్తులను ఉపయోగించుకుని ఆస్పత్రిలో ఉన్నపుడు అనుభవించిన తీవ్రమైన బాధను తగ్గించుకున్నారు. తర్వాత ఆయన వేలూరుకు వెళ్ళి, అక్కడ తనకు తెలుగు నేర్పడానికై నియమింపబడ్డ నరసింహయ్య అనే ఆయనను చూశారు. ఫ్రాంక్ హంఫ్రీస్ పోలీస్ ఆఫీసర్‌గా వేలూరులో నియమింప బడ్డారు. తర్వాత హంఫ్రీస్ వేలూరు వచ్చినపుడు నరసింహయ్య గారు తనను తాను పరిచయము చేసుకొనబోగా "నాకు తెలుసు" అన్నారు హంఫ్రీస్. ఆ టీచరు గారు ఆశ్చర్యంతో "ఎలా తెలుసును?" అని అడిగారు. "నేను నా సూక్ష్మ శరీరముతో వచ్చి మిమ్ములను చూశాను" అన్నారు హంఫ్రీస్. ఇంతకు ముందు నరసింహయ్యగారు అనేకమంది బ్రిటీష్ అధికారులకు తెలుగు నేర్పారు గానీ, వారెవ్వరికీ ఆధ్యాత్మికత పట్ల అనురక్తి లేదు. వారు ఆధ్యాత్మికత పట్ల విముఖులు. అందుకని ఆ పంతులు గారు, హంఫ్రీస్ ఒక పిచ్చివాడై ఉంటారనుకున్నారు.

హంఫ్రీస్, నరసింహయ్య గారిని ఈ విధంగా కోరారు. "నేను ఇంగ్లీషులో ఉన్న ఒక హిందూ జ్యోతిష శాస్త్ర గ్రంథమును చదువవలెననుకుంటున్నాను. మీరు నాకు సహాయపడతారా?". ఇది ఇంకొక వెఱ్ఱిమొఱ్ఱి ప్రశ్నగా భావించిన నరసింహయ్య గారు దాన్ని గురించి పట్టించుకొనలేదు. అది చూచి, "ఇక్కడెవరైనా మహాత్ములు ఉన్నారా?" అని హంఫ్రీస్ తన ధోరణిని కొనసాగించారు. ఈ ప్రశ్నతో నరసింహయ్యగారు ఉలిక్కి పడ్డారు. ఆయన హంఫ్రీస్‌ను పరీక్షింపదలచుకున్నారు. ఆయన మర్నాడు చాలామంది మహాత్ముల ఫోటోలను తీసుకొని హంఫ్రీస్ గదిలోనికి వెళ్ళారు. అక్కడ ఎవరూ లేకపోవుటచే ఆ ఫోటోలను టేబుల్‌మీద పెట్టి వెళ్ళిపోయారు. ఆయన తిరిగి వచ్చేటప్పటికి హంఫ్రీస్ కూడా వచ్చారు. ఆ ఫోటోలలో నుండి ఒక ఫోటోను

తీసి, "నరసింహయ్యా, ఈయన మీ గురువు గారు కదూ?" అని కావ్యకంఠ గణపతి ముని ఫోటో చూపి అడిగారు. కావ్యకంఠులు నిజంగానే నరసింహయ్యగారి గురువు. ఆశ్చర్యానందాల్లో మునిగిన నరసింహయ్య గారు హాంఫ్రీస్ నమ్మదగిన వ్యక్తేనని, కాకపోతే అన్ని వింతైన సంఘటనలు యాధృచ్ఛికంగా జరిగి ఉండేవి కావని అనుకున్నారు. "క్రితం రాత్రి మీ గురువు గారు నా కలలోకి వచ్చి మంచం మీద నా పక్కన కూర్చుని నాకర్థం గాని భాషలో ఏదో చెప్పారు" అని హంఫ్రీస్, నరసింహయ్య గారితో చెప్పారు. దీనితో నరసింహయ్య గార్కి నమ్మకం కుదిరింది.

దురదృష్టవశాత్తూ హంఫ్రీస్ జబ్బు పడటం వల్ల ఊటీ అనే వేసవి విడిదికి వెళ్ళి కొన్ని నెలలు గడపవలసి వచ్చింది. తిరిగి వచ్చిన తర్వాత ఆయన నరసింహయ్య గారితో ఇలా అన్నారు. "రాత్రినాకొక కల వచ్చింది. నేను నోటితో చెబితే మీరు నమ్మకపోవచ్చును. నేను చూసిన దానిని నేను బొమ్మగీసి చూపిస్తాను" అని, ఒక కొండను, దానిపై ఒకగుహను, దాని పక్కన ఒక చిన్న జలపాతాన్ని, అక్కడ నుంచుని వున్న ఒక సాధువుని గీశారు హంఫ్రీస్. అది విరూపాక్ష గుహ, రమణ మహర్షిల చిత్రమే. నరసింహయ్యకు నోట మాట రాలేదు. ఆయన మా గురువు గారికి గురువు గారు. ఇప్పటికి హంఫ్రీస్‌పై పూర్తిగా నమ్మకం కుదిరి ఆయనను భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళదలచారు. ఆయన మొదట హంఫ్రీస్‌ను వేలూరులో నున్న కావ్యకంఠ మునికి పరిచయం చేశారు. కేవలం 21 ఏళ్ళ వయస్సులో పోలీస్ సూపరింటెండెంట్ అయిన ఆ బ్రిటీష్ యువకుని చూచి కావ్యకంఠులు ఆశ్చర్యపోయారు. అపుడు తిరువణ్ణామలైలో థియోసోఫికల్ సొసైటీ వారి సమావేశాలు ఉన్నాయి. వాటిలో కావ్యకంఠుల వారు పాల్గొనవలసి యుండుటచే ముగ్గురూ తిరువణ్ణామలై వెళ్ళారు.

గమ్యం చేరగానే, కలలో చూచిన మహాత్ముని చూడవలెనని హంఫ్రీస్ తహతహలాడారు. వారు విరూపాక్ష గుహకు వెళ్ళి భగవాన్ ఎదురుగా కూర్చున్నారు. భగవాన్ దృష్టి హంఫ్రీస్‌పై చాలాసేపు నిలిచిపోయింది. భగవాన్‌తో తన మొదటి సమావేశం గూర్చి హంఫ్రీస్ ఇలా చెప్పారు. "మధ్యాహ్నంరెండు గంటలకు ఆయనను చూడడానికి మేము కొండపైకి వెళ్ళాము. విరూపాక్ష గుహజేరుకున్న తరువాత, ఏమీ మాట్లాడకుండా ఆయన పాదాల వద్ద కూర్చున్నాము. ఈ విధంగా చాలాసేపు కూర్చున్నాము. నేను నాలో నుండి పైకి లేచినట్లనిపించింది. నేను అరగంటసేపు మహర్షి కళ్ళలోకి చూస్తూ ఉన్నాను. గాఢ ధ్యానావస్థలో ఉన్నట్లున్న ఆయన కళ్ళలో ఏ కదలికా లేదు. ఈ శరీరం పవిత్రమైన ఆత్మకు దేవాలయం వంటిది అని నాకన్పించింది. ఈ గురువుగారి శరరీం, ఒక మానవ మాత్రుడు కాదు. ఆ శరీరం ఏదైతే కూర్చుని నిశ్చలంగా శవం వలె ఉన్నదో, అది కేవలం భగవంతుడి చేతిలోని పనిముట్టు (పరికరం). అందులో నుండి దైవ ప్రకాశం బలీయంగా ప్రసరిస్తున్నది. నా భావాలు వర్ణింప శక్యం కానివి. హుందాతనం, మృదు స్వభావం, స్వీయ నియంత్రణ, ధృఢమైన శాంతమైన స్వభావం కల్గిన మహర్షి వర్ణనకతీతమైన వారు. ఆయన చిరునవ్వు కంటే అందమైనదేదీ ఉండబోదు. ఆయన సన్నిధానం ఒక వ్యక్తిలో ఎంతమార్పు తెస్తుందీ అన్నది చాలా వింతైన విషయం.

ఇది భగవాన్ తోటి ఈ యువకుడి తొలి అనుభవం. తర్వాత ఏమైనా ప్రశ్నలు భగవాన్‌ను అడుగవలసిందిగా కావ్యకంఠులాయనకు సూచించారు. యువకుడు, ఉత్సాహవంతుడు, ప్రపంచానికి సేవ చేయాలనే కాంక్ష గల హంఫ్రీస్ వెంటనే అంగీకరించారు. ఆయన తొలి ప్రశ్న "గురువుగారూ! నేను ప్రపంచానికి సాయపడగలనా?" భగవాన్, "ముందుగా నీకు నీవుసాయపడు. అపుడు నువ్వు ప్రపంచానికి సాయపడగలవు". హంఫ్రీస్ "నేను ప్రపంచానికి ఉపయోగపడాలను కుంటున్నాను. నేను ఉపయోగపడలేనా?" భగవాన్ : "అవును. నీకు నువ్వు సాయపడుట ద్వారా నీవు ప్రపంచానికి ఉపయోగపడగలవు. నీవు ప్రపంచంలో ఉన్నావు. నువ్వే ప్రపంచం. నువ్వు ప్రపంచం కంటే వేరు కాదు. ప్రపంచం నీకంటే వేరు కాదు". కొద్దిసేపటి తరువాత హంఫ్రీస్ అన్నారు. "గురువర్యా! శ్రీకృష్ణుడూ, జీసస్ క్రైస్ట్ చేసినట్లుగా నేను అద్భుతాలు చెయ్యగలనా?" భగవాన్ : "వారిలో ఏ ఒక్కరైనా ఆ అద్భుతాలు జరుగుతున్నపుడు, అది తామే చేస్తున్నామని భావించారా?" అలా తొలిసారిగా, అతీత శక్తులకు ఎక్కువ విలువ ఇవ్వవద్దని, కర్తృత్వ భావన వలదని భగవాన్ ఆయనకు సూచించారు.

హంఫ్రీస్ ఎక్కువకాలం వేలూరులో ఉండలేకపోయేవారు. ఎప్పుడు రాగలిగితే అప్పుడు, ఎక్కువగా మోటార్‌సైకిల్‌పై, మండు వేసవి ఎండల్లో 50 మైళ్ళు ప్రయాణం చేసి వచ్చేవారు. హంఫ్రీస్ విరూపాక్ష గుహకు రాగానే భగవాన్ వేసే మొదటి ప్రశ్న "నువ్వు ఏమైనా తిన్నావా? నీకు ఆకలి వెయ్యడం లేదా?" హంఫ్రీస్ సాధారణంగా ఆకలిగా ఉండేవారు. భగవాన్ వెంటనే ఆయనకు భోజనం పెట్టించేవారు. పాశ్చాత్యులు చెంచాతో భోజనం తింటారని భగవాన్‌కు తెలుసు. అందుకని కొబ్బరిచిప్ప

పెంకుతో చెంచా తయారు చేశారు భగవాన్ ఆయన కొరకు. అది చూసి హంఫ్రీస్ సంతోషపడ్డారు. ఒకనాడు, భోజనం చేసిన తర్వాత కూడా హంఫ్రీస్ ఆకలితోఉన్నారు. భగవాన్ "నువ్వు ఇంకా ఆకలిగా ఉన్నావు" అని, ఇంకా కొంచెం భోజనం పెట్టించారు. ఆ ఎండ తీవ్రత వలన భోజనం తర్వాత ఆ బ్రిటీష్ యువకుడు తీవ్రమైన దప్పికతో ఉన్నాడు. కానీ బ్రిటీష్ సంస్కృతికి అలవాటు పడిన ఆయన ఏమైనా అడగడానికి మొహమాట పడ్డారు. అది తెలిసి భగవాన్ వెంటనే మరొక భక్తునితో "ఆయన దప్పికతో ఉన్నారు. ఆయనకు నిమ్మరసం ఇవ్వండి" అన్నారు. వీటన్నిటి మూలాన భగవాన్ కేవలం ఆధ్యాత్మిక గురువే కాదు, పోషించే తల్లి కూడా అని హంఫ్రీస్‌కు అన్పించింది. చాలాసార్లు చిన్నపిల్లలు అక్కడ మాట్లాడకుండా, ఆటలాడకుండా, ప్రశాంతంగా కూర్చుని ఉండడం ఆయన చూశారు. ఆయన విస్తుపోయారు. అంత ఎక్కువసేపు మాటా పలుకూ లేకుండా ప్రశాంతంగా చిన్నపిల్లలు ఉండడం ఇదివరకెన్నడూ ఆయన చూడలేదు. నిజమేమిటంటే, ఆ పిల్లలు కూడా భగవాన్ యొక్క ఆధ్యాత్మిక శాంతి వలన ప్రభావితులై అలా ఉన్నారు.

హంఫ్రీస్‌కు అతీంద్రియ శక్తుల పట్ల గల ఆసక్తిని గమనించి భగవాన్ ఆయనను వాటి నుండి దారి మళ్ళించారు. "ఏదైతే ఈ అతీత శక్తుల కంటే ఉన్నతమైనదో, దాని కోసం ప్రయత్నించు. నీ ఆశయం వీటికంటే ఉన్నతంగా ఉండాలి. అది ఇంకా ఉన్నతంగా, ఎంత ఉన్నతంగా అంటే నీవే అసలు సత్యానివి, అని నీవు గుర్తించే వరకు. ఈ అతీంద్రియ శక్తులు నిన్ను (మోహం లో) భ్రమలో పడేస్తాయి. వాటిని విడిచిపెట్టు." భగవాన్ హంఫ్రీస్ అతీంద్రియ శక్తులను ఉపయోగించటము, మానివేయడంలో తోడ్పడ్డారు. హంఫ్రీస్ చాలా ధృఢమైన వారు. ఎలాగైతే అతీంద్రియ శక్తులను వశపరచుకోగలిగారో అదే విధంగా గురువు గారి బోధలను కూడా అంతే శక్తివంతంగా అభ్యాసం చేశారు. ఎప్పుడైతే ఆయన తను ఎంచుకున్న అతీంద్రియ విద్యల్ని వదిలి వేశారో అప్పుడు భగవాన్ ఆయనకు, ఆత్మ విచారణ, శరణాగతి,హృదయంలోనికి వెళ్ళుట వంటి వాటివైపు నడిపించారు.

గురువు గారి గురించిన వర్ణనలను ఇంగ్లండులోని తన స్నేహితునికి వ్రాసిన లేఖలో వ్రాశారు హంఫ్రీస్. అవి 'ఇంటర్నేషనల్ సైకిక్ గజెట్' అనే పత్రికలో ప్రచురించబడ్డాయి. మనం చూసే అద్భుతాలన్నీ ఆసక్తికరమైనవీ, ఆశ్చర్యకరమైనవీ. కానీ, అన్నిటి కంటే అత్యద్భుతమైన దానిని మనము గుర్తించలేదు. ఈ అద్భుతాలన్నిటికిన్నీ వాటిని చూడటమనే కార్యానికి కూడా ఏ ఏకమైన, అనంతమైన శక్తి కారణమో దానిని మనం గుర్తించలేదు. ఈ అశాశ్వతమైన కార్యాలమీద వస్తువుల మీద, మీ ధ్యాస నుంచవద్దు. ఈ అద్భుతాలను చూడాలని గాని, గ్రహించాలని గాని ఆలోచన కూడా పెట్టుకోవద్దు. కానీ ఏదైతే ద్రష్ట వీటిని చూస్తుందో, వీటన్నిటికీ కారణభూతమైనదేదో దానిపై దృష్టి నిలపండి. మొదట్లో యిది అసాధ్యంగానే కన్పిస్తుంది. కానీ నెమ్మది నెమ్మదిగా ఫలితం తెలుస్తుంది. దానికి ఎన్నో సంవత్సరాల అధ్యయనమూ, అభ్యాసమూ కావాలి. కానీ ఆ విధంగానే గురువు తయారయ్యేది. దీన్నికై ప్రతిరోజూ పదిహేను నిమిషాలు కేటాయించండి. మనస్సు ఏ మాత్రం చలించకుండా, చూసే దానిమీద దృష్టి నిల్పండి. ఆ ద్రష్ట నీలోనే ఉన్నది.అదేదో స్పష్టమైనదనీ, దానిపై మనస్సును తేలికగా నిలపగలమనీ భావించవద్దు.అది అంత తేలిక కాదు, ఆ ద్రష్టను కనుగొనటానికి సంవత్సరాల కాలం పట్టినా, ఈ ఏకాగ్రత ఫలితాలు నాలుగైదు నెలల్లోనే కన్పిస్తాయి. యోగదృష్టి లేదా జ్ఞాన దృష్టి, మానసిక ప్రశాంతత, కష్టాలనెదుర్కొనే శక్తి, కంటికి కన్పించని శక్తి క్షేత్ర ఆవరణ ఇవన్నీ దాని ఫలితంగానే వస్తాయి. ఈ బోధలన్నీ గురువు గారి స్వంత మాటల్లో తన అంతరంగిక శిష్యులకు చెప్పిన వాటినే ఆయన మాటల్లోనే మీకు అందజేశాను. ఇక ఇప్పటి నుండి, ధ్యానంలో మీ ధ్యాసనంతా చూపడం మీద, చూడబడే దాని మీద కాకుండా, ఏదైతే ద్రష్టయై చూస్తుందో దానిపై స్థిరంగా ఉంచండి.

ఎంత శక్తివంతమైన బోధలు! హంఫ్రీస్ హృదయంలో స్థితుడైనాక పొందవలసిన వాటినన్నిటినీ పొందారు. ఉద్యోగం చేస్తూ, ధ్యానాన్ని కూడా కొనసాగించడం కష్టంగా ఆయనకు తోచింది. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, ఈ విషయమై అడుగగా, ఇంకా కొంతకాలం పాటు ఆగమని చెప్పారాయన.. (ఎవరిలోనైతే పరిపక్వత వచ్చిందో గురువు గార్కి తెలుసు. గొప్ప వంట మాస్టరైన ఆయన, ఇంకా కొంతకాలం ఈయనను వండాలనుకున్నారు కాబోలు) కొన్ని నెలల పిమ్మట ఆయన మరల భగవాన్ వద్దకు వచ్చారు. "ఇంక నువ్వు వెళ్ళవచ్చు అన్నారు". హంఫ్రీస్ అన్నారు "నేను ఇంకా మంచి లోతైన కాథలిక్‌గా వెనుకకు వెళ్తాను". ఆయనలో ఏ విధమైన సంఘర్షణకు తావు లేదు.

ఇంకా కొద్దికాలమైన పిదప, ప్రాపంచిక విషయాలన్నింటినీ త్యజించి, ఒక క్రైస్తవ మఠంలోకి వెళ్ళి సన్యాసిగా మారారు. హృదయంలో స్థిరపడితే హిందువు, క్రిస్టియన్, ముస్లిం, స్త్రీ, పురుషుడు అనే తేడాలుండవు. స్వచ్ఛమైన సత్యమే ఉండేది.

మస్తాన్ స్వామి

మస్తాన్ స్వామి ఒక గాఢ విశ్వాసం గల ముస్లిం. అన్ని మతపరమైన పద్ధతులను, ఆచారాలను, ఖచ్చితంగా పాటించాలనే ఆయన తల్లిదండ్రులు, ఆయనను కూడా అదేవిధంగా పెంచారు. ఎనిమిదేండ్ల చిరుప్రాయంలోనే, అదేమిటో తనకు తెలియకుండానే సమాధిస్థితిలోనికి వెళ్ళేవారాయన. ఆయన స్వభావ సిద్ధంగానే చుట్టూ పరిసరాల నుండి మనుష్యుల నుండి బాల్యం నుండే విడివడిఉండేవారు. ఈ అసాధారణ భక్తుడు అల్లా అన్నా, ప్రొఫెట్ మొహమ్మద్ అన్నా మిక్కిలి భక్తి తత్పరత కలిగి యుండేవారు. సమాధి అనుభవం పట్ల ఆయనకున్న అనురక్తి, ఆయనను తమిళమునేర్చుకొనుటకు ప్రోత్సహించింది. త్వరలోనే ఆయన కైవల్య నవనీతము, సుకర్ వాసిష్టము మొదలైన గ్రంథాలు చదవడం ప్రారంభించారు. పందొమ్మిదవ శతాబ్దానికి చెందిన సూఫీ మహాత్ముడు, గూనంగుడి మస్తాన్ గారి వేదాంతపరమైన, సరళమైన తమిళ పద్యాలు కూడా ఆయనను బాగా ప్రభావితం చేసినవి. ముహర్రమ్ వంటి ముస్లిమ్ పండుగలలో పాల్గొన్నా, ఆయన మనసూ, హృదయం మాత్రం లోనున్న ఆత్మవైపే దృష్టి కలిగి ఉండేవి. సమాధిస్థితిలోనికి వెళ్ళడం, తాయుమానవర్ యొక్క పాటలను చదవటమూ, పాడటము, ఆయన ఎక్కువగా చేస్తుండేవారు. తాయు మానవర్ యొక్క పాటలను భగవాన్ ఎంతగానో పొగడేవారు. ఎందుకంటే అవి పూర్తిగా సద్వస్తువు గురించే ఉండుట మూలాన. మిగిలిన మహాత్ములు తమ కవితలలో శివుడు, ఇతర దేవతల ప్రస్తావన వుంటుంది. తాయుమానవర్ ఎంతసేపు, హృదయంలోనికి వెళ్ళి మౌనమైపోవడం గురించి ప్రస్తావిస్తారు. మస్తాన్ స్వామి అందులో చెయ్యి తిరిగిన వాడు.

1914లో మస్తాన్ స్వామి దేసూర్ అనే గ్రామంలో ఉండేవారు. అది తిరువణ్ణామలైకు 40 మైళ్ళ దూరంలో ఉంది. దేసూరమ్మాళ్ అక్కడి నుండే వచ్చారు. ఆ గ్రామంలో ఆధ్యాత్మిక పిచ్చి ఉన్న వాళ్ళు, వారిద్దరే గనుక వారిద్దరూ స్నేహితులైనారు. ఒకరోజు దేసూరమ్మ, మస్తాన్ స్వామితో అన్నారు. "మస్తాన్ స్వామీ, నువ్వు మా గురువు గార్ని కలుసుకోవాలి," అని ఆమె తర్వాత అతనిని భగవాన్ వద్దకు విరూపాక్ష గుహకు తీసుకుని వచ్చింది. ఇస్లామ్ మతాన్ని గట్టి అంకిత భావంతో అనుసరించే మస్తాన్ స్వామి, భగవాన్ దర్శనం గురించి ఇట్లా చెప్తారు. "ఆయన శిల వలె కూర్చుని ఉన్నారు. నిశ్చలమైన ఆయన చూపు అనుగ్రహము, కరుణ, జ్ఞానముతో నిండి ఉంది. నేను ఆయన ప్రక్కన నుంచున్నాను. నావైపు ఒక్కసారి చూచుట ద్వారా, ఆయన నా హృదయ కవాటాన్ని తెరిచారు. ఆయన స్థితిలోనే నేనూ స్థిరపడి పోయాను. ప్రథమ దర్శనంతోనే, కేవలం భగవాన్ యొక్క ఒక్క చూపుతో ఏ మాత్రం అలసట లేకుండా, హృదయంలో మునిగిపోయి శాంతిగా ఎనిమిది గంటల పాటు ఉండిపోయాను. ఆ రోజుల్లో విరూపాక్ష గుహలో ఉండేటప్పుడు, ఒక్క అనుగ్రహ వీక్షణంతోటే భగవాన్ మా హృదయాన్ని తెరిచి మమ్మల్ని మార్చేసేవారు. అక్కడ ప్రశ్నలకు తావు లేదు. ఎందువల్లనంటే ఆయన చూపే మమ్ములను ఆయన వలె చేసేది.

మస్తాన్ స్వామి ఎంత అద్భుతమైన వ్యక్తి. ప్రథమ సమావేశంలోనే భగవాన్‌ను తన గురువుగా స్వీకరించాడు. అప్పటికే ఆయన గురువు యొక్క లక్షణాలను, గుర్తులను గురించి చదివి ఉన్నాడు. తన ఎదురుగా కూర్చుని ఉన్నది తన గురువే కాదు, దైవం కూడా అన్పించింది. తిరిగి వచ్చేసిన తర్వాత మస్తాన్ స్వామిలో ఒక సంఘర్షణ ఉత్పన్నమయింది. అప్పటి వరకు ఆయన గురువు ప్రాఫెట్ మహమ్మద్, అల్లా తన దేవుడైనప్పటికీ, ప్రాఫెట్ మహమ్మద్ తన గురువు అయినప్పటికీ, రమణ మహర్షి జీవించి యున్న (సజీవ) గురువు. నేను నా గురువు ప్రాఫెట్ మహమ్మద్‌కు ద్రోహం (అవిశ్వాసం) చేస్తున్నానా? అని అనుకునేవాడు. ఆయనలో భగవాన్ నిండి ఉన్నప్పటికీ, ఇస్లాం సంప్రదాయంలో పెరిగిన వాడవటం వల్ల "కేవలం ఆయన సజీవంగా లేనందువల్ల, నా గురువు ప్రాఫెట్ మొహమ్మద్‌ను నేను ప్రక్కకు నెట్టేస్తున్నానా" అని బాధపడేవారు.

అదృష్టవశాత్తు ఆయన భగవాన్ వద్దకెళ్ళి "భగవాన్! ఇది నా సమస్య. దయచేసి నాకు సాయపడండి" అన్నారు. భగవాన్ ఆయనవైపు కొంతసేపు చూశారు. భగవాన్ మస్తాన్ స్వామి వంక చూసి, అనుగ్రహాన్ని కురిపిస్తూ, ఇలా అన్నారు. "నీవు ఈ

శరీరాన్ని భగవాన్ అనుకుంటున్నావా? ప్రాఫెట్ చనిపోయారనుకుంటున్నావా? బుద్ధుడు చనిపోయారా? క్రీస్తు చనిపోయారా? వారు ఈనాటికీ లక్షలాది మందికి దారిచూపుట లేదా? సజీవ గురువు అంటే హృదయంలో సజీవంగా ఉన్న గురువు, సజీవ గురువు అంటే ఒకానొక చారిత్రక సమయానికీ, భౌగోళిక ప్రదేశానికీ పరిమితమైన వారు కారు. గురువు ఎప్పటికీ నీ హృదయంలో సజీవంగానే ఉంటారు. హృదయమే అల్లా. హృదయమే ఏసుక్రీస్తు. హృదయమే బుద్ధుడు. హృదయమే భగవాన్. హృదయంలోనికి మునగడం ద్వారా, హృదయంలోనే హృదయంగా ఉండు.

ఈ మాటలన్నీ నాకు విశ్వనాథస్వామి ద్వారా తెలిసాయి. నేను వెంటనే వాటిని అర్థం చేసుకోలేక, దయచేసి వాటిని నాకర్థమయ్యేటట్లు వివరించమని అడిగాను. ఆయన అన్నారు. గురువు ఎల్లప్పుడూ కాలానికి అతీతుడు. గురువును కాలానికి సంబంధించిన వారుగా చెప్పాలంటే, చావు, పుట్టుక, జీవితం ఇవన్నిటి గురించి చెప్పాలి. కానీ గురువు అనేది ఒకటే, అదే హృదయంగా మనలో ప్రతి ఒక్కరిలో ఉంది "స్వామీ! అలాగని మీరెలా చెప్పగలరు?" అంటే ఆయన అన్నారు. 'ఒకప్పుడొక భక్తుడు లాహోర్ నుండి వచ్చారు. లాహోర్, తిరువణ్ణామలై ఒకదానికొకటి 1000 మైళ్ళుకు పైగా దూరంలో ఉన్నవి. 1930లలో 40 లలో అంత దూర ప్రయాణమన్నది అసాధ్యమైన విషయం. ఆయన కేవలం ఒక నెల రోజులు మాత్రమే ఉండగలిగారు. ఆయన వెళ్ళేటప్పుడు "మిమ్మల్ని వదలి నేనెలా వెళ్ళగలను భగవాన్?" అని ఏడ్చారు. భగవాన్ అన్నారు "మీరు ఎక్కడకు వెళ్తున్నారు? భగవాన్ నుండి వేరుగా మీరు వెళ్ళగలరా? భగవాన్ ఎప్పటికీ మీతోనే ఉంటారు. భగవాన్ మీలోనే ఉన్నారు. నిజానికి మీరే భగవాన్'. ఆ జవాబులో ఉన్న అందాన్ని చూడు "మీరే భగవాన్, అని భగవాన్ అన్నపుడు, గణేశన్ కానీ, విశ్వనాథన్ గానీ భగవాన్ ఎలా అవుతారు? విశ్వనాథన్‌లోని గాని, గణేశన్‌లో కానీ 'అహమహమని స్ఫురించేదేదైతే' ఉన్నదో అదే భగవాన్. సజీవ గురువు ఎల్లప్పుడూ హృదయంలోని ఎఱుకగా (చైతన్యంగా) ఉంటారు. ఏ చైతన్యమైతే మీలో, నాలో, మనలోని ప్రతి ఒక్కరి హృదయంలో ఉన్నదో అదే అరుణాచల రమణులు, దేవుడు, ఆత్మ, హృదయము, అల్లా, క్రీస్తు, బుద్ధుడు, దానికి మనమేపేరైనా ఇవ్వవచ్చును"

మస్తాన్ స్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన నేతపనివాడు. ఆయనను భగవాన్ యొక్క కబీరు అంటారు. కబీరు ఎంత గాఢంగా తన గురువు గారి పట్ల భక్తి కలిగి ఉండేవారో, ఈయన కూడా భగవాన్ పట్ల అంతే భక్తి కలవారు. మస్తాన్ స్వామి క్రమం తప్పకుండా భగవాన్ వద్దకు రాసాగారు. ఆయన తన వృత్తి అయిన నేత పనిని వదిలిపెట్టి, కేవలం భగవాన్ కౌపీనానికి, తుండుగుడ్డలకు కావలసిన వస్త్రాన్ని మాత్రమే నేసేవారు. నిజమైన సన్యాసి కావున ఆయన వివాహం చేసుకోలేదు. తన గ్రామంలోనే వీధులలో బిచ్చమెత్తుకునే వాడు. తిరువణ్ణామలైకు తరచుగా దేసూరమ్మతో పాటు వచ్చేవారు. దేసూరమ్మాళ్ వద్ద దండిగా డబ్బుండి, ఆమె భగవాన్‌కు భిక్షనివ్వటానికై ఎక్కువగా సరుకులను తీసుకొని వచ్చేవారు ఆ బరువులన్నీ బియ్యమూ, పప్పు తన నెత్తిమీద పెట్టుకుని దేసూరు నుండి సంతోషంగా నడచి వచ్చేవారాయన. అది ఆయనకేమీ భారమనిపించేది కాదు. ఎందుకంటే తన గురువును కలుసుకోబోతున్నాననే సంతోషం వల్ల. అరుణాచలంలో కూడా, ఆయన భిక్షాటనకు వెళ్ళేవారు.

మస్తాన్‌స్వామి చాలాసార్లు భగవాన్‌తో సంభాషణలు జరిపేవారు. మస్తాన్‌స్వామి ఇలా చెప్పారు. "ఒకసారి, నేను భగవాన్ దర్శనానికి వస్తూ దారిలో, ఆయన అనుగ్రహం కోసం ప్రార్థించాను. విరూపాక్ష గుహకు రాగానే ఆయన నన్ను "నీకు సగుణోపాసన (భగవంతుని ఏదో ఒక రూపంతో ఉపాసించడం) ఇష్టమా లేక నిర్గుణోపాసనా?" (రూపం లేని దేవుణ్ణి ఆరాధించడం) అని అడిగారు. "నాకు నిర్గుణోపాసనే ఇష్టమని చెప్పాను. భగవాన్ నాకప్పుడు ఈ దివ్యమైన బోధ చేశారు. "నీ మనస్సును హృదయంపై లగ్నం చెయ్యి. ఆలోచనలన్నీ ఎక్కడ నుండి పుడుతున్నాయో ఆ మూలాల మీద నీ మనస్సును లగ్నం చేస్తే, మనస్సు అణగిపోతుంది. సత్యం ప్రకాశిస్తుంది. ఈ విధమైన బోధలు ఇతర పుస్తకాలలో చదివినప్పటికీ, పవిత్రమైన నా గురువు గారి స్వరం నుండి వచ్చిన ఈ జ్ఞానపూరితమైన పలుకులు నా హృదయంలోనికి చొచ్చుకుని పోయి, నాకు మార్గదర్శకమైనాయి. అటుపిమ్మట దాని గురించి నాకేవిధమైన సందేహాలు లేకుండా పోయాయి. భగవాన్ ఈ విధంగా మస్తాన్‌స్వామి హృదయంలో స్థిరపడేటట్లుగా త్రోవచూపారు.

మస్తాన్‌స్వామి చాలాసార్లు, భగవాన్‌తో కలిసి గిరి ప్రదక్షిణకు వెళ్ళేవారు. మస్తాన్‌స్వామి ఒకసారి భక్తి పారవశ్యంలో మునిగి ఉన్నపుడు, భగవాన్ గూనంగుడి మస్తాన్ వ్రాసిన పాటలు పాడమని కోరారు. భగవాన్ ఆ పాటలను ఇష్టపడేవారు. గురువు గారు కోరారు కాబట్టి నేను ఎలుగెత్తి (పెద్ద గొంతుతో) ఆ పాటలు పాడాను. మస్తాన్‌స్వామి ఇంకొక ఆసక్తికరమైన సంగతి చెప్పారు. అది భగవాన్, ఒక పెద్ద బంగారు రంగులో నున్న ముంగిసల గురించి. సాధారణంగా ముంగిసలు, బూడిద వర్ణంలో ఉంటాయి. కానీ ఆ ముంగిస మాత్రం అసాధారణమైన బంగారు వన్నెలో ఉన్నది. అది కార్తీక దీపోత్సవ సమయం. వందలాది మంది జనులు కొండపైకి వెళ్తున్నారు. వారి మధ్యలో గుండా పరిగెడుతూ ఈ ముంగిస విరూపాక్ష గుహలోనికి వెళ్ళింది. గుహలో మూలమూలలా వెదికింది. ఆ సమయంలో పళనిస్వామి దగ్గరలో నున్న వాగు (ఏఱు)లో స్నానం చేస్తున్నారు. భగవాన్ లోపల కన్పించకపోయే సరికి, పళనిస్వామి వద్దకెళ్ళి ఆయన పాదాలను నాకింది. తర్వాత కొండపైకెక్కి స్కందాశ్రమం చేరుకున్నది. స్కందాశ్రమం చేరగానే, అది నిర్భయంగా భగవాన్ ఒడిలోనికి ఎగిరి కూర్చుని, ఆయన వైపే తదేకంగా చూడసాగింది. భగవాన్ దానిని ప్రేమగా నిమిరి, తన కృపాదృష్టిని దానిపై ప్రసరింపజేశారు. ఆశ్రమం రద్దీగా ఉన్నది. మస్తాన్‌స్వామి ఒక్కరే అక్కడ పరిచారకులుగా ఉన్నారు. ఆయన, ఆ ముంగిసకేవిధమైన హానీ జరగకుండా, దానివల్ల అక్కడి నెమళ్ళకేమీ హాని జరగకుండా చూశారు. ఆ ముంగిస ఎక్కడికెళ్ళినా, ఆయన దాని వెనుకనే వెళ్ళేవారు. కొంతసేపటి తర్వాత అది మాయమైపోయింది. ఆశ్రమ సర్వాధికారి (మేనేజర్) పెరుమాళ్ళ స్వామి తిరిగి వచ్చిన తరువాత, మస్తాన్‌స్వామి జరిగిందంతా చెప్పారు. "నువ్వు ఆ ముంగిసను పట్టుకుని తాడుతో కట్టి ఉంచవలసింది" అన్నారు పెరుమాళ్ స్వామి. భగవాన్ వారి వంక చూసి నవ్వుతూ ఇలా అన్నారు. "ఏమి మీరు వారిని పట్టుకొనగలరా? వారిని బంధించగలరా? ఆయన ఒక సిద్ధ పురుషులు. అరుణాచలము అనేక మంది సిద్ధ పురుషులకు నివాస స్థానము, వారిలో ఒకరు ఇక్కడకు వచ్చి కొంచెం సమయము గడపదల్చుకున్నారు. అందుకనే ఆయన ఇక్కడకు వచ్చారు".

భగవాన్ జీవించి ఉన్న కాలంలో తీవ్రంగా సాధన చెయ్యదలచుకున్న కొందరు భక్తులు ఆశ్రమం దగ్గరలో పల్లా కొత్తు అనబడే పనస చెట్లతోటలో ఉండేవారు. కొన్నిసార్లు వారు ఇతర పట్టణాలకు వెళ్ళి, భగవాన్ కీర్తనలు పాడుతూ భిక్షాటన చెయ్యాలను కున్నారు. వాళ్ళెప్పుడు భగవాన్ అనుమతి కోసం వెళ్ళినా, భగవాన్ "మీరెక్కడకు వెళ్తారు? ఎక్కడ ఉంటారు?" అని ప్రశ్నించేవారు. "మాకదంతా పట్టదు. మేముపరివ్రాజకుల వలె, భిక్షాటన చేస్తూ, ఒక స్థిర నివాసం లేకుండా ఉండదలిచాం," అన్నారు వారు. కానీ భగవాన్ అంత సంతోషంగా లేరు. "మేము ఎక్కడకు వెళ్ళాలనుకుంటున్నామో మస్తాన్‌స్వామికి చెబుతాము" అనే వరకు. ఇది ఎందుకంటే, మస్తాన్‌స్వామి వారితో వెళ్ళి, వారికి భిక్షనివ్వడమో, వారికొరకు భిక్షాటన చేసి వారికి విశ్రాంతినివ్వడమో చేస్తారని ఆయన ఉద్దేశం. వాళ్ళు అక్కడికి ముప్పది లేదా 40 మైళ్ళ వ్యాసార్ధంలో కల పోలూరు, దేసూరు, చెంగం, జింజీ అనే ఊళ్ళకు వెళ్ళేవారు. మస్తాన్‌స్వామి వారితోకలసిగాని, వారి కంటే ముందే వెళ్ళి వారి కోసం వేచి ఉండి, వారిసేవ చెయ్యటం కానీ చేసేవారు. నేను భక్తులకు, భక్తుడను అనే వారాయన. "మస్తాన్‌స్వామి! నువ్వు మాకు ఇంతగా సేవ చేస్తున్నావు. నీకు మేమేమి చేయగలము?" అని వారనే వారు. "మీరు, నేను లేనపుడు గురువు గారు చెప్పిన మాటలను పొల్లుపోకుండా నాకు చెప్పండి" అన్నారు మస్తాన్‌స్వామి. అదొక్కటే ఈ భక్తుడు కోరుకున్న బహుమతి. మస్తాన్‌స్వామి చాలా అణుకువగా ఉండేవారు. "కుంజుస్వామి, విశ్వనాథ స్వాములకు తప్ప మిగిలిన భక్తులెవరికీ కూడా, మస్తాన్‌స్వామి ఎవరో తెలియదు" అని భగవాన్ అన్నారు. ఆయన ఎవరికంట పడకుండా ఉండేందుకు ఇష్టపడేవారు. అణుకువ, భక్తి తత్పరత, పవిత్రత అనే మాటలు ఆయనను వర్ణించడానికి సరిపోతాయి.

ఒకరోజు భగవాన్, మస్తాన్‌స్వామి మరికొందరూ ఆశ్రమంలో ఉండగా ఒక దొంగతనం జరిగింది. ఒక సాధువు పలుగు తీసికుని దొంగల వెంబడి పడినా కూడా, మస్తాన్‌స్వామి మాత్రం నిర్వికారంగా ఉన్నారు. భగవాన్ ఆ పలుగు తీసుకుని వెళ్ళబోతున్న సాధువును ఆపి "మనము సాధువులం, మన కర్తవ్యం మౌనంగా ఉండటము. దొంగల పని దొంగతనము చెయ్యటము. మన ధర్మాన్ని మనం పాటిద్దాం. వారి ధర్మాన్ని వారు పాటిస్తారు," అన్నారు.

మస్తాన్‌స్వామి జబ్బు పడినపుడు ఎవరికీ కష్టం కల్గించడం ఇష్టంలేక, వేరొక గ్రామానికి వెళ్ళారు. సాధారణంగా భగవాన్ ఎవరికోసమూ కూడా తన పరిధి దాటేవారు కాదు. కానీ మస్తాన్‌స్వామి విషయంలో మాత్రం దేసూరమ్మాళ్ గారిని పిలిపించి

"మస్తాన్‌స్వామి ఎక్కడకు వెళితే, మీరక్కడకు వెళ్ళి, ఆయనను జాగ్రత్తగా చూచుకొనండి" అని చెప్పారు. ఈ విధమైన సూచన ఇంకే భక్తుని విషయంలోనూ, భగవాన్ ఇచ్చినట్లు నేను వినలేదు. మస్తాన్‌స్వామి చివరి రోజులు చాలా చక్కగా గడిచిపోయాయి. దేసూరమ్మాళ్ భగవాన్ వద్దకు వచ్చి ఇలా చెప్పారు."భగవాన్, ఆయన చివరి రోజులలో, అపస్మారక స్థితిలో, మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నట్లు మాకు అన్పించింది. ఆయన అనేవారు, "నంది దిగి వచ్చింది. శివుని యొక్క భూతగణాలు నృత్యం చేస్తూ, మస్తాన్ రా, రా, రమ్మంటున్నారు." అది సంధిప్రేలాపనేమో మరి. కానీ భగవాన్, అతని చివరిక్షణంలో ఆయన లేచి నిలబడ్డారు. అతనున్న పరిస్థితిలో లేచి నిలబడుట అన్నది అసంభవమైన విషయం. ఆయన లేచి నిలబడి, నీళ్ళునిండిన కళ్ళతో "అపీతకుచాంబాళ్ నన్ను తీసుకుని వెళ్ళటానికి వచ్చారు. నేను వెళ్తున్నాను దేసూరమ్మాళ్" అంటూ ప్రాణాలు వదిలారు.

ఈ వివరాలన్నీ భగవాన్‌కు చెప్పబడినపుడు ఆయన ఇలా అన్నారు. "జగన్మాతే స్వయంగా ఆయనను తీసుకుని వెళ్ళటానికి వచ్చి ఉండవచ్చును. ఆయన వర్ణనలన్నీ పురాణాలలో ఈశ్వరునీ, ఆయన అనుచరులనూ గురించి చేయబడిన వర్ణనలాగే ఉన్నాయి. మస్తాన్‌స్వామి ఏ ఆడంబరం లేకుండా, తన ఔన్నత్యాన్ని పైకి కనపడనీయకుండా ఉండే వ్యక్తి. ఆయనలో నిగూఢంగా చాలా ఆధ్యాత్మిక అనుభవాలు నిండి ఉన్నాయి. భగవాన్ మస్తాన్‌స్వామిని ప్రశంసించడమే కాదు, ఆయన మీ సంరక్షణలో, మీ పర్యవేక్షణలో శరీరాన్ని వదిలెయ్యడం కూడా గొప్ప విషయమేనని, దేసూరమ్మాళ్‌కు కూడా కృతజ్ఞత తెలిపారు. అంతటితో ఆగలేదు. తర్వాత భగవాన్ రెండు వేల అయిదు వందల సంవత్సరాల క్రిందట వ్రాయబడిన 'తిరుమందిరం' అనే తమిళ గ్రంథాన్ని తీశారు. అందులో ఆత్మసాక్షాత్కారం పొందిన వాని శరీరాన్ని ఎలా పూడ్చిపెట్టాలో (ఖననం చెయ్యాలో) వివరించబడింది. ఆ పేరాలను గుర్తించి, సమాధిని ఎలా నిర్మించాలో, ఆ శరీరాన్ని, విబూది, కర్పూరము ఇతర ద్రవ్యాలతో ఎలా నింపాలో భగవాన్ వివరించారు. ఈ స్పష్టమైన సూచనలను పాటించి సమాధి నిర్మించబడింది.

వర్షం కుండపోతగా కురుస్తున్నప్పటికీ గ్రామం మొత్తం తరలివచ్చింది. ఆ ఊరిలోని చిన్న దేవాలయము, దేవుడిని ఊరేగించే రథాన్ని, ఆ ముస్లిం, భౌతిక కాయాన్ని తీసుకుని వెళ్ళటానికి ఇచ్చింది. చాలామంది హిందువులు ఇందులోని ఔన్నత్యాన్ని గుర్తించవచ్చు. ఆ రోజున ఎంత పెద్ద ఎత్తున వర్షం కురిసిందంటే నడుము వరకూ నీళ్ళు వచ్చేశాయి. వేదమంత్రాల నడుమ, ఆ శరీరాన్ని భగవాన్ సూచనల ప్రకారం నిర్మించబడ్డ సమాధిలోనికి చేర్చారు. ఆ సమాధి దగ్గరకెవరు వెళ్ళి ప్రార్థించినా వారి కోరికలు నెరవేరునట. ఇంత చక్కటి భగవాన్ భక్తునికి, మనం కూడా ప్రణామాలనర్పిద్దాము. అత్యంత సాధారణంగా కన్పించే మస్తాన్‌స్వామి, భగవాన్‌చే ఎంతగానో ప్రశంసింప బడ్డారు. మస్తాన్ స్వామి భగవాన్ సన్నిధిలో తాను పొందిన గొప్ప అనుభవములను ఎప్పుడూ బయటకు వెల్లడించే వారు కాదు. పదిమంది దృష్టిలో తాను పడకుండ మరుగునపడి ఉండుటకు ఇష్టపడేవారు. భగవానే, మస్తాన్ తొలినాళ్ళలో తమ వద్దకు వచ్చినపుడు జరిగిన విషయములను అప్పుడపుడు వెల్లడిస్తుండేవారు.

విశ్వనాథస్వామి ఈ విషయమై ఈ విధంగా చెప్పారు. "భగవాన్, ఒకప్పుడు నాతో ఇలా చెప్పారు. అన్ని రకముల వారు జ్ఞానిపట్ల ఆకర్షితులవుతారు. (స్వర్గలోక వాసులైన) దేవతలు, ఋషులు, బ్రహ్మనిష్ఠులు, సిద్ధులు (పరిపూర్ణస్థితికి చేరుకుని, దివ్యమైన మహిమలు కల్గినవారు), యోగులు మొదలైన వారందరూ కూడా జ్ఞాని సన్నిధివైపు ఆకర్షితులవుతారు. కొందరు సాధారణ మానవుల రూపములో వస్తారు. కొందరు సూక్ష్మశరీరములతో వస్తూ ఉంటారు. కొందరు మహాత్ములు బిచ్చగాళ్ళవలెను, పిచ్చివారి వేషములోనూ కన్పిస్తుంటారు. కొందరు జంతువులు, పక్షుల రూపాలలో కూడా వస్తుంటారు. సాధారణ మానవ దేహము ధరించి వచ్చి భక్తులుగా నిలచి పోయేవారిలో, ఆధ్యాత్మిక పరిపక్వత ఎక్కువగా ఉంటుంది. కొత్తగా వచ్చి చేరిన వారు, చాలా అభివృద్ధి చెందిన గొప్ప సాధకులతో తేలికగా కలసిపోతారు. కొంతమంది పక్వమునకు వచ్చి రాలిపోవుటకు సిద్ధముగా ఉన్న పండ్ల వలె ఉంటారు. వాళ్ళు కేవలం ఆత్మలో గాఢంగా నిల్చిపోవటానికే జ్ఞాని వద్దకు జేరుకుంటారు. మస్తాన్ అటువంటి భక్తుడు.

ఆయన ఎంత పరిపక్వత చెందిన వారంటే, ఆయన విరూపాక్ష గుహకు వచ్చినపుడు, కొన్నిసార్లు గుహలోనికి ప్రవేశించుటకు

ముందే, గాఢసమాధి స్థితిలో మునిగి పోయేవారు. ఆయన బయట గేటుపై చెయ్యి పెట్టగానే గాఢసమాధి స్థితిలోనికి వెళ్ళి, నిశ్చలంగా, ఏమాత్రమూ కదలిక లేక నిలచి పోయేవారు. ఇలా అనేకసార్లు జరిగింది. ఆయన నన్ను కనీసం చూడనైనా చూడక ముందే ఇలా జరిగి పోతుండేది. నేను, గుహలోపల ఉండుట వలన, బయట ఏమి జరుగుతుందో తెలిసేదికాదు," అని భగవాన్, విశ్వనాధస్వామితో చెప్పారు.

మస్తాన్‌స్వామి ఒకప్పుడు (ఆశ్రమంలో దొంగతనం జరిగిన సందర్భంలో) తోటి భక్తునితో ఇలా అన్నట్లు తెలుస్తుంది. "మిన్ను విరిగి మీద పడినా, గుండెల్లో ఖడ్గము లోతుగా దించబడినా, మన స్వస్వరూపమునుండి, సహజ స్థితి నుండి క్షణము కూడా, జారకూడదు. (వైదొలగకూడదు).

మస్తాన్‌స్వామికి సంబంధం అనే శిష్యుడు ఒకాయన ఉన్నారు. ఆయన నోటు పుస్తకంలో నుండి ఈ వివరాలన్నీ సేకరించబడ్డవి. సంబంధం, తన గురువుగారైన మస్తాన్‌స్వామి గురించి ఒక పాట వ్రాశారు. "ఓ మస్తాన్, దేసూరు వాసివైన, ముక్తి చెందిన ఓ మహాత్మా! నీవు ఎప్పటికి గొప్ప శుద్ధమైన సన్యాసివే. నీవు ఎప్పటికి చిన్న బిడ్డ వలె ఉండిపోయావు. సాధువు వలె తిరిగావు. లేశమాత్రమైనా ప్రాపంచిక పరమైన కోరికలు లేకుండా బ్రతికావు. సద్గురువు రమణుల పవిత్రమైన అనుగ్రహం పొందగలిగావు. నీ పరిపూర్ణతకు ప్రశంసలు, నీ పవిత్ర పాదాలకు వందనాలు".

మస్తాన్‌స్వామి ద్వారా మనం 'సజీవ గురువు' అనే పదానికి అర్థం తెలుసుకున్నాము. సాక్షాత్కారం పొందడంలో మస్తాన్‌స్వామికి మూడుసార్లు విస్ఫోటనములు జరిగినవి. మూడుసార్లు ఆయన హృదయం సందేహాలతో తెరచుకుంది. ఈ విషయంలో ఎప్పటికీ ధైర్యాన్ని కోల్పోవద్దు అనే పాఠం మనం కూడా నేర్చుకున్నా, స్వీయ ప్రయత్నం, ఆత్మ సాక్షాత్కారము అనేవి నామవాచకములు. ఆత్మను సాక్షాత్కరింపజేసుకొనుట అనేది క్రియ. ఎందకంటే అది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. దానికి మస్తాన్‌స్వామి ఉదాహరణ. ఆయనకు మూడవ పద్ధతిలో జ్ఞానోదయం ఎప్పుడైనదంటే, భగవాన్ అతనిని, సగుణమా, నిర్గుణమా, ఏవిధమైన భక్తి నీకిష్టమని అడిగినపుడు, మస్తాన్‌స్వామి నిర్గుణ భక్తి కోరుకున్నారు. భగవాన్‌కు అప్పటికే తెలుసు, అపీతకుచాంబ, ఆయనను తీసుకుని వెళ్ళుటకు వస్తారని. మస్తాన్‌స్వామి నిర్గుణభక్తిని కోరుకున్నప్పటికి ఆయనకు ముక్తి, సగుణరూపంతోనే వచ్చింది. దానిని బట్టి అర్థమయ్యేదేమిటంటే భగవంతుడే ఈ విషయాన్ని నిర్ణయిస్తాడు. మనకు ప్రయత్నం చేసే వరకు మాత్రమే స్వేచ్ఛ ఉన్నది. ఫలితం భగవంతుని చేతిలో ఉన్నది. అది ఎప్పుడూ మన మంచికే తోడ్పడుతుంది.



భగవాన్ అరుణాచలేశ్వర మరియు అపీతకుచాంబల్ అమ్మవారు

విలాచెరి రంగయ్యర్

ప్రేమకు అనేక ముఖాలున్నాయి. అది ఉన్నతమయినది. అనేక కోణాలలో అది వ్యక్తపరచబడుతుంది. జ్ఞాని ఒక భండారం (పెన్నిధి) వంటివారు. ఆయన పనులు అనేక విధాలుగా ప్రతిఫలాపేక్ష లేని నిస్వార్థ ప్రేమను ప్రతిబింబింపచేస్తాయి. భగవాన్ శ్రీరమణ మహర్షి, తన భక్తులతోడి తన అనుబంధం ద్వారా, ఈ మహోన్నత ప్రేమ యొక్క వేరువేరు రూపాలను చూపించారు.

చిన్న శిశువుగా ఉన్నపుడే భగవాన్‌లో ఉన్నతమైన లక్షణాలు కన్పిస్తుండేవి. బుడిబుడి నడకలు నడిచేటప్పుడే తనతో పాటు తన స్నేహితులను కూడా తల్లిపాలు త్రాగడానికి తీసుకుని వచ్చేవారు. దీని వలన ఎంత గాఢమైన స్నేహబంధం ఏర్పడుతుంది!

ఆ స్నేహితులలో ఒకరు మీనాక్షి అనే ఒకటిన్నర సంవత్సరాల పాప, ఆమె ఆ ఇరుగుపొరుగు ఇళ్ళలో ఒక ఇంటికి చెందిన బిడ్డ. కొన్నేళ్ళ తర్వాత మీనాక్షికి వివాహమైంది కానీ, వైవాహిక జీవితం సంతోషకరంగా సాగలేదు. ఏమైనప్పటకీ, ఆమె భగవాన్‌ను తన హృదయంలో పూజిస్తూనే ఉన్నది. ఆమెకు వీలుపడక ఎప్పుడూ భగవాన్‌ను చూచుటకు రాలేదు. 1940 దశకంలో ఆమె వృద్ధురాలై మంచం పట్టినపుడు, భగవాన్ ఆమె ఉన్నచోటనే దర్శనమిచ్చారు. నాయన విషయంలో వలె. ఆమె పక్కనే కూర్చుని ఆమెను తాకారు. కోమాలో ఉన్న ఆమె స్పృహలోనికి వచ్చి కృతజ్ఞతతో ఇలా పలికింది.

" నా ప్రభూ, దేవా, రమణా నన్ను అనుగ్రహించడానికి వచ్చావా" ఇవే ఆమె చివరి పలుకులు. స్నేహానికి దీన్ని అత్యున్నతమైన ఉదాహరణగా చెప్పుకోవచ్చును. వారి పసిప్రాయంలో తల్లిపాలను కలసి త్రాగారు. ఆ తర్వాత వారెప్పుడూ కలుసుకోలేదు. అయినా భగవాన్ విశ్వసనీయుడైన స్నేహితుడై, మీనాక్షి చివరి సమయంలో ఆమెను గుర్తుంచుకున్నారు.

లక్ష్మి కూడా, రెండేళ్ళ వయసులో రమణులతో పాటు ఆయన తల్లిపాలను త్రాగిన భాగ్యశాలి. ఆమె కాలానుగతంగా విధవరాలై, నెప్పితోనూ, బాధతోనూ చితికిపోయింది. అప్పటికి భగవాన్ పేరు ప్రఖ్యాతులు వ్యాపించినవి. ఒక రోజు భగవాన్ హాలులో ఉండగా, ప్రఖ్యాతి గాంచిన భక్తులు, పండితులూ ఆయన చుట్టూ ఉన్నారు. అరువదేళ్ళ వయసులో, నల్లగా, పీలగా, ఉన్న లక్ష్మి దాదాపు రెండు వందల మంది మధ్యనున్న భగవాన్ ఎదుట నిలబడి "భగవాన్ నన్ను గుర్తించగలరో లేదో, నాకు తెలియదు" అన్నది. "ఎందుకు గుర్తించలేరు? నువ్వు లక్ష్మివి కాదా? మనము చిన్నప్పుడు కలసి పాలు తాగలేదా?"" అని భగవాన్ అన్నారు. ఆయన అరువది ఏండ్ల తరువాత కూడా, తన స్నేహితురాలిని గుర్తుంచుకున్నారు.

వివేకమే రూపుదాల్చిందా అన్పించే భగవాన్ ఒక వజ్రం లాంటివారు. వజ్రంలోని ప్రతికోణమూ స్పష్టంగా, ప్రకాశవంతంగా ఉంటుంది కాబట్టి, మనం వజ్రానికి విలువనిస్తాము. భగవాన్ జీవితంలోని, బోధలలోని ప్రతిపేజీ కూడా, అదేవిధమైన స్వచ్ఛతతో మెరుస్తుంటుంది. చాలామంది భగవాన్ పట్ల శ్రద్ధ చూపిస్తారే తప్ప, ఆయన స్నేహశీలత్వాన్ని పట్టించుకోరు. చిన్నపుడు స్నేహితులై, ఇప్పుడు భక్తులుగా మారిన వారి పట్ల ఆయన సంబంధం ప్రబోధాత్మకంగా ఉంటుంది. వారు ఈయనను జ్ఞానిగా, మహాత్మునిగా గౌరవిస్తే, ఆయన వారిని చిన్ననాటి స్నేహితుల వలెనే చూచేవారు. భగవాన్ స్నేహితులూ, భక్తులూ అయిన వారిలో ఇద్దరు ముఖ్యమైన వారు. వారికి రెండు విషయాలలో పోలిక ఉంది. వారు సంసారంలో పూర్తిగా మునిగిపోయి ఉన్నారు. ప్రాపంచిక బాధ్యతల పట్ల ఎక్కువ మమకారం కల్గిన వారు, భగవాన్ వారిద్దరితోటీ ఎలా మెలగేవారో చూడడానికి ఆసక్తికరంగా ఉంటుంది. భగవాన్ వారిని కుటుంబంతో సంబంధాన్ని వదలి ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రారంభించమని చెప్పలేదు. దానికి బదులు తానే వారితో పాటు ఉండేవారు. కానీ వారు సంసార యాత్రలో అలసిపోయి, ప్రాపంచిక మమకారాల వల్ల పూర్తిగా డస్సిపోయినపుడు, ఆయన వారిని నెమ్మదిగా తనవైపునకు త్రిప్పుకున్నారు. ఆయన స్నేహితులు వారి కుటుంబ సమస్యలతో ఆయన వద్దకు వచ్చేవారు. అవి కేవలము ప్రాపంచిక విషయాలైనప్పటికి, అప్పటికింకా యువకుడైన భగవాన్ వారి సమస్యలను విని నిజమైన స్నేహితుని వలె వాటిని పరిష్కరించేవారు. ఆయన కేవలం సలహాలిచ్చి వదిలివేసేవారు కాదు. నిజంగా బాధ్యత తనమీద వేసుకుని వారి కష్టాలను తీర్చేవారు.

విలాచెరి రంగయ్యర్ అనే ఆయన భగవాన్ పుట్టిన ఊరైన తిరుచ్చుళిలో ఉండే వారు. ఆయనను 'రంగన్' అని కూడా పిలిచేవారు. ఆయన భగవాన్ బాల్యస్నేహితుడు, సహాధ్యాయి. వారిరువురి కుటుంబాలు దాదాపు ఒకే సమయానికి మధురై చేరుకున్నాయి. భగవాన్ అరుణాచలానికి పారిపోయే వరకూ, వారిద్దరూ చాలా సన్నిహిత మిత్రులుగా ఉండేవారు. 1903లో తొలిసారిగా, భగవాన్ అరుణాచలంలో ఉన్న విషయం రంగన్‌కు తెలిసింది. కానీ కుటుంబ బాధ్యతలలో కూరుకుని ఉండుట వల్ల, ఆయన వెంటనే వచ్చి భగవాన్‌ను కలుసుకోలేక పోయారు. కొన్ని సంవత్సరాల తర్వాత భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నపుడు ఆయనను కలిశారు. భగవాన్ స్నేహపూర్వకంగా, ఆయన జబ్బపై చరచి పలకరించారు. మొదట్లో, రంగన్, భగవాన్‌ను తన చిన్ననాటి స్నేహితుడు వెంకటరామన్ వలెనే చూసేవారు. "ఏమోయ్ వెంకట్రామన్ నువ్వు వెళ్ళే ముందు రోజు సాయంత్రం వరకు మనం కలసి ఫుట్‌బాల్ ఆడాము. నేను నీకు ముఖ్య స్నేహితుణ్ణి కదా. నువ్వు మర్నాడు వెళ్ళిపోతున్నట్లు నాకెందుకు చెప్పలేదు?" అని నిలదీశారు. "రంగా! నేనేమైనా మామూలు ప్రయాణీకుని వలె, సంచులు తీసుకుని బయలు దేరానా? ఏదో ఉన్నతమైన బలీయమైన శక్తి నన్ను అరుణాచలానికి లాగింది. ఇక మామూలు మర్యాదలు పాటించే అవకాశమెక్కడున్నదీ?" అని భగవాన్ అతనివైపు తదేకంగా చూశారు. తన సహాధ్యాయి, స్నేహితుడు, ఫుట్‌బాల్ ఆటగాడు, స్విమ్మింగ్‌పూల్‌లో (ఈత చెరువు) తన తోటి ఆడేవాడు అయిన వెంకట్రామన్, ఇక్కడున్న ఆయన ఎంతమాత్రం కాదని (ఎంతో ఎదిగిపోయాడని) రంగన్‌కు తెలిసింది. భగవాన్ ఒకప్పుడు గొప్ప ఈతగాడు. ఫుట్‌బాల్ ఆటగాడు. మల్లయుద్ధం చేసేవారు. ఆ రోజులలో భగవాన్‌ను చూచినవారు, ఆయన ఆరడుగుల పొడుగరి అనీ ధృఢకాయులనీ చెబుతారు. సామాన్య బ్రాహ్మణ బాలురకంటే ధృఢంగా ఉండేవారాయన. తన పదహారవ ఏట అహంకార మరణానుభవం సంభవించే వరకు ఆయన తలనొప్పిగాని, కడుపునొప్పి గానీ ఏ ఇతరమైన బాధలు గాని అనుభవించలేదు. ఆయన శరీరం అంత ధృఢంగా, ఆరోగ్యంగా ఉండేది. కానీ అరుణాచలేశ్వర ఆలయములో పాతాళ లింగం వద్ద ఉన్న తర్వాత ఆయన శరీరం అశ్రద్ధ వల్ల దెబ్బతిన్నది. రంగన్ భగవాన్‌లో ఈ మార్పు గమనించారు. ఇప్పటికే గురువు గారు ప్రఖ్యాతి చెందినందువల్ల కొంతమంది శిష్యులు అప్పటికే పోగయ్యారు. అయినప్పటికీ రంగన్ విరూపాక్ష గుహకు వచ్చినపుడు అంతే ప్రేమతో ఆయన ఆదరించారు.

వారి అనుబంధం చాలా చక్కగా ఉండేది. ఒకరేమో పరిపూర్ణమైన జ్ఞాని, మహాత్ముడు. రెండవ వారు, ఏ విధమైన ఆధ్యాత్మిక ఆసక్తిలేక, అజ్ఞానంతో నిండి, కుటుంబ బాధలలో మునిగిన వ్యక్తి. కానీ ఆయనకు భగవాన్ పట్ల గాఢమైన ప్రేమ. గురువుగారు ఆ గాఢమైన స్నేహాన్ని ఇష్టపడి, స్నేహితుని పడక ప్రక్కనే కూర్చునేవారు. సమస్యల భారంతో నిద్రపట్టక అటు ఇటూ పొర్లుతూ వేదనపడే మిత్రుని, నెమ్మదిగా తట్టి, 'హే రంగా! నిన్ను బాధపెడుతున్నదేమిటి?" అని అడిగేవారు. ఒకనాడు రంగన్ తన బాధలను ఆయనతో చెప్పారు. "నువ్వు ఇక్కడకు వచ్చేముందు, నీ కుటుంబం జరుగుబాటుకు ఏమైనా ఇచ్చి వచ్చావా?" అని భగవాన్ అడిగారు. తన కుటుంబానికి ఏమీ ఇవ్వలేని తన అశక్తతకు మిక్కిలి చింతిస్తూ, మౌనంగా ఉన్నారు రంగన్". అంటే నీకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నయ్యన్న మాట. నీకు పదివేల రూపాయలు లభిస్తే సరిపోతుందా?" అని అడిగారు భగవాన్. అప్పటి రోజుల్లో అది చాలా పెద్ద మొత్తము. భగవాన్ డబ్బు గురించి మాట్లాడడం రంగన్‌కు ఆశ్చర్యాన్ని కల్గించింది. భగవాన్ నొక్కినొక్కి అడిగారు. నీకు పదివేల రూపాయలు లభిస్తే నీ సమస్యలు మొత్తం తీరిపోతాయా? రంగన్ ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నారు. కొన్ని రోజుల తర్వాత, భగవాన్ వద్ద సెలవు తీసుకుని, చెన్నై వెళ్ళి, అక్కడ ట్రక్కులు, బస్సులు అమ్మే ఒక ఉద్యోగాన్ని సంపాదించుకున్నారు. ఆ తర్వాత లెక్క చూచుకుంటే ఆయనకు ఆ ఉద్యోగం ద్వారా వచ్చిన కమీషన్ సరిగ్గా పదివేల రూపాయలు.

ఒకసారి రంగన్ కుమారుని పాము కరవగా, జనం అతడు చనిపోయాడనుకున్నారు. అపుడు రంగన్‌కు భగవాన్ ఇచ్చిన విభూది గుర్తుకు వచ్చింది. (బహుశా రంగన్ ఏదైనా ప్రసాదమిమ్మని కోరి ఉంటారు. ఆయన విభూది ఇచ్చి ఉంటారు. తనంత తానుగా భగవాన్ సాధారణంగా ప్రసాదమిచ్చేవారు కాదు. దుఃఖిస్తున్న భార్యతోనూ, బంధువులతోనూ "ఏమీ విచారపడకండి. నా భగవాన్, నా స్నేహితుడున్నాడు అక్కడ" అని రంగన్ విభూదిని 'రమణ', 'రమణ' అని రమణ నామం స్మరిస్తూ తన కుమారుని శరీరానికి రాశారు. ఆ పిల్లవాడు కోలుకున్నాడు. ఇంకొకసారి, ఆయన పెద్ద కుమార్తె, మానసిక స్థిరత్వాన్ని కోల్పోయింది. ఆమె భర్త, ఆమె పట్ల శ్రద్ధ తీసికోవడం తన వల్ల కాక రంగన్ గారి సంరక్షణలో ఆమెను వదిలి వెళ్ళారు. రంగన్‌కు తన సమస్యలన్నిటికి ఒక్కటే పరిష్కారం. భగవాన్! రంగన్, భగవాన్‌కు లేఖ వ్రాశారు. త్వరలోనే

ఆయనకు ఆశ్రమం నుండి జవాబు వచ్చింది. "మీ ఉత్తరం భగవాన్‌కు చూపబడింది. భగవాన్ చాలాసేపు దానిని తన చేతిలో ఉంచుకున్నారు. ఆమెకు నయమవుతుందని మీకు జవాబు వ్రాయమన్నారు" అని ఉంది ఆ ఉత్తరంలో. మరొక సందర్భంలో ఆయన కుమార్తె బావిలో పడింది. ఆమెను బయటకు తీసినపుడు, అందరూ ఆమె చనిపోయిందనే అనుకున్నారు. రంగన్ తప్ప ప్రతి ఒక్కరూ రోదించసాగారు. రంగన్‌కు తన స్నేహితుని పట్ల అమితమైన విశ్వాసం. ఆయన వద్ద సకల రోగనివారిణి అయిన భగవాన్ విభూది ఉన్నది. ఆయన ఆ విభూదిని కుమార్తె శరీరంపై రాశారు. ఆమె కోలుకుంది.

ఒకప్పుడు రంగన్ భార్య చెల్లమ్మాళ్, భగవాన్ ఉండగా రమణాశ్రమానికి వెళ్ళింది. అక్కడ భక్తులందరూ, ఆశ్రమం నుండి గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. చెల్లమ్మాళ్ వారితోపాటు వెళ్ళింది. కానీ తిరిగి వచ్చి పాత హాలు చుట్టూ కొన్ని ప్రదక్షిణలు చేయసాగింది. భగవాన్ ఆశ్చర్యపోయారు. "ఇంత తొందరగా ఎలా వచ్చారు మీరు?" అని అడిగారామెను. "లేదు భగవాన్, మిగిలిన వాందరూ అరుణాచల ప్రదక్షిణ చెయ్యటానికి వెళ్ళారు. నా నడుమునొప్పి మూలాన, నేను వారితో వెళ్ళలేకపోయాను. అందుకని, గిరి ప్రదక్షిణ బదులు మీకే ప్రదక్షిణ చేద్దామనుకున్నాను" అన్నారామె. భగవాన్, ఆశ్రమ డాక్టర్ యం.ఆర్. కృష్ణమూర్తి గారిచే ఆమెకు ఇంజెక్షన్ ఇప్పించారు. గెస్ట్‌హౌస్ (అతిథి గృహం)లో విశ్రాంతి తీసికొనవలసినదిగా డాక్టర్ ఆమెకు సలహా ఇచ్చారు. కానీ భగవాన్ సన్నిధికి దూరంగా కొద్ది నిమిషాలు కూడా ఆమె ఉండలేక పోయింది. ఆమె నెమ్మదిగా నడుచుకుంటూ భగవాన్ హాలు వద్దకు వచ్చింది. ఆమె భర్త ఆదుర్దా పడ్డారు. ఆశీర్వదిస్తున్నట్లు భగవాన్ చెయ్యి పైకెత్తారు. చెల్లమ్మాళ్‌కు నడుము నొప్పి తగ్గిపోయింది. మళ్ళీ ఎప్పుడూ ఆమెకు నడుము నొప్పిరాలేదు. భగవాన్ వీరితో ఈ విధంగా వ్యవహరించడమనేది చాలా ప్రత్యేకమైనది. డబ్బు గురించి మాట్లాడడం, విభూదినివ్వటం, చెయ్యెత్తి దీవించి నొప్పి నయం చెయ్యడం, తన నిజమైన స్నేహితుని కోసమే ఇవన్నీ చేశారు. 'స్నేహం' అంటే ఏమిటి? అది ప్రేమ యొక్క ఒక ముఖమే. ప్రేమ అంటే ఏమిటి? ప్రేమంటే వివేకము, జ్ఞానము, భగవాన్ జ్ఞానానికే రాజు.

రంగన్‌తో భగవాన్ స్నేహం, విరూపాక్ష గుహకు చెందిన అనుభవాలకే పరిమితం కాలేదు. కొన్నిసార్లు రంగన్ పక్కపై పడుకుని ఉన్నపుడే, తెల్లవారుఝామున రెండింటికే భగవాన్ ఆయనను లేపి "పద ఈత కొట్టటానికి వెళదాం" అనేవారు. ఇప్పుడున్న రమణాశ్రమం కట్టక ముందు అక్కడొక చిన్న కొలను ఉండేది. రంగన్‌తో కొన్నిసార్లు భగవాన్, చిన్నప్పటి వెంకట్రామన్‌గా మారి పోయేవారు. వారి చిన్నతనంలో మధురైలో నీటిలో ఈదేటప్పుడు రంగన్ తొడపై గట్టి తన్ను తన్ని ఆయనను ఆటపట్టించేవారు. అప్పట్లో భగవాన్ చాలా బలంగా ఉండేవారు గనుక, ఆయన తన్నితే ఒక ఇనుప కడ్డీ పెట్టి కొట్టినట్లుండేది. తిరిగి ఇప్పుడు వారు ఈతకు వెళ్లినపుడు, భగవాన్ ఆటపట్టించడానికై రంగన్‌ను మరల తన్నారు. కానీ ఈసారి రంగన్ ఆయన పాదాన్ని పట్టుకుని, కళ్ళకద్దుకుని, తర్వాత తలమీద పెట్టుకుని ఇలా అన్నారు. "భగవాన్! మీకాలేమిటి ఇంత మెత్తగా తయారైంది? మీరు ఇదే పని మధురైలో చేసినపుడు, ఒక ఇనుపకడ్డీతో కొట్టినట్లుగా అన్పించేది. ఇప్పుడు మీ కాలు రోజాపువ్వు రేకు అంత మెత్తగా అన్పిస్తోంది". "అలాగా రంగా? ఆధ్యాత్మిక పరిపక్వత శరీరాన్ని కూడా మార్చివేస్తుంది కాబోలు" అని బదులిచ్చారు భగవాన్.

ఒకప్పుడు రంగన్, భగవాన్‌తో గిరి ప్రదక్షిణకు వెళ్తున్నపుడు, భగవాన్ ఒక ముల్లు మీద కాలు వేశారు. తనే వంగి ఆ ముల్లును తీసి వేసుకున్నారు. రంగన్ అప్పటి వరకు భగవాన్ పాదాలను గమనించి ఉండలేదు.కానీ కొంతదూరం వెళ్ళిన తర్వాత భగవాన్ ముళ్ళమీద కాలు వెయ్యడం చూశారు. భగవాన్, భగవాన్! మీ పాదంలో ఒక ముల్లున్నది. దయచేసి కూర్చుని, నన్నా ముల్లు తియ్యనివ్వండి. స్నేహితుని మాట విని భగవాన్ కూర్చున్నారు. రంగన్, భగవాన్ పాదాన్ని చూచినపుడు అందులో ఒకటి కాదు, లెక్కలేనన్ని ముళ్ళు ఉన్నాయి. భగవాన్ నిర్లిప్తంగా అన్నారు. "రంగన్! ఏ ముళ్ళు నువ్వు తీసివేస్తావు? పాతవా? కొత్తవా? దాని దారిన దానిని పోనివ్వు". "భగవాన్! మీరెలా నడుస్తారు?" అని రంగన్ అన్నారు. భగవాన్ నెమ్మదిగా అన్నారు. "చూడు. ఎప్పుడైనా ముల్లు కాలులో దిగబడితే, పాదాన్ని నేలకేసి రాస్తే, అంతా అదే సర్దుకుంటుంది".

రంగన్‌కు ఒకసారి భగవాన్‌ను ఆలింగనం చేసుకునే అవకాశం వచ్చింది. భగవాన్ చర్మము మృదువుగా, సున్నితంగా ఉండడం చూసి ఆయన ఆశ్చర్యపోయారు. మధురైలో ఉన్నపుడు ఆయన చర్మము గరుకుగా ఉండేది. ఎంత గరుకుగా అంటే ఆయన ఎవరినైనా రుద్దుకుంటే వారికి నొప్పి కలిగేటంత. రంగన్ ఆశ్చర్యంతో భగవాన్‌ను అడిగారు. "భగవాన్ మీ చర్మము యొక్క తత్వం ఎలా మారింది?" భగవాన్ మళ్ళీ అదే సమాధానం చెప్పారు. "ఆధ్యాత్మిక పరిపక్వత అన్నిటినీ

మార్చివేస్తుంది." ఒకసారి స్నేహితుడిగా చనువు తీసుకుని రంగన్ అడిగారు. "భగవాన్ మీ శిరసు కంపిస్తూ ఉంటుందెందులకు? మీకు, చేతి కఱ్ఱసాయమెందుకు నడవటానికి?" "రంగా! ఇది వృద్ధాప్యం వల్ల కాదు. నేను మరణానుభవం తర్వాత తిరువణ్ణామలై వచ్చి అరుణాచలుని పాదం వద్ద ఆశ్రయం తీసికొన్నప్పుడే, ఈ తల కంపించడం ప్రారంభించింది. ఆశ్చర్యంగా 'ఎందుకని?' అని అడిగారు రంగన్. భగవాన్ జవాబిచ్చారిలా. "ఒక ఉగ్రమైన మదపుటేనుగు, చిన్న పూరిగుడిసెలోనికి ప్రవేశిస్తే ఏమి జరుగుతుందో నువ్వు ఊహించగలవా? ఆ గుడిసెకు ఏమౌతుందో ఈ శరీరానికి అదే జరుగుతుంది. అది తునాతునకలైపోతుంది. ఈ విధంగా ఆధ్యాత్మిక అనుభవాల తీవ్రత, భగవాన్ శరీరాన్ని ప్రభావితం చేసింది.

ఒకసారి రంగన్, ఒక జ్యోతిష్యుణ్ణి కలవగా, ఒక సంవత్సర కాలం పాటు అంతులేనన్ని కష్టాలను అతను ఎదుర్కోవలసి ఉంటుందని ఆ జ్యోతిష్యుడు రంగన్‌తో చెప్పాడు.

ఆ జ్యోతిష్యుడు చెప్పిన సంగతిని రంగన్, తన లేఖలో భగవాన్‌కు వ్రాశారు. భగవాన్ వెంటనే చెంతనున్న భక్తులతో, రంగన్‌ను తన వద్దకు వచ్చి తనతోపాటు ఉండిపొమ్మని లేఖ వ్రాయమన్నారు. భగవాన్ ఈ విధంగా చెయ్యటం ఈ ఒక్కసారే చూశాము. రంగన్ వచ్చీరాగానే, నా వద్దనుండి దూరంగా వెళ్ళవద్దు, ఎల్లప్పుడూ నాతోనే ఉండు అన్నారు. చెన్నైనుండి ఒక స్నేహితుడు వారితో రెండు రోజులు గడపటానికి వచ్చారు. ఆయన వెళ్ళేరోజున, రంగన్ ఆయనతోపాటు రైల్వేస్టేషన్‌కు వెళ్ళటానికి సిద్ధమయ్యారు. భగవాన్ అపుడు రంగన్‌కు గట్టి సూచనలు చేశారు. "రంగన్ ఆయనను స్టేషన్‌కు తీసుకుని వెళ్ళి రైలెక్కించగానే వెంటనే నా వద్దకు తిరిగి వచ్చెయ్యి. ఇంకెక్కడకూ వెళ్ళవద్దు. రాత్రిపూట బస్తీలో గడపవద్దు. వెంటనే వెనుకకు వచ్చి నాచెంత ఉండు. కొన్ని నెలలు గడిచిన పిమ్మట, ఇక రంగన్ తిరిగి వెళ్ళవచ్చని భగవాన్ చెప్పారు. అతను ఇంటికి వెళ్ళునప్పటికీ అతని సమస్యలన్నీ తీరిపోవడం గమనించారు.

రంగన్, భగవాన్ బాల్యానికి చెందిన కొన్ని అద్భుతమైన కథలను తెలిపారు. భగవాన్ తండ్రి ఒక న్యాయవాది. ఆయన కోర్టుకు సంబంధించిన కాగితాలను ఇంట్లో ఒక అటకపై ఉంచారు. ఆయన స్నేహితులతో ఆడుకుంటున్నపుడు తండ్రిగారి ఆ కాగితాలను తీసి వాటితో కాగితపు పడవలు చేసి, ఆలయ కోనేరులో ఆడుకోవాలను కున్నారు. ఆయన తండ్రిగారికి ఆయన అంటే ఎంత వాత్సల్యమున్నప్పటికీ ఈ విషయం తెలియగానే ఆయన తీవ్రమైన కోపంతో మండిపడ్డారు. ఆయన భార్య అళగమ్మాళ్‌ను ఇలా ఆజ్ఞాపించారు, "అతని దుస్తులను తీసివేసి, కేవలము ఒక గోచీ ఉంచి, గుండుకొట్టించి, ఇంట్లోనుండి బయటకు పంపించు". చాలా సంవత్సరాల తర్వాత, రంగన్, భగవాన్‌ను విరూపాక్షగుహలో కలసినపుడు, ఆ సంఘటను గుర్తుచేసుకొని, "వెంకటరామన్, మీ నాన్నగారు నీ సన్యాసం గురించి ముందుగానే జోస్యం చెప్పారు. నీకు గుర్తుందా?" అని అడిగారు.

భగవాన్ స్కందాశ్రమంలో ఉండేటప్పుడు, రంగన్ తరచుగా ఆయన వద్దకు వస్తుండేవారు. ఒకరోజు ఆయన భగవాన్ లోపల పడుకుని ఉండడం చూశారు. అందుకని తలుపులు నెమ్మదిగా చేరవేసి రంగన్ బయటకు వచ్చారు. తీరా బయటకు వస్తే అక్కడ భగవాన్ ఎవరితోనో మాట్లాడుతూ కన్పించారు. క్షణం క్రిందటే ఆయన లోపల పరుండి ఉండడం తను చూశారు. అందుకని మళ్ళీ పరుగున లోనికి వెళ్ళిచూస్తే మళ్ళీ భగవాన్ పడుకునే ఉన్నారు. ఆయన భగవాన్‌తో ఆ విషయాన్ని చెబితే, భగవాన్ నవ్వుతూ తోసిపుచ్చారు. "నువ్వు ఆ దొంగని పట్టుకొని ఉండాల్సింది. విషయమేంటో తేల్చేవాళ్ళం" అన్నారు.

"భగవాన్! మీరు ఇంకా మధురైలో ఉండగానే, మీకు ఆత్మసాక్షాత్కారమైంది కదా!" అని రంగన్ అడిగారు. "నేను చదువుకుంటున్నపుడే అరుణాచలేశ్వరుడు, నాలోకి శక్తివంతంగా ప్రవేశించారు. అది నాకు తెలియనప్పటికీ, ఆయనే తన అనుగ్రహంతో తనని తాను నాకు తెలియజేశారు. నా శరీరం మొత్తం మండిపోతున్నట్లు అనిపించేది. ఆ క్షణంనుండే నేను సమాధిలో ఉండేవాణ్ణి." మీతో మాట్లాడటము, ఆటలు ఆడటము కొనసాగించినా, నేనెల్లవేళలా సమాధి స్థితిలోనే ఉండేవాణ్ణి. ఈ విషయాలన్నీ కేవలం రంగన్ ఒక్కరికే వెల్లడించారు భగవాన్.

ఒకరోజు భగవాన్ దంతాలలో ఒకదాని చిగుర్లు నల్లగా ఉండడం గమనించారు రంగన్. "భగవాన్ మీకు ఆరోగ్యకరమైన శరీరము మంచి పలువరసా ఉండేవి కదా!" అన్నారు రంగన్. భగవాన్ నిర్వికారంగా అన్నారు, "అవును. కానీ ఒకసారి నేను ఒంటరిగా ఇక్కడ ఉన్నపుడు, ఒక వ్యక్తి నాకు విషమిచ్చి మింగమన్నాడు. నేను మ్రింగేశాను. ఆ విషం నన్ను

చంపలేదు కానీ, నా చిగుళ్ళనీ పళ్ళనీ పాడుచేసింది". భగవాన్‌కు మూడుసార్లు విషము ఇవ్వబడింది. వింతగా చాలామంది మహాత్ములకీ విధంగా జరిగింది. ఉదాహరణకు యోగి రామ సూరత్ కుమార్ గారికి కూడా రెండుసార్లు విషం ఇవ్వబడింది.

కేవలం తన స్నేహాన్నే గాకుండా, తన బోధలను కూడా రంగన్‌తో పాలుపంచుకున్నారు భగవాన్. తన కుటుంబం, డబ్బు, అనేక రకాలైన ఇతర సమస్యలతో కొట్టుమిట్టాడుతుండబట్టి ఆధ్యాత్మిక సాధనకు కావలసిన స్థాయి తనలో లేదని రంగన్ తరచుగా అనుకుంటూ ఉండేవారు. నీ ఆలోచనలను బయటకు నెట్టు. ఏ ఆలోచనా లేనపుడు మాత్రమే స్వేచ్ఛను అనుభవించగలవు" అనేవారు భగవాన్. దురదృష్టవశాత్తు, ఈ సలహాను పాటించడం, రంగన్‌కు కష్టంగా ఉండేది. ఆధ్యాత్మికంగా పురోభివృద్ధిని సాధించడం తనకసాధ్యమని భావించిన రంగన్, "నేను జ్ఞానాన్ని పొందాలంటే ఇంకెన్ని జన్మలు ఎత్తాల్సి ఉంటుంది? అని భగవాన్‌ను అడిగారు. దానికి భగవాన్ ఒక చక్కటి సమాధానమిచ్చారు. "నిజానికి కాలము, దేశము అనేవి లేనేలేవు. ఒక్క గంటలో, ఎన్నో రోజులూ, సంవత్సరాలూ గడచిపోయినట్లు కలగంటాము. సినిమాలో కేవలం నీడలే గొప్ప సముద్రాలుగా, పర్వతాలుగా, భవంతులుగా మారిపోయినట్లు నువ్వు చూడడం లేదా? ఈ ప్రపంచం నీకు బాహ్యంగా లేదు. అంతా నీలోపలనే జరుగుతున్నది, ఒక సినిమాలాగానే. నీ మనస్సులో చిన్న ప్రపంచమే బాహ్యంలో పెద్ద ప్రపంచంలాగా కనపడుతుంది. తర్వాత, "భగవాన్! మీ అనుగ్రహం నామీద లేదు" అని వాపోయాడు రంగన్. "ఒకడు వరదలో ఉన్న గంగా నది నీటిలో నిలబడి, నాకు దప్పిక వేస్తున్నది. మా ఇంటిలోని పంపునుండి నీటిని తెచ్చి నా దాహం తీర్చండి అంటే ఎలా ఉంటుందో, నీ మాటలు అలా ఉన్నవి," అన్నారు భగవాన్, రంగన్‌తో.

దక్షిణభారతదేశంలోని కుంభకోణం అనే ఊరిలో ప్రతి పన్నెండేళ్ళ కొకసారి, గొప్ప ఉత్సవం జరుగుతుంది. లక్షలాది మంది ఈ ఉత్సవానికి హాజరౌతారు. తన కుటుంబంతో సహా తాను ఆ ఉత్సవానికి వెళ్తున్నట్లు రంగన్, భగవాన్‌కు వ్రాశారు. కానీ, అనుకోకుండా ఆ ఉత్సవం రోజున రంగన్, భగవాన్ వద్దకు వచ్చారు. ఆశ్చర్యంతో భగవాన్ ఇలా ప్రశ్నించారు, "నువ్వు ఇక్కడేం చేస్తున్నావు? ప్రతి వాళ్ళు ఆ ఉత్సవానికి కుంభకోణం వెళ్తుంటే నువ్వెందుకు ఇక్కడకు వచ్చావు?" ప్రగాఢమైన భక్తితో రంగన్ ఇలా అన్నారు, "ఇక్కడున్న దేవుడు కుంభకోణంలోని దేవునికంటే గొప్పవాడు అని గుర్తించాను కాబట్టి నేనిక్కడకు వచ్చాను." కొన్నిరోజుల తర్వాత, వెళ్ళిపోవల్సిన సమయం వచ్చినపుడు, భగవాన్‌నుండి దూరమై పోతున్నాననే బాధతో పెద్దగా ఏడ్చారు రంగన్. భగవాన్, ఆయనను ఇలా ఓదార్చారు. "రంగా! నువ్వు కుంభకోణంనుండి వచ్చినట్లు, మధురై వెళ్ళిపోతున్నట్లు, ఊహించుకుంటున్నావు. నిజానికి నువ్వెప్పుడు ఎక్కడ ఉన్నావో, ఇప్పుడు కూడా అక్కడే, అంటే నాతోనే ఉన్నావు. నాతో ఉన్నప్పుడు నువ్వు ఉత్సాహంగా ఉంటావు. కానీ,నీవు నీ స్వీయప్రయత్నంతో ఆత్మలో స్థిరపడితే, నాలో ఏ ప్రత్యేకతా లేదని,నువ్వప్పుడు గుర్తిస్తావు. నీవుకూడా ఆత్మవేనని గుర్తిస్తావు. కొన్నిసార్లు భగవాన్ అనేవారు, "ఎక్కడైతే మాటలులేవో అక్కడ నేనున్నాను". అపుడు రంగన్ అన్నారు, "అయితే మీరెందుకు మాట్లాడతారు?" "కేవలం కరుణతో," అనేది భగవాన్ సమాధానం. ఒకప్పుడు, రామస్వామిపిళ్ళై అనే వేరొక భక్తుడు తన తాళాల గుత్తిని పోగొట్టుకున్నారు. ఆయన భగవాన్ వద్దకు వచ్చి, "నా తాళాలను పోగొట్టుకున్నాను," అన్నారు. భగవాన్ ఇలా జవాబిచ్చారు, "తాళాలు ఎప్పుడూ ఎక్కడ ఉంటాయో అక్కడే ఉన్నవి. అవి ఎప్పుడూ పోలేదు. మీకు జ్ఞాపకం లేకుండా పోయింది. ఆత్మ ఎల్లప్పుడూ ప్రతి చోటా ఉంది. కానీ మన అజ్ఞానం వల్ల మన సమయమంతా ఆత్మను వెదుకుతూ గడిపేస్తాం."

ఇప్పటి రమణాశ్రమానికి వచ్చిన తర్వాత, అచటి ఆశ్రమవాసులలో ఎన్నో లోపాలు కన్పించాయి రంగన్‌కి. దానిని గురించి ఆయన ఇలా అన్నారు. "భగవాన్! ఇదెలా సాధ్యం? మీ చుట్టూ ఉంటూ కూడా మీ భక్తులలో అహంకారం పెరిగిపోతున్నది." భగవాన్ జవాబిచ్చారు. "మరి అహంకారం ఏ విధంగా నశిస్తుంది? అది ఒక వ్యక్తిలోనుండి బయటకు రావాలి. కావున ఇది కేవలం శుద్ధి చేసే విధానమే. పెంపు చేసే విధానము కాదు." ఒకసారి రంగన్ అడిగారు, "ఎందుకు మీరు ఈ రాళ్ళతో నిండిన కొండను దేవుడు అని పొగుడుతారు?" భగవాన్ అన్నారు, "అరుణాచలమంటే కేవలం పెద్ద బండరాళ్ళ గుట్ట అనుకుంటున్నావా నువ్వు? అనేకమంది పవిత్రమైన మహాత్ములు, యోగులూ ఇప్పటికీ ఈ కొండగుహల్లో ఉన్నారు. అరుణాచలుడే దేవుడు. ఆయనే శివుడు, ఆయనే చైతన్యము, ఆయనే నీ హృదయంలోని దివ్యత్వము".

స్నేహితుల మధ్య (పరిహాసోక్తి) సరసోక్తులు జరిగినట్లే, రంగన్‌కు, భగవాన్‌కు మధ్య ఛలోక్తులు జరుగుచుండేవి. ఒకసారి రంగన్ ఇలా అడిగారు, "భగవాన్, మీరింకా జీవితంలో సాధించవలసినదేమైనా ఉందా?" భగవాన్ అన్నారు, "అన్నీ

సాధించబడినవి. ఏది వదలివేయబడలేదు." "ఏదీ అంటే ఏమిటి భగవాన్?" అని స్నేహితుడాయనను అడిగారు. "నేనేది కావాలనుకుంటే అది కాగలను." రంగన్ అపుడు ఎదిగిన కుమార్తెతో వచ్చి ఉన్నారు. అందుకని ఆయన అన్నారు, "అయితే నేనొకపిల్లను తీసికొని వచ్చి, ఆమెతో మీ వివాహము జరిపించనా?" "తప్పకుండా" అని బదులిచ్చారు భగవాన్. తర్వాత భగవాన్ నవ్వుతూ అన్నారు, "గత ఇరువది సంవత్సరాలుగా, రంగన్ ఎప్పుడు వచ్చినా నేను భయపడుతూ ఉండేవాణ్ణి. ఎక్కడ ఒక పిల్లను తీసుకుని వచ్చి నాతో వివాహం జరిపిస్తాడేమోనని. నేను నిజంగానే రంగన్ అంటే భయపడేవాడిని."

రంగన్ మరల సమస్యలలో కూరుకునిపోయారు. ఆయన భార్య జబ్బు పడింది. కుమార్తెలకు వివాహాలు కాలేదు. ఆయన ఉద్యోగం పోయింది. ఆయన ఇంటిని తాకట్టు పెట్టి తెచ్చిన ఋణం తీర్చలేకపోయారు. భగవాన్, "వచ్చి నాతో ఉండు," అన్నారు. భగవాన్ చాలా కఠినంగా ఉన్నారు. ఎందుకంటే రంగన్ ఎప్పుడూ ఫిర్యాదుచేస్తుండేవారు. "భగవాన్! మీరు ఇతరుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నారు. కానీ మీరు నాతో మాట్లాడడం కూడా లేదు. మనమెంత స్నేహంగా ఉండేవాళ్ళం. నేను నా సమస్యల వలన ఎంతో దుఃఖంతో ఉన్నాను. కానీ మీరు మాత్రం నాపై కొద్దిగా కూడా కరుణ చూపించడంలేదు. ఇది నిరంతరం రంగన్‌పెట్టే నస. భగవాన్ రాతివలె ఉండిపోయారు. దాదాపు నెలా, రెండు నెలలు, పగలూ రాత్రీ ఇలా గడిచిపోయినవి. రంగన్ శోకాలకు (ఏడ్పులకు) భగవాన్ నిశ్చల మౌనమే సమాధానమయింది. వేసవిలో ఒకనాటి రాత్రి, రంగన్ ఇక ఏ మాత్రమూ భరించలేకపోయారు. ఆయన భగవాన్ కాళ్ళపైబడి ఏడ్చారు. "నేనిక వదిలేది లేదు. మీరు నాకు జవాబిచ్చి తీరాల్సిందే. నేను బాధతో ఉన్నాను. కరుణించండి. మీరు కనీసం నా ముఖం కూడా చూడటంలేదు. దయచూడండి." భగవాన్ ఆయనను పైకి లేవనెత్తి ఆకాశం వైపు చూపించారు. తిరువణ్ణామలైలో మేఘాలు లేని వేసవిరాత్రులలో నక్షత్రాలు వజ్రాలవలె ధగధగ మెరుస్తున్నాయి ఆకాశంనిండా. ఈ క్రింది సంభాషణ ద్వారా రంగన్‌కు లోతైన అవగాహన కల్పించాలనుకున్నారు భగవాన్.

భగవాన్ అన్నారు, "చూడు ఈ విశ్వం అన్నిటిలోకి అతి చిన్న నక్షత్రాన్ని. ఆ సూర్యుడు ఒక నక్షత్రమే. సూర్యునితో పోలిస్తే మన భూమి చాలా చిన్నది. ఆ చిన్న నక్షత్రంతో పోలిస్తే మన సూర్యుడు చిన్నవాడు. నీకు అర్థమౌతుందా?" రంగన్, "అవును. భగవాన్". "కనుక ఆ నక్షత్రంతో పోలిస్తే సూర్యుడే చాలా చిన్నవాడు. సూర్యుడే చిన్నవాడైతే భూమి ఎంత చిన్నది?" అన్నారు భగవాన్. రంగన్, "అవును. భగవాన్ భూమి చాలా చిన్నది." భగవాన్, "ఆ నక్షత్రంతో పోలిస్తే ఆసియాఖండం ఎంత పెద్దది?" రంగన్, "భగవాన్, అది చిన్న బిందువు అంతది." భగవాన్, "ఆ నక్షత్రంతో పోలిస్తే అరుణాచలం ఎంత ఉంటుంది?" రంగన్, "భగవాన్ అది మరీ చిన్న బిందువు అంత ఉంటుంది." భగవాన్, "ఆ నక్షత్రంతో పోలిస్తే రమణాశ్రమమెంత ఉంటుంది?" రంగన్, "అది మరీ మరీ చిన్న బిందువు భగవాన్." భగవాన్, "ఆ నక్షత్రంతో పోలిస్తే నువ్వెంత?" ఇది రంగన్ కళ్ళు తెరిపించింది. భగవాన్, "ఎల్లవేళలా నువ్వు, అతి చిన్న బిందువైన నీ గురించే ఆలోచిస్తావు," అని ముగించారు. ఇది వెంటనే రంగన్ హృదయ కవాటాన్ని తెరిచింది. ఆయన భగవాన్ కాళ్ళపైబడి వెక్కి వెక్కి ఏడ్చారు. భగవాన్ దయతో ఆయనకు జ్ఞాన పారవశ్యం కలిగింది.

మర్నాడు రంగన్ నిద్రపోలేకపోయాడు. ఆయన భగవాన్ ప్రక్కనే పడుకున్నారు. భగవాన్ ఆయనను ఇంటికి వెళ్ళమని చెప్పారు. ఆయన తిరిగి ఇంటికి వెళ్ళేసరికి, ఆయన సమస్యలన్నీ తీరిపోయినవి. కరుణా పూరితుడు, దయాంతరంగితుడైన భగవాన్ ఆ స్నేహితుడిని కాపాడారు. ఆయన ప్రాపంచిక సమస్యలు దూరమగుటే కాదు, ఆయనకు ఆధ్యాత్మిక జ్ఞానం కూడా కల్గింది. ఒక మహాత్ముడు, ఒక భక్తుని తన వద్దకు ఆకర్షిస్తే (రప్పించుకుంటే) చాలామంది విషయంలో, వారి కుటుంబం మొత్తాన్నీ తన ప్రేమ తోటీ, జ్ఞానంతోటీ రప్పించుకుంటారు. రంగన్ విషయంలో కూడా, ఆయన తల్లి, భార్య, సోదరులు కూడా ప్రేమ జాలంలో చిక్కుకుని పూర్తిగా ఆయన భక్తులుగా మారిపోయారు.

రంగన్‌కి ఒక సోదరుడు ఉన్నారు. ఆయన భగవాన్ సహాధ్యాయి (క్లాస్‌మేట్). ఆయన పేరు మణి. ఆయనకు 'పోకిరి మణి' అని మారుపేరు ఉండేది. ఆయన భారీశరీరంతో, దృఢంగా ఉండేవారు. ఆయన ఎక్కడకెళ్ళినా జనాన్ని భయపెడుతుండే వారు. ఎవరూ ఆయనతో తగాదా పెట్టుకోవడానికి ధైర్యం చేసేవారు కాదు. ఆయన చెప్పిన దానికి ఎదురాడే వారు కాదు. రంగన్ తల్లి, భగవాన్‌ను చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు మాత్రమే చూసి ఉన్నప్పటికీ, ఆయనపట్ల గాఢమైన భక్తి కల్గి ఉండేది. తర్వాత విరూపాక్ష గుహలో భగవాన్‌ను చూచినపుడు ఆమెలో పూర్తి మార్పువచ్చింది. దురదృష్ట వశాత్తు ఆమె కుమారుడు,

ఆమె ఆధ్యాత్మిక ఆశయాలలో పాలుపంచుకోలేదు. ఒకప్పుడు వారు తిరుపతి వెళ్తున్నపుడు, రైలు తిరువణ్ణామలై గుండా వెళ్ళింది. మణి తల్లి, "ఇక్కడ దిగి మన వెంకట్రామన్‌ను చూద్దాము," అని ప్రాధేయపడి అడిగింది. "నాకు ఈ కపట సన్యాసులంటే నమ్మకంలేదు. నేను రాను," అన్నారు మణి. ఆయన ఆమెను తిరుపతి తీసుకుని వెళ్ళారు. తిరిగి వచ్చేటపుడు ఆవిడ మళ్ళీ బ్రతిమలాడింది. "నేను నా వెంకటరామన్‌ను చూడవలసిందే. లేనిచో నేను ఇంటికి రాను," అని ప్రాధేయపడింది. పోకిరి మణి చివరికి ఒప్పుకున్నారు. "కేవలం నీమీద జాలితో నిన్నక్కడకు తీసుకుని వెళ్తాను. కానీ నేనాయనకు సాష్టాంగపడను. ఆయన ముందు మర్యాదగా మాట్లాడను. నేను ఎప్పటి పోకిరి మణి లాగానే ఉంటాను. నేను ఈ ఆధ్యాత్మిక జనులను గౌరవించను. నిజానికి నీకు గనుక అభ్యంతరం లేకపోతే, నేను ఆయన చెవి మెలిపెట్టి, మధురైకు లాక్కొని వచ్చి, వాళ్ళ అమ్మ దగ్గర వదిలేస్తాను. ఇంత చిన్న వయసులోసన్యాసమేమిటి? అర్థం పర్థం లేని మాటలు కాకపోతే" అన్నారు మణి.

విరూపాక్షగుహ వద్ద రంగన్ తల్లి భగవాన్‌కు సాష్టాంగ నమస్కారం చేస్తుంటే, పోకిరిమణి మాత్రం మొండిగా నుంచున్నారు. అపుడు భగవాన్ ఆయనవైపు మామూలుగా చూశారు. ఆ మరుక్షణం మణి శరీరం భగవాన్ ముందు సాష్టాంగపడింది. తనకేమయిందో తనకే తెలియదు. కొంతసేపటి తర్వాత, అతను లేచి భగవాన్ వంక చూశాడు. ఈసారి ఏదో జరిగింది. ఆయనలో ఏదో మార్పు వచ్చింది. ఆయన తల్లి అపుడు భగవాన్‌ను అడిగారు. "భగవాన్! ఇతడెవరో మీకు తెలుసా? మీరు ఇతనిని గుర్తించారా?" "ఆ! ఎందుకు తెలియదు. ఇతడు మన పోకిరి మణి కాదా," అన్నారు భగవాన్. మణిలో ఎంత తీవ్రమైన మార్పు వచ్చిందంటే, ఆయన ఈ కొసనుండి ఆ కొసకు మారారు. ఆయన రంగన్ కంటె గొప్ప భక్తుడిగా మారిపోయారు. ఆయన భగవాన్‌ను సాక్షాత్తు దైవంగా భావించి, ఎంతో గౌరవించే వారు. భగవాన్ అంటే ఆయనకెంత గౌరవమంటే, కొన్నిసార్లు ఆయన భగవాన్ గుహకు బయటనే ఆగి, ఎవరినైనా బ్రతిమలాడి, 'బ్రహ్మ వచ్చాడని చెప్పండి' అనేవారు. ఆయన ఉద్దేశ్యమేమిటంటే భగవాన్ శక్తివంతమైన దేవుడైన శివుడు, తనేమో అంతకంటె కొంచెం తక్కువ దేవుడైన బ్రహ్మ. ఏదేమైనప్పటికీ తను కూడా దేవుడే.

ఒకానొక సందర్భంలో, వారి కుటుంబమంతటికీ శంకరాచార్య మంత్రదీక్ష ఇచ్చారు. కానీ మణి వారి ననుసరించడానికి ఒప్పుకోలేదు. నేను మానవుల వద్దనుండి మంత్రదీక్ష తీసుకోను వాళ్ళు పవిత్రమైన వాళ్ళు అని మీరు చెప్పినా సరే. నేను భగవంతుని నుండే దీక్ష తీసుకుంటాను. నా దైవం రమణమహర్షి. అతను తర్వాతి రైలులో తిరువణ్ణామలైకు వెళ్ళి భగవాన్‌తో ఇలా చెప్పారు. "మా కుటుంబసభ్యులందరూ మంత్రదీక్ష తీసుకొనటానికి శంకరాచార్యుల వారి వద్దకు వెళ్ళారు. నేను నేరుగా మీనుండి మాత్రమే దీక్ష తీసుకుంటానని వారితో చెప్పి, అందుకోసమే మీ దగ్గరకు వచ్చాను. భగవాన్ నవ్వసాగారు. అదేం కుదరదు. మీరు నాకు మంత్రమిచ్చే వరకు నేనిక్కడినుండి కదిలేది లేదు. భగవాన్ చిరునవ్వుతో మౌనంగా ఉన్నారు. మణి తన మొండిపట్టుదల వదలలేదు. చివరకు భగవాన్ ఆయనవైపు చూచి "శివ, శివ" అన్నారు.

ఆ క్షణంనుండి, ఆయన ఎల్లపుడు శివనామాన్ని జపిస్తూ, పూర్తిగా మారిపోయారు. ఆయన క్షయరోగం బారినపడినప్పటికీ, రోజంతా, ప్రతి నిముషం తన మంత్రజపం కొనసాగించేవారు. కొద్ది రోజులలోనే, ఒకప్పటి పోకిరి అయిన ఆయన ముఖం ప్రకాశవంతంగా మారటం ఆయన కుటుంబ సభ్యులు గమనించారు. చనిపోయేముందు, నా దైవాన్ని నేను దర్శించుకోవాలి అన్నారాయన. వారాయనను ఇప్పటి రమణాశ్రమానికి తీసుకుని వెళ్ళారు. అక్కడ, ఆయన భగవాన్‌తో, "భగవాన్! నేను ఈ శరీరాన్ని వదలిపెట్ట బోతున్నాను. కాబట్టి ఈ శరీరానికి తమ ఆశీస్సులను ఇవ్వండి." భగవాన్‌కు పోకిరిమణి విషయం ఎప్పుడూ వింతగానే ఉండేది. మణి ఎప్పుడు ఏమి చేస్తాడో ఎవరికీ అంతుచిక్కేది కాదు. అతను క్రిందకు దిగి భగవాన్ ఆసనం చుట్టూ మూడుసార్లు అంగప్రదక్షిణం (పొర్లుదండాలు) చేసి, "ఇక ఈ శరీరం యొక్క యాత్ర అయిపోయింది," అన్నారు ఆయన. శివ, శివ అని శివనామాన్ని జపించుతూ ఇంటికి చేరారు. శరీరాన్ని వదిలే ముందు దుఃఖిస్తున్న తన భార్యతో, "ఏమీ దిగులుపడవద్దు. నేను నిన్ను విడిచిపెట్టట్లేదు. నేను వెనుకకు తిరిగి వచ్చి నలభై రోజుల తర్వాత నిన్ను నాతో తీసుకుని వెళ్తాను," అని చెప్పారు. ఆ విధంగానే సరిగ్గా నలభైరోజులకు ఆయన భార్య చనిపోయారు.

గురువు అనుగ్రహం ఎప్పుడైతే నీమీద ఉంటుందో, ఆ క్షణం నుండీ ప్రతి పనీ నీద్వారా జరిగిపోతుంది. నీచేత చెయ్యబడడం కాకుండా, అదే మహత్తరమైన తేడా. నీచేత చెయ్యబడడం (నువ్వే చేస్తున్నట్లుగా ఉండడం) అనేది, అహంకారం వల్ల నీ ద్వారా (నువ్వు ఆయన చేతిలో పనిముట్టువై) జరగడం, అనుగ్రహం వల్ల జరుగుతుంది.

సాబ్‌జాన్



భగవాన్ యొక్క ఇంకొక ప్రత్యేకమైన (ముఖ్యమైన) స్నేహితుడు సాబ్‌జాన్. ఆయన ముస్లిమ్. భగవాన్ సహాధ్యాయి. ఆయనను కలిసి, భగవాన్‌పట్ల ఆయన భక్తిని ప్రత్యక్షంగా చూడగలిగే అవకాశం నాకు వచ్చింది. ఆయన నైవేలిలో, నా సోదరులు సుందరం పనిచేస్తున్న చోటనే ఉండేవారు. "నా తోటి ఉద్యోగి తండ్రి భగవాన్‌తో ఉండేవారట," అని సుందరం పంపిన సందేశం నాకు ఆనందాన్నిచ్చింది. నేను వెంటనే నైవేలీకు వెళ్ళాను. సాబ్‌జాన్ నాల్గవ తరగతి నుండి ఆరవ తరగతి వరకు, భగవాన్‌తో కలిసి చదివారు. ఆయనతో ఫుట్‌బాల్ కూడా ఆడారు. ఆయనకిప్పుడు తొంబది ఏళ్ళు. కంటిచూపు లేదు. ఏమైనప్పటికీ, నేను వారింటికి వెళ్ళేరోజున, "నా క్లాస్‌మేట్ వెంకటరామన్ ఇవాళ వస్తున్నారు. ఆయన నన్ను చూడడానికి వస్తున్నారు" అని తన కుమారునితో చెప్పారు. నేను ఆయనకు అభివాదం చేసినపుడు, ఆయన నన్ను వెంకట్రామన్ అని పిలచారు. ఆయన కుమారుడు, నాన్నా! ఈయన గణేశన్, గణేశన్, అని పదే పదే సరిచేసి చెబుతున్నా ఆయన విన్పించుకోలేదు. "అవును. వెంకట్రామన్, రండి," అని సాబ్‌జాన్ అన్నారు. ఆయన నన్ను తాకి, ఆలింగనం చేసుకుని, తన ప్రక్కన కూర్చోబెట్టుకుని కన్నీటితో అన్నారు. ఆయన నన్ను తీసుకుని వెళ్ళటానికి వచ్చారు. నన్ను ఆశీర్వదించడానికి వచ్చారు. నా స్నేహితుడు నిజమైన స్నేహితుడు.

ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి, తన విలువైన క్లాస్‌మేట్‌ను గురించి చెప్పమని కోరాను. ఆయన జ్ఞాపకాల వెల్లువ మొదలైంది. "వెంకట్రామన్‌కు తమిళం బాగా వచ్చు. ఆయన తమిళంలో క్లాసు ఫస్ట్ వచ్చేవారు. ఆయనకు తమిళ వ్యాకరణంలోని సూత్రాల గురించిన పరిజ్ఞానం బాగా ఉన్నది. మా తమిళపండితులు (టీచర్) జాన్ బాలక్రిష్ణకు ఆయనంటే బాగా ఇష్టము. ఇంగ్లీషు ఆయనకు పెద్ద బాగా రాదు. మిగిలిన సబ్జెక్టులలో సగటు వారికంటె కొంచెం మిన్నగా ఉండేవారు. మొత్తం మీద ఆయనకు పాఠశాల పుస్తకాలంటే పెద్ద ఆసక్తి ఉండేదికాదు. ఆయనకు ఆటలంటే ఇష్టము. ప్రత్యేకించి ఫుట్‌బాలంటే. విద్యార్థిగా కూడా ఆయన ఎక్కువ భక్తితో ఉండేవారు. అప్పుడే ఆయన తిరుప్పరన్ కున్రమ్‌లోని సుబ్రహ్మణ్యస్వామి గుడి చుట్టూ భక్తి పారవశ్యంతో ప్రదక్షిణలు చేసేవారు. ఆయన తనతోపాటు నన్ను కూడా తీసుకుని వెళ్ళి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేయించేవారు. "దేవుని సృష్టిలో అంతా ఒకటే. అందరూ ఒకటే. దైవమూ ఒక్కటే. దేవుళ్ళలో ఈ కన్పించే తేడాలను మనం సృష్టించుకున్నవే," అనేవారు నాతో. చిన్నతనం లోనే నాలో విశాలదృక్పథం ఆయనచే నాటబడుట చేత, తర్వాత నేను కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్‌కు గొప్ప భక్తుణ్ణి కాగలిగాను.

వెంకట్రామన్ కన్పించకుండా పోయినపుడు, ఇంట్లో నుండి వెళ్ళిపోతానని నాకు చెప్పలేదని ఆవేదన చెందాను. తర్వాత నేను పోలీసుడిపార్టుమెంట్‌లో జేరాను. 1903లో ఉత్తరామెరూర్‌లోని ఒక షాపులో వెంకట్రామన్ ఫోటో చూచి ఆశ్చర్యపోయాను. అందులో ఆయన రూపం పూర్తిగా మారిపోయి ఉన్నారు. నేను, ఆ కొట్టు యజమానికి ఆ ఫోటో ఎలా వచ్చిందో తెలుసుకోవాలని ఆతృతపడ్డాను. ఆ ఫోటో తిరువణ్ణామలైలోని ఒక బ్రాహ్మణస్వామిదనీ, ఆయన అప్పుడు మౌనంలో ఉన్నారని తెలిసింది. నేను నా పాతమిత్రుణ్ణి కలవాలనే ఆత్రంతో ఆయన ఉన్నచోటుకు వెళ్ళాను. ఆయన మౌనంగా ఉన్నప్పటికీ, ఎంతో సంతోషంతో నన్ను ఆదరించారు. ఆయన చక్కటి చిరునవ్వుతో తల ఊపారు. ఇదివరకటి కంటే, మహాత్ముని లక్షణాలతో మరింత అందంగా కన్పిస్తున్న నా క్లాస్‌మేట్‌ను కలవడం నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది.

మరల నేను తిరుపత్తూర్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నపుడు, నేను ఇప్పటి రమణాశ్రమానికి వెళ్ళాను. ఆ సమయంలో, మా తండ్రిగారు చనిపోయి, నేను చాలా బాధలో ఉన్నాను. శ్రీరమణులు తన తల్లి సమాధిని చూపించారు. దానితో నేను కొంత ఊరట చెందాను. ఆయన చేసినపని వల్ల, శరీరానికి ఎప్పటికైనా మృత్యువు తప్పదని నాకర్థం అయింది. ఆ తర్వాత ఆయనను చూడానికి చాలాసార్లు వెళ్ళాను. వెళ్ళిన ప్రతిసారీ, నన్ను ప్రత్యేక శ్రద్ధతో చూసి, అక్కడున్న వారందరికీ నన్ను పరిచయం చేసేవారు. ఆయన భోజనం చేసేటప్పుడు, భోజనశాలలో, నన్ను తన ప్రక్కనే కూర్చోపెట్టుకునే వారు. అట్లా

ఆయన (ఎవరి విషయంలోనూ) ఎప్పుడూ చెయ్యరని నాకు తర్వాత తెలిసింది. ఆయన స్నేహితుడినైన నేను ఆయన భక్తుడిగా మారిపోయాను. నాలో అంతర్గతంగా తెచ్చిన మార్పే, ఆయన నాకిచ్చిన గొప్పవరం. ఒకసారి కలలో, నా భార్య చనిపోబోతుందనే సూచనలు, ఒక నిగూఢమైన భావగర్భితమైన రీతిలో చూపించి నన్ను ఓదార్చి, నన్ను ఆ అత్యంత బాధాకరమైన సంఘటనను ఎదుర్కోవడానికి సిద్ధంచేసిన గొప్పతనం ఆయనది. కలలో చెప్పబడ్డ రీతిలోనే, చాలా తక్కువ కాలంలోనే నా భార్య చనిపోయింది. కానీ మహర్షి అనుగ్రహం వల్ల, ఆ సంఘటన నన్ను ఎక్కువగా ప్రభావితం చెయ్యలేదు. ఆయనకు భగవాన్ పట్ల గల ప్రేమకు, భక్తికి, నేను చలించి పోయాను. నేను ఆయనతో చాలా కొద్దిగానే మాట్లాడాను. నేను వెళ్ళిపోయిన తర్వాత, ఆయన తన కుమారునితో, "నా వెంకట్రామన్ నిజమైన స్నేహితుడు. ఆయన నాకు వీడ్కోలు పలకటానికి వచ్చారు," అన్నారు. రెండురోజుల తర్వాత ఆయన చనిపోయారు.



టి.కె. సుందరేశ అయ్యర్



భగవాన్ యొక్క పాతభక్తులను గురించి చదువుతున్నా, వింటున్నా,ప్రతి క్షణమూ మనం వాళ్ళ అడుగుజాడల్లో నడుస్తాము, సహజంగానే. ఏ అరుణాచలునిలో అయితే వారు ఐక్యమయ్యారో, ఆయనకు, మనము కూడా చేరువ అవుతాము. వారి గురించి పాత భక్తులైన విశ్వనాధస్వామి, కుంజుస్వామి, అన్నామలైస్వామి, మొదలైన వారి ద్వారా విన్నపుడు, నేను మౌనపారవశ్యంలో మునిగిపోయేవాణ్ణి. ఈ పారవశ్యాన్ని అనుభవించాలంటే, మనం చేయవలసిందల్లా భగవాన్ చెప్పినది వినటమే. "నీ ధ్యాసను అసత్యమైన వాటిమీద నుండి తీసివేసి సత్యం వైపునకు మళ్ళించు. అసత్యమైన దేమిటంటే, దేహాత్మభావన (శరీరమే నేననే భావన) మరియు ప్రపంచము, కాబట్టి మన ధ్యాసను, అసత్య విషయాలనుండి మళ్ళించి, ఈ అమృత మూర్తులైన గొప్పభక్తుల అమర సన్నిధికి మరలిద్దాం.

హిందూ సంస్కృతిలో 'గురువు' అనే పదానికి గల అర్థము, ప్రాధాన్యము మనకు బాగా తెలిసినదే. కాని, ఉపగురువు అనే పదానికి అర్థం కొందరికి తెలియకపోవచ్చు. మనం ఉపగురువుకు కూడా అంతే ప్రాధాన్యాన్ని ఇస్తాము. ఉపగురువు మనకు గురువును చూపించడానికి తోడ్పడతారు. ఉపగురువు, ఒక పుస్తకమో, ఒక చెట్టో, ఒక స్నేహితుడో, ఏదో ఒకటి అయి ఉండవచ్చును. ఉపగురువు, గురువు కూడా ఒకే విధంగా గౌరవించబడాలి.

నాకు ఇద్దరు ఉపగురువులున్నారు. మొదటివారు మా అమ్మగారు. నాకు ఒకటిన్నర సంవత్సరాల వయసు ఉన్నపుడు, నేనుఊయలలో ఉండగా మా తల్లిగారు ఒక జోలపాట పాడారు. రమణుల పాట అది. ప్రతిసారీ నన్ను నిద్రబుచ్చడానికి మా అమ్మగారు అదే రమణులపాట పాడేవారు. నేను కళ్ళుమూసుకుని, హృదయం మీద ధ్యాసపెడితే ఇప్పటికి కూడా మా తల్లిగారి జోలపాటను వినగలను. నా గురువుపట్ల భక్తి బీజాలను ఆనాడే ఆవిడ నాలో నాటారు. నేను ప్రాకే (బందాడే) వయసులో ఉన్నపుడు, నన్నావిడ భగవాన్ ఎదురుగా కూర్చోబెట్టేది. నేను పెరిగిన తర్వాత, ఆవిడ నాకు రోజూ చెబుతుండేవారు. "వెళ్ళి భగవాన్‌కు సాష్టాంగ నమస్కారం చెయ్యి. ఆయన కళ్ళలోకి చూచి ఆయన ఆశీస్సులు తీసుకో" అని. నేను స్కూలుకు వెళ్ళడం మొదలైనాక స్కూలు విషయములేమైనా ఆమెతో పంచుకోబోతే, వెళ్ళు, వెళ్ళి భగవాన్‌కు చెప్పు అనేవారు. నాకేదైనా కొత్త కలము (పెన్ను) లభించినట్లయితే, మా అమ్మగారు "వెళ్ళు. భగవాన్‌కు చూపించి, ఆయన చేతిలో ఉంచి, ఆయన చేతి మీదుగా తీసుకో" అనేవారు. తను చనిపోయే వరకు ఆమె నేర్పిన ఒకే ఒక బోధ – "భగవాన్ ఒక్కరే నీకు చాలు. నీకింకేమి అవసరం లేదు," అని.

నా రెండవ ఉపగురువు, నా స్కూలు టీచర్ టి.కె.సుందరేశఅయ్యర్. మేము ఆయనను టి.కె.ఎస్. అని పిలిచేవారము. ఆయన గొప్ప అణకువ గలవారు. అసాధారణమైన నిరాడంబరత గలవారు. ఆయన మాకు ఆరవ తరగతిలో ఉపాధ్యాయుడుగా ఉండేవారు. నాపట్ల బాగా శ్రద్ధ చూపించేవారు. ఆయన ప్రతిరోజూ రమణాశ్రమానికి వచ్చేవారు. నాపట్ల ప్రత్యేక ఆసక్తి చూపేవారు. ఆయన, "గణేశా! ఇక్కడకురా! ఒక మహనీయుడు వచ్చారు. ఆయనకు ప్రణమిల్లు" అనో, లేకపోతే, "గణేశా! ఒక మహాత్మురాలు వచ్చారు. ఆవిడకు సాష్టాంగ ప్రణామం చెయ్యి అనో,", "ఈ స్వామీజీ శంకరమఠం నుండి వచ్చారు. ఆయనకు మొక్కు" అనో అనేవారు.

ఆయన సాష్టాంగపడి, నన్ను కూడా అలాగే చెయ్యమని ఆదేశించేవారు. ఇది ఎంతగా సాగేదంటే, ఆశ్రమంలోని కొందరు, టి.కె.ఎస్. ఒక వెఱ్ఱివాడు. అతడు గణేశన్‌ను గూడా వెఱ్ఱివాడిగా మారుస్తున్నాడు. ఆయన మహాత్ములు. మహనీయులు అని చెప్పి వెఱ్ఱి వాళ్ళందరికీ గణేశన్ చేత సాష్టాంగ ప్రణామాలు చేయిస్తున్నారు. నా దృష్టిలో భగవాన్‌కు నాపై గల గొప్ప అనుగ్రహమే, నన్ను సుందరేశన్ వైపునకు నడిపించింది.

తర్వాత నేను పెద్దవాణ్ణయినాక, ఎందరో భారతీయ మహాత్ములను గురించి తెలియజేసింది ఆయనే. అందులో కొందరు జీవించి ఉన్నవారు. మరికొందరు పరమపదించినవారు. ఆయనే నన్ను స్వామి రామదాస్ వద్దకు పంపింది. ఆయనకు, అంతర్గతంగా తెలిసి ఉంటుంది. స్వామి రామదాస్ నాకు దారి చూపగలరని. స్వామిరామదాస్, తన ఆధ్యాత్మిక వారసురాలైన

మాతాజీ కృష్ణాబాయి, నాకు జీవిత మంతా దారి చూపగలరని తలచారు. అప్పటికి కొంతమంది సజీవులైన మహాత్ములుండే వారు తిరుచ్చి స్వామివంటి వారు. ఆయన గురించి ఎవరికీ ఏమీ తెలియనపుడే టి.కె.ఎస్. నాచేత ఆయనకు ప్రణామం చేయించారు. యోగి రామసూరత్ కుమార్ తిరువణ్ణామలైలో ఎవరికీ తెలియనపుడే, టి.కె.ఎస్.తో ఆయన గంటల తరబడి మౌనంగా కూర్చునేవారు. ఒకరోజు టి.కె.ఎస్. ఒకయోగిని చూపి, "గణేశా! ఈయన ఒక సిద్ధపురుషుడు. ఆయన ఆకలిగా ఉన్నారు. ఆయనకు కొంచెం ఆహారం ఇవ్వు" అన్నారు. నేను వంటగదిలోకి పరుగెత్తుకుని వెళ్ళి భోజనం తీసుకుని వచ్చి ఆ యోగికి సమర్పించాను.

హృదయ కమలం వికసించటం గురించి భగవాన్ రమణమహర్షి ఈ విధంగా అన్నారు. "అది ఒక కలువమొగ్గలాగా ఉంటుంది. దాని రేకులు తెరచుకోవాలి. ఆ రేకులు విచ్చుకున్నప్పుడే, మీకు ఆధ్యాత్మిక అనుభవాలు కలుగుతాయి." వేదాలు, ఉపనిషత్తులు చదివినా, ఆధ్యాత్మిక సాధనలు చేసినా, ఆ రేకులు విచ్చుకోవు. ఏ యోగమూ వానిని తెరువలేదు. కేవలం ఆత్మసాక్షాత్కారం సాధించిన జ్ఞానుల సన్నిధి, అనుగ్రహం వల్లనే అవి విచ్చుకుంటాయి. వాళ్ళు ఒక్క చూపుతో నీ హృదయకమలంలోని ఒక రేకు విచ్చుకునేటట్లు చెయ్యగలరు. ఇది తేలికగా చెప్పే మాట కాదు. నాకు ఒక్కొక్క మహనీయుడితో దగ్గరగా వచ్చేసరికి ఒకొక్క రేకు విచ్చుకున్నది.

ఒకసారి నేను టి.కె.ఎస్. గారినడిగాను. "భగవానే మనకు గురువుగా ఉండగా, మీరు నన్నెందుకు ఇతర మహాత్ముల దగ్గరకు పంపుతున్నారు?" ఆయన ఈ చక్కని వివరణను ఇచ్చారు. "భగవాన్ మహాసముద్రము. ఈ మహాత్ములంతా నదుల వంటివారు. నువ్వెక్కడుంటావు గణేశన్. నువ్వు కనీసం ఒక నీటి బిందువుగానైనా ఉండాలని నాకోరిక. నీటిచుక్క నదుల్లో కలిస్తేగానీ సముద్రాన్ని చేరదు. ఒక నీటిబిందువు తనంత తానుగా సముద్రాన్ని జేరలేదు. ఈ గురువుగారు నాకు అణకువ, మౌనము, మహాత్ముల యొక్క గొప్పతనం గురించి తెలిపారు. ప్రాపంచిక విషయాలు మన మనస్సును కప్పేయటం వలన, మహనీయుల గొప్పదనాన్ని గుర్తిస్తే కానీ, మనలో అణకువ రాదు. అరుణాచలుడే రమణులనీ, రమణులే అరుణాచలమనీ, హృదయమనీ మొదటిసారిగా నాకు తెలియచేసింది ఆయనే.

1960 దశకంలో, ఆశ్రమవాసిగా నా జీవితం ప్రారంభమైన తొలినాళ్ళలో, ఆత్మవిచారణపై శ్రీభగవాన్ గ్రంథములు అధ్యయనం చేయుట వలననూ, అదృష్టవశాత్తూ నాకు లభించిన భగవాన్ ప్రత్యక్ష శిష్యుల సాన్నిహిత్యం వల్లనూ, భగవాన్ 'సూటిబోధ' అయిన 'ఆత్మ-విచారణ', మార్గము యొక్క విశిష్టతను గుర్తించాను. యవ్వనంలో సహజంగా ఉండే భావోద్రిక్తత వలననూ, ఉత్సాహం వల్లననూ అంత సూటిమార్గములు కానటువంటి, ఇతర మార్గములైన భక్తి, కర్మ, యోగ మార్గముల యొక్క సామర్థ్యము మీద అప్పట్లో తేలికభావంతో ఉండేవాడిని. భగవాన్ స్వయంగా, ఆ మార్గములను కూడా మెచ్చుకుంటుండే వారనీ, కానీ, ఆ మార్గములన్నీ కూడా చిట్టచివరకు ఆత్మవిచారణ మార్గంలో కలసిపోయేవేనని, ఆయన ఎప్పుడూ ఉద్ఘాటిస్తూ ఉండేవారనే విషయం, నాకప్పుడు కొంచెం కూడా తట్టేదికాదు.

ఈ విషయం, నన్ను ఎల్లప్పుడూ జాగరూకతతో గమనిస్తూ ఉండే నా ఉప గురువుగారి దృష్టి లోనికి రాకుండా పోలేదు. ఒకనాటి రాత్రి నా ఉపగురువు గారైన శ్రీ టి.కె.సుందరేశ అయ్యర్, ఆశ్రమ గ్రంథాలయమునకు చెందిన, శ్రీ రామకృష్ణ పరమహంసగారి ప్రాచ్య, పాశ్చాత్య శిష్యులచే (భక్తులచే) వ్రాయబడిన నాలుగు వందల పేజీలకు పైగా కల్గినటువంటి "శ్రీరామకృష్ణ పరమహంస జీవితము – బోధలు" అనే గ్రంథమును నాకు ఇచ్చి, దానిని చదువవలసినదిగా నన్ను కోరారు. అందులో ఏబది (యాభై) పేజీలు చదవడం పూర్తయ్యేసరికి, దక్షిణేశ్వరమునకు చెందిన ఆ మహనీయుని ఔన్నత్యానికి నేను హృదయపూర్వకంగా ప్రణమిల్లాను. అప్పుడు నా ఆధ్యాత్మిక జీవితంలో మరొక కొత్త కోణము వెలుగుచూసింది. అప్పటినుండి శ్రీభగవాన్ వచనామృతము (టాక్స్ విత్ శ్రీ రమణమహర్షి), శ్రీరామకృష్ణ కథామృతము (ది గాస్పెల్ ఆఫ్ శ్రీరామకృష్ణ) అనే గ్రంథములు రెండూ, నాకు అత్యున్నత ఆధ్యాత్మిక మార్గదర్శకములై నిలచినవి. నా ఆధ్యాత్మిక అంతరంగ ప్రయాణంలో సుమారు ముప్పది మంది మహాత్ములను కలుసుకొనగలిగాను. వారు, నా అంతరంగంలోని గవాక్షములను, ఒకదాని తర్వాత ఒకటిగా తెరచుకునేటట్లు చేశారు.

ఒకప్పుడు భగవాన్, ఒక ప్రశ్నకు సమాధానంగా, ఈ విధంగా చెప్పారు.

భక్తి, ముక్తికంటే వేరుకాదు. భక్తి అంటే స్వరూపముగానుండుటయే. (నిలచుటయే). ఎవరికైనా అసలు స్థితి అదియే. తన సాధనలచే అతడు దానిని గుర్తిస్తాడు. భక్తి అంటే ఏమిటి? దైవమును గూర్చి ఆలోచించుట. అనగా మిగిలిన ఆలోచనలన్నీ తొలగిపోయి కేవలము 'దైవము' లేదా 'ఆత్మ' గురించిన ఆలోచన మాత్రమే మిగిలియుండుట. అది తనను తాను దైవమునకు శరణాగతి చెందించుకొనుట. దైవము నిన్ను చేపట్టిన తర్వాత, నిన్ను కలతనొందించేదేదీ ఉండదు. ఏ విధమైన ఆలోచనలు లేకుండుటయే భక్తి. అదియే ముక్తి కూడా.

జ్ఞానమార్గమునే విచారణ మార్గమని అంటారు. అది అత్యంత ఉన్నతమైన పరాభక్తియే కాని వేరుకాదు. తేడా అంతా మాటల్లోనే. ఆ భగవాన్ మాటల యొక్క ప్రాముఖ్యతనూ, ఆ మాటలలోని అపారమైన వివేకమునూ నేను అర్థము చేసుకున్నాను.

భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా, 1903లో టి.కె.ఎస్. భగవాన్ వద్దకు వచ్చారు. అప్పటికాయనకు కేవలం పన్నెండేళ్ళ వయసు. ఆయన బంధువు లొకరు, "అరుణాచలేశ్వరుడు, మానవరూపం ధరించి విరూపాక్ష గుహలో ఉన్నారు," అని చెప్పారు. అప్పటికి భగవాన్ చాలా వరకు మౌనంలోనే ఉండేవారు. ఎప్పుడో ఒకటి, రెండు మాటలు మాట్లాడే వారు. టి.కె.ఎస్. రాగానే కళ్ళుమూసుకొని ఉన్న భగవాన్ కనులు తెరచి ఆయనను ఒక్క చూపుతో అనుగ్రహించారు. తర్వాత టి.కె.ఎస్. నాతో అన్నారు. నేను చూసింది మానవశరీరాన్ని కాదు. అది మెరుగుపట్టిన బంగారు విగ్రహం. సజీవ ప్రతిమ. భగవాన్ నన్ను చూశారు. అక్కడ దాదాపు పదిమంది ఆయన చుట్టూ కూర్చుని తమిళ గీతాలు పాడుతున్నారు. భగవాన్ కరుణతో నన్ను జూచి, "నాకోసం ఒక పాట పాడవా?" అని అడిగారు. అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే భగవాన్ ఎప్పుడూ మౌనంగా ఉండేవారు, ఏమీ అడిగేవారు కాదు. భగవాన్ చదివిన పెరియపురాణంలోని, సుందరం అనే భక్తుడు వ్రాసిన పాట పాడారు. టి.కె.ఎస్. ఆ పాట అనువాదం ఇలా ఉంటుంది. "మీ పాదములు తప్ప నాకు వేరే ఆధారమేమీ లేదు. వాటినే పట్టుకుని మీ అనుగ్రహానికి పాత్రుణ్ణి అవుతాను. పురాతన కాలం నుండీ ఋషులు నిన్ను కీర్తించారు. ఓ ప్రభూ! నా మనసు ఎక్కడెక్కడ తిరిగొచ్చినా కానీ, నా నాలుక నీ పవిత్రమైన నామాన్ని విడవకుండా పలికేటట్లు అనుగ్రహించు." టి.కె.ఎస్. పాట పూర్తి చెయ్యగానే భగవాన్ ఎంతో సంతోషించారు. భగవాన్ అన్నారు, "అవును. అదే చెయ్యవలసినది". ఇదే ఈ పన్నెండేళ్ళ బాలునికి చేయబడిన తొలి ఉపదేశం. ఆయన జీవితాంతం, చివరి నిముషం వరకు, మహాత్ములు వ్రాసిన వందలాది తమిళ గీతాలు కల మూడునాలుగు పుస్తకాలను వెంటనుంచుకొనే వారు. మొదటి ఉపదేశమే ఆయనకు మార్గదర్శకమయింది.

ప్రతిరోజూ ఈ పిల్లవాడు విరూపాక్ష గుహకు వెళ్ళి భగవాన్‌తో కొంతసేపు గడిపేవాడు. కాలక్రమాన ఆయన ఉపాధ్యాయుడయ్యాడు. ఆయన ఆధ్యాత్మిక అభివృద్ధిని గురించి ఆయనకు సందేహాలు మొదలయ్యాయి. ఒకరోజు ఆయన ఇలా అనుకున్నారు. "నేనెందుకు ఆ మహాత్ముని దగ్గరకు వెళ్ళి ఆయనతో ఉండాలి? నేనేమీ అభివృద్ధి చెందడం లేదు. నాలో మార్పేమీ కన్పించడం లేదు." మూడు నెలలపాటు ఆయన భగవాన్ వద్దకు వెళ్ళలేదు. ఒకరోజు రాత్రి కన్నీటితో ఆయన తలగడ (దిండు) తడిచిపోయింది. ఆయన "నా గురువుగారిని చూడాలి" అనుకున్నారు. ఉదయాన్నే కొండపైకి పరుగెత్తారు. అప్పుడు స్కందాశ్రమంలో ఉంటున్న భగవాన్ బయటకు వచ్చి టి.కె.ఎస్. కోసం వేచి ఉన్నారు. భగవాన్‌ను దూరం నుండి చూడగానే, టి.కె.ఎస్. తన భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. ఏడుస్తూ ఆయన వద్దకు పరుగెత్తి, ఆయన పాదాలపైబడి, వాటిని కన్నీటితో తడిపేశారు. "భగవాన్! దయచేసి నన్ను క్షమించండి" అన్నారు. భగవాన్ ఆయనను లేవదీసి అన్నారు. "ఇది నూఱవ రోజు". భగవాన్ లెక్కబెడుతూ ఉండి ఉంటారు. "నువ్వు వచ్చి వందరోజులయింది. నీకేమయింది?" అన్నారు భగవాన్. టి.కె.ఎస్. సమాధానమిచ్చారు." భగవాన్ నేను రానందుకు నన్ను క్షమించండి. నేనొక అవివేకపు పనిచేశాను. కానీ భగవాన్ నాలో నాకు ఏమీ అభివృద్ధి కనపడలేదు. ఇక్కడకు వచ్చి మీతో గడపడం వల్ల నాకు ఏమీ లాభం కనబడలేదు." భగవాన్ అన్నారు "సరే అదంతా బాగానే ఉన్నది. నీకేమి లాభం కన్పించలేదు. రాకపోవడం వల్ల నీకు నష్టం జరిగినట్లనిపించలేదా?" దానిని గుర్తు చేసుకుంటూ టి.కె.ఎస్. నాతో ఇలా అన్నారు. "మనము భగవాన్ వద్దకు వెళ్ళేది ఆయన నుండి ఏదో లాభం పొందడానికికాదు. ఆయన లేనిదే మనకు జీవితమే ఉండదసలు. ఈ ఆనందాన్ని హృదయంలో ఉంచుకునే అవకాశాన్ని మనం పోగొట్టుకోకూడదు. లేనిచో దాన్ని కోల్పోయిన వాళ్ళమవుతాము".

పాఠశాల ఉపాధ్యాయుడిగా తనకొచ్చే కొద్దిపాటి జీతంతో టి.కె.ఎస్., కొద్దిపాటి పటిక బెల్లం కానీ, మరమరాలు కానీ భగవాన్‌కు తీసుకుని వెళ్ళగలిగే వారు. ఒకనాడు ఆయన వద్ద అది కూడా లేదు. విచారంగా వెళ్ళి భగవాన్ పాదాలపై వ్రాలారు. "భగవాన్ నాకెంతో బాధగా ఉంది. నావద్ద డబ్బేమీ లేదు. అందుకని మీకు అర్పించడానికి ఏమీ తీసుకుని రాలేకపోయాను" అన్నారు. భగవాన్ నవ్వి అన్నారు. "ఎందుకు? నువ్వు అన్నిటి కంటే ముఖ్యమైన దాన్ని తీసుకుని వచ్చావు. మిగిలినవన్నీ అంత ముఖ్యమైనవి కావు". టి.కె.ఎస్.కు అర్థం కాలేదు. "నువ్వు నిన్నే తీసుకుని వచ్చావు" అన్నారు భగవాన్. ఇక్కడ గుర్తించాల్సిన విషయమేమిటంటే, ఆధ్యాత్మిక యాత్రలో, నిన్ను నువ్వు వదిలి వేయకూడదు. గురువు గారినీ, ఆయన బోధలనూ పొగడటం చాలా తేలిక. ఆ విధానంలో నిన్ను నువ్వు ఎన్నడూ వదిలి వెయ్యకూడదు. నువ్వు కూడా ముఖ్యమే.

కాలక్రమేణ ఆయనకు తరచు సందేహాలు వస్తూ ఉండేవి. ఒకరోజు ఆయన భగవాన్‌ను ఇలా ప్రశ్నించారు. "భగవాన్, ఏ ఒక్క విషయాన్ని తెలుసుకుంటే, అన్ని సందేహాలూ తీరిపోతవి?". భగవాన్ జవాబిచ్చారు. "సందేహించే వాడెవరో తెలుసుకో. సందేహించే వాణ్ణి పట్టుకుంటే సందేహాలకు తావుండదు. అందరూ జ్ఞానులేననీ, అందరూ సాక్షాత్కారం పొందినవారేననీ నిశ్చయంగా గ్రహించు. కేవలం కొద్దిమంది మాత్రమే ఈ విషయం తెలిసికొని ఉంటారు. అందుకనే సందేహాలు వస్తాయి (కలుగుతవి). సందేహాలను సమూలంగా తీసివేయాలి. సందేహించేవారు లేకపోతే, సందేహాలకు తావుండదు. ఇక్కడ సందేహించే వాడంటే మనస్సు". టి.కె.ఎస్. అన్నారు "దానికేమిటి భగవాన్ పద్ధతి?" భగవాన్ తక్షణమే జవాబిచ్చారు. "నేనెవరు? అని విచారణ చెయ్యి., ఈ విచారణ మాత్రమే సందేహించే మనస్సును సమూలంగా పెకలించి వేసి నిన్ను హృదయంలో నిలిపి, అతీతమైన స్థితిలో ఉంచుతుంది"

వేరొక సందర్భంలో టి.కె.ఎస్.కు మరొక సందేహం కల్గింది. ఆయన పండితుడు. సనాతన ఆచారాలను పాటించేవాడు. ఎన్నో ఉపనిషత్తులనూ, పురాణాలనూ చదివిన వాడు. అందువల్ల షట్చక్రాలు, కుండలిని, అనేవి ఆయనకు ఆసక్తికరంగా ఉండేవి. వాటి గురించి ఆయన భగవాన్‌ను అడిగితే భగవాన్ ఇలా సమాధానమిచ్చారు. "ఆత్మని మాత్రమే సాక్షాత్కరింపజేసికోవాలి. కుండలినీ శక్తి, దైవదర్శనాలు, అతీత శక్తులు మంత్ర ముగ్ధుల్ని చేసే వాటి ప్రదర్శనలు అన్నీ ఆత్మలోనివే. ఎవరైతే వీటి గురించి మాట్లాడి, వీటితోనే మునిగి ఉంటారో, వారు ఆత్మసాక్షాత్కారం పొందని వారే. ఆత్మ అనేది హృదయంలో ఉంటుంది. అసలు హృదయమే ఆత్మ. మిగిలిన రూపాలన్నీ మెదడు లోనివే. మెదడుకు కావలసిన శక్తి హృదయం నుండే వస్తుంది. హృదయంలో నిలిచి పోవడాన్నే ఆత్మసాక్షాత్కారం అంటారు. ఆ అసలు పనిని వదిలేసి, మెదడుతో కొనసాగించే మార్గాల పట్ల ఆకర్షితులవడం కేవలం సమయాన్ని దుర్వినియోగపరచడమే. ఉనికే లేని అహంకారాన్ని నిర్మూలన చెయ్యడం కోసం ఇన్ని రకాల ప్రయత్నాలూ, ఇన్ని రకాల సాధనాలూ పట్టుకుని వేళ్ళాడటం మూర్ఖత్వం కాదా?"

1920వ సం॥లో భగవాన్, టి.కె.ఎస్.కు మామిడిచెట్టు గుహలో నున్న కావ్యకంఠ గణపతి మునిని పరిచయం చేశారు. ప్రతిరోజూ టి.కె.ఎస్., భగవాన్ వద్దకు వెళ్ళేవారు. అందుకని భగవాన్ "నాయన వద్దకు వెళ్ళు. అక్కడ ఋగ్వేదాన్నీ, ఇతర గ్రంథాలనూ నేర్చుకో అన్నారు". టి.కె.ఎస్., నాయనను కలిసినపుడు, ఆయన మేధస్సు (తెలివి తేటలు) ఆయన వర్చస్సు, సనాతన జ్ఞానంలో ఆయన సాధించిన గొప్ప విషయాలు చూసి అవాక్కయ్యారు. ఆయనను తనొక శిష్యునిగా పరిగణించమని కోరి వేదాలను నేర్చుకొనుట మొదలు పెట్టారు. ప్రతిరోజూ టి.కె.ఎస్., నాయన, భగవాన్ వద్దకు వెళ్ళేవారు. భగవాన్ వారికి మార్గదర్శకత్వం చేసేవారు. కానీ ఆ చిన్న వయసులో టి.కె.ఎస్., నాయనలోని అంతులేని పాండిత్యాన్ని చూసి తన్మయులైపోయేవారు. ఒకరోజు ఈ విషయాన్ని ఆయనతో అంటే, నాయన "సుందరేశా! భగవాన్ అనుగ్రహం లేకపోతే, వేదాలలోని లోతుపాతులను, నిగూఢ విషయాలను అర్థం చేసికొనడం ఎవరి తరమూ కాదు" అని సరిదిద్దారు. అప్పుడు టి.కె.ఎస్.కు, నాయనకు, భగవాన్ ఎడల ఎంతటి అపారమైన గౌరవ ప్రతిపత్తులు ఉన్నాయో అర్థమైంది.

కావ్యకంఠ గణపతి ముని గురించిన అధ్యాయములో మనము మూడు సంఘటనలు చూశాము. కావ్యకంఠుల వారికి కుండలినీ శక్తి అసాధారణరీతిలో లేచినటువంటి అనుభవం, ఉమా సహస్రం అద్భుతమైన రీతిలో పూర్తి అవడం, భగవాన్ నాయనతో, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు తన చుట్టూ పరిభ్రమిస్తున్నాయని చెప్పుట, ఈ మూడు సంఘటనలు జరిగినపుడూ అక్కడ ఉండి తిలకించే సువర్ణావకాశం టి.కె.ఎస్.కు దక్కింది. అవి నాయనకు సన్నిహితంగా ఉండుట వల్ల తనకు లభించిన అపురూపమైన కానుకలు అని ఆయన నాతో చెప్పారు.

కావ్యకంఠుల వారికి రెండు వందల మందికి పైగా పండితులైన భక్తులుండే వారు. వారందరితో ఆయన, నేటి నుండి నేనుమీకు గురువును కాను, మనందరికీ గురువు శ్రీ రమణ మహర్షుల వారే అన్నారు. భగవాన్ ఇప్పటి రమణాశ్రమానికి వచ్చేసిన తర్వాత కొన్ని రోజులకు, సమాజంలో మంచిస్థానాలలో ఉన్న కావ్యకంఠుల వారి శిష్యులకు, రమణాశ్రమము ముందు ముందు ఉజ్వలంగా ఉండబోతున్నట్లు అన్పించింది.

నాయనగారు ఆశ్రమ మేనేజరు అయినట్లయితే, రమణాశ్రమము భవిష్యత్తులోని అవసరాలకు అణుగుణంగా రూపుదిద్దుకుంటుందనిపించింది వారి శిష్యులకు. వేరొక వర్గము వారు భగవాన్ సోదరులు నిరంజనానంద మేనేజర్ అయితే బాగుంటుందను కున్నారు. ఒకరోజు నాయన, ఆయన శిష్యులు హాలులోకి వెళ్ళారు. నాయన శిష్యులు "భగవాన్! నాయన ఆశ్రమ మేనేజర్‌గా ఉండాలని మేము అనుకుంటున్నాము అని విన్నవించారు. భగవాన్ కొంత తడవు మౌనంగా ఉన్న తర్వాత, శిష్యులతో గాకుండా, నాయన వైపు తిరిగి "నాయనా! మనము ఇటువంటి వ్యవహారాలలో చిక్కుకోవడం ఎందుకు? అతన్నే ఈ మేనేజ్‌మెంట్ వ్యవహారాలు నెత్తినేసుకుని తంటాలు పడనీ. తమిళంలో "అవనే కట్టిండు అళత్తుమ్" అన్నారు. దాని అర్థము "అతన్నే దీన్ని వాటేసుకుని ఏడవనీ" అని. నాయన భగవాన్‌కు సాష్టాంగ ప్రణామము చేసి, లేచి నిలబడి తీర్మానించారు. భగవాన్ ఇప్పటి నుండి, చిన్నస్వామే మేనేజర్‌గా ఉంటారు.

ఆయన సెలవు తీసుకుని బయటకు రాగానే మిగిలిన భక్తులు కూడా బయటకు వచ్చారు. నాయన, టి.కె.ఎస్.తో అన్నారు "ఈ రోజు నుండి మనమందరము, చిన్నస్వామికి ఆశ్రమము నిర్వహించడానికి బేషరతుగా పూర్తి సహకారాన్ని ఇద్దాము. టి.కె.ఎస్. దానిని చాలా శ్రద్ధగా పాటించారు. అప్పటికే నాయన పదివేలమందికి పైగా సభ్యులు గల ఒక పెద్ద సమాజాన్ని, స్వరాజ్య స్థాపన కోసం ప్రారంభించారు. వారు భారతదేశమంతటా మంత్రాలు పఠించాలని నిర్ణయించుకున్నారు. టి.కె.ఎస్. దానికి జనరల్ సెక్రటరీ గాను, నాయన ప్రెసిడెంట్‌గాను (అధ్యక్షుడు) ఉన్నారు. కానీ నాయన "మీరు చిన్నస్వామికి పూర్తి సహకారాన్ని అందించండి" అనికోరటం వలన టి.కె.ఎస్. ఆశ్రమ ఆఫీసులో పనిచెయ్యడం మొదలుపెట్టారు. గొప్ప ఆధ్యాత్మికవేత్త, వేద పండితుడు, బహు భాషావేత్త అయిన టి.కె.ఎస్.కు మూడు భాషలలో ప్రావీణ్యం ఉంది. సంస్కృతము, తమిళము, ఆంగ్లము. కాబట్టి ఆయనకు ఆశ్రమము యొక్క ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవహారం అప్పజెప్పబడింది. భగవాన్‌తో సన్నిహితంగా ఉండటానికి, దాన్నే గొప్ప అవకాశంగా తలచారు ఆయన. ఆయన ప్రతి ఆధ్యాత్మిక ఉత్తరాన్నీ భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళి, ఆయన సలహా అడిగేవారు. కావలసిన విషయాన్ని భగవాన్ వివరించి చెప్పిన తర్వాత, ఆయన ఆ విషయాలను వ్రాసి, జవాబు పంపేముందు భగవాన్ అనుమతికై వ్రాసిన దానిని మరల భగవాన్‌కు చూపేవారు.

భగవాన్ అప్పటికే ఎన్నో పద్యాలు, 'నేనెవరను?' 'ఆత్మ విచారణ' అను బోధలు చాలా వ్రాశారు. పండితులైన భక్తులు, వాటినన్నిటినీ సంగ్రహించి, 'రమణ మహర్షి సంపూర్ణ రచనలు'గా ప్రచురించదలచారు. వారు భగవాన్ యొక్క తమిళ రచనలన్నిటిని పోగుచేసి, ప్రెస్ (ముద్రణశాల)కు పంపారు. కానీ దానికి పీఠిక వ్రాయవలసి ఉన్నది. మురుగనార్, నటనానంద ఇద్దరు కూడా, తమిళ పండితులే కానీ, "భగవాన్ యొక్క స్వీయ రచనలకు పీఠిక వ్రాయుటకు మేమెంతవారము?" అని వెనుకంజ వేసినారు. ఆశ్రమంలో ఎవరూ సాహించలేకపోయారు. పీఠిక వ్రాయడం నిలచి పోయింది. ఒక రోజు టి.కె.ఎస్., రాత్రి చాలా పొద్దుపోయి, బస్తీ నుండి వచ్చారు. ఆయన హాలులోనికి రాగానే భగవాన్ "ఆ పీఠిక నీవే ఎందుకు వ్రాయగూడదు?" అన్నారు. ఆయన దిగ్భ్రమ చెందారు కానీ, భగవాన్ నోటినుండి వచ్చిన ప్రతిమాటా సత్యము అనీ, జవదాటకూడని ఆజ్ఞ అనీ ఆయనకు తెలుసును. టి.కె.ఎస్. అన్నారు. "భగవాన్! నేనెలా వ్రాయగలను? కానీ మీ అనుగ్రహముంటే అసాధ్యమేముంటుంది?" "దానిని వ్రాసెయ్యి. అంతా బాగానే వస్తుంది" అన్నారు భగవాన్. ఆయన కూర్చుని భగవాన్ వైపు చూచి వ్రాత ప్రారంభించారు. విషయం ప్రవాహంలా వ్రాతలో వచ్చేసింది. ఆ పీఠిక పూర్తి చేసిన తరువాత ఆయన దానిని భగవాన్ పవిత్రపాదాల వద్ద ఉంచారు. భగవాన్ దానిని చదివారు. భగవాన్ చదివేశారు గనుక టి.కె.ఎస్. వెళ్ళడానికి లేచారు. కానీ భగవాన్ ఆయనను వెనుకకు పిలిచారు. "ఇలారా! అని, 'ఆశిస్తున్నాము' అని ఎందుకు అన్నావు. 'నిశ్చయంగా జరిగి తీరుతుంది', అని ఎందుకు వ్రాయలేదు?" అన్నారు. ఇలా అంటూ పీఠికలోని చివర వాక్యంలో ఒక మార్పు చేశారు. "శ్రీ భగవాన్ యొక్క అనుగ్రహము, ఈ గ్రంథమును హృదయపూర్వకంగా చదివి అందులోనివి ఆచరించిన సాధకులకు,

మోక్షాన్నీ, ఆనందాన్నీ ఇస్తుందని ఆశిస్తున్నాము" అని ఉన్న దానిలో "ఇస్తుందని ఆశిస్తున్నాము"కు బదులు "నిశ్చయంగా ఇచ్చితీరుతుంది" అని మార్చారు. తమిళ పదము "నంబుగిరెన్" అంటే 'ఆశించబడింది'. భగవాన్ దానిని 'తిన్నమ్' అని మార్చారు. 'తిన్నమ్' అంటే 'నిశ్చయంగా జరిగి తీరుతుంది' అని. భగవాన్ సరిచేసిన తర్వాత ఆ పీఠిక ఈ హామీతో ముగిసింది. "ఈ సంపూర్ణ రచనలను హృదయపూర్వకంగా స్వీకరించి, ఆచరించిన సాధకులకు, భగవాన్ అనుగ్రహము నిశ్చయంగా, మోక్షాన్ని, ఆనందాన్ని ఇచ్చి తీరుతుంది". (ఈరోజుకు ఎంతమందికో ఈ పుస్తకం మార్గదర్శకంగా ఉండుటయే గాక, తమిళంలో గాని, ఇతర భాషలలోనికి అనువదించబడినది గానీ అయిన ఈ గ్రంథము ఎందరికో, ఇదే ప్రాణప్రదమైనది. నా స్నేహితుడు, బోధకుడు, మార్గదర్శకుడు అయిన ఆస్‌బోర్న్, ఈ పుస్తకంపై ప్రమాణం చేసి చెప్పేవారు అవసరమైనపుడు).

ఈ 'సంపూర్ణ రచనలు' తొలుత తమిళంలో వ్రాయబడింది. ఆర్థర్ ఆస్‌బోర్న్, దీనిని ఆంగ్లంలో ముద్రించి ప్రపంచమంతా లభ్యమయ్యేటట్లు చెయ్యాలనుకున్నారు. అప్పటికే ఆయన లండన్‌లో ఒకప్రచురణకర్తను పట్టుకున్నారు. కొన్ని పద్యాలు మాత్రమే తమిళం నుండి ఇంగ్లీషులోనికి అనువదించబడ్డాయి. ఇంకా ఎంతో పని మిగిలి ఉంది. కానీ ఎవరూ ఆస్‌బోర్న్ గారికి సాయపడుటలేదు. అప్పుడు మా టీచర్ గారైన టి.కె.ఎస్., ఆస్‌బోర్న్ పక్కన కూర్చుని సాయం చేశారు. ఆస్‌బోర్న్ ఇంటికి వెళ్లినపుడు టి.కె.ఎస్. గారు చెబుతూ ఉంటే నేను టైప్ చేసి, ఆస్‌బోర్న్ వచ్చిన తర్వాత ఇచ్చేవాణ్ణి. ఈ విధంగా ఈ 'సంపూర్ణ రచనలు' ఇంగ్లీషు అనువాదం మొత్తం నాచేత టైపు చెయ్యబడింది. ఇది నేను అహంకారంతో అనుటలేదు. సంతోష పారవశ్యంతో అంటున్నాను.

మా గురువు గారు టి.కె.ఎస్., తమిళంలో పద్యాలు బాగా వ్రాయగలరు. ఆయన సద్గురు రమణను స్తుతిస్తూ ఆరు పద్యాలు వ్రాశారు. ఆ పద్యాలను, ఆయన భగవాన్ పాదాల వద్ద ఉంచినపుడు, మళ్ళీ భగవాన్ అయిదవ పద్యంలోని ఒకే ఒక మాటను సరిదిద్దారు. "ఎవరి అనుగ్రహమైతే ప్రవహిస్తూ, అందరినీ ధన్యులను చేస్తుందో, ఆశీర్వదిస్తుందో" అని ఉంటే, దానిని ఆయన "ఎవరి అనుగ్రహమైతే నేరుగా అందరినీ (ఆశీర్వదిస్తుంది) ధన్యులను చేస్తుంది" అని సవరించారు. టి.కె.ఎస్. 'అనుగ్రహం' అనబడే దివ్యశక్తి అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉంటుంది. గురుశిష్యుల సంబంధంలో గురువు అనుగ్రహాన్ని, శిష్యుడు గ్రహించులాగా (స్వీకరించేలాగా) ప్రవహింప జేస్తారు. గురువు అనుగ్రహ ప్రవాహాన్ని సూటిగా, శిష్యుడు గ్రహించి లబ్ది పొందేలా దారి మళ్ళిస్తారు. అనుగ్రహం ప్రవహిస్తుంది అనే దానిలో 'ప్రవహిస్తుంది' అనే ఒకే ఒక్క మాటను 'దారి చూపిస్తుంది' అని మార్చారు. ఎంత సున్నితమైన మార్పు.

1963లో లూసీకార్నెల్‌సన్ అనే జర్మన్ వేదాంతి ఉండేది. భగవాన్ 'సంపూర్ణ రచనలు'ను తమిళ మూలం నుండి జర్మన్ భాషలోనికి నేరుగా అనువదింపదలచి, జర్మనీలో ఉన్నపుడు, తమిళభాష నేర్చుకుంది. ఆమె దానిని అనువదించి, సరిదిద్దించుకోవడానికి వచ్చింది. అందుకొరకే ఆశ్రమానికి వచ్చినప్పటికీ, అక్కడ ఎవరూ ఆమెకు సాయపడలేదు. మరల టి.కె.ఎస్., ఆమె ఒక వేదాంతి, ఆమెకు ప్రణామం చెయ్యి అన్నారు (లూసీ నాకు లూసీమా అయింది) జర్మన్ భాషలోనికి 'రచనల సంగ్రహం' టి.కె.ఎస్. గారిచే సరిదిద్దబడి, ఆయనసాయంతో తప్పులేకుండా చక్కగా సరిచేయబడింది. గొప్ప పండితుడైనప్పటికీ, ఆయన ఎంతో నిరాడంబరుడు. ఆయనపైకి సర్వసామాన్యుని వలె ఉండుటచే చాలా మందికి టి.కె.ఎస్. అంటే ఎవరో తెలియదు.

ఒకప్పుడు టి.కె.ఎస్. గారు చెప్పిన పెద్ద పేరాను నేను టైపు చేయుచుండగా, భగవాన్ బోధలను ఇష్టపడే డంకన్ గ్రీన్‌లీస్ అనే ఆయన లోనికి వచ్చారు. "మీరేమి టైపు చేస్తున్నారు? నేను దానిని చదువవచ్చునా?" అని అడిగారు. "తప్పకుండా చదవ వచ్చు" అన్నాను నేను. అది భగవాన్ బోధల గురించి చక్కని పేరా. గ్రీన్‌లీస్ "దీనిని ఎవరు వ్రాశారో మీరు చెప్పగలరా?" అన్నారు. "మా టీచర్ అయిన టి.కె.ఎస్. గారు" అన్నాను నేను. ఆయన రచించినవి ఇంకేమైనా ఉన్నాయా" అని ఆయన అడిగారు. "నావద్ద ఆరో, ఏడో ఫైల్సు ఉన్నవి" అన్నాను. "మీరు ఆ ఫైల్సునాకు ఇస్తారా? నేను వాటిని తీసుకుని వెళ్ళి పుస్తక రూపం తెస్తాను. ప్రచురణకు వీలుగా ఉండేటట్లు కూర్పు చేస్తాను" అని బ్రతిమలాడారు నన్ను డంకన్ గ్రీన్‌లీస్. డంకన్ గ్రీన్‌లీస్ సంపాదకత్వంలో అందంగా రూపుదిద్దుకున్న "భగవాన్ పాదపద్మ సన్నిధి"లో అనే పేరు గల పుస్తకము. గ్రీన్‌లీస్ ముందుగా వ్రాతప్రతిని తీసికుని వచ్చి "ఈ పుస్తకానికి ఏమి పేరు పెడదాము?" అని అడిగారు.

"భగవాన్ పాదపద్మ సన్నిధి"లో అని పేరు పెడదామని నేను సూచించాను. టి.కె.ఎస్. గారు ఎంతో సంతోషంతో, ఆ పుస్తకాన్ని భగవాన్ పాదాల వద్ద ఉంచు అన్నారు. నేను ఆ వ్రాతప్రతిని తీసుకుని భగవాన్ మందిరానికి వెళ్ళాను.

నేను గంటలకొద్దీ సమయం టి.కె.ఎస్. గారితో గడిపేవాణ్ణి. ఎక్కువ సమయం ఆయన మౌనంగానే ఉండేవారు. ఎప్పుడైనా, ఆయన మాట్లాడినపుడు చాలా ఆసక్తికరమైన విషయాలు చెప్పేవారు. ఆయన ఒకసారి నాతో ఇలా చెప్పారు. "గణేశన్! తిరువణ్ణామలైలోనూ, భారతదేశం మొత్తంలోనూ, ఇతర దేశాలలోనూ ఉండే సిద్ధ పురుషులు కూడా, గిరి ప్రదక్షిణ చెయ్యడానికి అరుణాచలానికి వస్తారు. కొన్ని సార్లు వారు కాంతి రూపంలో వస్తారు" భగవాన్ టి.కె.ఎస్. గారితోనూ, మరికొందరితోనూ తాను (ఆ) కాంతిని చూచినట్లు చెప్పారంట" "ఎవరికైనా నిజమైన భక్తి ఉంటే, వారు ఆ కాంతిని చూడవచ్చును. మాలో చాలామంది పాత భక్తులము, ఆ కాంతి అరుణా చలం చుట్టూ తిరగటం చూశాము. నీలో కోరిక ఉంచుకో గణేశా! కానీ ఎదురు చూడవద్దు. ఇంత టైములో చూడాలి అనుకోకు. చూచి తీరాల్సిందే అని గర్విష్టిగా అనుకోకు. సంపూర్ణమైన ప్రార్ధనా పూర్వకమైన అణుకువతోఉండు. అది కన్పిస్తుంది".

నేను (గణేశన్) ఈ కాంతిని ఒకసారి కాదు, మూడు సార్లు చూశాను. మొదటిసారి నేను ఒంటరిగా ఉన్నాను. రెండవసారి నేను ఒక జపాన్‌కు చెందిన భక్తుల బృందంతో ఉన్నాను. అపుడు నేను వారితో చెబుతున్నాను. ఆ కాంతిని చూడవచ్చని. వాళ్ళు చాలా నిజాయితీగా అడిగారు. "మేము కూడా చూడగలమా?" అని. నేనుచూచే సరికి అది అక్కడ ఉన్నది. వారందరూ గూడా ఆ కాంతిని చూచారు. వారందరూ దానికి సాష్టాంగ ప్రణామం చేశారు. మూడవసారి 2003లో జరిగింది. అపుడు సాయంత్రం 6.30 గంటలు అయింది. మధురై నుండి వచ్చిన ఒక భక్త బృందము, నేను, నోచూర్ వెంకట రామన్, మరికొందరు కలసి గిరి ప్రదక్షిణ చేస్తున్నాము. మేము పంచముఖ దర్శనం చోటుకు వచ్చినపుడు, అక్కడొక రాతిపై కూర్చుందామనుకున్నాము. మేము కూర్చోగానే, మధురై నుండి వచ్చిన భక్తులు ఆశ్రమంలో భోజన వేళ దాటిపోతుందని, తొందరపడి, మమ్మల్ని వదిలి వెళ్ళారు. అకస్మాత్తుగా నా దగ్గర స్నేహితుడు, టి.ఆర్. రామచంద్రన్ జపించే శివోపాసన మంత్రం (.. సద్యోజాతం, ప్రపద్యామి, సద్యో జాతాయవై నమో నమః) గుర్తుకు వచ్చింది. మేము ఆ రాతి మీద కూర్చున్నప్పుడల్లా, ఆ మంత్రం చదివేవారు రామచంద్రన్. నేను నోచూర్ వెంకట్రామన్‌ను అడిగాను. ఆయన ఆ మంత్రం చదవగలరేమోనని. ఆయన ఆ మంత్రాన్ని చదివారు. మేమంతా వింటున్నాము. మంత్రం చదవడం అవగానే మేము సాగిలపడి నమస్కరించాము. మాకందరికీ ఆ కాంతి కన్పించింది.

ఒక రోజు కొంతమంది వేదపండితులు సామవేదం చదువుతూ టి.కె.ఎస్.తో పాటు గిరిప్రదక్షిణ చేస్తున్నారు. ఉన్నట్లుండి, రోడ్డు మధ్యలో నాలుగైదు పెద్ద పులులు కూర్చుని ఉండడం చూశారు. హడలిపోయి వారు వేదపఠనం ఆపేశారు. చాలాసేపు అవి వారివైపు చూసి, చివరకు లేచి అడవిలోనికి వెళ్ళిపోయినవి. భగవాన్ అపుడు స్కందాశ్రమంలో ఉన్నారు. టి.కె.ఎస్. గారు పరుగెత్తుకుంటూ వెళ్ళి జరిగింది ఆయనకు చెప్పారు. "మీరు వేదపఠనం ఎందుకు ఆపివేశారు? వారు సిద్ధ పురుషులు. వాళ్ళు మీ వేదపఠనం వినాలని ఆతృతతో ఉన్నారు. మీరు వేదపఠనాన్ని కొనసాగించిఉండవలసినది" అన్నారు భగవాన్.

టి.కె.ఎస్. నాతో చెప్పారు. ఈ గూఢమైన అరుణాచలం లోపల చాలా విస్తారమైన రాజ్యములన్నవి. భగవాన్ తన కలను గూర్చి టి.కె.ఎస్.తో చెప్పారు. మూడుసార్లు భగవాన్‌కు కొండలోపల ఉన్నట్లుగా కలవచ్చింది. టి.కె.ఎస్. చెప్పారు తనకు కూడా అలాంటి అనుభవం వచ్చిందని. నాకు కూడా కొండలోపల ఉన్నట్లు అనుభవం వచ్చింది. నమ్మకం కలిగి ఉండండి. భక్తి కలిగి, అణుకువతో ఉండండి. శరణాగతి చెందండి. మీకంటే ఒకే ఒక్కరోజు పెద్దవారైన వ్యక్తికైనా సాష్టాంగ నమస్కారం చెయ్యండి. అప్పుడు మీలో అణుకువ వస్తుంది. అప్పుడు మీరు ఆధ్యాత్మిక స్వేచ్ఛను ఆస్వాదించగలరు. మరొకరికి సాగిల పడటం బానిసత్వం కాదు. అది ఆధ్యాత్మిక స్వేచ్ఛ. ఆనందమయ మైన ఆధ్యాత్మిక స్వేచ్ఛ.

భగవాన్ చాలా దయామయులు. ఒకసారి టి.కె.ఎస్. ఒక స్త్రీ సాధువు ముందు మోకరిల్లారు. "భగవాన్ ఇక్కడ ఉండగా, మీరు వెళ్ళి వేరేవారికి నమస్కరించడమేమిటి?" అని అరిచారు చిన్నస్వామి. టి.కె.ఎస్. కలత చెంది భోజనం చెయ్యలేదు. ప్రొద్దునే టి.కె.ఎస్. వచ్చేసరికి, వంటశాలలో భగవాన్ ఇడ్లీలు వేస్తున్నారు. ఆయన టి.కె.ఎస్. ముఖం పాలిపోయి ఉండడం చూశారు. "రా. వచ్చి కూర్చో. కాసిని ఇడ్లీలు తిందువు గాని" అన్నారు. టి.కె.ఎస్. అన్నారు. "భగవాన్ నేను త్వరగా

స్కూలుకి వెళ్ళాలి. నాకు క్లాసులున్నవి". "ఏయ్ పిల్లి సంచిలోనుంచి బయటపడింది. (అబద్ధం బయట పడింది) ఇవాళ ఆదివారము. నీకు స్కూలెలా ఉంటుంది? రా వచ్చి కూర్చో" అని భగవాన్ ఆకు తెచ్చి "నేను స్పెషల్ సాంబారు కాశాను" అని చెప్పి, ఆయన ప్రక్కనే కూర్చుని బోలెడన్ని ఇడ్లీలు వడ్డించారు. "నేను నా జీవితంలో అన్ని ఇడ్లీలను ఎప్పుడూ తినలేదు" అన్నారు టి.కె.ఎస్.

రమణాశ్రమానికి వచ్చిన కొత్తలో భగవాన్ తన తుండుగుడ్డను హాలుకు చివరన గల దణ్ణెం మీద వేసేవారు. అక్కడ ఒక పిచ్చుక గూడు ఉంది. అందులో మూడు, నాలుగు గుడ్లు ఉన్నవి. ఒకరోజు భగవాన్ తన తుండు గుడ్డ తీస్తూ ఉండగా, ఒక గుడ్డు జారి క్రిందపడి, పగులిచ్చింది. భగవాన్ నిశ్చేష్టులయ్యారు. దానిని పైకి తీసి దాని వైపు జాలిగా చూస్తూ "పాపం, ఆ తల్లి పక్షి ఎంత బాధపడుతుందో! తనకు కలగబోయే బిడ్డను నేను పాడుచేశానని నామీద కోపం తెచ్చుకుంటేందేమో. ఈ బీటలు వారిన గుడ్డు మరల సరిచేయవచ్చునా? ప్రయత్నం చేద్దాం." అప్పుడాయన ఒక తడిబట్టను ఆ గుడ్డుచుట్టూ కప్పి "అరుణాచలేశ్వరుడు ఈ పాపం నుండి నన్నుకాపాడు గాక!" అనుకున్నారు. దానిని గూటిలోపెట్టి, ప్రతి కొన్ని గంటలకీ ఒకసారి వచ్చి తడిబట్ట మార్చేవారు. ఏడు రోజులైన తర్వాత, ఆ పగులు మానిపోయింది. భగవాన్ అన్నారు. " చూడండి. ఎంత ఆశ్చర్యమో? ఆ పగులు మూసుకున్నది. ఆ తల్లి ఆనందంగా తన గుడ్డును పొదుగుతుంది. అరుణాచలుడు నా మూలాన ఒక జీవితం వృధా అవకుండా ఆ పాపాన్నుండీ నన్ను రక్షించారు. ఒకనాటి ఉదయం, ఆ గుడ్డ పొదగబడి, పక్షిపిల్ల బయటకు వచ్చింది. సంతోషంతో వెలిగే మొహంతో, ఆ పక్షిపిల్లను చేతిలోనికి తీసుకుని ముద్దాడి, నెమ్మదిగా తన చేతులతో నిమిరి, అందరికీ దానిని ఇచ్చారు.

ఒకప్పుడు, భగవాన్ యొక్క శ్రద్ధలోని ఒక కోణాన్ని గురించి చెప్పారు. టి.కె.ఎస్. "తనతోపాటే ఉండి తీవ్రసాధన చేసుకోవాలనుకుని, తనను సేవించాలనుకునే భక్తుల యొక్క భార్యల పట్ల, భగవాన్ అసాధారణ రీతిలో శ్రద్ధచూపించేవారు. మురుగనార్ గారి జీవితంలోనూ, సబ్ రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్ భార్య జీవితంలోనూ, నా తల్లిగారు నాగలక్ష్మి జీవితంలోనూ చోటుచేసుకున్న అనేక సంఘటనలను గురించి టి.కె.ఎస్. నాతో చెప్పారు. ఆ సందర్భంలో తన జీవిత గ్రంథంలో నుండి ఒక పుటను తెరిచారు. ఆయన భార్య ఒక కుమారుడిని, ఆయనకు వదిలి చనిపోయారు. ఆ సంఘటన ఆయనను తీవ్ర ఆధ్యాత్మిక సాధనలోకి నెట్టివేసింది. కానీ ఆయన బంధువులు పునర్వివాహం చేసుకోమని ఆయనను వత్తిడి చేశారు. ఆయన మొండిగా నిరాకరించారు. ఒకరోజు వారు అదేపనిగా వత్తిడి చేయడం తట్టుకొనలేక, ఆయన భగవాన్ వద్దకు వెళ్ళారు. భగవాన్ కొండమీద ఉన్నారు. ఆయనను చూస్తూనే భగవాన్ అన్నారు "జీవితాన్ని దాని దారిని దానిని పోనివ్వు. అడ్డుపెట్టవద్దు. చివరకు అంతా బాగానే ఉంటుంది". ఆయన ఇంకా ఇలా అన్నారు. "నువ్వు తిన్నగా సూర్యుని క్రింద ఉన్నపుడు, చీకటి నిన్నేమి చేయగలదు?" టి.కె.ఎస్. పునర్వివాహానికి అంగీకరించారు. ఆయన రెండవ భార్యకు ఇద్దరు పిల్లలు. భగవాన్ టి.కె.ఎస్. రెండవ భార్య తన సన్నిధిలో ఉన్నపుడు, ఆమె పట్ల అత్యంత శ్రద్ధ కనపరిచేవారు. చాలామంది పండితులైన భక్తులు, సంపన్నులైన వారు తనను ఏ మాత్రం పట్టించుకునే వారు కాదని టి.కె.ఎస్. చెప్పారు. బహుశా నాకు పెద్దగా విద్యార్హతలు (ఆధునిక విద్య) లేకపోవడం వల్ల, పేదవాడినవడం వల్లనూ, నా పట్ల వారికి అలక్ష్యము ఉండి ఉంటుంది. వారు బాహాటంగానే నన్ను అవమానించే వారు. "నువ్వెంత. నువ్వు కేవలం ఒక బడి పంతులివి అని". అది వినంగానే నేను మిక్కిలి కలత చెందుట చూసి, ఆయన నా వీపుపై చిన్నగా తట్టి "భగవాన్ మాత్రం నన్ను అంతులేని ప్రేమ, ఆపేక్ష, శ్రద్ధలతో చూచేవారు. భగవాన్ చూపించే ప్రేమకంటే, విలువైన ఆదరణ నాకెక్కడ దొరుకుతుంది?" అన్నారు.

1933లో ముప్పది ఆరేళ్ళ వయసులో, ఆయన ఇంకా ఏదో వెలితిని అనుభూతి చెందారు. అందుకని ఆయన భగవాన్‌ను, మీ నిజరూపాన్ని చూపించండి అని ప్రార్థించారు. భగవాన్ "అక్కడ కూర్చో" అని చెప్పి, తన అనుగ్రహ వీక్షణాల్ని, ఆయనపై ప్రసరింపజేశారు. టి.కె.ఎస్. హృదయం తెరచుకున్నది. ఆయన తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నారు. "నువ్వేమి చూడదలచుకుంటే అది ఇప్పుడు చూడు" అని భగవాన్ ఆయనతో అన్నారు. టి.కె.ఎస్.కు ఇష్టదైవం శ్రీరాముడు. అందుకని రాముని చూడాలని కోరుకున్నారు. రెండు గంటల పాటు పట్టాభిషిక్తుడై, తమ్ములతోనూ, సీతాదేవితోనూ, పాదాల చెంతనున్న హనుమాన్‌తోనూ కలసి ఉన్న శ్రీరామచంద్రుని దర్శనం లభించింది. ఆయన పారవశ్యంలో నుండి బయటకు వచ్చి నాక

"ఏమి చూశావు?" అని అడిగారు భగవాన్. టి.కె.ఎస్. తన అనుభవాన్ని వర్ణించి చెప్పిన తర్వాత "వెళ్ళి దక్షిణామూర్తి అష్టోత్తరము తీసుకునిరా" అన్నారు. "అందులో ఐదవ పద్యము చదువు. అందులో దక్షిణామూర్తిని, పట్టాభిరామాయ నమః అంటారు. దాని అర్థం దక్షిణామూర్తియే రాముడని. శ్రీరాముని రాజధాని అయోధ్య ఎనిమిది మూలలు, తొమ్మిది ద్వారాలు కలిగి ఉంటుంది. తిరువణ్ణామలై అయోధ్యే. రాముడే అరుణాచలుడు లేదా దక్షిణామూర్తి. టి.కె.ఎస్. అన్నారు "నేను ఒక పరమేశ్వరుడు (పరబ్రహ్మము), ఒక పవిత్ర గ్రంథము, ఒక దేవత, కావాలనుకున్నాను. భగవానే నాకు పరబ్రహ్మము, సంపూర్ణ రచనలే నా పవిత్ర గ్రంథము, రాముడు నా ఇష్టదైవము. భగవాన్ నాకు రామ దర్శనాన్ని ఇవ్వడం ద్వారా తానే రాముణ్ణి అని ఋజువు చేశారు.

ఒకసారి నేనాయనను అడిగాను "మీరు ఓం నమో భగవతే శ్రీరమణాయ అనే మంత్రాన్ని ఎలా తయారు చేశారు?" అని. టి.కె.ఎస్. నాతో ఇలా చెప్పారు. "నేను బాల్యం నుండే కృష్ణ పరమాత్మ పట్ల మిక్కిలి భక్తి కలిగి ఉండేవాణ్ణి. మా వంశంలో అనేక తరాల వారికి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రంతో మంత్ర దీక్ష ఇవ్వబడినది. వాసుదేవుడు అనేది శ్రీకృష్ణుని ఇంకోపేరు. అందుకని నేను ఎంతో ఇష్టంతోను, ఆసక్తితోనూ, భగవద్గీతను, శ్రీమద్భాగవతాన్ని చదివాను. శ్రీకృష్ణుని దర్శనం కావాలని కోరుకున్నాను. ఒక రోజు భగవద్గీతలోని ఒక వాక్యము నా హృదయం లోనికి చొచ్చుకుని పోయింది. అందులో శ్రీకష్ణ పరమాత్మ అంటారు "జ్ఞాని తూ ఆత్మైవ మే మాతమ్" అని. దాని అర్థము జ్ఞాని నా యొక్క రూపమే అనేది నా గుండెలకు హత్తుకుని పోయింది. సాక్షాత్తూ వాసుదేవుడేయైన భగవాన్ రమణులు, నా చెంత నుండగా, మళ్ళీ శ్రీకృష్ణుని వేరుగా పూజించడం ఎందుకు? ఆయన దర్శనం వేరుగా కావాలని కోరుకోవడమెందుకు? ఈ విధంగా నేను ఏకాగ్రతతో ఆలోచించాను. నాకు ఒకే ఒక మంత్రము, ఒక దైవము, ఒక పవిత్ర గ్రంథము కావాలి. అప్పుడు సంఘర్షణకు తావు ఉండదు. ఉన్నట్లుండి నా హృదయంలో, 'ఓం నమో భగవతే శ్రీరమణాయ' అనే మంత్రం స్ఫురించింది. నా హృదయంలో ఆ మంత్రం ఎడతెగక ప్రతిధ్వనించ సాగింది. నేను భగవాన్ వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్ళి, ఈ నూతన మంత్రం యొక్క ఆవిర్భావాన్ని గూర్చి చెప్పాను. ఆయన ఆ మంత్రాన్ని ఆమోదించారు. నేను తర్వాత ఈ నూతన మంత్రంలోని అక్షరాలను లెక్కించాను. అవి పన్నెండున్నవి. వాసుదేవ మంత్రంలో కూడా పన్నెండు అక్షరాలు ఉన్నవి. నేనెంతో ఆనందించాను. భగవాన్ ఈ మంత్రానికి పూర్తి సమ్మతి తెలిపారని తెలుసుకున్న ఆశ్రమ యాజమాన్యం ఈ మంత్రాన్ని పూర్తిగా ఆమోదించి, ఆశ్రమ శిఖరంలో 'ఓం' అనే చిహ్నానికి కింద గల 'శ్రీ రమణాశ్రమం' అనే అక్షరాల బదులు "నమో భగవతే శ్రీరమణాయ" అనే అక్షరాలను ఉంచారు.

నేను (గణేశన్) ఆశ్రమానికి శాశ్వతంగా వచ్చి చేరుటకు ముందు రెండు సంస్థలలో పనిచేశాను. ఆ రెండుచోట్ల వచ్చిన మొదటి నెల జీతాన్ని రెండు సమభాగాలు చేసి, నా ఉప గురువులైన నా మాతృమూర్తికి, నా ఉపాధ్యాయులైన టి.కె.ఎస్. గారికీ పంపించాను. అవి నా గౌరవనీయులైన గురువు గారి అంతిమ దినాలు. ఆయన తీవ్రంగా జబ్బుపడి, మంచాన పడి, ఆశ్రమం ఎదురుగా వున్న ఇంటిలో ఉన్నారు. నేను ప్రతిరోజూ ఆయన వద్దకు వెళ్లేవాడిని. అది ఆయన చివరి రోజు "గణేశా! నాకు సేవ చేసిన వీళ్లు చాలా బీదవారు. కాబట్టి దయచేసి, ఈ కవరులో ఉన్న డబ్బును, నా అంత్యక్రియలకు వాడు. అరుణాచల నామాన్ని పఠిస్తూ, నువ్వు నా శరీరాన్ని స్మశానం వరకు మొయ్యి"

అంతసేపు నేను ఏడుస్తూనే ఉన్నా "ఇంత డబ్బు మీకెక్కడిది?" అని అడిగాను. ఆయన దయతో నవ్వి 'నీకు గుర్తుందా? రెండుసార్లు నువ్వు నీ మొదటి నెల జీతమని కొంత డబ్బు నా నిత్యావసరాలకని పంపావు? ఆ డబ్బు నేను ఖర్చు చెయ్యలేదు. అది నా హృదయానికెంతో ప్రీతిపాత్రమైనది. ఇప్పుడు నువ్వే, నీ చేతులతోనే నేను అరుణాచలేశ్వరుని వద్దకు వెళ్ళే ఈ అంతిమ యాత్రలో ఖర్చు పెట్టవచ్చు. ఆయన నా తలపై చిన్నగా తట్టి అన్నారు. "ఇది నా ఆశీర్వాదం నీకు. చూడు, నాకున్నదంతా నీకు ఇచ్చేస్తున్నాను" ఈ ప్రపంచంలో ఏదైనా, ఆ జ్ఞాన స్పర్శతో సరిపోలేది ఉంటుందా?"

"ఓ భగవంతుడా! నా మనస్సు ఎచటెచట విహరించినా, నా నాలుక నీ పవిత్రమైన నామాన్ని నిరంతరం జపించే వరాన్ని నాకివ్వు".

వేంకటేశశాస్త్రి



పురాణప్రసిద్ధి చెందిన వేదకాలపు ఋషులనుండి, భగవాన్ వరకు, వారు ఏ సహజ స్థితిలో అయితే నిష్ఠులయిపోయారో, ఆ సహజస్థితిని మనము కూడా తిరిగి పొందాలని, వారి బోధలను వదలి వెళ్ళారు. ఎవరైతే ఆ బోధలు చదవటము గానీ వినటము గానీ చేస్తారో, వారు తాము కూడా అదిగా ఉండాలని, అనుకోవాలి అది ఏదైనా మార్పు తెచ్చుకోవడము ద్వారా కాదు, కేవలం 'అది'గా 'ఏఋుక'గా మిగలడమే (లేక ఉండడమే). "నేను ఎవరను?" అనే దాని ముఖ్య ఉపదేశం ఏమిటంటే 'వైరాగ్యము' లేదా 'కోరికలు లేకుండట'. ఇది వివేకముకంటె వేరుకాదు. కోరికలు లేకపోవడం అంటే, మనసును బాహ్యంలోని ఏ వస్తువు మీదకూ పోకుండా నిరోధించడమే. వివేకమంటే ఏ వస్తువూ కనపడకపోవటమే. ఇంకొకరకంగా చెప్పాలంటే, హృదయాన్ని తప్ప ఇతరమైన ఏ వస్తువునూ కోరకపోవడమే. వైరాగ్యము లేదా కోరికలు లేకుండుట. హృదయాన్ని వదలకుండా ఉండుటయే వివేకము. (నిత్యానిత్య వస్తు వివేచనము)

భగవాన్ గొప్ప భక్తులలో ఒకరు, నిరాడంబరంగా, అణుకువతో ఉండే వ్యక్తి. ఆయన ఈ రెండిటినీ, పూర్తి వైరాగ్యాన్నీ, చక్కటి వివేకాన్నీ సహజ లక్షణాలుగా కలిగి ఉండేవారు. ఆయన చాలా ప్రత్యేకమైన వ్యక్తి. ఆయన ఎవరో కాదు వేంకటేశశాస్త్రి గారే. ఆయనను మేము శాస్త్రి మామ అని పిలిచేవాళ్ళం. వేదాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వారిని శాస్త్రి అనే వారు. ఆయన ప్రపంచంలోనే జీవించినా, దానినేమాత్రం అంటకుండా ఉండేవారు. ఎల్లవేళలా వివేకంతో ఉండి, పనికీ, వివేకానికీ వైరుధ్యం లేదు అని చూపారు.

శాస్త్రిమామ భగవాన్‌కు దూరపు బంధువు. ఆయన చిన్నపిల్లవాడుగా ఉన్నపుడే తల్లి చనిపోవుట వలన తండ్రి రెండవ వివాహము చేసికున్నారు. సవతి తల్లి తరచుగా చిత్రహింసలు పెట్టినా, ఆమె దురాగతాలన్నిటినీ మౌనంగా భరించేవారు. ఆయనకు మూడేళ్ళ వయసు ఉన్నపుడు, ఆయన చేతిని మెలితిప్పి పొయ్యిలో పెట్టింది. ఆయన చేతివేళ్ళు శాశ్వతంగా దెబ్బతిన్నవి. ఆ భయంకర హింసను, ఆయన నోరు మెదపకుండా భరించారు. ఆయన తండ్రి, తన భార్య పద్ధతులలో మార్పు తేలేక, దక్షిణాదిన ఉన్న కేరళలోని కొచ్చి అనే ఊరిలో పాఠశాలలో చేర్చారు. అక్కడైనా ఆయన సుఖంగా ఉంటారని తండ్రి భావించారు. హాస్టలు వసతితో ఉండే ఆయుర్వేద పాఠశాల (బోర్డింగ్‌స్కూల్)లో తండ్రి ఆయనను చేర్పించారు. ఆ పాఠశాలలో జ్యోతిషశాస్త్రము కూడా నేర్పేవారు. అదృష్టవశాత్తూ అక్కడి ఉపదేశికుడు (ఉపాధ్యాయుడు) కొచ్చి రాజకుటుంబమునకు పెద్ద. ఆయన ఒక గొప్ప జ్యోతిషశాస్త్రవేత్త. ఆయుర్వేద వైద్యుడు కూడా.

శాస్త్రిమామ కూడా అద్భుతమైన తెలివితేటలు కలవాడు. ఒక్క సంవత్సరము లోపే ఆయన కొన్ని వేల సంస్కృత పద్యాలను చక్కగా నేర్చుకున్నారు. మామూలుగా వాటిని నేర్చుకోవాలంటే పదిహేను సంవత్సరాలకు పైనే పడుతుంది. ఆ ఉపాధ్యాయుడు ఈ పిల్లవాని తెలివితేటలకు ఆశ్చర్యపడి, ఆయనకు తను వ్యక్తిగతంగా శిక్షణ ఇవ్వాలనుకున్నారు. ఆ ఉపాధ్యాయుడు, తన సంరక్షణలో ఉన్న బాలుని తనతోపాటు, తన అంతఃపురమునకు తీసుకువెళ్ళి, ఆయనకు ఇలా చెప్పారు. "నీలాంటి వాడికి మామూలు జ్యోతిషశాస్త్రము పనికిరాదు.నేను నీకు జ్యోతిషశాస్త్రములోని అత్యున్నతమైన 'ప్రశ్న'ను నేర్పిస్తాను". సాధారణ జ్యోతిష్యములో, ఒక బిడ్డ పుట్టగానే, పుట్టిన సమయాన ఉన్న గ్రహస్థితిని బట్టి, జాతకచక్రాన్ని తయారుచేయించుతారు. ఆ బిడ్డ జీవితాంతము, ఆ జాతక చక్రములోని గ్రహాల స్థానాలనుబట్టి, ఆ బిడ్డ భవిష్యత్తు చెబుతారు. 'ప్రశ్న'లో నిష్ణాతుడైన వానికి జాతక చక్రంతో పనిలేదు. ప్రశ్న అడిగిన టైమునిబట్టి, పేరు, ప్రశ్న అడిగిన వ్యక్తి ఏదిక్కునకు ముఖం పెట్టి కూర్చున్నదీ అనే విషయాన్ని బట్టి, ఏ ఊరినుండి అతడు వచ్చాడు, ప్రశ్నలోని మొదటి అక్షరము, ప్రశ్నలోని మొదటి మాట, అనువానిని బట్టి, ఈ శాస్త్రజ్ఞుడు, తన మనసులోనే ఆ వ్యక్తి జాతకచక్రమును తయారుచేసుకుని, తన లోపలి అంతః చేతనను తట్టి, సమాధానం కొరకు వేచి ఉంటారు. అపుడు, భవిష్యద్వాణి లోపలనుండి వస్తుంది. ఇది చాలా ఖచ్చితంగా నిజమయి ఉంటుంది.

శాస్త్రిమామ చదువు పూర్తి అయిన పిమ్మట, గురుదక్షిణ ఇవ్వడానికి సిద్ధపడ్డారు. ఆ ఉపాధ్యాయుడు ఈయనను చూచి గర్వపడేవారు. కానీ ఈయన చాలా పేదవాడని తెలుసును. "నేను నిన్ను గురుదక్షిణ అడగదలచు కొన్నాను," అన్నారు. "గురువుగారూ మీకేమి కావాలో చెప్పండి దయచేసి", అన్నారు శాస్త్రిమామ. ఆ ఉపాధ్యాయుడు శాస్త్రిగారికి సుబ్రహ్మణ్యస్వామి ఫోటోను ఇచ్చారు. సుబ్రహ్మణ్యుడు శివుని రెండవ కుమారుడు. జ్ఞానానికీ, మౌనానికీ, వైరాగ్యానికీ ఆయన ప్రతిరూపం. ఆయనను పూజించు ఆయన నీ జీవితమంతా నీకు మార్గాన్ని చూపిస్తారు. అదే నీనుండి నేను కోరుకునే గురుదక్షిణ. శాస్త్రి మామ ఉపాధ్యాయుల వారిచ్చిన కానుకను ఆశీర్వాదంగా భావించి, తన గ్రామానికి తిరిగి వెళ్ళారు. ఆయన చాలా ప్రఖ్యాతిగాంచిన తిరుగులేని, సంపన్నుడైన జ్యోతిష్యుడు అయినాడు. ఆయన చెప్పిన జ్యోతిష్యము చాలా నిక్కచ్చిగా నిజమయ్యేది.

ఒకరోజు ఆయన బాబాయి ఒకరు రమణమహర్షి ఫోటో ఒకటి తెచ్చి ఆయనకు ఇచ్చారు. ఆయన ఆ ఫోటోను ఎంత గౌరవంతో తన పూజాగదిలో సుబ్రహ్మణ్యస్వామి ఫోటో ప్రక్కన ఉంచారు. ఒకరోజు ధ్యానంలో ఉన్న ఆయన కనులు తెరిచేటప్పటికి, భగవాన్ ఫోటో సుబ్రహ్మణ్యస్వామి ఫోటోగాను, సుబ్రహ్మణ్యస్వామి ఫోటో భగవాన్ ఫోటోలాగాను కన్పించసాగాయి. అది కలో లేక దర్శనమో ఆ మార్పును ఆయన దాదాపు అరగంటసేపు గమనించారు. అప్పుడాయనకు ఇలా అనిపించింది. మానవ రూపంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి తనకు జీవితమంతా మార్గదర్శకత్వం చెయ్యాలని, తన గురువుగారు కోరుకుని ఉంటారు. అందుకని ఆయన 1917లో స్కందాశ్రమానికి వచ్చారు. ఆయన వచ్చీరాగానే, అమ్మ అళగమ్మాళ్ ఆయనను తమ బంధువుగా గుర్తించారు. భగవాన్ కూడా, "అవును. నేనెరుగుదును. ఇతను సుబ్బు వాళ్ళ కుమారుడు" అన్నారు. భగవాన్‌ను కలుసుకొనక ముందు ఆయన భక్తులలో ఎక్కువమంది ఆయన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని గురించి ఎరుగరు. అందుకని భగవాన్ విశిష్టతను గూర్చి ముందుగానే ఏ అభిప్రాయమూ ఉండదు వారిలో. కానీ వారందరూ, ప్రథమ పరిచయంలోనే ఆయన వైశిష్ట్యాన్ని గుర్తించారు. అలాగే శాస్త్రిమామ కూడా భగవాన్‌ని చూడగానే, తన దైవాన్ని, గురువును కనుగొన్నాననుకున్నారు. వైరాగ్యానికీ, వివేకానికీ, మౌనానికీ ప్రతిరూపమైన దైవాన్ని ఆయనలో చూచారు. అప్పటికింకా భగవాన్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు ఆయనతో.

తాను ఎంచుకున్న జ్యోతిషశాస్త్ర విభాగమైన ప్రశ్న, ఖచ్చితమైన ప్రామాణికమైన శాస్త్రమని ఆయన నమ్మకం. ఆయన ధైర్యం కూడగట్టుకుని, భగవాన్ వద్దకు వెళ్ళి, ఎంతో అణకువతో, కానీ పూర్తి దృఢనమ్మకంతో ఈ క్రింది ప్రశ్నను అడిగారు. "భగవాన్! జ్యోతిషశాస్త్రము అన్ని శాస్త్రాలకంటే ఉత్తమమైనదీ ఖచ్చితమైనదీ కదా?" నెమ్మదిగా, నిశ్చయంగా భగవాన్ సమాధానమిచ్చారు. "ఆత్మకు సంబంధించిన శాస్త్రము అన్ని శాస్త్రములకంటే ఉత్తమమైనది" అప్పటికి శాస్త్రిమామ తన వృత్తిలో మంచి ఉచ్ఛస్థానంలో ఉన్నారు. ఆయన చెప్పిన ప్రతి జ్యోతిష్యానికీ భారీగా పారితోషికం ముట్టేది. ఆ విధంగా ఆయన బాగా డబ్బు సంపాదించి, ధనాన్ని కూడబెడుతున్నాడు. గురువుగారి మాటలు ఆయనలో వైరాగ్యబీజాలను నాటాయి. అనుక్షణం మారిపోతుండే ఈ ప్రపంచంలో జీవించడం నిరర్థకం అని భావించి, ఆయన తన గురువు వద్దనే ఉండిపోదామనుకున్నారు. కానీ హిందూ ఆచారము ప్రకారము, సన్యసించే ముందు తల్లి, తండ్రి లేదా పెద్దల సమ్మతిని పొందాల్సి ఉంటుంది. అందుకని ఆయన భగవాన్ తల్లిగారి వద్దకెళ్ళి, "నేనీ ప్రాపంచిక విషయాలను త్యజించి, భగవాన్ వద్ద ఉండిపోదామనుకుంటున్నాను," అన్నారు. అమ్మ ఆశ్చర్యంతో అన్నారు. "నీ చిన్నతనంలోనే, ఒక అమ్మాయిని నీకు భార్యగా మేము నిశ్చయించేశాముగదా! ఆమె నీ కొరకు వేచి ఉన్నది. నువ్వు పెద్దల నిర్ణయాన్ని గౌరవించవలెనుగదా! అన్నీ వదలి నువ్వు ఇక్కడకు ఎలా వస్తావు?" అన్నారు. శాస్త్రిమామ భగవాన్‌వైపు చూశారు. భగవాన్ కూడా ఆమె మాటలను ఆమోదిస్తున్నట్లుగా చిరునవ్వు నవ్వారు. శాస్త్రిమామ తిరిగి తన గ్రామానికి వెళ్ళి విశాలాక్షి అని పేరుగల ఆ అమ్మాయిని వివాహం చేసుకున్నారు. ఆమెను శాలా అని పిలిచేవారు. ఆయన తర్వాత కొద్ది సంవత్సరాలపాటు, అపజయమెరుగని జ్యోతిష్యుడిగా, చాలా సంతోషంగా గడిపారు.

ప్రశ్నశాస్త్రంలో ఆయనకు గల పాండిత్యానికి ఇది ఒక ఉదాహరణ. ఆయన వివాహం చేసుకున్న తర్వాత ఎక్కువసేపు పూజగదిలోనే గడిపేవారు. ఒకసారి ఆయన ఇంటికి ఒక వ్యక్తి వచ్చారు. ఆయన భార్య, "నాగప్ప చెట్టియార్ గారు వచ్చారు," అని చెప్పారు. శాస్త్రిమామ కూర్చున్న చోటునుండి లేవకుండానే ఇలా జవాబిచ్చారు. "ఆయన తన వజ్రపుటుంగరాన్ని

పోగొట్టుకుని, నౌకరు కాజేశాడని అనుమానిస్తున్నారు. ఎవరినీ అనుమానించవద్దని ఆయనకు చెప్పు. ఆయన పెరట్లో తన వస్త్రములు జాడించుకుంటున్నపుడు, ఆయన వజ్రపుటుంగరం జారిపోయింది. అది ఇపుడు వారి పెరట్లో, బావి వద్దగల అరటిచెట్టు కింద ఉన్నది. ఈ జ్యోతిష్యము నూటికి నూరుపాళ్ళు నిజమని నిర్ధారణ అయింది. అంత ఖచ్చితంగా ఆయన పనిచేసేవారు. పోలీసులు కూడా నేరస్థులజాడ కనుగొనడానికి ఆయన సాయం కోసం వచ్చేవారంటే ఆశ్చర్యంలేదు.

కొంతకాలానికి వారికొక పుత్రుడు కలిగాడు. ఆయన కొడుకు జాతక చక్రం పరిశీలించి, అతడు పందొమ్మిది సంవత్సరాల లోపే మృతి చెందుతాడని కనుగొన్నారు. తనకు వేరొక కుమారుడు కలిగే యోగం లేదని కూడా ఆయనకు తెలిసింది. ఆయన ఆ విషయాన్ని భార్యకు చెప్పకుండ, దుఃఖాన్ని పట్టలేక ఉపశమనం కోసం రమణాశ్రమంలోని భగవాన్ వద్దకు వచ్చారు. భగవాన్ కొండపైకి వెళ్తున్నపుడు శాస్త్రిమామ ఆయనను అనుసరించి, తన కుమారుని జాతకం గురించి చెప్పారు. కొంతదూరం వెళ్ళిన తర్వాత భగవాన్ ఆయన వైపు చూచి ఇలా అన్నారు, "నువ్వు దక్షిణాన కేరళలో ఉన్నావు కదా.కొచ్చిలో నువ్వు అక్కడ సమృద్ధిగా ఉండే పనసపండ్లను చూసే ఉంటావు. పనసపండు ప్రత్యేకత ఏమిటంటే, అది మానునుండి వస్తుంది. కొమ్మలకు కాయకుండా, కాయ కాసే సమయానికి అనేక మొగ్గలు వస్తవి. కానీ కొన్ని మాత్రమే నిలుస్తాయి. మిగిలినవి రాలిపోతాయి. ఆ చెట్టు చివరకు కొద్ది కాయలను మాత్రమే కాస్తుంది. పెద్దదిగా, ఆరోగ్యంగా ఉండే కాయలకోసం ఒకొక్క పెద్ద కాయకు చుట్టూ ఉండే యాభై, అరవై మొగ్గలు, పిందెలు రాలిపోతాయి."

శాస్త్రిమామకు, భగవాన్ తన కుమారుని రక్షించరు, అనే విషయం అర్థం అయింది. ఆయన భగవాన్‌కు సాష్టాంగనమస్కారం చేసి, తన గ్రామానికి బయల్దేరారు. వెళ్ళే ముందు భగవాన్ పాదాలు పట్టుకొని ఏడుస్తూ, "నాకు రక్షణ ఎక్కడ? నాకు ధైర్యాన్ని ఇవ్వండి." అని అడిగారు. భగవాన్ అపుడు, తను విరూపాక్ష గుహలో వ్రాసిన పద్యం, "హృదయకుహర మధ్యే..." అనే దానిని ఉటంకించారు. హృదయమనే గుహమధ్యలో, 'నేను', 'నేను' అంటూ, ఏకమూ, అద్వితీయమూ అయిన 'బ్రహ్మము' ప్రకాశిస్తూ ఉంటుంది. లోతైన ఆత్మాన్వేషణ ద్వారానో, మనస్సును శ్వాసనిరోధం ద్వారా స్వాధీన పరచుకొని (లేక అధీనంలో ఉంచుకుని) హృదయంలో స్థితుడవు కమ్ము. ఇది వినడంతోడనే తన ఎదుట రెండు మార్గాలున్నవనీ, అవి ఒకదాని కొకటి పరస్పర పూరకాలనీ, ఒకటి – ఆత్మాన్వేషణ, రెండవది – సంపూర్ణ శరణాగతి. ఆత్మాన్వేషణ చేయాలంటే పరిపూర్ణ శరణాగతి చెందాలి. శరణాగతి చెందాలంటే ఆత్మాన్వేషణ చెయ్యాలి, అని పూర్తి విశ్వాసం కల్గింది.

ఇంటికి వెళ్ళగానే ఆయన భార్యతోనూ, కుమారునితోనూ ఇలా చెప్పారు, "నేను నా గురువుగారి వద్దకెళ్ళి ఆయనతో కలసి ఉండదల్చుకున్నాను. కానీ, నేను మిమ్మల్ని గతిలేని స్థితిలో వదలి వెళ్ళను. మీరిద్దరు సుఖంగా ఉండడానికి కావలసిన ఏర్పాటుచేస్తాను. ఆ తర్వాత నేను వెళ్ళిపోతాను. ఇది నా తుదినిర్ణయం. ఆయన భార్య సామాన్యమైన, చదువులేని, పల్లెటూరి మనిషి అయినప్పటికీ, వివేకవంతమయిన సమాధానము ఇచ్చింది. మీరు ఇదంతా వదలి ఒక ప్రదేశానికి వెళ్తున్నారంటే, ఆ ప్రపంచం, దీనికంటే మంచిదయి ఉంటుంది. మీరు నన్నుకూడా ఎందుకు తీసుకుని వెళ్ళరు? నన్ను తక్కువ చోట ఎందుకు వదలిపెట్ట దలచారు? శాస్త్రిమామ ఆశ్చర్యంతో అడిగారు, "మరి మన పుత్రుడి మాట ఏమిటి? నువ్విక్కడ ఉండి, అతనిని పెంచాలని కోరుకుంటావనుకున్నాను". దానికామె, "నేను వాడిని నా తమ్ముడి ఇంట్లో వదలి మీతో వస్తాను," అన్నది. హిందూ కుటుంబాలలో, బంధువులు ఇటువంటి బాధ్యతలను సంతోషంగా తీసుకుంటారు. వాటిని బరువుగా భావించరు.

శాస్త్రిమామ ఆమెను ఇలా హెచ్చరించారు. నేనక్కడికి యాచకుడిగా వెళ్తున్నాను. అక్కడ నేను జ్యోతిష్యము చెప్పి డబ్బు సంపాదించను. నేను నా గురువు గారితో పూర్తి వైరాగ్యంతో, ఏ విధమైన కోరికలు లేకుండా, జ్ఞానార్జనే ధ్యేయంగా ఉంటాను. గురువుగారు ఏ విధంగా చెయ్యమంటే, ఆ విధంగా చేస్తాను. నా భోజనం గాని, తలదాచుకొనే చోటుగానీ ఎలా వస్తాయో నాకు తెలియదు. ఆమె స్థిరనిర్ణయంతో అన్నారు, "మీరు కష్టమే పడతారో, సుఖమే పడతారో ఏదైనా విజయం సాధిస్తారో, పరాజయమే పొందుతారో, దానినే నేనూ పంచుకుంటాను. హిందూధర్మం ప్రకారం ఈ విధంగా భర్తను కోరే అధికారం భార్యకు ఉంటుంది." ఆమె ఆయనతోపాటు ఏ కష్టమైనా పడటానికి సిద్ధపడినపుడు, శాస్త్రిమామకు అడ్డుచెప్పడానికి ఏమీ మిగలలేదు.

వాళ్ళు రమణాశ్రమానికి చేరుకున్నారు. ఆ రోజులలో స్త్రీలు ఆశ్రమంలో ఉండరాదు అనే నియమం ఉండేది. అందుకని భగవాన్ తమ్ముడూ, ఆశ్రమ మేనేజరు అయిన చిన్నస్వామి, శాస్త్రిమామతో ఇలా చెప్పారు, "నువ్వు మాతృభూతేశ్వరాలయంలో పూజాదికాలు నిర్వర్తించు. నీ భార్యను, టౌన్‌లో ఉన్న నా కుమారుని కుటుంబంతో ఉండమను. ఆమె అక్కడ ఉంటూ, భగవాన్ చెల్లెలికి, వెంకటు భార్యకు సేవచేస్తుంది. నువ్వు ఇక్కడే సేవ చెయ్యి" అన్నారు. శాస్త్రిమామ ఈ విషయాన్ని భగవాన్‌కు చెప్పారు. భగవాన్ కొంతసేపు మౌనంగా ఉండి, తర్వాత శాస్త్రిమామ వైపు తిరిగి, "నువ్వు ఎందుకు వచ్చావో, ఆ ఆశయంకోసం ప్రయత్నం కొనసాగించు". భగవాన్ ఉద్దేశం శాస్త్రిమామకు అర్థమైంది. ఆయన కర్తవ్యం పూజచేసి, భోజనం కోసం పని చెయ్యటం కాదు. ఆయన ఇక్కడకు వచ్చిన ఉద్దేశం, సర్వస్వాన్నీ త్యజించి, ఏ కోరికా లేకుండా, జ్ఞానాన్ని సంపాదించటం, నిజానికి, వైరాగ్యము, వివేకమూ వేరుకాదు.

ఆయన తన భార్యను తీసికొని, గిరిప్రదక్షిణ మార్గం మధ్యలో ఉన్న ఆదిఅణ్ణామలై అనే ఒక కుగ్రామంలోని ఒకానొక స్థావరంలో తలదాచుకున్నారు. ప్రతిరోజూ, భార్య, భర్తా గిరిచుట్టూ తిరిగి, భగవాన్‌తో పగలంతా గడిపి, ఆశ్రమ భోజనానికి ఆశించక ఉండేవారు. తిరిగి సాయంత్రం మిగిలిపోయిన ప్రదక్షిణ పూర్తి చేసుకుని వారి స్థావరానికి తిరిగి వెళ్ళేవారు. చుట్టూ ఉండే జనం ఈ నిరాడంబరమైన జంటను చూచి జాలిపడ్డారు. వారి వద్ద, గిన్నెలు లేవు. బియ్యంగానీ ఆఖరికి కూరలు కూడా లేవు. అందుకని సహృదయులైన పల్లె ప్రజలు, అరటిపళ్లు, వేరుశనగ గింజలూ, కొన్ని దుంపలు తెచ్చి ఇచ్చి, తినమని వారిని ప్రార్థించేవారు. ఈ విధంగా, ఈ నిరాడంబరమైన పవిత్రమైన దంపతులను, వారు చాలా సంవత్సరాలపాటు పోషించారు. వారు వేరుశనగ గింజలు, అరటిపళ్ళూ, ఇంకా పల్లె ప్రజలు ఏది ఇస్తే దానితో పొట్ట నింపుకునే వారు. ఆశ్రమం ఎంత రుచికరమైన భోజనం పెట్టినా వారు దానివైపు ఆకర్షింపబడలేదు. వాళ్ళు, భారతీయులు సామాన్యంగా తీసుకునే ఆహారం, బియ్యము, పప్పులు, గోధుమలు, మిగిలిన ఇతర పదార్థాలను గురించి మరచిపోయారు. అయినప్పటికీ, వారు పూర్తి సంతోషంగా ఉన్నారు.

భగవాన్‌కు వేదాలనుండి ఏదైనా వివరణ కావలసి వచ్చినపుడు, కావ్యకంఠులవారు, జగదీశశాస్త్రిగారు లేనిచో శాస్త్రిమామ సాయం తీసుకునే వారు. శాస్త్రిమామ కూడా చక్కటి కవి కావున, భగవాన్ ప్రశ్నలకు సమాధానాలను సంస్కృత పద్యాల రూపంలో ఇచ్చేవారు. ఒకరోజు భగవాన్ శాస్త్రిమామతో, "నువ్వు ఇంత చక్కటి సమాధానాలను ఇస్తున్నావు. శాల ఈపద్యాల భావాలను గుర్తించగలదా?" "భగవాన్! ఆమె పల్లెటూరి మనిషి. దాదాపుగా చదువుకోలేదనే చెప్పాలి. నేను వీటిని గురించి ఆవిడకు ఎప్పుడూ చెప్పలేదు." భగవాన్ పట్టుబట్టారు, "లేదు. నువ్వు ఆమెను నీ స్థాయికి తీసుకుని రావాలి. ఆమెకు తమిళము రాదా?" శాస్త్రిమామ, "ఆమెకు తమిళము తెలుసును." భగవాన్, "అయితే నాకోసం సంస్కృతంలో వ్రాసే వాటినన్నిటినీ ఆమె అర్థం చేసుకునేటట్లు సులభమైన తమిళంలోకి అనువదించి, ఆమెకు వివరించు".

నా చిన్నతనంలో శాస్త్రిమామ భగవాన్ బోధల మీద ఎన్నో పాటలు వ్రాసారని నాకు తెలుసు. ఎందుకంటే, మా తల్లిగారు వాటిని పాడి మాకు వినిపించేవారు. ఆ పద్యాలు సులభమైన భాషలో చక్కగా ఉండేవి. వాటిలో నేను ప్రత్యేకంగా ఇష్టపడే పాట ఒకటి ఉండేది. అది ఈ విధంగా సాగేది – "కాల్కండు వంగిదువిర్ (కాల్కండు) గురుపరా కాల్కండు, వంగిదువిర్ కాల్కండు, గురుపరా కాల్కండు వంగిదువిర్...." కాల్కండు అంటే పటిక బెల్లము. అనువదిస్తే దాని అర్థము, తీసుకోండి ఉచితంగా, పవిత్రమైన గురువు పాదాలనుండి ఉచితంగా లభించే పటికబెల్లాన్ని తీసుకోండి. ఈ కలకండ, గురువుగారి పవిత్రమైన పాదాలనుండి లభించే జ్ఞానామృతమే. గురువుగారి పాదాలపై బడి, ఎల్లవేళలా లభించే ఈ అమృతాన్ని తీసికోండి.

శాస్త్రిమామ కుమారుడు, బాలు కొద్ది సంవత్సరాలకొకసారి, తల్లితండ్రులతో ఉండడానికి తిరువణ్ణామలైకు వచ్చేవాడు. అప్పటికి శాస్త్రిమామ వైరాగ్యం గురించీ, మమకారం లేకుండా ఉండడం గురించి, శాలకు బోధిస్తుండే వారు. కానీ ఆయన బాలు, తన పందొమ్మిదవ సంవత్సరంలోపే చనిపోతాడని చెప్పలేదు. ఆ పిల్లవాడు సుందరంకంటే, నా కంటే కొద్దిగా పెద్దవాడు. అలా ఒకసారి అతడు వచ్చినపుడు శాస్త్రిమామ, శాల, నా తల్లితండ్రులు, సుందరం (మా అన్నయ్య), మణి (మా తమ్ముడు), భగవాన్ సోదరి, బాలు, నేను కలిపి ఫోటోకూడా తీయించుకున్నాము. ఈ ఫోటో ఇప్పుడు పురాతనవస్తువుల శాలలో ఉంది.

భగవాన్ జబ్బుతో ఉన్నపుడు, శాస్త్రిమామ, కొందరు పండితులతో కలిసి మృత్యుంజయ జపమనే ప్రత్యేక పూజా కార్యక్రమం చేశారు. 'మృత్యువు' అంటే చావు, 'జయము' అంటే గెలుపు అని అర్థం. ఈ హిందూ ఆచారము ప్రకారము, ఈ మంత్రాన్ని కొన్ని వేల సార్లు జపిస్తే, ఏ వ్యక్తి అయినా జాతకం ప్రకారం త్వరగా చనిపోతారని వ్రాసి ఉంటే, వారిని అపమృత్యువు బారిన పడకుండా కాపాడవచ్చును. భగవాన్ భక్తుల కోరికలను అంగీకరించే వారూ కాదు, తిరస్కరించే వారూ కాదు. కేవలం వారడిగిన విధంగా సహకరించే వారు. ఈ మంత్రపఠనమే వేదపాఠశాలలో నీటితో నిండిన కలశం ముందు జరగాలి. మంత్రోచ్చారణ, ఈ నీటిని, మంత్రజపం యొక్క శక్తివంతమైన ప్రకంపనలతో, శక్తివంతం చేస్తుంది. ఆ నీరు అపుడు ఆ వ్యక్తికి త్రాగడానికి ఇచ్చేవారు. ఒకరోజు, భగవాన్ సంభాషణలను రికార్డు చేసిన ఆయన, "జ్ఞానియైన భగవాన్ ఆ నీటిని త్రాగుతున్నారేమిటి?" అని ఆశ్చర్యపోయారు. భగవాన్ అప్పుడాయనను చూచి, సూర్యుని వంక చూచి, తన ఛాతీకి కుడివైపు చూపిస్తూ, తైత్తిరీయ ఉపనిషత్తులోని ఒక పంక్తిని ఉటంకించారు. "సా యశ్చా యమ్ పురుషేయశ్చాసవ్ ఆదిత్యే సా ఏకః". దీని అర్థం, "సూర్యునిలో ఉన్న శక్తి, నాలో ఉన్న శక్తి ఒక్కటే" అని. శాస్త్రిమామకు అర్థమయింది – భగవాన్ ఈ మంత్రాలను, ఈ ప్రక్రియను ఆమోదించలేదు. శిష్యులు కేవలం మేము మా గురువుగారి క్షేమంకోరి, ఏదో సేవచేశాము అని భావించి, సంతృప్తి పడతారనీ, మనశ్శాంతితో ఉంటారని, వాళ్ళకు సహకరించారే గానీ, ఆయనకు వాటిపై ఏ ఆపేక్షా, లేదా ఆసక్తీ లేదనీ. భగవాన్ చివరిరోజులవరకు ఆయనతో ఉండడంతో శాస్త్రిమామకు అప్పుడప్పుడు ఆత్మానుభూతి అందుతుండేది. ఆయన అప్పటికే నిరాడంబరతకు, పూర్తి వైరాగ్యానికీ పెట్టింది పేరు. కానీ పరిపూర్ణజ్ఞానం లభించాల్సి ఉంది. అదీ లభ్యమయింది భగవాన్ తన దివ్యమైన చూపుతో ఆయనను అనుగ్రహించ గానే.

నాకు వారితో దగ్గరగా ఉండే భాగ్యం లభించింది. ముఖ్యంగా శాలామామితో, నా బంధువులందరూ నేను వివాహం చేసుకోలేదని విచారిస్తుంటే, మా తల్లితండ్రుల మాత్రం పట్టుబట్టలేదు. బలవంత పెట్టలేదు. శాలామామి ఒకరోజున నన్ను కూర్చోబెట్టి ఇలా అన్నారు. "వివాహం చేసుకోవడం వల్ల నువ్వు పొందే లాభమేమిటి? ఈ ఒక్క శరీరమే భారం. ఇంకొక శరీరాన్ని తెచ్చుకోవడం వల్ల ప్రయోజనమేమిటి? ఆ ఇంకొక వ్యక్తి నీకు ఆనందాన్ని ఇవ్వగలరనుకోవడం కేవలం మిథ్య (భ్రమ). నిజమైన ఆనందం లోపలనుండి వస్తుంది. ఈ శరీరాన్ని శరణాగతి చెందిస్తే. నిద్రలో నీకు దేహస్పృహ ఉండదు కనుక, నువ్వు చాలా సుఖంగా ఉంటావు. నీకేదో సుఖాన్నిస్తుందని, ఇంకొక శరీరాన్ని తెచ్చిపెట్టుకుని, ఆ బాధ్యతను కూడా ఎందుకు భుజాన వేసుకుంటావు?" ఆమె వివేకపూరితమైన సలహా నాకు స్థైర్యాన్ని ఇచ్చింది. ఇదే సత్సంగం వల్ల కలిగే లాభం.

భగవాన్ దేహాన్ని విడిచిపెట్టిన తర్వాత, ఎక్కడో దూరాన ఉన్న గ్రామంలో చదువుకుంటున్న, శాస్త్రిమామ కుమారుడు, బాలు, తన పాఠశాల విద్యను పూర్తిచేసుకున్నాడు. మా తాతగారు చిన్నస్వామిగారు, అతనిని ఆశ్రమానికి రప్పించమన్నారు. ఆయన ఆ బాలుడికి, టౌన్‌లో జిల్లా కార్యాలయంలో ఉద్యోగం ఇప్పించారు. కొన్నిరోజుల తర్వాత బాలు, తన తల్లితండ్రులను తన వద్ద ఉండమని కోరాడు. కాబట్టి చిన్నస్వామి శాస్త్రిమామని, శాలమామిని అలాగే చెయ్యమన్నారు. శాస్త్రిమామకు తెలుసు, ఖచ్చితంగా ఏ తారీఖున, ఏ టైముకి తన పుత్రుడు చనిపోతాడు అనే విషయం, అది కేవలం ఇంకొద్ది, నెలల వ్యవధిలోనే ఉంది. ఆ దుర్దినానికి మూడురోజుల ముందు బాలు తీవ్రమైన జ్వరంతో తల్లితండ్రుల వద్దకు వచ్చాడు. ఖచ్చితంగా చెప్పబడ్డ సమయానికే చనిపోయాడు. శాస్త్రిమామ నాతో ఇలా చెప్పారు. "నేను శాల ఈ విషయాన్ని తట్టుకోలేదు అనుకున్నాను. అందుకనే బాలుయొక్క పొంచి ఉన్న మృత్యువును గురించి ముందుగా ఆమెకు చెప్పలేదు. కానీ, నా అంచనాలకు వ్యతిరేకంగా, ఆమె తన కుమారుని చావుని తట్టుకున్న విధానం అద్భుతం. ఆమె నాకన్న గొప్ప వ్యక్తి. ఆమె ఒక్క చుక్క కూడా కన్నీరు కార్చలేదు. బదులుగా ఆమె నన్ను ఓదార్చింది, అతడు అరుణాచలుని వద్దకు వెళ్ళిపోయాడు. అతడు ఇక్కడకు వచ్చి శరీరాన్ని వదలి అరుణాచలునిలో ఐక్యమవడం మన అదృష్టం."

వాళ్ళ కుమారుడు చనిపోయిన పిమ్మట, వారిద్దరూ, ఆశ్రమానికి ఎదురుగా ఉన్న కుటీరంలో ఉండేవారు. మా తండ్రిగారు ఆయనను, "మీరు ఇక్కడకు వచ్చి పూజ వ్యవహారంలో నాకు సహాయపడవచ్చుగదా!" అని కోరారు. శాస్త్రిమామ ఇప్పటికి లోతైన జ్ఞానాన్ని పొందారు కాబట్టి, భగవాన్ మందిరంలో పూజ ప్రారంభించారు. ఈ విధంగా నాకు ఆయన గురించి

తెలిసింది. ఏదో కారణం చేత, ఆయన నన్ను బాగా ఇష్టపడేవారు. నేను ఆశ్రమానికి వచ్చేసిన క్షణంనుండి, ఆయన నాపైన ప్రత్యేకమైన శ్రద్ధ చూపేవారు. ఆయన నాతో ఇలా చెప్పారు, "మనకు భగవానే దైవం. భగవాన్ రూపమే సత్యం, భగవాన్ నామమే సత్యం". "ఆ మాటలకు అర్థమేమిటి?" అని నేను ఆయనను అడిగారు. ఆయన ఇలా జవాబిచ్చారు. "నువ్వు భగవాన్ ఎవరో గుర్తించావా? భగవాన్ అరివున్మయి నిష్టన్ – ఆయన నిజంగా, ఆత్మ సాక్షాత్కారం పొందిన మహనీయుడు. అన్మ విటావాన్ హృదయంలో 'నేను', 'నేను' అనే బ్రహ్మముగా ఎప్పటికీ స్థిరంగా నిలచినవారు. ఆరివాల్ పూలన్ చేత్రాన్ "అంతరజ్ఞానము ద్వారా పంచేంద్రియాలను జయించిన వారు". "నేనేమి చెయ్యాలి? ఆయనను నేనెలా సేవించాలి?" అని నేనడిగాను. "ఆయనను గౌరవించు. ఆయన పేరులో ఖ్యాతిలో పాలుపంచుకో. ఆయన బోధలను ఇతరులతో పంచుకో. అలా చేస్తే వారు కూడా ఆంతరికమైన ఆనందాన్ని, "అంతరజ్ఞానాన్ని' కనుగొనగలరు. ఆయనను ఏ విధంగా భావించి పూజిస్తావు? ఆరివాంగియావన్, నీకు ఆయనెవరో తెలుసా? ఆయన ఒక జ్ఞానజ్యోతి. ప్రపంచానికి చెప్పు. రమణులు 'కేవలం శరీరమాత్రులు కాదనీ, ఒక వ్యక్తి మాత్రమే కాదనీ, ఆయన స్వచ్ఛమైన జ్ఞానము. ఆయన అరివాన్ గురిసత్తాన్. గురిసత్తాన్ అంటే పిడుగు. శత్రువు యొక్క అజ్ఞానాన్ని నాశనం చేసే అతిశక్తివంతమైన ఆయుధం. ఆయన కాలకాలన్ అంటే దేశకాలములను జయించినవాడు. 'చావినాయ్మాయ్ వీరన్' అంటే మృత్యువును జయించిన మహావీరుడు. భగవాన్ ఈ మాటలను 'ఉల్లదునార్పదు అనుబంధం'లో వ్రాశారు. (ఉన్నదినలుబది)

శాస్త్రిమామ నాతో ఎల్లపుడు భగవాన్ గురించి మాట్లాడి, ఆయన సన్నిధానాన్ని నేననుభవించేటట్లుగా చేసేవారు. అప్పటికి శాస్త్రిమామ ఆశ్రమంలో ఉద్యోగంలో చేరారు. ఆయన యువపూజారులైన కిట్టూకు, అప్పూచికు అసిస్టెంట్‌గా నియమింపబడ్డారు. వాళ్ళు వాళ్ళకు కావలసిన వస్తువులు తెమ్మని ఆయనకు చెప్పగానే ఆయన పరుగున వారు చెప్పిన పనులు చేసేవారు. ఆత్మసాక్షాత్కారం పొందిన మహాత్ముడు తనకంటె చిన్నవారైన ఇద్దరు పూజారులు చెప్పిన పనులన్నీ ఎదురుచెప్పకుండా చేయటం, వారు ఈయన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని కనీసం గుర్తించకపోవడం నాకు చాలా బాధ కలిగించింది.

నాగప్ప చెట్టియార్‌కు శాస్త్రిమామ చెప్పిన జ్యోతిష్యం గురించి, విన్నది పూర్తిగా నమ్మినప్పటికీ, అటువంటి అద్భుతాల ప్రభావం ఎలా ఉంటుందో, ప్రత్యేకంగా చూడాలని నాకు అన్పించేది. శాస్త్రిమామ చాలా అద్భుతాలు చేశారు. నా మెదడుగాని, తెలివితేటలు గాని, ఆ అద్భుతాల వెనుక ఉన్న తర్కాన్ని గ్రహించలేకపోయేవి. నా కళ్ళ ఎదుటనే ఆ అద్భుతాలు జరిగినపుడు నాకు ఆశ్చర్యంతో గగుర్పాటు కలిగేది.

ఎడిత్ దేరి అనే ఫ్రెంచి వనిత, పారిస్‌లో ఒక ఇంటర్నేషనల్ ఫ్రెంచి బ్యాంకులో ఛీఫ్ అకౌంటెంటుగా (జమఖర్చుల అధికారి)గా పనిచేసేవారు. ప్రతి సంవత్సరమూ, తనకు లభించే సెలవులను, ధ్యానంలో గడపడానికి, రమణాశ్రమానికి వచ్చి మూడునాలుగు వారాలు గడిపేవారు. బ్యాంకులో ఆ రోజు పని అయిపోగానే నేరుగా విమానాశ్రయానికి వెళ్ళి పారిస్‌లో విమానం ఎక్కి ముంబైలో దిగేవారు. ముంబైలో రైలెక్కి తిరువణ్ణామలై చేరుకునేవారు. తిరుగు ప్రయాణం కూడా అంత జాగ్రత్తగా పథకం వేసుకుని వీలైనంత ఎక్కువ సమయం ఆశ్రమంలో గడపడానికి చూచేవారు. భగవాన్ ఆశ్రమంలో గడిపే ప్రతి నిముషము ఆమెకు విలువైనది, పవిత్రమైనది.

1970వ దశకంలో ఆమె ఉద్యోగవిరమణ చేసే సమయాన, ఆమెగారు, ఆశ్రమంలో ప్రతి ఒక్కరికి బహుమతులు కొన్నారు. ఆ సారి వచ్చేటప్పుడు, ఆమె తను సాధారణంగా తెచ్చుకునే ఒకే ఒక బ్యాగు (పెట్టె)కు తోడు, ఈ కానుకలన్నిటిని ఉంచిన మరొక బ్యాగు (పెట్టె) కూడా తెస్తున్నారు. ఆమె ఒకానొక రోజున ఆశ్రమానికి రావలసి ఉన్నది కాని, రాలేదు. అట్లా ఎప్పుడూ ఆమె విషయంలో జరుగకపోవుటచే నేను ఆశ్చర్యపోయాను. ఒకరోజు ఉదయాన్నే నేను భగవాన్ సన్నిధి ఎదురుగా నుంచుని పాలాభిషేకం(లో పాల్గొంటున్నపుడు) చూస్తున్నపుడు, నా భుజంమీద రెండు చేతులు నా వెనుక నుండి ఆప్యాయంగా పడడం గమనించాను. ఆమె ఎడిత్‌దేరి. నా ఫ్రెంచి అమ్మ. ఆమె నా చెవిలో చెప్పారు. నేను నా బహుమతుల పెట్టె పోగొట్టుకున్నాను. అదే ఈ ఆలస్యానికి కారణం. ఏకారణం చేతనో నేను శాస్త్రిమామ వైపుకు వెళ్ళాను. ఆయన మంత్రాలు చదువుతుండగా నేనాయనకు దగ్గరగా వెళ్ళగానే, ఆయన యథాలాపంగా నావైపు తిరిగి, "ఏమీ పోలేదు. ఆవిడ దానిని తిరిగి పొందుతుంది," అన్నారు.

పూజ అయిపోయిన తర్వాత, నేనామెను శాస్త్రిమామకు పరిచయం చేశాను. ఆమె వివరాలు చెప్పసాగింది. సాధారణంగా, నేను ఎయిర్‌ఫ్రాన్స్ లోనే ప్రయాణిస్తాను. ఈ సంవత్సరం ఉద్యోగవిరమణ చేస్తున్నాను గనుక, చవకగదా అని కువాయిట్ ఎయిర్‌లైన్స్‌లో వచ్చాను. నేను ముంబై చేరుకునేటప్పటికి, కానుకలన్నీ ఉంచిన నా బ్యాగు లేకపోవడాన్ని గుర్తించాను. ఎయిర్‌లైన్స్ వారు తర్వాత వచ్చే వారి విమానంలో నా బ్యాగ్ తప్పక వస్తుందని హామీ ఇచ్చారు. నేను ఒక రోజంతా వేచి ఉన్నాను. కాని ఎన్నిసార్లు వెదికినా వాళ్ళు నా పోయిన బ్యాగ్‌ను కనుగొనలేకపోయారు. ఎయిర్‌లైన్స్ (విమాన నిర్వహణసంస్థ) వారు ఎలాగోలా దానిని వెదకిపట్టుకుని ఆశ్రమ చిరునామాకు పంపిస్తామని చెప్పారు. తనకు ప్రశ్న శాస్త్రంలో ఉన్న పరిజ్ఞానాన్ని బట్టి, శాస్త్రిమామ ఆమె బ్యాగు పోలేదని, దొంగతనం చేయబడలేదని, ఆమెకు అది తిరిగి లభిస్తుందని చెప్పారు.

కొన్నిరోజుల తర్వాత ఎయిర్‌లైన్స్ కంపెనీవారు, ఆమె పెట్టెను కనుగొనలేక పోయామని క్షమాపణలు కోరుతూ, ఆమె ఆ బ్యాగ్‌లో ఉన్న వస్తువుల వివరాలను, వాటి ఖరీదును చెబితే, నష్టపరిహారాన్ని చెల్లిస్తామని ఉత్తరం వ్రాశారు. శాస్త్రిమామ జ్యోతిష్యం పట్ల, ఆమె చాలా నిరాశ పడింది. మరుసటి రోజు శాస్త్రిమామను కలిసినపుడు ఆమె భావాలను నిర్మొహమాటంగా చెప్పేసింది. తన జ్యోతిష్యాన్ని నమ్మనందుకు శాస్త్రిమామకు కోపం వచ్చింది. ఏమి? ఆమె నా జ్యోతిష్యాన్ని సందేహిస్తుందా? ఆ బ్యాగ్ నా కళ్ళముందే కన్పిస్తోంది. పెద్దగదిలో, ఎవరూ అంటుకోకుండా వదిలి వేయబడి ఉంది.

ఎడిత్‌డేరి, ఆశ్రమంనుండి వెళ్ళిన ఒక వారం తర్వాత, ఆమె సంతోషంగా శాస్త్రిమామను పొగుడుతూ నాకు ఉత్తరం వ్రాశారు. "మీ జ్యోతిష మహాత్ముడు చాలా గొప్పవాడు. ఆయన చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. కువాయిట్ విమానాశ్రయంలో, నా తర్వాత విమానానికి చాలా వ్యవధి ఉండడంతో నేను సామాన్లు పెట్టే పెద్దహాలులోకి అనుకోకుండా వెళ్ళాను. అక్కడ ఏమి చూశానో తెలుసా? పోయిందనుకున్న నా బ్యాగు వాకిలి ప్రక్కనే నేలమీద ఉన్నది. దానికి గుర్తింపు చీటీలేదు. మిగిలిన బ్యాగులన్నిటికీ గుర్తింపు చీటీలు ఉన్నవి. ఆ బ్యాగ్‌లన్నీ చక్కగా, అలమారల్లో వరుసవారీగా అమర్చబడి ఉన్నాయి. నా బ్యాగ్ మాత్రం లేదు. నేను సంతోషంతో నా బ్యాగ్ గురించి ఆఫీసువారికి చెప్పాను. వారి పొరపాటుకు వారు క్షమాపణ చెప్పారు. సంతోషంగా ఉండు. నేను వచ్చే నెలలో, ఆశ్రమ ఉద్యోగులకు (పనివారికి) కేవలం కానుకలు ఇవ్వడానికి వస్తున్నాను.

ఒకసారి నేను సజీవులైన ఒక మహాత్ముడు చేసిన అద్భుతాలను గురించిన పుస్తకం చదువుతున్నాను. నేను ఆ పుస్తకాన్ని వదలిపెట్టలేదు. ఆ రాత్రంతా నిద్రపోలేదు. శాస్త్రిమామ ఉపదేశం అప్పుడే దొరికింది. నేను ఆ అద్భుతాలు చేసే మహాత్ముని కలుసుకోవాలనీ, నేను కూడా అద్భుతాలు చేసే శక్తి సంపాదించు కోవాలని అనుకున్నాను. పూజ అయిపోయిన తర్వాత, పాత ఆఫీసుకు దాదాపు ముప్పై అడుగుల దూరంలో ఉన్నపుడు, శాస్త్రిమామ, అకస్మాత్తుగా అన్నారు, "గణేశా ఆగు. అక్కడనే ఉండు". నేను అలాగే ఉండిపోయాను. ఆయన, "నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను. నువ్వు ఏ ఆలోచనా లేకుండా ఉండు". తర్వాత ఆయన ఒక ద్రాక్షపళ్ళ గుత్తిని నా ఎదురుగ ఎత్తి పట్టుకుని, "ఈ గుత్తిలో ఎన్ని ద్రాక్షపళ్ళు ఉన్నయ్యో, చెప్పు" అన్నారు. "పదమూడు," అన్నాను నేను. ఇక్కడకు వచ్చి వాటిని లెక్కపెట్టు అని మరలా ఆజ్ఞాపించారు. నేను ఊహించినది సరిగ్గానే ఉన్నది. "పదమూడే ఉన్నాయని నువ్వెలా చెప్పగలిగావు?" అన్నారాయన. అయోమయంగా, "నాకు తెలియదు" అన్నాను. "అలా అనకు. అలా అని నువ్వు వెళ్ళిపోలేవు. దానిలో పదమూడు ద్రాక్షపళ్ళు ఉన్నాయని నువ్వు ఎలా చెప్పగలిగావు?" అని ఆయన నొక్కి అడిగారు. ఈసారి నేను మౌనంగా ఉన్నాను. నీకు తెలుసుకదా,"నేను నిన్ను ఆలోచనలు లేకుండా ఉండమన్నాను," అన్నారు ఆయన. నువ్వు పదిహేను అనో, పది అనో, పదకొండు అనో ఎందుకు అనలేదు? ఖచ్చితంగా పదమూడు అని ఎలా చెప్పగలిగావు?" "నువ్వు ఆలోచనలు లేకుండా ఉన్నపుడు, నేను ఆ సంఖ్యను నీ మనసులో ఉంచాను. నేను అప్పటికే వాటిని లెక్కించాను. ఒక దృఢమైన మనస్సు, ఒక బలహీనమైన మనస్సును ఆక్రమించుకోవటమే అద్భుతమంటే. ఎప్పుడూ అద్భుతాల వలన ఆకర్షితుడవై లక్ష్యంనుండి వైదొలగకు". నేను ఆశ్చర్యపోయాను. నేను ఆయనకు ఎప్పుడూ ఆ పుస్తకంగుర్చి చెప్పలేదు. నేను దీనిని ఏ ఆధారం లేకుండా చెప్పడంలేదు." ఆయన భగవాన్ పద్యాల్లో ఒకదానిలోని కొంతభాగాన్ని ఉటంకించారు. ఆత్మాన్వేషణ జరిపి, ఆత్మలోనే ఎప్పటికీ చెక్కుచెదరని,

సద్వస్తువుగా స్థితులవటమే నిజమైన గొప్పదనము. అదే అన్నిటిలోకీ గొప్ప సిద్ధి. మిగిలిన సిద్ధులు, అతీంద్రియ శక్తులూ అన్నీ కలలో శక్తులను పొంది ఆనందించుట వంటివి. నిద్రించువాడు మేల్కొనగానే, నిద్రలో సంపాదించిన శక్తులు నిజముగా నుండునా? ఎవరైతే అసద్వస్తువులన్నిటినీ త్యజించి, ఆత్మనిష్ఠలో నుండువాడు, ఈ సిద్ధులవైపు ఆకర్షితుడై వాటిని పొందగోరునా? ఒకే ఒక దెబ్బతో, నాలో ఏమాత్రమైనా సిద్ధులు, అతీంద్రియశక్తుల పట్ల ఉన్న ఆకర్షణను తుడిచిపారవేశారు శాస్త్రిమామ.

శాస్త్రిమామ నేను కలుసుకున్న వారందరిలోకీ అత్యంతశక్తి వంతుడైన వ్యక్తి అయినప్పటికీ, అత్యంత నిరాడంబరులు. వేదాలలో సద్వస్తువు, అణువుకంటే చిన్నదీ, విశ్వమంతటికంటె పెద్దదీనూ. ఈ సూక్తి శాస్త్రిమామ పట్ల నిజమైనంతగా, మరెవరిపట్లా నిజంగాదు. ఆయనే ప్రస్తుతం నేనుంటున్న గృహం 'ఆనందరమణ'ని ఎంపికచేశారు. ఈ ఇల్లు అమ్మకానికి వచ్చినపుడు, "అనూరాధ ఆ ఇంటిని కొంటే బాగుంటుందని నేననుకుంటున్నట్లు ఆయనను సంప్రదించాను. అప్పటికి ఆయన పూర్తిగా అంధులైనారు. 'లేదు, నువ్వే దానిని స్వంతం చేసుకోవాలి' అన్నారు. ఆయన నన్ను ఆ స్థలానికి తీసుకొని వెళ్ళు అన్నారు. నేను ఆ స్థలంలోని ప్రతి అంగుళమూ ఆయనను త్రిప్పి చూపించాను. ఒకచోట, ఆయన నన్ను ఆపి, ఆ ప్రదేశం ఎలా ఉందో వర్ణించి చెప్పమన్నారు. "ఇక్కడ రెండు చెట్లున్నవి, ఒకటి రావిచెట్టు, రెండవది వేపచెట్టు" అన్నాను. ఇంకా ఏమైనా చెప్పేలోపలే, ఆయన నవ్వుతూ అన్నారు, "అవును, దైవమైన గణేశుడు ఈ చోటును ఎంపిక చేసుకున్నాడు. రావిచెట్టు తండ్రి అంశ. వేపచెట్టు తల్లి అంశ. దైవమైన గణేశుడు, పరమాత్మ శివునికీ, జగజ్జనని పార్వతికీ పుత్రుడు." నేను ఆయనకు 'సమర్థ వినాయకర్' అని పేరుపెట్టాను. అంటే శుభాలను కురిపించే గణేశుడు. ఆయన సూచించిన ప్రకారమే, ఒక స్నేహితుని సాయంతో 'ఆనందరమణ'నుకొని, శాస్త్రిమామ చెప్పినచోట గణేశస్వామికి గుడికట్టాను. గృహప్రవేశం రోజున, సమర్థ వినాయకుడి పూజతోసహా, జరగవలసిన కార్యక్రమాలన్నిటినీ ఆయనే దగ్గర ఉండి జరిపించారు. నేను ఆయనకు సాష్టాంగపడి, ఆయన ఆశీర్వాదాన్ని కోరినపుడు, ఆయన అనుగ్రహంతో నాకిలా చెప్పారు. "నీచుట్టూ ఉన్న ప్రపంచం, నిన్ను పట్టించుకోదు. నిన్ను వదిలేస్తుంది. కానీ ఏమాత్రం దిగులు చెందకు. సమర్థ వినాయకుడు నిన్ను రక్షించి నీకు మార్గము చూపుతారు. నేను నీకు ఇవాళ ఒక ప్రత్యేకమైన గణేశమంత్ర దీక్షను ఇస్తాను. ఆ మంత్రాన్ని వ్రాయకూడదు, పెద్దగా ఉచ్చరించకూడదు. ఆ మంత్రాన్ని నీ హృదయంలో జపించు. ప్రపంచాన్ని పట్టించుకోకు. అంతర్ముఖుడవై ఉండు. ఆ జపంలోనే మునిగి నీ హృదయంలోనే ఉండు. నీకు భగవాన్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉన్నవి.

శాస్త్రిమామ చివరిరోజులలో, ఆయన, తన మంచం మీద నుండి పడగా, తుంటివిరిగింది. హ్యూగోమెయర్, భక్తుల చివరి దశలో, వారికి సాయంచేసి, వారి అవసరాలను చూస్తూ వారికి హోమియోపతి మందులు ఇచ్చేవారు. ఆయన శాస్త్రిమామను చూచి, ఈయన వృద్ధాప్యం వలన శస్త్రచికిత్స చేయటానికి వీలుపడదు అన్నారు. శాస్త్రిమామ అన్నారు, "ఈ శరీరంపై శ్రద్ధ ఎందుకు? అది ఎలాగూ చనిపోయేదే, అది నెప్పితో పోతే నష్టమేమిటి? నేను శరీరాన్ని కాదు". "మామా, కాల్ రొంబావలికి రాథాం". నీ కాలు, బాగా నెప్పిగా ఉందా? అని నేనడిగాను. భరించలేని నెప్పిలో ఉండికూడా నవ్వుతూ అన్నారు, "కాలై ఎడుక్కు పార్కిరాయ్? ముక్కాలైపొరు ఆనందమా ఇరుక్కేన్. తమిళంలో, కాల్ అంటే కాలు, లేదా పావు (1/4), ముక్కాల్ అంటే ముప్పాతిక (3/4). 'కాల్' అనే పదాన్ని అలంకారికంగా ప్రయోగించి, చిన్నదైన 'పావు' లేదా 'పాతిక' భాగాన్ని చూస్తావెందుకు? అంటే ఈ శరీరాన్ని చూస్తావెందుకు? పెద్ద భాగమైన ముప్పాతిక వంతు మీద అనగా ఆత్మమీద శ్రద్ధ పెట్టు. ఆత్మపై దృష్టి పెట్టి, నేను సంపూర్ణమైన శాంతిలోను ఆనందలోనూ ఉన్నాను. ఆయన శరీరం బాధలో ఉన్నప్పటికీ, ఆయన సమయమంతా పూర్తి పారవశ్యంలో ఉన్నారు.

నాకు అది ఆయన ఆఖరిరోజని అనిపించింది. నేను నా స్నేహితురాలు అనూరాధను తీసికొని, ఈ అద్భుతమైన మహాత్ముని ఆశీర్వాదం పొందడానికి వెళ్ళాను. నేను ఆయన పాదాలను పట్టుకుని, "దయచేసి ఆశీర్వదించు మామా" అని కోరాను. ఆయన అణుకువగా అన్నారు, "భగవాన్ మాత్రమే ఆశీర్వదిస్తారు." "లేదు మీరు మా తలలపై చేతులుంచి దీవించాలి," అని నేను పట్టుబట్టాను. చివరకాయన అంగీకరించారు. "మేము మీ కొరకు ఏమైనా చెయ్యమంటారా?" అని ఆయనను అడిగాను నేను. "అనూరాధను 'అరుణాచల పంచరత్నమ్' పాడమని చెప్పు," అన్నారు. నేను, అనూరాధ ఆ మహోన్నతమైన భగవాన్ కీర్తన పాడుతుండగా, శాస్త్రిమామ తన రెండు చేతులను హృదయంపై ఉంచుకున్నారు. పారవశ్యంతో కన్నీరు అదేపనిగా కారసాగింది. శాస్త్రిమామ స్పృహలో ఉండే, ఆత్మలో లీనమైనారు.

రాజాఅయ్యర్



రాజా అయ్యర్‌ను పోస్ట్‌మాస్టర్ అనేవారు. ఆయన చాలా నిరాడంబరులు, భక్తిపరులు. ఆయన భజనలు, భక్తిగీతాలు పాడుతుండేవారు. ఆయన 1911వ సం॥లో భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా కలిశారు. స్వభావరీత్యా ఆయన ఒక నిరంతర బాటసారి. ఆయన కాళ్ళు ఎక్కడకు తీసుకువెళ్తే అక్కడకు వెళ్ళేవారు. అదే ఊరిలో ఉన్న తన మేనత్తను చూడడానికి తిరువణ్ణామలై వచ్చినప్పుడల్లా, ఆయన భగవాన్‌తో ఉండేవారు. 1911 సం॥లోనే ఆమె భగవాన్ గొప్పతనాన్ని గుర్తించింది. ఆమె తీపిపదార్థాలు (స్వీట్స్) తయారుచేసి విరూపాక్ష గుహలో ఉన్న భగవాన్‌కు నివేదించడం అలవాటుగా పెట్టుకుంది. రాజాఅయ్యర్ తిరువణ్ణామలైలో ఉన్నపుడు,"నేను ఈ పిండివంటలను భగవాన్ వద్దకు తీసుకుని వెళ్తాను," అనేవారు. అందుకని ఆమె ఆయన ద్వారా పిండివంటలు పంపించేవారు. మొదటిసారి ఈ స్వీట్లు తీసుకుని భగవాన్ వద్దకు వెళ్ళినపుడు, ఆయన భగవాన్ బోధలను అర్థం చేసుకోలేకపోయారు. కాని అక్కడి వాతావరణాన్ని ఇష్టపడేవారు. సాయంకాల సమయంలో విరూపాక్ష గుహలో స్నేహపూరితమైన వాతావరణము, సువాసనతో కూడిన అరుణగిరి గాలి, భగవాన్‌నుండి ప్రసారమయ్యే నిశ్చలత వర్ణింపనలవికానివి. నేను ఆ ప్రకృతి సౌందర్యంలో మునిగిపోయి ఆనందించేవాడిని. అంతేగాక, భగవాన్‌కు ఏది అర్పించబడినా, అది అందరికీ సమానంగా పంచబడేది. రాజాఅయ్యర్ దేశదిమ్మరి కనుక, కొన్ని కొన్ని సార్లు ఆయనకు చాలినంత ఆహారం దొరికేది కాదు. రాజాఅయ్యర్ భోజనప్రియుడని తెలుసును కనుక, భగవాన్ కొన్ని ఆహారపదార్థాలు, రాజాఅయ్యర్ కొరకు దాచి ఉంచేవారు. ఆయన ఎప్పుడు విరూపాక్ష, గుహకుగానీ, స్కందాశ్రమానికి గానీ వెళ్ళినా, ఆయనకు తినటానికి ఏదో ఒకటి లభించేది. రాజాఅయ్యర్ అన్నారు, "నేను భగవాన్ వద్దకు, కేవలం స్వీట్స్ తినడానికే వెళ్తుండేవాణ్ణి అని చెప్పుకోవడానికి నేనేమీ సిగ్గుపడను"

ఒకరోజు రాజాఅయ్యర్ స్కందాశ్రమానికి వెళ్తుండగా, ఎచ్చెమ్మాళ్ భగవాన్‌కు భిక్ష తీసుకుని వెళ్తూ కన్పించారు. అప్పుడు ఒక భక్తుల బృందం చాలా నిరాశనిండిన ముఖాలతో స్కందాశ్రమాన్నుండి దిగివస్తూ కనిపించారు. వారి ముఖాలు చూచి, ఎచ్చెమ్మాళ్ ఏమి జరిగింది అని అడిగారు. ఆ బృందం వారు అన్నారు, "మేము రమణమహర్షిని చూడడానికి వెళ్ళాము. మాకాయన కనపడలేదు," ఎచ్చెమ్మాళ్ ఆశ్చర్యపోయరు. "ఏమిటీ! మీరు ఆయనను చూడలేకపోయారా?" అన్నారు. "మేము చూడలేకపోయామని వారు సమాధానమిచ్చారు." "అక్కడెవరూ లేరా?" అని ఆమె వారినడిగారు. ఆ బృందంవారు చెప్పారు, "అక్కడ ఒకే ఒక వ్యక్తి ఉన్నారు. ఆయన రాళ్ళు పేర్చి గోడను సరిచేస్తున్నారు. ఆయన తప్ప ఇంకెవరూ లేరు. ఎచ్చెమ్మాళ్, "మీరు భగవాన్ ఎక్కడున్నారు? అని ఆయనను అడిగారా?" అని వారితో అన్నారు. వాళ్ళు జవాబిచ్చారు, "అవును. అడిగితే, భగవాన్ కొండపైకి వెళ్ళారని చెప్పారు." తికమకపడిన, ఎచ్చెమ్మాళ్, రాజాఅయ్యర్ వారినిలా అడిగారు, "ఆ వ్యక్తి ఎలా ఉన్నారు?" "ఆయన ఒక గోచీ పెట్టుకుని ఉన్నారు. తలకొక గుడ్డ చుట్టుకొని ఉన్నారు," అన్నారు ఆ బృందం. "ఆయన ఏ రంగులో ఉన్నారు," అన్నారు రాజాఅయ్యర్, ఎచ్చెమ్మాళ్. "ఆయన చాలా తెల్లగా ఉన్నారు," అన్నారా బృందం. ఎచ్చెమ్మాళ్‌కు, రాజాఅయ్యర్‌కు అర్థమయింది ఆ వ్యక్తి తప్పక భగవానే అయి ఉంటారని, ఎచ్చెమ్మాళ్, రాజాఅయ్యర్ వారితో "మాతో రండి. మేము మిమ్ములను భగవాన్ వద్దకు తీసుకుని వెళ్తాము" అన్నారు. వారందరూ, స్కందాశ్రమం చేరుకునేటప్పటికి, భగవాన్ తను చేసే పని ముగించి తన యథాస్థానానికి వచ్చి కూర్చున్నారు. ఆయన ఎంత ప్రశాంతంగా కూర్చున్నారంటే, వచ్చిన బృందం, ఇందాక మేము చూచింది ఈయనను కాదు, వేరే అతణ్ణి," అన్నారు. దీనికి భగవాన్ నవ్వారు. రాజాఅయ్యర్ ఎదురుగానే ఎచ్చెమ్మాళ్, భగవాన్‌ను ఇలా నిలదీశారు, "భగవాన్, మీరు వాళ్ళతో భగవాన్ కొండపైకి వెళ్ళారని ఎందుకు చెప్పారు? వారు పాపం ఎంతో నిరాశకు గురి అయ్యారు". "నేనే భగవాన్‌ను అని, నా నుదుటన ఒక అట్ట తగిలించుకోమంటావా, ఏమిటి?" అని భగవాన్ ఎచ్చెమ్మాళ్‌ను అడిగారు. ఇక్కడ గ్రహించవలసిన విషయం ఏమిటంటే, ఆయన, "నేనే భగవాన్‌ను, అని అట్టను నుదుటన తగిలించుకోమంటావా?" అని అడిగారంటే, తనే భగవాన్‌ను అని సూచించడమే. ఈ సంఘటన గూర్చి రాజాఅయ్యర్ నాకు చెప్పినపుడు, అది హాస్యంగాను ఉంది, ప్రబోధాత్మకంగానూ ఉంది.

1927వ సం॥లోరాజాఅయ్యర్ తిరుగుతూ, తిరుగుతూ రెడ్డిపాలయమ్ అనే చిన్న పట్టణం చేరుకున్నారు. అప్పటికే భగవాన్ కొండదిగి, రమణాశ్రమానికి వచ్చేశారు. అప్పటిలో విద్యుచ్ఛక్తి (కరెంటు) లేదు కాబట్టి, భగవాన్ భక్తులొకరు ఒక పంకాను (ఫాన్‌వంటిది) ఏర్పాటు చేశారు. ఒక తేలికైన బోర్డుకు, పొడవైన గుడ్డ అతికించబడి ఉంటుంది. ఈ బోర్డు (సీలింగ్) ఇంటి కప్పుకు తగిలించబడి ఉంటుంది. ఈ బోర్డుకు ఒక పెద్ద తాడు తగిలించబడి ఉంటుంది. ఫాన్‌కు తగిలించిన తాడు లాగగానే ఆ వస్త్రము చల్లటిగాలి తగిలేటట్లు చేస్తుంది. ఒకరాత్రి రాజాఅయ్యర్ కలలో భగవాన్ కనిపించారు. భగవాన్ హాలులో పంకా కింద కూర్చుని ఉన్నారు. రాజాఅయ్యర్ హాలులోనికి ప్రవేశించగానే, "రా, వచ్చి పంకాను లాగు" అన్నారు. కాబట్టి ఆయన కలలో, ఆయన పంకా లాగారు. భగవాన్ చల్లగాలిని ఆనందించారు. కొన్ని రోజుల తర్వాత రాజాఅయ్యర్, తిరువణ్ణామలై వెళ్ళారు. ఆయన భగవాన్ పాతహాలులో ప్రవేశించగానే, అచ్చు తన కలలో కన్పించిన లాంటి పంకా కనిపించింది. ఆయన భగవాన్‌కు ప్రణమిల్లారు. భగవాన్, "రా, వెళ్ళి పంకాలాగు" అన్నారు. రాజాఅయ్యర్ భగవాన్ చెప్పిన పనిని చేశారు. ఐదు నిముషాల తర్వాత, భగవాన్ ఆయనను పిలిచి, "రాజా! అది చాలు" అన్నారు. రాజా గొప్ప బాధ్యతను స్వీకరించినట్లుగా భావించి, భగవాన్ తనను సేవచెయ్యవలసినదిగా చెబుతున్నారని అర్థం చేసుకున్నారు. భగవాన్ ఎప్పుడూ ఎవరినీ, ఏ పనీ చెయ్యి అని చెప్పరు కాబట్టి, భగవాన్ తనను సేవచెయ్యమని సూచిస్తున్నారని భావించి, శాశ్వతంగా రమణాశ్రమానికి వచ్చేశారు.

రాజాఅయ్యర్ ఇప్పుడున్న రమణాశ్రమంలో ఉండడం ప్రారంభించగానే, ఆయనను భజనలు చేయడానికి ఎవరో ఒకరు తరచుగా పిలుస్తుండేవారు. వివిధ దేవతలకు వివిధ రకాల భజనలుండేవి. ఉదాహరణకు, శ్రీరామ నవమికి, శ్రీకృష్ణాష్టమికి ఆ రాత్రి అంతా భజనలు జరుగుతుండేవి. కొన్నిసార్లు గది మధ్యలో జ్యోతి వెలిగించేవారు. భజనలు జరుగుతుండగా జనులు దీపం చుట్టూ తిరుగుతుండేవారు.

ఒకసారి శ్రీరామనవమికి భజన చెయ్యడానికి రావలసిందిగా రాజాఅయ్యర్‌ను ఆహ్వానించారు. రాజాఅయ్యర్ భగవాన్‌కు ఆ విషయాన్ని తెలిపి, "భగవాన్ వారు నన్ను పిలిచారు, నేనక్కడకు వెళ్ళవలసి ఉంటుంది," అన్నారు. సాధారణంగా అడగగానే, సమ్మతిస్తూ భగవాన్ తల ఊపేవారు. కానీ ఆ రోజు తల ఊపలేదు. సరిగా అపుడే చిన్నస్వామి హాలులోకి వచ్చి ఇలా అన్నారు, "ఎవరో ఆశ్రమానికి డబ్బు పంపించి రమణాశ్రమంలో, వాళ్ళ గ్రామంలో జరిగేటట్లుగా శ్రీరామనవమి ఉత్సవం జరుపవలసిందిగా ప్రత్యేకంగా అభ్యర్థించారు". భగవాన్ అప్పుడు రాజాఅయ్యర్‌తో, "నువ్వు ఇచటనే ఉండి భజనలు నిర్వహించు" అన్నారు. ఆ రోజు రాజాఅయ్యర్ ఆశ్రమంలో భజన చేశారు. రాత్రి ఏడు, ఎనిమిది గంటలపాటు భజనలు జరిగినవి. భజనలు పాడుతున్నపుడు, రాజాఅయ్యర్ తరచుగా, పారవశ్యానికి గురయ్యేవారు. భగవాన్‌కూడా తనదైన విధానంలో భజనలతో ఆనందించారు. పాడడం ద్వారా గానీ, నృత్యం చేయడం ద్వారా గానీ భగవాన్, భజనలో పాల్గొనలేదు. కానీ తమిళంలో "పైత్యం, వాళ్ళందరూ పిచ్చివాళ్ళు" అన్నారు. తర్వాత ఇంకా ఇలా అన్నారు, ప్రతి ఒక్కరూ, వాళ్ళలాగా పిచ్చి వాళ్ళయితే ఎంత బాగుండును." నాకూ రాజాఅయ్యర్ పాడడం, నృత్యం చెయ్యటం చూసే అవకాశం దక్కింది అదృష్టవశాత్తూ అది చాలా అద్భుతంగా ఉంది.

ఒకరోజు చిన్నస్వామి రాజాఅయ్యర్‌తో "నువ్వు ఇక్కడ ఏదో ఒక పనిచేస్తే గానీ, ఆశ్రమంలో ఉండడానికి గానీ, తినడానికి గానీ వీలులేదు," అన్నారు. రాజాఅయ్యర్ వెళ్ళి భగవాన్‌తో చిన్నస్వామి అన్న మాటలు చెప్పారు, "రాజా! నువ్వు ఉదయాన్నే ఇడ్లీలు తయారుచెయ్యవచ్చును గదా!" అన్నారు. రాజాఅయ్యర్, "భగవాన్! నాకు ఇడ్లీలు ఎలా చెయ్యాలో తెలియదు," అన్నారు. భగవాన్, "నేను చూపిస్తానులే," అన్నారు. ఇడ్లీలు తయారుచెయ్యడం, అంత సులభమైన పనేమీ కాదు. ముందురోజూ బియ్యము, పప్పు, నానబెట్టి రోట్లో వేసి రుబ్బాలి. ఆ రోజులలో మరలు లేవు. ఆ రోజు సాయంత్రం భగవాన్, రాజాఅయ్యర్‌ను పిలిచి నేర్పించారు. (నిజానికి ఆయనకు నేర్పడానికిగాను, ఎన్నో రోజులు భగవానే, అయ్యర్‌తో కలిసి పిండిరుబ్బేవారు) మర్నాడు ఉదయం రాజాఅయ్యర్ భయపడుతూ, భగవాన్‌తో అన్నారు, "భగవాన్! నాకు ఇడ్లీలను ఆవిరిపై ఎలా ఉడికించాలో తెలియదు". భగవాన్ అన్నారు, "నేను వచ్చిసాయం చేస్తాను రాజా," అని. భగవాన్ ఆయనకు ఇడ్లీలు ఎలా వండాలో చూపించారు. కానీ మర్నాడు రాజాఅయ్యర్‌కు భయం కలిగేటట్లు ఇడ్లీలన్నీ తునకలయ్యాయి. ఆయన పరుగెత్తుకుంటూ హాలుకు వెళ్ళి "భగవాన్! ఇడ్లీలన్నీ విరిగిపోయినవి. ఇప్పుడేమి చెయ్యాలో నాకు తెలియటల్లేదు. నాకు భయమేస్తుంది"

అన్నారు. "ఇడ్లీలు చేసే ముందు నీకు నేను చెప్పాను గదా, అగ్నికి ముందు అర్పించాలని. నువ్వు, ప్రతిజ్ఞ చేశావా, మొదటి ఇడ్లీలను, అగ్నికి అర్పిస్తానని?". రాజాఅయ్యర్, "భగవాన్, నేనా విషయం మర్చిపోయాను". భగవాన్ అన్నారు, "అయితే, ఇప్పుడు వెళ్ళి ఆ పని చెయ్యి. అగ్నిదేవుడికి చెప్పు. మొదటిసారి ఇడ్లీలను ఆయనకు సమర్పిస్తానని". భగవాన్ చనిపోయిన తర్వాత కూడా మొదటి ఇడ్లీలను అగ్నికి సమర్పించడం, తాను మానలేదని, రాజాఅయ్యర్ నాతో చెప్పారు.

ఇదే రాజాఅయ్యర్, లోగడ కేవలం భోజనం (స్వీట్స్) కోసమే, భగవాన్ వద్దకు విరూపాక్ష గుహకు కానీ, స్కందాశ్రమానికి గానీ వెళ్ళేవారు. ఇప్పటికీ ఆయనకు తిండి అంటే ఇష్టం. అతడు వంటగదిలోకి వెళ్ళి, ఏది కావలిస్తే అది తినేసేవాళ్ళు వండినవైనా, పచ్చివి అయినా, ఒకరోజు, ఒక భక్తుడు భగవాన్‌కు ఈ విధంగా ఫిర్యాదుచేశారు. "భగవాన్! ఏమిటిదంతా?ఆయన హద్దు లేకుండా ఉంటున్నారు. ఏది తినాలనుకుంటే, అది తినేస్తున్నారు". భగవాన్, నవ్వుతూ అన్నారు, "ఏంటి మీరనేది రాజా గురించేనా?". భక్తుడు అన్నారు, "అవును. భగవాన్. అది ఆశ్రమనియమాలకు, విరుద్ధం కదా?". భగవాన్ అన్నారు, "నువ్వు ఖచ్చితంగా చెప్పగలవా? రాజాఅయ్యర్ చేసేది తప్పు అని నువ్వు వివరంగా చెప్పగలవా? "అవును," అన్నారు భక్తుడు. నువ్వుగూడా వంటగదిలోకి వెళ్ళి తరచుగా ఎందుకు తినుటలేదు." భక్తుడు అన్నారు, "లేదు భగవాన్. నేనలా చెయ్యలేను. నేను చెయ్యజాలను". భగవాన్ భక్తుడితో అన్నారు, "అతను, తరచుగా తింటున్నందుకు కాదు మీరు బాధపడేది. మీరు కూడా తరచుగా అలా తినలేక పోతున్నందుకు." ఈ విధంగా భగవాన్, ఆ భక్తునికి, ఇతరులనే వారు లేరు అని బోధించారు. మనలోని లోపాలను బట్టే మనం ఇతరులపై అభిప్రాయాలను ఏర్పరచుకుంటాము. ఆ భక్తుడు, చిన్నస్వామికి భయపడి తాను కోరుకున్నంత తినలేకపోయే వారు. అందుకని ఆయన రాజాఅయ్యర్‌పై ఫిర్యాదు చేశారు. కానీ రాజాఅయ్యర్‌కు చిన్నస్వామి అంటే భయం లేదు. కొన్ని సంవత్సరాల తర్వాత రాజాఅయ్యర్, నాతో చెప్పారు, చిన్నస్వామి ఎన్నిసార్లు, తనను మందలించినా, తాను ఆ పనిని మానలేదని, భగవాన్ అపుడు ఆ భక్తునితో అన్నారు, "నిజానికి ఇతరులెవరూ లేరు. నీకు బయట కన్పించేదంతా, నీలోని వాటియొక్క ప్రతిబింబమే. నీ మనసే వీటినన్నిటిని కల్పిస్తుంది."

1937లో రమణాశ్రమం పోస్టాఫీసు ప్రారంభించారు. రాజాఅయ్యర్‌ను దానికి మొదటి పోస్టుమాస్టర్‌ను చేశారు. కొత్తల్లో, భగవాన్ కూడా అక్కడ ఉండేవారు. రాజాఅయ్యర్ భగవాన్‌పట్ల ఎంత భక్తి కలిగి ఉండేవారంతే, భగవాన్‌కు సార్కోమా వచ్చినప్పుడు ఆలయంనుండి కుంకుమ తెచ్చి ఇస్తే భగవాన్‌కు వ్యాధి నయమౌతుందనుకున్నారాయన. ఇది కేవలం, ఆయన ఒక్కరి నమ్మకమే కాదు. ఆగ్రామ ప్రజలందరూ కూడా గాఢంగా నమ్మేవారు. అందుకని, రాజాఅయ్యర్ గుడికి వెళ్ళి పూజ చేయించి భగవాన్ పేరుతో, ప్రసాదాన్ని తీసుకుని ఆశ్రమానికి వెళ్ళారు. కాని డాక్టర్లు, ఏ ఒక్కరిని భగవాన్ రూములోనికి రానివ్వవద్దని గట్టిగా ఆంక్షలు పెట్టారు. డాక్టర్లతోను, కొంతమంది ఇతరులతోను భగవాన్ గదిలో ఉన్నారు. రాజాఅయ్యర్ తనలో తాను దుఃఖించారు. ఈ ప్రసాదాన్ని భగవాన్‌కు ఇవ్వలేకపోయాను. ఆయనే గనుక ఈ ప్రసాదం తీసుకుంటే ఆయనకు నయమౌతుంది. కొన్నిరోజుల తర్వాత ఎవరో రాజాఅయ్యర్‌ను పిలిచి భగవాన్ నిన్ను పిలుస్తున్నారు అన్నారు. ఆ పొట్లాన్ని ఎల్లవేళలా జేబులో పెట్టుకుని తిరుగుతున్న రాజాఅయ్యర్ ఆశ్చర్యపోయారు. ఆయన భగవాన్‌ను చూచుటకు వెళ్ళగానే, "రాజా నువ్వు నాకేమైనా ఇవ్వాలనుకుంటున్నావా?" అన్నారు. రాజాఅయ్యర్‌కు ప్రసాదం మాట గుర్తుకువచ్చింది. "భగవాన్ ఈ ప్రసాదాన్ని పచ్చయ్యమ్మన్ కోవెల నుండి తెచ్చాను. నేను మీకు నయమవాలని పూజ చేయించాను. దయచేసి ఈ ప్రసాదం తీసుకోండి. భగవాన్ కొంత ప్రసాదాన్ని నుదుటకు రాసుకుని, మిగిలినదానిని అందరికి ఇవ్వమని చెప్పారు. ఈ పచ్చయ్యమ్మన్ చాలా శక్తివంతమైన దేవత. ఈ ప్రసాదానికి నిజమైన శక్తి ఉంటుంది. ప్రతిభక్తుడూ భగవాన్‌కు తన యందు ప్రేమ ఉన్నదని అనుకుంటారని, భగవాన్‌కు తెలుసు. ఆ ప్రేమను ఎలా వ్యక్తం చెయ్యాలో కూడా భగవాన్‌కు తెలుసు.

రాజాఅయ్యర్, ఆశ్రమానికి వచ్చిన పాశ్చాత్యులను జాగ్రత్తగా చూచుకునే వారు. అతనా పనిని నిర్వహించే విధానాన్ని భగవాన్ మెచ్చుకునేవారు. నేను 1960లో ఆశ్రమానికి వచ్చినప్పటినుండి, 1972 వరకు పాశ్చాత్యుల ఎదుట ఎలా నడచుకోవాలో, వారిని జాగ్రత్తగా ఎలా చూసుకోవాలో నాకు చెబుతుండేవారు. హ్యూగోమెయిర్, నేనూ, రాజాఅయ్యర్ మంచి భోజనప్రియుడుకదా చివరిరోజుల్లో చాలా బాధపడతారను కున్నాము. కానీ ఒక అసాధారణ విషయం జరిగింది. తను చనిపోవడానికి వారం రోజుల ముందు ఆయన భోజనం మానేసి, చనిపోవడానికి రెండు రోజుల ముందు కేవలం

మంచినీరు మాత్రమే త్రాగుతానన్నారు. ఆయనకు ఏ జబ్బూ లేదు. ఏ జబ్బూ లేకుండా కేవలం వృద్ధాప్యంతో చనిపోయారు. నా స్వానుభవంలో కేవలం వృద్ధాప్యంలో మరణించిన వారిని ఇద్దరినే చూశాను. రెండవ వారు శామాతాత.

భగవాన్‌కు విరూపాక్ష గుహకూ, స్కందాశ్రమానికీ అప్పుడప్పుడు భోజనం తెచ్చిన అదృష్టవంతుడు శామాతాత. తర్వాత ఆయన తన ఉద్యోగాన్ని వదిలేసి, భగవాన్ తల్లికి వంటలో సాయం చేసేవారు. ఇప్పటి రమణాశ్రమంలో, ఆయన శక్తి ఉన్నంతవరకు ఉదయం పూట ఫలహారం (టిఫిన్) తయారుచేసేవారు. బాగా వృద్ధాప్యం వల్ల, ఇక పనిచేయలేని స్థితిలో ఆయనను ఆశ్రమం వదలి వెళ్ళమన్నప్పుడు, ఆయన హాలులోకి వెళ్ళి విచారంగా కూర్చున్నారు. ఒక పరిచారకుడు, శామాతాత పరిస్థితిని భగవాన్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఆ సమయంలో హాలులో ఒక ప్రభుత్వాధికారి ఉన్నారు. భగవాన్ ఆయన వైపు తిరిగి, "పాతిక సంవత్సరాల పాటు పనిచేసిన వారికి, పెన్షన్ ఇవ్వటం అనే పద్ధతి లేదా?" అని అడిగారు. ఆ సూచనను అర్థం చేసుకుని, ఆ పరిచారకుడు, ఆఫీసుకు పరుగెత్తుకుని వెళ్ళి, చిన్నస్వామికి ఆ విషయం చెప్పారు. చిన్నస్వామి, హాలులోకి వచ్చి, శామాతాతతో, "మీరు ఇటుపై ఏ పనీ చేయనక్కరలేదు. మీరు ఆశ్రమం విడచి వెళ్ళనవసరం లేదు. బదులుగా మీరు ప్రశాంతంగా, సంతోషంగా భగవాన్ సన్నిధిలో కాలం గడపండి," అని అభ్యర్థించారు. 1960వ దశకంలో శామాతాత మరణశయ్యపై ఉన్నపుడు, నేను ఎంతో భక్తితో సేవ చేశాను. ఆయనకు ఏ జబ్బూ లేదు. ఆయన కేవలం వృద్ధాప్యంతో కరగిపోతున్నారు. చివరిరోజున నన్ను శరీరాన్ని దహనం చెయ్యమని కోరారు. ఆయన నన్ను పిలచి ఆశ్రమంలో చనిపోయిన సాధువులకు దహనసంస్కారాలు ఎలా చెయ్యాలో చెప్పారు. భగవాన్ చేత పెన్షన్ (ఫించన్) ఇప్పించుకున్న ఈ మహనీయునితో, ఈ విధమైన విషయాలలో నా సేవ ప్రారంభమైంది. భగవాన్ ఇచ్చిన పెన్షన్ వలన ఈయనకు భగవాన్ సన్నిధిలో జీవించడానికీ, మరణించడానికీ అవకాశం దొరికింది.

రాజాఅయ్యర్ మృతిచెందే రోజున, నేను వెళ్ళి ఆయన పాదాలను స్పృశించాను. నేను ఆయనను, నన్ను ఆశీర్వదించమని కోరాను. లేదు అది భగవాన్ చెయ్యవలసిన పని. భగవాన్ ఇక్కడే ఉన్నారు. ఆయన ఆశీస్సులు తీసుకో. కానీ నేను పట్టుబట్టాను. "నేను భగవాన్ ఆశీస్సులు తీసుకుంటాను. కానీ మీరు కూడా నన్ను ఆశీర్వదించాల్సిందే" అన్నాను. అప్పుడు నేను రాజాఅయ్యర్‌తో అన్నాను. రాజాఅయ్యర్! మీకు నేను బాగా తెలుసు. నేను ఎప్పుడూ, నాకు చేతనైనంత మంచిగా చేస్తాను ఏ పనినైనా. మీకు ఏవైనా కోరికలుంటే చెప్పండి దయచేసి, నేను వాటిని తీరుస్తాను. నేను అలా చేస్తానని కూడా, మీకు తెలుసును. రాజాఅయ్యర్ జవాబిచ్చారు. గణేశన్! నాకు ఏ కోరికలూ లేవు. నాకు అసలు ఆలోచనలే లేవు. నాకు ఏ ఆలోచనా రావటము లేదు. చూడు, భగవాన్ ఇక్కడ ఉన్నారు. భగవాన్ ఇక్కడ ఉన్నారు. ఆయన చివరిమాటలు, "భగవాన్ నన్ను పిలుస్తున్నారు." నేను, నా స్నేహితులతో ఎప్పుడూ చెబుతూ ఉండేవాణ్ణి. భగవాన్ రాజాఅయ్యర్‌ను పోస్టు ద్వారా తీసుకుని వెళ్ళలేదు. టెలిగ్రాం ద్వారా తీసుకెళ్ళారు.



జి. రామస్వామి పిళ్ళై



భగవాన్ యొక్క కొంతమంది పాతభక్తులు, బయట ప్రపంచానికి పెద్దగా తెలియరు. వారు ముఖ్యమైన వ్యక్తులవలెగానీ, ప్రత్యేకమైన వ్యక్తుల వలెగానీ ఏమాత్రం కనపడరు. ఎందుకంటే, వారు ఆ విధంగా తెఱవెనుకనే ఉండిపోవాలని పలువురి దృష్టిలో పడకూడదని అనుకోవడంవల్లనే. కానీ, భగవాన్‌తో వారికిగల అనుబంధంలోనూ, ఆయన బోధలను అర్థం చేసికొనడంలోనూ, ఆచరణలో పెట్టటంలోనూ వారు చాలా ప్రత్యేకమైన వారు. అందులో కొంతమంది పెద్దగా ఎవరికీ తెలియదు. కొంతమందిని, ఇతరులు ఇష్టపడేవారుకాదు. కానీ ప్రముఖులైన శిష్యులకు, భగవాన్‌కూ, ఎలాంటి సంబంధం ఉండేదో, వారికీ భగవాన్‌కూ కూడా, అంతే ఉన్నతమైన (అనుబంధం) సంబంధం ఉండేది. రామస్వామిపిళ్ళై మాంసాహారుల కుటుంబమునకు చెందిన వారైనప్పటికీ, చిన్నతనం నుండీ ఆయన మాంసం తినలేకపోయేవారు. అందుకని శాఖాహారి అయ్యారు. అది చూచి, మిగిలిన కుటుంబసభ్యులు కూడా శాఖాహారులుగా మారారు. ఆయన బైబిల్‌ను క్షుణ్ణంగా చదివారు. బుద్ధుని బోధలను కూడా చదివారు. ఆయన ఒకసారి నాతో చెప్పారు. నేను చాలాసార్లు మసీదుకు కూడా వెళ్ళాను. అచ్చగా ముస్లింలు ఎలా ప్రార్థన చేస్తారో అలాగే నేను ప్రార్థన చేశాను. వాళ్ళు "అల్లా! అన్నపుడల్లా, నేను భగవదనుభూతిని చెందేవాణ్ణి. ఆయన ఎప్పుడూ వారిని అన్యులుగా గానీ, భేదంగాగానీ చూడలేదు. ఆయన పూర్వచరిత్ర అటువంటిది.

రామస్వామిపిళ్ళై తిరువణ్ణామలైకు 90మైళ్ళ దూరంలో ఉన్న చిదంబరంలో చదువుకున్నారు. ఒకరోజు వాళ్ళ క్లాసులో ఉపాధ్యాయుడు రమణమహర్షి ఫోటోను చూపించి, ఇది అరుణాచలంలో ఉన్న ఒక గొప్ప మహాత్ముని ఫోటో అని చెప్పారు. క్లాసులో ఉన్న నలుబది మంది విద్యార్థులలోను, రామస్వామిపిళ్ళై ఒక్కరే, ఆ ఫోటో చూచి ఆకర్షితులై, క్లాసు అయిపోయిన తర్వాత, ఉపాధ్యాయుల వద్దకు వెళ్ళి, "సార్, నాకా మహాత్ముని ఫోటో ఇస్తారా?" అని అడిగారు. ఆ ఉపాధ్యాయుడు ఎంతో సంతోషంగా ఆ ఫోటోను ఆయనకిచ్చారు. ఆ సంఘటనను గుర్తుచేసుకుని రామస్వామిపిళ్ళై "నేను నా భగవాన్ వద్దకు వెళ్ళకముందే, భగవాన్ నా రూమ్‌కు వచ్చేశారు," అన్నారు నాతో. ఇంతకుముందు ఇదే విధమైన అనుభవం కల్గినవారెందరో, "నేను గురువుగారి వద్దకు వెళ్ళక ముందే గురువుగారు నా వద్దకు వచ్చారు," అని నాతో చెప్పారు. ఈ ఫోటో లభించిన తర్వాత, భగవాన్‌ను కలుసుకోవాలనే తీవ్రమైన కాంక్ష ఆయనలో మొదలైంది. త్వరలోనే ఆయన తిరువణ్ణామలై జేరుకొని, విరూపాక్షగుహ ముందున్న రాతిపై కూర్చుని ఉన్న భగవాన్‌ను కలిశారు. భగవాన్ తొలి దర్శనమే నన్నిలా ఆలోచింపచేసింది, అని రామస్వామిపిళ్ళై నాతో అన్నారు, "ఇదిగో ఇక్కడ, ఈ విశ్వానికే ఏకైక మహారాజు, చక్రవర్తి కూర్చుని ఉన్నారు". ఈ భావన మొదటిసారి భగవాన్‌ను చూసినపుడు మాత్రమే కాదు. ప్రతిసారి భగవాన్‌ని చూచినప్పుడు, అది రోజుకు ఎన్నిసార్లైనా సరే, ఆయన జీవించి ఉన్నంతకాలమూ తనకదే విధంగా అనిపిస్తూ ఉండేది అని ఆయన చెప్పారు.

అప్పటికే భగవాన్ 'అక్షరమణమాలై' అనే నూట ఎనిమిది పద్యాలున్న గీతాన్ని వ్రాశారు. ఆ పద్యాలన్నిటినీ కంఠతా నేర్చుకోవడానికి బాలుడైన రామస్వామిపిళ్ళైకు గంటపైన కొద్దిసమయం పట్టింది. అప్పటినుండీ, కేవలము పాఠశాల బాలుడైనప్పటికీ, ఆయన ఆ పద్యాలను నిరంతరం చదువుతూనే ఉండేవారు. రామస్వామి, కాలేజిలో చదివేటప్పుడు, రెండవసారి భగవాన్ వద్దకు వెళ్ళారు. అప్పటికి భగవాన్ స్కందాశ్రమంలో ఉంటున్నారు. ఆరోజు, తన స్నేహితునితో కలసి భగవాన్ దగ్గరకు వెళ్ళినపుడు, ఆయన గిరిప్రదక్షిణ చేస్తున్నారు. ఆయన లోపలి మార్గమైన అడవిలోనుండి వెళ్ళే మార్గంలో వెళ్తున్నారు. తను, తన స్నేహితుడు కలసి భగవాన్ వెంట దట్టమైన అడవులగుండా వెళ్తున్నపుడు, భగవాన్ తన సైన్యము వెంటరాగా, వెళ్తున్న రాజు వలె ఆయనకు అన్పించారు.

ఆ గిరిప్రదక్షిణ ఆయనపై ఎంత ప్రభావం చూపిందంటే, ఆ మర్నాడే మళ్ళీ గిరిప్రదక్షిణ చెయ్యాలనిపించింది. కానీ ఈసారి ఒక్కడే బయలుదేరాడు. ఆ అరణ్యం మధ్య దారితప్పిపోయాడు. ఏమి చెయ్యాలో తెలియలేదు. అతను చుట్టూ చూసేటప్పటికి,

ఆశ్రమానికి చెందిన కమల అనే కుక్క ఆయన వెనుక నిల్చుని ఉంది. కమల, ఆయన దారి తప్పారని అర్థం చేసుకొని, తానే ఆయనకు ముందుగా నడవసాగింది. ఆయన ఎక్కడైనా ఆగి విశ్రాంతి తీసుకుంటే తను కూడా పడుకునేది. ఆయన లేచి నిలబడగానే, తను నడక ప్రారంభించేది. అతనిని, ఒక్క నిముషం కూడా వదలిపెట్టలేదు ఆమె. ఈ విధంగా ఆయన టౌన్ జేరుకునే వరకు వెంట ఉండి తర్వాత కన్పించకుండా పోయింది. ఆయన స్కందాశ్రమానికి వచ్చేసరికి కమల అక్కడే ఉన్నది. ఆ కుక్క తనతో ఉన్నంతసేపూ ఆయనకు, అది ఒక కుక్క వలే అన్పించలేదు. భగవానే ఆ రూపంలో వచ్చినట్లు అన్పించింది. పిళ్ళై స్కందాశ్రమానికి వచ్చి భగవాన్‌ను చూసేటప్పటికి, భగవాన్ ఆయనవైపు చూసి చక్కటి చిరునవ్వు నవ్వారు. "ఆక్షణంలోనే భగవాన్ జీవితంలోని తెలియని దారుల్లో, నాకు మార్గదర్శకులై ఉంటారని నాకు ప్రబలమైన నమ్మకం కుదిరింది," అన్నారు పిళ్ళై. అదే భగవాన్ సన్నిధిలో ఆయన తొలి నిజమైన అనుభవం.

ఆయన భగవాన్‌ను తరచుగా దర్శించుకోవడం మొదలుపెట్టారు. అలా ఒకసారి వెళ్ళినపుడు ఆయన భగవాన్ చేసిన అద్భుతాల్ని చూడాలని అనుకున్నారు. ఒకరోజు సాయంత్రం ఆయన టౌన్‌కు వెళ్ళినపుడు ఎవరో ఆయనకు ఒక కొబ్బరికాయను కొన్ని నూకలనిచ్చారు. ఆయన వాటిని భగవాన్ వద్దకు తీసుకుని వచ్చారు. భగవాన్ అన్నారు, "మనం దీనితో చక్కటి పాయసాన్ని తయారుచేయవచ్చును. లోపల పంచదార కానీ ,పటిక బెల్లం కానీ ఉన్నవేమో కనుక్కోండి. ఆయనకు ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ ఏమి అడగని భగవాన్ పటికబెల్లం కోసం అడిగారని. భగవాన్ కాలంలో స్కందాశ్రమంలో కొద్దిగా మట్టిపాత్రలు మాత్రమే ఉండేవి సరుకులు నిల్వ చేసుకోవడానికి. అన్ని కుండలూ ఖాళీగా ఉండేటప్పటికి, రామస్వామిపిళ్ళై ఏడవడం ప్రారంభించారు. భగవాన్‌కు పటికబెల్లం ఇవ్వలేకపోయానని. టౌన్‌కు పరుగెత్తుకుంటూ వెళ్ళి పటికబెల్లం తెద్దామనిపించింది. కానీ, చీకటిగా ఉంది. కుండపోతగా వర్షం పడుతుంది. ఆ రాళ్ళు అడుగువేస్తే జారేట్లుగా ఉంటాయి. భగవాన్‌కు పటికబెల్లం లేదని చెప్పడం ఇష్టంలేక, వాకిలి వద్ద నిలబడి, వర్షం తగ్గడం కోసం ఎదురుచూస్తున్నారాయన. వర్షం తగ్గగానే టౌన్‌కు పరుగెత్తుకుని వెళ్ళి, కొంత పటికబెల్లం కొనుక్కొద్దామని. ఉన్నట్లుండి తలుపు తట్టిన శబ్దమైంది. ఒక యువకుడు పూర్తిగా నీటిలో తడిచిపోయి ఉన్నాడు. ఆయన లోనికి వచ్చి ఒక చేతిసంచీనుండి, కొంత పటికబెల్లాన్ని అరటిపళ్ళ అత్తెమును బయటకు తీశారు. రామస్వామిపిళ్ళై ఇలా గుర్తు చేసుకున్నారు ఆ సంఘటనను. "నాకు అప్పటికే తెలుసు ఏదో అసాధారణమైనది జరుగబోతుందని. నేను ఉత్సాహంతో ధైర్యంగా భగవాన్ వద్దకు వెళ్ళాను." భగవాన్ నావైపు చూస్తూ అన్నారు, "చూడు పటికబెల్లం వచ్చేసింది. మనం పాయసం తయారుచేద్దాం. దానితోపాటు తినడానికి ఇప్పుడు అరటిపళ్ళు కూడా ఉన్నవి. రా! మనం విందు చేసుకుందాము. భగవాన్ పరిపూర్ణులైన జ్ఞాని. ఆయన ఎల్లప్పుడు స్వచ్ఛమైన ఎరుక (చైతన్యం)లో ఉండేవారు. అట్టి ఆయన వద్ద అద్భుతాల కోసం వెంపర్లాడ వలసిన పని నాకు లేదు. ఆయన సన్నిధిలో అద్భుతాలు వాటికవే జరిగిపోతుండేవి. భగవాన్ సాన్నిధ్యం ఆకర్షణశక్తి కలది. ఇనుపరజను అయస్కాంతం చేత ఆకర్షింపబడినట్లు, ఆయన సన్నిధానంలో, ఆయనకు తెలియకుండానే అద్భుతాలు జరిగిపోతుండేవి. పిళ్ళై, భగవాన్‌ను అడిగారు, "నాకు ఒక అద్భుతం చూడాలనిపించింది. వెంటనే ఈ సంఘటన జరిగింది. ఎలా జరిగిందిది?" అని. భగవాన్ జవాబిచ్చారు, "సన్నిధి విశేషం వల్ల, ఎరుక యొక్క శక్తివల్ల జరిగింది." ఈ సన్నిధి విశేషం అనబడేది, ఏ ఆలోచన, లేదా కోరిక యొక్క పాత్ర లేకుండానే జరిగింది. తర్వాత భగవాన్ అన్నారు, "గత సంవత్సరంగా, రోజులో రెండవసారి భోంచెయ్యడం, ఇవ్వాళే జరిగింది." ఈ సంఘటనను గూర్చి వివరిస్తూ, రామస్వామిపిళ్ళై కన్నీటితో ఇలా ముగించారు. "నేనారోజును ఎప్పటికీ మర్చిపోలేను. అది నా మనస్సులో చెరగని ముద్ర వేసేటట్లు చేశారు భగవాన్."

భగవాన్ తల్లి చనిపోయినపుడు, ఆమె శరీరాన్ని కొండపైనుండి క్రిందకు తీసుకుని రావటానికే కాకుండా, సమాధి చెయ్యటంలో కూడా పిళ్ళై సాయం చేశారు. ఆయన కష్టించి పనిచేసేవారు. భగవాన్ స్కందాశ్రమంలో ఉన్నప్పటి రోజుల్నుండే, ఆయనతో ఉండిపోవటం కోసమని తన జీవితంలోని సర్వస్వాన్నీ త్యజించారు పిళ్ళై. ఆయన ఎంతో కష్టపడి ఇవాళ మనకు రమణాశ్రమంలో కనపడే కొబ్బరిచెట్లనన్నిటినీ నాటారు. భగవాన్ అప్పటికే ఆయనకు "నేనెవరను?" అనే బోధను చేసినప్పటికీ, తోటపని చేసేటప్పుడూ, ఆశ్రమ పరిసరాలు శుభ్ర పరిచేటప్పుడు, 'అరుణాచలశివ' అనే ఉచ్ఛరిస్తుండే వారు. ఆయన, తోటపనిలోనూ, ఊడ్చుతానో, గుంటలు త్రవ్వుతూనో, రోజుకి 18 గంటలు పనిచేస్తుండేవారు. అప్పట్లో ఆశ్రమంలో ఒకే ఒక సైకిల్

ఉండేది. ఆఫీసులో పని చేసే వారెవరికైనా టౌన్‌నుండి ఏమైనా కావలసి వస్తే, రామస్వామి పిళ్ళై ఒక్కరే ఆ పని గురించి టౌన్‌కు వెళ్ళడానికి సిద్ధంగా ఉండేవారు. అందుకని రామస్వామిపిళ్ళైగా కాకుండా సైకిల్‌స్వామిగానే అందరికీ ఆయన పరిచితులు.

ఒకరోజు నేను ఆయనను అడిగాను, "మీరెప్పుడూ భగవాన్‌కు దూరంగా ఉండేవారు. మీరెప్పుడూ తోటలో పనిచేస్తుండేవారు. మీకెలా అన్పిస్తుండేది?" అని ఆయన ఇలా జవాబిచ్చారు, "గణేశన్, కొంతదూరం నుండి నేను భగవాన్ ఆకారాన్ని చూడగలిగేవాణ్ణి. నేను ఎల్లవేళలా ఆయన పేరు స్మరిస్తూ ఉండేవాణ్ణి. భగవాన్ ఎప్పుడూ నా హృదయంలో ఉండేవారు. భగవాన్ పరిపూర్ణతకు (లోటుపాట్లు లేకుండటకు) మారుపేరు. మేము ఆయనను చూసినప్పుడు, ఆయన పేరు స్మరించినపుడు మాకు కూడా పరిపూర్ణత అబ్బేది. ఆయన ఎప్పుడూ ఆనందంలో మునిగిపోయి ఉండేవారు. మేముకూడా ఆనందంలో మునిగి ఉండేవారము. ఆయన తను చెప్పిన దానిని బలపరచడానికి ఇతిహాసంనుండి సూక్తులు చెప్పుకొచ్చారు. "గణేశన్, దీనిని మన పవిత్ర గ్రంథాలలో గురుతురీయ అంటారు. 'తురీయము' అనేది సమాధిస్థితి. మూడుస్థితులైన జాగ్రత్, స్వప్న, సుషుప్త స్థితులను దాటిన తర్వాత నాల్గవ స్థితి తురీయము. నువ్వు ఎప్పుడైతే కష్టించి పనిచేస్తూ గురువుగారిని చూస్తూనో, గురువుగారి నామాన్ని తలచుకుంటూనో ఉంటావో, అప్పుడాయన నిన్ను ఈ స్థితికి జేరుస్తారు. ఇందులో నీ ఘనత ఏమీ ఉండదు. అది కేవలం నీపై ఆయనకు గల అనుగ్రహం వల్లనే జరుగుతుంది. అందుకనే దానిని 'గురుతురీయ' అంటారు. ఆయన ఆశీస్సుల వల్లనే మనం సమాధిస్థితిలో స్థిరపడగలుగుతాము.

మిగిలినవారు రామస్వామిపిళ్ళైను ఎక్కువగా చూడనప్పటికీ, భగవాన్, ఆయన అంతరంగసందేశాల ద్వారా (టెలిపతి) కలసి పని చేస్తుండేవారు. భగవాన్ ఎప్పుడూ, తన సన్నిధిని పిళ్ళైకు ప్రసాదిస్తుండేవారు. పిళ్ళై పని చేస్తున్నంతసేపూ భగవాన్ నామాన్ని ఉచ్చరిస్తూనే ఉండేవారు. ఒకరోజు ఆయనకు, తన పురోభివృద్ధి గురించి సందేహం వచ్చింది. ఆశ్రమంలోని ఇతర కార్యక్రమాలైన, పూజా, ఉత్సవాలు, మంత్రోచ్చారణ వంటి వాటిలో చురుకుగా పాల్గొనకపోవడం తప్పేమో అనిపించింది. అందుకని ఆయన భగవాన్‌ను అడిగారు. "భగవాన్, నేను చేస్తున్నది సరియైన పనియేనా?" అని. "ఆత్మవిచారణ చేస్తే, అన్నిటినీ చేసినట్లే అవుతుంది," అన్నారు భగవాన్. ఆయన తోటలో పనిచేస్తున్నపుడు గానీ, సైకిల్‌పై వెళ్తున్నపుడు గానీ, (స్పృహలో ఉండి), ఎరుకలో ఉండి, ఆత్మవిచారణ చేస్తుండేవారు. (నేను 1960 తర్వాత ఆయనను ఎప్పుడు ఆశ్రమంలో కలసినా, ఆయన చాలా గట్టిగా నాకు సలహా ఇస్తుండేవారు." ఈ పూజలలోగానీ, ఇతర పనులలో గానీ నిమగ్నమవకు. అవి నిన్ను ఎక్కడికీ తీసుకుని వెళ్ళవు. (దరికి చేర్చవు) కేవలం ఆత్మవిచారణ చెయ్యి.

ఒకరోజు తన తాళపుచెవులకు పోగొట్టుకుని, ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్, నా తాళంచెవులు పోయినవి" అని చెప్పారు. భగవాన్ నవ్వి అన్నారు, "తాళంచెవులు ఎక్కడికీ పోలేదు. అవి ఎక్కడుండేవి అక్కడే ఉన్నయ్యి. వాటిని ఎక్కడ పెట్టావో నువ్వు మర్చిపోయావు." తర్వాత, ఆయన ఎప్పుడూ చేసే విధంగానే, "ఇది ఆత్మలాగానే. అది ఎల్లప్పుడూ ఉండే చోటనే ఉంటుంది. మనం అది మరచిపోయి, దానిని వెతకటానికి ఎన్నో మార్గాలు పట్టుకుంటాం. నేను ఆత్మను కనుగొనలేకపోతున్నాను. ఆత్మ అంటే ఎలా ఉంటుందో నాకు తెలియదు. అది ఎక్కడ ఉంటుందీ తెలియదు. అది ఇక్కడనే ఉన్నప్పటికీ దానికొరకు వెతుకుతూనే ఉంటాము. ఆత్మ ఎక్కడికీ పోలేదు. కానీ మనమే మర్చిపోయాము" అని బోధను దానికి జోడించారు, భగవాన్. ఈ విధంగా ఏదో ఒక వృత్తాంతము గురించి చెబుతూ, రామస్వామిపిళ్ళై, నాకు భగవాన్ బోధలను అందించేవారు.

రమణాశ్రమాన్నీ, స్కందాశ్రమాన్నీ కలుపుతూ, చక్కగా ఎత్తుపల్లాలు లేకుండా చెయ్యబడిన రాతిబాట కన్పిస్తుంది. రమణాశ్రమాన్నీ, స్కందాశ్రమాన్నీ చూచిన వారీ బాటను చూచే ఉంటారు. అది రామస్వామి పిళ్ళై ఒక్కరే వేశారు ఇంకెవరి సాయమూ తీసుకోకుండా. భగవాన్ జీవితచరిత్ర, ఇంగ్లీషు పుస్తకంలో, "నున్నటిరాళ్ళతో కూడిన బాట రమణాశ్రమం నుండి స్కందాశ్రమానికి, ఒక భక్తుని కృషివల్ల, ఒక్క చేతి మీదుగానే వెయ్యబడింది," అని వ్రాశారు. తర్వాత అది ఫ్రెంచిభాషలోనికి అనువదింపబడింది. అందులో 'ఆ బాట ఒక భక్తుని చేత వెయ్యబడింది. ఆయనకు ఒక్క చెయ్యి మాత్రమే

ఉన్నది' అని వ్రాశారు. పిళ్ళై అంటుండేవారు, "చూడు, నాకు రెండు చేతులున్నప్పటికీ, నాకు ఒకే చెయ్యి ఉందనీ, అయినా, ఈ బాటను ఆ ఒంటి చేత్తోనే వేశానని, ఈ ఫ్రెంచి పుస్తకంలో ఉన్నది."

భగవాన్ ఎక్కడెక్కడ తిరుగుతారో ఆ దారులన్నిటిలోనూ, రామస్వామి పిళ్ళై మౌనంగా ఇసుక పరుస్తుండేవారు, ఆ బాట మెత్తగా వెల్వెట్ గుడ్డలాగా ఉండేటట్లు ప్రతిరోజూ మిట్టమధ్యాహ్నం మండుటెండలోనైనా సరే, ఆయన వెళ్ళి భగవాన్ నడిచే బాటలన్నీ సమంగా ఉండేటట్లు సరిచేసి వస్తుండేవారు. ఆయన ఎంతగా పైకి కనపడకుండా ఉండేవారంటే, చాలామంది ఆయనను గుర్తించే వారు కాదు, చాలామందికి ఆయన తెలియనే తెలియదు. ఒకరోజు భగవాన్ రమణాశ్రమంనుండి కొండపైకి వెళ్తుండగా, ఆయన కాలు ఒక రాతికి గీచుకుని పోయింది. అది ఆయన లక్ష్యపెట్టకపోయినా, వెంటనున్న పరిచారకుడు చూచి రామస్వామిపిళ్ళైకు చెప్పారు. అందుకని భగవాన్ నడిచే బాట మెత్తగా ఉండాలని రామస్వామిపిళ్ళై మరింత శ్రద్ధ తీసుకునేవారు.

ఆయన సాధారణంగా భగవాన్ కూర్చున్నచోటికి, హాలులోకి వెళ్ళేవారు కాదు. తెల్లవారుఝామునే మహర్షికి సాగిలపడి, తన పనిలోకి వెళ్ళిపోయేవారు. ఆయన హాస్యంగా మాట్లాడేవారు. ఒకరోజు ఆయన హాలు లోనికి వెళ్ళేసరికి, ఆచారవంతులైన హిందువులు రెండువర్గాలుగా చేరి ఉత్సాహంగా వాదులాడుకొంటున్నారు. ఒక వర్గమువారి కథనం ప్రకారం, వేదములు, చెప్పిన ప్రకారము, పురుష రూపము దాల్చిన శివుడు గొప్పవారు. రెండవ వర్గమువారి కథనం ప్రకారము శివునిభార్య, శక్తి అందరికంటె గొప్పది. (శక్తి అంటే బలమునిచ్చేది. కొన్ని గ్రంథాల ప్రకారం, శివుడు, శక్తినుండే బలాన్ని పొందుతారు). ఆ రెండు వర్గాలూ, భగవాన్ ఎదురుగా వాదించుకుంటూ ఉన్నారు. భగవాన్ పట్టించుకోకుండా కూర్చున్నారు. రామస్వామిపిళ్ళైని చూడగానే భగవాన్‌కు కుతూహలం కల్గింది. ఎందుకంటే, రామస్వామిపిళ్ళై హాస్యధోరణి గలవారు, నిర్మొహమాటస్తులైన భక్తులు.

ఆ వాదన దేనిగురించో తెలుసుకున్న రామస్వామిపిళ్ళై అన్నారు, "ఓ అది చాలా తేలికైన విషయం. స్త్రీరూపాన్ని సమర్థించే వర్గమే బలమైనది. ఎందుకంటే అని ఇంగ్లీషు వాక్యము HE is contained in SHE. So SHE is the most Powerful అన్నారు". (ఇంగ్లీషులో SHE అంటే 'ఆమె' అని అర్థం. HE అంటే 'అతడు' అని అర్థము. కాబట్టి 'ఆమె' అనే ఇంగ్లీషుపదంలో 'అతడు' అనే ఇంగ్లీషుపదం ఇమిడి ఉంది.) "ఇక సమస్య ఏముంది?" అన్నారు. శక్తివర్గము వారంతా చప్పట్లు కొడుతూ, "ఆ, మేమే గెలిచాము," అని కేరింతలు కొట్టారు. కాని రామస్వామిపిళ్ళై ఇంకా ఇలా అన్నారు. "ఆగండి! ఆగండి! ఆగండి!". "He can remain independently as HE. But 'SHE' cannot remain independently. 'HE' has to be there. Otherwise SHE cannot exist. (ఆంగ్లంలో 'HE' అనే మాట స్వతంత్రంగా ఉంటుంది. కానీ 'SHE' వ్రాయాలంటే 'HE' లేకుండా కుదరదు అని భావం) శివుని వర్గం వారు చప్పట్లు కొట్టి, "ఓ, మేమే గెలిచాం!" అన్నారు. రామస్వామిపిళ్ళై చమత్కారం చూసి భగవాన్ పగలబడి నవ్వారు. ఆయన ఎప్పుడు హాలులోనికి వచ్చినా, భగవాన్ చాలా ఆసక్తి కనపరచేవారు. భగవాన్‌కు నటన లేకుండా స్వచ్ఛంగా (నిర్మొహమాటంగా) ఉండడమంటే ఇష్టము. అదే రామస్వామిపిళ్ళై లోని గొప్ప సుగుణము.

అంత హాస్యచతురుడై ఉండికూడా, ఎప్పుడూ ఆయన నా చెవుల్లో రొదపెడుతుండే వారు. "నువ్వు తప్పక ఆత్మవిచారణ చెయ్యాలి. భగవాన్ సమక్షంలో మాకు మనసనేది ఒక నీడలాగానే అన్పించేది. ఆత్మకు అది ఒక నీడ మాత్రమే. ఈ అహంకారం, ఈ మనస్సు ఆత్మయొక్క నీడే. అహంకారము, అనవసరంగా వచ్చి చేరినదే. ఒక విధమైన అజ్ఞానము". మరల ఆయన హాస్యంగా ఇలా అనేవారు, "అది నాశనమైతే పోయేదేమీ లేదు. ఈ కల్పితమైన భ్రమ తొలగించబడాలి. అది స్థిరంగా, ఆత్మవిచారణ జరుపుతూ ఉంటే నిశ్చయంగా తొలగిపోతుంది. అటువంటి ఆత్మ అన్వేషణే సద్గురువు యొక్క కృప. మిగిలిన ప్రయత్నాలన్నీ కాలాన్ని వృథా చేసుకోవటమే."

మనం ఇంతకు ముందు చూసినట్లు, భగవాన్ వద్దకు వెళ్ళిన తొలిరోజు నుండే ఆయన, భగవాన్ వ్రాసిన పద్యాలను, రచనలను కంఠస్థం చేసేవారు. రోజులు గడిచేకొద్దీ భగవాన్ ఇంకా ఎన్నో పద్యాలు వ్రాశారు. ఈ పద్యాలన్నీ ఎక్కువగా, నాలుగు పంక్తులు కలిగి ఉండేవే. సాయంత్రాలు రెండు బృందాలుగా కూర్చుని పారాయణ చేసేవారు. ఒక బృందం

మొదటి రెండు పంక్తులూ పాడితే, రెండవ బృందం, చివరి రెండు పంక్తులూ పాడేవారు. పారాయణను ఒక రాగం లేదా ట్యూను ప్రకారం పాడేవారు. ప్రతి ఒక్కరూ ఆ రాగం ప్రకారమే పాడడం అక్కడి అలవాటు. కానీ రామస్వామిపిళ్ళై చాలా ఉత్సాహవంతుడైన వ్యక్తి. ఆయన ఉన్నట్లుండి, వేరే రాగంలోకి, లేదా ట్యూన్‌లోకి వెళ్ళి, పారాయణను పెద్దగా వేరే ట్యూన్‌తో పాడుతుండే వారు. దీనివల్ల పారాయణ చేసేవారికి ఇబ్బందిగా ఉండేది. వాళ్ళు భగవాన్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసేవారు, "భగవాన్! రామస్వామిపిళ్ళై బృందంలో మిగిలిన వారిని అనుసరించటల్లేదు. ఆయన వ్యతిరేకదిశలో పాడుతున్నారు. దయచేసి ఈ సమస్యని తీర్చండి". భగవాన్ బదులిచ్చారు, "అందులో సమస్య ఏముంది? ఆయనది అంత పెద్ద గొంతు. ఆయనను ఒక వైపు పాడనివ్వండి. మీరందరూ రెండవ వైపున పాడండి." రామస్వామిపిళ్ళై తన స్వంతరాగంలో గొంతెత్తి పెద్దగా పాడుతుండేవారు. మిగిలిన వారందరూ మాత్రం పారాయణ రోజూ జరిపే రాగంలోనే పాడేవారు.

ఆయన చివరి రోజులలో, ఆయన ఆశ్రమభోజనం చెయ్యలేకపోయేవారు. ఎందుకంటే, ఆయన పళ్ళు అన్నీ రాలిపోవడం వలన. ఆయన కేవలం ముంబై హల్వా మాత్రమే తినేవారు. అది గోధుమలు, పంచదారతో చేయబడేది. అది జెల్లీ వలె మెత్తగా ఉండుటచే ఆయన దానిని తేలికగా మింగేసేవారు. అదే ఆయన మొత్తం భోజనం. నేను అది ఆయనకు తెప్పించి పెట్టే వాడిని. ఆయన ఆశ్రమంలోనే ఉంటుండేవారు. నేను ఆయనకు, బాత్‌రూమ్ (స్నానపుగది) కలిగి ఉన్న గదిని కేటాయించాను. ఆయన అవసరాలు చూచుకోవడానికి, ఒక పరిచారకుడిని కూడా ఏర్పాటుచేశాము. ఒకసారి, యోగా గురువుగారైన టి.కె.వి.దేశికాచార్, తన టీచర్స్ బృందంతో కలిసి, చెన్నై నుండి వచ్చారు. ఆయన చాలా పేరు పొందిన యోగాగురువు. ఆయన నాకు యోగాను, ప్రాణాయామమును నేర్పారు. నేను ఆయనను రమణాశ్రమానికి ఆహ్వానించాను. నా స్నేహితురాలు అనూరాధ, నేను, ఆ బృందాన్ని ఆశ్రమమంతా తిప్పి చూపించి స్కందాశ్రమానికి తీసుకుని వెళ్ళాము. వెళ్ళేదారిలో నేను దేశికాచారితో చెప్తున్నాను. మేము నడుస్తున్న దారి, ఒక దిట్టమైన వ్యక్తి వేశారనీ, ఆయనకు ఇప్పుడు వందేళ్ళకు పైనే ఉంటయ్యని. దేశికాచారి గారి తండ్రి కృష్ణమాచారి గారు, 101 సంవత్సరాలు బ్రతికారు. ఆయన గొప్ప యోగి. స్కందాశ్రమం నుండి తిరిగి వచ్చేసిన తర్వాత, దేశికాచారిగారు, ఆ నూరు సంవత్సరాలు దాటిన ఆయనను నేను చూడవచ్చునా అని అడిగారు. నేనాయనను రామస్వామిపిళ్ళై గారి గదికి తీసుకొని వెళ్ళాను. ఎప్పటిలాగానే నన్ను చూడగానే ఆయన ఉత్సాహంతో ఉన్నారు. "రా! ఒంటరిగా వచ్చావెందుకు? మీ తండ్రిగారిని, సోదరులు సుందరంగారిని, మణిగారిని, ఆశ్రమంలోను, రమణనగర్‌లోనూ ఉన్న ప్రతి ఒక్కరినీ తీసికొనిరా. నేను వాళ్ళందరినీ చూడాలనుకుంటున్నాను." నేను ఆ మాటలకు ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఆయన అంత కలుపుగోలు మనిషికారు.

అప్పుడు ఆయన హల్వా తినే వేళ అయింది. నేను నా చెయ్యి జాపినపుడు ఆయన నా చేతిమీద చిన్నగా తట్టి, నువ్వు నాబిడ్డవు. నువ్వు చెయ్యి చాచి నన్ను అడుగుతున్నావు. అలా అంటూనే చిన్న పిల్లవాడికి తినిపించినట్లుగా నాకు తినిపించసాగారు. ఇది 1995లో జరిగింది. పదిహేనేళ్ళకంటే ముందు. నాకప్పటికి 60ఏళ్ళు దగ్గరపడుతున్నవి. నేనేమీ చిన్న బిడ్డను కాను అయినా, నాకాయన తినిపించారు. తర్వాత తన స్వహస్తాలతో హల్వాను పంచిపెట్టారు. ఈ దృశ్యం చూసి దేశికాచారి ఆనందించారు. "ఆయన గొంతు బాగుంటుంది. పారాయణ చేస్తారు." అని మీరు నాతో చెప్పేవారు కదా. మేము ఆయన పాటలను కొన్నిటిని వినవచ్చునా?" అని దేశికాచారి నన్నడిగారు. నేను పిళ్ళై గారితో అన్నాను, "రామస్వామిపిళ్ళై! వారు మీ పాటలను వినాలనుకుంటున్నారు. భగవాన్ పాట ఏదైనా పాడండి." "ఏమిటీ ఏదైనా భగవాన్ పాటపాడాలా?" అన్నారాయన కోపంతో. ఆయనే మళ్ళీ ఇలా అన్నారు. "నాకున్నది ఒకే పాట. అది భగవాన్ అక్షరమణమాలై. ఆయన తన కంచుకంఠంతో పాడసాగారు. పదవ పద్యము దగ్గరకు రాగానే ఆయాసంతో రొప్పటం ప్రారంభించారు.

అప్పుడు నేనాయను ఆప్యాయంగా కౌగిలించుకుని బ్రతిమలాడాను. "రామస్వామిపిళ్ళై దయచేసి ఆపండి. అది చాలు," అన్నాను. "ఓ! నువ్వు నన్ను ఆపమంటావా, సరే నేను ఆపేస్తాను" అన్నారు. మేము ఆయన దగ్గర సెలవు తీసుకునేటప్పటికి మూడున్నర అయింది. మేము అక్కడినుండి వెళ్లగానే, ఆయన అక్షరమణమాలై ఎక్కడ ఆపారో, అక్కడినుండి పాడడం మొదలుపెట్టారట. "ఆయన సాయంత్రం ఐదు గంటల వరకు పాడారు," అని ఆయన పరిచారకుడు చెప్పారు. అయిదు గంటలకు పరిచారకుడితో, నన్ను మంచం మీద లేపి కూర్చోబెట్టు అని అడిగారు. ఆయన పూర్తి స్పృహతో శరీరాన్ని వదిలే

వరకూ పాడుతూనే ఉన్నారు. ఆ సమయంలో నేనచట లేను. కానీ మర్నాడు, ఆశ్రమ ఆవరణలోనే, ఆయన కోరిన విధంగా అక్షరమణమాలను పాడుతూ, ఆయనను సమాధి చేశాము. రమణాశ్రమము, రమణ నగరంలోని వారందరూ అక్కడ ఉన్నారు. నేను ఏర్పాట్లన్నీ చేసి కార్యక్రమం జరిపించాను. రామస్వామిపిళ్ళై అనే దృఢమైన కొండరాయి (గండశిల) అరుణాచలంలో కలసిపోయింది. ఆయన భగవాన్‌ను ప్రేమించారు. భగవాన్ ఆయనను ప్రేమించారు కనుక నాకు కూడా ఆయన ఎడల ప్రేమ. ఆయన ఆశ్రమానికి సేవ చేయుట మాత్రమే కాదు. భగవాన్ యొక్క ప్రతి భక్తుడికీ సేవ చేశారు. స్కందాశ్రమానికి వెళ్ళేదారి, వందలాది సంవత్సరములు నిలచి యుంటుంది. అందులోని ప్రతి రాయి, రామస్వామిపిళ్ళై గురించి మాట్లాడుతుంది. మనుషులమైన మనము ఆయనకు కృతజ్ఞత తెలిపినప్పటికీ, తెలుపక పోయినప్పటికీ, ఆశ్రమంలోని ప్రతి కొబ్బరిచెట్టు ఆయన పట్ల కృతజ్ఞతతోనే ఉంటుంది.

రామస్వామిపిళ్ళై సమాధి పూర్తి అవగానే, ఆశ్రమ ప్రెసిడెంటు నన్ను, నేను ఉంటున్న గది తాళాలను అప్పగించమని కోరారు. మాతాజీ కృష్ణాబాయి నా చెవిలో చిన్నగా అన్నారు, “భగవాన్ నీకు పెన్షన్ ఇస్తున్నారు. తాళంచెవులు అప్పగించి స్వేచ్ఛగా ఉండు. ముప్పదిఏడేళ్ళు సేవచేసిన తర్వాత, ఆ రోజున నేను కర్మయోగాన్నీ, ఆశ్రమాన్నీ వదలి బయటకు నడిచాను. రామస్వామి పిళ్ళైకు నా ప్రణామాలు.



కుంజుస్వామి



ముండక ఉపనిషత్ అంటుంది, "ఆత్మ తను కోరుకున్న వారికి, వెల్లడి అవుతుంది. (సాక్షాత్కరిస్తుంది)". నేను రమణాశ్రమంలోగానీ, బయటగానీ ఏ భక్తుని కలసినా, "మీరీ ఆధ్యాత్మికమార్గంలోకి ఎలా వచ్చారు. ఏది మిమ్ములను ఇటు వైపు తిరిగేలా చేసింది?" అని అడిగేవాడిని. ఈ ప్రశ్న అడగడంలోని ఉద్దేశ్యము. వాళ్ళు దైవానుగ్రహం చేతనే ఇటు మళ్ళింపబడ్డారని, వారిని గుర్తింపచెయ్యడం కోసమే.

అది ఏ పుస్తకం చదవడం వల్లనో, ఏ స్నేహితుడు చెప్పటం వల్లనో జరిగినా కానీ, దాని వెనుక ఉన్న కారణము వారు పిలువబడడమే. అంటే, దైవానుగ్రహము వారిని ఇటువైపునకు పిలుస్తుంది. సాధువులు, మహాత్ములు, భగవాన్ యొక్క తొలినాటి భక్తుల జీవితచరిత్రలను, చదవటంలోని ఉద్దేశ్యము, వారిలో ప్రతి ఒక్కరూ ఏ విధంగా మార్పు చెందారు. ఏ విధంగా ఈ మార్గంలోకి ప్రవేశించారో తెలుసుకోవడం కోసమే.

కుంజుస్వామి కూడా చెప్పుకోదగిన మహాత్ముడు. "కుంజు" అంటే మళయాళంలో 'చంటిపాప' లేదా 'పసిబిడ్డ' అని అర్థము. ఆయన తన తల్లితండ్రులకు అంత అపురూపము కాబట్టి, వారాయనకు 'కుంజు' అని పేరుపెట్టారు. ఆత్మ మనందరినీ ఎంపిక చేసుకున్నట్లే. ఆయననూ వరించింది. మిమ్మల్ని మీరు వదలిపెట్టవద్దు. ఎందుకంటే, అది నిజంకాకపోతే మీరిప్పుడు ఈ పుస్తకాన్ని చదువుతూ ఉండరు. కుంజుస్వామి ఎప్పుడూ సంతోషంగానూ, ఆనందంగానూ, స్నేహంగానూ, ఉత్సాహంగానూ ఉంటారు. అలా కాకుండా వేరే విధంగా ఆయనను ఎవ్వరూ చూసి ఉండరు. పాతభక్తులను గురించి, అందులోనూ, నేను కలుసుకొన లేకపోయిన వారిని గురించి, ఎక్కువ విషయాలు నాకు తెలిపింది కుంజుస్వామిగారే. తరచుగా ఆయన ఆతిథ్యాన్ని (ఆదరాన్ని) పొందే భాగ్యం నాకు దక్కేది. నేను కృతజ్ఞతా పూర్వకంగా ఆయనతో అనేవాణ్ణి. "స్వామీ,నేనెప్పుడు విదేశాలకు ఉపన్యాసాలివ్వడానికి వెళ్ళినా, మీరే నన్ను పోషిస్తున్నారు". ఆయన నవ్వుతూ అనేవారు, "అవును. నేను చెప్పే సమాచారమంతా విషయదానమే. సంస్కృతంలో విషయదానమంటె సమాచారాన్ని ఇవ్వటము, భోజనము ఇవ్వటము అని అర్థాలు ఉన్నవి". ఆయన భగవాన్ వద్దకు 19 సంవత్సరాల వయసులో వచ్చారు. ఆయన రమణాశ్రమంలోనే పండు ముసలి వయసు, అంటే 96 ఏళ్ళ వయసు వరకు ఉన్నారు. (అప్పుడు కూడా ఆయన యువకుడిలాగానే ఉత్సాహంగా ఉండేవారు). ఆయన భగవాన్ వద్దకు వచ్చిన పిన్నవయసునుండి, పండు వృద్ధాప్యంలో చనిపోయేవరకు, రమణమహర్షి పట్ల అనన్యమైన భక్తిభావం కలిగి ఉండేవారు.

ఆయన ఒక నిమ్నకులానికి చెందిన కుటుంబంలో జన్మించారు. అప్పుడు భారతదేశంలో వ్యాప్తిలో ఉన్నటువంటి కులవ్యవస్థమూలాన నిమ్నజాతుల వారిని, సంఘానికి దూరంగా ఉంచేవారు. కుంజుస్వామి జన్మించినపుడు, జాతకచక్రము వ్రాయించగా, ఆ జ్యోతిష్యుడు ఈ బిడ్డ దైవీసంపద కలవాడనీ, అతని పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపమని చెప్పారు. ఆయన తల్లితండ్రులు, ఈ సలహాను శ్రద్ధగా పాటించారు. వారికి అయిదారుగురు బిడ్డలున్నప్పటికీ, ఈయన పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచేవారు. కుంజుస్వామికి, తన తండ్రి అంటే అమితమైన ప్రేమ. అందుకని ఆయన ఎక్కడకు వెళ్ళినా ఆయనతోపాటు తనుకూడా వెళ్ళేవారు. కుంజుస్వామి తరచుగా, తండ్రితో కలసి చిన్నచెరువు (కొలను)కు స్నానం చేయుటకు వెళ్ళేవారు. ఆయనకు మూడేళ్ళ వయస్సులో ఊహరాగానే, బ్రాహ్మణులు, సన్యాసులు, మొలలోతు నీటిలో నిలచి మంత్రాలను జపించడం గమనించారు.

"నాన్నా, మనం కూడా, వాళ్ళలాగానే మంత్రాలు జపించుదామా? నువ్వు నాకు ఒక మంత్రాన్ని నేర్పించవచ్చుకదా," అన్నారు. వారి తండ్రి తలవంచుకుని అన్నారు, "లేదు మనం అంటరానివారము. మంత్రాలు బ్రాహ్మణుల కొరకు ఉద్దేశింపబడినవి. బ్రాహ్మణులు, అగ్రవర్ణాలవారు, మరియు సన్యాసులు కూడా జపించవచ్చును. మనము జపించకూడదు." ఆ చినపిల్లవాడు తీవ్రనిరాశకు గురియై, చాటుగా కన్నీరుకార్చాడు. ఆ రోజు రాత్రి పరమేశ్వరుడు ఆయన కలలో కన్పించి

ఇలా అన్నారు, "బిడ్డా! నీకు నేను ఒక మంత్రాన్ని ఉపదేశించుతాను. 'ఓమ్ నమః శివాయః' అని జపించు" అన్నారు. ఆ బాలుడు నిద్రలేచిన దగ్గరనుంచి ఆ మంత్రాన్ని జపించడం మొదలుపెట్టారు. కొన్నిరోజుల తర్వాత, మళ్ళా కోనేరు దగ్గరకు తీసుకు వెళ్ళినపుడు, కొంతమంది, చిన్న గుడ్డసంచిలో నుండి విబూదిని తీసుకుని వారి శరీరాలకు పూసుకోవడం ఆయన చూశారు. "నాన్నా! నాకు కూడా అలాంటి విబూది ఉండే గుడ్డసంచీ కావాలి," అని అడిగారు ఆయన. "లేదు నాయనా! మనమంతా అంటరానివాళ్ళం, మనం విబూది ధరించకూడదు. విబూది సంచులు ఉంచుకోకూడదు," అన్నారు. ఇది వినడంతోనే కుంజుస్వామి మళ్ళీ బాధపడ్డారు. మరలా ఈశ్వరుడు ఆయన కలలో కన్పించి, ఒక చెట్టును చూపించి, "బిడ్డా, ఆ చెట్టు వద్దకు వెళ్ళు. దానికింద నీకు కొన్ని నాణాలు కన్పిస్తాయి. వాటిని తీసుకొని వెళ్ళి, విబూది సంచి కొనుక్కో" అన్నారు. మర్నాడు ఆ చోటుకు పరుగెత్తుకుని వెళ్ళిచూడగా, అక్కడ మూడు కాణీలు కన్పడ్డాయి. (అప్పటి కరెన్సీలో రూపాయికి పదహారు అణాలు. అణాకు నాలుగు కాణీలు). ఆయన వాటిని తండ్రికి చూపించి, జరిగింది చెప్పారు. "అయితే అది ఈశ్వరాజ్ఞ అన్నమాట. అయితే షాపుకు వెళ్ళి కొనుక్కో" అన్నారు. కుంజుస్వామి సంతోషంగా ఆ పనిచేశారు.

మరొక సంవత్సరం గడిచిన తర్వాత, కుంజుస్వామికి, జపమాల కావాలని పించింది. హిందువులు, అందులోనూ సన్యాసులు, రుద్రాక్షలతో తయారైన జపమాలను వాడతారు. దానినెంతో పవిత్రంగా భావిస్తారు. కానీ, ఈసారి వాళ్ళనాన్నకు చెప్పడానికి భయపడ్డారు. ఎందుకంటే ప్రతిసారిలాగే, "మనము అవి ఉంచుకోకూడదు. మనం అంటరానివాళ్ళం" అంటారని. అందుకని ఆయన ఈశ్వరుని ప్రార్థించారు. దయచేసి నాకొక జపమాల ఇవ్వమని. ఒకరోజు కోనేటిలో స్నానం చేసి స్నేహితుడితో తిరిగివస్తుంటే, ఆ స్నేహితుడు ఉన్నట్టుండి నాకు పనుంది, అని వెనక్కు వెళ్ళాడు. కుంజుస్వామి ఒంటరిగా నడుస్తున్నారు. ఉన్నట్లుండి, ఆయనకొక వింత దృశ్యం కనపడింది. ఒక పూర్తిగా విచ్చుకున్న తామరపువ్వు రోడ్డు మీద ఉంది. వంగి దానిని తీసేటప్పటికి, అక్కడొక రుద్రాక్షమాల బంగారుదారంతో గుచ్చబడి ఉన్నది. అతడు పరుగెత్తుకొంటూ ఇంటికి వెళ్ళి, వాళ్ళ నాన్నకు చూపించారు. వాళ్ళ నాన్నకు అప్పటికి పూర్తినమ్మకం కుదిరింది. ఆ బాలుడు ప్రత్యేకమైన బాలుడని, ఆయన సంతోషంతో ఆ జపమాలను స్వామి మెడలో, తన స్వంత చేతులతో వేశారు.

పది సంవత్సరముల వయసు వచ్చేసరికి, ఈ బాలుడు పూర్తిగా శివభక్తిలో లీనమైపోయాడు. తిరువిలయాదల్ పురాణమ్, అనే శివుని కథలను ప్రక్క ఊరిలో చెబుతుంటే వినటానికి, వీరి తండ్రి, ఈయనను తీసుకుని వెళ్ళారు. తిరువిలయాదల్ అంటే పవిత్రమైన ఆట (నాటకము) అని అర్థము తమిళంలో. ఈ కథలు శివుడు చేసిన పనులు, ఆయన భక్తులతో ఎలా ఆటలాడినదీ, ఎలా అనుగ్రహించిందీ తెలుపుతాయి. కుంజుస్వామి ఎంతో శ్రద్ధగా, ప్రతి మాటనీ వదలిపెట్టకుండా విన్నారు. ఇంటికి వెళ్ళిన తర్వాత వాళ్ళ తండ్రి, వాళ్ళ తల్లిగారికి, తను విన్న కథలను చెప్పమంటే, అక్షరం పొల్లు పోకుండా ఈ బాలుడు చెప్పగలిగాడు. ఆయన అసాధారణ జ్ఞాపకశక్తిని చూచి వారి కుటుంబం నివ్వెరపోయింది. ఆయన తండ్రి మర్నాడు, ఆ పల్లెలో వారందరినీ పిలువగా, ఈ పిల్లవాడు తన ప్రవచనంతో వారిని ఆశ్చర్యపరచాడు. త్వరలోనే పల్లెలోని ఇతరులు కూడా, ఈ పిల్లవానిని, భక్తి, ఆధ్యాత్మిక ప్రవచనాలకు తీసుకుని పోసాగారు. ఈయన, మానవ టేప్ రికార్డర్ వలె పనిచేసేవారు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం, ఈ పిల్లవాడు తన మాతృభాషయైన మళయాళంలోనే కాదు, తమిళంలోని, సంస్కృతం లోని ప్రసంగాలను కూడా గుర్తుంచుకుని చెప్పగలిగేవారు.

కుమారుని జీవితంలో జరిగే అద్భుతాలను చూచి తండ్రి ఈయన గురించి ఎక్కువగా ఆలోచించేవారు. ఈ అబ్బాయికి చక్కటి శిక్షణ ఇప్పించదలచి, తండ్రి ఆయనను, కుప్పండిస్వామి అనే ఆయన తమ ఊరికి వస్తే, ఆయన వద్దకు తీసుకుని వెళ్ళారు. కుప్పండిస్వామి ఈ సిద్ధులను చూచి పరిహసించి, కుంజుతోటి ఇలా అన్నారు, "వీటిలో చిక్కుకునిపోకు. అవి నీకు ఏ విధంగానూ సహాయకారులు కావు. ఈశ్వరుడు నీ కలలో కన్పించి ఇవన్నీ నీకు ఇచ్చింది, ఈ సిద్ధుల జోలికి వెళ్ళుటకు కాదు". ఆ పిల్లవాడు ఆయన కాళ్ళమీద పడి ప్రాధేయపడ్డారు, "నాకు మార్గం చూపండి" అని. కుప్పండిస్వామి, మంత్రవిద్య లేదా ఇంద్రజాలవిద్య, జ్యోతిష్యము, వైద్యము, వేదాంతము మొదలైన వాటిలో ఆరితేరినవారు. ఆయన, "వీనిలోనుండి ఒక కళను ఎన్నుకో. నేను నీకది నేర్పిస్తాను," అన్నారు. ఆ పిల్లవాడు వినయంగా, "స్వామి, మీరే నిర్ణయించండి" అన్నారు. గురువుగారు, "నేను నీ కొరకు ఎంపికచేయను. నీకు నువ్వే ఎంపికచేసుకోవాలి." వారు చివరగా చీటీలు

వేయగా, పిల్లవాడు తీసిన చీటిలో వేదాంతం అని వచ్చింది. అందుకని, అదే అతను అభ్యసించవలసిన శాస్త్రము అయ్యింది. (దైవం మనకు మార్గాన్ని చూపిస్తారు అంటానికి, ఇదే నాకు గొప్ప ఋజువు. కాకుంటే మనకు పూర్తి విశ్వాసం ఉండాలి.)

స్వామి, ఈయనకు కైవల్య నవనీతం అనే గ్రంథాన్ని బోధించడం మొదలుపెట్టారు. దాని అర్థము మోక్షము అనబడే వెన్న. జ్ఞానము అనేది పెరుగువంటిది. దానిని సరిపోయినంతగా చిలికితే వెన్నపూస వస్తుంది. కాబట్టి మనము చదివినదేదైనా పవిత్రగ్రంథాలైనా, మనము అర్థం చేసుకుంటే, విశ్వాసంతో దానిని ఆచరణలో పెడితే, మనకు ప్రత్యక్ష అనుభవము (స్వంత అనుభవము) అనే వెన్న లభిస్తుంది. కుంజుస్వామి చాలా శ్రద్ధగా చదివేవారు. ఆయన అసాధారణ జ్ఞాపకశక్తి వల్ల, మొదటి రోజునే ఇరువది పద్యాలను నేర్చుకున్నారు. అయిదు రోజులలో, ఆ పుస్తకం మొత్తాన్ని కంఠస్తం చెయ్యగలిగారు. వారి తండ్రిగారు, "ఇది చాలదు, దాని అర్థాన్ని కూడా, నువ్వు గ్రహించాలి," అన్నారు. కుంజుస్వామి, కుప్పండిస్వామి వద్దకు వెళ్ళి దాని అర్థాన్ని చెప్పించుకున్నారు. కుప్పండిస్వామి ఆ ఊరు వదలి వెళ్ళేటప్పుడు, కుంజును ఇంకొక స్వామికి అప్పగించారు. ఆయన యోగవాశిష్ఠం చెప్పడంలో బాగా నిష్ణాతుడు. ఈయన కొత్త గురువుగారు, దీనిని నువ్వు కంఠస్తం చేసి, అర్థం చేసికుంటే సరిపోదు. నువ్వు దీనిని అభ్యాసం చెయ్యాలి అని చెప్పారు.

ఆయన వాటిని ఆచరణలో పెట్టసాగారు. కానీ సంతృప్తి చెందలేదు. కొన్ని సంవత్సరముల తర్వాత కుప్పండిస్వామి యాత్ర ముగించుకుని వచ్చి, నిస్పృహతో కుంగిపోయిన కుంజుస్వామిని చూశారు. "ఎందుకిలా ఉన్నావు?" అని ఆయన కుంజును ప్రశ్నించారు. "స్వామీ నేను, దేనిని అభ్యాసం చేస్తున్నానో, అది నాకు తృప్తి కల్గటం లేదు. నేను వేదకాలానికి చెందిన పవిత్ర గ్రంథాలలోనూ, పురాణాలలోనూ, పూర్వకాలంలో చాలామంది మహర్షులు ఉండేవారనీ, వారు, ఒక్క వీక్షణం (చూపు) తోనే ఆత్మానుభవాన్ని ఇచ్చేవారని విన్నాను. అలాంటి మహర్షులు ఇపుడెవరూ లేరా?" అని కుంజు ఆయనను ప్రశ్నించారు. కుప్పండిస్వామి అన్నారు, "అవును. అటువంటి మహాత్ములు ఇప్పుడొకరున్నారు. ఆయన పేరు రమణమహర్షి. రమణమహర్షి అనే పేరు వినటంతోనే కుంజు పారవశ్యంలో మునిగిపోయారు. కొన్ని నిముషాలతర్వాత సర్దుకుని స్థిమితపడి, "స్వామీ! మీరీ రమణ మహర్షిని చూచారా?" అని అడిగారు. గురువుగారు, "అవును, అరుణాచలానికి వెళ్ళి, నేను ఆయనను చూశాను," అన్నారు. "నాకు కూడా అక్కడకు వెళ్ళాలని ఉన్నది," అన్నారు కుంజు.

కుప్పండిస్వామి చాలా గొప్ప గురువు. ఆయనకు, వందలాది భక్తులున్నారు. ఆయనకు, అంతరంగంలోనుండి ఒక సూచన వచ్చింది. రెండు సంవత్సరాలలో, తాను జీవసమాధిలోనికి వెళ్తానని, దానికి కుంజు సమాధిని మూసివెయ్యాలనుకున్నారు. అందుకని ఆయన కుంజుతో, "దయచేసి అప్పటివరకు వేచి ఉండు, ఈ పనికి నిన్నెందుకు ఎన్నుకున్నానంటే నీ పైన ఈశ్వరుని అనుగ్రహం ఉన్నది గనుక," అన్నారు. ఆ సమయంలో రామకృష్ణన్ అనే ప్రక్క ఊరిలో ఉండే స్నేహితుడు ఆయనను చూడడానికి వచ్చారు. కుంజు తన స్నేహితునితో, "కనీసం నీవైనా వెళ్ళి ముందు రమణమహర్షిని చూడు. అక్కడకు ఎలా వెళ్ళాలో నేను చెబుతాను," అన్నారు.

చిట్టచివరకు కుప్పండిస్వామి, సమాధిలోనికి వెళ్ళవలసిన రోజు రానే వచ్చింది. వందలాదిమంది, జరగబోయే అద్భుతాన్ని తిలకించడానికి అక్కడ గుమికూడారు. గొయ్యి త్రవ్వబడింది. గురువుగారు కుంజును సమాధి మీద రాతిపలకను ఉంచమన్నారు. "దానిని ఎప్పుడు మూసివేయాలో నాకెలా తెలుస్తుంది?" అన్నారు కుంజు. "నేను సమాధిలోనికి ప్రవేశించిన తర్వాత అకస్మాత్తుగా నా శిరస్సు కంపించడం మొదలవుతుంది. అదే నీకు సమాధిని బండతో మూసివేయడానికి సూచన" అన్నారు కుప్పండిస్వామి. "అది నేనెప్పుడు చూస్తాను?" అని అడిగారు కుంజు. "నేను సమాధిలోనికి ప్రవేశించిన తర్వాత ఒక అరగంటకు అది జరుగుతుంది," అన్నారు గురువుగారు. అరగంట గడచింది. తర్వాత గంట, గంటన్నర, రెండు గంటలు గడిచాయి. అయినా ఏమీ జరగలేదు. ఉన్నట్లుండి కుప్పండిస్వామి సమాధినుండి లేచి బయటకు పరుగెత్తారు. ఆయన వెనకే కుంజుస్వామి పరుగెత్తారు. దాదాపు ఒక మైలు పరుగెత్తిన తర్వాత, కుప్పండిస్వామి ఒక చెట్టుకింద ఆగారు. కుంజు ఆయన పాదాలపై బడి అడిగారు, "స్వామీ ఏమి జరిగింది?" అని. "నాకు తెలియదు. నేను ఎవరినీ మోసగించాలనుకోలేదు. నాకు అంతరంగంలోనుండి హెచ్చరిక అందింది. టైము కూడా నిర్ణయించబడింది. అది నాచేత నిర్ణయించబడలేదు. అది పైనుండి వచ్చిన ఆజ్ఞగా భావించాను. ఏదో పొరపాటు జరిగింది. దానినిబట్టి నేను ఇంకొంత సాధన చేస్తాను. నేను

యాత్రకు వెళ్తున్నాను. నేను తిరిగిరాను. నువ్వు రమణమహర్షి దగ్గరకు వెళ్ళు బిడ్డా! నీకు నా దీవెనలు," అని గురువు గారు చెప్పి, శిష్యుడిని వదలి వెళ్ళిపోయారు.

స్వామి జీవసమాధిలో ప్రవేశించుటలో విఫలమయ్యారనేది, గొప్ప సంచలన వార్త అయింది. త్వరలోనే సంచలనం తగ్గింది. తన ఉపగురువు ప్రయత్నం విఫలమవడం ఆయన వెళ్లిపోవటంతో కుంజు పరిస్థితి హృదయవిదారకంగా మారింది. ఆయన తండ్రి ఆయన మీద జాలిపడి, "బిడ్డా! నువ్వు కుప్పండిస్వామితో ఉన్నావు కదా, అక్కడ ఎవరికైనా నువ్వు ఋణపడి ఉన్నావా?" అని అడిగారు. "అవును నాన్నా, నేనొకరికి అయిదు రూపాయలు బాకీ ఉన్నాను," అన్నారు కుంజు. "ఇదిగో ఈ డబ్బు తీసుకొని వెళ్ళి బాకీ తీర్చెయ్యి," అన్నారు. ఆయన తండ్రి ఆయన చేతిలో అయిదు రూపాయిలుంచి, అయితే కుంజు, ఆ డబ్బును, ఈశ్వరుడే తిరువణ్ణామలైకు వెళ్ళుటకొరకు తనకు ఇచ్చినట్లుగా భావించారు.

అది దాదాపు 1920, జనవరిలో అయి ఉండవచ్చును. అప్పటికి కుంజు గురించి ఆయన గ్రామంలోనూ, చుట్టుప్రక్కల వారికీ బాగా తెలిసిపోయింది. అందుకని జనం కంటపడి, వారిలో అనవసర ఆసక్తిని లేపటం ఇష్టంలేక, రాత్రి వరకూ ఆగి, మెల్లిగా జారుకున్నారు. ఆయన పరుగున రైల్వేస్టేషన్‌కు వెళ్ళి అక్కడ వేచి ఉన్నారు, కానీ రైలు అందుకోలేకపోయారు. ఆయన ఎవ్వరికీ కనపడకుండా ఉండి, తర్వాత రైలులో కాట్పాడికి బయలుదేరారు. కాట్పాడికి వెళ్ళంగానే మరల తిరువణ్ణామలై వెళ్ళే రైలు, తప్పిపోయినట్లుగా తెలిసికొన్నారు. ఆ తర్వాత రైలు, సాయంత్రం అయిదుగంటలకు. ఆయన పగలంతా వేచి ఉండవలసి వచ్చింది. సాయంత్రం ఐదు గంటలకు, ఆయన టికెట్టు కొనుక్కోవడానికి వెళ్ళినపుడు, ఒక భయంకరమైన ప్లేగువ్యాధి తిరువణ్ణామలైలో వ్యాపించిందనీ, అందువల్ల అక్కడ ఎవరినీ దిగనివ్వడము లేదనీ తెలిసింది. ఈ వార్తతో కుంగిపోయిన కుంజుస్వామి ప్రక్కన నుంచుని ఉన్న వ్యక్తిని అడిగారు. "నేను తిరువణ్ణామలై వెళ్ళ వలెననుకుంటున్నాను. నేను ఏమి చెయ్యాలి?" అని. తిరువణ్ణామలై దాటగానే, తిరుకోయిలూర్ స్టేషన్ వస్తుంది. తిరుకోయిలూర్‌కు టికెట్టు తీసుకొని, తిరువణ్ణామలై రాగానే రైలులోనుండి దూకెయ్యి. అదే మార్గం," అని ఆ అపరిచితుడు సలహా ఇచ్చారు.

కానీ టికెట్టు కొనుటకు వెళ్ళినపుడు తన వద్ద కేవలం తిరువణ్ణామలై వరకు టికెట్టు కొనుటకు మాత్రమే డబ్బులు ఉన్నట్లు గుర్తించారు. తిరుకోయిలూరుకు టికెట్ తీసుకోవాలంటే ఇంకా నాలుగు అణాలు కావాలి. పూర్తిగా నిరాశచెంది, దిక్కుతోచక, భగవాన్‌ను ప్రార్థించడం మొదలుపెట్టారు. ఆయన క్రిందకు చూస్తే ఎదురుగా ఉన్న పట్టాల మీద పడిందాయన దృష్టి. రెండు రైలుపట్టాల మధ్య, ఒక పావలా కాసు (నాలుగు అణాలు) పడి ఉన్నది. మిక్కిలి సంతోషంతో దానిని తీసుకుని, టికెట్టు కొనుక్కొని చివరకు తిరుకోయిలూర్‌కు రైలు ఎక్కారు. వాళ్ళు తిరువణ్ణామలై రైల్వేస్టేషన్‌కు రాత్రి 9.30 గంటలకు చేరాలి. చట్టానికి కట్టుబడే వ్యక్తి కనుక, నిజాయితీపరుడైన యువకుడు కనుక, కుంజుస్వామి నిబంధనలను ఉల్లంఘించి, దిగరాదని నిషేధమున్న స్టేషన్ వద్ద దిగటానికి భయపడ్డారు. అకస్మాత్తుగా, ఆయన ప్రక్కన కూర్చున్న వ్యక్తి, ఆయన చెయ్యిపట్టుకుని ఇలా అన్నారు. "నేను తిరువణ్ణామలైలో దిగుతున్నాను. నువ్వుకూడా దిగవలసిందే," అని చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళారు. ఆ ఇద్దరూ చీకట్లో జారుకున్నారు. తర్వాత, అప్పుడు జరిగిపోయినదంతా గుర్తుచేసుకుని, ఆయన ఇలా అన్నారు," నేను ఉదయాన రైలు అందుకుని ఉంటే చీకట్లో తిరువణ్ణామలైలోనికి జారుకునే అవకాశము ఉండేదికాదు. అంతా పకడ్బందీగా, చక్కగా జరిగిపోయింది. నేను చట్టవిరుద్ధంగా చెయ్యడానికి ఇష్టపడలేదు. కానీ ఎవరో, నా చెయ్యి పట్టుకుని బలవంతంగా దించేశారు. నేను ఆయనను అనుసరించి వెళ్ళాను. ఇద్దరము కలసి ఒక గుడి ఆవరణలో వసారాలో పడుకుని నిద్రపొయ్యాము. మర్నాడు తెల్లవారుఝామున లేచి చూచేసరికి, నాకు సాయం చేసిన వ్యక్తి వెళ్ళిపోయారు. నా భగవాన్ తప్ప, అతను వేరెవరై ఉంటారు?"

దారేపొయే వాళ్ళు కుంజుస్వామికి, భగవాన్‌ను చేరాలంటే కొండపైకి వెళ్ళాలని చెప్పారు. కొండపైకి ఎక్కడానికి మూడు దారులున్నాయి. ఏ దారిన వెళ్లాలో ఆయనకు తెలియలేదు. (ఇది సాధకులందరికీ, సాంకేతికమైనదే. మనము సత్యాన్ని చేరాలంటే, మనకు సందేహాలూ, సమస్యలూ, అడ్డంకులూ ఎదరౌతాయి. ఏమైనప్పటికీ మనం పట్టు విడవకుండా, మన విశ్వాసాన్ని సడలిపోనివ్వకుండా ఉంటే, అవన్నీ సత్యం (సద్వస్తువు) చేతనే పరిష్కరించ బడతాయి. మనకు కావలసిందల్లా, పట్టుదలతో కూడిన దీక్ష, ఏకాగ్రత, విశ్వాసము). ఆయన ఒక బాటవెంట వెళ్ళి, అక్కడ, ఒక బలిష్ఠమైన జటాధారియై,

గడ్డము కలిగియున్న స్వామిని కలిశారు. కొందరు ఋషులు కేవలం శాపాలు మాత్రమే పెడతారని పురాణాలలో చదివి ఉన్న కుంజుస్వామికి కొంచెం భయంవేసింది. ఆయన వెనుకకు తిరిగి పరుగెత్తి, ఒక అపరిచితుడిని కలుసుకున్నారు. అతడు, "మీరెక్కడకు వెళ్ళాలి?" అని అడిగారు. "నేను రమణమహర్షి వద్దకు వెళ్ళాలి," అని చెప్పారు కుంజుస్వామి. "ఈ దారిలో వెళ్ళు," అని ఆ వ్యక్తి ఒక బాటను చూపారు. కుంజుస్వామి ఆ దారి వెంట పైకి వెళ్తే విరూపాక్షగుహకు కొంచెముపైగా, ఒక చిన్న గుడిసె ఉన్నది. రోజూ భగవాన్‌కు భోజనం పెట్టే ముదలియార్ పాటి అక్కడ ఉంటున్నారు. ఈ యువకుణ్ణి చూసి ఆమె, "ఎక్కడికి వెళ్తున్నావు?" అని అడిగింది. "నేను రమణమహర్షిని దర్శించుకోవాలనుకుంటున్నాను," అన్నారాయన. "ఇటువైపు వెళ్ళి, ఆ ఏటిలో స్నానం చేసి అపుడు మహర్షి వద్దకు వెళ్ళు. మేము రమణమహర్షికి భోజనం తెస్తాము. ఆయనతోపాటు మీకు కూడా కొంత ఆహారం తెస్తాము" అన్నారామె. స్కందాశ్రమానికి వెళ్ళే దారిలో, ఆయన ఇలా అనుకున్నారు, "నేను గురువుగారిని ఎలా గౌరవించాలి? నేను మొదటిసారి ఆయన వద్దకు వెళ్తున్నాను."

అక్కడకు చేరుకోగానే, భగవాన్ కూర్చుని ఉండడము, ముగ్గురు వ్యక్తులు ఆయనకు సాష్టాంగనమస్కారము చెయ్యడం చూశారు. వారిలో ఒకరు తన స్నేహితుడు రామకృష్ణన్. మిగిలిన వారిద్దరూ, పెరుమాళ్ స్వామి, స్వామీ అఖండానంద. "నేనూ ఈ విధంగానే నా గౌరవాన్ని తెలుపుకుంటాను. అని తనలో తను అనుకున్నారు. ఆయనకూడా సాగిలపడి నమస్కరించి, మాట్లాడకుండ, కొంత తడవువేచి ఉన్నారు. ముందు గురువుగారు మాట్లాడి,ఉపదేశమిచ్చే వరకు శిష్యుడు మాట్లాడకూడదు అని ఆయన కైవల్య నవనీతంలోనూ, జ్ఞానవాశిష్టంలోనూ చదివి ఉన్నారు. అపుడు భగవాన్, తీవ్రంగా దుఃఖించుచున్న ఒక స్త్రీవైపు తిరిగి, "నువ్వు ఎందుకు ఏడుస్తున్నావు? నువ్వు ఒక కుమారుని పోగొట్టుకున్నానని విలపిస్తున్నావు. కానీ ఇంకొక కుమారుడు ఇప్పుడు వచ్చాడు," అన్నారు. ఆ స్త్రీ ఎవరో కాదు, భగవాన్ తల్లి అళగమ్మాళ్. ఆనాటి ఉదయం అణ్ణామలైస్వామి అనే వ్యక్తి ప్లేగువ్యాధి వల్ల చనిపోయారని, ఆయన అమ్మ అళగమ్మాళ్‌కు, స్కందాశ్రమంలోని ఇతరులకు ఎంతో సేవచేసేవారని, భగవాన్ తల్లిగారికి, ఆయనంటే చాలా ఇష్టమనీ, చాలాకాలం తర్వాత కుంజుస్వామికి తెలిసింది.

కొంతసేపటి తర్వాత భగవాన్ బొగ్గులకుంపటి,చిన్న గిన్నె, కొన్ని దినుసులు పట్టుకుని వచ్చారు. కొంతమంది మహాత్ములు ఏవో కషాయాలను తయారుచేస్తారని, వాటిని తాగినవారికి మోక్షం వస్తుందని కుంజుస్వామి అంతకు ముందు చదివి ఉన్నారు. కుంజుస్వామి ఈ విధంగా అనుకున్నారు. "ఎంత అదృష్టవంతుడిని నేను. నా గురువుగారైన రమణమహర్షిగారు, ఆ కషాయాన్ని కాచి, నా మొట్టమొదటిరోజునే నాకు ఇవ్వబోతున్నారు". భగవాన్ కషాయాన్ని కాచి, ఆరేవరకు వేచి ఉండి, దగ్గరలో ఉన్న బుట్టను పైకెత్తారు. నాలుగు కుక్కపిల్లలు అక్కడ ముడుచుకుని పడుకుని ఉన్నయ్యి. భగవాన్ కాచినది, వాటికి ఆహారం ఇవ్వడానికి గంజి. ఆ కుక్కపిల్లలు అటు, ఇటు పరుగెత్తేటప్పటికి, భగవాన్, కుంజుస్వామితో "ఆ నాలుగిటినీ పట్టుకో," అన్నారు. కుంజుస్వామి ఆ విధంగానే చేశారు. భగవాన్ వాటికివ్వడానికి గంజిని చిన్నప్లేటులో పోశారు. తర్వాత కుంజుస్వామి అన్నారు, 'అదే నాకివ్వబడిన ప్రథమ ఉపదేశము. దాని ద్వారా నేను నాలుగు మహా వాక్యాలను గట్టిగా పట్టుకోవాలని అర్థం చేసుకున్నాను. (వేదాలలో నాలుగు మహావాక్యాలున్నవి. వాటిని హిందువులందరూ గొప్ప జ్ఞానంగా గౌరవిస్తారు). వాటిని మహావాక్యాలంటారు. అవి ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్వమసి, అయం ఆత్మాబ్రహ్మ. 'ప్రజ్ఞానంబ్రహ్మ' అంటే తెలిసికొనుటకు ఆధారమైన ఎరుకయే బ్రహ్మము. 'అహంబ్రహ్మాస్మి' నేను ఎరుకను లేదా బ్రహ్మమును. అదేనీవు అయి ఉన్నావు. 'తత్వమసి', 'అయం ఆత్మాబ్రహ్మ' జీవాత్మ, పరమాత్మ రెండూ ఏకమైన చైతన్యాన్ని నేను). ఇప్పుడు వాటిని ఒకదాని తర్వాత ఒకటిగా వదలిపెట్టు అన్నారు గురువర్యులు. కుంజుస్వామి అలాగే ఆ కుక్కపిల్లలను ఒకదాని తర్వాత ఒకటిగా వదిలారు. ఈ రెండవ ఉపదేశాన్ని గురించి కుంజు ఇలా అనుకున్నారు. నాలుగు మహావాక్యాలను బాగా జీర్ణించుకున్న తర్వాత, సత్యస్వరూపస్థితి ఒక్కటే మిగిలి ఉండేలా, ఆ మహావాక్యాలను ఒక్కొక్క దానిని వదలివెయ్యాలి. అతడు తన గురువుగారు, గొప్ప ఉపదేశాన్ని ఇచ్చారని భావించి పారవశ్యంలో మునిగిపోయారు. ప్రతి కుక్కపిల్లా తన వంతు గంజిని త్రాగివేసింది. తన కడుపునిండిన తర్వాత ఒక కుక్కపిల్ల మూత్రవిసర్జన చేసింది. భగవాన్, ఒక గోతాన్ని తెచ్చి నేల శుభ్రముచేశారు. మరొకటి కాసేపు అటూ ఇటూ తిరిగి, తనుకూడా అదే పనిచేసింది. కుంజుస్వామి మనసులో అనుకున్నారు, "భగవాన్, అటువంటి పనులు చేయకూడదు. నేను ఆ పనిని చేస్తే బాగుంటుంది." భగవాన్ ఆయనవైపు

తిరిగి అన్నారు. 'నువ్వు శుభ్రం చేస్తావా? అలాగే చెయ్యి' అన్నారు. కాబట్టి మూడవ ఉపదేశము 'శుభ్రము చెయ్యి' అని. "ఎల్లప్పుడూ నీ మనస్సును పరిశుభ్రంగా ఉంచుకో అని. దాని అర్థంగా కుంజుస్వామి భావించుకున్నారు. ఆయన చాలా శ్రద్ధగా ఈ విధులను జీవితమంతా పాటించి చాలా సంతోషాన్ని పొందారు.

ఆయన భగవాన్‌తో పదునెనిమిది రోజులున్నారు. ఒకరోజు మహర్షి కుంజుస్వామితో "నువ్వు ఏమి సాధన చేస్తున్నావు?" అని అడిగారు. "నేను పంచాక్షరీమంత్రం 'ఓం నమశ్శివాయ'ను జపిస్తున్నాను" అని కుంజుస్వామి చెప్పారు. భగవాన్, దానినే కొనసాగించు అన్నారు. కుంజుస్వామి దీనిని పదునెనిమిది రోజులపాటు కొనసాగించి, భగవాన్ సన్నిధిలో తాను ఆత్మానుభూతిని పొందాననుకున్నారు. తాను ఆశ్రమానికి భారంకాకూడదని తలచి, తన స్నేహితుడు రామకృష్ణన్‌తో కలసి ఇంటికి వెళ్ళి అదే విధమైన ఆనందస్థితిలో ఉండిపోదామనుకున్నారు. కానీ, వారు ఇంటికి వెళ్ళిన తర్వాత, ఆ ఆనందం మెల్లగా తరగిపోయి, తిరిగి వారి పూర్వపుస్థితికి వచ్చారు. మళ్ళీ భగవాన్ సాన్నిధ్యానికి వెళ్ళి తీరవలసిందేనని వారు భావించారు. మొదటిసారి తిరువణ్ణామలైకు వెళ్ళినపుడు కుంజుస్వామి తల్లితండ్రులకు చెప్పలేదు. ఈసారి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

భారతదేశంలో, గురువుగారికి సేవచెయ్యడమూ, ఆయనకు సమీపంలో ఉండడమూ ఆయన బోధలకొరకై ఎదురుచూడడమూ, ఎంతో గొప్ప భాగ్యంగా భావిస్తారు. కుంజుస్వామి, రామకృష్ణన్ స్కందాశ్రమానికి వెళ్ళినపుడు వారుకూడా గురువుగారికి సేవచెయ్యాలనుకున్నారు. అదృష్టవశాత్తు, పెరుమాళ్ స్వామి యాత్రకు వెళ్తున్నందున, భగవాన్‌కు వ్యక్తిగత (శారీరక) సేవచేసే బాధ్యతను వీరికి అప్పగించారు. పెరుమాళ్‌స్వామి చేసే సేవ, భగవాన్ పాదాలకు మర్దన చేసి ఆయనకు స్నానం చేయించడం, కుంజుస్వామి తన ప్రార్థన ఫలించిందని సంతోషించి, ఇంక ఏమి జరిగినా సరే భగవాన్‌ను వదలివెళ్ళకూడదని, గురువుగారు ఏ పనిచెబితే దానిని చేయాలనీ గట్టి నిర్ణయం తీసుకున్నారు.

"నేను నా గ్రామానికి వెళ్ళినపుడు, నా ఆనందమయ స్థితిని కోల్పోయి, తిరిగి అశాంతిలోకి ఎందుకు వచ్చాను? నా అయోమయము తొలగిపోయి, ఎప్పుడు నాకు స్వచ్ఛమైన జ్ఞానము లభిస్తుంది?" అని ఆయన భగవాన్‌ను అడిగారు. చిరునవ్వుతో ఆయన ప్రశ్నలను విన్న భగవాన్ ఇలా జవాబిచ్చారు, "నువ్వు కైవల్య నవనీతం చదివావు కదా. ఒకడు అన్వేషణలో మునిగి, జీవాత్మను కనుగొని (చూచి) దానిని అధిగమించి, దానికి ఆధారమైన శాశ్వతమైన ఆత్మను జేరుకొని, తానే ఆధారంగా, ఆత్మగా నిలచిపోతాడు. ఎల్లవేళలా (ఆత్మలోనే నిలచిపోతే) ఆత్మగానే మిగిలిపోతే ఇక జనన మరణాలు ఉండవు." "నేను నా ఆత్మను ఎలా తెలుసుకోవాలి?" అని కుంజుస్వామి అడిగారు. "ముందు నీవెవరో తెలుసుకో." అన్నారు గురువుగారు. "నేనెవరో నేనెలా గుర్తించాలి?" అని కుంజుస్వామి అడిగారు. "ఆలోచనలు ఎక్కడనుండి పుడుతున్నయో చూడు," అని భగవాన్ అన్నారు. "కానీ దానిని ఏ విధంగా చెయ్యాలి?" అని కుంజుస్వామి నొక్కి ప్రశ్నించారు. భగవాన్ అన్నారు, "నీ మనస్సును అంతర్ముఖం చేసి హృదయంగా ఉండు". తర్వాత తన అనుగ్రహ వీక్షణాన్ని కుంజుస్వామిపై నిలిపి, తన సహజనిష్టయైన మౌనంలోనికి వెళ్ళారు. ఆ క్షణానే కుంజుస్వామిలోని అలజడి, అశాంతి నశించాయి. ఇంతకు ముందెన్నడూ ఎరుగని శాంతినీ, ఆనందాన్నీ పొందారాయన.

కుంజుస్వామి మరల ప్రశ్నించారు, "నేను నా గ్రామానికి వెళ్ళినపుడు ఎందుకు ఆనందస్థితిని కోల్పోయాను?". భగవాన్ మరల కైవల్యనవనీతం నుండే కొన్ని వాక్యాలను ఉటంకించారు. "సద్గురు సన్నిధిలో ఆత్మానుభూతి ఒక మెరుపు వలెకలుగవచ్చు, కానీ, అది నిలవకపోవచ్చును. సందేహాలు తిరిగి తిరిగి వస్తూనే ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకొనుటకై, శిష్యుడు పఠనము, నిధిధ్యాస, మననము కొనసాగించాలి. చదవడం కానీ, వినడం కానీ శ్రవణమననములు అంటారు. అభ్యాసం చెయ్యటాన్ని లేదా ఆచరణలో పెట్టటాన్ని నిధిధ్యాసనము అంటారు. శ్రవణము, మననము, నిధిధ్యాసన, తెలుసుకునేది, తెలియుట, తెలుసుకునేవాడు, (జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత) అనే మూడింటి (త్రిపుటి) మధ్య బేధము తొలగిపోయి, తిరిగిరాకుండా ఉండేంత వరకు కొనసాగించవలసినదే. అక్కడ బేధమేమీ ఉండకూడదు. ఇతరమేమీ ఉండకూడదు. ఈ విధంగా భగవాన్ వివరించిన తర్వాత, కుంజుస్వామి, ఆయన సన్నిధిలోనే ఉండి, ఆయన చెప్పినవన్నీ కొనసాగించవలెననుకున్నారు. తనకు

ఏదైనా సందేహము వచ్చినపుడు భగవాన్ ఇతరుల ప్రశ్నలకు ఇచ్చే సమాధానాలను వినుట ద్వారా దానిని నివృత్తి చేసికొనవచ్చని ఆయన భావించారు. ఇక ఆయనకు పెద్దగా ప్రశ్నించవలసిన అవసరం లేకుండాపోయింది.

స్కందాశ్రమంలో దినచర్య తెల్లవారుఝామున నాలుగింటికి మొదలయ్యేది. భగవాన్ తల్లిగారు లేచి భక్తిగీతాలు పాడుతుండేవారు. అయిదు గంటలకు భగవాన్ వెలుపలకు వచ్చేవారు. భక్తులందరూ అక్షరమణమాలను పాడేవారు. శామాతాత వంట చేసే వారు. లేకుంటే ఎచ్చెమ్మాళ్ ఆహారం తీసుకుని వచ్చేది. ఎనిమిది గంటలకు అందరూ ఆహారం తీసుకునే వారు. మిగిలిన సమయమంతా ధ్యానం చేసుకొనుటలోనూ, ఋభుగీతను కానీ, కైవల్యనవనీతాన్ని కానీ, చదవడంలో గడిపేవారు. భగవాన్ ఎక్కువగా మౌనంలోనే ఉండేవారు. కుంజుస్వామి నాకు భగవాన్ గురించి కొన్ని ఆసక్తి కరమైన విషయాలు తెలిపారు. ఆయన చెప్పే దానిప్రకారం, భగవాన్ ఎల్లప్పుడూ వెల్లకిలా పడుకోవటంగానీ, ప్రక్కకు తిరిగి పడుకోవడం గానీ చేసేవారు కాదు. ఆయన ఎప్పుడూ ఏటవాలుగా ఆనుకొని ఉండేవారు. భగవాన్ చాలా పొదుపరి. ఏరోజుకారోజు (ప్రతిదినమూ) వారు పండ్లపొడి తయారుచేసి పొట్లము కట్టి భగవాన్‌కు ఇస్తుండేవారు. అది ఏమాత్రమైనా మిగిలిపోతే, దానిని తిరిగి పొట్లము కట్టి, మర్నాడు దానిని తిరిగి ఇవ్వమనేవారు. ఆయన పొదుపరితనము స్నానము విషయంలో గూడా కన్పించేదని చెప్పారు కుంజుస్వామి. భగవాన్ కొద్దిమాత్రపు నూనెను అరచేతిలో వేసుకుని, దానికి కొద్దిగా వేడినీరు జతచేసి (పేస్టు - లేహ్యము లాగా తయారుచేసి) దానిని ఒళ్ళంతా రుద్దుకునేవారు. వీపు ఆయన తోముకోలేరు కనుక కుంజుస్వామి, ఆయన వీపుకు నూనె రాసేవారు.

స్కందాశ్రమం వద్ద తిరువణ్ణామలై టౌన్‌కు అభిముఖంగా ఒక చిన్న అరుగు ఉన్నది. ఆ రోజులలో అక్కడొక రాయి మాత్రమే ఉండేది. భగవాన్ దానిపై కూర్చుని పండ్లు తోముకునేవారు. అప్పుడు చలి తీవ్రంగా ఉండేది. భగవాన్ కేవలం కౌపీనం మాత్రమే ధరించేవారు. ప్రొద్దుటే అంత చలిలో అక్కడ కూర్చోకుండా ఉంటే బాగుంటుందని కుంజుస్వామి అనుకునేవారు. కానీ భగవాన్ మాత్రం అక్కడే కూర్చునేవారు. దీనికి కారణం కుంజుస్వామికి తర్వాత తెలిసింది. సౌభాగ్యమ్మ అనే ఒక స్త్రీ రోజూ స్కందాశ్రమానికి వస్తుండేది. ఆమె వృద్ధురాలైపోయింది. కానీ, భగవాన్ దర్శనం కానిదే స్నానము చేయను, వండను, భోంచెయ్యను అని నియమం పెట్టుకుంది. ఒకరోజు ఆవిడ స్కందాశ్రమానికి రాలేదు. "నువ్వు నిన్న ఎందుకు రాలేదు?" అని అడిగారు భగవాన్. "భగవాన్, నా అదృష్టం కొద్దీ మా ఇంటినుండే మిమ్ములను దర్శించుకోగలిగాను. మీరు బయట బండరాతిపై కూర్చున్నపుడు, నేను మిమ్మల్ని చూడగలిగాను," అన్నదామె. ఆ రోజునుండి, చలి అయినా వర్షం అయినా, భగవాన్ ఆ రాతిపైనే కూర్చుని, సౌభాగ్యమ్మకు ప్రతిరోజూ దర్శనమిచ్చేవారు.

ప్రతిదినమూ పర్వదినంలాగానే ఉండేది స్కందాశ్రమంలో. భగవాన్ కుంజుస్వామిని, కావ్యకంఠగణపతి మునికి పరిచయం చేసారు. కావ్యకంఠులకు కపాలభేదమైనపుడు కుంజుస్వామి అక్కడే ఉన్నారు. తలనుండి వేడి ఆవిరి వస్తుంటే, కుంజుస్వామి చేతిని, తన తలపై ఉంచారాయన. అది చాలా వేడిగా ఉందని గమనించారాయన. 'ఆ దుర్భరమైన వేడినుండి ఉపశమనాన్ని పొందడానికి, కావ్యకంఠులు భగవాన్ చేతిని తన తలపై ఉంచుకున్నారు. దీనివల్ల ఆయన చల్లదనాన్ని పొంది నొప్పినుండి, అసౌకర్యంనుండి విముక్తి పొందారు. ఈ సంఘటన గురించి భగవాన్ కుంజుస్వామితో, "ఆయన ఆ అనుభవాన్ని గురించి మనకు చెప్పారు. నేను ఎవరికి చెప్పుకుని ఉండాలి?" అన్నారు. అప్పుడెవరో అడిగారు, "భగవాన్ మీకుకూడా ఆ అనుభవం అయిందా?" అని. భగవాన్ అవునని, కాదని అనకుండా ఊకొట్టారు.

నాయన,భగవాన్ ఆధ్యాత్మిక స్థితిగురించి, "ఆయన సహజనిష్ఠులు," అని కుంజుస్వామితో చెప్పారు. "ఆధ్యాత్మిక సాధకులందరూ శక్తినుండిగానీ, శాంతినుండిగానీ అభివృద్ధి చెందుతారు. వేదాల కథనం ప్రకారం, చాలామంది మహాత్ములు మీరా, ఆదిశంకరులు, స్వామి వివేకానంద మొదలైన వారు శక్తిని పెంపొందించుకుని, దానిని ఇముడ్చుకోలేక, పారవశ్యంతో, పాటల ద్వారానో, ఉపన్యాసాల ద్వారానో బహిర్గతపరిచారు. భగవాన్ శాంతిలో ప్రతిష్ఠితులై, అరుణాచలంనుండి, ఏమాత్రం కదలడానికి ఇష్టపడలేదు. అదే సహజనిష్ఠుడి లక్షణం. ఉన్నది ఉన్నట్లుగానే ఉండడం, అందుకనే కె.కె.నంబియార్ అనే పాత భక్తుడు భగవాన్‌ను 'మలయైముళుంగి, పర్వతాన్ని మ్రింగినవారుగా' అభివర్ణించారు.

ఆ కాలంలో కేరళలో నారాయణగురు అని ఒక మహనీయుడు ఉండేవారు. ఆయన చాలా ప్రఖ్యాతిచెందిన వారు. మహాత్మాగాంధీగారు కూడా ఆయనతో కొద్దినిముషాలు గడపడం గొప్ప భాగ్యంగా భావించేవారు. ఆయన సాధారణంగా ఎక్కడికీ వెళ్ళేవారుకాదు. నిజానికి ఇతర మహాత్ములే ఆయన పట్ల ఉన్న గౌరవంతో ఆయన వద్దకు వచ్చేవారు. కానీ ఆయన తన శిష్యులతో కలసి, స్కందాశ్రమంలో ఉన్న భగవాన్‌ను దర్శించుకున్నారు. భగవాన్ ఆయనతో మళయాళంలో మాట్లాడి, ఆదరపూర్వకంగా ఆహ్వానించి, మధ్యాహ్నభోజనానికి పిల్చారు. నారాయణగురు సంతోషంగా, తప్పకుండా మహర్షి ప్రసాదాన్ని స్వీకరిస్తాము అన్నారు. భగవాన్ తమ అనుగ్రహవీక్షణం ప్రసాదించారు. చాలా సేపు వారిద్దరూ పారవశ్యంతో కూడిన మౌనంలో ఉన్నారు. తను వెళ్ళవలసిన సమయం సమీపించినపుడు, నారాయణగురు, భగవాన్ సహజసమాధిని చూచి, “దానిని అలాగే ఉండనీ,” అన్నారు. సహజనిష్ఠ కొరకు అది ప్రార్థన, అని కొందరు, ఆ వాక్యానికి అర్థంచెప్పారు. కానీ నారాయణగురు శిష్యులు చెప్పినదాని ప్రకారం, ఆయన రచనల ప్రకారం, అప్పటికే ఆయన ఆ స్థితిలో ఉన్నారు. అక్కడికక్కడే సంస్కృతంలో ‘నివృత్తిపంచకం’ అనే అయిదు పద్యాలను, ‘సహజనిష్ఠ’ అనే స్థితిని ప్రశంసిస్తూ వ్రాశారు నారాయణగురు.

శిష్యులతోగూడి కొండ దిగి వస్తున్నపుడు నారాయణగురు పారవశ్యంలో ఉన్నారు. తన శిష్యులవైపు తిరిగి ఆయన సంతోషంగా, ఈ మహర్షి ‘ఒక రాజ సర్పము’ ‘త్రాచుపాము’ అన్నారు. హిందూమతంలోను, ఆధ్యాత్మికతలోనూ మహాత్ములను సర్పాలతోనూ, త్రాచుపాములతోనూ పోలుస్తారు. నారాయణగురు, తానే మహాత్ముడయి ఉండి, భగవాన్‌ను ఇంకొక త్రాచుపాముగ వర్ణించలేదు. భగవాన్‌ను రాజసర్పంగా ప్రశంసించారు. ఈ సత్యం ఆయన హృదయంలోనుండి వచ్చింది. ఆయన తన శిష్యులలో, ఒక సంపన్నుని, ఒక మేధావియైన పండితుడిని పిలచి ఈ దివ్యమైన పలుకులు పలికారు, “మహర్షి ఆధ్యాత్మికస్థితి ఎటువంటిదంటే, ఎవరినైనా ముక్తినొందించడానికి, ఆయన ఒక్క చూపుచాలును. ఇపుడు ఒక కుండలో ఉన్న దీపమువలె ఆయన ప్రపంచానికి వెల్లడికాకుండా ఉన్నారు. ఆయన గుర్తింపబడాలి. ఎందుకంటే, ఈ ఆధ్యాత్మిక సంపద, అనేకమందిచే కొల్లగొట్టబడాలి. మీరిద్దరూ ఇచట ఆగిపోయి, ఆరునెలలపాటు, వచ్చే యాత్రికులకు, భోజన వసతి సదుపాయాలను చేస్తూ, అనేకమంది ప్రతిరోజు ఆయనను చూచి, ఆధ్యాత్మిక ఉన్నతి పొందేలా అవసరమైన ఏర్పాట్లు చెయ్యండి. పండితుల సమాజంలోకీ, నిజమైన సాధకుల వద్దకూ వెళ్ళి మహర్షి గొప్పతనాన్ని గురించి వివరించండి. భగవాన్‌వల్ల ఆయన ఎంతగా ప్రభావితులైనారంటే, కేరళ తిరిగి వెళ్ళిన తర్వాత, ఆయన ‘మునిచర్యాపంచకమ్’ అని మరొక అయిదు పద్యాలు వ్రాసిపంపారు.

తిరిగివెళ్ళిన తర్వాత నారాయణగురు జబ్బుపడ్డారు. అది తెలిసిన భగవాన్ కుంజుస్వామికి ఒకనిమ్మపండును ఇచ్చి, దీనిని తీసుకుని వెళ్ళి ఆయనకు ఇవ్వమన్నారు. నారాయణగురు, ఆ పండును ఎంతో గౌరవంతో తీసుకుని, కళ్ళమీద, తలమీద, హృదయంమీద ఉంచుకున్నారు. భగవాన్ ఆ ప్రసాదాన్ని తనకోసం పంపారని ఆనందంతో కళ్ళనీళ్ళపర్యంతం అయ్యారు. ఎప్పుడైనా, తమిళనాడు నుండి ఆయనను ఎవరైనా చూడడానికి వస్తే, “మీరు భగవాన్ రమణ మహర్షిని చూశారా?” అని అడిగేవారు. ఎవరైనా లేదని చెప్తే, ఆయన గొంతుపెద్దది చేసి, “అయితే మీరిక్కడకు ఎందుకు వచ్చారు? మీరు వెనక్కు వెళ్ళి ఆయన దర్శనం చేసుకోవాలి” అని చెప్పేవారు. నారాయణగురు మహాసమాధి చెందబోతున్నారని తెలిసి భగవాన్ కుంజుస్వామిని పిలచి, నారాయణగురు గారి శరీరాన్ని ఏ విధంగా భద్రపరచవలెను అన్న విషయంపై తగు సూచనలనిచ్చి, కేరళకు పంపారు. నారాయణగురు ఒక జ్ఞాని, సాక్షాత్కారాన్ని పొందిన మహనీయుడు. అందుకని తదనుగుణంగా ఆయన సమాధి నిర్మింపబడాలని, భగవాన్ ఆకాంక్ష (ఉద్దేశం) కుంజుస్వామి అక్కడే ఉండి, సమాధి తృప్తికరంగా నిర్మించబడిందనే వార్తను భగవాన్ వద్దకు వచ్చి నివేదించాలి. నారాయణగురు మరణవార్త తెలియగానే భగవాన్, “నారాయణ గురు పూర్ణపురుషులు. ఆయన పరిపూర్ణంగా వికసించిన వారు” అని అన్నారు.

భగవాన్ చాలాసార్లు సహజంగా, అప్రయత్నంగానే సమాధిస్థితిలోకి వెళ్తుండేవారు. ఆ స్థితిలో నుండి, ఆయనను బహిర్ముఖులను చేయడానికి, బాహ్యప్రపంచంలోనికి తీసుకుని రావడానికి ఎంతో కష్టంగా ఉండేది. అలా జరిగినప్పుడు ముగ్గురు, నలుగురు, భగవాన్ చెవుల్లో శంఖాలు ఊదేవారు. అలా చాలాసేపు జరిగిన పిమ్మట భగవాన్ తన సమాధిస్థితినుండి బయటకు వచ్చేవారు. ఈ విధంగా భగవాన్ రమణాశ్రమానికి వచ్చిన కొంతకాలం వరకు జరిగింది. పురాణాలప్రకారం, మనస్సుని ప్రభావితం చెయ్యగల్గిన వస్తువులు రెండు ఉన్నవి. ఒకటి శంఖాన్ని ఊదడం, రెండు గంట మ్రోగించడం. శంఖము అణిగి

ఉన్న మనస్సుని బహిర్గతపరుస్తుంది. గంట శబ్దము, మనస్సును అంతర్ముఖం చేస్తుంది. మతిస్థిమితంలేని వారి మీద కూడా వీటిని ప్రయోగించి చూడవచ్చును. అందుకనే ఆలయాలలోనూ, చర్చిలలోనూ గంటలు ఉంటవి. అది శుష్క ఆచారం కాదు. దానివలన భక్తుల మనసు అంతర్ముఖమౌతుంది.

భగవాన్ తల్లిగారు చనిపోయినపుడు, మిగిలినవారితో పాటు కుంజుస్వామి కూడా, ఆమె దేహాన్ని క్రిందకు తెచ్చారు. ఎక్కడైతే ఆమె శరీరాన్ని ఖననంచేశారో, అక్కడ ఒక పూరిపాక వేయబడింది. భగవాన్ సోదరులైన నిరంజనానందస్వామి, దండపాణిస్వామి అక్కడే ఉండిపోయారు. కొన్నిసార్లు వాళ్ళు దోసెలు తయారుచేయడానికి కావలసిన దినుసులను సంపాదించి, కుంజుస్వామికి కబురుచేసేవాళ్ళు, నువ్వు కూడా ఇక్కడే ఉండి, ప్రొద్దుటే మాతోపాటు దోసెలు తిందువుగాని, అని. అటువంటి తాజా వంటకాలు స్కందాశ్రమంలో విశేషమైనవిగా, విలాసవంతమైవిగా అన్పించేవి. వారు కొన్ని దోసెలను భగవాన్‌కు పంపేవారు. కుంజుస్వామి తెల్లవారుఝామునే లేచి, వారితో కలిసి అంట్లు కడగటం మొదలుపెట్టేవారు. ఒకరోజు ఒక వ్యక్తి ముసుగువేసుకుని వచ్చి, కుంజుస్వామి వెనక నుంచుని, "ఒక అతిథికి ఏదైనా ఆహారం దొరుకుతుందా?" అన్నారు. కుంజుస్వామి వెనుతిరిగి చూడగా, ఆ వ్యక్తి ఎవరో కాదు, భగవానే. కుంజుస్వామి గౌరవంగా సమాధానమిచ్చారు, "భగవాన్, మీరు సరైన సమయానికి వచ్చారు. మేము దోశలు చేస్తున్నాము. దయచేసి ఇక్కడే ఉండండి."

అక్కడ మరొక స్త్రీ ఉండేది. ఆవిడ కూడా భగవాన్ దర్శనమైతే కానీ దినచర్య మొదలు పెట్టేదికాదు. భగవాన్ రమణాశ్రమానికి వచ్చారని తెలియగానే ఆమె వచ్చి పట్టుబట్టింది. "ఇక్కడే ఉండండి స్వామీ. నేను వంట చేసి మీకు భోజనం పెడతాను," అని. భగవాన్ ఒప్పుకున్నారు. మర్నాడు మరెవరో, "ఇవాళ మేము మీకు భిక్ష ఇవ్వాలనుకుంటున్నాము," అన్నారు. అప్పట్లో భిక్ష ఇచ్చినవారు, భగవాన్‌ను తమతోపాటు గిరిప్రదక్షిణ చెయ్యవలసినదిగా ప్రార్థించేవారు. భగవాన్ నెమ్మదిగా నడిచేవారు. అందుకని ఆయన గిరి చుట్టిరావడానికి రాత్రంతా పట్టేది. అందుకని ప్రజలు, భగవాన్‌ను, ఇప్పటి రమణాశ్రమంలోనే ఉండిపొమ్మని అడగసాగారు. ఒకసారి భక్తులు, అయిదురోజులు వరుసగా భిక్షనివ్వడం, భగవాన్ వారితో అయిదు రాత్రులు వరుసగా గిరిప్రదక్షిణ చెయ్యడం జరిగింది. మరుసటిరోజు భిక్షనివ్వడానికి వచ్చిన వారిని కుంజుస్వామి ఆపే ప్రయత్నం చేసేవారు. ఎందుకంటే భగవాన్‌కు అయిదురాత్రులు వరుసగా నిద్రలేదు కనుక. భగవాన్, "నువ్వు ఎవరితోనూ నాకు అయిదురోజులు వరుసగా నిద్రలేదు అని చెప్పొద్దు," అని కుంజుస్వామిని చూపులతోనే గట్టిగా వారించారు. చివరికి ఏడురోజులు గడిచిన తర్వాత కుంజుస్వామి ఇంక భరించలేకపోయారు. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి గట్టిగా మాట్లాడారు. "భగవాన్ మీరసలు నిద్రపోలేదు. మీకు విశ్రాంతి అవసరం లేదా? వీళ్ళని ఆపుతుంటే మీరు అడ్డుకుంటారెందుకు?" అని. భగవాన్ ఆయన వంక కరుణతో చూచి, "నిద్ర అంటే ఏమిటి? నిద్ర కేవలం మనసుకు విశ్రాంతినివ్వడానికే. మనసనేది ఉంటే దానికి నువ్వు విశ్రాంతినివ్వాలి. మనసెక్కడుంది? ఇరువది నాలుగు గంటలపాటు అదే పనిగా కళ్ళు తెరచే ఉంటే, అవి అలసిపోయి, కళ్ళు నొప్పి పెడతాయని నాకు అర్థం అయింది. ఎవరైనా, కాసేపు కళ్ళు మూసుకొని కూర్చుంటే, ఆ బాధకూడా ఉండదు ఇంక సమస్య ఎక్కడుంది?" అన్నారు.

భగవాన్ కొండ కిందకు, అమ్మ సమాధి వద్దకు వచ్చిన తర్వాత, టౌన్‌లోని భక్తులు వరుసగా భిక్ష ఇవ్వడం మొదలుపెట్టారు. స్కందాశ్రమానికి కాపలాగా ఉంచబడిన కుంజుస్వామి, రామకృష్ణస్వామి, భగవాన్‌కు ఎక్కువకాలం దూరంగా ఉండవలసి వచ్చేటప్పటికి, బాధపడడం మొదలుపెట్టారు. "మనం ఇక్కడికి భగవాన్ కోసం వచ్చాము. కొండమీద బిల్డింగుకు కాపలాకాయడానికి కాదు" అని వారు వ్యాకులపడ్డారు. అందుకని వారు కొండనుండి మెల్లగా జారుకుని భగవాన్‌తో ఉండదలిచారు. ఇది గమనించిన భగవాన్, ఒక రోజు "ఇవాళ అందరము గిరిప్రదక్షిణకు వెళ్దాము," అన్నారు. భగవాన్‌తో గిరిప్రదక్షిణ చేసిన తర్వాత కుంజుస్వామి, రామకృష్ణస్వామి స్కందాశ్రమానికి వెళ్ళారు. భగవాన్, మరికొందరు రమణాశ్రమానికి వచ్చేశారు. ఒక గంట గడిచిన తర్వాత, రామకృష్ణస్వామి, కుంజుస్వామి పరిగెత్తుకుంటూ రమణాశ్రమానికి వచ్చి ఏడుస్తూ ఇలా చెప్పారు, "భగవాన్! దొంగలు స్కందాశ్రమంలోనికి జొరబడి అన్నీ కాజేశారు. అక్కడ ఏమేమి వస్తువులుండాలో అన్నీ పోయినవి." ఏ విధమైన వ్యాకులత లేకుండా, భగవాన్ జవాబిచ్చారు. "అదీ మంచిదే. ఇప్పుడు ఆ బిల్డింగుకు ఎవరూ కాపలా కాయనక్కరలేదు. మీరు కూడా వచ్చి ఇక్కడే ఉండిపోవచ్చును." ఈ విధంగా రమణాశ్రమము అభివృద్ధి

చెందనారంభించింది. అది కేవలం ఒక పూరిపాకగా మొదలైంది. అందులో చిన్న ఎత్తు తక్కువ అరుగువంటిది ఉండేది. భగవాన్ పండుకొనటానికి. ఆరు లేదా ఏడుగురు భక్తులు, ఆయనకు దగ్గరలో కొబ్బరాకులతో చేసిన చాపలమీద పడుకునేవారు. కుంజుస్వామి అంటుండేవారు, "అవి ఎంతో మహత్తరమైన రోజులు, ఎందుకంటే మేము ఆయనకు ఎంతో దగ్గరలో ఉండేవారము, ఆయన మాతో వివేకపూరితమైన మాటలనే ఆణిముత్యాలను పంచుకునేవారు."

ఇక రెండవవైపు చూస్తే, ఎన్నో రోజులు వాళ్ళు ఆహారంలేక పస్తులుండే వాళ్ళు. భగవాన్ యొక్క ప్రకాశం అప్పుడే విస్తరించడం మొదలైంది. చాలామందికి ఆయన ఉనికి గురించి తెలియదు. అందుకే పెద్దగా ఎవరూ ఎక్కువగా ఆహారాన్ని సమర్పించేవారుకాదు. భగవాన్ అప్పుడు నలభైయ్యవ పడిలోకి ప్రవేశించి ఉన్నారు. కుంజుస్వామి, రామకృష్ణస్వామి ఇరవైలలోకి అడుగుపెట్టారు. వాళ్ళు శక్తివంతంగా పనిచేసేవారు కానీ, ఎక్కువ సార్లు ఆకలితో ఉండేవారు. హిందూ ఆచారం ప్రకారం, నెలలో పదకొండవ రోజైన ఏకాదశిన పూర్తిగా ఉపవాసం ఉండాలి. అందుకుబదులు, పన్నెండవ రోజున ద్వాదశినాడు విందు చేసుకుంటారు. ఎప్పుడైనా వారికి ఏమాత్రం ఆహారం దొరకకపోతే ఇవాళ మనం ఏకాదశి పండుగ చేసుకుందాం అని వాళ్ళందరినీ నవ్వించేవారు భగవాన్. ఎప్పుడైనా ఒకటిరెండు రోజులైన తర్వాత ఎవరైనా సరిపడా భోజనం పట్టుకుని వస్తే ఇవాళ ద్వాదశి పండగ చేసుకుందాం అనేవారు. కొన్ని కొన్ని రోజులలో సరిపడినంత బియ్యం ఉండేవికావు. భోజనానికి మాత్రం పదిమంది ఉండేవారు. భగవాన్ వారిని ఉత్సాహపరచి అడవిలోకి తీసుకువెళ్ళేవారు. ఆయనకు అక్కడ ఉండే అన్నిరకాల మొక్కల గురించి, ఆకుల గురించి తెలుసు. భక్తులను ఆ ఆకులను ప్రోగు చెయ్యమని చెప్పి, వాటి ఔషధ గుణాలను గురించీ, వాటిని ఎట్లా ఉపయోగించవలసిందీ అన్నీ వారికి చెప్పేవారు. దక్షిణభారతదేశంలో అన్నము, భోజనంలో ఎక్కువగానూ అందులో కలుపుకోవడానికి కూరలు పరిమితంగానూ వాడతారు. భగవాన్, "భోజనంలో అన్నమే ఎక్కువభాగం, కూరలు తక్కువభాగం ఉండాలని నిబంధన ఏమిటి? ఇవాళ మనం ఈ ఆకుకూరలు ఎక్కువగాను, అన్నం తక్కువగాను తీసుకుందాము," అనేవారు.

వాళ్ళకు కనీసపు సుఖాలుకూడా లేకపోయినా, వాళ్ళకు ఎప్పుడూ అలసట అనిపించేదికాదు. భగవాన్ వారిలో తనయొక్క సమత్వభావాన్ని జీర్ణించుకు పోయేట్లు చేశారు. (కష్టంలోనూ సుఖంలోనూ ఒకే విధంగా ఉండటము). ఎంతో గొప్ప మహాత్ములవలె. భగవాన్, తినడానికి సరిపడా భోజనం ఉన్నదా లేదా, అని ఎపుడూ పట్టించుకునే వారు కాదు. కానీ భగవాన్‌లోని గొప్పతనం ఏమిటంటే, తన శిష్యులకు కూడా ఆ 'తితీక్ష' అనే స్థితిని ప్రసాదించారు. (ఎటువంటి కష్టాన్నైనా భరించే ఓర్పును తితీక్ష అంటారు.) కుంజుస్వామి అన్నారు, "భగవాన్, మధురైనుండి పదహారేళ్ళ పాఠశాల విద్యార్థిగా ఉన్నపుడే వచ్చేశారు. ఆయనకు ఎక్కువగా పనిపాటలు, మెళకువలు నేర్చుకునే అవకాశం లేదు. అయినా ఆయన అరుదైన ప్రజ్ఞాపాటవాలు కలవారు. ఆయనకు పూలతో అందమైన దండలు ఎలా తయారుచెయ్యాలో తెలుసు. ఆకులతో విస్తర్లు తయారుచెయ్యటము తెలుసు. పాకశాస్త్రప్రావీణ్యం ఉంది. చాలారకాల వంటలు వండగలిగేవారు." భగవాన్ వీటినన్నిటినీ ఎక్కడ నేర్చుకున్నారోనని కుంజుస్వామికి ఆశ్చర్యంగా ఉండేది.

భక్తులు భిక్ష ఇవ్వటము మొదలుపెట్టినపుడు, ఆ రోజుల్లో అయిదు రూపాయల డబ్బు, కొన్ని బియ్యము, పప్పు, కూరగాయలు ఇచ్చేవారు. వారు పెట్టే షరతు ఏమిటంటే, భగవాన్, ఆ భిక్ష ఇచ్చిన వ్యక్తితోపాటు గిరిప్రదక్షిణ చెయ్యాలి. ఆశ్రమంలో ఉండే ఏడెనిమిది మందితోసహా ప్రతి ఒక్కరు. దీనికి ఇష్టపడేవారు. వారికి, భగవాన్‌తో కలసి గిరిప్రదక్షిణ చెయ్యడం అంటే, దైవంతో కలసి నడవడమే. కుంజుస్వామి ఒకసారి నాతో అన్నారు, "మేము మా స్నేహితులలో ఒకరితో కాని, ఒక మహాత్మునితోగాని నడుస్తున్నట్లు భావించే వారం కాదు. మానవ రూపం ధరించిన మహోన్నతమైన దైవంతోనే నడుస్తున్నామన్న భావనతో ఉండేవారము."

రమణాశ్రమంలో ఇప్పుడు ధ్యానానికి వాడే పాత హాలు, 1926 సం॥లో నిర్మించబడింది. కుంజుస్వామి, భగవాన్‌కు ఒక మంచాన్ని ఏర్పాటు చేయవచ్చని సంతోషించారు. కానీ భగవాన్ అందుకు ఇష్టపడలేదు. భగవాన్, "నేను రాతిపై నిద్రించటానికే ఇష్టపడతాను అన్నారు. శిష్యులు, ఒక కొత్త వెల్వెట్ (ముఖమల్) పరుపును లేదా మెత్తను దానిపై పరచినపుడు, భగవాన్ అన్నారు, "ఈ వెల్వెట్ మెత్త మీకు సంతోషాన్నీ, సుఖాన్నీ ఇస్తుందేమో కానీ, నాకది ముళ్ళపాన్పు వంటిది. నేను రాతిమీద

కూర్చోటానికే ఇష్టపడతాను. ఏదిఏమైనా భగవాన్‌కు ఒక మంచం అమరినందుకు కుంజుస్వామి, తాను చాలా సంతోషించానని చెప్పారు. ఇక్కడ కూడా భక్తులు, భగవాన్‌తోపాటు అదే హాలులో పడుకునేవారు.

రమణాశ్రమంలో కొన్ని కుక్కలు ఉండేవి. వాటివలన గొడవగా ఉంటుంది కాబట్టి, తమకెవ్వరికీ ఆ జంతువులంటే ఇష్టముండేదికాదని కుంజుస్వామి ఒప్పుకున్నారు. వారు నిద్రించేహాలునే, వంటగదిగాను, భోజనాల గదిగాను, వచ్చిన భక్తులు కూర్చునే హాలుగాను వాడేవారు. ఈ కుక్కలు కూడా అందులోనే ఉండేవి. భగవాన్‌కు, భక్తులలో కొందరికి ఆ కుక్కలంటే ఇష్టం ఉండదని తెలుసు. అందుకని భగవాన్ వాటిని తన మంచం కిందే నిద్రింప చేసేవారు. రాత్రిపూట వాటిని బయటకు తీసుకుని వెళ్ళి, తిరిగి తీసుకువచ్చి, వాటికిలా చెప్పేవారు, "మంచంక్రిందకు వెళ్ళండి. మీరు బయటనే ఉంటే మిగిలినవారికి కోపం వస్తుంది. లోపలికి వెళ్లండి," అనేవారు. భగవాన్ భక్తులతోపాటు తాను కూడా పనిచేసేవారు. ఆశ్రమంలోని పనులన్నీ, కూరగాయలు తరగటం, వంటచెయ్యడం, శుభ్రపరచటం, తోటపని, ఆఖరికి బేల్దారు పని (తాపీమేస్త్రీ పని), భగవాన్ కూడా చేసేవారు. ఆయన రాళ్ళు తెచ్చి, మట్టి, నీరు కలిసి, గోడలు కట్టడానికి సున్నాన్ని తయారుచేసేవారు. గురువుగారు కూడా తమతోపాటు పనిచేస్తుంటే, శిష్యులు రెట్టించిన ఉత్సాహంతోను, సంతోషంగాను పనిచేసేవారు.

ఒకరోజు భక్తుల మధ్యలో కూర్చుని ఉన్న భగవాన్, ఉన్నట్లుండి, కొండవైపుకు వెళ్ళారు. కుంజుస్వామి అన్నారు, "నేను చాలా ఆసక్తితో ఉన్నాను. భగవాన్ సాధారణంగా ముందుగా అనుకున్న పనులు తప్ప, ముందుగా అనుకోని పనులను చేసేవారుకాదు. ఎప్పుడైనా, అలా చేస్తే, దానికేదో ప్రాముఖ్యత ఉండేది. కుంజుస్వామి, తనను కూడా భగవాన్ రమ్మంటారేమోనని ఎదురుచూశారు. కానీ భగవాన్ ఒంటరిగానే వెళ్ళారు. కొంతదూరంనుండి భగవాన్ చుట్టూ కోతులుండడం గమనించారు. ఒక అరగంట దాటిన తర్వాత, ఏడ్చి, ఏడ్చి ఉబ్బిపోయిన కళ్ళతో వచ్చారు భగవాన్. మేము ఆందోళన చెంది, ఏమి జరిగిందని భగవాన్‌ను అడిగాము. ఈ కోతులు నా కొరకు స్కందాశ్రమంవద్ద వెతుకుతున్నవి. నేను స్కందాశ్రమం వదలిరాగానే, (వాటి జీవితాలను అపాయంలో పెట్టి) అవి ప్రాణాలకు తెగించి, కొండంతా నాకోసం వెదికాయి. కోతులు చిన్న రాజ్యాలు ఏర్పాటుచేసుకుని ఉంటాయి. అవి గనక వేరే రాజ్యపు సరిహద్దులో అడుగుపెడితే, ప్రత్యర్థి కోతులచేత చంపబడతాయి. ఈ కోతులు తమ ప్రాణాల్ని పణంగా పెట్టి, తమ పిల్లలతో సహా వచ్చాయి. నేను స్కందాశ్రమంలో లేకపోతే వాటికి వెలితిగా ఉందని, నన్ను అక్కడకు రమ్మని ప్రాధేయపడుతున్నాయి. నేను నా పరిస్థితిని వివరించి, వాటిని తిరిగి వెళ్ళమని కోరాను. అవి క్షేమంగా వెనుకకు చేరుకుంటాయని, వాటికి నేను హామీఇచ్చాను. వాటిని ఒప్పించడానికి చాలా సమయం పట్టింది. ఎప్పుడు ఈ సంఘటనను గూర్చి చెప్పినా, కుంజుస్వామి కన్నులనుండి ధారాపాతంగా కన్నీరు కారేది. దీనిని తలచుకుంటే, జంతువుల ప్రపంచంతో కూడా భగవాన్ ఎంతగా మమేకమయ్యారో ఆయనకూ, మనకూ కూడా కళ్ళకు కట్టినట్లు కన్పిస్తుంది. భగవాన్ తరచుగా అంటూండేవారు, "జంతువులకు, పక్షులకు, మనకు తేడా ఏముంది? పక్షులు పక్షి శరీరాన్ని ధరిస్తాయి. జంతువులు, జంతువుల శరీరాన్ని ధరిస్తాయి. మనము మానవ శరీరాన్ని ధరిస్తాము. మనమంతా వేరు వేరు చొక్కాలు ధరించినట్లుగా వేరు వేరు శరీరాలను ధరించాము కానీ, మనమంతా నిజానికి ఒకటే చైతన్యము అయి ఉన్నాము. కుంజుస్వామికి, జంతువులంటే ఇష్టము. ఆయన వాటితో భగవాన్ అనుబంధాన్ని గుర్తించారు. అందుకని ఆయన భగవాన్‌కు జంతువులతోటి, పక్షులతోటి ఉండే అనుబంధాన్ని వెల్లడించే కథలకు నిధివంటివారు.

రమణాశ్రమానికి వెళ్ళినట్లైతే మీరు నాలుగు జంతువులకు చెందిన నాలుగు సమాధులను చూస్తారు. భగవాన్, తాము మానవులను ఏ విధంగా చూస్తారో, జంతువులను కూడా అదే విధంగా, ఏమాత్రమూ తేడా లేకుండా చూచేవారు. తన తల్లికి ఎలా ముక్తిని ప్రసాదించారో, అదే విధంగా, ఒక జింకకు, ఒక కుక్కకు, ఒక కాకికి, ఒక ఆవుకు కూడా ముక్తిని ప్రసాదించారు. ఇవి కేవలం తెలిసిన సంఘటనలు. భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా, ఒక కోతిపిల్ల పుట్టీపుట్టగానే, కోతుల బృందమంతా కలిసి, ఆ కొత్తగా జన్మించిన కోతిపిల్లను, దాని వంటిమీద ఉన్న రక్తము ఇతర పదార్థాలతో సహా తీసుకుని వచ్చి, భగవాన్ ఒడిలోపెట్టేవి. భగవాన్ దానిని కడిగి శుభ్రం చేసి, దాని తల్లికి అందించేవారు. (కుంజుస్వామి, ఈ విషయాన్ని స్వయంగా చూచినట్లు నాతో చెప్పారు.) ఇది చాలా ప్రత్యేకత కల్గిన విషయం. ఎందుకంటే, మానవులెవరైనా కొత్తగా పుట్టిన కోతిపిల్లను గనుక తాకినట్లయితే, మొత్తం కోతుల గుంపంతా కలసి, దానిని వెలివేస్తాయి. ఆశ్రమంలోని

కుక్కపిల్లలు పుట్టేటప్పుడు కూడా, వాటికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసేవారు. ఉడుతలు వాటిలో అవి తగవులాడుకొని భగవాన్ వద్దకు వచ్చి ఫిర్యాదుచేసేవి. అప్పుడాయన వాటికి మధ్యవర్తిత్వం నెరపేవారు. పిల్లులు జబ్బుగా ఉన్నపుడు, వాటి పట్ల శ్రద్ధ తీసుకునేవారు. అక్కడొక పిల్లి ఒక కంటికి ఏదో జబ్బుతో ఉండేది. భగవాన్ ఒక తుండుగుడ్డను తన వద్ద ఉంచుకుని, ఆ కంటిని తుడిచి శుభ్రం చేసేవారు. దీనితో పక్కనున్న పరిచారకుడికి కోపంగా ఉండేది. ఆ పరిచారకుడి మనోభావాలను కూడా ఆయన గౌరవించి, ఆ తుండుగుడ్డను తనే స్వయంగా ఉతికేవారు.

భగవాన్ సామాన్యంగా ఎవరినీ ఏమీ అడిగేవారు కాదు. ఒకరోజు కొత్తగా వచ్చిన ఒక వ్యక్తి భగవాన్ సన్నిధిలో కూర్చుని ఉన్నారు. భగవాన్ ఆయన వంక చూసి, "ఈసారి మీరు వచ్చేటప్పుడు నాకు కొన్ని జీడిపప్పులు తీసుకొని వస్తారా దయచేసి?" అని అడిగారు. ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. భగవాన్ చాలా మొహమాటస్తులు. సాధారణంగా ఆయన తనంత తానుగా ముందుకు వచ్చి, కొత్తవారితో మాట్లాడేవారు కాదు. ఇక్కడ, చాలా అసాధారణంగా, ఆయన తనంతట తానుగా, నూతన వ్యక్తితో మాట్లాడడమే గాకుండా, దాదాపుగా ఆయనను తనకోసం ఏదో తెమ్మని అర్థించారు. త్వరలోనే అందరికీ కారణం తెలిసిపోయింది. అది ఉడుతల కొరకు. అవి జీడిపప్పులను రుచిమరిగి, వేరుశనగ పప్పులు తినేవి కావు. ఆశ్రమ యాజమాన్యం వేరే విధంగా తలపోసేది. "అవి కేవలం ఉడుతలు. వాటికి ఆకలి వేస్తే (కడుపుమాడితే) ఏమైనా తింటవి. మనము వాటికి వేరుశనగపప్పు వెయ్యవచ్చును." కాని అవి ఎన్నడూ వేరుశనగపప్పులను ముట్టుకునేవి కావు. ఆరు లేక ఏడు ఉడుతలు, భగవాన్ ఎదుట ఫిర్యాదుచేస్తూ నిలబడ్డాయి. అందుకే భగవాన్ అన్నారు, "అవి నన్ను బ్రతిమలాడుతూ మా ఆహారం ఎక్కడ? అని అడుగుతున్నవి," అప్పుడు రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్నది. జీడిపప్పుల ఉత్పత్తిని జాతీయం చేసినందున అవి మార్కెట్‌లో లభ్యమయ్యేవి కావు. ఆశ్రమం వంటగదిలో జీడిపప్పులు లేవు. స్టోరురూమ్ (వస్తువులు నిల్వచేసే గది)లో కొద్దిగా ఉన్నప్పటికీ, వంటవారు, వాటిని తమ వంటలలోకని జాగ్రత్త పరచుకున్నారు. భగవాన్ జీడిపప్పుల కోసం నాలుగు సార్లు కబురుపంపారు. కానీ వారు, "ఈ జీడిపప్పులు స్వీట్స్ తయారీకని ఉంచుకున్నాము. మేము వాటిని ఇవ్వము," అన్నారు. చివరకు భగవాన్ యొక్క అపారమైన కరుణ, ఈ అసాధారణ కట్టడిని అధిగమించింది. ఆయన ఆ వచ్చిన వ్యక్తిచేత ఉడతలకు జీడిపప్పులు తెప్పించేలా చేసింది. భగవాన్ తరచుగా, జీడిపప్పులను చిన్న ముక్కలుగా తుంచి, చిన్నపెట్టెలో పెడుతుండేవారు. ఆయన అడిగిన ఒకే ఒక వస్తువు ఉడతల కోసం జీడిపప్పు.

పాములు, నెమళ్ళు కూడా తరచుగా రమణాశ్రమానికి వస్తుండేవి. ఆ మహనీయుడు, తన చివరిక్షణాలలో కూడా, తన కరుణకు ఒక ఉదాహరణను మనకందచేశారు. తను శరీరాన్ని వదలబోయే ముందు పద్మాసనంలో కూర్చోబెట్టమని అడిగారు. ఒక తెల్లనెమలి బయట శబ్దం చేస్తోంది. అయిదు నిముషాల తర్వాత ఆయన కళ్ళు తెరచి అన్నారు, "ఆయనకు ఆకలిగా ఉంది. ఆహారాన్ని ఇవ్వండి," అని. (భారతదేశంలో జంతువులను, పక్షులను గురించి మాట్లాడేటప్పుడు, నపుంసకలింగమైన 'అది', 'ఇది' అనే మాటలు వాడతారు. కానీ భగవాన్ ఎల్లవేళలా వాటిని ఆయన, ఆమె అని సంబోధించే వారు. ఆయన చిట్టచివరిగా పలికిన వాక్యాల్లో ఇవి కొన్ని :'నెమలి గురించి') జంతువుల పట్ల, పక్షులపైన ఆయన కరుణ అపారమైనదని చెప్పటానికి కూడా వీల్లేదు. ఎందుకంటే ఆయనకా భేదం లేదు. అన్ని జీవులనూ ఒకే విధంగా చూసేవారు. మనము జంతువులూ, మానవులు పట్ల బేధదృష్టితో చూస్తున్నాము కనుక (మనము) భగవాన్‌కు జంతువులపట్ల గల ప్రేమను గొప్పదిగా భావిస్తున్నాము. భగవాన్ వాటిపట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరచటం గాదు, అన్ని జీవులపట్ల సమానమైన శ్రద్ధనే కనబరచేవారు.

దండపాణిస్వామి వంటవానిగా ఉండేవారు. భగవాన్ ఆయనకు సాయం చేస్తూ కావలసినవి అందించేవారు. దండపాణిస్వామి, ప్రతిరోజూ ఒక విధమైన ముళ్ళమొక్క తీసుకుని వచ్చేవారు. దానిని బాగా రుబ్బితే గానీ తినుటకు పనికిరాదు. భగవాన్ దానిని రోట్లో రుబ్బేవారు. అందువల్ల ఆయన కుడిచేతి వేళ్ళకి బొబ్బలు పొక్కేవి. భగవాన్ దానిని లక్ష్యపెట్టలేదు కానీ, అది కుంజుస్వామికి కోపం కలుగచేసింది. ఆయన దండపాణిస్వామి వద్దకు వెళ్ళి, "ఇకనుండి ఆ ముళ్ళమొక్కను తీసుకుని రావద్దు," అని చెప్పారు. "నేను ఇక్కడ వంటవాడిని. నా పనిలో నువ్వు జోక్యం చేసుకోవద్దు," అని దండపాణి స్వామి సమాధానమిచ్చారు. కుంజుస్వామి భగవాన్ వద్దకు వెళ్ళి, ఫిర్యాదు చేశారు. "భగవాన్, ఈ ముళ్ళ మొక్క మూలాన మీ

చేతులకు బొబ్బలెక్కుతున్నాయని, దానిని తేవద్దని చెప్పినా వినకుండా, దానిని తేవల్సిందే అని పట్టుబడుతున్నాడు. మీరు కనుక దానిని రుబ్బినట్లయితే నేను భోంచెయ్యను." మర్నాడు ఏమీ మార్పురాలేదు. అందుకని కుంజుస్వామి భోంచెయ్యడానికి నిరాకరించారు. భగవాన్ దానిని గమనించి అన్నారు, "ఎవరు ఏమిచెప్పినా, నేను వినవలసిందే అంటే, ఇక నాకు స్వేచ్ఛ ఎక్కడ ఉన్నది? వాళ్ళు చెప్పినట్లు నేను వినకపోతే వాళ్ళు మేము భోంచెయ్యము అంటారు. నాకు స్వేచ్ఛ ఏది?" కుంజుస్వామి బాగా బాధపడ్డారు. భగవాన్ ఆయనను ఎత్తిపొడవడం మొదలుపెట్టారు. "కుంజూ, నేను లేవవచ్చునా? నేను ఇప్పుడు భోంచేశాను." లేదా, "నేను లోనికి రావచ్చునా?" "నేను ఈ పుస్తకం చదువవచ్చునా? నీ అనుమతి తీసుకోకుండా చదివితే, నువ్వు భోంచెయ్యవుకదా!" "నేను బయటకు వెళ్ళవచ్చునా?" నేను కొండమీదకు వెళదామనుకుంటున్నాను. నేను వెళ్ళవచ్చునా? లేకుంటే నీవు భోంచెయ్యవు కదా!"

ఈ ధోరణి కుంజుస్వామిని కృంగదీసింది. మూడురోజులు దీనిని భరించిన తర్వాత ఆయన భగవాన్‌తో అన్నారు, "భగవాన్, నేను తిరుపతికి వెళ్తున్నాను. 6.30 గంటలకు నా బండి బయలుదేరుతుంది. తిరుపతి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక పుణ్యక్షేత్రము. అది తిరువణ్ణామలైనుండి దాదాపు నూరు మైళ్ళ దూరంలో ఉన్నది. భోజనాలైన తర్వాత, భగవాన్ ఉన్నట్లుండి అన్నారు, "నేను గిరిప్రదక్షిణకు వెళ్తున్నాను. అందరము కలసి వెళ్దాం. పదండి." రామకృష్ణస్వామి,కుంజుస్వామితో అన్నారు, "నీ రైలు ఆరున్నరకు గదా. మనందరం భగవాన్‌తో కలసి గిరిప్రదక్షిణకు వెళ్దాము. టౌన్ దగ్గరకు రాగానే నువ్వు వెళ్ళిపోయి రైలెక్క వచ్చును." కుంజుస్వామి దానికి ఒప్పుకొని, గిరిప్రదక్షిణ చెయ్యటానికి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుందామనుకున్నారు. కానీ భగవాన్ ఆరోజు ఎంతో నెమ్మదిగా నడచారు. ఎంత నెమ్మదిగా నడిచారంటే వారు టౌన్ పొలిమేరల వద్దకు వచ్చేటప్పటికి, ఆ రైలు కాస్తా వెళ్ళిపోయింది. భగవాన్ అన్నారు, "చూడు కుంజూ, నీ రైలు కదులుతున్నది. వెళ్ళు. వెళ్ళి ఎక్కు." ఆ తర్వాత ఆయన కుంజుస్వామిని ఓదార్చారు. "నీవు ఆశ్రమంలో పెట్టే ఆహారాన్నే తినలేవు. సాంబారు, రసమూ ఘాటుగా ఉన్నాయని వాటిలో నీళ్ళు కలుపుకుంటావు. ఆంధ్రాలో ప్రతి వంటకాన్నీ మిరపకాయలతో చేస్తారు. నువ్వు అక్కడ ఎలా తినగలవు?" కుంజుస్వామి భగవాన్ కాళ్ళకు సాష్టాంగపడ్డారు. ఆయన తర్వాత ఇలా అనుకున్నారు, నేను భగవాన్‌కు రాత్రింబవళ్ళు సేవచేసి, ఆయనకు చేరువగా ఉన్నందుకు, కొద్దిగా గర్వించాను. నేను అందరికంటే గొప్పవాణ్ణి ఎందుకంటే అందరికంటే నేనాయనకు దగ్గరగా ఉన్నాను కనుక. నేనాయన భక్తులలోను, సేవకులలోనూ గొప్పవాణ్ణి. భగవాన్ తన లీలతో, సహజంగా, చక్కగా నాకు చివాట్లు పెట్టారు.

రామకృష్ణస్వామికి వాసు అనే తమ్ముడు ఉండేవాడు. అతడు తిరువణ్ణామలైకు నాలుగువందల మైళ్ళ దూరాన ఒక కాలేజిలో చదువుతున్నాడు. వాసు ఒక హఠయోగిని అనుసరిస్తున్నాడనీ, ఆయన ఇతడికి భ్రూమధ్యంలో (కనుబొమ్మల మధ్య) దృష్టిని ఏకాగ్రపరచటం నేర్పించారనీ, రామకృష్ణస్వామికి ఇంటినుండీ లేఖ అందింది. వాసు ఎంత పట్టుదలగా దీనిని చేస్తున్నాడంటే, అతను దాదాపు పిచ్చివాడైపోయాడు. ఆయన ఏమీ తినలేరు, నిద్రించలేరు. ఆయన స్థితి దయనీయంగా ఉన్నది. దానిని నిలిపివేయమని కుటుంబ సభ్యులు సలహా ఇచ్చినా ఆయన పట్టించుకోరు. భగవాన్ వారి కుటుంబ సభ్యులనందరినీ ఎరుగుదురు. రామకృష్ణస్వామి, భగవాన్‌తో, "భగవాన్, నేను వెళ్ళినా అతను నా మాట వినిపించుకోడు," అన్నారు. అపుడు భగవాన్ అన్నారు, "కుంజూ, నువ్వు వెళ్ళి ఆ బోధ గురించి అతనికి వివరించిరా," అన్నారు. రామకృష్ణస్వామి వద్ద కుంజుస్వామికి ఇవ్వడానికి కేవలం అయిదు రూపాయలు మాత్రమే ఉన్నవి. అవి కేవలం రైలు టిక్కెట్టుకు మాత్రమే సరిపోతవి. కానీ దారిలో భోజనం చెయ్యటానికి డబ్బులుండవు. భగవాన్‌కు ఈ విషయం ఎలా చెప్పాలో వాళ్ళకు తెలియలేదు. చివరకు కుంజుస్వామి అన్నారు, "ఏమీ ఫర్వాలేదులే. భగవాన్ నన్ను వెళ్ళమన్నారు. అందుకని నేను వెళ్తాను. నేను ఆకలితో ఉన్నా ఫర్వాలేదు." ఆయన వెళ్ళవలసిన రైలు సాయంత్రం ఆరున్నర గంటలకు ఉన్నది.

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఒక భక్తుడు పూరీలు తీసుకుని వచ్చాడు. భగవాన్ చిన్నవైతే రెండూ, పెద్దవైతే ఒకపూరీ తినేవారు. భగవాన్ అందరికీ సమానంగా పంచాలనే వారు. అక్కడ ఒకే ఒక పూరీ ఉండి, అనేకమందికి ఇవ్వవలసి వస్తే, దాన్నే చిన్న ముక్కలుగా చేసి అందరికీ సమానంగా పంచేవారు. కానీ ఆ రోజున ఆయనకు హాలులో పూరీలు వడ్డిస్తే, ఒకటి వడ్డిస్తే చాలు అనలేదు. తెచ్చినవాళ్ళు రెండు వడ్డించి ఆగారు. తర్వాత మూడు, తర్వాత నాలుగు,

తర్వాత అయిదు, ఆరు అప్పుడు భగవాన్ చాలు అన్నారు. భగవాన్ ఆరు పూరీలను వేయనిచ్చినందుకు ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. ఆయన సామాన్యంగా ఒకటే తింటారు. ఆయన అయిదు పూరీలను నెమ్మదిగా, చక్కగా పొట్లం కట్టి కుంజుస్వామిని పిలిచారు. అప్పటికి కుంజుస్వామి తన సమస్య గురించి ఆయనకు చెప్పనేలేదు. గురువుగారు కరుణతో, ఆయనతో అన్నారు, "నీ దగ్గర కేవలము టికెట్టుకు మాత్రమే డబ్బు ఉన్నది. కానీ నువ్వు ఏమి తింటావు? దారిలో తినడానికి వీటిని తీసుకెళ్ళు," అని. దానితో కుంజుస్వామి ఎంతగా చలించిపోయారంటే, ఆ విషయం చెప్పిన ప్రతీసారీ, ఆయన ఏడ్చి, మా కళ్ళ వెంట కూడా నీరు తెప్పించేవారు. భగవాన్‌యొక్క సున్నితమైన, ప్రేమతో, శ్రద్ధతో కూడిన పనులు ఎంత చక్కగా ఉంటవి?

కుంజుస్వామి కూడా అంతే శ్రద్ధతో ఉండేవారు. తర్వాత రెండురోజులూ ఆయన నాలుగు పూరీలతోనే సరిపెట్టుకున్నారు. ఒక పూరీని ప్రసాదంగా అట్టే పెట్టారు. ఎందుకంటే, భగవానే స్వయంగా పొట్లంకట్టి ఇచ్చారు కదా! ఆయన ఈ ప్రసాదాన్ని రామకృష్ణ కుటుంబం కోసం తీసుకుని వెళ్ళి, ముందు వాసుకు తినిపించారు. తర్వాత ఆయన కొద్దిగా సమయం తీసుకుని వాసుని, అతని మార్గమైన హఠయోగంనుండి, భగవాన్ మార్గమైన ఆత్మాన్వేషణకు మార్చారు. అక్కడ కొద్దిరోజులుండి, వాసు పరిస్థితి మెరుగు పడడం గమనించి, ఆ తర్వాత ఆశ్రమానికి తిరిగివచ్చి ఆ విషయాన్ని భగవాన్‌కు విన్నవించారు. ఆయన ఆశ్రమానికి చేరేలోపే, వాసు హఠయోగ అభ్యాసాన్ని మానివేశాడనీ, భగవాన్ చెప్పిన పద్ధతిలో ధ్యానం చేస్తున్నాడనీ, వారి వద్దనుండి, ఆశ్రమానికి లేఖ వచ్చింది. వాసు తర్వాత సైన్యంలో జేరి, అందులో పెద్ద ఉన్నతాధికారి అయ్యారు. ఆయన సైన్యంలో పదవీ విరమణ చేసిన తర్వాత, నేను ఆయనను కలిశాను. ఆయన పొడుగ్గా, దృఢంగా ఉండే ఆరడుగుల వ్యక్తి. కానీ ఆయన హృదయం మాత్రం కపటంలేని సున్నితమైనది. ఆ చిన్న ముక్క పూరీ ప్రసాదానికీ, ఆత్మాన్వేషణకూ నా ధన్యవాదాలు.

కుంజుస్వామి అనేక కథలు చెబుతుండేవారు. అప్పట్లో, తిరువణ్ణామలైలో కందస్వామి అనే వ్యక్తి ఉండేవారు. ఆయన ఒక హంతకుడు. అందరూ ఆయనను అసహ్యించుకునే వారు. ఒకరోజున అతడు, తీవ్రంగా జబ్బుపడ్డాడు. ఆయనను ప్రజలు, టౌన్‌నుండి బయటకు నెట్టివేశారు. అతనికి రమణాశ్రమం ఎదురుగా ఉన్న మండపమొకటే తలదాచుకోవడానికి దిక్కు అయింది. అతడక్కడ ఉండి, భగవాన్‌కు తనకు ఆకలిగా ఉన్నదని కబురుచేశారు. భగవాన్ గంజికాచి ఆయనకు పంపేవారు. ఈ కథలో ముందుకు వెళ్ళే ముందు, భగవాన్ ఎప్పుడూ ఎవ్వరినీ అసహ్యించుకుంటూ, తృణీకరిస్తూ మాట్లాడేవారు కాదు, అని తెలుసుకోవాలి. భగవాన్ ఎప్పుడైనా ఎవరి మరణవార్తనైనా విన్నట్లైతే, అతడు లేక ఆమె ఎంత మంచివారు, అనేవారు. ఆ వ్యక్తికి వందలాది దుర్గుణాలు, కేవలం కొద్దిగా మాత్రమే సద్గుణాలు ఉన్నా సరే, ఆ సద్గుణాలపైనే దృష్టిపెట్టేవారు. ఆ కందస్వామి చనిపోయాడని విన్నపుడు, ఆయన భక్తులు, ఈ నీచాతినీచమైన వ్యక్తిలో భగవాన్‌కు ఒక్క సుగుణం కూడా దొరకదు పొగడటానికి అనుకున్నారు. వాళ్ళు కావాలనే వెళ్ళి భగవాన్‌కు కందస్వామి చనిపోయాడని చెప్పారు. "ఓ కందస్వామి చనిపోయాడా? ఆయన, సబ్బుకానీ, శీకాయపొడి కానీ లేకున్నా, తన శరీరాన్నీ దుస్తులనూ చాలా పరిశుభ్రంగా ఉంచుకునేవారు. ఆయన స్నానం చేసి, గంటలకొద్దీ తన ధోవతిని ఉతుక్కుని, దానిని మచ్చలేకుండా పరిశుభ్రంగా ఉంచుకునేవారు," అన్నారు. భక్తులందరూ ముక్తకంఠంతో భగవాన్ మేమంతా ఓడిపోయాము అన్నారు. భగవాన్, "ఏమి జరిగింది?" అన్నారు. "మేము మీకు కూడా ఈ వ్యక్తిలో ఒక్క సుగణమూ దొరకదు. వెదికినా అనుకున్నాము. కానీ మేము ఓడిపొయ్యాము. మీరు మమ్ములను ఓడించారు," అన్నారు.

భగవాన్‌యొక్క హాస్యాన్ని గురించికూడా కుంజుస్వామి అనేక ఉదంతాలు చెబుతారు. ఉత్తరాలు రాగానే, హాలులోనికి తీసుకెళ్ళి భగవాన్‌కు అందించబడేవి. భగవాన్ ఆ ఉత్తరాలను చదువుతున్నపుడు, భక్తులు ఆయన ముఖ కవళికలను గమనిస్తుండేవారు. ఆయన హావభావాల్నిబట్టి, ఉత్తరంలో ఏదైనా విశేషముంటే తెలిసిపోయేది. ఒకసారి భగవాన్ ఒక పోస్టుకార్డు చదివి ప్రక్కనుంచేశారు కానీ, ఆయన చిరునవ్వు ఆయనను పట్టించేసింది. కుంజుస్వామి, ధైర్యంచేసి అడిగారు, "మీరు ఆ కార్డులో ఏదో విశేషమైన విషయాన్ని చదివారని నాకర్థమైంది. మీరు దయచేసి అదేదో మాకు కూడా చెబుతారా?" అక్కడ అప్పుడు ఆరు లేక ఏడుగురు భక్తులున్నారు. భగవాన్ చిరునవ్వుతో అన్నారు. సాధారణ గృహస్థులు చనిపోయే వరకే

వారి దేహాలపై మమకారాన్ని ఉంచుకుంటారు, కానీ కొంతమంది సన్యాసులు, సాధువులు, ఎవరైతే అన్ని ప్రాపంచిక సుఖాలనూ త్యజించామనుకుంటారో, వారికి చనిపోయిన తర్వాత గూడా, తమ దేహాలపై మమకారం ఉంటుంది." వినేవాళ్ళకు ఏమీ అర్థంకాలేదు. భగవాన్ చెప్పారు. ఈ పోస్టుకార్డు ఎనిబది ఏళ్ళ సన్యాసినుండి వచ్చింది. "నేను ఏ రోజునైనా మరణించవచ్చును. నా శరీరాన్ని సమాధిలో ఉంచి, చక్కగా సమాధిని నిర్మించాలి గనుక దయచేసి నాకు విరాళాలు పంపండి," అని వ్రాశారు ఆయన.

1930లలో (దశకంలో) భగవాన్ ఏబది ఏళ్ళ వయసులో ఉన్నపుడు, తొంభై సంవత్సరాలకు పైబడిన వృద్ధుడొకరు భగవాన్ వద్దకు వచ్చారు. ఆయన ఎంతో పవిత్రంగా కన్పిస్తున్నారు. అనేకసార్లు దుఃఖిస్తూ భగవాన్ పాదాలకు సాష్టాంగపడ్డారు." భగవాన్ నాదొక్కటే ప్రార్థన," అన్నారు. భగవాన్ మామూలుగానే ఏమీ మాట్లాడకుండా ఆయనవైపు చూశారు. ఆ వృద్ధుడు అన్నారు, "భగవాన్, మీరు నూరేళ్ళు బ్రతకాలి. మీరు నూరేళ్ళు బ్రతకడం నేను చూడాలి." ఆయన ప్రార్థన విని అక్కడున్న వారందరూ చలించిపోయారు. అది దరిదాపుగా భగవాన్ నూరేండ్లు జీవించాలని దీవించినట్లుగా ఉన్నది చూడడానికి, భగవాన్ తన నవ్వును దాచుకున్నారు. కుంజుస్వామి సహజంగా హాస్యప్రియుడు కనుక, భగవాన్ దీన్నిగురించి చమత్కారంగా మాట్లాడతారని అనుకొన్నారు. ఒక గంట తర్వాత, ఆ ముసలాయన వెళ్ళిపోయిన తర్వాత కుంజుస్వామి భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్ మీరు చిరునవ్వు నవ్వటం నేను గమనించాను. కారణమేమిటి?" అన్నారు. భగవాన్ అన్నారు, "మీరంతా చలించిపోయారు కదా, ఆయన నేను వంద ఏళ్ళు బ్రతకాలని కోరుకున్నారని." ఆయన అడిగినదానికి అర్థమేమిటో మీకు తెలుసునా? తను నూట నలభై ఏళ్ళు జీవించాలని, ఎందుకంటే, మీరు నూరేళ్ళు బ్రతకడం నేను చూడాలి అన్నారు కదా."

వేదాంతంలోని వివిధ శాఖలకు చెందిన భక్తులు కుంజుస్వామిని వివిధ రకాల ప్రశ్నలు వేసినపుడు, తన వద్ద వాటికి సమాధానాలు లేవని ఆయనకు తెలిసింది. తమిళనాడునుండి చాలామంది, శైవసిద్ధాంతాన్ని అనుసరించే జనులు, ఆయనను ప్రశ్నలతో ముంచివేసేవారు. అక్కడ శైవసిద్ధాంతం మీద తరగతులు నిర్వహించే మఠం ఒకటి ఉన్నది. అందుకని ఆ తరగతులకు వెళ్ళి దానిని నేర్చుకోవాలనుకున్నారు కుంజుస్వామి. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్! నేను శైవసిద్ధాంతాన్ని నేర్చుకోవడానికి ఫలానాచోటుకి వెళ్తున్నాను," అన్నారు. "ఓ, ఎందుకు?" అన్నారు భగవాన్. "జనులు ఇక్కడకు వచ్చినపుడు వాళ్ళకు అనేక ప్రశ్నలు (సందేహాలు) ఉంటున్నవి. నేను గనుక దానిని గూర్చి తెలుసుకుంటే వారి ప్రశ్నలకు సమాధానమివ్వ వచ్చును," అని అన్నారు కుంజుస్వామి. "ఓ! అది చాలా బాగుంది. కాబట్టి ఇతరుల ప్రశ్నలకు సమాధానమివ్వటం కోసం, నువ్వు శైవసిద్ధాంతాన్ని నేర్చుకుంటావన్నమాట. సరే ఇంకెవరైనా వచ్చి అద్వైత వేదాంతం మీద ప్రశ్నలడిగితే, అప్పుడు నువ్వేమి చేస్తావు? నువ్వు వెళ్ళి అద్వైత సిద్ధాంతాన్ని నేర్చుకుంటావు. ఎవరైనా వచ్చి నీతో సంస్కృతంలో మాట్లాడితే నువ్వేమి చేస్తావు? నువ్వు వెళ్ళి సంస్కృతం నేర్చుకుంటావు. పాశ్చాత్యులు వచ్చి నీతో ఇంగ్లీషులో మాట్లాడితే, నువ్వేమి చేస్తావు? అప్పుడు నువ్వెళ్ళి ఇంగ్లీషు కూడా నేర్చుకుంటావా?" అప్పటికి కుంజుస్వామికి అర్థమయింది. భగవాన్ తనకాలు పట్టుకుని లాగుతున్నారని. (తనను వెర్రివెంగళాయిని చేస్తున్నారని) ఆయన తడబడుతూ అన్నారు, "భగవాన్ దయచేసి నన్ను క్షమించండి. నేనెక్కడకూ వెళ్ళబోవటములేదు. మీరు నాకు బోధించండి. ప్రేమచేతనే, నేను ఇతరులకు సాయంచెయ్యాలనుకున్నాను. భగవాన్ ఆయనపై అనుగ్రహ వీక్షణాన్ని ప్రసాదించి అన్నారు, "నువ్వుగనుక హృదయంలో 'నేను'గా నిలచిపోతే, నిన్ను అడిగిన ఏ ప్రశ్నలకైనా, సమాధానాలు వాటంతటికవే ప్రతిధ్వనిలాగా లోపలనుండే స్ఫురిస్తాయి. అవి తప్పక సరియైన సమాధానాలయి ఉంటవి. నీ హృదయంలో 'అహం' (నేను) గా నిలచిపోవడం నేర్చుకో."

వేరొక సంఘటనలో, ఒక కొంతమంది గ్రూపుగా వచ్చి ఆశ్రమ యాజమాన్యాన్ని ఇబ్బంది పెడుతున్నారు. అపుడే కుంజుస్వామి, పాతహాలులోనికి రావడం జరిగింది. అందరూ అక్కడ నించుని ఉన్నారు కాబట్టి, తను కూడా అక్కడే నుంచున్నారు. భగవాన్ ఆయనను చూసి, "నీకిక్కడ ఏమి పని?నువ్వు ఎందుకు ఈ జనంతో కలిశావు?" అన్నారు. కుంజుస్వామికి ఏమని చెప్పాలో తెలియలేదు. ఆ గుంపుతో కలవడానికి ఆయన రాలేదు. భగవాన్ మళ్ళీ అడిగారు, "ఏ ఉద్దేశంతో వచ్చావు నువ్వు?" "భగవాన్, నేను మీ అనుగ్రహం పొందడానికి వచ్చాను," అన్నారు కుంజుస్వామి. గురువుగారు కోప్పడ్డారు. "అయితే వచ్చిన పని చూసుకో, ఇక్కడెందుకు నుంచున్నావు?" ఆరోజు భగవాన్ ఆయనకు నేర్పిన పాఠం ఏమిటంటే,

మనం ఏ ఉద్దేశంతో ఇక్కడకు వచ్చామో దానికే అంకితమై ఉండాలి. మనం సత్యాన్ని గుర్తించడానికి వచ్చాము. అది కేవలం కుంజుస్వామి కోసం భగవాన్ చెప్పలేదు. ప్రతి ఒక్కరికోసం చెప్పారు. ఇది భగవాన్ యొక్క ప్రత్యక్షబోధ. మనము ఇతరుల విషయాలలో జోక్యము చేసుకోరాదు, అనేది గొప్ప బోధ, ఆచరణలో పెట్టవలసినది.

1932వ సం॥లో భగవాన్‌కు పగలు, రాత్రి పన్నెండేళ్ళ పాటు సేవ చేసిన తర్వాత, కుంజుస్వామి ఆశ్రమానికి దూరంగా ఉండి, ఆత్మాన్వేషణను తీవ్రంగా జరపాలనుకున్నారు. ఆయన మాధవస్వామి అనే యువకునకు, భగవాన్‌కు ఎలా పరిచర్యచేయాలో తర్ఫీదునిచ్చారు. తను సేవలోనుండి విరమించుకుంటున్నాననీ, పక్క ఆవరణలో (పల్లాకొత్తు) ఉండబోతున్నానని, చెప్పటానికై వేచి ఉన్నారు. ఈ విషయాన్ని గురువుగారికి ఎలా చెప్పాలో తెలియక తటపటాయిస్తున్నారు. ఆయన ఈ సందిగ్ధంలో ఉండగానే, ఒకరోజు ఆయన హాలులోనికి ప్రవేశించినపుడు, భగవాన్ అక్కడున్నవారికి, తనకు నిజమైన సేవ చెయ్యటమంటే తన భౌతిక అవసరాలను తీర్చడంకాదు, తన బోధలను ఆచరణలో పెట్టటమే అని చెబుతున్నారు. అంతకు ముందు కూడా ఒకసారి ఆయన అన్నారు. నేను గురువుగారికి వ్యక్తి గత సేవ చేస్తున్నాను అంటే వచ్చే లాభమేమి లేదు. ప్రతిరోజూ గురువుబోధకు అంటిపెట్టుకుని ఉండాలి. కొన్నిరోజుల తర్వాత, భగవాన్, "శుద్ధమైన మనోవాక్కాయ కర్మల ద్వారా, ఆత్మాన్వేషణ, విచారణ, ధ్యానము, ఇతర ఆధ్యాత్మిక సాధనలూ (నిరంతరము) చేస్తూ ఉండడమే, గురువుకు చెయ్యగలిగిన గొప్పసేవ. ఆయన చాలా రోజులనుండి భగవాన్‌తో ఆ విషయాన్ని చెప్పాలని అవకాశం కోసం, ఉదయమూ, సాయంత్రమూ చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. కానీ భగవాన్ తనంతట తానే విషయాన్ని గ్రహించి తగు సమాధానమిచ్చారు. మరొకరోజు ఆయన హాలులోనికి వెళ్ళేసరికి, భగవాన్ కైవల్యనవనీతంనుండి, కొన్ని వాక్యాలను ఉటంకిస్తున్నారు. అందులో శిష్యుడు, గురువుగారిని, "మీరు నాపై చూపిన అనుగ్రహానికి బదులుగా, నేను ఏమిచ్చి మీ ఋణం తీర్చుకొనగలను?" అని అడుగుతారు. దానికి గురువుగారు, "శిష్యుడు గురువుగారికివ్వగలిగిన గొప్ప బహుమతి, అడ్డంకుల వలన, బాహ్య ఆకర్షణ వలన ఏమీ చలించకుండ, తన హృదయంలో స్థిరంగా నిలచి యుండడమే," అంటారు. కుంజుస్వామికి, దీనితో ధైర్యం వచ్చింది. ఆయన భగవాన్ ముందు సాష్టాంగపడి, "భగవాన్! నేను పల్లాకొత్తుకు వెళ్ళి ఆత్మ విచారణ అభ్యాసం చెయ్యాలనుకుంటున్నాను అన్నారు. భగవాన్ సంతోషంతోనూ, ఆశ్చర్యంతోనూ అన్నారు, "మనస్సును, విచారణ, ధ్యానము, జపము, పారాయణ మీద ఏకాగ్రపరిస్తే సరిపోతుంది. (విచారణ అంటే నేనెవరిని? అని అన్వేషించుట, జపము అంటే మంత్రాన్ని ఉచ్ఛరించుట, పారాయణ అంటే అదేపనిగా, ఏ కోరికలూ లేకుండా, గురువుగారి రచనలను పాడుకోవడం"). కుంజుస్వామి మరల భగవాన్‌కు సాష్టాంగపడి, "భగవాన్ దయచేసి నన్ను అనుగ్రహించండి. నేను మీనుండి దూరంగా ఒంటరిగా ఉండటానికి వెళ్తున్నాను. నాకు మార్గాన్ని చూపండి. భగవాన్ ఆయన వైపు అనుగ్రహ పూర్వకంగా చూసి, ఈ చక్కని మాటలు చెప్పారు. "ఆత్మవిచారణే నీ అంతిమ ధ్యేయంగా పెట్టుకో. కానీ ధ్యానము, జపము, పారాయణ కూడా చేస్తూ ఉండు. వాటిని ఎడతెరపి లేకుండా, ఎల్లప్పుడూ చేస్తూనే ఉండు. నీకు ధ్యానము విసుగనిపిస్తే, జపము చెయ్యి, జపము విసుగనిపిస్తే ఆత్మవిచారణ చెయ్యి. అది విసుగనిపిస్తే, పద్యాలు పాడుకో పారాయణం చెయ్యి. వాటి మధ్యలో ఏమాత్రం ఖాళీరానివ్వవద్దు. నీపని నుండి మనస్సును, వేరే వాటి మీదకు వెళ్ళనివ్వకు. దీనిని హృదయపూర్వకంగా ఆచరణలో పెట్టు, చివరకు నువ్వు ఆత్మవిచారణలో స్థిరపడి, ఆత్మసాక్షాత్కారాన్ని పొందుతావు. ఇది కేవలం కుంజుస్వామికి మాత్రమే కాదు, ప్రతి సాధకునికీ, గురువుగారిచ్చిన హామీ. గట్టి నమ్మకంతో ఉండండి. ఆత్మవిచారణ మిమ్ములను, సత్యంలో స్థిరంగా ఉంచుతుంది. (ఇప్పటికే మీరు సత్యమై ఉన్నారు)

కుంజుస్వామి పల్లాకొత్తులో ఒక చిన్న గుడిసెలో ఉండేవారు. ఆయన డబ్బు సంపాదించే వారు కాదు. యాచించే వారు కాదు. ఆయనవద్ద ఉన్న సరుకులన్నీ అయిపోయినవి. తింటానికి తిండి లేదు. భగవాన్ మధ్యాహ్న భోజనానంతరము, పల్లాకొత్తుకు వచ్చి, అక్కడున్న చిన్న కోనేరు చుట్టూ నడుస్తూండే వారు. ఆయన తప్పక కుంజుస్వామిని కలసి, "నువ్వు ఏమి చేస్తున్నావు? నువ్వు ధ్యానం చేస్తున్నావా? నీవు ఆత్మవిచారణ జరుపుతున్నావా? " అని అడిగేవారు. భౌతికమైన సమస్యల గురించి గురువుగారికి చెప్పడం, ఉచితం కాదని, కుంజుస్వామి తన పరిస్థితిని గూర్చి భగవాన్‌కు చెప్పేవారు కాదు. ఆయనకు ఇప్పటికే తెలిసి ఉండదా? అనుకునేవారు. కుంజుస్వామి పల్లాకొత్తుకు మారిన మూడవరోజున, ఒక సంపన్న

భక్తుడు, వచ్చి భగవాన్‌కు నమస్కరించారు. ఆయన కుంజుస్వామికి స్నేహితుడు. అందుకని భగవాన్ అన్నారు, “ఓ, నీవు నీ స్నేహితుడిని చూడాలని వచ్చావా?” ఆయన బదులిచ్చారు, “అవును భగవాన్. నేను నిన్న రోజంతా పనిచేసి అలసిపోయి గాఢంగా నిద్రపోయాను. మీరు నా కలలోకి వచ్చి నీ స్నేహితుడు మూడురోజులుగా అక్కడ ఆకలితో అలమటిస్తుంటే, నువ్విక్కడ ప్రశాంతంగా నిద్రపోతున్నావా?” అన్నారు. అందుకని నేను వెంటనే లేచి రైలు ఎక్కి ఇక్కడకు వచ్చేశాను. “వెళ్ళి నీ స్నేహితుడిని కలువు”, అని చెప్పారు భగవాన్. ఆయన కుంజుస్వామిని కలసినప్పుడు, కుంజుస్వామి నిజంగానే గత మూడురోజులుగా ఏమీ తినలేదని, ఆయన పూరిగుడిసెలో ఏ విధమైన సరుకులూ లేవని గుర్తించారు. ఆయన కుంజుస్వామికి సరుకులు కొనుక్కోవడానికి కొంత డబ్బిచ్చి, భోజనం పెట్టించారు. అతను వెంటనే వెళ్ళవలసి ఉన్నప్పటికీ, భగవాన్ సన్నిధికి వెళ్ళి, “భగవాన్ నేను ఆయనను భోజనం లేకుండా పస్తులుంచను. నేను ఆయనకు ప్రతి నెలా అయిదు రూపాయలు పంపిస్తాను.” అని మాట ఇచ్చారు. ఆ రోజులలో అయిదు రూపాయలంటే, ఒక్కరి అవసరాలకు ఎక్కువగా సరిపోయేవి. కుంజుస్వామి అన్నారు, “నావద్ద ఏమీ లేవు. గిన్నెలు, వంటపాత్రలు ఏమీ లేవు. మరొక స్నేహితుడు ఇదిచూసి, వెంటనే ఒక స్టౌ, కొన్ని సరుకులు కొని ఇచ్చారు. కొన్ని సంవత్సరాల తర్వాత గౌండర్ కుంజుస్వామికి ఆశ్రమం ఎదురుగా, ఒక ఇల్లు కూడా కట్టించారు. కుంజుస్వామి కన్నీటితో ఈ మాటలు చెబుతుండేవారు. “నువ్వు నీ గురువుకు శరణాగతి చెందిన తర్వాత, అంటే సత్యానికి శరణాగతి చెందిన తర్వాత, ఏ విషయం కోసమూ ఆయనను ప్రార్థించాలని ప్రయాస పడవద్దు. ఆయనకు అన్నీ తెలుసు. దాని టైము వచ్చినపుడు అదే జరిగిపోతుంది.”

కుంజుస్వామి పల్లాకొత్తులో ఉండే రోజులలో, రమణాశ్రమము వేగంగా అభివృద్ధి చెందింది. చాలామంది సందర్శకులు ఆశ్రమానికి రావడం మొదలుపెట్టారు. కుంజుస్వామికి ప్రతిరోజూ భగవాన్ తనతో కనీసం, ఒక వాక్యమైనా మాట్లాడాలని ఉండేది. భగవాన్‌కు తీరిక లేక, అది చాలా కష్టతరమవ సాగింది. కుంజుస్వామి సంబరంతో గుర్తుకు తెచ్చుకున్నారు, “నేను చాలా తెలివి కలవాణ్ణి. ప్రతి రోజూ సాయంత్రం భగవాన్ సంపూర్ణ రచనల సంగ్రహంలోని తమిళ పద్యాలను పారాయణ చేసేవాళ్ళము. నేను కావాలనే ఒక వాక్యాన్ని వదలివేసే వాణ్ణి. వెంటనే భగవాన్, “ఏయ్, కుంజూ నువ్వు ఒక వాక్యాన్ని వదలివేశావు,” అనేవారు. లేదా ఒక మాటను తప్పుగా ఉచ్చరించే వాణ్ణి కావాలని. “అలాకాదు కుంజూ, దానిని సరిగా ఉచ్చరించు అనేవారు.” ఆయన నాతో మాట్లాడినందుకు ఎంతో సంతోషించేవాడిని. నాతో భగవాన్‌మాట్లాడాలని నేను కోరుకున్నప్పుడల్లా, ఆ కిటుకు ప్రయోగించేవాణ్ణి.

రమణమహర్షి 'సంపూర్ణ రచనలు' తమిళంలో పుస్తకరూపంలో అచ్చు అయినపుడు దురదృష్టవశాత్తు చాలామంది సాధువులు ఆశ్రమంనుండి ఆ పుస్తకం కొనుక్కోలేక పోయారు. అందుకని భగవాన్ ఒక భక్తునితో చెప్పి దానిని ఒక నోటు పుస్తకంలో చూచి వ్రాయించి (కాపీ చేయించి), కుంజుస్వామికి ఇప్పించారు. ఒక చిన్న భగవాన్ ఫోటో ప్రింటయిన కాగితం దానిలో అంటించారు. తన నోటు పుస్తకంలో అరుణాచలుడి బొమ్మ కూడా ఉంటే బాగుంటుందని కుంజు అనుకున్నారు. కానీ అది ఆయనకెక్కడా లభ్యమవలేదు. ఇంకా దానిని గూర్చి ఆలోచిస్తుండగానే, భగవాన్ ఆయనను పిలచి, “కుంజూ, నీ నోటు పుస్తకం తీసుకొనిరా, ” అన్నారు. ఆయన దానిపై అరుణాచలుని బొమ్మని గీశారు. కుంజుస్వామి ఆ నోటుపుస్తకాన్ని అనురాధ అనే భక్తురాలికి గుర్తుగా ఇచ్చారు. దానిలో భగవాన్ చేతి వ్రాత. ఆయన వేసిన అరుణాచలుని బొమ్మ ఉన్నవి. ఆమె ఇప్పుడా విలువైన వస్తువులను, ఆశ్రమంలోని పురాతన వ్రాతప్రతుల కేంద్రానికి అప్పజెప్పారు.

భగవాన్ తానువ్రాసిన పుస్తకాలన్నిటికీ ప్రూఫ్‌లు తనే సరిదిద్దేవారు. ఆయన రెండు సెట్లు ప్రూఫ్‌లు కావాలనే వారు. ఒకదానిని సరిదిద్ది ప్రెస్‌కు పంపేవారు. రెండవ దానిని తాను ఉంచుకునేవారు. అప్పుడు చాలా తప్పులు దొర్లేవి. అదే ప్రూఫ్‌ను మరల మరల సరిదిద్ది ప్రెస్‌కు పంపవలసి వచ్చేది. ఇలా నాలుగు లేక అయిదుసార్లు ప్రూఫ్‌లు దిద్దవలసి వచ్చేది. భగవాన్ ప్రతి ప్రూఫ్‌కాపీను, జాగ్రత్తగా అట్టిపెట్టి చివరకు నాలుగైదు కాపీలను బైండింగ్ చేసి పంచిపెట్టేవారు. ఆయన ఎక్కువ తప్పులున్న కాపీని తానుంచుకుని, మిగిలిన వాటిని కుంజుస్వామికి, ఇంకా పుస్తకాలను కొనుక్కోలేని వారికి ఇచ్చేవారు. ఇంత దయ, కరుణ కల్గినవారు భగవాన్.

ఒకప్పుడు కుంజుస్వామి ధ్యానముగాని, విచారణగానీ, వరుసగా, అన్ని వేళలా, చెయ్యలేకపోతున్నట్లు అనుకున్నారు. ఆయన భగవాన్ ఎదుట ఒప్పుకున్నారు. "భగవాన్ నేను అదేపనిగా వదలకుండా సాధన చెయ్యలేకపోతున్నాను. మధ్యలో అంతరాయం కల్గుతున్నది". భగవాన్ అన్నారు, "దానికేముంది? అది చాలా తేలిక. నువ్వు నిద్రపోయే ముందు ధ్యానం చేసి హృదయంలోనికి వెళ్ళు. అపుడు నీ నిద్ర సమయమంతా హృదయంలో దృష్టి నిలిపిన ధ్యానం లానే అవుతుంది. తెల్లవారి నువ్వు లేచిన క్షణాన్నే ధ్యానంలోకి వెళ్ళి హృదయంలో నిలువు కొన్ని నిముషాలపాటు. అపుడు నీవు మేల్కొని ఉన్నంతసేపు, హృదయంలో నిలచి ఉండడమనేది అంతర్వాహినిగా ఉంటుంది, నువ్వు పనిచేస్తున్నా, వాదిస్తున్నా, ఆఖరికి పోట్లాడుతున్నా కూడా. ఈ ఆధారము ఎప్పుడూ నిన్ను హృదయంలోనే నిలిపి ఉంచుతుంది. కుంజుస్వామి అన్నారు, "ఇది భగవాన్‌నుండి నాకు లభించిన, అత్యంత సుందరమైన, ఆచరణ యోగ్యమైన బోధ."

భగవాన్ అంతిమ దినాలలో, ఆశ్రమ యాజమాన్యము చాలా సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. భక్తులు వాళ్ళ కార్యక్రమాలను ఎలా కొనసాగించాలో తెలియకుండా ఉన్నారు. కావున కుంజుస్వామిని వెంటపెట్టుకుని వారు భగవాన్ వద్దకు వెళ్ళారు. భగవాన్ వారితో ఇలా అన్నారు, "ఆశ్రమ యాజమాన్యం ఇప్పుడెలా జరుగుతుందని అనుకుంటున్నారు? మీరుగానీ, ఇతరులెవరైనాగానీ దానిని నిర్వహిస్తున్నా రనుకుంటున్నారా? ఒక సర్వోత్కృష్టమైన శక్తి దీనిని నిర్వహిస్తున్నది. అదే శక్తి ఇకముందు కూడా నిర్వహించుతుంది." భగవాన్ శరీరాన్ని వదిలేముందు, భక్తులు మరలా ఆయన సందేశమును కోరారు. "మీ భక్తులమైన మేము ఏమి చెయ్యాలి?" అని వారు ఆందోళన చెదారు. కుంజుస్వామి, ఇంకా ఇరవైమంది భక్తులు, భగవాన్ వద్దకు వెళ్ళి ప్రార్థించారు, "భగవాన్ మాకు మార్గం చూపండి," అని. అప్పుడాయన తన చివరి సందేశాన్ని ఇచ్చారు, "బోధలను ఆచరణలో పెట్టండి," అని. అది ఆ ఇరవైమందికేగాదు. మనకందరికీ గూడ వర్తిస్తుంది. ఆయన మనల్ని గురువుగారి కథలతో ఆనందపరుస్తారు. నేను మీకు చెప్తున్నవన్నీ కుంజుస్వామి ప్రసాదమే. ఇతర భక్తుల గురించిన జ్ఞాపకాలనూ, వారితో భగవాన్‌కు గల అనుబంధాన్ని, కోతులతోనూ, జంతువులతోనూ, చెట్లు, మొక్కలు, కొండ, దాని రాళ్ళతోనూ, దాని ఇసుకతోనూ భగవాన్‌కు గల అందమైన అనుబంధాన్ని, ఇలా ఎంతో విలువైన సమాచారాన్ని మనకందించారు కుంజుస్వామి. మనమంతా కుంజుస్వామి పట్ల ఎంతో కృతజ్ఞతతో ఉన్నాము. ఆయన నాపట్ల చూపిన ఆదరాన్ని నేనెన్నటికీ మరువలేను.నేను చాడ్విక్ పూర్వమున్న పాత గదిని కుంజుస్వామికి ఇచ్చాను. నేను పెద్దవాడినయినప్పటికీ, ఆశ్రమంలో బాధ్యతగల పదవిలో ఉన్నప్పటికీ, ఆయన నన్ను చిన్న పిల్లవాడిగానే చూసేవారు. ఆయనకంత దయ.

ఆయన భౌతికంగా చాలా బాధలో నున్నందువల్ల, ఆయనకు నేను ఇద్దరు పరిచారకులను ఏర్పాటుచేశాను. వాళ్ళిద్దరూ, వాళ్ళ విధులను చాలా బాగానే చేసినప్పటికీ, కొన్నిసార్లు పెద్ద తప్పులనే చేసేవారు. కుంజుస్వామి ఎన్నడూ ఫిర్యాదు చేసేవారుకాదు. ఒకరోజు, "స్వామి, వారిద్దరూ మిమ్మల్ని బాగా చూసుకుంటున్నారా?" అని అడిగాను. "వాళ్ళు నన్ను చాలా బాగా చూసుకుంటున్నారు. నిజానికి ఇవాళ నేను, నిన్ను పిలిచి మానవాళికి ఒక మహత్తర వార్తను అందిద్దామనుకున్నాను. ఆ మాటలకు నేను తికమకపడి, "స్వామి, మీరు దేనిని గురించి చెబుతున్నారు?" అన్నాను. "నీకు తెలుసా? ఈ కండరాల నొప్పులు, తేనెతో మర్దనా చేస్తే తగ్గుతయ్యని, కుంజుస్వామి కండరాల నొప్పులు తగ్గటానికని ఆయన శరీరానికి మర్దనా చెయ్యవలసిన గోధుమరంగు (బ్రౌన్) నూనె, తేనెసీసా ప్రక్కప్రక్కనే ఉన్నవి. ఆయన సేవకులు, పొరపాటున ఆ నూనెకు బదులు తేనెతో ఆయన శరీరాన్ని మర్దన చేస్తున్నారు. దానివలన ఆయన నొప్పులు తగ్గలేదు. కుంజుస్వామి, "నేనొక కొత్తమందును మానవాళికి చెబుదామనుకున్నాను. కానీ, అది పనిచెయ్యలేదు," అని మాత్రమే అన్నారు. అంత బాధలో ఉన్నప్పటికీ ఏమీ ఫిర్యాదు చెయ్యకుండా, తను చెప్పదలచుకొన్న విషయాన్ని సూటిగా చెప్పకుండా, వారికి బాధ కల్గించని రీతిలో చెప్పారు.

ఆయన చివరిరోజుల్లో, దాదాపుగా మంచం పట్టారు. కనీసం లేచి కూర్చోలేక పోయారు. అనూరాధ, ఇంకొందరు, నేనూ ఆయనను సందర్శించి, ఆయనకు కాలక్షేపం అయ్యేటట్లు చేసేవాళ్ళం. మేము ఆయనను భగవాన్ పద్యాల గురించి చెప్పమనగానే, ఆయనకు ప్రాణం లేచి వచ్చేది. అనూరాధ కుమారుడు శంకర్, స్కూలు చదువు పూర్తిచేసుకుని, మెడిసిన్ చదవడానికి త్వరలో అమెరికా వెళ్ళబోతున్నాడు. కుంజుస్వామి వద్దనే ఆ అబ్బాయి దాదాపుగా పెరిగాడు. అందుకని

అతనికి కుంజుస్వామి అంటే చాలా ఇష్టం. తను తిరిగి అమెరికానుండి వచ్చేటప్పటికి, ఆయన మన మధ్య ఉండరని అతనికి తెలుసు. అందుకని అతడు బాగా బాధపడ్డాడు. కుంజుస్వామి అతడిని, సంతోషపెట్టాలని చూసేవారు. మేము ఆయనకు వినోదాన్ని పంచాలని చూచేవాళ్ళము. నేను కుంజుస్వామిని ఇలా ప్రశ్నించాను, "భగవాన్ తమిళంలోనికి అనువదించిన శంకరుని రచనల్లో మీకేపాట ఇష్టము?" ఆయన సర్దుకుని కూర్చుని నావైపు చూశారు. నేను, 'నేను ఆత్మను, నేను చైతన్యాన్ని' (అహం బ్రహ్మాస్మి) అని ఉండే పాటను ఇష్టపడతాను, అనూరాధ, 'నీవే ఆత్మవు, నీవే అది' (తత్ త్వమ్ అసి) అని ఉండే పాటను ఇష్టపడుతుంది. మీరు ఎవరిని సమర్థిస్తారు?" కుంజుస్వామి ముందు ఆమెను పాడనీ అన్నారు. ఆమె ముందు హస్తామలక స్తోత్రాన్ని పాడింది. అది 'అహం బ్రహ్మాస్మి' అని చెబుతుంది. తర్వాత ఆమె గురుస్తుతి పాడింది. అది 'తత్ త్వమ్ అసి' అని చెబుతుంది. మీరు ఏ పార్టీకి చెందుతారు? అహం బ్రహ్మాస్మి (నేను బ్రహ్మమును)కా లేక 'తత్త్వమసి' కా?" అని నేనాయనను అడిగాను. కుంజుస్వామి నవ్వి అన్నారు. 'నీవు', 'నేను' అనే వాటి మధ్య బేధమేమి ఉంది? 'తత్ త్వమ్ అసి' (అదే నీవు అయి ఉన్నావు)లో 'తత్' (అది) గానీ, 'త్వమ్' (నీవు) కానీ ముఖ్యం కాదు. అసి (అయి ఉన్నావు). 'వున్నావు' అనేదే ముఖ్యమైనది. 'అహంబ్రహ్మాస్మి'లో (నేను బ్రహ్మమునై ఉన్నాను)లో 'ఉన్నాను' అనేది ముఖ్యం. 'నేను'గా ఉండండి.

ఆ చక్కటి పాటను విన్న కొద్దిరోజులకే ఆయన చనిపోయారు. ఆయన చివరి రోజు రాత్రి, పరిచారకులతో, చెక్క మంచం మీద పరుపులు తీయించివేసి, వాళ్ళ సాయంతో పద్మాసనంలో కూర్చుని, నేను ధ్యానం చేసుకుంటాను, అని చెప్పారు. ఆయన గాఢధ్యానంలో ఉండగా, పరిచారకులు నిద్రపోయారు. ఆ మౌనంలోనే ఆయన మృతిచెందారు. ఆయన హృదయమెప్పుడూ అరుణాచలం లోనే సద్గురు రమణుల పాదాల చెంతనే ఉంటుంది.



కుంజుస్వామితో అనూరాధ



కుంజుస్వామికి 90వ జన్మదిన సన్మానం చేసిన గణేశన్

నిరంజనానంద స్వామి (చిన్న స్వామి)



ఒకప్పుడు తిరుచ్చిస్వామి, అనే మహాత్ముడు, నన్ను ఆశీర్వదించి ఇలా సెలవిచ్చారు. "ఆధ్యాత్మిక మార్గంలో సఫలత నొందాలి అంటే, ఒక వ్యక్తికి రోజాపువ్వు రేకు అంత సుతిమెత్తనిదీ, ఇనుపముక్క వలె గట్టిదీ, దేనినీ తనలో జొరపబడనీయనిదీ అయిన హృదయం ఉండాలి. సాధకుడు ప్రాపంచిక వ్యవహారాలతో ఉండేటప్పుడు ఇనుప హృదయాన్ని ఉపయోగించాలి. ప్రాపంచిక వ్యవహారాలు నిర్మమకారంగానూ, తాను తలపెట్టిన పని రోజువారీదయినా సరే, దీర్ఘకాలిక మైనదైనా సరే, ఎటువంటి సమస్య ఎదురైనా పూర్తిచేసి తీరాలి అనే స్పష్టమైన దృఢసంకల్పం తోటే చెయ్యబడాలి. దీనికి అత్యంతావశ్యకమైనది పట్టుదల. మరొకప్రక్క ఆధ్యాత్మిక సాధకుడు, గురువుకు సంపూర్ణ, స్వార్థరహిత శరణాగతి చెంది, ఆయన సేవచెయ్యటానికి సుతిమెత్తని రోజాపువ్వు రేకువంటి హృదయాన్ని ఉపయోగించాలి. దానికితోడు అటువంటి సాధకుడు సత్యాన్ని పొందడానికి భక్తితో కరగిపోయి, మిగిలినవారికి, గురువుగారి బోధల సారాన్ని గ్రహించడానికి తోడ్పడాలి. దీనికి ఓర్పు ఎంతో అవసరం. నాణేనికి రెండు ముఖాలైన పట్టుదలను, ఓర్పును నీలో ఉంచుకో అని చెప్పారు. భగవాన్‌పట్ల నిరంజనానందస్వామికి గల సంపూర్ణమైన అంకితభావము భక్తి, ఆయన రోజాపుష్పం యొక్క రేకువంటి అతి సున్నిత హృదయాన్ని వ్యక్తం చేస్తవి. ఎన్నో సమస్యలను, వ్యతిరేకతను ఎదుర్కొని ఆశ్రమ నిర్వహణ భారాన్ని మొయ్యటానికి సాహసించడం, ఆయన ఇనుప హృదయాన్ని వ్యక్తం చేస్తుంది.

హిందూపురాణాలలో దేవుడు రాముడుగా కానీ, కృష్ణుడు కానీ అవతరించినపుడు, తన సోదరులతో సహా వచ్చారు. రామునికి లక్ష్మణుడు, కృష్ణునికి బలరాముడు సోదరులు గదా. మహాత్ములైన జ్ఞానేశ్వర్ మహరాజ్, రామకృష్ణ పరమహంసలకు గూడా సోదరులున్నారు. ఈ సోదరులంత పరిపూర్ణ పురుషులు కానప్పటికీ, ఆ మహాత్ములు వీరిని తమతో కలుపుకొని, కాలాంతరంలో వారిలోని దోషాలను నివృత్తి చేస్తూపోయారు. ప్రపంచంలో సత్యాన్నీ, ధర్మాన్నీ, మంచితనాన్నీ వ్యాపింపచేయడమనే వారి ధ్యేయ నిర్వహణలో, ఈ సోదరులు ప్రముఖ పాత్ర వహించి, ఆనాటి వారి లీలా నాటకంలో ముఖ్యపాత్ర పోషించారు. అలాగే భగవాన్‌కూడా, తన సోదరుడు నిరంజనానందస్వామిని, ఏ విధమైన షరతులూ లేకుండా, తన ప్రక్కనే ఉంచుకున్నారు. ఈ మహాత్ముల సోదరులను పరిశీలిస్తే, వారు నిష్పక్షపాత బుద్ధితో ఉన్నట్లు తోస్తుంది. వాళ్ళు తప్పులు చేసినప్పటికీ అవి విస్తారమైన భగవల్లీలా విలాసం, దైవనిర్ణయంలోని భాగమే.

భగవాన్‌కు ఇద్దరు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. అన్న నాగస్వామి, తమ్ముడు నిరంజనానంద, చెల్లెలు అలిమేలు. వారి తండ్రి సుందరం అయ్యర్ చనిపోయినపుడు, కుటుంబ విభజన జరిగింది. నాగస్వామి, వెంకటరామన్ మధురైకు వచ్చారు. తల్లి అలగమ్మాళ్, నాగసుందరాన్నీ, అలమేలునీ తీసుకుని, మానా మధురైలో ఉన్న తన మరిది గారింటికి వెళ్ళింది. పదహారేళ్ళ వయసులో భగవాన్ మృత్యు అనుభవం పొంది, అరుణాచలం వెళ్ళారు. 1902లో ఆయన కుటుంబం, అరుణాచలంలో ఆయన ఉన్నట్లు ఆచూకీ తీసింది. నాగసుందరం తన అన్నగారిని చూడడానికి వచ్చారు. భగవాన్ అప్పుడు బ్రాహ్మణస్వామిగా పిలువబడుతూ విరూపాక్ష గుహక్రింద ఉన్న సద్గురు గుహలో ఉంటూ ఉన్నారు. నాగసుందరం తన అన్నగారు సన్యాసివేషంలోనూ పూర్తి మౌనంలోనూ ఉండడం చూసి, ఆయనను కౌగలించుకొని ఏడ్చారు. తన అన్నగారిలో ఏ విధమైన భావోద్వేగాలకు తావు లేకుండడాన్ని ఆయన గమనించారు. భగవాన్ మౌనంగానే ఉండిపోయారు. నాగసుందరం తానక్కడే ఉండి, ఆయనకు సహాయకారిగా ఉండాలనుకున్నారు. కానీ, నాగసుందరానికి ఇంకా నిర్వర్తించవలసిన ప్రాపంచిక బాధ్యతలెన్నో ఉన్నాయని భగవాన్‌కు తెలుసు. అందుకని ఆయన అక్కడే ఉండిపోతానని అన్నప్పటికీ, భగవాన్ ఏమీ సమాధానమివ్వలేదు. నిరుత్సాహ పడిన నాగసుందరం ఇంటికి తిరిగివెళ్ళారు.

నాగసుందరం బాల్యాన్ని గురించిగానీ, తర్వాత జీవితాన్ని గురించిగానీ మన వద్ద పెద్దగా వివరాలు లేవు. మనకు తెలిసిందల్లా, ఆయనకు వివాహమైనదనీ, గుమస్తాగా ఉద్యోగం వచ్చిందనీను. తర్వాత ఒకదాని తర్వాత ఒకటిగా దురదృష్ట సంఘటనలు

ఆయన జీవితంలో చోటు చేసుకోవడం మొదలైంది. ఆయన పెద్ద అన్న నాగస్వామి హఠాత్తుగా చనిపోయారు. అప్పుడాయనకు కేవలం ఇరువది ఏళ్ళు. కొద్దికాలంలోనే వారి పూర్వీకుల ఆస్తి వేలం వేయబడింది. వాళ్ళు సర్వస్వాన్నీ పోగొట్టుకున్నారు. ఆయన భార్యకూడా హఠాత్తుగా చనిపోయారు, చిన్న కుమారుని వదలి. నాగసుందరానికి ఉన్న ఒకే ఒక దిక్కు తల్లి అళగమ్మాళ్. కానీ ఆమె కూడా భగవాన్‌తో ఉండడానికి, అరుణాచలానికి వెళ్ళారు. ఈ విధమైన పరిస్థితులన్నీ ఆయనను దిగ్భ్రాంతికి గురిచేసి, శరణాగతి, అణకువ, సేవ అనేవి పాటించే స్థితికి నెట్టివేసినవి. ఆయనకు మిగిలి ఉన్నవేమైనా ఉంటే వాటినన్నిటినీ వదిలివేసి, తన కుమారుడిని కూడా చెల్లెలి వద్ద వదలిపెట్టారు. అదే సమయంలో ఎండమావిలా ఆయన తల్లి అక్కడకు వచ్చి తమతోపాటు ఉండమని కబురుచేశారు. అందుకని ఆయన అరుణాచలానికి వెళ్ళారు. తల్లి ప్రభావం వలన కాబోలు, భగవాన్ ఆయనను ఆదరించారు. అళగమ్మగారు, తన విరాగిపుత్రునితో, "నా మూడవ పుత్రుడు నాగసుందరం పెద్ద తెలివిగలవాడు కాదు. అతడు కొద్దిగా మొరటుగా ఉంటాడు. ఈ ప్రపంచంలో అతడు బ్రతకలేడు. నువ్వే అతనిని సంరక్షించాలి" అన్నారు. భగవాన్ తల్లి మాటను విన్నారు. చివరికెప్పుడో, ఆయనకు అండగా నిలబడడానికి కారణం చెప్పారు. ఒకప్పుడు ఆశ్రమ మేనేజిమెంటు గురించి పోటీ వచ్చింది. నిరంజనస్వామి ఆ పోటీలో ఉన్నారు. ఆరోజు కొండపైకి వెళ్తూ, భగవాన్ తనలో తను సణుక్కున్నారు. నేను ఏమి చేయగలను. నేను మాట ఇచ్చాను అని. రామచంద్ర అయ్యర్‌కు అర్థంకాక, "భగవాన్ మీరేమి అంటున్నారు?" అన్నారు. భగవాన్ బదులిచ్చారు, "మా తమ్ముడు ఇక్కడకు వచ్చినపుడు, మా తల్లిగారు, నానుండి మాట తీసుకున్నారు, అతనిని వదలిపెట్టననీ, సంరక్షిస్తాననీ, నాతోపాటు ఇక్కడే ఉంచుకుంటాననీ. నేనేమి చెయ్యగలను?"

జీవితంలో అనేక ఎదురుదెబ్బలు తిని, స్కందాశ్రమము చేరిన నాగసుందరము, తను కూడా సన్యాసిగా మారాడు. తనుకూడా అతి సామాన్యమైన, నియమనిష్టలతో కూడిన జీవితం గడుపుతూ తిరువణ్ణామలై వీధులలో బిచ్చమెత్తేవారు. అప్పటికే రమణమహర్షి నేనెవరను? అరుణాచల పంచరత్నము వ్రాసియున్నారు. అప్పటికే అవి బాగా ప్రచారంలో ఉన్నవి. ఎక్కువమంది భక్తులు ధ్యానానికీ, పారాయణకూ వానిని ఉపయోగించుకునే వారు. నాగసుందరం, శ్రవణ, మనన, నిధిధ్యాసనలను చేస్తూ, సన్యాసి జీవితం గడిపేవారు. కావ్యకంఠగణపతి ముని అప్పటికే బ్రాహ్మణస్వామికి, భగవాన్ శ్రీరమణమహర్షి అని పేరుపెట్టి, ఆయన ఖ్యాతిని పెంచారు. ఆయన నాగ సుందరాన్ని చూసినపుడు, భగవాన్ అతనిని కనిపెట్టి ఉండడాన్ని చూశారు. తాను కూడా ఆయనకు తోడ్పడాలనుకున్నారు. నువ్వు సాంప్రదాయ పద్ధతిలో సన్యాసం స్వీకరించి కాషాయ వస్త్రాలు ధరించవచ్చుగదా? అని చిన్నస్వామితో అన్నారు. ఆయనే నిరంజనానంద అనే పేరును నాగసుందరానికి పెట్టారు. దాని అర్థం కల్మషము లేని వాడు, శుద్ధమైన వాడు అని. అది పలకటానికి కష్టంగాతోచి అందరూ అతనిని చిన్నస్వామి అని పిలవడం మొదలుపెట్టారు.

అళగమ్మాళ్ చనిపోయినపుడు, ఆమె శరీరాన్ని క్రిందకు తెచ్చిన వారిలో ఈయన కూడా ఉన్నారు. వారు ఆ శరీరాన్ని ముళ్ళు, పొదలు ఉన్న చోటికి తెచ్చారు. అదే ఇప్పటి రమణాశ్రమము, మిగిలిన వారి సాయంతో, ఆమె శరీరాన్ని సమాధిచేశారు చిన్నస్వామి. ఆ సమాధికి పూజ చెయ్యాలని, కావ్యకంఠులు పట్టుపట్టారు. ఆచారం ప్రకారం ఆ సమాధిపై ఒక శివలింగాన్ని పెట్టారు. మామూలుగా అయితే దానిని కొన్నాళ్ళుంచి తీసివేస్తారు. కానీ ఆ లింగాన్ని అక్కడే ఉంచేశారు వాళ్ళు. నువ్వు ఇక్కడ పూర్తి సాంప్రదాయరీతిలో పూజాదికాలు నిర్వహించాలి ఎందుకంటే, ఇది కేవలము సమాధికాదు. ఆలయం. మీ తల్లిగారికి భగవాన్ విముక్తి కల్గించారు కాబట్టి ఆవిడను ఇంక సాధారణ మనిషిగా లెక్కించకూడదు. ఆమె భగవంతుడే, కావ్యకంఠులు ఆ ఆలయానికి మాతృభూతేశ్వర ఆలయమని పేరుపెట్టారు. మాతృభూతేశ్వరుడంటే తల్లిరూపంలో ఉన్న భగవంతుడు. ఈ విధంగా చిన్నస్వామి అక్కడే ఉండి ప్రతి దినము పూజాదికాలు చేసేటట్లుగా ఒప్పించారు. భగవాన్ స్కందాశ్రమంలో ఉన్నారు. చిన్నస్వామి భగవాన్‌కు కబురుపెట్టారు. మర్నాడు తను దోశలు తయారుచేస్తున్నాననీ, వాటిని స్కందాశ్రమానికి తీసుకునివస్తామనీ, అప్పట్లో వాళ్ళకది ఎంతో రుచికరమైన వంటకంగా భావించేవారు. మర్నాడు, "ఇక్కడ అతిథికేమైనా ఆహారం దొరుకుతుందా?" అనే మాటలు విన్పించాయి, చిన్నస్వామికి. వచ్చిందెవరో కాదు భగవానే. ఆయన తనని తనే అతిథిగా చెప్పుకొన్నారు. ఇప్పటి రమణాశ్రమానికి అమ్మగుడి, కేంద్రబిందువుగా మారింది. భగవాన్ అక్కడే

ఉండిపోయారు. స్వంతదారుగా గాక అతిథిగానే. అప్పటివరకూ ఎవరో ఇతరులు, ఆశ్రమాన్ని నిర్వహించేవారు. శేషాద్రిస్వామి చనిపోయాక కొంతమంది లాయర్లు భగవాన్‌తో రమణాశ్రమానికి అధికారపూర్వకంగా ఎవరినైనా సర్వాధికారిగా (మేనేజర్) నియమించమనీ లేకుంటే అనేక చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ నాయన ఈ పదవినలంకరించాలని కోరుకున్నారు. కాని భగవాన్ నాయనవైపు తిరిగి, "పిచ్చాయ్ (నిరంజనానంద చిన్ననాటి పేరు) ఈ పని చెయ్యాలను కుంటున్నాడు. అతన్నే మేనేజర్‌గా ఉండి ఆ భారాన్నంతా మొయ్యనీ," అన్నారు. నాయన ఆధ్యాత్మికంగా ఉన్నతులు కాబట్టి ఆయన మేనేజరుగా ఉంటే బాగుండేది అని చాలామంది భక్తులు అనుకున్నారు. కాని కాలం భగవాన్ నిర్ణయమే సరైనదని తేల్చింది. పెద్దగా ఆధ్యాత్మిక ఔన్నత్యం లేని చిన్నస్వామి దృఢచిత్తంతో ఆశ్రమ భారాన్ని నిర్వహించారు. (కానీ ఆయన భగవాన్ బోధలకు అడ్డురాకుండా, పట్టకమువలె ఉండేవారు)

కావ్యకంఠులు తన శిష్యులందరితోను అన్నారు, "ఇది భగవాన్ ఆజ్ఞ మనమందరమూ దీనిని సమర్థించాలి. ఆ రోజునుండి కావ్యకంఠుల శిష్యులు చిన్నస్వామి మేనేజర్‌గా ఉండడానికి సహకారాన్ని అందించారు. 1930లో భగవాన్‌ను ఒక వీలునామా తయారుచేయవలసిందిగా కోరారు. నిరంజనానందస్వామి కుటుంబసభ్యులు, ఆశ్రమముయొక్క ఆస్థిపాస్తులను నిర్వహించునట్లును, కానీ వారు భగవాన్ ఆధ్యాత్మిక వారసులుగా ఉండరాదనీ వీలునామా తయారుచేయబడింది.

చిన్నస్వామి చాలా నియమనిష్ఠలు కలవారు, నిరాడంబరులు, క్రమశిక్షణ కలవారు, చాలా ఖచ్చితంగా వ్యవహరించే వ్యక్తి. ఇవే ఆయనకు చెడ్డపేరు తెచ్చిపెట్టినవి. కానీ ఆయన దానిని లక్ష్యపెట్టలేదు. ఆయన ఎంత నియమనిష్ఠలు కలవారంటే, ఆశ్రమనిధులనుండి, ఒకపైసా కూడా, తన స్వంత ఖర్చులకు వాడుకునేవారుకాదు. భగవాన్ భక్తులలో ఆయనకిద్దరు మిత్రులుండేవారు. ఆయనకుండే చిన్న చిన్న ఖర్చులు, పళ్ళపొడి, తలనూనె, తమలపాకులు, వక్కలు, గొడుగు మొదలైన వాటికి అయ్యే ఖర్చులకు వారు డబ్బు ఇస్తుండేవారు. ఆ రోజులలో ఆయన సర్వాధికారి, ఆశ్రమ నిధులన్నిటిని నిర్వహిస్తుండేవారు. అప్పుడు ఈ జమాఖర్చులు లెక్కచూడడానికి, బోర్డుగానీ ట్రస్ట్‌గానీ లేదు. కానీ ఆయన తన నిజాయితీని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. పాత భక్తులు చెప్పేవారు. ఆయన ఎంత నిరాడంబరుడంటే తను కట్టుకునే దుస్తులు చిరిగిపోతే వాటిని తానే కుట్టుకుని తిరిగి ధరించేవారు. ఆయన కొత్తబట్టలు కొనుక్కొని ఉండవచ్చును. కానీ ఎవరైనా ధనవంతుడు వచ్చి, ఆశ్రమవాసులందరికీ దుస్తులు పంచిపెట్టేదాకా వేచి ఉండి, ఉన్నవాటితోనే కాలం గడుపుకునేవారు. అప్పుడు కూడా ఒక్క ధోవతినే తన కొరకు తీసుకునే వారు. వంటవారు ఎవరూ నియమింపబడనప్పుడు ఆయనే మొత్తం వంట అంతా చేసి, ఆశ్రమ అవసరాలన్నీ చూచుకుంటుండేవారు. (ఈ నిజాలన్నీ ఇది వరకు ఆయనపై ఫిర్యాదు చేసినవారు చెప్పినవే.)

ఒకప్పుడు 'జాకీ' అనబడే భగవాన్‌కు ప్రీతిపాత్రమైన కుక్క ఒక పందితో పోట్లాడుతూ చాలా తీవ్రంగా గాయపడింది. దాని పొట్టలోని పేగులు బయటకు వచ్చి, అది అమితంగా బాధపడసాగింది. అప్పుడు చిన్నస్వామి దానిని ఒక బుట్టలో పెట్టి, ఆ బుట్టను తన నెత్తిన పెట్టుకుని, పశువుల ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి, చికిత్స చేయించారు. జాకీ కోలుకుని ఎన్నో సంవత్సరాలు జీవించింది. 1988నాటికి చిన్నస్వామికి ఆశ్రమనిర్వహణలో సాయం కావలసి వచ్చింది. అందుకని ఆయన తనకుమారుణ్ణీ, ఆ కుటుంబం మొత్తాన్నీ రావలసిందిగా కోరారు. మా తండ్రిగారు నన్ను రమణాశ్రమం తీసుకుని వచ్చేసరికి నాకు రెండు సంవత్సరాలు. చిన్నస్వామి తన కుమారునితో కూడా అంతే ఖచ్చితంగా వ్యవహరించేవారు. ఆయన పట్ల ఏ విధంగానూ అభిమానం చూపేవారుకాదు. అందుకని మా తండ్రిగారు నిరాశచెంది, అసంతృప్తితో, కోపంతో ఉండేవారు. ఎప్పుడైనా సైకిళ్ళవంటివి ఆశ్రమానికి ఇవ్వబడినపుడు, మా తండ్రిగారు తనకు కూడా ఒకటి ఇవ్వమని అడగడం, చిన్నస్వామి నిరాకరించడం జరిగేది. మా తండ్రిగారు బాధపడితే, ఆయన తన కొడుకుతో ఇట్లా చెప్పేవారు, "వెంకటూ, మనము ఈ ఆశ్రమాన్ని నిర్వహించవలసినదిగా, భగవాన్‌చేత ఆజ్ఞాపించబడ్డాము. మనం ఆయనకు బానిసలము. ఒక తరం తర్వాత ఇంకో తరం, మనం ఈ బాధ్యత నిర్వహించవలసినదే. కానీ ఈ ఆశ్రమం మీద మనకు ప్రత్యేకమైన హక్కులేమీ లేవు. గడ్డివామి దగ్గర కుక్కలాగా, ఉంటూ మనలను మనం ఈ ఆశ్రమసేవకు అర్పించుకోవలసిందే. గడ్డివామి దగ్గర కుక్క తాను గడ్డి తినదు. వేరే పశువులను తిననివ్వదు. మా తండ్రిగారు ఈ బోధను అత్యంతశ్రద్ధతో పాటించారు. నా ఇద్దరు సోదరులు, నేనూ కూడా అలాగే చేశాము. ప్రస్తుతము మూడవ తరము ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నది. చిన్నస్వామి దీవెనల

వల్ల ఒక తరము, తర్వాత మరొక తరము ఆశ్రమనిర్వహణ భారాన్ని మోస్తుంది. నియంతల లాగానో, సర్వాధికారులు లాగానో కాకుండా, గడ్డివామి దగ్గర కుక్కలవలె.

చిన్నస్వామి తన మొరటు ధోరణితో చాలామందిని నొప్పించారు. కానీ చాలామంది భక్తులు చెప్పటం ఆ ఉదంతాలను నిష్పక్షపాత దృష్టితో చూడాలని, కథకు రెండువైపులా చూడడం ముఖ్యం. చిన్నస్వామి సమస్య ఆచరణకు సంబంధించినది. ఆశ్రమ వాసులందరూ, హాలులో భగవాన్ సన్నిధిలో కూర్చుని ఉంటే, పలురకాల ఆశ్రమ కార్యక్రమాలు, వంట, తోటపని, స్టోరునిర్వహణ, ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం, సందర్శకులను స్వాగతించడం, డబ్బు ఇచ్చి పుచ్చుకోవడం, పుస్తకములు ప్రింటు చేయించటము, ఆస్తులకు, బిల్డింగులకు, ఆశ్రమవాసులకు రక్షణ కల్పించటము, మొదలగునవి ఎలా జరుగుతవి? కాబట్టి ఆయన ఒక గట్టి షరతును పెట్టారు. ఎవరైనా ఆశ్రమంలో ఉండాలంటే వాళ్ళు ఏదో ఒక విధంగా ఆశ్రమ నిర్వహణకు తోడ్పడవలసినదే. ఎవరైతే ఈ షరతుకు ఒప్పుకోరో, వారిని ఆశ్రమం విడిచివెళ్ళమని చెప్పేవారు. చిన్నస్వామి వలన బాధపడ్డ వారందరూ, ఆయన నిర్ణయం సరైనది కాదని అనలేదు. ఆయన దానిని అమలులో పెట్టే విధానం, వారితో వ్యవహరించిన తీరు కఠినంగా ఉన్నవనే చెప్పేవారు.

మురుగనార్, రామస్వామిపిళ్ళై, చాడ్విక్, విశ్వనాథస్వామి, అన్నామలైస్వామి, కుంజుస్వామి, దేవరాజమొదలియార్, సూరినాగమ్మ, మునగాల వెంకటరామయ్య, చిన్నస్వామివల్ల మనస్తాపం చెందిన అనేకమందిలో కొందరు మాత్రమే. ఈ బాధాకరమైన విషయాన్ని నేను వారి వద్ద ప్రస్తావించినపుడు, వాళ్ళు ఒక విషయాన్ని ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. “చిన్నస్వామి కఠినత్వము మూలాన, ఆ సమయంలో మేము బాగా బాధపడిన మాట నిజమే... అందులో సందేహం లేదు. కానీ కాలాంతరంలో మేము గ్రహించిందేమిటంటే, ఆయనలా ప్రవర్తించి ఉండక పోతే మేమింకా ఆశ్రమనిర్వహణ కార్యక్రమంలో మునిగి ఉండి, మా ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించి ఉండేవారము కాదు. లోతుగా చూస్తే చిన్నస్వామిలో కనపడే కాఠిన్యమంతా భగవాన్ అనుగ్రహమే అన్పిస్తుంది.”

మురుగనార్ నాతో ఇలా అన్నారు, “చిన్నస్వామి అదేపనిగా నన్ను అవమానిస్తుండే వారు. నాకు ఆశ్రమంలో భోజనం పెట్టేవారు కాదు. నేను వీధులలోకి వెళ్ళి బిచ్చమెత్తుకో వలసి వచ్చేది. అమ్మ ఆలయంలో పూజ కొనసాగించడానికీ, ఆశ్రమంలో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడానికీ ఒప్పుకోలేదనీ, నన్ను ఆశ్రమంలో ఉండనివ్వలేదు. కానీ గణేశన్, నాకు ఆశ్రమం వదలివెళ్ళటం వలన రెండు ఆధ్యాత్మిక లాభాలు కల్గినవి అని రూఢిగా చెప్పగలను. చిన్నస్వామి కఠినత్వం వలనగాకపోయినట్లయితే నేనింకా రమణాశ్రమంలో పూజ చేస్తూ, ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడిని.” “ఏమిటి (దీనివలన) బయటకు వెళ్ళటం వలన మీకు లభించిన ఆధ్యాత్మిక వరాలు?” అన్నాను నేను. నేను ఏ సమయంలో అయినా, పగలుకానీ, రాత్రిగానీ భగవాన్ సన్నిధిలోనూ సమీపంలోనూ ఉండగలిగే వాడిని. రెండవది ఏమిటంటే, నేను ఎంతో పారవశ్యంలో ఉండి,కేవలం పద్యాలు వ్రాస్తుండేవాడిని. నేను భగవాన్ గురించీ, భగవాన్ బోధలను గురించీ దాదాపు నలభైవేల పద్యాలు వ్రాశాను. ఇవన్నీకూడా ఏకాంతంలో, మౌనంలో వ్రాయబడ్డవి. బాహ్యకార్యక్రమాలలో నిమగ్నమయి ఉంటే, ఇది సాధ్యపడేది కాదు. నేను ఈ రెండు వరాలూ పొందడానికి చిన్నస్వామి ముఖ్యసాధనంగా ఉపయోగపడ్డారు.

ఆశ్రమంలోని వంటశాలలో సహాయకులుగా ఉండేవారిలో ఒకరైన సుబ్బలక్ష్మిఅమ్మాళ్ నాతో ఇలా చెప్పారు, “భగవాన్, చిన్నస్వామిని, చాకలి బట్టలుతికే బండలాగా ఉపయోగించుకున్నారు. ఆయన ద్వారా భగవాన్ భక్తులలోని మురికిని, అంటే వాసనలను పోగొట్టి, వారి సమయమంతా, ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగించుకునేటట్లు చేశారు. ఈ పాత్రను పోషించడం కోసం చిన్నస్వామి నిరంతరం చెడుపేరు తెచ్చుకున్నారు. బలరామ రెడ్డిగారు నాతో ఇలా అన్నారు, “చిన్నస్వామి ఆశ్రమ నిర్వహణలో లోపాలున్నప్పటికీ, నేను గమనించిన నిజం ఏమిటంటే, భగవాన్ ఎప్పుడూ ఆయనను సమర్థించేవారు. నేను ఒకసారి చిన్నస్వామి మీద భగవాన్‌కు ఫిర్యాదు చేస్తే, భగవాన్ నన్ను వెంటనే సరిదిద్దారు. నేను ఆశ్రమంలో ఉన్నంతకాలమూ ఆయన చెప్పిన విధంగానే ఉన్నాను. భగవాన్, ‘ఇంత దూరం నుండి నువ్వు వచ్చినది, ఆశ్రమ నిర్వహణలో లోపాలను ఎన్నటానికా? నువ్వు వచ్చిన పని చూసుకో. నీలోపలి నుండి ఈ ఫిర్యాదులను లేవనెత్తే వాడెవడో కనుక్కో. మిగిలినదాన్ని ఆ ఉన్నతమైన శక్తికి వదిలెయ్యి. ఊరక ఉండు,” అని సూటిగా చెప్పారు.

1973లో విశ్వనాథస్వామి మౌంటెన్‌పాత్‌కు ఎడిటర్‌గా ఉన్నారు. నేను మేనేజింగ్ ఎడిటర్‌గా ఆయనకు సహాయపడుతున్నాను. నేను చిన్నస్వామి కఠినత్వము గురించి బాధపడుతూ ఆయనతో మాట్లాడాను. విశ్వనాథస్వామి, వెంటనే చిన్నస్వామికి రోజారేకువంటి సుతిమెత్తని పార్శ్వం వైపుకు నన్ను తిప్పారు." ఇతరుల మీద తీర్పులు చెప్పడం చాలా తేలిక. కానీ ఎవరు, ఎవరిపై తీర్పు చెబుతున్నారు? ఒక మనసు వేరొక మనసు చేసే పనులను విమర్శిస్తుంది అని విశ్వనాథస్వామి నాతో అన్నారు. (ఈ మాటలు, నాలో చిన్నస్వామిపట్ల, ప్రపంచంలో ప్రతి ఒక్కరిపట్ల గౌరవాన్ని పెంపొందించాయి. ఎందుకంటే ప్రతి వారిని 'నేను' లేదా 'అహం' (ఆత్మ)గా చూడగల్గితే నిందాస్తుతులకు చోటెక్కడ? విశ్వనాథస్వామి కొనసాగించారు. "గణేశన్, చిన్నస్వామి, సద్గురు భగవాన్‌కు సహాయంగా ఉండడానికి, పవిత్రమైన అరుణాచలం నుండి దొర్లివచ్చిన అతిపెద్ద బండరాయి. ఆయన కష్టపడి పనిచెయ్యడం వల్లనే. భగవాన్ ఇరువది నాలుగు గంటలూ ఒకేచోట భౌతికంగా అందుబాటులో ఉన్నారు. ఏ విధమైన అవాంతరాలు లేకుండా, హృదయ విద్యను, భగవాన్ సమక్షంలో, సూటిగా ఆయననుండే పొందగలిగాము. పాతహాలులో, సత్యాన్ని లేదా హృదయ విద్యను, ఆత్మజ్ఞానమును, భగవాన్ మాపై కురిపిస్తున్న అనుభవాన్ని మేము పొందాము. ఒక బలమైన స్థానము, ఆశ్రమమువంటి వ్యవస్థ లేకుంటే అది ఎలా సాధ్యమయ్యేది? సహజంగానే ఒక సంస్థ నిర్వహించాలంటే, గట్టి, దృఢమైన మనసుగల చిన్నస్వామిలాంటి మనిషి కావాలి. అందువల్లనే భగవాన్ మౌనంగా కూర్చుని ఒకేసారి, (సమతల అభివృద్ధి) సమాంతరంగానూ, నిలువుగాను ఎదుగుదలను జరగనిచ్చారు. సమాంతరంగా అభివృద్ధి చెందడమంటే, ఆశ్రమాన్ని ఒక సంస్థగా తీర్చిదిద్దడము. రోజువారీ కార్యక్రమాల నిర్వహణ, గ్రంథాలను ముద్రించటం, సందర్శించే భక్తులకు ఆహార ఏర్పాట్లు, ఇంకా ఇతర బాహ్య కార్యక్రమాలు. అదేసమయంలో నిలువుగా అభివృద్ధి చెందాలి. వ్యక్తియొక్క అంతరంగిక ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడాలి. అది గురువుగారి సన్నిధిలో గురువుగారి అనుగ్రహాన్ని గ్రహించడమే. ఆత్మవిచారణ, హృదయంపై ధ్యాస, ధ్యానము, ఏకాంత, వైరాగ్య జీవితం, సమాంతర అభివృద్ధిలో అనేకమంది వ్యక్తులూ, అనేక కార్యక్రమాలు ఉంటాయి. నిలువు (ఊర్ధ్వముఖం) గా అభివృద్ధి చెందడమంటే, ఒక వ్యక్తి తనలోని సత్యాన్ని అనుభవించేలా చెయ్యడం. భగవాన్ ఈ రెండు రకాలైన అభివృద్ధి సవ్యంగా జరగడానికి అంకురార్పణ చేసి, ఎదుగుదలకు దోహదపడే వాతావరణాన్ని కల్పించారు. చిన్నస్వామి ఎంతో శ్రమకోర్చి ఆశ్రమాన్ని అభివృద్ధి చేశారు. "ఈ అరుణాచలేశ్వరుని దివ్యలీలలో చిన్నస్వామి ముఖ్యభూమిక పోషించారు. అందుకనే, భగవాన్ ఆయనకు యాజమాన్య వ్యవహారాలలో నిరంతరం సహకరించారు. అదే సమయంలో భక్తులు ఆశ్రమంలో ఉన్నాసరే, పల్లాకొత్తులో ఉన్నా సరే, ప్రతి ఒక్కరికీ అంతరంగిక ఆధ్యాత్మిక సాధనలో మార్గదర్శకత్వం నెరపారు. సాధకులమైన మనమంతా, ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట (సాధన చేసినంత సేపు) మాత్రమే కాదు, రోజంతా, రోజులోని ప్రతి క్షణమూ, ఆ సద్వస్తువుయొక్క సాన్నిధ్యములోనే ఉన్నామన్న స్పృహతో మనముండాలి అనే విషయం నాకు స్పష్టంగా విశదపడింది. దానిని మీరు భగవాన్ అనండి, అరుణాచలమనండి, మీరే పేరుతో పిలిచినా సరే, ఈ వాస్తవాలు మనకందించిన వారికి మనము కృతజ్ఞతతో ఉండాలి. చిన్నస్వామి మాత్రమే కాదు, దేవరాజ మొదలియార్, అన్నామలైస్వామి, విశ్వనాథస్వామి, బి.వి.నరసింహస్వామి, మురుగనార్, పాల్‌బ్రంటన్ ఇంకా ఇతరులు సమాంతర అభివృద్ధికి తోడ్పడ్డారు. వీళ్ళందరికీ ఆత్మసాక్షాత్కారానికి, అవసరమైన ఊర్ధ్వముఖ (నిలువు) ఎదుగుదలను భగవాన్ అనుగ్రహించారు. ఒక రైలు నడవాలంటే, రెండు పట్టాలు కావలసినట్లుగా, ఆశ్రమ అభివృద్ధి రెండు పక్కల ఒకేసారి జరగాలి అన్నారు మురుగనార్.

గురువుగారితో సంబంధము (లేదా) అనుబంధము ఏర్పరచుకోవడానికి భక్తుడికి నాలుగు సూత్రాలు ఇవ్వబడ్డవి. 1. భక్తుడు గురువుగారినీ, ఆయన అవసరాలనూ కనిపెట్టుకుని ఉండాలి. భగవాన్ వంటి గురువు, తన శరీరాన్ని తాను లక్ష్యపెట్టరు. అరుణాచలేశ్వరుడు అనేకమంది తల్లుల రూపంలో ఆయన దేహసంరక్షణ చేశారు. అలా కాకున్నట్లయితే పాతాళలింగం వద్ద ఉన్నపుడే ఆయన శరీరం అంతమైపోయి ఉండేది. ఆత్మబోధ చెయ్యడానికి ఆ శరీరానికి అవకాశం ఉండేదే కాదు. గురువు తన అవసరాలను తీర్చమని ఎవరినీ అడగరు. ఆయన దగ్గరలో ఉన్నవారు తమంత తామే వాటిని గుర్తించి శ్రద్ధ తీసుకోవాలి. 2. రెండవది గురువుగారుండే ఆవరణను పరిశుభ్రంగా , ఏ విధమైన సమస్యలూ లేకుండా ఉంచాలి. 3. మూడవది, గురువుగారి బోధలను సంగ్రహపరచి, జాగ్రత్త చెయ్యాలి. 4. నాలుగవది, ఇవన్నీ చేసిన తర్వాత లేదా చేస్తుండగానే, గురువుగారి బోధలను ఆచరణలో పెట్టి, తాను హృదయంలో నిలచి తోటివారికి కూడా అందుకు సాయపడాలి.

మొదటిమూడు గురువుగారి భౌతిక అవసరాలను చూసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, గురువుగారి బోధలను జాగ్రత్త చెయ్యడం, సమాంతర అభివృద్ధికి సంబంధించినవి. బాహ్యక్రియలతో కూడినవి. చివరిదైన, గురువుగారి బోధలను ఆచరణలో పెట్టటమనేది ఊర్ధ్వముఖ అభివృద్ధి, భగవాన్ ఎంతో దయతో, ఓర్పుతో మౌనంగా, రెండురకాల అభివృద్ధికీ ప్రాధాన్యతనిస్తూ, ఇరువది నాలుగు గంటలూ ఆశ్రమంలోనే ఉండేవారు. ఎవరైతే ఆశ్రమ హక్కులను కాపాడడానికీ, గ్రంథాలను అచ్చువేయించడానికీ, ఆయన బోధలు సంగ్రహించడానికి, కృషిచేస్తారో, వారందరూ సమాంతర అభివృద్ధికి తోడ్పడినవారే. అయినా సరే, భగవాన్ వారిపైన కూడా అనుగ్రహాన్ని వర్షించి వారిలో ఊర్ధ్వముఖ అభివృద్ధికి తోడ్పడి, సత్యాన్ని సాధించడానికి సాయపడ్డారు.

చిన్నస్వామి జీవితాన్ని ఈ నాలుగు సూత్రాల వెలుగులో చూడాలి. చిన్నస్వామి మొదటి మూడుసూత్రాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టారు. భగవాన్ శరీరాన్ని, ఆయన అవసరాలను కనిపెట్టి ఉండడానికి ఆయన అవసరము ఉన్నది. ఆయన పనిలో తప్పులు జరిగి ఉండవచ్చును. కానీ రోజుకు ఇరువది నాలుగు గంటలూ, వారానికి ఏడురోజులూ, శ్రద్ధ చూపాల్సిన అవసరమున్నది. ఆ విధంగా భగవాన్ శరీరాన్ని సంరక్షించి ఆయన సన్నిధి ఎల్లవేళలా మనకందేలా చేశారు. రెండవది రమణాశ్రమము యొక్క ఆస్తులను పరిరక్షించడానికి ఆయన పోరాడవలసి వచ్చింది. ఆయన వలననే ఇపుడు మనమక్కడ ఉండగల్గుతున్నాము. ఆయన ఎంతో శ్రద్ధతో భగవాన్ వ్రాసిన బోధలని జాగ్రత్త చేశారు. భగవాన్ విరూపాక్ష గుహలోనూ, స్కందాశ్రమం లోనూ ఉన్నపుడు ఆయన వ్రాసిన బోధలన్నీ పోయినవి. ఈ విషయాన్ని భగవానే అంగీకరించారు. రమణాశ్రమానికి వచ్చిన తర్వాత,చిన్నస్వామి ఆధ్వర్యంలో, భగవాన్ వ్రాసిన, ఒక్క మాటకూడా పోలేదు.

చిన్నస్వామి మొదటి మూడు సూత్రాలనూ అతి జాగ్రత్తగా ఆచరించబట్టి, ఆయనకు వ్యక్తిగతమైన ఆధ్యాత్మిక సాధనకు సమయం లేకుండా పోయింది. అయినా భగవాన్ ఆయనపై తన అనుగ్రహాన్ని కురిపించారు. ఆయన తన చివరిరోజులలో తన తప్పులన్నిటికీ మూల్యాన్ని చెల్లించుకున్నారు. ఆయన శరీరం చాలా బాధలకు గురయ్యింది. అపుడు భగవాన్ ఆయనను విముక్తుడిని చేశారు. విశ్వనాధస్వామి దీనికి సాక్ష్యము. “చిన్నస్వామి తన రెండు చేతులను సంతోషంతో ముందుకు జాపారు. భగవాన్ వచ్చి, ఆయనను తీసుకునివెళ్ళి అరుణాచలునిలో ఐక్యతనొందించినట్లుగా,” నేను అనుభూతి చెందాను అన్నారు విశ్వనాధస్వామి.

భగవాన్ భక్తులలో ముగ్గురు విశిష్టమైన వ్యక్తులు చిన్నస్వామి గురించి నాతో చెప్పిన విషయాలను ఇక్కడ ప్రస్తావించడం ఉచితంగా ఉంటుందని భావిస్తున్నాను. ఎస్.ఎస్.కోహెన్ నాతో ఈ విధంగా చెప్పారు, “చిన్నస్వామి 1917లో, భగవాన్ సేవకు తన యావజ్జీవితాన్నీ అంకితం చెయ్యటానికి స్కందాశ్రమంలో ఉన్న గురువుగారి దగ్గరకు వచ్చారు. 1930లో ఆయన ఆశ్రమానికి సర్వాధికారి గావించబడి, ఆశ్రమముయొక్క భౌతిక కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటినుండి 1953లో ఆయన చనిపోయే వరకు ఆశ్రమ శ్రేయస్సుకు, ప్రగాఢమైన భక్తితో, అలుపెరగకుండా పనిచేశారు. దీనినిబట్టి, ఆశ్రమ హక్కుల విషయానికి సంబంధించిన కోర్టుకేసులలోనూ, వ్యాజ్యాలలోనూ ఆయన గట్టిగా నిలబడి, ప్రయాస పడవలసి వచ్చింది. ఇప్పటి రమణాశ్రమము దానికి సంబంధించిన వన్నీ ఆయన కష్టం వల్లా, ఉక్కుసంకల్పం వల్లా ఏర్పడినవే. ఆయన ఆశ్రమ విషయాల్లో ఎంత జాగ్రత్తగా, ఎంత పొదుపుగా ఉండేవారో కుమారునికి ఆయన ఇచ్చిన సందేశం ద్వారా తెలుస్తుంది. ఆయన చనిపోయే ముందురోజు తన కుమారుడు వారసుడు అయిన టి.ఎన్.వెంకటరామన్‌ను పిలిపించి చిన్నస్వామి అన్నారు, ‘నేను స్వచ్ఛమైన అంతరాత్మతోనూ (మలినం అంటని) పరిశుభ్రమైన చేతులతోనూ వెళ్ళిపోతున్నాను. నా లాభం కొరకు ఆశ్రమ నిధులనుండి ఒక్క పైసా కూడా ఖర్చు చెయ్యలేదు. ఇక్కడ ఉన్న వన్నీ భగవాన్‌కు చెందినవే. అందుకని వాటిని జాగరూకతతో శ్రద్ధగా కాపాడాలి. నీవు హృదయస్ఫూర్తిగా మనసా వాచా, రమణ భగవాన్ సేవకు అంకితమైపో, దానికి బదులుగా ఆయన తన అనుగ్రహాన్ని నీపై కురిపిస్తారు. నీ హృదయపు లోతుల వరకూ, నిజాయితీగా సత్యవంతుడివిగా ఉండు. మన పూర్వీకుల గౌరవప్రదమైన సంప్రదాయాన్ని ఇన్నాళ్ళుగా నేను కాపాడుకుని వస్తున్నట్లుగానే నువ్వు కూడా (నిలబెట్టు) కాపాడు.”

1938 వ సం॥ము నుండి తన చివరిరోజుల వరకు ఆశ్రమంలోనే ఉన్న మేజర్ చాడ్విక్ ఈ విధంగా చెప్పారు. చిన్నస్వామి లేకుండా, అసలు రమణాశ్రమమనేది ఉండేదేకాదు. ఆయన దానిని పూరిగుడిసె స్థితినుండి, గట్టి రాతికట్టడంగా అభివృద్ధి పరచారు. ఆయన ఉత్సాహంతో అలుపనేది ఎరుగకుండా కష్టించి పనిచేసేవారు. అతనికిష్టమైనది ఒకటే. భగవాన్‌ను చూడడానికి వచ్చే భక్తులకు, మంచిది, పోషకాహార విలువలుగల ఆహారాన్ని అందించాలని. ఆశ్రమ వాసులమైన మాకు యుద్ధంలో సైనికులు వాడే డాలులాగా, రక్షణనిచ్చేవారు. కాబట్టి ప్రపంచం లోపలా బయటా జరిగేవాటినేమీ పట్టించుకోకుండా మేము ఏ ఆటంకమూ లేకుండా అంతరంగ సాధనలో మునిగిపోయాము. దానిద్వారా, భగవాన్ సన్నిధిలో ఉంటూ పగలూరాత్రీ పరిశుద్ధత పొందాము.

ఆర్థర్ ఆస్‌బోర్న్ ఎల్లప్పుడూ ఆశ్రమానికి వెలుపలే ఉండేవారు. ఎందుకంటే, ఆయన తన కుటుంబంతో ఉండేవారు గనుక. చాడ్విక్ ఆశ్రమవాసి కనుక అతడు యాజమాన్యాన్ని బలపరుస్తున్నారని, ఆస్‌బోర్న్ అయితే నిష్కర్షగా చెబుతారని, ఆయన అభిప్రాయం అడిగాను. ఆస్‌బోర్న్ ఈ విధంగా చెప్పారు, "నాకైతే చిన్నస్వామికంటే గొప్పగా ఆశ్రమాన్ని నిర్వహించే వారెవరూ ఉండరు అన్పిస్తుంది. ఎందుకంటే ఆయన దయామయులైన నా గురువుగారు ఎంపిక చేసిన మనిషి కనుక." భగవాన్ ఎడలగల భక్తితో, ఆయన చిన్నస్వామి నిర్వహణను విమర్శించదలుచుకోలేదు. దానికి బదులుగా ఆయన ఇంకొక అడుగు ముందుకువెళ్ళి, "ఆయన నా గురువుగారి ఎంపిక గనుక అది మంచా, చెడా అని నిర్ణయించడానికి నా మనసు పనిచెయ్యదు. అంతకంటే మంచి నిర్వహణ ఉండకపోవచ్చును," అన్నారు.

చిన్నస్వామి పట్లగల అపారమైన గౌరవంతో ఆయన సాధించిన గొప్ప విషయాలను కొన్నింటిని చెబుతాను. తిరుచ్చుళిలో భగవాన్ జన్మస్థలం ఎంతో పవిత్రమైంది. అది వేలం వెయ్యబడింది. చిన్నస్వామి మేనేజర్ కాగానే, ఆ స్థలాన్ని తిరిగి సంపాదించి భగవాన్‌కూ, ఆయన తల్లితండ్రులకూ ఆలయంగా మార్చారు. ఆయన దానికి 'సుందరమందిరం' అని పేరుపెట్టారు. అది ఇప్పటికీ తిరుచ్చుళిలో ఉన్నది. మనము మరచిపోలేని గొప్ప విషయం. భగవాన్ ఆత్మసాక్షాత్కారం పొందిన ఇంటిని, ఎంతో శ్రమకోర్చి కొని దానిని రమణమందిరమనే పుణ్యస్థలంగా మార్చారు. మందిరము అంటే పవిత్రమైన స్థలము అని అర్థము. ఆ స్థలాన్ని కొనుటకు ఆయన ఎంతో కష్టపడవలసి వచ్చింది. ఈ రెండుచోట్లూ ఇప్పుడు భగవాన్ భక్తులకు యాత్రాస్థలాలుగా మారాయి.

భగవాన్ అరుణాచలానికి వచ్చి ఏబది సంవత్సరాలు అయిన సందర్భంగా, చిన్నస్వామి ఒక పెద్ద ఉత్సవం చేయాలనుకొన్నారు. వేలాది మందికి భోజనాలు ఏర్పాటుచేశారు. ప్రపంచం నలుమూలల నుండి గొప్పగొప్ప పండితులు వచ్చారు. గొప్ప సంగీత కళాకారులు ఆహ్వానించబడ్డారు. భగవాన్ అరుణాచలంనుండి ఎప్పుడూ కదలలేదు గనుక, ఆయనకు గొప్ప సంగీతాన్ని, ఆహారాన్నీ, వగైరాలను అందచేయాలని చిన్నస్వామి కోరిక. వీటిని గురించిన వివరాలు రమణాశ్రమ లేఖలలో ఉన్నవి. అప్పటికి నాకు పదేండ్ల వయసు. వీటినన్నిటినీ నేను స్వయంగానే చూచాను గాబట్టి నాకు గుర్తున్నవి.

నా దృష్టిలో చిన్నస్వామి సాధించిన గొప్ప విషయం, ఈ స్వర్ణోత్సవ వేడుకలే. ఆయన ఆలయంనుండి ఏనుగును రప్పించి భగవాన్‌కు ఆలయ మర్యాదలు చేయించారు. ఆలయంనుండి ఏనుగును ఎందుకు రప్పించారు? అక్కడున్న అన్నివేలమందిలో, భగవాన్ అరుణాచలానికి వచ్చినపుడు ఆయనతో పాటు ఉన్న జీవి అదొక్కటే. అరుణాచలేశ్వర ఆలయంలో ఒక వెయ్యిస్తంభాల మండపం ఉన్నది. అది చీకటిగా ఉండడంతో అందులోకి ఎవ్వరూ వెళ్ళేవారు కాదు. అక్కడ ఒక ఏనుగు కట్టివేయబడి ఉండేది. అక్కడే భగవాన్ కూర్చుని ఉండేవారు. మొదట్లో కొందరు అల్లరిమూకలు భగవాన్ ధ్యానంలో ఉండగా, ఇబ్బంది పెట్టేవారు. అందుకని ఆయన ఏకాంతంగా ఉండడంకోసం ఈ నిర్జనప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఆ ఏనుగే తన ఏకైన తోడు అప్పట్లో అని భగవాన్ చెప్పేవారు. అది గుర్తుంచుకొని చిన్నస్వామి ఆ ఏనుగును రప్పించి దానిచే ఆయనను గౌరవింపజేశారు.

1949వ సం॥లో ఇంకొక భక్తుడు ఆ ఏనుగును మళ్ళీ తీసుకొని వచ్చాడు. ఒక అమెరికన్ భక్తుడు, ఏనుగు భగవాన్‌కు వందనం చేస్తుండగా ఫోటో తీశాడు. ఆయన అమెరికా వెళ్ళిన తర్వాత, ఆ ఫోటో కాపీని పంపించారు. దాని వెనుక ఈ విధంగా వ్రాశారు. శరీరాన్ని ఎరుగని మహా (పెద్ద) ఆత్మ, ఆత్మనెరుగని పెద్ద శరీరము (ఏనుగు) భగవాన్ దీనిని చదవగా, అందరూ సంతోషించారు.

1949లో చిన్నస్వామి అమ్మ ఆలయానికి మహాకుంభాభిషేకాన్ని జరిపించారు. భగవాన్‌కు ఉత్సవాలంటే ఇష్టముగానీ, అయిష్టముగానీ లేకపోయినా భక్తులకోరికపై ఉత్సవంలో చురుకుగా పాల్గొన్నారు. ఆ ఉత్సవం నాలుగు రోజులపాటు చాలా చక్కగా నిర్వహించబడింది. వేలాదిమందికి భోజనం పెట్టబడింది. ఉత్సవం పూర్తి అయిన తర్వాత, అది విజయవంతం కావడానికి కష్టించిన, తోడ్పడిన వారందరికీ బహుమతులు పంచారు చిన్నస్వామి. చిన్నస్వామి అంటే అభిమానించే ఒక బృందం, చిన్నస్వామిని భగవాన్ సన్నిధికి తీసుకుని వచ్చి, అక్కడ ఒక కుర్చీ వేశారు. హిందూభక్తులు చేసినట్లుగా వారు ఆయన కాళ్ళను కడిగి, వాటిని పూలతో అలంకరించ వలెననుకున్నారు. చిన్నస్వామి దీనినిచూడగానే, కుర్చీలో కూర్చొనడానికి నిరాకరించి, కోపంతో ఈ విధంగా అరిచారు, "ఎవరైతే శరీరస్పృహ – అంటే దేహమే నేననే భావం లేకుండా ఉంటారో, వారికే పాదపూజ చెయ్యాలి. నాకింకా దేహాత్మభావన (దేహమే నేననే భావన) ఉన్నది. ఆయన భగవాన్ వైపు చూపించి ఇలా అన్నారు, "అందరికంటే ఉన్నతులయిన భగవాన్ ఇక్కడ ఉన్నారు. ఇక్కడ భగవాన్ తప్ప ఇతరులెవ్వరూ గొప్పవారుకాదు."

భగవాన్‌కు, చిన్నస్వామికి మధ్య ఉండే సంబంధాలను బయల్పరచే సంఘటనలు కొన్ని ఉన్నవి. ఒకసారి భగవాన్ జన్మదినానికి, ముందురోజున సరుకులను నిల్వ ఉంచే స్టోర్‌రూమ్‌లో సరుకులేమీ లేనట్లు గమనించారు ఆశ్రమవాసులు. వందలాదిమంది అప్పటికే వచ్చి ఉన్నారు. చిన్నస్వామి ధైర్యం సడలిపోయింది. ఆయనకు ఏమి చెయ్యాలో పాలుపోలేదు. అక్కడ డబ్బు లేదు. టైమూ (సమయము) లేదు. ఆయన భీతిచెంది అటుఇటు తిరుగ సాగారు. భగవాన్, భక్తులతోగూడి హాలులో ఉన్నారు. అర్ధరాత్రికి, ఒక పెద్ద ఎడ్లబండిలో సరుకులు వచ్చినవి. అందులో బియ్యము, ఆకుకూరలు, నూనె, కూరగాయలు మొదలగువానిని దించి ఆ బండి వెళ్ళిపోయింది. ఆశ్రమవాసులందరూ నిద్రించారు. కూరగాయలు తరగటానికిగానీ, వంట చెయ్యటానికిగానీ ఎవరూ లేరు. భగవాన్ పరిస్థితిని అర్థం చేసుకుని, తన చేతికర్రతో, నిద్రపోతున్న ఆశ్రమవాసులను మెల్లగా తట్టిలేపారు. వారితో ఇలా అన్నారు, "అక్కడ చిన్నస్వామి వేడిపాలలో మూతిపెట్టి కాల్చుకున్న పిల్లిలాగా కొట్టుకుంటున్నారు. మనం వెళ్ళి కూరలు తరుగుదాం. పదండి" అన్నారు. భగవాన్, భక్తులు కలిసి కూరగాయలు తరిగి, మర్నాటికి వంటకాలను సిద్ధం చేశారు. ఆ జన్మదినవేడుకలు ఘనంగా జరిగినవని వేరుగా చెప్పనవసరము లేదు.

పాల్‌బ్రంటన్‌కూ, మునగాల వెంకట్రామయ్యకూ, చిన్నస్వామికీ మధ్య ఏదో వైరుధ్యము ఉండేది. దానిని గురించి నేను వివరిస్తాను. హాలులో జరిగే సంభాషణలను రికార్డు చెయ్యనివ్వకుండా, పాల్‌బ్రంటన్‌ను చిన్నస్వామి అమర్యాదగా నిరోధించినట్లు వ్రాయబడింది. అదే విధంగా 'టాక్స్ విత్ రమణమహర్షి' (రమణమహర్షితో సంభాషణలు) అనే భక్తులందరూ చదవ తగిన పుస్తకాన్ని వ్రాసిన మునగాల వెంకట్రామయ్యగారి విషయంలో కూడా చేసినట్లు ఆరోపణలున్నవి. పాల్‌బ్రంటన్‌ని సంభాషణలు వ్రాయకుండా చిన్నస్వామి అడ్డుపడిన మాట నిజమే. అది ఎందులకంటే, భగవాన్ సన్నిధిలో సంభాషణలను నోట్ చేసుకుని, వాటిలో భగవాన్ పేరునైనా వ్రాయకుండా, ఆ పుస్తకాలను అమ్మటం ప్రారంభించారు పాల్‌బ్రంటన్. అంతేగాక తన పుస్తకం వల్లనే భగవాన్ ప్రజాదరణ పొందినట్లు ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయం తెలియగానే, చిన్నస్వామి హాలులో పాల్‌బ్రంటన్ కూర్చున్న చోటికి వచ్చి, నిర్మొహమాటంగా కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారు, "ఆపు. ఈ పని చెయ్యడానికి నీకు హక్కు లేదు," అన్నారు. బ్రంటన్ కోపంతో మండిపోయి, భగవాన్‌వైపు తిరిగి, "భగవాన్ ఉద్దేశం కూడా అదేనా?" అని అడిగారు. భగవాన్ మౌనంగా ఉన్నారు.

అలాగే మునగాల వెంకట్రామయ్యగారు భగవాన్ సంభాషణలను నోట్‌బుక్‌లో వ్రాసుకుని, ఆశ్రమము బయట కొంతమందిని పోగుచేసి, వారి మెప్పు పొందాలనుకునేవారు. అది చిన్నస్వామి దృష్టికి రాగానే, ఆయన హాలులోకి వెళ్ళి భగవాన్ సమక్షంలోనే మునగాల వెంకట్రామయ్యగారిని కూడా వ్రాయనివ్వకుండా ఆపేశారు. అందరిముందు అవమానింపబడి నందుకు మునగాల వెంకట్రామయ్యగారు కూడా తీవ్రంగా మనస్తాపం చెందారు. తర్వాత భగవాన్‌తో ఆయన ఉన్నపుడు, ఆ విషయాన్ని తలచుకొని బాధచెందుతున్నపుడు, భగవాన్ అన్నారు, "అన్నిటికంటె పెద్దదయిన అహం భావం ఏమిటంటే, నేను అందరికీ బోధ చెయ్యాలి, నేనొక గురువును అవాలి అనుకోవటమే." ఇది తనను ఉద్దేశించిన సందేశమని అర్థం చేసుకుని, మునగాల వెంటనే భగవాన్ ముందు ప్రణమిల్లి ఆయనను క్షమాపణ వేడారు. భగవాన్ ఆయనను రక్షించారు. తర్వాత మునగాల ఆయనే స్వయంగా అన్నారు, "నిజమైన సాధకుడు బోధకుడిగా మారితే (బోధించేవానిగా) ముందుగా జరిగేది అతని ఆధ్యాత్మిక అభివృద్ధి నశించిపోవడమే."

నేను బ్రంటన్‌తో పరిచయం కలిగి ఉన్నాను. తను భగవాన్ వద్దకెళ్ళి క్షమాపణ వేడుకున్నట్లు ఆయన ఒప్పుకున్నారు. భగవాన్ ఎంత చక్కగా వారి తప్పులను సరిదిద్ది, తిరిగి వారిని సాధనలోనికి మళ్ళించారు! పాల్‌బ్రంటన్, మునగాల వెంకట్రామయ్య, వీరిద్దరూ కూడా తరువాతి కాలంలో ఆత్మసాక్షాత్కారం పొందారు. ఇదే భగవాన్ ఉద్దేశం కూడా. మునగాల వెంకట్రామయ్య, పాల్‌బ్రంటన్‌ల రచనలద్వారా భగవాన్ బోధలకు ప్రచారం జరిగి సమాంతర అభివృద్ధి జరిగింది. భగవాన్ వారికి ఊర్ధ్వముఖ (నిట్టనిలువు) అభివృద్ధిని (అంతరంగ సాధనలో పురోగతిని) ప్రసాదించారు. దానికొరకు, చాకలివారు, బట్టలను ఉతకటానికి వాడే బండవలె, వారి దోషాలను తొలగించడానికి, చిన్నస్వామి ఉపయోగించబడ్డారు. ఇది మునగాల నాతో చెప్పినమాటే, “ఆయన చిన్నస్వామిని చాకలివాని బండలాగా ఉపయోగించారు. మేమందరం చిన్నస్వామిని నిందించాము. కానీ నిజానికి, ఆయన ద్వారా భగవాన్ మమ్ములను (దారి తప్పకుండా) కాపాడారు”.

ఇలా చాలా సంఘటనలు నేను చెప్పగలిగి ఉన్నప్పటికీ, అన్నామలైస్వామి గురించిన ఉదంతం ముఖ్యమైనది. అణ్ణామలైస్వామి ఆశ్రమంలోని కట్టడాలకు బాధ్యత వహించారు. కానీ ఆయన మామూలు బిల్డింగులను మాత్రమే కట్టగలరు. చిన్నస్వామి ఆలయ నిర్మాణానికి పూనుకున్నపుడు దక్షిణ భారతదేశం మొత్తం నుండి ప్రత్యేక కళాకారులు (శిల్పులు) రప్పించబడ్డారు. నిర్మాణం మొదలైన తర్వాత, ఒకసాంకేతిక సమస్య (Technical Problem) తలెత్తింది. దానిని అణ్ణామలైస్వామి తొలగించలేకపోయారు. అయినా తన ధోరణిలోనే పనులు సాగాలని, ఆయన అనుకున్నారు. ఆలయశిల్పులు, చిన్నస్వామి, ఆయనతో ఏకీభవించలేదు. అందుచే ఆయనను వెళ్ళిపొమ్మని చెప్పారు. అణ్ణామలైస్వామి తర్వాత నాతో ఈ విధంగా చెప్పారు, “బాహ్యంగా చూస్తే, చిన్నస్వామి నాతో పోట్లాడి నన్ను వెళ్ళగొట్టారు. కానీ అలా జరగడం నాకు అవసరమేనని తర్వాత నేను గుర్తించాను. అలా జరుగకపోయినట్లైతే, నా జీవితాంతం వరకు ఆశ్రమంలో బిల్డింగులు కడుతూనే ఉండేవాడిని. దీనిని గుర్తించి, భగవాన్ నన్ను ఆశ్రమ ఆవరణలోనికి అడుగుపెట్టవద్దని శాసించారు. ఇది భగవాన్ నన్ను నిందించడం కాదు అని తర్వాత బుజువైంది. ఎలాగంటే భగవాన్ దాదాపు ప్రతిరోజూ పల్లాకొత్తులో ఉన్న నా కుటీరానికి వచ్చి, నా నిరాండంబరతనూ, నియమనిష్ఠలనూ, సాధననూ, ఏకాంతాన్నీ ప్రోత్సహించేవారు. భగవాన్ నా కుటీరంలో నాకు ఏకాంతంగా బోధించడమనేది ఎటువంటి భాగ్యము! ఇదంతా చిన్నస్వామి నాపై మండిపడడం వల్లనే జరిగిందని నిజాయితీగా చెప్పగలను. నేను లోనికి మునిగాను, మన భగవానే నా హృదయంలో ఉన్న ‘అహం’ (నేను) అని నాకు అంతరజ్ఞానం కలిగింది.

పాతభక్తులందరూ, ఎందుకు పల్లాకొత్తుకు వెళ్ళారో, విశ్వనాధస్వామి నాకు వివరించారు. “మేము మా సాధన చేసికొనడానికి వెళ్ళాము.” భగవాన్ దీనికి అంగీకరించారు. “మీరు ఏ విధంగా కుటీరం నిర్మించుకోబోతున్నారు?” అని అడిగేవారు. వీధులలోనికి వెళ్ళి బిచ్చమెత్తుకొమ్మని ఆయన మమ్ములను ప్రోత్సహించే వారు. దీనివలన మేము రోజంతా భగవాన్‌తో గడపగలిగే వాళ్ళము. దీనివలనే మేము సాక్షాత్కారాన్ని పొంది సహజస్థితిలో నిలచిపోయాము. ఇది ఆశ్రమాన్ని వదలిపెట్టటం వల్లనే సంభవమైంది. భగవాన్ ఈ విధంగా జరగాలని భావించారు.

చిన్నస్వామి యొక్క అనుచిత ప్రవర్తన వలన అందరికంటే ఎక్కువ బాధపడింది విశ్వనాధస్వామి. ఒకసారి ఆయన మూడురోజులపాటు భోజనం లేకుండా నిరాహారిగా ఉండవలసి వచ్చింది. వంటశాలలో ఉండే సహాయకులు ఒకరు, ఆయనను, వంటగదిలోనుండి భోజనశాలలోనికి తీసుకుని వెళ్ళి, అందరితో పాటు కూర్చోబెట్టారు. ఆయన సరిగ్గా భోంచెయ్యబోయే సమయానికి, చిన్నస్వామి లోపలకి వచ్చి ఆయనను బయటకు తోసేశారు. భగవాన్ ఏ విధమైన ఆక్షేపణ చెయ్యకుండా దీనినంతా చూస్తూ ఉన్నారు.

విచిత్రంగా చిన్నస్వామి ఆఖరి దినాలలో, విశ్వనాథస్వామే ఆయనకు సేవచేశారు. “అంత తీవ్రంగా బాధపెట్టబడి, అవమానింపబడినా, మీరెలా ఆయనకు సేవలు చెయ్యగలిగారు?” అని నేను ఆశ్చర్యంతో అడిగాను. నేను దిండిగల్‌లో ఉండగా, భగవాన్ నా కలలో కనబడి, రమణాశ్రమానికి రమ్మన్నారు. నేను వెంటనే బయల్దేరి, ఆశ్రమానికి వెళ్ళాను. అది 1953వ సంవత్సరము. అప్పటికే భగవాన్ శరీరాన్ని విడిచిపెట్టేశారు. ఆయన నన్నెందుకు రమ్మన్నారో, నాకు అంతుచిక్కలేదు. నేను వచ్చేటప్పటికి చిన్నస్వామి తీవ్రంగా జబ్బుపడి సహాయకులెవరూ లేకుండా ఉన్నారు. ఈ కారణం వల్లనే భగవాన్

నన్నిక్కడకు రమ్మని ఉంటారని నేననుకున్నాను. 'నేను పగలు, రాత్రి ఆయనతో ఉండి సేవలు చేసి, ఆయనకు స్నానం చేయించేవాడిని. ఒకరోజు చిన్నస్వామి నా చేయి పట్టుకుని క్షమించమని ప్రాధేయపడ్డారు. అది విచారకరమే అయినా, చిన్నస్వామి తను చేసిన పనులవల్ల మిక్కుటంగా బాధలు పడవలసి వచ్చింది. భగవాన్ ఆయన తప్పులనన్నింటినీ మౌనంగా గమనించి, భౌతికబాధల ద్వారా, వాటికి మూల్యం చెల్లించేటట్లు చేశారు. చిన్నస్వామి తన చివరి రెండురోజులూ, భగవాన్ ఫోటోవంక చూస్తూ, అనుక్షణమూ రమణ, రమణ, రమణ అని స్మరిస్తూనే ఉన్నారు. చనిపోయేసమయాన కనులు మూసుకుని చేతులు చాచి ఉన్నారు. ఆయన ముఖం ప్రశాంతంగా, సంతోషంగా, ప్రకాశవంతంగా ఉంది. భగవానే వచ్చి ఆయనను తీసుకుని వెళ్ళి అరుణాచలేశ్వరునిలో ఐక్యమొందించారు. చిన్నస్వామి సమాధి నిర్మాణంలో పాత్రవహించిన నేను దానికి సాదాగా, ఒక రాతి పలకపై కేవలం 'నిరంజనానందస్వామి' అని ఆయన పేరు వ్రాసి, ఆయన పుట్టిన తేదీ, చనిపోయిన తేదీ వేయిద్దామనుకున్నాను. దానికి బదులుగా రాళ్ళపై పేర్లు చెక్కే ఆయన, ఒక రాతిపలకను పంపారు. దానిపై 'నిరంజనానందస్వామి 29.01.1953న అరుణాచలునిలో ఐక్యమైనారు' అని చెక్కబడి ఉన్నది. అది నాకు ఆనందాన్నిచ్చింది. తర్వాత కట్టిన పదిహేను సమాధులకు నేను అటువంటి రాతిపలకలనే అమర్చాను. ఉదాహరణకు (అరుణాచలునిలో ఐక్యమైనారు - మురుగనార్', 'అరుణాచలునిలో ఐక్యమైనారు - కుంజుస్వామి', 'అరుణాచలునిలో ఐక్యమైనారు - మేజర్ చాడ్విక్')

(అరుణాచలంనుండి దొర్లుకుంటూ వచ్చిన అతిపెద్ద బండరాళ్ళలో ఒకరైన చిన్నస్వామిని గుర్తుంచుకుందాం. ఆయన మన గురువుగారి సేవకొరకై వచ్చారు. గురువుగారి ఏకైక లక్ష్యం (లక్ష్యమనేదే ఉంటే) తనయొక్క స్థితినే అందరికీ లభ్యమయేటట్లు చెయ్యడం)

తనయొక్క స్థితినే అందరికీ లభ్యమయ్యేటట్లు చెయ్యడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న, మన గురువుగారి సేవకొరకై అరుణాచలంనుండి దొర్లుకుంటూ వచ్చిన అతి పెద్ద కొండరాళ్ళలో ఒకటైన నిరంజనానందస్వామిని గుర్తుంచుకుందాం!



శ్రీ భగవాన్‌తో చిన్న స్వామి

బి.వి.నరసింహస్వామి



భగవాన్ జీవితములోని సంఘటనలన్ని ఒక చక్కని పరిణామక్రమంలో ఎలా సాగిపోయినవో మనము గమనిస్తే, అందులోని ఒక గాఢమైన సౌందర్యం మనకు కానవస్తుంది. కాలక్రమేణా తనను తానే నెమ్మదిగా, స్థిరముగా విశదపరచుకున్న దివ్య ప్రణాళిక అది. దానిని లోతుగా పరిశీలిస్తే, అది కేవలము బాహ్యప్రణాళిక ఎంతమాత్రమూ కాదని మనము గుర్తిస్తాము. అదే పరిణామము మనలో కూడా చోటు చేసుకొనుటకు ఆరంభిస్తుంది. అదే ఒక మహాత్ముని సాన్నిధ్యములో ఉండుట వలన గానీ, ఆయన గురించి చదువుట, లేదా తెలుసుకొనుట వలనగానీ సిద్ధించే గొప్ప ప్రయోజనము.

మన ప్రియమైన భగవాన్, 1916-1922 సం॥ముల మధ్యకాలములో స్కందాశ్రమములో ఉన్నారు. ఆ కాలము లోనే తీవ్రంగా సాధన చేసుకునే ఆధ్యాత్మిక సాధకులు నెమ్మదిగా ఆయన వద్దకు రావటము ప్రారంభించారు. ఈ అద్భుతమైన కాలములోనే, భగవాన్ తమ ఒక్క చూపుతోనే పరిపక్వస్థితిలో నున్న భక్తులను వారి అంతరంగములోని ఏకాంతములో నిలుపగలిగే వారు. అదే సమయములో కేరళకు చెందిన మహనీయుడు, నారాయణ గురు కూడా, రమణులను దర్శించుకున్నారు, భగవాన్ యొక్క మహత్తర స్థితి ఆయనను ముగ్ధుల్ని చేసి పరవశంలో ముంచివేసింది. ఆయన తన శిష్యులిద్దరిని పిలిచి, మీరిక్కడ ఆరు నెలలుపాటు ఉండి మహర్షిని సందర్శించే యాత్రికులకు భోజన, వసతి సదుపాయములను కల్పించండి వేలాది మంది, ఈ మహర్షి అనబడే ఆధ్యాత్మికపెన్నిధిని దర్శించుకుని ఆధ్యాత్మిక లాభమును పొందే అవకాశమును కల్పించండి, నిజమైన సాధకుల, పండితుల సమాజాలలోనికి మీరు వెళ్ళి, వారితో మాట్లాడి మహర్షి ఆధ్యాత్మిక వైభవాన్ని గురించి వారికి చాటిచెప్పండి.

భగవాన్ యొక్క ఔన్నత్యము, ఆయన బోధ వ్యాపించటానికి ముందుగా, తండ్రియైన అరుణాచలుడు, రెండు చర్యలు జరిగేటట్లు చూశారు. మొదటిది భగవాన్ గొప్పతనాన్ని గుర్తించి, ఆయనకు ఒక నామధేయాన్ని ఇవ్వటమనే పనిని కావ్యకంఠగణపతి ముని ద్వారా జరిపించారు. అరుణాచలుడు, ఆ కాలంలోని ఉద్ధండపండితుడిచే ఈ చిన్న బ్రాహ్మణ బాలునికి 'భగవాన్ శ్రీరమణ మహర్షి' అని నామకరణం చేయించారు. రెండవ చర్య ఆయన బోధలు ఒక చక్కని క్రమంలో పొందుపరచబడాలి. దీనికొరకు భగవాన్ 'నేనెవరను?' అనే బోధను శివప్రకాశంపిళ్ళై ద్వారా, 'ఆత్మవిచారణ'ను గంభీరం శేషయ్య ద్వారా 'శ్రీరమణగీత'ను కావ్యకంఠగణపతిముని ద్వారా చక్కగా వివరించారు.

అవసరమైన ఈ రెండుపనులూ జరిగిన తర్వాత, తండ్రి అరుణాచలుడు, తన పుత్రుడైన రమణుని, తన ఒడిలోనుండి, పాదాల వద్దకు చేర్చారు. ఎందుకంటే అప్పటికి ఆయన బోధలు మానవాళిలో వ్యాపించవలసిన సమయమాసన్నమైనది గనుక, మూడవచర్యగా అరుణాచలుడు మూడు గండశిలలను (కొండరాళ్ళను) పంపారు. ఈ మూడవచర్య ఆయన బోధలను వ్యాపింపచేయటం. ఆ మూడు గండశిలలూ, 1. బి.వి.నరసింహస్వామి, 2. శుద్ధానంద భారతి, 3. క్రిష్ణభిక్షు. ఈ ముగ్గురు పండితులు, భగవాన్ బోధలన్నిటిని కలిగియున్న ఆయన జీవితచరిత్రను వ్రాయడానికి పంపబడ్డారు. వారి అంకితభావము చేత, వారు ఎంతో కష్టపడి పనిచేయటము వల్లనే, భగవాన్ గురించిన వివరాలు మనకు తెలిసినవి.

బి.వి.నరసింహస్వామి ఆత్మసాక్షాత్కారము (Self Realisation) : శ్రీరమణమహర్షి జీవితము- బోధలు అనే పుస్తకాన్ని వ్రాశారు. అదే భగవాన్ జీవితం గురించి వ్రాయబడిన మొదటి పుస్తకం. బి.వి.నరసింహస్వామి ప్రత్యేకమైనవారు. ఎందుకంటే ఆయన భగవాన్ జీవితచరిత్రను ఇంగ్లీషులో వ్రాయుట కొరకు, తనను తాను అంకితం చేసుకున్నారు. ఆయన దానికొరకు రెండువేల పేజీలకు సరిపడే సమాచారాన్ని సంగ్రహించి, దానిని చాలా నేర్పుతో కుదించి, సంగ్రహంగా, చదవడానికి తేలికగా ఉండేటట్లు రెండు వందల యాభై పేజీలుండే గ్రంథంగా తయారుచేశారు. అది 1930లో ప్రచురించబడ్డది. ఈ 'ఆత్మసాక్షాత్కారము' అనే పుస్తకము చదివిన తర్వాతనే, పాల్‌బ్రంటన్, క్రిష్ణభిక్షు, ప్రభవానంద, స్వామిమాధవతీర్థ,

శుద్ధానందభారతి, స్వామి శివానంద, స్వామి రామదాస్, ఇంకా అనేకమంది గొప్ప ఆధ్యాత్మికవేత్తలు రమణమహర్షి వద్దకు వచ్చారు. మహర్షికి గొప్ప గుర్తింపు తెచ్చింది పాల్‌బ్రంటన్ అని చాలామంది అనుకుంటారుగానీ, వారికి తెలియదు, ఈ గ్రంథం వల్లనే, ఆయన భగవాన్ వద్దకు వచ్చారని.

బి.వి.ఎన్.స్వామి అరుణాచలానికి తొంభైమైళ్ళ దూరంలోని సేలంలోని ఒక ప్రముఖన్యాయవాది. ఆయన గొప్ప పేరు పొందిన రాజకీయవేత్త, గొప్ప వక్త (ఉపన్యాసకుడు) మంచి రచయిత. ఆయన కత్తివంటి పదునైన మేధస్సుతో ఏ విషయాన్నైనా దాని లోతులలోనికి వెళ్ళి దానిలో ఉన్న సత్యాన్ని దానిలోని సారాన్ని వెలికిదీయగల దిట్ట. ఈయన ప్రశ్నించే తత్వం వల్లనే, ఈ అద్భుతమైన గ్రంథం మనకు లభించింది. ఇది వ్యాప్తిచేయగల అనేకమంది పాఠకులను ఆకర్షించి, వారిని పశ్చిమదేశాలకు అద్వైతద్వారంగా నిలిపింది. (అంటే వారి ద్వారా, అద్వైతాన్ని వెదుక్కుంటూ పాశ్చాత్యులు బయల్దేరారన్న మాట).

ఏమైనప్పటికీ, భగవంతుని దివ్యలీల ముందుగా ఊహించరానిది, అది ఒక రహస్యము. బి.వి.నరసింహస్వామి మంచి పేరుప్రఖ్యాతులతోనూ, సిరి సంపదలతోనూ వైభవంగా తులతూగుతున్నపుడు, ఆయన కుటుంబంలో చోటు చేసుకున్న ఒక గొప్ప విషాదం ఆయనను తీవ్రమైన విభ్రాంతికి గురిచేసింది. ఆయన ఇద్దరు కుమార్తులు, ఆయన కళ్ళముందే ఆయన పెరట్లోనే ఉన్న బావిలో పడిపోయారు. ఆయన అప్పుడు చేయగల్గిందల్లా నిస్సహాయంగా గుడ్లప్పగించి చూడడం మాత్రమే. ఈ దుఃఖాన్ని భరించలేక ఆయన 'వార్‌కౌన్సిల్'కు రాజీనామా చేశారు. రాజకీయ జీవితానికి స్వస్తి పలికారు. ఆయన ఎంతోమంది భారతీయ నేతలను నిరాశపరచారు ఎందుకంటే, ఆనాటి భారతీయస్వాతంత్ర్య సంగ్రామానికి ఆయనవంటి మేధావుల అవసరమెంతగానో ఉన్నది. ఆయన రమణమహర్షిని గురించి తెలుసుకొని తిన్నగా రమణాశ్రమానికి వెళ్ళారు. భగవాన్‌ను చూడగానే ఆయన కాళ్ళపై పడిపోయారు. భగవాన్‌కూడా ఆయనను ఒక్క చూపుతోనే అంగీకరించి, ఆయనకొక చిన్న గుహను చూపించి అందులో ధ్యానము చేసికొమ్మని చెప్పారు.

ఒక మంచి శిష్యునిగా, ఆయన ఎదురుచెప్పకుండా గురువుగారి ఆజ్ఞను పాటించారు. ఆయన మూడేళ్ళపాటు ఏకాంతంలో, పూర్తిగా చింతనలోనూ ధ్యానంలోనూ గడిపారు. ఆయన ఏదో ఒకటి అత్యవసరమైన పని ఉన్నది అని గుర్తించారు. అది ఏమిటంటే భగవాన్‌జీవితంపై ఒక గ్రంథం. నేను తప్పనిసరిగా సజీవులైన మహర్షియైన భగవాన్ జీవితచరిత్రను వ్రాయాలి అనుకున్నారు. ఎవరికీ ఏవో చెదురుమదురు సంఘటనలు తప్ప ఆయన జీవితాన్ని గురించి తెలియదు. ఆ తెలిసిన కొన్ని విషయాలు కూడా నిజమో కాదో తెలియదు. అది గొప్ప బాధాకరమైన బాధ్యత. ఎందుకంటే భగవాన్ సంపూర్ణ మౌనాన్ని పాటించనప్పటికీ, అప్పుడు కూడా పెద్దగా మాట్లాడే వారు కాదు. తన గురించి అసలే మాట్లాడేవారు కాదు. బి.వి.ఎన్., భగవాన్ అనుమతిని కోరారు. ఆయన దయతో అంగీకరించారు. ఆయన భగవాన్‌ను ప్రశ్నించడం మొదలుపెట్టారు. భగవాన్ ప్రతిసారీ స్పందించేవారు కాదు. ఎందుకంటే కొన్నిసార్లు ఆయన మౌనాన్ని వీడడానికి ఇష్టపడేవారుకాదు. ఏమైనప్పటికీ బి.వి.ఎన్. పట్టుదలతో ఉన్నారు. ఆయన మొండి పట్టుదలతో భగవాన్‌ను అనుసరించే వారు. ఆయన ఎక్కడకు వెళ్ళినా తనుకూడా ఆయనతోపాటు వెళ్ళేవారు. రాత్రిపూట కూడా, ఆయన ప్రక్కనే నిద్రించే వారు. ఆయన ఒక ప్రశ్న అడిగినప్పుడు, ఆయన శ్రద్ధ అంతా ఆ ప్రశ్నకు సమాధానం రాబట్టటం మీదే లగ్నమై ఉండేది. ఒకచిన్న సమాధానాన్ని భగవాన్‌నుండి రాబట్టటానికి, కొన్నిసార్లు రోజులు, వారాలు, ఇంకా ఎక్కువ సమయంగానీ పట్టేదని ఆయన వ్రాసుకున్నారు. అయినా ఆయన పట్టు విడువలేదు. ఆయన దృఢనిశ్చయం ఆయనకొక ప్రత్యేకతను ఆపాదించింది. అందుకే ఆయనపేరు వినగానే, భగవాన్ పాత భక్తులందరూ ఎంతో గౌరవిస్తారు.

ఆయన భగవాన్‌ను ప్రశ్నలు అడగటంతో మానలేదు. దేని వివరాలనైనా మూలంనుండే రాబట్టటం ఆయన స్వభావం. అందుకని ఆయన తిరుచ్చుళికి, మధురైకు, దిండిగల్‌కు, భగవాన్‌తో పరిచయమున్న వారితోటి, బంధువులతోటి మాట్లాడడానికి వెళ్ళారు. ఎప్పుడైనా ఆయన భగవాన్ బంధువుగానీ, స్నేహితుడుగానీ ఏదైనా గ్రామంలో ఉన్నారని తెలియగానే వెంటనే అక్కడకు వెళ్ళిపోయేవారు. వారిని అదేపనిగా ప్రశ్నించేవారు. ఆయన ఎంత నిక్కచ్చి మనిషి అంటే వారి దగ్గరనుండి లభించిన సమాచారము సరైనదో కాదో భగవాన్‌ను అడిగి తెలుసుకునేవారు. ఆయన తను వ్రాసేదానిలో, అసత్యాలు,

లోటుపాట్లు లేకుండా ఉండడానికి ఎంతో శ్రమపడ్డారు. అందుకని ఆయన పుస్తకంలో వ్రాయబడ్డ ప్రతి విషయమూ కూడా ఖచ్చితమైనదీ, నిజమైనదీ,ప్రామాణికమైనదీ. పాతభక్తులు చెప్పిన దాంట్లో ఎక్కువ ప్రాముఖ్యత సంతరించుకున్న అంశాలలో, ఒకటి ఏమిటంటే, మధురైలో భగవాన్ మృత్యు అనుభవం గురించి, అంత స్పష్టమైన వివరణ రావటానికి బాధ్యులు ఆయనేనని. అందులకు ఆయనకు మనము ఋణపడి ఉన్నామనీ. ఎడతెగకుండా వేసిన తన ప్రశ్నల ద్వారా, భగవాన్ పదహారేండ్ల బాలునిగా ఉన్నప్పుడు జరిగిన మృత్యు అనుభవం యొక్క సూక్ష్మాతిసూక్ష్మ వివరాలతో సహా ఆయన భగవాన్‌నుండి రాబట్టారు. తను సహజస్థితిలో స్థిరంగా నిల్చిపోవడానికి (ఆ మార్పుకి) దేశకాలాలతో నిమిత్తం లేదని భగవాన్ తెల్పారు. బి.వి.నరసింహస్వామి, తాను సంపాదించిన సమాచారాన్నంతా కుదించి, శుద్ధప్రతిని భగవాన్‌కు అందించారు. ఆయన దానిని అనుమతించి, దానికి 'ఆత్మసాక్షాత్కారము' అని పేరుపెట్టారు.

ఒకసారి ఆ పుస్తకం పని అయిపోయిన తర్వాత, ఆయన తన గుహ ప్రక్కనే వంట చేసుకోవడం కోసం ఒక చిన్న పాకను నిర్మించుకున్నారు. ఆయన మిగిలిన సాధకులను కూడా అలాగే నిర్మించుకోమని చెప్పి, వారికి ఆ పనిలో సాయం చేశారు. ఆయన వారికి తేలికపద్ధతిలో వంట చేసుకోవడం నేర్పించారు. అందువలన వారికి సమయము, డబ్బు ఆదా అయి, ప్రతి సాధకుడు భగవాన్ సన్నిధిలో ఎక్కువ సమయం గడిపేందుకు వీలు కలిగింది. అత్యంత శ్రద్ధాపూర్వకమైన తన సాధన ద్వారా, గురువుగారి బోధలను ఎలా పాటించాలీ అనే దానికి, ఒక గొప్ప ఉదాహరణగా నిల్చారు ఆయన. ఆ పల్లాకొత్తు సమాజాన్ని తయారుచేసింది ఆయనే.

ఇదంతా పూర్తయిన తర్వాత ప్రారబ్ధవశాత్తు ఆయనలో ఒక వాసన ఉత్పన్నమైంది. అది ఏమిటంటే పారవశ్యంతో భజనలు పాడాలనీ, భావోద్వేగంతో నృత్యం చేయాలనీ. ఆయన భగవాన్‌ను అర్థించడం మొదలు పెట్టారు. "భగవాన్, ఇది నా స్వభావం. దయచేసి నాకు మార్గం చూపండి." భగవాన్ సమాధానమివ్వకుండా దాటేసేవారు, అయినా బి.వి.ఎన్. వదలి పెట్టలేదు. చివరకు భగవాన్ ఇలా సలహా ఇచ్చారు, పశ్చిమభారతదేశానికి వెళ్ళి, ఆయన (తన) భక్తి మార్గాన్ని అనుసరించమని. బి.వి.ఎన్. అరుణాచలాన్ని వీడి ముంబై వైపు ప్రయాణమయ్యారు. ఆయన యాత్రలలో ఎంతోమంది భక్తిమార్గంలో ఉన్న సాధువులను కలసికొన్నప్పటికీ, ఆయనకు నిరాశ మాత్రమే మిగిలింది. ఉపాసనీ బాబా వంటి మహాత్ముడు, ఆయనకు సాయపడదామని చూసినా, ఆయనకు తృప్తి కలుగలేదు. చివరకు ఉపాసనీ బాబా ఆయనకు షిర్డీ వెళ్ళమని చెప్పారు.

ఆయన ఆ మాటలను పాటించి షిర్డీసాయిబాబా సమాధి వద్దకు వెళ్ళారు. అప్పటికి బాబా చనిపోయి పది లేక పదిహేను సంవత్సరాలై ఉంటుంది. రాత్రివేళలందు భక్తితో భజనలు చేసుకోవడానికి భక్తులు అక్కడకు చేరేవారు. ఆయన సాయిబాబా సమాధి ముందు నిల్చుని ఉన్నపుడు సాయిబాబాయొక్క దివ్యజ్ఞానము లేదా ఆవేశము ఆయనలోనికి ప్రవేశించి, "బిడ్డా, నేనే నీ గురువును. ఇక్కడనే ఉండి, నా చరిత్ర వ్రాయి" అన్నారు. బి.వి.ఎన్. అప్పుడు సాయిబాబాతో కలసి ఉన్న వారిని కలుసుకుని, వివరాలను సేకరించి, ఆ మహాత్ముని యొక్క జీవితచరిత్రను (ఆరుభాగాలుగా) తయారు చేశారు. అది పూర్తయిన పిమ్మట, బాబా ఆయనకు ఇలా చెప్పారు. నా పేరును వ్యాపింపచెయ్యి. ఈ బోధను కూడా వ్యాపింపచెయ్యి. అప్పుడు ఆయన చెన్నైకి వచ్చి, ఒక సాయిబాబా కేంద్రాన్ని స్థాపించారు. అక్కడ ఆయన ఒక గుడిని కూడా నిర్మించి సాయిబాబా పేరును భారతదేశమంతటా వ్యాపింపచేశారు.

నేను 1960లో రమణాశ్రమానికి వచ్చినపుడు అటువంటి విశిష్టమైన వ్యక్తి భగవాన్‌ను వదలి వేరెక్కడికో వెళ్ళారని విని బాధపడ్డాను. ఒకరోజు నేను, టి.పి.రామచంద్ర అయ్యర్ అనే మరొక పాతభక్తుని అడిగాను. "ఎందుకు నరసింహస్వామి భగవాన్‌ను వదలి వేరొక చోటుకు వెళ్ళారు?" అని. టి.పి.రామచంద్ర అయ్యర్ ఇలా బదులిచ్చారు, "నువ్వు ఈ ప్రశ్న అడిగినందుకు నాకు సంతోషంగా ఉంది. నాకు తెలిసిన ఒక నిజాన్ని వేరే వాళ్ళ దగ్గర చెప్పటానికి నేను సందేహిస్తున్నాను." 1955 చివరి భాగంలోనో, 1956 ప్రారంభంలోనో టి.పి.రామచంద్రఅయ్యర్, తిరువణ్ణామలైనుండి వెల్లూరు వెళ్ళే రైలులో ఫస్ట్‌క్లాస్ బోగీలోనికి ఎక్కారు. ఒక కాలు విరిగి పెద్దకట్టుతో అదే పెట్టెలో కూర్చుని ఉన్న బి.వి.నరసింహస్వామిని చూచి ఆయనకు ఆశ్చర్యం కలిగింది. బి.వి.నరసింహస్వామి అంటే అత్యంత గౌరవం గల ఇతర పాతభక్తుల వలెనే ఈయన

కూడా బి.వి.ఎన్‌ను చూసి సంతోషించారు. "నీవు నన్ను అడిగిన ప్రశ్ననే నేను ఆయనను అడిగాను, గణేశన్. ఎందుకు మీరు భగవాన్‌ను వదలి వెళ్ళారు అని అడిగాను." నరసింహస్వామి నాతో అన్నారు, భగవాన్ నాకు ప్రత్యేకంగా అలా చెయ్యమని చెప్పారు. మేమిద్దరము మాత్రమే ఉన్నపుడు నాకు భజనలు పాడాలని ఆసక్తి ఉందని ఆయనను వత్తిడిచేశాను. నామీద జాలితో ఆయన షిర్డీకు వెళ్ళమన్నారు. ఆయన నేను షిర్డీబాబా జీవితచరిత్ర వ్రాయవలసి ఉందనీ, బాబా గురించి భారతదేశం మొత్తానికీ తెలిసేలా చెయ్యాలనీ చెప్పారు. చెప్పింది భగవాన్ కనుక నేను దానికి ఒప్పుకున్నాను. కేవలం ఉట్టుట్టి భజనలూ, భావోద్వేగపు నృత్యాలకంటే, వేరొక మహాత్ముని ద్వారా అయినా నా ఆశలు, ఆశయాలు సరైన మార్గంలోకి మళ్ళించబడాలని ఆయన భావించారు. నేను భగవాన్ చెప్పినమాట వినలేదు, ఆజ్ఞను సత్యంగా పాటించలేదు. నా తప్పును నేను ఒప్పుకుంటాను. వేరే సజీవులైన మహాత్ముల వద్దకు వెళ్ళాను. సాయిబాబా ఇప్పుడు జీవించిలేరుకదా. ఆయన నాకెలా మార్గదర్శనం చూపగలరని సందేహించాను. ఇది నా మనసు చేసినపని. ఆ జీవించి ఉన్న మహాత్ములతో కలిసి ఉండాలని నేను చేసిన ప్రయత్నాలు నిరాశనే మిగిల్చినవి. చిట్టచివరికి షిర్డీలో సాయిబాబా తనే నా గురువని తెలియజేసి, నన్ను ఆయన సంరక్షణలోనికి తీసుకుని, తన అనుగ్రహాన్ని ప్రసాదించారు. నేను శాశ్వతంగా భగవాన్‌కు ఋణపడి ఉంటాను. సాయిబాబా దగ్గరకు వెళ్ళమని రమణులు చెప్పారనే విషయాన్ని నేనెవరికీ చెప్పలేదు. చెబితే జనులు జరిగింది అర్థం చేసుకోలేరు అని నేను ఎవరితో చెప్పలేదు. ఇది యదార్థంగా జరిగిన విషయం." అప్పుడు బి.వి.ఎన్. కళ్ళలో నీళ్ళున్నట్లు రామచంద్రఅయ్యర్ గుర్తుకు తెచ్చుకున్నారు. నేను కాలేజీలో చదువుకుంటున్నపుడు కూడా నేను చెన్నైలోని సాయిబాబా గుడికి వెళ్తుండేవాడిని. ఎందుకంటే దాని వెనుక బి.వి.నరసింహస్వామి సమాధి మందిరం ఉన్నదని. భగవానే బి.వి.ఎన్.ను సాయిబాబా వద్దకు పంపారు కనుక, నేను ముందు సాయిబాబాకు ప్రణామం చేసుకుని తర్వాత బి.వి.ఎన్ సమాధికి నమస్కరించేవాణ్ణి. ఎందుకంటే ఆయనే భగవాన్ గురించి, ఆయన బోధల గురించీ ప్రపంచానికి తెలియజేశారు కనుక.



శ్రీ భగవాన్‌తో ఆశ్రమ భక్తులు

శుద్ధానంద భారతి

శుద్ధానందభారతి ఒక సంస్కృత పండితుడు మరియు హఠయోగి. ఆయన 30 సం॥లు పూర్తి మౌనంలో ఉన్నారు. అందులో చివరి అయిదు సంవత్సరాలలో ఆయన భారతదేశంలో పర్యటించి ఎంతోమంది మహాత్ములను సందర్శించారు ఎందుకంటే ఆయన సత్యాన్ని ముఖాముఖీ దర్శించాలనుకున్నారు కనుక. అయినా వేదాలలో చెప్పబడినట్లుగా, ఆయనకేమీ ప్రత్యక్ష అనుభవం కాలేదు. అలా వ్యాకులత చెందుతున్నపుడు, ఆయనకు 'ఆత్మసాక్షాత్కారం' అనే పుస్తకం కనబడడం తటస్థించింది. అపుడు అరుణాచలంలో ఉన్న భగవాన్ రమణుల గురించి తెలిసింది. ఆ రాత్రే భగవాన్ ఆయన హృదయంలో కన్పించారు. త్వరలోనే ఆయన రమణాశ్రమానికి ప్రయాణమయ్యారు. ఆయన ముందు అమ్మ ఆలయానికి వెళ్ళారు. అది అప్పుడు చిన్న పూరిపాకగా ఉండేది. వాకిట్లోనే కావ్యకంఠముని కన్పించారు. లోపలినుండి ఒక కమ్మని కంఠం, "భారతిని లోపలకు పంపించు," అనడం విన్పించింది. అది భగవాన్ గొంతే. ఆశ్రమం లోపలికి ప్రవేశించకముందే కొండపాదం వద్ద సిద్ధపురుషులైన శేషాద్రిస్వామిగారు, శుద్ధానందను కలుసుకొని, "వెళ్ళు, వెళ్ళు, వెళ్ళు శుద్ధానందం. నువ్వు లోతుగా లోపలికి వెళ్ళేవరకూ వెళ్తూనే ఉండు," అన్నారు. తర్వాత మళ్ళీ ఆ మహాత్ముడే, "పరుగెత్తు, పరుగెత్తు శుద్ధానందం, రమణులు నీకొరకు వేచి ఉన్నారు. లోపలికి వెళ్ళు," అన్నారు. శుద్ధానందులు భగవాన్‌ను ఒక్కసారి చూడగానే సంపూర్ణ శరణాగతితో ఆయన పాదాల మీద పడ్డారు.

శుద్ధానందభారతి తొలిసారి తను భగవాన్‌ను కలుసుకున్నప్పటి సంగతి ఇలా వర్ణించారు. నాకు మానవాకారం ఏమీ కనపడలేదు. నేను దిమ్మెరబోయాను. ఒక తేజస్సు నా చుట్టూరా ఆవరించింది. భగవాన్ నన్ను మౌనంలో కరగించివేశారు. భగవాన్ అనుగ్రహాన్ని నాలో ఉంచారు. నా కళ్ళు అప్రయత్నంగా మూసుకున్నవి. నా హృదయగుహలోనికి వెళ్తున్నట్లు నాకనిపించింది. ఒక గంట ఒక క్షణం లాగా అన్పించింది. నేను కళ్ళు తెరచేటప్పటికి భగవాన్ యొక్క పద్మాల్లాంటి కళ్ళు నామీదే నిలచి ఉండడం చూశాను. నా లోపల ఏదో గొంతు వినిపించింది. ఇప్పుడు నువ్వు అనుభవించావు. గుహ తెరచుకుంది. 'నేను' అనేదే సత్యం. ఎన్నో ఏళ్ళు తీవ్రసాధన చేసిన తర్వాత, ఇప్పుడు ఇక్కడ రమణమహర్షి పవిత్రమైన పాదాలచెంత, నేను, సత్యమనేది, నాలోనే ఉన్న సద్వస్తువని మొదటిసారిగ అనుభవించి, ఆయన పాదాలు పట్టుకుని కన్నీరు కార్చాను సంతోషంతో. అపుడు మహనీయుడైన మాణిక్యవాచగర్ మాటలు గుర్తుచేసుకున్నాను." ఈ రోజు నువ్వు సూర్యుడవై నా హృదయంలో ఉదయించావు. అన్నిరకాల చీకట్లను పారద్రోలావు. నేను సంతోష పారవశ్యంలో ఈదులాడుతున్నాను."

భగవాన్ ఆయనను తిరిగి మౌనంలో ఉండమని విరూపాక్ష గుహకు పంపించారు. తర్వాత భగవాన్ అనేవారు, "భారతి ఎన్నో రోజులపాటు ఆహారం లేకుండాగానీ, కేవలం కొద్దిగా వేపాకులుగానీ, కొద్దిగా వేరుశనగ పొట్టుగానీ తిని, (అనేక రోజులు) జీవించగలరు. స్వయంగా రచయిత అయిన శుద్ధానందభారతి, బి.వి.నరసింహస్వామి వ్రాసిన 'ఆత్మసాక్షాత్కారం' అనే పుస్తకం చదివి ప్రభావితుడై తనుకూడా మహర్షి జీవితచరిత్రను తమిళంలో వ్రాయాలనుకున్నారు. ఈ ఉన్నతస్థితిలో ఉన్న యోగికి, మరొక మహాత్ముడైన పాండిచేరిలోని అరవిందులను దర్శించుకోవాలనే బలమైన కోరికుండేది. ఆయన భగవాన్‌ను అదే పనిగా అర్థిస్తుండేవారు. "నాకు అరవిందుల వద్దకు వెళ్ళాలని ఉంది. దయచేసి నాకు మార్గం చూపండి," అని ఆతృతగా అడుగగా భగవాన్ అంగీకరించారు. ఆయన ఇరువది అయిదు సంవత్సరాలపాటు అరవిందుల సంరక్షణలో ఉన్నారు. అక్కడే ఆయన రమణుల జీవిత చరిత్రను, "శ్రీరమణ విజయం" అనే పేరుతో వ్రాశారు. దాని అర్థము, "శ్రీరమణులఆగమనం"అని. భారతదేశంలోని తమిళం మాట్లాడే ప్రజలు, ఆ పుస్తకం చదివి భగవాన్ వద్దకు రావడం మొదలుపెట్టారు. భారతి ఆ తర్వాత ఎన్నో జీవితచరిత్రలు వ్రాసి రచయితగా ప్రఖ్యాతి గాంచారు.

ఆయన 1970లో రమణాశ్రమానికి వచ్చారు, అణ్ణామలైస్వామి జీవిత చరిత్ర వ్రాయడానికి. నేను ఆయనకు స్వాగతం పలికి, ఆయనకు కొద్దిరోజుల పాటు సేవ చేశాను. తిరిగి వెళ్ళే ముందు, చెన్నైలో ఉన్న తన ఆశ్రమానికి రమ్మని నన్ను ఆహ్వానించారు. నేను అందుకు అంగీకరించాను. ఆయన ఎంతో ఆప్యాయతతోనూ, మంచిగానూ ఉన్నట్లుగా కనిపించింది. ఒకరోజు ఆయన నన్ను తన ప్రక్కన కూర్చోమని చెప్పి, నాకు, మనకందరికి ఎంతో ముఖ్యమైన విషయాన్ని చెప్పారు. ఆయన అన్నారు, ''గణేశన్, నువ్వు ఆశ్రమ బాధ్యతను నిర్వహిస్తూ, 'మౌంటెన్‌పాత్' (ఆశ్రమపత్రిక)ను కూడా సమర్థవంతంగా నిర్వహించటం చూచాను. ప్రజలు నువ్వు చక్కగా నిర్వహించావని ప్రశంసించారు. నేను కూడా ఈ ఆశ్రమాన్ని నీకిచ్చేద్దామనుకుంటున్నాను. నీవు ఇష్టపడితే ఇప్పుడే అప్పచెబుతాను. కానీ ఒక విషయం గుర్తుంచుకో. ఎంత సంపద కలిగి ఉన్నా గానీ, అహంకారమును కలిగి ఉండేవానికి, నశింపచేయడానికి గాని, చెరిపి వెయ్యటానికి గానీ సాయపడదు. నా అంతర చక్షువుతో (జ్ఞానేత్రంతో) నీ ఆధ్యాత్మిక సిద్ధి, నీ ద్వారం వద్దనే వేచి ఉన్నదని స్పష్టంగా చూస్తున్నాను. ఏవైనా, ఏదైనా ఆస్థికిగానీ ధనానికి గానీ ఆకర్షణలో పడవద్దు. ఏ నిర్వహణ బాధ్యత నీమీద పెట్టబడినా ఒప్పుకొనవద్దు. నువ్వు ఎప్పుడూ స్వేచ్ఛగానే ఉన్నావు. ఆత్మగానే ఉండు. లోపలకు మునుగు. నీ హృదయంలోనే ఉన్న భగవాన్ పాదరేణువుగా మారు. ఆయనే సర్వాత్మ. దైవరాజ్యము నీ అనంతమైన ఆత్మలోనే ఉన్నది. నీ హృదయంలోనే విశ్రమించు. అదే సత్యమై ఉన్నది. ఆయన ఇంకా ఇలా అన్నారు, "నేను చేసిన తప్పునే నీవు చెయ్యవద్దు. నేను వందలాది పుస్తకాలు రచించుట ద్వారా, వైభవాన్ని పొందడానికీ, ఆశ్రమము కట్టడానికీ, పైగా, కీర్తి సంపాదించబడముపైనా శ్రద్ధ వహించాను. నువ్వు ఆ పని చెయ్యవద్దు. భగవాన్‌తోటే ఉండు. ఎల్లపుడూ ఆయనకు విధేయుడవై ఉండు. అరుణాచలం వద్దనే భగవాన్ పవిత్ర పాదరేణువువై ఉండు.



క్రిష్ణభిక్షు

వెంకటక్రిష్ణయ్య ఒక సంస్కృత మరియు తెలుగుపండితులు. ఆయన క్రిష్ణభిక్షు అనే పేరుతో ప్రఖ్యాతులు. క్రిష్ణభిక్షు అంటే, 'కృష్ణుడు అనే యాచకుడు' అని. చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు ఆయన తన బాబాయి ఇంటికి వెళ్ళినపుడు అక్కడ రమణమహర్షి పటము చూశారు. ఆయన దానిపట్ల గాఢంగా ఆకర్షితులైనారు. ఆయన బాబాయి, భగవాన్‌తోపాటు విరూపాక్షగుహలో ఉన్నారు. రమణగీతలోని మొదటి పృచ్ఛకులలో (ప్రశ్నలు వేసిన వారిలో) ఆయన ఒకరు. క్రిష్ణభిక్షు వద్ద కూడా రమణగీత ప్రతి ఒకటి ఉన్నది. ఆ చిన్న వయసులోనే దానిని చాలా ఆసక్తితో చదువుతుండేవారు.

ఆయన చెన్నైలో లాకాలేజిలో చదువుతున్నపుడు, ఒక స్నేహితుని ఇంట్లో కావ్యకంఠగణపతి మునిని కలవడం జరిగింది. కావ్యకంఠుల వారిలోని వక్తృత్వ పటిమ, అణకువ, విశేషపాండిత్యము గమనించి – కృష్ణభిక్షు ఆయనవైపు ఆకర్షితులైనారు. ఆరోజు తన గురువు రమణమహర్షి గురించి ఎంతో గొప్పగా ప్రశంసించారు, కావ్యకంఠులు. ఈయన ఇంత గొప్పవారైతే, ఈయన గురువు గారు ఇంకెంత గొప్పవారై ఉంటారో అని క్రిష్ణభిక్షు ఆశ్చర్యపోయారు. ఈ కలయిక ఆయనలో రమణాశ్రమానికి వెళ్ళాలనే గాఢమైన కోరికను కలుగజేసింది.

చివరకు ఆయన ఒక స్నేహితుడితో కలిసి రమణాశ్రమానికి వచ్చి, నిరాడంబరతకు రూపమైన భగవాన్‌ను చూచారు. భగవాన్ చుట్టూ ఉన్న వాతావరణం ఏమీ ఆడంబరం లేకుండా, ఆత్మీయతతో కూడి ఉన్నది. ఆయన గురువుగారిని అడిగారు. "నన్ను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించండి. కానీ ముందుగా నేనిపుడు ఏమి చేస్తున్నానో చెబుతాను. నేను గాయత్రి జపాన్ని, ప్రాణాయామాన్ని చేస్తున్నాను. ప్రాణాయామంలో కొన్నిరకాలు నా ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నవి. దయచేసి నాకు మార్గం చూపండి." భగవాన్ ఆయనతో ఈ విధంగా అన్నారు, "అన్నిటినీ ఆపివెయ్యి. ఎల్లవేళలా అద్వైత దృష్టి కలిగియుండు." కృష్ణభిక్షుకు దాని పూర్తి అర్థం అప్పట్లో తెలియలేదు. కానీ 1930లో మళ్ళీ ఆయన భగవాన్‌ను దర్శించారు. ఆరోజులలో భగవాన్‌ను అన్ని సమయాలలోనూ కలవడానికి వీలుండేది. భక్తులు భగవాన్ చుట్టూ కూర్చుని ఆయన కథలు చెబుతున్నా, ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్నా, ఛలోక్తులు విసురుతున్నా, నవ్వుతున్నా చూస్తూ ఉండేవారు. తన జీవితంలో అవి మరిచిపోలేని రోజులని కృష్ణభిక్షు నాతో చెప్పారు.

ఒక సమయంలో బి.వి.నరసింహస్వామి తన పుస్తకం వ్రాయడం పూర్తి చేసి, చదివి తగు సూచనలిమ్మని కృష్ణభిక్షుకు అందచేశారు. శుద్ధానందభారతి, కావ్యకంఠగణపతిముని, బి.వి.నరసింహస్వామి – ఈ ముగ్గురినీ చూచి భగవాన్ నవ్వారు. ఎందుకంటే వారు ముగ్గురూ కలిసి రాజకీయరంగంలో ఉన్నారు. ఇప్పుడు రాజకీయాలను వదలివేసి, ఆధ్యాత్మిక మార్గంలోనికి వచ్చారు. బి.వి.నరసింహస్వామి పుస్తకం చూసి ప్రేరణ పొంది, తను కూడా భగవాన్ జీవితచరిత్రను తన మాతృభాషయైన తెలుగులో వ్రాయాలనుకున్నారు. బి.వి.నరసింహస్వామి గారు వ్రాసిన 'ఆత్మసాక్షాత్కారము' అను పుస్తకమును ఆధారంగా చేసుకొని తను కూడా తెలుగులో భగవాన్ జీవితచరిత్రను వ్రాశారు కృష్ణభిక్షు.

భగవాన్‌తో కృష్ణభిక్షు అనుబంధం ప్రత్యేకంగా ఉండేది. భగవాన్ గొప్పవారు. ఆయన తండ్రివలె చూసుకునేవారు. నాకాయన మీద పూర్తి విశ్వాసముంది. నేను శ్రద్ధగా ఆయన మార్గాన్ని అనుసరించాను. నేను భగవాన్‌యొక్క చేతులలో పూర్తి రక్షణలో ఉన్నానని భావించాను. నాకే చింతలూ లేవు. నేను నా హృదయస్ఫూర్తిగా ఆయనను ప్రేమించాను. నేను ఆయన చెంతనే జీవించాను. ఒకేరూములో భోజనం చేస్తూ, ఆయనతోపాటే నిద్రిస్తూ, కబుర్లు చెప్పుకుంటూ, ఛలోక్తులను ఆనందిస్తూ ఉండేవాడిని. కానీ ఎల్లపుడూ ఆయన ప్రేమకూ, శ్రద్ధకూ కట్టుబడి ఉండేవాడిని. పగలూ, రాత్రీ ఆయన నన్ను కనిపెట్టి ఉన్నట్లుగా అనిపించేది. "ఆయన మహాచైతన్యము అనే ఒడిలో నన్ను కూర్చుండబెట్టుకుని, నాపట్ల ఆయనకు గల నిజమైన శ్రద్ధతో నన్ను ఆధ్యాత్మికంగా ఎదగనిస్తున్నారని అనుకునేవాణ్ణి," అని ప్రేమగా జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరోజు, భగవాన్ కూరగాయలు తరుగుతుండగా, ఆశ్రమ వంటశాలలో కృష్ణభిక్షు, "నన్ను కూడా సాయం చెయ్యనివ్వండి," అన్నారు. ఆయన

మూడుసార్లు కత్తి తీసుకున్నారు. మూడుసార్లు భగవాన్ క్రింద పెట్టించారు. అదేమని కృష్ణభిక్షుఅడిగితే, "నువ్వు ఇంటి దగ్గర కూరగాయలు కోస్తావా?" అన్నారు. "నేను ఇంటివద్ద చెయ్యవలసిన అవసరము లేదు," అన్నారు కృష్ణభిక్షు. భగవాన్ నవ్వి ఏమి ఇక్కడ ఇంటి వద్ద ఉన్నట్లుగా లేవా? అని అన్నారు. దీనినిబట్టి తెలిసేదేమిటంటే, కఠినమైన సాధన చేసేటపుడు, ప్రతి పనినీ కర్తృత్వభావన లేకుండా చేసి, ఆత్మగానే నిలిచిపోవాలి. అప్పుడు మీరెప్పుడూ హృదయంలో సహజంగా, 'నేను'గా ఉండిపోతారు.

వేరొక సందర్భంలో కృష్ణభిక్షు, భగవాన్‌ను ఇలా అడిగారు, "భగవాన్ ఇదివరలో మిమ్ములను తలుచుకోగానే మీరూపం కళ్ళ ముందు కన్పించేది. ఇప్పుడలా జరగటము లేదు. నేను ఏమి చెయ్యాలి?" "నువ్వు నా పేరును గుర్తుపెట్టుకొని జపిస్తూ ఉండు," అని భగవాన్ సలహా ఇచ్చారు. రూపంకంటె నామం గొప్పది. కొన్ని రోజులలో నామం ప్రాముఖ్యత కూడా పోతుంది. నీ ఆధ్యాత్మిక సాధనను కొనసాగించు. అప్పుడు 'నేను', 'నేను' అనే అహం స్ఫురణ ఒక్కటే దానంతట అదే అవిరళంగా నీ హృదయంలో సాగిపోతుంది. భగవాన్ నామరూపాల గొప్పతనాన్ని తిరస్కరించటల్లేదుకానీ, అదే సమయంలో ఎప్పటికీ నశించని సద్వస్తువు అయిన 'అహం' యొక్క ప్రాముఖ్యాన్ని నొక్కి చెబుతున్నారు.

భగవాన్ మరణించిన తర్వాత అందరు పాతభక్తులలాగానే కృష్ణభిక్షు కూడా ఆశ్రమాన్ని వదలి, ఒక పట్టణం నుండి మరొక పట్టణానికి తిరుగుతూ, ఔదార్యంతో, ఆతిథ్యమిచ్చిన స్నేహితుల వద్ద ఉంటూ కాలం గడుపుతున్నారు. నేను ఆశ్రమానికి వచ్చి, పాత భక్తులనందరినీ వెనక్కురమ్మని పిలుస్తున్నపుడు, ఎవరో అన్నారు, "కృష్ణభిక్షు మాటేమిటి?" అని. ఆ పేరువిని, నేను ఆయనొక బౌద్ధసన్యాసి అనీ, భగవాన్ జీవించి ఉన్నపుడు ఆయన చనిపోయి ఉంటారని అనుకున్నాను. తర్వాత నాకు, ఆయన మునగాల వెంకట్రామయ్యగారి కుమార్తె కామాక్షికి బంధువు అని తెలిసింది. నేను ఆమెకు ఉత్తరం వ్రాసి, ఆయన అడ్రస్ కనుక్కుని రమణాశ్రమానికి రమ్మని ఆహ్వానించాను. ఆయన ఇక్కడకు వచ్చినపుడు నమ్రతతో అన్నారు, "గణేశన్, నావద్ద డబ్బేమీ లేదు." ఏమీ ఫర్వాలేదు దయచేసి ఇక్కడే ఉండండి," అన్నాను నేను.

ఆయన న్యాయవర్తన ఎంతో గౌరవాన్ని కల్గించేదిగా ఉండేది. ఉదారబుద్ధిగల ఆయన మిత్రుడెవరో ఆయనకు నెలకు ఇరువది ఏడు రూపాయలు పంపేవారు. ఆయన అందులోనుండి ఇరువది రూపాయలు ఆశ్రమానికి ఇచ్చి, మిగిలిన ఏడు రూపాయలు తను ఉంచుకునే వారు. నాకు ఆయనంటే ఉండే గౌరవం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. ఈ నిరాడంబరుడైన వ్యక్తి, రమణాశ్రమ కిరీటంలోని ఒక మణివంటి వారు. కానీ ఆయన సాదాసీదాగా ఉండుటవల్ల చాలామంది ఆయనను పట్టించుకునేవారు కాదు. కానీ ఈ ఉన్నతుడైన వ్యక్తి, భగవాన్ జీవితచరిత్రను తెలుగులో వ్రాశారు. ఆ గ్రంథం పేరు 'శ్రీరమణలీల'. ఆయన భగవాన్‌తో 1928 సం॥ము నుండి కలిసిఉన్నారు.

ఒకపుడు, ఆశ్రమముయొక్క ధర్మకర్తల సంఘం ఒక తీర్మానం అమలు చెయ్యడానికి సిద్ధంగా ఉంది. అది ఏమిటంటే, శాశ్వతంగా ఆశ్రమంలో ఉండేవారు, ఆశ్రమంలో ఏ పనీ చెయ్యనట్లైతే, నెలకు ముప్పది రూపాయలు కట్టాలి. కృష్ణభిక్షు నా వద్దకు వచ్చిన విచారంతో అన్నారు, "నేను ఆశ్రమాన్ని వదలివెళ్తున్నాను గణేశన్." "సార్, మీరెందుకు వెళ్తున్నారు?" అన్నాను నేను ఆశ్చర్యంతో. "నేనంత డబ్బు కట్టుకోలేను." దిగ్భ్రమ చెందిన నేను ధర్మకర్తల వద్దకు వెళ్ళి నా మనసులో మాటచెప్పాను. "ఏమిటీ అర్థంలేని పని? ఆయన ఈ ఆశ్రమంలో ఒక నిజమైన మణివంటివారు." వాళ్ళు ఆ తీర్మానాన్ని రద్దు చేయడానికి సమ్మతించారు.

ఆయన రమణాశ్రమంలో జబ్బుపడి, ఆశ్రమాన్ని వదలివెళ్లామను కున్నారు. "నా స్నేహితుడు డాక్టరు, ఆయన దగ్గరకు వెళ్తాను. ఆయన నాకు వైద్యం చేస్తారు," అన్నారు వెళ్ళేటప్పుడు నన్ను కౌగలించుకొని దీవించారు. అదే ఆఖరుచూపు అవుతుందని నేను అనుకోలేదు. తర్వాత ఆయన చనిపోయారని నాకు వార్త అందింది. ఆయన అంతిమ దినాలను గురించి ఆయన స్నేహితుడైన ఆ వైద్యుడు నాకు ఇలా వ్రాశారు, "ఆయన పూర్తిగా స్పృహలో ఉన్నారు. ఎడతెరపి లేకుండా, రమణ, రమణ, రమణ అని జపిస్తూనే ఉన్నారు. చనిపోయే చివరిక్షణంలో, ఆయన ముఖము కాంతితో వెలిగింది. ఆయన, 'అవును. నేను వస్తున్నాను' అన్నారు. భగవాన్ వచ్చి ఆయనను తనతోపాటు, మూలమైన అరుణాచలానికి తీసుకుని వెళ్ళినట్లు కన్పిస్తుంది. భగవాన్‌కు అరుణాచలునికి, దేశకాలాలతో నిమిత్తం లేదుకద.

దేవరాజ ముదలియార్



ఒకప్పుడు పాతహాలులో ఒక నూతన వ్యక్తి భగవాన్ ఎదురుగా నిలబడ్డారు. భగవాన్ వెంటనే ఆయనను గుర్తుపట్టి, అందరికీ ఆయనను పరిచయం చేశారు. 'మనము కొండపైన ఉండగా, ఇరువది సంవత్సరములు క్రింద ఈయన వచ్చారు,' అని మురుగనార్ అలాగని నాకు చెప్పగానే, వెంటనే నేను ఆయనను అడిగాను. "అంటే దీని అర్థం భగవాన్‌కు అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేదనా?" మురుగనార్ దీన్ని ఇంకో ప్రశ్నతో ఎదుర్కొన్నారు. ఏమిటీ, అద్దం ప్రతిబింబాన్ని చూపటానికి ఏమైనా ప్రయత్నం చేస్తుందా? సాక్షాత్కారం పొందిన జ్ఞాని సమక్షంలో, ప్రతిదీ దానికదే బహిర్గతమవుతుంది. ఒక జ్ఞాని ఒక వ్యక్తితో సంభాషిస్తున్నప్పుడు, అక్కడ, ఆలస్యమవటంగానీ, వేరే ప్రయత్నంగానీ ఏమీ ఉండదు. భగవాన్ జ్ఞాని కనుక, ఎదురుగా ఉన్నదెవరో ప్రయత్నం లేకుండానే గ్రహించగలరు. ఇదేదో ఆలోచనలు చదవగలగటమో, యోగదృష్టి గాని, జ్ఞానదృష్టి అని కానీ, అనుకోకు. (అతీంద్రియశక్తులు) అటువంటివన్నీకూడా, మానసిక పరిధికి చెందినవి. సాక్షాత్కారము పొందిన జ్ఞాని మనసును అధిగమించినవారు. ఆయన ఆధ్యాత్మిక స్థితిలో ఉన్నవారు. సంపూర్ణమైన ఆధ్యాత్మిక స్థితిలో శరీరము, మనస్సుయొక్క ఆలోచన అప్పుడప్పుడు కదలవచ్చును. భగవాన్ తనే ఒకసారి అన్నారు. జ్ఞాని ఒక దర్పణములాటివాడు. దాని ముందు ఏమి పెడితే దాని ప్రతిబింబం అచ్చు దానిలాగానే ఉంటుంది.

భగవాన్‌తో అనుబంధం కలిగి ఉన్న ప్రతి భక్తుడూ వారి వారి స్వభావాన్నిబట్టి (పూర్వజన్మ వాసననుబట్టి) తలా ఒకరకంగా ఉండేవారు. . భగవాన్ కూడా వారికి తగ్గట్టుగానే ప్రవర్తించేవారు. ఉదాహరణకు మురుగనార్ భగవాన్‌ను సాక్షాత్తూ ఈశ్వరుడిగానే చూచేవారు. అనేక శతాబ్దాల క్రిందట ఈశ్వరునికి శరణాగతి చెంది గొప్ప కవియు, భక్తుడు అయిన మాణిక్యవాచగర్ లాగా మురుగనార్‌ను భగవాన్ చూచేవారు. మేజర్ చాడ్విక్, భగవాన్‌ను తల్లిలాగానూ, ప్రొఫెసర్ జి.వి.సుబ్బరామయ్య భగవాన్‌ను తండ్రిలాగాను, నా తాతగారైన చిన్నస్వామి ఆయనను గురువుగానూ, దైవముగాను భావించేవారు. అదే సమయంలో భగవాన్ ప్రతి ఒక్కరిని ఒకే విధమైన ప్రేమతో ఆప్యాయతతో చూసేవారు.

అలాగే ఒక విశిష్టమైన భక్తులుండేవారు. ఆయన తనను పూర్తి అమాయకత్వంతో నిండిన పసిపాపలాగానూ, భగవాన్‌ను తన తల్లితండ్రులుగానూ భావించుకునేవారు. ఆయనే ఎ.దేవరాజమొదలియార్, 'ఎ' అనే అక్షరం ఆయన స్వంత ఊరైన ఆర్కాటును సూచిస్తుంది. ఆయన తన హృదయపు లోతులలో భగవాన్‌ను తన తల్లి, తండ్రిగానే భావించేవారు. భగవాన్‌ను పిలచేటప్పుడూ, ఉత్తరాలలో సంబోధించేటప్పుడూ ఆయన అమ్మైయప్ప అనేవారు. 'అమ్మైయ్యప్ప' అంటే తమిళంలో తల్లితండ్రి అని అర్థం. ముదలియార్ తనను తను 'రమణశైయ్' రమణుని బిడ్డ అనుకునేవారు. భగవాన్‌కూడా ఆయనను పసిబిడ్డలాగానే చూసేవారు. కొంతమంది పాత భక్తులకు మొదలియార్ చిన్నపిల్లవాడిలాటి అమాయకమైన పద్ధతి నచ్చేదికాదు.

కాని ముదలియార్ శరణాగతికి ప్రతిరూపం. భగవాన్ అన్నారు, "సత్యాన్ని గుర్తించడానికి రెండు మార్గాలున్నవి. 'నేనెవరను?' అని ప్రశ్నించుతూ, అహంకారంయొక్క మూలాన్ని వెదికి, మూలమైన హృదయంలో దానిని కరిగిపోనివ్వాలి. రెండవది, 'నాకు' అనే అహంకారాన్ని నీలోనే ఉన్న అత్యున్నతమైన స్థితియైన 'అహం' లేదా 'నేను' లేదా 'హృదయానికి' శరణాగతినొందించాలి. భక్తునియొక్క ప్రయత్నము లేదా సాధన, గురువుగారి కృప రెండూ ఒకటే అర్థము కలవి, ఒకేసారి ఉండేవి. వాటి రెంటిటిమధ్య కాలవ్యవధి ఉండదు. ఎవరైతే ప్రయత్నము లేదా సాధన చేస్తారో వెంటనే అక్కడ అనుగ్రహం కూడా చైతన్యవంతమవుతుంది. సాధకుని ప్రయత్నమూ, ఈశ్వరానుగ్రహము రెండూ సమానార్థకములైనవే. (నిజానికి ఈశ్వరానుగ్రహం వల్లనే సాధకుని ప్రయత్నం మొదలవుతుందని భగవాన్ నొక్కి చెప్పేవారు).

దేవరాజమొదలియార్ భగవాన్‌తో దాదాపు ఏబది ఏండ్ల అనుబంధం కలిగి ఉన్నారు. ఏ ఇతర భక్తులకన్నా ఆయన ఎక్కువకాలం భగవాన్‌తోడి అనుబంధాన్ని ఆనందించారు. భగవాన్ అరుణాచలానికి వచ్చిన నాలుగేండ్లకు, వందలాదిమంది భక్తులు కార్తీకదీపోత్సవానికి తిరువణ్ణామలైకు వచ్చారు. వారిలో దేవరాజమొదలియార్ ఒకరు. ఆ రోజులలో భగవాన్ పూర్తిగా హృదయంలో ఐక్యమైపోయి, కళ్ళు మూసుకుని ఉన్నప్పటికీ, ఆయన అనుగ్రహం మొదలియార్‌పై ఉన్నది. ఆ వచ్చిన వందలాది మందిలో మొదలియార్ మాత్రమే ఆ బాలస్వామిచేత ఆకర్షించబడ్డారు. 1914లో ఆయన తిరిగి

అరుణాచలాన్ని సందర్శించారు. అప్పటికే ఆయన చిత్తూరులో ప్రసిద్ధిచెందిన వకీలు. భగవాన్ అప్పుడు విరూపాక్షగుహలో ఉంటుండేవారు. ఆ రోజులలో ప్రయాణమనేది చాలాకష్టంగా ఉండేది. ముదలియార్ తిరిగి 1917లో తిరువణ్ణామలై వచ్చారు. భగవాన్ అప్పుడు స్కందాశ్రమంలో ఉన్నారు. ముదలియార్ భగవాన్ అనుగ్రహం యొక్క అనుభవాన్ని పొంది, తను ఆయనకు శరణాగతి చెందాలనీ, తన ప్రార్థనలను ఆయనకు అర్పించాలనీ అనుకున్నారు. ఆయన మనసులోనే ప్రార్థించేవారు. ఎప్పుడూ నోటితో బయటకు వినపడేటట్లు ప్రార్థించేవారు కాదు. 1918 మరియు 1922 మధ్యకాలంలో వృత్తిరీత్యా వత్తిడుల వలన ఆయన భగవాన్ వద్దకు రాలేకపోయారు. 1922లో ఆయన తిరువణ్ణామలై వచ్చారు. భగవాన్ అప్పుడు రమణాశ్రమంలో ఉన్నారు. రమణాశ్రమం అప్పట్లో కొన్ని చిన్న పూరి గుడిసెలను మాత్రమే కలిగి ఉండేది. ఆయన భగవాన్‌కు ప్రణమిల్లారు. అదే సమయంలో ఒక భక్తుడు ఉల్లాసంతో పెద్దగొంతుతో 'తిరుప్పుగళ్' అనే తమిళ గీతాన్ని పాడుతున్నాడు. పెద్దది అయిన ఆయన కంఠస్వరం బయట కురిసే జోరువాన శబ్దంకన్నా మించిపోయింది. ఆ పాడిన ఆయన పేరు రామస్వామిపిళ్ళై. మధ్యాహ్నభోజన సమయంలో నలుగురైదురుగు మనుషులు ఉన్నారు. భగవాన్, ముదలియార్ వైపు చూసి, "మేము ఇక్కడ భోజనానికి ఒక ప్రత్యేకమైన పద్ధతిని అనుసరిస్తాము. మీకు వేరే విధమైన పద్ధతి అలవాటుంటే, మీరు అలాగే స్వేచ్ఛగా భోంచెయ్యవచ్చు," అన్నారు. ముదలియార్ గోధుమపిండితో చేసిన చపాతీలను తెచ్చుకున్నప్పటికీ, భగవాన్ తన పట్ల కనబరచిన శ్రద్ధకు కరగిపోయి, తను తెచ్చిన చపాతీలను వదిలేసి, మిగిలినవారితో కలిసి ఆనందంగా భోజనాన్ని ఆరగించారు.

ముదలియార్ భగవాన్ వద్దకు తరచుగా వస్తూ, ఆయనను ఎన్నో ప్రశ్నలు వేస్తుండేవారు. ఆయన నాతో చెప్పిన ఒక ముఖ్యమైన విషయము ఏమిటంటే, తాను ఒక నాస్తికుడిని, అని నాతో చెప్పారు. ఆయనకు దైవముపై విశ్వాసము లేదు. దేవాలయమునకు వెళ్ళుటగానీ, పూజాది క్రతువులను ఆచరించుటగానీ, ఆయన ఏమాత్రమూ ఇష్టపడేవారు కాదు. 1922లో, తన అభిప్రాయములను ఆయన భగవాన్ ముందుంచారు. భగవాన్, "అది సరే, దానిలో తప్పేమీ లేదు. దైవము ఎల్లప్పుడూ మీలోనే ఉన్నారు. మనస్సును అంతర్ముఖము చేసి, ఆ 'ఎరుక'పై ధ్యానించండి. అది చాలును," అన్నారు.

ఠీవిగా, గంభీరంగా, అదే సమయంలో చాలా సామాన్యంగా, సరళంగా ఉండే ఈయనతో కలసి కాలము గడిపే అదృష్టము నాకు దక్కింది. ఆయన ఒకసారి నాతో, "భగవాన్ ప్రత్యేకత ఏమిటంటే ఆయన ప్రతివారినీ, ఉన్నవారిని ఉన్నట్లుగానే, (వారియొక్క లోటుపాట్లతో సంబంధము లేకుండా) స్వీకరించేవారు. మిగిలిన గురువులు, అటువంటి శిష్యులను ముందుగా వారి లోటుపాట్లు సరిదిద్దుకొమ్మని చెప్పిగానీ, లేదా తామే వారిని సంస్కరించుట చేసి, ఆ పిమ్మటనే వారిని శిష్యులుగా తీసుకుంటారు. ఒకరోజు సుబ్రహ్మణ్యస్వామియొక్క భక్తుడొకరు వ్రాసిన పాటను భగవాన్ ముందు పాడారు మురుగనార్. సుబ్రహ్మణ్యస్వామి ముందుగా ఆ భక్తుని సంస్కరించి, పిమ్మట ఆయనను, తన సంరక్షణలోనికి ఏ విధంగా తీసుకున్నారో వర్ణించబడింది ఆ పాటలో. ఆ పాటలో సుబ్రహ్మణ్యస్వామి పేరునకు బదులు, భగవాన్ పేరునుంచి పాడుతున్నారు మొదలియార్. అప్పుడు అక్కడే ఉన్న మురుగనార్, వెంటనే ఆయనను చీవాట్లు వేశారు. "మీరీ పద్యము గొప్పగా ఉన్నదని భావిస్తున్నారేమో. నేను మాత్రము అందుకంగీకరించను. ఈ పాట మన భగవాన్ ఔన్నత్యమునకు తగిన విధముగా లేదు. భగవాన్ ఎప్పుడూ వేచి ఉండరు. ఎవరు తన వద్దకు వచ్చినాసరే ఆయన వెంటనే వారిని స్వీకరిస్తారు. అక్కడ ఆలస్యముగానీ వారిలోని లోటుపాట్లు తొలగింపబడాలి, వారు సంస్కరింపబడాలి ముందుగా, అనే ఆలోచనలకు తావేలేదు." అది నిజంగా భగవాన్ ఎలా మనల్ని స్వీకరిస్తారో తెలియజెయ్యటం లేదు. భగవాన్ ఎప్పుడూ వేచి ఉండరు. ఆయన ఎవరైనా సరే, తన వద్దకు వచ్చీరాగానే స్వీకరిస్తారు. అక్కడ ఏమీ అవసరముండదు. కాలయాపన ఉండదు. ఏ విధమైన అర్హత ఉండాలనే కోరిక, ఆంక్ష ఉండదు."

1922నుండి ఆయన చాలా తరచుగా భగవాన్ వద్దకువచ్చి, మనసులోనే తన సమస్యల నివారణ కొరకు ప్రార్థించేవారు. "నువ్వు నీ గురువును గానీ దైవాన్నిగానీ ప్రార్థించవచ్చును. కానీ దానికి షరతును పెట్టగూడదు. అది నెరవేరవచ్చును. నెరవేరకపోవచ్చును. అది నెరవేరితే సంతోషించి నెరవేరకపోతే దుఃఖించకూడదు". అని భగవాన్ నాకు వివరించారు. "శరణాగతి చెందడము, ఆపై ఊరక ఉండటమే నీ విధి. నేను దానిని నెరవేరుస్తానో, లేదో అనేది నీకనవసరము," అన్నారు.

ఆ రోజుల్లో భారతదేశంలో, ఆడపిల్లలకు వివాహం జరిపించడం అనేది చాలా కష్టంతో కూడుకున్నపని. కానీ ముదలియార్ ప్రార్థించారు. ఆయన కుమార్తె వివాహం ఏ విధమైన అడ్డంకులూ లేకుండా జరిగిపోయింది. 1930లో ఆయన ఎంతగానో ప్రేమించిన ఆయన భార్య తీవ్రంగా జబ్బుపడ్డారు. ఆయన భగవాన్ వద్దకు పరుగున వెళ్ళి ఆమె స్వస్థత కొరకై పదే పదే ప్రార్థించారు. ఆమె 1933లో చనిపోయారు. కానీ ఆయనకు భగవాన్ ఎడల కోపంగానీ, నిరాశగానీ రాలేదు. "గణేశన్, అదికూడా నాకు భగవాన్ దీవెనే. ఎందుకంటే, ఆ దెబ్బతగిలిన తర్వాత, నా మనస్సూ, శ్రద్ధా అన్నీ కూడా ఆధ్యాత్మిక అన్వేషణ వైపు మళ్ళినవి. ఈ ప్రాపంచిక బంధాలూ, మమకారాలూ ఎంత వ్యర్థమైనవో, నాకప్పుడు చాలా బాగా అర్థమయింది." తన భార్య చనిపోయిన తర్వాత, ఆయన రమణాశ్రమానికి వచ్చి తన గురువుగారి ముందు కూర్చున్నారు. భార్య చనిపోవుట వలన కల్గిన దుఃఖము ఏదైతే ఆయనను తీవ్రంగా క్రుంగదీస్తుందో, అది కాస్తా మాయమైపోయింది. ఈ దుఃఖాన్నుండి స్వస్థత లభించటమనేది కేవలం భగవాన్ అనుగ్రహం వల్లనే అంటారాయన.

మధ్యాహ్నభోజన సమయంలో ఎప్పటిలాగానే ముదలియార్‌ను పిలిచారు. ఆయన తనకు అన్నం సరిపడటల్లేదని, భోజనానికి వెళ్ళలేదు. ఆయన కజిన్ (సోదరుడు) డాక్టర్. గురుస్వామి ముదలియార్, చెన్నైలో చాలా ప్రఖ్యాతి గాంచిన వైద్యుడు, ఆయనకు అన్నము సరిపడకపోవటాన్ని సరిచెయ్యడానికి మందులేమీ లేవని, అందుకని అన్నాన్ని పూర్తిగా మానివైచి దానికి బదులుగా వేరే ఆహారము తీసికొనమని చెప్పారు. ఆ రోజు భగవాన్ అడిగారు, "దేవరాజముదలియార్" ఎక్కడ?" అని. ఎవరో భగవాన్ ఆయనను పిలుస్తున్నారని ముదలియార్‌కు చెప్పారు. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళారు. భగవాన్ ఆయనవైపు నిశితంగా చూచి, "ఇక్కడ కూర్చో," అన్నారు. రమణాశ్రమంలో అన్నం చాలా ఎక్కువగా వడ్డిస్తారు. ఆయనకు అన్నం వడ్డిస్తుండగా, ఆయన సందేహిస్తూ భగవాన్ వైపు చూశారు. గురువుగారు భుజించమని సూచించారు. వెంటనే ముదలియార్ భోజనం ప్రారంభించి వడ్డించిన అన్నం మొత్తం తినేశారు. ఆయన తర్వాత నాతో చెప్పారు, "నేను నా గురువుగారి ఆజ్ఞనుపాటించాను. నయము కాదని నిర్ధారించబడిన నా జబ్బు వెంటనే పోయింది".

ప్రతిరోజూ రకరకాల మంది మనుష్యులు వస్తుంటారు కాబట్టి, ఆశ్రమంలో ఎవరూ ముదలియార్‌ను ఎరుగరు. ఆశ్రమవాసులను భగవాన్ అడిగారు, "ఆయనెవరో మీరు గుర్తించారా?" అందరూ తలలు వంచుకున్నారు. "మీరెవరూ దేవరాజుముదలియార్‌ను గుర్తుపట్టలేదా? ఆయన మన దగ్గరకు తరచు వచ్చేవారు. అప్పట్లో ఎంత తేడాగా ఉండేవారు? అప్పట్లో ఆయన యూరోపియన్ సూటు ధరిస్తుండేవారు. కానీ యిప్పుడు చూడండి. ఎంత నిరాడంబరంగా సాదాసీదాగా ఉన్నారో? దేవరాజు ముదలియార్ కన్నీటితో నాకిలా చెప్పారు. గురువుగారికి నాపట్ల ఎంత శ్రద్ధో చూడు. ఆయన నువ్వెలా ఉంటే అలా స్వీకరిస్తారు. నువ్వు యూరపు దేశస్థునిలా సూటు, బూటు, టై, వేసుకున్నా, లేక అతి సాధారణమైన దుస్తులు ధరించినా, ఆస్తికుడివైనా, ఏదో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక సాధన చేస్తూ ఉన్నా, ఆయనకవన్నీ అనవసరం. గురువుకు శిష్యుడు ముఖ్యం. అతడు దేనిని నమ్ముతాడో, ఏమిచేస్తాడో, ఆయనకనవసరం. 1923నుండి ముదలియార్, భగవాన్ వద్దకు ఇంకా తరచుగా వెళ్ళసాగారు. ఇది చాలా ముఖ్యమైనది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే, ఆధ్యాత్మికంగా బలపడాలంటే, సత్యంతోటి అనుబంధం అవసరం. అది మనిషే కావచ్చును. బోధ, సంస్థ, ఆలయము, చర్చి ఏదైనా కావచ్చు. ఎడబాటులేని అనుబంధం తప్పనిసరి. శిష్యులకు బోధన ద్వారా కాకుండా, కేవలం వారితో కలసిమెలసి ఉంటూ, ఆ శిష్యుని మనస్సు నెమ్మది నెమ్మదిగా గెలుచుకుంటారు సద్గురువు.

1936లో ఆశ్రమయాజమాన్యం చాలా ఇబ్బందికరమైన స్థితిలో చిక్కుకుంది. భగవాన్‌పైనా, చిన్నస్వామిపైనా, ఆశ్రమవాసులలో పెక్కురిపైన, అక్కడి మేజిస్ట్రేట్ కోర్టులో కేసుపెట్టబడింది. చిన్నస్వామి, భగవాన్ శిష్యులైన సుందరమ్‌చెట్టియార్ అనబడే, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి వద్దకు ఆయన సలహా కొరకై వెళ్ళారు. తిరువణ్ణామలైలోను, చుట్టు ప్రక్కల ఉన్న ప్రఖ్యాత న్యాయవాదులందరినీ వదలి ఆ న్యాయమూర్తి తిరువణ్ణామలైకు 100మైళ్ళ దూరంలో చిత్తూరులో ఉన్న, దేవరాజమొదలియార్ పేరు చెప్పారు. ఈ సంగతి నాతో చెబుతున్నప్పుడు ఆయన కళ్ళునీళ్ళతో నిండాయి.

గురువుగారి అనుగ్రహం చూడు. భారతీయ దండనశాస్త్రము, (ఇండియన్ పీనల్‌కోడ్) ప్రకారము, ఎవరికైనా కోర్టునుండి, కోర్టుకు హాజరు కావలసినదిగా ఆదేశమువస్తే, వారు, కోర్టులో హాజరు కావలసినదే. ఈ అవమానకరమైన పరిస్థితిని తప్పించడం అసాధ్యంగా కనపడింది. కానీ దేవరాజమొదలియార్ శ్రమపడి కేసును తొలినాళ్ళలోనే కొట్టివేయించారు. కనుక ఎవరూ కోర్టుకు వెళ్ళవలసిన పని లేకపోయింది. ఫిర్యాదుదారు, పెద్ద కోర్టులో తన అప్పీలు దరఖాస్తు చేశారు. కానీ

దేవరాజ మొదలియార్, అక్కడ కూడా, కేసును కొట్టివేయించారు. (భగవాన్ ఈ పనికి ముదలియార్‌ను ఎన్నుకోవటంలో ఒక ముఖ్యోద్దేశము ఉన్నది. ఆయనకూడా మిగిలిన పాతభక్తుల వలె ఒక గండశిలగా ఉండి అరుణాచలుని బోధ అయిన 'I am' ని ('అహమ్' లేదా 'నేను'ను) ప్రపంచం మొత్తానికి వ్యాప్తిచెందించాలి. దానికి గురువు ఆయనను స్వీకరిస్తే చాలదు. ఆశ్రమ యాజమాన్యము, చిన్నస్వామితో సహా స్వీకరించాలి. ఈ సంఘటన వలన మొదలియార్ తన విమర్శకులను కూడా గెలుచుకున్నారు).

1939లో ముదలియార్ భగవాన్ అనుగ్రహముయొక్క ఆకర్షణను మరింతగా అనుభవించారు. అందుకని తన వృత్తిని మానివేసి, గురువుగారి పవిత్రపాదాల చెంత శాశ్వతంగా ఉండిపోవాలనుకున్నారు. అప్పట్లో ఎవరూ కూడా ఆశ్రమంలో గది నిర్మించుకోవడానికి అనుమతింపబడేవారుకాదు. కేవలం ఇద్దరికి మాత్రమే మేజర్‌చాడ్విక్, యోగిరామయ్యకు మాత్రమే మినహాయింపు లభించింది. చాలామంది ఇతరులు ప్రయత్నించారు కానీ, మేము దీనిని భక్తులు నివాసముండే ఆశ్రమంగా ఉంచదలచుకోలేదు. చిన్న ఆశ్రమంగానే, కొద్దిపాటి మందికి మాత్రమే నివాసం కల్పిస్తాం అని యాజమాన్యం ఎవ్వరికీ ఆశ్రమం లోపల ఉండే అవకాశం ఇవ్వలేదు. ఆశ్రమములోపల గది నిర్మించుకోవడానికి అనుమతి కోరుతూ చిన్నస్వామికి ఉత్తరం వ్రాసేలా భగవాన్ నాకు హృదయంలో ప్రేరణ కల్గించారు. నేను చిన్నస్వామికి లేఖవ్రాయగానే వెంటనే అనుమతినిస్తూ జవాబు వచ్చింది. (శిష్యుడు గురువు సన్నిధిలో ఉండాలని కోరుకున్నారు. గురువుగారు కూడా అదే విధంగా భావించారు. గురుశిష్యుల సంబంధం విషయంలో, దేవరాజమొదలియార్ గారి ఉదాహరణను నేనెంతో ఇష్టపడతాను). కుటీరాన్ని నిర్మించుకోవడానికి, చిత్తూరులోని తన వ్యవహారాలను పూర్తిచేసుకొని బయటపడడానికి ఆయనకు రెండేళ్ళు పట్టింది. 1941లో ఆయన శాశ్వతంగా ఉండిపోవడానికి రమణాశ్రమానికి వచ్చారు. ఆ తర్వాత ఆయన గురువుగారి తోటే నిత్యం ఉండిపోయారు. అయినప్పటికీ, భగవాన్ ఆయన పవిత్రమైన పాదాన్ని తన కుటీరంలో ఉంచాలని మొదలియార్‌కు గట్టికోరిక ఉండేది. దానికి భగవాన్ ఒక షరతుపై అంగీకరించారు. నేను నీ రూముకు వస్తాను. కానీ ఏ ఆర్భాటమూ ఉండరాదు. ఎవరినీ పిలువవద్దు. దానినొక పెద్ద వ్యవహారంగా చెయ్యవద్దు. మరల మొదలియార్ చెమ్మగిలిన కళ్ళతో చెప్పారు. భగవాన్ ఆయన గదిలోనికి వచ్చి ఆయనను ఆశీర్వదించారు. ఆ సంఘటన నా ఆధ్యాత్మిక లక్ష్యం సఫలవంతమవుతుందని సూచించినట్లుగా నేననుకున్నాను. అది కేవలం గదికి రావడం కాదు, గణేశన్. దీనిని తేలికగా తీసుకోకు. భగవాన్‌కు నాకు మధ్యన జరిగిన ప్రతిక్షణమూ (విలువగలదే) ప్రత్యేకమైనదే.

భగవాన్ ఇంగ్లీషులో చాలా తక్కువగా మాట్లాడేవారు. పాల్‌బ్రంటన్ పుస్తకం అచ్చు అయిన తర్వాత, పాశ్చాత్య దేశాలనుండి అనేకమంది సాధకులు రావడం ప్రారంభించారు. వారు భగవాన్‌తో సంభాషించడానికి, అనువాదకులు కావల్సివచ్చారు. దేవరాజమొదలియార్, మునగాల వెంకట్రామయ్య, ఇంకా అనేకులు, అనువాదకుల పాత్రపోషించేవారు. భగవాన్, "నా మాటలను అనువదించే వారందరిలో దేవరాజ మొదలియార్ మాత్రమే. నేను చెప్పింది చెప్పినట్లుగా అనువదిస్తారు," అన్నారు. ఈ మాటను, దేవరాజ ముదలియారే గాక ఇతరభక్తులు కూడా నాతో చెప్పారు.

దేవరాజుముదలియార్ భగవాన్ ముచ్చట్లు చెబుతుంటే, నేను గంటల తరబడి వింటూ ఉండేవాడిని. అది నా చెవులకు కమ్మని సంగీతం వలె ఉండడమే కాక, గురువుతోటి ఆయన అనుబంధమునుగూర్చి తెలుసుకోవటము, నా సాధనలో భాగంగా ఉండేది. ముదలియార్ నాతో ఇలా అన్నారు, "భగవాన్ నైతికపరమైన విషయాల గురించి, ప్రాపంచిక వ్యవహారాల గురించి గానీ, ఎప్పుడూ గట్టిగా ఏమీ చెప్పేవారు కాదు. కానీ దీనికి రెండు మినహాయింపులున్నవి. ఒకటి మాంసాహారం తీసుకోవటాన్ని అంగీకరించేవారుకాదు, రెండవది, బాహ్యవైరాగ్యాన్ని ఇష్టపడేవారు కాదు. ఉదాహరణకు, కాషాయవస్త్రాన్ని ధరించడం, గుండుచేయించు కోవడం, వేరే పేరు పెట్టుకొనడం, సన్యసించడం మొదలైనవి. 1936లో హాలులో భగవాన్ సన్నిధిలో ఉన్నపుడు, తను శాఖాహారిగా ఉండడాన్ని భగవాన్ ఇష్టపడతారనిపించింది. భగవాన్ నిజంగా ఈ విషయం తనతో అననప్పటికీ, ముదలియార్ గ్రహించారు. కానీ ఆయనకు డాక్టర్ గురుస్వామిముదలియార్ రక్తహీనత తగ్గటానికి, మాంసము, గ్రుడ్లు, కాలేయం సూప్ ఎక్కువగా తినమని చెప్పిన సంగతి గుర్తుకువచ్చింది. ఆయన నిజాయితీగా ఒప్పుకున్నారు, మాంసాహారమంటే చాలా ఇష్టమని. కానీ ఇక్కడ భగవాన్ ఎదురుగా కూర్చుని ఉంటే, భగవాన్ నన్ను శాఖాహారిగా ఉండమంటున్నారనే గట్టి భావన నాలో కల్గుతుంది. ఈ విధంగా సందిగ్ధంలో ఉండి, భగవాన్ కొండపైకి వెళ్ళినపుడు ఆయనతో కలసి వెళ్ళి, ఆయనతో ఇలా చెప్పారు, "భగవాన్ మీరు నన్ను శాఖాహారిగా ఉండమంటున్నట్లు నాకు అన్పిస్తుంది.

కానీ నా శారీరక అవసరం దృష్ట్యా వైద్యులు మాంసం తినమని నాకు చెప్పారు". భగవాన్ నవ్వి ఆయనతో అన్నారు, "శాఖాహారం శరీరానికి కావలసిన ఆరోగ్యాన్ని, బలాన్నీ ఇచ్చే పోషకపదార్థాలన్నిటినీ కల్గి ఉంటుంది". ఇది విని మొదలియార్ ఎంతో సంతోషించి ఇలా అన్నారు, "భగవాన్ నాకిప్పుడు ధైర్యంగా ఉంది, ఈ భోజన విషయంలో నూతన ప్రయోగం చెయ్యడానికి. (శాఖాహారిగా మారడానికి) మీరు అది సరిపోతుందంటే, పల్చనిగాలి తీసుకుని కూడా నేను జీవించగలనని నాకు తెలుసు. కేవలం భగవాన్ కృపవలన, శాఖాహారిగా మారినాకూడా, తన ఆరోగ్యము ఏమీ దెబ్బతినలేదని, తనకు మాంసాహారంపై ఏ విధమైన కోరికా, అటుపై కలుగలేదనీ ఆయన చెప్పారు.

ఒకప్పుడు, ముదలియార్ నాకు విశ్వాసము, నమ్మకము అనే పదాల మధ్య తేడాను విశదపరచారు. "నమ్మకము అనేది ఒక ఆలోచన. నేను హిందువునైనా, క్రైస్తవమతాన్ని నమ్ముతాను. విశ్వాసమనేది పూర్ణమయినది. అందులో స్వీకరించడం, తిరస్కరించడం ఉండదు". "అంటే మీ ఉద్దేశం ఏమిటి?" అని నేనడిగాను. ఆయన ఇలా జవాబిచ్చారు. "గణేశన్, భగవాన్ కనుక ఒక కాకిని నాకు చూపించి, 'ఇదిగో ఇక్కడ తెల్లనికాకి ఉంది' అంటే నేను చూసింది తెల్లనికాకినే అని నేను నమ్ముతాను. నేనెప్పుడూ తెల్లనికాకి గురించి వినలేదనిగాని, అది అసాధ్యమనిగాని, భగవాన్ ఎందుకలా అన్నారనే ప్రశ్నగానీ నాలో ఉదయించదు. ఆయన చెప్పినదానికి వ్యతిరేకభావన నాలో కలుగదు. అవును, గురువుగారు చెప్పారుగాబట్టి, అది తెల్లనికాకే అయి ఉంటుంది అంటుంది నమ్మకం. కానీ విశ్వాసం అక్కడ తెల్లనికాకిని మాత్రమే చూస్తుంది. దేవరాజుముదలియార్ శరణాగతి పథాన్ని అనుసరించారు. శరణాగతిలో 'నాకు' అనేది ఉండదు. 'నాకు' అనేదానికి నమ్మకమేగానీ విశ్వాసమంటే ఏమిటో తెలియదు. మనం శరణాగతి లేకుండా,'నాకు' అనే ఆలోచనతో ఈ 'తెల్లకాకి' తర్కాన్ని పరిశీలిస్తే, (అసలు సారాన్ని వదిలేసి) ఇవన్నీ అర్థంలేని మాటలు. భగవాన్ ఎప్పుడూ అలా అని ఉండరు అంటాము.

ప్రతి ఆధ్యాత్మిక సాధకుడూ,ప్రాచీన కాలంనుండీ, ప్రారబ్దానికీ, స్వేచ్ఛాయుతంగా ఆలోచించడానికీ మధ్య తికమక పడుతుంటాడు. బౌద్ధమతము, జైనమతమూ, మిగిలిన తూర్పు దేశాలకు చెందిన మతాలు, సాధారణంగా ప్రారబ్దాన్ని విశ్వసిస్తవి. మీరు ఇప్పుడు స్త్రీగా ఉన్నట్లయితే, మీరు ప్రారబ్దం ప్రకారమే స్త్రీగా పుట్టారు. మీరు కోరుకొనబట్టి స్త్రీగా జన్మించలేదు. కానీ అన్నీ అలా ప్రారబ్ధప్రకారం నిర్ణయింపబడితే మనమసలు, ఆధ్యాత్మిక సాధన అనేది ఎందుకు చెయ్యాలి? (ముదలియార్‌కు భగవాన్‌కు మధ్యలో ఈ విధమైన సంభాషణ జరిగింది ఒకనాడు, "భగవాన్, బాహ్య విషయాలైన, జాతీయత, కుటుంబమూ, వృత్తి, వివాహము, మరణమూ అనేవన్నీ ఒక వ్యక్తి కర్మఫలంగా ముందే నిర్ణయింపబడతాయని నాకు అర్థమయింది. కానీ అతని జీవితం యావత్తు చివరకు చిన్న చిన్న విషయాలు కూడా, ముందే నిర్ణయించబడతవా? భగవాన్, ఉదాహరణకు, నా చేతిలో ఉన్న ఈ విసనకర్రను నేలమీద పెట్టాననుకోండి. ఇది గూడా ముందుగానే నిర్ణయించబడి ఉంటుందా?" భగవాన్ చాలా గట్టిగా బదులిచ్చారు. "తప్పకుండా, ఈ శరీరం ఏమేమి చెయ్యాలో, ఏఏ అనుభవాలను అది పొందవలెనో, ఆ శరీరం ఉనికిలోనికి వచ్చినప్పటికే, (జన్మించినప్పటికే) నిర్ణయించబడినది. ముదలియార్ అంతటితో ఆగలేదు. ఆయన ఇంకా ప్రశ్నలు అడగసాగారు. అయితే అప్పుడు మానవుని స్వేచ్ఛ, తను చేసే పనులకు బాధ్యత ఏమౌతాయి?" భగవాన్ కరుణతో మొదలియార్‌ను చూస్తూ బదులిచ్చారు, "మనిషికి ఉన్న ఒకే ఒక స్వేచ్ఛ ఏమిటంటే జ్ఞానార్జనకోసం సాధన చెయ్యటం, దాని వలన దేహంతో తాదాత్మ్యం చెందకుండా ఉండగల్గుతాడు". మానవుడు తనను తాను దేహాత్మభావననుండి తప్పించ గల్గుతాడు. అది ఒక్కటే అతనికున్న స్వేచ్ఛ. దేహాత్మబుద్ధితో ఉన్నంతవరకు ప్రారబ్దంనుండి అతనికి స్వేచ్ఛ లేదు. శరీరం, దానికి నిర్ణయింపబడిన విధులన్నిటినీ చేసుకుంటూ పోతుంది. (కేవలం నేను శరీరంతో తాదాత్మ్యం చెందటల్లేదు అనుకుంటే చాలదు. ఎందుకంటే అదీ మరియొక ఆలోచనే కనుక, అందుకొరకే మనము సాధన చెయ్యాలి. దేహాత్మ బుద్ధిని తొలగించు కోవాలంటే, మనము, హృదయంలో స్థిరంగా నిలచి జ్ఞానాన్ని పొంది ఉండాలి). ఇది మనకు దేవరాజ మొదలియార్ అందించిన మరొక విలువైన బోధ.)

భక్తులు, సాధకులు, తరచుగా అరుణాచలముయొక్క గొప్పతనాన్ని గూర్చి, గిరిప్రదక్షిణ గురించీ, దానికి సమీపంలో ఉండడం గురించీ మాట్లాడుతుండే వారు. చాలాసార్లు ముదలియార్ గిరిప్రదక్షిణ యొక్క ప్రాముఖ్యతను గురించి అడిగేవారు. భగవాన్ ఒకసారి అన్నారు, "గిరిప్రదక్షిణ అనేది ప్రతి ఒక్కరికీ చాలా మంచిది. గిరిప్రదక్షిణ చేసేవాడు నమ్మకంతో చేస్తున్నాడా, లేదా అనేదానితో నిమిత్తం లేదు. నిప్పును అంటుకున్న అందరినీ అది కాల్చినట్లు, అరుణాచలము, తనకు ప్రదక్షిణ చేసేవారికి కేవలము మంచినే చేస్తుంది. ఒకసారి ముదలియార్ మళ్ళీ అదే ప్రశ్నతో భగవాన్‌ను విసిగించసాగారు. అపుడు భగవాన్

నవ్వుతూ అన్నారు, "గిరిప్రదక్షిణ ప్రాధాన్యాన్ని గురించి ఎందుకింతగా సతమతమౌతావు? నీకేమీ లభించినా లభించకపోయినా, కనీసం శరీరానికి వ్యాయామం లభిస్తుంది గదా". ముదలియార్ అత్యంత శ్రద్ధతో అరుణాచల గిరిప్రదక్షిణ రోజూ చెయ్యటం ప్రారంభించారు. ప్రతిసారి ప్రదక్షిణకు వెళ్ళే ముందు ఆయన భగవాన్ అనుమతి తీసుకునేవారు. భగవాన్ అనుమతిని ఇవ్వడమంటే, "ఇంకెవరు వస్తున్నారు నీతో?" అని అడిగేవారు. ఎవరైనా తోడువస్తుంటే వాళ్ళ పేర్లు చెప్పేవారు ముదలియార్. ఒకసారి భగవాన్ ప్రశ్నకు సమాధానమిస్తూ ముదలియార్, "ఈనాడు భగవాన్ నాతో వస్తున్నారు. ఇంకెవరూ రావడంలేదు," అన్నారు. భగవాన్ చక్కగా నవ్వి దీవించారు.

అరుణాచలం వద్ద నివసించడాన్ని గురించి, భగవాన్, అరుణాచల మహాత్మ్యం నుండి ఒక సంస్కృత పద్యాన్ని అనువదించారు. అందులో ఇలా ఉంది, "ఈశ్వరుడు ఇలాంటి ఉత్తరువు జారీచేశారు," ఏ విధమైన దీక్ష తీసికొననప్పటికీ, కొండకు మూడు యోజనాల (30మైళ్ళ) దూరంలోపల నివసించుటే చాలు, ఒక వ్యక్తియొక్క దోషాలు అన్నీ కాలిపోయి, పరమాత్మలో ఐక్యం చెందటానికి, ఇది నా ఆజ్ఞ". భగవాన్ ఒకసారి, ఈ పద్యాన్ని శ్లాఘిస్తూ (పొగడుతూ) ఇలా అన్నారు, "ఎవరైనా సరే, ఏదైనా సరే, కొండ లోపలగానీ, పైనగానీ, చుట్టుప్రక్కల గానీ ఉండే వారు అప్రయత్నంగానే మోక్షాన్ని పొందుతారు. ఏ విధమైన మతపరమైన, ఆధ్యాత్మిక పరమైన సాధన లేకుండానే. ముదలియార్, తన మామూలు ధోరణిలోనే భగవాన్‌ను ప్రశ్నించడం ప్రారంభించారు. "నేరస్థులు, నాస్తికులు, జంతువులు, పక్షులు ఇక్కడ ఉండే రాళ్ళు ఎలా మోక్షాన్ని పొందుతాయి?" "దానిని గురించి మాట్లాడడానికి గానీ, ప్రశ్నించడానికిగానీ మనమెంతవారము? అది ప్రీవీ కౌన్సిల్ (అత్యున్నత న్యాయస్థానం) చేత ప్రకటించబడిన నిర్ణయమైనపుడు," అని భగవాన్ కరుణతో అన్నారు. బ్రిటిష్‌వారి హయాంలో, బ్రిటన్ ప్రపంచంలో అనేకచోట్ల వలసరాజ్యాలను స్థాపించి పరిపాలిస్తున్న తరుణంలో, ప్రీవీకౌన్సిల్ అనేది లండన్‌లో ఉన్న అత్యున్నత న్యాయస్థానము. ముదలియార్ వకీలుగనుక, చట్టమునకు సంబంధించిన పదాలను రెండు అర్థాలు వచ్చేటట్లు వాడారు భగవాన్ చమత్కారంగా. (శ్లేషాలంకారము). దేవరాజముదలియార్ అన్నారు, "నేను లాయర్‌ను కనుక, ఈ నిజం నా హృదయం లోనికి సూటిగా చొచ్చుకునిపోయేటట్లుగా 'పరమేశ్వరునికి' బదులుగా 'ప్రీవీకౌన్సిల్' అనే పదాన్ని వాడారు.

ముదలియార్, తాను సామాన్యుణ్ణనీ, ఆధ్యాత్మిక పురోగతి సాధించే శక్తి లేనివాడననీ అనుకుంటుండేవారు. అందుకని అనేక సందర్భాలలో ఆయన భగవాన్‌ను అర్థించేవారు. "మీరు నన్ను కాపాడాలి. నన్ను నేను కాపాడుకోలేను," అని. ఒకరోజు ముదలియార్ ఒక తమిళపాటను చూడడం తటస్థించింది. అందులో కవి ఈ విధంగా బాధపడతారు, నాకు కోతిపిల్ల తన తల్లిని విడువకుండా పట్టుకున్నట్లుగా, దేవుని గట్టిగా పట్టుకొనటం చేతగాదని, అందుచే తల్లి దవడల మధ్యలో పట్టుకొని తీసికొనిపోబడ్డ పిల్లి పిల్ల వలె ఉన్నాననీ, కనుక ఈశ్వరుడే తనపట్ల శ్రద్ధ తీసుకొనవలసినదిగా ప్రార్థించారు. (మర్కట కిశోర న్యాయము, మార్జాల కిశోర న్యాయము). మొదలియార్ ఆ పాటను, భగవాన్‌కు చూపెట్టి ఇలా చెప్పారు, "నా పరిస్థితి కూడా అచ్చు అలాగే ఉంది. మీరు నాపై జాలి తలచాలి. భగవాన్ నా మెడను పట్టుకుని, నేను జారిపడిపోకుండా, దెబ్బలు తగులకుండ చూడండి"? భగవాన్ తన సహజధోరణిలోనే జవాబిచ్చారు. "అది అసాధ్యము. నువ్వు సాధన చెయ్యటము, గురువు సాయపడడమూ రెండూ అవసరమే". ముదలియార్ వాదించారు. పురాణాలలో కూడా సాధకుల సామర్థ్యాన్నిబట్టి మర్కటకిశోర న్యాయము, మార్జాలకిశోర న్యాయము అను రెండు పద్ధతులు గుర్తింపబడ్డవి అని ముదలియార్ వాదించారు. ఆయన ఎంతగా వాదించినా గానీ, ఆయనకు భగవాన్‌నుండి ఒకే ఒక సమాధానం లభించింది. (శిష్యుని ప్రయత్నమే, గురువు అనుగ్రహం). అక్కడ ఆలస్యంగానీ, తేడాగానీ ఉండదు. భక్తుని పరిశ్రమ, గురువు అనుగ్రహం సమానార్థకాలే. మనం గురువుగారిని మర్కటకిశోరం వలె అనగా కోతిపిల్ల వలె పట్టుకోవాలి. గురువుగారు మనల్ని తల్లిపిల్లి వలె పట్టుకుంటారు.

ముదలియార్ చేసిన గొప్ప సహాయం ఏమిటంటే, 1945 నుండి 1947 వరకు భగవాన్ సన్నిధిలో జరిగిన ప్రతి విషయాన్నీ ఒక డైరీలో వ్రాసి ఉంచారు. ఇది ఆశ్రమం వారిచే అచ్చువేయబడినది. దీనిపేరు "అనుదినము భగవాన్‌తో". ఇది మొత్తం కొన్ని నోటు పుస్తకాలలో వ్రాసి ఉండడాన్ని నేను చూశాను. వాటి అన్నిటిలో భగవాన్ చేతివ్రాత అక్కడక్కడ ఉంది. చాలా కొద్ది పేజీలు మాత్రమే దిద్దుబాట్లతో ఉన్నాయి (సరిదిద్దడము). టాక్స్ విత్ రమణమహర్షి (శ్రీరమణుల భాషణములు) లో భగవాన్ సంస్కృత గ్రంథాల నుండి వివరాలను ఉటంకిస్తే, 'అనుదినము భగవాన్‌తో' అనే పుస్తకంలో, పాత తమిళ గ్రంథాలనుండి ఉదాహరణలను ఇచ్చారు. 1950 దశాబ్దం చివరి భాగంలోనూ 1960 దశాబ్దం మొదటి భాగంలోనూ, ఆయన నాకు చెప్పిన కథలనూ, సంఘటనలనూ, పుస్తకంగా వ్రాయమని నేను ముదలియార్‌ను ఒత్తిడిచేశాను. ఫలితంగా,

భగవాన్‌తో ఆయన జ్ఞాపకాలు, "భగవాన్ శ్రీరమణమహర్షితో నా జ్ఞాపకాలు" అనే పేరుతో అచ్చయింది. నేను కాలేజీలో డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత రెండేళ్ళు ఆశ్రమంలో ఉన్నాను. అప్పట్లో మా కుటుంబ ఆర్థికపరిస్థితి బాగోలేదు కనుక, నేను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ ఉండేవాడిని. మా ఇంట్లో మొదట డిగ్రీ పూర్తిచేసింది నేనే. మేజర్ చాడ్విక్, తలైయార్‌ఖాన్, ఉద్యోగాన్వేషణలో నాకు తోడ్పడుతుండే వారు. ఆశ్రమంలో ఉంటూ, ఆఫీసులో పనిచేస్తున్నపుడు, పాతభక్తులనందరినీ, భగవాన్ సన్నిధిలో జరిగిన సంఘటనలను వివరించమని కోరేవాడిని. మేజర్ చాడ్విక్, ముదలియార్ ఎప్పుడూ అంగీకరించేవారు. వారు ఈ కథలను చెప్పిన తర్వాత, వాటిని (వ్రాతపూర్వకంగా) వ్రాసి ఇమ్మని ప్రాధేయపడే వాడిని. ఇవి రెండూ, భగవాన్ జ్ఞాపకాలను గురించిన మొదటి రెండు పుస్తకాలు. నేను 1960లో రమణాశ్రమానికి వచ్చేసిన తర్వాత, అక్కడ, మేజర్‌చాడ్విక్, దేవరాజముదలియార్, రామస్వామిపిళ్ళె, కుంజుస్వామి తప్ప పాతభక్తులెవరూ లేరు. శ్రీమతి తలైయార్‌ఖాన్, ఎస్.ఎస్.కోహెన్, ఆశ్రమానికి వెలుపల ఉండేవారు. నేను ఎక్కువ సమయం చాడ్విక్, కుంజుస్వామి, ముదలియార్‌లతో గడుపుతూ, భగవాన్ గురించిన కథలు వింటూ, ఆనందిస్తూ, ఇంకా ఇంకా వినాలని కోరుకునేవాడిని.

సంఘంలో మొదలియార్ గారి హోదా సామాన్యమైనది కాదు. సంఘంలోని శ్రేష్ఠులలో ఆయన ఒకరు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను 'రావు బహద్దూర్' (సంఘంలో అత్యంత గొప్ప వ్యక్తి) అను బిరుదునిచ్చి గౌరవించారు. ఆయన గొప్ప మేధావి. చాలా పేరుగన్న వకీలు. అయినా ఆయన తన సర్వస్వాన్నీ భగవాన్‌కు అర్పణచేశారు. 'ఆధ్యాత్మిక శరణాగతి అంటే మాటలతో శరణాగతి చెందటం కాదు. 'నాకు' అనేది, మౌనంగా ఉండే 'అహం' (ఆత్మ)కు శరణాగతి చెందాలి. భగవాన్ ఎలా ఎందుకూ పనికిరాని అహంకారాన్ని స్వీకరించి, అత్యంత విలువైన, వెలకట్టలేని 'అహం' (హృదయం)గా వెల్లడి అయ్యేట్లు చేశారో, ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు.

అది 1961 మరియు 1968 మధ్య కాలం. ఆశ్రమం చాలా పేద స్థితిలో ఉంది. ఒక్క మగవంట మనిషి మాత్రమే ఉన్నారు. పదిహేను కంటే తక్కువ మందికి వంట చెయ్యబడేది. అది రేషన్‌టైమ్. కొద్దిగా అన్నము, పప్పులేకుండా పులుసు, పల్చటి నీళ్ళలాంటి మజ్జిగ, పచ్చడి అన్ని భోజన పదార్థాలు ఉండే విందుభోజనాలు లేవు. నేను ఆశ్రమంలో అన్ని రాకల పనులనూ చూస్తూ, భోజనశాల అవసరాలను కూడా చూస్తుండేవాడిని. ముదలియార్, కొత్తగా పెళ్ళైన తన మనుమరాలు, ఆమె భర్తతో కలసి ఆశ్రమానికి వస్తున్నదని చాలా ఉత్సాహంతో ఉన్నారు. నేను వారు బస చెయ్యడానికి మోర్వీ అతిథి గృహంలోనూ, వెళ్లటానికి రిటర్న్ బస్ టికెట్, బస్టాండు నుండి వారిని తీసుకురావడానికి, గుఱ్ఱపుబండిని ఏర్పాటుచేశాను. నేను ఆశ్రమ వకీలును కలవడానికి వెళ్తూ, నూతన వధూవరులు వచ్చే సమయానికి వస్తానని మొదలియార్‌కు హామీ ఇచ్చివెళ్ళాను.

అప్పటికి కొద్దిగా ఆలస్యం అయినందున, నేను ముదలియార్ గదికి, పరుగున వెళ్లాను క్షమాపణ చెప్పడానికి. ఆ కొత్త దంపతులు పాతహాలులో ఉన్నారు. నేను ముదలియార్‌ను, ఆ నూతన దంపతులను, భోజనశాలకు తీసుకుని వెళ్తున్న సమయంలో, నా చేతిని గట్టిగా పట్టుకుని ముదలియార్ ఉద్వేగంతో ఇలా అన్నారు, "చూడు. భగవాన్ భౌతికంగా లేనందుకు నేనెంతో బాధపడుతున్నాను. ఆయనే గనుక ఉండి ఉంటే నా మనుమ సంతానాన్ని చూసి సంతోషించి, మాట్లాడి చక్కగా భోజనం పెట్టి ఉండేవారు. వారు తన పిల్లలే అయినట్లుగా ప్రత్యేకంగా, వ్యక్తిగత శ్రద్ధ పెట్టి చూసేవారు", ఆయన ఉద్వేగంతో ఇంక మాట్లాడలేకపోయారు. అప్పటికి 10.30 గంటలు అయింది. మధ్యాహ్న భోజనానికి ఇంకా సమయం ఉన్నది. నేను ఆ దంపతులను తీసుకుని, ముదలియార్‌తో కలసి భోజనశాలలోనికి ప్రవేశించే సరికి, అక్కడ ఆ దంపతులకు అరటి ఆకులు పరచబడి ఉన్నాయి. ముదలియార్ ఖచ్చితంగా మధ్యాహ్న భోజన సమయానికే భోంచేసేవారు. వారికి ఘనమైన విందుభోజనం వడ్డించబడింది. వడ, పాయసము, అప్పడము అన్నిటితో సహా. అప్పుడే ఆశ్రమ కాషియర్ (కోశాధికారి) వేగంగా వచ్చి నా చెవిలో గుసగుసగా చెప్పారు, "తెల్లవారుఝామున మీరు పట్టణానికి వెళ్ళారు. అప్పుడొక 'టెలిగ్రాఫిక్ మనీఆర్డర్' వచ్చింది. (అర్జంటుగా పోస్టు ద్వారా డబ్బు పంపుట) "తన మనవరాలికి, ఆమె భర్తకు చక్కటి విందుభోజనం ఏర్పాటుచెయ్యమని. కాబట్టి మీ అనుమతి తీసుకోకుండానే ఈ ఏర్పాట్లన్నీ చేశాను. నన్ను క్షమించండి," అన్నారు. ఆ జంట చాలా ఆనందంగా విందు ఆరగించింది. మేము ఆ దంపతులను సాదరంగా వీడ్కోలు చెప్పి పంపించిన తర్వాత, ముదలియార్ ఆనందబాష్పాలతో నన్ను గట్టిగా కౌగలించుకున్నారు. "గణేశూ! నేనెంత మూర్ఖుడిని. నేను నీతో బయటకు చెప్పలేదు గానీ, మనం రోజూ తినే నిస్సారమైన భోజనాన్నే వాళ్ళకు కూడా పెట్టవలసి వస్తుందే అని చాలా బాధపడ్డాను. భగవానే ఇక్కడ ఉంటే వారికి మంచి విందుభోజనం ఏర్పాటుచేసి ఉండేవారని అనుకున్నాను. చూడు గణేశూ, నా బాధని పోగొట్టటానికి,

భగవాన్ ఎవరికో ప్రేరణ కల్గించి వారిచేత టెలిగ్రాఫిక్ మనీ ఆర్డర్ పంపించేటట్లు చేశారు. అరటి ఆకుల మీద, వడ, పాయసం, అప్పడం అన్నీ వడ్డించి ఎంత మంచి విందు జరిగింది. భగవాన్ ఎంత కరుణతో ఈ ఏర్పాట్లు చేశారు," అంటూ ఆయన సంతోష పారవశ్యంతో ఏడ్చేశారు.

(ముదలియార్ ఎప్పుడూ శుభ్రంగా దుస్తులు ధరించి, నవ్వుతూ, మర్యాదగా ఉండేవారు. ఆయన ఎప్పుడూ కోపం తెచ్చుకుని ఎరుగరు. నేను ఆయనకు ఒకసారి అడిగాను, "మీరెప్పుడూ నవ్వుతూ అలా సంతోషంగా ఎలా ఉండగలరు?" దానికి సమాధానంగా, ఆయన మూడు బోధలను నాకు తెలియచేశారు. తేలికగా ఉండు. ఎప్పుడూ హృదయభారంతో ఉండకు. ఏసుక్రీస్తు అన్నారు, 'నీకు నువ్వే వెలుగువి కావాలి'. అంతే, అనవసరపు గొడవల్లో ఇరుక్కోకు. నన్ను చూడు. నేనెంత సంతోషంగా ఉన్నానో. దేనినీ పెద్ద సమస్యగా చేయవద్దు. గతాన్ని గుర్తు చేసుకుంటే, అనవసర గొడవలు వస్తవి. అలాగే భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతూ కూర్చున్నా గొడవలొస్తవి. వీలున్నంత వరకూ గతాన్ని గురించీ, భవిష్యత్తు గురించీ అతిగా ఆలోచించడం మానెయ్యి. ప్రస్తుతంలోనే ఉండు. భగవంతుడు నీలోనే ఉన్నాడు. నువ్వు కళ్ళతో చూసేటప్పుడు నిజంగా చూసేదెవరు? వినేదెవరు? తినేదెవరు? అరిగించుకునేదెవరు? నిద్రింపజేసేదెవరు? అంతరంగికమైన శక్తి, దేనినైతే భగవాన్ సర్వోత్కృష్టశక్తి అన్నారో, అదే దైవం. ఆ అంతరంగికమైన సర్వోత్కృష్టశక్తే నిజానికి నీవు. మౌనాన్ని పట్టుకుని ఉండు. 'అహం'గా ఉండు. ఎల్లపుడూ సంతోషంగా ఉండు. ఆయన చెప్పిన మూడో విషయమేమిటంటే, "భగవాన్ సత్యం. సత్యాన్ని నిర్వచించాలని చూడకు. మనసు ఆ పనిని చెయ్యలేదు. ఇది వరకు ఆ పనిని ఎవ్వరూ చేసి ఉండలేదు, నువ్వు 'నాకు' అనే దాన్ని వారి 'అహం'కు శరణాగతి చెందిస్తే, నీ హృదయంలో 'సత్యం' దానంతట అదే వ్యక్తమౌతుంది. నువ్వు ఆధ్యాత్మికంగా, నీ అంతరజ్ఞానంతో దానిని నువ్వు గుర్తించగల్గుతావు. నీకు నా ఆశీస్సులు," అన్నారు.)

1964 లేక 65 సం॥లలో ఆయన చివరిరోజులలో ఆయన ఆశ్రమాన్ని విడచి వెళ్ళవలసి వచ్చింది. ఎందుకంటే, ఆయన కుటుంబసభ్యులు, ఆయనను తమతోపాటే ఉండమని కోరుటవలన. నేను, ఆయనకొక వీడ్కోలు సభ ఏర్పాటుచేశాను. దాంట్లో భక్తులందరూ పాల్గొన్నారు. ఆయన తన బిడ్డలతో కాంచీపురమునకు వెళ్ళి, అక్కడ, విడువకుండ భగవాన్ నామాన్ని జపించసాగారు. ఒక దినపత్రిక విలేఖరి, ఆశ్రమవాసులను ఇంటర్వ్యూ (ప్రశ్నాపూర్వక) చేయడానికి రాగా, నేను ఆయనకు కాంచీపురంలో ఉన్న ఈ మణి వంటి భక్తుని గూర్చి తెలిపాను. ఆ పాత్రికేయుడు, దేవరాజ ముదలియార్‌ను వేసిన ప్రశ్నలలో ఒకటి. మీరే భగవాన్‌నుండి, ఒక రాయిగాని, పక్షిగాని, చెట్టుగాని, అరుణాచలంలో నివసిస్తుంటే ముక్తి పొందుతుందనే జవాబును రాబట్టారు గదా, మీరెందుకు, అరుణాచలానికి దూరంగా కాంచీపురంలో నివసిస్తున్నారు?" అదే పాత్రికేయుడు తర్వాత ముదలియార్ ఇచ్చిన సమాధానాన్ని నాకు తెలిపారు. మొదలియార్ అన్నారు, "అది మీరు అంటున్నారు, నేను అరుణాచలానికి ఎప్పుడైనా దూరంగా ఉన్నానని నేను అన్నానా? నేనిప్పుడు కాంచీపురంలో ఉన్నందుమూలాన, నాకేమైనా తేడా జరిగిందా (ఉందా)? భగవాన్ ఎల్లపుడూ నాతోనే ఉన్నారు. నేనెప్పుడూ అరుణాచలంలోనే ఉన్నాను. 'అహం' అనేది ఎక్కడున్నదో, అక్కడ అరుణాచలమున్నది. ముదలియార్ అప్పటికే (అప్రయత్నంగానే) ఈ అహంను గురించి బోధను వ్యాపింపచేస్తున్నారు.

నేను ఆయనను, ఎందుకు ఆయన రమణనామాన్ని జపిస్తున్నారని అడిగాను. ఆయన ఇలా అన్నారు, "నేను ఒకప్పుడు భగవాన్‌ను ఇలా అడిగాను, 'భగవాన్, కొన్నిసార్లు మీ గురించి ఆలోచించకుండానే నేను నామాన్ని జపిస్తుంటాను. అది సరైనదేనా? నాకు దీనికి మార్కులు పడతవా? స్వయంగా నేనైతే పడతయ్యనే అనుకుంటున్నాను, ఎక్కువ మార్కులు రాకపోయినా, ఒకటిరెండయినా పడతయ్యని. అంతేకదా భగవాన్?' అన్నాను. భగవాన్ నవ్వి బదులిచ్చారు, 'అవును. నీకు దీనికి మార్కులు పడతయ్యి'. అందుకే నేను రమణ రమణ అని విడువకుండా అంటున్నాను. నాకు పూర్తి నమ్మకమున్నది. ఆయన చెప్పినట్లు ఆయన ఆఖరిపరీక్షలో మార్కులు వేస్తారని," అన్నారు ముదలియార్.

ఆయన బంధువులు నాతో చెప్పారు. ఆయన చివరిరోజులు చాలా ప్రశాంతంగా గడిచాయని. ఆయన స్పృహ ఉన్న చివరిక్షణం వరకు రమణ, రమణ అని (స్మరిస్తూ) జపిస్తూనే ఉన్నారు. రమణ, రమణ అనుట కేవలం మంత్రజపమూ కాదు, (పూజాక్రతువూ కాదు). ఆచారకాండ కాదు. స్మరణ అంటే ఆ దివ్యసమ్ముఖాన ఉండడమే. నువ్వురమణ అనగానే, నువ్వు ఆ శక్తివంతమైన 'అహం'లో, శక్తివంతమైన, శుద్ధమైన చైతన్యపు సన్నిధిలో ఉండడమే.

విశ్వనాధస్వామి



భగవాన్ తల్లి అళగమ్మాళ్ గారి సోదరుడు దిండిగల్లులో ఉండేవారు. ఆయన భార్య ఒక కుమారుని ప్రసవించి చనిపోయింది. భగవాన్ తల్లితండ్రులు, ఆ బాలుని తమ ఇంటికి తీసుకుని వచ్చి ప్రేమగా, శ్రద్ధగా పెంచేవారు. భగవాన్ పుట్టబోయే ముందు, అమ్మ అళగమ్మాళ్ ఈసారి అమ్మాయి పుడితే నా మేనల్లుడికి భార్య అవుతుంది. అమ్మాయి పుట్టాలని ఆమె కోరుకున్నారు. ఆరాత్రి తిరుచ్చులిలో, భగవాన్ పుట్టగానే గుడ్డిదైన మంత్రసాని (నర్సు), అళగూ, అబ్బాయి పుట్టాడు, సంతోషించు. నేనొక గొప్ప వెలుగును చూశాను. అళగూ సంతోషించు అన్నారు. బాలిక జన్మించనందుకు అళగమ్మ నిరాశ చెందారు. ఆ నిరాశలో, ఆ గ్రుడ్డి నర్సు చూసిన గొప్ప వెలుగును గురించి విన్పించుకోలేదు.

పెద్దవాడైన పిమ్మట రామస్వామి చక్కటి న్యాయవర్తనగల వకీలు అయ్యారు. ఆయన చాలా క్రమశిక్షణ కల్గిన వ్యక్తి. సంఘసేవ ఎక్కువగా చేయుట వలన, ఆయనను అందరూ ఎక్కువగా గౌరవించేవారు. ఆయన పుత్రులలో ఒకరే విశ్వనాథన్. తన సోదరుల వలెనే విశ్వనాథన్ కూడా పదునైన మేధస్సుగల వారు. తన సోదరులతో పాటు ఆయన కూడా, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. 1921లో ఇంకా కాలేజీలో చదువుతుండగానే బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించినందుకు గాను అరెస్టు గావించబడ్డారు. (జైలులో పెట్టబడ్డారు). విశ్వవిద్యాలయ పరీక్షలు జరుగనున్నందున, ఆయన తండ్రిగారు ఆయనను బెయిల్‌మీద (పూచీకత్తు/హామీ) విడుదల చేయించారు. కానీ, తన స్వగ్రామమైన దిండిగల్‌కు వెళ్ళకుండ, తిరువణ్ణామలైలో దిగి, అపుడు రమణమహర్షిగా పిలువబడుతున్న తన మామయ్య వెంకట్రామన్‌ను కలవడానికి వెళ్ళారు విశ్వనాధస్వామి.

భగవాన్‌తోటి తన ప్రథమ కలయికను గురించి, ఆయన అనుగ్రహ వీక్షణను గురించి ఇలా వర్ణిస్తారాయన : భగవాన్, స్కందాశ్రమము ముందు ఉన్న ఖాళీస్థలంలో నుంచుని ఉన్నారు. నేను మొదట ఆయనపై దృష్టి నిలపగానే, ఆయనలో ఏదో సమ్మోహనశక్తి ఉన్నట్లు చూశాను. అదే ఆయనను, నేను చూసిన ఇతరులందరికంటే ప్రత్యేకంగా ఉండేటట్లు చేసింది. ఆయన భౌతికశరీరంనుండి విడిగా, దానితో సంబంధం లేనట్లుగా ఉన్నారు. ఆయన చూపులోనూ, చిరునవ్వులో కూడా ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక సౌందర్యం ఉన్నది. ఆయన మాట్లాడుతున్నపుడు, ఆయన మాటలు, ఎక్కడో లోతునుండి వస్తున్నట్టు అన్పించింది. ఆయనలోనూ, ఆయన కదలికలలోనూ, మచ్చలేని పరిశుద్ధత, వైరాగ్యము కన్పిస్తుండేవి. ఆయనలో ఏదో ఉన్నతమైన సంస్కారం గల పవిత్రమైన శక్తి ఉన్నట్లుగా నేను గ్రహించాను. ఆయన సమీపంలో మనసులో ఉండే అలజడి తగ్గిపోయి, మనసు నైతికబలాన్ని పెంపొందించే శాంతితో నిండిపోతుంది. ఆయన సన్నిధిలో ప్రత్యేకమైన సంతోషాన్ని, శాంతిని ప్రత్యక్షంగా అనుభవించవచ్చును. దీనిని నేను 'రమణలహరి' అంటాను. శ్రీరమణులయొక్క ఆనందమయమైన వాతావరణంలో, ఆయన అనుగ్రహమువలన కలిగే పారవశ్యంలో, ఏ వ్యక్తి అయినా, తన ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. అంతటా వ్యాపించి ఉండి అందరినీ కబళించివేసే, శక్తి అక్కడ ఉంటుంది. తన అనుగ్రహ ప్రకాశంలో, ఈ జగత్తుని మ్రింగివేయగల అరుణాచలేశ్వరుని శక్తియే అది. ఈ పారవశ్య అనుభవము తర్వాత విశ్వనాధస్వామి కొన్నాళ్ళు అక్కడే ఉండిపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

అప్పుడు భగవాన్ తల్లి అళగమ్మాళ్, భగవాన్ సోదరుడు, చిన్నస్వామి కూడా ఉన్నారు. వారు విశ్వనాధస్వామిని చిన్నతనంనుండి ఎరుగుదురు. చిన్నప్పుడే ఆయనకు సంస్కృతంలో పాండిత్యము ఉండేదని వారెరుగుదురు. అందుకని కొన్ని భక్తి పద్యాలు సంస్కృతంలోనివి పాడమని అడిగారు. పాడడం పూర్తవగానే, నువ్వు వీటన్నిటినీ నేర్చుకున్నావు. నా విషయంలో అలా జరుగలేదు. ఇక్కడకు రాకపూర్వము నాకేమీ తెలియదు. నేనేమీ నేర్చుకోలేదు. ఏదో నిగూఢశక్తి నన్ను లోబరుచుకుని, పూర్తి మార్పును తీసుకొని వచ్చింది. అప్పట్లో ఎవరికి తెలుసును గనుక నాకు ఇట్లా జరుగుతుందని. చిన్నతనంలోనే హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసుకోవాలనుకున్న నీ తండ్రిగారు, ఒక పెద్ద కుటుంబానికి పెద్దఅయ్యాడు. ఏమీ తెలియని నేను, ఇక్కడకు

లాగబడి, ఇక్కడే ఉంచివేయబడ్డాను. అది మంచికే జరిగింది. నేను నా పదిహేడవ ఏట ఇల్లు వదలిపెట్టినపుడు, భారీ వరదలో చిక్కుకున్న చిన్న అణువు వలె ఉన్నాను. నాకు నా శరీరాన్ని గురంచి తెలిసేదికాదు. ప్రపంచాన్ని గురించీ తెలిసేది కాదు. కళ్ళు తెరవడం కూడా కష్టంగా ఉండేది. నా కనురెప్పలు క్రిందకి అతికించబడ్డట్లుగా ఉండేది. నా శరీరము ఒక అస్థిపంజరంలాగా తయారైంది. సందర్శకులు నా స్థితిని చూసి జాలిపడేవారు. ఎందుకంటే వారికి నేనెంత ఆనందమయ స్థితిలో ఉన్నానో తెలియదు కనుక. కొన్ని సంవత్సరాల తర్వాత, నా వద్దకు తేబడిన వేదాంతగ్రంథాలలో 'బ్రహ్మన్' అనే మాట చూసి నేనాశ్చర్యపడి, ఈ అనుభవాన్నే బ్రహ్మమంటారా? అనుకున్నాను.

విశ్వనాధన్ వెళ్ళిపోవలసి వచ్చింది. భారమైన హృదయంతో ఆయన సెలవు తీసుకుంటుండగా, భగవాన్ రమణగీత కాపీని ఇచ్చారు. ఆ పుస్తకం ఇచ్చేటప్పుడు, దీనిని మీ తండ్రిగారికిచ్చి చదవమని చెప్పు అన్నారు. విశ్వనాధన్ దిండిగల్లులో ఆ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివారు. ఆయన ఆ పుస్తకంలో లీనమైపోయి చదువుతుండేవారు. ప్రత్యేకించి 18వ అధ్యాయంలో భగవాన్‌యొక్క గొప్పదనము చక్కటి సంస్కృత పద్యాలతో గొప్పగా కొనియాడబడినది. ఇది విశ్వనాధన్‌ను ఎంతగా కదిలించి వేసిందంటే, ఆయన ఈ ప్రపంచాన్ని వదలివేసి, భగవాన్ పవిత్రమైన పాదాలచెంతకు వెళ్ళిపోయి అక్కడే స్థిరపడి పోవాలనే నిశ్చయానికి వచ్చాడు.

1923 జనవరిలో, తల్లితండ్రులకు చెప్పకుండా ఆయన తిరువణ్ణామలైకు వెళ్ళిపోయారు. అప్పటికే భగవాన్ రమణాశ్రమానికి వచ్చి ఉన్నారు. ఆయన వచ్చి కన్పించగానే భగవాన్ అడిగిన మొదటి ప్రశ్న. నీవు ఇంట్లో తల్లితండ్రులకు చెప్పిగానీ, వారికేదైనా ఉత్తరము వ్రాసిపెట్టిగానీ వచ్చావా? విశ్వనాధన్ తలవంచుకున్నారు. నేను ఇల్లు వదలి వచ్చేటప్పుడు నేనాపని చేశాను. నువ్వెందుకు చెయ్యలేదు! ఇప్పుడు మీ తల్లితండ్రులకు నువ్వు క్షేమంగా ఉన్నట్లుగా జాబువ్రాయమన్నారు భగవాన్. భగవాన్ అపుడు ఉండడానికి అనుమతినిచ్చారు. భగవాన్ యొక్క శక్తి, భగవాన్ సన్నిధి చాలా బలీయమైనవని, అక్కడ ఉండగా తను లాంఛనంగా సాధన ఏమీ చెయ్యనవసరం లేదనీ విశ్వనాధన్ కనుగొన్నారు. అయినా, ఆయన భగవాన్ బోధలను చక్కగా చదువుతూ, ప్రేరణనిచ్చే భగవాన్ సన్నిధిలో, ఆశ్రమ పనులు నిర్వహిస్తుండేవారు. భగవాన్ బోధలు చదువుతున్నకొద్దీ, ఆయన నమ్మకం దృఢపడసాగింది. ఏమని అంటే భగవాన్‌సన్నిధి, కేవలం దగ్గరగా ఉండడం, ఆధ్యాత్మిక ఉన్నతికి తీసుకొని పోయే భగవాన్ సహచర్యము, లభ్యమైన వానికి సాధనతో పనిలేదు. అవే చాలు గమ్యానికి చేర్చడానికి. ఆయన నమ్మకం మరింత బలపడింది, ఉన్నది నలుబది యొక్క అనుబంధంలో భగవాన్ వ్రాసిన పద్యం చదివినప్పుడు ఎవరు మహాత్ముని సాంగత్యాన్ని పొందగలుగుతారో వారికి, మతపరమైన, ఆధ్యాత్మికపరమైన ఆచరణలేమీ అవసరం లేదు. చల్లని దక్షిణపు గాలి వీస్తుండగా, విసనకర్ర అవసరము లేనట్లే.

కొన్నిరోజులైన తర్వాత భగవాన్ నువ్వు ఏ విధమైన ఆధ్యాత్మిక సాధనను చేపడతావు అని అడిగారు. తాను చిన్నప్పటినుండి గాయత్రీ మంత్రాన్ని జపించడానికి ఇష్టపడతానని చెప్పారు. భగవాన్ ఇలా బదులిచ్చారు. "చాలా బాగుంది. కానీ నువ్వు నిజాయితీగా ప్రతిరోజూ ఒక ప్రత్యేక సమయంలో, పూర్తిగా దానిలో లీనమైపోయి, జపం చెయ్యాలి". భగవాన్ అపుడు విశ్వనాధన్‌ను, కొండపైనున్న చిన్న గుహకు తీసుకుని వెళ్ళారు. అక్కడ కూర్చుంటే ఎండతీవ్రత యొక్క బాధలేకుండా, అరుణాచలుడిని, తూర్పు, పడమర దిశలనుండి చూడవచ్చును. జపం చెయ్యటానికి ప్రత్యేకమైన వేళ ఉంటుంది. నేను వచ్చి నీ సాధనను పరిశీలిస్తూ ఉంటాను. కాబట్టి చాలా క్రమశిక్షణతో సాధనచెయ్యి," అన్నారు. విశ్వనాధన్ నన్ను ఆ గుహ వద్దకు తీసుకుని వెళ్ళి చూపించారు. భగవాన్ నిజంగానే పరిశీలించడానికి వచ్చేవారు. అవి వట్టి మాటలు కావు అని చెప్పగా నేను పొంగిపోయాను. ఆయన ఎంతగా జపంలో నిమగ్నమై పోయి ఉండేవారంటే, విశ్వనాధన్ తన విధిని సంపూర్తి చేయగల శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారో లేదో పరిశీలించడానికి భగవాన్ ఎన్నోసార్లు అచటికి వెళ్ళినప్పటికి, విశ్వనాధన్‌కు ఆ విషయం తెలిసేదికాదు.

విశ్వనాధన్ 1923నుండి 1927 వరకు భగవాన్‌తో ఉండి, కఠినతరమైన అభ్యాసాన్ని చేశారు. అది ప్రకాశానికీ, ప్రయత్నానికీ చెందిన కాలము. గురువుగారు తన అనుగ్రహాన్ని కురిపించడం, శిష్యుడు నిజాయితీగా ప్రయత్నించడం, తను ఎంతవరకు పురోభివృద్ధి చెందాడో విశ్వనాధన్‌కు గట్టిగా తెలియదు. అందుకని ఆయన భగవాన్‌ను ఇలా అడిగారు, "భగవాన్, నేను

నాలో ప్రస్తుతము ఉన్న జంతుప్రవృత్తుల్ని ఎలా అధిగమించగలను? నా స్వంత ప్రయత్నాలన్నీ వ్యర్థమైనాయి. ఏదో ఒక మహత్తరశక్తి మాత్రమే నన్ను మార్చగలదని నాకు నమ్మకం ఏర్పడింది." భగవాన్, ఎంతో కరుణతో బదులిచ్చారు, "అవును. నువ్వనేది నిజమే. ఇంద్రియాలకంటె ఉన్నతమైన, బలమైన శక్తిని జాగృతం చేయడం ద్వారానే, వీటిని అణచ(వచ్చును) గలము. నువ్వు గనుక ఆ ఉన్నతశక్తిని జాగృతం చేసి బలోపేతం చేసినట్లయితే, మిగిలినది ప్రతిఒక్కటీ దానికదే వెల్లడి అవుతుంది. ధ్యానాన్ని, మధ్యలో ఖాళీలేకుండా, నిరంతరం కొనసాగించాలి. ఆహారనియమాలు, ఇతర నియమాలు నిజాయితీగా, శ్రద్ధగా, పాటించడం వల్ల ఆంతరంగిక శాంతిని నిలుపుకోవడానికి వీలవుతుంది. భగవాన్ అన్నారు, "విశ్వనాధన్, ఇక్కడకు వచ్చే జనులతో కలవవద్దు. సంఘంలో అనుబంధాలు పెంచుకోవడానికి, మనుషులతో మాట్లాడడానికి, మనుషులతో స్నేహసంబంధాలు పెంచుకోవడానికి కాలం వృథా చెయ్యవద్దు. వీలున్నంత తక్కువ మాట్లాడు. విశ్వనాధ స్వామి శ్రద్ధగా, భగవాన్ మాటలను పాటించారు. ఎప్పుడైనా ఆయన మాట్లాడినా గొంతుపైకి వినబడేది కాదు. కేవలం ఊరిలోనికి పోయి బిచ్చమెత్తుకోవడానికి మాత్రమే బయటకు కదిలేవారు. తర్వాత కొందరు పాతభక్తులు నాకు చెప్పారు, ఆయన చాలా మృదువుగా సంభాషించేవారనీ, తక్కువగా బయటకు వచ్చేవారని.

విశ్వనాధస్వామి జీవితంలోని, ఈ ఘట్టానికి చెందిన చాలా ఆసక్తికరమైన సంఘటననొకదానిని మనం చూద్దామిపుడు. విశ్వనాధస్వామి వచ్చిన నాలుగు నెలలకు, వారి తండ్రిగారు అచటికి వస్తున్నారని దిండిగల్‌నుండి జాబు వచ్చింది. విశ్వనాధస్వామి ఆ ఉత్తరాన్ని భగవాన్‌కు చూపగా, ఆయన పూర్తి కరుణతో ఇలా అన్నారు, "విశ్వనాధా, మీ కుటుంబం కూడా వస్తుంది. రైల్వే స్టేషన్‌కు వెళ్ళి వాళ్ళని కలుసుకో. కానీ నేను లేకుండా మీ తండ్రిగారితో మాట్లాడవద్దు. స్టేషన్‌లో వారిని కలుసుకొని టౌన్‌లో వాళ్ళు ఉండడానికి ఏర్పాటు చేసుకున్న బస వద్ద వారిని దింపి, నీ గుహకు నీవు వెళ్ళిపోయి, నీ జపం చేసుకుంటూ ఉండు. నేను నీకు కబురుపెడతాను. అప్పుడుకూడా మీ తండ్రిగారితో మాట్లాడవద్దు. వచ్చి ప్రణామంచెయ్యి. నాకు కాదు. మీ తండ్రిగారికి. చేసిన తర్వాత మౌనంగా నిలబడు. నేను మిగిలినదంతా చూసుకుంటాను. విశ్వనాధన్ తండ్రి రామస్వామి, భగవాన్‌యొక్క ఆధ్యాత్మిక (స్థితి) ఔన్నత్యాన్ని ఎరుగరు. ఆయనకు భగవాన్, వెంకటరామన్‌గానే, ఇంటినుండి పారిపోయి సన్యాసిగా మారిన తన బంధువుగానే తెలుసును. అప్పట్లో, పాతహాలు నిర్మాణంలో ఉన్నది. అందుకని భగవాన్, తక్కినవారు గూడా, రోడ్డుకు అవతల ప్రక్కనున్న మండపంలోనికి మారారు. విశ్వనాధస్వామి తండ్రి అక్కడికి వచ్చి భగవాన్‌ను చూచినపుడు, ఆయన భగవాన్ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని గుర్తించగల్గారు. మరుక్షణమే ఆయన సంపూర్ణ గౌరవముతోను, భక్తితోనూ, భగవాన్‌కు సాష్టాంగ నమస్కారము చేశారు.

అపుడు భగవాన్, విశ్వనాధన్‌కు కబురుపెట్టారు. ముందుగానే సూచించిన ప్రకారం, ఆయన వచ్చి తండ్రికి ప్రణామంచేసి, ఆయన ప్రక్కనే చేతులు కట్టుకుని, తలవంచుకుని నిలబడ్డారు. రామస్వామి చాలా కోపంగా ఉన్నారు. ఆయన విశ్వనాధన్‌వైపు తిరిగి, "ఇదంతా చాలు. అన్నీ సర్దుకుని నాతో వచ్చెయ్యి. అందుకే మేము వచ్చాము. నిన్ను తిరిగి దిండిగల్ తీసుకుని పోవడానికే," అన్నారు. ఒక శిలవలె చెక్కుచెదరని నిశ్శబ్దంతో మండపమంతా నిండిపోయింది. భగవాన్, రామస్వామి వైపు చూసి అన్నారు. విశ్వనాధన్, శరణాగతి, స్వీయప్రక్షాళన (Self Purification) బాటపట్టారు. రామస్వామి పూర్తిగా సంతృప్తి చెందలేదు. భగవాన్ ఆయనతో అన్నారు, "విశ్వనాధన్‌ను ఇక్కడ ఉండనివ్వండి. అతనికి మేలు జరుగుతుంది. ఈమాట గారడివలె పనిచేసింది. ఆ తండ్రి కరిగిపోయాడు. ఆయన భగవాన్‌వైపు చూశారు. తండ్రిగా ఆయన బాధ్యతలూ, భావనలూ ఆయనను భగవాన్‌తో ఈవిధంగా మాట్లాడేటట్లు చేసినవి, "భగవాన్ కనుక విశ్వనాధన్‌యొక్క ఆధ్యాత్మిక పరిపూర్ణత గురించి బాధ్యత తీసుకుంటానంటే, అతడిని ఇక్కడ వదలి వెళ్ళటానికి నాకు అభ్యంతరం లేదు". మళ్ళా అక్కడ పూర్తి నిశ్శబ్దం ఆవరించింది. విశ్వనాధన్ ఇది ఎన్నడూ ఊహించలేదు. ప్రతి ఒక్కరూ భగవాన్‌వైపు చూడసాగారు. భగవాన్ కరుణతో ఆయనవైపు తిరిగి, అందరిముందూ ఈ విధంగా ప్రకటించారు : "అవును. విశ్వనాధన్‌యొక్క ఆధ్యాత్మిక పురోగతికి సంబంధించిన బాధ్యత యావత్తూ నేను తీసుకుంటాను". చిన్నస్వామి విషయంలో భగవాన్, ఎవరూ లేని సమయంలో, తల్లితో చిన్నస్వామి బాధ్యతను తను స్వీకరిస్తానని చెప్పారు. కానీ విశ్వనాధస్వామి విషయంలో, బహిరంగంగా ప్రకటించారు. ఏమైనా, ఇవి రెండూ చెదురుమదురుగా జరిగిన సంఘటనలు కావు. మనల్ని మనము నిజాయితీగా మనస్ఫూర్తిగా,

సాధనకు, అభ్యాసానికి అంకితం చేసుకుంటే, భగవాన్ మనలో ప్రతి ఒక్కరి ఆధ్యాత్మిక పరిపూర్ణతకూ ఇప్పుడు కూడా బాధ్యత వహిస్తారు. భగవాన్ యొక్క పవిత్రమైన వాక్కులను గుర్తుకు తెచ్చుకోండి : సాధకుని ప్రయత్నమూ, గురువు అనుగ్రహమూ రెండూ సమానార్థకములైనవీ, ఒకేసారి జరిగేవి. మన పాత్ర ప్రయత్నం చెయ్యడం వరకే.

విశ్వనాధస్వామి మిక్కిలి సంతోషించారు. ఆయన కఠోరమైన సాధన మొదలైంది. భగవాన్, ఆయనను తనతోపాటు నడవటానికి తీసుకువెళ్తూ, తాను రచించిన (జ్ఞాన, భక్తి పద్యాలను) జ్ఞానమును బోధించే, భక్తిని గురించి వివరించే పద్యాలను ఆయనకు వివరిస్తుండేవారు. భగవాన్ ఆయన గురించి పూర్తి శ్రద్ధ తీసుకున్నారు. విశ్వనాధస్వామి తర్వాత నాతో అన్నారు, "భగవాన్‌తో ఏకాంతంగా ఉండడం, కేవలం తన ఒక్కరికే ఆయన బోధను వివరించడం, తనకు భగవాన్ ఇచ్చిన గొప్ప వరాలు," అని. ఒకనాడు భగవాన్, విశ్వనాధస్వామి కూరలు తరుగుతుండగా, భగవాన్ ఆయనతో, "నువ్వు దుమ్మునికూడా ఉపయోగించగల్గిన సమర్థత కలిగి ఉండాలి. అదే సమయంలో ఈ జగత్తు మొత్తాన్నీ కూడా, కేవలం దుమ్ముగా భావించి నిరాకరించగలిగి ఉండాలి."

గురుశిష్యుల మధ్య అనుబంధం పెరుగుతూ ఉన్నది. విశ్వనాధన్‌కు వేదపురాణేతిహాసాలలో గట్టి పునాది ఉండాలని భగవాన్ భావించి ఉంటారు. అప్పట్లో కావ్యకంఠగణపతిముని కొండపైన ఉంటుండేవారు. కాబట్టి 1927లో భగవాన్ విశ్వనాధన్‌ను కావ్యకంఠుల వద్దకు పవిత్రగ్రంథాలను చదడానికి పంపారు. నాయన 1929లో పల్లాకొత్తులో ఉండటానికి వచ్చినపుడు కూడా, భగవాన్ ప్రత్యేకంగా విశ్వనాధన్‌తో చెప్పారు, "నాయన పల్లాకొత్తులోని ఒక కుటీరంలో ఉంటున్నారు. నువ్వు వెళ్ళి ఆయనతో ఉండి, ఆయన దగ్గర నేర్చుకో," అని. ప్రతిరోజూ, భగవాన్ ఆ కుటీరానికి వెళ్ళేవారు. ఎప్పుడూ, "నాయనా, విశ్వనాధన్ ఎలాగున్నాడు?" అని అడిగేవారు.

గురువుగారు తనకొక ఉపాధ్యాయుని సూచించారు. దానితో విశ్వనాధన్‌లో ఉత్సాహం పెరిగింది. సంస్కృత గ్రంథాలు చదవడం వల్ల పద్యాలను ఆసువుగా చెప్పగలగడం వచ్చింది. ఒకసారి ఆయన అయిదు పద్యాలను వ్రాసి భగవాన్ పాదాలచెంత ఉంచారు. భగవాన్ వాటిని చదివి ఆమోదిస్తున్నట్లు చెప్పారు, "అవి చాలా బాగున్నవి. వ్రాయటాన్ని నువ్వు ఎందుకు కొనసాగించవు? కానీ ముందు వానిని నాయనకు చూపించి సరిదిద్దించుకో," అన్నారు.

విశ్వనాధన్, కావ్యకంఠులు చేయి చేయి కలిపి, శ్రీరమణ అష్టోత్తరం అనే నూట ఎనిమిది భగవాన్ నామాలను వ్రాశారు. ఆ ప్రార్థన (అష్టోత్తర) లోని చక్కదనమేమిటంటే, దాని పరిమళం ఎప్పటికీ వాడిపోదు. దాని సువాసన హృదయంనుండి వెలువడుతుంది కనుక. అది విశ్వనాధన్, నాయనల హృదయాలనుండి వచ్చి హృదయమే తానైన భగవాన్ ఆమోదం పొందింది. అవి ఒక ప్రబంధ కావ్యము. పవిత్రమైన పువ్వు. దీనిగురించి విశ్వనాధస్వామి నాతో ఇలా చెప్పారు. భగవాన్ పవిత్రమైన పాదాలచెంత దీనిని ఉంచడం నా అదృష్టం. విశ్వనాధస్వామి తన ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించారు. ఏళ్ళు దొర్లిపోయినవి. ఎవరైతే సత్యంలో జీవిస్తారో, వారు ఎప్పటికీ శాశ్వతమైన ప్రస్తుతంలోనే ఉంటారు. అటువంటి వారికి, కాలంతో నిమిత్తం లేదు. ఎందుకంటే కాలము అనేది భ్రమ. విశ్వనాధస్వామి కాలంతో నిమిత్తం లేని పారవశ్యంలో ఉన్నారు.

భగవాన్ ఆరోగ్యం పాడైనపుడు, ఆపరేషన్ చెయ్యవలసి వచ్చినపుడు, అది ఆయనకు తీవ్ర అఘాతమైనది. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి అన్నారు, "భగవాన్ పగలూ రాత్రీ సేవచేస్తూ మీ చెంతనే ఉండిపోవడానికి అనుమతి ఇవ్వండి". భగవాన్ ఆయనవైపు తిరిగి, "నీవు చెయ్యవలసిన పని ఉన్నది." అని మర్యాదగా ఆయన వినతిని త్రోసిపుచ్చారు. భగవాన్ నిర్యాణం రోజున కొద్దిమంది నాతో సహా ఆయన గదిలో ఉన్నాము. బయట భక్తులు భగవాన్‌చే రచించబడిన హృదయాన్ని కరగించేటటువంటి అక్షరమణమాలను పాడుతున్నారు. భగవాన్ తన పరిచారకులను, తనను లేపి కూర్చోబెట్టవలసినదిగా కోరారు. అరుణాచల కీర్తన పెద్దగా విన్పిస్తున్న కొద్దీ ఆయన కనులనుండి ఆనందభాష్పాలు ధారాళంగా కారసాగాయి. విశ్వనాధస్వామి అక్కడ బహిర్గతమవుతున్న (వెల్లివిరుస్తున్న) ఈ మహోన్నత ఆధ్యాత్మిక వైభవాన్ని చూస్తున్నారు. ఉన్నట్లుండి భగవాన్ దృష్టి తనపై నిలవటాన్ని గమనించారు. (భగవాన్ ఆయన అనుగ్రహాన్ని తన హృదయంలోనికి నింపుతున్న

అనుభూతి కల్గి పారవశ్యంలో మునిగిపోయారు). ఆయన తన లోపల ఒక మెరుపు మెరిసినట్లు చూశారు. తన హృదయపు కవాటము తెరచుకొన్నట్లు అన్పించింది. భగవాన్ ఆయన అనుగ్రహాన్ని తన హృదయంలోనికి నింపుతున్న అనుభూతి కల్గి పారవశ్యంలో మునిగిపోయారు. మరుక్షణమే భగవాన్ చిరునవ్వు నవ్వి, విశ్వనాధస్వామి అనుభవించినది నిజమైన స్థితియేనని ధృవపరుస్తున్నట్లుగా చిన్నగా తల ఊపటం చూశారాయన. భగవాన్ విశ్వనాధుని తండ్రికి ఇచ్చిన తన మాటప్రకారము ఆయన కుమారునికి సాక్షాత్కారం కల్గించారు. ఆ పారవశ్యస్థితిని గూర్చి, విశ్వనాధస్వామి ఇలా గుర్తుచేసుకున్నారు. ఆ అనుగ్రహాన్ని అందుకున్న తర్వాత నా ఆధ్యాత్మిక అనుభవాలలో మకుటాయమానమైనది, భగవాన్ అంతిమ క్షణాలలో ఆయన సమీపంలో జరిగింది. నేను ఆ చిన్నగదిలో నుంచుని ఉండగా, ప్రతిదీ మసకబారింది. అంతా కంటికి కన్పించని శుద్ధ ఎరుకతో (కమ్మివేయబడింది) ఆవరించబడింది. ఒకేఒక, శాశ్వతమైన సద్వస్తువుతో ఆవరించబడింది. అక్కడ భగవాన్ నుండి నేను వేరుగా ఉన్న భావన మచ్చుకుకూడా లేదు. ఆయన భౌతికమరణంపట్ల కొద్దిపాటి విచారం కూడా లేదు. అందుకు బదులుగా శుభకరమైన పారవశ్యము, పొంగిన ఉల్లాసము ఉన్నవి. అది వేరేమీకాదు. ఆత్మ యొక్క సహజస్థితే.

భగవాన్ మహానిర్వాణము చెందిన తర్వాత, తన తల్లికి జబ్బుగా ఉందనీ, ఆమె మంచం పట్టారనీ, దిండిగల్‌నుండి కబురువచ్చింది. అక్కడ ఆవిడను చూసుకోవడానికి ఎవరూ లేరు. విశ్వనాధస్వామి ఇంటికి వెళ్ళి, తన తల్లికి కనీసం వండిపెట్టేవారుకూడా లేకపోవటం చూశారు. ఆయన రాత్రింబవళ్ళూ తల్లికి సేవచేశారు. ఆమె కొరకు వంటచెయ్యటము, స్నానము చేయించుట మొదలైన పనులన్నీ చేస్తూ నెలలతరబడి ఆమె సేవ చేశారు. అప్పుడు ఆయనకు భగవాన్ మాటలు గుర్తుకువచ్చినవి. 'నీకు చేయవలసిన పని ఉంది,' అని భగవాన్ మునుపు ఆయనతో అన్నారు. ఆయన తల్లిగారు, ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన నోటుపుస్తకాన్ని తనతో ఉంచుకునేది. ఆమె చనిపోయే ముందు ఆమె ఆ పుస్తకాన్ని తెరచింది. అందులో రమణులు స్వయంగా, చిన్న అక్షరాలతో అందంగా రమణఅష్టోత్తరాలు వ్రాశారు. ఆమె ఆ నామాలను ప్రతిరోజూ చదువుతున్నారు. తన చివరిక్షణాల్లో, విశ్వనాధా, నీకు నా ఆశీస్సులు, అంటూ ఆ నోటుపుస్తకాన్ని విశ్వనాధన్‌కు ఇచ్చారు. ఇది జరిగిన కొంతకాలానికి, ఆయన దిండిగల్‌లో ఉండగా, ఆయనకు కలలో భగవాన్ కన్పించి, రమణాశ్రమానికి రమ్మని చెప్పారు. ఆయన అక్కడకు వెళ్ళినపుడు చిన్నస్వామి జబ్బుతో ఉన్నట్లు కనుగొన్నారు. ఆయనకు రాత్రింబవళ్ళు సేవచేశారు. ఆరు నెలలపాటు చిన్నస్వామికి రేయింబవళ్ళు సేవ చేశారు. 1953లో చిన్నస్వామి చనిపోగానే విశ్వనాధస్వామి రమణాశ్రమంనుండి మాయమై (అంతర్థానమై) పోయారు.

విశ్వనాధస్వామియొక్క గొప్పతనాన్ని గురించి తెలుసుకున్న నేను, 1960లో ఆశ్రమానికి వచ్చేసిన తర్వాత, ఆయన కొరకై వెదుకసాగాను. నేను ఆయన ఎక్కడ ఉన్నదీ తెలుసుకోలేకపోయాను. ఆయన నానుండి తప్పించుకుంటూ ఉన్నారు. ఒకరోజు నేను చెన్నైవీధులలో నడుస్తూ ఉండగా, నా పాతస్నేహితుడు నన్ను కలుసుకుని, ఎంతో సంతోషంతో, నాతో ఇలా చెప్పారు, "గణేశ్ అన్నా! నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే, నేను విశ్వనాధస్వామిని కలుసుకొని మాట్లాడి వస్తున్నాను". నా సంతోషానికి అవధులు లేకుండా పోయినవి. "విశ్వనాధస్వామి ఇక్కడ ఉన్నారా?" అని నమ్మలేనట్లుగా అడిగాను. నా స్నేహితుడు నాకు ఆయన చిరునామా ఇచ్చారు. నేను వెంటనే అక్కడకు వెళ్ళాను. ఆయన ఆయన సోదరుడు ఉంటున్న అద్దె ఇంట్లో ఉంటున్నారు. నేను లోపలకు వెళ్ళినపుడు ఆయన ఆ కుటుంబమునకు వంటచేస్తున్నారు. నేను ఆ వంటగదిలోనే ఆయనకు సాష్టాంగనమస్కారము చేశాను. నేను బాధపడుతూ అన్నాను, "స్వామీ!మీ పని వంటచెయ్యటమా? మీ స్థానం భగవాన్ నివాసంలో కదా? రమణాశ్రమం మీ ఇల్లు కాదా?" ఆయన ఇలా బదులిచ్చారు, "గణేశన్! వంట వాడినైతే తప్పేమిటి? నా పొట్టకింత ఆహారం దొరికితే చాలు.అది నేను ఇక్కడ పనిచెయ్యడం ద్వారా లభిస్తున్నది. ఇక లోపలి (అంతరంగంలోని) ఆహారమంటావా, అది భగవాన్ ఇప్పటికే ఇచ్చేశారు. నేను ఆయనను రమణాశ్రమానికి రమ్మని ప్రాధేయపడ్డాను. ఆయన వచ్చేశారు.

విశ్వనాధస్వామికి సేవచెయ్యటమనేది నా జీవితమును సార్థకం చేసే పనుల్లో ఒక ముఖ్యమైన పని. విశ్వనాధస్వామి ఆశ్రమంలో ఉండడంవల్ల, ఆశ్రమము ఆధ్యాత్మిక పరిమళము వల్ల గుబాళించింది. మెల్లగా మిగిలిన భక్తులు వెనుకకు వచ్చారు. ఆ రోజులలో పెద్ద హాలు నిర్మించకముందు భగవాన్ సమాధిపై కేవలం ఒక పూరిపాక ఉండేది. ముందంతా

ఖాళీస్థలం ఉండేది. నేను ఆ ఖాళీస్థలంలో చాప పరచుకుని పడుకునేవాడిని. కొన్ని రాత్రులు విశ్వనాధస్వామి, మౌనంగా తనతో రమ్మని సైగ చేసేవారు. ఆయన నన్ను ఆశ్రమానికి రెండు కిలోమీటర్ల దూరములో ఉన్న యమలింగం వద్ద ఉన్న స్మశానమునకు తీసుకుని వెళ్ళేవారు. అక్కడ ఉన్న ఎత్తైన అరుగుపై మేమిద్దరం కూర్చునేవారము. ఆ అరుగు వెనుక భాగమున శవములను కాల్చటముగానీ పూడ్చటము గానీ జరిగేది. ఆయన నా దృష్టిని గిరివైపునకు మళ్ళించేవారు అక్కడ అలా రెండుమూడు గంటలు కూర్చుని తిరిగి వెనుకకు వచ్చేవాళ్ళము. అలా కొన్నిసార్లు జరిగింది. తర్వాత ఎప్పటికో నాకు ఆ మహనీయుని ఉద్దేశము అర్థము అయినది. ఆ యమలింగమునకు ప్రక్కనే ప్రస్తుతము నేను ఉంటున్న ఇల్లు 'ఆనందరమణ' ఉన్నది. యమలింగమునకు ఇలా నడచి వెళ్ళడమనేది 1970 దశాబ్దంలో జరిగింది. 1986లో ఆ ఇల్లు నాకు ఇవ్వబడింది. నేను శాశ్వతంగా అక్కడ ఉండుటకై 1995లో వెళ్ళిపోయాను. భగవాన్ విశ్వనాధస్వామి గురించి ఎంత శ్రద్ధ తీసుకున్నారో, అలాగే విశ్వనాధస్వామి నా గురించీ, నా ఆధ్యాత్మిక సాధన గురించీ శ్రద్ధ తీసుకునేవారు. ఆ విధంగా ఒక అందమైన గొలుసు, భగవాన్ రూపంలో నిత్యమై ఉన్న సత్యంలో మనలను కలుపుతున్నది.

విశ్వనాధస్వామి అత్యంత నిరాడంబరతకు మారురూపమా? అన్నట్లు ఉండేవారు. అందుకే నేనాయనను, 'నిరాడంబరతకు సూపర్‌మాన్ అనే వాడిని.' నా చిన్నపుడు చాలామంది సందర్శకులు మానసిక భావోద్వేగం వల్ల మానసికంగా దెబ్బతిన్నవారో, మతిస్థిమితం లేనివారో వస్తుండేవారు. వాళ్ళని ఎలా నిభాయించాలో (సంరక్షించాలో) నాకు తెలిసేదికాదు.

నేను అప్పుడే బైబిల్‌ను చదివాను. దాని గురించి ఒక మిత్రునితో చర్చిస్తున్నాను. అందులో మోజెస్ కథ నాకు నచ్చలేదు. అందులో ఆయన తన దండంతో (కర్రతో) ఒక రాతిని స్పృశిస్తే, ఆ రాతిమధ్యనుండి నీరు బయటికి వచ్చినట్లు వ్రాశారు. నేను ఇలా అన్నాను, "కనీసం వాళ్ళు మోజెస్ భూమిని స్పృశించారు. అప్పుడు నీరు బయటకు వచ్చింది," అని వ్రాసి ఉంటే బాగుండేది. రాతిలోనుండి నీరెలా బయటకు వస్తుంది?" అలా అంటున్నానో లేదో ఒక చెయ్యి వచ్చి నా చేతిని పట్టుకుంది. అది విశ్వనాధస్వామి. ఆయన నన్ను తిన్నగా స్కందాశ్రమానికి తీసుకుని వెళ్ళి, నా చేతిని రెండు రాళ్ళ మధ్య పెట్టి అక్కడ సహజంగా ఊరుతున్న నీటిధారను చూపించారు. భగవాన్ నన్ను ఇక్కడకు తీసుకుని వచ్చారు. నా చేతిని ఈ రాళ్ళ క్రిందపెట్టి ఈ నీటిని నాకు చూపించారు. భగవాన్ ఈ రాతిని అంటుకున్నారు. అప్పటినుండి ఈ నీరు నిరంతరమూ వస్తూ ఉంటుంది. ఆయన గంభీరంగా, "ఎప్పుడూ మహాత్ముని మాటలనూ, చేతలనూ అనుమానించరాదు. భగవదనుగ్రహం వల్ల మోజెస్‌కు ఆ రాతినుండి , నీటిని రప్పించగల శక్తి వచ్చి ఉండవచ్చును అనే విషయాన్ని నువ్వెలా సందేహిస్తావు? గణేశన్, జాగ్రత్తగా ఉండు," అన్నారు. ఇది నా ఆధ్యాత్మిక ఆలోచనా సరళిని సరిచేసింది. ఎందుకంటే ఆయన నా మనస్సును హృదయంలోనికి తెచ్చారు. మనసుతోనూ, తెలివితేటలతోనూ ఆలోచిస్తే ఇప్పటికీ నా సందేహం రావచ్చును. ఇప్పటికి కూడా, మీరు స్కందాశ్రమానికి వెళ్తే, అక్కడ ఒక రాతి క్రిందనుండి నీటి ఊట రావటాన్ని మీరు చెయ్యి ఆ రాతిక్రింద పెట్టి స్పృశించి తెలుసుకోవచ్చును. ఆ నీరు ఇసుకనుండి గాక రాతి క్రిందనుండే వస్తుంది. ఆ రాతిక్రింద ఇంకొక చదునురాయి ఉంటుంది.

ఆర్థర్ ఆస్‌బోర్న్ 'మౌంటెన్‌పాత్' (గిరిమార్గము) అనే ఆశ్రమపత్రికను ఒంటిచేతి మీదుగా (ఒంటరిగా) ఆరేళ్ళపాటు నిర్వహించారు. నేను సంపాదకునిగా ఉండేవాడిని. 1970లో ఆయన అకస్మాత్తుగా చనిపోయారు. నాకు ఏమి చెయ్యాలో పాలుపోలేదు. ఆస్‌బోర్న్‌గారి శ్రీమతి, "గణేశన్, దిగులు చెందకు. నేను దానిని నిర్వహిస్తాను," అన్నారు.

రెండేళ్ళపాటు ఆమె ఆ బాధ్యతను భుజాన వేసుకున్నారు. కాని అనారోగ్యము చేత, ఇతర సమస్యలచేత, ఆమె పత్రిక బాధ్యతను నిర్వహించడానికి సమర్థులైనవారినెవరినైనా చూడమని చెప్పారు. ఆమె కట్టలు కట్టలు సరిచేయవలసిన వ్యాసములు తెచ్చి నా టేబిల్ మీద పెట్టారు. నేను పూర్తిగా కలవరపడిపోయాను. మర్నాడు విశ్వనాధస్వామి నా ఆఫీసుకు వచ్చిన నాకు సైగచేశారు. ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. ఆయన నన్ను ఆశ్రమము వెనుకనున్న అడవిలోకి తీసుకుని వెళ్ళి, మళ్ళీ వెనుకకు తీసుకుని వచ్చి తన గదికి తీసుకుని వెళ్ళారు. ఆయన చిరునవ్వు నవ్వి అన్నారు, "భగవాన్ నీకు సాయం చెయ్యమని నాకు చెప్పారు. నేను సంపాదకత్వాన్ని వహిస్తాను, నిజంగా గణేశన్, నాకు సంపాదకత్వం చెయ్యటమనేది

తెలియదు. కానీ దానిగురించి నువ్వు కలవరపడనవసరం లేదు. నేను నేర్చుకుంటాను. ఆ సరిచెయ్యబడని రచనలన్నిటిని గొప్ప సంపాదకులైన ప్రొఫెసర్ స్వామినాథన్‌కు పంపించు. ఆయన ఎర్రసిరాతో సరిచేస్తే, అవి తిరిగివచ్చిన తర్వాత, నేను వాటిని చదివి నేర్చుకుంటాను. సాక్షాత్కారం పొందిన వ్యక్తి గనుక ఆయన అచిరకాలంలోనే సంపాదకత్వం ఎలా చెయ్యాలో నేర్చేసుకున్నారు. ఒక ప్రముఖ దినపత్రికకు సంపాదకుడిగా ఉన్న స్వామినాథన్, "విశ్వనాధస్వామి సంపాదకత్వము చాలా విశేషంగా ఉంది," అని మెచ్చుకున్నారు.

చిన్నవయస్సులోనే ఆశ్రమంలో శాశ్వతంగా ఉండిపోవడానికి వచ్చిన నాకు, పాత భక్తులతో సన్నిహితంగా ఉండే సదవకాశం లభించింది. వారి సాన్నిహిత్యం నాలో నిజమైన సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడింది. కేవలం వారిని సేవించుట ద్వారా, వారి జ్ఞానసంపదను నేను సంపాదించుకో గలిగాను. కన్పించని ఆధ్యాత్మిక లాభాన్ని పొందాను. పవిత్రగ్రంథాలలో చెప్పినట్లు, ఏ గ్రంథాలు చదవటంవల్లగానీ, ఏ ఇతర సాధనల వల్లగాని పొందలేని ఆధ్యాత్మికలాభాన్ని మహాత్ముల సేవ ద్వారా పొందవచ్చును. అలా సన్నిహితంగా ఉండడంవల్ల, వారి జ్ఞాపకాలను వ్రాయమని పట్టుబట్టే అవకాశం నాకు లభించింది. అదే నాకు లభించిన పెద్ద బహుమానం. అయితే ఆ పనిని విశ్వనాధస్వామిచేత చేయించలేకపోయినా, ఆయన టాక్స్ విత్ రమణమహర్షి (శ్రీరమణభాషణములు) అనే పుస్తకాన్ని తమిళంలోనికి అనువదించేలా ఒప్పించాను. నేను ఎందుకు అంతపట్టుబట్టి ఆయన చేత ఆ పుస్తకాన్ని అనువదింప చేశానంటే, భగవాన్‌గారే ఆయనచేత అనేక సంస్కృత గ్రంథాలను తమిళంలోనికి అనువదింపచేశారు. ఈ విధంగా 1970 దశాబ్దంలో, టాక్స్‌విత్ రమణమహర్షి (శ్రీరమణభాషణములు) అనే గ్రంథంలోని ప్రథమభాగం తమిళంలో "భగవత్ వచనామృతం" అనే పేరుతో అచ్చయింది. అది అప్పటికప్పుడే విజయాన్ని సాధించింది. కొద్దికాలం తర్వాత పూర్తి గ్రంథం కూడా ముద్రించబడింది. ఈ గ్రంథంలోని ప్రత్యేకత ఏమిటంటే, భగవాన్‌చే వాడబడిన తమిళ పదాలను, సాధకులు నేరుగా చదువుకొనవచ్చును.

1979లో విశ్వనాధస్వామి, నేను కలసి పథకం వేసుకున్నాము. ఏమని అంటే, 1980లో వచ్చే భగవాన్ యొక్క జయంతిశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నేరుగా భగవాన్ చేసిన బోధలను ప్రత్యేకించి పుస్తకాలుగా తీసుకుని రావటానికి మేమిద్దరం కలసి పనిచెయ్యవలసిన అవసరం ఉన్నదని. దురదృష్టవశాత్తు విశ్వనాధస్వామికి వడదెబ్బ కొట్టింది. ఆయన నా ఆఫీసుకు వచ్చి, నాకు ఒంట్లో బాగోలేదు. నా గదికి రమ్మన్నారు." నేను ఆయన వెంట ఆయన గదికి వెళ్ళాను. అక్కడ ఆయన వైఖరి భయపడేటంత అసాధారణంగా ఉంది. ఆయన ఒక 'కీ' ఇస్తే ఆడే బొమ్మవలె విరామం లేకుండా, నుంచోవడం, కూర్చోవడం (అసహజంగా) చేస్తున్నారు. నేను బాగా కలవరపడ్డాను. అయోమయమైపోయాను. ఏమిచెయ్యాలో తెలియలేదు. "నా శరీరాన్ని గురించి పట్టించుకోవద్దు. నేను అంతరంగంలో చాలా ఆనందస్థితిలో ఉన్నాను," అని ఆయన నన్ను ఊరడించారు. మా సోదరునికి టెలిగ్రామ్ ఇవ్వు. నేను నీ చేత ఎక్కువకాలం సేవ చేయించుకుని నిన్ను బాధపెట్టను. నేటికి రెండవరోజునే నేను నా శరీరాన్ని వదలివేస్తాను. నన్ను వీలైనంత సామాన్యంగా (నిరాడంబరంగా) పాతిపెట్టు. (పూడ్చివెయ్యి. నాకే విధమైన ఆచారాలూ, ఆర్భాటాలూ అవసరంలేదు. కాని సాయంత్రం నాల్గు గంటలకు ఇక్కడికి వచ్చెయ్. నీకు నేనొక సందేశాన్ని ఇస్తాను. నేను చెప్పిన సమయానికే అక్కడికి వెళ్ళాను.

చూడడానికి, వ్యాకులపడుతూ కూర్చోలేక, నుంచోలేక సతమతమవుతున్న ఆయన మరలా నాతో ఇలా అన్నారు, "మీరు ఈ శరీరమును గురించి ఏమాత్రమూ పట్టించుకొనవద్దు. నేను చెప్పేది వినండి. ఈ క్రింద ఇవ్వబడినది విశ్వనాధస్వామి సందేశము. ఇది ఆనాటినుండి కూడా నాకు ఎంతో శక్తివంతంగా పథనిర్దేశం చేస్తున్నది.

"ఈ శరీరము అనారోగ్యమునకు గురైనది. బహుశ మనసు కూడా అంతే అయి ఉండవచ్చును. కానీ హృదయముపై దేని యొక్క ప్రభావమూ లేదు. హృదయమునకు మార్పులేదు. ఆ హృదయమే నా ద్వారా మాట్లాడుతున్నది. (నా లోపలినుండి). ఈ సృష్టి అంతా, చిందరవందరగానూ, సంక్షోభంతోనూ, దుఃఖంతోనూ ఉన్నప్పటికీ, అది అంతా మనసుయొక్క పరిధికి మాత్రమే చెందుతుంది. అజ్ఞానంతో నిండిన మనస్సు అనుభవించే వాడుగానూ, అనుభవించబడునదిగానూ(లేదా)

విషయిగానూ, విషయంగానూ లేదా కర్తగానూ అతనిచే చేయబడే క్రియగానూ చీలి, ఈ సంక్షోభానికి అంతటికీ కారణమౌతుంది. జీవితంలోని అనుభవములు అన్నీ గూడా అనుభవించే వాడికి సంబంధించినవే. తీరా, ఆ అనుభవించే వాడేమో, (అహంకారము లేదా వ్యక్తిత్వము) తనకంటూ నిజమైన ఒక ఉనికే లేని ఛాయ (నీడ) వంటివాడు. ప్రతి వ్యక్తిలోనూ ఉన్న ఒకే ఒక సత్యము ఏమిటంటే, ఆ సర్వోత్కృష్టమైన, స్వచ్ఛమైన ఉనికి, అదే స్వచ్ఛమైన స్థితిలో ఉండే 'నేను' లేదా 'అహం'. సంపూర్ణమైన 'ఎరుక' లేదా 'చైతన్యము'. అది కర్తగానూ, చూడబడే వస్తువుగానూ విభజించబడదు. అదొక్కటే నిత్యమైన ఉనికి కల్గినది. అహంకారమునూ (వ్యక్తిత్వమునూ) దానియొక్క అనుభవములనూ గూడా అనిత్యమైనవనీ, జారిపోయే నీడల వంటివనీ తలంచి పారద్రోలితే, నిత్యమైన, సర్వోత్కృష్టమైన సత్యమొక్కటే తనంత తానుగా ద్యోతకమవుతుంది. (విశదమవుతుంది). ఎవరైనా సరే, ఈ విషయమును మేధోపరంగా అయినా (తెలివితేటలతో అయినా) నమ్మితే, ఒప్పుకుంటే, అతనికి వైరాగ్యము, మనశ్శాంతి లభిస్తవి. మన జీవనయాత్రలో నిత్యమూ అనేక సమస్యలతోనూ అనుభవములతోనూ కొట్టుమిట్టాడే మనము అప్పుడప్పుడూ కొంత తడవు ఆగి, ఆ నిత్యమూ ఉండే రొదనుండి (ప్రక్కకు తప్పు) కొంచెముసేపైనా ప్రక్కకు తప్పుకుని, ఏకాంతములోనుండి, ఈ మార్పుచెందని (అవికారియైన), మచ్చలేని, సర్వోత్కృష్టమైన 'శుద్ధఎఱుకను' లేదా 'చైతన్యమును'. ఆ నిశ్చలంగా ఉండే 'నేను' లేదా 'అహం'ను అనుభవించాలి. అంతులేనటువంటి ఎన్నో రకముల అనుభవములు ఉన్నప్పటికీ, ఇది ఒక్కటే లక్ష్యపెట్టతగినది. నిజమైనది.

బుద్ధుడు, ఏసుక్రీస్తు, ఆదిశంకరులు, భగవాన్ రమణులు ఈ సత్యమే మన అసలు స్వరూపమని తెలియజేసే గొప్ప జ్ఞాపకార్థపు నిర్మాణములు (Monuments). దీపస్తంభముల వంటి వీరియొక్క దర్శనమే మనకు మన స్వస్వరూపము అయిన సత్యమును గుర్తునకు తెచ్చి, మనస్సును అధిగమించుట వలన కలుగు శాంతి మనకు లభిస్తుంది. మనము చేయవలసిందల్లా, ఈ పరిమితమైన మనస్సును, ఈ 'నాకు' (me) అనే దానిని త్యజించి, నిత్య సత్యమైన, అనంతమైన 'నేను' లేదా 'అహం'లో కలసి కరిగిపోవడమే. గణేశన్! మీకు నా ఆశీస్సులు".

నేను ఆయనకు సాష్టాంగనమస్కారము చేశాను. భగవాన్ సందేశమును వ్యాప్తి చెందించుటలో సహాయకారిగా నిలచి, 'అహం' స్ఫురణను గూర్చి మానవాళికంతటికీ తెలియచెప్పటానికి, అరుణాచలమునకు వచ్చిన భక్తులలో ఆయన ఒకరు. మనము కేవలము కొన్ని పుస్తకాలు చదివి, వాటిలో చెప్పబడిన విషయాలను మన మేధస్సుతో ఒప్పుకుంటేనో, నమ్మితేనో సరిపోదు. ఆ బోధలను మన స్వంత అనుభవంలోనికి తెచ్చుకుని, మనము అంతరంగికమైన శాంతిని నిశ్చలతను అనుభవించాలి.

ఆయన వ్రాసిన 'శ్రీరమణ అష్టోత్తరము', శ్రీభగవాన్‌ను స్తుతిస్తూ వ్రాయబడినది. అందులోని కొన్ని వాక్యములను గుర్తుచేసుకుంటూ ఆయనకు నివాళులు అర్పిద్దాము. ఎవరైతే నిత్యము, శుద్ధమూ అయిన ఎరుకగా హృదయంలో నిలచి ఉంటారో వారికి ప్రణామము. ఎవరైతే సూర్యునివలె స్వయంప్రకాశము కలిగి అజ్ఞానమనే చీకట్లను పారద్రోలుతారో వారికి ప్రణామము. ఎడతెగని చైతన్యమునకు ప్రతిరూపకమైన వారికి ప్రణామము. చైతన్యము అనే జ్యోతికి ప్రణామము. ఎవరి జన్మమైతే ఆధ్యాత్మిక జాగృతి కోసము ఉద్దేశింపబడ్డదో వారికి ప్రణామము. ఎవరి రాకయైతే ప్రపంచం మొత్తానికీ ముక్తిని కల్గించటానికై నిర్దేశింపబడిందో, ప్రతి జీవీ తన శాశ్వతమైన 'అహం' లేదా 'నేను' ను అని గుర్తించేటట్లు చేయబడడానికి ఎవరు వచ్చారో వారికి ప్రణామం. పైన చెప్పబడినవన్నీ రమణులను స్తుతిస్తున్నట్లు కనబడుతున్ననూ, వాటి నిజమైన అంతరార్థం చాలా ప్రత్యేకమైనదీ, ముఖ్యమైనది. అది (ఇన్నర్‌పాత్) లోపలిదారి అనబడే అంతరంగమార్గ ప్రయాణం ద్వారా హృదయం చేరి, అక్కడ స్థితులై ఉండడమే.

విశ్వనాధస్వామి తాను ముందుగానే చెప్పినట్లు, ఆ రెండవ రోజునే పూర్తి స్పృహతో, ప్రశాంతంగా శరీరాన్ని వదలివేశారు. ఆయన జీవించి ఉన్నంతకాలం, ఆయన భౌతికశరీరం ఏ ప్రశాంతతను వెదజల్లేదో, అరుణాచలానికి దగ్గరగా ఆశ్రమంలో ఉన్న ఆయన సమాధికూడా అదే ప్రశాంతతకు నిలయమై ఉన్నది. ఆయన ప్రశాంతితో నిండిన గండశిల.

అణ్ణామలైస్వామి



అగ్ని చాలా విశిష్టమైనది. దాని స్వభావము రెండు విధాలుగా ఉంటుంది. తన వేడిమితో అది వస్తువులను నశింపజేయకలదు. తన కాంతితో అది విశదపరచగలదు. భగవాన్ జ్ఞానాగ్ని. ఆయన మన ప్రారబ్దాన్ని (కర్మలను) నశింపజేసి, అప్పటికే మనలో ఉన్న జ్ఞానజ్యోతిని (వివేకప్రకాశాన్ని) మనకు వెల్లడి అయ్యేట్లు (విశదపడేటట్లు) చేస్తారు. ఇలా రెండు విధాలుగా పనిచేసే ఆయన అనుగ్రహాన్ని, చాలా స్పష్టంగా, ఈ గొప్పభక్తుని జీవితంలో చూడవచ్చును. ఆయన పేరు చెల్లపెరుమాళ్.

ఆయన జన్మించగానే ఆయన తండ్రి, ఆయన జాతకచక్రాన్ని వేయించారు. ఆయన సన్యాసి అవుతాడని, ఒక సాధువుగా జీవిస్తాడని, కుటుంబీకునిగా జీవితం గడపడని దాని ద్వారా తెలపబడింది. ఆయన తండ్రి ఎలాగైనా, అలా జరగకుండా చూడాలనుకున్నారు. అందుకని ఆయన చెల్లపెరుమాళ్‌ను బడికి పంపలేదు. ఆయన గనుక చదువుకుంటే, ఆయనకు ఏ ఆధ్యాత్మికగ్రంథమో కనపడితే, దానిని చదివి ప్రభావితుడై ఇల్లు వదలివెళ్ళిపోయి సన్యాసిగా మారతాడని తండ్రి ఉద్దేశము. తను రైతు గనుక, తన కుమారుని కూడా, తన వెంట పొలాలకు తీసుకుని వెళ్ళి, ఎల్లపుడు తన ప్రక్కనే ఉంచుకునేవాడు. ఆయన ఏకైక ఉద్దేశము, కుమారుడు ఏమీ చదవకూడదని. కానీ చెల్లపెరుమాళ్‌కు చదువుమీద ఎంత ఆసక్తి అంటే, ఆయన స్వయంగా చదవటం నేర్చుకున్నారు. ఒక పదములోని ప్రతి అక్షరాన్నీ కూడబలుక్కుని చదవటం ద్వారా, ఒకొక్క పదాన్నీ చదువగలిగారు. ఆయన జీవితాంతం, ఈ పట్టుదల ఆయనకు బాసటగా నిలిచింది. అపజయాలు కూడా ఆయన పట్టుదలను నిరోధించలేకపోయాయి. ఒకరోజు వాళ్ళ నాన్నతో వెళ్తూ, కొందరు సాధువులు కాషాయవస్త్రాలు ధరించి అక్కడ ఉండడం గమనించారు. ఆయన రహస్యంగా ఆ సాధువులలో ఒకరిని కలుసుకుని, ఆధ్యాత్మిక గ్రంథాలను చదవడం మొదలుపెట్టారు. అలాగే ప్రక్క ఊరిలోని ఒక మహిళయొక్క పవిత్రమైన భక్తి కూడా ఆయనను ఆకర్షించింది. ఆమె ఇతనిని ఇంటికి తీసుకుని వెళ్ళి, కైవల్య నవనీతం లాంటి ఆధ్యాత్మిక పుస్తకాలను ఇచ్చేది. తనకు చదవడం రాదు కనుక, ఆవిడ చెల్లపెరుమాళ్‌ను ఆ పుస్తకాలను చదివి, వాటియొక్క అర్థాన్ని వివరించమని కోరింది. ఆయన వాటిని చదవడం మొదలుపెట్టినపుడు, ఆయనకు ఏ విధమైన వేదాంత పరిజ్ఞానము లేకపోయినప్పటికీ, తనలో నిక్షిప్తమై ఉన్న ఏదో శక్తి, ఆయన వాటిని అర్థం చేసుకుని ఇతరులకు వివరించగలిగేలా తోడ్పడింది. ఆయన చిన్న పిల్ల వాని తరహాలో అక్కడ ఉన్నది ఉన్నట్లు చెప్పసాగారు.

త్వరలోనే, ఒక నిర్ణీత సమయంలో తండ్రికి తెలియకుండా ఇంటినుండి పారిపోయి, ఏదో ఒక ఆధ్యాత్మికగ్రంథం చదివి వివరింపసాగారు. ఆయన ఆధ్యాత్మిక భాషణలు, ఆ స్త్రీ చుట్టుప్రక్కల వారిని కూడా ఆకర్షించడం మొదలుపెట్టాయి. కొద్ది నెలలకాలంలో, ఆయన భాషణలు ఎంత ప్రజాదరణ పొందాయంటే, ఆ పుణ్యస్త్రీ ఆయనను తన ఇంటికి వచ్చి ఉండమని కోరింది. ఆ తర్వాత ఆరేళ్ళపాటు, తండ్రినుండి దూరంగా ఉన్నారు. అది ఆయనకొక స్వర్ణయుగంలా ఉంది. ఆయన రుద్రాక్షలు, విబూది ధరించటం, దేవుళ్ళ పటాల ముందు మోకరిల్లటము. భక్తిపరమైన ఆచార వ్యవహారాలను శ్రద్ధగా ఆచరిస్తుండేవారు. ఒకరోజు ఆయన ఆధ్యాత్మిక భాషణ చేస్తున్నప్పుడు ఆయన తండ్రి దొంగచాటుగా లోనికి వచ్చారు. కుమారునిలో వచ్చిన మార్పును చూసి ఆయన దిగ్భ్రాంతిచెందారు. అయినా ఆయన కుమారుని ఏమీ ప్రోత్సాహపర్చలేదు.

అయినప్పటికీ చెల్లపెరుమాళ్ సన్యాసిగా మారాలని నిశ్చయించుకున్నారు. కౌమారదశలోనే ఆయన సన్యాసాన్ని స్వీకరించారు. ఆచారవంతులైన వారు ఆయనకు సన్యాసదీక్ష ఇవ్వరు కావున, తనకు తానే సన్యాసదీక్ష తీసుకున్నారు. ఆయన తన స్వగ్రామానికి తిరిగివచ్చిన తర్వాత, ఆయన గొప్పతనాన్ని గుర్తించిన కొంతమంది గ్రామస్థులు ఆయనకు సహాయపడడం మొదలు పెట్టారు. సుప్రసిద్ధులైన రామలింగస్వామి బోధలవల్ల ప్రభావితుడై మానవాళికి సేవ చేయనుద్దేశించి, వేసవిలో మట్టికుండలో నీరు పెట్టుకుని దారిన వెళ్ళే బాటసారుల దాహార్తిని తీరుస్తుండేవారు. గ్రామస్థులసాయంతో చిన్న కుటీరాన్ని నిర్మించుకుని, బీదలకు గంజికాచి ఇస్తుండేవారు. ఆయన మానవసేవ చేస్తున్నప్పటికీ, భక్తిపరమైన సాధనలు మానలేదు.

కంచి పీఠాధిపతి శంకరాచార్యులవారు ప్రక్క గ్రామానికి వస్తున్నట్లు ఆయనకు తెలిసింది. ఆయన వెళ్ళి కలిసినపుడు, ఆ స్వామి, "తర్వాత గ్రామానికి రమ్ము. అక్కడ నిన్ను కలుస్తాను," అని చెప్పారు. ఆయన వెళ్ళి శంకరాచార్యులను కలిసి, ఆధ్యాత్మికపథంలో త్రోవచూపమని అడిగినపుడు, ఆయనకు 'శివాయనమః' అనే మంత్రదీక్షను ఇచ్చి, ఆ మంత్రాన్ని ఒక లక్షసార్లు జపించమని చెప్పారు.

అది జరిగిన కొద్దిరోజులకు, ఒక పరివ్రాజకస్వామి ఆయనకు భగవాన్ గ్రంథం 'ఉపదేశఉందియార్', ముప్పది పద్యాలతో, తమిళంలో భగవాన్ బోధను ఇచ్చారు. ఆయనకు రమణమహర్షి గురించి ఏమీ తెలియదు. ఆ పద్యాలసారాన్ని ఆయన అర్థంచేసికోలేదు కానీ మహర్షియే తన గురువు అని భావించారు. అందుకని ఆయన ఊరంతా సంచరిస్తూ నేను నా గురువును కనుగొన్నాను. ఆయన తిరువణ్ణామలైలో ఉన్నారు. ఆయన వద్దకు వెళ్ళాలి అని చెప్పసాగారు. ఆ గ్రామంలోనివారు, ఈయన సాధువు, ఈయన వద్ద డబ్బేమీ లేదని తలచి, తిరువణ్ణామలైకు వెళ్ళటానికి కొంత డబ్బులిచ్చారు.

ఆయన తిరువణ్ణామలైకు వెళ్ళబోతుండగా, కంచి శంకరాచార్యుల వారు ప్రక్క గ్రామానికి వేంచేసి ఉన్నారని తెలిసింది. ఈ శంకరాచార్యుల వారే పాల్‌బ్రంటన్‌ను రమణమహర్షి దగ్గరకు పంపిన విషయం చెల్లపెరుమాళ్‌కు తెలుసును. అందుకని ఆయన శంకరాచార్యుల వారి వద్దకు వెళ్ళి, సాష్టాంగపడి ఇలా ప్రార్థించారు, "దయచేసి నన్ను ఆశీర్వదించండి. నేను రమణమహర్షి వద్దకు వెళ్తున్నాను". శంకరాచార్య ఆయనకు విబూదిని, పదకొండు వెండి నాణాలను ఇచ్చి, "నీవు మంచి కార్యము కొరకై వెళ్తున్నావు. వెళ్ళు," అన్నారు.

ఆ విధంగా 1923లో, ఇరువదియొక్క సంవత్సరాల వయసులో, చెల్లపెరుమాళ్ తిరువణ్ణామలైకు వచ్చారు. రమణాశ్రమానికి వెళ్ళే దారిలో, ఒక చిన్న మండపం వద్ద ఒక పెద్ద గుంపు ఉండడం ఆయన చూశారు. ఆయన ఎందుకలా జనం గుమికూడారని అక్కడ ఉన్న వారిని అడిగారు. ఆయన ఇలా సమాధానమిచ్చారు, "సిద్ధపురుషులైన శేషాద్రిస్వామివారు మండపంలో ఉన్నారు. ఆయన బయటకు వచ్చి తమను ఆశీర్వదిస్తారని, ఆ జనమంతా వేచి ఉన్నారు. నువ్వుకూడా వెళ్ళి, ఆయన దర్శనం చేసుకుని ఆయన ఆశీర్వాదం తీసుకో," అన్నారు. ఆ ప్రజలు శేషాద్రిస్వామి అంటే ఉన్న భయంచేతా, గౌరవంచేతా, లోనికి వెళ్ళడానికి భయపడి, బయటే వేచి ఉన్నారు. చెల్లపెరుమాళ్ జనం సందులోనుండి స్వామి ఒక లడ్డుని చేతిలో పట్టుకుని ఉండడం చూశారు. స్వామి గురించి ఏమాత్రమూ వివరములు తెలియని, చెల్లపెరుమాళ్ లోనికి వెళ్ళి, ఆయనకు సాష్టాంగ పడ్డారు. శేషాద్రిస్వామి లడ్డును తన నోటివద్దకు తీసుకుని వెళ్ళి, దానిని ఆ జనంలోకి విసరివేశారు. వారందరూ దానిని ప్రసాదంగా తీసుకున్నారు. తర్వాత ఆయన చెల్లపెరుమాళ్ వైపునకు తిరిగి నిందించటం ప్రారంభించారు. "ఓ మూర్ఖుడా! నువ్వు అరుణాచలానికి ఎందుకు వచ్చావు? నువ్వు తిరువణ్ణామలైకు ఎందుకు వచ్చావు? ఇక్కడ ఏమి ఉందని నువ్వు రావలసి వచ్చింది". ఈ తిట్లతో దడుచుకున్న చెల్లపెరుమాళ్ వెంటనే వెనుదిరిగి హడావిడిగా వెళ్ళిపోవడానికి సిద్ధమైనారు. అదృష్టవశాత్తు బయట నిలబడి ఉన్న ఒక సాధువు ఆయనను ఆపి, వివరణ ఇచ్చారు. "శేషాద్రిస్వామి ఒక సిద్ధ పురుషులు. ఆయన తిట్ల ద్వారా దీవెనలిస్తారు. ఆయన 'మూర్ఖుడా! నువ్వెందుకు అరుణాచలానికి వచ్చావు?' అంటే అరుణాచలానికి వచ్చిన 'నువ్వెంత గొప్పవాడివి' అని అర్థము. 'నువ్వు ఎందుకు ఇక్కడకు రావలసి వచ్చింది?' అంటే, 'నువ్వు ఏ ఉద్దేశంతో ఇక్కడకు వచ్చినా అది నెరవేరుతుంది,' అని అర్థము". ఈ తిట్లతో కూడిన దీవెనతో హామీ ఇవ్వబడిన వాడై, చెల్లపెరుమాళ్ రమణాశ్రమానికి వచ్చారు.

ఆయన ఆశ్రమంలోనికి ప్రవేశించేటప్పటికి, మహర్షి కొండపైనుండి వచ్చి కాళ్ళు కడుక్కున్న తర్వాత పాతహాలులోనికి వెళ్తున్నారు. చెల్లపెరుమాళ్ చాలా సంతోషించారు. ఆయన తన గ్రామంనుండి బయల్దేరకముందు, ఆయన కలలో, భగవాన్ కొండ దిగివచ్చి, కాళ్ళు కడుక్కుని పాతహాలులోనికి వెళ్తున్నట్లు కన్పించింది. భగవాన్ ఎంత చక్కగా ఈ సామాన్యుణ్ణి స్వీకరించారో చూడండి. హాలులోనికి వెళ్ళగానే, తాను ఒక్కడే భగవాన్‌తో అక్కడ ఉన్నట్లు గుర్తించారు చెల్లపెరుమాళ్. తనతోపాటు తీసుకుని వచ్చిన ఎండు ద్రాక్ష పళ్ళ పొట్లాన్ని భగవాన్ ముందు ఉంచారు. భావోద్రేకం ఉప్పొంగగా, కన్నీటితో సాష్టాంగ నమస్కారం చేశారు. ఆయన లేచిచూసేసరికి భగవాన్, ఆ ఎండుద్రాక్షపళ్ళను తింటూ కన్పించారు. చెల్లపెరుమాళ్‌కు

సాక్షాత్తు శివుడే, తాను సమర్పించిన నైవేద్యాన్ని స్వీకరిస్తున్నట్లు అన్పించింది. తర్వాత దాదాపు పదిహేను నిముషాలపాటు, భగవాన్ తన దృష్టిని ఆయనపై ప్రసరింపచేశారు. చాలా సంవత్సరాల తర్వాత ఆ సమయంలో ఆయనకేమి అన్పించిందని నేను అడుగగా, ఏదో అద్భుతమైన చల్లదనం, నా శరీరమంతా వ్యాపించినట్లు అన్పించింది. అది ఎలా ఉంది అంటే తీవ్రమైన ఎండలో ఉండివచ్చిన తర్వాత చల్లని మడుగులో మునిగితే ఎలా ఉంటుందో అలా అన్పించింది. ఇందులోని చక్కదనమేమిటంటే, తొలిసారి ఆయన భగవాన్‌యొక్క అనుగ్రహాన్ని చవిచూసిన దానికీ, ఆయన భవిష్యత్తులో అక్కడ చేపట్టబోయే పనికీ సంబంధమున్నది. భవిష్యత్తులో ఆయన మండుటెండలో పనిచెయ్యబోతున్నారు గద. ఆ తర్వాత ఆయన చిన్నస్వామి వద్దకెళ్ళి ఏమి చెయ్యమంటారని అడిగారు. హాలులోనికి వెళ్ళి, భగవాన్‌కు పరిచారకుడిగా ఉండమని ఆయనకు చెప్పారు. ఈ విధంగా ఆయనకు విశేషమైన అవకాశం లభించింది. భగవాన్‌తో ఉండడమే కాకుండా, ఆయనకు సేవచేసే అవకాశం కూడా లభించింది.

భగవాన్ ఆయనకు అణ్ణామలైస్వామి అని పేరుపెట్టారు. దానిలో ఒక ప్రత్యేకత ఉంది. భగవాన్ సోదరుణ్ణి, కుటుంబంలో పిలిచే పేరు 'పిచ్చాయ్'. ఆయన సన్యాసం పుచ్చుకుని, నిరంజనానంద అని పేరు పెట్టుకున్నా కూడా, భగవాన్ ఆయనను 'పిచ్చాయ్' అనే పేరుతో పిలిచేవారు. విశ్వనాధస్వామిని 'విశ్వనాధ' అనీ, కుంజుస్వామిని 'కుంజు' అనీ పిలిచేవారు. ఎవరైనా కేశవస్వామి అనే ఆయన ఆశ్రమానికి వస్తే భగవాన్ ఆయనను కేశవస్వామి అనే పిలిచి ఉండేవారు. కానీ ఆయన పేరుమార్చింది కేవలం అణ్ణామలైస్వామి ఒకరికే. నేను అన్నామలైస్వామిని అది ఎలా జరిగింది అని అడిగాను. అణ్ణామలైస్వామి ఈ విధంగా గుర్తుచేసుకుని చెప్పారు. "నేను భగవాన్ వద్దకు వచ్చిన మర్నాడే, ఆయన మామూలుగా అన్నారు. స్కందాశ్రమంలో భగవాన్‌కు పరిచారకుడిగా ఉంటూ,1920లో చనిపోయిన అణ్ణామలైస్వామి నన్ను చూడగానే తనకు గుర్తుకువచ్చారని అన్నారు. అందుకని భగవాన్ నన్ను ఆ పేరుతో పిలవడం మొదలుపెట్టారు. మిగిలిన భక్తులు అది విని వారుకూడా అదే పేరుతో పిలవడం మొదలుపెట్టారు. కొలది దినాల్లోనే నాకు ఈ కొత్త పేరు స్థిరపడిపోయింది". ఆయన భగవాన్‌కు పూర్ణశరణాగతి చెందారు కాబట్టి, భగవాన్ ఆయనను పూర్తి శ్రద్ధతో చూసేవారు. జ్ఞాని అద్దములాంటి వారు. ఆయన మీతో వ్యవహరించే విధానం, మీరు ఆయనను ఆశ్రయించే విధానంపై ఆధారపడి ఉంటుంది. మీరు పూర్తి శరణాగతి చెందితే ఆయన పూర్ణ అనుగ్రహం మీమీద ఉంటుంది.

ఒకరోజు ఆయన భగవాన్‌ను, "భగవాన్ నాకు ఏదైనా ఉపదేశమివ్వండి," అని అడిగారు. "లోనికి వెళ్ళు. ఎల్లప్పుడు హృదయాన్ని అంటిపెట్టుకుని ఉండు, శరీరంతోనూ, మనసుతోనూ తాదాత్మ్యం చెందడం, దుఃఖాన్ని కల్గిస్తుంది. హృదయంలోనికి లోతుగా మునుగు. అది నీ చైతన్యానికి, శాంతికి మూలం. నీ చైతన్యంలో, లేదా నీ హృదయంలో ఎల్లప్పుడూ స్థితమై ఉండు". చూడండి, అణ్ణామలైస్వామికి భగవాన్ ఇచ్చిన మొదటి ఉపదేశమిది. అది చాలా ముఖ్యమైనది. ఎందుకంటే, అణ్ణామలైస్వామి తర్వాత కాలంలో స్వయంగా నాతో చెప్పారు. "అప్పట్లో, గణేశా, ఆ మాటల అర్థం నాకు తెలియదు. నా మిగిలిన జీవితమంతా ఈ మొదటి ఉపదేశంమీదే ఆధారపడి ఉన్నది. ఈ బోధయొక్క సారాంశం నాకు తెలియదు. నేను గ్రహించలేక పోయినాను. నాలోని వాసనలు పైకి వచ్చి, మొట్టమొదట్లో నేను భగవాన్ చుట్టూ ఉండేవారినందరినీ గమనించడం మొదలుపెట్టాను. వాళ్ళందరూ ముచ్చట్లు చెప్పుకునేవారు నాకది నచ్చలేదు. వాసనలయొక్క లోపల అణగి ఉన్న సంస్కారాల శక్తి చూడు. ఆయన అనుకున్నారు, "అవును భగవాన్ గొప్పవారు. కానీ ఆయన చుట్టూ ఉన్నవారు నా సాధనకు భంగం కల్గిస్తారేమో. అందుకని నేనిక్కడ ఉండను. దానికి బదులుగా, నేను వేరెక్కడకైనా వెళ్ళి ఆధ్యాత్మికసాధన చేసుకుంటాను." భగవాన్‌తో కనీసం చెప్పనైనా చెప్పకుండా, ఆయన ఆశ్రమంనుండి వెళ్ళిపోయారు. ఇరువదిమైళ్ళు నడచిన తర్వాత ఆయనకు ఆకలి వేసింది. ఆయన అలసిపోయారు. ఆయన రెండువందల ఇళ్ళ వద్దకు వెళ్ళి బిచ్చమడిగారు. ఎవ్వరూ ఒక ముద్ద కూడా పెట్టలేదు. చివరకు ఆయనకు దిక్కు తోచలేదు. ఎవరి వద్దకు వెళ్ళాలో, ఏదిక్కుకు తిరగాలో తోచలేదు. అపుడు ఎవరో ఆయనను అడిగారు. "ఏయ్, ఎందుకు నువ్వు బాధపడుతున్నావు? నువ్వు ఎక్కడినుండి వస్తున్నావు?" "నేను తిరువణ్ణా మలైనుండి వస్తున్నాను," అన్నాను. "తిరువణ్ణామలైలో ఎక్కడనుండి?" "రమణాశ్రమంనుండి". ఆ వ్యక్తి ఆయనను మందలించారు. "నీవు రమణాశ్రమం నుండి ఇక్కడకు వచ్చి బాధపడుతున్నావా? మూర్ఖుడా! వెనుకకు వెళ్ళు!"

"మూర్ఖుడా వెనుకకు వెళ్ళు," అనే మాటలు వినగానే, ఆయన భగవాన్ వద్దకు తిరిగి వెళ్ళుటకు నిశ్చయించుకున్నారు. వెంటనే అద్భుతమైన రీతిలో అన్నీ అనుకూలంగా జరగడం మొదలైనాయి. ఒక హోటలు యజమాని, ఆయనను పిలచి అన్నం పెట్టారు. ఆయన టికెట్ లేకుండా తిరువణ్ణామలైకి రైలు ఎక్కారు. టికెట్లు పరిశీలించే అధికారి ఈయన ఒక్కరిది తప్ప మిగిలిన ప్రయాణీకుల టికెట్లు పరిశీలించారు. తిరువణ్ణామలైకు తిరిగి వెళ్తుండగా ఇలాటివి అనేకం జరిగాయి. అణ్ణామలైస్వామి, భగవాన్ పాదాలపై బడి, జరిగినదంతా చెప్పి, ఆయనను క్షమార్పణ వేడారు. భగవాన్ చాలా గొప్పగా బదులిచ్చారు. "నువ్వు ఎలా తప్పించుకోగలవు? నీవు ఎక్కడకు పారిపోగలవు? ఇక్కడే ఉండు". అణ్ణామలైస్వామి మరొకసారి భగవాన్ పాదాలపై పడ్డారు. "భగవాన్, మీరు ఏమి చెబితే అదిచేస్తాను. మీ సన్నిధిని విడిచి ఎక్కడకూ వెళ్ళను".

ఆ మర్నాడే, అణ్ణామలైస్వామి భగవాన్ సేవ చేస్తుండగా, భగవాన్, ఆయనవైపు తిరిగి, "అణ్ణామలైస్వామీ, నీళ్ళటాంకు వద్ద గోడకడుతున్నారు. వెళ్ళు. వెళ్లి మేస్త్రీ ఏమి పని చేస్తున్నాడో చూసిరా!" ఆయన అనుకున్నారు, భగవాన్ ఏదో సమాచారాన్ని (వివరాల్ని) అడుగుతున్నారని. అందుకని ఆయన మేస్త్రీ దగ్గరకెళ్ళి ఏమి చేస్తున్నారని అడిగారు. మేస్త్రీ, "నేను ఈ గోడ కడుతున్నాను," అని బదులిచ్చారు. అణ్ణామలైస్వామి భగవాన్ వద్దకు వెళ్ళి, "మేస్త్రీ ఆ గోడ కడుతున్నానని చెప్పారు," అన్నారు. అయిదుసార్లు భగవాన్ మేస్త్రీ ఏమి చేస్తున్నాడో చూసి రమ్మని ఆయనను పంపారు. మేస్త్రీకి నిజంగానే కోపం వచ్చింది. "నువ్వు మూర్ఖుడివా? చవటవా? నేను ఈ గోడ కడుతున్నానని ఎన్నిసార్లు నీకు చెప్పాలి?" అప్పుడు అణ్ణామలైస్వామికి తెలివి వచ్చింది. భగవాన్ ఎందుకు ఇన్నిసార్లు నన్ను అదే పనిగా పంపించారు? ఆయన నన్ను ఈ పనిని పర్యవేక్షించమని పంపి ఉంటారు. మొదట్లో ఆయన అనుకున్నారు. భగవాన్ తనకేదో తేలికైన పని ఇస్తారని. కానీ ఆయన మొదట్లో భగవాన్ అన్న మాటలను గుర్తుకు తెచ్చుకున్నపుడు, కొండపైనుండి వచ్చి పడే జలపాతము లాగానో, పెద్ద మంచుబండ లాగానో పని తనకు రాబోతుందని అర్థమయింది. ఒకదాని తర్వాత ఒకటి, ఒకదాని తర్వాత ఒకటిగా పనులు వచ్చిపడ్డవి. ఒక్క మనిషి తన స్వంత ప్రయత్నంతో చెయ్యడానికి అసాధ్యమైన పనులు. కానీ చాలా పెద్ద పెద్ద నిర్మాణపు పనులే అణ్ణామలైస్వామి నిజంగా చేశారు. ఈ రోజున కూడా రమణాశ్రమానికి వెళ్ళేవారు ఈ ఒక్క వ్యక్తి సాధించగల్గిన నిర్మాణపు పనులను చూడవచ్చును.

ఒకపని తర్వాత మరొకపని, భౌతికంగా కష్టం కల్గించే పనులు వచ్చినవి. సున్నపుబట్టీలో సున్నం తయారుచేస్తున్నపుడు విపరీతమైన వేడి ఉత్పన్నమయ్యేది. దాని ప్రక్కనే మండుటెండలో నుంచుని పనిచెయ్యవలసి వచ్చేది. దానికి తోడుగా ఆయన చుట్టూ ఉండే జనం, ఆయన ప్రయత్నాన్ని మెచ్చుకునే బదులు, ఆయనను ఎగతాళి చెయ్యటం, సాధించడం, అవమానించడం చేస్తుండేవారు. భగవాన్ తను ఎలా పనిచేస్తున్నాడో అని. చూడడానికి వచ్చినపుడే ఆయనకు కొంత, ఓదార్పు లేదా ఉపశమనం లభించేది. ప్రతిసారి భగవాన్ ఆయన దగ్గరకు వచ్చినపుడు ఆయనను ఇలా ప్రోత్సాహపరుస్తుండే వారు, "అణ్ణామలైస్వామి! నువ్వు ఈ దేహానికి కావు. నీవు మనసువూ కాదు. నువ్వు శుద్ధచైతన్యానివి. సర్వవ్యాపి అయిన ఆత్మవు. ఎల్లప్పుడూ దీనిని గుర్తుంచుకో. ఆఖరికి నువ్వు పనిచేస్తున్నా కూడా. భగవాన్ దాదాపుగా ఒకరికి అసాధ్యమన్పించే ఈ పనులను అన్నామలైస్వామికి ఎందుకు అప్పగించారు? ఇది వరకు ఆశ్రమంలోని కొందరి ధోరణి నచ్చక పారిపోవడానికి ప్రయత్నించారు. కానీ ఆయన వెనుకకు రావలసి వచ్చింది. ఎందుకంటే, భగవాన్, "నీకు చెయ్యవలసిన పని ఉంది," అని చెప్పారుగనుక. ఇది కేవలం బయటకు కన్పించే నిర్మాణపు పనికాదు. అది అంతర్గతంగా, ఆయన ప్రారబ్దాన్ని కడగి వేయడమే. మనలో ప్రతి ఒక్కరము మన ప్రారబ్దానికి బాధ్యులము. మన వ్యక్తిగత ప్రారబ్దాలను మనము మాత్రమే తొలగించుకోవాలి. వేరెవ్వరూ ఈ పనిని మన కొరకు చెయ్యలేరు వారికి మన మీద ఎంత ప్రేమ ఉన్నప్పటికీ. మన ప్రారబ్దాన్ని నశింపచేసుకోవడం ఎంతో అవసరం. అది మన సంస్కారాలను మోస్తూ ఉంటుంది. ఆ సంస్కారాలు మనలను ప్రభావితం చేస్తుంటాయి. ఎప్పుడైనా ఎవరైనా తనను విమర్శిస్తున్నారని గానీ, తనతో సహకరించడంలేదని గాని, ఆయన బాధపడితే, భగవాన్ ఆయన వద్దకు వెళ్ళి, బలవంతంగా గుర్తుచేస్తుండేవారు, "నువ్వు ఈ శరీరానివి కావు. నువ్వు మనస్సువు కాదు. నువ్వు శుద్ధ ఎరుకవు. అనంత చైతన్యానివి. దానిపైనే నీ దృష్టిని నిలుపు. నువ్వు పనిచేస్తున్నప్పటికీ ఎల్లవేళలా దానిని గుర్తుంచుకో. అణ్ణామలైస్వామి తర్వాత అన్నారు, నేను దానిని చాలా శ్రద్ధగా పట్టుకున్నాను. ఆయన ఆ విమర్శలకు

బాధపడినప్పటికి, తన ప్రారబ్దానికి, ఆయన అనుగ్రహానికి మధ్యగల ఘర్షణలో, ఆయన భగవాన్ వాక్కులను విడవకుండా పట్టుకున్నారు. "నీవు సర్వవ్యాపివి. నీవు చైతన్యానివి. పనిచేస్తున్నప్పటికి దానినే గుర్తుంచుకొని విడవకుండా ఉండు".

నేను రమణాశ్రమంలో ఉన్నన్నిరోజులూ, అణ్ణామలైస్వామి నిర్మించిన భవనాల గోడలకు నా తల ఆనించేవాడిని. అవి భగవాన్ సూచనలప్రకారం కట్టబడినవి. అణ్ణామలైస్వామి మొట్టమొదట్లో నిర్మించిన కట్టడాలలో ఒకటి, (రివెట్‌మెంట్). పెద్దగోడ, వర్షాలు, వరదలు వచ్చినపుడు వర్షపునీరు ఆశ్రమంలోనికి రాకుండా, నిర్మించిన పొడవైన, చాలా వెడల్పైన రాతిగోడ. భగవాన్ ఆయనకు, "ఒక గోడను కట్టు. అది చైనావాల్ (చైనాలోని సరిహద్దు అతి పెద్దగోడ) లాగా ఉండేటట్లు చూడు అన్నారు. అది పూర్తయిన తర్వాత, భగవాన్, "వెళ్ళి సామాను నిల్వ ఉంచే గదిని కట్టు," అన్నారు. మీరు ఆయన కట్టినటువంటి, ప్రదేశాలన్నీ చూసి తీరవలసినదే. భగవాన్ బాత్‌రూమ్, వళ్ళి అనే జింకసమాధి, జాకీ అనే కుక్క సమాధి, పెద్దదైన పాతభోజనశాల, వంటగది, వేదపాఠశాల, ఆశ్రమటాంకుకు రాతి మెట్లు, మేజర్‌చాడ్విక్ గది, చివరగా ఆశ్రమఆసుపత్రి, చాలామంది నన్నడిగారు, "సిమెంటు లేకుండా వీటినన్నిటిని ఎలా నిర్మించారు?" అని. ఒక సామాన్యుడైన చదువులేని పల్లెటూరివ్యక్తి. వీటిని నిర్మించారు అంటే వాళ్ళకు నమ్మడానికి కష్టంగా ఉంది. తర్వాతకాలంలో అణ్ణామలైస్వామి హాలులోనికి వస్తుంటే, భగవాన్, "నువ్వు లోపలకు వస్తుంటే బిల్డింగులే నా వైపు నడచి వస్తున్నట్లుంది," అని నవ్వుతూ అనేవారు. అణ్ణామలైస్వామి ఎంత భౌతికమైన, మానసికమైన కష్టాన్ని భరించారో మనము ఊహించవచ్చును. తీవ్రమైన ఎండలో నిలబడి శ్రమపడుతూ చుట్టూ ఉన్నవారి ఎగతాళినీ, మోసాన్నీ, అవమానాలనూ తట్టుకుంటూ ఎంతగా వ్యధ చెంది ఉంటారో. కానీ ఆయన భగవాన్ చేసిన మొదటి ఉపదేశాన్ని గట్టిగా పట్టుకున్నారు. "నీవు శరీరానివి కావు. నువ్వు మనసువి కావు. నీవు ఆత్మవు". కాబట్టి ఏ ఏ ప్రారబ్దమైతే తన శరీరమూ, మనసూ అనుభవించాల్సి ఉన్నదో, దానిని భగవాన్ కడిగి వేస్తున్నారని, ఆయనకు తెలియదు. 1938లో ఒకరోజు ఈ కట్టడాలన్నీ పూర్తయిన తర్వాత భగవాన్ ఆయనవైపు చూసి అన్నారు, "నువ్వు ఇప్పుడు స్వతంత్రుడవు. నీ కర్మలన్నీ పూర్తి అయినవి." అణ్ణామలైస్వామి కన్నీటితో కృతజ్ఞతా పూర్వకంగా, ఆయన పాదాలపై వ్రాలారు. యోగి రామయ్య అనే మరొక భక్తుడు, భగవాన్‌ను ఇలా ప్రాధేయపడ్డారు, "భగవాన్ అణ్ణామలైస్వామి ఎంతో కష్టపడి ఇన్నాళ్ళుగా పనిచేస్తూ ఉన్నారు. ఆయన ఆరోగ్యం కూడా పాడవుతుంది. మీరు ఆయనను విశ్రాంతి తీసుకొమ్మని ఎందుకు చెప్పరు?" భగవాన్ అన్నారు, "అవును. నేనాపని చేస్తాను". భగవాన్ ఆయనకు విశ్రాంతినివ్వడమే కాదు, అంతకు పూర్వముగాని, అటు తర్వాతగానీ ఆయన ఎన్నడూ చెయ్యని విధంగా ఆయనను హృదయానికి హత్తుకొన్నారు. ఆయన ప్రారబ్దానికి ఫుల్‌స్టాప్ (విరామచిహ్నం) పెట్టారు. ఒక్క కౌగిలింతతో అణ్ణామలైస్వామి యొక్క పూర్తి జీవితాన్ని ప్రారబ్దంనుండి అనుగ్రహానికి మార్చివేశారు.

ఎన్నో ఏళ్ళ తర్వాత తన జీవితాన్నే మార్చివేసిన ఆ కౌగిలింత గూర్చి అడుగగా, ఆయన ఈ విధంగా చెప్పారు. ఒకరోజు నేను భగవాన్‌కు ఉదయం పూట స్నానంలో సాయంచేద్దామని ఆయన స్నానాలగదిలోనికి వెళ్ళాను. మాధవస్వామి నేను కలిసి ఆయనకు సాధారణంగా చేసే నూనెతో మర్దన చేశాము. (మసాజ్). స్నానం పూర్తయిన తర్వాత మాధవస్వామి అడిగారు, "భగవాన్! కొంతమంది గంజాయి లేహ్యము తింటే వాళ్ళు ఒక రకమైన ఆనందం, సంతోషం అనుభవిస్తారట, ఆ ఆనందం యొక్క స్వభావమేమిటి? వేదాలలో చెప్పే ఆనందమూ అదీ ఒకటేనా?" అని. భగవాన్ గంజాయిని తినటం చెడ్డ అలవాటు అన్నారు. అప్పుడు పెద్దగా నవ్వుతూ నా వద్దకు వచ్చి నన్ను కౌగిలించుకుని, ఆనందా, ఆనందా, ఆనందా, ఆనందా అన్నారు. గంజాయి తినేవారు ఈ విధంగా ప్రవర్తిస్తారు. అది క్షణికమైన ఆలింగనము కాదు. తర్వాత మాధవస్వామి చెప్పారు, భగవాన్ అలా గట్టిగా నన్ను రెండు నిమిషాల పాటు పట్టుకుని ఉన్నారని. మొదటికొద్ది క్షణాల తర్వాత నేను శరీర స్పృహనూ, బాహ్యప్రపంచపు స్పృహనూ కోల్పోయాను. మొదట్లో ఆనందం, సంతోషం అనిపించింది. తర్వాత ఏ భావాలూ, ఏ అనుభవాలు లేని స్థితి (వచ్చింది) కలిగింది. కానీ ఎరుక (స్పృహ) పోలేదు. నాకు నా చుట్టుప్రక్కల ఏమి జరుగుతుందో తెలియలేదు. నేను ఆ స్థితిలో దాదాపు పదిహేను నిమిషాలు ఉన్నాను. నాకు బాహ్యస్పృహ వచ్చేసరికి నేను ఒంటరిగా బాత్‌రూమ్‌లో నుంచుని ఉన్నాను. మాధవస్వామి, భగవాన్ ఎప్పుడో ఫలహారానికి వెళ్ళిపోయారు. వాళ్ళు తలుపు తెరవడంకాని, వెళ్ళడంకానీ నేను చూడలేదు. నాకు ఉదయపు ఫలహారం గంటకూడా విన్పించలేదు. ఈ అనుభవం నా జీవితాన్ని పూర్తిగా

మార్చివేసింది. రమణాశ్రమంలో పనిచేసే జీవితం ముగిసిపోయినట్లు నాకన్పించింది. నేను అప్పటినుండి, ఆశ్రమం వెలుపల ఉండి, నా సమయంలో ఎక్కువభాగం ధ్యానంలో గడపవలసి ఉంటుందని నాకు తెలుసు. మర్నాడే నేను భగవాన్‌తో చెప్పాను, "భగవాన్, దయచేసి నన్ను ఆశీర్వదించండి. నేను పల్లాకొత్తులో ఉండబోతున్నాను."

భగవాన్ అప్పుడు అణ్ణామలైస్వామికి దగ్గరగా వచ్చి క్షణకాలం కౌగిలించుకొని ఆశీర్వదించారు. పల్లాకొత్తులో కుటీరానికి ఎంచుకున్న స్థలమూ, కుటీరముయొక్క ప్లాను, తను ప్రతిరోజూ ఏమి చేస్తున్నదీ, ఏమి జరుగుతున్నదీ, ప్రతి విషయాన్నీ ఆయన భగవాన్‌కు చెప్పేవారు. భగవాన్ దాదాపు ప్రతిరోజూ ఆయన వద్దకు వచ్చి ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్ళుటకు త్రోవచూపేవారు. తర్వాత, అణ్ణామలైస్వామి పూర్తిగా హృదయంలో స్థిరపడవలసిన సమయం ఆసన్నమైనదని భగవాన్ తలచారు. ఆయన అణ్ణామలైస్వామికి ఇలా సలహా ఇచ్చారు, "నువ్వు ఇప్పుడు హృదయంలో స్థితుడవైనావు. నువ్విక రమణాశ్రమానికి దర్శనం కోసము కూడా రావలసిన పనిలేదు. నువ్వు పల్లాకొత్తులోని నీ స్థానాన్ని వీడి రోడ్డుమీదకు వెళ్ళవద్దు. కొండపై మాత్రం నీ ఇష్టం వచ్చినట్లు నడువవచ్చును". ఒకరోజు అణ్ణామలైస్వామికి భోజనం లేదు. భగవాన్ అప్పుడాయనకు, అడవిలోనికి వెళ్ళి ఒక ప్రత్యేకమైన మొక్క ఆకులను కోసి, దానితో కొంత గుజ్జుగా ఉండే కూర తయారుచేసుకుని దానిని కొద్దిగా అన్నముతో కలిపి తినమన్నారు. కొద్దిగా అన్నము ఆయనకు ఎపుడూ ఇవ్వబడుతూ ఉండేది. భగవాన్ ఎవరికీ ఇది తినమని కానీ, ఇది తినవద్దని కానీ చెప్పలేదు. అణ్ణామలైస్వామికి మాత్రమే ప్రతిదీ నిర్దేశించేవారు. చాలామంది ఇతరులకు, తన సోదరునితో సహా, ఏ బజారుకు భిక్షకు వెళ్ళవలెనో కూడా చెప్పేవారు. అణ్ణామలైస్వామికి ఆయన అలా చెప్పలేదు. వేదాల ప్రకారం జీవించడానికి రెండు పద్ధతులు ఉన్నవి. ఒకటి తేనెటీగ ఒక పువ్వునుండి మరొక పువ్వునకు చేరుతూ తేనెను ప్రోగుచేసుకున్నట్లుగా, ఆహారాన్ని సంపాదించుకోవడం, లేదా కొండచిలువ వలె కదలకుండా ఉండి, తన వద్దకు వచ్చిన ఆహారాన్ని స్వీకరించడం. కేవలం అణ్ణామలైస్వామికే ఈ కొండచిలువ పద్ధతిని భగవాన్ చెప్పారు. ఆయనకు భిక్షమెత్తుకోవడానికి కూడా బయటకు వెళ్ళనివ్వలేదు. దానికి బదులుగా, ఆయనకు అన్నీ సమకూరేటట్లు చూచేవారు.

ఆత్మలో స్థితులైన తర్వాత, లేదా సహజస్థితిలో ఉన్న తర్వాత, అణ్ణామలైస్వామి 'ఆత్మాన్వేషణ' గురించి బోధించసాగారు. అప్పటిలో వ్యాప్తిలో ఉన్న తప్పుడు అభిప్రాయమేమిటంటే 'ఆత్మాన్వేషణ' కేవలము మేధావులకూ, పండితులకూ మాత్రమేననీ, చదువులేని వారికి, మనస్సును అంతర్ముఖము చేసి ఆత్మాన్వేషణ చేయగల సామర్థ్యం కానీ, చురుకుదనము కానీ ఉండవని. అణ్ణామలైస్వామి సాధారణ పల్లెటూరి జనులకు కూడా ఆత్మాన్వేషణ ఎలా చేయవలెనో నేర్పేవారు. ఆయన వారికి బోధించడం చూస్తే గమ్మత్తుగా ఉండేది, "నీ నిజస్వరూపాన్ని నువ్వు మరచిపోయానంటున్నావు కాబట్టి, ఇక ఉన్న ఒకే ఒక మార్గమేమిటంటే, వెనుకకు దానిలోనికి తిరిగి వెళ్ళడమే. నువ్వు ఎప్పుడూ లైటు వేసే ఉంచినట్లయితే చీకటి నీ గదిలోనికి ప్రవేశించలేదు. నీవు తలపులు తెరచి చీకటిని లోపలకు ఆహ్వానించినా అది రాలేదు. చీకటి అంటే వెలుగు లేదా లైటు లేకపోవటమే, మనస్సు అనేది స్వయంగా తయారుచేసుకున్న చీకటి ప్రదేశం. ఇందులోకి ఆత్మయొక్క ప్రకాశము పడనివ్వకుండా కావాలని మూసివేయబడింది. కాబట్టి, నీ స్వస్వరూపంలోకి వెళ్ళు". ఎవరో అన్నారు, "ఆత్మాన్వేషణ అనేది చాలా కష్టమైనది కాబట్టి, కొన్ని రోజులు భక్తిమార్గాన్ని గానీ, కర్మయోగాన్ని కానీ ఆచరించి, ఆ పిమ్మట ఆత్మాన్వేషణలోకి వస్తే బాగుంటుందా? అనుకుంటున్నాము," అని. అణ్ణామలైస్వామి చాలా గట్టిగా అన్నారు. "నీకు ఆత్మాన్వేషణ మార్గంలో ఆసక్తి ఉంటే, నువ్వు అందులో పెద్ద గొప్పగా లేవని భావించినా సరే, నువ్వు దానినే అనుసరించాలి. నువ్వు ఆత్మాన్వేషణనే సరియైన రీతిలో సమర్థవంతంగా చెయ్యాలీ అంటే, నువ్వు ఆ మార్గాన్నే అంటిపెట్టుకుని ఉండాలి. మిగిలిన మార్గాలు వాటికవే మంచివై ఉండవచ్చును గానీ, ఆత్మాన్వేషణకు ముందస్తుగా వాటిని ఆచరిస్తే అవి నిన్నేమీ ఆత్మాన్వేషణకు సిద్ధపరచవు. నువ్వు ఒక మంచి వయొలిన్ (వాయులీనము) విద్వాంసునివి కావలెననుకున్నట్లైతే, నువ్వు మంచి (టీచరు) ఉపాధ్యాయుని వద్ద పాఠాలు నేర్చుకుని, నీకు చేతనైనంత, నీ శక్తి కొలది అభ్యాసం చెయ్యాలి. నీకు అందులో ఏదైనా సమస్యలు ఎదురైతే, నువ్వు కొన్ని నెలలు క్లారినెట్‌ను నేర్చుకోవుగద. నువ్వు ఏ వాయిద్యాన్నయితే ఎంచుకున్నావో, దానినే అభ్యసిస్తూ సమస్యల నధిగమించి దాని మీద పట్టు సాధించే వారకూ దానిని విడచిపెట్టకూడదు. చూశారా, ఎంత సులభమైన సుస్పష్టంగా వివరించే ఉదాహరణను

ఆయన వాడారో, ఆత్మాన్వేషణకు సిద్ధమవడానికి దానినే అభ్యసించాలి. ఇప్పటికిగూడా, కొందరు గ్రామీణులు, అణ్ణామలైస్వామి చేత బోధించబడ్డవారు, ఆత్మాన్వేషణను అభ్యాసం చేస్తున్నారు.

నేను రమణాశ్రమంలో ఉండగా, కుంజుస్వామితో కలిసి మేము అడవిలోనికి నడచుకుంటూ వెళ్ళేవారము. తరచుగా కొంచెం ప్రక్కకు వెళ్ళి, అణ్ణామలైస్వామి ఆశ్రమంలోనికి వెళ్ళి, ఆయన సన్నిధిలో సేదదీరేవారము. ఆయన అల్లం (వేసిన) టీ ఇచ్చేవారు. మేము దానిని ఇష్టంతో త్రాగేవారము. ప్రతిసారి ఆయన దగ్గరకు వెళ్ళినపుడు, నేను సాష్టాంగపడేవాడిని. నేను పైకి లేస్తున్నపుడు ఇంకా మోకాళ్ళపై ఉండగానే, ఆయన తన చేతిని నా తలపై ఉంచి, నా జుట్టును అటుఇటు కలిపి, తర్వాత తన తలను నా తలపై ఆనించేవారు. ఆయన నన్నలా పలుకరిస్తున్నారని నేననుకున్నాను. కొన్నాళ్ళ తర్వాత, నా స్నేహితురాలు అనూరాధతో వెళ్ళినపుడుకూడా ఆయన అలాగే చేశారు. అనూరాధ, "అలా ఎందుకు ఆయన జుట్టు నిమిరి, ఆయన తలపై మీతల ఉంచుతున్నారు?" అని అడిగారు. ఆయన ఇలా బదులిచ్చారు, "1938లో వెంకటు కుటుంబం తిరువణ్ణామలైకు తీసుకురాబడింది. ఈ గణేశన్, ఆయన రెండవ కొడుకు అప్పుడే తప్పటడుగులు వేస్తున్నాడు. అతనికి ఒక వింత అలవాటు ఉండేది. ఆయనను భగవాన్ హాలులోనికి తీసుకువెళ్ళగానే, భగవాన్ సోదరి, ఒడిలోనుండి దిగి, భగవాన్ సోఫా వైపుకు ప్రాకుకుంటూ వెళ్ళి, పైకి ఎక్కటానికి ప్రయత్నించేవాడు. భగవాన్, పరిచారకుడు క్రిష్ణస్వామి, అతడిని ఆపి, భగవాన్ సోదరి ఒడిలోపెట్టి, "కుటుంబ సంబంధ బాంధవ్యాలు ఇక్కడేమీ బలపరచనక్కర్లేదు" అనేవాడు. ఒకరోజు భగవాన్ కృష్ణస్వామిని ఏదో పనిమీద పంపించారు. పసివాడిగా ఉన్న గణేశన్, చాలా త్వరగా పాకుతూ సోఫా వద్దకు వెళ్ళి, సోఫాపైకి ఎక్కేశాడు. సోఫాలోనుండి అతడు క్రిందపడకుండా ఉండడానికి, భగవాన్ తన ఎడమకాలితో సోఫాలోనికి నెట్టి, తన కుడి పాదము అతని తలపై ఉంచి, జుట్టును నిమిరారు. నా గురువుగారి పాదము ఇక్కడ ఉంది అనూరాధా. నేను నా తలను గణేశన్ తలపై ఉంచటం కాదు, నా తలను నా గురువుగారి పవిత్రపాదాలపై ఉంచుతున్నాను". అనూరాధ అడిగారు, "స్వామి దయ ఉంచి ఇంకేమైనా కథ చెప్పండి" అని. అన్నామలైస్వామి అన్నారు, "లేదు, ఇవాళ గణేశన్ కథే కేవలం. అతడు రెండేళ్ళ పిల్లవాడిగా ఉన్నపుడు, బొద్దుగా వెన్నముద్దలా ఉండేవాడు. నేను ఆయనకు వాహనాన్ని, నేను ఎక్కడకు వెళితే అక్కడకు ఆయనను తీసుకు వెళ్ళేవాడిని. ఆఖరకు కట్టడాల నిర్మాణపు పని వద్దకు కూడా. ఆశ్రమం యొక్క పాతఫోటో ఆల్బమ్‌లు చూస్తే కొన్ని గ్రూపు ఫోటోలలో నేను, గణేశన్‌ను ఎత్తుకుని ఉండడం చూడగలవు. ఆ రోజు ఆయన మాట్లాడే ధోరణిలో ఉన్నారు. నేను ఈ పిల్లవాడంటే బాగా ఇష్టపడేవాడిని. కేవలం ఇతను పసివాడనే కాదు, ఇతని పట్ల భగవాన్ ఎక్కువ శ్రద్ధ కనబరచేవారని. గణేశన్‌కు ఆరేళ్ళ వయసు ఉన్నపుడు, నేను డిస్పెన్సరీ నిర్మాణాన్ని పర్యవేక్షించుతూ ఉన్నపుడు, ఇతను నన్ను పట్టుకుని ఉన్నాడు. ఆరోజు భగవాన్ వచ్చి, దగ్గరలో ఉన్న పెద్ద రాతిపై కూర్చున్నారు. గణేశన్ పరుగెత్తుకుంటూ వెళ్ళి, ఆయన కాళ్ళకు ఆనుకుంటూ కూర్చున్నారు. అది చూసి నాలోని పరిచారకుడి వాసన బయటకు వచ్చింది. భగవాన్ పరిచారకులందరికీ, ఎవరూ భగవాన్‌ను అంటుకోకుండా చూడమని యాజమాన్యం సూచనలిస్తుంది. (అప్పటికి అణ్ణామలైస్వామి పరిచారకుడిగా లేనప్పటికి, ఆయన హాస్యంగా అనూరాధతో అలా అన్నారు) అందుకని నేను వెళ్ళి భగవాన్ కాళ్ళపై వాలిపోకుండా, గణేశన్‌ను ఆపబోయాను. భగవాన్ ఆయనను తన రెండు కాళ్ళ మధ్య పట్టుకుని, నాతో, "ఏమిటిది అణ్ణామలైస్వామీ? నీకేమీ పని ఇక్కడ? వెళ్ళి నీ పని చూసుకో," అన్నారు. అందుకే ఈ పసివాడు ఇప్పటికి కూడా నాకు ప్రత్యేకము. ఆ సంభాషణ జరిగినపుడు ఈ పసివాడికి అరువది ఏళ్ళు.

1995 సం॥లో, నేను ఆశ్రమ యాజమాన్యం నుండి (నిర్వహణ) రాజీనామా, చేసినపుడు, నా సహకారంతో ప్రింటు అయిన ఆశ్రమపత్రిక చివరి సంచిక 'ది మౌంటెన్ పాత్' కాపీనొకదానికి తీసుకుని అణ్ణామలైస్వామి ఆశ్రమానికి వెళ్ళాను. డాబామీద ఏవో మొక్కల ఆకులను ఎండబెడుతున్న అణ్ణామలైస్వామికి ఆ కాపీని ఇచ్చాను. నేను ఆయనను ప్రార్థించాను, "స్వామీ! ఆశ్రమ యాజమాన్యంలో భాగంగా, నేను పాల్గొన్న కార్యక్రమాలన్నింటిని నుండి పూర్తిగా తప్పుకొని విశ్రాంతిగా ఉండడానికి మీ అనుమతిని ఆశీస్సులను ఇవ్వండి". ఆయన ఒక్కసారిగా ఎగిరిగంతేసి, నా వద్దకు వచ్చి, నన్ను కౌగలించుకున్నారు. మొదట భగవాన్‌నుండి అణ్ణామలైస్వామికి కౌగిలింత లభించింది. ఇప్పుడు అణ్ణామలైస్వామినుండి నాకు లభించింది. నేను (వారిద్దరిచే) ఆశీర్వదించబడ్డట్లుగా భావించాను. "నువ్వు నన్ను ఎంతో సంతోషపడేటట్లు చేశావు.

ఇదే రమణులకు నువ్వు చెయ్యగల గొప్ప సేవ. ఇప్పటి వరకు గణేశా మనిద్దరము స్నేహితులము మాత్రమే. ఇప్పటినుండి, మనము సోదరులము. నా ఆశీస్సులు నీకెప్పుడూ ఉంటవి. ఆయన తిరిగి నన్ను కౌగలించుకుని, ఆయన తలను, నా తలపై ఉంచారు. నేను బయటకు నడిచేటప్పటికి నా హృదయం సంతోషంతో ఉప్పొంగిపోయింది. ఆయన ఎంత ఆనందంగా ఉన్నారంటే, ఆయన చేసే పని వదిలేసి, నాతో పాటు క్రిందకు వచ్చారు. నాకు కొన్ని 'ఇరువచ్చి' అనే మొక్కలను (Bauhinia Tomentosa) ఇచ్చారు. భగవాన్ నాకు అడవిలో ఈ మొక్కను చూపించి దాని పూలు, ఆకులు కోసుకుని, అన్నంలో కలుపుకుని తినమన్నారు. అప్పటినుండీ అదే చేస్తున్నాను. ఇదుగో ఇపుడు నీకు ప్రసాదంగా ఈ నాలుగైదు మొక్కలను ఇస్తున్నాను. ఆ మొక్కలు ఇపుడు పెద్ద చెట్లై, 'ఆనంద రమణ'లోని నా తోటలో ఉన్నవి.

అణ్ణామలైస్వామి చనిపోయినపుడు, ఆయన శరీరాన్ని ఆయన ఆశ్రమంలోనే సమాధిచేశారు. ఇటువంటి గొప్ప భక్తుని సమాధి రమణాశ్రయంలో కట్టలేదని నేనెంతో బాధపడ్డాను. భగవాన్ కృపవల్ల, చాలామంది పాతభక్తుల సమాధులను, ఆశ్రమ ఆవరణలో కట్టగలిగాను. కానీ అణ్ణామలైస్వామి విషయంలో అలా జరుగలేదు. అదే నా బాధకు కారణం. కానీ భగవాన్ కరుణ చూడండి. ఆయన ఇపుడు అణ్ణామలైస్వామి సమాధిని, ఆయన ఆశ్రమాన్నీ రమణాశ్రమంలో కలిపేశారు. ఈ పిల్లవాడిలాంటి మూర్ఖుడి గాఢమైన కోరిక భగవాన్చే తీర్చబడింది. ఈ రత్నంలాంటి భక్తుడి సమాధిని, తన ఆశ్రమంలోనికి తీసుకున్నారు. ఎంతో ప్రయాసతో గొప్ప కట్టడాలను నిర్మించిన, ఈ నిర్మాత, (బేల్దారు) ఇపుడు శాశ్వతంగా తన సద్గురువైనటువంటి శ్రీరమణభగవాన్ పవిత్ర పాదాలచెంత దుమ్ముగా (నిలిచి) ఉన్నారు.

మేధోపరమైన స్పష్టత, ప్రారబ్దాన్ని నాశనము చెయ్యడానికి ముఖ్యమైనది.

హృదయం కరగటమనేది రెండవమెట్టు. నువ్వు జ్ఞానంలోనికి వికసించాలంటే, హృదయం కరగటమనేది అత్యంత ముఖ్యమైనది. శరణాగతి చెందు, "నాకు" అనే దానిని, అణ్ణామలైస్వామి చేసినట్లుగా పూర్తిగా శరణాగతి చెందించు. మీరు ఆయన గురించి చదివినపుడు, ఆయన ఎలా అడుగడుగునా తన గురువుగారికి విధేయుడిగా ఉండి, ఆయన మాటనెలా పాటించారో చూడవచ్చును. ఇది మనకు గొప్పపాఠము. కరగటమంటే ఏడవటం కాదు, నేలమీద పడి పొర్లడము కాదు. అది 'నాకు' అనే దానిని కావాలని (ఇష్టపూర్తిగా) పూర్తి ఇష్టంతో, చాలా తేలికగా అర్పణ చేసెయ్యడమే. అది మీరు గనుక చెయ్యగలిగితే, ఎంత ఆనందంగా ఉంటుంది!



అన్నామలై స్వామి ఆశీస్సులతో గణేశన్

మురుగనార్



ఘనకీర్తి వహించిన మహనీయులు జ్ఞానసంబంధర్, మీరాబాయి, ఆండాళ్ భూమిపై వారి జీవితకాలము ముగియగానే పెద్ద జ్యోతిలో ఐక్యమై, భగవంతుడిలో కలిసిపోయారని చరిత్రలో వ్రాయబడింది. 1923వ సం॥లో తొలిసారిగా తన గురువును కలిసినపుడు, పెద్ద వెలుగును దర్శించి, తన ఆధ్యాత్మిక జీవితానికి శ్రీకారం చుట్టారు, కవి, మహాత్ముడు అయిన, ఒక భగవాన్ భక్తుడు. ఆ తర్వాత రోజులలో కూడా, ఆయన ఎప్పుడు భగవాన్‌ను చూచినా, ఆయన శరీరం చుట్టూ ఆవరించుకుని వెలుగు కన్పిస్తుండేది. ఆయనే శ్రీమురుగనార్. తమిళ సంఘంలో గొప్ప కీర్తిని సంపాదించుకున్న తమిళ కవి. ఒక ప్రఖ్యాతిగాంచిన ఉపాధ్యాయుడిగా, తమిళ కవిగా, ఆయన తమిళపండితుల కమిటీలో చురుకుగా పనిచేశారు. ఆ కమిటీవారు, మహా గొప్ప కార్యమైన తమిళ నిఘంటువు (డిక్షనరీ) తయారుచెయ్యడంలో నిమగ్నమై ఉండేవారు.

మురుగనార్ ఈశ్వరుడంటే అపరిమితమైన భక్తి కలిగియుండేవారు. ఏడు వందల సంవత్సరాలకు పూర్వం మాణిక్యవాచగర్, అనే గొప్ప ఈశ్వర భక్తుడైన ఒక మహాత్ముడు, ఈశ్వరునిపట్ల అత్యంత భక్తిపారవశ్యంలో మునిగి 'తిరువాచకమ్' అనే పద్యకావ్యాన్ని వ్రాశారు. మురుగనార్ తన సమయంలో ఎక్కువ శాతం, తిరువాచకం చదువుతూ గడిపేవారు. ఆయన ఎప్పుడు ఆ పవిత్రమైన తిరువాచకం చదివినా, మాణిక్యవాచగర్‌కున్న భక్తిపారవశ్యమూ ఆయన పొందిన జీవిత సాఫల్యత తనకు కూడా లభించాలని ఎంతో తపనపడేవారు. దాదాపుగా అదే సమయంలో ఆయన మామగారు, ఆయనకు భగవాన్ వ్రాసిన రెండు పుస్తకాలను ఇచ్చారు. ఒకటి 'నేనెవరు?' అనే పుస్తకము. జ్ఞానమార్గానికి చెందినది. రెండవది గాఢమైన భక్తిని వెల్లడించే భక్తిగీతాలు. ఆయన ఆ పుస్తకాలను ఎన్నోసార్లు చదివారు. తన స్నేహితులద్వారా భగవాన్ ఎల్లప్పుడూ సహజనిష్ఠలో ఉంటారని తెలుసుకున్నారు. అటువంటి మహనీయులు ఆ రోజులలో ఎక్కడా చూడబోమని అనుకున్నారు. మురుగనార్‌కు భగవాన్‌ను చూడాలనీ, ఆయనను సేవించాలనీ, భక్తిపారవశ్యంలో మునిగేటట్లుగా ఆయనచే ఆశీస్సులు పొందాలనీ ప్రగాఢమైన కోరిక కల్గింది. ఆయన తిరువణ్ణామలై కు వెళ్ళారు. ఆయన అరుణాచలేశ్వరుని ఆలయంజేరగానే, ఆశువుగా పదకొండు పద్యాలను భగవాన్‌ను పొగడుతూ, భగవాన్‌నే ఈశ్వరుడిగా సంబోధిస్తూ వ్రాశారు. ఆయన 1923 సెప్టెంబరులో రమణాశ్రమమునకు వెళ్ళారు. అప్పటికి రమణాశ్రమంలో కేవలం కొన్ని పూరిగుడిసెలు మాత్రమే ఉండేవి. శుభ పరిణామాలు ముందుగానే సూచించబడినట్లు, ఆయన లోపలకు వెళ్ళుటకు ముందే భగవాన్ బయటకు వచ్చారు.

తనకు లభించిన మొదటి దర్శనాన్ని మురుగనార్ ఈ విధంగా వర్ణించారు, "నేను వాకిలివైపు చూసినపుడు, ఒక ఉజ్వలమైన జ్యోతి, ఒక పెద్ద జ్వాల (ప్రకాశము) నాకు కన్పించింది. అది నా కళ్ళు చెదిరేటట్లు (కళ్ళకు ఏమీ కనపడని విధంగా) చేసింది. పారవశ్యంతో నేను వ్రాసిన పద్యాలను చదటానికి ప్రయత్నించాను. పెల్లుబికిన కన్నీరు దానికి అడ్డుపడ్డది. ఆ ప్రకాశమునుండి ఒక మానవాకారము వెలువడింది. అదే భగవాన్, ఆయన నేను చేతిలో పట్టుకున్న కాగితాన్ని, తనకివ్వమన్నారు. భగవాన్ ఆ పద్యాలను చదివి ఇలాఅన్నారు : "ఇది అచ్చు తిరువాచకం వలె ఉన్నది. మాణిక్యవాచగర్ వలెనే వ్రాయుట కొనసాగించు!" అప్పుడు భగవాన్ నావైపు లోతుగా చూచారు. కొంతసేపైన తర్వాత నేను బాహ్య స్పృహలోకి వచ్చాను భక్తిపారవశ్యం పొంగిపొరలుతుండగా, ఎంతో సంతోషంతోటి, కృతజ్ఞతతోటి, నేను భగవాన్‌వైపు చూచాను. ఆ కరుణాపూరితమైన భగవాన్ నేత్రాలనుండి వెలువడిన చూపు, నా లోనికి దూసుకునివెళ్ళి, వెంటనే నేను ఇది వరకెన్నడూ ఎరుగని ఆనందస్థితిని అనుభవించేటట్లు చేసినది. భగవాన్‌యొక్క ఆ చూపు, భక్తిపారవశ్యంతో కూడిన కవిత్వం, నా హృదయంలోనుండి పెల్లుబికేటట్లు చేసింది. అప్పటినుండి వందలకొలది పద్యాలు నానుండి ఉప్పొంగి వస్తుండేవి. నేను వాటిని భగవాన్ ముందుంచే వాడిని. ఆయన వానిని సరిదిద్దేవారు. ఇది నాకు చెబుతున్నపుడు మురుగనార్ భావోద్వేగంతో నిండిపోయారు.

అప్పటికప్పుడే భగవాన్ నా దైవమూ, గురువూ అయ్యారు. భగవాన్ సాక్షాత్తూ పరమేశ్వరుని అవతారమే అని నాకు పూర్తిగా నమ్మకం కుదిరింది. నా కొత్త యజమానిగా, ఆయన నా కళ్ళనూ, మనస్సునూ స్వంతం చేసుకున్నారు. వేడి తగలగానే మైనం కరిగిపోయినట్లు, భగవాన్‌ను చూడగానే, నా మనసు కరిగిపోయి, దాని ప్రత్యేక ప్రతిపత్తి (ఉనికి)ని కోల్పోయింది. తల్లిని కనుగొన్న దూడలాగా, నా హృదయం ఆయన పవిత్రపాదాలచెంత సంతోషించేది. పున్నమి చంద్రుని చూచిన సముద్రంలాగా, భక్తి నాలో ఉప్పొంగింది". శిష్యుని ప్రకాశింప చేయగల గురువుకూ, ఘనుడైన శిష్యునికీ మధ్యన భగవంతుడు దివ్యమైన అనుబంధాన్ని ఏర్పరచాడు ఆ రోజున. మురుగనార్‌కు హఠాత్తుగా ఏర్పడిన అనుబంధంతో ఆధ్యాత్మిక జీవితానికి నాందిపలుకబడింది.

ఆయన తన తల్లిని, భార్యను పోషించడానికి చెన్నైలో ఉపాధ్యాయునిగా చేసేవారు. అందుకని ఆయన వెనుకకు ఉద్యోగనిమిత్తం వెళ్ళవలసి వచ్చింది. మూడునెలల తర్వాత మరలా వచ్చారు. ఆయన భగవాన్‌ను చూసినపుడు మరల ఆయనకు, భగవాన్ శరీరం పూర్తిగా వెలుగుతో కప్పబడినట్లు కన్పించింది. మురుగనార్ అప్పటికి పూర్తిగా భగవాన్ అనుగ్రహంతో కప్పబడిపోయారు. అయినా సరే, తన బాధ్యతలపట్ల అరుణాచలానికీ, చెన్నైకీ మధ్యన ప్రయాణించక తప్పలేదు. ఆయనకు తన తల్లిగారిపట్ల మిక్కుటమైన ప్రేమ. గురువుగారి పట్ల గల భక్తికీ, తల్లిపట్ల గల ప్రేమకూ మధ్య నలిగిపోయేవాడినని మురుగనార్ నాతో చెప్పారు.

శరీరాన్ని మైమరచిపోయిన స్థితిలో (పారవశ్యంలో మునిగి ఉన్న స్థితిలో) రైలును అందుకుని చెన్నై పోవటం కష్టంగా ఉండేది. కొన్నిసార్లు కళ్ళవెంట ఆనందభాష్పాలు కారుతుండగా, మూడు మైళ్ళ దూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు చేరుకుని, ప్లాట్‌ఫాం పై అటూ ఇటూ నడుస్తుండేవారు. రైలు రానూ వచ్చేది, వెళ్ళనూ వెళ్ళేది. ఆనందపారవశ్యంలో మునిగి ఉన్న ఆయన అది గమనించేవారు కాదు. ఏ కూలీనో, లేక స్టేషన్‌మాస్టరో రైలు వెళ్ళిపోయిందని చెప్పగా, ఇంకా పారవశ్యంలో ఎక్కిళ్ళు పెడుతూనే వెనుకకు భగవాన్ వద్దకు వచ్చేసేవారు. ఇలా అనేకసార్లు జరుగుతూండే సరికి, భగవాన్ కుంజుస్వామిని గాని, విశ్వనాధస్వామిని గాని ఆయనకు తోడుగా పంపి, వారికి ఈ విధంగా చెప్పేవారు, "ఆయనను రైలు ఎక్కించి, రైలు కదిలిన తర్వాతనే మీరు ఆశ్రమానికి రండి".

1924లో మురుగనార్ తల్లి చనిపోయారు. తల్లిగారి అంత్యక్రియలు పూర్తిచేసి, ఆమె చితాభస్మంలో కొంతభాగాన్ని మట్టిపాత్రలో తీసుకుని భగవాన్ వద్దకు వచ్చారు. మిక్కిలి దుఃఖభారంలో ఉన్న మురుగనార్‌ను చూసి భగవాన్, "ఈ స్థితిలో అంత్యక్రియలు ఎలా జరుపగలిగావు?" అని అడిగారు. భగవాన్ అలా అడిగేసరికి, తనపట్ల భగవాన్‌కు గల అభిమానాన్ని చూసి, ఆయన దుఃఖం కట్టలు తెంచుకుంది. ఎవరో భగవాన్‌తో చెప్పారు, చితాభస్మం ఉంచిన పాత్ర ఆశ్రమం బయటపెట్టబడినదని, భగవాన్ అప్పుడు ఆ భస్మాన్ని, ఆశ్రమం దగ్గరలో ఉన్న అగ్నితీర్థంలో కలిపిరమ్మని చెప్పారు. ఎంత కరుణాపూరిత మనస్కులో భగవాన్ అని, ఈ విషయాన్ని చెప్తూ ఏడ్చేశారు మురుగనార్. ఆయన, తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ప్రాపంచిక బంధాలన్నిటినీ త్రెంచుకుని, 1926లో భగవాన్ వద్దకు వచ్చేశారు. సంపూర్ణశరణాగతి చెందారు. భగవాన్ ఆయనను హృదయపూర్వకంగా ఆహ్వానించారు. అప్పటినుండి మురుగనార్ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

మురుగనార్, ఆశ్రమ యాజమాన్యానికి దాని దైనందిన కార్యక్రమాల్లో, సహాయపడడానికి ప్రయత్నించేవారు. ఆయన తన ప్రాపంచిక వ్యవహారాలను సక్రమంగా నెరవేర్చడానికి శాయశక్తులా ప్రయత్నం చేసేవారు. కానీ ఆయన ధ్యాస పూర్తిగా అంతర్ముఖమై ఉండడం వలన, సాధన వైపు నిలిచిన దృష్టి వలన తాను ఏ ప్రాపంచిక వ్యవహారాన్ని నిర్వహించడానికీ సమర్థుడను కాను అనుకున్నారు. ఆశ్రమాన్ని వీడి, స్వతంత్రంగా జీవిస్తే బాగుంటుందేమో అనుకున్నారు. ఆయన భగవాన్ వద్ద తన అభిప్రాయాన్ని తెలిపినపుడు భగవాన్ ఆయనను దగ్గరలో ఉన్న పల్లాకొత్తులో ఉండమని ప్రోత్సహించారు. అప్పటినుండి మురుగనార్, భగవాన్ పాదాలచెంతనే తన సమయంలో ఎక్కువ భాగాన్ని గడుపుతూ, ప్రాపంచిక విధులనుండి బయటపడి, చాలా నిరాడంబరమైన, నియమనిష్ఠలతో కూడిన జీవితాన్ని గడిపేవారు. "నేను బిచ్చమెత్తుకుని ఆహారాన్ని సంపాదించుకుంటే బాగుంటుందనుకుంటున్నాను," అన్నారు మురుగనార్. భగవాన్ తన అనుమతిని సహజంగా, చక్కగా

తెలిపారు. మురుగనార్ విషయంలో సరే వెళ్ళి అడుక్కో అనలేదు. దానికి బదులుగా ఏ యే వీధులలో బిచ్చానికి వెళ్ళాలో, ఏయే వీధులలో వెళ్ళగూడదో, ఆ వీధుల పేర్లు చెప్పారు. మురుగనార్ తన్మయత్వంలో మునిగిపోయారు. ఆయన బిచ్చమెత్తుకుని, ఆ భిక్షను పల్లాకొత్తుకు తీసుకుని వచ్చేవారు. చాలా పరిశుభ్రంగా ఉండాలని కోరుకునే వ్యక్తి కనుక ఆ ఆహారాన్ని ఒక గుడ్డలో కట్టి, దానినొక చెట్టుకు తగిలించి, కోనేటిలో కాళ్ళూ, చేతులూ చాలాసేపు శుభ్రం చేసుకుంటూ ఉండేవారు. చాలాసార్లు కోతులు ఆయన ఆహారాన్ని కాజేసేవి. ఆయన భోజనం లేక ఆకలితో ఉండేవారు. అయినా ఆయన ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. ఆయన సంతోషంగానే ఉండేవారు. భగవాన్ సాన్నిధ్యం, ఆయనలోని కవిని ఉత్తేజితుడ్ని చేసింది. ఆయన భగవాన్ చేత ప్రోత్సహించబడడంచేత, సూచన ఇవ్వబడడం చేత తిరువాచకం రీతిలోనే వందలకొలది పద్యాలను వ్రాశారు. మిగిలిన భక్తులు వీనిని సంగ్రహపరచి, "రమణ సన్నిధిమురై" అనే పేరుతో ప్రైవేటుగా ముద్రించారు. (రమణుల సన్నిధిలో, ప్రార్థనలు, స్మృతులు). ఈ పుస్తకంలోని చక్కదనం ఏమిటంటే దీనిలో 1850 (పద్దెనిమిది వందల యాభై) ఆసువుగా చెప్పబడిన పద్యాలు, భగవాన్‌చేత చూడబడి సరిదిద్దబడినవి ఉన్నవి. ఈ పుస్తకముయొక్క ప్రాముఖ్యత ఏమిటి? మురుగనార్ తనంతతానుగానే ఇలా ప్రకటించారు, "రమణసన్నిధిమురై" యొక్క ముఖ్యోద్దేశము, ఉపయోగము, అజ్ఞానము అనే చీకటి, అహంకారము అనే భ్రమ, రమణప్రభువు అనుగ్రహ ప్రకాశం వలన పటాపంచలై, నశించిపోయి, గురువుపాదాల వద్ద అంటిపెట్టుకుని ఉండుటయే.

మురుగనార్ భగవాన్ వద్దకు వచ్చినప్పటికి, ఆయన వేదాంతగ్రంథాలు చదువలేదు. అందుకని ఆయన ఎక్కువ బాగా భగవాన్ బోధలను అర్థం చేసుకుని, తేలికగా జీర్ణించుకున్నారు. ప్రత్యేకించి, భగవాన్ సూటిమార్గమైన ఆత్మవిచారణను. ఎప్పుడైనా, ఎవరైనా, భక్తులు భగవాన్‌ను ప్రశ్నించినపుడు ఆయన ఇచ్చిన సమాధానాలను, మురుగనార్ తన కుటీరానికి వెళ్ళి, పద్యాలుగా వ్రాసిపెట్టేవారు. ఆ ప్రశ్నలూ, సమాధానాలు, కొన్ని వందలకొలది పద్యాలుగా తయారై, 'గురువాచకకోవై' (గార్లండ్ ఆఫ్ గురూస్‌సేయింగ్స్)గా అచ్చు వేయబడింది. ఇందులోకూడా ప్రతిపద్యమూ భగవాన్‌చే సరిదిద్దబడి, పేరుపెట్టబడి ఆమోదించ బడినదే. ఈ రెండు పుస్తకాలు కూడా ఇంగ్లీషులోనికి తర్జుమా చేయబడినవి. గురువాచకకోవై యొక్క సారాంశమేమిటి? అందులోని ఒక పద్యమే దాని సారాంశాన్ని స్పష్టం చేస్తుంది. ఈ బలహీనమైన (అశాశ్వతమైన) శరీరాన్నే 'నేను' అనే ఆలోచనను వదలివెయ్యి. శాశ్వతానందమయమై నీలోనే ఉన్న ఆత్మను తెలుసుకో. ఇదే 'నేను' అని నువ్వు భావిస్తున్న ఈ శరీరము నువ్వు కాదు. నిజమైన నువ్వు, నీలోనే సత్యంగా (ఆత్మగా) ఉన్నావు. దానిని అనుసరించు. ఆత్మవిచారణ సలిపి, దానిని కనుగొను.

మురుగనార్ చాలా అద్భుతమైన గ్రంథాలు రచించారు. రమణదేవమాలై, శ్రీరమణ చరణ పల్లాండు, శ్రీరమణ అనుభూతి, మరియు శ్రీరమణ జ్ఞానబోధమ్ మొదలైనవి. ఆయన గ్రంథాలన్నిటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక తత్వాన్ని మూడు తరగతుల క్రింద విభజించవచ్చును. ప్రార్థనలు, స్తుతులు, శుద్ధమైన సూటిమార్గము, ఆధ్యాత్మిక అనుభవం వల్ల కల్గిన పారవశ్యము. వీటిని రూపొందించడం కోసమే భగవాన్ ఆయనకు కవిత్వాన్ని అనుగ్రహించారు. మురుగనార్ ఈ విధంగా అన్నారు, 'ఈ గ్రంథాలు వ్రాసేటప్పుడు నాకు వేరే ఆలోచనే లేదు. సత్యమే తానైన భగవాన్, నా హృదయాన్ని ఎంతగా ఆక్రమించుకున్నారంటే, నేనుకేవలం రమణుల మీద, ఆయనపట్ల నాకుగల భక్తిపారవశ్యమును గూర్చి ఆయన సూటిమార్గాన్ని నిర్ధారిస్తూ మాత్రమే వ్రాశాను.

ఆయన మొదటి గ్రంథమైన రమణసన్నిధి మురై అచ్చయినపుడు, అది తీవ్రమైన వ్యతిరేకతను, విమర్శలను ఎదుర్కొని, నిషేధానికి గురి అయింది. ఈ గ్రంథం ఇంత తీవ్రంగా ఆశ్రమ యాజమాన్యంచే నిరసించబడడానికి కారణం, అందులోని ఒక పద్యము. ఒకే ఒక అనుగ్రహ వీక్షణం నాపై ప్రసరింపజేయడం ద్వారా, భగవాన్ రమణులు, నా అహంకారాన్ని సమూలంగా పెరికివేసి, దానికి బదులుగా, తన స్వంతస్థితి అయిన మహోన్నతమైన ఆనందాన్ని నాకనుగ్రహించారు. ఇది ఆసువుగా (ముందు ఆలోచన లేకుండా అప్పటికప్పుడు చెప్పే పద్యం) చెప్పబడింది. ఇది కొంతమందిలో క్రోధాగ్నిని రగిలించింది. ఎందుకంటే, మురుగనార్ అహంకారం పెచ్చరిల్లి, తాను భగవాన్‌తో సమానము అనేటట్లుగా చేసిందని, దాని (ఆయన) వ్యతిరేకుల అభిప్రాయం.

ఒకరోజు హాలులో భగవాన్ సన్నిధిలో మురుగనార్ భక్తిలో మునిగిపోయి పూర్తి తన్మయత్వంలో మునిగిపోయి, తదేకంగా భగవాన్‌వంక ఎలా చూస్తున్నారంటే, తన కళ్ళతోనే ఆయన ప్రేమనంతటినీ, త్రాగివేస్తున్నారా అనిపించింది విశ్వనాధస్వామికి. ఆయన అంత నిరాశకులోనైనా గూడా, దానినంతటిని భగవాన్ వైపు చూడడం ద్వారా, ఆయన పట్ల భక్తిలో మునగడం ద్వారా అధిగమించగలిగారు. ఆయన గొప్పతనం విశ్వనాధస్వామిని కదల్చివేసింది. విశ్వనాధస్వామి తనకు తెలియకుండానే, మురుగనార్ కలంపేరు, 'ముగవపురి మురుగన్' ను తనకు తనే పదే పదే అనుకుంటున్నారు. భగవాన్ అది విని, 'విశ్వనాధా! అతనిపేరు అన్నిసార్లు పునశ్చరణ చేస్తే ప్రయోజనమేమిటి? ఆ రెండు మాటలతోనూ, నువ్వొక పద్యాన్ని వ్రాయవచ్చునుకదా!" అన్నారు. ఆయన మాటలకు తల ఒగ్గి విశ్వనాధస్వామి, ఒక చిన్న కాగితం తీసుకుని, ఆ రెండు మాటలతో ఒక పద్యం వ్రాయడానికి ప్రయత్నించారు. చాలాసార్లు ప్రయత్నించి, తనవల్ల కాక ఆ ప్రయత్నాన్ని విరమించారు. ఆ మాటలతో కూడిన కాగితాన్ని భగవాన్ ముందుంచి హాలు వదలి వెళ్ళిపోయారు.

విశ్వనాధస్వామి తిరిగివచ్చేసరికి, భగవాన్ మొత్తం పద్యాన్ని పూర్తిచేసి, దాని క్రింద విశ్వనాధన్ అని వ్రాశారు. నిజానికి విశ్వనాధస్వామి ఆ పద్యంలో కొంచెం కూడా వ్రాయలేదు. భగవాన్, ఆ పద్యాన్ని మురుగనార్ అంటున్నట్లుగా వ్రాశారు. "అరుణాచల రమణన్, అందరి హృదయ కమలాలలో నివసించేవారు, నా అహంకారం వైపు జూచి చిరునవ్వునవ్వి, తనయొక్క ఒక కృపావీక్షణంతో, దానిని పూర్తిగా నశింపజేశారు. తిరువాచకంతో పోల్చదగిన, తిరువాచకంతో సరితూగగల నా రచన అయిన రమణసన్నిధిమురైతో ఈ ప్రపంచం మొత్తానికి జ్ఞానప్రకాశాన్ని అందజేసే శక్తి నాకు కలిగేటట్లుగా, భగవాన్ ఆయన ఆశీస్సులను, ముగవపురి మురుగన్ అయిన నాపై కురిపించారు. ఈ పద్యమెంతో ముఖ్యమైంది. ఎందుకంటే భగవాన్ స్వయంగా దీనిని వ్రాశారు. శ్రీభగవాన్ ఎవరూ అడగకుండానే తన పేరు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ అరుణాచల రమణన్ అని ప్రకటించారు. భగవాన్ మనకు హామీ ఇస్తున్నారు, ఆయన మనలో ప్రతి ఒక్కరి హృదయంలోనూ, ఎల్లపుడూ నివాసం ఉంటానని. ఆయన కృపాదృష్టి, ఆయన ఫోటోనుండి ప్రసారమైనా గూడా, అహంకారాన్ని నాశనం చెయ్య శక్తిగలది. ఆయన రాక యొక్క ఏకైక లక్ష్యము, కొద్దిమంది ఎంపికచేసిన శిష్యవర్గానికి మాత్రమేకాక, మానవాళి మొత్తానికీ జ్ఞానజ్యోతిని వెలిగించడానికి, జ్ఞానప్రకాశాన్ని కలిగించడానికి అని విశదపరిచారు. ఈ పద్యమే దానికి ఋజువు. మురుగనార్, భగవాన్‌తో తన ప్రథమ సమావేశములోనే, ఆయన అనుగ్రహ వీక్షణాన్ని పొంది, ఆత్మానుభవాన్ని పొందారు. నిజమైన సాధకులుగా మనమొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ అనుభవం స్థిరపడి, ఆత్మలో స్థితులవాలంటే, కొంత సమయం పడుతుంది. ఈ పద్యము వ్రాసినపుడు భగవాన్ మరల ఆయనవైపు చూశారు. ఇది మురుగనార్‌ను ఎటువంటి స్థితిలో నిలిపిందంటే, ఆయనలో కవితావేశం పొంగిపొరలి, వందలకొలది పద్యాలు వాటికవే ఆశువుగా (అప్రయత్నంగా) ఆయన కలంనుండి జాలువార సాగినవి. మురుగనార్ తొలినాటి పారవశ్యస్థితిలోనే ఎల్లకాలం స్థిరపడిపోవాలని తపించారు.తను రోజువారిగా గురువుగారితో గడిపే సమయం మాత్రమే కాకుండా, ఆయనతో ఏకాంతంగా మాట్లాడే అవకాశం దొరికి, తాను దివ్యమైన ఆనందస్థితిలో శాశ్వతంగా నిలచిపోయేటందుకు తోడ్పడాలని, ఆయన్ని నిశ్శబ్దంగా ప్రార్థించేవారు. తన మనస్సు లోతులలోని కోరికను, ఆయన ఎవరి వద్దా, ఆఖరికి భగవాన్ వద్ద కూడా వెల్లడి చేయలేదు. కానీ, భగవాన్‌కు ఆయన చెప్పవలసిన అవసరం ఉన్నదా?

ఆ రోజులలో ఆశ్రమంలో నుండి భక్తులు ఒక బృందంగా వెళ్ళి ఒకానొక చెట్టు ఆకులను కోసుకుని విస్తళ్ళ తయారీకి తీసుకు వచ్చేవారు. ఒకనాటి ఉదయం, కొంతమంది భక్తులబృందం అడవిలోకి వెళ్ళాలనే ఆలోచనలో ఉన్నారు. భగవాన్ మురుగనార్ వైపు ఒక ప్రత్యేకమైన చూపు చూశారు. దాని భావాన్ని అర్థం చేసుకున్న మురుగనార్, హడావిడిగా భగవాన్ వెంట హాలు బైటకు నడిచారు. ఆ బృందం వీరిని అనుసరించటం ప్రారంభించింది. కానీ భగవాన్ ఎంత వేగంగా ఆయనను, దట్టమైన అడవిలోపలి భాగంలోనికి తీసుకుని వెళ్ళారంటే, మిగిలినవారు వీరికంటే ఎంతో వెనుక ఉండిపోయారు. భగవాన్ ఒక పెద్ద దుంగమీద కూర్చుని మురుగనార్‌కు తన ప్రక్కన కూర్చోమని సైగచేశారు. వారిద్దరి మధ్య మాటలేమీ జరగలేదు. భగవాన్ అప్పుడాయనవంక లోతుగా, దృష్టిని సారించి, ఆయనను హృదయంలో శాశ్వతంగా స్థితులయ్యేటట్లు చేశారు.

మురుగనార్ కనులు తెరచేటప్పటికి, చీకటి పడింది. ఆయన ఒక్కరే అక్కడ ఉన్నారు. ఆయన తన్మయత్వంలో కొన్ని గంటల పాటు ఉండిపోయారు. అప్పటి నుండి మురుగనార్, ఆ అంతరంగిక, శాంతి, సౌఖ్యాలలోనే నిలిచిపోయారు.

అహంభావంతో, ఈ నీచమైన శరీరముతో తాదాత్మ్యము చెంది, నేనొక అధమమైన స్థితిలోనికి దిగజారాను. ఇప్పుడు, పరిశుద్ధమైన, దివ్యమైన, జ్ఞానియైన, అనుగ్రహముయొక్క ప్రతిరూపమేయైన ఆయనచే మేల్కొలుపబడి, నేను మహోన్నతమైన మౌనంతో నిండిన, సహజస్థితిని పొందాను. నేను పరిపూర్ణుడనై, శుద్ధమైన (ఎఱుక) చైతన్యము వలెనే వర్ధిల్లుతున్నాను. అహంకార నాశనంతో, పెల్లుబికిన ఆత్మజ్ఞానము, నా హృదయాన్ని నింపివేసింది. పూర్తిగా వికసించిన తన అనుగ్రహ వీక్షణం అనే ప్రకాశముతో, నన్ను పరమానంద స్థితిలోనికి వికసింపజేసి, సద్గురు రమణులు, ఒక మూర్ఖుడనైన నన్ను బుద్ధునివలె వర్ధిల్లేటట్లు, జీవించేటట్లు చేశారు. పురాతన కాలంనుండి, ఋషులు, మహాత్ములు, వాళ్ళ భక్తితోనూ, జ్ఞానంతోనూ, దేవుళ్ళనూ, దేవతలనూ ప్రస్తుతిస్తూ, అనేక రకాల వృత్తాలలో, ఛందస్సులలో వేలాది పద్యాలు వ్రాశారు తమిళ భాషలో. బహుశా చరిత్రలో మొదటిసారిగా మనకు మురుగనార్ ఒకే ఒక్క కవి, వివిధ వృత్తాలలో, ఛందస్సులో, శుద్ధమైన తమిళంలో ఒకే ఒక సద్గురువుమీద, అనగా భగవాన్ శ్రీరమణమహర్షి మీద నలభైవేల పద్యాలను వ్రాశారు. ఈ ఆధ్యాత్మిక అద్భుతం మురుగనార్‌కు మాత్రమే ప్రత్యేకంగా సాధ్యమైంది.

ఈ కవియైన మహాత్ముని, మరొకందుకు కూడా మనము గౌరవిస్తాము.

ఆయన నేర్పుగా భగవాన్‌నుండి, సూటిబోధను రాబట్టారు. (వెలువడేటట్లు చేశారు). ఆయన ప్రయత్నాలవల్లగాకపోతే భగవాన్‌యొక్క ప్రత్యక్ష బోధ మనకు మూడు విశిష్టగ్రంథాలుగా లభ్యమైఉండేదే కాదు. వాటిని, ఆత్మవిచారణ, ఆత్మసాక్షాత్కారములకు సంబంధించిన 'నవీన ఉపనిషత్తులు'గా భావించవచ్చును. ఉల్లదునార్పదు, దాని అనుబంధము, ఉపదేశ ఉందియార్, జ్ఞానము మీద కవిత, ఆత్మవిద్యా కీర్తనము అని పేరుగల్గిన గ్రంథాలే ఆ మూడూను. అనంతమైన ఆత్మ అనే సత్యాన్ని, ఎలా అనుభవంలోకి తెచ్చుకోవాలి అనే విషయాన్ని మనకు ఎరుకపరుస్తాయి ఆ గ్రంథాలు.

ఈ మూడు గ్రంథాలయొక్క ఆవిర్భావము ఎలా జరిగింది అనే విషయం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. 1926వ సం॥లో మురుగనార్ భగవాన్ వద్దకు వచ్చారు. అంతకుముందే భగవాన్ ఎన్నో పద్యాలను అప్పుడప్పుడూ వ్రాసినప్పటికీ, వాటినెవ్వరూ, సంగ్రహించి జాగ్రత్త పర్చలేదు. మురుగనార్‌కు కవిత్వంపట్ల ఉండే సహజమైన ఆసక్తి వల్ల ఆయన పరిశోధించి, భగవాన్ వ్రాసిన వాటిలో ఇరువది ఒక్క పద్యాలను కనుగొన్నారు. ఆయన వాటిని సంగ్రహించి, అవి అన్నీ ఒకే భావానికి లేదా విషయానికి సంబంధించి లేవని కనుగొన్నారు. అందుకని ఆయన భగవాన్‌తో కలసికూర్చుని, వాటిని విభజించారు. ఆయన ఎన్నుకున్న కవితా వస్తువు (విషయము) సత్యము. దానిని గుర్తించు విధానము (లేదా) (ఆత్మ, దాని సాక్షాత్కారము పొందు మార్గము). ఎందుకంటే భగవాన్‌తో కలసి జీవిస్తూ, పరిశుద్ధమైన ఆధ్యాత్మిక జీవనాన్ని గడుపుతున్న ఆయన సత్యంగానే నిలుచుటలో, హృదయంలో స్థితమై ఉండుటలోగల ప్రాముఖ్యతను గుర్తించారు. అందుకని, ఆ కవితావస్తువును ఆయన ఎన్నుకొన్నారు. అప్పటి భగవాన్ పద్యాలలో కొన్ని అందుకు సంబంధించినవి కావు. అందుకని మురుగనార్ వాటిని వదలివైచి, వాటికి బదులుగా, ఆ కవితా వస్తువుకు సరిపోవు మరికొన్ని పద్యాలను ఆయన స్వీయఅనుభవానికి సంబంధించిన వానిని వ్రాసి ఇమ్మని ప్రార్థించారు. ఇది ఇలా ఇరువది రోజులపాటు కొనసాగింది. తమిళ సాహిత్యంతో, ఒక ప్రత్యేక ఛందస్సులో నలుబది పద్యాలు ఒకే విషయంపై వ్రాయబడ్డవి. మురుగనార్ భగవాన్‌ను అదేవిధానం పాటించవలసిందిగా ప్రోత్సాహపరిచారు. భగవాన్ 'స్వయంగా దీనికి 'ఉళ్ళదునార్పదు', 'ఉన్నదినలుబది). 'నలుబదిపద్యాలలో సత్యము'. ఈ పుస్తకానికి సంపాదకత్వం నెరపేటప్పుడు వదిలివేసిన పద్యాలను కూడాజాగ్రత్తపరచమని, ఆయన భగవాన్‌ను మరికొన్ని పద్యాలను వ్రాయవలసిందిగా వేడుకుని, మరల ఇంకొక నలుబది పద్యాల సంగ్రహాన్ని కూర్చి, 'ఉల్లదు నార్పదు అనుబంధం) (Supplement to Reality in Forty Verses) అని పేరుపెట్టారు.

వేరొకసందర్భంలో మురుగనార్, దేవుళ్ళ యొక్క, దేవతల యొక్క లీలలపై అదే పనిగా పద్యాలు వ్రాస్తూనే ఉండేవారు. వారిలో ప్రతి ఒక్కరిని రమణులుగా భావించేవారు. డెబ్బది పద్యాలను పూర్తిచేసిన తర్వాత, ఈశ్వరుడు అడవిలో తపమాచరిస్తున్న

మునులను ఆధ్యాత్మిక ప్రబోధం గావించే సందర్భంలో, ఆయన కవితా వెల్లువ ముందుకు సాగకుండా నిలిచిపోయింది. ఆయన భగవాన్‌ను ఈశ్వరుడుగానే ఆరాధించేవారు కనుక, ఆయన భగవాన్‌ను ఇలా ప్రాధేయపడ్డారు. మీరు స్వయంగా ఈశ్వరుడే. ఇక్కడకు వచ్చేసరికి నేను ఆగిపోయి ముందుకు సాగలేకపోతున్నాను. దయచేసి, ఆ ప్రజ్ఞాశాలురైన ఋషులకు ఈశ్వరుడు ప్రబోధించినట్లుగా తరువాత ముప్పది పద్యాలను మీరు నాకు దయచేయండి. దానికి సమాధానంగా, భగవాన్ ఉపదేశ ఉందియార్‌ను (ఆధ్యాత్మిక బోధపై ముప్పది పద్యాలు) (Thirty Verses on Spiritual Instruction) ఇది ఆత్మగా నిలిచిపోయేటందుకు మెట్టు తర్వాత మెట్టుగా త్రోవచూపిస్తుంది. ఒకప్పుడొకరు, 'రమణసన్నిధి ముఱై'ని ఉద్దేశించి, ఇది నీ రచనలలోకెల్లా గొప్పది అని మురుగనార్‌ను ప్రశంసించారు. మురుగనార్ కన్నీటితో ఇలా బదులిచ్చారు. భారతదేశంలో, మహాభారతాన్ని అన్నిటికంటే గొప్పకావ్యంగా (ఇతిహాసంగా) భావిస్తారు, ఎందుకంటే అందులో సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మచే చెప్పబడిన బోధ, భగవద్గీత రూపంలో నిక్షిప్తమై ఉన్నది గనుక. అలాగే మీరు నా రచనలలో 'సన్నిధిముఱై' గొప్పది అని భావిస్తున్నారంటే అందులో భగవాన్ యొక్క 'ఉపదేశ ఉందియార్' నిక్షిప్తమై ఉంది కనుక.

నూటేబది ఏళ్ళ క్రిందట జీవించిన ఒక ప్రముఖ కవి, మానవునికి అన్నిటికంటే కష్టమైన విషయము ఆత్మసాక్షాత్కారాన్ని పొందటమే అని కొన్ని పద్యాలను వ్రాశారు. మురుగనార్ దానితో చాలా కలవరపడ్డారు. ఆయన అన్నారు, అది అన్నిటికంటే తేలికైనది. అది ఏ విధంగా కష్టమైనది అవుతుంది? ఆయన భగవాన్ సన్నిధిలో కూర్చుని, ఆత్మజ్ఞానము అన్నిటికంటే తేలికైనది అని వ్రాయబోయారు. కాని ఆయన ఇంక ముందుకుసాగలేక పోయారు. ఎందుకంటే అందరినీ మెప్పించే విధంగా ఎలా వ్రాయాలో తెలియక.

మురుగనార్ ఆ కాగితాన్ని భగవాన్ సోఫాక్రిందపెట్టి బయటకు వెళ్ళిపోయారు. ఆయన తిరిగి వచ్చేసరికి, భగవాన్ "ఆత్మవిద్యాకీర్తనం" అనే పేరుతో, ఆత్మజ్ఞానంపై కొన్ని పద్యాలువ్రాశారు. అవి భగవాన్ స్వీయ అనుభవాన్ని వర్ణిస్తూ,దానిని పొందటం, ప్రతి ఒక్కరికీ ఎంత తేలికో తెలుపుతున్నవి. "ఓ! ఆత్మవిచారణ ఎంత సులభం. నిజంగానే చాలా సులభం. ఎంత నిలకడలేనివారికైనా, బలహీనులకైనా, ఆత్మ అనేదే నిజమైంది. దానితో పోలిస్తే చేతిలోని ఉసిరికాయకూడా కేవలం భ్రమే అనిపిస్తుంది. నేను ఈ శరీరాన్ని అనే ఆలోచన దారంగా (సూత్రంగా) మిగిలిన ఆలోచనలన్నీ దానికే అంటిపెట్టుకుని ఉంటాయి. (ఆత్మవిచారణలో లోనికి మునిగితే) నేను ఎవరను? ఎక్కడనుండి వచ్చాను? అని ప్రశ్నలు వేసుకుంటూ ఆత్మవిచారణ లోనికి మునిగితే, మిగిలిన ఆలోచనలన్నీ మాయమైపోతవి. హృదయకుహరంలో 'నేను (అహమ్)', 'నేను (అహమ్)' అంటూ ఆత్మ స్వయంప్రకాశమై నిలచి ఉంటుంది. అటువంటి ఆత్మజ్ఞానమే (శుద్ధమైన ఎరుకే) స్వర్గము, నిశ్చలత్వము, ఆనందనిలయం. మనము భగవాన్‌కు మురుగనార్‌తో ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే, ఆత్మసాక్షాత్కారము పొందటం నిజంగా చాలా తేలికైనదిగా అన్పిస్తుంది. మురుగనార్‌కు భగవాన్ తప్ప వేరే దైవము లేరు. ఆత్మవిచారణ తప్ప రెండవ మార్గము లేదు. ఆత్మలో స్థిరమై మౌనంగా ఉండుట తప్ప, జీవితానికి వేరే ఉద్దేశమేమీ లేదు. ఆయన జీవితంలోని గొప్ప వెలుగు (విశేషము) కేవలము ఆయన రచనలు కాదు, భగవాన్‌నుండి ఆత్మబోధను వెలికి రప్పించడము కాదు, నిజానికి తను వ్రాసిన ప్రతి మాట, తను జీవించారు.

ఆయన కవితావైభవాన్ని చూసి, కేవలం తమ ఆస్థానంలో ఉంటే చాలునని, ఎంతో ఐశ్వర్యాన్ని సంపదను ఇవ్వజూపారు రాజులు. కానీ ఆయన తిరువణ్ణామలై వీధుల్లో బిచ్చగానిగా ఉండటానికి, భగవాన్ నీడలో ఉండటానికీ, ఆత్మలో స్థితులై ఉండటానికే ఇష్టపడ్డారు. హిందూవేదాలలో, శృతులలో, ఉత్తమోత్తమమైన గురుశిష్యసంబంధం ఎలా ఉంటుందీ అని వర్ణింపబడిందో దానికి ఉదాహరణగా నిలిచింది భగవాన్, మురుగనార్‌ల సంబంధం. మురుగనార్ గురువు బోధను అనుసరించే జీవించారు ప్రతిరోజూ, ప్రతిగంట, ప్రతినిముషము. హిందూ మతగ్రంథాలూ (ధర్మశాస్త్రాలు), అన్నీకూడా, శిష్యుడు గురువు గారిని ప్రశ్నిస్తున్నట్లు, గురువు గారు సమాధానము ఇస్తున్న రీతిలో ఉంటాయి. ఆఖరికి నైతిక విషయాలైనా సరే. హిందూసంస్కృతిలో గురుశిష్యుల అనుబంధం, ఎంత అందంగా ఉంటుందో మురుగనార్‌యొక్క తర్వాతి జీవితాన్ని చూస్తే అర్థమవుతుంది.

మురుగనార్,భగవాన్‌తో ఎల్లపుడూ (తరచుగా) సంభాషిస్తూ ఉండేవారు. భగవాన్ పెద్దగా చదువుకోలేదు. మురుగనార్ తమిళ సాహిత్యాన్ని (వాఙ్మయాన్ని) విస్తారంగా చదివారు. ఎప్పుడైనా భగవాన్ ఒంటరిగా మురుగనార్‌తో ఉన్నపుడు ఏదైనా ఒక గ్రంథముయొక్క సారాంశాన్ని చెప్పమని కోరేవారు. ఒకరోజు, తన్మయస్థితిలో ఉన్న మురుగనార్ ఒకదాని తర్వాత ఒకటిగా కొన్ని తమిళగ్రంథాల సారాన్ని విడమరచిచెప్పారు భగవాన్‌కు. గొప్ప శ్రోతయైన భగవాన్‌తో చాలా గ్రంథాలను గూర్చిన చర్చ జరిగింది. అప్పుడు భగవాన్, మురుగనార్ వైపు తిరిగి అన్నారు, “చిట్టచివరకు వీటన్నిటి సారాంశము ఒకటే. అదియే సత్యము లేక సద్వస్తువు. గమ్యము ఒక్కటే, దారులు, దారులను చూపే పటాలు (మ్యాప్‌లు) లేదా, అనేక మార్గాలూ, పవిత్ర గ్రంథాలూ, వేదాలూ, వర్ణనలూ, ఉదాహరణలూ, ఉపమానాలూ ఉన్నవి కానీ, అన్నిటి సారాంశము ఒక్కటే. అదే సత్యము. ఈ మాటలతో ఎంతో సంతోషించి మురుగనార్ వెంటనే స్పందించారు. “అవును భగవాన్, అది నిజమే. ఆ గ్రంథాలన్నిటిని చదవడం, సమయం వృథా చేసుకోవడమే అని ఇపుడు నాకు అన్పిస్తుంది.” భగవాన్ వెంటనే ఆయనను సరిదిద్దారు. “నువ్వు ఆ విధంగా భావించనవసరము లేదు. వాటినన్నింటినీ చదువబట్టే, అన్నిటిలో చెప్పబడిన విషయాల సారము, సత్యాన్ని గురించే అని మనకు అర్థమయింది. మనము గనుక ఇవన్నీ చదివి ఉండకపోయినట్లయితే, మన మనసు, ఇంకా ఏదైనా గ్రంథంలో, ఏమైనా కొత్త విషయం చెప్పబడిందేమో అని ప్రలోభపెడుతుండేది. అందుకని చదవటం కూడా ప్రయోజనకారియే సుమా. ఆచారాలు, పూజలూ విషయంలో కూడా అంతే. అనేకరకాల సంప్రదాయాలు, పూజలూ ఉన్నప్పటికీ, వాటినన్నిటినీ చేయటానికి గల కారణము, ‘ఉన్నది ఒకే ఒక సత్యము’ అని గుర్తించటానికే. అయితే ఆత్మ సాక్షాత్కారానికి పూజలూ, పునస్కారాలూ అంత ముఖ్యమైనవేమీ కాదు”.

మరియొక రోజున మురుగనార్ హాలులోనికి వచ్చేసరికి, భగవాన్ ఎదురుగా, అనేక వరుసలలో పుస్తకాలు పెట్టబడి, వాటికి పూజ చేసినందుకు చిహ్నంగా పూలు అమర్చబడి ఉన్నాయి. మురుగనార్ భగవాన్‌కు సాష్టాంగపడి చిలిపిగా, హాస్యంగా దరహాసం చేశారు. భగవాన్ ఎందుకు నవ్వుతున్నావు అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశారు. మురుగనార్ భగవాన్‌ను చూపుతూ సత్యమే ఇక్కడ కూర్చుని ఉన్నది. ఈ గ్రంథాలన్నీ పై పొట్టు మాత్రమే. జనం సారాన్ని బదులు, పొట్టుని పూజించారు. కవి గాబట్టి, ఆయన వెంటనే ఈ ఉదాహరణను ఇచ్చారు. చాలా నాణ్యమైన చెరుకు గడలను తెచ్చి, చెరుకు రసంతీసి, దానిని చక్కెర స్ఫటికాలుగా మార్చారని ఊహించుకోండి. ఆ చక్కెరతో ఒక మానవ ఆకారం చెయ్యబడిందనుకోండి. మీరేమో ఆ చక్కెర, ఈ పుస్తకాలేమో ఆ చెరుకుపిప్పి. తియ్యటి చక్కెర అయిన మీకు పూజ చెయ్యకుండా, జనులు పిప్పిని గౌరవిస్తున్నారు. మురుగనార్ చిరునవ్వు నవ్వారు. భగవాన్ కూడా నవ్వారు.

మురుగనార్‌కు భగవాన్‌కు ఎంత సన్నిహితమైన అనుబంధం ఉన్నదంటే, భగవానే మురుగనార్ రాకకోసం ఎదురుచూసేవారు. ఆయన లోపలికి వచ్చి రాగానే, ఆయన ఇంకా భగవాన్‌కు నమస్కారం చేసుకోకుండానే, భగవాన్ ఏదో ఒక ప్రశ్న వేసేవారు. మురుగనార్ యొక్క జ్ఞానేంద్రియాలు, శ్రద్ధ ఎప్పుడూ భగవాన్‌పట్ల, ఆయన మాటల (వాక్కుల) పట్ల, లగ్నమై ఉండేవి. ఆయన ఆ ప్రశ్నను విని, నమస్కరంచేస్తూనే తొండలాగానో, ఊసరవెల్లిలాగానో తల ఎత్తి, సమాధానం చెప్పటం ప్రారంభించేవారు. భగవాన్ భక్తులు దీనిని బల్లి సంభాషణ అనేవారు. మురుగనార్ స్వయంగా నాకు చెప్పినదేమిటంటే, ఇలా సంభాషణ చాలాసేపు కొనసాగుతుండేదని, కానీ తాను పడుకునే సంభాషిస్తున్న సంగతి, తను గుర్తించేవాణ్ణి కాననీ. విశ్వనాధస్వామి ఆశ్చర్యపోయి, కనీసం పాత హాలులోకి వచ్చిన తర్వాతనైనా, ఆ బల్లిసంభాషణ మానెయ్యమనేవారు. జనం వింతగా చూస్తారని తెలుసును కానీ, నమస్కారం చేసుకునేటపుడు నేను సమాధానాలు ఇచ్చే విషయంలో ఎంత ఏకాగ్రతతో ఉండేవాడినంటే, నాకు నేను నేలమీద పడుకుని ఉన్నానన్న స్పృహే ఉండేదికాదు. నేను పడుకుని ఉన్నపుడు నా స్వరం స్పష్టంగా విన్పించక, భగవాన్ శ్రమ పడవలసి వచ్చేది. ‘భగవాన్ నన్ను ప్రశ్నించారు, ఆయనకు నేనుసమాధానం చెప్పాలి,’ అనే ఒక్క విషయం తప్ప, మిగిలిన సంగతులేవీ నాకు పట్టేవికావు.

కొన్నిసార్లు, ఆయన భగవాన్ ముందు కూర్చుని ఉన్నపుడు, కవిత్వం దానికదే వచ్చేసేది, భగవాన్ కొండపైకో, లేక గోశాలకో వెళ్లేవారు. ఆయన తిరిగి వచ్చేసరికి, మురుగనార్ ఇంకా కూర్చుని వ్రాయటంలో మునిగిపోయి ఉండేవారు. భగవాన్

ఆయనను ఒక ప్రశ్న అడిగి, సమాధానం కోసం వేచి ఉండేవారు. భగవాన్ మురుగనార్ ప్రక్కనే నిలబడే వారు, మురుగనార్ వ్రాతపనిలో నిమగ్నమైపోయి, తను భగవాన్‌తో మాట్లాడుతున్నానన్న స్పృహలేకుండా, (భగవాన్‌ను గమనించకుండా) ఆయన ప్రశ్నలకు సమాధానాలు చెబుతుండేవారు. మిగిలినవారు దిగ్భ్రాంతి చెందే వారు, ఎందుకంటే హిందూ ఆచారం ప్రకారం గురువుగారు తన ఎదురుగా నిలబడి ఉండగా శిష్యుడు కూర్చుని ఉండడమనేది అమర్యాద సూచకం. అంతేగాక పాతాళలింగంలోని అనుభవం తర్వాత భగవాన్ ఎక్కువసేపు అదేపనిగా నుంచోలేకపోయేవారు.

రమణాశ్రమంలో ఉంటున్న వారుగానీ, అక్కడ భోంచేస్తున్న వారు గానీ ఆశ్రమానికి ఏదో ఒక విధంగా సేవచెయ్యాలి అనే నిబంధన ఉండేది. మురుగనార్ యాజమాన్యానికి సహాయం చెయ్యాలనుకునే వారు కానీ, శాయశక్తులా ప్రయత్నించినా కూడా, ఆయన చెయ్యలేకపోయేవారు. ఎందుకంటే ఆయన తీవ్రంగా సాధనలో మునిగిపోయి ఉండేవారు. అందుకని మురుగనార్ ఆశ్రమాన్ని వీడి, ప్రక్కనే ఉన్న పల్లాకొత్తులో ఎవరి పంచలోనో తలదాచుకుని, శరీరాన్ని నిలబెట్టుకోవటానికి బిచ్చమెత్తుకునేవారు. భగవాన్ ఎల్లవేళలా మురుగనార్‌పై తన అనుగ్రహాన్ని కురిపించేవారు కానీ, ఆశ్రమ యాజమాన్యం వ్యవహారాల్లో ఏమాత్రం జోక్యం చేసుకునేవారు కాదు.

చాలా దినాలలో, ఆయనలో కవితావేశం ఎంత తీవ్రంగా ఉండేదంటే, ఆయన వ్రాసేపనిలో మునిగిపోయి, తాను భోజనం చెయ్యలేదని కానీ, భిక్షకు వెళ్ళే సమయం దాటిపోతుందని కానీ, గమనించేవారు కాదు. ఒకరోజు ఆయన పూర్తిగా నిరాహారిగా ఉండి కూడా, ఆ విషయాన్ని ఆయన గుర్తించనే లేదు. ఆరోజు మహాశివరాత్రి పర్వదినము. ఆ రోజు హిందువులు రోజంతా కటిక ఉపవాసం చేస్తారు. మర్నాడు ఆయన భగవాన్ వద్దకు వెళ్ళినపుడు, భగవాన్, ఆయనతో పాటు గిరిప్రదక్షిణకు రమ్మని సైగచేశారు. మురుగనార్ ఉత్సాహంతో భగవాన్‌ను అనుసరించారు. కానీ రెండురోజుల ఉండి పూర్తిగా ఆహారం తీసుకోకుండా ఉండడం వల్ల, ఆకలితో ఉండడం వల్ల త్వరగా అలసిపోయారు. కొంతదూరం వెళ్ళిన తర్వాత, భగవాన్, మురుగనార్ ముఖం చూసి, ఆయన అలసిపోయినట్లుగా గమనించి కరుణతో మురుగనార్‌ను, "ఏమి, నిన్న నువ్వు భోజనం చెయ్యలేదా? శివరాత్రి అని ఉపవాసం ఉన్నావా?" అని అడిగారు. అప్పుడు మురుగనార్‌కు తెలిసింది ఆ ముందురోజు శివరాత్రి అని. "అవును భగవాన్. నేను తినలేదు" అన్నారు. గిరిప్రదక్షిణ అయిన పిమ్మట భగవాన్, మురుగనార్‌ను తనతోపాటు వచ్చి రమణాశ్రమంలో కడుపునిండా భోంచెయ్యమన్నారు. వంటగదిలోనికి వెళ్ళి మురుగనార్‌కు కడుపునిండేటట్లుగా భోజనం వడ్డించేటపుడు దగ్గర ఉండి చూడమని, భగవాన్ పరిచారకులొకరిని వంటగదిలోకి పంపించారు. మురుగనార్ ఈ సంఘటనను నాకు తెలిపేటప్పుడు తన గురువుగారు తనపట్ల చూపిన ఆసక్తినీ, శ్రద్ధనూ, తలచుకుని భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు.

కానీ అలా శ్రద్ధతో ఆయనకు ఆశ్రమంలో భోజనం పెట్టించటం ఆ ఒక్కసారే జరిగింది. చాలా సంఘటనల్లో దానికి వ్యతిరేకంగా జరిగేది. ఒకరోజు సబ్‌రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్ నాతో ఇలా చెప్పారు. అది ఆశ్రమం వారు అచ్చువేసిన ఒక వ్యాసములో కూడా ఉన్నది. నారాయణ అయ్యర్, మరొక భక్తులు టి.పి.రామచంద్రఅయ్యర్, కలసి, భగవాన్, అరుణాచలునిపై వ్రాసిన ఎనిమిది పద్యాలలో, ఆరో పద్యము యొక్క వివరణ కోసం భగవాన్ వద్దకు వెళ్ళారు. వాళ్ళు ఆ పుస్తకము తెరచి పట్టుకుని హాలులోనికి ప్రవేశించేటప్పటికి, మురుగనార్ భగవాన్‌కు నమస్కరించి, టౌన్‌లోనికి భిక్షకు వెళ్ళటానికి బయలుదేరుతున్నారు. పరిచారకులలో ఒకరు, "భగవాన్ ఇప్పుడే పనసపండును రుబ్బాము. మధ్యాహ్న భోజనంలో పిండివంట (పాయసం) కని. ఈ రోజు ఆయన తల్లిగారి ఆబ్దికమని మురుగనారే ఈ రోజు భిక్షకు డబ్బు కట్టారు. అటువంటిది ఆయనే టౌన్‌లోనికి బిచ్చానికి వెళ్ళటం మాకెంతో బాధాకరంగా ఉన్నది," అన్నారు. భగవాన్ ముఖంలో భావాలు మారిపోయినవి. ఆయన ప్రశాంతంగా అన్నారు, "అవును. మురుగనార్ ఇక్కడే ఉండి, మనతో పాటు భోజనం చెయ్యమని ఆహ్వానించవలసిన బాధ్యత ఎవరిది? అది ఆశ్రమ యాజమాన్యానిది. మురుగనార్ బిచ్చమెత్తుకొనడానికి వెళ్ళిపోయారు." ఇది వ్రాయటంలో ఉద్దేశ్యము, ఆశ్రమయాజమాన్యం యొక్క కాఠిన్యాన్ని ఎత్తి చూపటం కాదు. కానీ భగవాన్ మురుగనార్ యొక్క ఆధ్యాత్మిక స్వేచ్ఛకోసం ఎంత శ్రద్ధ తీసుకునేవారో తెలుపడానికి. ఆయన భోంచేశారా?

లేదా? ఆయనకు భౌతికమైన సౌకర్యాలు అమరినవా? లేవా? అనేది అనవసరం. భగవాన్ శ్రద్ధ అంతా గూడా... మురుగనార్ నియమనిష్టలు కల్గిన నిరాడంబర జీవితం గడుపుతూ, సత్యంలో స్థితుడై, (శాశ్వతంగా నిలిచిపోయి) ఉండేటట్లు చూడడం పైనే ఉండేది.

మురుగనార్, భగవాన్ అనే సత్యానికి, సాధకులమైన మన అజ్ఞానానికీ మధ్యన ఒక గొలుసులాంటి వారు. మురుగనార్ అనే సజీవమైన ఉదాహరణ లేకపోతే, భగవాన్ పెట్టిన లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమనుకునే వాళ్ళము. మురుగనార్ తన జీవితమంతా, నిరాడంబరంగా, పవిత్రంగా గడిపి ఆత్మవిచారణ ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందారు. ఆయనే గనుక అలా జీవించి ఉండనట్లయితే, మనమెంతగా మన తెలివితేటల్ని ఉపయోగించి భగవాన్ యొక్క ఆత్మవిచారణ అనే సూటిమార్గమును అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినా, అసలు ముఖ్యమైన విషయాన్ని గ్రహించలేకపోయేవాళ్ళం. మురుగనార్ ఆ బోధగానే జీవించి (అంటే ఆ బోధను తు.చ. తప్పకుండా జీవితంలో పాటించి), తనూ మనలాంటి వాడే అయినప్పటికీ, పవిత్రంగా జీవితాన్ని, పూర్తిగా గురువుగారి ఉపదేశానికి అంకితం చేసి గడపటం అసాధ్యమేమీ కాదని, తన జీవితం ద్వారా మనకు చూపించారు. కావుననే గురువుగారు ఆయనపై అనుగ్రహ వర్షం కురిపించారు.

మురుగనార్, భగవాన్‌ల మధ్య గల సాన్నిహిత్యాన్ని తెలిపే సంఘటనలు మరికొన్ని ఉన్నవి. వాళ్ళిద్దరి మధ్యన కఠినమైన క్రమశిక్షణే కాకుండా, హాస్యం కూడా చోటు చేసుకునేది. మురుగనార్, భగవాన్, తక్కిన సాధువులతోపాటు ఉదయానే, కూరగాయలు తరిగేవారు. ఒకరోజు వారు ఆకుకూర (బచ్చలికూర) తరుగుతున్నారు. భగవాన్, వేర్లను కోసేసి, కాండాన్నీ, ఆకులనూ విడివిడిగా తరిగేవారు. ప్రతి భాగాన్నీ విడివిడిగా వండి, ఏ భాగమూ వృథా అవకుండా చూసేవారు. భగవాన్ తాము కొండపైనుండే రోజుల గురించీ, ప్రత్యేకించి కీరపాటి, (తోటకూర అవ్వ) గురించీ మాట్లాడడం ప్రారంభించారు. ఆమెను కీరైపాటి, తోటకూర అవ్వ అని పిలిచే వారు. ఎందుకంటే ఆమె అనేకరకాల ఆకుకూరలను కోసుకుని వచ్చి వండుతుండేది. ఆమెకు ఆ కొండపైగల ప్రతిమొక్క పేరు, దానిలోని పోషక పదార్థాలూ, దాని ఉపయోగం గురించి చాలా పరిజ్ఞానం ఉండేది. భగవాన్ చెప్పటం ముగించాక, మురుగనార్ తరిగినవి సరిగ్గా లేనట్లు గుర్తించారు. భగవాన్ డొంకతిరుగుడుగా అన్నారు. కూరను తరగటంలో నీ నేర్పు, కుటుంబం నిర్వహించడంలో నేర్పులాగానే గొప్పగా ఉంది అన్నారు. మురుగనార్, (భార్యను) కుటుంబాన్ని వదిలేసి వచ్చేశారు గనుక, భగవాన్ మాటలకు, ఆయన మనసు గాయపడింది. ఆయన వెంటనే ఒక పద్యం వ్రాసి భగవాన్ ముందుంచారు. భగవాన్ దానిని చదువుకుని బాగా నవ్వుకున్నారు. అక్కడున్నవారంతా, భగవాన్‌ను, "మీరెందుకు నవ్వుతున్నారు?" అని అడిగారు. భగవాన్ ఆ పద్యాన్ని చదివారు, "ఓ రమణా! మీరు అత్యంత సామర్థ్యము గల వ్యక్తి. అవును నిజమే. మరి మీరు మీ అంత సామర్థ్యము గల కన్యను వివాహము చేసుకుని కాపురము ఎందుకు పెట్టలేదు? మీకు చక్కటి ఆదర్శవంతమైన కుటుంబము నిర్వహించుట సులభమైన పని అయినప్పుడు, గోచీపెట్టుకుని బిచ్చమెత్తుకుంటూ తిరగడమెందుకు?" భగవాన్ హృదయపూర్వకంగా నవ్వేశారు. మిగిలినవారంతా ఆయనతో శృతి కలిపారు.

ఒకప్పుడు ఆశ్రమంలో ఒక మూలికా తైలం తయారుచెయ్యబడుతుండేది. అది పూర్తవగానే, దానిని ఒక వెడల్పాటి గిన్నెపై గుడ్డను పరచి వడకట్ట వలసి ఉన్నది. భగవాన్ గుడ్డను బిగించి పట్టుకుని మురుగనార్‌ను గరిటతో నూనెను దానిపై పొయ్యమన్నారు. భగవాన్ మూలికల సంగతులు చెబుతూ, కొన్ని మూలికలు, ఒక వ్యక్తిని ఒకచోట కనబడకుండా అదృశ్యమయ్యేలా చేసి వేరొక చోట ప్రత్యక్షమయ్యేటట్లు చేయగలిగే శక్తి కలవికూడా ఉంటవి అని చెబుతున్నారు. భగవాన్ చెప్పే కథలను మైమరచి వింటూ, పాత్ర నిండిపోయింది కూడా చూసుకోకుండా నూనె పోస్తూనే ఉన్నారు మురుగనార్. భగవాన్ చురుగ్గా గమనిస్తూనే ఉన్నారు. అందుకని మురుగనార్‌ను మందలించారు. "ఆపు! నువ్వేం చేస్తున్నావు? నూనెను పారబోస్తున్నావు. నువ్వు ఎంత అజాగ్రత్తగా ఉన్నావు?" అని. మరల ఆయనను ఊరడించడానికి బుజ్జగించే విధంగా, "ఇలారా, క్రింద ఒలికిన నూనెను నెత్తికి రాసుకో. నీకింత మంచి ఖరీదైన మూలికా తైలాన్ని ఎవరిస్తారు? కానియ్యి. నీ మాడుపైన రాసుకో," అన్నారు. మురుగనార్ దృష్టి అంతా భగవాన్ పైనే నిమగ్నమై ఉంది. అందుకని చేతిలో నేలపై నూనె

తీసుకునే బదులు బురద తీసికొంటూ ఉన్నారు. (నేలవైపు చూడకుండా) భగవాన్ వెంటనే అన్నారు, "ఏయ్! ఆపు. నేను నిన్ను నూనె తలకి రాసుకోమన్నాను. బురదని కాదు," అన్నారు. ఇదే గురు-శిష్యుల సంబంధం. గురువుగారి అనుగ్రహం అత్యున్నతమైన జ్ఞానాన్ని మేల్కొల్పటమే కాకుండా, భక్తుల సంక్షేమాన్నికూడా చూస్తూ ఉంటుంది.

1926లో మురుగనార్, భార్యమీనాక్షిని చెన్నైలో వదలి ఆశ్రమంలో జేరడానికి వచ్చేశారు. మీనాక్షి చదువుకోలేదు కాని చాలా అద్భుతమైన వ్యక్తి. ఆమెకు తన కాళ్ళమీద తను నిలబడే శక్తి లేదు. (తనను తాను పోషించుకునే శక్తి లేదు) ఈ సంఘంలో ఎలా జీవించాలో తెలియక కొన్నాళ్ళు తండ్రి ఇంట్లో ఉంటూ, మళ్ళీ తిరువణ్ణామలైకు వచ్చి, భర్తను వచ్చి తనతో ఉండమని ప్రాధేయపడుతూ ఉండేది. అలా జరిగినప్పుడల్లా, మురుగనార్ కొండపైకి వెళ్ళి కనబడకుండా పొయ్యేవారు. భగవాన్‌కు కూడా, ఆయనను వెతకడం కష్టమైపోయేది. ప్రతిసారీ ఆయన వెనక నలుగురు మనుషుల్ని వెతకటానికి పంపవలసి వచ్చేది. మూడు రోజులు పూర్తి అయితే గానీ, ఆయనను వెనుకకు తీసుకురావడం జరిగేదికాదు. చివరగా, భగవాన్ మురుగనార్‌తో, "నీవు మీనాక్షి ఇష్టప్రకారము కలసి ఉండు," అన్నారు. మురుగనార్ ఎంత మొండిగా ఉన్నారంటే, ఆయన ఇంకొకసారి కొండపైకి పారిపోయారు. అందుకని మీనాక్షిని ఓదార్చడానికి వేరే మార్గం కనుగొన్నారు భగవాన్. ఆయన మీనాక్షి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. నేను ఆమెను కలసినపుడు, ఆమె భగవాన్‌తో తనకు గల అనుభవాలనెన్నింటినో చెప్పారు. వాటినన్నిటినీ వ్రాసి ఇమ్మని ప్రార్థించగా, ఆమె తమిళంలో వాటిని ఒక నోటుపుస్తకంలో వ్రాసి ఇచ్చారు. అవి ఇప్పుడు ఆశ్రమంలోని ప్రాచీన పత్రాలు భద్రపరిచే హాలులో ఉన్నవి.

ఆ పుస్తకంలో వ్రాయబడిన ఒక సంఘటన, ప్రత్యేకించి నా హృదయాన్ని కదిలించింది. భగవాన్ మీనాక్షిని సంతోషంగా ఉండమని చెప్పే ప్రయత్నంలో, "మీనాక్షీ నీకు నేనేమి చేయగలను?" అని అడిగారు. మీనాక్షి ఆయనకు తన చిరిగిపోయిన చీరను చూపించి, "భగవాన్, నా చీరను చూడండి. నేనేమి కోరుకుంటాను. నాకు కట్టుకోవడానికి బట్ట, తినడానికి తిండి ఉంటే చాలును. నా భర్త నాగురించి పట్టించుకోనందు వలన, నాకు అవి కూడా లేకుండా పోయినవి". ఆ మాటలకు భగవాన్ బాగా చలించి, ఆమెతో ఇలా అన్నారు, "మీనాక్షీ! నీకు నేను హామీ ఇస్తున్నాను. నీ జీవితాంతం వరకు నీకు ఈ రెండింటికి, అనగా తిండికి, బట్టకు లోటు ఉండదు". భగవాన్ మాటలతో హామీ ఇచ్చి ఊరుకోలేదు. ఆయన కుంజుస్వామిని, ఈశాన్య మఠాధిపతి వద్దకు వెళ్ళి, ఒక చీరను అడిగి తీసుకుని రావలసినదిగా పంపారు. గోచీపెట్టుకున్న ఒక గురువుగారు, తనకు తానుగా ఎవరినీ ఏమీ కోరనివారు, ఇంకొక సన్యాసిని, వేరొక వ్యక్తి భార్యకు ఇవ్వటానికి, చీర అడిగి రమ్మని పంపారు. ఆ తెచ్చిన చీరను ఆమెకు ఇస్తూ, మరొకసారి ఆమెకు హామీ ఇచ్చారు, "మీనాక్షీ, నువ్వు సంతోషంగా ఉంటావు. నీ జీవితాంతము నీకు తిండి, బట్ట లభిస్తాయి".

1960 దశకంలో ఈ సంగతి ఆమె నాతో చెప్పినపుడు నేనామె పట్ల శ్రద్ధ తీసుకోసాగాను. ప్రతి సంవత్సరము నేనామెకు రెండు చీరలు పంపేవాడిని. ఆమె ఆధ్యాత్మికంగా ఆసక్తి ఉన్న వ్యక్తి కాదు. ఆమె చెన్నైలోనే ఉండడానికి ఇష్టపడ్డారు. అందుకని నేను ఆమెకు ఏడు ఇళ్ళలో, వారంలో ఒక్కొక్క రోజు ఒక్కొక్కరి ఇంటిలో భోజనము పెట్టేటట్లు ఏర్పాటుచేశాను. ఆమె అంత్యదశలో ఉన్నారని తెలిసినపుడు, నేను ఆమెతో కొంత సమయం గడుపుటకు ఆమె వద్దకు వెళ్ళాను. ఆమె నన్ను చక్కగా దీవించారు. "మీనాక్షి అమ్మా! ఎలా ఉన్నారు మీరు?" అని నేనామెను అడిగాను. ఆమె పొట్ట బాగా ఉబ్బిపోయి ఉంది. ఆమె అన్నారు, "నేను చాలా సంతోషంగా ఉన్నాను". నేను నమ్మలేకపోయాను. "భగవాన్ ఎల్లవేళలా నాతో ఉన్నారు. ఆయన ఇచ్చిన హామీని, నీద్వారా పూర్తిచేశారు. నాకు తిండికీ, బట్టకీ లోటులేకుండా చేశారు. గణేశా, భగవానే దేవుడు," అన్నారు ఆమె. మురుగనార్ భార్యగా ఆమె సుఖపడి ఉండకపోవచ్చు. భగవాన్ పెంపుడుబిడ్డగా ఆమె చివరి వరకూ సంతోషంగానే ఉన్నారు. ఆమెతో మాట్లాడగలగటం, ఆమెకు కొద్దిపాటి సేవ చెయ్యటం నా అదృష్టంగా భావిస్తాను.

భగవాన్ అంతిమదినాలలో, మురుగనార్, రోజూ ఒక పద్యం రాసి చివరగా, భగవాన్ మీరు నూరేళ్ళు జీవించాలి అనివ్రాసేవారు. మురుగనార్, పద్మవెంకటరామన్ అనే భక్తురాలికి, శిక్షణ ఇచ్చి, భగవాన్ సన్నిధిలో వీటిని ప్రతిరోజూ పాడేటట్లు చేశారు. "ఉచ్ఛారణ విషయంలోనూ, తను వ్రాసిన మాటలు ఏమాత్రమూ మార్చకుండా ఉండే విషయంలోనూ మురుగనార్ చాలా

గట్టిగా ఉండేవారు", అన్నారు ఆమె. ఒకరోజున ఆమె పాడిన పాటలో ఈ మాటలు ఉన్నవి. "జ్ఞానభండార నాయక" అని. దాని అర్థం తమిళంలో, "జ్ఞానమనే కోశాగారానికి అధిపతి" అని. భావోద్వేగంతో పాడేటప్పుడు ఆమె అనుకోకుండా, 'భండార' అనే పదం బదులు 'భోకిషమ్' అనే పదాన్ని పలికారు. దాని అర్థం కూడా కోశాగారమనే. పాట పాడడం పూర్తి అవగానే భగవాన్ ఒక పరిచారకుణ్ణి, "ఆ మాటను మురుగనారే ఆ పాటలో ఉపయోగించారా?" అని. ఆమెను కనుక్కొని రమ్మని పంపించారు. భగవాన్‌కు మురుగనార్ శైలి గురించి ఎంతో బాగా తెలుసుకనుక, ఆ పదాన్ని మురుగనార్ వాడి ఉండరని ఆయనకు తెలుసును. ఆ గురుశిష్యుల అనుబంధం, ఎలాటిదంటే ఇద్దరిదీ ఒకటే హృదయంగా ఉండేది (Same Heart of Being)

భగవాన్ శరీరాన్ని వదలివేసే సమయం ఆసన్నమయినదని భక్తులందరూ ఎంతో కలవరపాటుతో ఉన్నారు. ఆయన భౌతికంగా తమ ఎదుటలేకపోతే వాళ్ళు ఏమి చెయ్యాలో వాళ్లకు తెలియలేదు. అందుకని మురుగనార్ నేతృత్వంలో ఒక బృందాన్ని ఆయన వద్దకు పంపించారు. ఆయన సందేశాన్ని అడగమని, భగవాన్‌కు వాళ్ళు ఏమి అడుగుతున్నారో తెలియదా? "బోధలను ఆచరణలో పెట్టండి" ఇవే ఆయన ఆఖరి పలుకులు. మురుగనార్, భగవాన్ నుండి ప్రత్యక్షజ్ఞాన బోధ వెలుపలకు వచ్చేటట్లు చేశారు. ముందు చెప్పిన మూడుగ్రంథాల ద్వారా, ఆయనే భగవాన్ అంతిమ సందేశము, "బోధలను ఆచరణలో పెట్టండి"ని బయటకు తీసుకుని వచ్చారు. నేను ఈదేహాన్ని కాదు అనే విషయంపై ఆయన ఎన్నో పద్యాలు వ్రాశారు. కానీ భగవాన్ మరణించినపుడు, ఆయన దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు.

1956నుండి, నేను మురుగనార్‌కు చాలా దగ్గరగా ఉండేవాడిని. నేను నా డిగ్రీ పూర్తిచేసుకుని రెండేళ్ళపాటు ఆశ్రమంలోనే ఉన్నాను. నేను మురుగనార్, దేవరాజ ముదలియార్, మునగాల వెంకట్రామయ్య, ఇంకా సబ్‌రిజిస్ట్రార్ నారాయణఅయ్యర్ లాటి పాత భక్తులను గమనించాను. వారి పవిత్రమైన జీవనాన్ని చూచి నేను బాగా ప్రభావితమయ్యాను. నేను 1960లో తిరిగివెనుకకు వచ్చినపుడు, పాతభక్తుల కొరకు నన్ను నేను అంకితం చేసుకోవటానికి ఇది నాకు బాగా తోడ్పడింది. వాళ్ళు ఎంత లోతుగా బోధను అర్థం చేసుకున్నారో, వాళ్ళ అవగాహన ఎంత లోతైనదో నేను గ్రహించసాగాను. మురుగనార్ ఇంకా బిచ్చమెత్తుకుంటూ ఉన్నారు. టౌన్‌కు వెళ్ళకపోయినా, మధ్యాహ్న భోజనానికి ముందుగా వచ్చి, వంటగది ముందు, తనపై కండువాను చాపి నుంచునేవారు. వంటవారు కొద్దిగా భోజన పదార్థాన్ని అందులో ఉంచేవారు. నేను ఆయన కదలికలను గమనించాను. అవి మౌనంగా, సుందరంగా ఉన్నవి. అప్పట్లో నా దగ్గరొక చిన్న కెమెరా ఉండేది. నేను ఆయనను 'స్వామీ' అని పిలిచాను. ఆయన వెనుకకు తిరిగి నావైపు చూడగానే నేను ఫోటో తీశాను. మురుగనార్ నన్ను ఆశీర్వదించారు కానీ, తర్వాత గట్టిగా మందలించారు. "ఇంకెప్పుడూ అలా చెయ్యకు," అని. మహాత్ముల తిట్లు, వారి ఆశీర్వాదాల కంటే ఎక్కవ శక్తివంతమైనవి అని విశ్వనాధస్వామి నాతో చెప్పారు.

మురుగనార్ భగవాన్ సమాధి వద్దకు వచ్చినపుడు, ఆయన ధ్యానంలో గాఢంగా మునిగి ఉండడంచేత, ఆయన కదలికలు కవిత్వంలాగా ఉండేవి. మురుగనార్ స్వామీ, మీరిక్కడకు వచ్చి సాష్టాంగపడేటప్పుడు, మీకు ఎటువంటి ఆలోచన (ఉద్దేశం) ఉంటుంది? అని నేను ఆయనను ఒకసారి అడిగాను. "అక్కడ ఉన్నది భగవాన్ ఒక్కరే. వేరే ఏమీ లేదు," అన్నారాయన. ఆయనకు ఉన్నది కేవలం భగవానే. మురుగనార్ లేరు. రమణాశ్రమము లేదు. సాష్టాంగనమస్కారమూ లేదు. భగవానే సర్వస్వము, ఇతరమేమీ లేదు.

అప్పటికి, ఆయనయొక్క గొప్ప రచనలైన, భగవాన్‌చే సరిదిద్దబడి, ఆమోదించబడిన రెండు పుస్తకాలు 'రమణ సన్నిధిమురై', 'గురువాచక కోవైల' గురించి నాకు తెలియదు. నేను మురుగనార్‌ను ఆశ్రమానికి తీసుకుని వచ్చి, ఆయనను, కొంతమంది స్నేహితులతో కలసిచూసుకుంటున్నాను. నా సోదరి ఆయన పాటలను కొన్నిటిని పాడుతుండేవారు. ఆయన, ఆమెను గురువాచకకోవైలోనుండికొన్ని పాటలను పాడమనే వారు. అవి వినగానే ఆయన కరిగి కన్నీరు కార్చేవారు. ఎందుకు కన్నీరు కారుస్తున్నారని అడుగగా, ఆయన ఇలా అన్నారు, "నేను భగవాన్ సన్నిధిలో ఉండగా, ఒకరోజు ఆయన ఒక చిన్న ఆడపిల్లను తదేకంగా చూస్తున్నారు. మీనుండి అనుగ్రహాన్ని ఆశీస్సులను పొందిన ఆ పాప ఎవరు?" అని నేనడిగాను.



ఆత్మానందంలో మురగనార్

ఆయన ఇలా బదులు ఇచ్చారు. "నీకు తెలియదా? ఇది మన లక్ష్మి". మురుగనార్ తిరిగి కన్నీరు కార్చి అన్నారు, "భగవాన్ మన అనే పదాన్ని ఉపయోగిస్తారు. అది ఆధ్యాత్మిక అనుభవాన్ని పంచుకోవడమే".

నేను ఆయనను, 'రమణ సన్నిధిమురై' గురించి ఇంకొన్ని వివరాలు చెప్పమన్నాను. రమణసన్నిధిమురై ప్రైవేటుగా అచ్చు వేయించబడినపుడు రమణాశ్రమ యాజమాన్యము దానిని అమ్మటానికి నిరాకరించింది. దానికి వ్యతిరేకంగా అనేక సంఘటనలు జరిగాయి. వాటిగురించి నీకు తెలియకపోవడమే మంచిది. కానీ నీకొక విషయం చెప్పదలచాను. ఒకరోజు భగవాన్‌కు నమస్కరిస్తున్నపుడు నేను బాగా అలజడి చెంది ఉన్నాను. నేను లేచి నుంచున్నపుడు, భగవాన్ అన్నారు, 'దిగులు చెందకు. దానిని మనమే అచ్చు వేయించుకుందాము'. నేను ఆఫీసుకు పరుగెత్తుకుని వెళ్ళి, 'రమణసన్నిధి మురై' కాపీ ఒకటి ఏమైనా దొరుకుతుందేమోనని ప్రయత్నించాను కానీ దొరకలేదు. అది (లైబ్రరీ) గ్రంథాలయంలో కూడా లభ్యం కాలేదు. నేను చెన్నైలో ఉన్న కొందరు భక్తులతో మాట్లాడి, 'రమణసన్నిధిమురై' ప్రతినొకదానిని తెప్పించి, ముద్రింపచేశాను. నేను దానిని మురుగనార్‌కు బహుకరించినపుడు, కృతజ్ఞతతో ఆయన కళ్ళు చెమర్చాయి. ఆయన, "చూడు భగవాన్ తన మాటను నిలబెట్టుకున్నారు" అన్నారు. అది ఆయన నిర్యాణం చెందడానికి కొన్ని వారాలముందు జరిగింది. అటు పిమ్మట, ఆయన గురువాచకకోవై (గురువుగారి ఉపదేశాన్ని కలిగియుండటమే) గురించి చెప్పారు. అది గురువుగారి ఉపదేశాలను కలిగి యుండడమే కాక, ఆయనచేత సరిదిద్దబడి, గ్రంథం పేరు కూడా ఆయన చేతనే నిర్ణయించబడింది. చాలా ఉత్సాహంతో, 'గురువాచకకోవై' కూడా, ఆశ్రమము యొక్క విలువైన ప్రచురణగా వెలువడింది. భగవాన్ హామీ, "దానిని మనమే ముద్రించుకుందాము" అనేది విజయవంతంగా నెరవేరినందుకు, నా హృదయం ఆనందంతో పొంగిపోయింది.

మురుగనార్ చనిపోయేటప్పుడు, డాక్టర్లు ఆయన కోమాలో (తెలివిలేని స్థితిలో) ఉన్నట్లు చెప్పారు. డాక్టర్ హ్యూగోమెయర్, "ఆయన శ్వాస ఎప్పుడైనా ఆగిపోవచ్చును. వెంటనే ఇక్కడకు రండి," అని కబురుపెట్టారు. అప్పుడు తెల్లవారుఝామున మూడు గంటలయింది. నేను మురుగనార్‌కు చాలా దగ్గరగా నుంచున్నాను. ఆయన కోమాలో ఉన్నారు. మా మాటలకు ప్రతిస్పందించరు అన్నారు డాక్టర్లు. కాదు నేను అరుణాచల అక్షరమణమాల పాడతాను అన్నాను గట్టిగా, వాళ్ళు అదేపనిగా అభ్యంతరం పెట్టినా, నేను ఆయనకు దగ్గరగా వంగి, "స్వామీ, నేను అక్షరమణమాలై పాడదలుచుకున్నాను," అన్నానాయన చెవిలో మెల్లగా. ఆ శరీరం నిశ్చలంగా ఉంది. కనుబొమలు మాత్రం పైకి లేచాయి. దానిని హ్యూగో, మిగిలిన డాక్టర్లు కూడా చూశారు. వాళ్ళు చెప్పింది గూడా నిజమే అయి ఉండవచ్చును. ఆ శరీరం కోమాలో ఉంది. కాని హృదయం మాత్రం పారవశ్యస్థితిలో ఉండి,కరుణతో ప్రతిస్పందించి కనుబొమలను కదిలించింది. మేమందరం అక్షరమణమాలను ఆపకుండా పాడాము. ఒకానొక పారవశ్యస్థితిలో మురుగనార్ అరుణాచలునిలో లీనమైనారు. మేము ఆయన శరీరాన్ని తీసుకొని వెళ్ళి సమాధి చేశాము. ఆయన సమాధి అరుణాచలానికీ, భగవాన్ పాతహాలుకీ మధ్యన ఉన్నది.

మనం ఆయనను సగౌరవంగా గుర్తుంచుకోవాలి ఎందుకంటే, మనం సాధనచేసి అనుభవిస్తున్న ఆత్మానుభూతికి ఆయన ఎప్పుడో సజీవమైన ఉదాహరణగా నిలచారు. మురుగనార్ కథ ఎప్పటికీ అంతమవ్వదు. ఎందుకంటే ఆయన శాశ్వతుడు కనుక. ఈ ఆత్మజ్ఞానమనేదే అమరమైనది. దానికి మొదలు లేదు. చివర లేదు.

జగదీశశాస్త్రి



భగవాన్ ఎల్లప్పుడు అన్ని జీవులనూ ఎంతో గౌరవంగా సంబోధించేవారు. ఆఖరికి జంతువులనూ, చెట్లనూ కూడా. ఆయన భక్తులను కూడా సామాన్యంగా వాళ్ళ మొదటి పేరు (పేరులో మొదటి భాగం) పెట్టిగానీ, వేరు విధంగా కానీ పిలిచేవారు కాదు. అయితే దానికి కూడాకొన్ని మినహాయింపులు ఉన్నవి. వానిలో ఒకటి, జగదీశశాస్త్రి. ఆయనను భగవాన్ 'జగదీశా' అని పిలిచేవారు. భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా, జగదీశశాస్త్రి అతి చిన్న వయసులో ఆయన వద్దకు వచ్చారు. భగవాన్ ఆయనను బాగా ఇష్టపడేవారు.

భగవాన్‌కు జగదీశశాస్త్రికీ సంబంధించి రెండు ముఖ్య సంఘటనలు ఉన్నాయి. శాస్త్రి, ఆయన భార్య, రమణాశ్రమము ఎదురుగా కుటీరాన్ని నిర్మించుకుని, చాలా ఆనందంగా జీవిస్తుండగా, ఆయనకు ప్రమాదకరమైన జీర్ణాశయకాన్సరు ఉందని గుర్తించారు డాక్టర్లు. కుటుంబసభ్యులు, మృత్యువును తప్పించలేరని తెలిసి, వారిని వారు సమాధానపరచుకున్నారు. భగవాన్ భక్తుడే అయిన, ఆ ఊరిలోని వైద్యుడు, "కొన్ని గంటలలోనే శాస్త్రి మరణించవచ్చును" అని చెప్పారు. చిట్టచివరి సమయంలో శాస్త్రి భగవాన్‌ను ప్రార్థించారు. ఆయన సంస్కృతకవికనుక, భగవాన్ మహిమనూ, శక్తినీ కొనియాడుతూ, ఆయన అనుగ్రహాన్ని అర్థిస్తూ 'ప్రపత్తి అష్టకమ్' పేరుతో,ఎనిమిది పద్యాలు వ్రాశారు. భగవాన్ ఎంతగా చలించిపోయారంటే, ఆయన శాస్త్రిని కాపాడారు. ఇది 1945లో జరిగింది. జగదీశశాస్త్రి పండుముదుసలి అయ్యేవరకు జీవించి 89 ఏళ్ళ వయసులో 1983లో మృతిచెందారు.

రెండవసంఘటన మరికొన్ని సంవత్సరాల తర్వాత జరిగింది. జగదీశశాస్త్రి కుటీరము ఒక పాశ్చాత్యదేశీయుని స్థలంలో ఉన్నది. దురదృష్టవశాత్తు, ఆ పాశ్చాత్యుడు ఆర్థికంగా కుంగిపోయి, ఆ స్థలాన్ని అమ్మవలసి వచ్చింది. ఆ విదేశీయుడు వారు ఆ కుటీర నిర్మాణానికి పెట్టిన ఖర్చుని, తాను ఇస్తానని, వారిని ఇల్లు ఖాళీ చేయవలసిందని కోరారు. జగదీశశాస్త్రి తల్లడిల్లిపోయారు ఎందుకంటే, ఆయనకు అరుణాచలంలో వేరే స్థలమేమీ లేదు. ఆ పాశ్చాత్యుడు ఇచ్చిన డబ్బు తీసుకుని వెళ్ళి ఆ డబ్బును భగవాన్ ఒళ్ళో పెట్టారు. రామకృష్ణ పరమహంస లాగానే భగవాన్ కూడా, కౌపీనం ధరించిన తర్వాత ఎప్పుడూ డబ్బును తాకలేదు. ఎందుకంటే డబ్బును తాను తినలేరు కనుక. కానీ ఇప్పుడు శిష్యునిపట్ల గల కరుణ వలన, జగదీశశాస్త్రి దుఃఖం ఉపశమించి, ఆయన డబ్బును వెనుకకు తీసుకునేదాకా ఆపాటే ఉంచేశారు.

జగదీశశాస్త్రి సంస్కృత పండితుడు కావున, భగవాన్‌తో సన్నిహితంగా మెలిగినవాడు కావున, భగవాన్ యొక్క 'ఉపదేశ సారము'నకు, 'అరుణాచల స్తుతిపంచకము'నకు సంస్కృతంలో స్పష్టమైన భాష్యము వ్రాశారు. మొదటి పుస్తకములో ఆత్మలో స్థితుడైయుండట ఎట్లో ఒక మెట్టు తర్వాత మరొక మెట్టుగా సూచనలు ఇవ్వబడినవి. జగదీశశాస్త్రి 'రమణసహస్రనామస్తుతి' ని కూడా వ్రాశారు. భగవాన్‌ను వేయిపేర్లతో స్తుతిస్తూ వ్రాసిన పద్యాలు అవి. ఆయన మూలానే గొప్ప ప్రాముఖ్యతగల శ్లోకము భగవాన్ బోధల మీద సంస్కృతంలో భగవాన్ చేతనే వ్రాయబడినది. ఒకప్పుడు, శాస్త్రి ఒక పదసముదాయాన్ని 'హృదయకుహరమధ్యే' అనుదానిని, పదేపదే తనలో తానే ఉచ్చరించుకుంటూ, దానితో మొదలుపెట్టి ఒక శ్లోకము వ్రాయటానికి, ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో సఫలురు కాలేక, ఆ పదాల వరకు ఒక కాగితముపై వ్రాసి, భగవాన్ హాలులో లేనపుడు ఆయన సోఫాపై ఉంచి బయటకు వెళ్ళిపోయారు. ఆయన తిరిగి వచ్చే సరికి, భగవాన్ శ్లోకాన్ని పూర్తిచేశారు. కొత్తహాలులో, భగవాన్ విగ్రహం వెనుక గోడపై ఈ శ్లోకం చెక్కబడి ఉన్నది.

జగదీశశాస్త్రి కుటుంబ పరిస్థితుల ప్రాబల్యంవల్ల తన నివాసాన్ని చెన్నైకు మార్చవలసి వచ్చింది. అయినప్పటికీ ఆయన వేదాంతాన్ని సంస్కృత భాష్యాలను బోధించటానికై తన శేషజీవితాన్ని వెచ్చించారు. ఆత్మవిద్యా ప్రబోధానికై ఆయన చేసిన సేవలకుగాను, కంచిపీఠాధిపతి శ్రీచంద్రశేఖర సరస్వతి స్వామిగారిచే 'ఆత్మవిద్యాభూషణమ్' అనే బిరుదు శాస్త్రిగారికి ఇవ్వబడినది. 1956లో నేను చెన్నైలో ఫిలాసఫీ (వేదాంతము) లో పోస్టు గ్రాడ్యుయేషన్ (ఎం.ఏ.) చేస్తున్నపుడు శాస్త్రిగారిని

కలుసుకునే మహాభాగ్యం కలిగింది. విశ్వవిద్యాలయంలో మా ఆచార్యులైన డాక్టర్ టి.ఎం.పి.మహాదేవన్, భగవాన్‌కు గొప్ప భక్తులు. ఒకప్పుడు ఆయన చెన్నైలోని తన నివాసంలో భగవాన్‌జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆ వేడుకలు మూడురోజుల పాటు జరిగినవి. చాలా గొప్ప పండితులు వచ్చి ఉపన్యాసాలు ఇచ్చారు. వారిలో జగదీశశాస్త్రి ఒకరు.

ఆయన భగవాన్ ప్రత్యేకత గురించి, ఆయన గొప్పదనాన్ని గురించి, చేసిన ప్రసంగం శ్రోతలను మంత్రముగ్ధుల్ని గావించింది. అది వేదాలను అనుసరించి ఉన్నది. మరియు భగవాన్ ఎలాగ ఒకవైపున మనందరి గురించి జాగ్రత్త తీసుకుంటూనే, మరొకప్రక్క ఆత్మలో స్థితులై ఉండేవారో తెలియజేసింది. ఆరోజున ఆయన మూడు విధాలైన కర్మలను, అనగా, సంచిత, ఆగామి మరియు ప్రారబ్ద కర్మలను గురించి తెలిపే శ్లోకాన్ని వివరించారు. సంచితకర్మ అంటే, పూర్వపు జన్మలలో మనము పోగుచేసుకున్న కర్మ, ఆగామి కర్మ అనగా, ఈ ప్రస్తుత జీవితంలో మనము తయారుచేసుకున్న కర్మ. ప్రారబ్ద మనగా, ఈ జీవితంలో అనుభవించవలసిన కర్మ. వేదాల ప్రకారము, జ్ఞానికి, సంచితకర్మ, ఆగామికర్మ నశించిపోతవి గాని ప్రారబ్ద కర్మను మాత్రము ఆయన అనుభవించాలి. భగవాన్ దీనిని చాలా హాస్యంగా కొట్టిపారేశారు. ఒకరు, దేహముయొక్క, మనసుయొక్క పరిధులను దాటిన తర్వాత అనగా దేహముయొక్కగానీ, మనసుయొక్క గానీ ప్రభావం వారిపై ఏమీ లేనపుడు, రెండు కర్మలు నశించిపోయినవి, ఒక కర్మమాత్రం మిగిలియున్నది అని చెప్పటానికి వీలులేదు. ఒక మానవునికి ముగ్గురు భార్యలున్నారనుకోండి. ఆయన చనిపోయినపుడు వారు ముగ్గురూ విధవలు అవుతారు. అంతేగాని అందులో ఇద్దరు మాత్రమే విధవలు అవరు. ఆ వ్యక్తి మరణానంతరము, అతని భార్యలలో ఏ ఒక్కరు కూడా విధవరాలు కాకుండా ఉందరు. అలాగే కర్త పోయినపుడు (కర్తృత్వ భావన పూర్తిగా నశించినపుడు) మూడు కర్మలలో ఏ ఒక్కటీ మిగిలిఉండదు.



శ్రీ భగవాన్‌తో జగదీశ శాస్త్రి దంపతులు

దైవరాత



భారతదేశపు తొలిరాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్‌సర్వేపల్లి రాధాకృష్ణన్, పండిత మదన్‌మోహన్‌మాలవ్యా, వినోబాభావే మొదలైన గొప్పవారందరూ దైవరాతను వేదఋషిగాను, గురువుగాను భావించేవారు. వినోబాభావే, తన వద్దకు ఎవరైనా వేదాల గురించిన సందేహాలతో వస్తే వారిని దైవరాత వద్దకు పంపేవారు.

దైవరాత స్కందాశ్రమానికి వచ్చి భగవాన్‌తో ఉండిపోయారు. భగవాన్‌కు ఆయనంటే చాలా ఇష్టము. చాలా నిరాడంబరమైన వ్యక్తి గావున, ఆయన భగవాన్‌తోపాటు ఉంటూ, టౌన్‌కు వెళ్ళి బిచ్చమెత్తుకునే వారు భోజనం కోసం. ఆయన తనకు దొరికిన ఆహారాన్ని, స్కందాశ్రమానికి తెచ్చి భగవాన్ ముందు పెట్టి, 'ఇంద్రాయస్వాహా' అనేవారు. అంటే నేనీ ఆహారాన్ని దేవతల రాజైన ఇంద్రుడికి అర్పిస్తున్నానని అర్థము. భగవాన్ అందులోనుండి కొద్ది ఆహారాన్ని తీసుకున్న తర్వాత, మిగిలినది తను భుజించేవారు.

1917లో స్కందాశ్రమంలో దైవరాత, భగవాన్ ఎదురుగా, కావ్యకంఠ ముని మరి ఆరుగురు గొప్ప పండితులతో కూర్చుని ఉన్నారు. వారందరూ భగవాన్‌ను ఎడతెరపి లేకుండా ప్రశ్నలతో ముంచెత్తారు. (ముంచేశారు) ఈ ప్రశ్నలూ, జవాబులూ అన్నీకూడా గ్రంధస్థము చేయబడి శ్రీరమణగీత అను పేరుతో ముద్రింపబడినది.

దైవరాత, భగవాన్‌ను అతి ముఖ్యమైన ప్రశ్న అడిగి, దానికి ఖచ్చితమైన జవాబు ఇవ్వవలసినదిగా కోరారు. "భగవాన్, సాధకునికి అన్నిటికంటే ముఖ్యమన కర్తవ్యము(బాధ్యత) ఏది?" అని దైవరాత భగవాన్‌ను ప్రశ్నించారు. "తన స్వస్వరూపాన్ని కనుగొనటమే సాధకునకు అన్నిటికన్న మిన్నయైన కర్తవ్యము," అని భగవాన్ బదులిచ్చారు.

చిన్నతనంనుండి దైవరాతకు భజనలు పాడడం అంటే ఆసక్తి. భజనలు పాడుతూ ఆయన నృత్యం చేసేవారు. ఆ రోజులలో భక్తులతో కలసి భగవాన్ గిరిప్రదక్షిణకు వెళ్ళేవారు. భగవాన్‌కు దైవరాత కన్పించినప్పుడల్లా, భగవాన్ ఆయన కళ్ళలోనికి మనస్ఫూర్తిగా చూసేవారు. దైవరాత భజనలు పాడుతూ, నృత్యంచేస్తూ, రోడ్డు ఒకప్రక్క నుండి రెండవ ప్రక్కకు వెళుతుండేవారు. భగవాన్‌కూడా భజనలు పాడుతూ నృత్యం చెయ్యడం మొదలుపెట్టేవారు. భగవాన్ అందం ఆయనను సమ్మోహనపరిచేది. ఆయన ఇలా అన్నారు, "భగవాన్ కనులు, మచ్చలేని వెలుగుతో ప్రకాశిస్తూ ఉండేవి. అవి శాంతితోనూ, ప్రేమతోనూ నిండి ఉండేవి. దేవుళ్ళకు వలెనే, ఆయన కనురెప్పలు మూతపడవు. ఆయన కళ్ళు పూర్తిగా తెరిచే ఉన్నప్పటికీ, అవినిశ్చలంగానూ, అంతర్ముఖమై ఉండేవి. ఆయన ఎదురుగా కూర్చుని, ఆయనవైపు తదేకంగా చూచినా, అది నిజమైన పూజ అవుతుంది. జనులు ఆయన దర్శనంతో ఆకర్షింపబడి, ఆయన దివ్యమైన సన్నిధిని వీడడానికి ఇష్టపడరు.

భగవాన్ కంఠస్వరాన్ని వర్ణించినది దైవరాత ఒక్కరే. ఇతరులెవ్వరూ ఆయన గొంతు ఎలా ఉండేదో చెప్పలేదు. మహర్షి కంఠస్వరము, శ్రావ్యంగా, చిన్నపిల్లల గొంతువలె మృదువుగా ఉండేది. అది అంతులేనంత తియ్యగా ఉండేది. అప్పుడప్పుడు అది ఎంత మృదువుగా ఉండేదంటే, అది సరిగా వినపడేదే కాదు. ఎంతో శ్రద్ధగా వినవలసి వచ్చేది. ఆయన కంఠధ్వని వింటున్నపుడు, ఏదో సున్నితమైన దివ్యవాణి ఆకాశంనుండి విన్పిస్తుందా అనిపించేది. వేదాలలో విస్తారంగా ప్రస్తుతింపబడిన దివ్యవాణి వంటిది ఆయన పలుకు.

దైవరాత అసలుపేరు గణేశశాస్త్రి కోసోయ్‌మణి. అతనిని కొన్నిసార్లు గణేశ అని,కొన్నిసార్లు గజానన్ అనీ పిలిచేవారు. ఆయనకు దైవరాత అనే పేరు ఎలా వచ్చింది అనేది, చాలా ఆసక్తికరమైన కథ. హిందూసంస్కృతిలో మహర్షులు చెప్పిన విధంగా ప్రజలు నడుచుకుంటారు. ఒకానొకప్పుడు ఆ గణేశశాస్త్రి, ఉజ్జయిని నుంచి వచ్చిన ఒక మహాత్ముని కలవటం జరిగింది. ఆయన శాస్త్రికి ఉపదేశమిచ్చి, భక్తిమార్గములోనికి ప్రవేశపెట్టారు. కొన్ని రోజుల తర్వాత వేరొక మహనీయుడు హఠయోగ అభ్యాసాన్ని నేర్పించారు. ఆయన భక్తినీ యోగాన్నీ తన జీవితమంతా వ్యాప్తిచేశారు. తర్వాత గజానన్

కావ్యకంఠగణపతి మునిని కలుసుకున్నారు. కావ్యకంఠులవారు గొప్ప సంస్కృత పండితులు కావున గజాననన్‌ను సహజంగానే ఆకర్షించారు. కావ్యకంఠులు గజాననుని, "నీ పేరేమిటి?" అని అడిగారు. ఆయన పేరు గణేశశాస్త్రి కోసోయ్‌మణి అనీ, గజాననన్‌గా అందరిచే పిలువబడతారనీ తెలుసుకున్న కావ్యకంఠులు నేటినుండి నీపేరు దైవరాత అన్నారు. కావ్యకంఠులు పేర్లు మార్చి కొత్త పేరులు పెట్టటంలో ఘనులు. అప్పటికే ఆయన వెంకట్రామన్ అనే పేరును భగవాన్ శ్రీరమణమహర్షి అని మార్చారు గదా! కావ్యకంఠులవారే దైవరాతను స్కందాశ్రమానికి తీసుకొని వచ్చారు. మొట్టమొదటిసారి భగవాన్‌ను దర్శించగానే, భగవాన్ అప్రయత్నంగా నిరంతరమూ నాలుగు వేదాలచేత గొప్పగా ప్రస్తుతించబడిన ఆత్మనిష్ఠలో సహజస్థితిలో ఉండుట చూచి ఎంతో అచ్చెరువందారు. భగవాన్ ఆయనను కొండపై ఉండుటకు అనుమతించారు. కావ్యకంఠులు ఎక్కడకు వెళ్ళినా, దైవరాత ఆయనను అనుసరించేవారు.

ఒకప్పుడు దైవరాత, కావ్యకంఠుల వారితో కలిసి పడైవీడురేణుకాంబ అలయంలో ఉంటున్నారు. ఆయన ఆ దేవి సమక్షంలో కఠిన తపస్సు చేస్తున్నారు. ఒకరోజు ఆయన నోటినుండి కొన్ని శ్లోకాలు వెలువడడం మొదలైంది. దీనిని రెండురోజులపాటు గమనించిన కావ్యకంఠులు, అది ఋగ్వేదంలోని ఛందస్సు గల పద్యాలని అర్థం చేసుకున్నారు. దైవరాత ఋగ్వేదమునకు చెంది కాలక్రమంలో లేకుండాపోయిన కొన్ని పద్యాలను వెల్లడించారు. దైవరాత పారవశ్యస్థితిలో ఉన్నందున కొన్ని సరిగా వినబడలేదు. కానీ వాటిలో ఎక్కువ భాగాన్ని కావ్యకంఠులు వ్రాసుకోగలిగారు. శ్లోకాలూ, వాటి భాష్యము కలిపి, కావ్యకంఠులచే 'ఛందోదర్శనము' అని పేరుతో వ్రాయబడి, తర్వాతి కాలంలో ముద్రింపబడ్డవి.

కావ్యకంఠులు 1936లో చనిపోయారు. తన గురువుపోవడంతో దైవరాత నేపాల్ వెళ్ళిపోయారు. వేదవాఙ్మయంతో తనకు గల దాహార్తిని (జిజ్ఞాసను) తృప్తిపరచుకోవడానికి అది సరైన ప్రదేశమని ఆయన భావించారు. అంతేకాకుండా, నేపాల్‌రాజు, ఈయన జ్ఞానార్జనకు సహకారాన్ని అందించడంతో ఆయన అక్కడ సుఖంగా ఉన్నారు. కానీ ఆయన ఎక్కడకు వెళ్ళినప్పటికీ, ఉత్తరాల ద్వారా భగవాన్‌తో సంబంధం కలిగి ఉండేవారు. భగవాన్ ఆయన లేఖలకై ఎదురుచూసేవారు. ఆయన ఉత్తరాలకు, ఆలోచనా తరంగాల ద్వారాగాని, లిఖితపూర్వకంగా గానీ, అనుగ్రహ ప్రసారం ద్వారాగాని సమాధానమిచ్చేవారు భగవాన్. నేపాల్‌నుండి, ఆయన వ్రాసిన ప్రతి లేఖ చివర, ఎల్లప్పుడూ శ్రీభగవాన్ పవిత్ర పాదాలచెంత అని వ్రాసేవారు.

రమణాశ్రమంలో 1960లో ఆయనకు స్వాగతం పలికే మహద్భాగ్యం నాకు లభించింది. ఒక్కసారి ఆయనను చూడగానే వేదకాలంనాటి ఋషి ఇక్కడ ఉన్నట్లుగా నాకు అన్పించింది. అప్పటికి ఆయనకూడా మహర్షి అని పిలువబడుతున్నప్పటికీ, రమణాశ్రమంలో మాత్రం ఆ పేరును వాడేవారు కాదు.అయినా ఆయన మహర్షి అనే నాకు తెలుస్తుండేది. ఆయన అవసరాలు చాలా స్వల్పమైనప్పటికీ, ఆయనకు సేవ అందించడంనాకు గొప్ప భాగ్యం. హిందూమతాన్ని గట్టిగా అవలంబించే ఆయన, గోవులనెంతో గౌరవించేవారు. గోవు మూత్రాన్ని సేవించేవారు. ఒక కప్పు గోమూత్రమునూ, కొద్దిగా వేపాకులనూ తీసుకుని ఆయన రోజుల తరబడి సంతోషంగా జీవించగలరు. ఆయన కఠినతరమైన నియమనిష్టలు, నిరాడంబరత ఎలాంటివంటే, భగవానే వాటిగురించి మాట్లాడుతుండేవారు.

అప్పటికే ప్రపంచాన్ని త్యజించడం వల్లా, యువకుడిగా ఉండడం వల్లా, నేను ఇంకా ఇంకా భగవాన్ గురించి తెలుసుకోవాలనుకునేవాడిని. ఈ మహనీయుడు, చిన్న పిల్లవాని వలె ఉండుట వలన నాకు ఆయన వద్దకు వెళ్ళటానికి, ఏమైన అడగడానికి సులభంగా ఉండేది. "స్వామీ, మీరు భగవాన్ ఒక మానవుడిగా ఎలా ఉండేవారో, దైవంగా ఎలా ఉండేవారో చెప్పవలసినది" అని నేను అడిగాను. ఆయన నావైపు చూసి చిరునవ్వు నవ్వారు. బహుశా నా అజ్ఞానానికి ఆయన నవ్వుకొని ఉంటారు. ఆయన ఒకే ఒక వాక్యం చెప్పారు. "భగవాన్, మానవశరీరమనే ముసుగును ధరించిన దైవమే".

భగవాన్‌కు గొప్ప శక్తులు ఉండేవని, వాటిని ఆయన దాచి ఉంచారని చెప్పసాగారు. వెంటనే నేను ఆయనను ఇలా అడిగాను, "అలా అనడంలో మీ ఉద్దేశం ఏమిటి? మీరొక్క ఉదాహరణ ఇవ్వగలరా?" దైవరాత అన్నారు, "నేను చెప్పగలను కానీ, నువ్వు అర్థము చేసుకొనగలవా?" "చెప్పండి. నేను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తాను" అన్నాను నేను. "భగవాన్‌కు

గతంలోకి వెళ్ళి గతాన్ని మార్చగల శక్తి ఉన్నది. నేను ఇలా బదులిచ్చాను. "నేను అర్థం చేసుకోలేకపోవటము ఒక్కటే కాదు. మీరేమి మాట్లాడుతున్నారో నాకు తెలియనే తెలియదు". ఆయన దయతో ఆయన అనుభవాన్ని నాకు వివరించారు. ఒకప్పుడు 1940లో దైవరాత, మంచుతో కప్పబడిన హిమాలయ శిఖరాలలో తిరుగుతూ, ధ్యానంలో నిమగ్నులై ఉండేవారు. అకస్మాత్తుగా, తన కళ్ళ వెంబడి నీరు కారడం ఆయన గమనించి, దానికి కారణం తెలుసుకోవాలనుకున్నారు. అప్పుడు ఆయన హృదయము నుండి ఒక శక్తి, భగవాన్‌కు దూరంగా ఉండడమే ఆ దుఃఖానికి కారణమని తెలియజేసింది. వెంటనే ఏ ఏర్పాటులేకుండానే అరుణాచలానికి తిన్నగా ప్రయాణమైనారు. ఆ ప్రయాణానికి పదిహేను దినాలు పట్టింది. అక్కడకు చేరగానే ఆయన ఆనందభాష్పాలతో భగవాన్ ఎదుట నిలబడ్డారు. ఆయనను చూడగానే, "ఇపుడే కొద్దినిముషాల క్రిందటే, నీ గురించి అనుకున్నాను. నిన్ను చూడాలని గట్టిగా అన్పించింది. ఇంతలో నువ్వు ఇక్కడ ఉన్నావు," అన్నారు భగవాన్. దైవరాత, "నీకు అర్థమైందా?" అన్నారు. నేను, "లేదు. నాకు అర్థం కాలేదు," అన్నాను. కొద్దిక్షణాల క్రిందటే అన్నప్పటికీ, అది పదిహేను రోజుల వెనుకకు వెళ్ళి నేను ప్రయాణానికి సిద్ధమయేటట్లు పురికొల్పింది. ఆయన నన్ను కన్నీరు కార్చేటట్లు చేసి, ఆయన నన్ను పిలుస్తున్నట్లుగా, నేను గుర్తించేటట్లు చేశారు". భగవాన్ అపుడు కొండపైకి (షికారుకు) వ్యాహ్యాళికి వెళ్లారు. నేనూ అనుసరించాను. "హృదయంలో స్థిరంగా నిలచి ఉండు. హృదయమే అరుణాచలమని గుర్తుంచుకో". భగవాన్ ఈ చివరి సందేశాన్ని ఇవ్వడానికి హిమాలయాలనుండి నన్ను ఇక్కడకు రప్పించారు. అప్పటినుండి ఎల్లవేళలా, భగవాన్ నా హృదయంలో అరుణాచలునిగా నివసిస్తున్నారు."



శ్రీ భగవాన్ – దైవరాత

కె.లక్ష్మణశర్మ



అసాధారణ ప్రతిభ కలిగినటువంటి, సంస్కృత కవులైన, కావ్యకంఠ గణపతి ముని, జగదీశశాస్త్రి, కపాలిశాస్త్రి, దైవరాత, భగవాన్ శ్రీరమణమహర్షికి భక్తులు. అలాగే మురుగనార్ గత వెయ్యేళ్ళలో చెప్పుకోదగ్గ గొప్ప తమిళ కవులలో ఒకరు. మరొక పండితుడు, కవి అయిన ఒక వ్యక్తి కూడా భగవాన్‌కు భక్తులయ్యారు. ఆయన ప్రఖ్యాతిగాంచారని, ఆయనను గొప్ప అనటం కాదు. ఆయన తనకే గుర్తింపూ లేకుండా గుర్తింపుకు దూరంగా ఉన్నారు. ఆయన తనను తాను ఎంతగా మరుగుపరచుకునే వారంటే, భగవాన్ ఆత్మవిచారణపై 'మహాయోగము' అనే గొప్ప గ్రంథాన్ని వ్రాసి, దానిని 'ఎవరు' (Pseudonym) అనే మారుపేరుతో వ్రాశారు. ఈ మధ్యకాలంలో అచ్చయిన కాపీలలోనే 'లక్ష్మణశర్మ' అని కన్పిస్తుంది.

వృత్తిరీత్యా వకీలు, ప్రకృతివైద్యుడు అయిన లక్ష్మణశర్మ, 1928లో ఆశ్రమానికి వచ్చారు. భగవాన్ ఒక్క చూపుతోనే ఆయనను వశపరచుకున్నారు. భగవాన్ ఆయనను, "ఉళ్ళదునార్పదు (ఉన్నది నలుబది) చదివావా?" అని అడిగారు. "ఉళ్ళదు నార్పదు" అనేది భగవాన్‌చే శాస్త్రీయమైన తమిళంలో రచింపబడిన నలుబది పద్యాల సంకలనం. ఈ రచనలో సత్యము లేదా సద్వస్తువు (ఆత్మ) గురించి. దానిలో సంస్థితమై ఉండుట ఎలాగ అను విషయముపై భగవాన్ బోధ ఉంటుంది. లక్ష్మణశర్మ నేను ఆ పుస్తకాన్ని చదువలేదు. నాకు శాస్త్రీయమైన తమిళం తెలియదు అన్నారు. పట్టుదల కలిగిన సూక్ష్మబుద్ధి కలిగిన సాధకుడు అగుట వలన, "భగవాన్ నాకు నేర్పిస్తే నేను నేర్చుకుంటాను," అన్నారు. మనము ఒక అడుగు భగవంతుని వైపు వేస్తే, ఆయన తొంభై తొమ్మిది అడుగులు మనవైపుకు వేస్తారు," అనే నానుడి నిజమే. లక్ష్మణశర్మ స్పందించిన విధం, ఆయన ప్రయత్నం చేయటానికి సిద్ధంగా ఉన్నారని, ఒక అడుగు ముందుకు వెయ్యటానికి తయారుగా ఉన్నారని తెలుపుతుంది. అందుకని సద్గురువు ఆయనకు (విడిగా) ఏకాంతంగా శాస్త్రీయ తమిళమును నేర్పడానికీ, అవసరమైన మార్గదర్శకత్వం నెరపడానికీ నిశ్చయించుకున్నారు. భగవాన్, తమిళ భాషలోని స్వల్పమైన భేదాలను వివరింపగా లక్ష్మణశర్మ సునాయాసంగా వాటిని గ్రహించారు. త్వరలోనే, భగవాన్, ఉళ్ళదునార్పదుని, దాని అనుబంధాన్ని వివరించడం ప్రారంభించారు. గురుశిష్యుల అనుబంధం అత్యంత అద్భుతమైనది. ఎందుకంటే గురువు శిష్యునికి తెలియని సమాచారాన్ని ఇవ్వటం చెయ్యరు. గురువు చేసేదేమిటంటే, శిష్యుడు తనే ఆత్మను, అనే విషయాన్ని గుర్తించునట్లుగా చేస్తారు. ఇదే విషయాన్ని 'ఉళ్ళదునార్పదు' తెలియచేస్తుంది.

భగవాన్ ఎప్పటివలెనే ఎంతో కరుణతో ప్రతిరోజూ చాలా సమయం తీసుకుని లోతుగా వివరిస్తుండేవారు. తర్వాత ఆ పుస్తకము ముద్రించబడింది. దానిని ముద్రింపచేయాలని లక్ష్మణశర్మ ఎన్నడూ అనుకోలేదు. ఆయన భగవాన్ తనకు బోధించిన విషయాలను,వాటిపై తానెలా సాధన చేసినది వర్ణించారు. లక్ష్మణశర్మ పల్లాకొత్తులో ఒక కుటీరంలో నివసించేవారు. ఆయన సంస్కృత పండితుడు కాబట్టి, రాత్రి కుటీరానికి రాగానే, పగలు తను సంపాదించుకున్న జ్ఞానాన్ని అంతటినీ, సంస్కృతంలో ఒక పద్యం రూపంలో వ్రాసేవారు. మర్నాడు ఆయన ఆ పద్యాన్ని భగవాన్‌కు చూపేవారు. భగవాన్ దానిని చదివి సరిచేసే వారు. ఎప్పుడైనా ఒకసారి భగవాన్ అసంతృప్తిని చూపు ద్వారా వెల్లడిచేసేవారు. అపుడు లక్ష్మణశర్మ ఆ పద్యాన్ని తిరిగి వ్రాసేవారు. భగవాన్ ఎవరి తప్పులూ ఎత్తి చూపటంగానీ, విమర్శించడం గానీ చేసేవారు కాదు. కానీ సన్నిహిత శిష్యులు మాత్రం ఆయన కళ్ళలోని భావాన్ని బట్టిగానీ, ముఖ కవళికలలో తేడాను బట్టిగానీ ఆయన భావాన్ని అర్థం చేసుకునేవారు. ఈ విధమైన దినచర్య రోజులూ నెలలూ కాకుండా, మూడు సంవత్సరాలు పట్టింది. ఈ కంప్యూటర్ యుగంలో, ఒక్కసారి మౌస్ నొక్కితే ఏ సమాచారమైనా, ఆఖరికి, సత్యాన్నైనా (ఆత్మజ్ఞానాన్నైనా) పొందాలనుకుంటాము. కానీ లక్ష్మణశర్మ చేసిన అంతులేని పరిశ్రమ చూడండి. సత్యాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నంలో.

లక్ష్మణశర్మ మాటలలో చెప్పాలంటే "భగవాన్ నాకు బోధించడం ప్రారంభించారు. నెమ్మదిగా, ఒక పద్యం నుండి రెండవ పద్యానికి వెళ్ళడం నాకు అవసరమనిపించేది. భగవాన్ నాకు బోధించిన దానిని నేనుసరిగా అర్థం చేసుకున్నానా లేదా

అనేది, నేను నిర్ధారించుకోవాలి. అందుకని నేను ఆయన చెప్పిన బోధ యొక్క అర్థాన్ని ఒక సంస్కృత పద్యంలో ఇమిడ్చి వ్రాసేవాడిని. రెండవ పద్యానికి వెళ్ళే ముందు, ఆయన చెప్పిన దానిని సరిగా అనువదించానో లేదో నిర్ధారించుకోవడానికి ఆ పద్యాన్ని భగవాన్‌కు చూపేవాడిని. నేను వ్రాసినది ఆయనకు అంత తృప్తి కల్గించలేదని నాకనిపిస్తే, ఆ పద్యాన్ని మరల మరల, ఆయనకు పూర్తిగా తృప్తి కలిగే వరకు వ్రాసేవాడిని. ఈ విధంగా నేను ఆ పద్యాలన్నిటినీ చదివి, సంస్కృతంలోకి అనువదించాను. ఉళ్ళదునార్పదు, నన్ను పూర్తిగా ప్రభావితం చేసింది. అందువలన నేను ఆ సంస్కృత పద్యాలను మరల మరల మెరుగుపరచడానికి ప్రయత్నించేవాడిని. మొదటి నలుబది పద్యాలను అనువదించిన తర్వాత, నేను మరలా మొదటికి వెళ్ళి మరలా వ్రాశాను. నా మనస్సులో ఉన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంత సమయాన్ని వెచ్చించినా, ఎంత శ్రమపడినా ఫర్వాలేదనిపించింది. ఈ సంస్కృతపు అనువాదానికి 'సద్దర్శనం' అని (సద్వస్తువును దర్శించుట) (ఆత్మ దర్శనము) పేరు పెట్టబడినది. లక్ష్మణశర్మ ఎంత కఠోర పరిశ్రమ చేశారంటే ఈ పద్యాలను గురించి, ఎప్పుడూ ఎవరి గురించీ ఏమీ మాట్లాడని భగవానే, "లక్ష్మణశర్మకిది తపస్సు వంటిది. ఆయన దానిని మరల మరల సరిదిద్ది మెరుగుపరిచి, దానిలోనే జీవించారు. ఏమాత్రం దోషం లేని, సంస్కృత అనువాదం చెయ్యాలని కష్టపడ్డారు, ఫలితాన్ని సాధించారు," అన్నారు.

ఈ సంస్కృత పద్యాలు పూర్తి అయ్యేటప్పటికి, కపాలిశాస్త్రి కూడా ఆశ్రమంలోనే ఉన్నారు. ఆయనను ఈ పద్యాలను చదవమనికోరగా, నేను వీటిని నా గురువుగారైన కావ్యకంఠులవారికి పంపిస్తాను. ఆయన సంస్కృత అనువాదాన్ని చదివి మార్పులేమైనా చెయ్యవలసి ఉంటేచెబుతారు అన్నారు. ఆ కావ్యం సిర్సిలో ఉన్న గణపతి మునిగారికి పంపబడింది. ఆ నలుబది పద్యాలలో ఉన్న భావంలోని గంభీరతను, లోతైన జ్ఞానాన్ని చూసి కావ్యకంఠులు ఆశ్చర్యపోయారు. ఆయన సాటిలేని ఆశుకవి. అంటే ఏమాత్రమూ తడుముకోకుండా, ముందుగా ఆలోచించకుండా అప్పటికప్పుడు కవితాధార ఆయన నోటినుండి వెలువడుతుందన్నమాట. ఆ శర్మగారి పద్యాలను సరిదిద్దడానికి బదులుగా, ఆయన ఆ పద్యాల్ని కొత్తగా తిరిగి మార్చి చెప్పేశారు. ఆయన అభిమానులు ఆ పద్యాలను 'సద్దర్శనము' అనే పేరుతో ముద్రింపచేసి, కపాలిశాస్త్రికి పంపగా, ఆయన దానికి భాష్యాన్ని వ్రాశారు. ఇది 1930 ఆ ప్రాంతంలో జరిగింది. కావ్యకంఠుల పద్యాల శైలిని భగవాన్ మెచ్చుకున్నప్పటికీ, ఆ అనువాదం ఖచ్చితంగా మూలానికి సరిపోయేటట్లు లేదని లక్ష్మణశర్మకు అనిపించింది. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్ ఈ అనువాదం చాలాచోట్ల మూలంకంటే వేరుగా ఉన్నది," అన్నారు. మూడు సుదీర్ఘమైన సంవత్సరాలు తమిళంలోనూ, సంస్కృతంలోనూ, ఉన్న ఆ పద్యాలపై శ్రమించారు కనుక, తను చెప్పేది సరిగానే ఉన్నట్లుగా ఆయన విశ్వసించారు. భగవాన్ ఉద్దేశంలో ఎప్పుడూ, ఎవరిలోనూ లోపాలు ఎంచగూడదు. సరియైన నిజాల్ని వెల్లడించవచ్చును అని ఉండేది. ఆయన లక్ష్మణశర్మతో, "నువ్వు ఆ పద్యాలను సరియైన రీతిలో, ఎక్కువ బాగా (మూలానికి సరిపోలేటట్లు) వ్రాయగలిగితే, నువ్వే నీ పద్యాలకు భాష్యం ఎందుకు వ్రాయకూడదు?" అన్నారు. భగవాన్ మాటలతో ఉత్సాహం పొందిన లక్ష్మణశర్మ, భగవాన్ బోధ వింటున్నపుడు తయారుచేసుకున్న విస్తృతమైన నోట్సు ఆధారంగా, భాష్యాన్ని వ్రాశారు.

ఒక తమిళ పత్రిక సంపాదకుడు, ఈ భాష్యాన్ని ప్రతి సంచికలోను కొంత చొప్పున సీరియల్‌గా వేయాలనుకున్నారు. ప్రతిసారి ఆ పత్రిక వచ్చినపుడు, భగవాన్, ఆ భాష్యాన్ని, ఎంతో ఆసక్తితో కత్తిరించి, ఆ పేజీలను గోధుమరంగు కాగితాలపై అంటించి దాచి ఉంచేవారు. ఆ భాష్యం పూర్తయిన తర్వాత, ఆ పేజీలన్నిటినీ కలిపి, భగవానే స్వయంగా, పుస్తకంగా కుట్టారు. భక్తులు, ఆ భాష్యంపై భగవాన్‌కున్న ఆసక్తిని గమనించి, దానిని అచ్చువేయించాలనుకున్నారు. కానీ ఏదో కారణం వల్ల ఆశ్రమం ఆ భాష్యాన్ని (ముద్రింపచేయలేకపోయింది) ముద్రించలేదు. కాబట్టి లక్ష్మణశర్మ స్వయంగా తానే ప్రైవేటుగా, ఆ పుస్తకాన్ని 'ఉళ్ళదునార్పదుఉరై' అనే పేరుతో స్వయంగా అచ్చువేయించారు. అలా ప్రింటు వేయించడంలో ఆయన స్వంత ఆసక్తి ఏమీ లేదు. కేవలం భగవాన్ దానిపట్ల ఆసక్తితో ఉన్నారనే దానిని ముద్రింపజేశారు.

ఆ భాష్యం ముద్రింపబడగానే ఒక ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. ఒకరోజు, భగవాన్ సోదరుడు చిన్నస్వామి, ఆశ్రమమేనేజర్, ఆశ్రమ ఆఫీసులో ఏదో జమాఖర్చుల పనిలో నిమగ్నమైయున్నారు. ఆయన వెనుకనున్న కిటికీ వద్ద నిలబడి భగవాన్ ఆయనతో మాట్లాడడం కోసము ఓపికగా వేచి ఉన్నారు. భగవాన్ ఆయనను పిలిచి ఉండవచ్చు, కానీ ఆ

విధంగా ఆయన ఎప్పుడూ చెయ్యరు. అలా పదిహేను నిముషాలు గడచిన తర్వాత భగవాన్ అక్కడ నుంచుని ఉండుట చూసి ఎవరో చిన్నస్వామితో ఆ విషయం చెప్పారు. అప్పుడు భగవాన్, "పిచ్చాయ్ ఉళ్ళదునార్పదుకు వ్రాయబడిన భాష్యాలన్నింటిలోకి లక్ష్మణశర్మ వ్రాసిన భాష్యం ఎక్కువ బాగుందని ప్రతి ఒక్కళ్ళు అంటున్నారు. ఎవరూ కూడా మూలాన్ని లక్ష్మణశర్మ చేసినట్లుగా అధ్యయనం చెయ్యలేదు. అందుకని లక్ష్మణశర్మ వ్రాసిన భాష్యాన్ని ఆశ్రమమే ముద్రిస్తే ఉచితంగా ఉంటుంది అన్నారు. చిన్నస్వామికి ఆయన చేసిన సూచన అర్థమైంది. వెంటనే ఆశ్రమము ఆ గ్రంథాన్ని ముద్రింపచేసింది. చిన్నస్వామి స్వయంగా ఆగ్రంథాన్ని చదివి, ప్రతి ఒక్కరికి, 'ఉళ్ళదునార్పదుఉరై' చదవండి. భగవాన్ బోధను అది ఉన్నది ఉన్నట్లుగా చూపుతుంది. అని చెప్పేవారు. ఆ సంవత్సరం ముద్రించిన గ్రంథాలన్నిటిలోకి 'ఉళ్ళదునార్పదు ఉరై' గొప్పదిగా ప్రశంసింపబడినది. ఈ రోజుకు కూడా అది గొప్ప తమిళ గ్రంథంగా పరిగణింపబడుతుంది.

మురుగనార్ ఒకసారి, "లక్ష్మణశర్మ ఉళ్ళదునార్పదుగా జీవించారు," అన్నారు. ఆయన అలా అనడంలో ఉద్దేశమేమిటని అడుగగా, మురుగనార్ ఇలా విపులీకరించారు. "గురువుగారి ద్వారా ఉళ్ళదునార్పదులో ఏదైతే బోధించబడిందో, దానిని హృదయపూర్వకంగా, వీసమెత్తు తేడా లేకుండా, లక్ష్మణశర్మ ఆచరణలో పెట్టారు. ఆయన, ఆయన జీవితం, ఊపిరి (శ్వాస), ఆలోచన అన్నీ కూడా ఆ పవిత్రమైన గొప్పవియైన నలుబది పద్యాల గురించే ఉండేవి. ఆయన ఇంగ్లీషు, తమిళం, సంస్కృతములో పండితుడు కావున ఈ మూడు భాషలలోనికి వానిని నిరంతరం, అనువదిస్తూనే ఉండేవారు. ఆ అనువాదానికి పీఠికగా ఆయన వ్రాసిన పలుకులు భగవాన్‌పట్ల ఆయనకు గల ఆరాధనా భావాన్ని తెలియజేస్తున్నవి. ప్రాచీనమైన ఉపనిషత్తులు, విలువైనవే. ఎందుకంటే, అవి భగవాన్ బోధలతో ఏకీభవిస్తున్నవి కనుక. ఆయన శిష్యులైన భారతీయులకు, విదేశీయులకు కూడా, ఆయన వ్రాసిన లేదా చెప్పిన బోధలే మొదటి ముఖ్యమైన జ్ఞానబోధలు. పురాతన శృతులకు విలువ ఎందుకంటే అవి భగవాన్ బోధలకు అనుగుణంగా ఉన్నవి కనుకనే, ప్రాచీన శృతులకు విలువనిచ్చే వారికి గూడ సజీవులైన సద్గురుని బోధలు ఎంతో ఆసక్తికరంగా ఉంటవి. ఈ పుస్తకములో ఒక నిర్ణీత క్రమంలో ప్రాచీన, నవీన (పాత, కొత్త) బోధలు ఇవ్వబడినవి. ఆయన 'ఉళ్ళదునార్పదుఉరై' యొక్క ఆంగ్ల అనువాదమునకు 'మహాయోగ' అని పేరుపెట్టబడినది. చాలాకాలము వరకు ఆత్మవిచారణపై భగవాన్ బోధలను కలిగిన సమగ్రమైన ఇంగ్లీషు పుస్తకము ఇది ఒక్కటే. భగవాన్ మహాసమాధి తర్వాతనే, ఆర్థర్ఆస్‌బోర్న్ గారి పుస్తకాలు, మునగాల వెంకట్రామయ్యగారి 'టాక్స్ విత్ రమణమహర్షి' వంటి పుస్తకాలు ఇంగ్లీషులో లభ్యమైనవి. ఈ పుస్తకాలు ఇంగ్లీషు మాట్లాడే వారికి, భగవాన్ ప్రత్యక్షబోధలను ఎక్కువగా అందుబాటులోనికి తెచ్చాయి.

లక్ష్మణశర్మ ఎందువల్ల ఆ పుస్తకానికి మహాయోగమని పేరుపెట్టారు? ఆ పుస్తకంలోని 'క్వెస్ట్' (అన్వేషణ) అను పేరుగల తొమ్మిదో అధ్యాయం చివర, లక్ష్మణశర్మ తాను ఆ పుస్తకానికి 'మహాయోగ' అని ఎందుకు పేరుపెట్టారో వ్రాశారు. 'నేనెవరు?' అనేదే ప్రతి ఒక్కరూ చేపట్టవలసిన అన్వేషణ. అన్ని యోగములు, 'నేనెవరు?' అనే ప్రశ్నలోనే ఉన్నవి గనుక. అది (ఆత్మవిచారణ) 'మహాయోగము' అనబడుతున్నది అన్నారు. ఎప్పటిలాగానే భగవాన్ ముద్రింపబడ్డ గ్రంథాన్ని కొనలేదు. "కొనడానికి ఎవరి వద్ద డబ్బు ఉన్నది?" అన్నారాయన. తన అలవాటు చొప్పున, వ్రాతప్రతి చివరి ప్రూఫులను కుట్టి బైండింగ్ తయారుచేసి గంటల తరబడి ప్రూఫ్‌లు సరిదిద్దినందుకు గాను, తన వద్దనే ఉంచుకున్నారు. దాదాపు ఆ సమయంలోనే, భగవాన్ కూర్మపురాణం చదువుతూ, అందులో ఒక శ్లోకాన్ని కనుగొని, దానిని తొమ్మిదవ అధ్యాయము చివర చేర్చారు. ఆ సంస్కృత శ్లోకంలో ఈ విధంగా ఉంది. అకళంకమైన (మచ్చలేని) శాశ్వత ఆనందమే అయిన ఆత్మనే 'తాను' అని ఈశ్వరుడు ప్రకటించారు. ఏ యోగము ద్వారా ఆత్మను (లేదా ఈశ్వరుని) దర్శించగలరో ఆ యోగమునే మహేశ్వరునికి చెందిన యోగము లేక మహాయోగము అందురు.

లక్ష్మణశర్మ, మురుగనార్ ఇద్దరు కూడా భగవాన్ యెడల గాఢమైన భక్తి కలవారు, గొప్ప మిత్రులుకూడా. ఈ ఇద్దరు మహాపురుషులు వేదాంతము గురించి గానీ, అద్వైతము గురించి గానీ, ఏ విధమైన పరిజ్ఞానము లేకుండా భగవాన్ వద్దకు వచ్చారు. అందుకని భగవాన్ చెప్పినదానిని వారు చక్కగా ఆకళింపుచేసుకున్నారు. మురుగనార్ అప్పటికే 'గురువాచకకోవై' 'ది గార్లండ్ ఆఫ్ గురూస్ సేయింగ్స్', (గురువచన రత్నమాల)ని తమిళ పద్యాలలో వ్రాసియున్నారు. మురుగనార్, లక్ష్మణశర్మ

కలసి, అందులోనుండి మూడు వందల పద్యాలను ఎంపిక చేశారు. లక్ష్మణశర్మ, ఆ పద్యాలను వచనరూపంలో ఇంగ్లీషులోనికి అనువదించారు. ఆయన ఆ పుస్తకానికి 'గురురమణ వచనమాల' అని పేరుపెట్టారు. లక్ష్మణశర్మ 'శ్రీరమణహృదయం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో వ్రాశారు. ఆయన దానిని ఇంగ్లీషులోనికి అనువదించి, దానికి 'రివిలేషన్' అని పేరు పెట్టారు. (శృతిప్రకాశము/ఆవిష్కరణము). ఈ ఇంగ్లీషు పుస్తకాలన్నీ కూడా, ఇంగ్లీషు మాత్రమే తెలిసిన వారికి, భగవాన్ బోధను నేరుగా అందజేస్తవి. మీరు మీ గ్రంథాలను 'Who' అనే పేరుతో ఎందుకు ప్రచురించారు? అని అడుగగా, లక్ష్మణశర్మ ఇలా బదులిచ్చారు. నేను నా సద్గురువైన భగవాన్‌నుండి, నా స్నేహితుడు మురుగనార్ నుండి, నేర్చుకున్న విషయాలే ఈ పుస్తకాలలో ఉన్నాయి. అందుకని వాటిని 'ఎవరు' వ్రాసినట్లు?

లక్ష్మణశర్మకు, ప్రకృతిచికిత్సలో ఎక్కువ విశ్వాసం ఉన్నది. అందుకని, ప్రజలకు వైద్యసేవలందించడానికి ఆయన తన గ్రామానికి వెళ్లారు. ఆయన వ్రాసిన 'నేచర్‌క్యూర్' (ప్రకృతిచికిత్స) అనేది ఆ విషయంపై గొప్ప (authoritative) ప్రామాణిక గ్రంథము. ఆయన సంస్కృతంలో కూడా ప్రకృతి చికిత్సపై "స్వాధీన స్వాస్థ్యమహావిద్య" అనే గ్రంథాన్ని వ్రాశారు. ఈ నాటికి కూడా, భారతదేశంలో ఆయనను 'ప్రకృతివైద్యపిత'గా భావిస్తారు. అయినప్పటికీ, ఆయన మనస్సు భగవాన్ బోధలతోనే ఎల్లప్పుడూ అనుసంధానమై ఉండేది. భగవాన్ 1950లో శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత కూడా, ఆయన భగవాన్ బోధలపై సంస్కృతంలో పద్యాలు వ్రాసి, వాటి సంకలనానికి, 'శ్రీరమణ పరా విద్యోపనిషత్' అని పేరు పెట్టారు. ఆశ్రమము ఆ పుస్తకాన్ని ఇంగ్లీషులో ముద్రింపజేసింది. ఆ పుస్తకాన్ని ఆచరణలో పెట్టి తీరవలసిందే. అంత చక్కటిది అందులోని విషయం. ఈ దిగువన ఇవ్వబడిన పద్యాలు లక్ష్మణశర్మచే రచింపబడిన శ్రీరమణ పరావిద్యోపనిషత్‌లోని భగవాన్ బోధలను విశదపరుస్తవి.

పద్యము 479 :- సముద్రములోని అలలు సముద్రమే అయినట్లు, స్వప్నంలో కన్పించే ప్రపంచం స్వాప్నికుడి (కలనుకనేవాడి)కంటే వేరుకానట్లు, ఈ ప్రపంచమంతా, నా ఆత్మయే తప్ప వేరు కాదు. ఈ గ్రహింపే ప్రపంచాన్ని ఆత్మలో విలీనం చేస్తుంది.

పద్యము 504 :- శృతులలో ప్రకటింపబడిన 'తత్వమసి' (తత్ త్వమ్ అసి) (అదే నీవు అయి ఉన్నావు) అనే మహావాక్యము పంచకోశాలచే ఆవరింపబడి ఉన్న 'తనను', 'తాను'గా విడదీసి, మహోన్నతమైన నిత్యసత్యంగా (సద్వస్తువుగా) నిలుపుతుంది. కేవలం ఆత్మవిచారణ వలననే, నిత్యసత్యమైన ఆత్మే తన స్వరూపంగా అనుభ(వింపబడుతుంది) విస్తారు.

పద్యము 505 :- ఎవరైతే ఆత్మవిచారణతో 'దేహమే నేను' అనే భ్రాంతిని వీడి, ఆత్మను అన్వేషిస్తారో, అతనికి, తన స్వస్వరూపము అవగతమై హృదయంలో స్థిరంగా నిలచిపోతారు. హృదయ కుహరంలోనే అత్యంత దివ్యమైన ఆత్మ, తన స్వస్వరూపంగా భాసిస్తుంది.

పద్యము 506 :- ఆత్మవిచారణ అనేదే, ఆత్మ గురించి సరియైన అవగాహన రావటానికి సూటిమార్గము. ధ్యానము అనేది, దీనికి ప్రారంభంలో ఉండే సహాయకారి మాత్రమే. 'అది దేహమే నేను' అనే భ్రాంతిని అధిగమించడానికి తోడ్పడుతుంది.



మునగాల వెంకట్రామయ్య



1896, సెప్టెంబరు నెలలో మధురైలో చదువుతున్న పాఠశాల విద్యార్థి, ఇంటికి వెళ్ళి తన తల్లితో, "అమ్మా! మా ప్రక్క స్కూలులో చదివే ఒక బ్రాహ్మణ బాలుడు ఇల్లు విడిచి పారిపోయాడు" అని చెప్పాడు. తన పేరే కల్గియున్న 1918 నాటికే ప్రఖ్యాతి వహించిన మహర్షిగా స్కందాశ్రమములో ఉన్న ఆ పారిపోయిన కుర్రవానితోనే విధి తనకు బంధం కల్గిస్తుందని, 1930నుండి జీవితాంతం వరకు ఆయన నిరంతర సహచరుడిగా తనను మారుస్తుందనీ, కొంచెం కూడా అతనికి అప్పుడు తెలియదు. ఆ పాఠశాల విద్యార్థి పేరే ఎస్.వెంకటరామన్. ఆయనే తర్వాత మునగాల ఎస్. వెంకటరామయ్యగా సుపరిచితులు. ఆయనే 'టాక్స్ విత్ రమణమహర్షి' అనే పుస్తకాన్ని (తయారుచేశారు) సంగ్రహపరిచారు. అది భగవాన్ యొక్క నిజమైన భక్తులకు బైబిల్ వంటిది. (శ్రీరమణభాషణములు)

మునగాల వెంకట్రామయ్య షోలవందన్ అనే గ్రామానికి చెందినవారు. ఆయన పూర్వీకులు, ఆయన సోదరులు కూడా అక్కడ ఉన్న వేదపాఠశాలలో వేదాలను అభ్యసించారు. ఆయనకు సంస్కృతం బాగా వచ్చును. అయినప్పటికి, ప్రక్క ఊరిలో ఉన్న ఇంగ్లీషు పాఠశాలలో చదవాలని నిశ్చయించుకున్నారు. తదనంతరం కాలేజీలో చేరారు. ఆయనకు ఇంకా చదువుతుండగానే వివాహము జరిగింది. ఆయన పరిశోధనా దృక్పథం కలవారగుటచే ముంబైలోని ఒక పరిశోధనా శాలలో ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనకు ఒక కుమార్తె జన్మించింది. కుమార్తెపై అంతులేని ప్రేమ ఉన్నప్పటికీ, ఆయన దృష్టినంతటిని పరిశోధనలపై కేంద్రీకరించారు. పది సంవత్సరాలపాటు విస్తృతంగా పరిశోధనలు జరిపిన తర్వాత, మళ్ళీ కళాశాలకు వెళ్ళిపోయారు. ప్రెసిడెన్సీ కాలేజినుండి పట్టాను (డిగ్రీని) పొంది, బంగారుపతకాన్ని సాధించి, చెన్నైలోని ప్రఖ్యాతిచెందిన కళాశాలలో ఒకదానిలో అధ్యాపకుడిగా 1912 నుండి 1918 వరకు పనిచేశారు. ఆ కాలంలో కూడా ఆయన సన్యాసివలె నిరాండంబర జీవితాన్ని గడిపారు. అప్పట్లో ఆచార్యులకు కళాశాల ఆవరణలోనే పెద్ద పెద్ద నివాసగృహాలు ఇవ్వబడేవి. ఆయన తన భార్యనూ,కుమార్తెనూ పెద్ద ఇంటిలో ఉండమని బ్రతిమాలి, తాను మాత్రం కాపలావాని కోసం నిర్మించబడ్డ చిన్న (అవుట్‌హౌస్) ఇంటిలో ఉండేవారు. ఆయన నిరాండంబరత ఆ విధంగా ఉండేది. ఆ రోజులలో కూడా మునగాల వెంకట్రామయ్య ఆధ్యాత్మికజీవితాన్ని గడపాలని ఆత్రంగా ఉండేవారు. ఆయన ఒక మహాత్ముని కలుసుకున్నారు. ఆ మహాత్ముడు ఈయనకు పది ఉపనిషత్తులను, భగవద్గీతను, బ్రహ్మసూత్రాలను బోధించారు. ఆ మహాత్ముడాయనకు, ఉపనిషత్తులను ప్రతిరోజూ చదవమని చెప్పారు. దానిని ఆయన జీవితాంతం వరకు పాటించారు. ఆయన టేబులు మీద ఉపనిషత్తులన్నీ ఉండేవి. ఎప్పుడు చదవాలని అనిపిస్తే అప్పుడు వాటిని చదువుతుండేవారు.

కొంతకాలం పిదప, ఆయనకు ఎంతో ప్రియమైన ఆయన కూతురు చనిపోయింది. ఆయన అంతులేని దుఃఖసాగరంలో మునిగిపోయారు. అశాంతితో, శాంతిని వెదుకుతూ ఆయన పర్యటించసాగారు. 1918లో ఆయన అరుణాచలానికి చేరుకున్నారు. ఆయనకు అచటివారు, స్కందాశ్రమంలో ఒక ఋషి ఉన్నారని చెప్పారు. ఆయన అక్కడకు వెళ్ళినపుడు ఆ ఋషి ఎవరో కాదనీ, తన చిన్నతనంలో ప్రక్క స్కూలునుండి పారిపోయిన బ్రాహ్మణబాలుడేనని, ఆయన ఇప్పుడు భగవాన్ రమణమహర్షిగా ప్రసిద్ధి చెందారనీ తెలిసింది. కానీ చెన్నై దగ్గరలో ఉన్న మహనీయునకు సేవ చేయవలసిన బాధ్యత ఉన్నందున, ఆ సేవకు అంతరాయం కలుగుతుందని, ఆయన తిరిగి వెళ్ళిపోయారు. 1922లో ఆ మహాత్ముడు చనిపోయారు వెంకటరామయ్యగారిని మరింత దుఃఖంలో ముంచి. ఆ మహాత్ముడు కడసారి సందేశంగా తన శిష్యునకు ఉపనిషత్తులను చదవడం కొనసాగించమని చెప్పారు. వెంకటరామయ్య తర్వాత అయిదేళ్ళపాటు, ఆ ఉపనిషత్తులను చదువుతూ ఉన్నారు. ఆయన 1927లో రమణాశ్రమములో భగవాన్‌ను కలుసుకున్నారు. ఈసారి, శ్రీరమణభగవాన్ తన సద్గురువు అని పూర్తిగా గుర్తించి, అప్పటినుండి ఆశ్రమంలోనే ఉండిపోయారు. శ్రీమునగాల స్వంత మాటల్లో చెప్పాలంటే, "ఒక అత్యంత సామాన్యుడైన

భక్తుడు, చాలా దుర్భరమైన, దుఃఖముతో బాధపడుతూ మనశ్శాంతికై, భగవాన్ శ్రీరమణమహర్షి సన్నిధిని కోరుకున్నాడు. శ్రీనిరంజనానంద స్వామి దయతో అనుమతించగా, ఆశ్రమంలోనే ఉండిపోయాడు".

ఒకనాడు, ఆయనకు భారతదేశ ప్రభుత్వంనుండి, ఢిల్లీలోని ఒక పరిశోధన విభాగానికి, అధిపతిగా, ఉద్యోగము ఇస్తామని ఒక లేఖ వచ్చింది. ఆ ఉద్యోగము చాలా ఆకర్షణీయమైనది. దానివలన మునగాలకు మంచి కీర్తిప్రతిష్ఠలు లభించిఉండేవి. ఆయన సిరాను గడ్డ కట్టకుండా ఉంచేందుకై ఒక రసాయన పదార్థాన్ని కనిపెట్టినందుకు గుర్తింపుగా, ఈ ఉద్యోగ అవకాశం వచ్చింది. ఈ రసాయన పదార్థాన్ని కనిపెట్టకముందు, క్షణక్షణము సిరా గడ్డ కట్టుకునిపోవుట వలన ప్రజలు కలముతో వ్రాయడానికి చాల కష్టపడవలసి వచ్చేది. ఉద్యోగము ఇస్తామని ప్రభుత్వం పంపిన లేఖను మునగాల భగవాన్‌కు చూపించారు. భగవాన్ ప్రతిస్పందన అంత సుముఖంగా ఉన్నట్లు కనపడకపోవుటచే, ఆయన ఆ ఉద్యోగ అవకాశాన్ని తిరస్కరించారు. భగవాన్ సన్నిధిలో, ఆయన మార్గదర్శకత్వంలో, మునగాల సాధనలో మునిగిపోయారు.

వెంకట్రామయ్యగారి మాతృభాష తెలుగు. ఆయన ఇంగ్లీషు, తమిళభాషలు ధారళంగా మాట్లాడగలిగేవారు. సంస్కృతంలో దిట్ట. ఏమైనప్పటికీ, గ్రాంథికమైన లేదా సాహిత్యపరమైన శాస్త్రీయమైన తమిళం తెలిసి ఉండాల్సిన అవసరం ఉందని ఆయన భావించారు. భగవాన్ అప్పుడు ఆయనకు, శైవసిద్ధాంతానికి సంబంధించి శైవమహాత్ములు వ్రాసిన గ్రంథాలను పరిచయం చేశారు.

భగవాన్ స్వయంగా ఆ గ్రంథాలను ఆయనకు బోధించారు. ఆయన భవిష్యత్తులో వ్రాయబోయేవాటికి ఇవి ఎంతో అవసరం. ఎందుకంటే తర్వాత ఆయన, 'టాక్స్ విత్ రమణమహర్షి' (రమణమహర్షితో సంభాషణలు) అనే గ్రంథాన్ని సంకలనంచేశారు. శ్రీ మునగాల మాటలలోనే చెప్పాలంటే, హుషారు గొలిపేటటువంటి, జ్ఞానాన్ని ప్రసాదించేటటువంటి, తన గురువుగారి పలుకులను, వ్రాసి ఉంచే బాధ్యతను తీసుకున్నారు. తనకు తానుగా తీసుకున్న ఈ బాధ్యత తన మనస్సు శుద్ధి అగుటకు సూక్ష్మమైన, లోతైన శ్రీభగవాన్ మాటలను బాగా అర్థం చేసుకునేటందుకు ఉద్దేశించబడింది.

ఎవరైనా సాధకుని ప్రశ్నకు భగవాన్ ఇచ్చిన సమాధానం శక్తివంతంగా ఉండడానికి కారణం, "సమాధానంలోని పదముల సంఖ్యనుబట్టిగాక, ఆయన వాడిన మాటలు లోతైన అర్థము కలిగి శక్తివంతంగా ఉండుటవలననే. అందుకని అనువదించడానికి కొంత సమయము పట్టేది. కొన్నిసార్లు సాధకులు ఆంగ్లంలో కాని, ఇతర భాషలలోగానీ ప్రశ్నలు అడిగినపుడు, దానిని భగవాన్ కొరకు తమిళంలోనికి అనువదించవలసి ఉండేది. భగవాన్ అప్పుడు తమిళంలో సమాధానమిస్తే, మునగాల అపుడు దానిని, సంబంధిత భాషలోనికి (ప్రశ్న ఏ భాషలో అడిగారో ఆ భాషలోనికి) తర్జుమా చెయ్యవలసి వచ్చేది. ఆయన అనువదించేటపుడు ఏమాత్రం తేడా రాకుండా చూసుకోవలసి వచ్చేది.

'టాక్స్ విత్ రమణమహర్షి' అనే గ్రంథానికి వ్రాసిన ముందుమాట (శీర్షిక)లో డాక్టర్ టి.ఎం.పి.మహదేవన్ ఈ విధంగా వ్రాశారు. మునగాల ఎస్.వెంకట్రామయ్య గారికి మనమెంతో ఋణపడి ఉన్నాము. ఎందుకంటే 1935నుండి 1939 వరకూ, నాలుగు సంవత్సరాలకాలం, భగవాన్ తోటి భక్తుల సంభాషణలను, ఆయన గ్రంథస్థము చేసినందుకు. ఏ భక్తులైతే భగవాన్‌ను చూడగల్గి, మాట్లాడగల్గిన సందర్భాన్ని పొందారో వారు తమ మనసులోని జ్ఞాపకాలద్వారా, గురువుగారి మాటలను తలచుకుని ఆనందించ వచ్చును. అరుణాచలరమణులు, ఎక్కువభాగం మౌనంద్వారా బోధించినా, ఆయన వాక్కు ద్వారా కూడా స్పష్టమైన, తికమక పెట్టని (సందేహానికి తావివ్వని) వినేవాళ్ళ మనసుల్ని అనవసర విషయాలతో మేఘావృతం చెయ్యకుండా, బోధించేవారు. ఆయన మాట్లాడిన ప్రతి మాట భవిష్యత్తు తరాలవారి కోసం భద్రపరచాలని కోరుకుంటారెవరైనా.

మేజర్ చాడ్విక్, ఈ పుస్తకంయొక్క పరిచయంలో, ఇలా వ్రాశారు, "ఈ పుస్తకంలో నాలుగేళ్ళపాటు జరిగిన సంభాషణలు పొందుపరచబడి ఉన్నవి. ఆ కాలంలో ఆశ్రమం చాలా ఉచ్ఛస్థితిలో ఉన్నది. మహర్షి ఆరోగ్యము చాలా వరకు బాగానే ఉండేది. ఆయన కూర్చునే హాలు తలుపులు పగలూరాత్రీ కూడా తెరచే ఉండేవి. ఎవరైనా లోనికి రావచ్చును. అందరికీ

ప్రవేశం ఉండేది. ప్రపంచం నలుమూలలనుండి, సందర్శకులు వస్తుండేవారు. సందర్శకులు ప్రపంచంలోని అన్ని దేశాలనుండి వస్తూ ఉండేవారు. భగవాన్ సూర్యుని వలె ప్రకాశిస్తుండేవారు. ఆయన ఉపదేశాలను అర్థం చేసుకోలేని వారుకూడా, ఆయన బోధలతో ఏకీభవించని వారు కూడా, ఆయన సన్నిధానంలో ఉత్తేజితులౌతుండేవారు.

శ్రీరామకృష్ణపరమహంసకు, ఆంగ్ల అనువాదకులుగా ఒక పాఠశాల ఉపాధ్యాయులైన 'యమ్' (M) ఉండేవారు. ఇక్కడ మునగాల భగవాన్ యొక్క 'యమ్'గా ఉండేవారు. తాను ఏదైతే అనువదించి చెప్పారో దానినంతా లిఖితరూపంగా భద్రపరచారు. ఆయన వ్రాసిన నోటుపుస్తకం భగవాన్‌కు చూపగా, ఆయన సరిదిద్దేవారు. అలా తయారైనదే 'టాక్స్ విత్ రమణమహర్షి' అనే గ్రంథం. ఈ పుస్తకం అసలు ప్రతి, చేతితో వ్రాయబడినది. నోటు పుస్తకాల రూపంలో ఉన్నదానిని నేను చూచాను. అందులో భగవాన్ సరిదిద్దిన దిద్దుబాట్లు కూడా ఉన్నవి. అందులో కొన్ని వ్రాతప్రతులను, భక్తులైన టైపిస్ట్ కిట్టూతోనూ, రమామణిగారితో కలిసి నేను కూడా టైపు చేశాను. ఆ టైపు చెయ్యబడిన విషయాన్నంతటినీ, కొంతమంది భక్తులతో ఏర్పడిన కమిటీకి, సమర్పించాము. వారిలో ఎక్కువమంది చెన్నైలో ఉండేవారు. వారు తప్పొప్పులు దిద్ది సంపాదకత్వం నెరపి, తిరిగి ఆశ్రమానికి పంపారు. అలా వచ్చిన ప్రతిని ఇంకా తప్పులుంటే సరిదిద్దమని మునగాలకూ, మేజర్ చాడ్విక్‌కూ అందచేయబడింది. పేజీలకు పేజీలు ఎర్రసిరాతో కొట్టివేయబడి, మార్జిన్‌లో (పేజీకి ఎడమప్రక్కన వదిలే ఖాళీ) పునరావృతం అని రిమార్కు వ్రాసి ఉంది. చాడ్విక్ ఆ కొట్టివేతలు చూడగానే కలతచెంది, కోపంతో ఆఫీసులోకి దూసుకుని వెళ్ళి, "భగవాన్ చెప్పిన పేరాలను కొట్టివేయడానికి వీళ్ళెవరు? భగవాన్ ఒకే పేరాను, వేరువేరు పదాలనుపయోగించి చెప్పటంలో ప్రత్యేకమైన ఉద్దేశముంది. అది ప్రతి సాధకుడియొక్క వ్యక్తిగత అవగాహనా శక్తికి సరిపోయటట్లు అదే భావాన్ని వేరు వేరు పదాలు వాడి చెప్పారు. ఒక చిన్న మాటకూడా తొలగించడానికి వీలులేదు. అవి అన్నీ భగవాన్‌చేత ఆమోద ముద్ర పొందినవే," అన్నారు. ఆయన సలహా పాటించబడింది. ఇవాళ ఆ గ్రంథం సంపూర్తిగా సంభాషణలను కలిగియున్నదంటే (కొన్ని భాగాలను తొలగించకుండా) అది చాడ్విక్ వలననే. మేజర్‌చాడ్విక్‌కు మునగాల సామర్థ్యము, రచనలో ఖచ్చితంగా ఉండే తత్వము అంటే ఎంతో గౌరవం. ఒకసారి చాడ్విక్ హాస్యంగా, "మునగాల భగవాన్‌యొక్క ఇంగ్లీషు నోరు," అన్నారు.

భగవాన్ తన శిష్యుని తెలివితేటలను, ఉత్సాహాన్నీ గమనించి, మునగాలను ప్రాచీనగ్రంథాలైన త్రిపురారహస్యము, అద్వైతబోధదీపిక, కైవల్య నవనీతములను అనువదించమని చెప్పారు. త్రిపురారహస్యము మునగాల వారిచేత ఆంగ్లంలోనికి ఎలా అనువదించబడిందీ అనేదొక ఆసక్తికరమైన సంఘటన. ఒకప్పుడు దైవరాత నేపాల్‌లో ఉంటున్న సమయంలో, త్రిపురారహస్యము అనే సంస్కృతగ్రంథాన్ని చూచి, వ్రాసిన వ్రాత ప్రతిని, భగవాన్‌కు పంపారు. ఆ గ్రంథాన్ని ఆయన నేపాల్‌రాజు గ్రంథాలయంలో చదివారు. భగవాన్ దానిని చదివి సంతోషించారు. ఆ గ్రంథాన్ని ఆంగ్లంలోనికి అనువదిస్తే, సంస్కృతం రాని సాధకులకు ఉపయుక్తంగా ఉంటుందను కున్నారు భగవాన్. మునగాల తనంత తానుగా ఆ పనిని చేయటానికి ముందుకు వచ్చారు. దానిని చదివి చాడ్విక్ ఎంతో సంతోషించి, దానిని టైప్ చేయించడానికీ, దానికి నల్లలెదర్ (తోలు) బైండింగ్ చేయించడానికి సాయపడ్డారు. అలా తయారుచేసిన ఆంగ్ల ప్రతిని భగవాన్‌కు బహూకరించారు. ఆయన దానిని తన మంచం ప్రక్కనేగల తిరిగే అల్మైరాలో పెట్టుకున్నారు. (Revolving Library Shelf) దానిని ఆర్తితో ఉండి ప్రాచీన అద్వైతగ్రంథాలను చదువాలనుకునే వారికి చదువుకోవడానికి ఇస్తుండేవారు. మునగాల చేసిన ఆంగ్ల అనువాదం భగవాన్‌కు ఎంతగానో నచ్చింది. అందుకనే ఆయన మునగాలవారిని, కైవల్యనవనీతము (తమిళము), అద్వైతబోధదీపిక (సంస్కృతం) లను ఇంగ్లీషులోనికి అనువదించమని ప్రోత్సహించారు. అవి కూడా టైపు చేయబడి లెదర్ బైండింగ్ చేయబడి, భగవాన్ మంచం ప్రక్కనగల పుస్తకాల అలమరలో పెట్టబడ్డవి. తర్వాత అవి ఆశ్రమము వారిచే ముద్రించబడ్డవి. డేవిడ్ మెక్లైవర్‌గారి సహకారంతో వెంకట్రామయ్య, భగవాన్ యొక్క 'అరుణాచల స్తుతిపంచకం' అనే హృదయాన్ని ద్రవింపజేసే అయిదు తమిళపద్యాలను ఆంగ్లంలోకి అనువదించారు. తర్వాత రోజులలో 'Collected Works of Ramana Maharshi' (రమణమహర్షి రచనల సంగ్రహము) తయారవడానికి, ఇదే బీజము, పునాది కూడా. ఈ పుస్తకానికి ఆర్థర్ ఆస్‌బోర్న్ సంపాదకత్వం వహించారు. నిజమైన గురుశిష్య సంబంధానికి – భగవాన్, మునగాల మధ్యగల సంబంధాన్ని దృష్టాంతంగా చెప్పుకోవచ్చు.

మునగాల శాంతికి, నెమ్మదితనానికి, అంతరంగిక సంతోషానికి ప్రతిరూపం. ఆయన ప్రశాంత వదనంలో ఎదుటివారిని ఆహ్వానిస్తున్నట్లుండే ఒక చక్కని చిరునవ్వు ఎల్లపుడూ ఒక భూషణంవలె ఉండేది. ఆయన ఎప్పుడూ జనసందోహంతో భగవాన్ మందిరంలో పూజాసమయంలోనూ, భోజనశాలలో భోజనసమయంలోనూ తప్ప, బయట ఎప్పుడూ కనిపించేవారు కాదు. మిగిలినసమయం అంతా తన గదిలో ఉపనిషత్తులను చదువుతూ ఉండిపోయేవారు. ఎంతోమంది సాధకులు, ఆయన వల్ల ప్రేరణ పొందేవారు. ఆయనప్రశాంతమైన ఆధ్యాత్మిక జీవితం వారిలో ప్రేరణ కలిగించేది. ఆయనతో సన్నిహితంగా మెలిగి, ఆయన ఉదాత్త జీవితాన్ని చూచి, ప్రేరణ పొందే భాగ్యం నాకు కల్గింది. భగవాన్ పాతభక్తులందరిలోనూ, ఈ అద్భుతమైన ఆధ్యాత్మిక లక్షణాన్ని నేను గమనించాను. వారు, సత్యంగా జీవిస్తూ, తమ ఆచరణాయుతమైన ఆధ్యాత్మిక జీవనం ద్వారానే యువతరానికి ప్రేరణ కల్గించేవారు. వారు సత్యాన్ని గురించి బోధించడం ద్వారా కాకుండా, సత్యమే తమ జీవితంగా ఉంటూ సాధకులకు ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి కలిగేటట్లు చేసేవారు.

నా జీవితంలోని రెండు ముఖ్యఘటనలు, మునగాల యువ సాధకులను ఎలా నడిపిస్తారో తెలియచేస్తాయి. 1960లో నేను రమణాశ్రమంలో స్థిరపడినప్పుడు, కొద్దిమంది పాతభక్తులు కావ్యకంఠగణపతిమునిని నా వద్ద విమర్శించారు. క్యావకంఠులవారు చెప్పే విషయాలు, ఆయన ఊహాజనితాలైన కల్పనలే అని వారన్నారు. నాకు దానితో దుఃఖం కలిగింది. నేను మునగాల వద్దకు వెళ్లాను. ఆయన కావ్యకంఠులను చూడలేదు. ఆయనపట్ల మునగాలకు తటస్థభావం ఉండేది. గొప్ప పండితులు కూడా, కావ్యకంఠులవారు చెప్పే వాటిని గూర్చి అవమానకరంగా ఎందుకు మాట్లాడుతున్నారని నేను ఆయనను అడుగగా, ఎవరినైనా సరే, అందులోనూ భగవాన్ భక్తులను నిందించడం, నీకు శ్రేయస్కరం కాదు. ఆ మహాత్మునిగురించిన నిందలు నీకెలా తెలిసినవి. అవి ఇతరుల అభిప్రాయాలు కదా. అభిప్రాయాలు మనసులోనుండి ఉదయిస్తాయి. సత్యము హృదయములోనే ప్రకాశిస్తుంది. నీకెప్పుడైనా సందేహాలు వస్తే, వెంటనే నేరుగా భగవాన్‌పై ధ్యాసపెట్టు. ఇతరుల అభిప్రాయాలను పట్టించుకోకు. భగవాన్ నీకు దారిచూపిస్తారు. భగవాన్, కావ్యకంఠుల యొక్క అపారమైన జ్ఞానసముపార్జనా శక్తిని, సత్యముపట్ల ఆయనకు గల అంకితభావాన్ని ప్రశంసించారు. ఉదాహరణకు ఒకరోజు భగవాన్, కావ్యకంఠుల గురించి దాదాపు గంటసేపు మెచ్చుకుంటూ మాట్లాడారు. ఆయన ఉమాసహస్రాన్ని ఎలా వ్రాశారు, హరసహస్రాన్ని ఎలా వ్రాశారు, తన శిష్యులను ప్రాచీన గ్రంథాలను ఎలా బోధించేవారు, అంత పాండిత్యమూ, సామర్థ్యమూ కలిగి ఉండి కూడా, ఎంత అణకువగా, వినయంగా ఉండేవారు ఎంత నిష్ఠగా జపం చేసేవారు, ఎంత బాగా తన లక్ష్యాన్ని అందుకోగలిగారు అనే విషయాల మీద, 1936లో కావ్యకంఠుల మరణాన్ని గురించి విన్నపుడు, "నాయనలాంటి మరొకరిని మనమెప్పుడు చూడగలము?" అన్నారు. నేను ఆయనకు, ఈ ఆత్మోన్నతి చెందించే వివరణకు హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుకున్నాను.

వేరొకరోజున, రమాదేవి మాత అనే మహాత్మురాలు ఆశ్రమానికి వచ్చింది. ఆమెకు ఎంతోమంది అనుచరులుండేవారు. కొన్ని గీతాలు పాడినప్పుడల్లా, ఆమె సమాధిలోనికి వెళ్తుండేవారు. ఒక రోజు సాయంత్రం మునగాల, నా గదికి వచ్చి, రమాదేవి భజనకార్యక్రమానికి రమ్మని పిలిచారు. నాకు ఆసక్తి లేదనీ, నాకు నా భగవాన్ ఉన్నారు. అదే నాకు చాలుననీ, నేను అన్నాను. మునగాల పసిపిల్లవాడిలాంటి అమాయకత్వంతో నావైపు తిరిగి అన్నారు, "నువ్వు రామకృష్ణ పరమహంస గురించిన పుస్తకాలను చదివావు కదా?" "అవును స్వామీ," అని నేను బదులిచ్చాను. రామకృష్ణుల వారు భావసమాధి లోనికి వెళ్తుండేవారని నువ్వు చదివే ఉంటావు. మనము దాని గురించి చదవటమే కానీ, స్వయంగా దానిని అనుభవించలేదు. రమాదేవి అటువంటి దివ్యమైన స్థితికి వెళ్తుంది. అది మానసికమైన స్థితి కాదు. కేవలము శుద్ధ ఆధ్యాత్మిక స్థితి. నాకు తెలిసినంతవరకూ, ఇతరులు చెప్పేదాన్ని బట్టి, శ్రీరామకృష్ణుల తర్వాత మాత రమాదేవి మాత్రమే ఆ ఆధ్యాత్మిక స్థితిని పొందగలిగింది. మునగాల నా చేతిని పట్టుకుని, హాలులోనికి తీసుకొని వెళ్ళి, తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నారు. భజన జరుగుతూ ఉంది. రమాదేవి గాఢధ్యానంలో మునిగి ఉంది. భజన మధ్యలో ఆమె అర్థంతరంగా లేచి నిలుచుంది. మునగాల నాతో అన్నారు, "ఆమె భావసమాధిలోకి వెళ్ళారు. ఆమెవైపే చూస్తూ ఉండు. గౌరవాన్ని కలిగి ఉండు". ఆ భజన దేవి, రాక్షసుణ్ణి సంహరించే ఘట్టమును గురించి జరుగుతున్నది. రమాదేవి ఆ ఘట్టాన్ని నటించి, అభినయించి చూపించారు.

తన చేతిలో ఖడ్గమున్నట్లు, దానితో రాక్షసుడిని చంపుతున్నట్లు, ఆమె నృత్యం చేస్తూ అభినయిస్తున్నారు. రమాదేవి స్థూలకాయురాలు. అందుకని ఆమె వేగంగా కదులుతూ, మెలికలు తిరుగుతూ నృత్యం చేయడం చూస్తుంటే, వింతగా అన్పించింది. చివరగా, ఆమె సమాధిలోనికి వెళ్ళింది. ఆ రాక్షసుణ్ణి చంపిన తర్వాత, అచ్చు, పురాణాలలో చెప్పినట్లుగా. ఆమె ఒంటికాలుపై నిలబడి, ఒక చేతిలో ఆ చనిపోయిన రాక్షసుని తలనూ (ఊహల్లో), ఒక చేతిలో ఖడ్గాన్నీ ధరించారు. (అలా ఆమె అభినయించారు). మునగాల చిన్నగా నాతో చెప్పారు. అంత భారీశరీరం ఒంటికాలిపై నిలబడడం అనేది, అసాధ్యమైన విషయం. భగవంతుడే ఆమెను ఆ భంగిమలో నిలబెడుతున్నారు. రామకృష్ణ పరమహంస పట్ల నేనెల్లపుడు ఇష్టంతో ఉండేవాడిని, భావసమాధి అంటే ఎలా ఉంటుందీ అని నేను ఆశ్చర్యపోతూండేవాడిని. ఇప్పుడు మునగాల ద్వారా ఆ కోరిక తీరింది. ఆ విషయంలో సందేహంలో ఉన్న నాకు రమాదేవి సంశయ నివృత్తి గావించారు.

నేనెప్పుడు మునగాల గదికి వెళ్ళినా, ఆయన ఉపనిషత్తులను చదువుతుండే వారు. ఒకరోజు నేను ఆయనను ఇలా అడిగాను, "మీరు భగవాన్‌కు ప్రత్యక్ష శిష్యులై ఉండి కూడా ఆత్మవిచారణ అభ్యాసం చెయ్యకుండా ఎల్లప్పుడూ ఉపనిషత్తులు చదువుతుంటారెందుకు?" అని. మునగాల నెమ్మది స్వరంతో అన్నారు. ఈ పారాయణ నా గురువుగారు చెయ్యమని చెప్పారు. నేను భగవాన్‌ను, ఉపనిషత్తుల పఠనాన్నే నా సాధనగా తీసుకొనవచ్చునా అని అడిగాను. భగవాన్ నన్ను ఈ ఉపనిషత్తులను ప్రతిరోజు, రోజంతా చదువుతూ ఉండమన్నారు. ఆర్తితో ఉన్న సాధకునికి, ఉపనిషత్తులు చదవటమనేది పూర్తి ప్రామాణికమైన సాధన. (పారాయణ అనేది ఎల్లప్పుడూ ఉండే ఆత్మను గుర్తుచేసుకోవటానికే, భగవాన్ అప్పటికే ఆయనకుఎప్పుడూ ఆయన హృదయంలోనే ఉన్న ఆత్మ ఎరుక పడేటట్లు చేశారు).

మునగాలకు ఇంకొక కుమార్తె ఉన్నారు. ఆమె పేరు కామాక్షి. ఆమె బాలమేధావి. సంస్కృత పండితురాలు. ఆమెకు తొమ్మిదేళ్ళు వయసు వచ్చే సరికి, సంస్కృత భాషలోని గొప్ప గ్రంథాలన్నిటినీ క్షుణ్ణంగా చదివేశారు. ఆమె కౌమారదశలో (13-19) ఉండగానే, ఎంతో ఆత్మవిశ్వాసంతో పండితుల చర్చాగోష్ఠిలో పాల్గొని, ఆ పండితులతో సంవాదము నెరపి, గెలుపొందేవారు. ఆమె పిన్నవయస్కురాలైనప్పటికి, ఎంతో పాండిత్యము కలదానివలె కన్పించేవారు. భగవాన్ కరుణతో, ఆమె మేధోపరమైన జ్ఞానాన్ని భక్తితో కూడిన వివేకంగా మార్చారు. (ఒకప్పుడు, ఒక భక్తుడు, మీ బోధ అంతా కూడా, కేవలం మేధస్సుపరమైనదే కదా? అన్నారు. భగవాన్ భక్తితో కూడిన విచారణనే నేను బోధిస్తాను అన్నారు). ఒకరోజు ఉదయం భగవాన్ హాలులో ఉన్నప్పుడు కామాక్షి అటువైపు వెళ్తుండగా ఆమెను హాలులోనికి పిలిచారు. అత్యంత మేలైన వివేకాన్ని అందిస్తూ భక్తిలో ముంచివేసే భగవాన్ శ్రీకృష్ణుని జీవితము, బోధనలు కలిగి ఉన్న శ్రీమద్భాగవతాన్ని ఆమెకు ఇచ్చి హాలులో ఒక చోటు చూపించి, అక్కడ కూర్చుని ఆ పుస్తకాన్ని చదవమన్నారు. మనుషులు రావటం ప్రారంభమవగానే, ఆమెను పిలిచి పుస్తకం చదివినంత వరకు పేజీని గుర్తుపెట్టి మరుదినము రమ్మని చెప్పి పంపించేశారు. ఆ పుస్తకపఠనం పూర్తి అయ్యేంతవరకు ప్రతిరోజు అక్కడకు వచ్చి చదువవలసినదిగా ఆమెకుచెప్పారు. భాగవతంలోని భక్తి, వివేకాలను ఆమె ఆకళింపు చేసుకునేలా చేశారు.

మరొకరోజున ఆమెను పిలచి చిన్న కాగితపు చీటీని ఆమెకు ఇచ్చారు. దానిమీద 'ఓం నమో భగవతే శ్రీరమణాయ' అనే మంత్రము వ్రాసి ఉంది. ఆమె ఆ మంత్రాన్ని తనశ్రావ్యమైన కంచుకంఠంతో చదివారు. భగవాన్ ఆమెవైపు ఏకాగ్రంగా (తదేకంగా) చూశారు. అందుకని కామాక్షి, "భగవాన్, దీనిని నేను రోజూ చదవనా?" అని అడిగారు. భగవాన్ "ఎల్లప్పుడూ," అన్నారు. తర్వాత ఆ చీటిని ఆమెనుండి తీసివేసుకుని, తన ఎదురుగా ఉన్న మండుతున్న పొయ్యిలో పడవేశారు. ఈ సంఘటనవల్ల, కామాక్షినుండి ఒక మాట తీసికొనటమూ,ఆమె భగవాన్ చెప్పిన మాటకు కట్టుబడి ఉండడానికి సిద్ధపడడమూ జరిగింది. "ఓమ్ నమో భగవతే శ్రీరమణాయ" అంటే, భగవాన్ శ్రీరమణుల ఎడల అణకువ, విధేయత, భక్తి కలిగియుండుట. భగవాన్ తనకు ఆ మంత్రము ఇవ్వటము వలన, ఆమె భక్తిమార్గములో పరిపూర్ణత పొందేటట్లుచేసింది. ఆమె జీవితమంతా, ఈ మంత్రాన్ని జపిస్తూనే ఉంది.

రమణనగర్‌లో, ఆశ్రమానికి ఎదురుగా ఉన్న వీధిలో, ఆర్థర్ ఆస్‌బోర్న్ ఇంటిప్రక్కన, కామాక్షికి కొంత స్థలమూ, దాంట్లో ఒక చిన్న ఇల్లూ ఉన్నది. ఆమె భర్త డాక్టర్, రామచంద్రయ్య ప్రొఫెసర్‌గా విశ్వవిద్యాలయంనుండి, పదవీ విరమణ చేసిన తర్వాతనే, ఆమె ఆ ఇంట్లోకి రాగలిగారు. ఆమె తనభర్తతో ఆ ఇంట్లో కొద్ది సంవత్సరాలు గడిపారు. అది ఆమె జీవితమంతటిలోకి సంతోషకరమైన సమయం. ఆ తర్వాత, ఆమె జబ్బుపడడమూ, హాస్పిటల్‌కు తీసుకుని వెళ్ళగా, కాన్సర్ వ్యాధి చివరిదశలో ఉన్నట్లు తేలింది. వైద్యపరంగా (దూరంగా ఉన్న) ఆస్పత్రిలో ఉండవలసినదని ఆమెకు సూచింపబడినప్పటికీ, పవిత్రమైన అరుణాచల పాదము వద్ద, తన సద్గురు రమణుల పవిత్రమందిరం సమీపంలో, తన స్వంత ఇంటిలో తన చివరి దినాలను గడపటానికి ఆమె మొగ్గుచూపారు. ప్రతిరోజూ నేను కొన్ని గంటలుఆమెతో గడిపేవాడిని. ఎక్కువ మోతాదులో మందులు వాడవలసి వచ్చినందున ఆమె శరీరము కృశించిపోసాగింది. అందమైన స్త్రీ అయినటు వంటి కామాక్షి గుర్తించలేనట్లుగా తయారయింది చివరకు. ఒకరోజు నేను దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేశాను. "భగవాన్ మిమ్ములను ఎందుకు కాపాడుట లేదు?" అని. ఆమె ఇలా సమాధానం ఇచ్చారు, "మీరు, నా అంతరంగ స్థితిని గురించి ఆలోచించకుండా, కేవలం నా బాహ్య ఆకారం పైనే దృష్టిని పెడుతున్నారు. నేను మీకు ఎన్నోసార్లుచెప్పాను. నేను ఈ శరీరాన్ని కాదు అని. భగవాన్‌ను నేను దర్శించుకున్న మొదటిరోజునే, ఆయన కృపావీక్షణం నన్ను హృదయంలో స్థిరపరిచినది. నేను సాధారణంగా, ఈ శరీరంతోగానీ, మనస్సుతోకానీ తాదాత్మ్యం చెందను. ఈ శరీరం వచ్చింది. అది తిరిగి వెళ్ళాలి. నేను శాశ్వతంగా ఆత్మనే. ఈ శరీరమే నిజమనే భ్రాంతినుండి, మిమ్మల్ని మీరు విడుదల చేసుకోండి. నేను ఎల్లప్పుడూ సంతోషంగా ఉన్నాను. నేను ఆనందంలో మునిగి ఉన్నాను." ఒక అనుగ్రహపూరితమైన చిరునవ్వుతో ఆమె ఇంకా ఇలా అన్నారు, "మీకు నా దీవెనలు. భగవాన్‌కు పూర్తిగా శరణాగతి చెందండి. భగవాన్ మీకు మార్గం చూపుతారు." కొద్ది రోజులలోనే కామాక్షి చనిపోయారు. ఆమె శరీరాన్ని స్మశానానికి మోసుకునిపోయి, జ్వాలలకే జ్వాలయైన అరుణాచలునికి ఆహుతిచేసే భాగ్యం నాకు దక్కింది.

"లక్ష్మణశర్మ, మునగాల వెంకట్రామయ్యల ప్రత్యేకత ఏమిటంటే, వారిద్దరూ అణుకువతో ఉండేవారు. వారిద్దరూ ఏ విధమైన ప్రచారాన్నీ, గుర్తింపునీ కోరుకోలేదు. లక్ష్మణశర్మ తన అసలు పేరును మరుగుపరచి 'ఎవరు'(who) అనే మారుపేరుతో రచనలు చేశారు. మునగాల భగవాన్ మహాసమాధి చెందేవరకు తన రచనలను ప్రచురించలేదు. మునగాల త్రిపురారహస్యానికి తన ఆంగ్లానువాదాన్ని నాకు చూపించి, "మీరు దీనిని చూశారా?" అన్నారు. అది ముద్రించమనే అభ్యర్థన కాదు. ఊరికినే అడిగారు. ఆ ఇద్దరు భక్తులూ, వారి అహంకారాన్ని (వ్యక్తిత్వాన్ని) పూర్తిగా తుడిచిపెట్టేశారు. నశింపజేశారు. పుస్తకం తయారవుతున్నపుడు, నాకు ఆ పుస్తకము యొక్క పేరు (శీర్షిక / Title) అర్థం కాలేదని తెలిపాను. ఆయన అది చాలా స్పష్టంగా ఉంది అన్నారు. నేను ఆయనకు వివరించాను దాని అర్థం అందరికీ బోధపడదని. ఆయన ఇలా అన్నారు, "ఆ పేరునే నేను భగవాన్‌కు చూపించాను. ఇప్పుడెలా వేరే పేరు దానికి జతపరచగలను?" అన్నారు. నేను, దానిని ఇతరుల కోసం అలా చేస్తే బాగుంటుందన్నాను. ఆయన అప్పుడు 'మిస్టరీ బియాండ్ ట్రినిటీ' (Mystery Beyond Trinity) (త్రిపుటి ఆవల రహస్యము) అనే ఉపనామాన్ని చేర్చారు.

భగవాన్ చనిపోయినపుడు మునగాల ఆశ్రమాన్ని వదలి తన పిల్లలతో ఉండడానికి వెళ్ళిపోయారు. 1955లో ఆయన సన్యసించి, స్వామి రమణానంద సరస్వతి అనే నామధేయాన్ని స్వీకరించారు. 1963లో ఆయన అరుణాచలునిలో ఐక్యమైనపుడు, ఆయన చెప్పిన ప్రత్యేకమైన సూచనల ప్రకారం, ఆయన దేహం, ఆయన కుమార్తె కామాక్షి ఇంటి పెరటిలో సమాధి చెయ్యబడింది. అరుణాచల రమణన్ అనే ఉజ్వల జ్ఞానజ్వాలలో, మునగాల వెంకట్రామయ్య ఒక ప్రకాశించే జ్వాలగా శాశ్వతంగా జీవించి ఉంటారు.

కె.కె.నంబియార్



1932లో కె.కె.నంబియార్ అనబడే మళయాళీ (కేరళకు చెందిన) సివిల్ ఇంజనీర్ ప్రభుత్వోద్యోగిగా ఉంటూ తిరువణ్ణామలైలో రోడ్లు వేయించారు. ఆయన మొట్టమొదటి తారురోడ్డును ఆసుపత్రినుండి రమణాశ్రమానికి వేశారు. ఆయన భక్తి అలాంటిది. ప్రభుత్వము ఈ పనిగురించి తనను ప్రశ్నిస్తుందేమోననే బెంగ ఏమీ లేదు ఆయనకు.

ఆయన 1932లో ఆశ్రమానికి రావడానికి ముందు, 'నేనెవరను?' అనే పుస్తకానికి మళయాళ భాషలోని అనువాదాన్ని చదివారు. 'జీవించి ఉన్న మహర్షి' అనే సమాసము ఆయన దృష్టిని ఆకర్షించింది. ఆయన పెద్దగా నవ్వేశారు. ఎందుకంటే మహర్షులు అనే వాళ్ళు వేల సంవత్సరాల క్రిందట ఉండేవారుకానీ, ఇప్పుడు ఉండడమనేది ఆయనకు నమ్మలేని విషయంగా అనిపించింది. ఆ పుస్తకంలో ఉన్న విషయాన్ని అపహాస్యం చేసి, నమ్మటానికి నిరాకరించారు. కానీ, ఆ మర్నాడే, ఆయన యొక్క ఇంకొక స్నేహితుడు, "అలా చెయ్యకు. నేను స్వయంగా ఆయనను చూశాను. ఆయన నిజంగానే మహర్షి, మనం అక్కడకు వెళ్దాము," అన్నారు. ఆయన ఆ విధంగా భగవాన్ వద్దకు వచ్చారు. భగవాన్ తన దృష్టిని ఆయనపై ప్రసరించగానే ఆయనకు వశీభూతులు అయిపోయారు. ఒక గంట తర్వాత, ఆయన ఆశ్రమాన్ని విడిచి వెళ్ళవలసి వచ్చినపుడు ఆయన ఈ విధంగా అనుకున్నారు. "ఆశ్రమాన్ని వదలిరాగానే నా హృదయము, ఒక గొప్ప ఆధ్యాత్మిక అయస్కాంతానికి, మానవశరీరంలో ఉన్న దైవత్వానికి, నిర్నిరోధంగా (నిరోధించలేని విధంగా) ఆకర్షింపబడింది". గ్రాంట్‌డఫ్ అనే ఆయన అంతకు పూర్వమే అటువంటిదే అయిన తన అనుభవాన్ని వర్ణించారు. కానీ నంబియారు దానిని చదివి ఉండలేదు. ఆయన అన్నమాటలు, ఆయన స్వీయ అనుభవంతో అన్నవే.

గురువు అనుగ్రహం వల్ల నంబియార్ అప్పటినుండి తరచుగా, భగవాన్‌ను దర్శిస్తుండేవారు. నంబియార్ సోదరి భర్త, ప్రభుత్వ వైద్యాధికారిగా తిరువణ్ణామలైలో నియమింపబడ్డారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని నంబియార్ భగవాన్‌ను దర్శిస్తుండేవారు. నంబియార్ బావగారు నాస్తికులు. "సాధువులందరూ మూర్ఖులు, సోమరిపోతులు," అని ఆయన అంటుండేవారు. కానీ మరల అనుగ్రహమెట్లా ప్రవహిస్తుందో చూడండి. భగవాన్‌కు పంటినొప్పి వచ్చింది. ఆయనకు వైద్యసేవ అవసరమైంది. నంబియార్ బావగారు ఆ సమయంలో ఆస్పత్రిలో విధినిర్వహణలో ఉండుటచే, ఆయన భగవాన్‌ను చూడవలసి వచ్చింది. ఆయన, నేను ఆయనను కేవలము రోగిగానే చూస్తాను అని గట్టిగా చెప్పారు. ఆ వైద్యుడు, డాక్టర్ పి.సి.నంబియార్ తర్వాత నేను ఆయనను కలుసుకున్నపుడు ఇలా చెప్పారు, "గణేశన్! నేను చాలా అహంకారంతోనూ, అమర్యాదగానూ ఉన్నాను. ఆయన పన్ను పీకటానికి వెళ్ళినపుడు. భగవాన్‌తో, 'ఏయ్ నీ నోరు తెరువు,' అన్నాను". కానీ భగవాన్ స్పర్శ ఆయనలో గొప్ప మార్పును తెచ్చింది. సంపూర్ణమైన మార్పు ఆయనలో సంభవించి ఆ నాస్తికుడు కాస్తా, ఒక భక్తుడుగా మారిపోయారు.

1936లో కె.కె.నంబియార్ కూడా తిరువణ్ణామలైకు బదిలీ చేయబడ్డారు. ఆ సమయానికి, మహర్షితో ఆయన అనుబంధం, అన్ని విధాలుగానూ, అన్ని కోణాలలోనూ బలపడింది. ఆశ్రమములోని ఒక ఉత్సవ సమయంలో నంబియార్, భగవాన్ సమక్షంలో భోంచెయ్యాలనుకున్నారు. భగవాన్ భోంచేస్తుండగా చూడాలి అని తనలో తాను అనుకున్నారు. అక్కడ చాలా పొడుగు క్యూ ఉన్నప్పటికీ, శిష్యుని ఆర్తివలనా, గురువు అనుగ్రహం వలనా ఆయన సరిగ్గా భగవాన్ ఎదురుగా భోజనానికి కూర్చోవడం సంభవించింది. అన్నం వడ్డించబడుతున్నపుడు, ఆయన గర్వంతో పొంగిపోయి నా ప్రార్థన అంగీకరింపబడింది అనుకున్నారు. రమణాశ్రమంలో అన్నాన్ని ఒక పెద్ద గిన్నెలో తెచ్చి వడ్డిస్తారు. తన ప్రార్థన అంగీకరింపబడింది అని ఆయన అనుకుంటున్నంతలో, ఆయనకు వడ్డించబడిన అన్నంగడ్డ ప్లేటులోనుండి దొర్లిపోయింది. భగవాన్ నంబియార్ వంకకు చూసి అన్నారు, "అదుతాన విళుందదు, తానే విళుందుదుత్తు". దాని అర్థము అది దానంతట అదే జరిగిపోయింది.

అందుకని అది అద్భుతమని భావించరాదు. అది కేవలము అనుగ్రహము వల్ల జరిగింది. తాను కోరుకొనుట వలన జరగలేదు.

నంబియార్ నాతో అన్నారు, "భగవాన్ దానంతటదే దొర్లిపోయింది అన్న క్షణంనుండి, ఎన్నో అద్భుతాలు నా జీవితంలో వరుసగా జరిగిపోయాయి. ప్రతిదీ ఒక కలలాగే ఉండేది".

ఒకరోజు భగవాన్ ఆయన కలలో కన్పించారు. ఆయన నంబియార్‌కు నల్లగుడ్డతో బైండు చేసిన ఒక నోటు పుస్తకాన్ని చూపించారు. ఆయన ఆ పుస్తకం యొక్క మందము, పేజీల సంఖ్య, సైజు చూపించారు. భగవాన్ కలలో "నాకు ఈ నోటుపుస్తకము కావాలన్నారు. నంబియార్ అర్థంతరంగా నిద్రలేచి, టేబుల్ (సొరుగు) డ్రాయర్‌లాగి చూశారు. డ్రాయర్‌లో సరిగ్గా అలాంటి నోటుబుక్కే ఉంది. ఆ నోటుపుస్తకము చేతబట్టుకుని పరుగున భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్ మీరు నా కలలో కన్పించి ఈ పుస్తకాన్ని అడిగారు," అన్నారు. భగవాన్ తన పరిచారకుని వైపు తిరిగి అన్నారు, "నేను గత మూడురోజులుగా ఇదే పుస్తకంకోసము నిన్ను అడుగుతున్నాను. నేను ఈ వివరాలన్నీ కూడా నీకు చెప్పాను," అన్నారు. "చూడు నంబియార్ దానిని తీసుకుని వచ్చారు". భగవాన్ పరిచారకుని అటువంటి పుస్తకము కావాలని అడుగుతున్నారు. ఎందుకంటే ఆయన కావ్యకంఠముని యొక్క రమణగీతను మళయాళభాషలో వ్రాయాలనుకున్నారు. చూడండి నంబియార్ ఆ పుస్తకాన్ని భగవాన్‌కు ఎలా తెచ్చి ఇచ్చారో. కానీ నంబియార్ గుర్తుంచుకుని అన్నారు, "అదుతానావిళందవు" అది దానంతట అదే జరిగింది. అది ఏమీ అద్భుతము కాదు. అది అనుగ్రహము వల్లనే జరిగింది.

మరొక సందర్భంలో నంబియార్‌కు ఇంకా స్పష్టమైన కల వచ్చింది. భగవాన్ పాతహాలులో కూర్చున్నట్లు, అక్కడ శ్రీధర్ అనే యోగి ప్రాణాయామం చేస్తున్నట్లు కలగన్నారు. ఆయన ఎంత ఏకాగ్రచిత్తంతో ప్రాణాయామం చేస్తున్నారంటే, అగ్నికణాలు ఆయన శరీరంనుండి, తలనుండి కూడా వెలువడడం మొదలుపెట్టాయి. ఆయన భగవాన్‌ను ఈ విధంగా ప్రాధేయపడ్డారు. "భగవాన్, నేను బాధపడుతున్నాను. దయచేసి సాయపడండి". భగవాన్ వెంటనే బదులిచ్చారు, "ఈ కసరత్తులన్నీ ఆపెయ్యి. ఆత్మవిచారణ కొనసాగించు. అది నిరపాయకరమైన, సులభమైన, సూటియైన, శక్తివంతమైన మార్గము సత్యాన్ని చేరుకోవడానికి". నంబియార్ నిద్రనుండి లేచి, రమణాశ్రమానికి వెళ్ళారు. ఆయన హాలులోనికి పరుగున వెళ్ళి భగవాన్‌కు నమస్కరించారు. యోగి శ్రీధర్ కూడా హాలులోనే ఉన్నారు. నంబియార్ శ్రీధర్‌కు హాలు బయటకు రావలసిందిగా సైగచేశారు. నంబియార్ తన కలను గురించి శ్రీధర్‌కు చెప్పారు. శ్రీధర్ చాలా కృతజ్ఞతాపూర్వకంగా అన్నారు, "ధన్యవాదములు. నేను ఎంతో బాధపడుతున్నాను. నేను భగవాన్‌ను అడగాలనుకున్నాను. కానీ ధైర్యం చాలలేదు. నేను అడిగే స్థితిలో లేను. మీకు మరొకమారు ధన్యవాదములు". అద్భుతాల పట్ల ఆకర్షింపబడ కూడదని, సూటిమార్గమైన ఆత్మవిచారణనే అనుసరించాలని ఈ కలద్వారా నంబియార్ అర్థం చేసుకున్నారు.

దైవం తన హృదయంలోనే ఉన్నట్లు అంతఃస్ఫురణ ద్వారా అర్థం చేసుకున్న నంబియార్, అంతరంగంలో దృఢంగా తయారైనారు. అలా ఆత్మానుభూతిని పొందిన క్షణాలలో, ఆయన గొప్ప మహనీయుడైన సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి గీతాన్ని గుర్తుచేసుకునేవారు, "ఓ ప్రభూ! నేను నిన్ను కొత్త వస్తువు దేనినీ కోరుటలేదు. నా సహజమైన ఆనందస్థితినే నాకివ్వు". నంబియార్ నిరంతరం ఆ గీతాన్ని స్మరిస్తూ ఉండేవారు. అది సత్సంగం కోసం వెదకమని ఆయనను ప్రోత్సహించింది. ఆయన రమణాశ్రమంలో ఉన్నపుడు, ఆయన పాతభక్తులైన చాడ్విక్, టి.పి.రామచంద్రఅయ్యర్, మునగాల వెంకట్రామయ్య, కుంజుస్వామి, విశ్వనాధస్వామి మొదలైన వారి సాంగత్యాన్ని కోరుకునేవారు. నిజానికి వారిని తనతోపాటు చెన్నై రమ్మని పట్టుబట్టేవారు.

భగవాన్ సోదరులైన చిన్నస్వామి, నంబియార్‌ను, ఆశ్రమనిర్వహణలో సహకరించవలసినదిగా కోరారు. నంబియార్ భగవాన్ వద్దకు వెళ్ళారు. భగవాన్ తన ఆమోదాన్ని తెలిపారు. అప్పటినుండి ఆశ్రమ ఆఫీసు వ్యవహారాలలో నంబియార్ చేయూతగా ఉన్నారు. ఆయన ఒకవైపు ఆత్మ విచారణ చేస్తూనే, మరొకవైపు ప్రాపంచిక వ్యవహారాలు చూస్తుండేవారు. ఆయన తన వృత్తిని (ఉద్యోగాన్ని) చాలా అడుగుమెట్టునుండి మొదలుపెట్టి, చాలా ఉన్నతస్థితికి చేరుకున్నారు. ఆయన రాజకీయనాయకులను,

ప్రభుత్వ అధికారులనూ, కలుసుకుంటూ ఉండేవారు. బాహ్యంగా చూడడానికి ఆయన ఎన్నో వ్యవహారాలతో సతమతమవుతూ ఉండేవారు. అయినప్పటికీ, ఆత్మవిచారణలో సంపూర్ణంగా నిమగ్నమయి. అదే సమయంలో చురుకుగా బాహ్య వ్యవహారాలను నిర్వహించిన వ్యక్తిగా, ఆయన ఒక ఉదాత్తమైన ఉదాహరణ. భగవాన్ పాల్‌బ్రంటన్‌కు చెప్పినట్లుగా, ఆయనకు, పనికి, జ్ఞానానికీ మధ్య వైరుధ్యము లేదు.

నంబియార్ ప్రతిక్షణమూ, భగవాన్‌పై ఆధారపడి ఉండేవారు. "భగవాన్ నా గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు," అని ఆయన స్నేహితులతో చెప్తుండేవారు. యుద్ధసమయంలో, ఆయన కుటుంబంతో సహా చెన్నైలో ఉంటుండేవారు. ఆయన ప్రభుత్వ అధికారి అయినప్పటికీ, ఆయనకు కూడా, వేరే ప్రదేశాలకు వెళ్ళి తిరిగి చెన్నై రావడానికి ఎంతో కష్టంగా ఉండేది. ఎందుకంటే సైన్యాన్ని చేరవేయవలసి ఉండడంతో రైళ్ళన్నీ ఎప్పుడూ కిటకిటలాడుతుండేవి. ప్రజలకు టికెట్లు ముందుగా రిజర్వు చేసికోవటం సాధ్యపడేదికాదు. ఒకరోజు, నంబియార్ స్నేహితులలో ఒకరు, "ఇవాళ మీరు చెన్నై ఎలా వెళ్ళగలరు? మొత్తం రైలంతా క్రిక్కిరిసిపోయి ఉంది," అని సవాలు చేశారు. నంబియార్ పూర్తివిశ్వాసంతో బదులిచ్చారు, "నా భగవాన్ నా విషయం చూసుకుంటారు," అని. ఆయన స్నేహితుడు ఎగతాళి చేశారు. మీ పిల్లలతో కలసి మీరు ఐదుగురుఉన్నారు. ఒకరే అయినట్లయితే ఎట్లానో ఒక పెట్టెలోకి తోసేసేవాళ్ళము. నంబియార్ అంటూనే ఉన్నారు, "నా భగవాన్ నన్ను చూసుకుంటారు. దిగులు చెందవద్దు". నంబియార్ విల్లుపురం వరకు వెళ్ళి,ఎక్స్‌ప్రెస్ రైలు కోసం వేచి ఉన్నారు. అది వచ్చినపుడు పూర్తిగా క్రిక్కిరిసి ఉన్నట్లు కనబడింది. వాళ్లను రైలు ఎక్కించటానికి సాదరంగా వచ్చిన స్నేహితుడు, "నేనిలా జరుగుతుందని అంటూనే ఉన్నాను," అన్నారు. నంబియార్ దృఢంగా అన్నారు, "మీకు భగవాన్ గురించి తెలియదు". అలా అంటూనే ఇంజన్ వరకూ వెళ్ళారు. ఇంజన్‌కు ప్రక్కనే ఒక కొత్త తాళం పెట్టబడిన ఫస్ట్‌క్లాస్ బోగీ ఉన్నది. ఆయన ప్రభుత్వ అధికారి కావున ఆయన స్టేషన్‌మాస్టర్ దగ్గరకు వెళ్ళి, ఆయనను ఆ బోగీ తాళం తియ్యవలసినదిగా కోరారు. ఆ కుటుంబం ఆ బోగీని మొత్తాన్ని ఆక్రమించుకుంది. ఆయన ఎప్పుడు ఈ సంఘటన గురించి మాట్లాడినా, పారవశ్యంలో మునిగి కన్నీరు కార్చేవారు. ప్రాపంచిక విషయాలైనా సరే భగవాన్‌పై పూర్తి విశ్వాసముంచు. రైలులో జాగా (సీటు) దొరకాలన్నా సరే, గణేశన్, ఇది అద్భుతమేమీ కాదు. అది పరిపూర్ణమైన విశ్వాసము మరియు కరుణ.

కె.కె.నంబియార్, విధినిర్వహణలో అమెరికాకు, ఇంగ్లండుకు పర్యటించారు. ఈ అన్ని పర్యటనలలోనూ, భగవాన్ మార్గం చూపి, భగవాన్ భక్తులను కలుసుకునేలా చేశారు. ఆ సంఘటనలు చాలా ఆసక్తి కరంగా ఉంటాయి. ఆయన ఆ జ్ఞాపకాలనన్నిటిని, 'The Guiding Presence of Bhagawan' (మార్గాన్ని చూపే భగవాన్‌సన్నిధి) అనే తనపుస్తకంలో పదిలపరిచారు. అమెరికానుండి వస్తూ ఆయన, 'Movie Camera' - కదిలేవాటిని ఫోటోతీసే కెమేరా (ఇప్పటి వీడియో కెమెరా లాంటిది) తీసికొనివచ్చారు. ఆ 1940వ దశకంలో భారతదేశంలో అది గొప్ప అద్భుతమైన వస్తువే. అది ఒక అద్భుత వస్తువే కాదు, అది, భగవాన్‌పై చిత్రాలు తీయడానికి లభించిన గొప్ప వరము. అందువల్లనే భగవాన్ చిత్రాలను మనము చూడగల్గుతున్నాము. దానితోపాటుగా చార్లీచాప్లిన్ సినిమా (హాస్యరసభరితమైనది) తీసికొనివచ్చి భగవాన్‌కు చూపించారు. 'నేను భగవాన్ ప్రక్కనే కూర్చుని ఉన్నాను. భగవాన్ ఆ సినిమాచూస్తూ మనసారా నవ్వేశారు. ఆయన ఆ సినిమాని బాగా ఆనందించారు. అది చూసి నేను కూడా చార్లీచాప్లిన్ అభిమానినైపోయాను'.

నంబియార్ ఆశ్రమానికి అందించిన మరొక సాయమేమిటంటే, మాతృ భూతేశ్వర ఆలయ నిర్మాణంలో సహకరించారు. సాధారణంగా ఒక ఆలయాన్ని ఒక స్థపతి ఆధ్వర్యంలో నిర్మిస్తాం. ఆయనకు (ఆగమశాస్త్ర విషయాలు) సాంప్రదాయకంగా ఎలా ఆలయాన్ని నిర్మించాలీ అనే శాస్త్రము బాగా తెలిసి ఉంటుంది. వైద్యనాథస్థపతి అనే ఆయనకు ఆలయనిర్మాణ బాధ్యతను అప్పగించారు. కానీ నంబియార్‌ను కూడా పిలిపించారు. నంబియార్ భగవాన్ వద్దకు వెళ్ళి, 'చిన్నస్వామి నన్ను ఆలయనిర్మాణంలో సహకరించమంటున్నారు. నాకు ఆ విషయాలేమీ తెలియవు,' అని చెప్పారు. భగవాన్, 'ఫర్వాలేదు, ఆయనకుసాయపడండి,' అన్నారు. ఆలయ నిర్మాణము పూర్తయి ఉత్సవాలన్నీ పూర్తయ్యాక, ఒక ఫోటోగ్రాఫర్‌ను రప్పించి వారిద్దరి ఫోటోను తీయించారు. ఆ ఫోటోను చూసి భగవాన్ ఇలా వ్యాఖ్యానించారు, 'శాస్త్రీయమైన, సాంప్రదాయక ఇంజనీరు వైద్యనాథస్థపతి, ఆధునిక స్థపతి నంబియారు కలిసి ఉన్నారు'.

1950, ఏప్రిల్ నెలలో భగవాన్ పరిస్థితి క్షీణిస్తూ ఉన్నపుడు, 'భగవాన్ దేహాన్ని ఎక్కడ సమాధి చెయ్యాలి?' అనే వివాదం ఏర్పడింది. భగవాన్ ఏ అభిప్రాయాన్నీ వెల్లడించనప్పటికీ, ఆయన ఆ ప్రదేశం గూర్చి ఒక నిర్ణయం తీసుకున్నట్లు కన్పించారు. భగవాన్ చనిపోయినరోజు రాత్రి నంబియార్‌కు ఒక స్పష్టమైన కలవచ్చింది. ఆయన స్వప్నంలో భగవాన్, నా తాతగారైన నిరంజనానంద స్వామితోనూ, తండ్రిగారైన వెంకటూతోనూ తలుపులు వేసి ఉన్న గదిలో సమావేశమైనారు. ఆ తలుపు ఓరగా తెరచి ఉన్నది. గుమ్మం బయట నిలబడి ఉన్న నంబియార్‌కు, నంబియార్‌ను లోపలకు పిలవమన్న భగవాన్ కంఠం విన్పించింది. భగవాన్ అపుడు ఒక డ్రాయింగు గీసి వారందరిని ప్రస్తుతం భగవాన్ సమాధి ఉన్న చోటుకు తీసుకుని వెళ్ళారు. ఇప్పుడు సమాధి ఉన్న చోటున నిర్మించాలని మిగిలినవారు అనుకోలేదు. తన కరసాయంతో భగవాన్ తన సమాధి ఎక్కడ ఉండాలో గీచిచూపించారు. నంబియార్ నిద్రలేచి, మా తాతగారితోనూ, మిగిలిన వారితోనూ తన స్వప్నం గురించి తెలిపారు. వాళ్ళు ఆయన మాటలను త్రోసిపుచ్చి, నువ్వూ నీ కలలూను. మేము నీకల గురించి వినబోవటల్లేదు. మేము ఏ చోటులో అయితే కట్టాలని నిర్ణయించుకున్నామో, అక్కడే నిర్మిస్తాము. మీరు జోక్యం చేసుకోనక్కరలేదు. మీరు ఇతరులతో మీ కలను గూర్చి చెప్పనవసరం లేదు. వాళ్ళు ఆయన కల గురించి ఆయనను అపహాస్యంచేశారు. వాళ్ళకు 'అన్నంగడ్డ దానంతటి అదే జారిపోవడం' అనే మాటల వెనుక ఉండే శక్తి గురించి అవగాహన లేదు. మా తాతగారు ఆయనను సవాలు చేశారు. 'మీరు అక్కడ సమాధి నిర్మించాలంటే నా శవం మీదే నిర్మిస్తారు," అని. కానీ టౌన్‌లోని ప్రముఖులందరూ, అన్నామలైపిళ్ళై ఆధ్వర్యంలో వచ్చి, నంబియార్ కలలో చూచిన ప్రదేశంలోనే సమాధిని నిర్మించవలసిందిగా చెప్పారు ఏ కారణంలేకుండానే. వారి ఎంపికకు (లేదా నిర్ణయానికి) అందరూ కట్టుబడి ఉండవలసి వచ్చింది, మా తాతగారితో సహా.

నంబియార్ గురించి ఒక వ్యక్తిగతమైన సంగతి చెప్పాలనుకుంటున్నాను. నేను ముంబైలో పనిచేసేటప్పుడు నాకొక వింత ఆధ్యాత్మిక అనుభవం జరిగింది. నేను నా ఉద్యోగానికి రాజీనామా చేసి వారణాసికి పారిపోయాను. నేనెక్కడ ఉన్నానో ఎవరికీ తెలియదు. ప్రతివారు నేనేమైపోయానో అని ఆశ్చర్యపోతున్నారు. నేను ఆరు రోజుల పాటు స్పృహ లేకుండా ఉన్నాను. నంబియార్ ఒక ప్రైవేటు కంపెనీలో ఛీఫ్ ఇంజనీర్‌గా చేస్తున్నారు. ఆయనకొక స్వప్నం వచ్చింది. భగవాన్ ఆయన కలలోకన్పించి, నేను బోర్లా పడుకుని ఉన్నట్లు, నా వీపుమీద పెద్ద పుండు ఉన్నట్లుగా చూపించారు. భగవాన్, ఆయన చేతిని నా వీపుపై ఉంచి, "నంబియార్, గణేశన్‌ను చూడు. అతనికి ఇది ఉన్నది. నేను అతనిని కాపాడబోతున్నాను". ఆయన తన చేతిని తీసివేయగానే ఆ పుండు మాయమైంది. ఆయన అప్పుడు, "నంబియార్, వెళ్ళి వెంకటుకు చెప్పు. గణేశన్‌కు బాగవుతాడని. నేనతన్ని కాపాడాను," సరిగ్గా అదే జరిగింది. భగవాన్‌కృప వల్లనే నేనీనాడు, ఏ పాతభక్తులైతే భగవాన్ పవిత్రపాదాలను ప్రస్తుతించారో, వారిని నేను ప్రస్తుతించగల్గుతున్నాను. నంబియార్‌కు నేను అణకువతో ప్రణామాల్ని అర్పించుకుంటున్నాను.



ప్రొఫెసర్ జి.వి.సుబ్బరామయ్య

ఒక కళాశాల ప్రిన్సిపాల్ (ప్రధాన అధ్యాపకులు)గా ఉండే జి.వి.సుబ్బరామయ్య చెప్పుకోదగిన వ్యక్తి. ఆధ్యాత్మిక సాధకులు ఆయనకు ఎంతగానో ఋణపడి ఉన్నారు. ఎందుకంటే, ఆయన భగవాన్‌నుండి ఒక హామీని పొందియున్నారు. తాను మనందరను కాపాడి, ముక్తిని పొందేటట్లు చేస్తామని, భగవాన్ ఏప్రిల్ 14, 1950లో శరీరాన్ని వదిలేశారు. ఏప్రిల్ ఏడు లేక ఎనిమిదవ తేదీన, ప్రొఫెసర్ సుబ్బరామయ్య, సబ్‌రిజిస్ట్రార్ నారాయణఅయ్యర్‌లు భగవాన్‌ను చూడడానికి వెళ్ళారు. వాళ్ళు మిక్కిలి దుఃఖించారు. భగవాన్ సుబ్బరామయ్యను, "నీకు ఏమి కావాలి?" అని అడిగారు. సుబ్బరామయ్య, "అభయం ఇవ్వాలి," అన్నారు. భగవాన్ ఆయన వంక చూసి, "ఇచ్చాను," అన్నారు. అంటే ఆయన ఉద్దేశ్యం కేవలం కాపాడడమే కాదు, ముక్తినివ్వడం కూడా. సబ్‌రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్, "భగవాన్, అది కేవలం సుబ్బరామయ్యకేనా?" అని అడిగారు. భగవాన్ ఆయన వైపుకు తిరిగి, "ప్రతి ఒక్కరికి," అని బదులిచ్చారు.

1960లలో ఒకరిద్దరు సందర్శకులు మాత్రమే రమణాశ్రమానికి వస్తుండేవారు. వారుకూడా భగవాన్ బోధలగురించి ఏమాత్రం తెలిసిన వారు కాదు. ఈ రోజున భగవాన్ సందేశం ఎల్లెడలా వ్యాపిస్తున్నది. బోధ కేవలం వేదాంతంలాగా వ్యాపించడం కాదు. కానీ తన స్వస్వరూపమైన సత్యం యొక్క సారంగా వ్యాప్తిజెందుతున్నది. ప్రతి ఒక్కరూ దీంట్లోకి మేల్కొంటున్నారు. (శరీరంతో తాదాత్మ్యం చెందడం నిద్ర. దేహాత్మ బుద్ధిని వీడడం మెలకువ). ఇదే భగవాన్ మాట ఇచ్చిన అభయము, కాపాడుట, ముక్తి. భగవాన్ ఒకప్పుడు అన్నారు, 'ప్రతి జీవీ అరుణాచలానికి రావలసినదేనని – భౌతికమైన అరుణాచలానికి కాదు. తనలోనున్న అరుణాచలమునకు. (హృదయములోనికి) ప్రతి ఒక్కరూ 'అహం' 'నేను' అనే బోధలోనికి (స్ఫురణ) మేల్కోవాలి. భగవాన్‌నుండి ఈ అభయము యొక్క హామీ రావడానికి కారణమైన జి.వి.సుబ్బరామయ్య గారికి మనం ఋణపడి ఉంటాము.

సుబ్బరామయ్య 1930లో దుఃఖభారంతో భగవాన్ వద్దకు వచ్చారు. ఒక రెండేళ్ళ పుత్రుడు చనిపోయినందున దుఃఖంలో మునిగిపోయి, భారతదేశమంతా పర్యటించసాగారు. ఒక పర్యటనలో ఎవరో రమణమహర్షి వద్దకు వెళ్ళమని సలహా ఇచ్చారు. అనుకోకుండా, అదే సమయంలో వేరెవరో, భగవాన్ ఉపదేశసారము తెలుగు అనువాదాన్ని ఆయనకు ఇచ్చారు. ఆయన వెంటనే ఇలా అనుకున్నారు, ఒక తమిళుడు తెలుగులో ఇంతగొప్ప ఆధ్యాత్మిక పద్యాలు (కవిత్వం) వ్రాశారంటే ఆయన నిజంగా, ఆధ్యాత్మికంగా చాలా గొప్పవారై ఉంటారు. అందుకని ఇంకా దుఃఖభారంతోనే మహర్షిని సందర్శించారు. భగవాన్ తొలిచూపు ఎంతటి అనుగ్రహంతో నిండి ఉన్నదంటే, అది ఆయన దుఃఖభారాన్ని మటుమాయంచేసింది. సుబ్బరామయ్యగారి మాటలలో చెప్పాలంటే, నా జీవితంలో ధృవనక్షత్రం, నా సద్గురువు భగవానే. నేను దుఃఖంలో ఉండి ఆయన వద్దకు చేరుకున్నాను. మొదటి దర్శనంతోటే, నేను ఆనంద, శాంతిజలధిలో మునిగిపోయాను. అప్పటినుండి ఆయనే నా జీవితానికి వెలుగు. ఆయనే నా తల్లి, తండ్రి, గురువు, భగవాన్ నా స్వంతం, భగవాన్ నా సర్వస్వం. నాయొక్క ఈ చిన్న వ్యక్తిత్వము (జీవుడు) దాని అనుబంధాలు అన్నీ ఆయనలోనే పరిసమాప్తి చెందినవి. ఆవిరైపోయినవి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆయన అనుగ్రహానికి ప్రతిరూపం. నా జీవితంలో ప్రతి అడుగులోనూ, చిన్నచిన్న సంఘటనలలోనూ శ్రీరమణులు అనబడెడి దివ్యఅనుగ్రహం యొక్క మార్గదర్శకత్వాన్ని ఇంకా ఇంకా ఎక్కువగా అనుభవిస్తున్నాను.

అయినప్పటికి, అలా చూసిన తర్వాత కూడా, ఆయనలో ఒక (నిజాయితీతో కూడిన) సందేహం మిగిలిపోయింది. భగవాన్, భగవద్గీతలో మానవుడు జీర్ణించి పోయిన శరీరాలను,చిరిగిపోయిన పాత దుస్తులను వలె వదలివేసి కొత్తవాటిని ధరిస్తారని చెప్పబడినదిగదా, మరి నవనవలాడే శరీరాలు గల శిశువుల మరణం విషయంలో ఇది ఎలా వర్తిస్తుంది?" భగవాన్ ఆయనవంకకరుణతో చూచి, ఇలా బదులిచ్చారు, "చనిపోయిన బిడ్డ శరీరము జీర్ణించిపోలేదని నీకేమి తెలుసును? అది

బయటకు కనిపించకపోవచ్చును. కానీ శరీరం పాడవనిదే దానికి మృత్యువు రాదు కదా.అదే ఆధ్యాత్మిక నిబంధన". సుబ్బరామయ్యగారి దుఃఖము, బాధ వెంటనే నివృత్తి అయిపోయినవి.

సుబ్బరామయ్య చక్కటి మాటకారి. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్లభాషలలో పండితుడు. ఆయన భగవాన్ రచనలను ఆంగ్లంలోనికి అనువదించడం మొదలుపెట్టారు. రమణగీతకు ఆయన వ్రాసిన అనువాదం ఈ నాటికీ ప్రశంసలనందుకుంటున్నది. ఇంతకు పూర్వము ఆయన ఒక మహాత్ముని కలుసుకున్నారు. ఆయన సుబ్బరామయ్యకు మంత్రదీక్షను ఇచ్చారు. ఆయన ఆ మంత్రాన్ని ఎంతో శ్రద్ధతో జపిస్తుండేవారు. భగవాన్ వద్దకు వచ్చిన తర్వాత, ఆయన దర్శనమైన తర్వాత, ఆయన ఆ మంత్రజపాన్ని కొనసాగించలేకపోయారు. ఆయన ఏదో అపరాధం చేసినట్లుగా భావించి, తానేమైనా తప్పుచేస్తున్నానా? అని కలతచెందారు. ఆయన ఈ సమస్యతో భగవాన్ వద్దకు వెళ్ళారు. 'భగవాన్ అకస్మాత్తుగా, ఆ మంత్రం ఆగిపోయింది. నాకు భయంగా ఉంది,' అన్నారు. భగవాన్ ఇలా అన్నారు, 'నువ్వు ఆమంత్రంతో చాలా జపముచేశావు. దాని ఫలితమే నిన్నిక్కడకు తీసుకొని వచ్చింది. నువ్వు భయపడవలసిన అవసరమేముంది?' చాలాకాలం తర్వాత ఆయన భగవాన్‌ను ఇలా అడిగారు, 'మనసులో జపించటానికి, ధ్యానానికి బేధమేమిటి?' భగవాన్ బదులిచ్చారు, 'అవి రెండూ ఒక్కటే. రెండింటిలోనూ మనస్సు ఒకే విషయముపై కేంద్రీకరించబడి ఉంటుంది. మంత్రము, జపము, ధ్యానము, ధారణ, అన్నీకేవలం పేర్లలో తేడా మాత్రమే. వాటికి కొంత కృషి (ప్రయత్నం) జమచేయవలసి ఉన్నపుడు వానికి ఈ వేర్వేరు పేర్లతో వ్యవహరిస్తాము. గమ్యం చేరగానే అవి ప్రయత్న రహితంగా సాగిపోతవి. ఇది వరకు సాధనంగా ఉన్నది, ఇప్పుడు లక్ష్యంగా మారిపోతుంది.

కొద్దికాలం తర్వాత సుబ్బరామయ్యగారికి వేరొక రకం సమస్య వచ్చింది. ఆయన స్వామి రామతీర్థచే బోధించబడిన ఒక ప్రాణాయామాన్ని అభ్యాసం చేస్తున్నారు. సుబ్బరామయ్య ఒకనిర్ణీత సమయంలో ప్రతిరోజూ దానిని అభ్యాసం చేసేవారు. ఒకరోజున హఠాత్తుగా తన తల ముక్కలు చెక్కలు అయిపోతుందేమోనన్నంత బాధ కలిగింది ఆయనకు. ఆ అభ్యాసాన్ని ఆపివేసినప్పటికి, రోజూ అదే వేళకు, ఆ బాధ కలిగేది. ఒకరోజు రాత్రి భగవాన్ ఒంటరిగా ఉన్నపుడు ఆయన తన సమస్యను చెప్పుకున్నారు. భగవాన్ నవ్వుతూ అన్నారు, 'ఏమిటి మళ్ళీ భయంలో చిక్కుకున్నావా? గురువు చెంతనుండి, మార్గాన్ని చూపకుండా, ఎవరికి వారుగా యోగాభ్యాసము చేసేవారికి ఇటువంటి అనుభవాలు కలుగుతవి. కానీ నువ్వు నా దగ్గరకు వచ్చావుకదా! ఇంకా నువ్వెందుకు భయపడాలి?' తర్వాత గొంతు తగ్గించి (గుసగుసగా) చెప్పారు, 'మరలా నీకు ఆ బాధ కలిగినపుడు నన్ను తలచుకో. నువ్వు బాగానే ఉంటావు'. ఈ మాటలను మన హృదయంలో బంగారంతో లిఖించుకోవాలి. నువ్వు ఏ విధమైన సాధన చేస్తున్నా సరే, నీకెపుడైనా బాధకల్గినపుడు, లేదా సమస్య ఎదురైనపుడు గురువుగారి పేరు తలచుకో. సుబ్బరామయ్యగారు ఆ బాధ తిరిగి తనకెన్నడూ కలుగలేదని నాతో వ్యక్తిగతంగా చెప్పారు.

భగవాన్ సుబ్బరామయ్యగారికి, సాధకులు ప్రార్థనలు ఎలా అర్పించాలో చాలా స్పష్టంగా చెప్పారు. గురువుగారిని ఆధ్యాత్మికస్వేచ్ఛకోసమే, ముక్తి కోసమే కోరుకొనవలెనా? లేక ప్రాపంచిక వ్యవహారాలు కూడా సాయం అడగవచ్చునా? సుబ్బరామయ్యగారికి రెండు లేక మూడుసంవత్సరాల వయసుకల కుమార్తె ఉండేది. ఆ బిడ్డ పల్లెటూరిలో పెరుగుతుండేది. ఆమెకు తరచుగా ఫిట్స్ (మూర్ఛలు/ తెరలు) వస్తుండేవి. ఆ బిడ్డ ఒకసారి స్పృహనుకోల్పోయి, ఇక బ్రతకదేమోననిపించింది. సుబ్బరామయ్య వెంటనే భగవాన్‌కు అర్జంట్ టెలిగ్రాము పంపారు. "భగవాన్! నా బిడ్డ ఇందిర బాధపడుతున్నది. దయచేసి ఆమెకు సాయపడండి". ఆరోజు రాత్రి ఏడు గంటలకు ప్రక్క గ్రామంలో ఉంటున్న వాళ్ళ బావగారు, ఆ క్రిందటి సంవత్సరము రమణాశ్రమమునుండి తెచ్చిన విబూదిని తీసుకొనివచ్చారు. దీనిని ఆమె నుదుటికి రాయండి అన్నారు. ఆయన ఇద్దరు ఆయుర్వేద వైద్యులను కూడా పిలిపించారు. ఆమె నుదుట విబూదిని రాయగానే, అందరికీ ఆశర్యము, సంతోషము కలిగేట్లు అప్పుడే వచ్చిన ఆ ఇద్దరు ఆయుర్వేదవైద్యులు ఆమెకు నయమైందని చెప్పారు. ఆ మర్నాడే ఆశ్రమంనుండి జాబు అందింది. భగవాన్ మీ టెలిగ్రామ్‌ను రాత్రి ఏడుగంటలకు చూచారు. అంతా బాగనే ఉంటుంది. సుబ్బరామయ్యకు అది గొప్ప అద్భుతం. తరువాత క్రిస్మస్ సెలవలకు ఆయన భగవాన్ వద్దకు వెళ్ళారు. అందరూ మేధావుల వలెనే జరిగినదానిని ఒప్పుకోవడానికి, ఆయనకు సమస్యగా ఉన్నది. సుబ్బరామయ్య భగవాన్‌ను ఇలా అడిగారు, "మీరు నా బిడ్డను

కాపాడాలనుకున్నారా?" భగవాన్, కాపాడాలి అని అనుకోవడము కూడా ఒక సంకల్పమే. ఒక కోరికే. జ్ఞానికి కోరికలుండవు. జ్ఞానిదేనినైనా చూడగానే వెంటనే దైవశక్తి (దివ్యచైతన్యము) దానంతట అదే కార్యోన్ముఖమౌతుంది. మనము ప్రార్థించి గురువుగారి దృష్టి, ఏదో ఒక వస్తువు మీద పడాలని ఆశిస్తే, వెంటనే దైవశక్తి జోక్యం చేసుకుంటుంది. రమణుల గురించి గానీ, అరుణాచలుని గురించిగానీ ఆలోచిస్తే వెంటనే దైవశక్తి పనిచెయ్యనారంభిస్తుంది.

ప్రతిసారి సుబ్బరామయ్య రమణాశ్రమానికి వచ్చినపుడు, భగవాన్ ఆయనను తెల్లవారుఝామున రెండున్నర గంటలకు లేపి, సబ్‌రిజిస్ట్రార్ నారాయణఅయ్యర్, కళ్యాణసుందరమ్‌అయ్యర్‌లతోపాటు వంటశాలలోనికి తీసుకొని వెళ్ళేవారు. అక్కడ వారు సాంబారుగానీ, చట్నీగానీ తయారుచేసేవారు. భగవాన్ వంట చేసేవారు. వీరంతా సాయంచేసేవారు. ఎండ వేడి వలన, పొయ్యిసెగవలనా, భగవాన్‌కు చెమటలు పట్టటం సుబ్బరామయ్యగారు చూస్తే వెంటనే విసనకర్ర తీసుకొని విసురుతుండేవారు. ఏ ప్రత్యేకమైన సేవలూ ఇష్టపడని భగవాన్, 'ఆపు' అనేవారు. ఒకసారి సుబ్బరామయ్య భగవాన్ వెనకగుండా పాకుకుంటూ వెళ్ళి, ఆయన వంటపనిలో పూర్తిగా నిమగ్నమై ఉన్నపుడు, వెనుకనుండి విసరసాగారు. భగవాన్ అది గమనించి, "అయితే నువ్వు దొంగతనంగా చెయ్యదలచుకున్నా వన్నమాట. కానీ అదిగూడా నువ్వు సరిగా చెయ్యలేకపోతున్నావు. రా, నేను చూపిస్తాను. భగవాన్ సుబ్బరామయ్య చెయ్యి పట్టుకుని విసనకర్రను ఎలా ఉపయోగించాలో చూపించారు. సుబ్బరామయ్య అన్నారు, భగవాన్ నన్ను తాకటమనేది ఒక దివ్యమైన క్షణం నాకు. తర్వాత వారు ప్రక్క గదిలోనికి చట్నీ రుబ్బటానికి వెళ్ళేవారు. సుబ్బరామయ్యకు రోకలితో చట్నీ నూరటం చేతనయ్యేదికాదు. మరల ఆ పనిని నేర్పటానికి భగవాన్ సుబ్బరామయ్య చేతిని పట్టుకునేవారు. ఆయనేమో పారవశ్యంలో మునిగిపోయేవారు. చట్నీ తయారైన తర్వాత, భగవాన్ రుచి చూసి, అందరికీ రుచి చూపించేవారు. అందరి చేతులూ ఏదో ఒక పనిలో నిమగ్నమైయుండుట చేత, భగవాన్ చట్నీతో చిన్న చిన్న ఉండలు తయారుచేసి నోరు తెరవమని వారి నోళ్ళల్లో వేసేవారు. భగవాన్ అలా చేసినప్పుడు నాకు స్వర్గంలో ఉన్నట్లనిపించేది.

ఒకప్పుడు నేను సుబ్బరామయ్యను అడిగాను. "భగవాన్‌లోని ప్రత్యేకత ఏమిటి?" అని. భగవాన్ తనకు ఎదురైన సమస్యలను ఎదుర్కొనే విధానం ప్రత్యేకమైనది. ఆయన సాక్షాత్కారము అటువంటిదే. ఆయన అప్పటికి ఏ ఇతర మూలమునుండి వీనిని చదివిగాని, చూసిగాని, వినిగాని ఉండలేదు. ఆయన సమాధానములు ఆయన చేసే పనులూ కూడా స్వతంత్రమైనవి. ప్రత్యేకమైనవి. జీసస్ వలె ఆయన ఏ విషయాన్నైనా సంపూర్ణ అధికారంతో మాట్లాడేవారు. ఆయన మాటలు ఆయన స్వీయానుభవమునుండి, స్వీయ జ్ఞానమునుండి చెప్పబడినవే గాని, పుస్తకములలో చదివిగాని, వేరే వారి వద్ద వినిగాని, చెప్పినవి కావు. ప్రతి ప్రశ్నకు మూలములోకి వెళ్ళి దానిని సులభతరం చేసేవారు. ఆయన మాట్లాడేటప్పుడు అస్పష్టంగా ఉన్న, లేక తికమకపెట్టే పదాలను వాడేవారు కాదు. ఆయన తన సమాధానాలతోపాటు నిర్దుష్టమైన ఉదాహరణలిచ్చి, తను చెప్పదలచుకున్న దానిని స్ఫటికమంత స్పష్టంగా తెలియజేసేవారు. జి.వి.సుబ్బరామయ్య గారు భగవాన్ పలుకులలోని స్పష్టతను గురించి మాట్లాడేటప్పుడు ఆనందంతో మైమరచి పోయేవారు. భగవాన్ ఒకసారి ఆయనతో ఇలా చెప్పారు, "ఎవరైనా ఎవరికి ఈ ఆత్మసాక్షాత్కారము అని విచారణ జరిపితే, ఆ వ్యక్తిత్వం అంతరించి, ఆత్మను ఇంకా సాక్షాత్కరింపజేసుకోవాలి, అనే భ్రమ కూడా మటుమాయమై పోతుంది. అదే గురువుయొక్క అనుగ్రహము. గురువు ఆత్మసాక్షాత్కారము జరుగలేదను భ్రమను మాత్రమే తొలిగించగలడు. అంతేగానీ, ఆత్మసాక్షాత్కారన్ని కలుగజేయడం, గురువునకే గాదు ఈశ్వరునకు కూడా సాధ్యము కాదు. వారు ఆత్మసాక్షాత్కారం కల్గించండి అని గురువునడుగుట, నన్ను నాకు ప్రసాదించండి అని అడుగుటవంటిదే. మనము మన శరీరాలతో తాదాత్మ్యము చెంది, నేనొక వ్యక్తిని అనే భ్రమకు లోనౌతున్నాము. దీని వలన గురువుకూడా ఒక వ్యక్తే అనే మరొక భ్రాంతి ఉత్పన్నమవుతుంది. గురువు నాకంటే భిన్నమైన వారు అనేభ్రాంతి కల్గుతుంది. గురువు నీకంటే వేరుగా లేరు. నీకంటె భిన్నమైన వారు కాదు".

భగవాన్ అంతిమ దినాలలో సుబ్బరామయ్య కొన్ని పద్యాలను వ్రాసి భగవాన్‌కు సమర్పించారు. వాటిలో ఒకటి మన సాధకులకు ఎంతో ముఖ్యమైనది. ఎందుకంటే, మనందరి తరపునా ఆయన భగవాన్ కొక వాగ్దానం చేసారు. ఆ ప్రార్థన

ఇది :- "(మేము ప్రతిజ్ఞ చేస్తున్నాము) మీ బోధలను ఎల్లవేళలా మనసులో నిలుపుకుంటామని, అహంకారమనే భ్రమని తొలగించుకుని మీరు ఎల్లవేళలా ఉన్నట్లు ఆత్మలో నిలిచి ఉండుటకు అవసరమైన బోధలను నేర్చుకుంటామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాము. మా ప్రియమైన ఓ సద్గురురమణా! ఇదియే మా భక్తులందరమూ కలసి మీకు చేయగల్గిన సేవ" మనకు మన గురువుగారి పట్ల బాధ్యత ఉన్నది. రమణులు అందరికన్నా గొప్ప గురువు అని ఎలుగెత్తి చాటితే సరిపోదు. మనము ఆయన బోధలను నిరంతరము మనసులో నిల్పుకొనుటకు, కంకణబద్ధులమై ఉండాలి. భగవాన్ చివరి క్షణాలలో సుబ్బరామయ్య పట్టరానంతగా దుఃఖించారు. భగవాన్ ఆయనతో చెప్పిన చివరిమాటలు 'దిగులు చెందకు. శాంతంగా ఉండు. అన్నీ స్వయంగానే ఉంటాయి. ఉండుట అనేదే మన నైజము. రావటము పోవటము అనేది మనసు చేసే మాయ. మనలోని మౌనాన్ని అంటిపెట్టుకుని ఉండడమే మన బాధ్యత.

భగవాన్ సన్నిధిలోని మరి రెండు ముఖ్యమైన అనుభవాలను గురించి సుబ్బరామయ్య ఇలా తెలుపుతున్నారు.

'బి.అనంతాచారి చాలా శ్రమకోర్చి రమణగీతను అచ్చువేయించారు. ఆయన సహకారాన్ని ప్రశంసిస్తూ పీఠికలో వ్రాయబడింది. ఆయన నిజాయితీగా తన పేరును అందులోనుండి తొలగించవలసిందిగా భగవాన్‌ను ప్రార్థించారు. భగవాన్ ఇలా బదులిచ్చారు, "నువ్వు ఎందుకు బాధ చెందుతావు? నీ పేరును తొలగించమని కోరుట కూడా, నీ పేరును ఉంచమని కోరుట అంత అహంకారపూరితమైనదే. దానిని అలా ఉండనివ్వు. అనంతాచారి అంటే ఎవరో ఎవరికి తెలుసును? గుర్తింపు పొందాలను కోవడం నుండి దూరంగా జరగడమే అణకువ అని మనము అనుకుంటాము. ఉన్నదానిని ఉన్నట్లు స్వీకరించడమే అణుకువకు తుదిమెట్టు అని అర్థంచేసుకోము.

పన్నాలాల్ ఐ.సీ.ఎస్. అలహాబాద్ విభాగానికి కమీషనర్‌గా ఉన్నపుడు, ఒకసారి తన కుటుంబంతో ఆశ్రమాన్ని సందర్శించారు. తనకు సిరిసంపదలూ, అధికారమూ, భౌతిక సుఖాలన్నీ ఉన్నప్పటికీ మనశ్శాంతి కరవైందని భగవాన్‌తో చెప్పుకున్నారు. భగవాన్ ఆయనకు, "నువ్వు శాంతిని ఎందుకు కోరుకుంటావు. నువ్వు ఇప్పుడున్న విధముగానే ఉండవచ్చుగదా," అని ప్రశ్నించారు. పన్నాలాల్ బదులిచ్చారు, "ఎందుకంటే, నేను సంతోషంగా లేనుకాబట్టి," అని. భగవాన్ సమాధానమిచ్చారు. ఒక వ్యక్తికి తలనొప్పి వస్తే, సరియైన మందు తీసికొని, ఆ తలనొప్పిని వదలించుకున్న దాకా విశ్రాంతి తీసుకోడు, ఎందుకంటే ఆరోగ్యము మన సహజస్థితి, జబ్బుకాదు. అలాగే శాంతి అనేది మన సహజస్థితి. నిజానికి మనము ఎల్లవేళలా శాంతిగానే ఉన్నాము. కాని దానిని మరచి, బాహ్యంలో శాంతి కొరకు వెదుకుతాము. అది చాలా అసాధ్యమైన కార్యము. అదే అన్ని సమస్యలనూ సృష్టిస్తుంది. ఏ క్షణానైతే నువ్వు నీ మనసును బాహ్య వస్తువులనుండి మరల్చి అంతరంగంలోనికి త్రిప్పుతావో అప్పుడే నీకు శాంతి లభించి ఆనందం కల్గుతుంది".

ఒకసారి తెల్లవారుఝామున సుబ్బరామయ్య భగవాన్‌ను దర్శించినపుడు, మనము మన స్వస్వరూప అనుభూతిని ప్రతిరోజు ఎలా పొందవచ్చునో భగవాన్ చెప్పారు. నిద్రకు మెలకువకు మధ్య, ఒక క్షణకాలపు మసక వెలుగు ఉంటుంది. జాగ్రదవస్థ 'నేను' అనే ఆలోచనతో మొదలవుతుంది. ఆ 'నేను' అనే ఆలోచన ఉదయించకముందు, ఒక క్షణంలో కొద్దిభాగం, అఖండమైన శుద్ధచైతన్యం లేదా 'ఎఱుక' ఉంటుంది. కావున మొదట స్పృహలేకుండుట. తర్వాత శుద్ధమైన ఎఱుక లేదా చైతన్యము, తర్వాత నేను అనే ఆలోచన ఉంటవి. అప్పుడు మనము మన చుట్టూ ఉన్న ప్రపంచము గూర్చి స్పృహగల్గి ఉంటాము. మనము చురుకుగా, మెలకువగా, కనిపెట్టి ఉండగల్గితేనే శుద్ధచైతన్యాన్ని గమనించ (అనుభవించ) గలుగుతాము.

భగవాన్ బోధ లోని చక్కదనమేమిటంటే అది సులభమైనది, సూటియైనది, సహజమైనది. మహోన్నతుడైన గురువుకూ, ఆయన పాత (ప్రత్యక్ష) భక్తులకూ మధ్యనున్న పవిత్రమైన అనుబంధాలను గురించి చదవగలగటం మన భాగ్యము. ఈ ప్రక్రియ (చదవటం)లో మన అంతరంగము పరిశుద్ధమవుతుంది. అది సత్యముపై కేంద్రీకరిం (పబడడానికి)చడానికి సమాయత్తమౌతుంది. మనము అసంకల్పితంగా, మెదడువైపు, జ్ఞాపకాల వైపు, కోరికలవైపు తిరుగుతాము. ఎందుకంటే మన భద్రత అందులో ఉందని మనము అనుకొనుట చేత, మనకు పరిపూర్ణ విశ్వాసము ఉండాలి. అరుణాచలా అంటే

అరుణ – అచల ('అరుణ' అంటే ఉండుట, 'అచల' అంటే కదలిక లేకుండా, స్థిరంగా అని. మన మనస్సు ఏ చలనమూ లేకుండా నిశ్చలస్థితిలో) 'అరుణా' అంటే 'సర్వకాల సర్వావస్థలలోను ఉండేది' (చైతన్యము) అనీ, 'అచల' అంటే 'కదలిక లేకుండా స్థిరంగా' అని అర్థము. మనస్సు కదలిక లేకుండా నిశ్చలంగా ఉన్నప్పుడు దానికి, ఆత్మలో లీనమగుట తప్ప వేరే త్రోవలేదు. ఎరుకగా మిగిలిపోవటయే మార్గము. ప్రతి వారూ చివరకు, అరుణాచలమునకు రావలసినదే అని భగవాన్ అన్న మాటలకి అర్థమిదే. నువ్వు సత్యం కావాలనుకుంటే చలించే మనస్సును నిశ్చలం చెయ్యాలి. నేను సుబ్బరామయ్యగారితో సన్నిహితంగా ఉండేవాడిని. ఒకసారి నేను ఆయన స్వంత టౌన్‌కు వెళ్ళాను. ఆయన నాకు Horizon ను చూపించి (భూమి ఆకాశం కలుస్తున్నట్లు కన్పించే ప్రదేశం) "అరుణాచలుడు అక్కడ ఉన్నారు గణేశా, నువ్వు చూడలేవా? నేను అరుణాచలుణ్ణి చూడగలిగాను. అది అద్భుతం కాదని నేను మీకు చెప్పగలను. మనస్సు నేను అరుణాచలాన్ని చూడడం లేదు అంటే, మనస్సు వెంటనే కల్పించే 'చూడటం లేదు' అనే భావనపై నువ్వు దృష్టి పెడుతున్నావన్నమాట. మనస్సు వెంటనే కల్పించే అసత్యభావనలను తిరస్కరించండి. మనలో ఉండే విశ్వాసమే నిజము. ఆయన నాలుగువందల మైళ్ళ దూరం నుండి నాకు అరుణాచలాన్ని చూపించారు. నేను చూడగలిగాను. కె.కె.నంబియార్ నాకు ముంబైలో ఉన్నప్పటినుండి, అనగా 1960 నుండి తెలుసును.ఆయన కూడా, సత్యంలో మునిగారు. ఆయన ఒక పెద్ద కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ, సముద్రానికి ఎదురుగా ఉన్న పెద్ద అంతఃపురం వంటి భవనంలో ఉంటుండేవారు. ఆయన నన్ను రాత్రి భోజనానికి పిలిచారు. వాళ్ళ ఇంట్లోకి వెళ్ళాలంటే నాకు కొంచెం సంకోచంగా ఉండేది. ఆయన నన్ను స్వతంత్రంగా ఉండేటట్లు చేసి మేడపైకి తీసుకుని వెళ్ళి సముద్రాన్ని చూపించారు. ఆయన నన్ను కౌగలించుకుని ఇలా అన్నారు, "చూడు గణేశా! అరుణాచలుడు అక్కడ ఉన్నారు". మరల ఆ రోజున సముద్ర ఉపరితలంపై అరుణాచలాన్ని నేను చూశాను. తర్వాతనే నేను అరుణాచలునిలో నిలచి, దాని లోతు అనుభవించాను.

ప్రతి ఒక్కరూ అరుణాచలానికి రావలసినదే అనేది భగవాన్ పవిత్రమైన పలుకులు. మనకు ఆ మాటల మీదే కాదు మన మీద కూడా విశ్వాసం ఉండాలి. మనం మన లోపలకు తిరగాలి. ఎందుకంటే మనమే సత్యం కాబట్టి. సత్యం అన్ని ప్రదేశాలలోనూ ఉన్నది. మీ మెదడు వైపుకు, మనసు వైపుకు చూడకండి. వాటిపై ఆధారపడకండి. అవి ఎప్పుడూ అసత్యాన్నే కన్పించునట్లు చేసి,ఆ విషయాలని అసత్యమనీ, కల్పితమనీ, మిమ్మల్ని నమ్మిస్తాయి. (మనస్సు, మెదడు అసత్యాన్ని సత్యంగాను, సత్యాన్ని అసత్యంగాను తలపింపచేస్తాయి. సత్యం వాటి పరిధికి ఆవల ఉన్నది. కనుక అవి సత్యాన్ని చూపించలేవు) దీనినే ఇద్దరు గొప్ప భక్తులైన కె.కె.నంబియార్, ప్రొఫెసర్ జి.వి.సుబ్బరామయ్యలు నాకు తెలిపారు. అరుణాచలాన్ని చూపించుట ద్వారా వారు నాకు తెలిపారు. వారు నాకు బాహ్యంలో అరుణాచలాన్ని చూపించారు. ఎందుకంటే నేను లోనికి తిరిగి, ప్రతి క్షణమూ, నా లోనే అరుణాచలాన్ని అనుభవించేటట్లుగా, భగవాన్ (ప్రత్యక్ష) పాతభక్తులలో ప్రతి ఒక్కరూ అరుణాచలం నుండే వచ్చారు. ఎందుకంటే భగవానే అరుణాచలుడు కావున. వారందరూ అరుణాచలంలోని కొండరాళ్ళు, గండశిలలు. వాళ్ళు అరుణాచలానికి తిరిగి వెళ్ళిపోయారు. యన్.ఆర్.కృష్ణమూర్తిఅయ్యర్ కూడా గొప్పభక్తులు. ఆయన ఒకసారి నాతో అన్నారు, "గణేశా! నువ్వు కూడా కొండరాయివే. నేనుకూడా కొండరాయినే. నువ్వు వెనుకకు వెళ్ళిపోతున్నావు. మనం ఎఱుకతోనే వెనక్కు వెళ్దాం. స్పృహ లేకుండా కాదు". నేను దుమ్ముకణాన్ని మాత్రమే. రాతినికూడా కాదు. మీరు పెద్ద కొండరాయి అయి ఉండవచ్చును. కె.కె.నంబియార్ గండశిల. కుంజుస్వామి కొండమీద ఒక రాతిని చూపి, "ఇది మన మురుగనార్," అన్నారు. నేను గిరిప్రదక్షిణ చేస్తున్నపుడు, ఈ రాళ్ళను చూస్తూ ఆనందిస్తాను. ఎందుకంటే గురుశిష్యులు అనుబంధము లోనికి (హృదయంలోనికి) మునగడానికి ముఖ్యమైనది.

సుబ్బరామయ్య ఒకసారి నాతో అన్నారు, "బయటకు వెళ్ళాలంటే, అనేక సూచనలుంటవి. అక్కడ తలుపులు, రోడ్డుమాప్స్ (రోడ్డుమార్గాన్ని చూపించే పటాలు) కానీ అంతరంగంలోనికి వెళ్ళాలంటే, ఏ మార్గాన్ని సూచించే పటముగానీ, మార్గదర్శిగాని ఉండరు. ఉపనిషత్తులు చెప్పినట్లుగా, పక్షికి దారి ఉండదు. పక్షి ఎక్కడ ఎగిరితే అదే దారి. చేపకు నీటిలో దారి ఉండదు. అది ఎక్కడ ఈదితే అదే దారి. అలాగే నువ్వు లోపలకు మునిగి నీ దారి నువ్వే కనుక్కోవాలి. ఏ వేదాలూ, శృతులూ నీకు సహాయపడలేవు. నీవు గ్రంథాలనుండి పొందిన జ్ఞానము ఏ విధంగానూ నీకు సహాయపడదు. నీమీద నీకు

పూర్ణవిశ్వాసమున్నపుడే నువ్వు దానిని సాధించగలవు. పక్షి ఎంత అందంగా ఎగురుతుంది? అది మార్గాన్ని గురించి దిగులు పడుతుందా? చేప దారి తెలియదని సంశయిస్తుందా? మనమెందుకుని సంశయిస్తున్నాము? లోపలకు మునుగు. మా గురువు రమణులు ఎప్పుడూ అనేవారు, "లోపలకు మునుగు. లోపలకు దూకు. లోపలకు వెళ్ళు," భగవాన్ పైన పూర్తి విశ్వాసముంచి లోపలకు మునుగు, లోపల చేతులు చాపి నీ కొరకు ఎదురు చూస్తూ నీ అంతర గురువు నీకు తప్పక లభిస్తారు.

జి.వి.సుబ్బరామయ్య గారికి ఇద్దరు కుమార్తెలున్నారు. లలిత మరియు ఇందిర. వారు భగవాన్‌ను చూడడానికి ఎంతో కష్టపడి వస్తుండేవారు. అలా ఒకసారి వచ్చినపుడు, పెద్ద అమ్మాయి లలిత, ఉపదేశసారము కొత్త పుస్తకాన్ని తీసుకొని, భగవాన్ రచించిన నాలుగు లైన్ల సంస్కృత పద్యములోని మొదటిరెండు అక్షరములను కలిపి పెద్దగా చదివింది. దేహమ్ - నాహమ్ - కోహమ్ - సోహమ్. ఈ మాటలన్నిటికి కలిపితే, "నేను దేహాన్ని కాదు. నేను ఎవరిని? నేను అదే" (భగవంతుడిని). అది వినగానే భగవాన్ అన్నారు. చాలాబాగుంది. అది చాలు మిగిలిన పద్యాన్ని నువ్వు చదవనవసరము లేదు. నువ్వు చదివిందే జ్ఞానసారము. అదే నీ మంత్రంగా చేసుకో. తర్వాత, ఎప్పుడు వారు వచ్చినా, ఇందిరను ఆ మంత్రం చదవమని చెప్పేవారు భగవాన్. త్వరలోనే అది ఆమెకు కంఠతా వచ్చింది. వారు తిరిగి వెళ్ళబోయే రోజున, భగవాన్ వద్ద సెలవు తీసుకొనడానికి వచ్చినపుడు, భగవాన్ కొండపైకి మామూలుగా వాహ్యాళికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నారు. ఆ పిల్లలు భగవాన్‌కు దగ్గరగా వెళ్ళి, "భగవాన్, మేము ఇంటికి వెళ్ళాలి?" అంటూ ఏడ్చేశారు. ఇందిరను ప్రేమతో తట్టుతూ,మీ చోటుకి మీరు వెళ్ళండి. నా చోటుకు నేను వెళ్తాను అన్నారు కొండను చూపిస్తూ. అదే వారు ఆఖరుసారి సెలవు తీసుకోవడమైనది. ఇంటికి చేరగానే ఇద్దరు పిల్లలూ సుబ్బరామయ్యగారికి ఉత్తరం వ్రాశారు. లలిత తన నమస్కారములను శ్రీభగవాన్‌కు అందజెయ్యమనీ, తను పై తరగతికి పంపబడినానని తెలుపమనీ వ్రాసింది. ఇందిర తను ఎల్లవేళలా మంత్రాన్ని చదువుతున్నానీ (జపిస్తున్నాననీ) శ్రీభగవాన్‌పై ధ్యానం చేస్తున్నాననీ వ్రాసింది. ఆఉత్తరాలను చదివి, భగవాన్ బాగా సంతుష్టులైనట్లు కన్పించారు. కొద్దికాలము తర్వాత ఇందిర చనిపోయింది. సుబ్బరామయ్యగారు ఆమెకు సమాధి నిర్మించి దానిపై దేహమ్-నాహమ్-కోహమ్-సోహమ్ అనే మంత్రాన్ని చెక్కించారు.



పాల్‌బ్రంటన్

మాటలలో పొందుపరచబడిన ఆధ్యాత్మిక జ్ఞానము ఎల్లపుడూ వేదాలలోనూ, ఉపనిషత్తులలోనూ, బైబిల్, తోరా, కొరాన్, జెంద్‌అవెస్తా, భగవద్గీత, మిగిలిన మతాలకు చెందిన పవిత్ర గ్రంథాలలో లభించుచున్నది. కానీ మాట వస్తువు కాజాలదు. 'నీరు' అనే మాట నీరు కాజాలదు. ఆ మాట మన దప్పికను తీర్చలేదు. అలా కాకుండా ఒక గ్రుక్కెడునీరుత్రాగితే అద్భుతం జరుగుతుంది. అదే పోలికలు ఆధ్యాత్మికతకు వర్తింపజేయండి. పుస్తకాల ద్వారా సముపార్జించిన జ్ఞానం మీకెంతైనా ఉన్నదని మీరు గర్వించవచ్చును. కానీ ఇది 'నీరు' అనే పదాన్ని పట్టుకోవటంవంటిదే. అయితే మనము సత్యాన్ని ఎలా పట్టుకోగలము? ఈ పవిత్ర గ్రంథాల వల్ల ప్రయోజనమేమిటి? మహర్షులు,మహాత్ములు, ఏ ప్రయోజనము లేనట్లైతే వారి పవిత్రమైన బోధలను మనకు వదలి వెళ్ళి ఉండేవారు కాదు. ఒక మహాత్ముడు తన జీవితములోని ప్రతి క్షణమూ సత్యమే అయి ఉంటారు. ప్రపంచ నలుమూలల నుండి, ప్రజలు ఆయన బోధల ద్వారాను, ఆయన సత్యజీవితము ద్వారాను ఆకర్షింపబడి, ఆ సత్యంయొక్క సాన్నిధ్యంలో జీవించి, దానిని జీర్ణించుకొని (గ్రహించి) చిట్టచివరకు, ఆ సత్యాన్ని అనుభవించ గల్గుతారు. ఎందుకంటే ఆ మహనీయుని శరీరంలో, ఉపనిషత్తులు, వేదాలు, తెలిపిన సత్యాన్ని వారు దర్శించగలరు గనుక.

మనము పాతభక్తుల జీవితాలను గూర్చి చదువుతున్నపుడు, భగవాన్ శ్రీరమణమహర్షి జీసస్ వలె, బుద్ధుని వలె, ప్రతి క్షణమూ సత్యమై జీవించారు. ఆయన ఇరువది నాలుగు గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేవారు. అక్కడ ఏ నియమనిబంధనలూ ఉండేవికావు. ఆయన తలుపులు ఎపుడూ తెరచే ఉండేవి అని తెలుస్తుంది. ఆయన పాతశిష్యులు, ఆయన సమీపంలో జీవిస్తూ, సత్యం రెండుకాళ్ళతో నడుస్తూ, ఆ (శరీరం) నోటితో మాట్లాడుతూ, ఆ కళ్ళతో చూస్తూ ఉంటే, వాళ్ళు ప్రత్యక్షంగా చూస్తుండేవారు. వారుకూడా ఎంతో లోతుగా సత్యంలో కూరుకుపొయ్యారనేది, అర్థం చేసుకునే భాగ్యం, వాళ్ళతో కలసి జీవించడం వల్ల నాకు లభించింది. వారిని గురించి చదువుతున్నపుడు, సత్యం మన గుండెల్లోకి చొచ్చుకుని పోతుంది, మనకు తెలియకుండానే. వారిని గురించి చదువుట ద్వారానే పరమసత్యం తోటి, మామూలుగా సాధ్యపడని అనుబంధాన్ని మనము ఏర్పరుచుకోగలము.

కొంతకాలము తర్వాత (తన రచనలతో) ఎందరినో భగవాన్ వద్దకు వెళ్ళవలెననెడి ప్రేరణను కలిగించిన, ఒక మేధావి భగవాన్ వద్దకు శిష్యునిగా వచ్చి చేరారు. 'ఆయన (అజ్ఞానము అనే) చీకటి అసత్యము' అని ప్రపంచానికి చాటిచెప్పారు. ఆయన పేరు రాఫెల్‌హర్స్టు. ఆయన భగవాన్ దయ వలన తాను అంతరంగజ్యోతి యొక్క దర్శనము పొందగలిగానని (అంతరంగంలోని ప్రకాశాన్ని దర్శించగలిగానని) బహిరంగంగా ప్రకటించిన మొదటి పాశ్చాత్య దేశీయుడు. పాల్‌బ్రంటన్‌గా సుపరిచితుడైన ఆయన గొప్ప రచయిత. ఆయన తన ఆధ్యాత్మిక జీవితంలో ఎన్నో హెచ్చుతగ్గులను (ఒడిదుడుకులను) చవిచూశారు. అది అచ్చు మన జీవితంలానే ఉందని మనకు ఆశ్చర్యం వేస్తుంది. కొన్నిసార్లు మనము ఆధ్యాత్మిక శిఖరముపై ఉన్నట్లు భావిస్తాము. కొన్నిసార్లు పాతాళంలో ఉన్నట్లు అన్పిస్తుంది. కానీ మనము ఒక ఉన్నతమైన శక్తిపై ఆధారపడితే, లేక శరణాగతి చెందితే, అప్పుడు ఇక ఓటమి ఉండదు.

1963లో తనకు (చివరగా) పూర్తి సాక్షాత్కారము జరిగినట్లు పాల్‌బ్రంటన్ వ్రాశారు. అపుడు (చైతన్యంలో) అంతరంగంలో (హృదయంలో) బాంబు ప్రేలుడులాంటి విస్ఫోటనం జరిగింది. అది దానంతట అదే జరిగింది. దైవత్వము ఎల్లపుడు నాతోనే, నాలోనే ఉన్నట్లు, నేను గుర్తించాను. 'నేను' అనే మాట నాలో స్ఫురించసాగింది. అది ఒక్కటే సత్యమని నేను చూశాను. 'అహం', 'నేను' అనేదే మొత్తం ఉనికికంతటికీ పునాది. నేను బాగా లోతుకు నా హృదయము లోనికి దిగి, కాలరాహిత్యాన్ని (కాలమునకు అతీతమైన స్థితి)ని అనుభవించినప్పటికి, నేను బాహ్యంలో మామూలుగానే ఉంటూ కాలాన్ని అనుభూతి చెందుతున్నాను. ఈ రెండు అనుభవాలు, ఒక దాని ప్రక్కన ఒకటి కొనసాగుతున్నవి, నేను నా శరీరాన్ని కేవలం

పై పెంకు (డొల్ల) లాగానే చూశాను. మిగిలిన వారి శరీరాలుకూడా పై పెంకుల వలెనే అన్పించినది. నేను అన్ని కోర్కెలకు అతీతంగా పక్షివలె స్వేచ్ఛను అనుభవించాను. అన్నిటినుండి నిజంగా విముక్తుడనైనాను. నేను ఈ శరీరాన్ని కాదు. అందుకని ఎంతో స్వేచ్ఛగా అన్పించింది. నేను చనిపోలేనని నాకు తెలియును. 'నేను' లేదా 'అహం' అనేదే దైవము కనుక, ఆ నిజమైన 'నేను' లోనే నేను ఎల్లప్పుడు జీవించి ఉండగలను". ఎంత గొప్పగా ఆయన ఆత్మసాక్షాత్కారాన్ని వర్ణించారు. పాల్‌బ్రంటన్ జీవితం, ఆత్మ విచారణ ద్వారా మీరూ, నేనూ కూడా (అందరమూ) ఆత్మసాక్షాత్కారాన్ని పొందవచ్చునని మనకు ఋజువు చేసింది.

తన జీవితంలో పైకి సంఘర్షణలుగా కన్పించే వాటన్నింటిలోనూ, ఒక ఉన్నతమైన శక్తి ఆయనను నడిపించింది. ఆయన ఎప్పుడు పతనము చెందబోయినా ఆ ఉన్నతమైన శక్తి, పైకి లేవడానికి సాయపడింది అనేది మనందరికి ప్రోత్సాహకరంగా ఉండటమేగాకుండా, మనం మనలోనే 'నేను'గా మన హృదయంలో ఉన్న, ఉన్నతమైన శక్తికి శరణాగతి చెందితే, ఆ ఉన్నతమైన శక్తి మనలను నడిపిస్తుంది అని తెలియజేస్తుంది. ఆయన దానికి అంటిపెట్టుకుని ఉన్నారు, బోధలను తు.చ. తప్పకుండా పాటించి, పూర్ణత్వస్థితికి నడిపించబడ్డారు. అందువల్లనే నేను 1963లో ఆయన సాధించినదానిని గురించి చదివినపుడు, అది సాధ్యమే అని నమ్మాను. ఆ నమ్మకమనే గట్టి శక్తిని మనలోనికి (గ్రహించుకుని) నిల్పుకుని మన ఆధ్యాత్మిక జీవనాన్ని కొనసాగించాలి.

పాల్‌బ్రంటన్ పాఠశాలలో ఉన్నపుడు, వాళ్ళ భూగోళ ఉపాధ్యాయుడు, 'ఇండియా' అనే మాట పలుకగానే ఆయన శరీరంలో ఆనందంతో కూడిన కంపనలు ప్రవహించినవి. తర్వాత ప్రపంచ పటములో భారతదేశాన్ని చూపించినపుడు కూడా అలాగే సంతోషతరంగాలు అతనిలో నిండిపోయినవి. అదే అతనికి సత్యాన్వేషణకు నాంది అయింది. భారతదేశానికి వెళ్ళాలనే గాఢమైన కోరిక, అంత చిన్న వయసులో కేవలం ఒక పేలవమైన ఆలోచనకాదు. ఒక ఉన్నత శక్తి ఆయనను నడిపిస్తున్నది. తన కౌమారదశలో తనకు, తన చుట్టూ ఉన్న పరిసరాలకు,వ్యక్తులకు భావములలో ఆలోచనలలో ఎంతో వ్యత్యాసము ఉన్నట్లు అన్పించింది. ఆయన తన జీవితాన్ని అంతం చేసుకోవాలనుకున్నారుకూడా. కానీ జీవితాన్ని అంతం చేసుకోవాలన్న ఆలోచనే ఆయనలో మరణం అంటే ఏమిటి? మరణం తర్వాత ఏమిటి? అనే జిజ్ఞాసను రగిల్చింది. ఎక్కడనుండి ఆయనకు ఆ జిజ్ఞాస కల్గింది? ఆ మహోన్నతశక్తినుండి తప్ప. తర్వాత ఆయన బ్రిటిష్ మ్యూజియమ్ లైబ్రరీకి వెళ్ళి, మరణం మీద అన్ని సిద్ధాంతాలను అధ్యయనం చేశారు. ఆయన, గూఢవిద్య లేదా రహస్యవిద్య, మార్మికవిద్య రోసిక్రూసియనిజమ్ (Rosicrucianism) , బౌద్ధమతము, క్రైస్తవమార్మిక విద్య, యోగము మొదలైన విషయాలన్నిటిమీదా, అనేక గ్రంథాలను అధ్యయనం చేశారు. ఆయన ఇంకా ఎంతో తెలుసుకోవాలనే ఆసక్తితో థియోసాఫికల్ సొసైటీ (దివ్యజీవన సమాజము) లో జేరారు. రెండు సంవత్సరాలలో, వాళ్ళ ఈశ్వరసంబంధమైన జ్ఞాన యోగవిద్య ప్రకటనలనుచూచి నిరాశచెందారు. ఏమైనప్పటికి ఆ ఈశ్వర సంబంధమైన జ్ఞానయోగ విద్యవలన ఆయనలో ప్రాచ్య, పాశ్చాత్య (తూర్పు, పశ్చిమ) దేశాల మార్మిక విద్యలను గూర్చి తెలుసుకోవాలనే గాఢమైన కోరికను రగిల్చింది.

ఆశ్చర్యకరంగా ఆయన మార్మిక విద్యలలోనూ, గూఢవిద్యలలోను ఆసక్తి వదలివేసి జర్నలిజమ్ (పాత్రికేయవృత్తి, వార్తాసమర్పణ విధానం)లో తన పూర్తిశ్రద్ధనుంచారు. మరలా ఆ ఉన్నతశక్తే ఆయనను గొప్ప రచయితగా తయారయ్యే విధంగా నడిపించింది. దైవరాజ్యంలోనికి ప్రవేశించాలని ప్రయత్నించిన వారిలో కొందరిని, గోడకు కన్నంవేసి దొంగలలాగా రాదల్చుకున్నారు వారు అని జీసస్, వాళ్ళను తిట్టటంలో ఆయన ఉద్దేశమేమిటి? వాళ్ళు వాళ్ళ అహంకారాన్ని విడిచిపెట్టకుండ, అహంకారపు ప్రవృత్తినుండి బయటపడకుండా, వాళ్ళు దైవరాజ్యంలోనికి ప్రవేశించాలని చూస్తున్నారని జీసస్ అభిప్రాయం. ఎవరా దొంగలు? వాళ్ళు గుప్తశక్తులను (అతీంద్రియశక్తులను) కోరుకునే వారే సుమా!

అలా ఆయన తన సులభగ్రాహ్యమైన రచనలతో పేరు సంపాదించు కుంటున్నపుడు కూడా,ఆయన మనసులో ఒక సంఘర్షణ జరుగుతుండేది. నేను పాత్రికేయవృత్తిని కొనసాగించి ఖ్యాతిని సంపాదిచుకోవాలా, లేక ఆధ్యాత్మిక సాధన కొనసాగించాలా అని. అదే ఆయనలోని సంఘర్షణ, ఆయన ఇద్దరు గురువులను కలిశారు. ఆలన్ బెన్నెట్ మరియు థర్స్టన్ (Thurston)

వాళ్ళు ఆయనకు సరియైనమార్గాన్ని చూపటానికి ప్రయత్నించారు. కానీ, ఒక తలపాగా ధరించిన భారతీయుడు, ఆయనను, ప్రభావితం చేసి, భారతీయ యోగశాస్త్రంలో పరిశోధన సల్పమని ప్రోత్సాహపరచారు.

ఆయన జీవితంలో మరొక మార్పు సంభవించింది. ఆయన వివాహం చేసుకున్నారు. ఒక కుమారుడు కలిగాడు. ఆ కుమారుని పేరు కెన్నెత్‌హర్స్ట్. కెన్నెత్‌ను కలుసుకునే భాగ్యం నాకు కలిగింది. బ్రంటన్ యొక్క అముద్రిత వ్రాతప్రతులను కొన్నిటిని ఆయన నాకు ఇచ్చారు. అవి తర్వాత (Conscious Immortality) అమరచైతన్యము అనే పేరుతో ముద్రితమైనవి. కెన్నెత్ తన తండ్రి వ్రాసిన పదహారు గ్రంథాలను ముద్రింపజేశారు.

ముప్పది రెండేళ్ళ వయసులో బ్రంటన్ జీవితం చెప్పుకోతగ్గ మలుపు తిరిగింది 1930వ సంవత్సరంలో. భారతీయ యోగశాస్త్రాన్ని గూర్చి పరిశోధించాలని ఆయనలో గట్టికోరిక కలిగింది. ఆయన వెంటనే భారతదేశంలోని, దార్శనికులు, మహాత్ములు, మహర్షులు వారియొక్క (శతాబ్దాల వివేకవిజ్ఞానాలను) గొప్పతనాన్ని, వారియొక్క అనేక శతాబ్దాలకు చెందిన వివేక విజ్ఞానాలను గురించి తెలుసుకోవాలనే దృఢనిశ్చయంతో ఆయన ఓడలో ముంబైకు చేరుకున్నారు. ఆయన భారతదేశం మొత్తము పర్యటించారు. మహర్షులను, మహాత్ములను, మెస్సయ్యలను, మార్మికులను, జ్యోతిష్కులను కలుసుకుంటూ వారిని ప్రశ్నిస్తూ పరిశీలిస్తూ, ఆయన పర్యటించారు. దాని ఫలితంగా సంభ్రమాశ్చర్యాలను కొలిపే 'A Search In Secret India' (గుప్త భారత దేశంలో అన్వేషణ) అనే పుస్తకం రచించారు. అది మంచి ప్రాచుర్యాన్ని పొందింది.

ఆ పర్యటనలలో ఆయన చెన్నైకు వచ్చారు. అక్కడ ఒక మౌనముని ఆశ్రమంలో సుబ్రహ్మణ్య అనే ఆయన బ్రంటన్‌ను పలుకరించి, పవిత్రమైన అరుణాచలంపై ఉండే తన గురువుగారి వద్దకు రావలసిందిగా పట్టుబట్టారు. బ్రంటన్ నిరాకరించారు. అంతటితో వదలకుండా, మర్నాటి సాయంత్రం వచ్చి కలుస్తానని చెప్పి వెళ్ళారు సుబ్రమణ్య. తన హోటల్‌కు తిరిగివచ్చిన తర్వాత, బ్రంటన్ వెంకటరమణి అనే రచయితను కలవటానికి, ఒక పరిచయ లేఖతో సహా వెళ్ళారు. మర్నాటి ఉదయం వెంకటరమణి ఆయనను తన గురువు గారైన కంచి కామకోటిమఠ పీఠాధిపతి శ్రీశంకరాచార్యుల వద్దకు తీసుకొని వెళ్ళారు. దక్షిణభారతదేశంలోని ఎంతోమంది హిందువులకు ఆయన ప్రధాన గురువు. సరియైన ఆధ్యాత్మిక గురువు ఎవరైనా ఉన్నారాయని ఆయనను ప్రశ్నించినపుడు, శంకరాచార్యులు, బ్రంటన్ వద్దనుండి ఏది ఏమైపోయినా, అరుణాచలంపై ఉన్న రమణమహర్షిని కలుస్తాను అని వాగ్దానం తీసుకొన్నారు. ఆయన తిరిగి తన గదికి వచ్చేసరికి, తన గురువుగారైన భగవాన్ శ్రీరమణమహర్షి వద్దకు బ్రంటన్‌ను తీసుకొని వెళ్ళటానికి సుబ్రమణ్య వచ్చారు.

శ్రీభగవాన్‌తోటి ఆయన తొలిసమావేశం గురించి చదువుతుంటే ఆసక్తికరంగా ఉంటుంది. దానికి తార్కికమైన ఆధారమేమీ లేదు. అందుకొరకు మార్మికమైన పథకరచన జరిగిందా అన్పిస్తుంది. పాల్‌బ్రంటన్ భారతదేశానికి రావటం, భగవాన్ శ్రీరమణ మహర్షియొక్క గొప్ప ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి వెల్లడి చెయ్యటంకొరకే, దైవం యొక్క పథకంలో నిర్ణయించబడింది. సత్యాన్ని కప్పివేసే చీకటి దారులను తన శక్తివంతమైన రచనల ద్వారా తెరచే పని ఆయనకు వదలివేయబడింది. అక్కడ ప్రకాశమున్నదని తెలియజేస్తూ ప్రపంచం నలుమూలలలోని సాధకులకూ ఆయన తలుపులు తెరచారు.

పాల్‌బ్రంటన్ 1930లో మహర్షి వద్దకు వచ్చారు. మేధావి, పాత్రికేయుడు కనుక ఆయన ముప్పదిరెండు పేజీలనిండా మహర్షి నడుగవలసిన ప్రశ్నలను వ్రాసుకొచ్చారు. ఆయన మార్మిక వాదమును కూడా అధ్యయనం చేసినందున ఆయన చాలా జాగ్రత్తగా ఆలోచించి ఆ ప్రశ్నలను తయారుచేశారు. కానీ ఆయన మహర్షి వైపు, మహర్షి ఆయనవైపు చూడగానే, మనస్సు అంచనాలకు అందని లోతైన మౌనంలోనికి ఆకర్షింపబడ్డారు. ఆయన నోటినుండి గానీ, మనసు నుండిగాని, ఒక్క మాట కూడా బయటకు రాలేదు. ఆయన ఇదివరకెన్నడూ ఎరుగని నిశ్శబ్దంతోనూ, శాంతితోనూ నిండిపోయారు.

బ్రంటన్ ఇలా అనుకున్నారు. ఇనుపరజనును అయస్కాంతము ఆకర్షించినట్లు. ఈ వ్యక్తిలోనిది ఏదో (శక్తి) నా దృష్టిని ఆకర్షిస్తోంది. నా చూపును ఆయన నుండి మరల్చ లేక పోతున్నాను. తర్వాత, నిశ్శబ్దమైన, పవిత్రమైన మహర్షి సాన్నిధ్యంలో, తన మొదటి సమావేశపు ప్రాముఖ్యతను గూర్చి బ్రంటన్ ఇలా వ్రాశారు. "ఒక నిశ్శబ్దమైన, నిరోధింపబడని ఏదో మార్పు

నా మనసులో చోటుచేసుకుంటున్నట్లు, నాకు తెలిసింది. ఎంతో జాగ్రత్తగా, ఖచ్చితంగా, హెచ్చుతగ్గులు లేకుండునట్లుగా రైలులో నేను తయారు చేసుకున్న ప్రశ్నలన్నీ ఒకదాని తర్వాత ఒకటి జారిపోయినవి. ఇన్నాళ్ళనుండి, నన్ను ఇబ్బందిపెట్టిన సమస్యలను పరిష్కరించగలనా అనే విషయం ఇప్పుడంత పట్టించుకోవలసినదిగా నాకు అన్పించలేదు. ఒక స్థిరమైన ప్రశాంతత అనే నది నా సమీపంలో ప్రవహిస్తున్నట్లు, ఏదో శాంతి నా అంతరంగపు లోతులలోనికి చొచ్చుకుని వస్తున్నట్లు ఎప్పుడూ ఆలోచనలతో సతమతమయ్యే (హింసింపబడే) నా మెదడు, కొంత విశ్రాంతి చెందటం మొదలుపెట్టినట్లు నాకు తెలుస్తున్నది".

త్వరలోనే ఆయన ఉత్తరభారతదేశానికి తిరిగివెళ్ళారు. ఆధ్యాత్మిక గురువులను వెదుకుతూ. ఆయన కలుసుకున్న వారిలో ఒకరు పరివ్రాజక యోగి అయిన చండీదాస్ ఆయన పాల్‌బ్రంటన్‌ను చూడగానే మూడు జ్యోతిష్య సంగతులు చెప్పారు. ఆ మూడు నిజమైనవి. మూడవది చాలా ప్రత్యేకమైనది. చండీదాస్, బ్రంటన్‌తో ఇలా చెప్పారు. నువు మరొక రెండుసార్లు భారతదేశానికి వస్తావు. నువ్వు నీకోసం వేచియున్న ఒక మహర్షితో, ఆధ్యాత్మిక దాహార్తిని పూర్తిచేసుకుంటావు. పాల్‌బ్రంటన్ కోసం వేచియున్న మహర్షి, భగవాన్ శ్రీరమణ మహర్షి.

ఆయన చేసిన విస్తారమైన ప్రయాణాల భారం ఆయనపై తీవ్రప్రభావాన్ని చూపించి, ఆయన జబ్బుపడి, బాగా పాడైపోయారు. ఆయన అనారోగ్యం ఆయనను ఎంతగా బాధించిందంటే, ఆయన వెంటనే బయలుదేరి ఇంగ్లాండ్ వెళ్ళిపోవాలనుకున్నారు. అదృష్టవశాత్తూ ఆయన మనసులో ఒక పెనుగులాట మొదలైంది. అంత జబ్బులో కూడా, ఆయన కలుసుకున్న మహర్షులు, మహనీయులు, మార్మికుల చిత్రాలు, ఆయన మనసులో ఒకదాని వెంబడి ఒకటి (Slideshow) వాటంతటవే కన్పించసాగాయి. అన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, రమణమహర్షి చిత్రం ఎక్కువ ప్రకాశవంతంగా కనబడింది.

ఇప్పుడు వింత పరిణామాన్ని చూడండి. ఆయన ఇంగ్లండ్‌కు వెళ్ళి తీరాలని నిశ్చయించుకున్నారు. అనుకోనివిధంగా, మహాత్ముల చిత్రాలన్నీ ఆయన హృదయంలో వరుసగా ప్రత్యక్షమైనాయి. (కన్పించాయి.) ఆయన మహర్షి వద్దకు తిరిగివెళ్లాలని నిశ్చయించుకున్నారు. వెంటనే రమణమహర్షి జీవితచరిత్ర వ్రాసిన బి.వి.నరసింహస్వామి వద్దనుండి, అరుణాచలానికి, గురువుగారి వద్దకు రావలసిందిగా బ్రంటన్‌కు లేఖ వచ్చింది. ఆయన ముంబైనుండి చెన్నైకు వచ్చినపుడు, రచయిత వెంకటరమణి బ్రంటన్‌ను కలుసుకుని శంకరాచార్య ఏమని చెప్పారో తెలిపారు. "మీ స్నేహితుడు భారతదేశం మొత్తం పర్యటిస్తారు. ఆయన ఎంతమందో యోగుల్ని కలసి, ఎందరో గురువుల మాటలను విని చివరకు మహర్షి దగ్గరకు వచ్చి తీరుతారు. ఎంత బాగా భవిష్యత్తును చెప్పారు. అందువలననే, బ్రంటన్ తన స్నేహితులను భారతదేశానికి పంపుతూ, "వెళ్ళిచూడండి. అక్కడ సత్యమే మానవరూపంలో జీవిస్తున్నది. వెళ్ళి కామకోటిపీఠాధిపతి అయిన శంకరాచార్యులను దర్శించండి. అన్నిటికంటె ముఖ్యము, తిరువణ్ణామలైకు వెళ్ళి గొప్ప మహాత్ములైన రమణమహర్షి కంటికి కన్పించనటువంటి శక్తిని అనుభవించండి. ఆయన భౌతికంగా లేకపోయినా ఫర్వాలేదు".

రెండవసారి పాల్‌బ్రంటన్ మహర్షి వద్దకు వచ్చారు. అది మన లాభం కొరకే. అలా వచ్చి ఉండకపోయినట్లైతే, పాల్‌బ్రంటన్‌పై ప్రసరించబడిన అనుగ్రహవీక్షణం, ఆయనతోటే మరుగైపోయి ఉండేది. కానీ మహర్షి గురించి ప్రపంచం మొత్తానికి తెలియవలసి ఉన్నది. ప్రపంచంమొత్తం 'నేను', 'అహం' అనే సందేశాన్ని అందుకోవలసి ఉన్నది. అందుకనే ఉన్నతమైన శక్తి, తిరిగి రమణమహర్షి వద్దకు బ్రంటన్‌ను పంపింది. ఆయన ఎలాగైనా సత్యాన్ని అనుభవించి తీరాలని వెనుకకు వచ్చారు. ఆయన అనేకమంది మహాత్ములను ప్రశ్నించి వారందరూ సత్యాన్ని గురించి మాట్లాడగా విన్నారు. ఇప్పుడాయన, అనుభవించాలనుకుంటున్నారు. ఈ విధంగా దృఢనిశ్చయుడైన పాల్‌బ్రంటన్ 1931లో అరుణాచలమునకు వచ్చారు. ఆయన దృఢనిశ్చయం చూసి బి.వి. నరసింహస్వామి, ఇతర భక్తులు, రమణాశ్రమానికి పొరుగున ఉన్న పల్లాకొత్తులో ఒక కుటీరం నిర్మించుకోవటానికి సాయపడ్డారు. రమణమహర్షి పవిత్ర పాదాలచెంత తన సర్వస్వాన్నీ అర్పించటానికి సిద్ధమైనారు, పాల్‌బ్రంటన్. సత్యాన్ని అనుభవించుట కొరకై, పాల్‌బ్రంటన్ యొక్క అకుంఠిత దీక్ష, దృఢనిశ్చయము, పూర్ణవిశ్వాసము, మనందరము కూడా అలవరచుకోవాలి.

ఆయన రమణమహర్షితో అనేకసార్లు, సమావేశమై సంభాషణలు జరిపారు. కొన్ని సమావేశాలు, చిన్నవి, కొన్ని సుదీర్ఘమైనవి. ఆయన ఎల్లప్పుడు చేతిలో ఒక నోటు పుస్తకము, పెన్సిల్‌తో, మహర్షిని ఎల్లవేళలా అనుసరిస్తుండేవారు. ఆయన మహర్షిని శోధించే ప్రశ్నలువేసి, ఆత్మవిచారణ గురించి పూర్తిగా అర్థమయ్యేవరకు, మహర్షిని వదలలేదు. మహర్షి కూడా, తన వద్ద ఉన్నదంతా, పాల్‌బ్రంటన్‌కు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారు, ఎందుకంటే తన బోధ ప్రపంచవ్యాప్తి చెంది పదిమందికి ఉపయోగపడాలి గనుక. దానిని లోతుగా అర్థం చేసుకున్న తర్వాత,దానిని ఆయన తన పుస్తకము 'A Search In Secret India' లో పొందుపరచారు. ప్రపంచంలో మొదటిసారిగా, 'నేను' అనేదే దైవమని, తన దృష్టిని అంతరంగ ప్రకాశంపై నిలపాలని బోధించబడి, ఒక పాశ్చాత్యుని కలము ద్వారా ఆ విషయం లిఖించబడ్డది. అదే సత్యాన్ని, 'I Am That I Am' అని దైవరాజ్యము నీలోనే ఉన్నదని, బైబిల్ వెల్లడించింది. తన శక్తివంతమైన మాటల ద్వారా, మనలో ప్రతి ఒక్కరిని, అంతరంగంవైపుకు తిరగమని అంతరంగంలోని ప్రకాశము లేదా చైతన్యము, మనకు లభ్యమౌతుందని, భవిష్యత్తులో ఎప్పుడోకాదు, ఇప్పుడే ప్రయత్నించమని చెప్పారు.

స్పష్టత కల్గిన ఆయన మాటలు, ఎంతోమంది పాశ్చాత్యులనే కాదు, చాలామంది భారతీయ మేధావులను కూడా, మహర్షి వద్దకు వచ్చేటట్లు చేసినవి. మేజర్‌చాడ్విక్, యస్.యస్.కోహెన్, మారిస్ ఫ్రిడ్‌మన్, డాక్టర్ హఫీజ్ సయ్యద్, దిలీప్ కుమార్ రాయ్, ఇంకా ఎంతోమంది ఇతరులు,బ్రంటన్ వ్రాసిన పుస్తకం చదివే మహర్షి వద్దకు వచ్చారు. ఎందరో భారతీయ మఠాధిపతులు కూడా 'A Search In Secret India' చదివి మహర్షి గురించి తెలుసుకున్నారు. రమణమహర్షి రచించిన 'నవమణిమాల', (తొమ్మిది రత్నాలు కల్గినహారం) లో, ఆయన 'నేను' అనే బోధను (అహమ్, I am) ప్రపంచమంతా వ్యాప్తి చేసే పనిని అరుణాచలుడు తనకప్పగించారని వెల్లడిచేశారు. తను అరుణాచలమునుండి ఒక అంగుళము కూడా కదలకుండా అదెలా సాధ్యమౌతుంది? కాబట్టి పాల్‌బ్రంటన్ లాంటి ఒకరు దానిని ప్రపంచంలో వ్యాప్తి చెయ్యటానికి కావలసివచ్చింది. పాల్‌బ్రంటన్ అప్పటికప్పుడే ప్రజాదరణ పొందారు. ప్రపంచం నలుమూలలలో ఆర్తితో బాధచెందుతున్న నిజమైన సాధకులు, ఈ పుస్తకం ద్వారా, మిణుకు మిణుకుమనే ప్రకాశాన్ని చూడగలిగారు. ఇందు ఎవరికి వారే తమ అంతరంగమునందలి ప్రకాశాన్ని దర్శించదానికి, అంతరంగంలోనికి దృష్టిని నిలపాలని, నొక్కి చెప్పబడింది. అదే పండిత పామరులందరినీ ప్రభావితం చేసిన రహస్యము.

పాల్‌బ్రంటన్ మాటలలో చెప్పవలెనంటే, "ఈ అరుణాచల మహర్షి మాటలు, ఇప్పటికి కూడా, నా మనస్సులో మార్గమును చూపే గొప్ప వెలుగువెన్నెల వలె ప్రకాశిస్తున్నవి".

రాయ్ ఎమర్సన్, "నేను అరుదుగా లభ్యమయ్యే మహాత్ములతోటి సమావేశముల ద్వారా, బంగారు ఫలములను కోసుకోగలిగాను. మహర్షితోటి సంభాషించుట ద్వారా, నేను బుట్టలనిండా బంగారుఫలాలను కోసుకున్నాను. మన యూరప్ ఖండములోని గొప్ప వేదాంతులు మహర్షి ముందు కొవ్వొత్తిని కూడా పట్టలేరు. జ్ఞానమును శాంతిని వెదజల్లే ఆయన అద్భుతమైన చిరునవ్వును ఎవ్వరూ మర్చిపోలేరు. మనలను అంత బాగా అర్థము చేసుకునే వారిని నేనెప్పుడూ చూడలేదు. ఆయన మాటలు కొన్ని నీ మార్గమును నునుపుగాను, సుగమంగాను చేస్తవి. నీ యొక్క గాఢమైన అనుభూతి ద్వారా నీవు గ్రహించిన విషయములను,ఆయన మాటలు ధృవీకరిస్తాయి. పాల్‌బ్రంటన్ జ్ఞాపకార్థము, ఆయన పుస్తకములోని కొన్ని మాటలను ఉటంకిస్తాను.

బ్రంటన్ :- మీరు మాట్లాడే ఆత్మ అనేది ఖచ్చితంగా ఏమై ఉంటుంది? మీరుచెప్పేదే నిజమైతే మానవునిలో ఇంకొక 'నేను' ఉండవలెనే?

భగవాన్ :- ఒక మనిషి రెండుగుర్తింపులు లేదా రెండు 'నేను'లు కలిగియుండుట ఎలా సంభవం? దీనిని అర్థము చేసుకొనవలెనంటే ఒక వ్యక్తి తనను తాను విశ్లేషించుకొనవ వలసి వస్తుంది. ఒక మనిషి ఇతరులు తనను, ఒక శరీరము, మనసు, వ్యక్తిత్వముల సమ్మేళనమైన వ్యక్తిగా అనుకొనుట వలన, తన గురించి తాను కూడా, శరీరము, మనస్సు, వ్యక్తిత్వముల సమ్మేళనమైన వ్యక్తిననే భావించుకుంటున్నాడు. అలా భావించుటకు దీర్ఘకాలంగా అలవాటు పడుట వలన, మన

నిజస్వరూపమును అతడు ఎన్నడూ దర్శించలేకపోతున్నాడు. అందుకనే 'నేనెవరను?' అనే ఆత్మ విచారణను జరపమని నేను నీకు చెప్పాను. నీ స్వస్వరూపమును వర్ణింపమని నువ్వు నన్ను కోరావు. దాని గురించి ఏమి చెప్పగలము? దేని నుండి నీ వ్యక్తిగతమైన 'నేను' (వ్యక్తిత్వభావన) అంకురిస్తుందో (పుడుతుందో) ఎక్కడ, ఈ భావము లయమై (అంతరించి) పోతుందో అదే నీ నిజస్వరూపము.

బ్రంటన్ :– 'నేను' అనే అహంత మాయమగుటయా? ఎవరైనా తన వ్యక్తిత్వ భావనను ఎలా పోగొట్టుకొనగలరు?

భగవాన్ :– ప్రతి ఒక్కరిలోనూ, ఉదయించే తలంపులన్నింటిలోనూ మొదటి తలంపు, 'నేను' అనే ఆలోచనే. ముందు మనసులో 'నేను' అనబడే ఉత్తమ పురుష సర్వనామము మొదలైన తర్వాతనే, 'నీవు' అనబడే మధ్యమ పురుష సర్వనామము బయల్దేరుతుంది. నీవు గనుక ఈ 'నేను' అనే సూత్రమును (దారమును) దాని మూలమును జేరు వరకూ మానసికంగా అనుసరిస్తే, అపుడు ఈ 'నేను' అనే తలంపు (ఆలోచన) మొట్టమొదటిగా ఉదయించే ఆలోచనగాను, చిట్టచివరిగా అంతరించే ఆలోచనగానూ కనుగొంటావు. ఇది అనుభవ పూర్వకముగా తెలుసుకొన గలిగిన విషయమే.

బ్రంటన్ :– అలా ఒకరు తనలోనికి తాను మానసిక విచారణ జరపటము అనేది సాధ్యమేనని మీరు అంటారా?

భగవాన్ :– ఊరక ఉండు (నిశ్చలమైన మనసుతో ఉండు), ఆలోచనలకు తావివ్వకు. 'అహం' లేదా 'నేను' అనే చైతన్యమును, తెలుసుకో (అనుభవించు).

బ్రంటన్ :– నేను కనులు తెరచుకొని ధ్యానము చెయ్యవలెనా? లేనిచో కళ్ళు మూసుకుని ధ్యానము చేయవలెనా?

భగవాన్ :– మీరు కళ్ళు తెరచుకొనిగానీ, మూసుకునిగానీ, మీకేది అనుకూలంగా ఉంటే ఆ విధంగా చెయ్యవచ్చును. అది ఒక్కొక్కరికి ఒక విధముగా ఉంటుంది. మనస్సు కళ్ళు ద్వారా విషయములను గ్రహిస్తేనే 'చూడటము' అనేది జరుగుతుంది. మనస్సు అంతర్ముఖమై ఉండి విషయములను గ్రహించకపోతే కళ్ళు తెరచి ఉన్నప్పటికీ అది చూడదు. శబ్దముల విషయము కూడా అంతే. నీవు వాటిపై దృష్టిని ఉంచితే వాటిని వింటావు. నీవు ఏకాగ్రతతో నీలోని హృదయము మీదనే దృష్టిని ఉంచితే నువ్వు శబ్దములను వినవు. ఆసనం విషయంలో కూడా అంతే. జ్ఞానమార్గమునకు ఏ ఆసనము మంచిది, అనే ప్రసక్తే లేదు. ఆసనము అంటే నిజానికి హృదయములో నిలకడ గలిగి ఉండుటయే. అది అంతర్గతమైనది. ఉత్తమమైన ఆసనం హృదయములో నిలకడగలిగి ఉండుటయే.

బ్రంటన్ :– మేము ప్రయత్నము చెయ్యవలెనా? (ప్రయత్నము అవసరమా?)

భగవాన్ :– ప్రయత్నము లేకుండా ఎవరూవిజయాన్ని సాధించలేరు. మనోనిగ్రహము అనునది ఎవరికీ జన్మహక్కు కాదు.విజయాన్ని సాధించిన కొద్దిమంది, తమ పట్టుదల వల్ల, అకుంఠిత దీక్ష వలననే విజయాన్ని సాధించారు. మన దృష్టిని వస్తువుల వైపునకు, విషయముల వైపునకు, మేధస్సు వైపునకు త్రిప్పితే, మనసు ఆ విషయములనే గ్రహిస్తుంది. అదే మన ప్రస్తుత దుఃఖమునకు కారణము. కానీ మనము అంతరంగములోనికి తిరిగి, మన దృష్టిని హృదయముపైనే నిలిపి ఉంచితే, దాని గురించి మాత్రమే ఎరుకతో ఉంటాము. కావున అంతయూ, మనము దృష్టిని ఎటువైపు త్రిప్పుతాము (బాహ్యమువైపునకా, అంతరంగములోనికా) లేదా, దేనిపై దృష్టిని నిలుపుతాము అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

బ్రంటన్ :– మేమెలా ధ్యానము చెయ్యవలెను?

భగవాన్ :– మీరు తెలుసుకొనవలసినదల్లా, కనులు మూసుకుని, అంతరంగము లోనికి మీ శ్రద్ధను లేదా దృష్టిని ప్రసరింపజేయడమే.

బ్రంటన్ :– 'నేను దైవమును' (అహం బ్రహ్మాస్మి) అని చింతించుట ఉపయోగకరమైనదేనా?

భగవాన్ :– 'అహం', 'అహం' అని స్ఫురించే ఆత్మయే దైవము. 'నేను' అనే ఆలోచనకాదు. దానిని గ్రహించు.దానిని గూర్చి ఆలోచించుట కాదు. 'I AM THAT I AM' 'నేను నేనైన నేను' అంటే, ఒకరు తన స్వస్వరూపముగా నిలచి ఉండుటయే ఆత్మనిష్ఠులై ఉండుటయే. ఎవరైనా ఎప్పుడైనా తన స్వస్వరూపమైన ఆత్మయే గానీ వేరేమీ కాదు. ఆ సమయంలో పెంపుడు ఉడుత,

భగవాన్ సోఫాపై నుండి బయటకుపారిపోవుటకై అవకాశము కొరకు వేచి ఉన్నది. భగవాన్ దానిని పట్టుకుని, ప్రతి ఒక్కరూ బయటకుపరుగెత్తాలని, దూసుకుపోవాలని కోరుకుంటారు. బయటకువెళ్ళటానికి అంతు ఉండదు. (బాహ్య విషయములను గురించి ఆలోచించుటకు అంతు ఉండదు.) ఆనందము లోపలనే (అంతరంగము)లోనే ఉన్నది, బాహ్యములో కాదు.

బ్రంటన్, లండన్ దగ్గరలో ఒక ప్రశాంతమైన గ్రామంలో ఉండగా, భగవాన్, ఆయనకు ధ్యానంలో కన్పించి, ఆయన రెండవ పుస్తకమైన 'The Secret Path' (రహస్యమార్గము) అనేపుస్తకాన్ని వ్రాయమన్నారు. అప్పుడు భగవాన్ అనుగ్రహం వలన, ఒక ప్రవాహంలాగా రచన సాగింది. ఫలితంగా తొమ్మిది పుస్తకాలు వెలువడ్డాయి. వీటన్నిటిలోకి 'The Quest for Overself' (పరమాత్మకై అన్వేషణ) అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఎందుకంటే, ఆయన భగవాన్ సన్నిధిలో పొందిన అనుభవాలనన్నిటినీ, సాధకులకు మార్గంచూపటం కోసం, ఎలా ఆచరణలో పెట్టాలి అనేది తెలపడంకోసం వెల్లడించారు. 1938 లేదా 39లో పాల్‌బ్రంటన్‌కు, రమణాశ్రమ నిర్వాహకులకు,మనస్పర్థలు వచ్చినవి. వాటివలన భగవాన్ హాలులో, బ్రంటన్ నోట్సు వ్రాసుకోవడానికి వీలులేకపోయింది. ఇది ఆయనకెంత కోపాన్ని కలిగించిందంటే, అసలు ఆశ్రమ సమీపములోనే ఆయన ఉండలేకపోయారు. ఆయన వెళ్ళిపోయారు. మైసూరు మహారాజుగారి సహకారంతో (ఔదార్యంతో) 1947 వరకు భారతదేశంలో ఉన్నారు. కానీ, ఆయన భగవాన్‌తోటి ఎప్పుడూ సంబంధం కొనసాగించారు. ఆయనకు భగవాన్ పట్ల పరిపూర్ణమైన భక్తి, శరణాగతభావం ఉన్నాయి. ఆయన తన్మయత్వంతో వ్రాసే లేఖల ద్వారా భగవాన్‌తో ఎల్లపుడు సంబంధం కలిగియున్నారు.

ఒక లేఖలో బ్రంటన్ ఇలా వ్రాశారు, 'భగవాన్ 'నేను' (ఆత్మ) ఎల్లవేళలా నా హృదయకుహరంలో నన్ను కలుస్తుంటారు'. భగవాన్ కూడా పాల్‌బ్రంటన్ అంటే ఆపేక్షగా ఉండేవారు. ఒకరోజు హాలులో ఉండగా, భగవాన్ బాహటంగానే చెప్పారు, "పాల్‌బ్రంటన్ గురించిన ఆలోచన నా మనసులోనికి వస్తుంది. పాల్‌బ్రంటన్ కూడా భగవాన్‌ను తలచుకుంటున్నట్లు రూఢిగా చెప్పగలను". సరిగ్గా అదే సమయంలో, ప్రపంచంలో (భూగోళంలో) ఆవలి వైపున పాల్‌బ్రంటన్ ఒక ప్రవచనము (ఉపన్యాసము) ఇవ్వబోతూ భగవాన్‌కు తన వందనమును సమర్పించుకున్నారట.

మరొకసారి హాలులో ఉండగా భగవాన్ పోస్టులో ఒక పాంప్లెట్ (కరపత్రము) అందుకున్నారు. ఆ పత్రంలో, పాల్‌బ్రంటన్ వ్రాసిన సూక్తి (Quotation) వాక్యమొకటి ముద్రించబడింది. భగవాన్ దానిని పెద్దగా చదివారు. అందులో పాల్‌బ్రంటన్ ఇలా వ్రాశారు, "నేనుపూర్ణమైన శాంతిలో ఉన్నాను. అహం (అహంకారము, వ్యక్తిత్వము) ఇంకా ఉన్నది. కానీ, అది పూర్తిగా రూపాంతరము చెందింది. నా విలువలేని వ్యక్తిత్వంకంటే, చాలా ఉన్నతమైనదేదో, నా చైతన్యంలో (మనస్సు) ఉదయించి, 'నేను' (నాకు)గా మారుతుంది. నేను కళ్ళు చెదిరే కాంతి సముద్రము మధ్యలో ఉన్నాను.నేను పవిత్రమైన ఆనందపు ఒడిలో ఉన్నాను. దైవ అనుగ్రహము, పూర్తి శరణాగతితో వేడుకున్నపుడు మాత్రమే దిగివచ్చి (అవతరించి) పనిచేస్తున్నది. అది లోపలనుండే పనిచేస్తున్నది. ఎందుకంటే దైవము, అన్ని జీవుల హృదయాలలో ఉంటారు గనుక. దాని గుసగుసలు (మర్మర ధ్వనులు) (సున్నితశబ్దము) కేవలం, శరణాగతితోనూ, ప్రార్థనతోనూ, పరిశుద్ధమైన మనసులోనే విన్పిస్తాయి. హేతువాదులు, తార్కికులు, అది అంటే నవ్వుతారు. నాస్తికులు దానిని నిరసిస్తారు. (తిరస్కరిస్తారు) కానీ అది ఉన్నది. అది (జీవుని) పరిధిలోని చైతన్యములోనికి దైవము దిగిరావటమే. (అవతరించటమే). అది ఒక ఊహించని, ముందుగా చెప్పలేని, శక్తియొక్క రాకడయే. (రావడమే) అది విశ్వంలోని నిశ్శబ్దం నుండి వినవచ్చే గొంతుకయే (స్వరమే). అది, దాని నిబంధనలననుసరించి ప్రామాణికమైన అద్భుతాలను చేయగలదు. (జరుగునట్లు చేయగలదు). ఈ సంఘటన, 'అనుదినము రమణులతో' 'Day By Day With Bhagavan' అనే పుస్తకములో వ్రాయబడింది.

1952లో మహర్షి సమాధిచెందిన పిదప, పాల్‌బ్రంటన్ రమణాశ్రమమునకు వచ్చారు. అది ఎంతోచక్కగా ఉన్నది. ఎందుకంటే భగవాన్ భౌతికంగా ఉన్నప్పటికీ, లేనప్పటికీ ఆయనకు ఏమీ తేడా కన్పించలేదు. మునుపు భగవాన్ భౌతికముగా ఉన్నపుడుకూడా బ్రంటన్, రమణుల ఆధ్యాత్మిక సన్నిధిలోనే మునిగిపోయి ఉండేవారు. ఆయన సన్నిధానములో, బ్రంటన్, "సద్గురువు

శరీరమును వీడుట వలన మా అనుబంధం తెగిపోలేదు. మా మధ్యన పరస్పర అనుసంధానము (Communication) నిరోధింప బడలేదు. ఆయన ఇంకా నాలో ఒక ఉదాత్తమైన శక్తివలె, రక్తమాంసాదులతో గూడిన శరీరముతో సంబంధము లేని ఒక ఉనికివలె, జ్ఞాన ప్రకాశము వలె ఉన్నారు. కానీ ఆయన నాలో ఉండుట మాత్రము స్పష్టము. ఆయన మహర్షిని సర్వోత్కృష్టమైన దైవశక్తికి శుద్ధమైన మార్గంగా ఆరాధించేవారు.

ఆయనను యువసాధకులకు ఒక సందేశమివ్వమని కోరినపుడు, ఆయన ఇలా అన్నారు, "నిరంతరాయంగా "నేనెవరను?" అనే విచారణను కొనసాగించండి. దేహేంద్రియాలతో ఈ 'నేను' అనే వ్యక్తిత్వము ఎలా మిళితమౌతుందో, గాఢనిద్రలో ఎలా హృదయంలో ఉండి (పోయి), ఆత్మ సుఖాన్ని అనుభవిస్తుందో బాగా విశ్లేషించండి. 'నేను' అనే ఆలోచన ఏ మూలమునుండి ఉత్పన్నము అవుతుందో కనుగొనడానికి తీవ్రప్రయత్నము చెయ్యండి. ఎల్లపుడు ధ్యానమును కొనసాగించండి. మీ దృష్టిని అంతరంగంలోనికి మళ్ళిస్తూనే ఉండండి. ఏదో ఒకరోజున ఈ ఆలోచనా చక్రముయొక్క వేగము తగ్గి, అంతరజ్ఞానము గూఢముగా ఉదయిస్తుంది. దానంతట అదే తెలియబడే ఆ సహజజ్ఞానాన్ని అనుసరించు. నీ ఆలోచనలను కట్టిపెట్టు. అది నిన్ను చివరకు, నీ లక్ష్యమైన, సంశయముల ఊగులాట లేకుండ స్థిరముగ ఉండు, శాశ్వతమైన, ఎడతెగని, శుద్ధచైతన్యమునకు (ఆత్మసాక్షాత్కారమునకు) నడిపిస్తుంది. (చేరుస్తుంది).

1963లో ఆత్మసాక్షాత్కారము పొందిన తర్వాత, పాల్‌బ్రంటన్ సున్నితమైన శాంతిని ప్రసరించే పవర్‌స్టేషన్‌గా అయినారు. ఆయన అంతర ప్రకాశము యొక్క సౌందర్యము ఎంతోమంది సాధకులను ఆకర్షించింది. సత్యమైన ఆధ్యాత్మిక అనుభవము కోసము అనేక సంవత్సరములు ఎడతెగకుండ సాగించిన అన్వేషణలో ఎన్నటికీ పట్టువదలని, నిరాశ చెందని ఆయన ఉత్సాహాన్ని మనము చూడవచ్చును. ఈ అనుభవము, ఆయనకు మహర్షి యొక్క ప్రథమ దర్శనములోనే కల్గినప్పటికీ, అది అనేక సంవత్సరాల పాటు, నిగూఢంగా మరుగున పడి (కప్పబడి)పోయి ఉన్నది. దానిని ఆయన స్వంతం చేసికొనడానికి, ఆయన అనేక సంవత్సరాలపాటు, కఠినమైన, జారిపోయే, ఆధ్యాత్మిక బాటలో ప్రయాణించవలసి (నడవవలసి) వచ్చింది. ఆయన నూతనసాధకులను కలసినపుడల్లా, అంతరంగంలో విచారణ కొనసాగించాలని, సద్గురువుయొక్క పవిత్రమైన బోధను, దృఢంగా ఆచరణలో పెట్టాలని నొక్కివక్కాణించేవారు. ఆయన ఇలా వ్రాశారు, "మానవ సహజమైన అన్ని లోపములు, దోషములు నాలో ఉండినవి. (ప్రయాణంలో) దారిలో రోడ్డుపక్కన (మార్గమధ్యంలో) ఎన్నోసార్లు, పడిపోయాను. నా అంతట నేనే నిలదొక్కుకుని, ప్రతిసారీ, చిట్టచివరకు లక్ష్యాన్ని సాధించాను".

1970 దశకంలో అపాపంత్ అనే ఆయన, ఇంగ్లాండ్‌లో భారత రాయబారిగా ఉండేవారు. మారిస్ ఫ్రిడ్‌మన్ (Maurice Fredman) పుణ్యమా అని, (అతడు అప్పటికే భగవాన్‌కు గొప్పభక్తుడు) లండన్‌లోని భారతీయ విద్యాభవన్‌లో భగవాన్ చిత్రపటాన్ని ఆవిష్కరించడంద్వారా, భగవాన్‌పట్ల తన కృతజ్ఞతను వ్యక్తపరచాలనుకున్నారు. చాలా ఎక్కువమంది సభకు వస్తారని అంచనా వేయబడింది. ఆ ఉత్సవాలలో భాగంగా ఒక జ్ఞాపకార్థంగా ఒక పత్రికను అచ్చువేశారు. ఆ ఆలోచన వచ్చిన నాటినుండి నన్ను సంప్రదించడం ప్రారంభించారు. పాల్‌బ్రంటన్‌ను ఆహ్వానించవలసినదిగా, ఆయనను ప్రధాన ఉపన్యాసకునిగా ఉంచవలసినదిగా,నేను సలహా ఇచ్చాను. తను రావడానికి బదులుగా, ఒక వ్యాసాన్ని ఆ పత్రికలో ముద్రించడానికి పంపారు ఆయన. తన గురువు రమణులను, ఆరాధనా పూర్వకంగా స్మరిస్తూ వ్రాసిన గొప్ప వ్యాసమది. నేను దానిని ఆశ్రమ పత్రిక అయిన మౌంటెన్‌పాత్‌లో కూడా ముద్రింపజేశాను: "నేను ఆయన నివాసంలోనికి అడుగిడి, మహర్షి సగము మంచమునకు జేరగిలబడి, సగము కూర్చుని ఉన్నట్లున్న భంగిమలో చూచి నలుబది సంవత్సరములు గడచిపోయినవి. అంత సుదీర్ఘకాలము తర్వాత, చాలా జ్ఞాపకాలు కొంతవరకు మరుగున పడిపోతవి. లేనిచో పూర్తిగా కన్పించకుండా పోతవి. కానీ నేను ఈ విషయములో పూర్తి నిజాయితీతో చెప్పగలను. ఆ రెండింటిలో ఏదీ జరుగలేదని. అందుకు భిన్నంగా,ఆయన ముఖము, శరీరము, పరిసరాలు, అప్పుడెంత స్పష్టంగా చూశానో ఇప్పుడు కూడా, అంతే స్పష్టంగా నాకు జ్ఞాపకం ఉన్నది. అంతకంటె ముఖ్యమైన విషయమేమిటంటే, ధ్యానసమయంలో, ఆయన ప్రకాశవంతమైన సన్నిధి మొదటి రోజున ఎలా ఉందో, ఈ రోజునగూడా అంతే నిజంగా, స్పష్టంగా ఉన్నది". ఒక చెప్పుకోదగిన (విశిష్టమైన) భక్తుడు, విశిష్టమైన సద్గురువును ప్రశంసిస్తున్నారు.

1960లో నేను రమణాశ్రమమునకు వచ్చే సందర్శకుల బాగోగులు చూస్తుండే వాడిని. నేను ఒక గైడ్ వలె వారిని చూడవలసిన ప్రదేశాలన్నీ తిప్పి చూపించేవాడిని. పాశ్చాత్యులు చాలా తక్కువగా వచ్చేవారు. నేను వారిని ఇష్టపడేవాడిని. ఎందుకంటే సాధకుల మధ్య ఉండాలని నాకు ఆతృతగా ఉండేది. పాతభక్తులతో గడపడానికి ఎంత ఆత్రంగా ఉండేవాడినో, మహర్షినీ, ఆయన బోధలనూ వెతుక్కుంటూ వచ్చే కొత్త సాధకులతో సమయం గడపడానికి అంతే ఉత్సాహంతో ఉండేవాడిని. వారిలో కొద్దిమంది, పాల్‌బ్రంటన్ సూచన వల్ల ఇక్కడకు వచ్చామని వెల్లడించేవారు. ఆయన తప్పనిసరిగా వారితో కంచి శంకరాచార్యుల వారి వద్దకు వెళ్ళండి. ఆయన సజీవ శరీరంతో ఉన్న సత్యమే సుమా. (దైవమేసుమా!) . అన్నిటికంటేముఖ్యంగా, రమణాశ్రమానికి వెళ్ళండి. శరీరము లేని సత్యము అక్కడ ఉన్నది. దానినే మీరు అనుభవించాలి.

నేను పాల్‌బ్రంటన్‌కు ఉత్తరాలు వ్రాసేవాడిని. ఎందుకంటే భగవాన్ గురించి ప్రపంచం మొత్తానికి తెలియజేసింది ఆయనే కాబట్టి. ఆయన సలహాలు, సూచనలూ పొందాలనుకునేవాడిని. నేను ఆయనకు ఎన్నోసార్లు ఆశ్రమానికి వచ్చి ఉండవలసినదిగా, ఆహ్వానిస్తూ లేఖలు వ్రాసినా, సమాధానమేమీ వచ్చేది కాదు. కానీ నేను ఇక్కడకు సందర్శకులుగా వచ్చే ఆయన స్నేహితుల ద్వారా, ఆయనకు ఉత్తరాలు పంపుతుండేవాడిని. ఆ లేఖలలో ఒక దానిలో నేను ఆయనను ఇలా ప్రశ్నించాను. "బ్రంటన్, మీరు మహర్షిని పని, జ్ఞానము గురించి అడిగారు. మీరు భగవాన్‌తో అడవిలో ఉన్న ఆశ్రమములో ఉన్నారు. మేము, జీవనయానానికై (జీవనభృతికై) ప్రపంచం లోనికి వెళ్ళి డబ్బు సంపాదించుకోవాలి. కావున నేనెలా జీవించాలి? మీకు భగవాన్ స్వయంగా పనికీ, జ్ఞానానికి భేదం లేదని చెప్పారు గావున, మీకు ఈ విషయంలో స్పష్టత ఉండి ఉంటుంది. అది కాస్త నాకూ తెలపండి". జవాబుగా ఆయన క్లుప్తంగా, అందంగా ఉన్న లేఖను ఒక మిత్రుని ద్వారా పంపారు. పనులు నీకు వాటంతట అవే సంభవిస్తాయి కదా. ఇప్పుడు పనులను నువ్వే చేస్తున్నాననుకుంటున్నావు. కానీ అది తప్పు. పనులు నీ ద్వారా జరుగుతున్నవి. "నేనే చేస్తున్నాను" అనే భావననుండి, 'నా ద్వారా జరుగుతున్నవి' అనే భావనకు రా. రమణ మహర్షి దైవశక్తి లేదా మహోన్నతశక్తి ప్రవహించడానికి ఉన్న నిర్మలమైన మార్గమువంటివారు. నువ్వు, నేనుకూడా అంతే. ఈ మహర్షులు, మహాత్ములు, మెస్సయ్యలూ కూడా దైవశక్తి ప్రవహించడానికి దారులు మాత్రమే. నువ్వు, నేను కూడా, అంతే. మహర్షులవలె మనము కూడా, మార్గముగా మారి, దైవశక్తిని మనగుండా ప్రసరింపనిస్తే, పనికి, జ్ఞానానికీ తేడాలేదు. నీ ద్వారానే పనులు జరుగుతున్నాయనే ఉద్దేశం నీకు కల్గిన క్షణమే, అంతా తేలికగా మారిపోవటం నీవు చూస్తావు. జీసస్, "నీకు నువ్వే వెలుగువి కావాలి" అన్నారు. నీలోని భారము ఏమిటి? నేను పనులు చేస్తున్నాననే కర్తృత్వభావన. జరిగిపోయిన కాలపు (భూతకాలము) జ్ఞాపకాలూ, భవిష్యత్తు గురించిన ఆలోచనలు. ఇవన్నీ కలగలిపి నీలో భారాన్ని కల్గించుతవి. వాటిని వదలివైచి, మహోన్నత శక్తికి శరణాగతి చెందు. నీవు ఎంత తేలికగా మారతావో, అంటే నీలోని భారం మొత్తం తొలగిపోయి, ఎంతో తేలికైన భావం నిన్ను ఆశ్చర్యపరుస్తుంది.

నేను ఎన్నిసార్లు ఆశ్రమానికి వచ్చి ఉండమని ఆహ్వానించినా, ఆయన ఎప్పుడూ అంగీకరించలేదు. కానీ, ఆయన చనిపోయిన తర్వాత ఒక నెలరోజులకు ఆయన సెక్రటరీనుండి లేఖ వచ్చింది. "గణేశన్, నేను ఎన్నో పనులలో ఉండుటచేత మీకు ముందుగా వ్రాయలేకపోయాను. బ్రంటన్ చనిపోవటానికి కొద్ది గంటల ముందు ఆయన నన్ను పిలచి, గణేశన్‌కు, ధన్యవాదములు తెలుపుతూ లేఖ వ్రాయి," అని చెప్పారు.

తర్వాత న్యూయార్క్ దగ్గరలో బ్రంటన్ యొక్క సంస్థ (ఆశ్రమము), 'Wisdom's Golden Rock' (జ్ఞానపు బంగారురాయి)ని సందర్శించే గొప్ప భాగ్యము నాకు కలిగింది. ఆ సంస్థకు ఆయన పేరు పెట్టాలని అక్కడి వారు అనుకొనగా, ఆయన దానికి అంగీకరించలేదు. డామియాని అనే భారతీయుడు, బ్రంటన్ యొక్క ప్రవచనము కొరకు అక్కడ ఏర్పాటుచేసి, ప్రముఖంగా కనిపించే చోట, బ్రంటన్ యొక్క పెద్ద ఫోటోను పెట్టారు. బ్రంటన్‌కు తను ప్రవచనం ఇచ్చే చోటును (ముందురోజే) అక్కడి ఏర్పాట్లను ముందురోజే చూసే అలవాటు ఉన్నది. తన ఫోటోను అక్కడ చూసినపుడు, "దానిని అక్కడనుండి తొలగించి, మా సద్గురువు చిత్రాన్ని అక్కడ ఉంచండి," అన్నారు.

ప్రపంచం నలుమూలలకు చెందిన ఆధ్యాత్మిక సాధకులు, పాల్‌బ్రంటన్‌కు ఎంతగానో ఋణపడి ఉంటారు. వేదకాలంనుండే, నీలోనికి తిరిగి, నీలో ఉన్న దైవాన్ని దర్శించు, 'అదే నీవు' అని చెప్తున్నప్పటికీ (ఘోషిస్తున్నప్పటికీ) మనకెవరికీ ఏమి చెయ్యాలో తెలియదు. జీసస్, 'దైవరాజ్యము నీలోనే ఉన్నది' అని చెప్పినపుడు కూడా ఆ మాటలను వాటి భావాన్ని అవగాహన చేసుకున్న వారు లేరు. ఇప్పుడు పాల్‌బ్రంటన్ ద్వారా, భగవాన్ సందేశమైన, "లోనికి తిరుగు. హృదయంలోనికి చూడు, నిశ్చలంగా ఉండు. 'అహమ్' 'నేను' అనేదే దైవమని తెలుసుకో," అనేది మనకు లభించింది.

మేజర్ చాడ్విక్



రమణమహర్షిని దర్శించిన తొలి పాశ్చాత్య దేశీయుడు ఫ్రాంక్‌హంఫ్రీస్. ఆయన 1911లో కొండపైకి వెళ్ళి, విరూపాక్ష గుహ బైటనున్న రాతిపై కూర్చుని ఉన్న భగవాన్‌ను చూచి, ఈ విధంగా వ్రాశారు, "ఆ మానవ శరీరమునుండి దైవము తీవ్రంగా ప్రకాశిస్తున్నారు (Radiated)". ఆయనను దర్శించిన రెండవ పాశ్చాత్య దేశీయుడు పాల్‌బ్రంటన్. ఆయన 1930లో భగవాన్‌ను దర్శించి, ఆయనను తన గురువుగా భావించారు. ఆయన శిష్యునిగా భగవాన్ సూటి బోధ అయిన, ఆత్మవిచారణను, విపులీకరించి (వెలికితీసి) దానిపై అనేక పుస్తకాలను రచించి, సద్గురు బోధను ఆధ్యాత్మిక ప్రపంచం మొత్తానికీ వ్యాపింపచేశారు. పాల్‌బ్రంటన్ పుస్తకము చదివి మూడవ పాశ్చాత్యుడు భగవాన్ వద్దకు వచ్చారు.

దైవము, గురువు, మానవుడు అనేది, 'శాశ్వతమైన త్రిభుజము (ఈశ్వరో గురురాత్మేతి) ఫ్రాంక్‌హంఫ్రీస్, భగవాన్‌ను 'దైవంలా' చూశారు. పాల్‌బ్రంటన్, భగవాన్‌ను గురువుగా భావించారు. ఆ శాశ్వతమైన త్రిభుజము పూర్తి కావలసి ఉన్నది. కాబట్టి మూడవ పాశ్చాత్యుడు రావలసియున్నది. ఆ మూడవ పాశ్చాత్యుడు కూడా ఇంగ్లండ్‌నుండి వచ్చారు. ఆయన చాలా సహజమైన పరిపూర్ణ మానవుడిని భగవాన్‌లో చూశారు. ఆ పాశ్చాత్యుని పేరు (Allan. W. Chadwick) ఆలన్. డబ్ల్యు. చాడ్విక్. భగవాన్ పాతభక్తులు ఆయనను ప్రీతితో 'సాత్విక్' అని పిలిచేవారు. సంస్కృతంలో 'సాత్విక్' అంటే శుద్ధమైన అని అర్థము. ప్రాపంచిక బంధాలనుండి విడివడినవాడు అని అర్థము (ఈ సాత్విక్ అనబడే పెద్ద మనిషి బ్రిటిష్ సైన్యంలో మేజర్‌గా పనిచేసి శత్రుసంహారంలో పాలు పంచుకున్నాడు మొదటి ప్రపంచ యుద్ధంలో)

రమణాశ్రమంలో ఎ.డబ్ల్యు.చాడ్విక్‌ను, 'మేజర్ చాడ్విక్' అనేవారు. ఆయన బ్రంటన్ వ్రాసిన పుస్తకం చదివి 1935లో అరుణాచలానికి వచ్చారు. భగవాన్ వద్దకు రావడానికి పదకొండు సంవత్సరాల క్రిందటే, తనకు తానుగా ఒక ధ్యానపద్ధతిని ఏర్పరచుకుని, దానిని క్రమం తప్పకుండా చక్కగా పాటిస్తుండే వారు. చాడ్విక్ ఇలా అన్నారు, "భగవంతుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. కనుక, ఆయన తననుండే ప్రపంచాన్ని సృష్టి చేసి ఉంటారు. ఎందుకంటే ఆయన సర్వశక్తిమంతుడు కనుక, ఆయన గాక, వేరొకటేమైనా ఉండి ఉంటే ఆయన దేవుడై ఉండడు. (భగవంతుడు అనంతుడు. అంటే అంతము లేనివాడు. అంటే తాను తప్ప ఇతరము లేనివాడు). అందుకని నేను సాధకుడే భగవంతుడు అనుకున్నాను. ధ్యానంలో నా పద్ధతి ఏమిటంటే నేను భగవంతుడికంటే భిన్నముగా లేను, అందుకని ఒక వ్యక్తిగా అనవసరమైన ఆలోచనలను రానీయకుండా పవిత్రమైన దైవంలోనే విశ్రాంతి చెందాలి. ఏమీ ఆలోచించవద్దు. ఊరక ఉండు". ఎంత భవిష్యత్తుకు సరిపోలినట్లుగా ఉన్నది! భగవాన్ వద్దకు రాకముందే ఆయన అనుసరించిన పద్ధతి ఆలోచనలను (నిగ్రహించి) ఆపివేసి, ఊరక ఉండుటయే.

మేజర్ చాడ్విక్ పాల్‌బ్రంటన్ వ్రాసిన 'గుప్తభారతంలో నా అన్వేషణ' 'A Search In Secret India' చదివారు. అందులో మూడు అధ్యాయాలు శ్రీరమణమహర్షిని గురించి వ్రాయబడ్డవి. అందులో ఆయన ఫోటోకూడా ఉన్నది. ఆ మూడు అధ్యాయాలూ, మహర్షి ఫోటో చాడ్విక్‌ను ఎంతగానో ఆకర్షించినవి. ఆయన అరుణాచలమే నా ఇల్లు, మహర్షి నా ఆధ్యాత్మిక గురువు అనుకున్నారు. ఆయన ఆ సమయంలో మెజోర్కా (స్పెయిన్) అనే ప్రదేశంలో ఉన్నారు. ఆయన అప్పటికప్పుడు అక్కడి వ్యవహారాలను చక్కబెట్టుకుని అక్కడి తన గృహమును, సామగ్రిని వదలివైచి, తన స్వదేశమైన ఇంగ్లండ్‌కు వెళ్ళి, తనకు అత్యంత ఇష్టమైన తన సోదరీమణులతో, కొంతకాలం ఉన్నారు. తర్వాత అక్కడి గృహాన్ని వదలివైచి భారతదేశానికి ప్రయాణమైనారు. ఆయన తిరిగి ఇంగ్లండుకు వెళ్ళలేదు. ఆయన అరుణాచలంలో తన సద్గురువు సన్నిధిలో శాశ్వత నివాసము ఏర్పరచుకున్న తొలి పాశ్చాత్యుడు. ఆయనతోటి నా పరిచయంలో నాకు బాగా నచ్చినదీ సాధకులమైన మనము గమనించవలసినదీ ఏమిటంటే, ఆయన నిర్ణయం తీసుకోవడానికీ, అమలులో పెట్టటానికీ మధ్య కాలవ్యవధి ఉండదు. నిర్ణయం తీసికొన్న వెంటనే అమలుచేసేస్తారు. ఈ మూడు అధ్యాయాలూ చదివిన తర్వాత, ఆయనలో తడబాటుగానీ

ఊగిసలాట గానీ లేవు. ఆయనకు అరుణాచలమే తన ఇల్లు అనీ, మహర్షి తన గురువు అనీ నిశ్చయించుకున్న తర్వాత, తర్వాత చర్య సన్యసించడమే. ఇంగ్లండులోని తన ఇంటికి వెళ్ళి తన అక్కచెల్లెళ్ళ కోర్కెలు తీర్చి, మళ్ళీ వెనుకకు తిరగకుండ అరుణాచలానికి ప్రయాణమైనారు. సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఆయన అరుణాచలానికి వచ్చారు. భగవాన్ ఎదురుగా నిల్చుని మొదటిసారిగా సజీవమైన తన గురువును చూచి, దైవము, గురువు, పరిపూర్ణ మానవుడిని ఒకేసారి చూచినట్లు భావించారు. “మీకెలా అన్పించింది?” అని అడిగినపుడు, “ఆయన సన్నిధిలో అంతులేని శాంతిని, అనుగ్రహాన్ని అనుభవించాను. నేను ఆయనను మొదటిసారిగా చూస్తున్నట్లు అనిపించలేదు. నాకు ఆయన ఎల్లపుడూ తెలిసి ఉన్నట్లు అనిపించింది. ఎపుడో పాత పరిచయాన్ని పునరుద్ధరించినట్లు గూడా కాకుండా, ఆ పరిచయం ఎప్పుడూ ఉన్నట్లు, దానిని నేనిప్పుడే గమనించినట్లు అన్పించింది”.

చాడ్విక్‌నుచూడండి. తన సర్వస్వాన్నీ వదలివేశారు. స్నేహితులతో బంధువులతో, తోటి ఆఫీసర్లతో తన అనుబంధాన్ని త్రెంచేసుకున్నారు. ఒక తెలియని దేశంలో తెలియని సాధువుగా ఉండడానికి. ఈ విధమైన దృఢమైన నిర్ణయం, త్యాగము, కార్యాచరణ సాధకులమైన మనము నేర్చుకోవాలి. మనము సరిగా సత్యానికి, అరుణాచలునకు, రమణులకు ఎట్టఎదుట ఉన్నాము. అరుణాచలమంటే కేవలం కొండకాదు. వేదములు వర్ణించే ‘అహం’ లేక ‘నేను’. దేవుడు మోజెస్‌కు చెప్పింది అదే. ఆ శక్తివంతమైన భగవాన్ సన్నిధి, చాడ్విక్‌ను అక్కడ శాశ్వతంగా ఉండిపోవాలని అక్కడికక్కడే నిర్ణయం తీసుకునేటట్లు చేసింది. అందులో ఏ విధమైన సందిగ్ధానికి తావులేదు. తన నిర్ణయాన్ని ఎప్పుడూ మార్పు చేసికోనూ లేదు. ప్రశ్నించుకోనూ లేదు. అటువంటి విశిష్టమైన శిష్యుడు పూర్తి శరణాగతి చెందితే గురువుగారెలా స్పందిస్తారు? సద్గురువు పూర్తి బాధ్యతను తీసుకుంటారు. భగవాన్ చాడ్విక్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించడం, మిగిలిన శిష్యులకు, వింతగా అనిపించేది. ఆయన ఆశ్రమ నిర్వాహకులకు చెప్పారు. ఆయన సర్వస్వాన్నీ వదిలేసి వచ్చారు. మనము ఆయనను జాగ్రత్తగా చూసుకోవాలి. ఆయనకు ఆహారం మసాలాలు లేకుండా, ఘాటుగా లేకుండా తయారుచెయ్యబడాలి. రమణాశ్రమంలో దొరైకూటు, దొరైరసం అని తయారుచేస్తారు. వాటిని 1935లో చాడ్విక్ కోసం భగవాన్ మొదటగా తయారుచేశారు. ఆ రోజులలో పాశ్చాత్య దేశీయులను ‘దొర’ (యజమాని) అంటుండేవారు. అందుకని సహజంగానే చాడ్విక్‌ను కూడా అలాగే సంబోధించేవారు. అందుకని ఆ కూరగాయలతో తయారైన వంటకాన్నీ రసాన్నీకూడా దొరైకూట్, దొరైరసం అనేవారు.

ఉదయపు ఫలహారము, అప్పుడూ ఇప్పుడూ కూడా ఇడ్లీ, కారప్పొడి, నెయ్యి (ఏమార్పూ లేకుండా). చాడ్విక్ ఆ కారప్పొడిని ‘గన్‌పౌడర్’ అనేవారు. ఆయనకు ఆ కారం ఒక పెద్ద ప్రేలుడు పదార్థంలాగా అన్పించేది. అందుకని భగవాన్, చాడ్విక్‌కు ఇడ్లీలతోపాటు నెయ్యి, పంచదార పెట్టించేవారు. ఈ రోజు వరకూ విదేశీయులకు ఆ విధానమే కొనసాగుతుంది. రాత్రిపూట ఆయన ఘాటుగా ఉండే రసమూ, చట్నీ తినలేరుకనుక, చాడ్విక్‌కు పాలూ, పళ్ళూ ఇప్పించేవారు. కనుక ప్రతి విషయంలోనూ భగవాన్, చాడ్విక్‌పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపించేవారు. సర్వాధికారి చిన్నస్వామితో సహా ప్రతి ఒక్కరూ దీనిని గమనించారు. అందువలననే ఆశ్రమంలో స్వంతంగా ఒక గది నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వబడింది. అంతకు ముందెన్నడూ ఎవరికీ అటువంటి అవకాశము లభించలేదు. చాలా సంవత్సరముల తర్వాత యోగి రామయ్య, బలరామరెడ్డిగారు, దేవరాజముదలియార్ ముగ్గురికీ చాడ్విక్ రూము పక్కనే మూడు అటువంటి గదులు నిర్మించుకోవడానికి అనుమతి లభించింది. తన గది నిర్మాణము జరుగుతున్నపుడు, ఆశ్రమ స్టోరురూమ్ పక్కనే ఉన్న పెంకుటింటి షెడ్డులో ఉండే వారు చాడ్విక్. అప్పుడప్పుడు తన ఉదయపు నడకకు వెళ్ళేటప్పుడు, భగవాన్ ఒక స్నేహితుని వలె ఆ షెడ్‌లోనికి వచ్చి, చాడ్విక్ టేబుల్ వద్దకు వెళ్ళేవారు. చాడ్విక్ ఒక మూలన కుర్చీలో కూర్చుని ఏదో ఒక పుస్తకం చదువుకుంటూ ఉండేవారు. భగవాన్ ఆయన పర్స్ తెరచి, ఫోటోలు, గుర్తింపుకార్డులూ మొత్తము అన్ని వస్తువులు బయటకు తీసి, చాడ్విక్‌ను “ఇదేమిటి?” ‘ఇదేమిటి?’ అని ప్రశ్నిస్తూ ఉండేవారు. భగవాన్, చాడ్విక్‌తో సన్నిహితంగా మెలిగేవారు. చాడ్విక్ తన నూతన బసకు మారినపుడు కూడా, భగవాన్ అప్పుడప్పుడూ ఆయన వద్దకు వెళ్ళేవారు. మధ్యాహ్నభోజనము తర్వాత, భగవాన్ పల్లాకొత్తులోని కొలను చుట్టూ నడిచేవారు. అక్కడికి చాడ్విక్ గది చాలా దగ్గరగా ఉండేది. ఆ రెండింటికి మధ్య కర్రగేటు గల కంచె ఉండేది. కొన్నిసార్లు భగవాన్ ఆ గేటు తెరచుకొని చాడ్విక్ గదిలోనికి వచ్చేవారు.

ఒక ప్రక్క చాడ్విక్ భౌతిక అవసరాలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూనే, భగవాన్ ఆయనను ఆధ్యాత్మిక పథంలో చక్కగా నడిపిస్తుండేవారు. చాడ్విక్ వచ్చిన మొదటి రోజునే భగవాన్ అతనితో స్వతంత్రంగా మాట్లాడుట వలన, అంతదూర ప్రయాణం చేసి వచ్చిన చాడ్విక్ స్వస్థలంలోనే ఉన్నంత సుఖంగా ఉన్నారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకున్న తర్వాత వచ్చినపుడు, భగవాన్ 'నేనెవరను?' అనే పుస్తకమును తెప్పించి చాడ్విక్‌కు ఇచ్చారు. కేవలం చేతిలో పెట్టి ఊరుకోలేదు. చదవండి. చదివి ఆచరణలో పెట్టండి అన్నారు. ఆధ్యాత్మికమైన బహుమతి ద్వారా, భగవాన్ మిక్కిలిగా ఆధ్యాత్మిక దీవెనలను చాడ్విక్‌పై వర్షించడం ప్రారంభించారు. మరికొద్ది రోజులలోనే చాడ్విక్‌ను మరల పిలిచి బి.వి.నరసింహస్వామి, వ్రాసిన 'ఆత్మసాక్షాత్కారము' (Self Realisation) అనబడే మహర్షి జీవితచరిత్రను ఇచ్చి, మునుపటి వలెనే 'చదువు', 'ఆచరించు' అన్నారు. ఆ రెండు పుస్తకాలను చదివి, తన ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యాలో ప్రణాళిక తయారుచేసుకున్నారు.

చాడ్విక్ పూర్తి శ్రద్ధ అంతా, భగవాన్ మీద, భగవాన్ బోధలపైనా ఉండేది. ఒక నిజమైన శిష్యునిగా, తనపైఎంత గురుతరమైనబాధ్యత ఉంటుందో చాడ్విక్ బాగా అర్థం చేసుకున్నారు. ఆయన శ్రద్ధ, బోధను అవగాహన చేసుకోవటం, సద్గురు సన్నిధియొక్క వైభవాన్ని (మహత్తును) అర్థం చేసుకొనటం, అవే ఆయనకు గల గొప్ప బాధ్యతలు. ఆయన చాలా శ్రద్ధగా కర్తవ్యం నిర్వహించేవారు. తన గదిలోగానీ, అరుణగిరిపై గానీ ధ్యానం చేసుకొనటం, ఎప్పుడైనా విశ్రాంతిగా ఉండవలెనన్పించినపుడు, ఆధ్యాత్మిక పుస్తకాలు చదవడం చేసేవారు. మిగిలిన సమయమంతా, తన గురువుగారి ఎదురుగా కూర్చుని ఉండేవారు.

ఎందుకని మీరు ఎప్పుడూ భగవాన్ ఎదురుగా ఉండేవారు అని నేను ఆయనను అడిగినపుడు, ఆయన ఇలా అన్నారు, "ఇక్కడ దైవమూ గురువూ కూడా మానవరూపం ధరించి ఉన్నారు అని నేను భావించాను. నాకు ఆయన సన్నిధిలోనూ, సమీపంలోనూ ఉండే అవకాశం లభించినపుడు నేను ఆ సువర్ణావకాశాన్ని పోగొట్టుకుంటానా? ఊరికినే వృథాగా కాలం గడపటానికి నేనేమైనా మూర్ఖుడినై ఇక్కడకు వచ్చానా? రమణాశ్రమంలో శాశ్వతంగా ఉండిపోవటమే కాకుండా, ఒక నిముషము కూడా వృథా చేయని ఒక వ్యక్తి. ఆయనకు దేనిపట్లా ఆకర్షణ లేదు. ఆయన ఏకాగ్రతకు గానీ, ధ్యానానికి గానీ భంగం కల్గించే విషయాలేమీ ఉండేవి కావు. ఎవరైనా ఇతర పాశ్చాత్యులు వచ్చినపుడుకూడా, ఆయన తన పనులను వదులకునే వారు కారు. మిగిలినవారు పాండిచేరి, బెంగుళూరు, ఊటీ, లేదా వేరేదైనా చల్లని ప్రదేశానికి వెళ్ళేవారు వేసవిలో. కానీ చాడ్విక్ సామాన్యంగా భగవాన్ సన్నిధిని వదిలేవారు కాదు. ఎందుకంటే, "నా సద్గురువు ఇక్కడ ఉండగా వేరే చోటుకు నేను ఎందుకు వెళ్తాను?" అనేవారు. ఆయన భగవాన్ గురించి పలికే పలుకులు, నన్ను కదిలించి వేసేవి.

చాడ్విక్ ఒక మహోన్నతమైనవ్యక్తి. పొడుగ్గా, అందంగా ఉండే ఆయన చాలా క్రమశిక్షణ గల వ్యక్తి. ఆయన చిరునవ్వుతో ఉండి, ప్రతి ఒక్కరితోనూ స్నేహంగా ఉండేవారు. తన సాధనను ఎంతో శ్రద్ధగా చేసుకుంటూనే, ఆశ్రమ నిర్వాహకులకు ఎంతగానో సహకరించేవారు. ఆయన అందులో భాగంగా మారారు. భగవాన్ శరీరాన్ని వదిలివేసిన తర్వాత, ఆశ్రమం ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. వ్యాజ్యములు ఎదుర్కొనవలసి వచ్చినపుడూ, ఆర్థిక ఇబ్బందులలోనూ, అంతర్గత కలహాలలోనూ, ఆయన ఆశ్రమంలోనే ఉండి, నిర్వాహకులకు సహకరిస్తూ, వారి పక్షాన నిలబడేవారు. పాల్‌బ్రంటన్, ఫ్రాంక్‌హంఫ్రీస్ వలె గాక, చాడ్విక్, భగవాన్‌కూ భక్తులకూ, భగవాన్‌కూ, భగవాన్ సందర్శకులకు మధ్యన జరిగే సంభాషణలను, ఎక్కువగా వింటుండేవారు. 'టాక్స్ విత్ రమణమహర్షి' (రమణ మహర్షితో సంభాషణలు) శ్రీరమణభాషణములు (Day By Day With Bhagavan) (అనుదినము రమణులతో) వంటి పుస్తకములు, చాడ్విక్‌చేత, భగవాన్ చేత సరిచూడబడ్డవి. 'అనుదినము రమణులతో' అనే గ్రంథమునకు, ఆయన చక్కని 'పరిచయం'వ్రాశారు. ఈ సంభాషణలను భగవాన్‌కు చూపించటమే కాదు, ఆ ప్రశ్నలు వేసినవారికి కూడా చూపించి, వారు అడిగిన ప్రశ్నలు, వారి సమాధానాలు సరిగ్గా వ్రాయబడ్డవో లేదో కూడా సరిచూడబడ్డవి. అవి నోటుపుస్తకంలో వ్రాయబడిన తర్వాత భగవాన్ సరిచూసేవారు. కావున బ్రంటన్, భగవాన్ బోధ అనే ఓడకు తెరచాపగా ఉంటే, చాడ్విక్ ఓడకు లంగరుగా ఉండి, అందులో వ్రాయబడిన ప్రతి మాట, సద్గురువు చేతనే ఆమోదింపబడ్డాయని మనకు విశ్వసనీయతను కల్గిస్తారు.

ఈ సందర్భంలో నేనుకూడా, ఉన్నటువంటి కొన్ని సంఘటనలను వివరిస్తాను. ఒకవిధంగా ఇవి అన్నీకూడా, చాడ్విక్‌కు సంబంధించినవే. నేను 1956లో కాలేజీ డిగ్రీ పూర్తిచేసిన తర్వాత, మా తండ్రిగారు నన్ను పై చదువుకు వెళ్ళమన్నారు. మా కుటుంబం అపుడు ఆర్థిక ఇబ్బందులలో ఉన్నందువల్ల, నేను అందుకు అంగీకరించలేను, ఏదైనా ఉద్యోగం చేస్తానని చెప్పాను. 1956, 58 మధ్య నేను తిరువణ్ణామలైలో ఉద్యోగం కోసం ఎంతగానో ప్రయత్నిస్తున్నాను. మేజర్‌చాడ్విక్, శ్రీమతి తలైయార్‌ఖాన్ గూడా నాకు ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నించారు. కానీ నా గురించి దైవ నిర్ణయం వేరుగా ఉన్నది.

ఆ రెండు సంవత్సరాలు తిరువణ్ణామలైలో ఉన్న పాత భక్తులందరితోనూ చాలా సన్నిహితంగా మెలిగాను. చాడ్విక్, ఆర్థర్‌ఆస్‌బోర్న్, మురుగదాస్, కోహెన్, దేవరాజముదలియార్, ఇంకా ప్రొఫెసర్ సుబ్బరామయ్యలాంటి ఆశ్రమానికి తరచుగా వచ్చే ఇతరులతోనూ, దగ్గరగా ఉండేవాడిని. వాళ్ళలో ఉన్నది (లక్షణాలు) ఏదో నాలో ఎంతో గౌరవాన్ని, సంభ్రమాన్ని, ఆశ్చర్యాన్ని, ఆసక్తిని, రేకెత్తించేది. "మీరు భగవాన్‌తో ఏమి మాట్లాడేవారు? మీకు, భగవాన్ మధ్య ఎటువంటి అనుబంధం ఉండేది?" అనే ప్రశ్నలతో నేను వారిని వేధిస్తుండేవాడిని. కొన్నిసార్లు వాళ్ళు సమ్మతించి కొంత సమయం వెచ్చించి, నేనడిగిన వాటికి సమాధానమిచ్చేవారు. నేను ఎంతో ఉత్సాహంతో ఆ జ్ఞాపకాలనే మణులను, లిఖిత పూర్వకంగా ఇమ్మనేవాడిని. ఎందుకంటే అలా చెయ్యకపోతే, అవి మరుగున పడిపోతవని. కానీ ఎక్కువమంది, "నేనెవరిని? నేనేమి చెప్పగలను?" అనేవారు. నేను వారితో వాదించేవాడిని. "మీ గురించి ఎవరూ బాధపడబోవడం లేదు. భగవాన్ మీకు చేసిన బోధ ఏమిటి? ఆయనతో మీకుగల అనుబంధం ఎటువంటిది? ఈ విశేషమైన జ్ఞాపకాలను, భద్రపరిచి, భావి తరాలకు అందజేయవలసిన బాధ్యత మీమీద ఉన్నది. దయచేసి వాటిని లిఖితపూర్వకంగా భద్రపరచండి".

చాడ్విక్‌కు నేను కృతజ్ఞుడనై ఉంటాను. ఎందుకంటే, ఆయన ఒక్కరే నన్ను ప్రోత్సహించారు. చాలాసార్లు, ఆశ్రమంలో పెద్దగా జనంగానీ, పనులుగానీ లేనప్పుడు, నన్ను తన ప్రక్కన కూర్చోబెట్టుకుని ఒక విశేషమైన సంఘటన గురించి చెప్పేవారు. ఒక్కొక్క సంఘటన గురించి చెప్పటముపూర్తి అయిన తర్వాత తన గదికి వెళ్ళినపుడు దానిని ఒక నోటుపుస్తకంలో వ్రాసి ఉంచేవారు. అప్పట్లో ఆ సంగతి నాకు తెలియదు. 1958లో నేను రెండు సంవత్సరాల (పోస్ట్‌గ్రాడ్యుయేషన్) వేదాంతశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి తిరువణ్ణామలైనుండి దూరంగా వెళ్ళాను. వెళ్ళేముందు చాడ్విక్, "ధన్యవాదములు. నేనీ సంఘటనలన్నింటిని నోటుపుస్తకంలో వ్రాసి ఉంచాను," అన్నారు. నా ఉన్నతవిద్య పూర్తి అయిన తర్వాత, నేను కొద్ది నెలల పాటు ఉద్యోగం చేసి 1960లో తిరువణ్ణామలై తిరిగివచ్చాను. తిరిగి వచ్చిన తర్వాత నేను చేసిన మొదటిపని, చాడ్విక్ గదికి వెళ్ళి, "మీ ప్రసాదాన్ని ఇవ్వండి. అదే మీరు ఆ సంఘటనలన్నింటినీ వ్రాసిన నోటుపుస్తకాన్ని ఇవ్వండి," అని అడిగాను. చాడ్విక్‌గారి నోట్‌బుక్, మొదట ముద్రించబడిన జ్ఞాపకాలను గురించిన పుస్తకము. ఆ పుస్తకము ముద్రించబడిన తర్వాత నాకు ధన్యవాదములు తెలుపుతూ చాడ్విక్ ఒక లేఖ వ్రాశారు. అందులో ఆయన ఇలా వ్రాశారు, "మన ఆశ్రమంలో ఏ పుస్తకాన్ని కూడా వ్రాసిన వారి ఇష్టానుసారంగా,ఎవరి ఇష్టం వచ్చినవారికి వాళ్ళు అంకితమిచ్చే ఆచారము లేదు. ఆశ్రమంలో వ్రాయబడిన ప్రతి పుస్తకము భగవాన్‌కే అంకితమివ్వబడుతుంది. రమణార్పణమస్తు, అని శ్రీభగవాన్ పవిత్రపాదములకు అర్పించబడినది. ఎవరికైనా అంకితమివ్వగల్గే అవకాశము ఉన్నట్లైతే, నేను తప్పక ఈ పుస్తకాన్ని నీకే అంకితమిచ్చి ఉండేవాడిని, ప్రియతమ గణేశన్".

అప్పటికి నేను పాతభక్తులకు బాగా చేరువయ్యాను. మరొక ఆయన, జి.వి.సుబ్బరామయ్య గారు, "నా జ్ఞాపకాలను నేను నా మాతృభాష అయిన తెలుగులో వ్రాస్తున్నాను," అన్నారు. కేవలం తెలుగులో మాత్రమే వ్రాస్తే ప్రయోజనము ఏమి ఉంటుంది. మీరు ఇంగ్లీష్ ప్రొఫెసర్(ఆచార్యులు) గదా! ఆ పుస్తకాన్ని ఇంగ్లీషులోనికి అనువదించండి. అది జ్ఞాపకాలను గురించిన రెండవ పుస్తకము. దానిని ఆయన స్వంతంగా ముద్రింపచేశారు. నేను ఆయనను బ్రతిమాలి తర్వాత ముద్రణలు ఆశ్రమము ద్వారా జరిగేటట్లు చేశాను. తర్వాత స్మృతులు ప్రవాహంలా సాగినవి. టి.కె.సుందరేశ అయ్యర్ 'భగవాన్ పాదపద్మసన్నిధిలో', సూరినాగమ్మగారి 'నా రమణాశ్రమజీవితం', ఆ తర్వాత కుంజుస్వామి, బలరామిరెడ్డియార్, కనకమ్మాళ్ ఆ ఆధ్యాత్మిక ఆహారము వారిదే. అదృష్టవశాత్తు ఈ ఆధ్యాత్మిక ఆహారాన్ని ఆకలిగొన్న (తపనతో ఉన్న) ఆధ్యాత్మిక సాధకుల నోటికి అందించే చెంచాలాగా నేను ఉపయోగించబడ్డాను.

బుద్ధునియొక్క, ఏసుక్రీస్తుయొక్క, శ్రీరామకృష్ణుల యొక్క బోధలు వారి భక్తులచే లేదా శిష్యులచే పదిలపరచబడి ఉండకపోయినట్లైతే, మనము వాటిని గురించి ఎలా తెలుసుకోగలిగే వారము? ఇవాళ భగవాన్ రమణుల జ్ఞాపకాలు మనకు అందుబాటులో ఉన్నవంటే ముందుగా చాడ్విక్‌కు ధన్యవాదాలు తెలుపుకోవాలి. తర్వాత పదే పదే నేచేసిన విన్నపాలను మన్నించి తమ జ్ఞాపకములను వ్రాసి ఇచ్చిన ఇతర భక్తులకు ధన్యవాదములు. ఈ పుస్తకములు ఒక నిజమైన సద్గురువుకు ఆయనకు పరిపూర్ణ శరణాగతి చెందిన శిష్యులకు కేవలం వాచకమైన బోధ (కేవలం మాటలకు మాత్రమే పరిమితమైన బోధ) సరిపోదు. ఆ సద్గురుబోధను వారు ఎలా ఆచరణలో పెట్టారు అనేది మనము తెలుసుకోవాలి. మనకు సద్గురుబోధను ఆచరణలో పెట్టటానికి మనకు చాలా ప్రోత్సాహము అవసరము. లేకుంటే ఒక బైబిలు, ఒక ఖురాను, ఒక భగవద్గీత సరిపోయి ఉండేవి. అందుకే పాతశిష్యులయొక్క జ్ఞాపకములు, వారు సద్గురువుతో కలిసి ఎలా జీవించేవారో, ఆ సద్గురువు, తన పవిత్ర జీవనము ద్వారా, సత్యాన్ని ఎలా తెలియజేశారు అనేది మనకు ముఖ్యమైన విషయం.

చాడ్విక్‌కు సద్గురువుతో ప్రత్యేకమైన అనుబంధం ఉండేది. “మీరు చూచినపుడు ఆయనతో కలిసి ఉన్నపుడు, భగవాన్ ఎలా ఉండేవారు? మీకు ఎక్కువగా హత్తుకుపోయిన అంశమేమిటి?” అని నేను అడిగినపుడు, ఆయన తన జ్ఞాపకములలో వ్రాసిన విషయాలనే చెప్పారు. “భగవాన్ ఒక విధమైన కాంతితో ప్రకాశించే సుందరమైన రూపం కలవారు. ఆయనకు చాలా సున్నితమైన చేతులు ఉండేవి. వాటితో ఆయన చక్కగా భావవ్యక్తీకరణ చేసేవారు. ఆయన చేతులతోనే మాట్లాడతారా? అన్పించేది చూచేవారికి. ఆయన ముఖకవళికలు పొందికగా ఉండేవి. అద్భుతమైన ఆయన కళ్ళు, అందరినీ ఆకట్టుకునేవి. ఆయన నుదురు (ఫాలభాగము) శిరస్సుపై భాగము (శిఖరము) చాలా ఉన్నతంగా ఉండేవి. భారతదేశములో దీనిని జ్ఞానశిఖరము అంటారు. కావున సహజంగానే, మన ప్రియతమ భగవాన్‌కు అది ఉన్నతంగా ఉండడంలో ఆశ్చర్యంలేదు. ఆయన శరీరం చక్కటి సౌష్టవంతో ఉండి, ఆయన మధ్యస్థమైన పొడుగు అయినప్పటికీ, ఆయన చక్కటి శరీరాకృతి వలన, ఆయన చాలా పొడగరి వలె అన్పించేవారు. ఆయన హాస్యచతురులు. ఆయన మాట్లాడుతున్న సమయంలో చిరునవ్వు, ఆయన ముఖాన్ని వీడేదికాదు. ఆయన వద్ద హాస్యోక్తులకు కొదవలేదు. ఆయన గొప్ప నటులుకూడా. ఆయన ఏకథను వివరించినాకాని, దానిని చక్కటి హావభావాలను ప్రదర్శిస్తూ గొప్పగా చెప్పేవారు. ఆయన వద్దకు జనము వాళ్ళ కుటుంబగాథలు చెప్పుకోవడానికి వచ్చినపుడు, సంతోషకరమైన విషయాలైతే ఆయనకూడా నవ్వుతూ వారి ఆనందంలో భాగం పంచుకునేవారు. ఈ విధంగా ఇతరుల భావోద్వేగాలకు ప్రతిస్పందించేవారు. ఆయన ఎప్పుడూ కంఠస్వరం పెంచేవారు కాదు. ఎప్పుడైనా కోపంగా కన్పించినాకూడా, ఆయనలో నిండియున్న శాంతిపై ఆ కోపము యొక్క ప్రభావం (ఛాయలు) ఏమీ కన్పించేవి కావు. కోపము చెందిన వెంటనే ఆయనను పలుకరించితే, ఆయన ఎంతో శాంతముగా, ఏమాత్రం తొణకకుండా సమాధానం చెప్పేవారు. ఆయన అనవసరంగా కానీ ఆపకుండా కానీ మాట్లాడేవారు కాదు. ఆయన మౌనాన్ని చూస్తే, మన మధ్య ఎంత అనవసరపు సంభాషణలు జరుగుతున్నాయో తెలుస్తుండేది. (మనము ఎంత వ్యర్థమైన సంభాషణలను జరుపుతున్నామో తెలుస్తుండేది) అన్నివిధాలా సాదాసీదాగా ఉండడానికి ఆయన ఇష్టపడేవారు. ఆయన నేలపై కూర్చోవడానికి ఇష్టపడేవారు. కానీ ఇతరులు బలవంతంపై ఆయన మంచాన్ని ఉపయోగించాల్సి వచ్చింది. రోజు మొత్తంలో ఎక్కువభాగం మంచంపైనే ఆయన ఉండేవారు. ఎప్పుడూ, తనకు ఏ విధమైన ప్రత్యేకత చూపించినా, ఆయన ఏమాత్రం సహించేవారు కాదు. ఆయన ప్రతిరోజూ కొన్ని పర్యాయాలు ఆ గిరిపై తిరుగాడుతుండేవారు. ఈ భూమిపై ఆయనకు దేనిపైన అయినా మమకారము ఉందీ అంటే అది కేవలము ఆ గిరిపైననే. ఆయన ఆ గిరిని ప్రేమించేవారు, అదే దైవమని ఆయన చెబుతుండేవారు,” అని చాడ్విక్ చెప్పారు.

చాడ్విక్, భగవాన్‌తో సన్నిహితంగా మెలిగేవారు. చిన్న పని కానీ, పెద్ద పని కానీ భగవాన్‌ను సంప్రదించకుండా చేసేవారు కాదు. భగవాన్ ఎప్పుడూ మాటలతో ఆమోదించడంకానీ, నిషేధించడం కానీ, చెయ్యనప్పటికీ, ఆయన పాతశిష్యులకు ఆయన మనోభావం అర్థమైపోయేది. ఆయనకు సమ్మతమైతే తల ఊపేవారు. ఆయనకు ఇష్టం లేకపోతే మౌనంగా ఉండేవారు. ఒకప్పుడు చాడ్విక్‌కు బాగా పంటిపోటు వచ్చింది. ఆ రోజులలో మంచి దంతవైద్యుడు కావాలంటే పాండిచేరికి వెళ్ళవలసి వచ్చేది. చాడ్విక్ భగవాన్ వద్దకు వెళ్ళి, “భగవాన్! నాకు బాగా పంటిపోటుగా ఉంది. నేను పాండిచేరికి వెళ్ళి అక్కడ

దంతవైద్యునికి చూపించుకోనా?" అని అడిగారు. అపుడు భగవాన్ మౌనంగా ఉండిపోయారు. చాడ్విక్ పాండిచేరి వెళ్ళలేదు. మూడు దినాలలో చాడ్విక్ పంటిపోటు ఆశ్చర్యకరంగా తగ్గిపోయింది. చాడ్విక్ నాతో ఇలా అన్నారు, "సాధకుడు సద్గురువుతో చక్కని అనుసంధానం కలిగి ఉండాలి. ఆయన జవాబు ఇస్తారు. ఆ జవాబు మాటలతోనే ఇవ్వనవసరం లేదు. నీవు ఆయన అభిప్రాయానికి అంటిపెట్టుకుని ఉంటే, ఆయన వెళ్ళవద్దని చెప్పినా కూడా వెళ్ళనవసరం లేకుండానే నొప్పిని తగ్గించే ప్రక్రియ జరుగుతుంది".

మనము ఇంతకు ముందే చూసినట్లు చాడ్విక్ ఒక చక్కటి క్రమశిక్షణ కలిగిన దినచర్యను పాటించేవారు. ధ్యానము చెయ్యడం, ఆధ్యాత్మిక గ్రంథములను చదవటము, ఎక్కువ సమయం భగవాన్ ఎదురుగా కూర్చోవడం. ఆరు అడుగుల నాలుగు అంగుళాల పొడుగు ఉండే ఆయన ఎక్కువసేపు నేలమీద కాళ్ళు ముడుచుకుని (బాసీపట్ల వేసుకుని సుఖాసనంలో) కూర్చోవడానికి ఇబ్బంది పడేవారు. అది గమనించి భగవాన్ ఆయనను ఒక ధ్యానానికి ఉపయోగించే బెల్టును వాడమని సలహా ఇచ్చారు. తన జ్ఞాపకాల పుస్తకంలో ధ్యానానికి ఉపయోగించే నూలుబెల్టు గురించి వ్రాశారాయన. ఆ బెల్టును శరీరంచుట్టూ ధరించి, మోకాళ్లను నిలువుగా పెట్టుకుని ఆయన కూర్చునేవారు. దానివలన ఆయన గోడకు ఆనుకోవలసిన అవసరముకానీ, కాళ్ళు చాపుకోవలసినఅవసరము కానీ ఉండేదికాదు. ఆయన గంటల తరబడి నేలపై ఏ ఇబ్బందీ లేకుండా కూర్చోగలిగేవారు. అప్పటినుండి చాడ్విక్ పాతహాలులో ఒక మూల ఈ ధ్యానపు బెల్టు ధరించి కూర్చుని ఉండడం తప్పనిసరిగా కన్పించేది. ఆ ఉపాయాన్ని భగవాన్ తనకు చెప్పారని చాడ్విక్ నాతో అన్నారు. "అయితే మీ పుస్తకంలో ఆ విషయాన్ని ఎందుకు వ్రాయలేదు?" అని అడిగితే, ఆయన, "భగవాన్ నన్ను చెప్పవద్దని చెప్పారు," అన్నారు. కనీసం సూచనగా అయినా చెప్పవచ్చు గదా, అప్పుడు మేము అర్థము చేసుకునేవాళ్ళం కదా?" అంటే, "నేను ఒక సూచన ఇచ్చాను. కావాలంటే జాగ్రత్తగా చదవండి," అన్నారు. జాగ్రత్తగా చదివితే భగవాన్ తన తండ్రిగారు కూడా అటువంటి బెల్టు వాడారు అని చాడ్విక్‌తో చెప్పినట్లు అందులో వ్రాయబడి ఉంది. ఆయన తండ్రిగారు ఆ బెల్టుని చాలా అరుదుగా వాడినప్పటికీ, చాడ్విక్ నేలపై కూర్చోవడానికి ఇబ్బంది పడడం చూడగానే భగవాన్‌కు, ఆ బెల్టు సంగతి గుర్తుకు వచ్చి, ఆయనకు ఆ సలహానిచ్చారు. భగవాన్ చాడ్విక్ యొక్క భౌతికమైన, ఆధ్యాత్మికపరమైన విషయాల గురించి ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచేవారు.

చాడ్విక్ తన పుస్తకంలో వ్రాయని విషయం మరొకటి కోహెన్, నాతో చెప్పారు. ఆశ్రమ ఆఫీసులో ఇంగ్లీషు ఉత్తరప్రత్యుత్తరాలు చూసే అతను వెళ్ళిపోవలసి వచ్చింది. ఏమిచెయ్యటానికి పాలుపోక, మా తాతగారైన చిన్నస్వామిగారు, చాడ్విక్‌ను పిలిచి ఆఫీసుకు వచ్చి ఇంగ్లీషు ఉత్తరాల విషయం చూడవలసినదిగా ఆయననుకోరారు. దానికి చాడ్విక్ నిరాకరించి తన గదికి వెళ్ళిపోయారు. కాని ఆయన అంతరాత్మ ఆయనను బాధపెట్టింది. వాళ్ళందరూ ముఖ్యంగా చిన్నస్వామి నాకు చాలా సాయం చేశారు గదా, వాళ్ళు నన్ను చిన్న సాయంకోరితే, నేను చెయ్యలేదు. ఆ సాయంత్రం కోహెన్ తన వద్దకు వచ్చినపుడు, తన సందేహాన్ని ఆయనకు చెప్పారు చాడ్విక్. భగవాన్ సలహా తీసుకొమ్మని కోహెన్ ఆయనకు చెప్పారు. చాడ్విక్ యొక్క సందేహాన్ని గురించి విని, భగవాన్ కొంతసేపు మౌనంగా ఉండి, తర్వాత కోహెన్ వైపు తిరిగి ఇలా అన్నారు, "చాడ్విక్ ధ్యానం చెయ్యడం ద్వారానే భగవాన్‌కు ఎక్కువ సేవ చేస్తున్నారు," అన్నారు.

చాలామంది సాధకులు వాళ్ళ సాధన పురోగతి చెందుతున్నపుడు ఒక తీవ్రమైన చెప్పలేనటువంటి భయాన్ని అనుభవిస్తారు. అదే చాడ్విక్ విషయంలో కూడా జరిగింది. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి ఆ విషయాన్ని గురించి తెలిపారు. "భయం నీకు చెందింది కాదు. అది అహంకారంచేత సృష్టించబడింది. దానిని అహంకారమే ఎదుర్కోవాలి. ఎవరికి ఈ భయం కలుగుతున్నదీ అని ప్రశ్నించుకోండి. ఆ భయం మాయమై పోతుంది. అహంకారము ధ్యానములో ఉన్నపుడు ప్రత్యేకంగా అనేక అడ్డంకులను కలుగజేస్తుంది. ఆ అడ్డంకి ఏ విధమైనదైనా కానివ్వు. వెంటనే నేనెవరు? సమస్య ఎవరికి వచ్చింది? అని ప్రశ్నించుకొనండి. ఆ సమస్య వెంటనే తీరిపోతుంది. నేనెవరిని? అని ప్రశ్నించినపుడు, దాని జవాబుకొరకై వేచి ఉండక, నిశ్శబ్దాన్ని (మౌనాన్ని) గమనించినట్లైతే, ఆ నిశ్శబ్దమే అహంకారాన్ని తక్షణం అణచివేస్తుంది". చాడ్విక్ ఎంతగా పరిపక్వత చెంది ఉన్నారంటే భగవాన్ మాటలు వినగానే, ఆయన భయం పటాపంచలైపోయింది. ఆయన తిరిగి ఎన్నడూ ధ్యానంలో భయాన్ని పొందలేదు.

ఒకప్పుడు చాడ్విక్ ఒక పుస్తకంలో గురువుయొక్క ఒక్క వీక్షణమే (చూపు) చాలు, ముక్తిని ఇవ్వడానికి అని చదివారు. చాడ్విక్‌కు సందేహం వచ్చింది. ఒక్క చూపుతో ముక్తి లభిస్తే ప్రతివాళ్ళూ ఎందుకు ముక్తులవటం లేదు? అని. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి చెప్పసాగారు. భగవాన్ పవిత్రగ్రంథాలు ఆ విధంగా చెబుతున్నాయి అని, ఆయనకు ఇంకా ఎక్కువ చెప్పనివ్వకుండానే భగవాన్ బొగ్గు, కర్రబొగ్గు, తుపాకిమందు అని మూడు మాటలు అన్నారు. ఆ మాటలు అర్థంకాక, చాడ్విక్ అడిగారు, 'భగవాన్ మీరు చెబుతున్నదానికి అర్థమేమిటి?' అని. భగవాన్ ఈ విధంగా సమాధానమిచ్చారు. గురువుయొక్క అనుగ్రహవీక్షణం ఎల్లప్పుడూ ఉన్నది. దానియొక్క శక్తి కూడా ఎల్లవేళలా ఒకే విధంగా ఉంటుంది. కానిదానిని అందుకోవాలంటే, సాధకునిలో కూడా అంతే తీవ్రత, పరిపక్వత ఉండాలి. అందుకనే సాధకులను, బొగ్గు, కర్రబొగ్గు, తుపాకిలో మందుతో పోలుస్తారు. బొగ్గు మండటానికి చాలా సమయం తీసుకుంటుంది. కర్రబొగ్గు తక్కువ సమయంలో అంటుకుంటుంది. తుపాకిమందు వెంటనే మండుతుంది. కాబట్టి కొంతమంది సాధకులు వెంటనే అనుగ్రహాన్ని పొందుతారు. కొంతమంది కొంత ఎక్కువ సమయం తీసుకుంటారు. ఏ సాధకులైతే, గురుబోధను వినిపించుకోకుండా, ఆచరణలో పెట్టకుండా ఉంటారో వాళ్ళు చాలా దీర్ఘకాలం తీసుకుంటారు. భగవాన్, చాడ్విక్‌ను భయం రాగానే, 'నేనెవరిని? ఈ భయమెందుకు? అని ప్రశ్నించుకోండి. ఆ భయం తొలగిపోతుంది' అని చెప్పగానే ఆ క్షణమే చాడ్విక్ దానిని ఆచరణలో పెట్టారు. ఆ భయం శాశ్వతంగా తొలగిపోయింది. భగవాన్ యొక్క సైనికశిష్యుడు, మేజర్ చాడ్విక్ తుపాకీ మందులాంటివారే.

చాడ్విక్‌కు, ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడంలో ఉన్న తీవ్రమైన ఆసక్తిని గమనించి, భగవాన్ మునగాల వెంకట్రామయ్యగారిని కైవల్యనవనీతము, త్రిపురా రహస్యము, అద్వైత బోధదీపిక మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలను ఇంగ్లీషులోకి అనువదించమని చెప్పారు. ఆ అనువాదములు పూర్తికాగానే చాడ్విక్ వాటిని టైపుచేయించుకొని (బుక్‌బైండర్) పుస్తకాలను బైండింగ్ చేసే వాని వద్దకు వాటిని పంపించి, ఒక్కొక్క పుస్తకానికి రెండేసి కాపీల చొప్పున టైపుచేయించి నల్లలెదరుతో బైండింగ్ చేయించి, ఒక కాపీని తను ఉంచుకుని ఒక కాపీని భగవాన్‌కు ఇచ్చేవారు. భగవాన్ ఆ కాపీని తన (కదిలే) అలమారాలో ఉంచుకుని, ఎవరైనా సంస్కృతంగానీ, తమిళం కానీ చదవడం చేతకాని డాక్టర్ మీస్, కుమారి మెర్‌స్టన్, పోలెండ్‌కు చెందిన ఉమాదేవి, డబ్ల్యు.వై.ఇవాన్స్‌వెన్జ్, మారిస్ ఫ్రిడ్‌మన్ వంటి తీవ్రసాధకులకు చదువుకోవడానికి వాటిని ఇస్తూ ఉండేవారు. చాడ్విక్ ఆసక్తి వలన, భగవాన్ కరుణ వలన ఈ అనువాదాలు వెలువడ్డాయి.

చాడ్విక్, భగవాన్‌తో చాలా హాస్యమాడుతూ ఉండేవారు. ఆరోజులలో పాత హాలులో సీలింగ్‌ఫ్యాన్‌లు ఉండేవికావు. వాటికి బదులుగా భారతదేశపు సంప్రదాయపు పంకా ఉండేది. అది పొడవైన మొద్దుకర్రకు అంతే పొడవైన వస్త్రము అతుకబడి ఉండేది. దానికి ముడివెయ్యబడిన పొడవైన తాడును ఇటూఅటూ లాగినపుడు ఆ పంకా ముందుకు వెనుకకు కదులుట వలన చక్కని గాలి వీచేది. పాతహాలులో పంకాతాడు భగవాన్ సోఫా వెనుక ఉండేది. ఒకరోజు ఎవరూ హాలులో లేనపుడు చాడ్విక్ తన ఆరు అడుగుల నాలుగు అంగుళాల శరీరాన్ని ఎలాగో వంచి భగవాన్ సోఫా వెనుక దాగి ఉన్నారు. భగవాన్ వచ్చి సోఫాలో కూర్చున్న తర్వాత, చాడ్విక్ దొంగతనంగా (భగవాన్ చూడకుండా) పంకాను లాగడం మొదలుపెట్టారు. ఎవరూ లేకుండా పంకా వేగంగా కదలటం చూచి, భగవాన్ ఆశ్చర్యపోయారు. భగవాన్ చాలా నెమ్మదిగా తిరిగి ఎవరైనా ఉన్నారా అని చూచేటప్పటికి చాడ్విక్ పంకా లాగడం ఆపి దాక్కునేవారు. ఎవరూలేరని భగవాన్ అటువైపు తిరగగానే చాడ్విక్ మరలా పంకా లాగేవారు. అలా కొన్నిసార్లు జరిగిన తర్వాత భగవాన్, "చాడ్విక్ మీరు అక్కడ ఉన్నారు నాకు తెలుసు," అన్నారు.

పవిత్రమైన అరుణగిరి గురించి అనేక రహస్యాలు భగవాన్, చాడ్విక్‌కు చెప్పేవారు. ఒకరోజు హాలులో ఉన్నపుడు భగవాన్ చాడ్విక్‌తో, "చాడ్విక్, నేనొకసారి గిరిప్రదక్షిణ చేస్తుండగా, అకస్మాత్తుగా గిరిలోనికి తీసుకొని పోబడ్డాను. అక్కడ చాలా నగరాలు, జలపాతాలు, నదులు, ఆలయాలు, జనమూ ఉన్నారు. ఇప్పుడు ఇక్కడ ఉన్న మనుషులు అక్కడ కన్పించారు. ఓ చాడ్విక్! మీరుకూడా అక్కడున్నారు". భగవాన్ ఈ విషయం చెప్పిన తర్వాత, చాడ్విక్, మునగాల వెంకట్రామయ్య, ఆస్బోర్న్ ఇంకా అనేకమంది అకస్మాత్తుగా తాము గిరిలోపల ఉన్నట్లూ, గిరిలో ఉన్నట్లు ఎవరికి వారు విడివిడిగా అనుభవం పొంది అక్కడ ఉన్న నగరాలను, జలపాతాలను ధ్యానంలో ఉన్న మహర్షులనూ, మహనీయులనూ దర్శించారు. ఇది చాలా

ఆశ్చర్యకరంగా ఉండవచ్చునుకానీ, ఇది నిజమైన ఆధ్యాత్మిక అనుభవం. ఏ 'నేను' (సత్యాత్మ) లోకైతే మనము మేల్కొనాలో, ఆ 'నేను' గిరిలో (సత్యాత్మ)లో ఉన్నది.

చాడ్విక్, భగవాన్‌ను అరుణాచలము గురించి మరిన్ని విషయాలు చెప్పమని కోరారు. కొండపై తాను ఏ విధంగా సంచరించేవారో, కొండపై తాను అడుగుపెట్టని ప్రదేశము ఒక అంగుళము కూడా లేదని మహర్షి చాడ్విక్‌తో చెప్పారు. తాను కొండపై తిరుగుతుండగా జరిగిన ఒక సంఘటన గురించి భగవాన్ చాడ్విక్‌కు చెప్పసాగారు. ఒకసారి భగవాన్ గిరిపాదం వద్ద అడవిలో ఉన్న పచ్చైయ్యమ్మన్ కోవెలలో నివసించేటపుడు కొండపై తిరుగాడుతుండగా, ఒక నిటారుగా ఉన్న కొండశిఖరంపై, ఉన్న పెద్ద మర్రిచెట్టును చూచారు. దక్షిణామూర్తి, అరుణగిరి యోగిరూపంలో ఒక పెద్ద మర్రివృక్షం క్రిందకూర్చుని ఉంటారని పురాణాలలో వర్ణించబడింది. అది ఆ చెట్టే అయి ఉండవచ్చును అనే భావన ఆయనలో కలిగింది. భగవాన్ పైకి ఎక్కి దాని వద్దకు చేరుకోవాలనుకున్నారు. ఆ దారిలో ఆయన కాలు ప్రమాదవశాత్తూ ఒక పొదపై ఉన్న కందిరీగల తుట్టెకు తగిలింది. ఆ గూడులో ఉన్న కందిరీగలు ఆగ్రహంతో, ఆ కాలును తీవ్రంగా కుట్టినవి. తాను చూచిన దృశ్యమంతా ఒక్కసారిగా అదృశ్యమవటం భగవాన్ గమనించారు.ఆయన కోవెలకు బాగా వాచిపోయిన కాలుతో తిరిగివచ్చారు. తర్వాత భగవాన్ భక్తులందరికీ ఆ మర్రిచెట్టు జోలికి వెళ్ళటానికి ప్రయత్నించవద్దని హెచ్చరిక చేశారు. ఆ సంఘటన గురించి నాకు వివరించి, చాడ్విక్ ఇలా అన్నారు, "ఆ రోజు ఇంకా పైకి వెళ్ళాలని ప్రయత్నించకుండా భగవాన్ కోవెలకు తిరిగి రావటం మన అదృష్టం. లేనట్లయితే భగవాన్ అరుణాచలుడే కాబట్టి, అరుణగిరి యోగిలో ఐక్యమైపోయి ఉండేవారు ఆ రోజే. ఏప్రిల్ 14, 1950న ఆయన శరీరంనుండి తేజస్సు గిరిపైకి వెళ్ళి గిరిలో ఐక్యమైపోయినట్లు ఆ రోజునే అరుణగిరి యోగిలో ఐక్యమైపోయి ఉండేవారు.

భగవాన్ ఒకప్పుడు, "చాడ్విక్ మనతోనే ఉండేవారు ఇదివరకు (పూర్వజన్మలో)," అని బాహాటంగానే చెప్పారు. "పాశ్చాత్యదేశాలలో జన్మించాలనే తీవ్రమైన కోరిక వలన, ఆయన చాడ్విక్‌గా జన్మించి తిరిగి మన వద్దకు వచ్చారు," అని చెప్పారు. ఈ విషయాన్ని చాడ్విక్ నాతో చెప్పినపుడు, నేనంత సంతోషించలేదు. ఎందువల్లనంటే భగవాన్ ఎప్పుడూ పునర్జన్మ గురించి కానీ పూర్వజన్మల గురించి కానీ మాట్లాడేవారు కాదు. అప్పుడు చాడ్విక్, భగవాన్ చెప్పినదాని సారాంశమేమిటంటే సాధకులమైన మనము ఎప్పుడూ కోరికలు పెంచుకోకూడదు. మనము ఎల్లవేళలా ధ్యానించవలసిన విషయము, మనలోని 'ఎఱుక'గా లేదా చైతన్యంగా స్ఫురించుతున్న 'నేను' అనేదే.

చాడ్విక్ చేసిన గొప్ప మేలు భగవాన్ చేత, ఆయనే గురువుఅని పలికించడం. భగవాన్ ఎప్పుడూ గురువు, శిష్యుడు అనే ద్వైతభావాలను ఒప్పుకునేవారు కాదు. నేను గురువును, మిగిలినవారు శిష్యులు అని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. కానీ ఒకానొక సమయంలో ఈ విషయంలో చాడ్విక్‌కు ఒక సమస్య వచ్చింది. "మీరేమో మీరు గురువును అని ఎప్పుడూ అనరు. కానీ సద్గురువు లేకుండా శిష్యుడు సాక్షాత్కారము (ముక్తి) పొందలేరు అంటారు. అలాగైతే నేనేమై పోవాలి? నేను గురువును వెదుక్కుంటూ వెళ్ళాలా భగవాన్!" అని చాడ్విక్, భగవాన్‌తో మొరపెట్టుకున్నారు. ఉన్నది కేవలము ఆత్మయే. అందు గురువు, శిష్యులు అని విభాగాలు లేవు. నిజమైన సద్గురువు, తాను శిష్యునికంటే వేరుగా ఉన్నానని తలచరు. ఆయన అందరిలోనూ ఉన్న చైతన్యము ఒకటే అని, వివరించడానికి ప్రయత్నించారు. కానీ ఆయన ఇచ్చిన సమాధానంతో చాడ్విక్ సంతృప్తి చెందలేదు అని గమనించి, భగవాన్ ఇతరులతో, "చాడ్విక్ నేను చెప్పిన దానితో సంతృప్తి చెందలేదు. సబ్‌రిజిస్ట్రార్ గారిని ఈ విషయాన్ని గురించి ఒక చట్టబద్ధమైన పత్రము (లీగల్ డాక్యుమెంట్) తయారుచేసి పట్టుకుని రమ్మనిచెప్పండి. ఆఫీసువాళ్ళను, వాళ్ళ అధికార ముద్రను పంపమని చెప్పండి. అప్పుడు నేను ఆ పత్రముపై అధికారముద్ర వేసి అతనికి ఇస్తాను," అన్నారు. ఈ విధంగా చాడ్విక్ భగవాన్‌చేత తాను నిజంగానే గురువును అని ఒప్పించారు.

చాడ్విక్ మరొక విషయాన్ని కూడానాకు తెలిపారు. భగవాన్ శరీరాన్ని వదలివేయడానికి కొద్దిరోజుల ముందు, చాడ్విక్ ఆయన గదిలోనికి వెళ్ళి, "భగవాన్! మీరు మమ్మల్ని వదలి వెళ్ళిపోతున్నారు," అని బిగ్గరగా ఏడ్చారు. అప్పుడు భగవాన్ "గురువుయొక్క ప్రధాన విధి, తన శిష్యుల హృదయాలలో తన ఉనికిని నిశ్చయంగా విశదపరచడమే. అది నిర్వహించిన తర్వాత ఆయనకు వెళ్ళిపోవడానికి (శరీరాన్ని వదలడానికి) స్వేచ్ఛ ఉంటుంది". భగవాన్ అప్పటికే సత్యాన్ని, చాడ్విక్

మరియు ఇతరుల హృదయాలలో నాటారు. అందుకనే ఆయన శరీరాన్ని వదలడానికి సిద్ధమైనారు. ఈ సందర్భంలో కూడా తానే గురువునని ఆయన వెల్లడిచేశారు.

ఒకప్పుడు నేను చాడ్విక్‌ను, "మీరు ఆత్మసాక్షాత్కారాన్ని పొందారా?" అని అడిగాను. నేను పాతశిష్యులైన మురుగనార్, కోహెన్, ఆస్‌బోర్న్, సాధు నటనానంద, దేవరాజమొదలియార్, ఇంకా ఇతరులను అందరిని, ఇదే ప్రశ్న అడిగాను. వారిలో ఒక్కరు కూడా 'అవును' అనికానీ, 'లేదు' అనికానీ చెప్పలేదు. కేవలం చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. నేను చాడ్విక్‌ను అడిగినపుడు ఆయన 'అవును' అనికాని, 'లేదు' అనికాని చెప్పలేదు. దానికి బదులుగా ఆయన ఇలా చెప్పసాగారు. "ఏమి జరిగిందో చెబుతాను విను. నేను భగవాన్ వద్ద ఉండడం ప్రారంభించి నాలుగైదు సంవత్సరాలు అయిన తర్వాత నేను ఒక తప్పు చేశాను. ఇన్నాళ్ళుగా నేను ఎంత పురోగతిని సాధించాను? అని తెలుసుకోవడానికి ప్రయత్నించాను. ఏ సాధకుడు కూడా, ఇటువంటి పని చేయరాదు. 'నేను ఏమాత్రమూ పురోగతి చెందలేదు' అని నేను భావించాను. రమణాశ్రమంలో నన్ను చూసిన చాలామంది నన్ను ఒక మహర్షిలాగానో మహాత్ముడిలాగానో చూచి, 'ఓ! ఈయన ఎంత అదృష్టవంతుడు. ఈయన భగవాన్‌కు సన్నిహితంగా ఉంటారు. ఆయన చాలాసేపు ధ్యానం చేస్తారు. ఆయన ఇప్పటికే ఆ స్థితిలో ఉన్నారు' అనసాగారు. ఇది నాలో ఒక వైరుధ్యాన్ని సృష్టించింది. నేను ఆధ్యాత్మికంగా పురోగతి చెందడంలేదని నేననుకున్నాను. ఏమైనప్పటికి ప్రాపంచిక జీవితాన్ని వదలివేసిన నేను మరలా ఆ బాహ్యజీవితంలోనికి వెళ్ళలేను. ఈ విధంగా నేను బాగా ఇరుకున పడిపోయాను. నేను విచారంలో మునిగాను. నేను భగవాన్‌హాలుకు పరుగున వెళ్ళాను. ఆయన ఒంటరిగా ఉన్నారు. 'భగవాన్! ఇదీ నా పరిస్థితి అని చెప్పాను. భగవాన్ నేను ఇక్కడా పనికిరాకుండా పోయాను. అక్కడా ఉండలేను. ఇది నాకెంతో దుఃఖాన్ని కలిగిస్తోంది' అన్నాను. భగవాన్ నావైపు కరుణతో చూశారు. 'చాడ్విక్! ఇదంతా ఎవరంటున్నారు?' అన్నారు. వెంటనే నాలో ఏదో విద్యుత్ ప్రవాహంలాటిది జరిగింది. నేను నా గదికి పరుగున వెళ్ళి తలుపులు వేసుకుని నిశ్చల (షాక్) స్థితిలో ఉన్నాను. అప్పుడు నాకు ఆధ్యాత్మికంగా పురోగమించుట లేదనికానీ, నేనీ ప్రపంచంలో ఉండగలనా అనే సందేహం కానీ కలుగలేదు. నేను సంతోషం కానీ విచారం కానీ లేకుండా ఉన్నాను. కొన్నిదినాలు గడిచాయి. చాడ్విక్ అనుభవించిన విలాసవంతమైన విషయమల్లా, ఒక స్నానపుతొట్టిలో స్నానం చెయ్యటం మాత్రమే. ఆయన కుటీరం ముందున్న వరండాలో ఒక స్నానపు తొట్టిని అమర్చుకున్నారు ఆయన. ఈ పై సంఘటన జరిగిన కొన్ని రోజులకు, అనుకోకుండా ఏదో జరిగింది. చాడ్విక్ నాతో ఇలా చెప్పారు. "గణేశన్! నేను స్నానం చేస్తున్నాను. నిజాయితీగా చెప్పాలంటే నేను, ఆధ్యాత్మిక చింతనలోగానీ ప్రార్థన భావంతోగానీ లేను. అపుడు అకస్మాత్తుగా 'నేను' అనే 'అహం' 'స్ఫురణ' ఉదయించింది. అవి మాటలు కావు. ఆయన నిజమైన అనుభవం. ఆయన ఎంత తన్మయంలో మునిగిపోయారంటే, ఈ శరీరాన్ని తుడుచుకోవడం కూడా మరచి ఒక తువ్వాలు చుట్టుకుని, కొన్నాళ్ళ క్రితం ఎక్కడినుండి పారిపోయారో ఆ పాతహాలుకు పరుగెత్తారు. అదృష్టవశాత్తూ ఈసారికూడా భగవాన్ ఒంటరిగా ఉన్నారు. ఈ ఆధ్యాత్మిక తన్మయత్వంలో 'నేను', 'నేను' అనే అహంస్ఫురణ అనుభవాన్ని పొంది చాడ్విక్ అనే వ్యక్తిత్వం మాయమై, 'నేను' మాత్రమే మిగిలి ఉన్నపుడు, ఆయన భగవాన్‌ను అడిగారు, "భగవాన్! ఇదేనా ఇది?" చాడ్విక్ గుర్తుచేసుకున్నారు. భగవాన్ గొప్ప చిరునవ్వు నవ్వి, "అవును చాడ్విక్, 'ఇదే అది'," అని నిశ్చయంగా చెప్పారు. నేను ఆయనను అడిగాను, "భగవాన్! ఇది ఇంత సులువైనదా?" అని. భగవాన్ బదులిచ్చారు, "అవును. అది అంత సులభమైనదే," అని. అప్పటినుండి నాకెప్పుడూ ఏ విధమైన సందేహమూ లేదు.

ఒకసారి చాడ్విక్ నాకిలా సలహా ఇచ్చారు. "గణేశన్! ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించాలని ప్రయత్నించకు. ఎందుకంటే చివరకు (విషయ) జ్ఞానమే ఆత్మసాక్షాత్కారానికి ప్రతిబంధకము (అడ్డంకి) అవుతుంది. ఒకప్పుడు నేను తమిళము నేర్చుకోవాలని ప్రయత్నించి, దానికి భగవాన్ అనుమతి కోరాను. అపుడు ఆయన జవాబు ప్రబోధాత్మకంగా ఉంది. ఆయన అన్నారు, 'ఎందుకు నువ్వు ఇంకొక వ్యర్థమైన భారాన్ని పెంచుకోవాలనుకుంటున్నావు? 'సత్యాన్ని' పొందాలంటే ఉన్న పరిజ్ఞానాన్నంతా వదలివేయాల్సిందే. మీరు సత్యాన్ని అనుభవంలో పొందాలంటే, మీ అంతరంగంలోకి మునిగి నిరంతరాయంగా 'నేనెవరిని?' అనే విచారణ చెయ్యవలసి ఉంది. ఆత్మసాక్షాత్కారానికి (తాళంచెవి) అభ్యాసము (ఆచరణ), అభ్యాసము (ఆచరణ), అభ్యాసము (ఆచరణ) మాత్రమే'. ఆ సందర్భంలో నేనొక విషయంపై వివరణ కోరాను. ఎందుకని పాశ్చాత్యులు భగవాన్ బోధచే

ఆకర్షింపబడుతున్నారు? అని ఆయన ఇచ్చిన సమాధానం చెప్పుకోదగ్గది. "భగవాన్‌యొక్క బోధ పశ్చిమదేశాల్లో బాగా ప్రశంసలు పొందింది. ఆయన యొక్క స్వచ్ఛమైన, హేతుబద్ధమైన వాదనలు ఆకట్టుకుంటవి. ఆయన ఎప్పుడూ దీనిని మీరు ఆచరించి తీరాలి అని ఏ నియమాన్ని చెప్పరు.దానికి బదులుగా ఆయన ఎల్లపుడూ సాధకుని అంతర్ముఖపరచి, అంతా మీ చేతులలోనే ఉన్నది. గురువు కేవలం మార్గాన్ని చూపించగలరు. అంతేగాని ఆత్మసాక్షాత్కారాన్ని ప్రసాదించలేరు అని చెప్తారు.

భగవాన్‌యొక్క వీలునామా వ్రాయబడి అమలుపరచబడినపుడు చాడ్విక్ దానిని పూర్తిగా సమర్థించారు. హైకోర్టుజడ్జి, కోర్టులోని అధికారి సమక్షంలో వీలునామాపై సంతకానికి బదులుగా ఒక నిలువు గీత గీచినపుడు చాడ్విక్ అక్కడే ఉన్నారు. తర్వాత కొంతమంది వ్యక్తులు, వీలునామాను వ్యతిరేకించినపుడు, చాడ్విక్ అవసరమైన ప్రతి ఆఫీసుకూ వెళ్ళి, భగవాన్ ఆ వీలునామాను తయారుచేయించినపుడు తాను అక్కడే ఉన్నానని, ఆశ్రమ నిర్వహణ, ఆయన కుటుంబానికే అప్పజెప్పబడినదని, సాక్ష్యమిచ్చారు. ఎవరో దారిన పొయ్యే వారికి అధికారము అప్పజెప్పటముకంటే, కుటుంబమునకే నిర్వహణ బాధ్యతను అప్పజెబితే వారు ఎటువంటి పరిస్థితిలోనూ, ఆశ్రమాన్ని వీడకుండా ఉంటారు. భగవాన్ ఎంపిక అన్నివిధాలా సమంజసమైనది. మా తాతగారు నిరంజనానందస్వామి చనిపోయిన తర్వాత మా తండ్రిగారైన వెంకటు, వంశపారంపర్య క్రమానుసారం మేనేజర్ అయ్యారు.

1956 నుండి 1958 వరకూ నేను తిరువణ్ణామలైలోనే ఉండి ఉద్యోగము కోసము ప్రయత్నిస్తున్నాను. ప్రయత్నాలు ఫలించకపోవటంతో నేను చాలా విచారంగా ఉన్నాను. అలాంటి సమయంలో చాడ్విక్ నన్ను తన గదికి పిలిచారు. ఆయన నాతో ఇలా అన్నారు, "గణేశన్! భగవాన్ సజీవులుగా ఉండగానే, ఆస్‌బోర్న్, మునగాల వెంకట్రామయ్య, కోహెన్, నేను నలుగురమూ, జ్యోతిష్యము అంటే ఎక్కువ ఆసక్తికలిగి ఉండేవారము. మునగాల వెంకట్రామయ్యగారు, నేనూ హిందూజ్యోతిషశాస్త్రమును నమ్మేవారము. కోహెన్ పాశ్చాత్యజ్యోతిష శాస్త్రాన్ని నమ్మేవారు. ఆస్‌బోర్న్ ఇ-చింగ్ అనే ప్రాచీన చైనాదేశపు జ్యోతిషశాస్త్రాన్ని నమ్మేవారు. వీలునామా ప్రకారము, తర్వాత ప్రెసిడెంటు వెంకటూ పెద్దకుమారుడు, మీ అన్నయ్య అయిన సుందరము అవుతారు. కానీ, మీ ముగ్గురు సోదరులలో ఎవరు భగవాన్ ఆధ్యాత్మిక బోధలను పంచుతారు? అనేది మా ప్రశ్న. మాలో ప్రతి ఒక్కరము మాకు నచ్చిన జ్యోతిషశాస్త్రాన్ని ఆశ్రయించాము. మాకందరికీ ఒకే రకమైన జవాబు లభించింది. గణేశన్! నువ్వే భగవాన్ బోధను వ్యాప్తి చెందించబోతున్నావని తెలిసింది. ఇది 1957లో జరిగింది. నాకపుడు ఆధ్యాత్మిక జీవితంమీద ఆసక్తిగాని, రమణాశ్రమంలో ఉండిపోవాలనే ఉద్దేశం గానీ లేవు. 'నీ స్థానము ఇది అయినప్పుడు, నువ్వు ఉద్యోగము వెతుక్కుంటూ వెళ్ళవలసిన అవసరమేమున్నది. నువ్వు ఇక్కడే ఉండు," అని చాడ్విక్ నాతో అన్నారు. కానీ నేను ఆ మాటలు విన్పించుకోకుండా వెళ్ళిపోయాను. తిరిగి 1960లో వెనక్కు వచ్చాను.

నేను ఆశ్రమానికి తిరిగివచ్చిన తర్వాత, చాడ్విక్ స్థంభంవలె నాకెంతో ఊతాన్ని ఇస్తూ, ఆశ్రమనిర్వహణలో ఎంతో సహకరిస్తుండేవారు. నాకెటువంటి సమస్య ఎదురైనా, అది కోర్టు వ్యవహారమైనా, లేదా ఆర్థిక సమస్య అయినా, చాడ్విక్ నాకు బాగా వెన్నుదన్నుగా నిలిచేవారు. ఒకప్పుడు మా తండ్రిగారు ఆశ్రమానికి దూరంగా ఉన్నారు. అది 1961వ సంవత్సరము. నేను ఆశ్రమంలో ఒక సంవత్సరము ఉండి, నాకు ఆశ్రమ నిర్వహణ విషయంలో నిర్ణయాలు తీసుకోవడము, ఏర్పాట్లు అన్నీ సరిచూడడము చెయ్యవలసి ఉండేది. అప్పుడు ప్రతి సంవత్సరము జరిగే పదిరోజుల కార్తీక దీపోత్సవం మొదలైనది, అరుణాచలేశ్వరుని ఆలయంలో. ఆ ఉత్సవములో ముఖ్యమైన ఘట్టము, అరుణగిరిపై పెద్ద జ్యోతిని, కార్తీక దీపాన్ని వెలిగించటము. భగవాన్ జీవించి ఉండగా ఆయన హాలు బయట దీపం కన్పించేటట్లుగా కూర్చుని ఉండేవారు. గిరిపై దీపం వెల్గించిన వెంటనే భగవాన్ ఎదురుగా, నేతితో దీపాన్ని వెలిగించేవారు. భగవాన్ శరీరాన్ని వదలివేసిన తర్వాత, ఆయన కూర్చునే స్థానంలో ఆయన ఫోటోను ఉంచి, దాని ఎదురుగా నెయ్యిదీపాన్ని వెలిగించేవారు ఆశ్రమనిర్వాహకులు. అది ఈనాటికి అనుసరించబడుతున్న సంప్రదాయము.

1961లో కార్తీక దీపోత్సవమునాడు భారీ వర్షము కురవసాగింది. సంప్రదాయం ప్రకారం, భగవాన్ ఫోటోను నేతిదీపాన్ని హాలు బయట ఉంచడానికి వీలుపడక నేను ఎంతో ఆందోళనచెందాను. అది చూచి చాడ్విక్ నా వద్దకు వచ్చి గణేశన్,

ఆందోళన చెందవద్దు. మనము భగవాన్ ఫోటోను, భోజనాల హాలులో ఉంచి, అక్కడే దీపాన్ని వెలిగించవచ్చును. "భగవాన్ ఆచారాలనూ, సంప్రదాయాలను పాటించడంలో ఆసక్తి కనపరచకపోయినప్పటికీ కార్తీకదీపాన్ని దర్శించడానికి మాత్రము అత్యంత శ్రద్ధ చూపేవారు. నేను ఆశ్రమముయొక్క సాంప్రదాయాన్ని ఎలా తప్పించగలను? మా తండ్రిగారు ఇక్కడ లేరు. నేను సంప్రదాయాన్ని ఎలా పాడుచెయ్యను?" అని ఆందోళన వెలిబుచ్చాను. చాడ్విక్, "భగవాన్ జీవించి ఉండగా, ఒక సంవత్సరము ఇలాగే వర్షం కురిసింది. అప్పుడు భోజనాల హాలులోనికివెళ్ళి, అక్కడ పెద్ద ద్వారాన్ని తెరచి గిరిశిఖరాన్ని, దీపాన్ని చూద్దాము అని భగవాన్ సలహా ఇచ్చారు. నేను భగవాన్ ప్రక్కనే ఉన్నాను. 'భగవాన్ వర్షం భారీగా కురుస్తున్నందు వలన మనముదీపాన్ని దర్శించలేమేమో?' అన్నాను. భగవాన్ తన బైనాక్యులర్స్ (దూరదర్శిని) తీసి దానిగుండా చూస్తూ, 'చూడండి, చూడండి,' అన్నారు. గిరిమీద దీపము వెలిగించబడగానే అద్భుతంగా వర్షము ఆగిపోయింది. మేఘములు కొంతసేపటి వరకు చెల్లాచెదురైపోయాయి. ఎంతో ఆత్రంగా చూస్తున్న మాకు, దీపదర్శనం లభించింది. వెంటనే భగవాన్ అన్నారు, 'ఇప్పుడు నేతి దీపం వెలిగించండి,' అని. మనమూ దానినే అనుసరిద్దాం" అన్నారు. వర్షం కుండపోతగా కురుస్తున్నందువల్ల నేను సందేహంతోనే ఉన్నాను మనస్సులో. ఏమైనప్పటికి చాడ్విక్‌గారి సలహాను పాటించాను. చాడ్విక్ నా ప్రక్కనే కూర్చుని, 'చూడండి, చూడండి,' అన్నారు. సరిగ్గా ఆయన చెప్పిన విధంగానే జరిగింది. సరిగ్గా దీపము వెలిగించేవేళకు వర్షము ఆగిపోయింది. మబ్బులు చెదిరిపోయినవి. మేము భోజనశాలలో భగవాన్ ఫోటో ముందు నేతిదీపం వెలిగించాము. గిరిపై దీపదర్శనమైన కొద్దిసేపటికే మళ్ళీ మబ్బులు కమ్ముకున్నవి. మాకుదీపం కనబడకుండా చేసినవి.

ఆర్థికసమస్యల వల్ల భగవాన్ పరమపదించిన పిదప కొన్ని ఆశ్రమ కార్యక్రమాలను నిలిపివేయవలసి వచ్చింది. 1938వ సం॥లో పిల్లలకు వేదములు బోధించుటకు ఆశ్రమములో నెలకొల్పబడిన వేదపాఠశాల ప్రారంభించబడింది. ఆ పాఠశాల ఆర్థిక ఇబ్బందుల వలన మూసివేయవలసి వచ్చింది. మందిరములో పూజాకార్యక్రమము కూడా సరిగా నిర్వహింపబడడం లేదు. అప్పుడు చాడ్విక్ ఆ పనిని తన మీద వేసుకున్నారు. మా గురువుగారు టి.కె.సుందరేశఅయ్యర్ సహకారముతో, వేదపాఠశాలను పునఃప్రారంభించారు. భగవాన్ మందిరంలోనూ, అమ్మ సమాధి వద్ద కూడా అనుదినమూ పూజలు సక్రమంగా జరిగేలా ఏర్పాటుచేశారు. అమ్మ ఆలయంలో శ్రీచక్రపూజ ప్రారంభింపచేసినది చాడ్విక్‌గారే, పరిపూర్ణ శరణాగతి చెంది ఆశ్రమంలోనే ఉంటూ, ఆశ్రమానికి ఎంతో అండగా నిల్చారాయన. ఆయన కేవలం అక్కడ ఉండడం వల్లనే భగవాన్ బోధ వ్యాప్తి చెందింది. సోమర్‌సెట్‌మామ్, స్పాల్డింగ్ ఇంకా అనేకమంది ప్రముఖులు అక్కడకు వచ్చినపుడు, చాడ్విక్‌తో మాట్లాడేవారు. ఆయన భగవాన్ వైశిష్ట్యాన్ని గురించి వారికి వివరించేవారు.

'అనుదినమూ భగవాన్‌తో', 'మహర్షితో సంభాషణలు' అనేగ్రంథాలను ఆయన సరిచూశారు. శ్రీరమణభాషణములు (టాక్స్‌విత్ ది మహర్షి) అచ్చువేయబడటానికి ముందు ఆ వ్రాతప్రతులను మద్రాసుకు (చెన్నై) తీసుకు వెళ్ళారు. ఎవరో పండితులు వాటిని సరిచూసి అనేక పేజీలను పునరావృత్తి (వ్రాసినదే తిరిగి వ్రాయడం) అని కొట్టిపారేశారు. ప్రెస్‌కు ఇచ్చేముందు వ్రాతప్రతిని ఆశ్రమానికి తీసుకొచ్చారు. ఆ సమయంలో నేను ఆఫీసులో ఉన్నాను. ఆ సరిదిద్దబడిన వ్రాతప్రతిని చాడ్విక్ ఆమోదంకోసం ఆయన వద్దకు పంపాను. దానిని పూర్తిగా చూచిన తర్వాత, కోపంతో ఎర్రబడిన ముఖంతో ఆయన ఆఫీసుకు వచ్చారు. "ఎవరు మా గురువుగారి మాటలను కొట్టిపారేసింది? మీకేమి తెలుసు? మీరు కేవలము మీ పాండిత్యప్రతిభతోటి, వీటిని పునరావృత్తి అని అంటారా? ఆ పునరావృత్తి అత్యంత ఆవశ్యకమైనది. గ్రంథ పరిచయంలో ఆయన ఇలా వ్రాశారు, "ఇందులోని పునరావృత్తి అర్థవంతమైనదే. ఇందులో ఒక్క మాటను కూడా వదలివేయనవసరం లేదు. ఎందువలన అంటే, ప్రతి పదము భగవాన్‌చే చూడబడినది. ఆమోదించ బడినది". ఇవాళ ఆ పుస్తకంలో మనం చదువగలిగేదంతా చాడ్విక్ వలననే. లేకుంటే 'మహర్షితో సంభాషణలు' లోనూ, 'అనుదినమూ భగవాన్‌తో' అనే గ్రంథంలోనూ, భగవాన్ సంభాషణలు కల్గియున్న ఇతర గ్రంథాలలోనూ, చాలావరకు తీసివేయబడి ఉండేవి. ఈ విధంగా మేజర్‌చాడ్విక్, భగవాన్ సందేశాలను మనకు పూర్తిగా అందేలా చేశారు.

ఆయన చివరిరోజుల్లో బాగా జబ్బుపడి, వెల్లూరులోని క్రైస్తవ వైద్యకళాశాల ఆస్పత్రికి తీసుకుపోబడ్డారు. ఆయన తిరువణ్ణామలైలో 'హెర్నియా' ఆపరేషన్ చేయించుకొనగా, అది సెప్టిక్ అయి చీముపట్టి బాధాకరంగా మారటంవలన వెల్లూరు హాస్పటల్‌కు

తీసుకువెళ్ళవలసి వచ్చింది. ఆయన అరుణాచలమునకు దూరంగా వెళ్ళుటకు ఏమాత్రం ఇష్టపడలేదు. మేము అందరమూ వైద్యం కొరకు వెల్లూరు వెళ్ళవలసినదిగా ఆయనకు నచ్చచెప్పాము. కనుక ఆయన అక్కడకు వెళ్ళారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నదని, ఆయన వైద్యులు మాకు వార్త పంపారు. నేను ఆయన వద్దకు వెళ్ళాలని చాలా ఆతృతతో ఉన్నాను. కానీ మా తండ్రిగారు, శ్రీమతి తలైయార్‌ఖాన్, హ్యూగోమెయిర్ అనే జర్మన్ డాక్టర్ నన్ను ఆశ్రమంలోనే ఉండి ఆశ్రమ వ్యవహారాలు చూచుకొమ్మని, వారు ఏమైనా చాడ్విక్‌కు సాయపడగలమేమోనని వెళ్ళారు. వాళ్ళు ఆస్పత్రికి చేరుకోగానే, అక్కడి వైద్యులు చాడ్విక్ కోమాలో ఉన్నారని, మాట్లాడలేకపోతున్నారని తెలిపారు. చాడ్విక్ వంటినిండా అమర్చబడిన ట్యూబులను చూచి శ్రీమతి తలైయార్‌ఖాన్ ఆవేదనతో, "చాడ్విక్ మేము రమణాశ్రమంనుండి వచ్చాము," అన్నారు. వెంటనే "సుస్వాగతము గణేశన్!" అని ఆయన బదులిచ్చారు. నేను అక్కడకు వెళ్ళానని ఆయన అనుకున్నారు. 'గణేశన్ రాలేకపోయారు,' అని వాళ్ళు ఆయనతో చెప్పారు. అప్పుడు ఆయన ఇవాళ 'ఈస్టర్' (క్రైస్తవ పండుగ) అన్నారు. అప్పుడు హ్యూగోమెయిర్ "చాడ్విక్, 'ఈస్టర్' ఇవాళ కాదు. ఇంకా వారము రోజుల తర్వాత", అన్నారు. "నాకు ఆ విషయం తెలుసు. నాకు ఇవాళ "ఈస్టర్" అన్నారు చాడ్విక్.

ఆయన చనిపోయిన తర్వాత ఆయన శరీరము ఆశ్రమమునకు తీసికుని రాబడింది. చాలామంది ఆయన శరీరాన్ని ఆశ్రమంలో సమాధి చెయ్యటాన్ని వ్యతిరేకించారు. వాళ్ళని ఎదిరించి, నేను ఖండితంగా చెప్పాను. చాడ్విక్ భగవాన్ బిడ్డ. ఆయన శరీనాన్ని వెలుపలకు పంపటానికి వీలులేదు. ఆయన గదికి దక్షిణపు వైపున ఆయన శరీరం సమాధి చెయ్యబడినది. ఆయన గదిలో ఆయన అహంకారానికి ఒక సమాధి ఉన్నది. 1938లో ఆయన కుటీరంలో చిన్నగోతిని త్రవ్వుతున్నారు. కొంతమంది భక్తులు అది ఎందుకో అర్థంకాక "మీరు ఎందుకు గొయ్యి తవ్వుతున్నారు?" అని అడిగారు. ఆయన వారి వంక చూచి "ఇది నా అహంకారమునకు సమాధి" అన్నారు.

ఈ గొప్ప భక్తుడు తన గురువుగారైన భగవాన్ రమణులను సేవించి, తిరిగి మూలానికి వెళ్ళి అందులో ఐక్యమైనారు. ఇవాళ మనము ఆయన శరీరము యొక్క సమాధిని, వ్యక్తిత్వము యొక్క సమాధిని మాత్రమే చూడగలము. అంతరంగంలోనికి చూస్తే, హృదయంలోనే భగవాన్‌ను, అరుణాచలేశ్వరుడిని, గొప్ప గౌరవనీయుడైన చాడ్విక్‌ను దర్శించవచ్చును. ప్రతిరోజూ ఆయన 'గణేశన్ సలామ్ అలేకుమ్" అంటు నన్ను పలుకరిస్తారు. అది ముస్లింలు పరస్పరము పలుకరించుకునే పద్ధతి (అభివాదము చేసుకునే) అంటే 'శాంతి కలుగుగాక" అని అర్థము. హృదయములోనే ఉన్న మేజర్ చాడ్విక్, ఇప్పటికీ మనందరితో అంటూనే ఉన్నారు. 'సలాం అలేకుమ్', 'శాంతిగా ఉందురు గాక' అంటూ.

సాధు అరుణాచల (మేజర్ చాడ్విక్)

మారిస్ ఫ్రిడ్‌మన్



మారిస్ ఫ్రిడ్‌మన్ ఒక మేధావి. ఆయన పోలెండ్ దేశంలోని, ఒక యూదు కుటుంబంలో జన్మించారు. ఆయన ఎంత నిరుపేద కుటుంబం నుండి వచ్చారంటే, ఆయనకు పదమూడు సంవత్సరాలు వచ్చేవరకు, ముతక రొట్టెలు తప్ప 'తెల్లటి బ్రెడ్ ఎరుగరు. ఆయనకు పదిసంవత్సరములు వచ్చేటప్పటికి, రష్యన్, హీబ్రూ, సిరిలిక్, భాషలను చదవటము వ్రాయటము చెయ్యగలిగేవారు. రష్యన్, పోలిష్, ఫ్రెంచి, ఇంగ్లీషు, హిబ్రూ భాషలను ధారాళంగా మాట్లాడ గలిగేవారు. ఆయన పాఠశాల రోజులనుండి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తయ్యేవరకూ క్లాసులో ప్రథముడుగా ఉండేవారు. ఆయన ఎంత అద్భుతమైన మేధాశాలి అంటే, ఆయనకు కేవలము ఇరువది సంవత్సరముల వయస్సు వచ్చేసరికి, నూరు 'పేటెంట్ల'ను (క్రొత్తయంత్రములు, పనిముట్లు వగైరాలను స్వతంత్రంగా కనుగొని వాటికి ప్రభుత్వము నుండి హక్కును పొందుట) ఇంజనీరింగ్‌కు సంబంధించిన నూతన ఆవిష్కరణలకుగానూ పొందారు.

ఇరువది అయిదు సంవత్సరాల వయసు వచ్చేసరికి, ఆయనకు, దైవాన్ని అన్వేషించాలి అనే అంతర్గత తపన మొదలైంది. ఆ క్రమంలో ఆయన యూదుమతాన్ని వదలి, రష్యన్ సంప్రదాయానికి మారారు. ఒక సన్యాసిగా మారి ఒక మారుమూల మఠంలో కఠినమైన నియమ నిష్టలతో కూడిన జీవితాన్ని గడిపేవారు. ఆయన చాలా అరుదుగా బయటకు వెళ్ళేవారు. ఒకసారి ఆయన చాలా ఎత్తైన ఒక జలపాతపు పై భాగానికి చేరుకున్నారు. అప్పుడు, ఆయనకు, నీకు నిజముగా ఏసుక్రీస్తు పట్ల నిజమైన నమ్మకముంటే, నీవు నిజముగా చర్చిని ప్రేమిస్తున్నట్లయితే, ఈ జలపాతంలోకి దూకు" అనే ప్రేరణ సైతాన్ నుండి కలిగింది. ఆయన వెంటనే ఆ సన్యాసి దుస్తులతోనే దూకేశారు. అరుణాచలేశ్వరుడు ఆయనకు ఏమైనా జరగనిస్తారా? ఆయన దుస్తులు అక్కడ ఉండే కొన్ని పొదలలో చిక్కుకుని పోయి, ఆయన కాపాడబడ్డారు. సత్యాన్ని తెలుసుకోవాలని నిజాయితీతో కూడిన జిజ్ఞాస, ఆర్తి ఉంటే, ఆ సత్యమే మనలను నడిపిస్తుంది అనటానికి ఇదే ఋజువు.

ఆయన ఆచరిస్తున్న సాంప్రదాయకపు సిద్ధాంతాలేవీ కూడా, ఆయనను సత్యం వద్దకు తీసికుని వెళ్ళలేకపోయాయి. అందుకని. ఆయన అన్ని కట్టుబాట్ల నుండి స్వేచ్ఛ పొంద దలిచారు. ఆ అన్వేషణ ఆయనను, థియొసోఫికల్ సొసైటీకి అనీబిసెంట్ వద్దకు జేర్చింది. జిడ్డు క్రిష్ణమూర్తి తోటి సమావేశము ఆయనను ఎంతగానో ప్రభావితము చేసింది. ఈ సమావేశాలన్నీ 1926 సం॥ములో జరిగాయి. కృష్ణమూర్తి, "సత్యము ఏ మార్గమూ లేని ప్రదేశము. దానిని చేరుకోవాలంటే, ఏ బాహ్య విషయం పైనా ఆధారపడకుండా, స్వతంత్రంగా సాగాలి" అని చెప్పారు. ఆ దృక్పథం ఆయనకు నచ్చి, కృష్ణమూర్తి గారితో ఆవిషయంపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మారిస్ ఎపుడు మాట్లాడదలచుకున్నా కృష్ణమూర్తిగారు అవకాశము యిచ్చేవారని తెలుస్తుంది.

మారిస్‌కు దైవాన్ని దర్శించాలని, సత్యాన్ని తెలుసుకోవాలని ప్రగాఢమైన వాంఛ ఉన్నప్పటికీ, ఆయన ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలోనే 1928 నుండి 1934 వరకూ ఉద్యోగం కొనసాగించారు. ఆయన ఫ్రాన్స్ దేశంలోని ఒక ప్రఖ్యాతి చెందిన విద్యుత్తు పరికరములను తయారుజేసే యంత్రాగారానికి జనరలు మేనేజర్‌గా (నిర్వహణ అధికారిగా) ఉన్నారు. కానీ సత్యాన్ని తెలుసుకోవాలనే ఆశయము, తపన ఆయనను ఎన్నడూ వీడలేదు.. అందుకని ఆయన, ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైన వేదాంత గ్రంథాల యొక్క ఫ్రెంచి భాషలోని, జర్మన్ భాషలోని అనువాదములను, చదవటం ప్రారంభించారు. ఆయన ఆధ్యాత్మిక జీవితానికి 1935వ సం॥ము ఒక మలుపుగా మారింది. అప్పుడు ఆయన పాల్‌బ్రంటన్ వ్రాసిన పుస్తకములను చదవటము మొదలు పెట్టారు. 'నేనెవరు?' అనే బోధ, చాలా ప్రబోధాత్మకంగా అనిపించింది. సత్యము మనలోనే ఉంటుంది. బాహ్యంలో కాదు. అనే బోధ, ఆయనను అంతర్ముఖులగునట్లు చేసింది. పాల్‌బ్రంటన్ పుస్తకాలు ఆయనలో భారతదేశానికి వెళ్ళాలి, అచట సజీవులైన మహర్షి, శ్రీభగవాన్ రమణమహర్షిని దర్శించాలనే ప్రగాఢవాంఛను రగిలించినవి. మైసూరు దివాన్, తమ రాష్ట్రాన్ని ఆధునికీకరణ చెయ్యదలచి, ఆ దేశాలలోని ఆధునిక సదుపాయాలను గూర్చి తెలుసుకొనుట

కొరకు, యూరప్ ఖండాన్ని, ముఖ్యంగా ఇంగ్లండ్ దేశాన్నీ సందర్శించారు. ఒక రోజు ఆయన మారిస్‌ఫ్రిడ్‌మన్ జనరల్ మేనేజర్‌గా ఉన్న ఫ్యాక్టరీని సందర్శించారు. మారిస్‌లోని నిజాయితీ,కష్టించి పని చెయ్యటము మొదలైన సుగుణాలతో బాగా ప్రభావితులై, ఆయనను ఇలా అభ్యర్థించారు. "మీరు దయచేసి, మా రాష్ట్రానికి వచ్చి, మా రాష్ట్రమును అభివృద్ధి పరచటానికి తగుసలహాలను యివ్వగలరా?" 1930 దశకంలో, భారతదేశము బాగా వెనుకబడి ఉన్నది. టెక్నాలజీ (అన్ని రంగాలలోనూ యంత్రములను ఉపయోగించటము) అభివృద్ధి చెందలేదు. మారిస్ వెంటనే ప్రత్యుత్తరమిచ్చారు. "నా సామానులు సిద్ధంగా ఉన్నవి, సర్, నేను మీతో భారత దేశానికి రావటానికి సిద్ధంగా ఉన్నాను. మారిస్ (హృదయ) సౌందర్యం అటువంటిది.

1935లో, తను దర్శించాలని కలలు కనే భారతదేశానికి మారిస్‌ఫ్రిడ్‌మన్ వచ్చారు. విద్యుత్ పరికరములను, తయారు చేసే పెద్ద పరిశ్రమ, స్థాపించే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఎందుకంటే ఆ రంగంలో ఆయన నిష్ణాతులు కాబట్టి. ఆయన ఆశయం భగవాన్‌ను కలుసు కోవటమే. ఆయన ఎంత, పని భారంలో ఉన్నప్పటికి, ఆయన భగవాన్‌ను కలుసుకోవటానికి వెళ్ళారు. మొదట్లోనే, భగవాన్‌కు శరణాగతి చెందడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. ఆయన పగలు రాత్రి పరిశ్రమలో పాటుపడేవారు. కొద్ది రోజులలోనే ఆయన విజయాన్ని అందుకోగల్గారు. వారాంతాలలో ఆయన అరుణా చలానికి వెళ్తుండేవారు. అక్కడి జనులు, "ఇరుగో మన మారిస్ వస్తున్నారు," అనేవారు.

ఆయన అక్కడ గడిపే కొద్ది సమయంలో, తన స్నేహితులతో సంభాషిస్తూ, తరచుగా భగవాన్‌ను ప్రశ్నిస్తూ గడిపేవారు. భగవాన్ ఓర్పుగా సహించేవారు. భగవాన్ సహజంగా, అప్రయత్నంగా, ప్రతిబింబించే అద్దంలాగా ఉండేవారు. ఎవరైనా పూర్తిగా ఆధ్యాత్మికతలో మునిగిపోయినపుడు, అందుకు బదులుగా, ఆయన తనను తానే వారికి ఇచ్చేసేవారు. రమణాశ్రమములో ఉండేవారు, మారిస్ ఇక్కడకు రావటానికి మీకు బోలెడు డబ్బు ఖర్చు అవుతుంది కదా! వారానికి ఒకసారి వచ్చే బదులు, నెలకొకసారి లేదా రెండు నెలలకొకసారి రావచ్చునుగదా, అనేవారు. "అపుడు మారిస్ యిలా అనేవారు," నేనేమి చెయ్యను? నా బాటరీ అంతే తీసుకో గలుగుతుంది. ఒక వారంలో అది ఖాళీ అయిపోతుంది. అందుకని నేను ప్రతివారం భగవాన్ సన్నిధికి వచ్చి, నా బాటరీని తిరిగి చార్జింగ్ చేసికుని వెళ్ళవలసి వస్తున్నది".

మారిస్ భగవాన్‌తో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఆయన సాధ్యమైనంత వేదాంత పరిజ్ఞానాన్ని సంపాదించి, ఇతరులతో చర్చిస్తూ, సాధ్యమైనన్ని హిందూ పవిత్రగ్రంథాలను చదువుతూ ఉండేవారు. మోక్షము సంపాదించాలంటే, సన్యాసాన్ని స్వీకరించాలని, ఆయన ఎక్కడో చదివారు. ఆయన భగవాన్‌తో భగవాన్, పవిత్ర గ్రంథాలు ఇలా చెబుతున్నవి. మీరు నాకు దయచేసి సన్యాసము ఇవ్వండి అనే వారు. భగవాన్ మౌనంగా ఉండేవారు. కానీ మన ప్రియతమ మారిస్ గురించి మీకు తెలుసుగద. ఆయన తరచుగ అడుగుతుండేవారు. ఒకరోజు మారిస్ కొండపైనున్న భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్, నాకు సన్యాసం ఇవ్వండి. నేనీ ప్రపంచాన్ని పరిత్యజించి, ఆత్మసాక్షాత్కారము కోసము పాటు పడతాను", అన్నారు. భగవాన్ కరుణతో నిండిన గొంతుతో, సన్యాసం లోపల నుండి తీసికొనవలసినది, బయట నుండి కాదు అన్నారు. మారిస్‌ముఖము పాలిపోయింది. భగవాన్ తల్లివలె ఆయనవైపు చూచి ఇలా వివరించారు. "మీరు ఇప్పటికే సన్యాసిగానే ఉన్నారు. మీరు కాషాయ వస్త్రాలు ధరించాలి అని ఎందుకు అనుకుంటున్నారు?" మారిస్ వదలి పెట్టలేదు. ఆయన తరచుగ భగవాన్‌ను సన్యాసము ఇవ్వమని అడుగుతూనే ఉన్నారు. భగవాన్ సన్యాసము తీసికొనవలసిన అవసరము లేదు అని పదే పదే చెబుతూ ఉన్నారు. అయితే మేధావి అయిన మారిస్ ఊరుకుంటారా? ఆయన ఆనందాశ్రమంలోని స్వామి రామదాస్ అనే సాక్షాత్కారం పొందిన స్వామీజీ వద్దకు వెళ్ళి, ఎలాగో సన్యాసం ఇవ్వటానికి ఆయనను ఒప్పించారు. మారిస్‌కు నూతన నామధేయము ఇవ్వబడినది. ఆయనను స్వామి భారతానంద అనిపిలిచేవారు. మారిస్ స్వామిరామదాస్ గారికి సన్నిహితులైనారు. ఒకరోజు స్వామి రామదాస్ మారిస్‌తో, "మారిస్! భారతానందా! ఇదే నీ ఆఖరి జన్మము", అన్నారు. గొప్పమహనీయుడు కాబట్టి ఆయన మారిస్ గొప్పతనాన్ని గుర్తించారు.

ఒక దినము, భగవాన్ కొండదిగి వస్తూ ఉండగా, మారిస్ కాషాయవస్త్రములు, రుద్రాక్షమాలలు ధరించి ఆయన ఎదురుగ నిలబడ్డారు. ఆయనను చూస్తూనే భగవాన్ నవ్వడం మొదలు పెట్టారు. భగవాన్ చిరునవ్వుతో పక్కనున్న పరచారకునితో,

"హే, ఈయన సర్కస్‌లో బఫూన్ వలె ఉన్నారు," అన్నారు. మారిస్‌కు అర్థమైనది. తన జీవితం మొత్తం, అంతరంగంలో తను సన్యాసి వలెనే ఉన్నారు. అందువల్ల కాషాయ వస్త్రములపై మోజు కొద్ది సంవత్సరముల పాటు మాత్రమే ఉన్నది. సన్యాసము అంటే మమకారాన్ని వీడుటయే అని భగవాన్ అన్నారు. మారిస్‌కు ఎన్నడూ, ఏవిధమైన మమకారాలు లేవు.

కర్మాగారములో పనిచేసే సమయములో కూడా మారిస్ చాలా నియమబద్ధమైన, కఠోర జీవితం గడిపారు. ఆ రోజులలో ఆయనకు మూడు వేల రూపాయల జీతము ఇవ్వబడేది. ఆ రోజులలో అది చాలా పెద్ద మొత్తము. మారిస్ ఆ డబ్బును తీసికోకుండ, కార్మికులనిధికి ఆ ధనాన్ని ఇవ్వండి అని చెప్పారు. నిద్రించటం విషయానికి వస్తే, రాత్రిపూట షాపులు మూసి వేసిన తర్వాత, షాపు బయట అరుగుపై పడుకుని నిద్రపోయేవారాయన. ఈ బిగ్‌బాస్,. ఈ మొత్తం కర్మాగారానికి ఉన్నతాధికారి, భోజనం విషయమేమిటి? కార్మికులందరూ భోజనం కారియర్లతో, భోజనశాలకు వెళ్తున్నపుడు భిక్షాపాత్రతో, భోజన శాల ద్వారం వద్ద నిలుచునే వారాయన. అది భిక్షతో సన్యాసి జీవితం గడపవలెనే కోరికతోనే సుమా. మారిస్‌ను ఎంతగానో ప్రేమించే ఆ కార్మికులు, ఆయన పాత్రలో కొంత భిక్ష ఉంచే, లోనికి వెళ్ళేవారు. అంతే కాదు. మారిస్ తన దుస్తులను తానే కుట్టుకునేవారు. రాట్నంతో నూలనువడకి, ఆ నూలుతో తయారైన పైజామాలు, కుర్తాలు మాత్రమే ఆయన ధరించేవారు. తన చెప్పులను కూడా తనే తయారు చేసుకునేవారు. తన జీవిత విధానము గురించి గర్వపడే వారూ కాదు, కించపడే వారుకాదు. తను చాలా సంతోషంతో జీవితం గడిపేవారు.

భగవాన్‌తోటి, మారిస్ అనుబంధం సన్నిహితమైనదిగానూ, క్రమం తప్పకుండానూ ఉండేది. బిడ్డ తల్లిని ప్రశ్నించినట్లే, సాధన విషయంలో, మారిస్, భగవాన్‌ను అనేక ప్రశ్నలు అడుగుతుండేవారు. కేవలం సాధన పట్ల ఆసక్తితోనే ఆయన ప్రశ్నించేవారు. భగవాన్ ఓర్పుగా ఆయన ప్రశ్నలకు సమాధానములు చెబుతుండేవారు. ఈ ప్రశ్నోత్తరాల నన్నిటిని, జాగ్రత్తగా వ్రాసిపెట్టుకుని, భగవాన్‌చే సరిదిద్దించుకునే వారు. ఇదే 'మహర్షీస్ గాస్పెల్' అనే పేరుతో భగవాన్ 60వ జన్మదినమున 1939లో ప్రచురితమైనది. అప్పటినుండి అది నిజాయితీగా సాధన చేసేవారికి మార్గదర్శకంగా ఉన్నది. ఈరోజున కూడా అది, తీవ్రంగా సాధనచేసేవారికి ఎంతో ఉపయోగకరంగ ఉన్నది. నేను సాధకులకు మూడు పుస్తకాలను చదవమని చెప్తాను, మహర్షి ఆయన సందేశము (మహర్షి అండ్‌హిజ్‌మెసేజ్), వర్డ్స్‌ఆఫ్‌గ్రేస్ (అనుగ్రహ భాషణలు), మహర్షీస్ గాస్పెల్, (మహర్షి చరిత్ర). అలా భగవాన్‌తో సన్నిహితంగా మెలుగుతున్నపుడే, ఆయన అనేక చక్కని పద్యాలు వ్రాశారు. అందులో రెండు పద్యాలలో ఆయన ఇలా వ్రాశారు. ఇప్పటి వరకు నేను నిన్ను సంతోష పెట్టటానికే ఈ రంగస్థలంపై ఉన్నాను. నా కళ్ళు (నీ నాటకం యొక్క) నీ లీల యొక్క కాంతితో గ్రుడ్డివైపోయాయి. నీ నవ్వు యొక్క గొప్ప ధ్వనితో నా చెవులు దిమ్మెక్కి పోయినవి. నిజమైన దుఃఖం అనే జ్వాలలో నాగుండె బూడిదగా మారిపోయింది. ఓ ప్రభూ! నిన్ను సంతోష పెట్టటానికే నేను వెర్రివాడుగా మారాను. ఇప్పుడు నేను ఈనాటకంలో పాత్ర పోషణ వలన కలిగే దుఃఖాన్ని ఆపుకోలేకపోతున్నాను. ఓ ప్రభూ! నన్నీ నాటక రంగస్థలం నుండి దింపివేసెయ్యి. ప్రభూ! నేనీరంగస్థలం లోనికి దారినీ, దాని నుండి నిష్క్రమించే దారినీ మర్చిపోయాను." భగవాన్ ఆ పద్యాలను చదివి సంతోషించేవారు.

ఈ కథనము అచ్చు, కొన్నివందల సంవత్సరములక్రితం నివసించిన అప్పయ్య దీక్షితార్ అనే (మహర్షి)ముని వ్రాసిన దాని వలెనే ఉందని భగవాన్ అన్నారు. అప్పయ్య దీక్షితార్ పద్యాలు సంస్కృతములో తాటి ఆకులపై (తాళపత్రాలపై) వ్రాయబడ్డాయి. వాటి గురించి చాలా మందికి తెలియదు. ఆయన పద్యాలలో ఒక రాజనర్తకి, రాజుగారి ఎదుట నృత్యప్రదర్శన యిస్తున్న సన్నివేశం వర్ణించబడింది. రాజుగారు తృప్తి చెంది, ఆపు అని చెప్పేవరకూ ఆమె నృత్యం చేస్తూ ఉండవలసినదే. ఆ నర్తకి అవయవములు అలసిపోయి, నెప్పిపెడుతున్నాసరే, తనకు తానుగా నృత్యాన్ని ఆపే ప్రసక్తి లేదు. ఆమె యిలా దుఃఖిస్తుంది. ఓ ప్రభూ! నేననుభవించిన ఎన్నో జనన మరణాల వలన అలసిపోయాను. నీ కృపావీక్షణము ఒక్కటి చాలు, ఈ జనన మరణాలనే నాట్యాన్ని ముగించి, నాకు విముక్తి కల్గించడానికి." భగవాన్ ఒక్క నిముషము ఆగి అన్నారు," మారిస్ ఫ్రిడ్‌మన్ యిక్కడకు చెందినవారే. ఎందుకో ఆయన విదేశాలలో జన్మించారు. తిరిగి ఇక్కడకే చేరుకున్నారు. అలా కాకుంటే అప్పయ్య దీక్షితార్ వ్రాసిన పద్యాల వంటివే, ఆయన ఎలా వ్రాయగలిగారు? భగవాన్ మారిస్‌ను రంగస్థలం నుండి దిగిరమ్మని

పిలవకుండా, ఆయన నాటకాన్ని కొనసాగనిచ్చారు. మారిస్ ఒక కర్మయోగి. ఆయన చేయవలసిన సత్కార్యాలు చాలా ఉన్నవి. అందుకనే ఆయన ప్రపంచమనే నాటక రంగస్థలంపై, తన పాత్రపోషణను ఇంకా కొనసాగించ వలసి వచ్చింది. అందుకని మారిస్, కాలమాన పరిస్థితులతో పాటు సాగిపోతూ ఆ కర్మాగారంలో తీరిక లేని పనిలో కొనసాగారు.

అపాపంత్ అనే అవధ్ దేశపు యువరాజు, ఇంగ్లండ్‌లో చదువుముగించుకుని వచ్చిన పిదప, రాజ్యపాలనా దక్షతలో శిక్షణ పొందుట కొరకై మైసూరు మహారాజా వారి వద్దకు పంపించబడ్డారు. ఆయన శిక్షణలో భాగంగా, మారిస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఫ్యాక్టరీ సందర్శించవలసి వచ్చింది. అపాపంత్, నిదానంగా కుదురుగా ఉండే వ్యక్తి. ఆయన మారిస్ యొక్క మేధస్సునూ, అంకిత భావాన్నీ చూచి ఆయన పట్ల ఆకర్షితులైనారు. అదే విధంగా మారిస్ కూడా, అపాపంత్‌ను చూచి ఇష్టపడి. ఆయనకు ఆధ్యాత్మికతను గురించి చెప్పసాగారు. గ్రామాలను అభివృద్ధి చెయ్యవలసిన అవసరాన్ని గురించి, సైన్సును, టెక్నాలజీని గ్రామిణ జీవితంలోనికి తీసుకుని వెళ్ళి, గ్రామీణుల జీవితాలను, సుఖంగా సజావుగా సాగిపోయేటట్లు చేయవలసిన అవసరం గురించి ఆయన ఆ యువరాజుకు తెలియ జెప్పారు. అపుడు అపాపంత్, మారిస్‌ను, మీరు దయచేసి, మా రాష్ట్రానికి వచ్చి అయిదారు నెలల పాటు అక్కడ ఉండి, ఆ విషయాలలో మాకు మార్గదర్శకత్వం వహించండి అని కోరారు.

ఇది జరిగిన కొన్ని రోజులకు, మారిస్, అవధ్ యువరాజు అంతఃపురానికి వెళ్ళారు. నేను మీవద్దకు వచ్చేశాను. నేను బెంగుళూరులోని నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. నేను అవధ్ రాష్ట్రంలోని గ్రామాలకు సేవచెయ్యదలచాను, అన్నారు. ఆ యువరాజు ఒక్కసారిగా నివ్వెరపోయారు. ఏమి మాట్లాడాలో తెలియక ఇబ్బంది పడ్డారు. చివరకు, “ఈ రాష్ట్రమునకు, మీ వంటి పెద్ద ఇంజనీర్‌కు తగిన జీతము ఇచ్చేస్తోమత లేదు”, అన్నారు. మారిస్ తన సహజ ధోరణిలో ఇలా అన్నారు. నేను ఆ గదిలో నేలపై పడుకుని నిద్రించగలను. పని చేయటానికి మామూలు మేజాబల్ల చాలును. నడవటానికి నాకు కాళ్ళు ఉన్నవి. నాతోపాటు మిమ్ములను కూడా నడిపించి తీసికుని వెళ్తాను. మనిద్దరము కలసి అవధ్ రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేద్దాము. ప్రస్తుతం నాకు ఆకలిగా ఉంది. కొంచెం భోజనం పెట్టండి అని అడిగారు. మారిస్, టెలిగ్రామ్‌వలె చాలా క్లుప్తంగా, చాలా స్పష్టంగా మాట్లాడేవారు.

తానెక్కడ ఉన్నప్పటికీ, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా భగవాన్‌తో సంబంధముకలిగి ఉండేవారు మారిస్. దానిని బట్టి అంతరంగంలో ఆయన ఎల్లపుడూ భగవాన్ సన్నిధిలో ఉండేవారని మనకు అర్థమౌతుంది. భగవాన్‌కు వ్రాసిన లేఖల్లో ఒకదానిలో, మహర్షి గురించి నేను ఆలోచించినపుడేకాదు. నేను ఆయన గురించి ఆలోచించనపుడు గూడ, మహర్షి నాతోనే ఉంటారు. లేనిచో నేనెలా జీవించగలను?” అని వ్రాశారు. అపాపంత్, మారిస్ కలసి పనిచెయ్యడము ప్రారంభించారు. మారిస్ యొక్క ఆఫీసు, గ్రామంలోని పెద్ద చెట్టు క్రింద ఉండేది అంటే మీకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన సందర్శించిన పల్లెలలో ఆయన ఉంటూ, వాటి అభివృద్ధికై ఎంతో శ్రమించేవారు. గ్రామాలను అభివృద్ధి చెయ్యటానికీ, శక్తివంతం చెయ్యటానికీ, వాటికి స్వతంత్ర పరిపాలనాధికారం ఉండాలని గాంధీ అనుకునేవారని మారిస్ విని ఉన్నారు. మహాత్మాగాంధిని కలుసుకుని ఈ విషయాలలో మరిన్ని వివరాలను తెలుసుకోవటానికై ఆయన గాంధీ ఆశ్రమానికి వెళ్ళారు. మహాత్మాగాంధీ వెంటనే మారిస్‌తో మాట్లాడారు. గాంధీ, మారిస్‌ను ‘భారతానందా!’ అని మాత్రమే పిలిచేవారు. ఆయన సేవాశ్రమంలోని వారంతా కూడా అలానే పిలిచేవారు. మహాత్మాగాంధీ, మారిస్ కేవలం కష్టించిపని చేసే వ్యక్తి మాత్రమే కాదు, నూతన ఆవిష్కరణలు చెయ్యగల మేధావి కూడా అని తెలుసుకున్నారు. మారిస్ భారతీయ రాట్నమును (చరఖాను) వాడుతున్నారని విని, “ఇంకా ఎక్కువ శక్తి వంతంగా పనిచేసే రాట్నమును మీరెందుకు తయారు చెయ్యకూడదు?” అని ప్రశ్నించారు. మారిస్ వెంటనే ఒక కొత్త తరహా చరఖాను తయారు చేశారు. ‘ధనుష్ తక్లీ’ అని పిలువబడే ఈ కొత్త చరఖా విశేషమేమిటంటే, మామూలు రాట్నం ఉపయోగించడానికి అయ్యే శక్తితో దానికి మూడు రెట్లు నూలును తయారు చెయ్యవచ్చును. దానితో మహాత్మాగాంధీ మిక్కిలి సంతోషించారని వేరుగా చెప్పనవసరము లేదు.

మారిస్, భగవాన్‌తోగాని, మహాత్మాగాంధీతోగానీ, జిడ్డు కృష్ణమూర్తితోగాని, మరెవ్వరితోనైనా సరే ఉన్నపుడు, ఆయన పాటించే పద్ధతి, ఒకే విధంగా ఉండేది. మొదట వారిని ప్రశ్నించి విషయాలను తెలుసుకొనటం, పరిశోధించటం, ప్రతి విషయంలోనూ, నిజాన్ని నిగ్గుతేల్చుకుని. అప్పుడు, అంగీకరించి, అనుసరించడం లేదా ఆచరణలో పెట్టటము. ఆయన స్వభావము అటువంటిది. ఇదే పద్ధతిని ఆయన (75) డెబ్బై అయిదు గ్రామాలను సంస్కరించటానికి అవలంబించారు. చదువురాని నిరుపేద గ్రామీణులను ఆయన ఎంతో ప్రేమించి, వారిపట్ల ఎంతో కరుణతో ఉండేవారు. ఆ గ్రామీణులు ఈయన సన్నిధిలో ఉంటే పవిత్రులమైపోతాము అనుకునేవారు. వాళ్ళు ఆయనను 'స్వామీ' అని పిలిచేవారు. మారిస్ గ్రామాల్లో తాను చేపట్టిన కార్యక్రమాల్లో విజయం సాధించారు. మారీస్ జీవన విధానం గురించి భారతదేశం యావత్తు తెలిసిపోయింది. అప్పటికి మహాత్మా గాంధీ, భగవాన్ కూడా శరీరాలను వదలివేశారు. ఇది మారిస్‌కు అశని పాతంలా తగిలినప్పటికీ, ఈ జీవితమనే నాటకాన్ని కొనసాగించవలసినదే కనుక, తాము ప్రారంభించిన పనులకే పునరంకితమయ్యారు.

మారిస్, వారణాశికి, అక్కడగల జిడ్డు కృష్ణమూర్తి సంస్థలో ఉండటానికి వెళ్ళారు. ఆ చుట్టుప్రక్కల గల గ్రామాలలో సంస్కరణ కార్యక్రమాలను అమలు చేశారు. కృష్ణమూర్తి అనుయాయులు బౌద్ధమతాన్ని ఎంతగానో ఇష్ట పడేవారు. ఎందుకంటే బుద్ధుని బోధలు, కృష్ణమూర్తి బోధలు చాలా విషయాలలో పోలి ఉంటవి గనుక. అచ్యుత్ పట్వర్ధన్ వంటి, కృష్ణమూర్తి దీర్ఘకాలిక అనుయాయులు మారిస్‌తో బాగా సన్నిహితంగా మెలగసాగారు. అపుడు చైనాలోని కమ్యూనిస్టులు అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో ఉండటంతో, టిబెట్ సంక్షోభం మొదలైంది. ఈ సంక్షోభం సంగతి వినగానే మారిస్ కార్యచరణకు సిద్ధమయ్యారు. అప్పటికి అపాపంత్ సిక్కిమ్‌కు కొత్తగా గవర్నర్ అయ్యారు. ఏమాత్రము కాలం వృధా చెయ్యకుండా, మారిస్ సిక్కింకు వెళ్ళి అపాపంత్‌ను కలిశారు. మారిస్ ఎంతో ఉద్వేగంతో అపాపంత్‌తో ఇలా అన్నారు. "ఇప్పుడు మీరు నాకు చాలా ఉపయోగపడబోతున్నారు. మనము నిర్వహించవలసిన ఒక గొప్ప కార్యమిక్కడ ఉన్నది. ఎందుకంటే దలైలామాగారినీ, ప్రాచీన బౌద్ధమత వ్రాతప్రతులను, వేలాదిమంది టిబెట్ దేశీయులను మనము కాపాడాలి. వెంటనే మారిస్, అపాపంత్‌ను వెంట బెట్టుకుని, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలవటానికి ఢిల్లీకి వెళ్ళారు. మారిస్ చాలా చురుకైన వ్యక్తి కనుక, ఆ రక్షణకార్యక్రమాన్ని గురించి పకడ్బందీగా ఉండే ప్లాను తయారు చేశారు. దలైలామాను రక్షించటానికి తామే విధంగా పథకం రచించారో అచ్యుత్ పట్వర్ధన్, మారిస్, ఇద్దరూ నాతో చెప్పారు. టిబెట్ నుండి దలైలామాను తప్పించి, సురక్షితంగా భారతదేశం జేర్చటానికి, మారిస్ చేత రచించబడిన ఈ పథకాన్నే (బ్లూప్రింటునే) నెహ్రూ అమలు పరిచారు. వారు చైనా ప్రభుత్వానికి దలైలామా ప్రయాణించే విమానం గురించి తప్పుడు సమాచారము అందించి, భారత ప్రభుత్వం వేరే విధమైన ఏర్పాట్లు చేశారు.

దలైలామా, టిబెట్ నుండి తప్పించుకుని భారతదేశానికి జేరుకున్నపుడు వందలాది టిబెట్ దేశీయులు కూడా, భారతదేశం జేరుకున్నారు. దలైలామా, అనేక ప్రాచీన బౌద్ధమత వ్రాతప్రతులను తనతోపాటు తీసికుని వచ్చారు. అలా వేలాది వెలకట్టలేనటు వంటి ప్రాచీన బౌద్ధమత వ్రాతప్రతులు కమ్యూనిస్టు చైనా చేతులలో ధ్వంసం కాకుండా, కాపాడబడ్డవి. దలైలామా భారతదేశంలో అడుగుపెట్టగానే అచ్యుత్ పట్వర్ధన్ ఆయనను కలసి తమ పథకం వివరాలను ఆయనకు తెలిపేవిధంగా, మారిస్ పథకం రచించారు. కానీ దలైలామా తప్పించుకోవడం గురించి వ్రాయబడిన గ్రంథాలలో, గానీ, బౌద్ధవ్రాత ప్రతులు రహస్యంగా టిబెట్ నుండి ఇండియాకు చేరవేయబడిన సంగతులు వివరించే గ్రంథాలలో గానీ, ఎక్కడా, మారిస్ పేరు వ్రాయబడలేదు. మారిస్ అంత నిస్వార్థపరుడైన వ్యక్తిని పేరు ప్రతిష్టలపట్ల ఆకాంక్ష లేకుండా, తనను తాను పూర్తిగా మరుగు పరచుకునే వ్యక్తిని నేను ఎక్కడాచూడలేదు. మహర్షిస్ గాస్పెల్ అనే ఆయన పుస్తకం మొదట ముద్రింపబడినపుడు కూడా మారిస్ పేరు ఎక్కడా వెల్లడి చేయబడలేదు. ఇప్పటి పుస్తకాలలో మాత్రమే ఆయన పేరు కనపడుతున్నది. టిబెటన్ సంక్షోభకాలంలో, జవహర్‌లాల్ నెహ్రూ,నా చేతులు కట్టివేయబడ్డాయి. నేనేమీ చేయలేను," అని నిర్మొహమాటంగా చెప్పివేశారు. వెంటనే మారిస్ (భారతదేశం మొత్తం పర్యటించి) వందలాది టిబెట్ దేశ శరణార్థులకు వసతి కలిపించడానికి తన స్వంత డబ్బు ఖర్చుచేసుకుని భారతదేశం మొత్తం పర్యటించారు. చల్లని ప్రదేశాలను ఎంపిక చేసి ఐదుచోట్ల వాళ్ళకు ఆవాసం కలిపించారు.

భారతదేశంలో ఈనాడు వారు ప్రశాంతంగా జీవించగల్గుతున్నారంటే, అది ఈ తొలినాళ్ళలో యూదు మతానికి చెందిన మార్మికుడైన ఈ మహాత్ముని వలననే అయినప్పటికీ ఆయన పేరు వెల్లడి కాలేదు.

ఎటువంటి దుర్భర పరిస్థితులనైనా ఇట్టే చక్క దిద్దగల, మారిస్‌యొక్క శక్తి సామర్థ్యాలను తెలుసుకొన్న నెహ్రూ, మారిస్‌ను ఖాదీ ఉద్యమాన్ని చేపట్టి నడిపించవలసినదిగా కోరారు. దాని వలన ఆయన ముంబై వెళ్ళవలసి వచ్చింది. అక్కడ ఆయన తన పాత పరిచయస్థురాలైన మిస్. పెటిట్ అనే వృద్ధురాలితో కలసి ఉండేవారు. భగవాన్ నాకు మారిస్‌ను ముంబైలో కలుసుకునే అవకాశమిచ్చారు. అంతకు ముందు 1960 దశకంలో ఆయన ఆశ్రమాన్ని సందర్శించినపుడు నేను కలుసుకున్నాను. మరల రమణాశ్రమ పత్రిక అయిన 'మౌంటెన్‌పాత్'కు వాణిజ్యప్రకటనల ద్వారా డబ్బు ప్రోగుచేయుటకోసం 1970 దశకంలో, నేను ముంబై వెళ్ళినపుడు ఆయనను కలిశాను. అపుడు మారిస్ నాతో ఇలా అన్నారు." మీ శరీరం ఆశ్రమనిర్వహణ కార్యంలో నిమగ్నమై ఉన్నప్పటికీ, మీ హృదయం శుద్ధమైన ఎఱుకలో స్థిరపడి ఉండాలి. మీరు ఏమి చేస్తున్నాసరే. దానిని వదల వద్దు.

మేము వ్యక్తిగత సమావేశాల్లో చక్కటి చర్చలు చేసుకునేవారము. ఒకసారి మారిస్ నాతో చాలా ఆవేదనతో ఇలా అన్నారు. భగవాన్ మాతో కలసి భోంచేస్తూ, మాట్లాడుతూ, నడుస్తూ, నవ్వుతూ ఎల్లవేళలా మాకందు బాటులో ఉండే ఆ విలువైన సంతోషకరమైన రోజులలో, మేము పూర్తి ప్రయోజనాన్ని అందుకోలేకపోయాము. సత్యమే పుష్కలంగా అందరి మధ్యనా ఉండి, అందరికీ దానిని తీసికోవటానికి అవకాశము ఉన్నది. కానీ, నేడు రేపు అని జాగుచేస్తూ అలసత్వంతో బూటకపు సాకులతో, మమ్ములను మేము కట్టిపడ వేసుకున్నాము. అందువల్ల సాక్షాత్తూ సముద్రమే మా చెంత ఉన్నప్పటికీ కేవలం ఒక కప్పునిండా మాత్రమే తీసి కొనగలిగాము. మరొక సందర్భంలో నన్ను ప్రోత్సాహపరచటానికి ఆయన ఇలా అన్నారు. "చూడండి, భగవాన్ ఒక వ్యక్తికాదు. ఆయన, ఆయన బోధ ఒకటే. ఆయన బోధ రూపంలో ఆయన మీకు పూర్తిగా లభ్యమవుతూనే ఉన్నారు. మీరు ఏపనిలో నిమగ్నమయి ఉన్నా అంతరంగంలో 'ఎఱుక'ను ఆస్వాదిస్తూ ఉండండి ఆ 'ఎఱుకే' మన భగవాన్.

మారిస్ ముంబైలో నన్ను సుదీర్ఘమైన వ్యాహ్యాళికి, (షికారుకు) తీసుకుని వెళ్ళేవారు. ఆయన నాతో ఇలా అనేవారు. నేను మీకు కారును ఏర్పాటు చెయ్యను. మిమ్ములను బస్సులో కూడా తీసికుని వెళ్ళను. నాతో ఎక్కడకు వచ్చినా నడచి రావలసినదే అందుకు మీరు సిద్ధమేనా అని ఆయన ప్రశ్నించేవారు. నేను చేతులు జోడించి, "సత్యానికి చేరువలో ఉండటానికి నేను తటపటాయిస్తానా?" అన్నాను. ఆధ్యాత్మికంగా మారిస్ ఎంతో పెద్దవారు. కానీ భౌతికంగా ఆయన అయిదు అడుగుల ఎత్తు కూడా ఉండరు. ఆయన ప్రక్కన నడవటానికి ఎవరూ సందేహించరు. అలా ఒకరోజు, నడుస్తున్నపుడు మారిస్ నాతో," గణేశన్, ఈరోజు మిమ్ములను ఒక ప్రదేశానికి తీసికుని వెళ్తాను. అక్కడ నేను బీడీలు అమ్ముకునే ఒక సాధారణ వ్యక్తిని కలిశాను. మేము ఆ చోటుకు వెళ్తుండగా, మారిస్ ఇలా చెప్పసాగారు. "బీడీలు కాల్చే అలవాటున్న అనేక మంది ఆయనతో తమ కష్టాలను వెళ్ళబోసుకోవటం చూశాను. ఈ సామాన్య వ్యక్తి అచ్చు రమణ మహర్షి చెప్పినట్లుగానే వాళ్ళకు సమాధానాలు చెబుతున్నారు. రమణ మహర్షి గనుక మరాఠీలో మాట్లాడి ఉంటే, ఆయన కూడా, ఆ సమాధానాలనే ఇచ్చి ఉండేవారు. నేను నా షికారు ఆపి, శ్రద్ధగా ఆయన మాటలను వింటుండేవాడిని, బీడీలను అమ్ముకునే ఒక సామాన్య వ్యక్తి, ఏమాత్రమూ తడుముకోకుండా అటువంటి సమాధానాలు చెప్పటం చూస్తే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. నేను అక్కడికి ప్రతిరోజూ వెళ్ళి, ఆయన మాటలను వ్రాసుకునే వాడిని. తర్వాత నేను ఇంటికి వెళ్ళి, ఆ ప్రశ్నోత్తరాలన్నిటినీ, ఇంగ్లీషులోనికి అనువదించేవాడిని.

కానీ ఆయన అనుమతి తీసికొనకుండా, ఆపని చేస్తున్నందుకు ఆయనకు తప్పు చేస్తున్నట్లుగా అనిపించేది. (అపరాధ భావన ఉండేది) అందుకని తను చేస్తున్నదంతా ఆయనకు తెలిపి, తాను వ్రాసిన వాటి నన్నిటినీ మరాఠీ భాషలోకి తర్జుమా చేసి చెప్పారు. ఆయన సంతోషించి, కానీ, అలాగే వ్రాస్తూ ఉండు అన్నారు. ఇదే తర్వాత "అయామ్‌దట్" అనే పుస్తకంగా వెలువడింది. ఆ వ్యక్తి ఎవరోకాదు 'నిసర్గదత్త మహరాజు' గారే. తర్వాత నేను మహరాజ్‌ను కలసిన తర్వాత, మారిస్‌తో

ఇలా అన్నాను. అవును మీరు చెప్పినది అక్షరాలా సత్యం. ఆయన సన్నిధిలో ఉంటే నేను భగవాన్ సన్నిధిలోనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను అన్నాను. భగవాన్ బోధే ఆయన నోటి నుండి అప్రయత్నంగా వచ్చేస్తుంది. మారిస్ ఎల్లప్పుడూ నన్ను ప్రోత్సాహ పరచేవారు. "ఏదీ వచ్చి మహరాజ్‌కు మీకు జరిగిన సంభాషణను వివరించడి," అనేవారు. ఆయన ఇంకా ఇలా అనేవారు. ఆధ్యాత్మిక సాధకుడిగా మహర్షులతోనూ, మహాత్ములతోనూ సాంగత్యం చెయ్యటము, మీకు లోతైన అవగాహన రావటానికి తోడ్పడుతుంది. లోతులలోకి వెళ్ళి దానిని అనుభవించడానికి తోడ్పడుతుంది. చదవటం కేవలం మేధాపరమైన అవగాహననే యిస్తుంది. ఈ అనుభవపూర్వకమైన అవగాహన, వాళ్ళమాటలు నువ్వు అర్థం చేసుకున్నా,చేసుకొనక పోయినా, సాక్షాత్కారం పొందిన సద్గురువుల సన్నిధిలోనే జరుగుతుంది. ఈ విధంగా అంటు మహరాజ్ వద్దకు వెళ్ళమని నన్ను ప్రోత్సహించారు.

ఆయన చివరి దినాలలో నేను ఆయన వద్ద ఉండలేకపోయాను. భగవాన్‌కూ, నిసర్గదత్త మహరాజ్‌కూ కూడా భక్తుడైన ఒకరి ద్వారా, భగవాన్, మారిస్ అంతిమ సమయంలో ఆయనను కనిపెట్టి ఉన్నట్లు తెలుసుకుని సంతోషించాను. తన సేవలకు ప్రతిఫలంగా ఎక్కువ ఫీజు (రుసుము) వసూలు చేసే ఒక నర్స్ గురించి ఆయన నాకు చెప్పారు, ఆ నర్స్‌కు ఒక కల వచ్చింది. ఆ స్వప్నంలో కౌపీనం మాత్రమే ధరించిన ఒక సాధువు కనిపించి, ఆవిడకు చాలా స్పష్టంగా ఇలా చెప్పారు." నా భక్తుడు బాధలో ఉన్నాడు. వెళ్ళి ఆయనకు పరిచర్యలు చెయ్యండి" ఆ సాధువు మారిస్ ఇంటికి చేరుకొనడానికి అవసరమైన సమాచారమంతా చాలా వివరంగా చెప్పారు. ఆ స్వప్నంలో వివరించబడిన చోటుకు వెళ్ళి, ఆ నర్సు అక్కడ మారిస్ ఫ్రిడ్‌మన్‌ను చూశారు. కుమారి పెటైట్ అనే ఆవిడ వయసులో మారిస్ కన్నా పెద్దది. ఆ వృద్ధురాలు నిస్సహాయంగా, తన నెవరూ చూచే దిక్కు లేక ఉన్నది. ఆ నర్స్ వెంటనే వారికి సేవ చెయ్యడానికి తన సంసిద్ధతను తెలియచేశారు. కఠిన తరమైన నియమ బద్ధ జీవితానికి అలవాటు పడ్డ మారిస్ ఆవిడ సేవలను అంగీకరించలేదు. ఆమె నిరుత్సాహంతో తిరిగి వెళ్ళిపోతూ, గదిలో గోడమీద ఉన్న రమణ మహర్షి ఫోటోను చూశారు. ఆమె మారిస్ వైపు తిరిగి ఆశ్చర్యంతో, "ఈసాధువే నా కలలో కనిపించి మీ సంగతి చెప్పారు," అన్నారు. ఆ మాటలతో మారిస్ చలించిపోయి, అంటే నా గురువుగారే నా సంరక్షణ చూచుకోవడానికి వచ్చారన్నమాట అన్నారు. ఆయన చివరి క్షణం వరకూ ఆ నర్స్ ఆయనకు సేవలు చేశారు.

మారిస్‌ను తన గురువుగా భావించే అపాపంత్, మారిస్ చివరి రోజులలో ఆయన వద్ద ఉన్నారు. అపాపంత్ నాతో ఫోన్‌లో, "అపా, ఈ మహర్షి చనిపోతున్నారు. ఆయన మీగురించి అడుగుతున్నారు. ఎంతత్వరగా వీలైతే అంతత్వరగా మీరిక్కడకు రండి", అవి చిన్న గొంతుతో చెప్పారు, నేను అక్కడకు వెళ్ళే సరికి మిస్ పిటైట్, డాక్టర్, నర్స్, మారిస్ మందువేసుకోవడానికీ, ఆహారం తీసుకోవడానికీ అంగీకరించటల్లేదని నాకు ఫిర్యాదు చేశారు. వాళ్ళు మారిస్‌ను మందువేసుకోవడానికీ, ఆహారం తీసుకోవడానికీ ఒప్పించమని నన్ను ప్రాధేయపడ్డారు. కానీ మారిస్‌కు ఇష్టం లేని పనిని ఆయన చేత ఎవరైనా చేయించగలరా? ఆయన గదిలో ప్రతివస్తువూ ఎంతో పొందికగా, శుభ్రంగా, దేనిస్థానంలో అది అమర్చబడి ఉన్నది. నేను గౌరవ పూర్వకంగా ఆయనను సమీపించేటప్పటికి, ఆయన, "అపా, ఎవరు చనిపోతున్నారు?", అని అరచారు. మర్నాడు నన్నొకడినీ గదిలో ఉండమని మిగిలిన వారందరినీ, ఆయన బయటకు పంపివేశారు. అపుడు ఆయన ఇలా అన్నారు, "అపా, నాకు సంగీతం వినపడుతుంది. ప్రకాశవంతమైన కాంతి కనిపిస్తున్నది. ఎవరు చనిపోతారు? ఎవ్వరూ చనిపోవుట లేదు. ఈ వ్యాధిగ్రస్తమైన శరీరము నన్ను శ్రావ్యమైన, పొందికైన, సుసంబద్ధమైన అందము నుండి దూరంగా ఉంచుతున్నది. వాళ్ళు నన్ను ఈ శరీరంలోనే ఉంచేప్రయత్నాలు చెయ్యకుండా చూడు. ఇక ప్రశాంతంగా వెళ్ళు. మర్నాడు మేమందరమూ ఆయన మంచం వద్దనే ఉన్నాము. ఆయన మూడుసార్లు శ్వాస తీసుకుని "హరిః ఓమ్, హరిః ఓమ్, హరిః ఓమ్', అంటూ ప్రాణం విడిచారు. ఆయన వెళ్ళిపోయారు. నిసర్గదత్తమహరాజ్ కూడా ఆయన మంచం ప్రక్కనే ఉన్నారు. "మహారాజ్ మారిస్ ఎక్కడకు వెళ్ళ న్నారు? ఆయనకు ఏమి జరుగుతున్నది?" అని అడిగాను. మహరాజ్ ఇలా బదులిచ్చారు. "ఏమీ జరగటుల్లేదు. ఎవరూ చనిపోవటుల్లేదు. ఎందుకంటే ఎవరూ జన్మించలేదు కనుక. అప్పుడు నేనాయనను అడిగాను, "అలాగైతే ఈ దుఃఖము ఎందుకు? ఈ శూన్యము, ఈ పోగొట్టుకున్న బాధ ఎందుకు?" మహరాజ్ కరుణతో నావైపు చూసి," దుఃఖపడుతున్నది ఎవరు? అని ప్రశ్నించారు. నేను మౌనంగా ఉండిపోయాను. కొద్ది గంటలలోనే నిసర్గదత్త మహరాజుగారి సన్నిధిలోనే,

మారిస్ ఫ్రిడ్మన్ అని మనచే పిలువబడేవారి పార్థివ దేహం అగ్నికి ఆహుతి అయినది. ఆ అవశేషాలు, వాటి స్వస్థలానికి చేరుకున్నవి. గొప్ప భక్తుడైన మారిస్ ఫ్రిడ్మన్ తన మూలమైన అరుణాచలానికి చేరుకున్నారు.

ఒకసారి నిసర్గ దత్తమహారాజ్గారు, ఉండమంటే నేను వారి ఇంటిలో ఉన్నాను. నేను అక్కడ ఎనిమిది రోజులపాటు ఉన్నాను. ఉదయం ఎనిమిది గంటల నుండి పదిగంటలవరకూ, ఆయన పూజ చేసినంతవరకూ నన్ను ఆయన ప్రక్కనే కూర్చో మనేవారు. ఆయన పూజాస్థలంలో గొప్పమహాత్ములైన శ్రీరామకృష్ణ పరమహంస, బుద్ధుడు, ఏసుక్రీస్తు, రమణమహర్షి ఫోటోలు ఉండేవి. ఆఖరికి మారిస్ఫ్రిడ్ మన్ ఫోటోకూడా ఉండేది. మహరాజ్ ఆ ఫోటోలన్నిటికీ, గంధము, కుంకుమ, పెట్టి పూలమలలు వేసేవారు. ఆ కార్యక్రమము ఆయన చేస్తుండగా, ఒకరోజు నాలో నేను, "ఈయన ఎందుకిలా చేస్తున్నారు?" అనుకున్నాను. ఆయన నావైపు తిరిగి కరుణ నిండిన గొంతుతో "మారిస్ఫ్రిడ్మన్ ఒక జ్ఞాని. ఆయన ఒక మహర్షి, మహనీయుడు", అన్నారు. అది కాదనలేని నిజము. రమణ మహర్షి యొక్క, నిసర్గదత్త మహరాజ్గారి యొక్క బోధలను, మనకు అందజేసి, మారిస్ ఫ్రిడ్మన్ మనకెంతో మేలుచేశారు. వార్తలలోకి ఎక్కకుండ, ఎవరిదృష్టిలో పడకుండా, మరుగున పడి ఉండాలని కోరుకునే, అటువంటి మహనీయుని గురించి తెలుసుకోవడానికి, స్మరించుకోవడానికీ, మన మెంత అదృష్టవంతులము. 'మహర్షీస్గాస్పెల్' మొదటి ముద్రణలో ఆయన పేరు కూడా లేదు. నిజమైన సాధకులమైన మనము ఆయనను మన హృదయములోనే అంటిపెట్టుకుని ఉండాలి.



ఎస్.ఎస్.కోహెన్



ఎస్.ఎస్.కోహెన్ (సులేమాన్ సామ్యుఎల్ కోహెన్), భగవాన్ వద్దకు వచ్చిన అత్యంత మేధావంతులలో ఒకరు. ఇరాక్‌కు చెందిన ఈయన యూదుమతస్థుడు, 18సం॥ముల వయసులో, యోగుల జీవితాలలో జరిగే అద్భుత సంఘటనల గురించి ఉపదేశము పొందిన వారికి మాత్రమే ఉద్దేశించి వ్రాయబడిన ఒక పుస్తకము చదివారు. సత్యాన్ని అన్వేషించాలనే దృఢ నిశ్చయంతో ఉన్న ఆయన, తన జీవితమునే మార్చివేయగలిగిన ఆధ్యాత్మిక మహాపురుషునికై అన్వేషించి, అటువంటి వానిని కలుసుకొనడానికై తన సర్వస్వాన్నీ త్యజించాలని భావించారు.

ఆ సమయంలో మొదటి ప్రపంచ యుద్ధము మొదలైంది. అది ఆయనకు గొప్ప పాఠాన్ని నేర్పింది. శాంతి ఎప్పటికీ బయట దొరకదనీ, తనలోనే దొరుకుతుందని ఆయన తెలుసుకున్నారు. అప్పటి కింకా కౌమారావస్థలోనే ఉన్నప్పటికీ, ఆయన హృదయములో నుండి ఒక విశ్వాసము, ఆయనకు, తన జీవిత రహస్యమును వెల్లడి చేసే తాళపు చెవి భారతదేశములోనే ఉన్నదని తెలిపింది. దైవికంగా, ముంబైలో ఉన్న ఆయన సన్నిహిత మిత్రుడు తీవ్రంగా జబ్బుపడ్డారు. (దానిని మనము దైవికమని భావించినా, యాదృచ్ఛికము అని భావించినా, అది కేవలము గురు కృప మాత్రమే. సాధకుని జీవితములో యాదృచ్ఛికము అనేది ఉండదు.) ఆ స్నేహితుడు కోటీశ్వరుడు ఒక రోజు హఠాత్తుగా ఆయన స్టాక్స్, షేర్స్ అన్నీ పడిపోయినవి. కొద్ది కాలములోనే ఆయన సర్వసంపదలూ కోల్పోయి బికారిగా వీధిలో మిగిలారు. ఆయన తీవ్రంగా కృంగిపోయారు. ఆయన విశ్వసించదగిన తన స్నేహితునికి లేఖ వ్రాశారు. తనకు ఎంతో మేలు చేసిన ఆ గ్రంథమును, నిరాశతో కృంగిపోయిన తన మిత్రుడు కూడా చదవాలని ఆయన అనుకున్నారు. తాను చాలా పేద వారైనప్పటికీ, భారతదేశానికి వెళ్ళటానికి అదొక అవకాశంగా ఆయన భావించారు. ఆయన పదకొండు మంది బిడ్డలు కల కుటుంబంలో పెద్దబిడ్డ. ఆయన తండ్రి ఒక ఓడలో క్లీనర్‌గా పనిచేసేవారు. తండ్రిగారికి కుమారుడంటే ఎంతో ప్రేమ. కుమారుని యొక్క మనసు లోపలి కోర్కెను తెలిపినపుడు, తండ్రి తన యజమాని వద్దకు వెళ్ళి, బొంబాయిలో వెళ్ళే ఓడలో తన కుమారునికి పని ఇచ్చి, అతను బొంబాయి చేరుకోవడానికి సహాయపడవలసినదిగా కోరారు. కోహెన్ త్వరలోనే భారతదేశానికి ప్రయాణమైనారు. నిరుపేద అయిన కోహెన్ తండ్రి, కోహెన్ కు ప్రయాణం ఖర్చుల నిమిత్తం కేవలం ఒకే ఒక నాణేన్ని ఇవ్వగలిగారు. ఆ నాణేన్ని కోహెన్ జేబులో పెడుతూ, "వెళ్ళు, నీ ఆధ్యాత్మిక అన్వేషణలో సఫలుడివి అవుగాక !" అని ప్రేమతో దీవించారు.

ఆయన తన స్నేహితుని కలుసుకోవటానికి వెళ్ళారు. ఆ పుస్తకము, ఆయన స్నేహితుడు కృంగుబాటు లోనుండి కోలుకోవటానికి తోడ్పడింది. కానీ వారిద్దరూ, ఇంకా నిరుపేదలుగానే ఉన్నారు. కోహెన్ వద్ద ఒక్క నాణెము ఉన్నది. ఆ స్నేహితుని వద్ద అది కూడా లేదు. కష్టించి పనిచేసే స్వభావంగల కోహెన్, ఒక షాపులో గుమాస్తాగా జేరాడు. ఆయన మేధస్సుతో ఆయన ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉన్నట్లు గుర్తించారు. ఒక వర్గము వారు సుఖంగా, సంతోషంగా ఉంటారు. రెండవ వర్గము వారు, బాధతో ఉండి ఎపుడూ ఫిర్యాదులు చేస్తూ ఉంటారు. సంతోషంగా ఉండే వారి వద్ద రెండు అర్హతలు ఉన్నట్లు ఆయన గమనించారు. వారికి పుష్కలంగా డబ్బు, జ్ఞానము ఉన్నాయి. సంతోషంగా లేనివారికి డబ్బు లేదు. జ్ఞానమూ లేదు. అందుకని కోహెన్ జ్ఞానాన్ని సంపాదించుకుని, దాని ద్వారా డబ్బు సంపాదించు కోవాలనుకున్నారు. ఆయనకు డబ్బు కేవలం ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిరాటంకంగా, ఆధ్యాత్మిక సాధన సాగించుకొనటానికి మాత్రమే. ఆయన ఒక అంతగా ధన వంతుడు కాని, షాపు యజమాని వద్ద పనిలో జేరారు. ఆయన కోహెన్‌కు అకౌంట్సు వ్రాయటము నేర్పారు. కోహెన్ ప్రతిభాశాలి అని గుర్తించి తన అకౌంట్స్ మొత్తము ఆయనకు అప్పచెప్పారు. షాపు యజమాని. అంతేకాక చుట్టుప్రక్కల షాపుల యజమానులకు గూడా ఆయన గురించి సిఫార్సు చేశారు. కోహెన్ వారి అకౌంట్సు చూడడం మొదలు పెట్టారు. అచిరకాలంలోనే ఒక మంచి అకౌంటెంట్‌గా ఆ చుట్టుప్రక్కల ఆయన పేరు తెచ్చుకున్నారు.

ఇదిలా ఉండగా, కృంగుబాటులో నుండి కోహెన్ సాయంతో బయటపడ్డ స్నేహితుడు. థియోసోఫికల్ సొసైటీలో సభ్యుడుగా చేరారు. బొంబాయిలో జరిగే ఆ సంస్థ సమావేశాలన్నిటికీ కోహెన్‌ను తీసికుని వెళ్ళసాగారు. అక్కడ, ఆ సంస్థ అధ్యక్షురాలైన

అనీబిసెంట్‌ను ఆయన కలిశారు. ఆమె సునిశిత మేధస్సు, చేసే పనిపట్ల పూర్తి అంకితభావం, పనులను చక్కగా సమర్ధవంతంగా చెయ్యటం చూసి, ఆయన ఆకర్షితులైనారు. అప్పటికే కొన్నిసార్లు ఆమెతో ఆయన వ్యక్తిగతంగా సమావేశ మై ఉన్నారు. ముంబైకి వచ్చినపుడల్లా అకౌంట్స్ విషయంలో సాయపడటానికి అకౌంటెంట్ కోసం వెతుక్కుంటున్నారు. అనిబిసెంట్. ఆమె కోహెన్‌ను అకౌంట్స్ చూడటంలో సాయపడమని కోరారు. ఆమె కోహెన్ పనితనం చూసి సంతృప్తి చెంది ఆయనను చెన్నై లో ఉన్న తమ సంస్థ హెడ్‌క్వార్టర్స్‌కు (మాతృసంస్థకు) తీసికుని వెళ్ళారు. కోహెన్ అక్కడ అయిదు సంవత్సరాలు ఉండి, ఆ సమయాన్ని పూర్తిగా సద్వినియోగ పరుచున్నారు. చెన్నైలోని థియోసోఫికల్ సొసైటీలోని లైబ్రరీ, భారతదేశములోని అతి పెద్ద గ్రంధాలయాలలో ఒకటి. అక్కడ ఆయన వేదాంతమునకు సంబంధించిన పుస్తకాలను, ఇతర ఆధ్యాత్మిక గ్రంధాలను చదివారు. దైవం ఈ విధంగా మనలను నడిపిస్తారు. మహాత్ములు చెప్పినట్లు నువ్వు దైవము వైపు ఒక అడుగు వేస్తే ఆయన నీ వైపు తొమ్మిది అడుగులువేస్తారు. నేను అయిదు సంవత్సరాల పాటు భగవాన్‌కు అంత దగ్గరలో ఉండి, కనీసం ఆయన గురించి వినను కూడా లేదు అని కన్నీటి పర్యంతమవుతూ చెప్పారాయన.

ఆ రోజుల్లో వేల మైళ్ళ దూరాన ఉన్న ఆయన స్నేహితుడొకరు, పోస్టులో ఆయన కొక పుస్తకం పంపారు. అదే ఆయన జీవితాన్ని మలుపు త్రిప్పింది. ఆ పుస్తకం పాల్ బ్రంటన్ వ్రాసిన 'గుప్తభారతదేశంలో నా అన్వేషణ' అనే పుస్తకం. ఆ పుస్తకంలో ఎందరో మహాత్ముల గురించి వ్రాయబడినప్పటికీ, చాడ్విక్‌ను వలె ఈయనను కూడా రమణ మహర్షిని గురించి వ్రాసిన మూడు అధ్యాయాలు మాత్రమే ఆకర్షించినవి. ఆయనే నీ సద్గురువు అని ఆయన అంతర్వాణి చెప్పింది. ఆయన తన సామాను సర్దుకుని, ఏడువేల రూపాయల నిల్వతో తిరువణ్ణామలైకు బయలుదేరారు. పాశ్చాత్యుల దుస్తులను ధరించి 1936 ఫిబ్రవరిలో ఆయన రమణాశ్రమానికి వచ్చారు. ఆయన భోజనశాల లోనికి ప్రవేశపెట్టబద్దారు. అప్పుడే ఉదయపు ఫలహారము చేస్తున్న భగవాన్ తలపైకి ఎత్తకుండానే "దయచేసి వచ్చి ఫలహారము తినండి", అన్నారు. ఆ సంఘటన గుర్తు చేసుకున్నపుడు కోహెన్ కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యారు. అదే నా ఆధ్యాత్మిక యాత్రకు మొదలు, చివర కూడా అంటారాయన. లోనికి వెళ్లి కౌపీన ధారి అయిన భగవాన్‌ను చూడగానే, మానవ రూపం ధరించిన సత్యాన్ని తాను చూస్తున్నట్లు అనిపించి పారవశ్యంలో మునిగారాయన. కోహెన్ ఇంకా పారవశ్యంలో మునిగి ఉండగానే, భగవాన్ తన ఉదయపు వ్యాహ్యాళికి వెళ్ళి పోయారు.

భగవాన్ తిరిగి వచ్చి, పాత హాలులోనికి ప్రవేశించగానే కోహెన్ వెళ్ళి తన గురువుగారి ఎదుట కూర్చున్నారు. ఆయన లోపలనుండి పెల్లుబికి వచ్చే భావతరంగాలు, ఆధ్యాత్మిక పారవశ్యంలా రూపుదాల్చాయి. కోహెన్ ఇలా అన్నారు. "నేను ఒక్కడినే భగవాన్‌తో పాటు హాలులో ఉన్నాను. సంతోషము, శాంతినన్ను ఆవరించాయి. ఇంతకు ముందెన్నడూ కూడా, కేవలం ఒక వ్యక్తి సన్నిధిలో ఉన్నంత మాత్రాన, అంత పవిత్రతను అనుభవించడం అనేది నాకు జరుగలేదు. అప్పటికే నా మనస్సు భగవాన్ యెడల ధ్యానంలో మునిగిపోయింది. భగవాన్‌ని ఒక శరీరంగా అది భావించలేదు. అది ఎంత అందమైన శరీరమైనా సరే, ఆ శరీరాన్ని భగవాన్‌గా భావించలేదు. ఆ సత్యమే (లేదా సద్వస్తువే) (ఆ శరీరం ద్వారా) తన ఉనికిని ప్రస్ఫుటంగా తెలియచేస్తున్నట్లు అనిపించింది. కొంతసేపటికి, నేను పరిసరాల గురించిన ఎఱుకలోకి వచ్చేసరికి నావైపే లోనికి చొచ్చుకుపోయే చూపుతో పెద్ద కళ్ళతో మనసుకు ఊరట కల్గించే చిరునవ్వుతో, పసిపాప వంటి అమాయకత్వంతో భగవాన్ కనిపించారు. ఈ విధంగా కోహెన్ దొరికిపోయారు. (బోనులో చిక్కారు)

భగవాన్ ఎదురుగా కూర్చుని పూర్తిగా బాహ్యాన్ని మరిచిన కోహెన్, తాను ఇంకా దుస్తులు మార్చుకోలేదని గుర్తించారు. గురువుగారికి ఇవ్వటానికి తెచ్చిన పండ్లను సూట్‌కేసులో పెట్టటం గుర్తుకు వచ్చింది ఆయనకు. సూట్‌కేస్ తాళాల కోసం జేబులో వెతుకుతుంటే దొరకలేదు. అదే ముసుగులోని అదృష్టంలాగ అనిపించింది. ఏం చెయ్యాలో తెలియక కన్నులు మూసుకుని కూర్చున్న తరుణంలో ఉన్నట్లుండి తాళాలు తన ఒడిలో పడినట్లనిపించింది. రామస్వామి పిళ్ళై అనే భక్తుడు, ఆశ్రమము పని మీద స్టేషన్‌కు వెళ్ళారు. ఒక ప్రయాణికుడు స్టేషన్ మాస్టరుకు తాళపుచెవుల గుత్తిని ఇచ్చి, ఒక విదేశీయుడు కూర్చుని వెళ్లిన సీటులో అవి పడి ఉన్నవని చెప్పి బహుశ మీరు వీటిని అతనికి అందజేయ గలరు : అని చెప్పి వెళ్ళారు. స్టేషన్ మాస్టర్ వాటిని రామస్వామి పిళ్ళైకు ఇచ్చారు. రామస్వామి పిళ్ళై ఆశ్రమానికి తిరిగి వచ్చి, ఈ సంగతి చెప్పి,తాళపు చెవుల గుత్తిని భగవాన్‌కు అందజేశారు. భగవాన్ కోహెన్ వైపు చూపిస్తూ, "ఈ తాళపు చెవులు ఎవరివి? తప్పకుండా ఆయనవే," అన్నారు. రామస్వామిపిళ్ళై వాటిని కోహెన్

ఒడిలో పడవేశారు. ఇది భగవాన్ చేసిన అద్భుతంగాని అద్భుతం. కోహెన్, జీవిత రహస్యాన్ని తెలియబరచేతాళం చెవి భారతదేశంలో దొరుకుతుందని ప్రయాణం మొదలుపెట్టారు. దానిని కనుగొన్నట్లుగా ఆయనకు రూఢి అయింది.

అపుడు రమణాశ్రమంలోనే ఉంటున్న పాల్‌బ్రంటన్‌కు కోహెన్ ఒక లేఖ తెచ్చారు. పాల్ బ్రంటన్ కోసం గదులన్నీ వెతుకు తుండగా,ఒక గదిలో పాశ్చాత్య డాకరు, మేజాబల్ల వద్ద కూర్చుని ఏదో పుస్తకం చదువుతుండటం చూశారు. ఆయనను బ్రంటన్‌గా భావించి, "బ్రంటన్ గారూ శుభోదయం" అని పలుకరించారు. ఆ పాశ్చాత్యుడు, "నేను బ్రంటన్‌ను కాను. నేను మేజర్ ఎ.డబ్ల్యూ. చాడ్విక్‌ను," అని చెప్పారు. అప్పటికప్పుడే వారిద్దరూ మిత్రులైపోయారు. చాడ్విక్ చెప్పారు. పాల్ బ్రంటన్, చాడ్విక్‌లతో కోహెన్ సమావేశమై, ఆ చక్కని సత్సంగంలో గంటల తరబడి సద్గురువుని గూర్చి మాట్లాడుకుని, కొన్ని సందేహాలను తీర్చుకొనడానికి ప్రయత్నించారు. పాల్ బ్రంటన్, కోహెన్ ఇద్దరూ మేధావులే. ఫలితంగా ఇద్దరిమధ్య తీవ్ర వాగ్వివాదము జరిగింది. బ్రహ్మచర్యం గురించిన చర్చ అది. పాల్ బ్రంటన్‌కు, ఆధ్యాత్మికతకు, బ్రహ్మచర్యంతో పనిలేదని అభిప్రాయము. ఆధ్యాత్మిక సాధకునకు బ్రహ్మచర్యం అత్యంత ఆవశ్యకమైనదని కోహెన్ అభిప్రాయము. సాధకులకు, సాత్వికాహారము, బ్రహ్మచర్యము, సత్సంగము సహకరిస్తయ్యని కోహెన్ అభిప్రాయము. బ్రంటన్ అంగీకరించలేదు. అప్పుడు చాడ్విక్, "మీరిద్దరూ ఈ విధంగా వాదులాడుకోవటం ఎందుకు? భగవాన్ దగ్గర కెళ్ళి అడుగుదాం, పదండి, " అన్నారు.వారందరూ భగవాన్ దగ్గరకు వెళ్ళారు. చాడ్విక్ భగవాన్‌ను, "భగవాన్! ఆధ్యాత్మిక సాధకులకు బ్రహ్మచర్యము అవసరమా?"అని అడిగారు. భగవాన్ ఎప్పుడూ, సమస్యకు సమాధానమివ్వకుండా, సమస్యనే తొలగించేవారు. బ్రహ్మమును వీడకుండా ఉండటమే బ్రహ్మచర్యము. 'బ్రహ్మచర్యము' అనే పదమే, మీరు బ్రహ్మము నుండి వైదొలగగూడదని సూచిస్తున్నది. "నేను" లేదా 'అహం' అనే దాని నుండి విడివడకుండా ఉండుటయే ఆధ్యాత్మిక సాధకులకు అత్యంత ఆవశ్యకమైనది", అన్నారు భగవాన్.

అసలు సమస్యనే తొలగించివేసిన భగవాన్ సమాధానం విన్న కోహెన్, భగవాన్ బోధలన్నిటినీ చదవాలని అనుకున్నారు. ఆయన ఆశ్రమంలోనే శాశ్వతంగా ఉండిపోయి, భగవాన్ పుస్తకాలన్నిటినీ అధ్యయనం చెయ్యసాగారు. ఆయనకు ఈ ఆశ్రమంలో అన్నిటికంటే నచ్చిన విషయమేమిటంటే, ఇక్కడ ఏ విధమైన కట్టుబాట్లు లేవు. ఎవరూ కూడా, భజనలకు, సమావేశములకు, తరగతులకు ఆచారపరమైన పూజాది కార్యక్రమాలకు వెళ్ళి తీరాలని బలవంతం చెయ్యబడరు. సాధకునికి పూర్ణ స్వాతంత్రము ఉండటము కోహెన్ కు ఎంతగానో నచ్చింది. భగవాన్ ఇది ఎక్కువ ముఖ్యము. అది తక్కువ ముఖ్యము," అనే నిబంధనలు ఎప్పుడూ చెప్పేవారు కాదు. ఒక వ్యక్తికి ఏది అవసరమో అతనికే బాగా తెలుస్తుందని భగవాన్‌కు తెలుసు. కోహెన్ ఆశ్రమాన్నీ, అంతకు మించి ఏ విధి నిషేధాలూ విధించని భగవాన్‌నూ ఎక్కువ ఇష్టపడేవారు. భగవాన్ గురువులందరిలోకి సరళతములు.ఎప్పుడూ కూడా, తన శిష్యుల జీవితాలను నియంత్రించే విధంగా, నియమ నిబంధనలను ఏర్పరచ వలసిన అవసరమున్నట్లు ఆయన భావించలేదు. అందరిపై ఒకే విధమైన క్రమశిక్షణను రుద్దాలని ఆయన అనుకోలేదు. ఎందుకంటే ఏ నియమనిబంధనలతో పని లేకనే అత్యున్నతమైన, తనకు తానే వెల్లడి అయే సత్యాన్ని తనలోనే కనుగొన్నారు గనుక. సరియైన సమయంలో, మొగ్గ తొడిగి, పువ్వువికసించినట్లు, ఆత్మసాక్షాత్కారము దానంతట అదే లోన తరంగము వలె పెల్లుబికి విశదపడుతుందని ఆయన స్వీయ అనుభవము.

ఆ సమయంలో కోహెన్, కొందరితో కలిసి, ఆశ్రమ అతిధిగృహంలో ఉండేవారు. తాను సాధన చేసికొనడానికి అవసరమయిన ఏకాంతము, రద్దీగా ఉండే ఆ గదిలో దొరకదని భావించి, భగవాన్ వద్దకు వెళ్ళి ఆయన. "భగవాన్! నేను సాధన కొనసాగించుకొనుటకు, ఆశ్రమము బైట, ఒక కుటీరములో ఉండవచ్చునా?" అని అడిగారు. భగవాన్ ఆమోదాన్ని పొంది పల్లాకొత్తులో ఒక గుడిసె వేయించు కున్నారు ఆయన. కోహెన్ తీవ్రమైన ఆస్తమా పేషెంటు(రోగి) కనుక ఆ గుడిసె తడి ఆరే వరకు, అందులోకి వెళ్ళవద్దని ఆరేవరకు వేచి ఉండమని భగవాన్ సలహాయిచ్చారు. తాను ఆస్థమా పేషంటునని, భగవాన్‌కు ఎలా తెలుసా అని ఆయన ఆశ్చర్యపోయారు. తన గృహప్రవేశ ఉత్సవానికి, భగవాన్‌నూ, ఇతర భక్తులనూ ఆయన ఆహ్వానించారు. భగవాన్ కోహెన్ కుటీరంలోకి ప్రవేశించినపుడు తనకు కుర్చీగాని మరి ఏ ఇతర ఆసనము గానీ తెప్పించవద్దని భగవాన్ కోహెన్‌తో చెప్పారు. ఆయన అందరితో పాటు నేలపై చాపమీద కూర్చున్నారు. ఆ ఉత్సవము పూర్తయిన తర్వాత, భగవాన్ వెళ్ళి పోతున్న సమయంలో, కోహెన్ ఆయనను అనుసరించి,భావోద్రేకంతో ఆయనను ఇలా ప్రార్థించారు. "భగవాన్ ఈ శరీరానికి

గృహాన్ని ఇచ్చారు. నా ఆత్మకు (మనసుకు) కూడా శాశ్వతమైన (గృహాన్ని) స్థానాన్ని దయచేసి ఇస్తారా? (కలుగజేస్తారా?) దీని కొరకే నేను కుటుంబాన్నీ అన్ని ప్రాపంచిక వ్యవహారాలను వదలి ఇక్కడకు వచ్చేశాను. భగవాన్ నడుస్తూనే కొంత తడవాగిన తర్వాత కోహెన్ వైపు తిరిగి, "కోహెన్ నీ ధృడమైన విశ్వాసమే నిన్నిక్కడకు తీసికుని వచ్చింది. ఇంక సందేహానికి తావేది?" అన్నారు.

తన ఏడువేల రూపాయల నిల్వధనం పైన వచ్చే స్వల్పమైన వడ్డీనే ఆయన ఆదాయం. పల్లాకొత్తులో ఉంటుండగా, కొద్దిగా అన్నమును, ఏదో ఒక కూరను వండుకుని, భగవాన్ సన్నిధిలో ఉండుటకు ఆశ్రమానికి వెళ్ళిపోయేవారు. కేవలము మధ్యాహ్న భోజన సమయానికే ఆయన ఇంటికి వచ్చేవారు. తన జీవితం మొత్తంలో ఏనాడూ, రుచికరమైన భోజనం పట్ల తాను ఆకర్షితుడు కాలేదని, కోహెన్ నాతో చెప్పారు. కేవలం ఆకలిని తీర్చుకోవడానికి ఆయన భోంచేసే వారు కాని, రుచులతో జిహ్వ (నాలుక)ను తృప్తి పరచడానికి కాదు. ఒకసారి ఒక సంపన్నుడు, చాలా గొప్ప విందు భోజనాన్ని రమణాశ్రమంలో ఏర్పాటు చేశారు. కోహెన్, ఆ విందుకు ఆహ్వానింపబడలేదు. తాను వండుకున్న కొద్దిపాటి సాదాసీదా భోజనాన్ని తినటానికి కుటీరానికి వెళ్ళినపుడు, మొదటిసారిగా ఆహారం గురించి బాధపడ్డారు. అంతకు ముందు గానీ ఆ తర్వాతగానీ, ఆహారాన్ని గురించి ఆలోచించలేదని కోహెన్ నాతో అన్నారు. కానీ ఆ రోజున మాత్రం, "అక్కడ అందరూ అంత గొప్ప విందు భోజనాన్ని ఆరగిస్తుంటే ఇక్కడ నేను ఈ చాలీచాలని అన్నాన్ని తినవలసివచ్చింది", అని ఆయన బాధపడ్డారు. ఆ మధ్యాహ్నం భగవాన్ అటుగా వెళ్తూ కోహెన్‌ను "భోజనం చేశారా?" అని అడిగారు. "ఆ కొద్దిగా అన్నమూ, కూరా తిన్నాను?" అన్నారు కోహెన్, భగవాన్ ఇలా అన్నారు, "అన్నమూ, కూరానా? చాలా గొప్ప విషయం. నేను విరూపాక్ష గుహలో ఉన్నపుడు రోజుల తరబడి, ఏ విధమైన ఆహారము ఉండేదికాదు. కొన్ని రోజులు ఎవరైనా కొద్దిగా అన్నం తెచ్చేవారు. నేను ఆ అన్నానికి, నీటిని చేర్చి కలిపి, ఉప్పుకూడా లేకుండా తినేవాడిని. మీకు అన్నమూ, కూర, ఉప్పు, అన్నిటినీ మించి పెరుగూ లభిస్తున్నవి", ఆ రోజు తర్వాత తిరిగి ఎన్నడూ నేను ఆహారాన్ని గురించి ఆలోచించలేదు. గురువుగారితో కలసి జీవించడంలో ఉండే ప్రయోజనమిదే. ప్రతి లోపమూ వేరుతో సహాతొలగించబడుతుంది. గురువు గారితో జీవించడమే గొప్ప ఆధ్యాత్మిక సాధన.

ఆయన పగలంతా భగవాన్‌తో ఉండేవారు. కొన్ని సార్లు రాత్రిళ్ళు కూడా, గురువు గారితో ఉన్నపుడు ఆయన ఆధ్యాత్మిక శక్తిని నీవు గ్రహించాలి. రాత్రిపూట కొద్దిమంది మాత్రమే (నిజమైన) తీవ్ర సాధకులు ఉన్నపుడు, భగవాన్, పురాతన కాలానికి చెందిన మహర్షులను గురించీ, మహాత్ములను గురించీ, పురాణ గాధలనూ మాకు చెబుతుండేవారు. భగవాన్ మాట్లాడుతున్నా, మౌనంగా ఉన్నా, ఆయన సన్నిధి ఆధ్యాత్మిక శక్తితో నిండి ఉండేది. మేము ఆయన వంక చూస్తూ ఆ ఆధ్యాత్మిక శక్తిలో మునిగిపోవటానికి ఇష్టపడేవారము. సద్గురువు తోటి అంత సన్నిహితంగా ఉండడం అప్పటి తన ఆధ్యాత్మిక స్థితికి ఎంతో ఉపయోగకరంగా ఉండేదని ఆయన చెప్పారు. అది ఎలా ఉపయోగపడేది?" అని నేనడిగాను. మూర్ఖమైన ఆశల (అంచనాల) పై శక్తిని వృధా చేయటము, కృత్రిమ మైన విలువలకు ప్రాముఖ్యత ఇవ్వటము, వ్యర్థమైన విలువలేని ఆశయాలు పెట్టుకోవడం వంటి తెలివితక్కువ పనుల వలన హృదయానికి అయిన గాయాలను ఆశక్తి (మాన్పించేది) నయం చేసేది. భగవాన్ తన అనుగ్రహాన్ని నాపై వర్షించేవారు. నేను అంతకు ముందు అనుసరిస్తున్న (సాధనా) పద్ధతులను విడచివైచి, నేను ఆశలు పెట్టుకున్న నమ్మకాలన్నిటినీ వదలి వైచి, ఆధ్యాత్మికంగా ఆకలి గొన్న నాకు మార్గం చూపమని ఏ అరమరికలూ లేకుండా, ఏ షరతులూ, దాపరికాలు లేకుండా పూర్ణ శరణాగతి పొందాలనే గాఢమైన తపన అకస్మాత్తుగా నన్ను ముంచివేసింది. ఆ క్షణాన్నే, నా ప్రారబ్ధ కర్మనీ, నా సర్వస్వాన్నీ (నేను అనబడే దాని నంతటినీ) నా సద్గురువు భగవాన్ రమణ మహర్షి చేతులలో (అప్పగించాను) పెట్టి వేశాను.

మూడు సంవత్సరముల కఠోరమైన సాధన జరిగిపోయింది. ప్రతి రెండవ దినమున (రోజు మార్చిరోజు) ఆయన ఎనిమిది మైళ్ళ గిరిప్రదక్షిణ చేసేవారు. "ఎందుకు?" అని నేనడుగగా, " ఆ ప్రదక్షిణ చేసే మూడుగంటల సమయంలోనూ, ఏ ఆలోచనా ఉండేదికాదు. కేవలము హృదయం మీదే దృష్టి ఉండేది. భౌతిక పరమైన, మానసికమైన కారణలేవీ గూడా, దృష్టిని హృదయం మీద నుండి మళ్ళించేవి గాదు. ఆ పవిత్రమైన గిరి, నీ ధ్యాసను ఎటువంటి అడ్డంకీ లేకుండా, అత్యంత సులభంగా, హృదయంపై నిల్పడానికి సహాయపడుతుంది. అది ఆయనకు అంతరంగికమైన మౌనాన్ని, ఏకాంతాన్ని దృఢపరచుకొనడానికి తోడ్పడింది. బాహ్యమైన విషయాలు ఆయనను ఆకర్షించి, ఆయన దృష్టి మరల్చుతున్నపుడు, ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, "నేను, నా

సాధనను తీవ్రతరం చేసుకోవాలనుకుంటున్నాను. అందుకొరకు నేనొక యాత్రకు వెళ్ళవలెననుకుంటున్నాను." అన్నారు. భగవాన్ "దానికి అవసరమైన ఏర్పాట్లను చేసుకున్నారా?" అని అడిగారు. కోహెన్ ఇలా బదులిచ్చారు."భగవాన్! నేను ఏ ఏర్పాట్లనూ చేసుకోలేదు. నేను సాధువువలె వెళ్తున్నాను. నేను భారతీయుడి వలె దుస్తులు ధరిస్తాను. శాఖాహారాన్ని భుజిస్తాను. ఆలయాలూ, పవిత్రమైన ప్రదేశాలూ దర్శిస్తాను. ఏకాంతంలో ఉంటూ నా ధ్యాసను హృదయంపై నిలిపి ఉంచుతాను".

కోహెన్ దక్షిణ భారతదేశమంతా సందర్శించారు. ఎన్నో ఆలయాలను ఆయన దర్శించారు. మారిస్ ఫ్రిడ్‌మన్‌వలె కోహెన్ కూడా, లోతుగా తరచి ప్రశ్నిస్తూ, ఆధ్యాత్మిక సాధనలో హేతు బద్ధమైన వైఖరిని పాటించేవారు. మొదటగా ఆయన మేధావి. మేధస్సు మనస్సు యొక్క నేత్రం కనుక, అది సాధకునికి ఆత్మను గురించి, ఖచ్చితమైన పరిపూర్ణమైన పరిజ్ఞానాన్ని పొందటానికి తోడ్పడుతుంది. కానీ అది ఎన్నటికీ, అణువంతైనా అనుభవాన్ని రుచి చూపించలేదు. ఆ సమయంలో, సాధకుడు నిరాశా నిస్పృహలకు లోనౌతాడు. అతడు మహా అయితే శూన్యాన్ని అనుభవించగలడు. అందువలన అతనిలో ఒక రసహీనమైన (వెలితి) స్థితి కలుగుతుంది. సద్గురువు (మహర్షి) ఆ లోపాన్ని గమనించి, దానిని అధిగమించటానికి సాధకునికి తోడ్పడతారు. అలా తోడ్పడే మార్గాలలో, యాత్రకు వెళ్ళమని సూచించడము ఒకటి. అటువంటి ప్రయాణాలలో, సాధకునికి, తన అంతరంగంలో కేవల విషయ పరిజ్ఞానము, అనుభవంగా మార్పు చెందడాన్ని గమనించడానికి అనేక అవకాశాలు లభిస్తాయి. కోహెన్‌ను దక్షిణ భారతదేశ యాత్రకు అనుమతించడము ద్వారా, కోహెన్ సాధనలో ఏర్పడ్డ లోపాన్ని అధిగమించడానికి తోడ్పడ్డారు భగవాన్. ఇది కోహెన్ ఆధ్యాత్మిక జీవితంలో గొప్ప మార్పును తీసికుని వచ్చింది. తాను విజయవంతంగా, ఆ రసహీనమైన (అనుభవ శూన్య) స్థితిని అధిగమించి, హృదయంలోని 'అహం స్ఫురణను' అనుభవంలోనికి తెచ్చుకున్న వైనాన్ని ఈ విధంగా నాకు వివరించారు కోహెన్

ఆయన యాత్రా సమయంలో, కేరళలోని ఆనందాశ్రమంలో స్వామి రామదాస్‌ను ఆయన కలుసుకున్నారు. ఎల్లప్పుడూ రామనామాన్ని గానం చేస్తూ, స్వామి రామదాస్ ఆనందసాగరంలో మునిగి తేలుతుండేవారు. రమణుల సన్నిధిలో ఆత్మ సాక్షాత్కారం పొందిన ఆయన సన్నిధిలోని వాతావరణము అంతా సంతోష తరంగాలతో నిండి పోయి ఉండేది. మొదటిసారిగా, భక్తి అంటే ఏమిటో, అంతరంగికమైన స్వచ్ఛమైన ఆనందం అంటే ఏమిటో కోహెన్‌కు తెలిసింది. ఆనందాశ్రమం నుండి వెలుపలకు వచ్చినపుడు, ఆయన సంతోషంతో నిండి ఉన్నారు. కానీ ఆయన తన జ్ఞాన మార్గాన్ని వీడలేదు. ఆయన కన్యాకుమారికి వెళ్ళారు. అక్కడ భగవాన్ నుండి దూరంగా ఉన్నాను అనే బాధ ఆయనను పీడించసాగింది. సముద్రపు ఒడ్డున ఇసుకలో పడుకుని, ఆయన ఈ విధంగా రోదించ సాగారు. "ఓ భగవాన్! మీరెంత గొప్పవారు. ఎంత ఉన్నతమైనది, సర్వత్రా వ్యాపించి ఉన్నది, మీ మచ్చలేని స్వచ్ఛత. దేని తోనూ పోల్చలేని మీ సద్గుణాలను, మీ నెమ్మదితనాన్ని మీ మాటల మధురిమను, చల్లటి ఆహ్లాదకరమైన మీ చిరునవ్వు, ప్రశాంతమైన, ఆరాధనీయమైన ముఖాకృతి, సర్వత్ర వ్యాపించి యున్న మీ ప్రేమ యొక్క ప్రకాశము, ఆఖరికి జబ్బుపడిన వీధిలో తిరిగే జంతువులతో సహా అన్ని జీవులను (ప్రాణులను), మానవులను ఒకే విధంగా చూడగల మీ సమదృష్టి, వీటన్నిటి గురించి, మీ శిష్యులమైన మేము ఎంత చక్కగా చెప్పుకుంటామో, స్మరించుకుంటామోగదా.

అలా గురువు కొరకు తపన చెందుతూ, ఆయన రమణాశ్రమానికి, తిరిగి వచ్చారు.భగవాన్‌కూ ఆయన భక్తులకూ జరిగే సంభాషణలను ఆయన వ్రాసుకోవడం మొదలు పెట్టారు.అప్పట్లో సంభాషణలు వ్రాసుకోవడానికి వీలులేదని నిబంధన ఉండుటచే, ఆయన అక్కడ జరిగే సంభాషణలన్నింటిని జాగ్రత్తగా గుర్తుపెట్టుకొని, తన గదికి వెళ్ళిన తర్వాతనోటు బుక్కులో వ్రాసుకొనేవారు. ఈ నోటు పుస్తకమే తర్వాతి కాలంలో, 'గురురమణ' అనే గ్రంథంగా అచ్చయింది. భగవాన్ జీవితంలోని చివరి రెండు సంవత్సరాలలోనూ, ఆయన జబ్బును గురించిన వివరాలన్నింటిని, తన డైరీలలో వ్రాసి ఉంచారు. ఆయన హోమియోపతి గురించి తెలిసిన వ్యక్తి కనుక, భగవాన్‌కు జరుపబడిన వివిధరకాలైన వైద్యముల గురించి, జరిగిన శస్త్ర చికిత్సల గురించి వివరంగా వ్రాయగల్గిన పరిజ్ఞానం ఆయన కున్నది. అపుడు ఆయనకు ఆత్మానుభూతి వల్ల లభించే ఆనందం అప్పుడప్పుడు అనుభవం కాసాగింది. అది లభ్యమవటానికి ఆయనకుచాలా సమయం పట్టింది. కానీ, మేధావి గనుక ఆయనకు ఇంకా సందేహాలుండేవి. 'ఆత్మసాక్షాత్కారము' హఠాత్తుగా, ఒక్కసారిగా జరుగుతుందని ఆయన పవిత్రగ్రంధాలలో చదివారు. ఆయన భగవాన్ వద్దకు, "భగవాన్! ఆత్మసాక్షాత్కారము ఒక్కసారిగా అకస్మాత్తుగా జరుగుతుందని పవిత్రగ్రంధాలు చెబుతున్నవి గదా!"

అన్నారు. భగవాన్ కోహెన్ వైపు చూసి చిరునవ్వు నవ్వి, "అవును. కానీ, దానికి ముందు తగిన పరిపక్వత రావాలి. అది చెట్టున ఉన్న కాయ పరిపక్వమయినట్లుగా నిదానంగా జరుగుతుందని మరువరాదు", అన్నారు.

ఆయన 1950, ఏప్రిల్ 12 వ తేదీన భగవాన్ నిర్యాణానికి రెండు రోజుల ముందు ఇలా వ్రాశారు. అది కల్పావసాన సమయమువలె, సర్వజనవిచారణ దినము (The day of the final Judgement) నకు ముందు రోజు సాయంత్రము వలె అన్పించింది. ఏ దినమునైతే మా జీవిత సర్వస్వాన్నీ కోల్పోబోతున్నామో, మాకు నీడ, మా ఆశ, మా విలువైన సంపద, మా ప్రేమ పెన్నిధి అయిన మా సద్గురువు గారి అత్యంత విలువైన జీవితం, అంతం అవబోతున్న రోజుకు ముందు రోజు, ఏమో ఈ దినం అనిపించింది. మహర్షి తెలివి గానే ఉన్నారు. అప్పుడప్పుడు మాట్లాడుతున్నారు. కానీ చివరి క్షణం వరకు, ఆయన ఏమీ అడగరు. తనకు ఏమి చేయాలో, ఏమి చెయ్యకూడదో కూడా సెలవివ్వరు, ఏ బాధగురించీ చెప్పుకోరు. నెప్పిగా ఉన్న చోట పట్టుకుంటేనో, ఆయన శరీరాన్ని ఎత్తినపుడో తప్ప. అప్పుడు, కేవలం ఉన్న భౌతిక స్థితిని తెలియ చెయ్యటం కోసం, "అంటుకుంటే నెప్పిలేని ప్రదేశం లేదు," అని అన్నారు. అపుడు పరిచారకుడు ఆయనను పట్టు కునేటపుడు మరింత జాగరూకత తో ఉన్నారు. ప్రత్యేకించి నొప్పి తీవ్రతరంగా ఉన్న ఈ రోజున.

భగవాన్ శరీరాన్ని వదలిన పిమ్మట, ఎన్నో కొట్లాటలు, యాజమాన్యం అంటే శతృత్వము మొదలైనాయి. ఎక్కువ మంది భక్తులు వెళ్ళిపోయారు. 1950,51 సంవత్సరములలో ఆశ్రమ పరిస్థితి, ఎంతో సంకటావస్థలో ఉంది. ఉదయపు ఫలహారము, టీ, కాఫీలు లేవు. కేవలం మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం మాత్రమే ఉన్నవి. త్వరలోనే సర్వాధికారి నిరంజనానందస్వామి కూడా శరీరాన్ని వదలివేశారు.

మా తండ్రిగారు, తర్వాత అధ్యక్షులు అయినారు. ఆయనకు ఇంగ్లీషురాదు.అవసరమైన ఉత్తరాల నన్నిటినీ వ్రాసిపెట్టటం, ఆశ్రమమునకు వ్యతిరేకంగా కోర్టులో దాఖలైన అనేక వ్యాజ్యాలకు అఫిడవిట్స్ (ప్రమాణ పూర్తిగా జడ్జిగారి యెదుట వ్రాసి ఇవ్వవలసిన పేపర్లు) వ్రాసి ఇవ్వటము, ఆశ్రమము స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉండటానికి, కోహెన్ ఎంతో సహాయ కారి అయ్యారు. అన్ని పనులూ పూర్తి అయిన తర్వాత, శ్రీమతి తలైయార్ ఖాన్‌తో తాను ఉమ్మడిగా వాడుకుంటున్న కుటీరాన్ని ఆమెకు ఇచ్చేశారు. ఆయన నిజమైన సన్యాసి. ఆయనకు మా తండ్రిగారి స్థలం (పక్కన చిన్న జాగా) ఉన్నది. దానిని ఏ షరతులూ లేకుండా తన తదనంతరము మా తండ్రి గారికి చెందునట్లు వీలునామా వ్రాశారు. ఆశ్రమము మీద భారంగా ఉండటము ఇష్టములేక, వెల్లూరుకు వెళ్ళి అక్కడ ఉండిపోయారు. "మీరు అరుణాచలాన్ని వదలి ఎందుకు వెళ్ళిపోయారు ?" అని నేను ప్రశ్నించగా, "నాకు ఆస్థమా బాగా ఎక్కువ అయింది. వెల్లూరు అక్కడి నుండి కేవలం (52) ఏబదిరెండు మైళ్ళే అయినప్పటికి, ఇక్కడి వాతావరణము, నా ఆరోగ్యానికి అనుకూలముగా ఉన్నది", అన్నారు.

ఆయన వ్రాసిన 'గురురమణ' అనే గ్రంథము తయారైనప్పటికీ, ఆశ్రమము వద్ద నిధులు లేక దానిని ప్రచురించ లేకపోయింది. అందుకని ఆయనే స్వయంగా దానిని అచ్చువేయించారు. 1952లో నేను ఆ గ్రంథాన్ని ఆశ్రమప్రచురణగా అచ్చువేయించుటకు, వెల్లూరు వెళ్ళి ప్రచురణ హక్కులను ఆశ్రమానికి ఇమ్మని కోరాను. ఆయన అంగీకరించారు. 1962లో 'గురురమణ' గ్రంథము యొక్క రెండవ ముద్రణ జరిగి నప్పుడు, ఏ కారణమూ లేకుండానే, నేనొక ప్రతిని, భగవాన్‌కు అత్యంత భక్తురాలైన దోరబ్ గారి అక్కగారికి పంపాను. ఆ సమయంలో ఆమె తీవ్రమైన కుటుంబ సమస్యలతో బాధపడుచున్నారు. ఆమె ఒక చిన్న గదిలో భగవాన్ ఫోటోను పెట్టుకుని పూజించేవారు. ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, దానికి అంగీకరించక ఆ ఫోటోను అవతల పారవేయమని చెప్పారు. ఆమె వాళ్ళతో ఇలా చెప్పారు." మీరు నన్ను ఏమైనా చెయ్యండి. నాకు భగవాన్‌ను పూజింపటానికి అరగంట టైమివ్వండి." ఆమెకు ఆ అవకాశము గూడా ఇవ్వబడకపోవడంతో, ఆమె ఆ గదిలోనికి వెళ్ళి తలుపులను బంధించుకుని భగవాన్‌ను నిలదియ్యటం ప్రారంభించారు. ఆమె "భగవాన్, మీరున్నారని, మీరే నా గురువు అనీ ఋజువు చెయ్యండి".

ఆమె పెద్ద అపార్టుమెంటుకు నేను వెళ్ళాను. ముందు వాకిలి తలుపుకూ నేలకూ మధ్యన ఒకటి, రెండంగుళాల ఖాళీ ఉన్నది. ఆమె ధ్యానం చేసుకునే గదికి కూడా అలాగే ఖాళీ ఉన్నది. పోస్టుమాన్ ఆ ఖాళీగుండా, నేను పంపిన పార్శిల్‌ను ఆ సందులో గుండా విసిరారు. అది తిన్నగా ఆమె గదిలోకి వెళ్ళి ఆమెకు గట్టిగా తగిలింది. ఆ విసురుకు ఆ పార్శిల్ చిత్రంగా తెరుచుకుంది.

ఆమె క్రిందకిచూసేసరికి, 'గురురమణ' అనే శీర్షిక కనిపించింది. ఈ రోజుకు కూడా అంతమంది భక్తులలో ఆవిడ ఒక్కరికే ఆ పార్శిల్‌ను ఎందుకు పంపానో నాకు తెలియదు.

వెల్లూరులో కూడా కోహెన్ స్వతంత్ర జీవితాన్ని గడిపారు. ఆయన ఎవ్వరినీ ఏ విధమైన సాయమూ కోరలేదు. ఆయన చాలా పొదుపుగా జీవించేవారు. ఎవరైనా సాధకులు ఆయన ఇంటికి వచ్చినపుడు, వారికి భగవాన్ గురించిన కథలనూ, భగవాన్ బోధలనూ చెప్పేవారు. భక్తులలో ఒకరైన దోరబ్ ఫ్రేమ్‌జీ, ఆయనను తరచుగ సందర్శించేవారు. ఒకసారి ఆయన వచ్చినపుడు కోహెన్, కన్పించలేదు. ఆయన కోసము వెతుకగా, కోహెన్ బాత్‌రూమ్‌లో పడి ఉన్నారు. పైకి లేచే శక్తి లేక ఏడు గంటల పాటు ఆయన అలాగే పడి ఉన్నారు. దోరబ్‌జీ ఆయనను రమణాశ్రమమునకు ఎదురుగా ఉన్న రమణనగర్‌లోని తన ఇంటిలో ఉంచి, నన్ను ఆయనకు భోజనం పంపమని కోరారు. ఒక సంవత్సరము గడచిన తరువాత,ఆయన మరల బాత్‌రూములో పడిపోయి, చాలా గంటలపాటు, ఎవరూ చూడక అలాగే ఉన్నారు. అదృష్టవశాత్తూ దోరబ్‌జీ ఆ రోజుననే తిరువణ్ణామలై వచ్చి కోహెన్ బాత్‌రూమ్‌లో పడి ఉండటాన్ని కనుగొన్నారు. ఆయన పరుగెత్తుకుంటూ నా వద్దకు వచ్చి, "ఆయనను తోడులేకుండా వంటరిగా మనము వదల కూడదు. ఆయనను ఆశ్రమములో ఉండనివ్వండి", అన్నారు. ఆశ్రమంలో ఆయన ఒకసారి మంచంపై నుండి క్రిందపడి తన కాళ్ళు విరిగిన వని భావించారు. నేను ఎముకల డాక్టర్లనూ, (ఆర్థోపెడిక్ సర్జన్) ఆయుర్వేద డాక్టరునూ తీసుకుని వచ్చి ఆయనను పరీక్ష చేయించాను. ఆయనను పరీక్షించిన పిదప, ఏమీ విరగలేదని వాళ్ళు తేల్చారు. కానీ కోహెన్ తన కాళ్ళు విరిగిపోయినవనీ, తానిక నడువలేననే అభిప్రాయానికి వచ్చారు. నేను ఆయనకు ఒక చక్రాల కుర్చీని తెప్పించి, ఆయనకు చివరి వరకూ సేవచేయటానికి కన్నన్ అనే పరిచారకుణ్ణి నియమించాను.

కోహెన్ నా పట్ల ఎంతో దయగా ఉండేవారు. సాయంత్రము అయిదు గంటల తర్వాత నేను ఆఫీసులో పనిలో మునిగిపోయి ఉంటే, ఆయన వచ్చి, ఇక పని ఆపెయ్యమని నన్ను కోరేవారు. నేను అంగీకరించకపోతే ఆయన నన్ను కోప్పడేవారు. "ఏమిటి ఈ పనంతా? నువ్వు ఇక్కడకు సాధన చేసుకోవడానికి వచ్చావు. మనము ఇక్కడకు మన సద్గురువు కోసము వచ్చాము. ఈ సంస్థకూ, గురువుకూ చేసే సేవ అంతా కూడా, నీకు పేరు, ప్రఖ్యాతులను సుఖాలనూ సమకూర్చవచ్చును. కానీ నువ్వు (ఆత్మసాక్షాత్కారానికి) ఏ మాత్రము చేరువ కాలేవు. మేలుకో గణేశన్! నేను మేల్కొన్నట్టు మేలుకో. నేను చాలినంత సేవచేసి ఏకాంతంలోకి వెళ్ళిపోయాను. నువ్వు ఏకాంతంలోకి వెళ్ళు, సాధనలోకి ఉరుకు, ఆయన తరచుగా నాతో ఇలా చెప్పుండేవారు, "ఈ ఊహాత్మకమైన నమ్మకాలతో భ్రమలో ఉండవద్దు. నువ్వేదో ఆశ్రమానికి సాయపడుతున్నాననో, గురువుకు సేవ చేస్తున్నాననో భావించవద్దు".

కారణాలేమో తెలియవుకానీ, ఆయన చివరి దినాలలో ఆయనకు మతి స్థిమితం తప్పింది. ఆఫీసులో పని ముగించుకుని, ఆయన గదికి ఎప్పుడు వెళ్ళినా, ఆయన పదేపదే నాతో ఇలా చెబుతుండేవారు, "జాగ్రత్త. తిరిగి వెళ్ళిపోయి సాధన చేసుకో. ఈ పని నీకేమీ ఉపయోగపడేదికాదు. నేను నీపట్ల గల ఆసక్తితో చెబుతున్నాను. నువ్వు ముక్తి కొరకే వచ్చావు." ఇలా చెప్పిన వెంటనే ఆయన ఇలా కొనసాగించేవారు, "మీ తండ్రి నన్ను ఏడో అంతస్తులో ఉంచారు. నాకు కాళ్ళులేవు. నేను ఏడో అంతస్తుకు ఎలా చేరగలను?" మొదటిసారి ఈ విధంగా జరిగినపుడు నేను దిగ్భ్రాంతి చెందాను. "కోహెన్, మన గురువుగారి వద్దకు వచ్చిన అత్యంత గొప్ప మేధావులలో మీరు ఒకరు. మీరు ఏమి మాట్లాడుతున్నారు. అసలు రమణాశ్రమంలో మొదటి అంతస్థే లేదు," ఆయన ఇంకా అర్థం పర్థం లేని మాటలు మాట్లాడటముతో, ఆయన చిత్త భ్రమలో ఉన్నారనుకుని, దానిలో నుండి బయట తీసికుని రావటానికై (తెలివి తెప్పించటానికి) ఆయనను పట్టుకుని కుదిపాను, దానితో ఆయన కళ్ళు ప్రకాశవంతమైనవి. ఆయన ఇలా అన్నారు,"గణేశన్! వృద్ధాప్యంలో శరీరం వశంతప్పుతుంది. (పట్టు), అలాగే మనసు కూడా కొన్నిసార్లు వశం తప్పుతుంది. కానీ, మనము ఈ శరీరమూ కాదు. ఈ మనసూ కాదు కాబట్టి అవన్నీ పట్టించుకోకూడదు." "కోహెన్, మీరు ఏ స్థితిలో ఉన్నారు?" అని నేనాయనను అడిగాను. "నేను ఆనందంలో ఉన్నాను. నేను సంపూర్ణ ఆనందంలో ఉన్నాను", అన్నారు. మరుక్షణమే ఆయన అర్థం పర్థంలేని మాటలు మొదలుపెట్టారు. "నువ్వు కన్నన్ అనే ఒక పరిచారకుణ్ణే నియమించావు. కానీ నా గదిలో తొమ్మిది మంది కన్నన్‌లు ఉన్నారు. నేను గదిలో ఒంటరిగా ఎలా నిద్రపోగలను? నేను భయముతో తడబాటుతో తిరిగి ఆయనను కుదిపినపుడు, ఆయన నావైపు స్థిరంగా చూచి ఇలా అన్నారు. "మీరు నా మనస్సు చెప్పే వెందుకు

పట్టించుకుంటారు? ఇవన్నీ నా మనసులోనివి. నేను, నా మనసు చెప్పేవాటిని వినవద్దని మీకు చెప్పానుగదా", మేధస్సు అనేది ఆయన జీవితంలో ప్రాముఖ్యత వహించింది కాబట్టి ఆయన మనస్సు ఇప్పుడు నాటకము లాడుతున్నది. కొంతమంది భక్తులు వాళ్ళ చివరి దినాలలో దుర్భరమైన బాధలు పడవలసిన వచ్చినపుడు, నేను వారిని అడిగేవాడిని, "మీ వంటి వారికి ఇటువంటి జబ్బు ఎందుకు రావలసివచ్చినది"? అని. వారందరూ ఒకే విధమైన బదులు ఇచ్చేవారు. వారు వారి దేహానికి అత్యంత శ్రద్ధ కనబరచి, దానిని సుఖపెట్టారు కాబట్టి, అది ఈ విధంగా బదులు తీర్చుకుంటున్నది. తాను మనసునకు ఆవల ఉన్నానని నిజంగా చూపించింది మొదటగా కోహెన్. మీరు ఎందుకు ఇలా అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని నేనడిగినపుడు, కోహెన్ ఇలా జవాబిచ్చారు. "నేను నా దృష్టిని బాహ్యానికి మళ్ళించినపుడు అది అర్థంలేని మాటలు మాట్లాడుతుంది. నేను దృష్టిని లోపలికి మరల్చినపుడు అది 'కేవలము ఆనందమే. గణేశన్, నీ శరీరమూ, మనస్సూ ఎప్పటికీ ఈ విధంగా జబ్బు (బాధ) పడకూడదు. నీకు నా ఆశీస్సులు." కొన్నిసార్లు ఆయన బాధపడ్డపుడు, నేను ఓదార్చే వాణ్ణి, "కోహెన్, మీరు ఎందుకు ఏడుస్తారు? మీరు ప్రశాంతంగా, నిద్రలోకి జారుకున్నట్లుగా వెళ్ళిపోతారు." ఆయన చాలా హాస్యప్రియులు కనుక నవ్వి, నాతో ఇలా అనేవారు. "మీరిలా ఎందుకంటున్నారో నాకు తెలుసును గణేశన్. ఎందుకంటే, నేను చనిపోయిన తర్వాత అచ్చగా, ముందుగా నేను చెప్పినట్లే కోహెన్ మరణం సంభవించింది, అని మీరు అందరితో చెప్పుకోవచ్చును". ఏ కారణము చేతనో, తను చనిపోయిన తర్వాత, తన శరీరాన్ని ఆశ్రమంలోనే ఖననం చెయ్యాలని ఆయనకు గట్టికోరిక. మా తండ్రి గారూ, నేనూ అలాగే జరుగుతుందని హామీ ఇచ్చాము. 'ఏ ప్రదేశములో తనను పూడ్చాలో, అది కూడా కోహెన్ గారు చూపించారు. కొన్నిసార్లు నేను ఆశ్రమములో లేనపుడు, ఆయన కన్నన్‌ను ఆ చోటుకు తీసికుని వెళ్ళి, "ఇదిగో ఇక్కడ గొయ్యి తవ్వి నాశరీరాన్ని అందులో పడేసి, మట్టితో ఆ గోతిని పూడ్చివెయ్యి," అన్నారు కన్నన్ భయంతో "అమ్మో! వద్దు! వద్దు! అది పాపము," అనేవాడు. "సరేలే కన్నన్ దిగులు పడవద్దు. నేను చనిపోయిన తరువాత నన్ను పూడ్చిపెట్టే ప్రదేశమిదే. నేను ఊరికినే, నేను బ్రతికుండగానే నిన్ను ఆ పని చెయ్యమంటున్నాను. అంతే, నీకేమీ పాపంరాదు."

1980వ సం॥ములో నేను ఆశ్రమము పని మీద బయటకు వెళ్ళినపుడు, కోహెన్ చనిపోయారు. కోహెన్ తన శరీరాన్ని ఆశ్రమంలో ఎందుకు సమాధి చెయ్యి మన్నారో మనకు తెలియదు. దురదృష్టవశాత్తు ఆయనను స్మశానంలో పూడ్చారు. నేను టూర్ నుండి తిరిగి వచ్చిన తర్వాత, "కోహెన్, భగవాన్ గొప్ప శిష్యులలో ఒకరు. ఆయన అరుణాచలం నుండి వచ్చిన మెరుపు. ఆయన యొక్క ఈ చిన్నకోరికను, మనము తీర్చలేమా?అన్నాను. ఎంతమంది నేను చేసిన పనిని సమర్థిస్తారో తెలియదు. కానీ నేను ఆయన శరీరాన్ని బయటకు తీయించి ఇపుడు ఆయన సమాధి ఉన్నచోట పూడ్చి పెట్టించాను.

కోహెన్, ఏమీ సాధారణ వ్యక్తికాదు. ఆయన శరీరాన్ని, మనస్సును దాటినట్లయితే, తన శరీరాన్ని ఆశ్రమంలో సమాధి చెయ్యమని ఎందుకు కోరారో తెలియదు. కానీ అది ఎలా జరిగిందో చూడాలి. వెల్లూరులో ఉండగా, ఒక క్రైస్తవ సంస్థకు తన అవసాన దశలో కనిపెట్టి ఉండుటకుగాను, ఆయన ధనము ఇచ్చారు. ఆయన బాత్‌రూములో పడిపోయి, ఆశ్రమానికి తీసుకుని రాబడటానికి ఏది కారణమో, తాను తన శరీరాన్ని ఆశ్రమంలో సమాధి చెయ్యమని కోరినప్పటికి, ఆయన శరీరం మొదట బయట సమాధి చెయ్యబడి, తదుపరి ఆశ్రమానికి తీసికుని రాబడి, ఆశ్రమంలోనే సమాధి చెయ్యబడింది. ఈ విషయం ఈ హాస్య ప్రియుడికి తెలిసే ఉంటుంది. ఆ దివ్య శక్తి మరొకసారి యుక్తిగా, ఆయన శరీరాన్ని ఆశ్రమానికి తిరిగి తీసికుని వచ్చి ఆశ్రమంలో సమాధిచేసేలా చేసింది. ఈ తేజోవంతమైన మెఱుపు, పవిత్ర తేజోగిరికి తిరిగి వెళ్ళింది, శామ్యూల్ సులేమాన్ కోహెన్ తిరిగి అరుణాచలంలో కలసిపోయారు.

కోహెన్ జీవితము మన జీవితమే. అది శ్వాస వంటిది. శ్వాస అందరికీ ఒకటే. కానీ అది ప్రతి వారిలో విడిగా ఉంటుంది. సాధనతోనే ముడిపడి యున్న కోహెన్, జీవితము, ప్రతి ఒక్కరి జీవితమే. ఆయన గురించి చదివి, గ్రహించుకుంటే, అది మనలో ఒక శుద్ధమైన ఎఱుకను జాగృతం చేస్తుంది. ఏ శుద్ధ చైతన్యం కోసం ఆయన అభిలషించారో, తన జీవితాన్ని దేనికోసం వెచ్చించారో అది మనలోనూ జాగృతమవుతుంది.

ఆశ్రమములోని వంట చేసే స్త్రీలు

భగవాన్ జీవితము మొత్తములో రెండు విషయాలకు ఆయన ప్రాధాన్యతను ఇచ్చేవారు. ఒకటి ఆత్మ విచారణ. రెండవది, ఆశ్రమానికి వచ్చిన సాధకులెవరినీ కూడా భోజనము చెయ్యకుండా పంపేవారు కారు. 'అనుదినము భగవాన్‌తో', 'రమణాశ్రమ లేఖలు' అనే పుస్తకాలు చదివితే, ఆశ్రమానికి వచ్చిన ప్రతివారినీ భోజన శాలకు పంపేవారని తెలుస్తుంది, నిజానికి కొంతమంది భక్తులు ఈ విషయమై ఆయనను అడిగారు కూడా, "మీరెందుకు భక్తులు ఏ వేళప్పుడు వచ్చినా కూడా, భోజనం పెట్టాలంటారు?" అని. భగవాన్ తేలికగా సమాధానమిచ్చారు, "నాకు ఆకలంటే ఏమిటో తెలుసును." భగవాన్ భోజనం పెట్టటానికే గాదు, వంట చెయ్యటానికి గూడా ప్రాముఖ్యతను ఇచ్చేవారు, తానే ఒక అద్భుతమైన పాకశాస్త్ర ప్రవీణులు (వంటవారు). తర్వాతి కాలంలో స్వామి త్రివేణి గిరి అని పిలువ బడ్డ సాధు సుందరం, భగవాన్‌కు వంటగదిలో సహాయకుడిగా ఉండేవారు. ఆయన ఇలా చెప్పారు, "భగవాన్‌తో కలసి వంటగదిలో పని చెయ్యటం కేవలం వంట చెయ్యటమే కాదు, నిశ్చయంగా ఒక విధమైన ఆధ్యాత్మిక సాధనయే అని కాలక్రమేణ నేను గుర్తించాను".

భగవాన్ వంట గదిలోనికి ప్రవేశించి, వంట పనులలో పాల్గొనడం ద్వారా, నేర్పిన విలువైన పాఠం ఏమిటంటే, మనము దైవ నిర్ణయంపైనే పూర్తిగా ఆధారపడి, దానికే కట్టుబడి ఉండాలి అని. పూర్తిగా శరణాగతి చెంది, దైవ నిర్ణయానికి తలఒగ్గడమే అనుగ్రహమంటే. కొద్దిరోజులపాటు వంట గదిలో సహాయకునిగా పనిచేసిన అన్నామలైస్వామి ఈ విధంగా గుర్తు చేసుకున్నారు. "ఒకరోజు ఆశ్రమంలో భోజనం తయారు చెయ్యటానికి కావలసిన పదార్థాలేమీ లేనప్పుడు, ఎక్కడో అడుగున ఉన్న చాలా కొద్ది ద్రవ్యాలతో భగవాన్ వంట ప్రారంభించడం నేను చూశాను. వంట పూర్తయ్యే లోపల అరుణాచలేశ్వరుడు కావలసినవి పంపుతారని ఆయన నమ్మకం. ఆ రోజు ఉదయం అయిదున్నర గంటలకు, భగవాన్ ఒక గుప్పెడు నూకలను శుభ్రం చెయ్యసాగారు. ఆయన వాటిని పాత్రలో పోసి నీటితో కడిగి, చిన్న చిన్న రాళ్ళను ఏరివేసి, బొగ్గుల కుంపటిపై ఉడికించసాగారు. నాకు ఆయన చేసే పనులు వింతగాను, అర్థం కాకుండానూ ఉన్నవి. ఎందుకంటే, అది ఒక్కరికి కూడా చాలదు. ఆ నూకలు ఉడికేటప్పటికి, ఒక భక్తుడు రెండు లీటర్ల పాలు తీసికుని వచ్చారు. నూకలు ఉడికిన తర్వాత, భగవాన్ ఒక పెద్ద పాత్రను పొయ్యి మీద పెట్టి, నూకలు, పాలు కలిపి ఉడికించడం మొదలుపెట్టారు. మరికొన్ని నిముషాల తర్వాత మరొక భక్తుడు, ఎండుద్రాక్ష, పటిక బెల్లము పట్టుకొని వచ్చారు. భగవాన్ వాటిని కడిగి, ఆ



పాత్రలో వేశారు. ఆరున్నర అయ్యేసరికి, కుంభకోణం నుండి కొందరు భక్తులు వస్తూ, వారితోపాటు ఒక పెద్ద పాత్ర నిండా ఇడ్లీలు, చట్నీ, వడలు, ప్రత్యేకమైన కొండ అరటి పళ్ళు, అరటి ఆకు దొప్పలు తీసికుని వచ్చారు. భగవాన్ చేసిన పాయసాన్ని తినటానికి ఈ అరటి ఆకు దొప్పలే అవసరమయ్యాయి. భగవాన్ స్నానం చేసిన తర్వాత ఏడుగంటలకు మేమందరము కూర్చొని, కడుపునిండా ఫలహారము చేశాము.

ప్రఖ్యాతిగాంచిన తెలుగు రచయిత గుడిపాటి వెంకటాచలం, ఆశ్రమంలోని వంటగది గాథలు సేకరించక పోయినట్లయితే, ఇవాళ అవి మనకు లభ్యమయ్యేవికాదు. ఈ రోజున రమణాశ్రమ వంటవారిని గౌరవంగా తలచుకునే అవకాశముండేది కాదు. చలం వీటినన్నిటినీ గ్రంధస్తం చేశారని తెలియగానే, బొంబాయిలో ఉన్న మారిస్ ఫ్రిడ్‌మన్ దానిని ఇంగ్లీషులోనికి తర్జుమా చేసే ఏర్పాట్లను చేశారు. ఆయన తానే స్వయంగా, ఆ వ్రాత ప్రతిని తిరగ వ్రాసి నాకు తెచ్చి ఇచ్చారు. ఆ పుస్తకాన్ని అచ్చువేయించడానికి ఆశ్రమం వద్ద ఆర్థిక స్తోమత లేదని తెలిసి, ఆయన ఆ వ్రాత ప్రతిని ఇక్కడ వదిలి వెళ్ళిపోయారు.

1979–80 లో, భగవాన్ జన్మ శతాబ్ది ఉత్సవం జరుపదలచి, నన్ను భారత దేశం మొత్తం తిరిగి, భక్తులను కలసి, నిధులు సేకరించటానికి పంపారు. డబ్బుప్రోగు చెయ్యడానికి ఒక (జ్ఞాపిక) పత్రికను తయారుచేసి దానిలో వాణిజ్య ప్రకటనలకు గానూ, దాతల నుండి చందాలు సేకరించడం, ఒక మార్గంగా ఎన్నుకున్నాము. నా స్నేహితుడు, గొప్ప వ్యాపారవేత్త అయిన టి.ఎస్. నాగరాజన్ అనే ఆయన పత్రికను అచ్చువేయటానికి ముందుకు వచ్చారు కాని, దానికి తగినన్ని, వ్యాసాలు లేవని కనుగొన్నారు. పాత పుస్తకాలలో వెతకమని నేను ఆయనను కోరాను. మారిస్ ఫ్రిడ్ మన్ వదిలిన వంటశాల గాథల వ్రాతప్రతిని మరచిపోయి. ఆయన వాటిని వెదకి ఆ పత్రికలో అచ్చువేశారు. నేను చలము, మారిస్ ఫ్రిడ్‌మన్, ఎస్.నాగరాజన్ గార్లకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఎందుకంటే, వారి వల్లనే, ఈ సామాన్యమైన ఆశ్రమ వంటవారి జీవితాలు వెలుగులోనికి వచ్చినవి.

పాఠకులు వాటిని కేవలం కథలో, సంఘటనలో అనుకొనరాదు. అవి భగవంతుని తో సహజీవనం చేసిన వారు చెప్పిన అనుభవాలు. వంటవారిలో ఒక స్త్రీ ఆమె కాలం గురించి ఇలా చెప్పారు. "భగవాన్ వంటగది మధ్యలో ఉండేవారు. వంట పనిని పర్యవేక్షిస్తూ, సలహాలనిస్తూ. అప్పట్లో వంటగది చాలా చిన్నగా ఉండేది. ప్రతిసారీ, నాకేది కావలసి వచ్చినా భగవాన్ చుట్టూ తిరిగి వెళ్ళవలసి వచ్చేది. ఆ విధంగా, రోజు మొత్తంలో నేను అనేకసార్లు ఆయనకు ప్రదక్షిణం చెయ్యవలసివచ్చేది. ఆయన నా దైవంగదా. వంటగది మధ్యలో ఆయన ఉండటం నా భాగ్యం కాదా? భోజనాన్ని వడ్డించే ముందు ఆహారపదార్థాలన్నిటినీ భగవాన్ రుచి చూసే వారు. అందువల్ల భోజనం మొత్తం పవిత్రంగా మారేది. ఇవాళ్టి రోజున కూడా రమణాశ్రమంలో వడ్డించబడే ఆహారము పవిత్రమైనదే ఎందుకంటే భగవాన్ స్పర్శ ఎప్పుడూ ఉంటుందిగనుక.

శ్రీ భగవాన్‌తో ఆశ్రమ వంట స్త్రీలు మరియు ఆశ్రమవాసులు

శాంతమ్మాళ్

ఇప్పుడు మనం శాంతమ్మాళ్ గురించి చెప్పుకుందాము. నాకు ఆవిడతో సన్నిహితంగా మెలిగే అవకాశం కలిగింది. కానీ నా కప్పటికి ఆమె గొప్పతనం గురించి తెలియదు. ఆమెతోటి సత్సంగం దొరకటం నా మహద్భాగ్యమని ఇప్పుడునేను గుర్తించాను. మారిస్ ఫ్రిడ్‌మన్ ఇచ్చిన వ్రాతప్రతులు చదివిన తర్వాతనే నాకు ఆవిడ యొక్క ఆధ్యాత్మిక గొప్పతనం గురించి అవగాహన వచ్చింది. భగవాన్ స్కందాశ్రమము నుండి రమణాశ్రమానికి 1922లో వచ్చారు. అప్పుడు ఆశ్రమంలో నలుగురైదుగురు మాత్రమే ఉంటుండేవారు, భగవాన్ సోదరుడు చిన్నస్వామితో కలిసి. 1922 నుండి 1928 వరకు చిన్నస్వామి ముఖ్య వంటవానిగా ఉండేవారు. మిగిలిన వారు అప్పుడప్పుడు వచ్చి సాయపడి తిరిగి ఇంటికి వెళ్తుండేవారు. శాంతమ్మాళ్ 1928లో చిన్నస్వామి కి సాయపడటానికి వచ్చి, మరల తిరిగి వెళ్ళలేదు.

శాంతమ్మాళ్ తన భర్తను, ముగ్గురు కుమారులను కోల్పోయింది. ఆమెకు ఒకే కుమార్తె మిగిలింది. ఆమెకు అతికష్టం మీద పెళ్ళిచేశారు. దురదృష్టవశాత్తూ ప్రసవ సమయంలో ఆమె కూడా చనిపోయింది. శాంతమ్మాళ్ కు నావారు అని చెప్పుకునేవారు గానీ, నాదీ అని చెప్పుకునే ఆధారంగానీ, ఏమీ లేకుండా పోయింది. బాగా పేద స్థితిలో ఉన్నందున, చాలా మంది బంధువుల ఇళ్ళలో వంటలో సాయపడటానికి వెళ్ళేది. ఒక రోజు ఆమె బావగారి ఇంట్లో అన్నము వండుతుండగా, ఆమెకు అంతరంగంలో ఇలా అనిపించింది. "నువ్వు ఏమి చేస్తున్నావు? నీ పిల్లలు చనిపోయారు. ఎందుకు ఈ బాధ్యతలన్నీ నెత్తిన వేసుకుంటావు? నువ్వు ఎవరికి సేవ చేస్తున్నావు? నువ్వు ఎవరివి?" ఇవి కేవలము ఆలోచనలు కావు. భవిష్యత్తులో కాబోయే గురువు గారి ఆజ్ఞను ఆమె గాఢంగా అనుభూతి చెందారు. ఆమె తన బావగారిల్లు వదలి రామనాథపురంలోని తన మిత్రులు, మురుగనారు ఇంటికి వెళ్ళింది. లోపలికి ప్రవేశిస్తూనే ఆమె మురుగనారు గదిలోనికి వెళ్ళి, అక్కడ మొదటిసారిగా భగవాన్ ఫోటో ను చూశారు. అది ఆమెను ప్రభావితం చేసి రమ్మని పిలిచినట్లయింది. ఈయనే నా దైవము అనుకున్నారు. అదేమిటి? ఇప్పటివరకూ ఈయన గురించి నేను ఎందుకు తెలుసుకొనలేదు? అని బాధపడ్డారు. ఆమెకు అరుణాచలం వెళ్ళాలనే కోరికగలిగింది. కాని పాపం ఆమె వద్ద ప్రయాణ ఖర్చులకు ధనం లేదు. అదృష్టవశాత్తూ 1927 లో, రామనాథ పురం నుండి, కొంతమంది కలసి, కార్తీక దీపోత్సవానికి అరుణాచలము వెళ్తున్నారు. వారు ఆమె టిక్కెట్‌కు డబ్బిచ్చి, తమతోపాటు తీసికుని వెళ్ళారు.

ఆమె అరుణాచలానికి వచ్చి నలభై రోజులపాటు ఆ బృందంతోపాటు ఉండిపోయారు. ప్రతిదినము ఆమె రమణాశ్రమానికి వెళ్ళి, అక్కడ రమణుల సన్నిధి లో గడిపేవారు. ఆమె ప్రార్థించారు. "నా స్వప్నం నిజమైంది. ఇవాళ నా అదృష్టం పండింది. నా దైవం ఇక్కడే ఉన్నారు. మీ సన్నిధిలో నాకు స్వర్గంలో ఉన్నట్లు ఉన్నది. కానీ నేను ఇక్కడ నుండి దూరంగా వెళ్ళిన తర్వాత కూడా, నా మనస్సు నన్ను బాధించకుండా చూడండి". భగవాన్ సహజంగా మొహమాటస్తులు (సిగ్గరి) కనుక తన ప్రక్కనే నుంచుని ఉన్న మురుగనార్‌తో, "అసలు మనసనే వస్తువు ఉన్నదేమో కనుక్కొనమని ఆమెకు చెప్పు. ఉంటే దాని రూప మేది? దానికి మీసాలూ, గడ్డమూ ఉంటవా?" అది విని శాంతమ్మాళ్ స్థాణువై నిల్చున్నారు. మురుగునార్ కల్పించుకుని, "భగవాన్ మీకు, ఆత్మాన్వేషణలో దీక్ష ఇచ్చారు. మీరు గుర్తించలేదా?" అన్నారు. అందులోని ఆధ్యాత్మికత యొక్క లోతు ఆమె వెంటనే గ్రహించ లేకపోయారు. కానీ ఆమె గాఢమైన భక్తి పారవశ్యంలో మునిగి, రమణ స్తుతి పంచకంలోని ఒక పద్యాన్ని పాడసాగారు. ఆ పద్యము యొక్క భావము ఇది : "ఓ భగవాన్ ! నీ ఆధ్యాత్మిక వైభవం జగత్తు మొత్తాన్నీ దాని సుగంధంతో నింపివైచింది. ఆ సువాసనచే ఆకర్షితులై అనేకమంది వారి హృదయాలను నీ వైపుకు తిప్పారు. నేను కూడా తపన చెంది ఆత్రంతో నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. ఎక్కడున్నారు ఆయన? అని అన్వేషించి, ఇపుడు నీ సన్నిధికి చేరాను. "ఈ పద్యం లోని అందం ఏమిటంటే, విరూపాక్ష గుహలో సత్యమంగళం వెంకట్రామ అయ్యర్ 1910వ దశకంలో వ్రాసిన ఈ పద్యము శాంతమ్మాళ్ పరిస్థితికి చక్కగా సరిపోయింది. ఇది ఆమె కొక్కరికే కాదు, మనలో ప్రతి ఒక్కరికి కూడా

వర్తిస్తుంది. ఈ ప్రస్తుతం అనబడే దానిలో, మనకు భగవాన్‌తో అనుసంధానమై ఉండటానికి అవకాశము ఉన్నది. మనలో ఉన్న మౌనంగా కాక, హృదయ స్ఫురణగా కాక, ఆయన ప్రత్యేకంగా లేరు. ఆమె భగవాన్ వద్ద సెలవు తీసికొనడానికి వెళ్ళినపుడు, భగవాన్, "బోధలసారాన్ని కలిగియున్న ఉపదేశసారము అనే ముప్పది పద్యములు గల పుస్తకము రేపు వస్తున్నది. మీరు ఇంకొక రోజు ఉన్నట్లయితే, నేను ఆ పుస్తకాన్ని మీకు ఇస్తాను" అన్నారు. ఆవిడ మరొక దినము ఉండి ఉపదేశసారము అనే పుస్తకము యొక్క కాపీని, భగవాన్ నుండి తీసికున్నారు. వెళ్ళిపోయే సమయంలో శాంతమ్మాళ్ బాగా దుఃఖించారు. భగవాన్ ఆమెను, "ఏడవ వద్దు. మీరు అరుణాచలాన్ని వీడుట లేదు. వెళ్ళి త్వరలోనే తిరిగి రండి", అన్నారు.

దురదృష్టవశాత్తూ ఏడాది వరకూ ఆమె తిరిగి రాలేకపోయారు. ఆమె లేనప్పుడు భగవాన్ జయంతి ఏర్పాట్లు జరిగిపోతున్నవి. సర్వాధికారిని పిలచి, శాంతమ్మాళ్ కు ఒక ఆహ్వాన పత్రికను పంపవలసినదిగా చెప్పారు భగవాన్. ఆ సమయంలో శాంతమ్మాళ్ నిరుపేద, అనాథ అయిన వితంతువు. గురువుకు శిష్యునికి మధ్యగల దూరాన్ని భర్తీ చేయటానికి, భగవాన్ తీసుకున్న శ్రద్ధను చూసి, శాంతమ్మాళ్ చలించిపోయారు. ఆమె డబ్బు అడుక్కుని చివరకు 1928లో ఆశ్రమానికి వచ్చేశారు. ఆమె వచ్చే సరికి భగవాన్ 'ఉళ్ళదునార్పదు' (ఉన్నదినలుబది) అనే బోధను వివరిస్తున్నారు. ఆయన చెప్పటము ఆపి, ఆమె వైపు తిరిగి, "మీకు దీని కాపీ అందిందా? మీకు కాపీని పంపమని వాళ్ళకు చెప్పాను," అన్నారు. భగవాన్ కరుణకు, వ్యక్తిగత శ్రద్ధకు, చలించిపోయిన ఆమె "నేను ఈ గురువుగారితోనే ఉండిపోతాను. వేరెక్కడకూ వెళ్ళకుండా ఆయనకు వండి పెడతాను", అని ప్రతిన పూనారు.

మర్నాడు ఆమె భగవాన్‌తో ఇలా చెప్పారు. "భగవాన్, మీ వద్ద ఉన్నంత కాలమూ నా మనసు ప్రశాంతంగా ఉన్నది. మీ నుండి దూరంగా వెళ్తే అశాంతితో బాధపడుతున్నాను. నేను ఏమి చెయ్యాలి?" "మీ మనసు విశ్రాంతిగా ఉండే వరకు మీరిక్కడే ఉండిపొండి", అన్నారు భగవాన్. మర్నాడు ఉదయం చిన్నస్వామి వైద్యచికిత్స కొరకు చెన్నై వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు ఉండవలసి వచ్చింది. చిన్నస్వామి లేనపుడు, ఆశ్రమంలో వంట చేసే వారు లేరు. వంట పని చూచుకొనవలసినదిగా శాంతమ్మాళ్‌ను కోరారు. భగవాన్ వద్ద ఉండి ఆయనకు వండిపెట్టటం అనేది, నా చిరకాల 'స్వప్నం'. అది సువర్ణావకాశమైనది. శాంతమ్మాళ్ వంటగదిలోనికి ప్రవేశించినపుడు, కొత్తగా వంటగదిలోనికి వచ్చిన ఆమెను ఒంటరిగా వదలివెయ్యడం ఇష్టంలేక, భగవాన్, అక్కడకు వెళ్ళి వంట పనిలో ఆమెకు సాయపడసాగారు. మంచి పాకశాస్త్ర ప్రవీణులేకాక, తన భక్తుల అహంకారములను వండి అరుణాచలునికి నివేదించడంలో ఆయన దిట్ట. నిజానికి కావ్యకంఠులవారు ఈ విధంగా గానం చేశారు, "ఓ భగవాన్! మీరు వంక లేని పాకశాస్త్రజ్ఞులు. కాకపోతే మాంసాహారాన్ని వండువారు. మీరు మా అహంకారముల నన్నిటిని వండి మీ తండ్రిగారైన అరుణాచలేశ్వరునకు నివేదిస్తారు".

ఒకసారి వాడుకలోనున్న నూనె డబ్బాకారిపోవడం మొదలుపెట్టేసరికి శాంతమ్మాళ్‌కు, సమస్య ఎదురైంది. తనకు ఇంకొక డబ్బా లభిస్తే గనక, చాలా వరకు సమస్యలు తీరిపోతవి అని ఆమె భగవాన్ తో అన్నది. భగవాన్ సమాధానమివ్వలేదు. పదిరోజులలో, ఆరు పెద్ద డబ్బాలు, రైల్వేస్టేషన్ నుండి రమణాశ్రమానికి పంపబడ్డవి. పంపిన వారి పేరు చిరునామా లేదు. ఇప్పటికి కూడా వాటిని ఎవరూ పంపారో తెలియదు. భగవాన్ శాంతమ్మాళ్ ను పిలచి, "నువ్వు ఒక్క డబ్బా అడిగావు. ఇక్కడ ఆరుఉన్నవి" అన్నారు. మరొక పర్యాయము శాంతమ్మాళ్‌కు కొంత డబ్బు అవసరమైంది. మూడు దినముల లోపల, సరిగ్గా ఆమెకు కావలసినంత రొఖం ఆమెకు మని ఆర్డరు ద్వారా పంపబడింది. దినపత్రికలో మహర్షి గురించిన వ్యాసాన్ని చదివిన శ్రీనివాసరావు అనే ఆయన ఆ డబ్బును పంపారు. ఆ వ్యాసంలో శాంతమ్మాళ్ అనే వంట మనిషి భగవాన్‌కు వంట చేసి పెట్టడానికి ఆశ్రమానికి వచ్చి ఉంటున్నారని చదివిన ఆయనకు, ఆమెకు కొంత డబ్బు పంపాలనే ప్రేరణ కల్గిందట, శాంతమ్మాళ్ తర్వాతి కాలంలో "ఈ రెండు సంఘటనల వలన, భగవాన్ పట్ల పూర్తి విశ్వాసము ఉంటే చాలు," అని ఋజువు అయిందని నాతో అన్నారు.

ఒక రోజు భగవాన్, శాంతమ్మాళ్ వంట గదిలో వంట చేస్తున్నారు, భగవాన్ కూరను అదేపనిగా కలియదిప్పుతూ, ఒక్కసారి ఆపి, ఆమె వైపు చూశారు. శాంతమ్మాళ్ వెంటనే నిశ్చలంగా అయిపోయారు. నిశ్శబ్దము, శుద్ధమైన సంతోషము మిగిలి, తక్కినవన్నీ మాయమైపోయాయి. శాంతమ్మాళ్ అమితమైన ఆనందాన్ని పొందుతూ ఉండిపోయారు. కొంతసేపు అయిన తర్వాత భగవాన్ అటూ ఇటూ నడుస్తుండగా, శాంతమ్మాళ్‌కు పరిసరాల జ్ఞానం కలిగింది. భగవాన్ కూర వంక చూస్తూ

అన్నారు. ఇది పూర్తిగా ఉడికిశబ్దం రాకుండా అయిపోయింది. ఇప్పుడు మీరు సుగంధద్రవ్యాలను కలుపవచ్చును. మనస్సును నిశ్శబ్ధ స్థితిలో నిలిపి, దానికి, వివేకమనే సుగంధద్రవ్యాన్ని కలుపవలెనని శాంతమ్మాళ్ అర్ధం చేసుకున్నారు, ఈ విధంగా, రోజువారీ పనులలోనే బోధను మిళితంచేసే వారు భగవాన్. మరొకసారి, శాంతమ్మాళ్ అప్పుడే ఏదో ఒక వంటకము వండటము పూర్తి చేశారు. అప్పుడు వంటగదిలోనికి వచ్చిన భగవాన్ను, ఆ వంటకం రుచిచూడవలసినదిగా ఆమె కోరారు. భగవాన్ సరదాగా నవ్వుతూ ఇలా అన్నారు," మీకు తెలుసా, రాజులు వంటకాలను రుచిచూచుటకు కొంతమందిని నియమించి, వారికి భారీగా జీతము ముట్ట చెప్పేవారు. మీరు నన్నదే పని చెయ్యమంటున్నారు. మీరు నాకేమి జీతం ఇస్తారు ?" అన్నారు. "భగవాన్, నేనొక యాచకురాలిని, నేను నన్ను మాత్రమే మీకు అంకితమివ్వగలను. " అన్నారు శాంతమ్మాళ్.. ఈ శరణాగతిని భగవాన్ హృదయపూర్వకంగా ఆమోదించారు. శాంతమ్మాళ్ వంటలను అందరూ ఇష్టపడేవారు, అవి చాలా రుచిగా ఉండటమే కాదు. పూర్తిగా శరణాగతి చెందిన వారిచే వండబడ్డవి కాబట్టి".

శాంతమ్మాళ్, హాలులో జరిగిన ఒక ఆసక్తి కరమైన సంఘటన గురించి తెలిపారు. ఒకప్పుడు ఒక యూరప్ దేశస్థుడు, ఆశ్రమానికి గుఱ్ఱపు బగ్గీలో వచ్చి, తిన్నగా హాలులోనికివెళ్ళారు. అక్కడ, ఆయన, భగవాన్కు తాను వ్రాసిన కాగితాన్ని ఇచ్చారు. భగవాన్ దానిని చదివి, ఆయన వైపు చూశారు. వెంటనే ఆయన కనులు మూసుకుని నిశ్చలులైనారు. కొంతసేపున్న తర్వాత భగవాన్ కూడా కనులు మూసుకున్నారు. వారిద్దరూ నిశ్శబ్ధంగా (మౌనంగా) ఉన్నారు. వారి చుట్టుప్రక్కల ఉన్న మరికొందరు కూడా శాంతిలో మునిగిపోయారు. మధ్యాహ్నం భోజనానికి గంట కొట్టారు. అయినా భగవాన్ కానీ, ఆ పాశ్చాత్యుడు కానీ కదలలేదు. పన్నెండు గంటలకు ఇరువురూ కళ్ళు తెరిచారు. ఆ పాశ్చాత్యుడు పారవశ్యంతో వెళ్ళిపోయారు. భగవాన్ ఒకసారి మీరెంత పాత్రను తీసికుని సముద్రానికి వెళితే అంత నీరు నింపుకొని తెచ్చుకోగలరు. మీరు కేవలం ఒక కప్పు మాత్రమే తీసికుని వెళ్తే, కప్పునీరు మాత్రమే తెచ్చుకుంటారు. మీరు బకెట్ తీసికుని వెళ్తే, బకెట్ నిండా నిండా నీళ్ళు తెచ్చుకోగలరు. ఆ సముద్రం మొత్తాన్ని దోచుకోండి. ఆ పాశ్చాత్యుడు సముద్రము మొత్తాన్ని కొల్లగొట్టుకోవటానికి వచ్చారు. భగవాన్ అపార అనుగ్రహాన్ని పొందటానికి, ఆ పాశ్చాత్యుడు ఎంత భాగ్యశాలి అయిఉంటారో, అని శాంతమ్మాళ్ నాతో అన్నారు.

శాంతమ్మాళ్ చెప్పిన మరొక ఆసక్తి కరమైన సంఘటన ఒక హైందవ సన్యాసి గురించినది. ఒకప్పుడు ఒక వృద్ధుడైన ఉత్తర భారతదేశానికి చెందిన సన్యాసి రమణాశ్రమానికి వచ్చి, అక్కడ కొద్ది వారాలు ఉన్నారు. చివరిరోజున ఆయన భగవాన్ వద్దకు వచ్చి, ఆయన ఎదురుగా నిలబడి ఇలా అన్నారు. "భగవాన్, రమణాశ్రమంలోని ప్రతిదీ నాకు పూర్తి సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు నేను వెళ్ళిపోవటానికి సిద్ధంగా ఉన్నాను.నా హృదయంలోని కోర్కెను తీర్చండి. భగవాన్, తాను అంతకు ముందుగానీ, అటుపిమ్మటగానీ చెయ్యని పనిని చేశారు. ఆయన లేచి నుంచుని సన్యాసి వద్దకు వెళ్ళి ఆయనను స్పృశించారు. వారిద్దరూ ఆ విధంగా నుంచునే ఉన్నారు, ఆ సన్యాసి కన్నీళ్ళతో భగవాన్ పాదాలపై, పడేవరకు. చక్కటి చిఱునవ్వుతో, పారవశ్యంలో మునిగిన వాడై ఆయన, భగవాన్ సన్నిధిని వీడి వెళ్ళిపోయినారు.

మైసూరు మహారాజా వారిని గురించి వేరే భగవాన్ పుస్తకాలలో లేని ఉదంతాన్నొక్కదాన్ని శాంతమ్మాళ్ చెప్పారు. బ్రిటీష్ వారి హయాములో 300 పైగా చిన్న చిన్న రాజ్యాలుండేవి భారతదేశములో ప్రతి రాజ్యానికి ఒక రాజు, ఒక రాణీ, కోట, సైన్యము ఉండేవి. ఈ రాజ్యాలలో పెద్దవి. హైదరాబాదు, మైసూరు రాజ్యములు. మైసూరు మహారాజు పండితుడు, కళలను, సంస్కృతిని పోషించేవారు. ఒకరోజు ఎవరికి తెలియకుండా, ఆయన నిశిరాత్రిలో భగవాన్ వద్దకు వచ్చి, మర్నాటి ఉదయం వరకు ఉండిపోయారు. ఆయన భగవాన్తో ఒంటరిగా మాట్లాడాలనికోరుకున్నారు. కానీ భగవాన్ అటువంటి అవకాశం ఇంతకు ముందు ఎవరికీ ఇవ్వలేదు. ఆయన హాలులో ఉన్నా, గిరిపైకి వెళ్ళినా భక్తులు ఆయన వెంట ఉంటూ ఉండేవారు. అందుకని భగవాన్ ఆయనకు తను స్నానం చేసే 8 అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పుగల స్నానపుగదిలో మాట్లాడటానికి అవకాశం ఇచ్చారు. మహారాజు భగవాన్ పాదములపై బడి దు:ఖించారు. ఆయన కన్నీరు భగవాన్ పాదములను తడిపివేసినది. అప్పుడు మహారాజా పైకి లేచి, ఇలా అన్నారు. " భగవాన్! వాళ్లు నన్ను రాజుని చేసి బలవంతంగా సింహాసనంపై కూర్చోబెట్టారు. ఈ కారణం వలన, నేను మీ వద్దకు వచ్చి, మీ సన్నిధిలో ఉండలేకపోతున్నాను. ఈ కొద్ది

నిముషాలే నా జీవితం మొత్తంలో విలువైనవి. ఇటుపై నేనిక్కడకు రాలేను. దయచేసి నన్ను ఆశీర్వదించండి. శాంతమ్మాళ్ భగవాన్‌ను మహారాజా గురించి అడిగినపుడు, 'ఆయన పరిపక్వమైన పండు', అని ఒకే వాక్యంలో చెప్పారు భగవాన్.

ప్రతిసంవత్సరము తిరువణ్ణామలైలో కార్తీక దీపోత్సవము పదిరోజులపాటు వైభవంగా జరుపబడేది. అరుణాచలేశ్వరుని విగ్రహాన్ని టౌనులో ఊరేగించేవారు. ఆ గొప్ప దృశ్యాన్ని చూడటానికి వేలాది భక్తులు గుమికూడేవారు. ఈ భక్తులలో చాలా మంది యాచకులు, సాధువులు, సన్యాసులు. వాళ్ళు భోజనము కొరకై రమణాశ్రమానికి వచ్చేవారు. వారందరికీ భోజనం పెట్టబడేది. ఒక సంవత్సరము, వారి రద్దీ తట్టు కోవడం కష్టమనిపించింది ఆశ్రమ సేవకులకు. ఆ సంవత్సరము వారికి భోజనం పెట్టటం ఆపి వేద్దామనుకున్నారు. ఆ నిర్ణయానికి వచ్చిన రోజు రాత్రి శాంతమ్మాళ్‌కు ఒక స్వప్నం వచ్చింది. ఆమె, భగవాన్, హాలులో కూర్చుని ఉన్నారు. ఆమె ఏదో కీటకము వంటిది, భగవాన్ ప్రక్కన ఎగరటం చూచారు. క్రమేపీ అది పెద్దదిగా అయి, రెక్కలు గల పెద్ద ఎర్రని గుఱ్ఱము వలె మారి పోయింది. అది ముందు భగవాన్ చుట్టూ, తర్వాత, మొత్తం ఆశ్రమం చుట్టూ ప్రదక్షిణ చేసి, తిరిగి భగవాన్ వద్దకు వచ్చి, తర్వాత మాయమై పోయింది. మర్నాడు, ఈ కలకు అర్థమేమై ఉంటుందా అనే కుతూహలంతో శాంతమ్మాళ్ భగవాన్ వద్దకు వెళ్ళారు. "కార్తీక దీపోత్సవ సమయంలో, దేవతలు, దివ్య పురుషులు, యాచకులు, సాధువుల రూపంలో తిరువణ్ణామలైకు వస్తారు. కాబట్టి వారికి భోజనం పెట్టటం గొప్ప విశేషం అన్నారు. మర్నాడు ఉదయం శాంతమ్మాళ్, ఈ సంగతిని చిన్న స్వామికి తెలియ చెయ్యగానే, ఆయన వచ్చే యాచకులు, సాధువులు అందరికీ భోజనం ఇవ్వటానికి ఏర్పాట్లు చేశారు.

శాంతమ్మాళ్‌కు కాంతి వంతమైన వెలుగుల దృశ్యాలు కనిపిస్తుండేవి. "నేను మొదటిసారి భగవాన్ వద్దకు వచ్చినపుడు సూర్యుడి వంటి గొప్ప కాంతి,మధ్యలో భగవాన్‌తో కనిపించింది. తర్వాత నా భ్రూమధ్యంలో కాంతి కనబడసాగింది. మరొకసారి పెద్దకాంతి భగవాన్ తలనుండి బయటకు వచ్చి హాలంతా నిండిపోయింది. ఆకాంతిలో భగవాన్‌తో సహా అంతా మాయమై పోయింది. 'నేను', అనే భావం మాత్రం, ఒక కాంతితో నిండిన శూన్యమువలె ఉండిపోయింది. నేనీ విషయాన్ని భగవాన్‌కు చెప్పినపుడు, అటువంటి దృశ్యాలు కన్పిస్తుంటవని భగవాన్ చెప్పారు." "తాను ఎలా కన్పిస్తారో తెలుసుకొనుటకు, ఎవరైనా అద్దంలో చూసుకోవాలి. కానీ ఆ వ్యక్తి ఆ ప్రతిబింబమే తానుగా భావించరాదు. జ్ఞానేంద్రియాలతోటి, మనసుతోటి గ్రహించ బడేది ఎన్నటికీ సత్యం కాదు. ఈ దృశ్యాలన్నీ మనసు కల్పించే భ్రమలే. ఎవరైనా వాటిని నమ్మితేవారి, ఆధ్యాత్మిక ప్రగతి ఆగిపోతుంది. ఎవరికి ఈ దృశ్యాలు కన్పిస్తున్నాయో విచారణ జరుపు. ఎవరైతే సాక్షిగా చూస్తున్నారో తెలుసుకో. ఏ ఆలోచనలూ లేని శుద్ధమైన ఎఱుకలో నిలచి, ఆ స్థితి నుండి చలించకు." అని భగవాన్ అన్నారు.

ఒకప్పుడు ఉత్తర భారతదేశపు కొస నుండీ, ఒక వ్యక్తి ఆశ్రమానికి వచ్చి కొన్ని వారాల పాటు ఉండిపోయారు. ఆయన వెళ్ళబోయే రోజున ఆయన భగవాన్ ఎదురుగా నిల్చుని ఇలా అన్నారు, "భగవాన్! నేను వెళ్ళిపోతున్నాను. తిరిగి ఎప్పుడు వస్తానో తెలియదు. నిరంతరమూ మీ సన్నిధిలో ఉండగలిగే అంతభాగ్యము నాకు లేదు. దూర ప్రాంతంలో ఉన్న పాపియైన నన్ను గురించి ఆలోచించకుండా మీరు నాకెలా సాయపడగలరు? అందువల్ల నాకు మీ మనసులో చోటివ్వమని, మిమ్ములను ప్రార్థిస్తున్నాను. భగవాన్ ఇలా సమాధాన మిచ్చారు. "జ్ఞానికి మనసు ఉండదు. మనసులేని వారు, గుర్తుంచు కొనుట గానీ, ఆలోచించుటగానీ ఎలా చెయ్యగలరు? నేను, ఈ విశ్వాన్ని పాలించే (ఈశ్వరునకు) ప్రభువునకు, మీ ప్రార్థన నందచేస్తాను. అది ఆయన పరిధిలోనిది. " ఆ భక్తుడు వెళ్ళిపోయిన పిమ్మట, భగవాన్ మా వైపు జూచి ఇలా అన్నారు. "ఒక జ్ఞాని చుట్టూ చేరిన భక్తులపై ప్రత్యేకమైన శ్రద్ధ ఉంటుందని, జనము భావిస్తారు. ఒక గురువుగనుక పక్షపాతము చూపిస్తే, అతడు జ్ఞాని ఎలా అవుతారు? తనపై శ్రద్ధ చూపించి, తనకు సేవ చేసే వారిని చూచి ఉబ్బి పోవటానికి అతనంత మూర్ఖుడా? 'దూరము' అనేది లెక్కలోనికి వస్తుందా? తనను తాను సమర్పించుకుని, అహంకారాన్ని శాశ్వతంగా వదలివేసిన వానిని చూసి గురువు సంతోషపడతారు. అటువంటి వ్యక్తి ఎక్కడ ఉన్నా, అతని పట్ల శ్రద్ధ వహిస్తారు. అతడు ప్రార్థన చెయ్యనవసరము లేదు. దైవము అతడు కోరకుండానే అతనిని రక్షిస్తారు. అప్పుడు భగవాన్ ఒక ఉదాహరణ నిచ్చారు. కప్ప ఎప్పుడూ కమలం యొక్క కాడను అంటిపెట్టుకుని దానికి సమీపంలో ఉన్నప్పటికీ, తేనెటీగ దానిలోని మకరందాన్ని గ్రహించి వెళ్ళిపోతుంది. అవి దూరం నుండీ వస్తాయి. తేనెను గ్రహిస్తాయి. ఎగిరిపోతాయి. అవి నిజంగా ధన్యజీవులు".

ఒకసారి దక్షిణాది నుండి ఇద్దరు స్త్రీలు భగవాన్ వద్దకు వచ్చారు. వారిలో ఒకరు గురువు వలె రెండవ వారు శిష్యుని వలె నటించ సాగారు. వారు హాలులోనికి రాగానే, ఒక స్త్రీ ఒక పెద్ద ఆసనాన్ని తన గురువు కొరకు పరచి, ఆమెను దానిపై కూర్చుండబెట్టారు. భగవాన్‌కు నమస్కరించి వచ్చి తన గురువు ఎదురుగా కూర్చున్నారు. తిరిగి భగవాన్ వద్దకు వెళ్ళి, మోక్షమును పొందుటకు ముక్తి మార్గాన్ని బోధించమని కోరారు. భగవాన్ మౌనంగా ఉన్నారు. అప్పటికి సాయంకాలము అవవస్తున్నది. ఆ రాత్రికి రైలులో తాము వెళ్ళిపోవలెనుగనుక ఆమె బాధపడ్డారు. "స్వామీ, మాకు బోధించండి. ఆలస్యము అయిపోతున్నది," అని ఆమె ప్రాధేయపడ్డారు. కొంతసేపటి తర్వాత ఆమె మరల భగవాన్‌కు గుర్తు చేసింది. చివరకు ఉద్రేకము చెంది, ఆమె అడిగారు, "స్వామీ, మాకేమైనా చెప్పండి. అందరూ అజ్ఞానాన్ని గురించి మాట్లాడతారు. అజ్ఞానమంటే ఏమిటి? దయచేసి దానిని మాకు వివరించండి," అన్నారు. భగవాన్ మురుగనార్ వైపు తిరిగి కరుణతో ఇలా అన్నారు. "ఎవరు అజ్ఞానులు అని అంతరంగంలో విచారణ జరుపమనండి ఆమెను." మురుగనార్ ఆ స్త్రీల వైపుకు తిరిగి, "మీకు దీక్షయివ్వడం అయిపోయింది. ఇంక మీరు వెళ్ళవచ్చును." అన్నారు. నిరాశతో ఆ స్త్రీ లిద్దరూ వెళ్ళిపోయారు. తర్వాత భగవాన్ ఆ సంఘటన గురించి ఇలా అన్నారు. "ప్రతి పనీ హడావిడిగా చెయ్యబడాలి. ప్రతివారికి ఏదో ఒక రైలు అందుకోవలసి ఉంటుంది.వారు హడావిడిగా ఈ స్వామి వద్దకు వచ్చి, ముక్తి, మోక్షము అనబడే పార్శిల్ తీసుకుని వెళ్ళాలనుకుంటారు. వాళ్ళు అక్కడ కొంతా, ఇక్కడ కొంతా చదివి, మోక్షానికి సిద్ధంగా ఉన్నారనుకుంటారు. ఎవరు మోక్షాన్ని కోరుకుంటున్నారు? ఎవరికి ముక్తి కావాలి? అంతరంగంలోనికి తిరిగి హృదయంలో పరిపూర్ణంగా నిండి ఉన్న మౌనంగానే తానుండక, బాహ్యంలో తిరుగుతూ శాంతి లేక అలజడి చెందుతుంటారు. ప్రతిదీ ఇప్పటికే లోపలే ఉన్నది. ఎవరైతే వెతుకుతున్నారో, వెతకబడేది కూడా వారే. నిశ్చలత్వమే సత్యము. శాంతమ్మాళ్, శ్రద్ధతో వీటిని వ్రాసి ఉండకపోతే ఇటువంటి సంఘటనల వివరాలు, సాధకులమైన మనకు లభ్యమయ్యేవి కావు.

అద్భుతమైన పాకశాస్త్ర ప్రవీణురాలే కాకుండా, శాంతమ్మాళ్ చాలా బలమైన స్త్రీ. ఒక రోజు ఒక పెద్ద పాత్రలో సాంబారు మరుగుతున్నది. భగవాన్ అకస్మాత్తుగా వంట గదిలోనికి వచ్చారు. ఆ పాత్ర ఎంత పెద్దది అంటే, దానిని మొయ్యడానికి సాధారణంగా ముగ్గురు మనుషులు కావాలి. ఆ సాంబారు అప్పటికే బాగా మరిగి పోయినందున, దానిని పొయ్యి మీద నుండి క్రిందకు దింపమని చెప్పి వెళ్ళిపోయారు భగవాన్. ఆ చుట్టు ప్రక్కల ఎవరూలేనందు వల్ల శాంతమ్మాళ్, ఏ మాత్రం ప్రయాస పడకుండా ఆ పాత్రను దించి ప్రక్కన పెట్టారు. అది చేసిన తర్వాత ఆమె ఆశ్చర్యంతో అనుకున్నారు." ఇది భగవాన్ చే చెయ్య బడ్డ అద్భుతమే. మామూలుగా ఒక్క స్త్రీ దానిని తాకను కూడా లేదు. కానీ భగవాన్ చెప్పారు కాబట్టి, నేను దానిని ఎత్తి అవతల పెట్టగలిగాను." అంత ప్రగాఢమైన విశ్వాసము గల స్త్రీ ఆమె.

శాంతమ్మాళ్ పల్లా కొత్తులో ఉండే సాధువుల పట్ల,దయగానూ, వారికి సహాయకారిగాను ఉండేవారు. వారి భోజనాన్ని వారే వండుకోవలసి ఉన్నది. గనుక, వారు చేసుకోలేనివి, ఊఱగాయ పచ్చళ్ళు, తీపి పదార్థాలు, ఆశ్రమంలో తయారు చెయ్యబడ్డ రుచికరమైన పదార్థాలు వారికి పంపు తుండేది. ఇదంతా భగవాన్‌కు చెప్పేచేస్తుండేది. ఒకప్పుడు ఎక్కువ రకాల కూరగాయలను ఉపయోగించి తయారు చెయ్యబడిన, అవియల్ అనే రుచికరమైన దక్షిణాది వంటకాన్ని ఆశ్రమంలో తయారుచేశారు.

భగవాన్ శాంతమ్మాళ్ ను ప్రక్కకు పిలచి, "మురుగనార్‌కు అవియల్ అంటే ఇష్టము. మురుగనార్‌కు అవియల్ ఎవరు ఇస్తారు?" అన్నారు, శాంతమ్మాళ్, వెంటనే వంటగది లోనికి వెళ్ళి, అవియల్‌ను పార్శిల్ చేసి, పల్లాకొత్తుకు పరుగున వెళ్ళారు. మురుగనార్ భిక్ష కొరకు టౌనుకు వెళ్ళి ఉన్నందున ఆయన అక్కడ దొరకలేదు. ఆమె దారిలో ఆయనను పట్టుకుని, భగవాన్ ఆయన కొరకు అవియల్ పంపిన విషయం చెప్పారు. తన సద్గురువుకు గల (శ్రద్ధను) కరుణను చూచి మురుగనార్ బిగ్గరగా ఏడ్చేశారు.

వృద్ధురాలైన పిదప, ఆమె ఆశ్రమానికి భౌతికంగా సేవ చెయ్యలేనని భావించారు. ఆశ్రమముపై భారంగా ఉండటము ఇష్టము లేక ఆమె ఆశ్రమాన్ని వదలి వెళ్ళి పోవాలనుకున్నారు. ఆ రాత్రి భగవాన్ ఆమె స్వప్నంలో కన్పించి, "ఎక్కడకు వెళ్తారు శాంతమ్మాళ్? మిమ్మల్నెవరు కనిపెట్టి ఉంటారు?" అన్నారు. తానే ఆమెను కనిపెట్టి ఉంటానని, భగవాన్ ఆమెతో పరోక్షంగా చెప్పారన్న మాట. శాంతమ్మాళ్, తన చివరి రోజుల వరకూ ఆశ్రమంలో ప్రశాంతంగా గడిపారు.

శంకరమ్మాళ్

శంకరమ్మాళ్ ను గురించిన వివరాలేమీ లేదు. మనకు తెలిసినదంతా ఆమె బాల్యవితంతువు అనీ, వంట మనిషిగా మారిందనీ తప్ప. భారతదేశంలోని బాల్యవితంతువు లందరూ, భగవంతుని గురించి స్మరిస్తూ, పఠిస్తూ, దైవ మందిరాలను దర్శిస్తూ ఉండమని ఉద్భోదింపబడేవారు. శంకరమ్మాళ్ చాలా తెలివిగల బాలిక. ఆమె దేవుడిని వెతకటమంటే, సత్యాన్ని వెదకటమేనని, ఎందుకంటే లెక్కలేనంత మంది దేవుళ్ళు ఉన్నప్పటికీ, ఒకే ఒక విశ్వజనీన సత్యం ఉంటుందని, కనుగొన్నారు. ఎంతో చిన్న వయసు లోనే ఆవిడ ఇలా భావించారు.

ఆమె కుటుంబంలో, ఆమె పట్ల దయతో ఉండే ఒకే ఒక వ్యక్తి, ఆమె సోదరుడు. ఆమె కౌమార దశలో ఉన్నపుడు (13–19 మధ్య వయస్సు) ఆమెకు కైవల్యనవనీతము, యోగవాశిష్టమువంటి ఆధ్యాత్మిక గ్రంధములను పరిచయం చేశారు. వందలాది మంది దేవుళ్ళు, దేవతలూ ఉన్నప్పటికీ హిందూ మతం ప్రకారం, వాటి వెనుక అంతర్లీనంగా ఉన్నది ఒకే ఒక సత్యమనే ఆమె ప్రగాఢ విశ్వాసాన్ని, ఆ గ్రంధాలు బలపరచినవి. కేవలం సద్గురువు కృపకు పాత్రులమైతేనే, సత్యానికి చేరువ కాగలమనే, ఆమె విశ్వాసాన్ని కూడా ఆ గ్రంధాలు బలపరచినవి, సత్యము ఎప్పుడూ 'ఏఱుక' రూపం లోనే ఉంటుందనే అద్వైతిక వివరణను గూడా ఆమె అవగాహన చేసుకున్నారు. ఈ పరిజ్ఞానము, ఆమెను అంతరంగం లోనికి ప్రవేశించి దానిని అనుభవము లోనికి తెచ్చుకొనమని ప్రోత్సహించింది.

శంకరమ్మాళ్ చాలా పవిత్రప్రదేశాలనూ, ఆలయాలను సందర్శించారు. ఆమె సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చు కొనుటకై తహతహ లాడారు. కానీ, దానిని పొందగలగాలంటే, గురువు పాదాల వద్దకు చేరితే కానీ సాధ్యపడదని ఆమెకు తెలియును. తనలో ఉన్న ఈ తపన గురించిగానీ, పరిజ్ఞానాన్నీ గురించి గానీ ఎవరికీ చెప్పుకోలేక పోయింది, ఆమె. సద్గురువైన రమణులు ఆమెను ఇంకా సమస్యలలో ఉంచుతారా? త్వరలోనే, ఆమె సోదరుడు అరుణాచలేశ్వర ఆలయాన్ని దర్శించటానికి. అరుణాచలానికి తీసుకుని వెళ్ళారు. అక్కడ ఏమి జరిగిందీ అంటే, ఆ అన్నాచెల్లెళ్ళు, లింగాకారములో ఉన్న స్వామిని అర్చిస్తుండగా, ఎక్కడనుండి వచ్చాడో తెలియని పూజారి ఒకరు, "ఓహో! మీరిద్దరూ రమణ మహర్షిని సందర్శించడానికి వచ్చారన్న మాట," అన్నారు. శంకరమ్మాళ్ మొదటి సారిగా ఆ పేరును విన్నది. కాని ఆమె పారవశ్యంతో కొద్ది క్షణాల పాటు శరీరస్పృహనే కోల్పోయింది. ఆమె సోదరుడు అది గుర్తించి ఆమెను రమణాశ్రమానికి తీసికుని వెళ్ళారు.

శంకరమ్మాళ్, భగవాన్ ఎదుటకు వెళ్ళినపుడు, ఆమెను, ఆయన కరుణరసపూరిత మైన చిరునవ్వుతో చూచారు. "నా వద్దకు రావటానికి నీకింత కాలము పట్టిందా ?" అని ప్రశ్నిస్తున్నట్లుందా చూపు. చాలా మంది యితర భక్తులు, తమకు కూడా ఆ చూపు అలానే కన్పించిందని అన్నారు. కైవల్య నవనీతములోనూ, యోగవాశిష్టము లోనూ, చెప్పబడ్డ, జ్ఞాని యొక్క లేదా సాక్షాత్కారము పొందిన వాని యొక్క లక్షణములన్నీ ఆయనలో కన్పించినవి ఆమెకు. మొదటి చూపులోనే, ఆయన మానవ రూపం ధరించిన దైవమని ఆమె గుర్తించింది. భగవాన్, ఆమెను చూచి చిరునవ్వు నవ్వగానే, ఆయనే తన సద్గురువు కూడా అని ఆమెకు నిశ్చయమయింది. సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటం కోసము ఆమె సద్గురువు కావాలని కోరుకున్నది, ఎట్టకేలకు ఆయన సన్నిధికి చేరుకున్నది. ఈ విధమైన పారవశ్యము, అత్యున్నతమైన స్థితిగా కైవల్య నవనీతములోనూ, యోగ వాశిష్ఠము లోనూ తెలుప బడియున్నది. ఈ స్థితిలో ఏ ఆలోచనలూ ఉండవు కేవలమూ సద్గురువు పంపిన ఆలోచనలు తప్ప. శంకరమ్మాళ్ ఆశ్రమంలోనే ఉండిపోయి, తన జీవిత పర్యంతము సద్గురువు సేవ చేయాలనుకున్నది.

శంకరమ్మాళ్ తన జీవితంలో ఏమీ కోరుకొనలేదు. ఆఖరికి, తన సోదరుని గూడా ఏమీ అడుగలేదు. ఆయన ప్రోత్సాహం వల్లనే, అనేక ఆలయములు, పవిత్ర ప్రదేశములూ చూచారు. ఆమె హిందూ సిద్ధాంతముల ప్రకారము నడచుకున్నారు. సోదరి, తన సోదరుని మాటకు తలవొగ్గి ఉండవలెనని సిద్ధాంతము. ఇప్పుడు మొదటిసారిగా ఏదో అడగాలని భావించారు. ఆమె సోదరునితో, "దయచేసి నన్నిక్కడ వదలి వెళ్ళండి. నన్ను సద్గురు సేవ చేసుకొన నివ్వండి అన్నారు. శంకరమ్మాళ్ సోదరుడు, సద్గురువు చెంత నుండి, ఆయనను సేవించుకొన వలెననే ఆమె తపనను గుర్తించారు. ఆయన వెంటనే ఆశ్రమ ఆఫీసుకు వెళ్ళారు." అక్కడ సర్వాధికారి చిన్న స్వామి దేని గురించో ఆందోళనతో ఉన్నారు. ఆశ్రమసభ్యులతో

ఏదో విషయాన్ని చర్చిస్తున్నారు. వారుయిలా అనుకుంటున్నారు. శాంతమ్మాళ్ అనే ఆశ్రమ వంట మనిషి కొద్దిరోజుల పాటు ఆశ్రమానికి దూరంగా వెళ్తున్నారు. ఇంతమంది సందర్శకులకు, రానున్న ప్రముఖ వ్యక్తులకు ఎవరు వంట చేస్తారు? అదే భగవాన్ అనుగ్రహమూ, లీలా కూడా. తన సోదరి ఆశ్రమంలో ఉండి పోవాలనుకుంటున్నదని, శంకరమ్మాళ్ సోదరుడు చిన్నస్వామితో చెప్పినపుడు, వెంటనే ఆయన "ఆమె వంట చేస్తుందా?" అని అడిగారు. శంకరమ్మాళ్, సంతోషంతో అంగీకరించి రమణాశ్రమంలో ఉండి పోయినది.

భగవాన్ తరచుగ వంట గదిలోనికి వస్తూ ఉండలం వల్ల, శంకరమ్మాళ్, భగవాన్‌కు కనుచూపు మేరలో ఉండటం సాధ్యపడింది. అందులకామె ఎంతోసంతోషించారు. ఎందుకంటే భగవాన్, జ్ఞాని అనే పదానికి, ఖచ్చితమైన ఉదాహరణ కనుక. ఆయన యొక్క ప్రతి కదలిక, అందంగా, (ఖచ్చితంగా) వంక పెట్టలేని విధంగా ఉండేవి. ఆయన చూపు, ఆయన నడక, ఆయన కదలికలు, సంజ్ఞలు, ఆఖరికి ఆయన ఒక కప్పును క్రింద పెట్టటము కూడా ఎంతో చక్కగా, హుందాగా ఉండేవి. ఆమె ఎల్లప్పుడూ ఆంతరంగికమైన సంతోషములో మునిగి ఉండేది. అందుకని ఆమె గురించి వ్రాయటానికి సమాచారమేమీ లభ్యమవలేదు. అందుకనే ఏ రికార్డులోనూ, ఆమె పేరు వ్రాయబడలేదు. చలంగారు, ఆశ్రమ వంటశాలలోని సహాయకుల నందరినీ, విడివిడిగా (ఇంటర్వ్యూ) ప్రశ్నాపూర్వక సంభాషణ చేసి, వారి ఫోటోలను తీసుకున్నపుడు, ఆమె తన ఫోటో తియ్యటానికి అనుమతించలేదు. కానీ ఆమె గురించి ఒక విషయము చెప్పవలసిన అవసరము ఉన్నది. పనిలో నిమగ్నమై ఉన్నపుడుగానీ వంటగదిలో ఒక మూల మౌనంగా కూర్చుని ఉన్నపుడుగానీ, ఎల్లవేళలా ఆమె నిరంతర ఆనందంలో నిలచి ఉండేవారు. ఆమె ఎప్పుడూ ప్రశాంత స్థితిలో ఉండేవారు.

1956లో నా డిగ్రీ పూర్తి అయిన తర్వాత, నాకు ఉద్యోగము దొరికేవరకూ నేను రమణాశ్రమము లోనే ఉన్నాను. అప్పటికి నాకు 22 సంవత్సరములు. రెండేళ్ళు గడచిపోయినవి, అయినా నాకు ఉద్యోగం దొరకలేదు. భగవాన్ నన్ను తన వద్ద శిక్షణ పొందటానికై ఉంచుకున్నారు. ఆశ్రమానికి వచ్చే భక్తులను, మహాత్ములను కనిపెట్టి చూచుకొనవలసినదిగా నాకు చెప్పారు. నా పాఠశాల ఉపాధ్యాయులైన టి.కె. సుందరేశ అయ్యర్, నాకు శిక్షణ నిచ్చే బాధ్యతను తీసికున్నారు. ఆయన నన్ను మహాత్ముల కే గాక పాత భక్తులకు గూడ పరిచయం చేశారు. అప్పుడు నేను శంకరమ్మాళ్ ను గమనించాను. అప్పటి కామె 60 సంవత్సరాలు దాటిన వయసులో ఉన్నారు. ఆమె ఎప్పుడూ, ఒక మూలన కూర్చుని ఉండేవారు. ఆమె ఎప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడేవారు కాదు. నిజానికి భగవాన్ జీవించి ఉన్నపుడు కూడా ఆవిడ, ఆయనతో కూడా పెద్దగా మాట్లాడేవారు కాదు. దానికి కారణ మేమంటే, అడగకుండానే భగవాన్ తన అనుగ్రహాన్ని ఆమెపై కురిపించే వారు. అందుకని మాటలతో పని ఉండేదికాదు. ఆమె సన్నగా, నల్లగా ఉండి, ఆకర్షణీయంగా ఉండేది కాదు. ఆమె ముభావంగా ఉండే స్వభావం గలది. ఆమె కలుపుగోలుగా ఉండకపోవుట వలన, ఎవరూ ఆమె దగ్గరకు వెళ్ళే వారు కాదు. ఇవన్నీ ఇలా ఉన్నప్పటికీ, బహుశా భగవాన్ కృప వలన కాబోలు నాకెప్పుడూ ఆవిడ పట్ల ఆకర్షణ ఉండేది. నేను వెళ్ళి ఆమె ప్రక్కన కూర్చున్నపుడు ఆమె ముభావంగా ఉండేది. చివరకు ఒకరోజున నాకు భగవాన్ గురించి చెప్పండి అన్నాను. చెప్పేదాకా ఆమెను వదలి పెట్టలేదు.

భగవాన్ యొక్క మౌనమే ఆయన సూటి బోధ. ఆయన మౌనాన్ని అవగాహన చేసుకోలేనివారికి మాత్రమే ఆయన ఆత్మ విచారణను బోధించేవారు. అందువల్ల, ఆయన బోధలలో ఆత్మ విచారణకు ద్వితీయ స్థానమే ఉన్నది. ఆయన బోధను, తన అనుగ్రహ వీక్షణం తోనే చేసేవారు. ఈ చూపునే మురుగనార్, ఇతరులు కృపా వీక్షణమని, అనుగ్రహ వీక్షణమని అంటారు. భగవాన్‌తో మాట్లాడవలసిన అవసరము ఎప్పుడూ ఉండేదికాదు. ఆయన నన్ను నిదానంగా, నిలకడగా పరిపక్వత చెందునట్లు చేశారు. భగవాన్ భక్తులందరూ ఆయన అనుగ్రహ వీక్షణాన్ని (కృపాదృష్టిని) ఎక్కువగా పొగుడుతారు. కాని ఆయన అంతర మౌనానికి ఆ వీక్షణము కేవలము బాహ్య (ప్రకటన) వ్యక్తీకరణ మాత్రమే. మౌనమే భగవాన్ స్థితి. ఆయన సూటి బోధ మౌనం ద్వారా మాత్రమే జరిగేది. ఆయన మౌనమనే సందేశాన్ని అందుకున్న వారికెవరికీ కూడా, ఆయనతో మాట్లాడవలసిన పనికానీ, ఆయన బోధలతో పనికాని ఉండదు. మౌనం ద్వారా జరుపబడే ఆయన నిగూఢమైన కార్యాన్ని నేను మాటలలో ఎలా వ్యక్త పరచగలను?

నేను ఆవిడను ప్రశాంతంగా ఉండనివ్వడానికి సిద్ధంగా లేను. ఒక ఇనప (రజను) రేణువు అయస్కాంతము వైపు ఆకర్షితమైనట్లు, నేను ఆవిడ పట్ల ఆకర్షితుడైనాను. ఆవిడ వంట గదిలోని పనిని చాలా శ్రద్ధగా నిర్వహించేవారు. అందులో నుండి ఎప్పుడూ తప్పు కునేది కాదు. నేనెప్పుడూ పనిగట్టుకుని ఆవిడను ప్రశ్నిస్తూనే ఉండేవాడిని. నేనెల్లప్పుడూ, ఆవిడను, "మీరే స్థితిలో ఉన్నారు? అని ప్రశ్నించే వాడిని. మీరు బాగా చురుకుగా ఉన్నారు కాబట్టి మీరు సమాధి స్థితిలోలేరు. మీరు కళ్ళు తెరచుకుని ఉన్నారు కానీ, అయినా ఒక విధమైన మౌనంలో ఉన్నారు. అది ఎటువంటి స్థితి? మీరు దయచేసి నాకు చెబుతారా?

శంకరమ్మాళ్ సూక్ష్మ బుద్ధి కలవారే కాదు, దృఢమైన స్వభావము కలవారు. ఆమె తన పనిలో పూర్తిగా నిమగ్నమై ఉండేవారు. ఆమె తన పనిని ఎంతో శ్రద్ధతో, ఏకాగ్రతతో చేసేవారు. ఆమె ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడుతూ కన్పించే వారుకాదు. ఈ గుణాలన్నీ ఇతరులు ఆమెను తప్పుకుని తిరిగేలా చేశాయి. కానీ నా మీద మాత్రం అవి వ్యతిరేక దిశలో పని చేశాయి. నేను ఆవిడ వైపుకు బలంగా ఆకర్షితుడనైనాను. ఆవిడ గురించి తెలుసుకుంటున్న కొద్దీ, ఆమె పట్ల నా గౌరవము పెరగసాగింది. ఆవిడ చాలా అసాధారణ మైన వ్యక్తి అని నాకు విశ్వాసం కలిగింది. అందుకని, ఆమె ఎల్లపుడూ సమస్థితిలో ఉండుటకు గల రహస్య మేమిటో చెప్పమని ప్రాధేయ పడ్డాను. చాలాసార్లు పట్టుదలగా ప్రయత్నించిన తర్వాత, ఆఖరికి ఆమె కొంచెం మెత్తపడ్డారు. ఆమె ఇలా విశదపరచారు, "నా కున్నటువంటి ఈ అంతరంగిక మైన ఆనందాన్ని చూచి నేనే తికమక పడేదాన్ని. ఈ స్థితి మన పవిత్ర గ్రంథాలలో ప్రశంసింపబడినది. నేను చాలా సామాన్యమైన స్త్రీని కనుక, ఈ స్థితిని గూర్చి సందేహంలో ఉండేదాన్ని మహర్షులు, మహాత్ములు గూడా, ఈ స్థితిని అందుకొనడానికి, ఏళ్ళ తరబడి తపస్సు చేసేవారని మన వేదాల్లో ఉన్నది, "నేను నిజంగా ఆ స్థితిలో ఉన్నానా?" అని నాకు ఆశ్చర్యంగా ఉండేది. ఇటువంటి సందేహాల్లో కూరుకుని పోయి, ఎవరిని అడగాలో తెలియక, ఆవిడ అవకాశము కోసము వేచి ఉన్నారు. ఒకరోజు ఉదయపు ఫలహారము తర్వాత, ఆమె, భగవాన్ మాత్రమే ఉన్నారు. తాను నిజంగా, అటువంటి, అసాధారణమైన ప్రశాంత స్థితిలో ఉన్నానా? అని ఆయనను ఎలా అడగాలా అని ఆమె ఆలోచిస్తున్నారు. శంకరమ్మాళ్ భగవాన్‌కు సాగిలపడి నమస్కరిస్తున్నపుడు, కైవల్య నవనీతము లోని ఒక పద్యము ఆమెలో స్ఫురించింది. అందులో గురువు, శిష్యుని నీవేమి అర్థము చేసుకున్నావో చెప్పు అంటారు. ఆ శిష్యుడు, చేతులు జోడించి, గురువుగారితో ఇలా చెబుతారు, "ఓ ప్రభూ! నా హృదయంలో సత్యమై ఉంటూ, నా లెక్కలేనన్ని జన్మలన్నింటిలోనూ నడిపించింది మీరే, మానవ శరీరాన్ని ధరించి నన్ను విముక్తుడిని చేసి, నీ బోధ ద్వారా ఈ అంతర్గత ఆనందస్థితిని ప్రసాదించిన మీకు జయమగుగాక, నన్ను ముక్తుడిని చేసిన మీ అనుగ్రహమునకు ఋణము ఎలా తీర్చుకోవాలో నాకు తెలియుట లేదు. నీ పవిత్ర పాదములకు జయమగుగాక.

ఆమె ఈ పద్యాన్ని పాడినపుడు భగవాన్ ఆమె వైపు కరుణతో చూచి, అంటారు, "అందులో సందేహించడానికి ఏమి ఉన్నది?" అవును. దానికి జవాబు తరువాత పద్యములో ఉన్నది. ఆ తర్వాత పద్యము ఏమంటుందంటే, శిష్యుని వివరణ విన్న తర్వాత గురువు పరమానంద పడిపోతారు. గురువు శిష్యుని దగ్గరకు రమ్మని, కౌగిలించుకుని, ఆత్మ నిష్ఠుడవై ఉండి, ఈ అంతరంగికమైన ఆనందంలో నిలచి ఉంటూ అజ్ఞానము, అస్థిరత్వము, తప్పుడు జ్ఞానము అనే మూడు అవరోధములకు తావివ్వకుండా, ఉండటమే నీవు నా కివ్వగలిగిన అత్యున్నత పురస్కారము. (కైవల్య నవనీతము ఇంగ్లీషులో కూడా అచ్చులో ఉంది. ప్రతి వారూ ఈ గురు శిష్యుల సంభాషణను తప్పకుండా చదవమని నా కోరిక. ఈ చిన్న పుస్తకము రెండు భాగములుగా ఉంటుంది. మొదటి భాగములో, గురువు 'అహం' స్ఫురణను గూర్చి ('నేను', 'నేను' అనే అంతర స్ఫురణను గూర్చి) శిష్యునకు బోధించటము, ఆ శిష్యుడు దానిని గ్రహించటము. రెండవ భాగములో గురువు నువ్వేమి అర్థము చేసుకున్నావో చెప్పమనగా, ఆ శిష్యుడు మేధస్సుచే గాక అనుభవపూర్వకముగా అర్థము చేసుకున్న దానిని వివరించడము ఉంటుంది. అందుకే కైవల్య నవనీతము చాలా ముఖ్యమైన గొప్ప పుస్తకము. శంకరమ్మాళ్, భగవాన్ వైపు చూశారు, భగవాన్ కూడా, ఆమె వైపు కొన్ని నిముషాలు స్థిరంగా చూశారు. శంకరమ్మాళ్ కళ్ళు నీటితో నిండిపోయినవి. ఆమె పదే పదే ఆయన పాదాలకు మొక్కారు. "అప్పటినుండి, నేనా స్థితిలోనే ఉన్నాను ఏ ఆలోచనలూ లేకుండా," అన్నారు శంకరమ్మాళ్.

మనము ఎంతగా చదివి నప్పటికీ, అవి జీసస్‌యొక్క, బుద్ధుని యొక్క లేదా రమణుల యొక్క బోధలు కానివ్వండి, మనము వాటిని ఆచరించడం అసాధ్యము అనే అభిప్రాయంతో వాటికి కొంత దూరములో ఉంటాము. ఇది మానవ మేధస్సు కల్పించిన పరిధి. "అది జీసస్‌కు, బుద్ధునికి, రమణులకు సాధ్యమైంది. కానీ నాకెలా సాధ్యమౌతుంది?" అనుకుంటాము మనము. ఆమె చనిపోయే వరకూ ఆమెకు సన్నిహితంగా ఉండే సద్భాగ్యము నాకు లభించింది. కనుక ఆమె నుండి నేను గ్రహించ గలిగాను. ఆమె సత్యాన్ని జీవించింది. అందుకని నేను ఆమె నుండి చాలా స్పష్టత పొందాను.

ఒకసారి నేను, ఆమెను, నా సాధనలో సహాయకారిగ ఉండేందుకు భగవాన్ వ్రాసిన రెండు పద్యాలను సూచించమని కోరాను. వెంటనే ఆమె తమిళ అక్షరమణ మాలలోని రెండు పద్యములను పాడారు. నావికుడు లేని ఓడ పెను తుఫానులో చిక్కుకున్నట్లు సంసార సాగరంలో చిక్కుకున్న నన్ను కాపాడుము. ముక్కు లేని వాని ముందు చూపబడు అద్దము వలెగాక, నన్ను ఆదరముతో కౌగిలించుకుని కరుణింపుము అరుణాచలా! వాటి ప్రత్యేకత ఏమిటి అనినేడిగేలోపుననే, ఆమె వివరించారు. ప్రారంభంలో సాధకులు వారిలో రెండు లోపాలను చూస్తారు. ఒకటి వారిలో పరిపూర్ణత లేదు (అనేక లోపాలున్నవని) అని, సాధనలో వారెదుర్కొనే తీవ్రమైన అడ్డంకులను ఎలా అధిగమించాలో తెలియక పోవుట అనేది. ఆ రెండు సాధకుని నిస్పృహలో ముంచేస్తవి. ఈ రెండు పద్యాలతో, అలా పైకి కన్పించే భయాలను తొలగిస్తారు భగవాన్. ఆ ఉన్నతమైన శక్తికి పూర్తిగా శరణాగతి చెందటమే, అన్ని ఆధ్యాత్మిక జబ్బులను నయం చేసే సర్వరోగ నివారిణి. జ్ఞానమును స్వచ్ఛమైన పాలతోగాని అమృతము తో గాని పోల్చవచ్చును. శరణాగతి అనేది వాటిని తనలో ఉంచి జాగ్రత్త పరచి మనకు అందించే పాత్ర వంటిది. శరణాగతి సాధకుని తన హృదయం లోనికి మునుగునట్లు చేస్తుంది.

శంకరమ్మాళ్ మరణ సమయంలో పూర్తి స్పృహలో ఉన్నారు. ఆమె కనులు మూసుకుని చిరునవ్వుతో శరీరాన్ని వదలి వేశారు. మరణము ఆమెను భయపెట్టలేదు. ఆమెను ఆశీర్వదించమని కోరగా, ఆమె చిరునవ్వు నవ్వి అన్నారు. "ఇవ్వటము, పుచ్చుకొనటము అనే ఈ మాటలు ఏమిటి? నీ లోపల ఉన్న ఆనందంలో నిలిచిపో, నువ్వు ఇప్పటికే అదిగా ఉన్నావు. ఎల్లపుడు అందులోనే ఉన్నావు".



సుబ్బలక్ష్మి అమ్మాళ్

వంట వారితోటి భగవాన్ అనుబంధం ప్రత్యేకంగా ఉండేది. వారితోటి, ముఖ్యంగా బాల్య వితంతువుల తోటి ఒక మిత్రునిలా మెలిగే వారాయన. వారితో కలసి మెలసి ఉన్నట్లు కనిపించి నప్పటికి, గొప్ప పండితులకు తాను చేసే బోధనే వారికి కూడా చేసేవారు. తన బోధలోని నిజమైన లోతులను వారు గ్రహించేటట్లు చేసేవారు. సద్గురువు అత్యున్నతమైన బోధను నిష్పక్షపాతంగా అందరికీ ఒకే విధంగా చేస్తారు అనే దానికి ఇదే గుర్తు.

వారణాశి. సుబ్బలక్ష్మి అమ్మాళ్ పదహారేళ్ళ వయసుకే వితంతువుగా మారింది. ఆమెకు ఉన్న ఒకే ఒక ఆధారం ఆమె తల్లి. ఆమె కూడా గట్టి ఆధ్యాత్మిక సాధకురాలు. వారు నెల్లూరు దగ్గరలో ఉన్న ఒక గ్రామంలో ఉండేవారు. వాళ్ళు తరచుగ యాత్రలకు వెళ్ళి, ఇతర ఊళ్ళలో ఉన్న ఆలయాలను సందర్శించేవారు. అలా ఒక యాత్రలో వాళ్ళు అరుణాచలానికి వెళ్ళారు. విరూపాక్ష గుహలో ఒక చిన్నముని ఉన్నారని విని, అక్కడకు వెళ్ళారు. భగవాన్‌ను చూడంగానే, సాక్షాత్తూ అరుణాచలుడే మానవ రూపం ధరించి వచ్చారని విశ్వాసం వారికి కల్గింది. ఆమె మాటల్లోనే చెప్పాలంటే, "ఆయనకు అప్పుడు సుమారు 30 సంవత్సరముల వయసు ఉంటుంది. ఆయన పుటం పెట్టిన బంగారం వలె మెరిసిపోతున్నారు. ఆయన కళ్ళు తామర రేకుల్లా ప్రకాశిస్తున్నవి. ఒక గాఢమైన శాంతి ఆయనను ఆవరించి ఉన్నది.

ఆమెకు 31 సంవత్సరాల వయస్సు ఉన్నపుడు, ఆమె మరల భగవాన్ వద్దకు వచ్చారు. అప్పటికి భగవాన్, కొండపాదం వద్ద ఉన్న రమణాశ్రమానికి వచ్చేశారు. అప్పుడు చాలా కొద్ది సమయమే ఉన్నారు. ఒక సంవత్సరం గడిచింది. ఆమెకు భగవాన్ సన్నిధిలో ఉండాలని, కోరిక ఉంది గాని రాలేకపోయింది. ఒకరోజు స్వప్నంలో ఆమెకు బాగా తెలిసిన పండితులొకరు కన్పించి, "ఎక్కడో వెతకవలసిన అవసరం నీకేమున్నది ? నిన్ను నువ్వు భగవాన్ రమణులకు అర్పించుకో, ఆయన స్వయంగా దైవమే. ఆయన నీకు మోక్ష మార్గాన్ని చూపిస్తారు." అన్నారు. నెల్లూరు పర్వతమ్మ అనే స్నేహితురాలితో కలిసి ఆమె భగవాన్ వద్దకు వెళ్ళారు. వారిద్దరూ కాశీకి వెళ్ళి, జీవితమంతా ఆ పవిత్ర నగరంలోనే గడపాలని నిర్ణయించుకున్నారు. అటువంటి గొప్ప యాత్రకు వెళ్ళే ముందు, భగవాన్ వద్ద ఆధ్యాత్మిక బోధ పొంది వెళ్దామని, భగవాన్ వద్దకు వచ్చారు. ఆమె భగవాన్‌ను అడిగారు. "ఆత్మ అంటే ఏమిటి? సర్వత్రా వ్యాపించి యున్న ఆకాశమా? లేక అన్నిటినీ చూస్తూ సాక్షి గా ఉండే ఎఱుకా?" అని భగవాన్ ఆమె వైపు నిశితంగా చూసి అన్నారు, "ఆత్మలో నిష్ఠుడవై ఉండు ఏ విధమైన ఆలోచనలూ లేకుండా, ఆత్మ యొక్క స్వభావాన్ని గురించి చింతించకు", తన మనసంతా కరిగిపోతున్నట్లు సుబ్బలక్ష్మీ అమ్మాళ్‌కు అన్పించింది. ఏ ఆలోచనా రాలేదు. ఆమె మనసంతా, గాఢమైనశాంతితో నిండిపోయింది.

వారణాసి యాత్రను వదలివేసి, తిరువణ్ణామలై టౌన్‌లో ఉండి, ప్రతిరోజూ ఆశ్రమానికి వస్తూ, మౌనంలో, శాంతిలో కాలం గడిపేది. అప్పుడు భగవాన్ సోదరి అలమేలు అమ్మాళ్ కోరడంతో, ఆశ్రమంలోని వంట పనిలో, సాయం చెయ్యడానికి అంగీకరించింది. వంట గదిలో భగవాన్ సాన్నిధ్యం దొరకడంతో ఆమెకు కొంత ఊరట కల్గింది. ఆమె కఠినమైన ఆచారాలు పాటించే మనిషి అగుట వల్లనూ, పని భారం ఎక్కువగా ఉండి, ఆమె సమయం మొత్తం దానికే సరిపోవడం వల్లనూ ఆమె తన గ్రామానికి వెళ్ళిపోయారు. కొంత కాలము గడిచేటప్పటికి, ఆమె ధ్యానంలో ఏదో వెలితిని అనుభవించసాగింది. సద్గురువుకు దూరంగా ఉంటున్నాననే బాధ ఆమెను ఆశ్రమానికి తిరిగి వచ్చేలా చేసింది. ఆమె శాంతిని పొందారు. ఆ రోజు ఉదయాన్నే, శాంతమ్మాళ్‌కు భగవాన్, సుబ్బలక్ష్మీ అమ్మాళ్ వస్తారు, ఆమెకు భోజనం తీసి ఉంచండి అని చెప్పటం గురించి విని మరింత ఆనందం పొందారు. ఆయన యొక్క అవ్యాజ్యమైన ప్రేమ, తనులేనపుడు కూడా, తన పట్ల కనబరచిన శ్రద్ధ ఆమెను ఉండిపోయి ఆయన సేవ చేసేలా చేసినవి.

మరల పనిభారము తనను ధ్యానము చేసుకోనివ్వడము లేదని ఆమె భావించసాగారు. భగవాన్ ఆమె బాధను అర్థం చేసుకుని ఒకరోజు ఆమెతో అన్నారు, "నువ్వు ధ్యానం గురించి ఇంకా తపన చెందుతున్నట్లు కనిపిస్తున్నది" అని. "అవును

భగవాన్ ఇక్కడ నాకేముంది భగవాన్ ఎడతెరపి లేని పనితప్ప", అన్నారామె. భగవాన్ ఆమెను జూచి చిరునవ్వు నవ్వి అన్నారు "నీ చేతులు పని చేస్తుండ వచ్చును కానీ, నీ మనసు నిలకడగా ఉండవచ్చును. ఏదైతే ఎప్పటికీ చలింపదో అదే నీవు. దానిని గుర్తించు. అపుడు నీకు పని భారమనిపించదు. నువ్వు ఈ శరీరాన్ని అనీ, నువ్వు పనిచేస్తున్నాననీ భావిస్తే, నీ జీవితం ఒక అంతులేని పనిగా అన్పిస్తుంది, నిజానికి మనసు పనిచేస్తున్నది. శరీరము కాదు. నీ శరీరము విశ్రాంతిగా ఉన్నంత మాత్రాన నీ మనసు కూడా విశ్రాంతిగా ఉంటుందా? నిద్రలో కూడా కలలతో మనసు తీరుబాటు లేకుండా ఉంటుంది". ఆమె అడిగారు, "నేను, నేనీ శరీరాన్ని కాను అని ఎల్లవేళలా ఎందుకు గుర్తించుకోలేకపోతున్నాను? భగవాన్ నవ్వి అన్నారు, "ఎందుకంటే నువ్వింకా తగినంత జ్ఞానానుభవము పొందలేదు గనుక".

సుబ్బలక్ష్మీ అమ్మాళ్, తరచుగ ఉపవాసాలు చేస్తుండేది, ఆమె ఒక ప్రాచీన గ్రంథంలో ఇలా ఉన్నట్లు చదివింది. ఎవరైతే తనను తాను తెలుసుకో గోరతారో, అతడు, తన శరీరాని పట్ల శ్రద్ధ వహిస్తే, తనను నది దాటించమని ఒక మొసలిని కోరినట్లు అవుతుంది. ఆమె భగవాన్‌కు ఆ విషయాన్ని చూపింది. నువ్వు మాడమని దాని అర్థం కాదు. నువ్వు నీ శరీరాన్ని హింసించనక్కరలేదు. దాని అర్థం, శరీరానికి అవసరమైన దాని కంటే ఎక్కువ ఇవ్వవద్దని. నీ మనసుతో ఆత్మ విచారణ చేస్తూ, నీ శరీరాన్ని దాని పని దానిని చేసుకోనివ్వు. అది నీకు ఆటంకంగాకుండా ఉంటుంది. దీనికి, స్వచ్ఛమైన తాజాగా తయారైనది, తగు మోతాదులో ఉండే ఆహారాన్ని తీసుకొనడం అవసరము. మరొకసారి కాషాయ వస్త్రాల్ని ధరించి, బిచ్చమెత్తకుంటానని కోరగా, భగవాన్ గట్టిగా వారించి,"నీకు రంగు బట్టలు వైరాగ్యాన్ని ఇస్తాయా? సన్యాసం అంటే ఏమిటో ముందు తెలుసుకో." అన్నారు.

ఒకరోజు కొంతమంది భగవాన్ ఎదుట కూర్చుని గురువును పొగుడుతూ పాడసాగారు. భగవాన్ పాట మధ్యలో లేచి వెళ్ళిపోయారు. ప్రార్థనలూ, పొగడ్తలూ, ఎవరినీ ముందుకు నడిపించ లేవు. సద్గురువు యొక్క ఒక కరుణాపూరితమైన చూపే, నిజమైన జ్ఞానాన్ని ఇస్తుంది. తాను, భగవాన్ యొక్క కటాక్ష వీక్షణాన్ని పూర్తిగా ఒకసారి కాదు అనేకసార్లు పొందానని, ఆమె గర్వంగా భావించారు. మర్నాడు భగవాన్ ఆమె వైపు జూచి అన్నారు, ఆరునెలల పిల్లలాగా ఉంటేగానీ, నిజమైన జ్ఞానానికి చేరువయ్యే అవకాశము లేదు.

భగవాన్ సన్నిధిలో జీవించడమే గొప్ప సాధన. ఎప్పుడూ ఆయనతో అలాగే ఉండేది. ఆయన వద్దకు ఎవరు వెళ్ళినా, ఆయన వారి స్థాయికి దిగి మాట్లాడే వారు. ఆయన మాటలు, కదలికలూ, కంఠస్వరమూ, ఆయన చుట్టూ ఉన్న వారికి తగ్గట్టుగా మారిపోయేవి. చిన్నపిల్లలకు వారితో ఆటలాడు చెలికాని వలె, కుటుంబీకులకు ఒక గొప్ప సలహాదారువలె, పండితులకు, జ్ఞాన రూపం వలె, యోగులకు, విజయాన్ని ఒసగే దేవుని వలె, అన్పించేవారు. ఆయన తనను వారిలో చూసేవారు. వారు తమను ఆయనలో చూసేవారు. వారి హృదయాలు, ఆయన పాదాలకు శాశ్వతమైన ప్రేమతో బంధింపబడేవి. ఆయన కేవలం ఉండటం ద్వారానే బలమైన ఐకమత్యభావనను ప్రసరింపజేసేవారు. ఏవిధంగా నైతే మంట కాంతిని ప్రసరింపజేస్తుందో ఆవిధంగా. భగవాన్ జ్ఞానము, కరుణల యొక్క ప్రతిరూపమే. ఆయన మా లోపాలను, తప్పులను పట్టించుకొనకపోయినా, మేము ఆయన బోధలను పొల్లుపోకుండా అనుసరించేటట్లు చేసేవారు. కొన్నిసార్లు ఒకపనిని ఆయన తృప్తి పడేవరకు మరల మరల చేయవలసి వచ్చేది. అది ఆయన కొరకు చేసేవారా? దాని వలన ఆయనకు ఉపయోగ మేముంటుంది? మనము పనులను సరిగ్గానే చెయ్యగలమని, ఓర్పు లేకుండుట, శ్రద్ధ లేకుండట వలననే పనులు సక్రమంగా జరుగకపోవటం సంభవిస్తుందనీ మనకు ఋజువు చెయ్యటానికే. ఆయన కొన్నిసార్లు మాచేత పని సరిగ్గా చేయించటానికి గట్టిగా, కఠినంగా ఉండేవారు. మనము గట్టిగా ప్రయత్నిస్తే ఆ పనిని సక్రమంగా చెయ్యగలమని ఆయనకు తెలుసు. మనకు తెలియదు. అనుభవం ద్వారా, ఆత్మస్థైర్యము, దాని ద్వారా ధర్మవర్తనము వలన కలుగు ప్రశాంతత లభించేవి. పనిని, జ్ఞానాన్ని కూడా చక్కగా బోధించగల ఉదాత్తమైన గురువు భగవాన్.

గురుశిష్యులుగా వారి అనుబంధము యొక్క లోతు తెలుపుటకు, సుబ్బలక్ష్మిఅమ్మాళ్ ఇలా అన్నారు. ఆయన సన్నిధిలో ప్రతిక్షణమూ ఆయన దైవమేననే భావన మాలో ఉండేది. ఆ భావం కల్గటం కూడా ఆయన అనుగ్రహం వల్లనే. ఎందుకంటే,

అప్పుడప్పుడు, తననిజ స్వరూపం అనగా తాను దైవమేనని, మనకు పరిచితమైన దేహంకాదనీ వెల్లడి అయ్యేటట్లు చేసేవారు. ఆయన పట్ల మాకు గల ప్రేమే మమ్మల్ని ఆయన పాదాలకు కట్టివేసి, ఇక్కడే ఉండిపోయేటట్లు చేసింది. ఆయన కొరకు మేము ఇల్లు వాకిలి, ప్రాపంచిక బంధాలను అన్నిటిని వదలివేశాము. ఆయన వలననే మేము క్షేమంగా ఉంటామని, ఏదో ఒక అద్భుతమైన రీతిలో మమ్ములను గమ్యం చేరుస్తారనీ మాకు తెలుసు. ఆయనే మా లక్ష్యము, మా నిజమైన స్వగృహము కూడా.

అదృష్టవశాత్తూ నేనామెకు దగ్గరగా ఉండేవాడిని. అప్పుడు నేను బొద్దుగా ఉండే రెండేళ్ళ పసివాడిని. నా సోదరులు బిడియస్తులు. నేను వారి వలె కాక, కుటుంబ సభ్యులు కాని వారితో కలవడానికి కూడా ఏమీ తటపటాయించేవాడిని కాదు. అందుకని ఈ వంటవారు నాతో ఆడుకుంటూ నన్ను ముద్దు చేసేవారు. ఒకరోజు సుబ్బలక్ష్మి అమ్మాళ్, నన్ను వంటగది బయటకు తీసికుని వెళ్ళి తన ఒడిలో కూర్చోబెట్టుకుని, భోజనం తినిపించారు. నా చేతులలో రెండు మామిడి పండ్లను గట్టిగా పట్టుకుని ఉన్నాను. అకస్మాత్తుగా ఒక పెద్ద మగకోతి, మామిడిపండ్లను చూసి నావైపునకు రాసాగింది. భయంతో నా ముఖాన్ని ఆమె వైపునకు త్రిప్పాను. ఆమె నన్ను కాపాడటానికి సిద్ధపడింది. తన రెండు చేతులతో నన్ను చుట్టి వేసి నాకు కోతి నుండి రక్షణ కల్పించింది. దాని వలన తనకు జరగబోయే అనర్థము గురించి ఆమెకు పూర్తిగా తెలుసును. ఆ కోతి కసితో ఆమె చేతిని కండ, ఊడిపోయేలా కొరికింది. తీవ్రంగా రక్తము కారుతుండగా, ఆమె నన్నెవరి చేతికో అప్పగించింది. అందరూ ఆమెకు రేబిస్ వ్యాధి సోకుతుందేమోనని భయపడ్డారు. అప్పట్లో రేబిస్‌కు మందు లేదు. దేవుని దయవలన ఆమెకేమీ జరుగలేదు. ఆమెను హాస్పిటల్‌లో జేర్చారు. ఆమె జీవితాంతము ఆమె చేతిపై లోతైన గాయము తాలూకు మచ్చఉండేది. నేను ఆ సంఘటనను గూర్చి మర్చిపోయాను.

నేను పెద్దయిన తర్వాత ఆమె చేతిపై ఉన్న మచ్చను చూచి, “మీ చేతి మీద ఈ మచ్చ ఏమిటి?” అని అడిగాను. నా చిన్నతనంలో నన్ను కాపాడే ప్రయత్నం లోనే ఆమెకు ఆ గాయమైందని విని, నేను తల్లడిల్లాను. సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఇలా పలుకుతూ నన్ను ఊరడించారు. “వద్దు,వద్దు, బాధపడకు. నేనే నీకు కృతజ్ఞత చెప్పుకోవాలి. ఎందుకంటే, ఆ సంఘటన జరిగిన చాలా రోజుల వరకూ భగవాన్ దృష్టి నాపై ఉండేది. ఆయన ఎప్పుడూ అడుగుతూ ఉండేవారు, “నీ గాయము ఎలా ఉన్నది? నయమైనదా? అని”. కేవలము ఆయన చూపే నాకు 'రేబీస్' రాకుండా కాపాడింది. అందుకని నేనే నీకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. నేను ఆమె పాదాలను తాకుతూ, “మీరు, ఆపదలో రక్షణ కల్గించే జగన్మాత యొక్క అంశతో నన్ను కాపాడారు. మీకు నేను నా కృతజ్ఞతను ఎలా వ్యక్త పరచుకోవాలో తెలియటము లేదు. నేను వాడిన 'జగజ్జనని', 'మాతృ అంశ' అనే పదజాలంతో సుబ్బలక్ష్మిగారు చలించి పోయారు. జగన్మాత యొక్క భక్తులందరూ ఈ మాతృ అంశ వలననే రక్షింప బడుతుంటారు.భగవాన్ కూడా ఈ పదాలను కొన్నిసార్లు వాడారు. కానీ భగవాన్ గురించి వ్రాసేవారు ఈ విషయాన్ని వదిలివేస్తారు. ఎందుకంటే అది వారికి అర్థం కాదు కనుక. భగవాన్ రెండు మూడు సార్లు ఈ మాటలను జగజ్జనని తన జీవితంలో జోక్యం చేసుకుంటున్నట్లు, తన జీవితమును ప్రభావితం చేస్తున్నట్లు, అన్నారు.

శాంతమ్మాళ్ తనతో చెప్పిన విషయాన్ని ఆమె నాతో చెప్పారు. ఆమె స్వప్నంలో భగవాన్ హాలులో కూర్చుని ఉన్నారు. ఆయన ప్రక్కన అందమైన రూపంతో కళ్ళు చెదిరే కాంతితో మెరిసి పోతున్న ఒక దేవత ఉన్నారు. అదే సమయంలో అదే రూపంతో ఉన్న మరొక దేవత, ఆశ్రమం చుట్టూ తిరుగుతూ తన విధులు నిర్వర్తిస్తున్నారు. అదేమిటో అర్థం గాక, ఆమె భగవాన్‌కు తన స్వప్నం యొక్క వివరాలు తెలిపారు. భగవాన్ దాదాపుగా నిజమేనన్నట్లుగా తల ఊపి, ఇలా అన్నారు. “అవును, నేను కొండపై నున్నపుడు ఒక ఆమె వచ్చి నాకు భోజనం పెడుతుండే వారు. ఆమె పేరు అఖిలాండమ్మాళ్ (దేసూరమ్మాళ్). ఆమె భోజనం వడ్డించేటప్పుడు నా ప్రక్కన మరొక విస్తరిని ఎక్కువగా ఉంచేవారు. అందులో భోజనం కూడా వడ్డించేవారు. నేను, “ఎవరికోసం ఆ విస్తరిని ఎక్కువగా ఉంచారు?” అని అడుగగా, “అది అమ్మకు”, అని ఆమె బదులిచ్చారు. కొంచెం సేపు ఆగి ఆయన, “అఖిలాండమ్మకు కూడా, మీకు వచ్చిన కల లాంటి కలే వచ్చింది.

సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఇంకా ఇలా చెప్పసాగారు. అప్పు శాస్త్రి భార్యకు సంబంధించి, నేనొక సంఘటనను చూశాను. ఆ రోజులలో కాఫీ అనేది అరుదైనది, విలాసవంతమైనదిగా భావించబడేది. అందుకని ఆశ్రమానికి వచ్చే భక్తులు కాఫీ తీసుకుని

వచ్చేవారు. భగవాన్‌కు అది ఏ మాత్రం ఇష్టం ఉండదని తెలియక. అప్పుశాస్త్రి భార్య ఒకపెద్ద పాత్ర నిండా చాలా మంచి కాఫీ తెచ్చారు భగవాన్ కొరకు. భగవాన్ అన్నారు, "మీకు తెలుసును గదా. నాకు కాఫీ ఇష్టముండదని." అప్పుశాస్త్రి భార్య అన్నారు. నేనేమి చెయ్యను? పార్వతీ మాత ఆలయం ముందు నిల్చుని నాకు సైగ చేశారు. "నా బిడ్డకు కాఫీ లేకుండా ఉన్నాడు. కొంత కాఫీ తయారుచేసి ఆయనకు పట్టుకుని వెళ్ళు," నన్ను నిందించవద్దు. ఇది అమ్మ ఆజ్ఞ. భగవాన్‌కు ఆ కాఫీ త్రాగటం తప్ప, తప్పించుకునే దారిలేక పోయింది. కానీ ఆయన ఇలా అన్నారు. అమ్మకు నా జీవితంలో జోక్యం చేసుకుంటూ నాదారికి అడ్డం రావడం తప్ప వేరే పనిలేనట్లుంది. ఇది ఇంతకు ముందు నేను కొండపై ఉన్నపుడు కూడా జరిగింది.

నేను ఆ సంఘటనను గురించి వివరించమని సుబ్బలక్ష్మిఅమ్మాళ్‌ను కోరాను. అయితే అది ఇప్పటికే కొన్ని పుస్తకాలలో వ్రాయబడింది. భగవాన్ కొండపై ఉంటుండేవారు. అప్పటికి ఒక క్రమబద్ధమైన చర్య ఏమీ ఉండేది కాదు. ఉదయం ఎనిమిదిగంటలకు అక్కడ ఉన్నవారందరూ ఒక చోట చేరి, (భిక్షాన్నాన్ని) తెచ్చిన భిక్షను అందరూ కలసి తినేవారు. ఆ భోజనం ఎప్పుడూ చద్ది అన్నమే అయి ఉండేది. ఒకసారి ఈ భోజనం అయిపోతే వాళ్ళంతా ఎవరి ఇష్టం వచ్చిన పని వాళ్ళు చేసుకునే వాళ్ళు. భగవాన్ రోజంతా కొండపై తిరుగుతూ ఉండేవారు. ఎంతగా తిరిగే వారంటే, "ఈ గిరిపై నేను కాలుమోపని చోటు, ఒక అంగుళం కూడా లేదు" అని ఆయన ఒకసారి అన్నారు.అలాంటిరోజులలో ఒక నాడు, మోటుగా కన్పిస్తున్న ఒక కట్టెలు కొట్టుకునే స్త్రీ ఆయన దారికి అడ్డంగా నిలబడి ఉండటం చూశారు. భగవాన్ వెళ్ళే దారిలో కాళ్ళను వెడల్పుగా చాచి నుంచుని ఉన్నది ఆ స్త్రీ. ఆ స్త్రీ తన కాళ్ళను అడ్డుతొలగించలేదు. భగవాన్ (హిందూ ధర్మ విరుద్ధం కనుక) ఆ కాళ్ళను దాటి ముందుకు వెళ్ళలేదు. భగవాన్ తటపటాయిస్తూ ఆమె ఎదుట నిల్చుని ఉండగా, ఆమె తిట్ల వర్షం కురిపించసాగింది. ఆమె, ఆయనను ఇలా అడిగింది,"నువ్వు ఎందుకు ఎప్పుడు చూసినా తిరుగుతూ ఉంటావు? నిలకడగా ఒకచోట ఎందుకు ఉండవు?" భగవాన్ ఆమె మాటలను హృదయపూర్వకంగా స్వీకరించి, ఆ తర్వాత స్కందాశ్రమం నుండి ఎప్పుడూ కదిలేవారుకాదు. తర్వాత రమణాశ్రమానికి వచ్చారనుకోండి. ఆ తర్వాత గూడా ఎప్పుడో (వ్యాహ్యాళి) షికారుగా తప్ప పెద్దగా ఎక్కడికీ వెళ్ళేవారు కాదు. నేనేదో అడగాలని ఆతృత పడుతుండగా సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఇలా చెప్పారు. "ఆ గ్రామీణ స్త్రీ ఎవరు అని, మేము భగవాన్‌ను అడుగగా, భగవాన్ స్వయంగా అన్నారు, వేరెవరు అవుతారు, జగన్మాత అమ్మ గాక.

నాలో భక్తి పారవశ్యము పొంగి పొరలుతుండగా నేను, ఆమె భగవాన్ గురించి ఎలా భావించేవారో చెప్పమని వినయంగా ప్రాధేయపడ్డాను, ఆమె అన్నారు. "నాకు భగవానే తల్లి, ఎవరైనా సరే ఆయనను తల్లిగా భావించి ఆయనకు చేరువైతే ఆయనను గట్టిగా అంటిపెట్టుకుని ఉండటం తేలిక అవుతుంది. నేను చూసిన తల్లులందరిలోకీ నిస్సందేహంగా కరుణా పూరిత మైన తల్లి ఆయన. చదువులేని వితంతువును, సంఘంచే వెలివేయబడ్డ దానినైన నాకు ముక్తి అనేది ఆశించగలిగే స్థితి ఉన్నదా? ఆయన నా హీన స్థితి నుండి లేవనెత్తి, తన అనుగ్రహంతో నన్ను విముక్తి చెందించారు. ఈ సుబ్బలక్ష్మి అమ్మాళ్ చెప్పిన కథనాలన్నీ నాకెంతో సంతోషాన్ని కల్గించాయి.ఎందుకంటే, భగవాన్ యొక్క ఈ రక్షించే మాతృ అంశ ఇప్పటికీ ఆయన భక్తులకు స్పష్టంగా తెలుస్తుంది. వింటానికి చెవులూ, చూడటానికి కళ్ళు ఉంటే చాలు, ఈ రక్షించే మాతృ అంశను అర్థం చేసుకొనడానికి.

ఒకసారి శ్రీ కృష్ణుని ఉదాహరణకు చెబుతూ, ఆమె నాతో అన్నారు, "మీకు తెలుసా, యుగాల క్రిందట, భగవంతుడు గొల్లవానిగా వచ్చి, గొల్ల భామలకు మోక్షాన్నియిచ్చారు. అదే విధంగా, భగవాన్ వంట పనిలో ప్రవేశించి మాబోటి అజ్ఞానులైన స్త్రీలను కాపాడారు. భగవాన్ పట్ల ఆమె భావాన్ని చూసి నేను చలించి పోయాను. ఆమె ఇంత భక్తితోనూ, సంపూర్ణంగానూ, భగవాన్‌నూ ఎలా ప్రేమించ గలిగారని నేనడిగాను. ఆమె ఇలా అన్నారు, "యోగులు, ఋషులూ కూడా, కఠినమైన నియమాలను పాటించీ, తపస్సును చేసీ చేరుకున్న స్థితికి, భగవాన్ కేవలం వంటగదిలో ఆయనకు దగ్గరగా పనిచేసినంత మాత్రాన మమ్ములను తీసికుని వెళ్ళారని. మీకు తెలుసునా? మేము నిత్యం చేసే కొద్ది పాటి పనే మాకు సంపూర్ణ ఆనందాన్నీ, ప్రకాశాన్నీ తెచ్చిపెట్టేది, ప్రాపంచికమైన పనుల్లోనే, అంటే రుబ్బటమూ, వండటమూ, భోజనశాలలో అతిధులకు వడ్డన చెయ్యటము మొదలైన పనులలోనే మేము పారవశ్యాన్ని పొందే వారము. అది ఎలా సంభవము? ఆయన సన్నిధితో

మమ్ములను ఆశీర్వదించారు. (ఆయన మాకు దగ్గరగా ఉంటూ మాకు మేలు ఒనకూర్చారు) ఆ ఆశీర్వాదంతో, మనస్సు, హృదయంలో లయమై పోయే స్థితికి చేరుకున్నాము. మా హృదయాలు ఆయనతోనూ, ఆయన లోనూ ఉండేవి. ఆయన మేము చేసే మొత్తము పనిలో ఉండేవారు. మానవ హృదయంలో ఎంత ఆనందం నిక్షిప్తమై ఉందీ, అనే విషయాన్ని. ఈ పారవశ్యాన్ని అనుభవించని వారు కనీసం ఊహించను గూడా లేరు. తన సద్గురువు శ్రీ రమణులను పూజ్య భావంతో తలుచుకుంటూ చేతులు జోడించి, ఆమె అన్నారు. "భగవానే మా నిజమైన గమ్యము, మా గృహము. మాకు ఆయన ఒక్కరే ఉన్నారు. ప్రకాశవంతమైన ఆయన రూపం చాలు మాకు.ఆయన ఎంత గొప్ప గురువు అని తెలుసుకోవాలంటే, ఆయనతో కలిసి జీవిస్తూ, ఆయనతో కలసి పని చేస్తూ ఉండాలి. అనుదినమూ చేయబడే చిన్న చిన్న పనుల ద్వారా ఆయన మాకు వేదాంతంలోని ఉన్నతమైన సత్యాన్ని బోధించే వారు. మాపై ఆయన ప్రభావము యొక్క లోతు, విస్తారము ఎంతగా ఉన్నాయో తెలుసుకోకుండానే, మా స్వభావం కూకటి వేళ్ళ వరకూ మారిపోయింది. ఆయన తన అపారమైన కరుణ ద్వారా, మమ్ములను సంపూర్ణ జ్ఞానంలోనికి నడిపించారు.

ఆ క్షణంలో జగన్మాత అంశగా ఉన్న సుబ్బలక్ష్మి అమ్మాళ్‌కు నేను సాష్టాంగ పడ్డాను. ఆమె ఈ శరీరాన్ని కాపాడారు. ఆమె నాకు ఈ విషయాలన్నీ తెలపటం ద్వారా, దైవరాజ్యం నా కళ్ళ ముందు క్షణకాలం పాటు కన్పించేటట్టు చేశారు.

చేతిలో మామిడికాయలు పట్టుకున్న బాలుడు - గణేశన్

నాగలక్ష్మి - వెంకటరామన్ - బాలు - భగవాన్ సోదరి అలమేలు అమ్మాళ్ - సుందరం (ఎడమ నుండి కుడికి)

సంపూర్ణమ్మాళ్

సాధారణంగా తారతమ్యాలు ఎంచని, ఎవరినీ ఎవరితోనూ పోల్చని భగవాన్, సంపూర్ణమ్మాళ్ గురించి, "ఆమె మన వంటవారందరిలో శ్రేష్టమైన వారు". అన్నారు. సంపూర్ణము అంటే సాధారణంగా తీపితో నింపబడినది అని అర్థము. ఆధ్యాత్మికంగా, పూర్ణమైన ఆనందము అని అర్థము. భగవాన్ జన్మించిన తిరుచ్చుళి గ్రామము యొక్క ప్రక్క గ్రామంలోనే సంపూర్ణమ్మాళ్ జన్మించారు. బాల రమణుల మృత్యు అనుభవము గురించీ, ఆయన తిరువణ్ణామలై వెళ్ళటము గురించీ, ఆయన భగవాన్ శ్రీ రమణ మహర్షిగా లోకానికి వెల్లడి కావడం గురించీ, ఆమె విని ఉన్నారు. వారి కుటుంబము, వీనిలోని ప్రతి విషయాన్నీ ఎంతో ఉత్సాహంతో ఆలకించి, ఆయనను దర్శించుకోవాలనుకున్నారు. వారు, సంపూర్ణమ్మాళ్‌ను కూడా తమతో రమ్మని ఆహ్వానించారు. కానీ ఆమె తన సమయాన్ని తన భర్తకూ, బంధువులకూ వినియోగించాలనే ఉద్దేశంతో, వారితో వెళ్ళడానికి నిరాకరించారు. కొంతకాలానికి ఆమె భర్తను కోల్పోయారు. దాని వలన, అంతులేని దుఃఖంలోనూ, బాధలోనూ మునిగి పోయారు. ఆమె కుటుంబం వారు, భగవాన్ ఒక్కరే ఆమెను ఆ అంతులేని దుఃఖం నుండీ రక్షించగలరని దృఢంగా నమ్మి, ఆమెను భగవాన్ వద్దకు రమ్మని ఆహ్వానించారు. ఆమె దుఃఖంలోనే పడిపొర్లటానికి ఇష్టపడి వారి ఆహ్వానాన్ని తిరస్కరించారు.

కానీ భగవాన్ అనుగ్రహం చూడండి. ఒకరోజు ఆమె మధురైలోని మీనాక్షి ఆలయంలో ప్రార్థన చేస్తుండగా, ఒక బ్రాహ్మణబాలుడు ఆమె ప్రార్థనకు అంతరాయంగా నిలచి, "మీరు నాకు ఒకసారి భోజనం వండి పెట్టరా?" అని గట్టిగా కోరారు. ఎంత వింతైన కోరిక. యాచించేటప్పుడు యాచకులు భోజనాన్నే యాచిస్తారు. కానీ ఈ వింతైన యువకుడు, "నాకు ఒకసారి భోజనం వండి పెట్టరా?" అని అడిగారు. సంపూర్ణమ్మాళ్ ప్రార్థన అప్పటికే దాదాపు పూర్తవటంతో ఆమె తనలో "నాకు ఒక బ్రాహ్మణునికి వండి పెట్టే మంచి అవకాశము దొరికింది. నాకెంతో సంతోషంగా ఉన్నది,"అనుకున్నారు. కానీ ఆ యువకుడు అకస్మాత్తుగా అంతర్ధానమైపోయారు. ఆమె, అతని కోసం అంతటా వెదికారు. అప్పుడామెకు తట్టింది. ఆ వచ్చినది, తనను వెదుక్కుంటూ వచ్చిన ఆ భగవానే కాని, వేరెవరూ కాదు అని.

కాబట్టి 1932 లో ఆమె తన సోదరి తోనూ, బావగారైన నారాయణ అయ్యర్‌తోనూ కలసి, తిరువణ్ణామలై వెళ్ళారు. ఆమె ఇంకా దుఃఖంలోనే ఉన్నారు. కానీ భగవాన్ యొక్క ఒక్క చూపుతో ఆమె మారిపోయారు. ఆ చూపు ఉపశమనం కల్గించేదిగా ఉన్నది. ఆమె భగవాన్ వైపు తదేకంగా చూస్తూ ఉండగా, భగవాన్ ఆమె పై దృష్టి నిలిపారు. దాని ఫలితం అద్భుతంగా ఉన్నది. ఆ ముగ్గురూ ఇరువది రోజులపాటు ఆశ్రమంలో ఉండిపోయారు. సంపూర్ణమ్మాళ్ భౌతికంగా చాలా చురుకుగా ఉండేవారు. అందువలన ఆమెకు ధ్యానం చెయ్యటమంటే ఏమిటో తెలియదు. కానీ, భగవాన్ సన్నిధిలో కూర్చున్నప్పుడు, ఆమె అప్రయత్నంగా ధ్యాన స్థితిలోనికి వెళ్ళి పోయేవారు. ఆమె ఆయన సన్నిధిలో ఉన్నపుడు, ఆమెలో ఏ ఆలోచనలూ ఉండేవికావు. ఆమె, ఆయనకు దూరంగా టౌన్‌లో ఉన్నపుడు, ఆలోచనలతో ఆమె తల దిమ్మెత్తిపోయేది. మర్నాడు, భగవాన్ సన్నిధిలో కూర్చుని, ఆయన దృష్టితనపై నిలుపబడినపుడు, ఆమె మరల ఆలోచనారహిత స్థితిని అనుభవించారు. భగవాన్ ఇది మానసికమైన చర్యకాదు, ఆధ్యాత్మిక పరమైనది అని ఆమె అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో ఆమెకు 'నేనెవరను?' అనే పుస్తకాన్ని ఇచ్చారు.

ఇరవై రోజుల తర్వాత ఆమె తన గ్రామానికి వెళ్ళినపుడు, తన మనసు అలజడి చెంది యుండటాన్ని, ఆమె గమనించారు. ఆశ్రమములో ఉండగా తాను అనుభవించిన ప్రశాంతత, భగవాన్ సాన్నిధ్యం వల్లనే అని ఆమె గ్రహించారు. ఆశ్రమానికి తిరిగి వెళ్ళటానికి నిర్ణయించుకున్నారు. ఆమె స్థితిని అర్థం చేసుకున్న ఆమె మేనమామ ఆమెను వెంటపెట్టుకుని ఆశ్రమానికి తీసికుని వెళ్ళారు. అక్కడ, వంట మనిషి శాంతమ్మాళ్ వెళ్ళిపోతున్నట్లు తెలుసుకున్నారు. భగవాన్ సన్నిధిలో, ఎవరో ఆమెను "శాంతమ్మాళ్ వెళ్ళిపోవటానికి వీలుగా, మీరు వంట పనిని చేబడతారా?" అని అడిగారు. భగవాన్ ఆమె వంక చూసినపుడు, "ఓహో, ఇదా, మీ ఎత్తు (మాయ)!" అనుకున్నారు. ఆమె ఆనందించారు. ఆ వంట పని బాధ్యత సంపూర్ణమ్మాళ్ భుజాలపై పడింది. ఆ రోజు ఆమె వంట చేసి, భగవాన్‌కు వడ్డన చేస్తున్నపుడు, ఆలయంలో "నాకు ఒకసారి భోజనం వండిపెడతారా?"

అని అడిగిన బ్రాహ్మణయువకుడు ఆయనేనని ఆమె గుర్తించింది. మొదటిసారి భోజనం వడ్డిస్తున్నపుడే, ఆమె ఆధ్యాత్మిక అన్వేషణ మొదలైంది, అంతమైంది కూడా. తాను కేవలం ఒకానొక బ్రాహ్మణుడికి వడ్డించటము కాదు, సమస్త జీవకోటిలోనూ నెలకొనియున్న భగవంతునికి వడ్డన చేస్తున్నానని గుర్తించారు'. ఆమె ఆశ్రమంలోనే ఉండిపోయి భగవాన్‌కు భోజనం తయారు చెయ్య సాగారు.

సంపూర్ణమ్మాళ్‌కు వంట చేతనయినప్పటికీ, భగవాన్ ఆమెకు వండటము లోని మెళకువలను, స్వల్పమైన తేడాలను గుర్తించి రుచికరంగా భోజన పదార్థాలను ఎలా తయారుచెయ్యాలో నేర్పించారు. ఎన్నో రకాలుగా పప్పులతోను, ధాన్యముతోనూ, కూరగాయాలతోనూ రుచికరమైన వంటకాలను ఎలా తయారు చెయ్యాలో ఆమెకు నేర్పారు. అంతేగాకుండా, ఆ సమయంలో ఆయన కథలు చెబుతుండేవారు. ఆయన బాల్యానికి సంబంధించిన కథలతో ప్రారంభించి, మెల్లగా వేదాంతం గురించి చెప్పి, ఆత్మ బోధతో ముగించేవారు. అత్యున్నత మైన 'సత్యము' యొక్క స్థితి 'నేను' అనే స్థితియే అని చెప్పారు. భగవాన్, సంపూర్ణమ్మాళ్‌కు 'ఋభు గీతను' ఇచ్చి దాని ప్రత్యేకతను వివరించారు. ఇది ఒక్కటేగాదు, భగవాన్ నేర్పినది. సంపూర్ణమ్మాళ్ ఇలా చెప్పారు. పని అంటే ఇతరుల పట్ల ప్రేమ. కేవలం ఆయన సన్నిధి ద్వారానే, ఆయన (మా దగ్గరలో ఉండటం ద్వారానే) మేమందరము భగవంతుని సన్నిధానంలో ఉన్నామని, మేము చేసే పని అంతా భగవంతుని సేవ యేనని, మేము అర్థము చేసుకునేటట్లు చేసేవారు. ఆయన వంట పనిని, మాకు 'వేదాంతమునూ, ఆధ్యాత్మికతనూ బోధించడానికి ఉపయోగించేవారు. ఉదాహరణకు భగవాన్ ఒకసారి, "కూరగాయలను ఉడికించేటప్పుడు మీరు వాటిపై మూతలు ఉంచాలి. అప్పుడే అవి తమ సువాసనను కోల్పోకుండా ఉండి, తినుటకు యోగ్యంగా ఉంటవి. మనసు విషయం కూడా అంతే మీ మనసుపై ఒక మూతను పెట్టి (బాహ్యంలోనికి వెళ్ళకుండా) నెమ్మదిగా ఉడకనివ్వాలి. అప్పుడు మాత్రమే మానవుడు, భగవంతుడు మింగటానికి యోగ్యుడుగా తయారు అవుతాడు" అని చెప్పారు. వండటమును గురించి భగవాన్ చెప్పే మెళకువలు, ఆయన రుచికరంగా వండటం నేర్పే విధానమూ చూచి, కొత్త వారెవరైనా ఆయన భోజన ప్రియులనీ, సుష్టుగా భోంచేస్తారనీ పొరపాటుగా అభిప్రాయ పడవచ్చును. దానికి వ్యతిరేకంగా, భగవాన్ మమ్ములను భోజన పదార్థాలను స్వల్పంగానే వడ్డించ నిచ్చేవారు. ఆయన తీపి, పులుపు, కారం పదార్థాలన్నిటినీ ఏకం చేసి, రుచిని గురించి పట్టించుకోకుండా తినేసేవారు. అసలు భోజనము యొక్క రుచినే పట్టించుకోరా? అన్నట్లు ఉండేవారు. మేము ఈ విషయాన్ని గురించి మాట్లాడినపుడు. "భిన్నత్వం చాలు. ఏకత్వాన్ని ఉండనివ్వండి అని చెప్పేవారు. మరొక సందర్భంలో, "ఎందుకు ఈ బేధాలు? అంతా భిన్నత్వము లోని ఏకత్వముగా ఉండవలెను గదా?" అని ప్రశ్నించారు.

సంపూర్ణమ్మాళ్, ఒక ఆధ్యాత్మిక సాధకుడు, శీఘ్రంగా, సులభంగా, ఏ ప్రయత్నమూ లేకుండా ఎలా పరిపక్వత చెందవచ్చును. అనే దాని కొక కిటుకును తెలిపారు. అది కేవలము గురువు అనుగ్రహము వలననే సాధ్యము. అది హిందూ ఆధ్యాత్మిక గ్రంధాలలో వ్రాయబడి ఉన్నది. ఉన్నతమైనటువంటి ఆంతరిక ఆనందము,కేవలము సద్గురువు అనుగ్రహం వల్లనే సాధ్యము. ఆయన అనుగ్రహం తప్పించుకోలేనిది. "భగవాన్ కూడా కష్టపడి పని చేసేవారు. శ్రద్ధగా చేసేవారు. వంటకాల్లో దినుసులను సరిగ్గా ఎంత పాళ్ళలో వేయాలో ఆయనకు తెలుసును. ఆయన ఎప్పుడూ సరిగ్గా పనిచేసేవారు. మమ్ములను అదే విధంగా చెయ్యమనే వారు. మేము చెయ్యవలసి నదంతా, ఆయన చెప్పినట్లు నడుచుకొనడమే. మేము ఆయనను తలచుకుంటూ వంటకాలు చేసిన రోజున అవి చాలా రుచికరంగా ఉండేవి.అందుకని మా వంటకాలు రుచికరంగా ఉండటము కోసము, మేము ముందుగా ఆయనను తలచుకొని, ఆ తర్వాత కావలసిన పదార్థాలను వంటకంలో వేసే వారము. నెమ్మదిగా ఈ అలవాటును మిగిలిన పనులలోనికి కూడా విస్తరింప జేసుకున్నాము.అంటే, అది ఎటువంటి చిన్నదీ, ప్రాముఖ్యము లేని పని అయినా సరే దానిని ప్రారంభించే ముందు భగవాన్‌ను తలచుకుని ప్రారంభించే వారము. అపుడు ఆ పని సక్రమంగా, విజయవంతంగా పూర్తి అవటం గ్రహించాము.అందుకని భగవాన్ గురించి ఆలోచించడం మా జీవితంలో, విడదీయరాని భాగమై పోయింది. మేము భగవాన్ పై మా దృష్టిని నిలపడము నేర్చుకున్నాము. మేమెప్పుడైనా సరే, భయపడ్డా, ఆందోళనలో ఉన్నా, బాధలో ఉన్నా, కేవలము ఆయనను తలచు కుంటే చాలు, ఆయన హస్తం మాకు సహాయం చెయ్యడం మాకు అనుభవమయ్యేది. నేను ఆశ్రమానికి రావటానికీ, తిరిగి వెళ్ళటానికీ, అడవి మార్గం గుండా ఒంటరిగా రావలసి ఉండేది.ఆ మార్గం కొండపాదంలో(కొండను అనుకుని) ఉండేది. కొన్నిసార్లు నాకు కొంచెం భయం వేసేది. నేను భయపడుతున్నానని భగవాన్‌కు తెలిసినపుడు, " మీరెందుకు భయపడతారు? నేను మీతో పాటు లేనా?" అన్నారు. చిన్నస్వామి ఒకరోజు, "మీరు

ఒంటరిగా ఎందుకు వస్తున్నారు? మీకు భయం వెయ్యదా?" అని అడిగారు. దానికి భగవాన్ ఈ విధంగా సమాధానము ఇచ్చారు. "ఆమె వంటరిగా ఉన్నారా? నేను ఎల్లవేళలా ఆమెతోపాటు లేనా?" అన్నారు. సంపూర్ణమ్మాళ్ అన్నట్లుగా, మనము మన దృష్టిని భగవాన్‌పై నిలిపితే, ఆయన ఎల్లవేళల మన తోనే ఉండి, మనలను నడిపిస్తూ, మనము పరిపక్వత చెందేటట్లు చేస్తారు.

సంపూర్ణమ్మాళ్ గారు చెప్పిన రెండు అందమైన జ్ఞాపకాలను ఇక్కడ వివరిస్తాను. ఒకసారి వైద్యులు, భగవాన్‌కు మజ్జిగ బదులుగా పెరుగు తీసికొనమని చెప్పారు. కానీ అందరికీ సరిపడ పెరుగు లేదు. భగవాన్ తనకు ప్రత్యేకంగా ఏమైనా పెడితే తినరు. ఒక రోజు భగవాన్‌కు మజ్జిగ వడ్డిస్తున్న సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఏదో ఒక పనిచేసి తాను చాలా తెలివి గల పని చేశాననుకున్నారు.ఆమె మజ్జిగ బకెట్‌లో రహస్యంగా ఒక గరిట నిండా పెరుగు నుంచి అది భగవాన్‌కు వడ్డించారు. భగవాన్ ఆమె వైపు తేరిపార చూచి, "సుబ్బలక్ష్మీ! మీరు ఏమి చేశారో తెలుసా? మీరు నాకు విషాన్ని వడ్డించారు. నాకు భక్తులకు మధ్య ఏ విధమైన వ్యత్యాసాన్నైనా సరే చూపించటం విషంతో సమానం. సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఎంతగా బాధ పడ్డారంటే ఆమె మూడురోజుల పాటు జ్వరముతో బాధ పడ్డారు. శాంతమ్మాళ్ భగవాన్ వద్దకు వెళ్ళి, "భగవాన్! మీరు సుబ్బలక్ష్మి అమ్మాళ్ పట్ల కోపంతో ఉన్నారు. పాపం ఆవిడ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. దయచేసి మీరామెను క్షమిస్తారా?" అని అడిగారు. భగవాన్ నవ్వుతూ, "నేను, ఆమె పట్ల కోపగించుకున్నానా? ఆమె ప్రవర్తన పట్ల కోపగించుకున్నానుగాని', అన్నారు. వెంటనే ఆమె జ్వరం తగ్గిపోయినది.

రెండవ సంఘటన కూడా అపూర్వమైనదే. సంపూర్ణమ్మాళ్ ఇలా చెప్పారు, " ఒకసారి నేను కొందరు స్నేహితులతో కలసి కాశీ యాత్రకు వెళ్ళటానికి భగవాన్ అనుమతి కోరాను. భగవాన్ ఎగతాళిగా అడిగారు, మీరు కాశీలో అరుణాచలములో లేనిది ఏమి ఉంటుందని భావిస్తున్నారు? అని అడిగారు? కాశీ విశ్వేశ్వరుడు ఇక్కడే ఉన్నారు. ఆయన ఇక్కడే నీ దగ్గరే ఉంటే, ఆయనను వెతుక్కుంటూ నువ్వు ఎక్కడికో వెళ్ళుట ఎందులకు? ఆయన తనను తాను ఉద్దేశించే, ఆయన ఇక్కడే మీతోనే ఉంటే, ఆయనను వెతుకుతూ వెళ్ళటం ఎందుకు?" అన్నారు. భగవాన్ అనుమతి ఇవ్వలేదు గనుక, నేను యాత్ర ప్రసక్తిని వదలి వేశాను.కానీ సద్గురువు యొక్క కరుణను చూడు. మర్నాడు ఉదయాన్నే, భగవాన్ నాతో ఇలా అన్నారు, "సంపూర్ణమ్మాళ్, నాకు రాత్రి ఒక కల వచ్చింది. నువ్వు కాశీలో విశ్వనాధుని ఆలయంలో పూజచేస్తున్నట్లు", "నాకు ఆశ్చర్యము అది కలేనా?అని. "ఆయన నన్ను తీసికుని వెళ్ళి, ఆలయంలో పూజ చేసికొనే అవకాశ మిచ్చి తిరిగి వెనుకకు తీసికొనివచ్చారా? అని నేను అనుకున్నాను", అన్నారు సంపూర్ణమ్మాళ్. భగవాన్ సంపూర్ణమ్మాళ్ పట్ల చాలా కరుణతో ఉండేవారు. ఆమె చుట్టూ ఉండే వారు కేవలం ఆమెలోని దోషాలనే చూసేవారు. కానీ భగవాన్ వాటిని పట్టించుకోకుండా, ఆమె పట్ల ఏకాగ్రమైన శ్రద్ధతో ఆమెను ఆ లోపభూయిష్టమైన లౌకికస్థితి నుండి లోపరహితమైన, పరిపూర్ణమైన ఆధ్యాత్మిక స్థితికి లేవనెత్తారు.

సంపూర్ణమ్మాళ్, భగవాన్ ఆరాధన రోజున, ఆశ్రమంలో చనిపోయారు. ఆమె శరీరాన్ని స్మశానానికి మోసుకుని వెళ్ళి, ఆమె చితికి నిప్పంటించే భాగ్యము నాకు దక్కింది. భగవాన్ నాకిచ్చిన మరొక ఆశీర్వాదమిది.



భగవాన్ ఆరాధనోత్సవము

లోకమ్మాళ్

లోకమ్మాళ్, మిగిలిన అందరి వంటవారి వలెనే భగవాన్ యొక్క ప్రథమ దర్శనము లోనే, (1930 దశకంలో) పారవశ్యం చెందారు. ఆయన ఒక్క వీక్షణము చేతనే ఆమె, ఆయనకు సంపూర్ణ శరణాగతి చెందారు. ఆమె చిన్న బాలికగా ఉన్నపుడే ఆమె మేనమామ ఆమెకు 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించారు. బాల్యం నుండే ఆమె దృష్టి భగవంతుని పై ఉండేది.

లోకమ్మాళ్ బాల్యంలోనే వితంతువుగా మారింది. అందుకని కుటుంబమువారూ, సంఘము కూడా ఆమెను దూరంగా ఉంచి, పట్టించు కునేవారు కాదు. ఆ గ్రామంలోని తేనమ్మాళ్ అనే మరొక వితంతువు మాత్రమే, ఆమెకున్న ఏకైక మిత్రురాలు. వారిద్దరూ ఆధ్యాత్మిక విషయాలను గుర్చి మాట్లాడుకునేవారు.

తేనమ్మాళ్ అరుణాచలమునకు వెళ్ళి భగవాన్‌ను దర్శించి ఉండుట చేత, ఎల్లపుడు భగవాన్ గురించిన సంఘటనలు చెబుతుండేది. "నేను కూడా అరుణాచలమునకు వెళ్ళి భగవాన్ పవిత్రమైన పాదాల వద్ద కూర్చుండగలనా?" అని ఆవిడ అనుకుంటూ ఉండేది. కానీ ఆమె ఒక సంపన్న కుటుంబమునకు చెందిన స్త్రీ అగుట వల్ల, వారు ఆమెను అందుకు అనుమతించలేదు. ఆమె అభ్యర్ధనలు పెడచెవిన పెట్టబడ్డవి. కానీ దైవము ఆమె నిజాయితీతో కూడిన ప్రార్ధనలను విస్మరించునా? ఒకరోజు, ఒక స్త్రీ లోకమ్మాళ్‌కు దినపత్రికను చూబిస్తూ, లోకమ్మాళ్ అరుణాచలంలో ఉండే మీ మహాత్ముడు చనిపోయారు అన్నారు". లోకమ్మాళ్ గుండె పగిలినట్లయి ఎంతగానో ఏడ్చారు. కానీ ఆమె చెప్పినది శేషాద్రి స్వామి యొక్క మరణాన్ని గురించి. ఇది జరిగిన కొద్ది రోజులకు, ఆమె ఒంటరిగా ఉన్నపుడు, భగవాన్ ఆమె వైపు నడుస్తూ, ఆమెను పిలుస్తున్నట్లు ఒక దృశ్యం కన్పించింది. ఆమె తన సోదరుని అరుణాచలమునకు తీసికుని వెళ్ళమని బ్రతిమిలాడింది. ఆయన మెత్తబడ్డారు. తిరుపతి వెళ్తున్న కొందరు స్త్రీలతో కలసివెళ్ళింది ఆమె.

ఆమె అరుణాచలమునకు చేరుకున్నపుడు, అందరు స్త్రీల వలెనే ఆమె కూడా టౌన్ లో ఉండవలసి వచ్చింది. ఇపుడు పెట్టబడుతున్న ఇడ్లీలకు బదులుగా అప్పుడు అన్నము గంజిగానీ, కాఫీగానీ ఇవ్వ బడేవి. ఆమె ఆశ్రమానికి వెళ్ళిన మొదటి రోజునే, భగవాన్ ఆమెను పిలిచి, "ఇక్కడ కాఫీగానీ, గంజికానీ ఇస్తారు. మీకేది కావాలి? " అని అడిగారు. భగవాన్ ధ్యాసలో మునిగిపోయిన ఆమె ఏదైనా ఒకటే అన్నారు. ఆ మాట అంటూ భగవాన్ వెనుకనే వంటగదిలోనికి వెళ్ళారు. ఆయన భౌతిక సాన్నిధ్యంలో ఉండదలచి. ఆమె వంటగదిలోనికి వెళ్ళారు. వంటగదిలో భగవాన్ వంట చేస్తుండగా ఆమె సహాయం చేశారు. హాలులో ఉండగా తమిళవేదాంత కీర్తనలను శ్రావ్యంగా పాడేవారు. భగవాన్ వాటిని మెచ్చుకునే వారు. ఆమె గానం వల్ల పేరుకెక్కారు. భగవాన్ ఆమెకు ఫలానా పాట పాడమని చెప్పేవారు.

ఇంతలో ఆమెతో వచ్చిన స్త్రీలు తిరుపతి నుండి వచ్చారు. అంటే ఆమె తన కుటుంబం చెంతకు వెళ్ళవలసిన సమయం ఆసన్నమైందన్న మాట. ఆమె సెలవు తీసుకొనుటకు భగవాన్ వద్దకు వెళ్ళినపుడు, ఆయన ఆప్యాయంగా అడిగారు, "వెళ్ళిపోతున్నావా?" అని. దానితో ఆమె చలించి పోయారు. భగవాన్ ఆమెకు ఉపదేశసారం అనే పుస్తకం కాపీ ఒకదానిని ఇచ్చారు. లోకమ్మాళ్ ఆగకుండా ఏడ్చేశారు. భగవాన్, మీరు తప్ప నాకు ఆధారపడటానికి ఎవరూ లేరు. నా బంధువులు నా పట్ల క్రూరంగా ఉంటారు. నాకు వెళ్ళాలని లేదు. కానీ వారు నన్ను బలవంతం చేస్తున్నారు. నన్ను ఎలాగోలా మీ పాదసన్నిధికి చేర్చుకొమ్మని నా ప్రార్ధన. మీ కాళ్ళ వద్ద బానిసగా పడి ఉంటాను. దయచేసి నాపై మీ అనుగ్రహాన్ని కురిపించండి". భగవాన్ కరుణతో ఆమె వైపు చాలా సేపు చూశారు. ఆ చూపు ఆమెతో పాటు ఉండి పోయింది.

భగవాన్‌చే ఇవ్వబడిన కృపావీక్షణం వంట చేసే స్త్రీలనందరిని కట్టిపడవేసింది. ఆయన వారిపై వ్యక్తిగత శ్రద్ధ చూపేవారు. భగవాన్ గురించిన అద్భుతమైన విషయమేమిటంటే, ఆయనకు అంతమంది భక్తులున్నప్పటికీ, వీరిలో ప్రతి ఒక్కరి పట్ల ప్రత్యేక మైన వ్యక్తిగత శ్రద్ధ చూపించేవారు. ఆయన ఈ అయిదుగురిలో ప్రతి ఒక్కరికీ ఒక పుస్తకాన్ని ఇచ్చారు. శాంతమ్మాళ్‌కు, లోకమ్మాళ్‌కు 'ఉపదేశసారాన్ని' ఇచ్చారు. శంకరమ్మాళ్‌కు కైవల్య నవనీతం ఇచ్చారు. సుబ్బలక్ష్మి అమ్మాళ్‌కు ఋభుగీతను

ఇచ్చారు. సంపూర్ణమ్మాళ్‌కు 'నేను ఎవరు? అనే పుస్తకాన్ని ఇచ్చారు. చివరగా వారందరికీ, హృదయంలోని 'అహం' స్ఫురణను వినే అవకాశం ఇచ్చారు.

భగవాన్, లోకమ్మాళ్‌ను తన వైపునకు లాగేసు కున్నారు. ఆమె తన కుటుంబంతో తెగతెంపులు చేసుకుని, ఆశ్రమంలో వంట చెయ్యసాగారు. ఒకరోజు భగవాన్ వంటగదిలోకి వచ్చారు. ఆయన వచ్చినపుడు, సాంబారు మరుగుతున్నది. ఆయన దాని క్రింద మంట ఉన్నదా?" అని అడిగారు. లోకమ్మాళ్, 'అవును' ఉన్నది. 'అది ఇంకా మరగాలి', అన్నారు. భగవాన్ అన్నారు, "లోకమ్మాళ్ మాత్రమే నేను చెప్పేది వింటుంది. నన్ను మెచ్చుకుంటుంది. సాంబారు పూర్తిగా మరిగిందాకా ఉంచుతుంది. మిగిలిన వారంతా, వంట త్వరగా పూర్తి చెయ్యాలనే హడావిడిలో పదార్థాలను పూర్తిగా ఉడకనివ్వరు".

ఆ రోజులలో స్త్రీలు నెలసరి సమయమప్పుడు, మొదటి మూడు రోజులు, దూరంగా ఉంచబడేవారు. వాళ్ళు కళ్ళకు కనపడకుండా ఉంచబడేవారు. వాళ్ళకు సాదా భోజనం మాత్రమే ఇవ్వబడేది. వారు మిగిలిన కుటుంబ సభ్యులతో కలిసి భోజనము చెయ్యడానికి వీలులేదు. వారు తినే భోజనము వీరికి పెట్ట బడేదికాదు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆ మూడురోజులూ వారిని అంటరాని వారుగానే చూసేవారు. ఒక రోజు భగవాన్ తను చెప్పినట్లు జరుగుతున్నదో లేదో చూద్దామని వంటగదికి వచ్చారు. తేనమ్మాళ్ ఆకుకూర వండడం కన్పించింది. "ఇది పొద్దున చేద్దామను కున్న వాటిలో లేదే? తేనమ్మాళ్ ఏమి చేస్తున్నదీ?" అన్నారు. తేనమ్మాళ్‌కు చెప్పక తప్పలేదు. మాలో ఒకరు దూరంగా ఉన్నారు. ఆమెను ప్రత్యేకంగా వేరే చోట ఉంచి వేరే భోజనం పెట్టవలసి వచ్చింది. భగవాన్ చాలా బాధ పడ్డారు. కోపం కూడా వచ్చింది. ఆమె వేరుగా ఎందుకు తినాలి? మిగిలిన వారికి పెట్టే భోజనము ఆవిడ ఎందుకు తినరాదు. ఆమె కడగాఉంటే ఏమి ? బేధం చూపించవద్దు. మన భోజనశాల నుండే ఆమెకు, అన్నము, పప్పు, కూర ఇవ్వండి అన్నారు.

భగవాన్ చెప్పినా సరే, ఆశ్రమములోని, ఆఫీసులోని చాలా మంది వద్ద నుండి వ్యతిరేకత వచ్చింది. ఈ కొత్త నియమాలకు వాళ్ళు ఇష్ట పడలేదు. అందువలన భగవాన్ అప్పుడప్పుడు కోపం చెందుతుండే వారు. ఆయన ఇలా అనేవారు, ఈ ఆశ్రమము అందరికీ భోజనము పెడుతుంది. ఇక్కడెవరూ అంటరానివారులేరు, ఇలాటివి ఇష్టము లేనివారు వేరే ఎక్కడైనా భోంచేయవచ్చును. స్కందాశ్రమంలో ఉండగా మా తల్లిగారితో ఇటువంటి సమస్యే ఉండేది. అది దూరంగా ఉండటమనే సమస్యకాదు. అక్కడ అంటరానితనము అనేది సమస్య. మాకు కట్టెలు కొట్టి తెచ్చి ఇచ్చేవానికి అన్నం పెట్టటానికి ఆమె నిరాకరించేవారు. అలా చేస్తే, మాకు మైల అంటుతుందని ఆమె ఉద్దేశం. నువ్వు ముందు తిను, తర్వాత నేను తింటాను. తర్వాత మిగిలిపోయినవి అతనికి ఇచ్చి దూరంగా తినమంటాను అని, కానీ, నేను మొండిగా ఉండి, అతనికి సగౌరవంగా భోజనం పెట్టవలసిందే అన్నాను. ఆమె మొదట్లో భోంచెయ్యకుండా అదేపనిగా ఏడుస్తూ కూర్చునేవారు. కానీ నేను గట్టిగా నిలబడ్డ తరువాత, ఆమె కూడా అది సరియైనదే అని అర్థం చేసుకున్నారు. ఒక మనిషికి వేరొక మనిషికి మధ్య బేధమేమిటి? ప్రతి వారిలోనూ దైవాన్నే చూడటం సరికాదా? లోకమ్మాళ్ అన్నారు, "భగవాన్ మాలో ప్రతిఒక్కరినీ, నీచమైన అజ్ఞానపు స్థితిలో నుండి, ఉన్నత స్థితి లోనికి తీసికుని వచ్చారు. సర్వోత్కృష్ట మైన సమత్వ స్థితి, ఏకత్వ స్థితి లోకి మమ్ము తీసుకుని వెళ్ళారు. మిగిలిన అందరు వంట వారివలెనే లోకమ్మాళ్ కూడా భగవాన్ బోధలవల్ల, సూచనల వల్ల పక్వమైనారు.

ఈ రోజు ఆశ్రమంలో ఇడ్లీలు తింటున్నామంటే, అది లోకమ్మాళ్ వలననే. అంతకు ముందు కేవలం గంజికానీ, కాఫీ గానీ ఉండేవి. లోకమ్మాళ్ ఉండే సమయంలో, పాతకురుచ్చి అనే గ్రామంలో సారవంతమైన భూములు ఉండి, ఉప్పుడు బియ్యం చెయ్యటానికి పనికి వచ్చే ధాన్యము అక్కడ పండేది. ఒకానొక సందర్భంలో, లోకమ్మాళ్ సోదరుడు, ఆ బియ్యాన్ని ఆశ్రమానికి పంపారు. భగవాన్ ఈ బియ్యాన్ని మెత్తగా రుబ్బి దానితో ఇడ్లీలు చేశారు. అవి చాలా రుచిగా ఉన్నాయి. భగవాన్ ఆ బియ్యాన్ని మెచ్చుకున్నారు. "ఈ ఉప్పుడు బియ్యము ఎంత మంచివి?" అన్నారు. లోకమ్మాళ్ వెంటనే తన సోదరునికి, బంధువులకు లేఖ వ్రాశారు. మీరు నాకేమీ చెయ్యనవసరము లేదు. భగవాన్ ఈ బియ్యాన్ని మెచ్చుకున్నారు గనుక, ఈ ఉప్పుడు బియ్యాన్ని మాత్రం తప్పక పంపుతూ ఉండండి. అప్పటి నుండి ఇడ్లీలు ముఖ్యమైన ఉదయపు ఫలహారంగా మారాయి.

ఆమె చివరి రోజులలో లోకమ్మాళ్ రమణ నగర్‌లోని ఒక కుటీరంలో ఉండే వారు. మిగిలిన వారికి చేసినట్లే నేను ఆమె బాగోగులు చూస్తుండేవాడిని. ఆమె పక్వమైన వ్యక్తేకాని, ప్రారబ్దవశాత్తు, ఆవిడ ఉద్రేక (కోప) స్వభావం కలిగి ఉండేవారు

చివరివరకు. ఆమె ఒకసారి నాతో, "మీరు నాకు ఒక పనిమనిషిని పంపాలి నన్ను చూసుకోవటానికి", అన్నారు. ఆమెను మెప్పించటం దుస్సాధ్యమైన పని. నేను ఆమెకు పదునెనిమిది సార్లు పనిమనిషిని మార్చవలసివచ్చింది. వాళ్ళలో ప్రతి ఒక్కరూ చేతులు జోడిస్తూ నా వద్దకు వచ్చి, "దయచేసి లోకమ్మాళ్ వద్ద పనిచెయ్యమని, మమ్ములను అడగకండి," అని ప్రార్థించేవారు.

నేను మర్నాడు ఉదయం ఆమెను చూడటానికి వెళ్ళేసరికి, లోకమ్మాళ్ నన్ను కోపద్దారు. "నేను ఒంటరిగా ఉన్నాను. నాకు భయము వేసింది. నువ్వు పనిమనిషిని పంపలేదు అన్నారు". నేను ఆవిడ తిట్ల దండకం గుర్తుకు వచ్చి పారిపోయాను. ఆ ఒక్క రాత్రికి కూడా నేను ఆమెకు పనిమనిషిని ఏర్పాటు చెయ్యలేకపోయాను. మర్నాడు చాలా భయపడుతూ ఆవిడ కుటీరంలోనికి ప్రవేశించాను. కానీ ఆవిడ ముఖం వెలిగిపోతుండటం నేను చూశాను. ఆమె, "ఎవరది, గణేశా!" అన్నారు. "అవునమ్మా, " అన్నాను నేను. ఇంకేముంది, ఇంకొక పనిమనిషిని పంపలేదని ఆమె తిట్టేస్తారనుకున్నాను. దానికి బదులుగా, "రా నాయనా, రా", అన్నారామె. నా ముఖాన్ని గట్టిగా పట్టుకుని నా నుదుటిని ముద్దాడారామె," నీ వల్లనే నాకు భగవాన్ దర్శనమయింది. నిన్న రాత్రి నిన్ను తిట్టానా? కానీ భగవాన్ చూడు. ఒకప్పుడు, యువకులు నన్ను వేధిస్తున్నారని చెబితే, ఆయన సోఫాలో నుండి ఒక్క ఉదుటునలేచి, ఈ ఫోటోను నాకిచ్చారు. ఆ ఫోటోను నాకిస్తూ చెప్పారు, "ఇవాల్టి నుండి, మీకు ఈ సమస్య ఉండదు.". అని "నన్ను చూడు గణేశా! నాకిప్పుడు తొంభై ఏళ్ళు అప్పటినుండి ఇప్పటివరకూ, ఏ మగవాడి వల్లా, ఏ సమస్యా రాలేదు. క్రితం రాత్రి నిన్ను నేను తిడుతున్నపుడు భగవాన్ "లోకమ్మా, లోకమ్మా", అని పిలవడం విన్పించింది. నీకు తెలుసా! భగవాన్ ఆ ఫోటోలో సజీవులుగా ఉండి, నేను మీకు చెప్పి ఉండ లేదా, నేనెల్లపుడూ మీతోనే ఉంటానని? నేను మీతో ఉండగా భయం ఎందుకు ? సంతోషంగా ఉండండి. అన్నారు. భగవాన్ మీ వల్లనే నాతో మాట్లాడారు", అన్నారు. నాకు సంతోషం వేసింది. ఆ మర్నాడే లోకమ్మాళ్ చనిపోయారు. నేనే ఆమె చితికి నిప్పంటించాను. ఎందరో పాత భక్తుల విషయంలో చేసినట్లుగానే, ఎటువంటి దీవెన! వంట వారు సాధారణ వ్యక్తులా లేక గొప్ప వారా అనే పట్టింపులేకుండా, అందరూ "నేను" (అహం స్ఫురణ) అనబడే ఉత్తమస్థితికి కొనిపోబడ్డారు.

వంట గదిలో ఉండగా ఒకనాడు భగవాన్ శాంతమ్మాళ్‌తో చెప్పారు, "అరుణాచలముపై నా అడుగుపడని ప్రదేశము ఒక అంగుళము కూడా లేదు". భౌతికంగా అది సాధ్యమేనా? ఆయన ఆ మాటల ద్వారా తానే అరుణాచలేశ్వరుడనని తెలిపారు. ఇప్పటివరకు మనం ఎవరి గురించి చెప్పుకున్నామో అవన్నీ అసాధారణమైన అరుణాచల గండశిలలు. మీరు, నేను కూడా అరుణాచలానికి చెందినవారమే. మనము అరుణాచలానికి చెందిన పచ్చగడ్డి లేదా గులకరాళ్ళు అయి ఉండవచ్చును. ఈ రచయితకు తాను కేవలం అరుణాచలానికి చెందిన 'ధూళిరేణువు'నే అని తెలుసు. ఈ 'ధూళికణము' సుడిగాలులు వల్ల అనేకసార్లు కొట్టుకుని పోయింది. కానీ అదృష్టం కొద్దీ, అది ఎప్పుడూ అరుణాచలం వైపే వెళ్ళింది. దానికి దూరంగా కాని, వ్యతిరేకదిశలో గానీ వెళ్ళలేదు. అదే అనుగ్రహమంటే. అనుగ్రహమనేది అర్థంకానిది కాదు, అది మనచుట్టూ ఎల్లపుడూ ఉంటూనే ఉంది. మనము దానిని గుర్తించాలి. అంతే.



టి. పి.రామచంద్రఅయ్యర్



భగవాన్‌తో, వంటగదిలో మాట్లాడాలనుకునే సాధకులకు శాంతమ్మాళ్ చాలా సహాయకారిగా ఉండేవారు. కొంతమంది భక్తులు బిడియంతో అందరి ముందు భగవాన్‌తో హాలులో మాట్లాడలేక పోయేవారు. అటువంటివారికి శాంతమ్మాళ్ సాయపడేవారు. అలాగే టి.పి.రామచంద్ర అయ్యర్, భగవాన్ పరిచారకులలో ఒకరు. ఆయనకూడా సాధకులకు హాలులో చాలా సహాయకారిగా ఉండేవారు. ఆయన స్వభావతహ స్నేహపూర్వకంగా ఉండేవారు. ఆధ్యాత్మిక పోరాటంలో స్పష్టతనూ, ఉపశమనాన్నీ వెతుక్కుంటూ, అరుణాచలానికి వచ్చే సాధకుల బాధను ఆయన అర్ధము చేసుకునేవారు. 1940 దశకంలో ఆశ్రమము పెద్దదిగా విస్తరించేటప్పటికి, చాలా మంది ప్రజలు భగవాన్‌ను చూడాలనే ఆశతో వచ్చేవారు. భగవాన్ మరీ ఎక్కువగా శ్రమకు గురికాకుండా ఉండటానికై త్వరలోనే, నియమ నిబంధనలు చెయ్యబడ్డవి. నిజమైన సాధకులు, తమ వ్యక్తిగత, సాధనా పరమైన సమస్యలతో భగవాన్‌ను కలుసుకొనటం కష్టసాధ్యమై టి.పి.ఆర్ ను సాయం కోరేవారు. ఆయన ఆ సాధకులకు, భగవాన్‌కు మధ్య వారధిలా పనిచేసి, వారికి భగవాన్‌తో ఏదో ఒక విధంగా మాట్లాడే అవకాశం కల్పించేవారు. టి.పి.ఆర్, శాంతమ్మాళ్ కొన్నిసార్లు ఆశ్రమ నిబంధనలను అతిక్రమించి నప్పటికీ, వాళ్ళు కేవలం సాధకులకు సాయం చెయ్యడానికే ప్రయత్నం చేస్తున్నారు కనుక. భగవాన్ మిన్నకుండేవారు.

టి.పి.ఆర్ తిరువణ్ణామలైలో జన్మించారు. పవిత్రమైన అరుణగిరి పాదం వద్ద పెరిగారు. వారి కుటుంబం కొన్ని తరాలుగా, అక్కడే ఉన్నారు. వారు ఆలయంలోని దేవుడైన అరుణాచలేశ్వరునికీ, ఆయన శక్తి అపీతకుచాంబకూ భక్తులు. టి.పి.ఆర్, ఆరు లేక ఏడు సంవత్సరాల బాలుడిగా ఉన్నపుడు, విరూపాక్ష గుహలో ఉన్న భగవాన్‌ను అనేకసార్లు దర్శించుకున్నారు. ఆయన పరుగెత్తుకుంటూ విరూపాక్ష గుహకు వెళ్ళేవారు. భగవాన్ మాకు పటికబెల్లము, ఎండుద్రాక్ష ఇస్తారు. అందుకని నేను భగవాన్ వద్దకు వెళ్ళాను అని నిజాయితీగా ఒప్పుకునే వారు. ఏమైనప్పటికీ, ఆయన కన్పించని భగవాన్ ఆధ్యాత్మిక ప్రభావానికి లోనైనారు. ఆయన ఆశీస్సులను అందుకున్నారు. ఈ అనుభవాల ప్రభావం ఆయన పెద్దవాడై, స్కూలుకు, కాలేజీకి వెళ్లినపుడు స్పష్టంగా కనపడింది. మతమును గురించి, వేదాంతమును గురించి చదవాలని ఆయనకు చాలా కోరిక ఉండేది. కాలేజీలో, తమ కుటుంబ సభ్యుల ఇష్టానికి వ్యతిరేకంగా, వేదాంతమును తన పాఠ్యాంశముగా తీసికున్నారు. భగవాన్ యొక్క సూటి మార్గాన్ని అర్ధం చేసుకొనడానికీ, ఆచరణలో పెట్టటానికీ, అన్ని మతములకు సంబంధించిన పవిత్ర గ్రంధాల నుండి లభించే పరిజ్ఞానం బహుశ ఆయనకు అవసరమయ్యిందేమో. పెద్దయిన తర్వాత ఆయన చెన్నైలో సంపన్నుడైన న్యాయవాది అయ్యారు.

1938లో రమణాశ్రమానికి కొన్ని కోర్టు పరమైన సమస్యలు రాగా, వాటినన్నిటిని ఆయన చూచుకున్నారు. 1939లో ఆయన భార్య చనిపోయారు. ఆవిడ అంటే ఆయనకు చాలా ప్రేమ. ఆవిడ మరణం ఆయనకు ఎంతగా కృంగదీసిందంటే, ఆయన జీవితం చుక్కాని లేని నావ అయింది. ఆయనకు ఓదార్పు, ఉపశమనం కేవలం రమణుల సన్నిధిలోనే దొరికేవి. భగవాన్ ఆయనను తన వైపుకు వచ్చేటట్లుగా నడిపించారు. ఫలితంగా ఆయన 1940 దశకంలో (వాలంటరీ రిటైర్‌మెంట్) స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, అరుణా చలంలో స్థిరపడ్డారు. 1946 తర్వాత ఆయన భగవాన్‌కు వ్యక్తిగత పరిచారకుడయ్యారు. అంత తెలివైన, గొప్ప పండితుడైన ఆయన తన సర్వస్వాన్ని వదలి, భగవాన్ కు వ్యక్తిగత పరిచారకుడై ఆయనతో ఉండిపోయారు.

నా చిన్నతనంలోనూ, అటు తర్వాత కూడా, నేను టి.పి.ఆర్ తో సన్నిహితంగా ఉండే వాడిని. నాకు ఆయన అంటే ఎంతో ఇష్టము. ఇప్పుడు వెనక్కు తిరిగి చూచుకుంటే, ఎందుకని నాకు ఆయనంటే అంత ఆకర్షణో స్పష్టంగా కనబడుతుంది. భగవాన్ శరీరాన్ని వదిలే రోజున కుటుంబసభ్యులు, డాక్టర్లు, ఆశ్రమంలోని ముఖ్యమైన వారు అందరూ నిర్వాణ గదిలో

ఉన్నారు. భగవాన్ పడుకుని ఉన్నారు. చివరి క్షణంలో, డాక్టర్లు ప్రతి ఒక్కరిని గది వీడి వెళ్ళమన్నారు. మేమందరము వెళ్ళిపోవటానికి సిద్ధమైనాము. నేను కూడా బయటికి వెళ్ళిపోతున్నపుడు, టి.పి.ఆర్ నా చేతిని పట్టుకుని, నన్ను గది ద్వారం వద్ద నిలబెట్టేశారు. ఆయన గనుక నన్ను బలవంతాన ఆపి ఉండకపోతే, నేను మహాద్భుత దృశ్యమైన, భగవాన్ శరీరం వదలగానే అక్కడి నుండి వెలువడిన వెలుగును చూడలేక పోయేవాడిని. ఆ కాంతి, అరుణాచలాన్ని చేరటాన్ని నేను చూడలేదు. 'ది లైఫ్ మాగజైన్' అనే పత్రికకు చెందిన ఫోటోగ్రాఫర్, హెన్రీ కార్టియర్ బ్రెస్సన్, ఆ కాంతి, గిరి శిఖరంపైన జేరి అందులో కలిసిపోవడాన్ని చూశారు. అప్పుడు ఆయన ఆశ్రమానికి ఎదురుగా ఉన్నారు. ఆయనే ఆ సమయాన్ని రాత్రి 8.47 నిముషాలుగా గుర్తించారు. భగవాన్, టి.పి.ఆర్ ద్వారా నాకు ఆ దివ్యకాంతిని దర్శించే భాగ్యాన్ని ప్రసాదించారు. కాలేజిలో చదువుతుండగా గూడా, ఎప్పుడు రమణాశ్రమానికి వచ్చినా నేను వెతుక్కుంటూ వెళ్ళి ఆయనను కలిసేవాడిని. మేమిద్దరము కలసి కాలం గడిపే వారము, 1960లో నేను ముంబైలో ఆరునెలలపాటు ఉద్యోగం చేసిన తర్వాత, నేను ఉద్యోగం వదలి ఆశ్రమానికి తిరిగివచ్చాను. అందుకని, నేను పాత భక్తులందరితోనూ, టి.పి.ఆర్ తో సహా,సన్నిహితంగా ఉండేవాడిని. ఇదంతా భగవాన్ ఆశీస్సుల వల్లనే జరిగింది. ఒక వ్యక్తి, సత్యానికి అంకితమైనపుడు దైవము, మహాత్ముల ద్వారా అతనికి దారి చూపిస్తారు. ఒక మహనీయురాలు నాకొక బాధ్యతను అప్పజెప్పారు. ఆశ్రమాన్ని వదలి వెళ్ళిపోయిన పాత భక్తులందరినీ వెనుకకు తీసుకునిరా. వెనుకకు తీసుకుని వచ్చి సేవ చెయ్యి. వాళ్ళు ఆశ్రమంలో సుఖంగా ఉండేటట్లు చూడు" అని. " ఆ విధంగా ప్రతి ఒక్కరూ, టి.పి.ఆర్.తో సహా వెనుకకు వచ్చారు.

ఒక రోజు నేను ఆశ్రమానికి వస్తుండగా,టి.పి.ఆర్, నా భుజం మీద తట్టి అన్నారు: "నేను కూడా నీలాగానే వేదాంతాన్ని ప్రత్యేక పాఠ్యాంశంగా తీసుకున్నాను కాలేజీలో, నేను వేదాంతాన్ని ఎంతో ఇష్టపడేవాడిని. నేను న్యాయవాదినయిన కొత్తలో, ఒకసారి ఆశ్రమానికి వచ్చాను. అప్పట్లో తరచుగ వచ్చేవాడిని. ఒకప్పుడు హాలులో, ఆత్మయొక్క స్వభావం గురించిన చర్చ జరుగుతున్నది. అప్పటికి నేను పుస్తకాలు చదవడం ద్వారా సంపాదించిన పరిజ్ఞానమంతా మనసులో తాజాగా ఉన్నది. నేను నేర్చుకున్న, పరిజ్ఞానమునంతా వెళ్ళగక్కేశాను. అనేక వేదాంత శాఖలలో ఉన్న చైతన్యము యొక్క అనేక స్థాయిలను గురించి మాట్లాడాను. నేను అధిమానసిక చైతన్యము, అంతశ్చేతన, (చైతన్య రహితము) అనే పదములు ప్రయోగించాను. భగవాన్ ముందు గొప్పలు బోయాను. నా ఉత్సాహభరితమైన, విస్తారమైన వివరణలను విని భగవాన్, అకస్మాత్తుగా చురుకుగా ప్రతి స్పందించారు. ఏదో ఒక దానిని ఆధారము చేసికొని, దాని కంటె అధికమైన స్థితిలో ఉన్నది, దాని అంతరములో (లోపల) ఉన్నది, అది లేకున్న స్థితి అని ఎవరైనా సిద్ధాంతీకరించగలరు. చైతన్యమే సద్వస్తువు లేదా సత్యము కాబట్టి, దాని గురించి ఏ రకమైన సిద్ధాంతములనైనా తయారు చేయ్యటమనేది అజ్ఞానమే, అలా చెయ్యటము మేథస్సుకు చాలా ఆకర్షణీయంగా, సంతృప్తి నిచ్చేదిగా ఉండవచ్చును. 'సత్యము' అనేది చాలా సరళ మైనది. సూటి అయినది. దానికి ఏ విధమైన మార్పులు తేడాలు అవసరము లేదు. ఏదైతే ఉన్నదో అది కేవలము చైతన్యమే. దానిని, ఏ పేరుతో నైనా పిలవండి. ఆత్మ, బ్రహ్మము, ఎఱుక, పరిపూర్ణము, అరుణాచలము, అది కేవలము శుద్ధ చైతన్యమే. భగవాన్ యొక్క ఈ శక్తివంతమైన మాటలు, నన్ను లోనికి మునిగేలా చేసినవి. నేను చాలా సమయం ఆనందంలో మునిగి ఉండి పోయాను. ఆ తర్వాత టి.పి.ఆర్ చెప్పిన మాటలు చాలా చక్కగా ఉన్నవి. గురువు గారి దగ్గరలో ఉండుటలో లాభముయిదే. ఎన్నో గ్రంధములు చదివితేగాని అర్థము కానిది, గురువు గారు చిన్నగా తట్టగానే అర్థమై పోతుంది. అది నిన్ను ఆ స్థితిలోనికి వెళ్ళి సత్యానుభవమును పొందేలా చేస్తుంది. ఇలా గురువు తట్టుట అనునది ఎన్నోసార్లు జరిగినది. నా జీవితములో సద్గురువుతో సన్నిహితంగా ఉండేవారికి, ఇలాంటి దెబ్బలు, చాలాసార్లు తగులుతాయి. ప్రతిసారీ, ఆ దెబ్బ నిన్ను లోపలకే తీసుకుని వెళ్తుంది, బాహ్యమునకు కాదు.

ఒక రోజు టి.పి.ఆర్ అన్నారు. "నేను భగవాన్‌కు సన్నిహితంగా ఉన్నప్పటకీ, ఇంకా నాలో సందేహాలు ఉండిపోయినవి. వేదాంత గ్రంధములు తెలిపే విషయములను సరిగా అవగాహన చేసికొనలేకపోవటము లేదా తప్పుగా అర్థము చేసుకొనటమే ఈ సందేహములకు కారణము. ఆయనకు ఈ సమస్య ఉండేది. ఎందుకంటే వేదాంతమును కాలేజీలో అభ్యసించుట

వలన. ఎవరైనా సరే గ్రంథములను అధికంగా చదివితే తప్పకుండా వివాదములూ, సంఘర్షణలూ ఎక్కువ అవుతవి. నేను అన్నాను, "దయచేసి మరింత వివరంగా చెప్పండి. ఇదేదో సరిగ్గా నా సమస్యలాగానే ఉన్నది". టి.పి.ఆర్ వివరించారు. "నాలో పుస్తక పరిజ్ఞానమునకు, వివేకముతో కూడిన అనుభవ జ్ఞానమునకూ మధ్యన వివాదం చెలరేగు తుండేది. ఏమిటి, వేదాలు, శృతులు, స్మృతులు వంటి పవిత్ర గ్రంథముల వలన లభించే విజ్ఞానము అంత వ్యర్థమైనదా? దానిని అంతటిని వదలి వేస్తేనే గానీ, అసలైన సత్యజ్ఞానము లభించదా? లేనిచో ఈ చట్రాన్ని అధిగమించి పోవాలా? అనే సంధిగ్ధంలో ఉండేవాడిని నేను. ఈ పవిత్ర గ్రంథాలన్నిటినీ చదవటం కేవలం, కాలాన్ని వృథా చేసుకొనడమేనా? అని ఆశ్చర్యం వేసింది. అందుకని, నేను ఈ సమస్యను భగవాన్ ముందుంచాను. భగవాన్ శాంతంగా వివరించారు. అరుణాచలుడు, నేర్చినదానిని వదలివెయ్యడం లేదా జ్ఞానాన్ని త్యజించడం అనేదాని యొక్క కేంద్రంలో ఉన్నారు. అత్యంత అంతిమమైన స్థితియైన ఆధ్యాత్మిక పరిపూర్ణతను అందుకోవలెనంటే, ఒక వ్యక్తి తాను నేర్చుకున్నది లేదా సంపాదించుకున్నదీ అయిన జ్ఞానాన్నంతా నిశ్శేషంగా వదలివేయాలి. ఎవరైనా ఏదైనా నేర్చుకోకపోతే దాన్నెలా వదలివేయగలరు? పవిత్ర గ్రంథములు మనకు జ్ఞానాన్ని చదువును సమకూర్చును. చదువును లేదా జ్ఞానాన్ని వదలి వేయడమంటే, ఒకరి మనసులో ఆ గ్రంథాలను వ్యతిరేకించడము లేదా మనసులో నుండి వాటిని తీసి వెయ్యడము అవుతుందా? అది ఎలా సాధ్యము? అలా కాకుండా జ్ఞానాన్ని వదలి వెయ్యడమంటే, కేవలం మన మేధస్సు ద్వారా మనం సంపాదించుకున్న పరిజ్ఞానం నుండి, మనలను మనము విడుదల చేసుకుని, (మనదృష్టిని దానిపైకి పోనివ్వకుండా చేసి) సత్యాన్ని అనుభవించుట కొరకు లోనికి దూకడమే. (హృదయకుహరం లోనికి వెళ్ళుటయే) అంటే సత్యము తన కంటే వేరు అని భావించకుండా, దానిలో కలసి ఐక్యమై పోవడమే. పుస్తకములలో చెప్పబడినదాన్ని అనుభవసిద్ధం చేసి కొనాలి. అనగా దానిని తాను స్వయంగా అనుభవించి తెలుసుకోవాలి. అన్ని పవిత్ర గంధ్రాలు బోధించిన బోధల సారాన్ని సాధకునికి స్వీయానుభవముగ (వారి స్వంత అనుభవముగ) అందించి, వారు సకల పవిత్ర గ్రంథములను వినుట ద్వారాగాని, చదువుట ద్వారా గాని సంపాదించుకున్న పరిజ్ఞానాన్ని అధిగమించి పరిపూర్ణులయ్యేటట్లు చేస్తారు అరుణాచలేశ్వరుడు. క్లుప్తంగా చెప్పాలంటే, వ్యక్తిగతమైన 'నేను', లేదా 'అహంకారము' లేదా వ్యక్తిత్వము అనబడేదే విషయ పరిజ్ఞానము. ఈ చదువు లేదా ఈ జ్ఞానము మొత్తము తలలో ఉంటుంది. 'నేను', 'నేను' అనబడే 'అహం స్ఫురణ' హృదయంలో ఉంటుంది. అదే 'సత్య జ్ఞానము'. అప్పుడు వివాదానికి తావేది? తలనుండి హృదయానికి దిగటమే ఆధ్యాత్మిక సాధనకు ప్రారంభము అని భగవాన్ స్పష్టంగా చెప్పారు.

చాలా తరచుగా, ఆశ్రమము బయట ఉన్న టి.పి.ఆర్, గదికి వెళ్ళి, ఆయన కొరకు వేచి ఉండేవాడిని. ఒకరోజు ఆయన ఇలా సణుక్కుంటూ గది బయటకు వచ్చారు. "తాత ఏమో విత్తనాలు నాటారు. మనవడేమో ఫలాలు కోసుకుంటున్నారు". ఆయన దానిని మరల మరల అంటున్నారు. "మీరేమి అంటున్నారు?" అని నేనాయనను అడిగాను. అప్పుడాయన ఒక చక్కని వివరణ నిచ్చారు, "ఒకరోజు ఒక భక్తుడు భగవాన్‌కు ఆశ్రమంలో ఘనమైన భిక్షను ఏర్పాటు చేశారు. నేను, నా మిత్రునికి ఆ భిక్ష గురించి సంతోషాన్ని వ్యక్తపరుస్తుండగా భగవాన్ లోనికి వచ్చారు. ఆయన మా సంభాషణను విని చిరునవ్వు నవ్వి నా వైపు తిరిగి ఇలా అన్నారు. " భిక్ష గురించి ఆలోచిస్తున్నారా? అరుణాచలానికి వచ్చిన తర్వాత ఒక మీ తాతగారింటి లోనికి మాత్రమే భిక్ష కొరకు ప్రవేశించాను. ప్రతిరోజు మీ తాతగారు క్రమం తప్పకుండా అరుణాచలేశ్వరుని ఆలయమునకు వచ్చేవారు. ఆయన అరుణాచలేశ్వరునకు గొప్ప భక్తుడు. ఎత్తుగా, దృఢంగా ఉండే ఆయన రుద్రాక్షలను ఇతర పూసలను ధరించేవారు. ఆ రోజులలో అనగా 1896 వ సంవత్సరమునకు కొంచెమటూ ఇటూగా, నేను పెద్ద గుడిలోని గోపురము సుబ్రహ్మణ్య ఆలయం దగ్గరలో, అరుణాచలేశ్వరాలయ ద్వారమునకు దగ్గరలో ఉండే వాడిని. ప్రతిరోజు మీ తాతగారు, కొంతసేపు మౌనంగా నా ఎదుట కూర్చునేవారు. నేను అప్పటికి పదహారేళ్ళ బాలుడిని. ఆయన పెద్దవారు. అయినప్పటికీ ఆయన నా ఎదుట మౌనంగా ఉండేవారు. ఆయన టౌన్‌లో మంచి పేరు పొందిన వ్యక్తి. అందుకని చాలామంది ప్రముఖులు ఆయనకు అతిథులుగా వచ్చేవారు. ఒకరోజు చాలా ప్రముఖుడొక ఆయన వారింటికి వచ్చారు. విందు ఏర్పాట్లు చెయ్యబడ్డవి. ఆరోజున గూడా మీ తాతగారు అరుణాచలేశ్వరుని దర్శనానికై వచ్చి, నా వద్దకు వచ్చి కూర్చున్నారు. కొంచెం

సేపటి తర్వాత, "లేవండి! మా ఇంటికి వచ్చి భిక్ష తీసుకుని వెనుకకు వద్దురుగాని," అన్నారు నాతో. అప్పుడు మాట్లాడటం నాకు అలవాటు లేదు, నేనురానని నాకు ఇష్టం లేదని సైగలు చేశాను. ఆయన లెక్క చెయ్యలేదు. ఆయన భారీగా, దృఢంగా ఉన్నారు. నేనేమో సన్నగా, బలహీనంగా ఉన్నాను. ఆయన మరల మరల అభ్యర్థించారు. నేను 'రాను' అనే ఉద్దేశం మీదనే ఉన్నాను. నేను ఏ మాత్రం వినకపోయేసరికి, ఆయన కిందకు వంగి, నా చేతులను తన చేతులతో పట్టుకుని, బలవంతంగా లేవదీసి, తనతో వెళ్ళేలా చేశారు. ఆ విధంగా బలవంతంగా ఆయన ఇంట్లోకి ప్రవేశించవలసి వచ్చింది. ఆయన నన్ను అందరికంటె ప్రత్యేకమైన స్థానంలో కూర్చుండ బెట్టి, మిగిలిన వారికి వేసిన ఆకుల కంటె పెద్ద ఆకును నా ముందుంచి, ఆయనే స్వయంగా వడ్డించారు. నేను భోజనం ముగించిన తర్వాత ఆయన భోంచేశారు. ఆ రోజులలో నేనెన్నడూ స్నానం చేసే వాడిని కాను. నా శరీరం నుండి వాసన వస్తుండేది. అందుకని ఎవ్వరూ నా దగ్గరగా వచ్చేవారు కాదు. టౌను నుండి చాలా మంది వచ్చి నన్ను చూచి వెళ్ళి పోయేవారు. మీ తాతగారొక్కరు మాత్రమే గుర్తించారు, "యువకుడైనా ఆయనలో పరిపూర్ణత్వము ఉన్నది అని. దీనిని గురించి చెప్పినపుడు ఆయన కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి. ఆయన ఇలా చెప్పారు,"గణేశన్, కేవలం భగవాన్ పట్ల మా తాతగారి భక్తి వలననే, ఇప్పుడు నేను భగవాన్ సన్నిధిని ఆనందంతో అనుభవించ గలుగుతున్నాను. భగవాన్ ప్రతిదినమూ నాపై కురిపించే అంతరంగిక ఆనందమును అనుభవించ గలుగుతున్నాను."

మరొక రోజున, నేను టి.పి.ఆర్ ను అడిగాను, "భగవాన్ యొక్క కరుణ గురించి మీరేమైనా నాకు చెబుతారా?" ఆయన బదులిచ్చారు, "భగవాన్ కరుణకు రెండు ప్రక్కలు ఉంటవి. ఎవరైనా దుఃఖంలో ఉంటే, ఆయన వారి స్థాయికి దిగి, వారిని లేవనెత్తి (సాధారణ జీవితానికి) మరల పూర్వపుస్థితికి తీసికుని వచ్చేవారు. అటువంటి వారి విషయంలో, ఎల్లప్పుడూ తాను అంటి పెట్టుకుని ఉండే, ఆత్మ విచారణను గూడా పక్క కు పెట్టేవారాయన. కరుణ యొక్క రెండవ వైపు ఇంకా లోతైనది. ఆయన బాధ నుండి ఉపశమనం కల్గించటమే గాక, ఆ వ్యక్తిని పూర్తిగా మార్చేసే వారు. కొన్ని నిజంగా జరిగిన సంఘటనలతో ఈ విషయాన్ని వివరించి చెప్పండి.(లేదా మీరు చెప్పిన విషయం బాగా ఆకళింపుచేసికొనటానికి కొన్ని ఉదాహరణలు చెప్పండి) నేనెప్పుడూ భగవాన్ కథలను వినాలని ఆసక్తితో ఉండేవాడిని. టి.పి.ఆర్ ఇలా చెప్పారు. రమణాశ్రమము లోపల పోస్టాఫీసు ప్రారంభించ బడినపుడు, ఒక చాలా ముఖ్యమైన ఆఫీసరు, రమణాశ్రమానికి వచ్చారు. ఆయన కన్నీటితో హాలు లోనికి వచ్చారు. "భగవాన్, నా ఏకైక పుత్రుడిని కోల్పోయాను. మా కుమారుని పోగొట్టు కున్న తర్వాత నేను గాని, నా భార్య గానీ ఏనాడూ ప్రశాంతంగా కానీ, ఆనందంగా కానీ లేము. మేము జీవితంలో ఏ గమ్యమూ లేని వారమై తిరుగుతున్నాము. భగవాన్ ఆయన వంక కరుణతో చూశారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు, "భగవాన్, మాకు ఒకే ఒక్క కోరిక, మీరు మా కోరికను తీర్చాలి. మేము వచ్చే జన్మలో మా కుమారుని చూడాలనుకుంటున్నాము". టి.పి.ఆర్ చెప్పసాగారు. హాలులో ఉన్న భక్తులందరికీ భగవాన్ ఏమి జవాబివ్వబోతున్నారో తెలుసు. భగవాన్ నిజంగా అలాంటి జవాబునే ఇచ్చారు. భగవాన్, ఆయన వంక కరుణాపూరిత నేత్రాలతో చూసి, ఆయనను ఇలా ప్రశ్నించారు. "తండ్రి ఎవరు? కొడుకు ఎవరు? తండ్రి కొడుకుల మధ్య సంబంధ మంటే ఏమిటను కుంటున్నావు? పునర్జన్మ అంటే అసలు నీ ఉద్దేశమేమిటి? ఇదంతా నీకు అర్థమైతే నువ్వు అడిగేదాని లోతు నీకు తెలుస్తుంది. ఆయన భగవాన్‌కు సాష్టాంగ నమస్కారముచేసి భగవాన్‌తో ఇలా అన్నారు, "భగవాన్, నా కిదంతా ఏమీ తెలియదు. నేను కోరుకునేది ఒక్కటే. నేను నా కొడుకుని చూడాలి." భగవాన్ అప్పుడు ప్రత్యేకము, అసాధారణము అయిన పని చేశారు. ఆయన తను కూర్చున్న చోటు నుండి లేచి తన చేతులు పై కెత్తి ఇలా అన్నారు, "సరే, నేను అది నీకిస్తాను. నీవు నీ కొడుకును చూచేలా చేస్తాను. ఈ జన్మలో మీ కుమారుని ఎంత స్పష్టంగా చూశారో అంత స్పష్టంగా మీ కుమారుని మరు జన్మలో మీరు చూస్తారు." ఆ ఆఫీసరు మహదానందము చెంది, భగవాన్ పాదాల వద్ద అనేక సార్లు మొక్కారు. చాలా సంతోషంతో ఆయన హాలు వదలి వెళ్ళిపోయారు.

హాలులో ఉన్న భక్తులందరూ టి.పి.ఆర్ తో సహా ఆందోళన చెందారు. టి.పి.ఆర్, భగవాన్‌ను ఇలా అడిగారు, "భగవాన్ మీరు ఆయనకు అటువంటి సమాధానం ఎలా ఇవ్వగలిగారు? ఇది మీ బోధకు వ్యతిరేకంగా ఉన్నది. మీ బోధ ప్రకారము జన్మ, మరియు పునర్జన్మ అనేవి లేనే లేవు. ఈ శరీరమే జన్మించక పోతే ఇక పునర్జన్మ ప్రసక్తి ఎక్కడ? భగవాన్, టి.పి.ఆర్

వైపు తిరిగి అన్నారు, “నేను ఏమి చేయను? నేను ఆయనకు ఈ సమాధానము ఇచ్చి ఉండకపోతే, ఆయన మనస్సు చిన్నాభిన్నమై పోయి ఉండేది. టి.పి.ఆర్, ఇలా బాధపడ్డారు, “మీరిలా, మీ స్థాయి నుండి క్రిందికి దిగడం. నాకు సంతోషంగా అన్పించడం లేదు”. భగవాన్, వారి బాధను, నిరుత్సాహాన్నీ గమనించి, “వెళ్ళి, భగవద్గీతను తీసికొనిరండి”, అన్నారు. భగవాన్ అందులో నుండి ఒక పేరాగ్రాఫ్ ను చూపి, టి.పి.ఆర్‌ను, దానిని పెద్దగా చదవమన్నారు. ఆ భాగంలో శ్రీకృష్ణుడు, అర్థము చేసుకునే వారి సామర్థ్యాన్ని బట్టి, జ్ఞానాన్ని ప్రసాదించాలి. దానిని గ్రహించటానికి తగిన పరిపక్వత లేని వారికి జ్ఞానోపదేశము చేసినట్లయితే, వారి విశ్వాసము పూర్తిగా నాశనం చెందుతుంది అని ఉన్నది. ఇది భగవాన్ కరుణ అని చెప్పటం ముగించారు.

అప్పుడు, రెండవ రకం కరుణ గురించి, మనుషుల్ని పూర్తిగా మార్చివేసే కరుణను గురించి చెప్పమని, నే నాయనను కోరాను. అప్పుడు టి.పి.ఆర్ ఇలా గుర్తుచేసుకున్నారు, “అరవింద్ బోస్, ఒక పారిశ్రామిక వేత్త, ఆయన బాగా విద్యావంతుడు, భగవాన్‌కు గొప్ప భక్తుడు. ఆయన భగవాన్ యొక్క ఆత్మ విచారణ మార్గం పట్ల ఆకర్షితులైనారు. ఆయన బెంగుళూరులో ఒక పరిశ్రమ ప్రారంభించారు. అది ఇప్పటికి గూడా బాగా నడుస్తున్నది.

ఆయన ప్రతివారము, భగవాన్‌ను చూడటానికి వచ్చేవారు, వస్తూ, తనతోపాటు కొందరు స్నేహితులను కూడా తీసికుని వచ్చేవారు. బోస్‌కు, ఇరువది సంవత్సరాల కుమారుడు ఉండేవారు. అతడు చాలా తెలివిగల కుర్రవాడు, బోస్, ఆ కుమారునికి పరిశ్రమ నిర్వాహణ భారాన్ని అప్పగించి తను, భగవాన్ పవిత్ర పాదాల వద్ద స్థిరపడి పోదాము అనుకున్నారు. కానీ, ఆ పిల్లవాడు అకస్మాత్తుగా చనిపోయాడు. బోస్ దుఃఖానికి అంతులేకుండా పోయింది. రమణాశ్రమము నుండి చాలా మందిమి ఆయనను ఓదార్చటానికి వెళ్ళాము. మేము భగవాన్ బోధలలోని అన్ని కోణాలను గురించి ఎంతగానో మాట్లాడాము. అయినా లాభము లేక పోయింది. ఆయనను భగవాన్ వద్దకు తీసుకుని వెళ్ళవలెనను కున్నాము. మధ్యాహ్నం, పన్నెండు గంటలు, రెండు గంటలు మధ్యసమయంలో సాధారణంగా భగవాన్ వద్ద జనం ఉండరు కాబట్టి, ఆ టైములో నేను బోస్‌ను భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళాను. భగవాన్, తనకు దగ్గరగా కూర్చొనమని చెప్పి, ఆయన వైపే చూడటం మొదలు పెట్టారు. బోస్ శారీరకంగాను, మానసికంగాను వ్యధ చెంది ఉన్నారు. ఆయన చాలా వ్యాకులతతో ఉన్నారు. ఆయన తన కళ్ళను కూడా తెరిచే స్థితిలో లేరు. భగవాన్ ఆయనపై ఏకాగ్ర దృష్టి నిలిపారు. చివరకు బోస్ కళ్ళు తెరిచారు. ఆయన భగవాన్ వైపు చూడగలిగారు, భగవాన్ ఆయన వైపు చూస్తూనే ఉన్నారు.కొంతసేపటి తర్వాత ఇది ఆయనను కదలించింది. ఆయన పెద్ద గొంతుతో అరచారు, “భగవాన్, దేవుడున్నాడా?” భగవంతుడున్నడా?” అయిదు నిమిషాల పాటు అక్కడ మౌనం రాజ్యమేలింది. భగవాన్, బోస్ వైపు చూస్తూనే ఉన్నారు. బోస్ కూడా భగవాన్ వైపు చూచారు.” టి.పి.ఆర్, దీని నంతటి బయటి నుండి కిటికీ ద్వారా చూస్తూ ఉన్నారు.ఆయన బోస్‌లో ఏదో మార్పు రావటము గమనించారు.ఆయన తన మామూలు స్థితికి వచ్చి, భగవాన్‌కు నమస్కరించారు. బోస్ మొదటిసారిగా చిరునవ్వు నవ్వి “భగవాన్, ధన్యవాదములు”, అన్నారు. టి.పి.ఆర్ అన్నారు. “భగవాన్‌కూ. బోస్‌కూ మధ్యన ఏమిజరిగిందో మనకు తెలియదు.బోస్, “భగవంతుడున్నాడా?” అని అడిగారు. భగవాన్, “నీ ప్రశ్నలోనే సమాధాన మున్నది”, అన్నారు. ప్రశ్నకు, జవాబు అనేది కేవలం మేధాపరమైనది లేదా బుద్ధికి సంబంధించినది. కానీ కరుణ అనేది, అంతులేని ఊరట నిచ్చేది. చాలా దృఢమైనది”, బోస్, భగవాన్‌కు గొప్ప భక్తుడి గానే ఉండిపోయారు. అప్పటికే ఆయనకు “బోస్ కాంపౌండ్”, ఉండేది. అందులో భక్తులు ఉండుట కొరకు అనేక కుటీరాలు ఉండేవి. టి.పి.ఆర్ కూడా ఆయన చివరి రోజులలో అక్కడ ఉండేవారు. కొన్నాళ్ళకు ఆయనను నేను ఆశ్రమానికి తీసికుని వచ్చేశాను.

భగవాన్ ఉదయం 3.30 గంటలకు లేచేవారు. ఆయన అయిదు, అయిదున్నరకు కొండపైకి వెళ్ళి వచ్చేవారు. దాదాపు ఆరుగంటలకు స్నానం చేసేవారు. ఆరున్నరకు ఉదయం ఫలహారం చేసేవారు. ఎనిమిది గంటలకు హాలులో ఉండేవారు. పదకొండు గంటలకు మధ్యాహ్న భోజనానికి వెళ్ళేవారు. ఆయన కొక దినచర్య ఉండేది. నేను టి.పి.ఆర్ తో అంటూ ఉండేవాడిని, “మన భగవాన్ ఎప్పుడు ఏమి చేస్తారో చెప్పవచ్చును. కానీ శేషాద్రి స్వామి, రామకృష్ణ పరమ హంసల

విషయంలో అలా వీలవదు." టి.పి.ఆర్ అన్నారు. "మీరు అలా మాట్లాడవద్దు. మీరు జ్ఞాని ఏం చెయ్యబోతున్నారో ఎప్పటికీ ఊహించలేరు". ఆయన మరల ఇలా అన్నారు. "నేను కొన్ని సంఘటనలను చెబుతాను. మీరు వాటిని అర్థం చేసుకున్నారో లేదో, మీరే విశ్లేషించుకొనండి, ఒకప్పుడు ఉత్తర భారతదేశము నుండి ఒకస్వామి వచ్చారు. ఆయన వృద్ధులు. ఆయన కొన్ని వారముల పాటు ఆశ్రమంలో ఉండి పోయారు. ఆయన ఆధ్యాత్మికంగా బాగా పరిణితి చెందిన వారు అయి ఉండాలి. ఎందుకంటే ఆయన చుట్టూ ఒక ప్రకాశము (కాంతి) కనపడేది. ఆయన వెళ్ళిపోయేరోజున, ఆయన భగవాన్ ఎదుట నిల్చున్నారు. నేను భగవాన్ ప్రక్కన ఉన్నాను. ఆ స్వామి అన్నారు, "నేను చాలా సంతోషంగా ఉన్నాను, ఎందుకంటే నేను అరుణాచలానికీ, మీ ఆశ్రమానికీ వచ్చిన తర్వాత, నేను కోరుకున్నవన్నీ పొందాను. కానీ నాకింకా రెండు కోరికలు ఉన్నవి. అవి మీ వల్లనే నెరవేర్చబడతవి.

హాలులో ఉన్న మేమందరము, ఆయన భగవాన్ సమాధానంతో గట్టిగా దిమ్మెరపోతారనుకున్నాము. మేము ఊపిరి బిగబట్టి వేచి యున్నాము.భగవాన్ తల ఊపి, ఆ స్వామిని చెప్పటం కొనసాగించమని సైగ చేశారు. ఆ స్వామి చేతులు జోడించి, నా శిరస్సును మీ పాదాలపై ఉంచి కరగిపోవాలనీ, మీ పాదాలను నాకన్నీటితో అభిషేకించాలని, నా మొదటి విన్నపము." భగవాన్ ఒక్క మాట కూడా మాట్లాడకుండా వేచి ఉన్నారు. ఆ స్వామి అన్నారు "మీరు మీ పవిత్ర హస్తాలను నా మీద ఉంచి నీకు ఆత్మ సాక్షాత్కారాన్ని, మోక్షాన్ని ఇచ్చాను, అనాలి అనేది నా రెండవ విన్నపము." ఈ స్వామి ఇటువంటి విన్నపాలు చేశారేమిటి? అని మాలో మేము నవ్వుకున్నాము. కానీ ఒక ఆశ్చర్యకరమైన విషయం జరిగింది. భగవాన్ సోఫా పై నుండి లేచి ఆయన ఎదురుగా నిల్చున్నారు. ఆ స్వామి భగవాన్ పాదాలపై పడ్డారు. ఆయన కన్నీరు భగవాన్ పాదాలను తడపటం మేము చూశాము. కొంతసేపైన తర్వాత భగవాన్ ఆయనను లేవదీశారు. తన చేతులను ఆయన భుజాలపై ఉంచి, నేను నీకు ఆత్మసాక్షాత్కారాన్ని ఇచ్చాను అన్నారు. ఆయన కళ్ళనుండి కన్నీరు కారుతూనే ఉన్నప్పటికీ, ఆయన భగవాన్ వద్ద నుండి సెలవు తీసికుంటుండగా", ఆయన ముఖం సంతృప్తితో వెలిగిపోయింది.

టి.పి.ఆర్ ఇలా కొనసాగించారు, "ఒక అమెరికన్ ఆశ్రమానికి వచ్చారు. ఆయన పేరు మాకు తెలియదు. ఆ పొడవైన, అందమైన అమెరికా దేశస్థుడు, తన పేరును చెప్పకుండానే లోనికి వచ్చారు. ఆయన లోనికి వచ్చిన క్షణము నుండి, భగవాన్ దృష్టి ఆయన పైననే ఉన్నది.ఆయన భగవాన్ ముందు మూడు గంటలపాటు కూర్చునే ఉన్నారు. వారిద్దరి మధ్య ఏదో ఒక విధమైన కనపడని పరస్పర భావ వ్యక్తీకరణ జరుగుతూ ఉన్నది. అక్కడ గాఢమైన నిశ్శబ్దత అలముకొన్నది. వారిద్దరి మధ్య సంభాషణ జరుగలేదు. ఆ అమెరికా దేశస్థుడు లేచి వెళ్ళిపోయారు. ఆయన మరల తిరిగి రాలేదు. నేను భగవాన్ ను అడిగాను, "ఏమిటి, ఈయన ఇక్కడకు వచ్చి కేవలము మూడు గంటలపాటు మాత్రమే ఉన్నారు?" భగవాన్ ఇలా బదులిచ్చారు, "ఆయనకు కావలసినది ఆయనకు దొరికినది. ఆయన వచ్చిన పని పూర్తి అయినది. ఇంకా ఇక్కడ ఉండి పోవలసిన అవసరమేమిటి? ప్రతిదీ ప్రస్తుతంలోనే పూర్తి అవుతుంది!'

అప్పట్లో ఒక గొప్ప వంశమునకు చెందిన సంపన్న స్త్రీ, తాను కేవలము భగవాన్‌తో ఉండుట కొరకై వస్తున్నాను, అని టెలిగ్రామ్ పంపారు, ఆమె ఓడలో బాంబేకు ఫలానా తేదీన జేరుకుంటాననీ, అక్కడ నుండీ, మద్రాసుకు రైలులో వస్తాననీ. తాను ప్రత్యేకమైన రైలులో ఫలానా తేదీన అరుణాచలానికి చేరుకుంటానని వ్రాశారు (ఆ టెలిగ్రాంలో). బొంబాయి నుండి తన కార్యక్రమాన్ని ఖరారు పరుస్తూ మరొక టెలిగ్రామ్ పంపారు. మద్రాసు నుండి మరొక టెలిగ్రామ్ పంపారు. తనను కలుసుకొనడానికి ఎవ్వరూ రైల్వేస్టేషన్‌కు రాకపోవటముతో నిరాశ చెందారు. రమణాశ్రమము వద్ద కూడా ఎవరూ ఆమెకు ఎదురు వెళ్ళి తోడ్కొని రాలేదు. తనకు తానే హాలులోనికి వచ్చారామె. భగవాన్ ఒక దినపత్రికను ముఖానికి ఎదురుగా పెట్టుకుని చదువుతున్నారు.ఆమె, ఆయన ముఖం కూడా చూడలేకపోయారు. ఆమె అంతదూరము నుండి, అందులో ప్రత్యేకమైన రైలు ఏర్పాటు చేసుకుని వస్తున్నందున, మేజర్ చాడ్విక్, మునగాల వెంకట్రామయ్యగారు కూడా, ఆమెను కనిపెట్టి చూసుకొనవలసినదిగా అభ్యర్థించ బడ్డారు. ఆమె తనకు జరిగిన నిరాదరణ పట్ల మండి పడ్డారు. ఆమె ఇలా అన్నారు. "నేనొక స్త్రీని. నేను ఏమి తప్పు చేశాను? నేను అన్ని విధాలా సక్రమమైన విధానంతోనే ఇక్కడకు వచ్చాను. ఇక్కడ

ఎవ్వరూ నన్ను గౌరవించుట లేదు. ఈ రమణ మహర్షి నా వైపు చూడను కూడా లేదు. ఆమెకు విపరీతంగా కోపము వచ్చింది. ఆమె చాడ్విక్ తోనూ, మునగాల వెంకట్రామయ్యగారి తోనూ, "నాలుగు గంటలకు నా రైల్వే కారు వద్దకు రండి. నేను మీతో మాట్లాడాలనుకుంటున్నాను," అని చెప్పి అప్పటి కప్పుడు వెళ్ళిపోయారు. వారు ఆమెను కలవటానికి వెళ్ళినపుడు, ఆమె ఇలా ప్రశ్నించారు," రమణ మహర్షి నా పట్ల కనీసపు మర్యాదనైనా చూపలేదెందుకని? నేనేమి తప్పు చేశాను? నేను చెయ్యవలసిన వన్నీ వంక పెట్టలేని విధంగా చేశాను. కానీ ఆయనకు ఒకస్త్రీని ఎలా గౌరవించాలో, కనీసం ఎలా పలుకరించాలో కూడా తెలియదు." వాళ్ళు అన్నారు," మా గురువుగారిని గురించి చెడ్డగా మాట్లాడకండి. మేము వెళ్ళి ఇక్కడ జరిగినవన్నీ ఆయనకు చెబుతాము," ఆమె అన్నారు, "అందుకోసమే నేను ఈ మాటలు అంటున్నాను. వెళ్ళి ఆయనతో చెప్పండి. ఆయనను ఎంతో కొంత నేర్చుకోనివ్వండి." ఆ ఇద్దరూ భయపడుతూ, జరిగిన విషయాన్ని భగవాన్ కు చెప్పారు. భగవాన్ చాలా ఆసక్తిగా విన్నారు. ఆయన ఆ విషయాలన్నీ మరింత వివరంగా చెప్పమని అడిగారు. ఆఖరికి, తన సాధారణ సమస్థితికి వచ్చి అన్నారు, "ఆమె ఇదంతా అన్నారా? అప్పుడు ఇదే దీని పనిని చేస్తుంది." ఆ రాత్రి ఆ స్త్రీ కి ఒక స్వప్నం వచ్చింది. ఆ కలలో భగవాన్, "వెనుకకు రా", అన్నారు. ఆ మర్నాడు ముందుగా తెలుపకుండా ఆమె రమణాశ్రమానికి వచ్చింది.ఎనిమిది గంటల నుండి భగవాన్ కళ్ళు హాలు ద్వారం వైపు చూస్తున్నాయి. ఆమె పది గంటలకు వచ్చారు. భగవాన్ ఆమెను చూచి చిరునవ్వు చిందించారు. ఆమె భగవాన్ కు భక్తురాలిగా మారిపోయారు. తర్వాత, ఆమె అన్నారు, "మనము ఎప్పుడూ సద్గురువునుగానీ, ఆయన చెయ్యబోయే చర్యలను గానీ విశ్లేషించలేము. ఆయన చర్యలను బట్టి మనము దేనినీ నిర్ణయించలేము".

టి.పి.ఆర్ కేవలము ఈ సంఘటనలను గురించి తెలపటమే కాదు, భగవాన్ బోధల పట్ల అవగాహనను కూడా కల్గించారు. ఒకసారి ఆయన భగవాన్‌తో ఇలా చెప్పారు, "మీ వ్యక్తిగత రూపాని పైగల ఆకర్షణతో నేను మీ వద్దకు రాలేదు. మీ బోధ అయిన "నేనెవరను?", అనేది హేతుబద్ధంగా ఉండుటవలన, దాని పట్ల ఆకర్షితుడనై మీ వద్దకు వచ్చాను. దానిని నేను ఆచరణలో పెడుతున్నప్పటికీ, నాకింకా అగమ్యగోచరంగానే ఉన్నది. నేను దాని అనుభవాన్ని పొందలేకపోతున్నాను. (నేను దానిని అనుభవంలోనికి తెచ్చుకోలేకపోతున్నాను)?" భగవాన్ ఆయన వైపు నిలకడగా జూచి ఇలా అన్నారు. "చేపలను పట్టుకోదలచిన వాడు, తన గాలానికి, చేపను బాగా ఆకర్షించే ఎరను వేస్తాడు. అతడు, ఆ చేపకు ఆహారం తిన్పించాలనుకుంటాడా? ఆయన దానిని కేవలం పట్టుకోవాలనుకుంటాడు." పదకొండు పేజీలను కల్గిన 'నేనెవరను?' అనే మణి వంటి పుస్తకము, మనలను ఆకర్షించి, మన అహంకారాన్ని నాశనం చెయ్యడానికి ఉద్దేశించిన 'ఎర' వంటిదే. నేను, టి.పి.ఆర్ ను,"మీరు ఎప్పుడైనా భగవాన్ రచనలను గురించి ఆయన నుండి వివరణలను పొందారా?" అని అడిగాను. టి.పి.ఆర్ తాను, భగవాన్‌ను తమిళ పదములైన 'ఆర్ఒళీ' (కాంతి ప్రకాశము) అనే వాటి యొక్క అర్థమును గురించి అడిగినట్లు చెప్పారు. ఆ పదములు, 'ఉన్నది నలుబది'లోని మొదటి రెండు పద్యముల తర్వాత అసలు గ్రంథము ప్రారంభ పద్యములోనివి.

ఒక వ్యక్తి ప్రపంచమును నిజంగానే చూస్తాడు కనుక, చాలా భిన్నమైన రూపాలు ఉన్నవని అతడంగీకరించాలి. కానీ చూడబడేది మొత్తమూ ఈ నామములూ (పేర్లూ), రూపములూ, చూచేవాడూ, ఏ తెరపై ఈ దృశ్యములన్నియూ కన్పిస్తున్నవో, ఆ తెర, తన ప్రకాశముతో వీటినన్నిటినీ కన్పింప జేసే ఆ కాంతి (దీపము) అవన్నీ కూడా నిజానికి ఆ ఒక్క వస్తువే. 'నేను' 'అహం' అనబడే శుద్ధ చైతన్యమే, ఆత్మయే. అపుడు నేను, "తన ప్రకాశముతో వీటినన్నిటినీ కన్పించేసే కాంతి (దీపము) ఏమిటి? అది దేనిని ఉద్ధేశించి చెప్పబడినది?" అన్నాను. అప్పుడు భగవాన్, "ఆర్ఒళీ' అంటే, సర్వత్ర వ్యాపించి యుండు నట్టి ప్రకాశము, ఏకాంతి వల్ల నైతే మనసు పనిచేయుట జరిగి, మనసు సర్వమును గ్రహించ గలుగు చున్నదో, సర్వ ప్రపంచమును చూడగలుగుచున్నదో అది. స్థూల మనసు ద్వారానే (అంటే ఇంకా గుప్త వాసనలు లేదా సంస్కారములు కలిగి యున్న మనసు ద్వారానే) మనము ఈ జగత్తును, తెలిసిన వాటిని, తెలియని వాటిని గూడా చూడగలుగు తున్నాము. అతీంద్రియ విషయములు గూడా మనసు ద్వారానే తెలుసుకొనబడతవి. తెలిసిన వాటిని కన్నుల ద్వారా చూస్తాము. మనము

చూడాలని కోరుకునే దైవము వంటి మనకు తెలియని వాటిని దృశ్యంగా చూస్తాము. ఆ తెల్లని వెలుగునే మనము 'ఆత్మ' అంటాము. దానినే జీసస్ 'అగ్ని' అన్నారు. ఆత్మ ప్రకాశము చీకటి వెలుగులకు అతీతమైనది. ఆ కాంతిలో ఏ వస్తువూ చూడ బడదు. అక్కడ చూచేవాడూ, చూడబడేదీ ఉండదు. సంపూర్ణ ప్రకాశమునందు, (ఆత్మసాక్షాత్కారము నందు) సంపూర్ణ చీకటి యందు (గాఢ నిద్రావస్త వంటి దాని యందు) మనకు మామూలుగా కనబడునవి. ఆ రెండు అవస్థలలోనూ కనబడవు. కానీ ఆత్మ ఒక కాంతిని మనస్సు నందు ప్రతిబింబింపజేస్తుంది. అంటే స్థూలమనస్సు, అనగా గుప్త వాసనలు (సంస్కారములు) కలిగి యున్న జడమైన మనస్సు ఆత్మ యొక్క ప్రభావము చేతనే పనిచేయుట ప్రారంభిస్తుంది. మిరుమిట్లు గొలిపే కాంతి కాకూండా, కటికి చీకటి కాకుండా, మధ్యస్థమైన మసక వెలుతురు (కాంతి)లోనే స్వప్నములు, దృశ్యములు గోచరిస్తాయి. వస్తువులు కన్పిస్తాయి. స్థూలమనసును చైతన్య పరిచే, ఈ ఆత్మ చేత ప్రతిబింబించబడిన కాంతిని గురించే మొదటి పద్యములో చెప్పబడినది.

ఒకసారి నేను టి.పి.ఆర్‌తో ఇలా అన్నాను. "మన సాధకులకు కూడా బాధ్యతలుంటవిగదా, అపుడు ప్రాపంచిక బాధ్యతలను, ఆధ్యాత్మిక ఆశయాలను సమగ్రంగా ఎలా నిర్వహించుకోవాలి? ఇది గొప్ప వైపరీత్యము వలె కన్పిస్తున్నది." టి.పి.ఆర్. బదులిచ్చారు. "నాకు భగవాన్ తో జరిగింది ఏమిటో చెబుతాను. నన్ను సంసార బంధముల నుండి తప్పించవలసినదిగా ప్రార్థించాను. నేను ఎంతగా అంతర్ముఖం చెందాలని చూసినా, జీవన పయనంలోని బాధ్యతలు, నన్ను పట్టి లాగుతున్నవి. వాటిని అధిగమించ లేకపోతున్నాను. ఈ బాధ్యతలు అధిగమమించే మార్గమును (ఉపాయమును) కోరుకుంటున్నాను." భగవాన్ మిక్కిలి ప్రేమతో అన్నారు. "నదీ తీరమును కోసి వేసే టటువంటి ఉధృతమైన వరదలో కొట్టుకొని పోయే చిన్న గడ్డిపరక వలె ఉండు." టి.పి.ఆర్ అప్పుడు వివరణ యిచ్చారు. ఆధ్యాత్మిక సాధకులకైనా, యితరుల కైనా, దైనందిన జీవితంలోని కార్యక్రమాలూ, బాధ్యతలూ తప్పవు. తాము చాలా ముఖ్యమైన వారిమి అని మానవులు పేరు, ప్రఖ్యాతులను ఆశించి కష్టపడతారు. అందుకని వారనేక సమస్యలను ఎదుర్కొనవలసి ఉంటుంది.

నిజమైన ఆధ్యాత్మికత అంటే, బాధ్యతల నుండి, పనుల నుండి తప్పించు కొనడం గాదు, పనులు చేసేవాడికి ప్రాముఖ్యత లేకుండా పనులలో నిమగ్నమై ఉండటము, ఇంకో విధంగా చెప్పాలంటే, వరద ప్రవాహంలోనికి విసరివేయబడ్డ దుమ్ము వలె ఉండాలి, ఏ కార్యంలో నిమగ్నమైనా సరే. నేనే కర్తను, నేనే చేస్తున్నాను అనే భావాన్ని విడనాడాలి, పనిని విడనాడటము కాదు. నేను తిరిగి టి.పి.ఆర్‌ను ప్రశ్నించాను, "నేను పనిచేస్తూన్నాను. నేను కర్తను కాదు అని నేనెలా భావించగలను?" టి.పి.ఆర్ అన్నారు, "నేను కూడా ఇదే భగవాన్‌ను అడిగాను, భగవాన్ కర్త యొక్క ప్రాముఖ్యతను (తగ్గించటానికి) తుడిచి వెయ్యటానికి, రెండు ఆచరణ యోగ్యమైన మార్గాలను భగవాన్ చెప్పారు. ఒకటి నీ చుట్టూ జరిగే దానిపట్ల ప్రతిస్పందన లేకుండా ఉండటము, ఎవరైనా పనిచెయ్యవలెను కానీ ప్రతి స్పందించరాదు. రెండవది పనులు, కార్యక్రమములు అన్నీ నీ ద్వారా జరిగి పోతున్నవే గాని, నీ చేత చెయబడుట లేదు. కార్యక్రమములు అన్నియు ఒక సర్వోత్కృష్ట మైన శక్తిచే జరుపబడుచున్నవి. పనులన్నియు, అవి మంచివైనను, చెడ్డవైనను, నీ ద్వారా మాత్రమే జరుగుతున్నవి. నీ చేతగాదు. ప్రతిస్పందించుట యనగా మానసికమైన కార్యము. మనసు మనలను పనితో (కార్యముతో) బంధించివేస్తుంది. నీవు ప్రతిస్పందించకపోయినట్లైతే అది (మనసు) చనిపోతుంది.

ఆయన చివరి రోజులలో ఆయనను ఆశ్రమానికి వచ్చి ఉండమని ప్రార్థించాను. ఆయనే మొదటిసారి చాడ్విక్ గదిలో ఉన్నారు. చాడ్విక్ తప్ప ఇతరు లెవరూ అందులో ఉండలేదు. తర్వాత కొద్ది కాలానికే ఆయనకు పక్షవాతము వచ్చింది. నేను ఆయనను పాండిచేరి తీసుకుని వెళ్ళాను. అక్కడ భగవాన్ భక్తుడూ, నా మిత్రుడూ అయిన డాక్టర్ భాస్కరన్ ఆయనను చూచుకున్నారు. కొద్ది రోజులలోనే ఆయన కోలుకున్నారు. నేను ఆస్పత్రికి వెళ్ళి, దయచేసి నన్ను ఆశీర్వదించండి అన్నాను. ఆయన తన చేతులను నా తలపై ఉంచి ఇలా అన్నారు,"భగవాన్ స్వయంగా చెప్పిన బోధలను అనుసరించండి. మౌనమును, ఆత్మవిచారణను ఆచరించండి. వేరే ఏ ఇతర సాధనల వైపూ మళ్ళకండి. చెయ్యటానికి ఇతర పనులేవీ లేనపుడు, మౌనంగా

ఉండండి. ఏదైనా పని చేస్తున్నప్పుడు, మనసులో, ఈ పనిని ఎవరు చేస్తున్నారు? అని ప్రశ్నించుకోండి. నిరంతరము ఈ ఆత్మవిచారణను కొనసాగించండి. అది మిమ్ములను, సుమ్మా ఇరు (be still) ఊరక ఉండు అనే స్థితికి తీసుకుని వెళ్తుంది. టి.పి.ఆర్ చెప్పుకుంటూ వెళ్ళారు. "నాకు అప్పట్లో తెలియ లేదుగానీ గణేశన్, 'ఊరకుండుట' అనబడు స్థితి, భగవాన్‌కూ, సాధకునికీ మధ్య లంకెయే, (కలుపునదియే). ఏమీ చెయ్యకుండా నువ్వు మౌనంగా ఉన్నపుడు నీ దృష్టిని లోపల ఉన్న మౌనము లేదా 'అహమ్' (నేను) అను దానిపై నిలుపు. అప్పుడు నీవు ఎల్లప్పుడూ సత్యముతో అనుసంధానమై ఉంటావు. దానిని నువ్వు ఏ పేరుతో నైనా పిలువవచ్చును. భగవాన్, అరుణాచల, దైవము, జీసస్, అపుడు నువ్వా సత్యములో ప్రతిష్ఠుడవౌతావు. టి.పి.ఆర్ బెంగుళూర్ లో చనిపోయారు. ఆయన చివరి మాటలు నాకు అందచేయబడ్డవి. నేను ఆయనను ఆశీర్వదిస్తున్నానని గణేశన్‌కు వ్రాయండి. అది ఈ ఒక వ్యక్తికే కాదు. అది సాధకులందరికీ ఆశీర్వాదమే. ఈ భక్తులందరికి నివాళులర్పిద్దాము. వాళ్ళందరూ అరుణాచలము యొక్క గండశిలలు, వాళ్లను, వారి జీవితాలను తలచుకుంటూ మనము కూడా సత్యములో లబ్ద ప్రతిష్టులమౌదాము.



స్కందాశ్రమములో శ్రీ భగవాన్‌తో ఆశ్రమవాసులు (నిలబడి ఉన్న బాలుడు గణేశన్)

స్వామి మాధవ తీర్థ

తర్వాత చెప్పబోయే ఇద్దరు భగవాను భక్తులలో ఒకరు సంశయాళువు, సందేహించువాడు, మరొకరు పండితుడు, వేదాంతి. భగవాను ఈ రెండు లోహములను, కరుణ, ప్రేమ, శ్రద్ధ, ప్రకాశము అనే పరశువేది ద్వారా బంగారంగా మార్చారు. వారిద్దరినీ మార్పునొందించిన విధానాలలో తేడా ఉండవచ్చును కానీ అంతిమ ఫలితం ఒకటే, ఆధ్యాత్మిక పథంలో నడిపించి ముక్తులను చెయ్యటము. వీరి గురించి చదివినపుడు సద్గురువు వారి స్థాయికి దిగి, వారికి కల్గిన ఆటంకాలన్నిటినీ ఎలా తొలగించారో, దాని ద్వారా చివరకు మోక్షాన్ని పొందుటకు ఎలా ప్రోత్సహించారో. మనలో ప్రతి ఒక్కరూ కూడా, ఆ మోక్షము యొక్క ప్రభావాన్ని అందుకుంటాము మనకు తెలిసినా, తెలియక పోయినా, మీకు తెలిసి అంటుకున్నా తెలియక అంటుకున్న నిప్పు కాల్చే తీరుతుంది. అలాగే ఏకాగ్రతతో చదివిన వారికి, వారిలోన మార్పు జరిగి పోతుంది వారికి తెలిసి జరిగినా, తెలియకుండా జరిగినా.

స్వామి మాధవ తీర్థ ఒక ప్రసిద్ధి చెందిన మహాత్ముడు. బాల్యము నుండియే మోతీలాల్ (స్వామి మాధవ తీర్థ) మరణం యొక్క రహస్యాన్ని గురించి తీవ్రంగా యోచించేవారు. సంచారకులైన సాధువులు సన్యాసులు ఎవరు ఎదురైనా, "దయచేసి, మృత్యువు అనే రహస్యాన్ని గురించి వివరించండి? అని అదేపనిగా అడుగుతుండే వారు. ఆయన సంస్కృతము నేర్చుకుని తన చేతికి అందిన పవిత్రగ్రంధాలన్నిటినీ అధ్యయనం చేశారు. శ్రీ మద్భాగవతము ఆయనకు ఇష్టమైన గ్రంధము. ఆయన ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని గూడా చాలా బాగా అధ్యయనం చేశారు. 'థియరీ ఆఫ్ రిలెటివిటీ', (సాపేక్ష సిద్ధాంతము) అంటే, ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. ఎందుకంటే వేదాంతమునకూ, ఆది శంకరాచార్యుల వారి మాయ ను గూర్చిన వివరణకూ, సాపేక్ష సిద్ధాంతానికీ అనేక పోలికలున్నట్లు, ఆయన కనుగొన్నారు. ఆయన పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ, సాపేక్ష సిద్ధాంత ము గురించీ, దానికీ వేదాంతమునకూ గల పోలికల గురించీ ఉపన్యసించేవారు. వక్తగా బాగా పేరు పొందిన ఆయన, తన పర్యటనలలో మహాత్ములనూ, ఆనందమయి మా వంటి మహనీయులను కలిశారు. 1920 దశాబ్దంలో, పాండిచేరికి చెందిన ప్రముఖ మహాత్ములైన శ్రీ అరవిందులతో కలిగిన ప్రత్యక్ష పరిచయం, ఆయనను నిజమైన సత్యాన్వేషణ వైపు మళ్ళించింది.

1939లో ఆయన సన్యాసము స్వీకరించారు. అటుపిమ్మట, ఆయన స్వామి మాధవ తీర్థ గా పిలువ బడేవారు. ఒక సన్యాసిగా ఆయన విస్తారంగా పర్యటించారు. ఆయన పాండిత్యము వలననేగాక, తాను చదివిన దానిని తన జీవితములో ఆచరణలో పెట్టే విధానము వలన గూడా ప్రజల అభిమానాన్ని పొందారు. ఆయన గొప్ప రచయిత. ఆయన నూరు పుస్తకాలకు పైగా రచించారు. కానీ, ఆధ్యాత్మిక ఆశయ సాధన కొరకు అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. సత్యము కొరకై, ఆయనకు కల్గిన తీరని దాహము ఆయనను అరుణాచలుని వద్దకూ భగవాన్ వద్దకూ 1944లో తీసుకుని వచ్చింది. ఆయన రమణాశ్రమంలో పధ్నాలుగు రోజులు ఉన్నారు. ప్రతిరోజూ అధ్యయనంలోనూ, అనుభవం తోనూ నిండిపోయింది. గొప్ప పండితుడు కనుక ఆయన తన అనుభవములను, భగవాన్‌ను తానడిగిన ప్రశ్నలను, ఆయన ఇచ్చిన సమాధానములను వ్రాసి యుంచారు.మొట్ట మొదటి రోజుననే భోజన శాలలో ఆయన, భగవాన్ కు పరిచయముచేయబడగానే, భగవాన్ అనుగ్రహ పూర్ణ దృక్కును (వీక్షణమును) ఆయనపై నిలిపారు. ఆ మొదటి వీక్షణం (చూపు) గురించి,ఆయన ఇలా వ్రాశారు. "మహర్షి యొక్క చూపులో, తీక్షణమైన సూర్యుని ప్రకాశాన్ని చూశాను. నా శ్వాస ఆగిపోయినట్లు అన్పించింది. నా మనస్సు చెప్పలేనంత ఆనందంతోనూ, ప్రశాంతతతోనూ నిండిన ఆధ్యాత్మిక తీరాలకు గొని పోబడింది." ఎవరు తనను కలిసినా, భగవాన్ తన మొదటి చూపుతోనే తనయొక్క ఉన్నతస్థితిని వారికి అనుగ్రహించేవారు. నిజమైన దర్శనము అంటే అదే. వచ్చిన వారికి పొందగలిగే యోగ్యత ఉన్నా, లేకున్నా, ఆయన తన పూర్ణ అనుగ్రహాన్ని ఎప్పుడూ ప్రసారం చేస్తుండేవారు. స్వామి మాధవ తీర్థ లాంటి భాగ్యశాలులు. ఆ అనుగ్రహాన్ని అంది పుచ్చుకో కలిగేవారు (పొంద గల్గేవారు).

ఆయన ఆశ్రమంలో ఉన్న పధ్నాలుగు రోజులలోని ప్రతినిముషాన్నీ, సద్వినియోగం చేసుకుని తద్వారా, మనకందరికి ఉపయోగ పడ్డారు. స్వామి మాధవ తీర్థ ఇలా వ్రాశారు, "పూర్తి వివేక,వైరాగ్యముల ద్వారా, సాధకుడు సాక్షీ భావ స్థితికి చేరుకొనుటకు, ఆశించవచ్చును. కానీ దాని కంటే ఉన్నతమైన స్థితి ఉన్నది. అందు, ఒకరు విశ్వమంతటిలోనూ, అన్నిజీవులలోనూ, సర్వే సర్వత్రా తన ఉనికినే గుర్తిస్తారు. ఈ స్థితినే సంస్కృతములో అభిన్న భావము అంటారు. మహర్షి చేత అందుకోబడిన ఈ స్థితి సామాన్య సాధకుని ఆలోచనా పరిధికీ అవగాహనాశక్తికీ అతీతమైన దైనప్పటికీ, సాధకుడు మహర్షి వంటి గొప్ప మహనీయుల సన్నిధిలో కూర్చుని, ఈ అభిన్న భావ స్థితి యొక్క స్వభావమును, ప్రత్యేకతను కొంతవరకు అర్థము చేసుకొనవచ్చును.

హాలులో కూర్చుని ఉన్నపుడు నేను ఈ విషయములను గమనించాను. మహర్షి మంచము మీద కూర్చుని, తన చుట్టూ ఏమి జరుగుతున్నా తనకు పట్టనట్లు ఉండేవారు. ఉదాహరణకు సందర్శకులు వస్తూనే ఉండేవారు. వారు భగవాన్‌కు నమస్కరించుకుని, హాలులో కూర్చొనుట కానీ, తిరిగి వెళ్ళిపోవుట గానీ చేస్తుండేవారు. కానీ అందరిలోనూ తన ఉనికినే, (వారు తన కంటే భిన్నముగా లేరు) అనే అభిన్న భావననే ఆయన కలిగి ఉన్నట్లు నాకు అన్పించింది. ఈ ఏకత్వ భావన (స్థితి) వలననే ఆయన అందరి అంతరంగములలో ఉన్న చైతన్యమును స్పృశించ గలిగేవారు. అప్పుడు ఆయన సన్నిధిలో ఉన్నవారు, ఆలోచనా పరిధిని అధిగమించి ఆ సర్వవ్యాపి యైన చైతన్యము యొక్క ఉనికిని తమలో అనుభవించ గలిగే వారు. ఈ విధంగా మహర్షి నుండి చైతన్యము యొక్క శక్తి ప్రసరిత మవుతున్నదని గ్రహించిన వాడనై, నేను, ఆయన సన్నిధిలో కూర్చుని ఆయన అనుగ్రహ ప్రసారమును చక్కగా అందుకొనుటకు నన్ను నేను ఏ విధముగా సిద్ధపరుచు కొనవలెనో ఆయననే అడగవలెనని నిశ్చయించుకున్నాను.

ప్రశ్న : మీ సన్నిధిలో కూర్చుని ఉన్నపుడు, మీ అనుగ్రహమును అందుకొనుటలకు (మీ నుండి ప్రసరితమయ్యే చైతన్య శక్తిని అందుకొనుటకు) మేము ఏ విధమైన మానసిక స్థితిని కలిగి ఉండవలెను?

మహర్షి : మనస్సును నిశ్చలముగా ఉంచండి. అది చాలును, మిమ్ములను మీరు నిశ్చలంగా ఉంచుకొనగలిగితే, ఈ హాలులో కూర్చుని మీరు ఆధ్యాత్మిక సహాయమును అందుకొనగలరు. సాధనలన్నిటి యొక్క ముఖ్యోపదేశము సాధనలను వదలి వేయుటయే. మనసు నిశ్చలమైనపుడు, చైతన్యము (ఆత్మ) యొక్క శక్తి అనుభూతమవుతుంది. చైతన్యము యొక్క తరంగములు ఎల్లెడల వ్యాపించి ఉన్నవి. మనస్సు నిశ్చలంగా, శాంతితో నిండి ఉంటే, ఎవరైనా వాటిని అనుభవించ గలరు.

ప్రశ్న : నేను మీ కళ్ళలోనికి అదేపనిగా చూస్తూ ఉండుట మంచిదా? లేక మీ ముఖమును దర్శిస్తూ ఉండవలెనా? లేదా నా మనస్సును ఏదో ఒక దానిపై ఏకాగ్ర పరచ వలెనా?

మహర్షి : మీ స్వస్వరూపము పై దృష్టిని నిలపండి. కళ్ళు తెరచుకొని ఉన్నా, మూసుకుని ఉన్నా పట్టింపు లేదు. సర్వత్రా నిండి ఉన్నది ఒకటే, కావున కనులు తెరిచినా, మూసినా ఒకటే. మీరు ధ్యానము చెయ్యదలచి నట్లైతే, మీ లోని 'అహం' (నేను) అనబడు చైతన్యముపై ధ్యానము చెయ్యండి. అదే ఆత్మ దానికి కళ్ళు లేవు గనుక కనులు మూసినా, తెరచినా ఒకటే. మీరు సాక్షాత్కారమును పొందితే, ఈ ప్రపంచము గురించి ఏ ఆలోచనలూ ఉండవు. మీరు ఒక గదిలో, కూర్చుని ఉన్నపుడు, కిటికీలు తెరచి ఉన్నా, మూసినా, మీరు, మీరుగానే ఉంటారు. అదే స్థితిలో, కనుక మీరు ఆత్మలో నిలకడ గలిగి ఉంటే బయట కార్యములు జరుగుతున్నా, లేకున్నా మీకేమీ పట్టదు.

మహర్షి తన అభిన్న భావనతో ఉండుటనూ, సాధకుడు ఆయన సాన్నిధ్యములో ఉండుటనూ, నేను రేడియో ట్రాన్స్ మిటర్‌తోనూ (రేడియో తరంగములను ప్రసారము చేసే యంత్రముతోనూ) ఆయన సన్నిధిలో కూర్చుని ఉన్న సాధకుని రేడియోరిసీవర్‌తోనూ (రేడియో తరంగములను అందుకునే యంత్రముతోనూ) పోల్చటానికి సాహసిస్తాను. మహర్షి యొక్క ఆధ్యాత్మిక శక్తి, సూర్య కాంతి వలె ఎడతెగకుండా ప్రసరింప బడేది. ఆయనకు సంబంధించినంత వరకు. కానీ మాయతో ఇంకను కప్పబడిన సాధకుడు, ఆ శక్తి ప్రసారమును అందుకునే యోగ్యత సంపాదించుకునే వరకు, ఆ మహర్షి యొక్క ఎంతో మేలు కల్గించే

ఆ ఆధ్యాత్మిక శక్తి ప్రసారము వలన కనపడే ఫలితము ఏమీ కనబడదు. ఆ శక్తిని అందుకొనుటకు సాధకుని సంసిద్ధతనే అనుగ్రహము యొక్క చర్య అంటారు. అంటే అనుగ్రహము వలననే సాధకునిలో సంసిద్ధత ఏర్పడుతుందని భావము.

స్వామి మాధవ తీర్థ ఇలా అంటారు. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత (తెలుసుకునేవాడు) తెలుసుకొనుట, తెలుసుకొన బడేది అనే విషయములన్నీ కూడా, సహజంగానే 'ఈ జగత్తు సత్యము' అనే అభిప్రాయముతోటి ముడిపడి ఉన్నవి. ఈ విషయం పై భగవాన్ అభిప్రాయమును వెల్లడించే ముందు, ఇది ఎంతో కాలముగా నేను మిక్కిలి ఆసక్తికొనియున్న విషయమని, అందువల్లనే, నేనిచటకు రాకపూర్వమే నేను 'మాయ' అనే పేరుగల చిన్న పుస్తకమును వ్రాశాను. అందులో నేను ఈ జగత్తు యొక్క నిత్యత్వమును గురించి భారతీయ దర్శన శాస్త్రములో వివరింపబడిన విషయములకూ, ఆధునిక కాలములో గొప్ప భౌతిక శాస్త్రవేత్త అయిన అయిన్‌స్టీన్ తన సాపేక్ష సిద్ధాంతము ద్వారా వెల్లడి చేసిన విషయాలకూ గల సారూప్యమును వివరించాను. నేను ఆ పుస్తకము యొక్క ఒక కాపీని (ప్రతిని) మహర్షికి పంపియున్నాను. నేను ప్రతిపాదించిన విషయముపై ఆయన అభిప్రాయము తెలుసుకొనవలెనని ఎంతో కుతూహలముతో, ఉన్నాను.

ప్రశ్న : ప్రొఫెసర్ ఐన్‌స్టీన్ ఈ మధ్య కాలములో, గణిత శాస్త్ర విజ్ఞానము ద్వారా, కాలము, దూరము, వస్తువులు, ఆకారము లేదా రూపము, భారము, వేగము మొదలైన వన్నీ, సాపేక్షమైన విలువలు కల్గినవనీ, స్థిరమైన (ఎన్నటికీ మారని) విలువలు కలిగి యున్నట్టివి కావనీ, అని అన్నియూ, ద్రష్ట (చూచువాడు) యొక్క స్థితిపై ఆధారపడిన విలువలు కలిగి ఉంటవనియూ వెల్లడించినారు. 'మాయ' అను పేరు గల చిన్ని పుస్తకమును, ఈ విషయముపై వ్రాసిన దానిని మీకు పంపించాను.

మహర్షి : అవును, మీరు చెప్పేది నిజమే. నాకు అది బాగున్నది. దానిని పూర్తిగా చదివాను. ద్రష్టను (చూసేవాడిని) సరిదిద్దుట ద్వారా సర్వమునూ, సరిదిద్ద వచ్చును. ఆ పుస్తకములో చూచువారు పెక్కురున్నట్లు వ్రాసినారు, నిజానికి ద్రష్ట ఒక్కరే ఒక్కరు. అనేకులు అనేది చూసేవాడి ఊహల లోనే ఉంటారు. (వాస్తవంలో కాదు).

ఈ జవాబులోనూ, తర్వాత మహర్షిఇచ్చిన జవాబులలోనూ, మహర్షి అనుగ్రహ పూర్వకముగా, నేను ఈ విషయమును గురించి ఆ పుస్తకములో జరిపిన చర్చలో, జరిగిన ఒక పొరపాటును ఎత్తి చూపినారు. నేను నా వాదములన్నిటినీ ఒక తప్పు నమ్మకము లేదా ఊహ (సరియైనది కానటువంటి ఊహ) పై ఆధారపడి చేశాను. ఆయన చాలా సేపు వివరణ ఇచ్చి, సరియైన దృక్కోణమును విశదపరచినారు. ఆ పుస్తకము వ్రాయుటలో నా ఉద్దేశము 'మాయ' అను విషయము పై ఆది శంకరుల వారిచే ప్రతిపాదించ బడిన సిద్ధాంతమునకు, ఆధునిక భౌతిక శాస్త్ర సిద్ధాంతమైన సాపేక్ష సిద్ధాంతమునకు (ఐన్ స్టీన్ యొక్క థియరీ ఆఫ్ రిలేటివిటీ –Theory of Relativity) పూర్తి పోలిక ఉన్నదని తెలుపుటయే. ఈ సిద్ధాంతము అందరికీ తెలిసినదే. ఐన్‌స్టీన్ థియరీ ఆఫ్ రిలేటివిటీ ప్రకారము (సాపేక్ష సిద్ధాంతము) కాలము, దూరము అనునవి కేవలము సాపేక్షిక మైనవి, వాటివిలువలు పూర్తిగా చూచువాడి (గమనించే వాడి) యొక్కయు, చూడబడేటటువంటి (పరిశీలించబడుతున్నటువంటి) వస్తువు లేదా విషయము యొక్క పరిస్థితులపై ఆధారపడి ఉండుననియూ, స్థిరమైన (మారని) విలువలు గల కాలము, దూరము అనునవి లేవనియు ప్రతిపాదింప బడినది. ఇద్దరు పరిశీలకులు, రెండు భిన్న మైన ప్రదేశముల నుండి, ఒకే సంఘటనను పరిశీలించి నట్లైతే, వారు కనుగొని నట్టి ఫలితములో ఇవ్వబడిన కాలము, దూరముల యొక్క విలువలు తేడాగా ఉండి, ఒకరు పరిశీలించిన వానితో రెండవ వారివి సరిపోలి ఉండవు. ఇద్దరు పరిశీలకులు రెండు వేరు వేరు ప్రదేశములలో ఉండి పరిశీలిస్తే, ఒకే సంఘటనను (విషయమును) వారు రెండు రకాలుగా చూస్తారు అనే వాదనతో దీనిని ఋజువు చేస్తారు. ఇద్దరు పరిశీలకులు రెండు వేరు వేరు ప్రదేశముల నుండి పరిశీలిస్తున్నారు అనేదే ఒక ఊహాజనితమైన భావన. ఆ ఇద్దరి మధ్య దూరము కూడా సాపేక్ష మైనదే. (స్థిరమైన విలువ కల్గినది కాదు.) కావున కేవలము ఒక పరిశీలకుడు మాత్రమే ఉండవలెను. స్వామి మాధవ తీర్థకు వెంటనే మహర్షి థియరీ ఆఫ్ రిలేటివిటీ వంటి ఆధునిక విజ్ఞాన శాస్త్ర సిద్ధాంతములను కూడా, సత్యములో స్థిరపడిన తనస్వీయ అనుభవముతో ప్రయత్న రహితముగానే విశ్లేషించ గలరని విశదపడింది.

సద్దర్శనము లోని పదహారవ శ్లోకము (పద్యము) కాలము, దూరములపై మహర్షి అభిప్రాయములను స్పష్టంగా విదితము చేస్తుంది.

నేను లేని (స్థలము) కాలము, దూరము ఎక్కడ ఉన్నవి?

ఈ శరీరము కాలము, దూరము (స్థలము)లకు పరిమితమై యుండవచ్చును. కానీ నేను ఈ శరీరమును కాను. నేను సర్వకాలములలోనూ, సర్వత్రా ఉన్నాను.

(భగవాన్, థియరీ ఆఫ్ రిలేటివిటీ తప్పు అని చెప్పలేదు. దానిని వివరించుటకు ఎన్నుకున్న ఉదాహరణ, సమర్ధింప బడజాలని ఊహపై ఆధారపడినదని అన్నారంతే).

పై పద్యములో చెప్పబడిన సంపూర్ణమైన ఆధ్యాత్మిక అనుభవము, కాలము, దూరముల గురించి ఉన్న పొరపాటు అభిప్రాయము లన్నిటినీ, కొట్టి పారవేస్తుంది. కాలము అనునది (ఒక స్థిరమైన విలువ కలిగినది కాదు) ఒక మొదలు, చివర కలిగియున్నట్టిది కాదు. కాలమునకు మొదలు, చివర ఉన్నవని భావించుటము అర్ధరహితము. ఊహాజనితము. మనముగనుక కాలమునకు మొదలు చివర ఉన్నవని భావిస్తే, అవి కూడా కాలములోనే ఉండవలెను. ఈ పదహారవ శ్లోకము ద్వారా, భూత, భవిష్యత్తులనునవి నిరాకరించబడి, కేవలము నిరంతరమైన ప్రస్తుతము మాత్రమే అంగీకరింపబడినది. ఆ సద్వస్తువును, ఎట్టి మార్పు నొందని నిర్వికారమైన, సదా ఉనికి కలిగినటువంటి ఆత్మను సాధకుదు ఇప్పుడే, ఇక్కడే సాక్షాత్కరింప జేసుకొనవలెనని భావించవలెనే గాని, భవిష్యత్తులో ఎప్పుడో జరుగునని, భావింప రాదు.

స్వామి మాధవ తీర్ధ ప్రశ్నలన్నీ ఆయన వేదాంత పరిజ్ఞానముపై, ఆధారపడి ఉండేవి.

ప్రశ్న : ఈ జగత్తంతా, ఈశ్వరుడే అయినట్లయితే, ఈశా వాశ్య ఉపనిషత్తు, ఈ జగత్తును త్యజించండి అని ఎందుకు చెబుతుంది.

(భగవాన్ జవాబులన్నీ ఎప్పుడూ స్వీయానుభవము మీదే ఆధారపడి ఉండేవి)

భగవాన్ : ఈశ్వరుని కంటె, ఈ జగత్తు భిన్నముగా ఉన్నది అనే తప్పుడు అభిప్రాయమును మాత్రమే త్యజించవలెను. ద్వైత భావనను, అనేకత్వ భావనను, కన్పించేది అంతా సత్యము అనే భావనను విడనాడవలెను.

స్వామి మాధవ తీర్ధ తిరిగి ఇలా ప్రశ్నించారు.

ప్రశ్న : ద్వైత భావనను విడిచి పెట్టవలెను. ద్వైతము లేదు, అనేకత్వము లేదు అనేటట్టయితే, ఈశ్వరునికి శరణాగతి చెందవలెను అని శృతులు చెప్పే ఉత్తరువు విషయమేమిటి?" భగవాన్ ఇలా బదులిచ్చారు. దక్షిణ భారతదేశములో ఒక ఆచారం ఉండేది. వారు ప్రతినిత్యము భోంచేసే ముందు గణేశుని విగ్రహాన్ని పూజించే వారు. ఒకరోజు, ఒక పేద బాటసారి కొంచెము పిండిని, కొంచెము బెల్లమును దారిలో ఆహారముగా ఉపయోగించుకొనుట కొరకై తీసికుని వెళ్తున్నారు. ఆయన భోంచెయ్యవలెనంటే ముందుగా గణేశన్‌ను పూజించాలి. ఆయన బెల్లం గడ్డను తీసుకుని దానిని ముద్దగా జేసి దానినే గణేశునిగా భావించారు. ఇప్పుడు పూజానంతరము నైవేద్యము పెట్టవలెనంటే బెల్లము విడిగా లేదు. అందుకని, ఆ విగ్రహము నుండి కొంత బెల్లమును గిల్లి నైవేద్యము గా పెట్టారు. అలా చెయ్యటములో, ఆయన, ఆ విగ్రహాన్ని అపవిత్రము చేశారు.'శరణాగతి' అంటే మీకున్న భావన, ఆ బాటసారి పెట్టిన నైవేద్యం కంటే ఏ మాత్రం మెరుగ్గా లేదు. మీరు ఈశ్వరుని కంటే వేరుగా ఉన్నానని భావించుకుని (ఊహించుకుని) ఆ పరమాత్మను మీరు అపవిత్రం చేశారు. మీరు శరణాగతి చెందించు కున్నా లేకున్నా, మీరెప్పుడూ ఆ పరమాత్మ కంటే వేరుగా లేరు. నిజానికి, ఈ ప్రస్తుతక్షణం లోనే, ఈ క్షణాన్నే, భవిష్యత్తులోనూ, గతంలోనూ వలెనే, కేవలం దైవము మాత్రమే ఉనికి గల్గిఉన్నది. దైవమొక్కటే ఉన్నది. ఈ "బెల్లపు గణేశు ని" కథ, ఆయన ఇక్కడ వున్న పధ్నాలుగవ రోజు పూర్తవుతుండగా జరిగింది. సెలవు తీసికొనబోతూ, స్వామి మాధవ తీర్ధ చాలా పండ్లు భగవాన్ ముందు ఉంచారు. భగవాన్ దయతో చిరునవ్వు నవ్వుతూ అన్నారు, "ఓహో వినాయకునికి బెల్లము నైవేద్యము పెడుతున్నారన్న మాట". తర్వాత కాలంలో, భగవాన్ ఆ మాటలు అనగానే, తనలో అకస్మాత్తుగా మార్పుచోటు చేసుకుందని. స్వామి మాధవ తీర్ధ నాతో చెప్పారు.

స్వామి మాధవ తీర్ధ భగవాన్ వద్దనున్న స్వల్ప కాలంలో ఆయన నుండి రాబట్టిన ముఖ్యమైన ఆధ్యాత్మిక బోధలను ఇక్కడ వ్రాస్తాను. ఆత్మవిచారణ జరుపుతున్నపుడు మనసు నుండి ఉత్పన్నమయే ప్రశ్నలు, "నేను శివుణ్ణి అనుకోవాలా? లేదా నేను

మనసుని కాను, నేను బుద్ధిని కాను, అనుకోవాలా?" అనేవాటికి జవాబివ్వవద్దు. నేనెవరిని? అని దేనినీ పట్టించుకోకుండా అడుగుతూనే ఉండు. హృదయము దానంతట అదే జవాబును విశదపరుస్తుంది. ఈ పలికే "నేను' వెనుక నున్న నిశ్శబ్దమైన 'నేను'యొక్క స్థితియే మహత్తరమైన మంత్రము. ఆ 'నేను' అనే స్థితియే గొప్ప మంత్రము. 'నేను', అనేదే మొట్టమొదటి నామమనియు, 'ఓం' అనబడే ప్రధానమైన శబ్దము లేదా, స్పందన తర్వాత ఉత్పన్నమైనదేనని చెబుతున్నది. జపించే వాడు లేకుండా జపమనేది లేదు. ప్రతివారూ 'నేను' అనే జపాన్నే చేస్తారు. మనము ఎన్నిసార్లు 'నేను', 'నేను' 'నేను' అంటాము మన జీవితాలలో, నువ్వు ఉన్నట్లే ఉండు సత్యము, శుద్ధచైతన్యము ఇప్పుడు ఏదైతే ఉన్నదో అదే నిజమైన జపము, జపము అన్నా దైవము (పరమాత్మ) అన్నా ఒకటే. నీవు 'సంపూర్ణుడివే. అపరిపూర్ణత అనే భావాన్నే విడచిపెట్టు. అక్కడ నాశనము చెయ్యవలసినదేదీ లేదు. అహంకారము సత్యమైనది కాదు. (దానికి నిజమైన ఉనికి లేదు.) తాడును చూచి పాము అని భ్రమించినపుడు, భ్రమ తొలగిన తర్వాత ఆ పామును చంపవలసిన అవసరము ఉండదు కద. మనసును నాశనము చెయ్యవలసిన అవసరము లేదు. ఆత్మ నిష్ఠయే నిజమైన ఆసనము. ఆ నిజమైన ఆసనములో స్థిరముగా ఉండండి.

"నేను ఏ పుస్తకము చదువ వలెను?" అని అడిగావు. ఆత్మే నిజమైన పుస్తకము. జీవితము అనేది అందులో వ్రాయబడిన పేజీలు. దానిలో ఏ విభాగమునైనా మీరు చూడవచ్చును. ఎవ్వరూ ఆ పుస్తకమును నీ నుండి తీసికుని వెళ్ళరు. నీకు జ్ఞాపకము వచ్చినప్పుడల్లా ఆత్మ వైపుకు తిరుగండి. అదే నిజమైన "గ్రంథ పఠనము'. మీ దృష్టిని అంతర్ముఖము చెయ్యండి. మనసు నిశ్చలంగా ఉంచండి.అది చాలును. మనసు నిశ్చల మైనపుడు, ఆత్మయొక్క శక్తి అవగత మౌతుంది. సాధన లన్నిటి ఉద్దేశ్యము సాధనలను విడిచి పెట్టడమే. చింతలు మీకు చెందవు. ఎక్కడైతే చింతలు అన్నీ మటుమాయమౌతాయో, వాటి ఉనికిని కోల్పోతాయో, ఆ నిశ్శబ్దమైన మనోమూలము లోనికి మునుగు. మనస్సు దేని నుండి ఉత్పన్న మౌతుందో, ఆ స్థానంలోనికి మునుగు. నీ దృష్టిని అక్కడ నిలుపు. ఆత్మను వెతుకు. దుఃఖము అంతా నశించిపోతుంది. నీ మనసును అంతర్ముఖం చెయ్యి. లోపల దాగి ఉన్న వాసనలను బయటికి త్రోసి వెయ్యి. అప్పుడు నీకు ఒక సర్వోత్కృష్ట శక్తి సర్వత్రా పనిచేస్తున్నదని విశదమవుతుంది. చూచేవాడూ, చూడబడేదీ ఏకమై నీవు నిశ్చలంగా ఉంటావని తెలుసుకో, సూర్యుడు, చీకటిని ఎప్పుడూ చూడనట్లుగానే 'ఆత్మ' అజ్ఞానమును ఎప్పుడూ చూడలేదు. ఆత్మ తెలుసుకొనబడదు. కానీ నేరుగా గ్రహించుట ద్వారా అది అనుభవమునకు వస్తుంది. అలా అనుభవించుటనే 'ఆత్మసాక్షాత్కారము' అంటారు. భౌతికంగా భవిష్యత్తులో ఉండేదీ, ఉండబోయేదీ, అంతా అశాశ్వతం. ప్రస్తుతము నువ్వు ఏమిటో, ప్రస్తుతము నీకున్న దేమిటో సక్రమంగా అర్థము చేసుకొనటానికి ప్రయత్నించు. అప్పుడు భవిష్యత్తును గురించి ఆలోచించవలసిన అవసరముండదు.

స్వామి మాధవ తీర్థ భగవాన్‌ను వ్యక్తిగతమైన సలహా కొరకు అడుగగా భగవాన్ ఆయనకు ఇలా చెప్పారు, "ప్రయాణాలు చెయ్యటము, ఉపన్యాసములు ఇవ్వటము తగ్గించండి', ఆయన మారు మాట్లాడకుండా, దానిని పాటించారు. ఆయన తిరిగి వెళ్ళిన తర్వాత గుజరాత్‌లోని సబర్మతి నది ఒడ్డున, 'వేదాంత ఆశ్రమము' ను స్థాపించారు. గుజరాత్ లోని ప్రముఖులు, పండితులు, మహాత్ములు అందరూ ఆయనను బాగా ఎరుగుదురు. ఆధ్యాత్మిక సుఖం కోసం వారు ఆయన వద్దకు వచ్చే వారు. ఆయన తీవ్రంగా సాధన చేసుకునే వారందరికీ గట్టిగా సలహాయిచ్చేవారు. "రమణాశ్రమమునకు వెళ్ళండి. రమణ మహర్షితో ఉండండి. కొంతసమయాన్ని ఆయన సమక్షంలో గడపండి. నాకు ఏమైతే ఉన్నదని మీరు భావిస్తున్నారో అదంతా నాకు రమణ మహర్షి చేత ప్రసాదింప బడినదే," వారంతా , స్వామి మాధవ తీర్థ వలన రమణాశ్రమమునకు వచ్చేవారు. అందువలనే, కొన్నిసార్లు రమణాశ్రమము గుజరాత్ వారితో నిండిపోయేది.

1956లో, స్వామి మాధవ తీర్థ, 60 మంది భక్తులతో కలసి రమణాశ్రమమునకు వచ్చారు. ఆయన కొన్ని వారముల పాటు ఆశ్ర మములోని లోపల ఉన్నారు. మిగిలిన భక్తులు బయట, ఆశ్రమానికి చెందిన గెస్ట్‌హౌస్ (అతిథి గృహము)లో ఉన్నారు. ఆ సమయంలో, నా డిగ్రీ పూర్తి అయిపోయి, ఉద్యోగం వెతుక్కుంటూ, ఆశ్రమంలో సేవ చేస్తున్నాను. ఆశ్రమ అధ్యక్షులుగా ఉన్న మా తండ్రి గారు అప్పుడు సుదీర్ఘ యాత్రలో ఉన్నారు. ఆశ్రమ నిర్వహణ బాధ్యత నా కప్పజెప్పబడినది. టి.కె.సుందరేశన్ అయ్యర్ వంటి పాత భక్తులు (దీర్ఘకాల అనుభవం కల భక్తులు) నాకు సలహా లిస్తుండే వారు. "స్వామి మాధవ తీర్థ, భగవాన్ సన్నిధిలో ఆత్మసాక్షాత్కారము పొందారు. ఆయనతో కొంత సమయము గడుపుతుండు," అని వారు

నాకు చెప్పారు. మాధవ తీర్థ, ఆయన భక్తులతో కలిసి తిరిగి వెళ్ళే రోజున, వారిని పంపటానికి కావలసిన ఏర్పాట్లను చూడవలసిన బాధ్యత నాపై బడింది. వాళ్ళు రైల్వేస్టేషన్‌కు వెళ్ళుట కొరకు నేను ఇరువది గుఱ్ఱపు బండ్లను మాట్లాడాను. స్వామి మాధవ తీర్థ కొరకు ఒక గుఱ్ఱపు బండి, ఆశ్రమ ద్వారము వద్ద వేచి ఉన్నది. నేను ఆయన గది లోనికి వెళ్ళునప్పటికి ఆయన కన్నీరు కారుస్తూ ఒక తన్మయత్వస్థితి లో ఉన్నారు. ఆయన భక్తులు ఆయనకు చెప్పులు, బయట తీవ్రంగా వర్షం కురుస్తుండటంతో గొడుగు, ఇచ్చారు. నేను ఆయనతో ఇలా చెప్పాను, "స్వామీ మీరు రైల్వేస్టేషన్ కు వెళ్ళవలసిన టైమయింది. గుఱ్ఱపు బండ్లు అన్నీ వచ్చినవి. మీ భక్తులు వేచి ఉన్నారు. దయ చేసి రండి." ఆయన నన్ను అనుసరించారు. కానీ ఆయన చెప్పులను ధరించటానికి గానీ, గొడుగును ఉపయోగించడానికి గానీ అంగీకరించలేదు. దానికి బదులుగా ఆ కుండపోతగా కురుస్తున్న వర్షంలో తడుస్తూనే ఆయన నడిచారు. అప్పటికి పూరిపాకగా ఉన్న భగవాన్ మందిరానికి మేము నడిచాము.

ఆ ఆరడుగుల, ప్రకాశవంతమైన వృద్ధ సన్యాసి, మొదలు నరికిన చెట్టు వలె భగవాన్ మందిర ద్వారము వద్ద పడి పసిబిడ్డ రోదించి నట్లు రోధించారు. నా జీవితంలో మొదటిసారిగా అటువంటి ఆసక్తికరమైన సుందర దృశ్యాన్ని చూశాను. ఆయన ఈ క్రింది విధంగా భగవాన్‌ను ప్రార్థించారు. "భగవాన్! నేను పాలుత్రాగే పసిబిడ్డను, నేను మిమ్ములను వదలి వెళ్ళలేను. కానీ నేను వెళ్ళ వలసి యున్నది," మేము దాదాపుగా ఆయనను పట్టుకుని లాగి, పట్టుకుని బలవంతంగా బండి వరకు తీసికుని వెళ్ళవలసి వచ్చింది. ఆయన ఆశ్రమ ఆవరణలో బండిని ఎక్కటానికి నిరాకరించారు. మేము ఆయనతో పాటుగా, ఆశ్రమము బయటకు, మిగిలిన భక్తుల బండ్లూ ఉన్న చోటుకు నడువ వలసి వచ్చింది. అప్పటివరకూ గూడా స్వామీ మాధవ తీర్థ శరణాగత భావన లో మునిగి, పారవశ్యంతో ఏడుస్తూనే ఉన్నారు. భక్తులు ఆయనను బండిలోనికి ఎక్కించబోతున్నారు. ఒక పవిత్రులైన, పక్వత చెందిన పాత భక్తులు, బి.యమ్.ఎస్ నాయుడు అనే ఆయన, స్వామి గొప్ప తనమును గురించి బాగా తెలిసిన ఆయన, నాకిలా సలహా ఇచ్చారు. "ఆయన మహాత్ముడు. ఆయన పవిత్ర పాదాలపై నీ శిరసును ఉంచు," నేను ఆ సలహాను పాటించాను, స్వామి మాధవ తీర్థ తన రెండు చేతులను, నా తలపై ఉంచి, ఆశీర్వదించారు.నేను తన్మయత్వంలో మునిగిపోయాను. అదే నా తొలి ఆధ్యాత్మిక అనుభవము. శారీరక, మానసిక పరుధులను అధిగమించేటట్లు చేసిన అనుభవము. నేను ధన్యుడనైనట్లుగా భావించాను. బి.ఎమ్.ఎస్ నాయుడు గారు, నా నిజమైన ఆధ్యాత్మిక జీవన ఆరంభానికి సహాయం చేశారు. కానీ అప్పట్లో దాని నిజమైన విలువ నాకు తెలియదు. ఇదంతా భగవాన్ అనుగ్రహమే.



శ్రీ భగవాన్ సమాధి మందిరం (పాతది)

చగన్ లాల్.వి.యోగి



మహాత్ముడైన మాధవ తీర్థ భగవాన్ అనుగ్రహం కోసం అరుణాచలం వెళ్ళవలసి వచ్చింది. దానికి వ్యతిరేకంగా, సంశయాళువు, సందేహించే స్వభావము గలవారూ అయిన చగన్ లాల్ వి. యోగివద్దకు సద్గురువే వెళ్ళారు. చగన్ లాల్.వి.యోగి పదునెనిమిదేళ్ళ వయసులో, స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ వ్రాసిన గ్రంధములు అనేకము చదివారు.అవి చదవటము వల్ల తాను కూడా వారి వలెనే సన్యాసి కావలెననే కోరిక ఆయనలో తలెత్తింది. వారి గ్రంధములు ఆయనలో, సామాన్యమైన జీవనం గడపాలి, ఉన్నతమైన ఆలోచనలు కలిగియుండాలి,ఆధ్యాత్మిక సాధన కొరకు జీవితమును అంకితము చెయ్యాలి. అనే ఆశయములను అంకురింపజేసినవి. ఇరువది ఏళ్ళ వయసులో చగన్ లాల్ మహాత్మాగాంధీని కలిసి, ఆయన ఆదర్శములచే ప్రభావితులై వాటిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించారు.

ఆయన శక్తి వంచన లేకుండా, పవిత్రమైన, అంకిత భావం కల్గిన జీవితాన్ని గడిపారు. 38 ఏళ్ళ వయసు వరకూ, అప్పటి నుండి ఆయనలో అనేకరకములైన సందేహములు చోటుచేసుకోవడం ప్రారంభించినవి. ఆయన, దైవాన్ని, మతాన్ని, సాధువులను, సన్యాసులను ప్రతి ఒక్కరిని సందేహించటం మొదలు పెట్టారు. సంశయములు, సందేహములు అనే గాఢాంధకారము ఆయన జీవితములో అలముకొన్న రోజులలో ఆయన మొదట శ్రీరమణ మహర్షి గురించి విన్నారు. ఆ సమయంలో ఆయన పూర్తి సంశయాళువుగా మారిపోతున్నారు. ప్రపంచమంతా, అన్యాయము, కౄరత్వము, దురాశ, ద్వేషము, ఇంకా అనేక దుర్మార్గములతో నిండి ఉన్నట్లుగా ఆయనకు కనపడసాగింది. ఆయనకు మతం మీద దేవుడి మీద నమ్మకము పోయింది. చగన్ లాల్ పరమ నాస్తికుడుగా మారారు. ఆయన దేవుడు లేడు అనేవారు. సాధువులనూ, మహాత్ములనూ తిరస్కార భావంతో అపహసించే వారు. వాళ్ళ వల్లనే ఈ ప్రపంచము అవినీతి, అసమానత్వము, దుఃఖముతో నిండిపోయి ఉన్నది అనేవారు. యువకుడుగా ఉన్నపుడు ఆయన కష్టించి పనిచేసేవారు. ముంబై నగరంలో ఆయనకు మంచి పేరు ఉండేది. ఆయనకు ఒక ప్రింటింగ్ ప్రెస్ ఉండేది. ఆయన సంభాషణలో చతురులు కనుక, ఆయనకు చాలా మంది స్నేహితులుండేవారు. కానీ వారందరూ ఎంతగా ప్రయత్నించినా, ఆయన సందేహించే స్వభావాన్ని మార్చలేక పోయారు.

ఒకరోజు చగన్ లాల్ యోగి స్థానిక రైలు (లోకల్ ట్రెయిన్) లో ప్రయాణిస్తుండగా ఆయన సన్నిహిత మిత్రులొకరు, రమణాశ్రమమునకు వెళ్ళి, రమణ మహర్షి దర్శనము, చేసుకుని వచ్చిన ఆయన, మహర్షి గొప్పతనమును గూర్చి తెలిపి, ఆయన మానవ రూపం ధరించిన దేవుడే యని తెలిపారు. ఆ స్నేహితుడు, ఇదుగో నేను రమణాశ్రమము నుండి పవిత్రమైన విబూదిని తెచ్చాను. నుదుటన పెట్టుకో మన్నారు. చగన్ లాల్ తీసుకొనలేదు. చగన్ లాల్ ఆయన మాటలకు నవ్వి, ఆయన పట్ల జాలి పడ్డారు. కొన్ని రోజుల తర్వాత, రమణాశ్రమమునకు వెళ్ళి వచ్చిన మరొక స్నేహితుడు, అందమైన చిత్రములు గల 'శ్రీ మహర్షి' అనే పుస్తకమును ఇచ్చి, "నేను రమణాశ్రమము నుండి వస్తున్నాను చగన్ లాల్. నన్ను నమ్మండి మహర్షి భగవంతుడే. అరుణాచలానికి వెళ్ళి రమణ మహర్షిని దర్శించండి. అప్పుడూ మీరు తప్పక మీ సంశయ శీలతను మార్చుకుంటారు, లేదా కనీసం ఈ పుస్తకం చదవండి అన్నారు. తను ప్రింటర్ కనుక ఆ ఆకర్షణీయంగా ముద్రితమైన పుస్తకాన్ని చూడాలనుకున్నారాయన. మరొక స్నేహితుని ద్వారా, ఆయన 'ఆత్మసాక్షాత్కారము' అనబడే పుస్తకాన్ని అందుకున్నారు. అది బి.వి. నరసింహస్వామి చేత రచించబడిన మహర్షి (ప్రామాణిక) జీవిత చరిత్ర. చగన్ లాల్, నిశ్చయంగా, నెమ్మదిగా పులి నోట్లో చిక్కుకోబోతున్నారు. ఆయన 'ఆత్మసాక్షాత్కారము' అనే పుస్తకమును చదువుతున్నపుడు అనేక సందేహములు ఆయన మనసులో ఉత్పన్న మవటం ప్రారంభించాయి. ఆయనకు అప్పటికి గూడా రమణ మహర్షిని గురించి ఎట్టి అభిప్రాయము లేదు కానీ, తన సందేహాలను ఆయనకు వ్రాశారు. ఆయనకు వచ్చిన సమాధానములు హేతుబద్ధంగా ఉన్నప్పటికీ, చగన్ లాల్ అవి కేవలం పాండిత్య పరమైనవి గా భావించారు. కానీ వాటిలో ఏదో లోతు ఉన్నదని ఆయన ఒప్పుకునే వారు. ఈ మేధాపరమైన జ్ఞానము, అవగాహన చాలవు. నాకు ప్రత్యక్ష అనుభవం కావాలి. ఈ గాఢమైన భావము వలన స్నేహితుల ప్రోద్బలం వలన, చగన్ లాల్ అనబడే సందేహ శీలి, 1938-39 లో తిరువణ్ణామలై కు బయలుదేరారు.

రమణాశ్రమమునకు చేరుకున్న చగన్ లాల్ ఉదయమునుండి సాయంత్రము వరకు ఆశ్రమములో గడిపిన తర్వాత సాయంత్రము భగవాన్‌కు పరిచయము చేయబడ్డారు. భగవాన్ ఆయనను, గుజరాతీలో ఉన్న ఉపదేశసారములోని పద్యములను చదవమన్నారు. చగన్ లాల్ అయిష్టంగానే చదవటం ప్రారంభించారు. పదిహేను పద్యములు చదివేసరికి రాత్రి భోజనమునకు గంట మ్రోగింది. ఆయన పద్యములు చదువుతున్నంత సేపు, భగవాన్ తనను నిశితంగా పరిశీలిస్తున్నట్లు, ఆయనకు అన్పించింది. భగవాన్ కళ్ళ నుండి ప్రసరించే కాంతి, తనకు తెలియకుండానే తన చైతన్యమును ఆవరిస్తున్నట్లు అన్పించింది. ఆయన మౌన వీక్షణము, చగన్ లాల్‌లో ఏదో సున్నితమైన, ఖచ్చితమైన మార్పును తీసికొని వచ్చింది. అంతకుముందు కొద్ది నిముషముల వరకు, అత్యంత భారంగా, భరించ లేనట్లుగా అన్పించిన (అజ్ఞానపు) చీకటి క్రమంగా తేలికపడి, కరిగిపోయి కాంతి ప్రకాశముగా మారింది. ఇది వరలో ఉన్నటువంటి దిగులు విచారము అంతా, మాయమై పోయి ఆయన హృదయాన్ని చెప్పలేని సంతోషంతో నింపి వేసింది. ఆయన అవయవములు 'స్వేచ్ఛ' అనే సముద్రములో కడిగివేయబడ్డవి.

ఆ సాయంత్రము భోజనశాలలో ఆయన, భగవాన్‌కు చేరువలో కూర్చున్నారు. ఆయన ఉన్నట్టి ఉల్లాస కరమైన స్థితిలో, ఆయన తిన్నటువంటి భోజనము, అసాధారణమైన, అత్యంత రుచికరమైనదిగా ఆయనకు అన్పించింది. సాక్షాత్తూ దేవుని సన్నిధిలో తాను స్వర్గలోకపు విందును ఆస్వాదిస్తున్నట్లుగా ఆయనకు అన్పించింది. ఆ అసాధారణమైన, పవిత్రమైన, దైవానుగ్రహము యొక్క అనుభూతిని మరికొంత వృద్ధి చేసుకుంటే అది ఆధ్యాత్మిక మార్గములో ముక్తికి దారి తీస్తుందని భావించి, అక్కడ మూడు రోజులపాటు ఉండిపోవాలనుకున్నారాయన.

ఆ మూడు రోజులు ఉండటము గురించి చగన్ లాల్ ఇలా వ్రాస్తున్నారు. ఆ దివ్య గురువు సాన్నిహిత్యంతో గడిపిన మూడు రోజులలోనూ, నా దృక్పథము పూర్తిగా మారిపోయినట్లు నేను కనుగొన్నాను. అపోహలతోనూ, దురభిప్రాయములతోనూ కట్టి వేయబడినట్లుగా ఉండెడి నా పాత వ్యక్తిత్వపు ఛాయ కూడా లేకుండా, కనుమరుగై పోయింది, ఆ కొద్ది సమయము నేను మహర్షితో గడిపేటప్పటికి, సత్య స్వరూపమును కాంచటానికి నా కళ్ళకు అడ్డుగా ఉన్న బంధములన్నీ తొలగిపోయి నట్లైంది. నా మనస్తత్వము పూర్తిగా మారిపోయినట్లు నాకు అర్ధమైంది. ప్రపంచపు రంగులు మారినట్లనిపించింది. పగటి పూట వెలుతురు కూడా ఎంతో సున్నితంగా అన్పించింది. నా దృష్టిని కేవలము (జగత్తులోని) జీవితములోని చీకటివైపునకే త్రిప్పి ఉంచటం ఎంత వ్యర్ధమైన, ఎంత మూర్ఖత్వముతో కూడినదో నాకు తెలియసాగింది.

భగవాన్ అనబడే ఆ దివ్య మాంత్రికుడు, గొప్ప ఉజ్వలమైన వెలుగు తోనూ, ఆశ తోనూ, సంతోషముతోనూ నిండిన ప్రపంచమునకు త్రోవ చూపారు. కేవలము ఈ భూమిపై మహర్షి ఉనికి వలననే, మూర్ఖత్వము వలన, అజ్ఞానము వలన గాయాలూ, బాధలూ అనుభవిస్తున్న ఈ మానవాళి, ఉద్ధరింపబడి కాపాడ బడుతుందని నాకు అన్పించింది. మొదటి సారిగా నాకు 'దర్శనము' యొక్క ప్రాముఖ్యత తెలిసి వచ్చింది.

చగన్ లాల్ 'దర్శనమును' గురించి అనుగ్రహమును గురించి ఈ విధముగ చెబుతున్నారు. "కొన్ని సంవత్సరముల క్రిందట ఒక సందర్శకుని ప్రశ్నకు సమాధానమిస్తూ మహర్షి, "మహాత్ముని దర్శనము మీకు తప్పక లాభమును చేకూరుస్తుంది. పవిత్ర గ్రంధములు మహాత్ముని దర్శనము, మహాత్ముని తోటి సాంగత్యము, సంసార సాగరమును దాటించే నావ వంటివని తెలుపుతున్నవి. మీకు అంతకంటే ఏమి లాభము కావాలి?" అన్నారు.

నేను హృదయపూర్వకంగా ఈ వ్యాఖ్యను దృఢపరుస్తాను. అందుకు నా జీవితమే సాక్ష్యము. కేవలము శ్రీ భగవాన్ యొక్క దర్శనము తోనే, నాలో 'ఆధ్యాత్మిక జ్ఞానము' అనే సూర్యుడు ఉదయించి, అవిశ్వాసము, అపనమ్మకము, భ్రాంతి అనే చీకటిని పారద్రోలాడు. అది 'భక్తి' అనే కాంతితో నా హృదయమును ప్రకాశింపజేసింది. ఆ ఆనందకరమైన క్షణము నుండి, ఆ అనుగ్రహ జ్వాల యొక్క ప్రకాశము ఇంకా ఇంకా పెద్దదిగా కాంతి వంతమైనదిగా నా హృదయములో విస్తరిస్తున్నది.

దర్శనము అనేది నిజంగా ఎలా పని చేస్తుంది? వినోభా భావే, ఆ విధానమును గూర్చి, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణములో ఇచ్చిన ఉపన్యాసములో తెలిపారు. ఒక వ్యక్తిలో ద్వైత భావన నశించి పోయి, ఆయన అభిన్న భావముతో నిండిపోయి, అన్ని జీవుల పట్లా ప్రేమతో ఆయన హృదయం సంపూర్ణంగా నిండిపోతే, ఆయన బాహ్య కార్యక్రమాలు ఆగిపోతవి. అందరిలోనూ,

అన్నిటిలోనూ తన ఉనికినే గుర్తించగల అటువంటి మహాత్ముని మనము కలుసుకొనగలిగితే, ఆయన దర్శనముతోటే మన కష్టములన్నీ చెల్లాచెదురైపోతవి. (తొలగిపోతవి).

దర్శనము, అనుగ్రహము కూడా ఎంతో మేలు కల్గించే వైనప్పటికీ, అవి తమను శుద్ధి పరుస్తున్నవి అనే సంగతిని భక్తులు కొన్నిసార్లు గమనించలేకపోవచ్చును. ఏది ఏమైనప్పటికి కేవలము దర్శనముతో తృప్తి నొందక సాధకులు, శరణాగతి లేక ఆత్మ విచారణ చేపట్టి గురువు అనుగ్రహమునకు పాత్రులు కావలెను."

ఆయన అక్కడ ఒక్కరోజు ఉండుటకు వెళ్ళారు. కానీ, శ్రేయస్సును గూర్చే ఆధ్యాత్మిక ప్రభావం నుండి విడివడ లేకపోయారు. అది (హిప్నాటిజము) వశీకరణ విద్యకాదు. మెస్మరిజమ్ కాదు. కాని స్వచ్ఛమైన ప్రేమ, కరుణ, శాంతి, ఆయన మహర్షి సన్నిధికి మరల మరల రాసాగారు. ఒకసారి కలలో, భగవాన్ ఆయన చేయి పట్టుకుని కొండపైకి శిఖరానికి తీసుకుని వెళ్ళారు. తాను నిశ్చయంగా లక్ష్యం సాధిస్తానని భగవాన్ ఈ స్వప్నం ద్వారా (శిఖరానికి) హామీ ఇచ్చినట్లు ఆయన భావించారు. (చాలా మంది ఇతర భక్తులకు కూడా, ఇటు వంటి స్వప్నమే, భగవాన్ తమను చేయిపట్టుకుని కొండ చివరి భాగానికి తీసుకుని వెళ్ళినట్లు కలవచ్చింది.)

చగన్ లాల్ యోగి, భగవాన్ ఎడబాటును సహించలేకపోయారు. ఆయన ఎల్లపుడు తన సద్గురువు పవిత్ర పాదాల చెంత ఉండాలని కోరుకున్నారు. ప్రపంచాన్ని వదలి అరుణాచలంలో స్థిరంగా ఉండిపోవటానికి సిద్ధంగా ఉన్నారు. కానీ ఆయనకు కుటుంబ బాధ్యతలు కూడా గుర్తున్నవి. అయినప్పటికి ఆయన 1945లో ముంబైలోని తన ప్రింటింగ్ ప్రెస్‌ను అమ్మి వేసి భగవాన్ వద్దకు రావాలనుకున్నారు.తన ప్రింటింగ్ ప్రెస్‌ను త్వరగా అమ్మి వెయ్యటం ఎలాగా అని ఆలోచిస్తుండగా భగవాన్ కలలో కన్పించారు. అంతకుముందు రమణాశ్రమాన్ని చూడని ఆయన ఒక మిత్రుడు కూడా కలలో కన్పించారు. భగవాన్ ఆ మిత్రుని వైపు చూపించి, "నీ ప్రెస్‌ను ఇతనికి అమ్మి వెయ్యి", అన్నారు. "నేను నా కుటుంబాన్ని పోషించాలి. ఎంత ధరకు నేను దాన్ని అతనికి అమ్మాలి? ఆయన ప్రెస్ కొని తీరాలి. నేను అరుణాచలానికి రావాలి. "భగవాన్ గోడపై అయిదు అంకెల సంఖ్యను వేశారు, అది ఆయనకు సంతృప్తి కరంగానే ఉన్నది". తెల్లవారి, ఆయన ప్రెస్ కు వెళ్ళినపుడు, కలలో కన్పించిన మిత్రుడే తనకోసం వేచి ఉన్నారు. చగన్ లాల్ స్వప్నం వివరాలను అతనికి చెప్పారు. ఆయన మిత్రుడు, భగవాన్ సూచించిన రేటు కు ప్రెస్‌ను కొనటానికి వెంటనే అంగీకరించారు. ఆయన స్నేహితుడు ఆయనకు ఇలా సలహా ఇచ్చారు. "తిరువణ్ణామలై కు ప్రతివారము వెళ్ళండి. కానీ మీ వృత్తిని కొనసాగించండి. బెంగుళూరులో ప్రింటింగ్ ప్రెస్ పెట్టి, మీ కుటుంబంతో అక్కడ ఉండండి" అలా అయితే మీరు భగవాన్ వద్దకు తరచు వెళ్తుండవచ్చును. ఆశ్రమం వారి పుస్తకాలు అచ్చువేస్తూ వారికి సాయ పడవచ్చును." చగన్ లాల్ బెంగుళూరు వెళ్ళారు. అక్కడ ఆరు నెలలుగా మూతబడి ఉన్న ఒక పెద్ద ప్రింటింగ్ ప్రెస్ ను చూశారు. దాని ధరను అడిగినపుడు, ఆ ప్రెస్ యజమాని తాను చెల్లించలేనంత ఎక్కువ ధర చెప్పారు. కానీ ఇప్పటికి ఈ సంశయాళువుగా ఉండి భక్తునిగా మారిన ఈయనకు మార్గం తెలిసింది. ఆ ప్రింటింగ్ ప్రెస్ యజమానిని తనతో పాటు రమణాశ్రమానికి రమ్మన్నారు. ఆయన రమణ మహర్షి గురించి ఎప్పుడూ వినకపోయినా, ఆయన చగన్ లాల్‌తో వెళ్ళారు. పాత హాలులో భగవాన్‌కు ఈ సమస్య గురించి చెప్పారు. ఆయన సమాధానం చెప్పేలోపునే, చగన్ లాల్ అడిగిన ధరకే ఇవ్వడానికి ఒప్పుకున్నారు ఆ ప్రెస్ యజమాని, త్వరలోనే ఆ ప్రెస్‌ను కొన్నారు. దానికి పేరును సూచించమని భగవాన్ ను ప్రార్థించగా, భగవాన్ దానికి 'అరుణప్రెస్' అని పేరు పెట్టారు. త్వరలోనే రమణాశ్రమము పుస్తకాలు అచట ప్రింటు అవసాగినవి.

భగవాన్ భక్తులు, 1946 సెప్టెంబర్ ఫస్టన, ఆయన అరుణాచల ఆగమన స్వర్ణోత్సవాలు (ఆయన అక్కడకు 1896 సెప్టెంబరు 1న వచ్చారు గాబట్టి) జరుపుకోవాలనుకున్నారు. దాని గుర్తుగా చక్కని పత్రికను అచ్చు వేయించాలనుకున్నారు. వారు దానిని ముద్రించవలసినదిగా అరుణా ప్రెస్‌ను కోరారు. అది చాలా ఫోటోలు కలిగిన పెద్ద పుస్తకము. చగన్ లాల్‌కు ఆ ప్రింటింగ్ పూర్తి చెయ్యటానికి టైము సరిపోదని తెలుసును. కానీ అది ఆశ్రమమునకు చెందినది కనుక, కాదు అనలేక పోయారు. ఆ సందిగ్ధతలో ఆయన భగవాన్ వద్దకు వెళ్ళి, నిర్ణీత సమయంలో దానిని పూర్తి చెయ్యటం అసాధ్యమని చెప్పారు. భగవాన్ కొద్ది సేపు విని మౌనంలోకి వెళ్ళారు. కొంతసేపటి తర్వాత, భగవాన్ ఆయనతో ఇంగ్లీషులో, (నీ పనిని

చెయ్యి) అని చెప్పారు. చగన్ లాల్ దానిని ఆజ్ఞగానూ, ఆశీర్వాదంగానూ తీసుకున్నారు. ఉత్సాహవంతులైన తన పనివారితో కలసి ఆయన రాత్రి పగలు పనిచేశారు, ఆ ఉత్సవాలకు కొద్దిరోజుల ముందు, బహుశ ఆగస్టు చివరి వారంలో, "గోల్డెన్ జూబిలీ సావనీర్,' 'శతజయంతిఉత్సవ పత్రిక' కాపీలను తీసికుని వెళ్ళి అక్కడ జేరియున్న అనేకమంది భక్తులకు ఆనందం కలిగించే విధంగా భగవాన్‌కు అందజేశారు.

చగన్ లాల్ యోగి భగవాన్ సమత్వ భావన గురించి రెండు సంఘటనలను తెలిపారు. చగన్ లాల్ యోగి, తాను భారత దేశం మొత్తంలో అనేకమంది మహాత్ములను కలిశాను కానీ, భగవాన్ సమత్వ బుద్ధికి సరియైన వారెక్కడా కన్పించలేదని చెప్పారు. తాను హాలులో కూర్చుని ఉండగా ఒకనాడు, ఎక్కడో దూరాన పంజాబు నుండి ఒక పెద్ద పార్శెల్ ను భగవాన్ అందుకున్నారు. అందులో 'చ్యవనప్రాశ లేహ్యం' అనే బలవర్ధక టానిక్ ఉన్నది. ఆ పార్శిల్‌ను పంపిన భక్తుడు, భగవాన్‌ను ఆ లేహ్యమును రోజూ కొంచెము చొప్పున రెండు నెలలపాటు ప్రతిరోజూ తీసికుంటే, భగవాన్ ఆరోగ్యము మెరుగు పడుతుందని ప్రార్థించారు. భగవాన్ నవ్వి ఊరుకున్నారు. మర్నాడు ఫలహార సమయంలో ప్రతివారి విస్తరిలోనూ, ఆ మందు వడ్డించబడి ఉన్నది. ఆ మొత్తము మందు సమానముగా అందరికీ పంచబడి ఒక్కరోజులో పూర్తిచెయ్యబడినది. ఒక భక్తుడు ఆదుర్దాతో, భగవాన్ దానిని మీరు రెండు నెలల పాటు తీసుకోవలసి ఉన్నది కదా", మీరు ఒక్కరోజులో అవజేశారు," అన్నారు. భగవాన్ చక్కగా నవ్వి, "భగవాన్‌కు కేవలం ఒక్క నోరే ఉందనుకుంటున్నారా?" ఆ నోర్లన్నీ భగవాన్‌వే," అన్నారు. ఆ మందు పంపిన భక్తుని మాట తీసి వెయ్యలేదు. భగవాన్ మొత్తం మందునీ తినేశారు అక్కడ ఉన్న అందరి నోళ్ళ ద్వారా.

భగవాన్ ఆరోగ్యము బాగా లేనందువల్ల, ఒక భక్తుడు ఎంతో నెయ్యి వేసి రొట్టెను తయారుచేసి, ఒక కప్పు నిండా పాలు, ఒక కప్పు నిండా బత్తాయి రసము తీసికునివచ్చారు. ఆయన వాటినన్నిటినీ హాలులో ఉన్న భగవాన్ వద్దకు తీసుకుని వెళ్ళి "మీ ఆరోగ్యం కోసం వీటిని తీసుకొనండి అన్నారు." భగవాన్ వాటివైపు చూడనుకూడా చూడలేదు. భగవాన్ తనకు ఏదైనా ప్రత్యేకంగా ఇవ్వబడటాన్ని ఇష్టపడరు. దానిని అర్థం చేసుకోకుండా హాలులో ఉన్న స్త్రీలలో ఒకామె అడిగారు, "భగవాన్! మేము మిమ్ములను సోఫా మీద కూర్చొనమని ప్రార్థించి నందున మీరు మా ప్రార్థన నంగీకరించి సోఫా మీద కూర్చున్నారు గదా. అలాగే దీనిని కూడా ఎందుకు తీసుకొనరు? ఇది మీ ఆరోగ్యానికే గదా, భగవాన్ అన్నారు. "అవును, మీరు చెప్పేది సరియైనదే," అక్కడ ఉన్న వారందరూ దిగ్భ్రమ చెందేలా, భగవాన్ సోఫా పై నుండి దిగి క్రింద కూర్చున్నారు. అక్కడున్న అందరూ బ్రతిమ లాడారు. "భగవాన్, భగవాన్, దయచేసి సోఫాపై కూర్చొనండి." అని, పాపం భగవాన్ తో ముందు మాట్లాడిన స్త్రీ బ్రతిమాలాడసాగారు. కన్నీరు కారుస్తూ ప్రాధేయ పడ్డారు. "క్షమించండి, భగవాన్, ఇలా జరగాలని నేను కోరుకోలేదు". భగవాన్ గొప్ప చిరునవ్వుతో బదులిచ్చారు, "ఎందుకు బాధపడతారు? మీరు నన్ను సరియైన పనే చెయ్యమని చెప్పారు," నేల మీదనుండి లేవడానికి ఆయన నిరాకరించారు. అదృష్టవశాత్తు, అనేక సంవత్సరముల నుండి సేవ చేస్తున్న ఒక పరిచారకుడు ఆయనను ఎత్తి సోఫా మీద కూర్చుండ బెట్టారు ధైర్యము చేసి. పైకి లేవదీస్తూన్నప్పుడు భగవాన్ అడ్డుపెట్టలేదు. నేలమీదనే కూర్చోవాలని పట్టు పట్టనూ లేదు. చగన్ లాల్ చెప్పారు, " ఒకసారి ఒక అమెరికన్, ఒక పెద్ద చాక్లెట్‌ను తెచ్చి భగవాన్‌కు ఇచ్చారు. అప్పుడు హాలులో 36 మంది ఉన్నారు. భగవాన్ అన్నారు, "దానిని ముప్పది ఆరు ముక్కలు చెయ్యండి". ఆ చిన్న ముక్కలు అందరికీ సమానంగా పంచబడిన తర్వాత ఆఖరి ముక్కను భగవాన్ తీసికున్నారు. అంత కఠినమైన నిజాయితీతో, వస్తువులను అందరికీ పంపిణీ చేయించే వారు. ఒకప్పుడు, ఒక స్వామి అరుణాచలమునకు వచ్చి ప్రదక్షిణ రోడ్డులో ఒక మండపంలో ఉంటూ ఉన్నారు. ఆ మండపము ఆశ్రమము నుండి కొద్ది దూరములోనే యున్నది. అచిరకాలంలోనే ఆయన విబూదితో జబ్బులు నయము చేస్తారని పేరొందారు. వందలాది మంది ఆయన వద్దకు రావటం ప్రారంభించారు. అది ఒక పెద్ద సంచలనము అయింది.విబూది స్వామి వద్ద నుండి తిరిగి వెళ్తూ వారిలో కొందరు ఆశ్రమానికి వచ్చేవారు. ఆ సమయంలో భగవాన్ కీళ్ళనొప్పులతో బాధపడుతుండేవారు. (మోకాలి నొప్పితో). ఆయన పైకి లేవ వలెనంటే ఆయుర్వేద నూనెను కొద్దిగా రెండు మోకాళ్ళ పై రాసుకుని పైకిలేచేవారు. ఒకరోజు ఆయన ఒక మోకాలికి నూనె రాయలేదు అందువల్ల లేవాలని ప్రయత్నించినా పైకి లేవ లేకపోయారు. ఆయన సోఫాపై కూర్చుని ఆ మోకాలికి నూనె రాసుకుంటున్నారు. ఆ సమయంలో విబూది స్వామి దర్శనం చేసుకుని ఇక్కడకు వచ్చారు. భగవాన్ తన కొరకు మర్దన చేసుకొనటం చూసి,

వాళ్ళు నిరాశ చెందిన ముఖాలతో, నమస్కారమైనా చెయ్యకుండా వెనక్కు తిరిగి వెళ్ళిపోయారు. తనవైపుకు చూపించు కుంటూ భగవాన్ నవ్వి అన్నారు, “తన మోకాలును తానే మర్దనా చేసుకుంటున్న (తోముకుంటున్నా) ఈ స్వామిని చూసి వాళ్ళే మను కోవాలి? ఈయన తన మోకాలి నొప్పిని తానే నయము చేసికొనలేనివాడు, ఇతరులకెలా నయము చెయ్యగలరు?” చగన్ లాల్ యోగి, భగవాన్, తన పై తనే ఛలోక్తులు విసరగలరు, అని కనిపెట్టారు. భక్తుల ప్రగాఢ విశ్వాసం వల్ల అద్భుతంగా ఎన్నిసార్లు వారి జబ్బులు నయమవటం జరిగినా, అవి తన వల్ల జరిగినట్లు భగవాన్ ఎప్పుడూ ఒప్పుకునేవారు కాదు. ఇవి అన్నీ వాటంతట అవే జరిగిపోతవి. నీలగిరి లోని చల్లదనం సహజంగా ఉండునట్లే, జ్ఞాని సన్నిధిలో అనారోగ్యంతో ఉన్నవారు స్వస్థత పొందటం, సాధకులు స్వస్థితిని అనుభూతి పొందటం, ఆత్మ శక్తి ప్రేరణతో సహజంగా జరుగుతవి. ఒకరి ఆత్మ యొక్క సహజంగా జరిగే చర్యలలోని భాగమే అవి. సాధకుని దృష్టి యెప్పుడూ ఆత్మపై నిలకడగా ఉండవలెను.

చగన్ లాల్ యోగికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె యుక్త వయస్కురాలైనపుడు, చగన్ లాల్ భార్య, కుమార్తె వివాహం గురించి చింతించసాగింది. ఆమె టి.పి.రామచంద్ర అయ్యర్‌ను కలిసింది. ఆయన వెంటనే ఆమెను భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళారు. అప్పుడే మరొక భక్తుడు హాలులోనికి ప్రవేశించారు. వాళ్ళు విషయాన్ని భగవాన్‌కు తెలిపినపుడు, ఎందుకు విచారిస్తారు? ఇరుగో ‘భట్. ఈయనను సంప్రదించండి.” అన్నారు. భట్‌కొక కుమారుడున్నాడు. ఆ కుమారునికి సంబంధం వెతుకు తున్నారాయన. భగవాన్ సమక్షంలో పెళ్ళి నిశ్చయమైనది. ఇప్పుడు కూడా ఆ దంపతులు చెన్నైలో ఆనందంగా ఉన్నారు. చాలా ఏళ్ళ క్రిందట చగన్ లాల్, తన కొక కుమారుడు కలగాలని కోరుకున్నారు. వారికొక కుమారుడు కలిగాడు. అతనికి ‘అరుణ్’ అని భగవాన్ నామకరణం చేశారు. ఆ కుటుంబం మొత్తము భగవాన్ ఎడల పరిపూర్ణ భక్తి తో ఉంటారు. భగవద్గీత లోని ఒక శ్లోకంలో కృష్ణపరమాత్మ అంటారు, “ఎవరైతే అన్నిటినీ వదలి నన్నే శరణు పొందుతారో, వారి బాధ్యత నంతా ఇహము నందు, పరము నందు నేనే వహిస్తాను”, అని. (అనన్యాశ్చింత) ఈ సంశృకు శీలి భగవాన్‌కు శరణాగతి చెందారు, భగవాన్ ఆయన కుటుంబ భారాన్నంతా వహించారు. తర్వాతి కాలంలో చగన్ లాల్, కేరళలోని ‘ఆనందాశ్రమం’ లో స్థిరపడ్డారు. అక్కడ రమణుల నామాన్ని నిరంతరం పలుకుతూ, పూర్తి స్పృహతో, ప్రశాంతంగా స్వామి రామదాస్, మాతాజీ కృష్ణాబాయిల సమక్షంలో శరీరాన్ని వదిలారు.



అమ్మ కృష్ణాబాయి - స్వామి రామదాస్

ప్రొఫెసర్ ఎన్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్



ఎన్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్, తెలివిని, బుద్ధిని తప్ప మరిదేనినీ నమ్మేవారు కాదు. ఆయన మిగిలిన వాటినన్నిటినీ సందేహించేవారు. ఆయన ఒక శాస్త్రజ్ఞుడు. (సైంటిస్ట్). భగవాన్, ఈ సందేహపడే వ్యక్తిని, సూటిగా, స్పష్టంగా, అంతర్గత శాంతిని అనుభవించేటట్లు చేశారు.

ఎన్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్, ఒక అత్యంత మేధావి అయిన భౌతిక శాస్త్ర ప్రొఫెసర్. ఆయన, ప్రపంచ ప్రఖ్యాతి గాంచి, నోబెల్ బహుమతి పొందిన డాక్టర్. సి.వి.రామన్ వద్ద చదువుకున్నారు. ఎన్.ఆర్.కె.అని పిలువ బడే ఆయన, జీవితంలోని ఆచరించవలసిన పనులను అశ్రద్ధ చేసి, కేవలం దేవుని పట్ల, ఆధ్యాత్మికత పట్ల దృష్టి పెట్టే వారెవరైనా సరే, వారితో పోట్లాట పెట్టుకునేవారు. దేనినైనా ఆయన ఒప్పుకోవాలి, అంటే దానికి శాస్త్రీయ పరమైన వివరణ కావలసినదే. ఆయన హిందువు అయినప్పటికీ, ఎవరి ముందైనా సాష్టాంగ నమస్కారము చెయ్యటము, అనేది మూఢవిశ్వాసమేగాక, తనను తాను కించపరచుకోవడమే అనుకునేవారు. 1922లో ఎన్.ఆర్.కె, తిరువణ్ణామలైలో ఉన్న తన సోదరిని కలవటానికి వచ్చారు. ఆయన బావగారు కుప్పుస్వామి, ఆయన స్నేహితుడు టి.కె.సుందరేశ అయ్యర్, అప్పుడే భగవాన్‌ను చూడటానికి వెళ్ళబోతూ, ఆయనతో ఇలా అన్నారు. "మేమిద్దరమూ రమణమహర్షి దగ్గరకు వెళ్తున్నాము. కృష్ణమూర్తీ, మీరు కూడా మాతో పాటు రండి," ఒక షరతుపై ఎన్.ఆర్.కె అందుకు ఒప్పుకున్నారు, "మీరు మహర్షి అనే ఆయన ముందు నేను సాష్టాంగ పడతానని భావించకండి". ఆ స్నేహితులు నవ్వుకున్నారు. వారికి నిస్సందేహంగా తెలుసును ఏమిజరగబోతుందో.

ఆకాలంలో రమణాశ్రమమంటే అమ్మ సమాధిపై వేసిన పూరిపాక. ఆ ముగ్గురూ పూరి గుడిసె లోనికి వెళ్ళారు. అపుడు ఒక వింత విషయం జరిగింది. తనకు తెలియకుండానే ప్రొఫెసర్ మహర్షి ముందు సాష్టాంగ పడ్డారు. ఆ స్నేహితులిద్దరూ బాగా నవ్వు కున్నారు. ఎందుకంటే సరిగ్గా, వాళ్ళ ఊహ ప్రకారమే జరిగింది. ఒక సందేహించేవాడిని, ఏదైనా చెయ్యమని పట్టుబట్టనక్కర లేదు. ఆధ్యాత్మిక శక్తికి ఆ సమర్థత ఉన్నది. భగవాన్ పూర్తిగా ఎన్.ఆర్.కె వైపు దృష్టి నిలిపారు. కొన్ని నిముషాల తర్వాత ఎన్.ఆర్.కె. పైకి లేచారు. తను చేసిన పనికి ఖంగుతిన్నారు.ఆ అనుకోకుండా జరిగిపోయిన పనిని గూర్చి ఆలోచించ కుండా తప్పించుకొనడానికి, ఆయన భగవాన్‌తో చర్చకు (వాదనకు) దిగాలనుకున్నారు.

తర్వాత ఏమి జరిగిందో ఎన్.ఆర్.కె.చెప్పారు, "ఇలా కూర్చుని ఉన్నారు గద, మీ తర్వాత స్థితి ఏమిటి? శరీర పతనం తర్వాత కూడా ఆత్మ ఉంటుంది. అది ఆత్మ లేక దైవంతో ఐక్యత నొందుతుంది అనే సమాధానం రాబట్టాలని నా ఉద్దేశం. ఆయనను తప్పు అని తేల్చడానికి వాగ్వివాదం పెట్టుకోవాలి అనేది నా కోరిక.కానీ అది అలా జరగలేదు. నా ప్రశ్న అడిగి చాలా నిముషాలు గడిచినవి. ఏమీ సమాధానం రాలేదు. అక్కడ సంపూర్ణమైన నిశ్శబ్ధం ఉన్నది. మా ఇరువురమూ ఒకరి నొకరు నిశ్చలంగా చూస్తూ ఉన్నాము. నాలో ఒక ఆలోచన కలిగింది. ఈ మనిషి ఒక ఇబ్బంది కరమైన ప్రశ్న నుండి తప్పించుకొనడానికి మౌనాన్ని ఆశ్రయించారా ఏమి? " అని సరిగ్గా అప్పుడే "మీరు "స్థితి" అన్నారు. 'స్థితి' అంటే మీ ఉద్ధేశ్యము ఏమిటి?" అకస్మాత్తుగా వేయబడిన ఈ ఎదురు ప్రశ్నకు నేను సమాధానము ఇవ్వవలసి ఉన్నది. నేను ఆలోచనలో పడ్డాను. నేను ఆయన శరీరం గురించి అడగలేదు. ఎందుకంటే అది దహనం చెయ్యబడటమో లేదా పూడ్చి పెట్టబడటమో జరుగుతుంది. నేను ఆలోచిస్తున్నది. ఆ శరీరంలో ఉన్న, ఆలోచనలను సలిపే మనసు గురించి దీని గురించే నేను అడిగింది. ఇప్పుడు నేను గనుక, ఆ ప్రశ్న 'మనసు' గురించి అడిగాను. అంటే ఆయన నన్ను 'మనస్సు' అనే దానికి మీ నిర్వచనము ఏమిటి? అని అడుగుతారు. ఆ ప్రశ్నకు సమాధానం సిద్ధంగా ఉంచుకోవాలి. అందుకని నాలో నేనే విచారణ మొదలు పెట్టాను. ఇది అంతా ఆయన చూపు యొక్క శక్తి వలననే జరిగింది. నాకు ఈ ప్రశ్నకు జవాబు దొరకలేదు, నా మనసు స్తంభించి పోయింది. ఆలోచనాశక్తి నశించి పోయింది. నేను నిస్సహాయంగా మూగగా తయారైనాను. భగవాన్ కళ్ళలో

(తీవ్రమైన) వెలుగుచూశాను. అవి నా కళ్ళను గట్టిగా బంధించి వేశాయి. అపుడు మహర్షి ముఖంపై విజయోత్సాహంతో కూడిన ప్రకాశవంతమైన చిరునవ్వు పరుచుకున్నది. నేను దేహ స్పృహనూ, నా చుట్టూ ఉన్న ప్రపంచమును (గురించిన) స్పృహనూ కోల్పోయాను. విలువలేని 'నేను' అనేది స్వచ్ఛమైన చైతన్యంలో కలసి పోయింది. అందులో నామరూపములు, కాలము, కర్మలు (పనులు) అన్నీ పూర్తిగా నశించిపోయినవి. అది ఆదీ, అంతమూ లేని ప్రగాఢమైన నిశ్శబ్దము. కానీ అది 'అహం' స్ఫురణతో ప్రకాశిస్తున్నది. నేను, శరీరము, దాని చుట్టూ ఉన్న పరిసరాల స్పృహ రాగానే, లోపలి కాంతి ఇంకా ప్రకాశిస్తుండగా ఇక అడగవలసిన ప్రశ్నలు, జవాబులు ఏమీ మిగులలేదు. నేను త్వరగా సాష్టాంగ పడి బయటకు పరిగెత్తాను. ఆ ఓటమిలో నున్న ఆనందంలో మునిగి.

"అదే 'నేను' యొక్క అంతమునకు ఆరంభము. ఆధ్యాత్మిక విస్ఫోటనము నాలో కల్గించిన తర్వాత, భగవాన్ నన్ను ఆహ్వానించారు. "లోనికి వచ్చి భోజనం చెయ్యండి", అది ఒక పూరి గుడిసె. దర్శనము, భోజనము, నిద్ర, అన్నీ అందులోనే జరిగి పోయేవి". ఎన్.ఆర్.కె చెప్పటం కొనసాగించారు. "గణేశన్, భోజనానికి పిలవటం వెనుక గల రహస్యాన్ని నీకు చెబుతాను. ఆధ్యాత్మిక అనుభవాన్నినిలిపి ఉంచడానికి, దాని వలన తీవ్రంగా కుదిపి వేయబడ్డ శరీరానికి ఆహారంతో పుష్టిని చేకూర్చేవారు. చాలామంది భగవాన్ యొక్క ఈ మాతృత్వ భావనను లేదా కరుణను అర్థం చేసుకోలేరు. ఆధ్యాత్మిక అనుభవాన్ని ఇవ్వటమనేది పితృ అంశ. (తండ్రి వలెచేసేపని). శరీరాన్ని ఆహారంతో పోషించడమనేది భగవాన్ చే కరుణతో కొనసాగించబడిన మాతృ అంశ (తల్లివలె చేసే పని). ఆ రోజు నేను భగవాన్ చే ఆధ్యాత్మికంగా కుదిపి వెయ్యబడ్డాను, భౌతికంగా కూడా ఆహారాన్ని ఇవ్వటం ద్వారా, ఆయన నాపై అనుగ్రహం కురిపించారు. వట్టి నేలపై విస్తరి వేయబడింది. రెండుసార్లు అన్నము, సాంబారు, మజ్జిగ వడ్డించబడినవి. సామాన్యంగా ఉన్నప్పటికీ అది దేవతల భోజనము, ఆ ప్రసాదము నన్ను నా సద్గురువు శ్రీ భగవాన్ రమణుల పాదాలకు దృఢంగా కట్టి పడవేసింది.

ప్రొఫెసర్, ఎన్.ఆర్.కె. 1898లో తిరుచ్చి దగ్గరలోని ఒక గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి రంగనాధ అయ్యర్ నగరంలో పేరుమోసిన న్యాయవాది. ఆయన బాబాయి (అంకుల్) అప్పాచీ అయ్యర్ తరచుగ వారింటికి వస్తుండేవారు. ఆయన భగవాన్ గురించి మాట్లాడుతుండేవారు. అప్పటికి కేవలము పదిహేనేళ్ళ వయసు గల ఎన్.ఆర్.కె. కు ఎక్కువగా అర్థమయ్యేది కాదు. ఆయన అదృష్టం కొద్దీ, ఆ ఇరువది మంది సభ్యులు కల కుటుంబము. తిరుపతి యాత్రకు వెళ్ళారు. తిరువణ్ణామలై తిరుపతి వెళ్ళే దారిలో ఒక స్టేషన్. ఎన్.ఆర్.కె. పెద్ద అక్క వివాహమయిన తర్వాత తిరువణ్ణామలై లో ఉండుట చేత, వారు అక్కడ ఆగారు. ఇది 1914 లేక 1915లో జరిగింది. అప్పుడు భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నారు. వారందరూ, ఈ పదిహేనేళ్ళ వయసుగల ఎన్.ఆర్.కె. ఇతర మగ పిల్లలు, ఆడ పిల్లలతో కలిసి విరూపాక్ష, గుహకు వెళ్ళారు. వారు భగవాన్‌కు సాష్టాంగ నమస్కారము చేసినపుడు, భగవాన్ దృష్టి ఈ పదిహేనేళ్ళ బాలుడిపై బడింది. తదేకదృష్టితో భగవాన్ తనను చూచినప్పటికీ ఎన్.ఆర్.కె. అదేమీ పట్టించు కోలేదు. అతను గుహచుట్టూ పరుగెత్తాలనే ఆసక్తితో ఉన్నారు. అక్కడ ఒక పెద్ద తెల్లని శంఖము ఉన్నదనీ, దానిని పిల్లలు ఊదారని, చెప్పి, పిల్లలను స్వేచ్ఛగా ఆడుకొన నిచ్చినందుకు, ఆనందించారు.

1919 లో ఆయన తన అక్కగారింటికి మరల వెళ్ళారు. ఆయన మామూలుగా భగవాన్‌ను చూడటానికి స్కందాశ్రమానికి వెళ్ళారు. 1915 నుండి 1922 వరకు, ఆయన పాఠశాల లోనూ, తర్వాత కళాశాల లోను ఉన్నపుడు, ఆయనకు చాలా చాలా అనుభవాలొచ్చి ఆయనను మౌనంలోనికి పంపేవి. కానీ అవి మొదటి సారి భగవాన్ చూసిన చూపు వలన జరుగుతున్నవని ఆయన అనుకోలేదు. తన కేమి జరుగుతుందో ఆయనకు తెలియదు. కాలేజీలో ప్రొఫెసర్, ఇంగ్లీషులో ఒక వ్యాసము వ్రాయమన్నపుడు, మిగిలిన వారందరూ అదే పనిగా వ్రాసుకుంటూ పోతుంటే, తన మనసు ఖాళీగా ఉండుటచే (పనిచెయ్యక పోవుటచే) ఎన్.ఆర్.కె. ఒక మాట కూడా వ్రాయలేక పోయారు. ఆ రోజులలో ఆ వివరించలేని అంతరంగిక నిశ్చల నిశ్శబ్ద అనుభవాలు భగవాన్ యొక్క గొప్ప వీక్షణం వల్లనే కలుగుతున్నవి అని ఆయన అనుకోలేదు. తర్వాత ఎప్పుడో వాటి గురించి నాకు చెబుతున్నపుడు ఆయన అన్నారు. "నా అంతరంగిక ఆధ్యాత్మిక ప్రయాణము అంతా ఆ భగవాన్ చూపు

నుండే ప్రారంభమైందని నేను గుర్తు చేసుకున్నాను".

1930 లో ఆయనకు టాన్సిల్స్ ఆపరేషన్ (శస్త్ర చికిత్స) జరిగింది. ఆ డాక్టర్ పొరపాటున తియ్యవలసిన దాని కంటె ఎక్కువ కండ తీసేశారు. దాని వలన ఆగకుండా దగ్గు తెరలుగా వచ్చి, అది తీవ్రమైన ఉబ్బసానికి (ఆస్థమా) దారి తీసింది. ఆయన ఇంగ్లీషు (అల్లోపతి) మందులు తీసుకున్నారు.అవి ఏమీ ఉపశమనాన్ని ఇవ్వలేదు. తర్వాత ఆయన యూనానీ, ఆయుర్వేద, ఇంకా ఇతర రకాల చికిత్సలను చేయించుకున్నారు. అవి ఆయనను, చింతపండు, కారము వాడకుండా నిషేధించాయి. ఆ సమయంలో ఆయన తన బాబాయి అప్పాచీ అయ్యర్ తోనూ, బావగారి తోనూ కలిసి భగవాన్ వద్దకు వెళ్ళారు. భగవాన్ మరల వారిని భోజనానికి పిలిచారు. వారందరూ కూర్చున్నారు. భోజనము వడ్డించబడినది. ఎప్పటిలాగానే సాంబారు, రసము, మజ్జిగ, అన్నము వడ్డించారు. ఇప్పటికి కూడా రమణాశ్రమంలో వాటినే వడ్డిస్తారు. అన్నపు రాశిపై సాంబారు వడ్డించబడినపుడు, ఎన్.ఆర్.కె (తనకు పెట్టబడిన ఆంక్షలవలన) సందేహించారు. ఇదంతా చూస్తున్న భగవాన్, "మీ జబ్బులన్నీ పోగొట్టుకోవాలని ఇక్కడకు వచ్చి,ఇంకా సందేహిస్తారెందుకు? తినండి, "అన్నారు.అది దైవాజ్ఞ. ఆయన ఆ దైవాజ్ఞ తనను స్థత పరుస్తుందని (ఆరోగ్యంచే కూరుస్తుందని) అనుకున్నారు. అది అలానే జరిగింది. అది ఏమీ వెంటనే జరిగిపోయిన అద్భుతము కాదు. కొన్ని నెలల తర్వాత పూర్తిగా నయమైంది.

దానికి తోడుగా మరొక చక్కటి సంఘటన జరిగింది. భగవాన్ తమ్ముడు చిన్నస్వామి ఆయనను పిలిచి, భగవాన్ 21 సంవత్సరాల వయసులో ఉన్నప్పటి ఒక పెద్ద ఫోటోను,శ్రీ భగవాన్‌చే అరుణాచలేశ్వరుని స్తుతిస్తూ వ్రాయబడిన, అయిదు పద్యాలుగల 'శ్రీ అరుణాచలస్తుతి పంచకమును, ఎవరో మార్మిక భక్తుడు వ్రాసినటు వంటి, భగవాన్‌ను స్తుతిస్తూ వ్రాసిన అయిదు పద్యములు గల శ్రీరమణ స్తుతిపంచకమును, (తమిళంలో ఉన్నవానిని) ఇచ్చారు. సంతోషంతో పొంగిపోయిన ఎన్.ఆర్.కె, భగవాన్ వద్దకు వాటిని తీసికుని వెళ్ళి ఆయన ఒడిలో ఉంచారు. భగవాన్ ఆ పుస్తకాలను తీసి వాటిలోని అచ్చుతప్పులను సవరించి. ఫోటోతో సహా వాటిని తిరిగి ఇచ్చారు. ఎన్.ఆర్.కె.భగవాన్ కు నమస్కరించి, వాటిని ప్రసాదంగా తీసికున్నారు. ఆయన వాటిని ఎంతో విలువైనవిగా ఆయన జీవితమంతా భద్ర పరచుకున్నారు.

అది అక్కడితో ఆగిపోలేదు. ఆ సందేహ పరుడైన శిష్యునికీ, గురువుకూ మధ్య అంతకు ముందే, ఒక సంభాషణ జరిగింది. మరల ఒక సంభాషణ వారిద్దరి మధ్య జరిగి, ఆ సందేహించే తత్వం ఉన్న శాస్త్రజ్ఞుడు భగవాన్ శిష్యునిగా మారిపోయారు. ఎన్.ఆర్.కె చెప్పారు, "నేను ఆయనకు నమస్కరించి, అన్నాను, "భగవాన్, నేను రామ జపమును చేస్తున్నాను. నేను రామ, రామ, రామ అని జపిస్తుంటూను. అంతకంటే 'అరుణాచల శివ, అరుణాచల శివ', అని చెయ్యటము ఉత్తమము కదా," భగవాన్ గట్టిగా చెప్పారు, "వద్దు, వద్దు, వద్దు. రెండూ ఒకటే. 'రా' అంటే ఏదైతే ఉన్నదో అది, 'మ' అంటే 'నీవు'. అదే నీవు. 'అరుణాచల' లో 'అ' అనగా 'అది' 'రు' అంటే 'నీవు', 'న' అంటే అయి ఉన్నావు. అదే నీవు అయి ఉన్నావు. నీవు అదే. రెండిటి అర్థమూ, 'అదే నీవు అయి ఉన్నావు' అనే తత్వమసి నీ మనసునే నోటిగా ఉపయోగించి (నీ మనసులోనే) విష్ణుచక్రము వలెఎప్పుడూ విడవకుండా చెయ్యి. నువ్వు జపముచేస్తున్నట్లు గా యితరులెవ్వరికీ తెలియగూడదు. భౌతికశాస్త్ర ఆచార్యుడైన ఎన్.ఆర్.కె అడ్డుతగులుతూ అన్నారు, "నేను, నా టైమంతా ఆ విధంగా గడిపితే నాఉద్యోగం ఏమౌతుందీ? నా పని ఆగిపోదా?" భగవాన్ ఆయన వంక అనుగ్రహముతో చూచి ఇలా అన్నారు, "ఎవరి పేరునైతే నీవు జపిస్తున్నావో, వారు, దాని పూర్తి బాధ్యత తీసుకుంటారు".రామమంత్రాన్ని చేస్తూనే ఉండు. అన్నారు. నీవు దాని గురించి పట్టించుకోనవసరములేదు. గురువు నుండి లభించినఈ హామీ ఆయన చేత, అయిదు సంవత్సరాలలో ఎనిమిది కోట్ల రామజపం చేయించింది.

1934 లో ఎన్.ఆర్.కె భార్య తోటీ ముగ్గురు పిల్లల తోటీ, రమణాశ్రమానికి వచ్చారు. భగవాన్ సహాధ్యాయులిద్దరు, వెంకటరామయ్య, నారాయణ అయ్యర్ వారితో పాటు వచ్చారు. ఈసారి గూడా, భగవాన్ సన్నిధిలో ఆయనకు అనేక అనుభవాలు వచ్చినవి. ఒకరోజు రాత్రి భోజనము అయిన తర్వాత వారు భగవాన్ సన్నిధిలో కూర్చున్నారు. అప్పుడు బెంగుళూరు నుండి వచ్చిన రామచంద్రరావు, ఋభుగీతను పెద్దగా చదవసాగారు.భగవాన్ తీవ్రంగా సాధన చేసే వారందరికి దానిని చదవమని చెప్పేవారు. అందులో ప్రతి పద్యమూ 'అహంబ్రహ్మమ్‌తో' పూర్తవుతుంది. అంటే నేనే బ్రహ్మమును అని

అర్థము. లేదా బైబిల్‌లో దేవుడు, మోజెస్‌కు చెప్పినట్లు "I am that I am" (నేను నేనై ఉన్న నేను). రామచంద్రరావు దీనిని చదువుతుండగా ఎన్,ఆర్‌కె, సమాధిలోనికి వెళ్ళిపోయారు. శుద్ధ చేతన యొక్క తరంగాలు ఆయనను ఊపేసినవి. ఆయన శరీర స్పృహను కోల్పోయారు. మిగిలిన వన్నీ నీడ వలె ఆయనకు తెలుస్తున్నది. ఆ స్థితిలో ఆయన కుటుంబాన్నీ,ప్రపంచాన్నీ త్యజించి వేయాలనుకున్నారు. అప్పుడు అరుణాచలము అడవి వలెఉండేది. అందుకని ఆయన అడవిలోకి వెళ్లి పోదాం కనబడకుండా అనుకున్నారు. భగవాన్ ఆయన వంక కేవలం ఆయన వంకే చూశారు. అదే గురువు అనుగ్రహము. భగవాన్ ఆయనతో అన్నారు, కృష్ణమూర్తి, నీ కుటుంబంతో మధురై వెళ్ళిపో. సన్యాసిగా నువ్వు సంపాదించు కోవాలనుకునే మోక్షము, గృహస్థుగా, ఉద్యోగం చేసుకుంటూనే నీవు పొందుతావు. నేను చెబుతున్నాను. ఇంటికి వెళ్ళు,"

ఎన్.ఆర్.కె చెప్పారు 'అహమ్ బ్రహ్మమ్' అనేది నన్ను సమాధి అంచులకు తీసికుని వెళ్తే, భగవాన్ ఆజ్ఞ. నన్ను తట్టి లేపింది. ఆయన గురువునకు నమస్కరించి, ఆయన ఆజ్ఞ పాటించారు. ఆయన ఒకటే అడిగారు, "మీరు నాకొక ఋభుగీత పుస్తకాన్ని యిస్తారా దయచేసి?" అని. ఆ పుస్తకమును చేతిలో ఉంచుకుని తన కుటుంబాన్ని తన ఇంటికి తీసుకుని వెళ్ళారు. ఆయన ఉద్యోగానికీ, గృహనిర్వహణ బాధ్యతలకూ కొంత సమయాన్ని కేటాయించారు. ఆయన తీవ్రసాధకులైనారు. ఆయన ఎల్లపుడూ రామ మంత్రమును జపించుతూగాని, అరుణాచల స్తుతి పంచకము, రమణ స్తుతి పంచకము గానీ చదువు తుండేవారు. ఆయన ఋభుగీతను చాలా వరకు కంఠస్తము చేశారు. ఈ విధంగా మన సద్గురు బోధను మనము ఆచరణలో పెట్టాలి. నిత్యజీవితంలో అలా చేసినప్పుడు సద్గురువు మనలను మన అంతరంగ ప్రయాణంలో ఒకో మెట్టూ ముందుకు తీసికుని వెళ్తారు, భగవాన్, ఎన్.ఆర్.కె ను తీసికుని వెళ్ళినట్లు .

1941లో మధురైలో ప్రొఫెసర్‌గా ఉన్న ఎన్.ఆర్.కె. కు రమణాశ్రమము నుండి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానము వచ్చింది. తొమ్మిది రాత్రుల పాటు దేవికి పూజలు జరుపుతారు. గత అయిదేళ్ళుగా జరుపుతున్నారు. ఆ విజయదశమి రోజున నా అక్షరాభ్యాసము జరుగబోతున్నది. మా తాతగారైన చిన్న స్వామి ఎన్.ఆర్.కె ను ఈ ఉత్సవానికి ఆహ్వానించారు. ఎన్.ఆర్.కె, ఈ ఆహ్వానాన్ని అందుకున్నపుడు, తను కూడా భగవాన్ బిడ్డే కాబట్టి, తనకు కూడా అక్షరాభాస్యము జరగాలనుకున్నారు. సంస్కృతంలో 'అక్షరాభ్యాసము' అనేదానికి, 'నిశ్శబ్ద ఆత్మవిచారణ' అనే అర్థము ఉంది. (నశించని దానిని అభ్యసించుట). ఆ టైంలో తను భగవాన్ సన్నిధిలో ఉంటారు కాబట్టి తను కూడా ఆత్మలోనికి వెళ్ళుటకు మౌనదీక్ష, పొందుదామనుకున్నారు. వెంటనే రమణాశ్రమానికి బయలుదేరారు. 1962,63లో ఆయన నాకు చెప్పారు. మనిద్దరమూ సోదరులము. నువ్వు మామూలు విద్యలోనికి అడుగుపెట్టినపుడు నేను హృదయంపై దృష్టి నిలవటం అనే అభ్యాసాన్ని భగవాన్ సన్నిధిలో మొదలుపెట్టాను. మనము సోదరులము. మనమెప్పుడూ కలసే ఉన్నాము. ఇక ముందు కూడా ఇలాగే ఉంటాము. భగవాన్ అలానే అనుకున్నారు.

తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు.ఋభుగీతను చేతిలో ఉంచుకుని, మిగిలిన రెండు పుస్తకాలూ కంఠతా వచ్చుగనుక వాటిని దగ్గర ఉంచుకునే అవసరము లేదు. ఋభుగీతను చేతిలో ఉంచుకుని భగవాన్ వైపు చూశారు. ఎన్.ఆర్.కె, భగవాన్‌తో చెప్పారు. ఈ పుస్తకమును మీ చేతికిచ్చి మీ చేతులమీదగా అందుకున్నాను. భగవాన్ తనను గురించి అంత పట్టించుకుంటున్నందుకు ఆయన భావోద్రేకంలో మునిగారు. ధైర్యాన్ని కూడగట్టుకుని ఇందులో రోజూ పాటుకోవటానికి కొంత భాగాన్ని సూచించండి అన్నారు. భగవాన్ 26వ అధ్యాయాన్ని చూపించి వీటిని పాడుకోవటమే 'సమాధి' అన్నారు.

ఇది అందరు సాధకులకు పాఠమే. పుస్తకము అనేది కేవలము చదివి పక్కన పెట్టెయ్య డానికి కాదు. అది మన అవయవాల వలె మన శరీరంలోని భాగంగా మారాలి. మన గురువు సూచనలను మనము శ్రద్ధతో ఆచరించాలి. ఆయన ఈ పుస్తకాలను ఎల్లపుడూ తన వెంట ఉంచుకునే వారు. ఆయన ఆ పద్యాలను లక్షలసార్లు చదివారు. ఋభుగీత ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసలలో భాగమై పోయింది.

నేను, "మీరు ఈ పుస్తకాలను ఇన్నిసార్లు ఎందుకు చదివారు?" అని అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పారు. "ఇవి కేవలము

పుస్తకములు కావు. కేవలము పద్యాలు కావు. అవి మంత్రములు. ఇవి పవిత్రమైన గురువు వచనాలు. " నేను కొంచెం నమ్మలేనట్లుగా సంధిగ్ధావస్థలో ఉన్నట్లు కన్పించి నట్టున్నాను, "నేనొకసారి అరుణాచలస్తుతి పంచకము అర్థము చెప్పమని సద్గురువును కోరాను. " ఆయన, "మరల మరల చదవటమే వాటి అర్థము అన్నారు.' అందుకనే నేను వాటి నన్నిసార్లు చదివాను. సందేహశీలి అయిన ఆ శాస్త్రజ్ఞుణ్ణి చూడండి. అప్పుడు మేము కలిసిన తర్వాత కూడా ఆయన వాటిని ఇంకెన్ని సార్లో చదివి ఉంటారు. ఆ తుప్పుపట్టిన లోహాన్ని గురువు బంగారంగా మార్చారు. ఒక సైంటిస్టు తేలికైన అర్థములున్న పద్యాలను వేలసార్లు చదవటమా ఆయన రామ మంత్రమును గూడ జపించే వారు. శాస్త్రజ్ఞుడు అయినప్పటికి, తన మెదడును పనిచెయ్యనివ్వకుండా ఆపెయ్య గలిగారు.

1944లో ఎన్.ఆర్.కె, తన చివరి దీక్ష కొరకు భగవాన్ వద్దకు వచ్చారు. ఆ మధ్యకాలములో ఆయన పూర్తి సాధనలో ఉన్నారు. భగవాన్ అనుగ్రహం పొందారు గనుక. ఆ రోజు భగవాన్ కొండ దిగి వస్తూ ఉండగా, ఎన్.ఆర్.కె నమస్కరించారు. ధైర్యాన్ని కూడగట్టుకుని, నేను ఆత్మాను భవాన్ని ఎలా పొందగలనో అనుగ్రహంతో తెలుపండి. నిద్రలో కూడా కేవల నిర్వికల్ప సమాధిలో ఎట్లా ఉండగలనో తెలుపండి. మిగిలిన సమయాల్లో సహజ నిర్వికల్ప సమాధిలో ఎలా ఉండగలనో చెప్పండి. నా నిద్రలో కూడ అది ఉండవలెను. నేను లేచిన తర్వాత కూడా అది కొనసాగవలెను." భగవాన్ బదులిచ్చారు. "నిద్ర అనేది దేవుడిచ్చేస్థితి, నువ్వు నిద్రపోతున్నపుడు నువ్వేమీ చెయ్యలేవు. కానీ మిగిలిన సమయాల్లో నేనెవరిని? అనే ఆత్మవిచారణను నువ్వు సాధనచెయ్యాలి. నువ్వు కోరుకునే పక్వమైన ఆ ఫలం దానంతట అదే, అప్రయత్నంగానే నీ చేతికి అందుతుంది". ఎన్.ఆర్.కె నాతో చెప్పారు. "నా చివరి ఉపదేశాన్ని నా గురువు" గారి పవిత్రమైన నోటి నుండి పొందాను. నేనిక ఆయనను అడగవలసిన దేమీ లేదు. నేను తీవ్రంగా సాధన చెయ్యవలసి ఉన్నదని, (నా కోరిక తీరుటకు) అది తప్పనేను చేయవలసిన ఇతర పని ఏదీ లేదని నాకు తెలుసును".

ఎన్.ఆర్.కె పూర్తిగా సాధనకు అంకితమైనారు. 1955లో రిటైరైన తర్వాత, రమణాశ్రమానికి క్రమం తప్పక వచ్చేవారు. ఆయన ఎప్పుడూ సమాధి స్థితిలోనే ఉండేవారు. అది నాకు ఆశ్చర్యం కల్గించేది. అయినా, సాక్షాత్కారం పొందినవాడినని ఆయన ఎప్పుడూ చెప్పుకోలేదు. అది నాకొక బోధ. నిజానికి పాత భక్తులెవరూ, తాము సాక్షాత్కారాన్ని పొందామని చెప్పుకోలేదు. ఆయన తరచుగ వస్తూ ఉండేవారు కాబట్టి, నేనాయనతో సన్నిహితంగా ఉండేవాడిని. నేను 1960 నుండి ఆశ్రమంలో శాశ్వతంగా ఉండిపోయాను గనుక, ఆయనను కొన్ని జ్ఞాపకాలను చెప్పమని అదేపనిగా అడిగేవాడిని.

1960 నుండి ఆయన ఎప్పుడు ఆశ్రమానికి వచ్చినా ఎక్కువరోజులు ఆశ్రమంలో ఉండిపోయేవారు. ఆయనే భగవాన్ సహాధ్యాయులను గురించిన వివరాలను తెలిపింది. భగవాన్ కుటుంబం తిరుచ్చుళిలో ఉండగా, వారి పొరుగు ఇంటిలో లక్ష్మి అనే చిన్న బాలిక ఉండేది.లక్ష్మి ఈ వివరాలను ఎన్.ఆర్.కె కు చెప్పింది. "భగవాన్‌ను గర్భంతో ఉన్నపుడు అళగమ్మాళ్ భరించలేని, ఎడతెగని (మంటల) వేడితో బాధపడేవారు. అందుకని ప్రతిరోజూ వేపాకు, మారేడు ఆకును నూరి ముద్దగా చేసి ఆమె పొట్టకు ప్రతిరోజూ వ్రాసేవారు. ఆ మంటను ఉపశమింపజెయ్యటానికి". ఈ వివరాలు లక్ష్మి నుండి మాత్రమే లభించనవి. లక్ష్మి భగవాన్ తల్లికి బాగా దగ్గరగా ఉండేవారు. లక్ష్మి భగవాన్ ఇద్దరూ, అళగమ్మాళ్ వద్ద పాలు త్రాగేవారు. నిజానికి భగవాన్ ఆరేళ్ళ వరకూ తల్లి వద్ద పాలు త్రాగారు. అందుకనే ఆయన అంత దృఢంగా ఉంటారు, అంటారు లక్ష్మి.

భగవాన్ జీవిత చరిత్రలో 1896, సెప్టెంబరు 1న రైలు దిగి ఆయన సూటిగా ఆలయం, లోకి వెళ్ళి నట్లు వ్రాయబడింది. కానీ ఆయన సహాధ్యాయులు ఇలా చెప్పారు. "పుస్తకాలలో అలా వ్రాయబడి నప్పటికీ, జరిగిన వాస్తవమదికాదు. రైలు ఉదయం ఆరుగంటలకు చేరింది. భగవాన్ సమాధి స్థితిలో ఉన్నారు. (ఆయన తిన్నగా గుడిలోనికి వెళ్ళలేదు). తిరువణ్ణామలై వీధులలో తిరిగి, తిరిగి, పన్నెండు గంటలకు ఆలయానికి జేరుకున్నారు. ఆలయద్వారాలు మూసి వేసి తాళాలు పెట్టబడి ఉన్నవి. భగవాన్ రాగానే ద్వారాలన్నీ తెరచుకున్నవి. ఆయన లోనికి వెళ్ళినపుడు అక్కడ ఎవరూ లేరు, భగవాన్ లింగమును కౌగలించుకుని, "తండ్రీ! నీ పిలుపు పై నేను వచ్చేశాను. నీ ఇచ్ఛయే నెఱవేరుగాక!" అన్నారు. అంతా అరుణాచలేశ్వరుని పథకమే. భగవాన్‌ది కాదు.

నేను ఎన్.ఆర్.కె ను భగవాన్ వ్యక్తిగత అలవాట్లను గూర్చి అడిగాను. ఎన్.ఆర్.కె అన్నారు. "నేను వాటిని పరిశీలించడమే కాదు, జీవితాంతము, వాటిని అనుసరించటానికి ప్రయత్నించాను. భగవాన్ దినచర్యలో శారీరక శుభ్రత, బట్టలు పొందికగా ఉంచుకొనుట, ఆహారాన్ని అందరితో సమానంగా పంచుకొనుట, దినచర్య ఒక కాలమాన పట్టిక (టైమ్‌టేబుల్) ననుసరించి సాగించటం, టైం టేబిల్‌ను ఖచ్చితంగా పాటించడము, ఆయన ఎప్పుడూ ఏ పనినీ మధ్యలో వదలివేసేవారు కాదు. తను చేసుకోగలిగిన పనిని చేసిపెట్టమని ఎవరినీ కోరేవారు కాదు. తాను యితరుల కన్న ఉన్నతమైన వాడినని భావించే వారుకాదు. ఆయన ఎల్లపుడూ సత్యాన్నే మాట్లాడేవారు. అలా మాట్లాడితే ఇతరులను కించపరచి నట్లవటం కానీ, ఇతరులు బాధపడటం గానీ జరుగుతుందనుకుంటే మాట్లాడకుండా మౌనంగా ఉండేవారు. ఆయన భవిష్యత్తు గూర్చి ఎప్పుడూ చింతించలేదు. భగవాన్ మనకు తానే ఉదాహరణగా నిలచి, అన్నిటిని తనే ఆచరణలో పెట్టి, తద్వారా మనము నేర్చుకునేటట్లు చేశారు. ఆయనను మనము మనసా, వాచా, కర్మణా అనుసరించాలి.

1980లో ఒకసారి నేను ఎన్.ఆర్.కె దగ్గర బాధపడ్డాను. "మీరు సాధన చేస్తూనే ఉన్నారు. ప్రొఫెసర్, ఇవాల్టికి కూడా మీరు సాధన చేస్తూనే ఉన్నారు. నాకు ఈ ఆశ్రమ పని భారమైపోయి సాధన చేసుకొనడానికి టైము ఉండుటలేదు, మిమ్ములను చూసినప్పుడు నాకు బాధ వేస్తుంది. ఆయన అన్నారు, "ఎందుకు బాధ? మీరు సాధన చేశారా, సేవ చేశారా అనేది అనవసరము. మీరు అరుణాచలునిలోని భాగాన్నే అని పూర్తిగా గుర్తించండి. అది చాలును." అది అర్థంకాక నేనాయనను అడిగాను. "నేను అరుణాచలుని లోని భాగాన్ని.' అనటంలో అర్థమేమిటి? ఎన్.ఆర్.కె నన్ను ఆఫీసు నుండి గిరి పాదము వద్దకు తీసికుని వెళ్ళారు, ఆయన గౌరవంగా గిరిని నాకు చూపుతూ అన్నారు, "అరుణాచలుడే శుద్ధ చైతన్యము. ('అహం', లేదా 'నేను') 'తత్వమసి' 'అదే నీవు అయి ఉన్నావు' అనే దాని స్వభావం. వేదాలు కూడా ఈ నిజాన్నే వెల్లడిచేస్తున్నాయి. మనలో ప్రతి ఒక్కరిలో ఉన్న 'అహం' లేదా 'నేను' అనేది అరుణాచలుడేనని మానవాళి మరచిపోయింది. వేదాల సారము అరుణాచలమే. మానవాళిచే 'అహమ్' ను లేదా 'నేను' ను గుర్తింపజేసి 'అహం' అనే సత్యాన్ని పునఃప్రతిష్టించడానికే అరుణాచలుడు, రమణ భగవాన్ అనే మానవ రూపాన్ని ధరించారు. అరుణాచలుడు (మానవ రూపము) 'నేను' అనే సత్యాన్ని వ్యాప్తి చెయ్యడానికి మానవ రూపము ధరించగానే, కొండపై నున్న రాళ్ళు గూడా, భక్తుల శరీరాలు ధరించినవి. కాబట్టి గణేశన్, నువ్వు నేను కూడ అరుణాచలంలో రాళ్ళమనే నిశ్చయంతో ఉండు, భగవాన్ కాంతి రూపంలో అరుణాచలానికి జేరుకోవటం మనము చూశాము. మనము కూడా మన శరీరాలను వదలిన తర్వాత ఆ పవిత్ర గిరికే చేరుకుంటాము. 'సంతోషంగా ఉండు గణేశన్' నువ్వు ఈ పని చెయ్యవలసి ఉన్నది. భగవాన్ నిన్ను ఈ పనిని చెయ్యమని ఉద్దేశించినట్లు నా కనిపిస్తున్నది.

నేను ఎన్.ఆర్.కెను, ఆయన భార్యనూ చాలా కాలం పాటు రమణాశ్రమంలో ఉండేటట్లు చెయ్యగలిగాను. అందువలన నాకాయన ఆశీస్సు అందుకునే గొప్ప అవకాశం దక్కింది. 1981,82, ఆ ప్రాంతంలో నేను, ఆయనను, భగవాన్ సమక్షంలో ఆయన, ఇతర పాత భక్తులూ అందుకున్న పారవశ్య స్థితిని నాకు ప్రసాదించమని ప్రార్థించాను. ఆయన నా మాటలకు మిక్కిలి సంతోషించారు. ఆయన అన్నారు, "అవును నువ్వొక్కడివే కాదు గణేశన్, ఈ సంఘటనను గురించి విన్న ప్రతివారూ, లోపల రమణుల నిశ్శబ్దంలోనూ, బయట ఆనంద బాష్పాల తోనూ కరగిపోతారు. దీనిని విను. ఒక రోజున భగవాన్ సుఖాసనంలో, అమ్మ సమాధిపై నిర్మించిన పూరి గుడిసె దగ్గరలో ఒక బల్లపై కూర్చుని ఉన్నారు. భగవాన్ సహాధ్యాయి రంగన్, రామస్వామి పిళ్ళై, యితర పాత భక్తులు భగవాన్ ఎదురుగ నేల మీద కూర్చున్నారు. వాళ్ళు తమిళంలోని 'రమణ స్తుతి పంచకము'ను పాడటం ప్రారంభించారు. రంగన్ నేల మీద భగవాన్‌కు చాలా దగ్గరగా కూర్చుని ఉన్నారు. ఆయన తల ఆ బల్ల నుండి కేవలం రెండు అంగుళాల దూరంలో మాత్రమే ఉన్నది, "దయచేసి నీ మెత్తని పవిత్రమైన పాదాన్ని నా శిరస్సుపై ఉంచు ' అనే వాక్యంతో ఆ పద్యాలు పూర్తి అయ్యాయి. భగవాన్ పాదము బల్లపై నుండి మెల్లగా క్రిందకు వచ్చి రంగన్ తలపై కొంతసేపు ఆని ఉన్నది. రంగన్‌తో సహా ఆ బృందం మొత్తము ఆ పద్యాన్ని మరల మరల పాడారు. వారందరూ ఈ ఆధ్యాత్మిక అనుభవంతో వశీ భూతులైనారు. ఎన్.ఆర్.కె తర్వాత మద్రాస్ కు వెళ్ళి, అక్కడ చనిపోయారు. డాక్టర్లు ఆయన స్పృహలో లేరు, కోమాలో ఉన్నారు. అని చెప్పినప్పటికీ, ఏదో అనుకుంటున్నట్లుగా ఆయన

పెదవులు కదులుతూనే ఉన్నవని, ఆయన కుమారులు, నాతో చెప్పారు.అది అరుణాచల స్తుతి పంచకము, రమణస్తుతి పంచకము. ఋభుగీతలోని ఇరువది ఆరవ అధ్యాయము అయి ఉండవచ్చును తప్పని సరిగ.

తల, హృదయానికి వందనము చెయ్యటమనేది, మన అహంకారము, ఆత్మలో లీనమైపోవటంలో చివరగా జరిగే భౌతిక క్రియ. అహంకారము ఆత్మలో లీనమై పోవాలి. అదే పవిత్ర సద్గురువు పాదాలను శిరస్సుపై ఉంచుకొనడంలో గల ఆంతర్యం. సాష్టాంగ నమస్కారము చెయ్యడము, ఎవరి పాదాలపై నైనా తల ఉంచడము. వీటన్నిటికి ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్నది. అర్ధం చేసుకుని అనుభవించండి. నా తలను 30 మంది గురువుల పాదాలపై ఉంచాను. చాలా మంది వలెనే, నేను కూడా సందేహపరుడినే,కానీ నన్ను నమ్మండి. మీరు మీ తలను గురువు పాదాలపై ఉంచినపుడు మరేదో జరుగుతుంది.ఏమిటది, మీ 'అహంకారము' సర్వత్రా వ్యాపించి యున్న ఆత్మకు వందనం చేస్తుంది. ఇంకొక మార్గము లేదు. కేవలము చదవటము, శిక్షణ తీసికొనడము ప్రాయపడను. గురువుగారి పవిత్రమైన పాదములను అంటుకుంటే చాలును. ఎప్పుడైనా మీ శిరసును హృద

శ్రీ భగవాన్ సమాధి మందిరం వద్ద ప్రొఫెసర్ ఎన్.ఆర్.కె. మరియు కుటుంబ సభ్యులు

హాలులోని పరిచారకులు

భగవద్గీతలో కృష్ణ పరమాత్మ ఇలా అంటారు,"వేలాది మందిలో ఒకరు ఆధ్యాత్మిక సంపూర్ణత కొరకు పాటుపడుదురు. వారిలో ఎవరో ఒకరు నన్ను, ఆత్మగా (నేను) గుర్తిస్తారు. ఒక పురాతన లోకోక్తి ఇలా అంటుంది, "ఎంతోమంది పిలవబడతారు. కొందరు మాత్రమే ఎన్నుకొన బడతారు.

సత్యాన్ని వెదకాలనే అంతరంగిక ఆశయం, లేదా ముముక్షుత్వము అనేది చాలా తక్కువగా కనపడే అసాధారణ మైన లక్షణము. సాధకుడు అవాలంటే భగవంతుడి అనుగ్రహము ఉండాలి. సత్యాన్ని చేరుకోవాలంటే, ఎంతో సంక్షోభాన్ని ఎదుర్కోవాలి. ఎన్నేళ్ళపాటో సాధన చెయ్యాలి అంటారు. కానీ భగవాన్‌కు అది, అ,ఆ లు నేర్చుకున్నంత సులభము. ఎందుకని? ఎందుకంటే ఆయన కేవలము మానవరూపము దాల్చిన అరుణాచలుడే కనుక. అందువల్లనే భగవాన్ భక్తుల రూపంలో ఉన్న కొండరాళ్ళు, గండశిలలు కూడా ఆయన మార్గానే నడిచి ఆనందమును అందుకున్నారు. వాళ్ళు అప్పటికే సత్యాన్ని చూసి ఉన్నారు కనుక వాళ్ళు సంప్రదాయ పద్ధతిలో సాధన చెయ్యనవసరము లేదు. అవి అరుణాచలుని లీల, దైవ నాటకము. భగవాన్ దానినే నటన మనే గొప్ప ఆట' అనేవారు. ఆ విధంగా ఆయన భక్తులందరూ సాధన చేసి, అరుణాచలునిలో కలిసిపోయారు. ఇంకా చెప్పాలంటే వాళ్ళు సత్యములో నుండి వచ్చారు. సత్యములో జీవించారు. సత్యములోకి వెళ్ళి పోయారు.

మూడు రకాల మనుషులు భగవాన్ వద్దకు వచ్చేవారు. తమ స్వంతసాధన కోసం, భగవాన్ ముందు ధ్యాన, ధారణ, ఇత్యాదులు చేసుకునేవాళ్ళు. ఈ రకానికి చెందిన వారు మురుగనార్, మునగాల వెంకట్రామయ్య, విశ్వనాధ స్వామి లాంటివారు. కొంతమంది ఆశ్రమ ఆఫీసులో సేవ చెయ్యటానికి వచ్చినవారు. అనేకమంది అనేక రకాల పనులు చేస్తేనే, ఆశ్రమము పనిచెయ్యగలిగేది. వీరు భగవాన్ ఆమోదంతో తమ పనులుతాము చేసుకునేవారు. ఉదాహరణకు, మాతాతగారైన నిరంజనానంద స్వామి, సర్వాధికారిగా ఉండేవారు. స్టోరు కీపర్ గాను, ఇంకా కొన్ని ఇతర బాధ్యతలు నిర్వహించే వారు. మూడవ రకము వారు భగవాన్‌కు వ్యక్తిగత సేవకులుగా ఉండేవారు. వీరందరూ మగవారు. వారు ఆశ్రమములోనే ఉండేవారు. వారి పూర్తి సమయాన్నంతా భగవాన్ కొరకు వెచ్చించే వారు.

కుంజుస్వామి స్కందాశ్రమము రోజుల నుండి, తర్వాత రమణాశ్రమములోనూ ఉన్నారు. ఆయన సేవకులకు భగవాన్ కు మధ్య సంబంధాలు ఎలా ఉండేయో చక్కగా చెప్పారు. "భగవాన్ సోఫాపై నిద్రించేవారు. మేము ఆయనకు దగ్గరలో పడుకునేవారము. భగవాన్ అలవాటుగా 3.30 కు లేచి బయటకు వెళ్ళేవారు. ఆయన సోఫాదిగగానే, మాలో ఒకరము ఆయనకు టార్చిలైటు అందించేవారము. ఒక్కసారి గూడా టార్చిలైటు గురించి మమ్ములను పిలవటముగానీ, లేపటము గానీ చెయ్యవలసిన అవసరము ఉండేదికాదు. ఆయన లేచీ లేవగానే, అప్రయత్నంగా మేమూ లేచేవారము. భగవాన్ మా వైపు చూచినపుడు మాలోపలకు ఒక వెలుగు ప్రవేశించేది, వెంటనే మేము లేచే వారము. భగవాన్ తన పనులు తనే చేసుకొనుటకు యిష్టపడేవారు. ఆయన మాకు ఎప్పుడూ ఆజ్ఞలు జారీ చేసే వారు కాదు. ఆయన సేవకులుగా మేము, ఆయన అవసరాలను ముందుగా గుర్తించి, అవసరమైన పనులు చేసే వారము.

వీరు కేవలం భౌతికంగా పనిచెయ్యటము మాత్రమే కాదు. వారి వ్యక్తిగత సాధన అభివృద్ధి చెందేటట్లు భగవాన్ శ్రద్ధ తీసుకునేవారు. దాని గురించి, కుంజుస్వామి ఇలా చెప్పారు," ఒకసారి నేను భగవాన్‌తో నేను ఆశ్రమము బయట ఉంటాను. అప్పుడు నా సమయాన్నంతా వ్యక్తిగత సాధనకు ఉపయోగించుకుంటాను, కేవలము సేవ నాకు తృప్తి నివ్వటము లేదు," అన్నాను. భగవాన్ ఇలా అన్నారు, "నిజమైన సేవ, నా దుస్తులు ఉతుకుటలో లేదు. మీ మనసులను శుభ్రపరచుకొనుటలో ఉన్నది," ఆధ్యాత్మిక సాధనల విషయంలో ఆత్మ విచారణ సమయమున్నపుడల్లా చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ, నిధి ధ్యాసనముగాని, ధ్యానముగాని సమయమున్నపుడల్లా చేసుకోవాలి. అది సాధ్యపడనిచో, జపము చేసుకొనవలెను. ఏకాగ్రత కుదరక అది కూడా చేయలేక పోతే, మహాత్ములు వ్రాసిన పద్యాలను పాడుకుంటూ ఉండాలి. ఎవరైనా, ఈ నాల్గింటి లో ఏదో ఒకటి ఆచరిస్తుండాలి.

ఒకసారి కుంజుస్వామి, ఆశ్రమము బయట ఉండటము ప్రారంభించి నాక, ఇతర సేవకులు వచ్చారు. ఈ సేవకులు చాలా అదృష్టవంతులు. ఎందుకనగా వారు భగవాన్‌ను పగలూ, రాత్రీ సేవించేవారు. గురుశిష్యుల మధ్య అనుబంధం చాలా ప్రత్యేకమైనది. తాను స్వయంగా అరుణాచలుడే కావున, భగవాన్ ఎప్పుడూ నిశ్చలంగా అంతర ఆనందంతో ఉండేవారు. 'ఆయన అచలుడు కదలికలేని వారు గనుక ఎప్పుడూ నిశ్చలంగా నిర్వికారంగా ఉండేవారు. కానీ శిష్యుల రూపంలో వచ్చిన గండశిలలకు మాత్రము ఎప్పుడూ వారెవరు అని గుర్తు చేయబడుతుండేది. ఆ విధంగా వారు వారిలోనున్న హృదయాన్ని (నేను ను) ను గుర్తించుటకు వీలవుతుంది గనుక. ఈ విధంగా ఈ భక్తులపై భగవాన్ అనుగ్రహాన్ని కురిపించే వారు.

భగవాన్ పరిచారకులతో చాలా సన్నిహితంగా ఉండి, వారి అంతులేని ప్రేమానురాగాలను అందుకునే భాగ్యము నాకెందుకు కలిగిందో నేను అర్ధము చేసుకొనలేదు. ఆ అర్హత సంపాదించుకోవడానికి నేను చేసుకున్న పుణ్యమేమిటో నాకు బోధపడలేదు. ఈ భగవాన్ యొక్క రత్నాలను గురించి మీతో పంచుకోవడానికే. నేను వారి అంతులేని ప్రేమాభిమానాలను పొందానన్నమాట. ఈ పరిచారకుల విషయంలో గొప్పదనమేమిటంటే, బయట వారు ఏ పనిలో నిమగ్నమై ఉన్నా, లోపల హృదయంతో, అనుసంధాన మై ఉండే వారు ఎల్లప్పుడూ.



రంగస్వామి - సత్యానంద స్వామి - టి.పి. రామచంద్రయ్యర్ - వెంకటరత్నం - రామకృష్ణస్వామి - సుబ్రహ్మణ్యం - శివానందస్వామి (ఎడమ నుండి కుడికి)

ఎన్.దొరైస్వామి అయ్యర్

దొరైస్వామి అయ్యర్ ఒక పండితుడు. ఆయన భగవాన్ ను మొదటిసారిగా 1920 దశకంలో చూశారు. తర్వాత వారు ప్రఖ్యాతి చెందిన న్యాయవాది అయ్యారు. కానీ భగవాన్ ఆయనను కీర్తి అనే మిరుమిట్లు గొలిపే చీకటిలో ఎందుకు తిరగనిస్తారు? ఆయన తన పరిచారకులలో ఒకనిగా తన వద్దకు లాక్కున్నారు. 1948-50 మధ్యలో. అప్పటికి దొరైస్వామి అయ్యర్ బాగా ప్రముఖ వ్యక్తి, ఆయనకు ప్రభుత్వంతో బలమైన సంబంధాలు ఉండేవి.

భగవాన్‌కు కాన్సర్ కొరకు చికిత్స చేయించే సమయంలో, ఆయన తన గొప్ప పలుకుబడిని ఉపయోగించారు. అవసరమైన పరికరములను, స్పెషలిస్టులను భగవాన్‌కు వైద్య సేవలు చెయ్యడానికి రప్పింప చేశారు. ఆయన తన పలుకుబడితో భగవాన్‌కు అవసరమైన సేవలు చెయ్యటానికి కావలసిన పరికరములను, సామాగ్రిని, స్పెషలిస్టులను, తిరువణ్ణామలైకి వచ్చేటట్లు చేశారు.

దొరైస్వామి అయ్యర్ పేరు గుర్తుకు వస్తేనే, నా హృదయం కృతజ్ఞతతో కరగి పోతుంది. 1960లో నా అదృష్టంకొద్దీ ఆయనను పాండిచేరి లోని అరవింద ఆశ్రమంలో కలుసుకున్నాను. ఆ సమయంలో ఆయన అక్కడ ఉంటున్నారు. నేను 'మౌంటెన్ పాత్' అనబడు ఆశ్రమ పత్రికలో వ్యాసము వ్రాయుట కొరకు, ఆయనను ఇంటర్వ్యూ చెయ్యడానికి అక్కడకు వెళ్ళాను. ఒక పవిత్రమైన రహస్యాన్ని ఆయన నాకు చెప్పారు, "1920 దశకంలో నేను స్కందాశ్రమంలో ఉండేటప్పుడు, ఒక రోజున నేను భగవాన్‌తో ఒంటరిగా ఉన్నాను. భగవాన్, మానవ దేహంతో ఉన్న దేవుడే అని నేను పూర్తిగా ఎరుగుదును. ఈ విషయాన్ని భగవాన్ పాత భక్తులందరూ ఎరుగుదురు. భగవాన్ కేవలము మునికాదు, మహర్షి కాదు అనేది ప్రాచ్య, పాశ్చాత్య దేశాలకు చెందిన భగవాన్ భక్తులందరకూ తెలుసును. అయినప్పటికి ఏదో బలమైన కారణం వల్ల, ఒక ఆధ్యాత్మిక ప్రేరణ మానసికంగా ఒక ప్రశ్న వేసేటట్లు బలవంత పెట్టింది. "భగవాన్! నిజంగా మీరెవరు?" నేనేమీ పైకి మాట్లాడలేదు. కానీ భగవాన్ నా ప్రశ్న విన్నట్లున్నారు. ఆయన నన్ను చూచారు. లేచి నా వద్దకు వచ్చారు ఆయన చేతిని చాచి, నా చేతిని తన చేతిలోనికి తీసుకుని, దాదాపుగా కొండపైకి మరింత పైకి లాక్కొని, కొండపై మరింత ఎత్తుకు తీసుకుని వెళ్ళారు. మేముగిరి శిఖరానికి అవలీలగా చేరుకున్నాము. సర్వత్రా వ్యాపించి ఉండే భగవాన్ సన్నిధి, భౌతికంగా ఆయనకు ఎంతో చేరువుగా ఉండటం నాకు పారవశ్యం కల్గించగా, నేను ఆయన పాదాలకు సాష్టాంగపడ్డాను. అలా పడుకుని ఉన్నస్థితిలో కూడా, చొచ్చుకొని పోయే తన చూపును సూటిగాను హృదయంలోనికి ఆయన పంపటము చూడ గలిగాను. ఆయన అన్నారు, "అరుణాచలుడెవ్వరు 'అహం' (ఆత్మ) గాక ? లోనికి చూడు. నువ్వు కూడా అరుణాచలునివే. లోనికి దూకు. ఆయన నావైపునకు వంగి, నా హృదయాన్ని ఆయన చేతితో తాకారు, ఆ క్షణంలోనే, భగవాన్ అరుణాచలునిగానూ, నేను, నేను ఏ రాతి మీద కూర్చుని ఉన్నానో, ఆ రాయిగానూ నాకు అనుభవము అయింది.

అరుణాచలుడే అన్నిటిలో, అంతటా సత్యముగా (ఆత్మగా) వ్యాపించి ఉన్నారు. నేను మరల భగవాన్ పాదాలకు నమస్కారము చేశాను. దొరైస్వామి అయ్యర్ ఈ అద్భుతమైన విషయం చెప్పటం పూర్తి చేసే సరికి సమాధి స్థితిలో ఉన్నారు. ఆయన నా భుజాలు పట్టుకుని ఊపి ఇలా అన్నారు. "గణేశన్, ఇప్పుడు కూడా, నేను నిరంతరం అరుణాచలుడిని అనుభవిస్తూనే ఉంటాను. అరుణాచలం లో ఉండు, భగవాన్ బోధలను అంటిపెట్టుకుని ఉండు.అంతా సవ్యంగా ముగుస్తుంది. నీకు నా ఆశీస్సులు". ఆయన చెప్పిన విషయం నన్ను ఎంతగా కదల్చివేసిందంటే, నా కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. నేను ఆయన పాదాల పైబడి ఆశీర్వదించమనికోరాను. ఆయన చక్కని చిరునవ్వు నవ్వి, నన్ను పైకి లేపి ఇలా అన్నారు. "గణేశన్,వెళ్ళు. వెతుకు గది అంతా వెతుకు. ఈ ఫ్రేము కట్టబడిన భగవాన్ ఫోటోతప్ప వేరే ఏ ఇతర ఫోటోలు నీకు కన్పించవు. నేనుఎప్పుడూ దానిని చూస్తుంటాను. నాకు అది నిజమైనది. భగవాన్ నాకు దీనిని 1938లో ఇచ్చారు. భావోద్రేకంతో కంఠం గద్గదమై ఆయన యిక మాట్లాడలేకపోయారు. అరవిందుల ఆశ్రమంలో ప్రతి గదిలోనూ, అరవిందులు శ్రీమాత ఫోటో ఉంటుంది. కానీ ఈ అరవింద ఆశ్రమవాసి గదిలో మాత్రము భగవాన్ ఫోటో ఉన్నది. ఈ ఆధ్యాత్మికంగా ఉన్నతులైన వీరందరూ భగవాన్ కంటే వేరుకాదు. ఈ సంఘటన జరిగిన కొద్ది వారములలో దొరైస్వామి అయ్యర్ దేహాన్ని వదలి వేశారు.

శివానంద స్వామి

దొరై స్వామి అయ్యర్ సంపన్నులూ, చదువుకున్నవారూ. ఆయన భగవాన్ ఆశీర్వాదాన్ని పొందారు. అందుకు భిన్నంగా, తరువాత పరిచారకుడు పెద్దగా చదువుకోలేదు. అమాయకుడు. అణకువగలవారు. శివానంద స్వామి పసిపిల్లవానిలా అమాయకుడని పేరుపొందారు. బహుశా ఈ అమాయకత్వంవల్ల, అంతరంగ పవిత్రత వల్ల భగవాన్ ఆయనను ఒక్కసారి కాదు, రెండుసార్లు ఆశీర్వదించారు.

'రమణ మహర్షి రచనల సంగ్రహం' తమిళంలో అప్పుడే అచ్చయ్యింది. అది 'నూల్ తిరట్టు' అనే పేరుతో అచ్చయ్యింది. ఆ పుస్తకము ఆశ్రమ పుస్తకాల షాపులో ఉన్నది. భగవాన్, పరిచారకులు కొందరు దానిని కొనుక్కున్నారు. 'సంపూర్ణంగా సన్యసించిన శివానంద స్వామి వద్ద అసలు డబ్బు లేదు. మా తాతగారు, గట్టి క్రమశిక్షణతో ఉంటారు గనుక ఎవరికీ పుస్తకాలు ఉచితంగా ఇవ్వరు. భగవాన్ వినమ్రుడైన, నిరుపేదయైన తన భక్తుని ఇటువంటి విలువైన పుస్తకం పొందనివ్వకుండా వదలివేస్తారా? భగవాన్ వద్ద ఒక వాడని నోట్‌బుక్ ఉన్నది. ఆ నోటుపుస్తకంలో 'రచనల సంగ్రహం' మొత్తాన్నీ (తమిళంలో) ఎత్తి వ్రాశారు. ఆయన ఏమి చేస్తున్నారనేది ఎవరికీ చెప్పలేదు. ఆయన చాలాసేపు వ్రాస్తూనే ఉండేవారు. ఆ పని పూర్తయిన తర్వాత, ఆయన, శివానందస్వామితో, "శివానందం, ఇలా రండి, ఆ పుస్తకం కొనుక్కోవడానికి డబ్బుకోసం ఎక్కడికి వెళ్తారు? నేనే దానిని చూచి వ్రాశాను. తీసికొండి, " అన్నారు. శివానంద స్వామి ఎంతో పరవశించిపోయి ఆ నిమిషాన్నే, సాధనలోకి దూకాలనుకున్నారు. కాని తానుసాధన చెయ్యటానికి భగవాన్ సాయం అవసరమని అర్థం చేసుకుని, ఆయన పసిపిల్లల వంటి అమాయకత్వంతో భగవాన్ వద్దకు వెళ్ళి, " భగవాన్, నాకేదైనా మంత్రముగానీ ప్రత్యేకమైన ఉపదేశము గాని ఇస్తారా? సాధన చేసుకుని నన్ను నేను (ముక్తినొందించుకొనటానికి) తరింప జేసుకొనడానికి?" భగవాన్ నవ్వి బదులిచ్చారు "ఎల్లప్పుడు నీలో ఉన్న చైతన్యాన్ని అంటిపెట్టుకుని ఉండు".

భగవాన్ కొన్ని రోజులైన తర్వాత ఆయనను మరల పిలిచారు. ఈ మధ్యకాలంలో, శివానంద స్వామి అంతర్ముఖుడై భగవానే అరుణాచలుడు అని గ్రహించారు ఆయన ఆశ్చర్యంలో మునిగారు, "నిజంగానా? భగవానే అరుణాచలుడా?" ఆ మర్నాడే భగవాన్,శివానంద స్వామిని పిలిచి, "మీనోటు పుస్తకం తెచ్చివ్వండి," అన్నారు. భగవాన్ తన కిచ్చిన నోటు పుస్తకాన్ని తెచ్చారు శివానందం. భగవాన్ ఆ నోటు పుస్తకాన్ని రెండు గంటలపాటు ఉంచుకుని, తర్వాత అందులో ఒక పేజీని తెరచి ఇలా అన్నారు, "సందేహానికి తావెక్కడ? నీవు తృప్తి చెందావా?" భగవాన్ అందులో తానే గీచిన అరుణాచలుని పటమును చూబిస్తూన్నారు. శివానంద స్వామికి భగవాన్ అరుణాచలుడేనా నిజంగా అనే సందేహం వచ్చింది కాబట్టి, భగవాన్‌పై మాటలు అన్నారు. శివానంద స్వామి, భగవాన్ ఈ విధంగా సందేహాన్ని తీర్చడంతో ఎంతో ఆనందాన్ని పొందారు.

శివానంద స్వామికి, భగవాన్ శరీరాన్ని వదలివేసిన రోజునే మరొక అద్భుతమైన అనుభవం వచ్చింది. తెల్లవారు ఝామున నిర్వాణ రూమ్‌లో నున్న శివానంద స్వామిని భగవాన్ పిలచి, "సంతోషము" అన్నారు. ఆ గదిలో ఉన్న ఇతరులంతా ఎంతో ఆదుర్దాతో ఉన్నారు. భగవాన్ ఆయన శరీరాన్ని ఏక్షణానైనా వదలి వేయవచ్చును. అది ఏమీ సంతోషకరమైన సందర్భము కాదు. నిజానికి అనేకమంది కన్నీరు కారుస్తున్నారు. భగవాన్ శివానంద స్వామి వైపు చూచి ఇలా వివరించారు, "ఇంగ్లీషు వాళ్ళు తమ కృతజ్ఞత తెలియజెయ్యటానికి, 'థాంక్యూ' అంటారు. మనకు (మనభాషలో) అటువంటి మాటలు లేనందువల్ల సంతోషము అనే పదాన్ని వాడాను. దానిలోని అద్భుతమేమంటే, ఆ నిముషానే శివానంద స్వామి సంతోషాన్ని, ఆనందాన్ని అనుభవించారు.

1960 దశకంలోనూ, 1970 దశకంలోనూ నేను శివానంద స్వామి తోటి, సాన్నిహిత్యం పెంపొందించుకున్నాను. ఆ అణకువ గల్గిన, వినయశీలి అయిన అమాయక పరిచారకుడు, నన్ను ఆశీర్వదించారు. "గణేశన్, భగవాన్ బోధల సారము, ఏమిటంటే, ఆనందమే మన నిజ స్వరూపము. బాహ్యంలో అరుణాచలుడు రమణులు. అంతరంగంలో ఉండే అరుణాచలుడు కేవలం ఆనందమే. మీకు నా దీవెనలు.

రామకృష్ణస్వామి



రామకృష్ణస్వామి, కుంజుస్వామి ప్రక్క ప్రక్క గ్రామాలకు చెందినవారు. నిజానికి రామకృష్ణస్వామియే కుంజుస్వామిని 1920 ఆ ప్రాంతాలలో, భగవాన్‌ను దర్శించమని పట్టుబట్టారు. కుంజుస్వామి పరిచారకుడిగా ఉన్నారు. కానీ ఆయన సాధనకొరకు, పల్లా కొత్తుకు వెళ్ళటానికి నిర్ణయించు కున్నప్పుడు, తన స్థానంలో భగవాన్ సేవలు చెయ్యడినికి రామకృష్ణస్వామిని తీసుకుని వచ్చారు. రామకృష్ణస్వామి చెప్పుకోదగ్గ తెలివి తేటలుగల వారు. శివానందస్వామి వలెనే అమాయకులు. ఆయన భగవాన్ సేవను అత్యంత శ్రద్ధతోనూ, ఉత్సాహంతోనూ చేసి భగవాన్‌నూ, నిరంజనానందస్వామిని కూడా మెప్పించగలిగారు. స్టోర్స్ నిర్వహణలోనూ, ఆశ్రమ ఉద్యానవన నిర్వహణలోనూ సాయం అత్యవసరమై నిరంజనానందస్వామి రామకృష్ణస్వామిని వాటిని నిర్వహణలో తనకు తోడ్పడమని వేడుకున్నారు. భగవాన్ అనుమతితో, రామకృష్ణస్వామి ఆశ్రమ నిర్వాహకులకు, పూర్తి అంకిత భావంతోనూ, భక్తితోనూ సేవా, సహకారాలను అందించారు. నిరంజనానందస్వామి ఈ భక్తునికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండి, ఎప్పుడూ ఆయన గురించి గొప్పగా చెబుతుండేవారు.

రామకృష్ణస్వామి నా పట్ల ఎంతో దయగా ఉండేవారు. ఆయన భగవాన్‌కు తనకు సంబంధించిన ఎన్నో సంఘటనలను తెలిపారు. ఒకరోజు హాలులో భగవాన్ సేవ చేస్తున్నపుడు, రామకృష్ణస్వామి భగవాన్ వద్దకు వెళ్ళి అన్నారు. "భగవాన్, నేను పూర్తిగా నిధి ధ్యాస లోనూ, ధ్యానములోనూ ఉండిపోవాలనుకుంటున్నాను. ఇందుకొరకు నేను విరూపాక్ష గుహకు వెళ్ళ వచ్చునా?" అని అడిగారు. భగవాన్ సంతోషించినట్లు కనబడ్డారు. వెళ్ళు అక్కడ ఉండు," అన్నారు. ఒక వారములో రామకృష్ణస్వామి ఆనందాన్ని పొందారు. ఒకరోజు గాఢ ధ్యానంలో ఉండగా, ఆయన జ్ఞాన నేత్రంతో, దూరంగా చిదంబరంలో ఉన్న నటరాజ ఆలయానికి వెళ్ళినట్లు కనుగొన్నారు. ఆయనకు ఆ పవిత్ర ఆలయం కనబడింది. ఆ పూజాస్థలి ప్రక్కన ఉన్న కర్టెను (తెర)కు నిప్పు అంటుకోబోతూ ఉన్నది. ఆ దృశ్యం ఎంత స్పష్టంగా ఉందంటే, ఆయన సమాధి స్థితిలో నుండి ఒక్క ఉదుటన లేచారు. ఆ సాయంత్రం చిదంబరం ఆలయంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని గురించి టౌనంతా చెప్పుకుంటున్నారు. స్వామి తన శక్తికి చాలా సంతోషించారు. ఒక్క వారంలోనే ఆధ్యాత్మికంగా తాను చాలా ఎదిగిపోయానని భావించి, భగవాన్‌కు ఈ సంఘటనను గురించి చెప్పటానికి, పరుగెత్తారు. భగవాన్, కోపంతోనూ (అనంగీకారంతోనూ) మండిపడ్డారు, "రామకృష్ణా నువ్వు కేవలం ఒక దృశ్యం చూడటానికేనా విరూపాక్ష గుహకు వెళ్ళింది? నీ ధ్యానాన్ని తీవ్రతరం చేసుకొనటానికి గాదా, నువ్వక్కడకు వెళ్ళింది? భౌతిక నేత్రాలతో గానీ, జ్ఞాన నేత్రం (దివ్యచక్షువు) తోగాని, బాహ్య విషయాలను చూడటం అనేది చక్కటి ధ్యాన ప్రవాహానికి ఆటంకం కల్గుతున్నదనేదానికి గుర్తు, ఏదైనా సిద్ధిని గానీ, అతీంద్రియ శక్తిని గానీ పొందటము అనేది, ఆధ్యాత్మిక ప్రయాణానికి ఆటంకమే. నీ ఏకాంతమూ, ధ్యానమూ చాలు, దిగిరా!" అన్నారు. భగవాన్ మాటలు, రామకృష్ణస్వామికి మేల్కొలుపు వలె పనిచేసినవి. ఆయన ఆ రోజు నుండి ఎప్పుడూ దృశ్యాలలో చిక్కుకోలేదు. తన హృదయంలో ధ్యాన శక్తిని 'మేల్కొలపాలంటే, గురువు సాన్నిధ్యం అవసరమని ఆయన పూర్తిగా అర్థము చేసుకున్నారు. అందుకని, తోటపనిలోనూ, స్టోరు నిర్వహణ పనిలోనూ పూర్తిగా మునిగి నిమగ్నమై పోయారు. ఆశ్రమ ఉద్యానవనం కళకళలాడింది కేవలము రామకృష్ణస్వామి, రామస్వామి పిళ్ళైల వలననే. రామకృష్ణస్వామి, ఉండటం వల్ల కష్టించి పని చెయ్యటం వల్ల స్టోరు కూడా అభివృద్ధి చెందింది.

రామకృష్ణస్వామికి, చిన్నప్పటి నుండి ఫిట్స్ (తెరలు, మూర్ఛలు) వస్తుండేవి. కొన్నిసార్లు స్టోరులో పనిచేస్తున్నపుడు ఫిట్స్ వలన గంటలకొద్దీ స్పృహలేకుండా ఉండేవారు. ఆయనను ఆశ్రమ ఆస్పత్రికి, భగవాన్ పాత హాలు ప్రక్కగుండా మోసుకుని వెళ్ళవలసి వచ్చేది.ఒకసారి, ఆ దృశ్యాన్ని భగవాన్ చూడటము తటస్థించింది. రామకృష్ణస్వామి స్వస్థత నందిన తర్వాత భగవాన్ వద్దకు వెళ్ళి నమస్కారము చేసుకున్నారు. భగవాన్ యిలా అడిగారు, "హే రామకృష్ణా ! మీరెలా భావించారు?"

భగవాన్ ఉద్దేశము ఫిట్స్ వచ్చిన సమయంలో ఆయనకెలా అన్పించింది? అని. రామకృష్ణస్వామి బదులిచ్చారు, “భగవాన్ నాకేమీ తెలియదు. నాకు దేహస్పృహగానీ, పరిసరాల స్పృహగానీ లేదు. భగవాన్ చెప్పారు, “కాదు,కాదు, అలా కాకూడదు. మీరు ఎల్లవేళలా అంతర చైతన్యాన్ని (లోన ఉండే ఎఱుకను) అంటిపెట్టుకునే ఉండాలి. మీరు 'ప్రజ్ఞ' (బాహ్యస్పృహ)ను కోల్పోయినా, మీరు ఎప్పుడూ (జ్ఞప్తి) 'అంతశ్చేతన' (లోపలి ఎఱుక) ను కోల్పోగూడదు. రామకృష్ణస్వామి భగవాన్ ఉద్దేశాన్ని అర్థం చేసుకున్నారు. ఆ ఉపదేశ ప్రభావము ఏమిటి? ఆయనకు మరల ఎన్నడూ ఫిట్స్ రాలేదు.

రామకృష్ణస్వామి 'జ్ఞప్తి' అనే దానికి యిలా వివరణ యిచ్చారు. 'ప్రజ్ఞ' అంటే తన శరీరాన్ని గురించి, పరిసరముల గురించి స్పృహకలిగి ఉండుట, మనము చూచేదీ అనుభవించేదీ ప్రజ్ఞ. ప్రజ్ఞ అనేది బాహ్యస్పృహ జ్ఞప్తి అంటే, స్వచ్ఛమైన లోపలి ఎరుక. అది మానవునికి సహజంగా ఉండే ఎరుక. ఉదాహరణకు, ఒక వ్యక్తి నిద్రలేచినపుడు, తాను లేచాననీ, ఇంకా నిద్రలో లేననీ, అర్థము చేసుకుంటాడు. మెలకువగా ఉన్నానని ఎరుక ఉంటుందిగానీ, మనస్సు దేని మీదకూ వెళ్ళదు. ఇది ఒక లిప్త పాటు, చాలా స్వల్పమైన సమయం వరకు ఉంటుంది. అది ఒక ఆధ్యాత్మిక స్థితి. దానిని మనము ఏకాగ్రతతో గమనించకపోవుటచే అది మనకు తెలియకుండానే గడచిపోతుంది. ప్రతిదినమూ, (మన బాధ్యతల వలన పరిస్థితుల వలన ఒకానొక మానసిక స్థితికి అలవాటు చెంది ఉండుట వలన, దాని ప్రవృత్తి యొక్క ప్రేరణతో) మనము ఒక బలవత్తర మైన ప్రేరణతో వెంటనే మంచము దిగి, మన దినచర్య లోనికి దిగిపోతాము. పని ప్రారంభిస్తాము. ఈ విధమైన ఎరుకను, ఎప్పుడైతే మనకు దేని గురించిన ఆలోచనలు ఉండవో, ఇంకా సాధారణ బాహ్య స్పృహలోనికి రాలేదో, కానీ తెలివి (ఎరుక) మాత్రము ఉన్నదో దానిని 'జ్ఞప్తి' అంటాము. ఇది ఎవరైనా అనుభవించ వచ్చును.” నిసర్గదత్త మహారాజుగారు ఆరెండికి మధ్య స్పష్టమైన తేడాను తెలిపారు. 'తెలివి' లేక 'ఎఱుక', ఏదైనా ఒక బాహ్య విషయాన్ని పట్టుకుంటే, అది బాహ్య స్పృహ అవుతుంది.



వైకుంఠవాసర్

వైకుంఠవాసర్ మరొక సామాన్యమైన వ్యక్తి, మహాత్ములతో కలసి ఉండుట వల్లనూ, వారి ప్రవచనములు వినుట వలననూ, ఆధ్యాత్మిక పరిపూర్ణత సిద్ధించాలంటే, గురుసేవే ఖచ్చితమైన మార్గమని అర్ధము చేసుకున్నారు. అందుకని తనను తాను అర్పించుకొనుటకు సద్గురువును వెదకటం ప్రారంభించారు. ఆయన (ఎక్కువగా) చదువుకోలేదు గనుక శాస్త్రములను చదివి అర్థము చేసికొనలేరు. అందుకని భగవాన్ ఏమిచేశారు? భగవాన్ వైకుంఠ వాసర్‌ను తన వైపుకు లాక్కున్నారు. భగవాన్ యొక్క ఒక్కచూపు తోటే, ఆయనే తన గురువని ఆయనకు నమ్మకమేర్పడింది. వైకుంఠవాసర్ స్వంత మాటలలో చెప్పాలంటే, "ఆయన మానవ రూపము ధరించిన దేవుడు. నేను భగవాన్ వ్యక్తి గత పరిచారకుడిగా నియమించబడినపుడు నేను చాలా ఆనందించాను. ప్రతి క్షణమూ నేను భగవంతుణ్ణే సేవిస్తూన్నాననీ, మానవుణ్ణి కాదనీ ఎఱుకలో ఉండేవాడిని."

వైకుంఠ వాసర్ భగవాన్‌ను దేవుడి గానే భావించి నప్పటికీ వారిద్దరి మధ్య తేలికపరిచే (ఉల్లాసపరిచే) సంఘటనలు లేకపోలేదు. ఒకనాడు ఉదయాన్నే, పాత హాలులో, తెల్లవారుఝామున వైకుంఠవాసర్, నేలపై నుండి తన చాపను చుట్టటానికి పైకి తీసినపుడు, దాని క్రింద ఒక పాము చుట్ట చుట్టుకొని ఉండటము చూచారు. భయంతో "భగవాన్, పాము,పాము" అన్నారు. భగవాన్ పాముని చూచి, వైకుంఠవాసర్ వైపు కు తిరిగి భయమును పోగొట్టే చిరునవ్వుతో, "వైకుంఠవాసర్! భయమెందుకు? నీ శయ్య (పక్క) (పఱుపు) నిన్ను వెదుక్కుంటూ వచ్చింది." అన్నారు. భగవాన్ వైకుంఠవాసర్‌ను అయిదు తలల ఆదిశేషుని పాన్పుగా చేసుకుని ఉండే వైకుంఠవాసుడైన విష్ణువుతో పోల్చారు. ఈ హాస్యోక్తి అతనిలోని భయాన్ని క్షణంలో పోగొట్టింది.

నాకు వైకుంఠవాసర్‌తో సాన్నిహిత్యం పెరిగిన తర్వాత, నాకు ఆయనను ఇలా అడగటానికి ధైర్యము వచ్చింది. "మీ జీవితంలో భగవాన్ మీ మీద నిజంగా అనుగ్రహ వర్షం కురిపించిన సంఘటనలను గురించి మీరు నాకు తెలుపగలరా?" అని నేనాయనను అడిగాను. వైకుంఠవాసర్ అన్నారు, " ఒకప్పుడూ, రాత్రి ఒంటిగంట సమయంలో, భగవాన్ ఆశ్రమం నుండి బయటకు వెళ్ళి కొండవైపు వెళ్ళటం నేను కనుగొన్నాను. నేను ఆయనను అనుసరించాను. నాకు భగవాన్ కు మధ్య ఇసుక ఉన్నది. అప్పుడు కారుచీకటిగా ఉన్నది. నేను భగవాన్ వెళ్ళే దారిని జాగ్రత్తగా గమనించసాగాను. ఉన్నట్లుండి, పావుకోళ్ళ శబ్దము వినబడింది. ఆ పావుకోళ్ళు దగ్గరగా వస్తున్న కొలది చప్పుడు పెద్దదయింది. తర్వాత ముందుకు సాగిపోయింది. ఆ శబ్దం వినబడింది గానీ ఎవరూ కనిపించలేదు. నాకు సంభ్రమాశ్చర్యములు కల్గినవి. ఎందుకంటే, భగవాన్ ఒక కంటికి కన్పించని (అదృశ్యరూపములో) సిద్ధ పురుషుడు గిరి శిఖరంపై ఉంటారనీ, ఆయనే స్వయంగా అరుణాచలుడని చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి. నాకు చెమటలు పట్టినవి. భగవాన్ నా వైపు చూచి అన్నారు. అయితే, నువ్వు విన్నా వన్నమాట." ఆయన ఇంకా ఇలా అన్నారు. గిరి అగ్ర భాగంలో ఉండే సిద్ధ పురుషుడు అరుణాచలుడే. వేరెవరుకాదు. ఆయన అరుదుగాగానీ కనబడరు. మీరు ఆయన (పాదుకల) చప్పుడు వినగలిగారు. (చాలా) మంచిది."

ఈ భక్తులు కేవలం భగవాన్‌కు భౌతిక పరమైన సేవ చేయటమే కాదు, ఆయన ఆశీస్సులను పూర్తిగా పొంది, వారి అంతరంగంలో పరిపూర్ణస్థితిని పొందగలిగారు. (పావుకోళ్ళు - చెక్కతో చేయబడిన పాదుకలు లేక చెప్పులు)

డాక్టర్ యమ్. అనంత నారాయణరావు



భగవాన్ ఒకప్పుడు అన్నారు, " ఈ భౌతికమైన శరీరము పడిపోవాలంటే, అది ఏదో ఒక జబ్బును పట్టుకోవాలి." అని భగవాన్‌కు ఎడమ మోచేతి వద్ద కాన్సర్ వ్యాధి సోకింది. ఒక విధంగా అది అంతమునకు ఆరంభము. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, భగవాన్ అత్యంత నిష్ణాతులైన పెద్ద స్పెషలిస్టులను తన వద్దకు రప్పించుకున్న విధానము. భగవాన్, యిలా అందరు డాక్టర్లనూ ఒక చోటికి చేర్చవలసి వచ్చింది ఎందుకంటే, (జీవితమనే) నాటకానికి, ఆఖరి సీను(అంతం) ప్రదర్శింపబడవలసి ఉన్నది గదా – అంటే ఆయన శరీరాన్ని వదలవలసిన సమయం ఆసన్నమైనదిగదా!

డా. అనంత నారాయణరావు బాగా పేరుపొందిన పశువైద్యులు. 1929లో ఆయన బొంబే నుండి రైలులో ప్రయాణిస్తున్నారు. ఆయన మరుసటి స్టేషన్‌లో దిగిపోతారనగా, ఆయన ప్రక్కన కూర్చున్న వ్యక్తి, ఆయనకు భగవాన్ ఫోటో ను యిచ్చి, "ఈయన గొప్ప మహాత్ముడు. తిరువణ్ణామలై లో ఉంటారు అని చెప్పారు." డా. రావు మహాత్ములంటే అమిత భక్తి కలవారు కావున కృతజ్ఞతతో దానిని స్వీకరించారు. ఆయన 1930లో పై చదువులకు లండన్ వెళ్ళారు. ఆ ఫోటో సంగతి మరచిపోయారు. కానీ భగవాన్ ఆయనను మరువనిస్తారా? 1932లో ప్రభుత్వము ఆయనను దక్షిణ భారతదేశంలో ఒక వైద్యపరమైన అధ్యయనం నిర్వహించటానికి నియమించింది. ఆయన దక్షిణాదికి వచ్చినపుడు, తనకు రైలులో యివ్వబడిన ఫోటో సంగతి గుర్తుకు వచ్చింది. ఆయన తన భార్యతో చెప్పారు. మనమొక మహాత్ముని చూడబోతున్నాము అని. ఆయన తన భార్యతోనూ, తన మిత్రుడు డాక్టర్. శివరావు తోనూ కలసి తిరువణ్ణామలైకి వచ్చారు. డా. శివరావు భగవాన్‌కు సేవచేశారు.

డా. అనంతనారాయణరావు, ఎప్పుడూ మహాత్ముల సహవాసం చేస్తుండేవారు. కాని 1932లో ఆయన భగవాన్ ను చూచినపుడు, ఒక ఆలోచన ఆయన మనసులో స్పష్టంగా మెదిలింది, "ఈయన మానవ రూపంలో ఉన్న భగవంతుడు. దీనినే శాస్త్రములు సద్గురువు, జీవన్ముక్తుడు, సిద్ధ పురుషుడు, జ్ఞాని అని ఘోషిస్తున్నవి. ఆయన ఆశ్రమానికి తరచుగ రాసాగారు. ఆయన రెండవసారి వచ్చినపుడు, భగవాన్ దివ్యత్వాన్ని అర్థము చేసుకొనుటయేగాక, ఆత్మ విచారణ గురించి గూడా పరిజ్ఞానాన్ని పొందారు. భగవాన్ సన్నిధిలో కూర్చుని ప్రయత్న రహితంగానే నిశ్చలత్వాన్ని, మనోనిశ్చలతను పొందారు. అంతరంగిక ఆనందము, అంతరంగిక పరిపూర్ణత గురించి ఏమేమైతే చదివారో, వాటిని కేవలము భగవాన్ ముందు కూర్చొనుట ద్వారానే పొందారు. ఈ అనుభవంతో ఆయన నిరంతరము ఆత్మ విచారణ చేయటము ప్రారంభించారు.

1943లో ఆయన ఆశ్రమము ఎదురుగా ఒక ఇంటిని నిర్మించుకుని, అక్కడ ఉండాలి అని నిశ్చయించుకున్నారు. ఆయన తన ఇంటి ఆవరణలో త్వరగా కాపుకు వచ్చే పళ్ళ చెట్లను నాటారు. ఈ చెట్ల నుండి వచ్చే మొదటి కాపు ఎప్పుడూ భగవాన్‌కు సమర్పించబడేది, భగవాన్ పండును ముక్కలుగా చేసి, తను ఒక ముక్క ఉంచుకుని డా. రావుని మిగిలిన ముక్కలు అక్కడున్న భక్తులకు పంచమనేవారు. వింతైన విషయం ఏమిటంటే మూడేళ్ళు గడచినా, ఒక్కనాడు గూడా ఒక్క ముక్క కూడా ఆయనకు ప్రసాదంగా లభించలేదు. ఒకరోజు, ప్రసాదాన్ని పంచిపెట్టి ఖాళీప్లేటు తో భగవాన్ వద్దకు తిరిగి వచ్చారు. హృదయంలో ఆవేదనతో అనుకున్నారు, "నేను ఇంకా భగవాన్ నుండి ప్రసాదాన్ని ఎందుకు అందుకోలేదు?" అని. అప్పుడే భగవాన్, "అనంత నారాయణరావుగారూ, ఇలా రండి. ఇన్ని సంవత్సరముల నుండి మీరు పండ్లను ప్రతి ఒక్కరికిపంచి పెట్టారే గానీ, మీకెప్పుడూ ఒక ముక్క కూడా లభించలేదని, నేను గమనించాను. అని, తన ముక్క ప్రక్కన ఉన్న మరొక ముక్కను తీసి, "మీకోసం ఒక ముక్కను అట్టిపెట్టాను. వచ్చి తీసుకొండి," అన్నారు భగవాన్, డా. రావుకు ఆనందం వేసింది. ఆ సంఘటనను గుర్తుజేసుకుంటూ, డా. రావు నాతో అన్నారు, "భగవాన్ తన చేతితో స్వయంగా దానిని నాకు ఇచ్చారు. దానిని తీసుకుని తిన్నాను. అది ఒక ఆధ్యాత్మిక అనుభవము. ఎందుకంటే నన్నా స్థితిలో ఉంచారు.

సాధకునిగా దీనినుండి ఆయన రెండు పాఠాలు నేర్చుకున్నారు. మొదటిది సాధకుడు ప్రతిదీ ఇచ్చివేయాలి. దానిని ఉంచుకోవాలనే మమకారము లేకుండా, రెండవది, సద్గురువు అనుగ్రహం కోసము వేచి ఉండాలి. ఈ రెండు ఆధ్యాత్మికపాఠాలను

వంట బట్టించుకుని , ఆయన ఇలా ప్రార్థించారు, "భగవాన్, మీకు వ్యక్తిగతంగా సేవ చెయ్యాలని ఉన్నది." ఆయన ఉద్దేశము. ఆయన కాళ్లుపట్టే (మర్దనాచేసే, మసాజ్ చేసే) అవకాశము కోరుకున్నారు. ఎందుకంటే హిందూశాస్త్రముల ప్రకారము ఒక మహనీయుని పాదములను స్పర్శించుట ద్వారా, ఆధ్యాత్మిక లాభము కల్గుతుంది అని చెప్పబడింది. ఆయనకు 1948లో ఆ భాగ్యము దక్కింది. అప్పుడు చిన్నస్వామి ఆయనను, "భగవాన్ వ్యక్తిగత పరిచారకుడిగా ఉంటారా?" అని అడిగారు. వ్యక్తిగత పరిచారకుడిగా ఆయన చెయ్యవలసిన పని, ఆయన కాళ్ళు పిసుకుట, వగైరా పనులు (మసాజ్) చెయ్యటము అనంత నారాయణరావుగారు చెప్పలేనంతగా ఆనందించారు.

ఏమైనప్పటికి భగవాన్ మిగిలిన వాటినన్నిటినీ పంచినట్లే తన శరీర భాగాలను కూడా సమానంగా పంచేవారు. ఆయన ఒక పరిచారకుడికి కుడి చెయ్యి, మరొకరికి ఎడమ చెయ్యి, పట్టటము, అలా తలా ఒక పని అప్పుచెప్పేవారు. భగవాన్ చేసే ఇటువంటి చిన్న పనులలో కూడా ప్రత్యేకత ఉండేది. ప్రతి మాటకు, ప్రతి కదలికకు ప్రత్యేకత ఉండేది. సర్వోత్కృష్టమైన సత్యము అందులో ఉండేది. అది కేవలము క్షణికమైన జారిపోయే అనుభవము కాదు. డా.రావుగారికి ఎడమ చెయ్యి (పట్టటానికి, మసాజ్ చేయుటకు) అప్పగించబడినది. ఆపని కారణం లేకుండా చెయ్యబడలేదు. ఆ చేతికే కాన్సరు వచ్చింది. "ఆ విషయంలో కూడా భగవాన్ అనుగ్రహం చూపారు. ఆయన నాకు ఎడమ చెయ్యి నిచ్చారు. అందువలన చివరి రోజు వరకు ఆ చేతి కి కట్టు కట్టగలిగాను.

భగవాన్ చివరి శ్వాస తీసుకున్నపుడు ఆయన అక్కడ ఉన్నారు. నాకూ ఆ సమయంలో అక్కడ ఉండే భాగ్యం దక్కింది. చివరి కొద్ది నిముషాలలో ఆక్సిజను పెట్టదలచి, డాక్టర్లు ప్రతి ఒక్కరిని , గదిని వీడి వెళ్ళ వలసినది గా ప్రార్థించారు. అందరూ వెళ్ళారు. మా తాతగారు, మా తండ్రి, భగవాన్ సోదరి, నేను నిర్వాణ గది ముందు ఉన్నాను. టి.పి.రామచంద్రఅయ్యర్, "ఏయ్, ఇక్కడ, ఆగు," అన్నారు. ఈ విధంగా నా అదృష్టం కొద్దీ, భగవాన్ శరీరం వదలి నపుడు, ఆయన శరీరాన్నుండి వీడిన కాంతిని చూడగలిగాను. డా. అనంతనారాయణ రావు, డా.ఆర్.సుబ్రమణ్యం, డా.టి.ఎన్.కృష్ణమూర్తి గారితో కలసి ఆ ప్రత్యేకమైన కాంతిని చూడ గలిగారు.



సుందరం (ప్రస్తుత ఆశ్రమ అధ్యక్షులు), డా॥ అనంత నారాయణరావు, టి.ఎన్. వెంకటరామన్

సాధు బ్రహ్మణియమ్

భగవాన్ అప్పటికే గొప్ప డాక్టర్ల చేత నాలుగు శాస్త్ర చికిత్సలు చేయించుకుని ఉన్నారు. ఈ వైద్యులందరూ ఎక్కడ నుండి వచ్చారు? భగవాన్ దర్శకత్వం లోని చక్కదనం అదే. డా.సుబ్రమణియన్, సన్యసించిన తర్వాత సాధు బ్రహ్మణియంగా పిలువ బడ్డారు. ఆయన 1930లో భారత ప్రభుత్వ ఉత్తర్వులపై విదేశాలకు వెళ్లారు. ఆ సమయంలో, భగవాన్‌కు అత్యంత భక్తురాలైన ఆయన తల్లిగారు అరుణాచలంలో ఉండిపోయారు. డా.సుబ్రమణియన్ విదేశాలలో తన పని ముగించుకుని విదేశముల నుండి వచ్చిన తర్వాత, తల్లిని కలుసుకొనడానికి అరుణాచలము వచ్చారు. విద్యావంతుడు గనుక ఆయన మొదట ఆశ్రమము పుస్తక విక్రయశాలకు వెళ్ళి, కనబడిన పుస్తకాలన్నిటిని కొనుక్కున్నారు. హాలులోనికి ప్రవేశించిన తర్వాత, ఆయన ఆపుస్తకాలను భగవాన్ ముందుంచి సాష్టాంగ పడ్డారు. భగవాన్ ముందుకు వంగి ప్రతి ఒక్క పుస్తకాన్నీ అంటుకున్నారు. (తాకారు) ఆ పుస్తకాలను వెనుకకు తిరిగి ఇవ్వబోయే ముందు, వారి తల్లివైపు తిరిగి అడిగారు, “ఈయన మీ కుమారుడా?” అని. ఆ తర్వాత డా.సుబ్రమణియన్ వంక చూశారు. ఆ ఒక్క అనుగ్రహ వీక్షణంతోటే, అంతకు ముందు ఎటువంటి ఆధ్యాత్మిక ఆశయాలు లేని ఆ వైద్యుడు, పైగా విదేశాల నుండి అప్పుడే వచ్చినవాడు, “ఈయనేదేవుడు. ఈయనే సద్గురువు అని గుర్తించారు. త్వరలోనే ఆయన ప్రతివారమూ ఆశ్రమానికి రావటం ప్రారంభించారు.

ఆయన సన్యసించిన తర్వాత నేను ఆయనతో బాగా సన్నిహితంగా మెలిగే వాడిని. భగవాన్ యొక్క ఒక చూపే తనను చాలా మార్చివేసింది, అని ఆయన చెప్పారు. భగవాన్ ముందు తాను ఉంచిన పుస్తకములు ఆయన కెంతో విలువైనవి. ఎందుకంటే భగవాన్ వాటిని తాకినారు గనుక. ఆయన ఆ పుస్తకములను తన పూజగదిలో ఉంచి వాటిని పూజించేవారు. (పవిత్రంగా చూచుకునేవారు). ఆయన మరొక సెట్టు పుస్తకాలను కొనుక్కుని వాటిని చదువుకునేవారు. ఆత్మ విచారణ ప్రారంభించారు.

నేను సాధు బ్రహ్మణియంను అడిగాను, “మీరు భగవాన్‌ను ఎప్పుడైనా ప్రశ్నించారా?” అని. ఆయన నా వైపు చూచి నా వెన్నుతట్టి ఇలా అన్నారు, “గణేశన్, ఆ అవసరం కలుగలేదు, భగవాన్ యొక్క ఒక్క చూపే నన్ను ఆంతరంగిక ఆనందంలో నిలిపింది. నన్ను నేను ఆ స్థితిలో నిలిపి ఉంచుకొనడానికి భగవాన్ పుస్తకాలు ఉన్నవి. ఈ పుస్తకములు ఆ స్థితిలోనికి వెళ్ళటానికి అవసరమైన మేధాపరమైన పరిజ్ఞానాన్నంతా ఇస్తవి. (భగవాన్ యొక్క ఆ చూపు, ఈ పుస్తకాలు చాలు.) భగవాన్ ఆ స్థితిని నాకిప్పటికే ఇచ్చారు. భగవాన్ యొక్క ఆ చూపు, పుస్తకాలే చాలా ఎక్కువ నా మనసులో సందేహాలు లేవు. ఈ అనుభవం తర్వాత ప్రభుత్వం ఆయనను “డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ అండ్ పబ్లిక్ హెల్త్” గా చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ ఆరోగ్యశాఖలో అది అత్యంత ఉన్నతమైన ఉద్యోగం. (పదవి) దానినుద్దేశించి తరచుగా ఆయన నవ్వుతూ అంటూ ఉంటారు. “దిగులు చెందకు. భగవాన్ నీకు అత్యున్నతమైన ఆధ్యాత్మికస్థితిని ఇవ్వటమే కాకుండా, నీ మానసికమైన భౌతికపరమైన అవసరాలను గూడా కనిపెట్టి చూసుకుంటారు.”

ఆయన ఇలా అన్నారు, “భగవాన్ ఎంత చక్కగా నాకా పదవిని (ఉద్యోగాన్ని) ఇచ్చారు. ప్రభుత్వంతో ఆ పదవిలో ఉండబట్టే, భగవాన్‌కు అవసరమైన అన్ని పరికరములను నేను చెన్నైలోని అనేక ఆస్పత్రులనుండి తెప్పించగలిగాను. భగవాన్ చేతి మీద చిన్న కణితి, 1949లో ఆపరేషను చేసిన తర్వాత, తిరిగి తలఎత్తినపుడు, దొరైస్వామి అయ్యర్ నన్ను మద్రాసు నుండి ఒక స్పెషలిస్టును (ప్రత్యేకనిపుణుడు) తీసికొని రమ్మన్నారు. నేను వెంటనే పని ప్రారంభించాను. ఆరోగ్య శాఖా మంత్రి అయిన డా.రాజన్ నాకు మంచి స్నేహితుడు. ఆయన నాకు కావలసినంత స్వేచ్ఛ ఇచ్చారు. ప్రభుత్వము వారి నియమ నిబంధనలకు లోబడి నడుచుకుంటూనే, ఆరోజులలో కాన్సర్ జబ్బుకు ఉత్తమ మైనదని భావించబడే రేడియం ట్రీట్‌మెంట్ భగవాన్‌కు ఆశ్రమంలోనే అందించబడింది. గొప్ప నిపుణులైన సర్జన్‌లు (శస్త్రచికిత్స చేసేవారు) వచ్చారు.

నాకున్న ఒకే ఒక దైవము, సద్గురువుకు, ఈ విధమైన సేవలందించినందుకు నేను ధన్యుడినైనట్లుగా భావించాను. ఆయన 1950 ఏప్రిల్ 14లో మహాసమాధి చెందేవరకు, ఆ సేవలను అందించగలిగాను. ఆయన ఎల్లప్పుడు ఎంతో కరుణ చూపేవారు. నేను ఆయనను ప్రార్థించాను కనుక ఆయన నాకు సేవ చేసే భాగ్యాన్ని ప్రసాదించారు. ఆయన తన జీవితం తుది వరకు, నాకీ అవకాశాన్ని ఇచ్చారు. అటుపై భావోద్రేకంతో ఆయన మాట్లాడలేకపోయారు.

భగవాన్ శరీరాన్ని వదలి వేసిన తర్వాత, డా.సుబ్రమణియన్ కూడా ఉద్యోగ విరమణ చేశారు. ఆయన తన జీవితాన్ని ఆత్మ విచారణకు అంకితం చేశారు. ఆయన ఒక కుటీరాన్ని నిర్మించుకుని దానికి (రమణకుటీర్) అని పేరు పెట్టారు. నేను మొదటి సారి కుటీరము లోనికి ప్రవేశించినపుడు, ఆయన, "గణేశన్! రండి, " అన్నారు. ఆయన నన్ను పూజా గదిలోనికి తీసుకుని వెళ్ళి నమస్కరించమన్నారు, దేనికి నమస్కరించాలంటే రమణ మహర్షి తాకి ఇచ్చిన పుస్తకాలకు. భగవాన్ శరీరాన్ని వదలి వేయటానికి రెండు రోజులు ముందు, ఈ డాక్టర్లందరూ మురుగనార్‌ను ముందుంచుకుని, భగవాన్ వద్దకు వెళ్ళారు. వైద్యుల తరపున మురుగనార్ మాట్లాడారు. భగవాన్ వారిని భౌతికంగా వదలి వెళ్ళిన తర్వాత వారు ఎలా జీవనం కొనసాగించాలి. అనేది కనుక్కోవాలనుకున్నారు. ఇన్ని మాటలు ఆయన ముందు మాట్లాడలేక, మాపై మీ ఆశీస్సులను కురిపించండి అన్నారు. "వాళ్ళ ఉద్దేశమేమిటో సద్గురువు ఎరుగరా? ఆయన ఒక్కటే చెప్పారు, "బోధను ఆచరణలో పెట్టండి," అని.

కావున మనమందరం దేనిగురించి వేచి ఉన్నాము? భగవాన్ తన పరిచారకులను తీసికొని వెళ్ళినట్లుగానే మనలను గూడా, శిఖరాగ్రానికి తీసికుని వెళ్తారు. ఎందుకంటే అందరూ ఆయన రక్షణలోని వారమే. దేవునికి పక్షపాతము లేదు. సద్గురువుకు కూడా లేదు. భగవాన్ తనకు వైద్య సేవలందించిన వైద్యుల పట్ల అనుగ్రహంతో ఉన్నారు. భగవాన్ తన చేతిని అందరి కొరకు జాపుతారు, మనం ఎంత తక్కువ ఎత్తులో ఉన్నా సరే. మనలను శిఖరాగ్రానికి తీసికుని వెళ్తారు, తద్వారా ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఇవ్వటం కోసము. మన భగవాన్ చాచిన హస్తాన్ని అందుకోవటానికి మనము తయారుగా ఉన్నామా?



యోగి రామయ్య



పాల్ బ్రంటన్, యోగి రామయ్య గురించి నాటకీయంగా తన పుస్తకం 'గుప్త భారతదేశంలో నా అన్వేషణ'లో వ్రాసిన పరిచయం ప్రపంచం మొత్తం మీద గల భగవాన్ భక్తులలో ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అది 1980 దశకంలో జరిగింది. పాల్ బ్రంటన్ తన కుటీరంలోకి ప్రవేశిస్తుండగా, ఆయనకు తీవ్రంగా భయం కలిగేటట్లు ఒక త్రాచుపాము, పడగ ఎత్తి లోపల ఉన్నది. అలా భయంతో నిస్సహాయంగా స్థాణువై ఆయన నుంచుని ఉండగా, ఒక చక్కటి శరీర దారుఢ్యం కలిగి, చెక్కిన బుద్ధుని ప్రతిమ వలె ఉన్న వ్యక్తి వచ్చి, ఒక్క చూపు తోనే పరిస్థితిని అర్ధం చేసుకున్నారు. త్రాచుపామును శాంతింప జెయ్యడానికి, రెండు చేతులను పైకెత్తి ఆయన కుటీరంలోనికి ప్రవేశించారు. దానికి సమాధానంగా, ఆ సర్పము ఎత్తిన తన పడగను ఆయన పాదాల వద్ద కిందకు దించింది. ఆయన నిశ్శబ్దంగా క్రిందకు వంగి, ఆ పాము బయటకు వెళ్తుండగా దాని తోకను నెమ్మదిగా నిమిరారు. పాల్ బ్రంటన్ ఆశ్చర్యంతో, మీకు భయం వెయ్యటం లేదా?" అని అడిగారు. ఆయన బదులిచ్చారు, "నేను దేనిని గురించి భయపడాలి?" నేను ఏ విధమైన ద్వేషము లేకుండా, అన్ని జీవుల పట్ల నా హృదయంలో ప్రేమ కలిగి దానిని సమీపించాను. ఆయన పనులతోనూ, మాటలతోనూ మిక్కిలి సంతోషించి, ఆయన పేరు అడిగారు బ్రంటన్, "యోగి రామయ్య" అని ఆయన బదులిచ్చారు.

యోగి రామయ్య తల్లితండ్రులు భక్తులు. వారు చాలా సంపన్నులు, ఫలితంగా ఆయన చదువు మీద కంటే, జీవితంలో మంచి విషయాలను ఆనందించడంలో ఆసక్తి కలిగి ఉండేవారు. దైవలీల ఎలా పనిచేస్తుందో చూడండి. పదునెనిమిది సంవత్సరాల వయసులో ఆయన మహాత్ముడైన కబీర్‌ను గురించి, ఒక పుస్తకం చదవటం సంభవించింది. ఆ పుస్తకాన్ని చదవగానే, ప్రాపంచిక విషయాల అశాశ్వతత్వం, ఆయన ముఖాన బాంబు వలె పేలింది. ఆయన అప్పటి వరకూ ప్రపంచాన్ని సత్యమని భావిస్తున్నారు. కానీ కబీరు జీవితము, బోధలు గురించి చదివిన తర్వాత ఆయన మారిపోయారు. సత్యమును తెలుసుకోవాలనే తీవ్రమైన ఆర్తితో, ఆయన గురువు కొరకు వెదుకసాగారు. ఒకరోజు ఆయన ఒక గురువును కలిశారు. ఆయన రోజుకు 5వేలసార్లు రామనామము జపించమని చెప్పారు. సత్యము కొరకై ఎంతో ఆర్తితో ఉన్న ఆ యువకుడు, "నేను ఇంకా ఎక్కువసార్లు చేస్తేనో?" అన్నారు. గురువు, "ఇంకా ఎక్కువ లాభము పొందుతావు," అన్నారు. వదిలి పెట్టకుండ రామయ్య, నేను నిరంతరం చేస్తుంటే ఏమౌతుంది?" అన్నారు. ఆ కుర్ర వాని ప్రశ్నతో మిక్కిలి సంతోషించి, సమాధానము చెప్పకుండా, గురువు ఆయనను కౌగలించుకుని 'రామ మంత్రాన్ని' ఉపదేశించారు. ఆ క్షణం నుండీ, ఏ పనిని చేస్తున్నా, ఆపకుండా రామనామాన్ని జపిస్తూనే ఉండేవారు, అదే సమయంలో వేరొక గురువు, హఠయోగ ప్రాణాయామానికి చెందిన కొన్ని శ్వాసించే మెళకువలను ఆయనకు నేర్పారు. ఈ రెండింటిని తీవ్రంగా అభ్యాసం చెయ్యటంతో, ఆయనకు ఈ జగత్తు అనిత్యం అనే విశ్వాసం మరింత బలపడింది.

ఆయన అప్పుడు కాశీకి వెళ్ళి తన మిగిలిన జీవితమంతా అక్కడ గడిపివేయాలనుకున్నారు. దైవం ఎలా జోక్యం చేసుకుంటుందో చూడండి. వెళ్ళే దారిలో, ఆయన తనకు మంత్రోప దేశముచేసిన గురువును కలుసుకొనుట తటస్థించింది. ఆయనకు తాను కాశీకి వెళ్తున్నట్లు రామయ్య చెప్పారు. అందులకు గురువు, "మీ గ్రామానికి తిరిగి వెళ్ళి, మీ తోటలో, నిరంతరాయంగా మీ సాధనను కొనసాగించండి, ఏమీ తటపటాయించకుండా, రామయ్య గురువు మాటకు తలవొగ్గి, సాధన చేసుకొనటానికి, ఇంటికి వెళ్ళారు. కొంతకాలమునకు ఆయనకు 'రామ' దర్శనమైంది. ఆ సాధనే మరింత తీవ్రంగా కొనసాగించుటతో బాహ్యమైన రాముడు మాయమైపోయి, తనలోని ఆత్మగా దైవాన్ని అనుభవించసాగారు. సందేహంతో వెళ్ళి పండితులను అడిగారు, "కర్త, కర్మ ఒకటేనా? తెలుసుకునేవాడు, తెలియబడేది ఒకటేనా? అవి బేధములేకుండా ఒక్కటిగా ఉండగలవా?" అని. కర్త వేరు కర్మ వేరు, అని వారుచెప్పేది ఆయనకు తృప్తి నివ్వలేదు. అందుకని తన సందేహాన్ని తీర్చగలిగేవారి కోసం అన్వేషించసాగారు. ఈ వెదికే ప్రయత్నంలో ఒకసారి 1930 దశకంలో, తిరువణ్ణామలై లోని రమణాశ్రమంలోని పాత హాలుకు వెళ్ళారు. తన సందేహంతో వేసారిన ఆయన, "చేసేవాడు, చేయబడేది (కర్త,కర్మ) ఒకటేనా?" అని అడిగారు.

అప్పుడుహాలులోనే ఉన్న కావ్యకంఠ గణపతిముని, "నిశ్చయంగా కాదు. కర్త, కర్మ కంటే వేరు" అని చెప్పారు. దానితో వ్యధనొంది భగవాన్ వైపు చూశారు రామయ్య. భగవాన్ వివరించారు, "సామాన్యుడికి భౌతిక ప్రపంచంలో, కర్త వేరు, కర్మవేరు, కానీ సమాధి అనుభవంలో అవి రెండూ కలిసిపోయి ఏకమౌతాయి."

ఈ జవాబు రామయ్య సందేహాన్ని నివృత్తి చేసింది. ఆయన వెంటనే భగవాన్‌ను సద్గురువుగా భావించుకుని, తిరువణ్ణామలైలోనే ఉండిపోవటానికి నిశ్చయించుకున్నారు, భగవాన్ ఆయన పట్ల ఎంతో శ్రద్ధ చూపేవారు. ఎందుకంటే, రామయ్య నిజమైన యోగి లాగానే జీవించేవారు. ఉదయం పది గంటలకు ఆయన భోజనం చేసేవారు. ఆయన ఒక్క పూటే భోం చేసేవారు. తన భోజనం తానే వండుకునేవారు. అది చాలా తక్కువ మోతాదులో ఆకు కూరను వండుకుని తినేవారు. పల్లాకొత్తులోని రాతి గుహలో సాధన చేసుకుంటూనో, భగవాన్ ముందు గంటల తరబడి కూర్చుంటూనో ఉండేవారు. భగవాన్‌తోటి ఎప్పుడైనా, ఎక్కడైనా ఉండటానికి అనుమతి ఉన్నది ఆయన కొక్కరికే. భగవాన్ సూటి బోధ అయిన ఆత్మ విచారణను ఆయన ఇష్టపడేవారు. భగవాన్ ఆయనను ప్రేమగా చూసేవారు. రామయ్యకు కేవలం తన మాతృభాష అయిన తెలుగు మాత్రమే వచ్చినందున, భగవాన్ తనంతట తానే, ఉపదేశసారము, ఉళ్ళదునార్పదులను తెలుగులోనికి అనువదించారు. ఆయనకు ఆత్మ విచారణకు సహాయకారిగా ఉండుట కోసము.

రమణ మహర్షితో ఆయన చేసిన చక్కటి సంభాషణలు కొన్ని, 'టాక్స్ విత్ రమణ మహర్షి' (రమణ మహర్షితో సంభాషణలు) లో అచ్చువెయ్యబడినవి.

యోగి రామయ్య : సాధకుడు సాక్షాత్కారము కొరకు గురువు వద్దకు వెళ్తారు. గురువు బ్రహ్మమునకు ఏ గుణములు ఉండవు. మాలిన్యములు ఉండవు అంటారు. ఆయన ఒక వ్యక్తిగా మాట్లాడినట్లుగాదా? గురువు అలా మాట్లాడకపోతే, శిష్యుని అజ్ఞాన మెలా తుడిచి పెట్టబడుతుంది? గురువు వ్యక్తిగా మాట్లాడే మాటలు సత్యానికి దారితీస్తాయా?

భగవాన్ : గురువు ఎవరితో మాట్లాడాలి? ఎవరికి బోధించాలి? ఆయనకు ఆత్మ కంటె భిన్నంగా ఏమైనా కన్పిస్తుందా?

యోగి రామయ్య : కానీ శిష్యుడు వివరణ కోరుతున్నాడు.

భగవాన్ : నిజమే, కానీ గురువు అతనిని వేరుగా చూస్తారా? అందరూ సాక్షాత్కారము పొందినవారని తెలియక పోవుట లోనే శిష్యుని అజ్ఞానము ఉన్నది. ఎవరైనా ఆత్మ కంటే వేరుగా ఉండ గలరా? గురువు, అజ్ఞానము అక్కడ ఉందని చూపిస్తారు. అంతేగాని వ్యక్తిగా విడిగా ఉండరు. 'సాక్షాత్కారమంటే ఏమిటి? దేవుడు నాలుగు చేతులు, శంఖు చక్రాలు వగైరాలతో కన్పించడమా? ఒకవేళ దేవుడు అలా కన్పించినా గానీ, శిష్యుని అజ్ఞానం ఎలా తుడిచి పెట్టబడుతుంది? సత్యమనేది శాశ్వత సాక్షాత్కారము. ప్రత్యక్షంగా గ్రహింపబడేవాడు, దేవుడు అంటే పైన చెప్పిన విధంగా కన్పిస్తాడు అని అర్థం కాదు. సాక్షాత్కారమనేది శాశ్వతమైనది కాకపోతే, అది ఏమీ ప్రయోజనకారి కాదు. నాలుగు చేతులతో కనబడేది. శాశ్వత సాక్షాత్కారము అవుతుందా? అది భౌతిక మైనది, భ్రమవంటిది. అక్కడ చూచేవాడుండాలి. చూచేవాడు మాత్రమే సత్యము. శాశ్వతము.

భగవాన్ కొనసాగించారు. దేవుడు కోటి సూర్యుల కాంతితో కనబడుగాక, అది ప్రత్యక్ష అనుభూతి (గ్రహించడము) అవుతుందా? దానిని చూచుటకు, కళ్ళు, మనసు వగైరాలు అవసరము. అది పరోక్ష జ్ఞానము. చూచువాడు (ద్రష్ట) ఒకడే ప్రత్యక్ష అనుభవము. చూచువాడొకడే ప్రత్యక్ష అనుభూతి. మిగిలిన అనుభూతులు (గ్రహించుట) అన్నీకూడా పరోక్షమే. ప్రస్తుతము శరీరమే నేను అనే భావముఎంతగా పాతుకుపోయిందంటే, కళ్ళ ముందు కనబడేదే ప్రత్యక్షము, చూసేవాడు కాదు అనుకునేటంత. (నేను సాక్షాత్కారము పొందలేదనిగానీ, నేను ఆత్మ నుండి వేరుగా ఉన్నాననిగానీ ఎవరైనా అనగలరా?) లేదు. స్పష్టముగా అందరూ సాక్షాత్కారము పొందిన వారే. అసాధారణమైన శక్తులను ప్రయోగించాలనే (ఉపయోగించాలనే) కోరికే అతనికి దుఃఖాన్ని కల్గిస్తుంది. తనకు అవి లభ్యం కావని మానవునికి తెలుసు. అందుకే తనకు దేవుడు ప్రత్యక్షమై ఆయన శక్తులన్నిటినీ తనకు యిచ్చి (భక్తునకిచ్చి), ఆయన చాటున ఉండాలని కోరుకుంటాడు. క్లుప్తంగా చెప్పాలంటే దేవుడు తన శక్తులన్నిటిని మానవునికి ఇచ్చివేయాలని.

యోగి రామయ్య : భగవాన్ వంటి మహనీయులు అంత తేలికగా మాట్లాడటము బాగానే ఉంటుంది. ఎందుకంటే సత్యము మీనుండి వైదొలగదు. (ప్రక్కకు తప్పుకోదు) అందుకని ఇతరులకు కూడా అది తేలికే అనుకుంటారు. కానీ, సామాన్యులకు నిజమైన కష్టమున్నది.

భగవాన్ : అయితే ఎవరైనా తాను ఆత్మను కాదు అంటారా?

యోగి రామయ్య : భగవాన్ చేసిన విధంగా, విషయాలను సూటిగా ఉంచే ధైర్యమెవరికీ ఉండదు.

భగవాన్ : ఉన్నదున్నట్లు చెప్పటానికి ధైర్యముతో అవసరమేమిటి?

ఒకప్పుడు, నేను యోగిరామయ్యను అడిగాను, "భగవాన్ సన్నిధిలో మీకెలా అన్పించేదో దయచేసి చెప్పగలరా? ఆయన అన్నారు, "భగవాన్ సన్నిధిలో కూర్చొనటం వలన మనశ్శాంతి తేలికగా, ప్రయత్నరహితంగా వస్తుంది. నేను మూడు, నాలుగు గంటలు సమాధి స్థితిలో ఉండేవాడిని. అప్పుడప్పుడు, నా మనస్సు ఒక రూపాన్ని ధరించి లోపల నుండి బయటకు రావడం తెలిసేది. కానీ, అదే పనిగా సాధన చేస్తూ దానిని హృదయం లోనికి తిరిగి వెళ్ళి అందులో కలిసి పోయేటట్లు చేసేవాడిని, మనసు, హృదయంతో కలిసిపోతే, ఆత్మ సాక్షాత్కారము జరుగుతుంది. ఫలితము శాంతియే.

భగవాన్ మరణానంతరము, యోగి రామయ్య, తన గ్రామంలోనే, ఎక్కువ సమయము తపస్సు, యోగ, మౌనములతో గడిపేవారు. ఆయన సన్నిధిలో ప్రశాంతత లభిస్తుందని ఎంతో మంది ఆయన సన్నిధిలో కాలం గడిపేవారు. అక్కడే అంటిపెట్టుకుని ఉండిపోయిన వారికి ఆత్మవిచారణ బోధింపబడేది. వారిని భగవాన్ మార్గాన్ని అనుసరించమని చెప్పేవారు. ఆయన చివరి రోజులు చాలా ప్రశాంతంగా గడచి పోయినవి. ఆయన చివరి క్షణం వరకూ పూర్తి స్పృహతో ఉన్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్నవారు, అప్పుడాయన ముఖము యోగ ప్రకాశంతో నిండిపోయింది, అని చెప్పారు. ఆయన పెదవులు, భగవాన్ రమణ నామాన్ని తుది వరకూ ఉచ్ఛరిస్తూనే ఉన్నవి. ఆయన దేహాన్ని సమాధి చేసిన చోట, ఒక సమాధి మందిరం నిర్మించబడింది. అప్పటినుండి ఆ మందిరము, ఒక పూజాస్థలముగా మారింది.



శ్రీ భగవాన్ - యోగి రామయ్య

డాక్టర్ యమ్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్

ఆధ్యాత్మికత లోనికి లోతుగా దిగి అన్వేషించాలంటే, మేధోపరమైన విశ్వాసము మాత్రమే చాలదు. ఈ ప్రయాణంలో ఎంతో ప్రయత్నము అవసరము. ఎందుకంటే (హృదయం)లోనికి వెళ్ళే వరకు, నీ గమ్యాన్ని చేరుకొనటానికి దాదాపుగా ఆగుట అనేది లేకుండా ప్రయాణము చెయ్యవలసినదే. కానీ ఒక్కసారి నీవులోనికి తిరిగితే, నువ్వు ప్రయాణించవు ఎందుకంటే, సత్యమనేది నీలోనే ఆత్మరూపంలో ఉన్నది. ఎప్పుడూ అది అచటనే యున్నది. ఇప్పుడు కూడా ఉన్నది. అక్కడ కాలము, దూరము, కారణత్వముల ఏవిధమైన కదలిక అవసరములేదు. మనమందరము, వేరు వేరు మతములకు చెందియున్న మానవులము. అదే కారణత్వానికి బీజము. అన్నిరకాల గుర్తింపులు అనేవాని పట్టునుండి (నేను ఫలానా, దేశం, కాలం, హోదా, కులం,మతం, ఎక్కువ, తక్కువ వగైరా) నిన్ను నువ్వు విడిపించుకొనగలిగితే, గాఢనిద్రలో వలె (వాటి యొక్క ఆలోచనలేవీ నీలో లేకుండా ఉంటే) నిశ్శబ్దత, ప్రశాంతత, నిశ్చలత వికసించును. ఎక్కడైతే కాలము, దూరము కారణత్వము, దేశము, వగైరాలు ఉండవో, అటువంటి స్థితిలో ఉండాలంటే, లోనికి మునిగి అన్వేషించుట అత్యావశ్యకము.

సాధువులవలె జీవనంగడిపిన, భగవాన్ భక్తులైన, బి.వి.నరసింహస్వామి, మురుగనార్, సాధు నటనానంద, కుంజుస్వామి, విశ్వనాధస్వామి, గొప్ప పండితులైన కావ్య కంఠ గణపతిముని, డా. మీస్, గ్రాంట్ డఫ్, డంకన్ గ్రీన్‌లీస్, బానింగ్ రిచర్డ్‌సన్, మునగాల ఎస్.వెంకట్రామయ్య, ఆర్థర్ ఆస్‌బోర్న్, మారిస్ ఫ్రిడ్‌మన్, ఎస్.ఎస్.కోహెన్, యింకా ఇతరుల గురించి అనేక గ్రంధములు వ్రాయబడినవి. కానీ సాధారణ గృహస్థుగా ఉండి, పూర్తిగా గృహనిర్వహణ బాధ్యతలతో మునిగిపోయి, ఉన్న భక్తుల వివరాలు వెలుగులోనికి రాకపోవటం వింత అయినా నిజం. బహుశ యిలా ఎందుకు జరిగి ఉండవచ్చునంటే, హిందూ సంప్రదాయ దృక్పథం వలన. ఆ దృక్పథం, ఆధ్యాత్మికతను, కఠినమైన నియమాలను పాటించుట, పరిత్యాగము (అన్నిటిని విడిచిపెట్టుట), జ్ఞానము, వగైరాలతో ముడి పెట్టినట్లు ప్రజలు భావించుట వల్ల. ఇలా మానవులను వేరుగా చూస్తే (వేర్పాటుగా చూస్తే,) నిజమైన ఆధ్యాత్మికతను సరిగా అవగహన చేసుకొనటం జరుగదు, అని నా వ్యక్తి గత అభిప్రాయం. అందుకని 1960లో నేను రమణాశ్రమానికి రావటానికి ముందు నుండే, సర్వము త్యజించినవారి పట్ల, వారి వారి కుటుంబాలకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చుకునే వారిపట్ల నేను ఒకే విధమైన శ్రద్ధ చూపేవాడిని. ఈ ప్రక్రియలో, అశ్రద్ద చేయబడ్డ ప్రాముఖ్యత ఇవ్వబడని కొందరు భక్తులతో నేను అనుబంధం పెంచుకున్నాను. కొద్దిమంది యిలా మిగిలిన వారిచే లక్ష్యపెట్ట కుండా వదలి వేయబడిన భక్తులతో నేను అనుబంధం పెంచుకున్నాను. నాకు వారితో సాన్నిహిత్యము పెరిగే కొలదీ, భగవాన్ తోటి వారికి గల బలవత్తరమైన అనుబంధం చూసీ, సద్గురువు పట్ల వాళ్ళ సంపూర్ణ శరణాగత భావము చూసీ, భగవాన్ వారిపట్ల చూపించిన అసాధారణమైన శ్రద్ధనూ, అనుగ్రహమునూ చూచి నేను మిక్కిలి ఆనందాన్ని పొందాను. వాళ్ళు వాళ్ళ కుటుంబాలను అంటి పెట్టుకుని ఉన్నమాట నిజమేకాని, వారు జ్ఞానులు అనేవిషయంలో నాకు ఏ సందేహమూ లేదు. రమణ సన్నిధిలో నిత్యమూ ఉంటే సందేహానికి తావుంటుందా? ఇమాన్యుయల్ కౌంట్ అన్నారు, "మీరు ఆకుపచ్చరంగు కళ్ళద్దాలను ధరిస్తే మీకు అంతటా, ఆకుపచ్చరంగు మాత్రమే కన్పిస్తుంది." మీరు అజ్ఞానంతో ఉంటే మీకు అన్నిచోట్లా అజ్ఞానమే దర్శనమిస్తుంది. మీరు కూడా, భగవాన్, బుద్ధుడు, జీసస్ మాత్రమే జ్ఞానులు అనుకుంటారు.

డాక్టర్, ఎమ్.ఆర్. కృష్ణమూర్తి అయ్యర్, పాత తరం భక్తులకు, ఆశ్రమడాక్టర్‌గా బాగా తెలుసును. ఆయన తన మందులను చిన్న చెక్కపెట్టెలో పెట్టి, ఆశ్రమములోని పాత భోజనశాల ద్వారము ప్రక్కనున్న అలమరలో పెట్టి తాళమువేసేవారు. ఈనాటి ఆశ్రమ ఆస్పత్రికి ఆనాడే ఆయన బీజం వేశారు. తంజావురులోని 'మొండి' అనే ఊరులోని ఒక పేరుమోసిన కుటుంబం నుండి వచ్చిన ఎమ్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్, చాలా మంచి ప్రసూతి వైద్యులు. (గైనకాలజిస్ట్) వృత్తిపరంగా మంచి ప్రఖ్యాతి గడించిన ఆయన పుర ప్రముఖులలో ఒకరు. ఆయనకు ఆధ్యాత్మికత పట్ల తీవ్ర జిజ్ఞాస ఉన్నప్పటికీ, తేలికగా ఉద్రేకపడే స్వభావాన్ని ఆయన అదుపులో ఉంచుకోలేక పోయేవారు. 1927లో ఆయన భగవాన్‌ను కలసిన

తర్వాతనే, ఆయనలోని ఈ భావోద్రేక సంక్షోభము సమసి అణగిపోయింది. మొదటిసారిగా, తన ఆధ్యాత్మిక సాధనలో ఉపశమనాన్నీ, శాంతినీ పొందారు. (పక్వానికి వచ్చిన సాధకులు భగవాన్ వద్దకు వస్తారు అనే విషయం నాకు ఉత్సాహాన్నిస్తుంది. వారికి సరైన స్విచ్ తిప్పితే చాలు. బుద్ధుడు చెప్పినట్లుగా, "మిమ్మలను సత్యము యొక్క వాకిలి ముందు నిలిపాను. యిప్పుడు, మీరు లోపలకు వెళ్ళవలసి యున్నది". భగవాన్, వారి నిజమైన ఆధ్యాత్మిక సాధనలోనికి ఒక తోపు తోసేవారు. అందువల్ల పూర్తిగా స్వతంత్రులుగా ఉన్న రమణులకు, పాత భక్తులలో ఎక్కువ మంది ఆధ్యాత్మిక బానిసలు వలె ఉండేవారు. తాను స్వతంత్రులుగా ఉన్న భగవాన్ మిగిలిన వారికి స్వాతంత్ర్యం పొందడానికి తోడ్పడేవారు, వారు ఆధ్యాత్మిక బానిసలము అనే భావనతో ఉన్నపుడు, సంపూర్ణ శరణాగతి చెందినపుడు.)

తన తీవ్రమైన భావోద్రేక సంక్షోభాల నుండి (తరచుగ కోపోద్రిక్తత చెందే స్థితి నుండి) బయటపడ్డ కృష్ణమూర్తి అయ్యర్ భగవాన్ వద్దకు తరచుగా రావడం ప్రారంభించారు. భగవాన్ తోటి ఆయన సహచర్యం, భగవాన్‌ను తన సద్గురువు గాను, మానవ రూపం ధరించిన సత్యంగాను, దర్శించడానికి తోడ్పడింది. 1933లో ఆయన తిరువణ్ణామలైలో స్థిరపడడానికి వచ్చేశారు. గృహస్థు కనుక టౌన్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. "ఆరోజులలో ప్రతిరోజూ, ఒక ఆధ్యాత్మిక ప్రత్యేకత గల దినమే నాకు. అంటే ఇరువది నాలుగు గంటలూ తిరువణ్ణామలై వంటి పుణ్యక్షేత్రంలో గడపటం కాదు. ప్రతి క్షణము నాకొక ఆధ్యాత్మిక అనుభవమే. మౌన సూర్యుడైన భగవాన్, ధృవనక్షత్రమువలె, నా జీవితంలోని ప్రతిక్షణమూ "నాకు దారి చూపుతుండేవారు" అన్నారు కృష్ణమూర్తి ఆయన ఇంకా ఇలా చెప్పారు, "నేను ఎప్పుడూ విసుగు చెందలేదు. నా జీవితంలోని ప్రతి క్షణమూ నాకు భగవాన్ రమణులనబడే దైవము ఇచ్చిన కానుకగానే తీసుకున్నాను."ఈ ఆధ్యాత్మికతను ప్రక్కకు పెడితే,ఆయన తిరువణ్ణామలై లోనూ, చుట్టూ పట్ల గ్రామాలలోనూ బాగా పేరు మోసిన డాక్టరు, ఆయన రోజంతా పనిచేస్తూ తీరిక లేకుండా ఉండేవారు. కానీ ప్రతి ఆదివారమూ మధ్యాహ్నం రెండుగంటలకు, తన 'సద్గురువు పాదాల వద్ద ధ్యానం చేసుకొనటానికి వచ్చేవారు. అందుకని ఆశ్రమంలో ఉండేవారు చాలా మంది ఆయనను 'ఆదివారము వైద్యుడు' అని పిలవటం మొదలు పెట్టారు. భగవాన్ ఆయనను చూడగానే సంతోషించేవారు. 'ఓ ఇవాళ ఆదివారమా'. అనేవారు.

జీసస్ లాగానే భగవాన్ కూడా ఒక గొఱ్ఱెల కాపరి వలె తన భక్తులందరినీ సంరక్షించుకునేవారు. ఆయన కృష్ణమూర్తి అయ్యర్‌కు మాత్రమే కాదు ఆయన భార్య సుబ్బులక్ష్మి అమ్మాళ్‌కూ, ఆయన కుటుంబ సభ్యులందరికీ, ఉపశమనాన్నీ, సుఖాన్నీ యిచ్చేవారు. దాని ఫలితంగా సుబ్బులక్ష్మి అమ్మాళ్, ఆమె పిల్లలు, భగవాన్‌కు పూర్తిగా అంకితమైనారు. భగవాన్‌ను కలుసుకొనుటకు ముందు, ఆ కుటుంబము ఒక చిన్న పల్లెలో ఉండేది. అప్పటికే భగవాన్‌కు అంకితమైన కృష్ణమూర్తి అరుణాచలమునకు వెళ్ళిపోతుండేవారు, తన భార్యా, బిడ్డలను ఒంటరిగా, ఆ పల్లెలో వదలిపెట్టి, ఆ సమయంలో తన భర్త ప్రపంచాన్ని త్యజించి సన్యసిస్తారేమోననే భయంతో, సుబ్బులక్ష్మి అమ్మాళ్ ఎప్పుడూ దిగులుతో ఉండేవారు. ఒకరోజు ఈ భయము ఎంత గట్టిగా పట్టుకుందంటే, ఆమె రాత్రి పడుకోగానే ఏడ్చేసింది. భగవాన్ ఆమె కలలో కనబడి సుబ్బులక్ష్మీ, భయము చెందకు. నేను కృష్ణమూర్తి బాగోగులు చూచుకుంటున్నాను. అతనిని తన పద్ధతిలో సాధన చేసుకొన నివ్వు. నేను మిమ్మలను కాపాడుతున్నాను. నీ దిగుళ్ళన్నీ (చింతలన్నిటినీ) విడిచిపెట్టు," అలా చెప్పిన తర్వాత తన చెయ్యి ఎత్తి దీవించారు భగవాన్. ఆ దంపతులు మర్నాడు భగవాన్ వద్దకు వెళ్ళి ఈ కల గురించి వివరించారు. భగవాన్ ఆమోదించినట్లుగా నవ్వారు. ఆ రోజు రాత్రి నుండీ భయాలన్నిటినీ వదలి, సుబ్బులక్ష్మి అమ్మాళ్ పూర్తిగా భగవాన్‌కు అంకితమై సందేహము, భయము లేకుండా, ఆనందకరమైన గృహస్థ జీవనం గడిపారు.

తిరువణ్ణామలైకి వచ్చేసిన తర్వాత, ఆ కుటుంబం టౌన్‌లో, ఉండసాగింది. సుబ్బులక్ష్మి అమ్మాళ్ తన బిడ్డలను చదివించుకోవటంలో తీరిక లేకుండా ఉండేది. ఆమెకు ఆధ్యాత్మిక సాధనకు టైముండేదికాదు. ఆ కుటుంబం మొత్తం భగవాన్‌ను దేవుడిగానే భావించారు.అయినా ఆమెకు సాధనకు తీరిక దొరికేదికాదు. భగవాన్ ఎప్పుడూ నిర్బంధ పెట్టేవారుకాదు. సుబ్బులక్ష్మి అమ్మాళ్ లాగా తన వద్దకురాలేని వారికి, వారి వద్దకే భగవాన్ ఏదో ఒక రూపంలో వెళ్ళేవారు . ఒకరోజు టౌన్‌లో పెద్ద ఊరేగింపు జరిగింది. శేషాద్రి స్వామిది పెద్ద ఫోటో మేళతాళాల తో టౌనంతా ఊరేగింపబడింది. సుబ్బులక్ష్మి ఆ ఫోటో వంక చూచి, "నాకు గనుక ఇంటి వద్ద అటువంటి పెద్ద ఫోటో భగవాన్‌ది ఉంటే, నేను ఆయన దగ్గరకు రోజూ వెళ్ళలేను గనుక పూలదండలు వేసి పూజిస్తాను"అనుకున్నారు. ఆ ఆలోచనలతో, ఆమెలోనికి వెళ్ళి తలుపు గడివేసుకున్నారు.

వెంటనే ఎవరో తలుపు తట్టారు. ఎవరో అంతే సైజు భగవాన్ ఫోటోతో, వాకిట్లో నుంచుని ఉన్నాడు. అతడు అన్నారు, "నేను పోలూరు నుండి వస్తున్నాను. ఈ ఫోటో మీ యింటి వద్ద యివ్వమని చెప్పారు. నేను ఆశ్రమానికి వెళ్తున్నాను. భగవాన్ దర్శనం చేసుకున్న తర్వాత తిరిగి వస్తాను". సుబ్బులక్ష్మి సంతోషానికి అవధిలేకుండా పోయింది.

ఆమె ఆ ఫోటోను చూచింది. గౌరవంతో ఇంట్లోకి తీసుకుని వెళ్ళింది. పూలదండ వేసింది. పూజ చేసింది. పిల్లలు బడినుండి రాగానే వారూ ఆనందించారు. "ఓ, భగవాన్ మన ఇంటికి వచ్చారు, అంటూ". వాళ్ళ తండ్రి ఇంటికి వస్తుండటము చూడగానే, వాళ్ళు వీధిలోని కి పరుగెత్తి, "నాన్నా! భగవాన్ మన ఇంటికి వచ్చారు," అన్నారు. కృష్ణమూర్తి గూడా ఎంతో ఆనందించి, "అది ఎలా వచ్చిందా?" అని ఆశ్చర్యపోయారు. సుబ్బులక్ష్మి అమ్మాళ్, "మీరే అతనిని పంపారనుకున్నాను", అన్నారు. కృష్ణమూర్తి సమాధాన మిచ్చేలోపులే, ఆ ఫోటో ఇచ్చిన అతను వచ్చారు. అతడు అన్నారు, "నేనొక ఎలక్ట్రీషియన్‌ను (కరెంటు పని చేసేవాడిని) ఒక రోజు మేజర్‌చాడ్విక్ తన గదిలో ఏదోకరెంటు పనులు చెయ్యటానికి నన్ను పిలిచారు. నేను ఈ ఫోటోను అక్కడ చూచాను. పని అయిపోయిన తర్వాత ఆయన డబ్బిచ్చారు. నేను ఆయనను డబ్బుకు బదులుగా ఈ ఫోటో యిమ్మన్నాను. ఆయన అలా చెయ్యగానే నేను సంతోషించి, ఈ ఫోటోను పోలూరు తీసుకుని వెళ్ళాను. ప్రతిరోజూ ఈ ఫోటోకు ఎంతో గౌరవంతోపూజ చేస్తున్నాను. ఒకరోజు నన్నేదో ఆవేశించింది.

అప్పుడు నేను, "నేను తిరువణ్ణామలై వెళ్ళి, అవరంగట్టు వీధిలో ఉన్న డా.ఎమ్.ఆర్. కృష్ణమూర్తి అయ్యర్ ఇంట్లో ఈ ఫోటో ఇవ్వాలి," అన్నాను. "అందుకే ఈ ఫోటోను ఇక్కడ వదలి వెళ్తున్నాను." అన్నారు. ఆ కుటుంబం మొత్తం ఆ విషయాన్ని భగవాన్‌కు చెప్పగా, ఆయన ఎంతో ఆసక్తితోనూ, ఆశ్చర్యంతోనూ, దానిని విన్నారు, తనకు దానితో ఏమీ సంబంధంలేనట్లు.

డా.కృష్ణమూర్తి, భగవాన్‌కు, (బేషరతుగా) ఏ విధమైన షరతులు లేని సంపూర్ణ శరణాగతి చెందారు. ఆయన తన దృష్టిని ఇంకా ఎక్కువగా సాధనపై కేంద్రీకరించారు. అందువలన ఆయన తన వైద్య వృత్తికి ఎక్కువ సమయం కేటాయించలేకపోయారు. డబ్బు సంపాదించలేకపోయారు. అప్పుడు ఆరోగ్య మంత్రిగా ఉన్న డా.ఎస్.ఎస్.రాజన్, అనే ఆయన కృష్ణమూర్తికి సహాధ్యాయి (క్లాస్‌మేట్), మంచి స్నేహితుడు. ఒక రోజు డా.రాజన్ కృష్ణమూర్తిని చూడటానికి వచ్చారు. ఆయన కృష్ణమూర్తి ఆర్థికపరిస్థితిని గూర్చి విని ఉన్నారు. అందుకని సాయం చెయ్యాలనుకున్నారు. ఆయన "మీకు ప్రభుత్వ ఆస్పత్రి లో ఉ ద్యోగం యిప్పిస్తాను". అని అన్నారు. కృష్ణమూర్తి, "ఏ ఆధ్యాత్మిక శక్తి, నన్ను తిరువణ్ణామలైకి తీసుకుని వచ్చిందో, అదే నా బాగోగులన్నీ భవిష్యత్తులోనూ చూచుకుంటుంది," అని బదులిచ్చారు. అదే ఆయనకు భగవాన్‌పై గల దృఢవిశ్వాసము. ఆయన నమ్మకానికి తగ్గట్టుగానే, రెండుసార్లు కృష్ణమూర్తి తనకు చికిత్స చేసే అవకాశమిచ్చారు భగవాన్.

భగవాన్‌కు ఎక్కిళ్ళు తగ్గకుండా వచ్చేవి. కృష్ణమూర్తి మంచి మంచి మందులు వాడినా ఫలితం లేకపోయింది. క్షీణిస్తున్న భగవాన్ ఆరోగ్యం ఆందోళన కల్గించింది. భగవాన్ జీవించ రేమోనని కృష్ణమూర్తి అనుకున్నారు. కన్నీళ్ళు కారుతుండగా, "భగవాన్! మిమ్ముకాపాడటానికి నాకు సహాయం చెయ్యండి," అని కృష్ణమూర్తి తన హృదయంలోనే ప్రార్థించారు. ఆ రాత్రి భగవాన్, సుబ్బులక్ష్మికి కలలో కన్పించి, "కృష్ణమూర్తి ఎందుకు ఏడుస్తున్నారు? ఒక (మూలికల) ఆకుతో తయారుచేయబడిన ఆయుర్వేద మందును నాకివ్వమని చెప్పు. తన కలలో కూడా ఆమె ఆశ్చర్యపోయింది. భగవాన్ తిరిగి అన్నారు. "అది మీ పెరటిలో ఉన్నది. దానిని తీసికొని రండి. ఆ రోజులలో స్త్రీలను ఉదయం అయిదు గంటలలోపు ఆశ్రమానికి రానిచ్చేవారుకాదు. భగవాన్ సుబ్బులక్ష్మి అమ్మాళ్‌ను నాలుగు గంటలకురమ్మన్నారు. తన భార్య తటపటాయిస్తుండగా, భగవాన్ మనలను నాలుగు గంటలకు రమ్మన్నారు. మనము వెళ్ళితీరాలి," అని కృష్ణమూర్తి అన్నారు. కృష్ణమూర్తి, ఆయన భార్యా ఇద్దరూ కలసి ఆశ్రమానికి వెళ్ళారు. భగవాన్ వారి కొఱకు వేచి యున్నారు. ఆయన చెయ్యి చాపి వారుతెచ్చిన మందును తీసుకున్నారు. ఎక్కిళ్ళు ఆగిపోయినవి.

రెండవ సంఘటన ఇంకా ప్రత్యేకమైనది. కృష్ణమూర్తి 'మెడిసిన్' చదువుతుండగా ఆయనకు శ్రీనివాసరావు అనబడే ప్రొఫెసర్ ఉండేవారు. తర్వాత కాలంలో డా.శ్రీనివాసరావు, భగవాన్‌కు వ్యక్తిగత పరిచారకుడుగా ఉండేవారు. ఆయన కొంచెము అధికారము చెలాయించునట్లుగా ఉండేవారు. ఒకప్పుడు భగవాన్‌కు ఉదరానికి సంబంధించి ఏదో సమస్య వచ్చింది. ఆయన దానికి శస్త్ర చికిత్స చెయ్యాలి," అని చెప్పారు. ఆయన నిరంజనానంద స్వామి వద్దకు వెళ్ళి, ఆ శస్త్రచికిత్స అవసరమని

ఆయనకు నచ్చచెప్పారు. వారిద్దరూ కలిసి చెన్నైలోని ప్రముఖ సర్జన్ డా. పాండలేకు లేఖవ్రాసి, ఆయన అభిప్రాయము కోరారు. సాంప్రదాయ వాది అయిన కృష్ణమూర్తి, బాధపడ్డారు. ఆయన తనలో తను యిలా అనుకున్నారు,"జ్ఞాని శరీరముపై ఎటువంటి శస్త్ర చికిత్స పరికరములు వాడరాదు. ఆయన భౌతిక శరీరములోని ప్రతి జీవకణము దివ్యశక్తితతో నిండి ఉంటుంది. ఆ శరీరము దానికదే స్వస్థత పొందుతుంది. ఆయన శస్త్రచికిత్సను ఆపమని ఇతర డాక్టర్లను, కోరారు. కానీ ఆయన మాటలు పెడచెవిన పెట్టబడినవి. గత్యంతరం లేక ఆయన ప్రార్ధించసాగారు. ఆయన తన హృదయంలో, "భగవాన్, ఈ క్లిష్ట స్థితి నుండి మిమ్ములను కాపాడుకోవటానికి నాకు సాయపడండి," అని ప్రార్ధించారు. ఆ రాత్రే భగవాన్ ఆయన కలలో కన్పించారు. ఆయన, "కృష్ణమూర్తీ! మీరెందుకు బాధపడుతున్నారు? ఈ మూడు ఆయుర్వేద తైలములనూ కలిపి, ఉదయాన్నే తెస్తే, అదే చికిత్స అవుతుంది," అన్నారు. కృష్ణమూర్తి, సుబ్బులక్ష్మి ఆ రాత్రే దాన్ని తయారుచేశారు. మర్నాడు ఉదయాన్నే భగవాన్ వద్దకు తీసుకుని వెళ్ళారు. ఆయన దానిని తాగారు. శస్త్రచికిత్స చెయ్యటానికి ముందుగా డా॥శ్రీనివాసరావు, డా.పాండలే, భగవాన్‌ను పరీక్షించగా, అక్కడ జబ్బు తాలూకు ఏ చిహ్నామూ కన్పించలేదు" భగవాన్ రహస్యాన్ని వెల్లడించారు. "ఈ ఉదయం కృష్ణమూర్తి ఏదో ఆయుర్వేద తైలమును ఇచ్చారు. అంతా సర్దుకుంది". దానివల్ల జరిగే దానిలో తనకు సంబంధము లేనట్లుగా ఆయన మాట్లాడారు. "దీని మూలాన నా అధ్యాపకులైన డా.శ్రీనివాసరావుగారికి నాపై శతృత్వము పెరిగినది, తన (పథకాన్ని) ఆలోచనను నేను వమ్ము చేశానని." అని డా. కృష్ణమూర్తి ఆ సంఘటన గురించి వివరించారు.

భగవాన్ వృత్తిపరంగా డాక్టర్ కృష్ణమూర్తికి గౌరవమిచ్చేవారు. ఏ మందు తీసికోవాలన్నా, వేరే డాక్టరు చెప్పిన మందునైనా సరే తీసుకునే ముందు కృష్ణమూర్తిని అడిగేవారు. ఆయనకు తన భక్తుని మీద అంత నమ్మకము. కానీ కృష్ణమూర్తిని, యింక సంప్రదించడం మానివేశారు, ఎందుకంటే, పెద్ద(సీనియర్) డాక్టర్లు (ఎక్కువ అనుభవం గల వైద్యులు) చెప్పిన శస్త్రచికిత్స కు అడ్డుపడ్డారు గనుక. అది కృష్ణమూర్తికి ప్రయోజనకారి అయింది. ఆయన అప్పటి నుండి యింకా ఎక్కువ సమయయు అంతరంగ ధ్యానానికి వెచ్చించసాగారు. తర్వాత కాలంలో, భగవాన్ ఎడమ చేతికి కాన్సర్ అని తెలిసినపుడు, దానికి ఏ విధమైన చికిత్స చేయించాలి అనే విషయం గూర్చి సంప్రదించడానికి, ఆయనను పిలువను గూడా లేదు.

అప్పటికే భగవాన్ చేతికి మూడు శస్త్రచికిత్సలు జరిగినవి. భగవాన్ శరీరాన్ని కత్తితో కోస్తుంటే తాను ఆపలేక పోతున్నానని కృష్ణమూర్తి బాధపడుతున్నారు. నాలుగవదీ, పెద్దదీ అయిన చివరి ఆపరేషనుకు, డాక్టర్. రాఘవాచారి మున్నగు ప్రఖ్యాత శస్త్ర చికిత్సకులు (సర్జన్స్) చెన్నై నుండి వచ్చారు. వారందరూ భగవాన్ ఎదుట నిలబడి, "భగవాన్! ఈ శస్త్ర చికిత్స జరిపి తీరాలి. చెన్నై నుండి అవసరమైన సామాగ్రి వస్తుంది." అని చెప్పారు. భగవాన్ వారిని చూచి, "మీరు కృష్ణమూర్తి అయ్యర్‌కు చెప్పారా?" అన్నారు అందరు సర్జన్స్, డా.శ్రీనివాసరావుతో సహా కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళారు. డా.రావు, ఆయనతో చాలా గట్టిగా చెప్పారు, "శస్త్ర చికిత్సను ఆపవద్దు. అది తప్ప వేరే మార్గము లేదు.వారందరూ దాని గురించే వచ్చారు. "కృష్ణమూర్తికి చెప్పారా? "అని భగవాన్ అన్నపుడే, నాకు అర్థమైంది. మేము శస్త్ర చికిత్సకు నీ అనుమతి తీసికోవాలని. కాబట్టి మాతో రండి. కాని శస్త్ర చికిత్స వద్దు అని చెప్పవద్దు. శస్త్రచికిత్స చెయ్యవలసినదే అని భగవాన్‌కు చెప్పండి," కృష్ణమూర్తి, "నేనా పని ఎలా చెయ్యగలను?" అని ఏడ్చారు. డాక్టర్లు దాదాపు ఆయనను లాక్కుని వెళ్ళినంత పనిచేశారు. కృష్ణమూర్తి అప్పుడు ఏమి జరిగిందో తనే చెప్పారు. భగవాన్, అప్పుడాయనకు 'వద్దు' అనవద్దు అనేభావాన్ని వెలిబుచ్చారు తన చూపు ద్వారా, కృష్ణమూర్తి ఆ సూచనకు తలవగ్గారు. ఆ డాక్టర్లు వెళ్ళిపోయిన తర్వాత, కృష్ణమూర్తి భగవాన్‌తో ఒంటరిగా ఉన్నారు. భగవాన్ మాటలతో కాకుండా, హృదయంలోని మౌనం తోటే, ఈ భావాన్ని కృష్ణమూర్తికి అందించారు. "ఏమి చెయ్యగలము కృష్ణమూర్తి. పనులు ఎలా జరుగవలసి ఉన్నవో అలాగే జరుగుతవి. అది అరుణాచలుని ఇచ్ఛ. ఆయన ఇచ్ఛ నెరవేరాలి. భగవాన్ బహిరంగంగానూ, వినపడేటట్లు కృష్ణమూర్తి అయ్యర్‌తో, "అంతా పూర్తయ్యే వరకూ నాతో ఉండండి," అన్నారు.

1949, డిశంబరు 19 తారీఖున నాల్గవ శస్త్ర చికిత్స జరిగింది. ఆ రోజు నుండి 1950, ఏప్రిల్ 14 తారీఖున భగవాన్ నిర్యాణం చెందే వరకూ, కృష్ణమూర్తి ప్రతిరాత్రీ భగవాన్ తోనే ఉండేవారు. ఆయన భగవాన్ ప్రక్కనే ఉండక పోయినా కనుచూపు మేరలోనే పిలిస్తే పలికేటట్లు ఎప్పుడూ అప్రమత్తంగా, ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. అందరూ నిద్రించిన వేళ, ఆయన భగవాన్‌తో రాత్రంతా ఉండేవారు. ఆయన, ప్రతిరోజూ "నేను స్వర్గనరకాలు రెండిటినీ చూచేవాడిని. నా సద్గురువుతో ఉండటం స్వర్గం అయితే ఆయన శరీరం బాధపడుతుంటే చూడటం నరకము."

కృష్ణమూర్తి అయ్యర్ మార్మికుడు (వేదాంతి). మా ఇద్దరికి మధ్యగల సన్నిహిత సంబంధం గూర్చి, తెలుపడానికి నాకేమీ అభ్యంతరం లేదు. నేను కాశీలో ఉన్నపుడు, నా వీపుపై వచ్చినది సెప్టిక్ అయినది. (చీము పట్టినది) మా తండ్రిగారు బెనారస్ నుండి నన్ను చెన్నైకు తీసికుని వచ్చారు. పక్షవాతం రాకుండా ఉండాలంటే, శస్త్రచికిత్స చెయ్యాలి అన్నారు డాక్టర్లు, డాక్టర్ టి.ఎన్.కృష్ణస్వామి, "నువ్వు వెంటనే శస్త్ర చికిత్స చేయించుకోవాలి," అన్నారు. "నేను డా.ఎమ్.ఆర్.కృష్ణమూర్తి అయ్యర్ చేత మాత్రమే వైద్యం చేయించుకుంటాను, " అని నేనన్నాను. ఎందుకలా అన్నానో నాకే తెలియదు. మా తండ్రిగారు, "మనము కృష్ణమూర్తి అయ్యర్‌తో మాట్లాడటము మానివేశాము. గత పదిసంవత్సరాలకు పైగా అతనితో కలవ లేదు. నేనెలా వెళ్ళి ఆయనను నీకు వైద్యము చెయ్యమని అడుగగలను?" అన్నారు. "అదంతా నాకు తెలియదు," అని నేనన్నాను. మా తండ్రిగారు నన్ను ఇంటికి తీసుకుని వెళ్ళారు. మా తల్లిగారు కృష్ణమూర్తి అయ్యర్ వద్దకు వెళ్ళమని ఆయనతో చెప్పారు. ఆయన మొండిగా ఉన్నారు. "నేనాయనను ఎలా కలుసుకొనగలను?" అన్నారు.ఎట్లాగో మా తండ్రిగారు వెళ్ళారు. కృష్ణమూర్తి, "అవును నేను వస్తాను.కానీ రెండు షరతుల మీద, నేను ఆయనకు వైద్యం చేసేటప్పుడు ఎవరూ గదిలోనికి రాకూడదు. మీరు నాకు కాలపరిమితి పెట్టగూడదు. నేను ఏమి చికిత్స చేస్తున్నాను? ఏ విధమైన మందులు అతని మీద వాడుతున్నాను? అని అడగకూడదు." అన్నారు. కృష్ణమూర్తి అయ్యర్ రెండు నెలలపాటు నాకు చికిత్స చేశారు. నేను నా పొట్టమీద (బోర్లా) పడుకుని ఉండగా, నా వీపుపై లోతుగా ఏర్పడిన పుండ్లకు మందులు వ్రాసేవారు. ఆ సమయంలో, భగవాన్ తోటీ, అరుణాచలుని తోటీ తనకు గల మార్మికమైన అనుబంధం గురించి చెప్పేవారు. అది ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకుని వెళ్ళేదిగాను, భౌతికంగా స్వస్థత చేకూర్చేది గానూ ఉండేది. ఆయన యిచ్చిన మందుల శక్తీ, గుణమూ కంటే, ఈ ఆధ్యాత్మిక విషయాలను చెప్పడమే, నా పుండ్లు త్వరగా, పూర్తిగా నయమవటానికి కారణమని నాకు అన్పించింది. అలా ఒకరోజున ఆయన, అరుణాచలుడు, రమణులు ఒకరే. భగవాన్ తాళం చెవి అరుణాచలుని వద్ద వదలి పెట్టారు.

బైబిల్ అంటుంది 'అడుగుడి, ఇవ్వబడును'. 'తట్టుడి–తెరవబడును' అని. అది నిజమే, మీరు అరుణాచలేశ్వరుడిని అడిగితే ఆత్మవిచారణకు తాళము చెవియిస్తారు. ఆత్మ విచారణ అంటేలోనికి మునుగుట".

కృష్ణమూర్తి అయ్యర్ రోజూ గిరి ప్రదక్షిణ చెయ్యడం మొదలు పెట్టారు. ఆయన అరుణాచలేశ్వరుని ఆలయం చుట్టూ కూడా, ప్రదక్షిణ చేసేవారు. కొన్నిసార్లు తన్మయస్థితిలో వీధులలో తిరుగుతూ కన్పిస్తుండేవారు. టౌన్‌లో జనం బాహటంగానే ఆయనకు పిచ్చెక్కింది అనసాగారు. ప్రతిరోజూ గిరి ప్రదక్షిణ చేస్తూ ఆశ్రమానికి వచ్చి సమాధి ముందు, తన్మయత్వంలో భగవాన్ మీదా, అరుణాచలుని మీదా, గొంతెత్తి బిగ్గఅగా పాటలు పాడేవారు. నేను ఆయనకు సాష్టాంగపడేవాణ్ణి. ఆయన గుర్తించి మార్మికమైనట్లుగా నవ్వి భగవాన్ మందిరం వైపు చూపేవారు, భగవాన్‌కు మాత్రమే నమస్కారం చెయ్యాలన్నట్లుగా సూచిస్తూ. ఆయనలో మార్మికమైన అనుభవాల తరంగాలు కొనసాగుతున్నట్లు నా కన్పించేది.

ఆయన చివరిరోజులలో, ఆయనకు ఒక నిగూఢమైన అనుభవం కలిగింది. పర్వదినాలలో దేవుని ఊరేగించే పెద్ద రథము చక్రములు విరిగిపోతాయనీ, ఆలయ కమిటీ వారికి వాటిని రిపేరు చేయించమని చెప్పమనీ అరుణాచలేశుడు తనకు చెప్పినట్లుగా ఆయన చెప్పారు. ఆ కమిటీసభ్యులు, ఆయనను పిచ్చివానిగా భావించి ఆ మాటలను పట్టించుకొనలేదు. కానీ ఆ రథము ఆయన యింటి వద్దకు వచ్చినపుడు, అది నిలచిపోయింది. మూడురోజులపాటు ఆయన తన యింటిపై భాగాన నుంచుని, మాడ్చేసే ఎండని లెక్కచెయ్యకుండా, ఆ రథాన్ని తదేకంగా చూస్తూ ఉండిపోయారు. ఆయన పైకి వెళ్ళే తలుపు తాళం వేసుకుని క్రిందకు దిగిరాలేదు. మూడవ రోజున నేను గిరి ప్రదక్షిణ చేస్తుండగా, 'ఏదో వింత కారణంగా నాకు ఆయనను చూడాలన్పించింది. ఆయన భార్య అన్నారు, "మేమేమి చెయ్యము? మూడు రోజులగా మేమాయనను చూడలేదు. ఆయనపై నున్నారు. మాకు ఆ తలుపు తట్టే ధైర్యము కూడా లేదు." ఆయన భార్య నాతో మాట్లాడుతుండగా, కృష్ణమూర్తి వచ్చి, "గణేశన్ వచ్చారా?" అని అడిగారు. ఆయన మమ్మల్ని ఏకాంతంగా వదలి, దూరంగా వెళ్ళమని ఆమెకు చెప్పారు. నేను ఆయనకు సాష్టాంగ పడ్డాను. ఆయన (నల్లకప్పు)ఎండకు నల్లగా మారారు. ఆయన, "గణేశన్, అరుణాచలుడు నన్ను పిలిచారు. నేను వెళ్తున్నాను. నీకు నా ఆశీస్సులు. ఈ మార్గము నుండి వైదొలగవద్దు. అరుణాచలుడు మిమ్ములను కాపాడుతారు. ఇక్కడే ఉండండి. తర్వాత కొద్ది రోజులకు ఆయన చనిపోయారు. అరుణాచలుడు తన హృదయంలోనికి ఆయనను (కలిపే)తీసేసుకున్నారు.

డాక్టర్ హఫీజ్ సయ్యద్

భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా, ఒక మార్మిక భక్తుడు, సత్యమంగళం వెంకట్రామన్ రమణుని పొగుడుతూ అయిదు పద్యాలు వ్రాశారు. అందులో ఒక పద్యం లో భగవాన్‌ను ఇలా స్తుతిస్తారు, "ఓ సద్గురు రమణా! నువ్వు ఇప్పుడు బ్రాహ్మణుని శరీరంలో ఉన్నప్పటికి నువ్వు కుల, మతాలను, అధిగమించిన సత్యానివి. ప్రపంచం మొత్తం నుండి కుల, మత, విశ్వాసాలతో నిమిత్తం లేకుండా అనేకమంది నీ పాదాల వద్దకు చేరుదురు. వాళ్ళు నీ దగ్గరకు ఎందుకు చేరతారంటే, వారు నిన్ను సత్యంగా (ఆత్మగా) తలుస్తారు గనుక. ఈ పద్యములు 1910లో వ్రాయబడి పాడబడినవి. అప్పటికి భగవాన్ చుట్టూ ఎక్కువ మంది ఉండేవారుకాదు. కానీ 1922లో భగవాన్ రమణాశ్రమమునకు వచ్చిన తర్వాత, అన్నిజాతులూ, మతాలకు చెందిన ప్రజలు, ప్రపంచం నలుమూలల నుండి రావటం మొదలుపెట్టిన తర్వాత ఈ పద్యము లో చెప్పబడిన జ్యోతిష్యము (భవిష్యవాణి) నిజమైంది.

డా.హఫీజ్ సయ్యద్, దృఢ విశ్వాసముగల ముస్లిమ్. ఆయన భగవాన్ వద్దకు వచ్చారు. ఆయన అలహాబాద్ యూనివర్సిటీలో 'ఇస్లామిక్ స్టడీస్' (ముస్లింమత అధ్యయనం) డిపార్టుమెంటుకు అధిపతి గానూ, (హెడ్), ప్రొఫెసర్‌గానూ ఉండేవారు. ఆయనకు ఇతర మతముల పట్ల ద్వేషము లేనప్పటికి, ప్రపంచం మొత్తం మీద 'ఇస్లాం' మతమే గొప్పది అనే నమ్మకంతో ఉండేవారు. ఒకరోజు ఒక స్నేహితుడు ఆయనకు పాల్‌బ్రంటన్ వ్రాసిన, 'గుప్త భారతదేశంలో నా అన్వేషణ' అనే పుస్తకాన్ని ఇచ్చారు. ఆయన ఆ పుస్తకం చదివి అమితా నంద పడిపోయి, ఈ గొప్ప హిందూ గురువును కలుసుకొనవలెనని గట్టికోరికతో ఉన్నారు. ఆయన ఈ మహర్షి ఒక ముస్లింను ఎలా ఆదరిస్తారో అని ఆలోచించారు. ఆయన మారిస్ ఫ్రిడ్‌మన్ ను కలవటం జరిగింది. అప్పుడు మారిస్, "అవును భగవాన్ రమణులు నా సద్గురువు. ఆయనే పరమోత్కృష్టమైన సత్యము. వెళ్ళి ఆయనను కలవండి అని చెప్పారు. మారిస్, ఈ సలహా నివ్వటమే కాకుండా, డా.సయ్యద్ ఆశ్రమంలో ఉండటానికి తగు ఏర్పాట్లు చేశారు. ఆ అడవిలో ఉన్న ఆశ్రమంలో ఆయనకు ఎదురు వచ్చిందెవరు? ఎవరో కాదు, పాల్ బ్రంటనే. ఆయనను, ఆశ్రమంలోనికి భగవాన్ వద్దకు తీసుకుని వెళ్ళారు.

డాక్టర్ సయ్యద్ ఒక్కసారి భగవాన్ వంక చూశారు. ఆయన సత్యాన్ని అనుభవించారు. ఆయన కొద్ది సమయం మాత్రమే ఉన్నారు. తర్వాత వెళ్ళి పోవలసి వచ్చింది. ఆయన ఆశ్రమాన్ని వదలి వెళ్ళేటప్పుడు, తను ఎప్పటికైనా 'ఆధ్యాత్మిక పరిపూర్ణత' పొందగలిగితే, అది కేవలము రమణ మహర్షి సన్నిధిలోనే జరుగుతుంది అని భావించారు. మొదటిసారి ఆయన1935లో భగవాన్‌కు కలిశారు. మరల 1936లో కలిశారు. 1937 లో సయ్యద్ ఆశ్రమానికి వచ్చినపుడు జబ్బుపడి నెల రోజులపాటు మంచాన ఉన్నారు. భగవాన్, డా.హఫీజ్ సయ్యద్‌ను, ఒక తల్లి, తన బిడ్డను చూచుకున్నట్లుగా ఎంతో ప్రేమతో చూచుకున్నారు. ఒకరోజు ఆయన వంటగదిలోనికి వెళ్ళి, ఉప్మా తయారు చేసి తీసుకుని వచ్చి, డా.హఫీజ్ సయ్యద్‌కు పెట్టారు. ఆ ప్రేమ డా.హఫీజ్ సయ్యద్‌ను పూర్తిగా కరిగించింది. కానీ ఆయన వృత్తి బాధ్యతల వలన చాలా కాలము వరకు ఆయనకు ఆశ్రమము వద్ద ఉండుటకు వీలుకాలేదు. 1943 లో ఆయన ఆశ్రమము దగ్గరలో ఇల్లుకట్టుకున్నారు. ఎందుకంటే, సెలవలలో తాను, తన భార్య భగవాన్ సన్నిధిలో ఉండటానికి. భగవాన్ సన్నిధే ఆయనకు సర్వస్వము అయిపోయింది.

ఆయన భార్య గురించి చెప్పకుండా, డా.హఫీజ్ సయ్యద్ గురించి మాట్లాడటం సాధ్యముకాదు. ఆమె చాలా భక్తి కల్గిన పరదా ధరించే ముస్లిం స్త్రీ. ఇస్లాం మతంలో చెప్పబడిన బోధలన్నిటినీ చాలా శ్రద్ధగా అనుసరించేది. ఆమె భర్త లాగానే ఆమె కూడా ఈ హిందూ మహాత్ముడి పట్ల ఆకర్షితురాలైనారు. ఆమె భగవాన్‌ను చూడాలని కోరుకున్నది. కానీ తన మత సిద్ధాంతములు వేరే పురుషుని చూచుటకు అనుమతించవని భావించారు. అందుకని ఆమె ఆశ్రమమునకు వచ్చి, భర్త చేత కబురు చేసేది. గురువుగారూ, దయచేసి వచ్చి నన్ను చూడండి," అని. ఆమె భర్త ద్వారా భగవాన్‌తో మాట్లాడేవారు,

ఎందుకంటే వారి మతము స్త్రీలు, వేరే పురుషులతో సూటిగా మాట్లాడటాన్ని ఒప్పుకోరు గనుక. భగవాన్ ఆమెను ఆశీర్వదించారు. ఆయన ఆమెను మార్చటానికి ప్రయత్నించలేదు. కాని మార్పు దానంతట అదే వచ్చింది. ఈ శ్రద్ధాళువైన ముస్లిం స్త్రీ, భగవాన్ హాలు లోనికి తనంతట తానే రావటం ప్రారంభించారు.

డా.హాఫీజ్ సయ్యద్, భార్యకు, భగవాన్‌ను భోజనానికి పిలవాలనీ, ఆయనకు తన హృదయం సంతృప్తి పడేలా భోజనం పెట్టాలని చాలా గాఢమైన కోరిక ఉండేది. ఆ సమయంలో, ఆ దంపతులు ఆశ్రమమునకు ప్రక్కన ఒక అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆమె తన కోరికను, భర్తకు తెలిపి నపుడు, ఆశ్రమ నిబంధనలను, భగవాన్ పద్ధతులను తెలిసిన ఆయన, "లేదు, ఆయన (బయట భోం చెయ్యరు) ఆశ్రమం నుండి బయటకు వచ్చి మన ఇంటికి రారు. ఆయన ఎప్పుడూ ఆశ్రమము బయట భోజనము చెయ్యరు," అన్నారు. ఎలాగైన ఆవిడ మొండి పట్టుతో ఉన్నారు. చివరకు డా.హాఫీజ్ సయ్యద్ ఆవిడ కోరికను భగవాన్ కొండపైకి వెళ్తుండగా చెప్పారు. భగవాన్ ఆయన చెప్పినది విన్నారు. నవ్వి నడక కొనసాగించారు. కాని భక్తులు పట్టుపట్టినప్పుడు ఏ మౌతుంది? మెదడుతో ఆలోచించి చేస్తే, అది దురహంకారము లేదా గర్వము అవుతుంది. భగవాన్ రోజూ కొండపైకి వెళ్లేవారు. ఒకరోజు ఆయన కొండ పైకి వెళ్తుండగా ఆమె దారిలో నిలబడి, ఆమె భర్త చేత అడిగించారు, "భగవాన్! మీరు తప్పక మా యింటికి భోజనమునకు రావాలి". భగవాన్ మరల నవ్వి నడక కొనసాగించారు.

ఆ రాత్రి భగవాన్ ఆమె కలలో కన్పించి, "మీరెందుకు అంత పట్టుదలగా ఉన్నారు? మీకు తెలుసు నేను రాలేనని. నేను భోజన శాలలో మిగిలినవారందరితో కలిసే భోజనం చేస్తాను. జనము దూరము నుండి వస్తారు. నేను వారిని నిరుత్సాహపరచలేను. మీరు ముగ్గురు సాధువులకు భోజనం పెడితే నాకు భోజనం పెట్టినట్లే." అన్నారు. భగవాన్ ఆ సాధువు లెవరో కూడా ఆమెకు తెలియజేశారు. కలలో ఆశ్రమంలో ఉంటున్న ముగ్గురు వ్యక్తులను చూశారు. వారు డా.మెల్‌కోటె, సాధు ప్రబుద్ధానంద, క్రిష్ణభిక్షు. డా. మెల్కోటే గృహస్థు, ప్రబుద్ధానంద సన్యాసి, కృష్ణ భిక్షు బ్రహ్మచారి. శ్రీమతి సయ్యద్ తన హృదయం తృప్తి చెందే విధంగా వారికి భోజనం పెట్టారు. ఆమె వారిని భగవాన్‌గానే భావించినట్లుగా, ఆమె భోజనానంతరము, వారికి తమలపాకులు ఇచ్చుట ద్వారా ఋజువు అయింది. ముస్లిం స్త్రీ కేవలము తన భర్తకు మాత్రమే తమలపాకులు ఇవ్వవలెను. ఆఖరికి తండ్రికి, సోదరులకు గూడా యివ్వరాదు. కానీ ఇస్లాం మతము ఒక ఫకీర్‌కు లేదా మహనీయునికి తమలపాకుల నివ్వటానికి, అనుమతించింది. ఆమె వారిలో ప్రతి ఒక్కరికి తమలపాకులను యిచ్చారు. వాళ్ళు ఆమె తమను ఎంత ఉన్నతంగా భావించారో అర్థం చేసుకున్నారు. ఆ ముగ్గురూ తిరిగి భగవాన్ వద్దకు వెళ్ళి ఆ సంఘటనను వివరంగా చెప్పారు. భగవాన్ మెచ్చుకోలుగా విన్నారు. ఆయన ఎప్పుడు మాటలతో మెచ్చుకోరు. ఆయన చూపు ద్వారా, కదలికల ద్వారా భక్తులు అర్థం చేసుకుంటారు.

"మిమ్మల్ని భగవాన్ పట్ల అంతగా ఆకర్షించిన విషయమేమిటి;?" అని నేను ఒకసారి డా.హాఫీజ్ సయ్యద్‌ను అడిగాను. ఆయన, "భగవాన్ యొక్క మానవత్వము గూడా, ఆయన స్వచ్ఛమైన ఆధ్యాత్మికత అంత గొప్పది. ఆధ్యాత్మికంగా ఎంత ఉన్నతంగా ఉంటే, వారిలో మానవత్వం కూడా అంత ఉన్నతంగా ఉంటుంది అని డా.హాఫీజ్ సయ్యద్ నమ్మకం. భగవాన్ ముఖ్య బోధ, దేవునికి గాని, గురువుకు గాని శరణాగతి చెందటము. ఎందుకంటే భగవాన్ దైవానికి శరణాగతి చెందే దానివలన లాభాన్ని పొందారు. కానీ భగవాన్ తత్వంలోని (వేదాంతంలోని) ముఖ్యమైన లక్షణము, జీవితంలోని ఏకత్వము, దివ్యత్వము యొక్క ఏకత్వము.

"ఈ జగత్తును పాలించే వారొకరున్నారు. ఈ ప్రపంచాన్ని చూసుకొనడం ఆయన పని. ఈ ప్రపంచం యొక్క భారమును మొయ్యడం ఆయన పని. మనదికాదు, " అని భగవాన్ అనడం నేను అనేకసార్లు విన్నాను. భగవాన్ ఉద్దేశము భక్తి అంటే మనసును అంతర్ముఖం చేసి హృదయంపై దృష్టిని నిల్పుటయే."

డా.హాఫీజ్ సయ్యద్, మహర్షితో సుదీర్ఘమైన (జ్ఞానపరమైన) వివేకయుతమైన సంభాషణలు చేసేవారు. అవి "టాక్స్ విత్ రమణమహర్షి" (రమణ మహర్షితో సంభాషణలు), అనుదినము భగవాన్‌తో, రమణాశ్రమ లేఖలులో గూడా కన్పిస్తవి. "ఎందుకు మీరు ఎప్పుడూ భగవాన్‌ను ప్రశ్నిస్తుండేవారు?" అని నేనడిగినపుడు ఆయన, "ఒక మహాత్ముడు లభ్యమైనపుడు,

దైవాన్ని చేరుకొనుటకు అనుసరించవలసిన మార్గములను, సాధనలను, ఆయన వద్ద నుండి గ్రహించి, ఆయనను ఆవిధంగా పూర్తిగా వినియోగించుకోవాలి. అందుకని భగవాన్ ను ప్రశ్నించుటకు నేనెన్నడూ సందేహించలేదు.

టాక్స్ విత్ మహర్షి లో నుండి కొన్ని సంభాషణలను ఇక్కడ ఇస్తాను.

డా.హఫీజ్ సయ్యద్ : బాహ్య జగత్తు సృష్టి వెనుక (నామ, రూపాల) గల ఉద్దేశమేమిటి, భగవాన్?

భగవాన్ : ఆ సృష్టే మీలో ఈ ప్రశ్నను రేకెత్తించింది.

సయ్యద్ : నిజమే. నేను మాయతో కప్పబడి యున్నాను. దాని నుండి బయట పడుటఎట్లు?

భగవాన్ : ఎవరు మాయలో చిక్కుకుని ఉన్నారు? ఎవరు బయట పడగోరుతున్నారు?

సయ్యద్ : గురువుగారు, మీరలా 'ఎవరు?' అని అడిగినపుడు అది అజ్ఞానంలో ఉన్నటువంటి,'నేను', ఇంద్రియాలు, మనసు, శరీరము, అని తెలుసును. నేను ఈ విచారణను పాల్‌బ్రంటన్ పుస్తకము చదివిన తర్వాత మూడు నాలుగుసార్లు చెయ్యటానికి ప్రయత్నించాను. నేను చాలా ఆనందము పొందాను. కానీ ఆ ఆనందము కొంత సమయము ఉండి, తిరిగి అంతరించి (తొలగి) పోయినది. నేను 'నేను'లో లేదా 'అహం' లో స్థిరంగా నిలిచేదెలా? దయచేసి నాకొక ఆధారాన్ని ఇచ్చి సాయం చెయ్యండి.

భగవాన్ : కొత్తగా వచ్చినది కాలక్రమంలో పోవలసిందే.

సయ్యద్ : శాశ్వత సత్యాన్ని ఎలా చేరుకోవాలో దయచేసి తెలుపండి.

భగవాన్ : మీరిప్పటికే అదిగానే ఉన్నారు. మనము ఆత్మకంటే భిన్నంగా ఉండగలమా? మీరు 'మీరు'గా ఉండుటకు, ప్రయత్నమవసరము లేదు. ఎందుకంటే మీరు ఎల్లపుడూ అదే గనుక.

మరొకసారి సయ్యద్ యిలా అడిగారు : "మీరు అరుణాచలుని స్తుతిస్తూ వ్రాసిన అయిదు పద్యాలు చదువుతూ ఉన్నాను. మీరు వాటిని అరుణాచలుని ఉద్దేశించి వ్రాశారు. మీరు అద్వైతులు గదా! మీరు, భగవంతుని మీకంటే వేరుగా ఎలా చూడగలరు?

భగవాన్ : భక్తుడు, దైవము, పద్యములు అన్నీ ఆత్మయే.

స : కానీ మీరు దేవుని సంబోధిస్తున్నారు, మీరు ఈ అరుణాచల పర్వతమే భగవంతుడని చెబుతున్నారు.

భ : మీరు ఆత్మని శరీరంగా భావిస్తున్నారు. భక్తుడు, ఆత్మను అరుణాచలునిగా భావించగూడదా?

స : అరుణాచలుడే ఆత్మ అయితే, అన్ని కొండలలో దానినే ప్రత్యేకంగా ఎందుకు ఎన్నుకోవాలి? భగవంతుడు అన్నిచోట్లా ఉన్నారు. మీరు భగవంతుని అరుణాచలమనే ఎందుకు అంటున్నారు?

భ : మిమ్ములను అలహాబాదు నుండి యిక్కడకు ఆకర్షించిన దేది? ఇక్కడ కూర్చుని ఉన్న జనులందరినీ యిక్కడకు ఆకర్షించినదేది?

స : మీరే భగవాన్.

భ : నేను ఇక్కడకు ఎలా ఆకర్షితుడనైనాను? అరుణాచలుని వల్లనే, అరుణాచలుని శక్తి కాదనలేనిది. మరల అరుణాచలుడు లోపలనే (అంతరంగములోనే) ఉన్నారు. బాహ్యమున కాదు. ఆత్మే అరుణాచలుడు.

డా.హఫీజ్ సయ్యద్, భార్యతో కలిసి, భగవాన్ నిర్యాణము చెందునంత వరకు ఆశ్రమము దగ్గరే ఉన్నారు. ఆయన ఒకసారి నాతో, అరుణాచలుడు, భగవాన్ ఇద్దరూ ఒకటే. వారు వేరువేరుగా ఉనికి కలిగిలేరు. భగవాన్ నిర్యాణం చెందిన తర్వాత హఫీజ్, ఆరోగ్య సమస్యల వల్ల, ఇతర కారణముల వలన అరుణాచలములో ఉండలేక పోయారు. ఆయన ఆత్మవిచారణను అభ్యాసం చేసుకొనడానికి, ధ్యానములో గడుపుటకు, తన స్వస్థలమునకు వెళ్ళారు. అరుణాచలుడు హృదయములోనే ఉన్నారని ఆయనకు తెలుసు. భగవాన్ అన్నట్లుగా, ఓ అరుణాచలా, 'హృదయమే' నీ పేరు! అని. డా.హఫీజ్ సయ్యద్ చివరి రోజులు చాలా ప్రశాంతంగా గడచినవి. భగవాన్, ఆయనను అరుణాచలములో ఐక్యము చేశారు. అరుణాచలుని సందేశము 'ఆత్మలోనిలచి ఉండుము' అనియే. ఆత్మయే మౌనము (నిశ్శబ్దము)

సబ్ రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్



సబ్ రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్ అదృష్టవంతుడైన భగవాన్ భక్తులు, ఆయన ఊహించలేని, వర్ణించనలవి కాని, శ్రద్ధ, ప్రేమ, సంరక్షణ, ఆశీర్వాదములు భగవాన్ నుండి పొందారు. నా ఉద్దేశంలో భగవాన్‌కు యిష్టమైన భక్తులలో ఆయన ఒకరు. 1928లో నారాయణ అయ్యర్ సబ్ రిజిస్ట్రార్‌గా, తిరువణ్ణామలైకు ముప్పది మైళ్ళ దూరములో గల చెట్‌పట్‌లో నియమించబడ్డారు. ఆయన స్వేచ్ఛగా ఆలోచించేవారు. ఆయన సందేహశీలి. (దేన్నీ గుడ్డిగా నమ్మేవారు కాదు). సాధువులన్నా, సన్యాసులన్నా హేళన లేదా తిరస్కార భావాన్ని కలిగియుండే వారు. వారు ఆరోగ్యకరమైన సంఘానికి పట్టిన చీడపురుగులు అని భావించే వారాయన. ఆయన భాగ్యం కొద్దీ ఆయనకు నమ్మకస్తుడైన, భక్తిపరుడైన డాక్టర్. వి.రామకృష్ణ అయ్యర్ అనే స్నేహితుడుండేవాడు. ఆయన తిరుచ్చులికి చెందిన లక్ష్మీఅమ్మాళ్ పుత్రుడు. లక్ష్మీఅమ్మాళ్, భగవాన్ చిన్నతనంలో ఆయనతో ఆడుకున్న చిన్ననాటి స్నేహితురాలు. కనుక సహజంగానే, ఆయన పెరిగి పెద్దవాడై భగవాన్‌కు గొప్ప భక్తుడైనారు. రామకృష్ణ అయ్యర్ న్యాయంగా ఉండే ప్రభుత్వ వైద్యుడు. ఆయన నవ్వుతూ, నవ్విస్తూ, హాస్య చతురత, సంభాషణలో చతురత కలిగి యుండేవారు. ఆయనను ఎక్కడ ఉద్యోగములో నియమించినా, అవకాశము ఉన్నంతవరకూ భగవాన్‌ను దర్శించేవారు.

1928లో ఒకరోజు, రామకృష్ణ అయ్యర్, నారాయణ అయ్యర్‌ను, "కార్తీక దీపోత్సవానికి మీరు కూడా నాతో అరుణాచలమునకు రావచ్చును గదా!" అని అడిగారు. (ఆ రోజులలో తిరువణ్ణామలైని అరుణాచలము అని పిలిచేవారు. రైల్వే బోర్డు కూడా ఆవిధంగానే ఉండేది.) "దేవుళ్ళకు, దేవతలకు నగలు పెట్టి, అలంకరించి ఆర్భాటంగా ఊరంతా ఊరేగించడం అనేది. నాకు నిజంగా ఇష్టముండదని, మీకు తెలుసునుగదా, రామకృష్ణా అటువంటి మూర్ఖపు పనులు నాకు నచ్చవు. కానీ మీరు నా ప్రాణ స్నేహితులు కనుక, మీ మాట మన్నించి మీతో వస్తాను," అన్నారు నారాయణ అయ్యర్. తీరా వాళ్ళు తిరువణ్ణామలై జేరుకునేసరికి, అక్కడ ఉత్సవాన్ని తిలకించడానికి వచ్చిన జన సందోహంతో ఊరంతా క్రిక్కిరిసిపోయి ఉన్నది. నారాయణ అయ్యర్ ఎక్కడా నిలుచోవడానికి గాని, కూర్చోవడానికి గాని అంగుళం మేర కూడా ఖాళీ లేకపోవటాన్ని గమనించారు. నారాయణ అయ్యర్, "రామకృష్ణా! మీరు రమణాశ్రమానికి వెళ్తున్నారుగదా. ఆశ్రమమంటే బోలెడు ఖాళీ స్థలమూ, కావలసినన్ని చెట్లూ ఉంటవి. నేను ఒక షరతు మీద అక్కడకు వస్తాను. మీ చేత 'స్వామి' అని పిలువబడే ఆయన నా ఎదురుగా వస్తే, నేను ఆయనకు సాష్టాంగపడను. రామకృష్ణ అయ్యర్ తర్వాత ఇలా గుర్తుచేసుకున్నారు. భగవాన్ పెద్ద ఉచ్చును నారాయణ అయ్యర్ మెడకు తగిలిస్తున్నారని అప్పుడంతా నాకు తెలుస్తూనే ఉన్నది." ఏమీ సందేహించకుండా, రామకృష్ణ అయ్యర్ తనతో పాటు ఆయనను తీసికుని వెళ్ళారు.

1928 లో ఆశ్రమంలో మూడు పూరిగుడిసెలు మాత్రమే ఉండేవి. అది కేవలము కాకతాళీయముగానే జరిగిందా? వాళ్ళు ఆశ్రమంలోనికి వస్తున్నప్పుడే, ఒక కుటీరంలో నుండి వస్తూ భగవాన్ వారికి ఎదురుగా వచ్చారు.ఆయన రామకృష్ణ అయ్యర్‌ను చూడగానే ఒక్కనిముషము ఆగి, "రామకృష్ణా, మీ తల్లిగారెలా ఉన్నారు? మీ కుటుంబము ఎలా ఉన్నది?" అని యోగక్షేమాలు విచారించారు. ఆ సంభాషణ జరిగేటప్పుడు 'పరిచయం చెయ్యబడకుండా యితరులతో మాట్లాడరాదు' అన్న బ్రిటిష్ (ఆంగ్లేయుల) సాంప్రదాయాన్ని అనుసరించి, నారాయణ అయ్యర్ భగవాన్ వైపు తిరుగను కూడా లేదు. అప్పుడు రామకృష్ణ అయ్యర్, ఆయనను భగవాన్‌కు పరిచయం చేశారు. నారాయణ అయ్యర్, ప్రశాంతంగా, కరుణరసం తొణికిసలాడుతున్న భగవాన్‌ను చూసి సమ్మోహితులైనారు. ఆ మరుక్షణమే, ఎత్తుపల్లాలుగా ఉండి రాళ్ళతో నిండియున్న ఆ మట్టినేలను గూడా లెక్క చేయక, భగవాన్ పాదాల ముందు సాష్టాంగ ప్రణామం చేశారు. ఆయన సందిగ్ధంలో పడ్డారు. ఇంత వరకూ సాధువులనూ సన్యాసులనూ, విమర్శించిన తను ఇప్పుడొక సాధువునకు సాష్టాంగపడ్డారు. ఆయన తనను తానే సమాధాన పరుచుకున్నారు. "నేనిద్దరు గొప్పవారిని, మహాత్మాగాంధీని, రవీంద్రనాథ్ ఠాకూర్‌నూ కలుసుకున్నాను.

కాని వారిలో ఒక్కరు కూడా, ఈ నూతన వ్యక్తితో పోల్చదగ్గవారుకాదు. ఈయన కరుణా రసభరితమైన చూపు సమ్మోహన పరచి, కట్టి పడవేస్తుంది. నేను ఆయన పై నుండి, నా కనులను మరల్చ లేకపోతున్నాను. నన్ను నేను నియంత్రించుకోవాలి. ఎందుకంటే నేను ఈయన చూపుల వలలో చిక్కుకో దల్చుకోలేదు. కాని, ఈయన కొక అవకాశ మిస్తాను. ఆయన పుస్తకాలు కొన్నిటిని చదువుతాను."

ఆయన పుస్తక విక్రయశాలకు వెళ్ళారు. ఆ రోజులలో అది కేవలము ఒక తలుపులులేని అరమరయే. (షెల్ఫ్). భగవాన్ యొక్క 'ఉళ్ళదునార్పదు' అప్పుడే తమిళంలో అచ్చయింది. ఆయన పుస్తకమును చదివి ఆ స్వామిని అంచనా వెయ్యటానికి ఆ పుస్తకాన్ని కొన్నారు. ఆ స్వామి, ప్రశంసలకు తగియున్నారా లేదా అని తెలుసుకోదలచుకున్నారు. ఆయన మొదట పద్యాన్ని చదివినప్పుడు ఒక్క మాట కూడా అర్థము కాలేదు,"ఏమి జరుగుతున్నదా?" అని ఆయన ఆశ్చర్యపోయారు. ఆయన తనలో తాను అనుకున్నారు. "నేను ఆయన వైపు చూచినపుడు నాలో ఏదో వెలిగింది (రాజుకుంది). అది నా ఆధీనంలో లేదు. ఏది దానిని సంభవింప చేస్తున్నదో, నాకు తెలియదు. నేను ఆయనను అంచనా వేద్దామనుకుంటే, ఆయన చేత తమిళంలో వ్రాయబడిన దానియొక్క ఒక ముక్కను కూడా నేను అర్ధంచేసుకొనలేకపోతున్నాను. అటువైపుగా వెళ్తున్న ఎవరినో ఆయన అడిగారు "ఉళ్ళదునార్పదు' మీకు తెలుసా? దాని అర్థం మీకు తెలుసునా? " ఆ వ్యక్తి అన్నారు. "నాకు కూడా దాని అర్థము తెలియదు. కానీ భగవాన్ ఇవాళ రాత్రి ఆ పద్యాలను చదివి, వాటి అర్థాన్ని వివరించబోతున్నారు. మీరు ఉండిపోవచ్చును గదా! " నారాయణ అయ్యర్, తనలో తాననుకున్నారు, "నేనిక్కడ ఉండిపోయి ఈ స్వామికి మరొక అవకాశము ఇస్తాను". ఆ ఉచ్చు ఇంకా, ఇంకా గట్టిగా బిగుసుకుంటున్నది.

ఆ రాత్రి, భగవాన్ ఆ పద్యాలను రాగ, భావ యుక్తంగా ప్రతిమాటా అవగాహన అయ్యేలా చదివారు. నారాయణ అయ్యర్‌కు, తాను 'వశీకరణ'కు లోబడుతున్నానా అని ఆశ్చర్యం కలిగింది. (తాను మెస్మరైజ్ చెయ్యబడుతున్నానా? అని) ఇప్పుడు ఆయన చదువుతున్న ప్రతిదీ, నేను అర్థము చేసుకొనగలను. ఇంతకు ముందు, నేనొక్క మాటను కూడా అర్థము చేసుకొనలేకపోయాను. ఆయన మనసు, ఈ రకము సంక్షోభంలో చిక్కుకుని యుండగా, తాను చదువుతూ, చదువుతూ, మధ్యలో ఆయనపై దృష్టిని ఏకాగ్రపరచారు భగవాన్. వెనుకటి రోజులలో సన్నిహితంగా ఉండే చాలా కొద్ది మంది మాత్రమే భగవాన్ చుట్టూ ఉండేవారు. కేవలం 1940 దశకము నుండే జనం గుంపులు గుంపులుగా (ఎక్కువ సంఖ్యలో) రావటం మొదలుపెట్టారు. అంతకు ముందు భగవాన్ తాను ఎన్నుకున్న వారిని సూటిగా చూసేవారు. నారాయణ అయ్యర్ భగవాన్ వలనా, ఆయన చదువుతున్న పద్యము వలనా సమ్మోహితులైనారు.

నారాయణ అయ్యర్ అన్నారు, "ఇరువది ఒకటవ పద్యాన్ని వివరిస్తూ, దేవుని మన కళ్ళతో (ఇంద్రియములతోగాని చూడలేము) చూడలేము. ఇంద్రియములతో తెలుసుకొనలేము. దైవాన్ని చూడటమంటే దైవంగా ఉండటమే. అని ఈ పద్యము చెబుతున్నది అన్నారు. శ్రోతలనుండి దండపాణి స్వామి అనే ఆయన లేచి, "భగవాన్, స్వానభవం నుండే దీనిని చెబుతున్నారా?" అన్నారు. ఈ సున్నితంగాలేని మొరటు ప్రశ్నకు భగవాన్, ప్రశాంతంగా, నిష్కపటంగా, "కాకపోతే, నేను అది చెప్పగలిగిన సాహసం చేస్తానా?" అన్నారు.

ఆ మాటలు (అలా ప్రకటించబడటము) వినగానే నారాయణ అయ్యర్‌లో ఏదో అనుభూతి ఆయనను వింతగా లోబరచుకున్నది. ఆయన శరీరమంతా కంపించింది. ఆ స్థితిలో భగవాన్‌వైపుకు చూచినపుడు, ఆయన ఒక గొప్ప ప్రకాశవంతమైన కాంతిని (వెలుగును) భగవాన్ చుట్టూ చూశారు. నారాయణ అయ్యర్ ఆ అనుభవాన్ని (దేవుణ్ణి చూడటమంటే దేవుడిగా ఉండటమే) పొందారు. మతములన్నీ దైవమని ఎవరిని గురించి ఘోషిస్తున్నాయో, ఆయన గనుక శరీరం ధరించి రావటం జరిగితే, అదే ఈయన. నారాయణ అయ్యర్‌కు ఒక అంతర్గతమైన అనుభవము భగవానే దైవమని నిశ్చయానికి వచ్చేటట్లు చేసింది. నారాయణ అయ్యర్ అన్నారు,"ఆ క్షణము నుండి, ఇక నా నిర్ణయాలేమీ లేవు. నేను భగవాన్‌కు బానిసనై పోయాను. నారాయణ అయ్యర్ నాకిలా వివరించారు. "గణేశన్! నేను దేవుని గురించి మేధాపరమైన (బుద్ధి పరమైన) ఏ విశ్వాసానికీ లొంగలేదు. అందుకని, భగవాన్ నాకు, 'తానే దైవాన్ని' అనే అనుభవాన్ని ఇచ్చారు". నేను ఆయనతో హాస్య మాడుతూ

అన్నాను. "నారాయణఅయ్యర్ దైవాన్ని అనుభవించడానికి తానే దైవమయ్యారు." ఆయన నన్ను కౌగలించుకుని, "అవును, అది నిజమే. దేవుడిని తెలుసుకోవాలంటే దేవుడిగా మారాలి. వేరే మార్గమేమీ లేదు."

కేవలం భగవాన్ ఆశీస్సులు నాకు ఉండబట్టే నారాయణ అయ్యర్, నాకు, తనకు భగవాన్ తో గల కొన్ని అనుభవాలను తెలిపారు. బహుశా భగవాన్ ఉద్దేశం అందరినీ తెలుసుకోమనే అయి ఉంటుంది. చాలాసార్లు, నారాయణ అయ్యర్ ఆశ్రమ ఆఫీసుకు వచ్చి, నన్ను బయటకు లాగుకుని వచ్చి గోశాలకో, గిరిపాదానికో తీసుకుని వెళ్ళేవారు. అప్పుడు తన అనుభవాలను నాకు తెలిపేవారు. ప్రతిసారీ ఆయన బాధపడేదేమిటంటే, "నాకు భగవాన్ నుండి అంత గొప్పగా లాలింపు పొందగలిగే అర్హత లేదు. బహుశ గత జన్మలలో ఏమైనా పుణ్యకార్యాలు చేశానేమో, ఈ జీవితంలో పూజగాని, సాధనగానీ చెయ్యలేదు. ఆయన వద్ద నుండి అంత శ్రద్ధ, ప్రేమ అందుకొనడానికి" అని.

ఒకసారి, "భగవానే నాకు దైవము అంటారు కదా మీరు, అలా అనటంలో మీ ఉద్దేశమేమిటి? మీరెలా భావిస్తున్నారు?" అని నేనడిగాను. నేను నారాయణ అయ్యర్ యొక్క అనుభవాన్ని సందేహించానని కాదు. అది ఆయన మాటలలోనే వినాలని. ఆయన, "భగవాన్ దైవమే. అలా అనుటలో ఏమతానికో సంబంధించిన ఏ దేవుడి గురించో నేను చెప్పటము లేదు. సర్వోత్కృష్టమైన శుద్ధచైతన్యమును గురించి మాట్లాడుతున్నాను. ఇంతకు ముందున్న వారెవరితోనూ నేను ఆయనను పోల్చలేదు. ఎందుకంటే మానవరూపం దాల్చిన అద్వితీయ శక్తిని దేనితోనూ పోల్చడంలో అర్థం లేదు. కానీ మనము అర్థము చేసుకొనడానికి, అవసరమనుకుంటేనే, బుద్ధునితో గాని జీసస్‌తో గాని పోల్చవచ్చును". నారాయణ అయ్యర్ అన్నారు, "ఎప్పుడైనా, నేను భగవాన్‌తో మాట్లాడుతున్నపుడుగానీ, ఆయన సన్నిధిలో కూర్చుని ఉన్నపుడు గానీ, దైవమే ఇక్కడ కూర్చున్నారు. మాట్లాడుతున్నారు అని నా కన్పించేది. మన గొప్ప భాగ్యం కొద్దీ ఆ సర్వోత్కృష్టమైన చైతన్యమే మానవ శరీరమనే వస్త్రాన్ని ధరించి, కరుణతో, మనస్థాయికి దిగివచ్చి, మనకు ఆత్మ విద్య యొక్క సత్యాన్ని - ఆత్మ జ్ఞానాన్ని వివరించే కార్యక్రమం చేపట్టింది. అటువంటి ఆలోచనలు ఎల్లప్పుడు నేను భగవాన్‌ను ఆయన బోధలను స్పష్టంగా అర్థం చేసుకునేటట్లు చేసినవి.

నేను నారాయణ అయ్యర్‌కు చెప్పాను, "నేను ఇరువది నాలుగేళ్ళ వయసులో ఆశ్రమానికి వచ్చినపుడు, వేదాంతము యొక్క పూర్తి అవగాహన లేదు. నాకు వేదాంతంలో ఎమ్.ఎ డిగ్రీ ఉన్నప్పటికీ, ప్రాచ్య, పాశ్చాత్య వేదాంతములతో పరిచయం ఉన్నప్పటికీ, హిందూమత సారమైన (అత్యంత కీలకమైన) వేదాంతాన్ని గ్రహించలేకపోయాను. అది విస్తారముగానూ సంక్లిష్టము గాను ఉండుటచే, నేను ప్రయాస పడుతుండే వాడిని. కొందరు ఆశ్రమ వాసులు, సంస్కృతము నేర్చుకుని ఆదిశంకరుల రచనలను చదవండి. అపుడు మీరు భగవాన్ బోధలను గ్రహించ గలుగుతారు," అని చెప్పారు. నారాయణ అయ్యర్, "అప్పుడు మీరేమి చేశారు?" అన్నారు. సాధన చెయ్యటం, అది ఏ విధమైన సాధన అయినా, సరే, వివిధ రకములైన మతముల గురించీ, వేదాంతముల గురించీ, తెలుసుకొనుట కంటె ముఖ్యమైనది అని నేనను కున్నాను. నారాయణ అయ్యర్, "భగవాన్‌ను ప్రశ్నలడిగినపుడు నేను గూడా సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నాను. నా సమస్యను భగవాన్ త్రుటిలో ఎలా నివృత్తి చేశారో చూడు. ఒకప్పుడు బాగా విద్యాధికులైన వేదపండితులు, వేదములలోని భాగముల గురించి, ఉపనిషత్తులను గురించి, సంస్కృతములోని శాస్త్ర గ్రంథముల గురించి చర్చించు కుంటున్నారు. భగవాన్ వారికి సరియైన వివరణలను ఇస్తున్నారు. అది నిజంగా చూడదగ్గ, గుర్తుపెట్టకోదగిన, ఆనందించదగిన దృశ్యము. అదంతా చూస్తూ, ఈ పండితులైన వీరు, ఇటువంటి గొప్ప విషయాలను భగవాన్‌తో చర్చిస్తున్నారు, అనుకుంటే, సిగ్గుతో కుంచించుకునిపోయాను. వారికి తెలుసుకోవాలనే అభిలాషయున్నది. అదే సమయంలో, విషయాన్ని గురించిన చక్కటి అవగాహన ఉన్నది. వాళ్ళతోపోలిస్తే నేనెంతటి వాడిని?" శాస్త్ర పరిజ్ఞానం విషయానికి సంబంధించి నేను ఒక సున్నాలాటి వాడిని. నేను శాస్త్ర పరిజ్ఞాన హీనుడిని. ఇటువంటి ఆలోచనలతో నా తల నిండిపోయింది. ఆ పండితులు వెళ్ళి పోయిన తర్వాత భగవాన్ నా వైపుకు తిరిగి, "ఏమిటి?" అంటూ, నా భావాలను చదువుతున్నట్లుగా నా కళ్ళల్లోకి లోతుగా చూశారు. నాకు బదులిచ్చే అవకాశము ఇవ్వకుండానే, భగవాన్ చెప్పసాగారు,"ఇదంతాపై పొట్టు మాత్రమే. పుస్తక పరిజ్ఞానము, వేద పారాయణ చేయగల్గిన శక్తి కల్గియుండుట

వలన కలిగే ప్రయోజనము శూన్యము. సత్యమును తెలుసుకొనుటకు, మీరు, ఈ విద్యార్జన అనే బాధను (చిత్రహింసను) పడవలసిన పనిలేదు. ఆ తర్వాత ఆయన ఒక చక్కటి వాక్యాన్ని అన్నారు, "చదవటం ద్వారా (విద్యార్జనచేయుట ద్వారా) మీరు సత్యాన్ని జేరుకోరు. మీరు ప్రశాంతంగా ఉండండి. అదే సత్యము. నిశ్చలంగా ఉండండి అదే దైవము." అప్పుడు ఎంతో కరుణతో ఆయన మరల నా వైపునకు తిరిగారు. ఈ సారి ఆయన గొంతులోనూ, వైఖరిలోనూ మార్పు ఉన్నది, "నారాయణ అయ్యర్ మీరు గడ్డము చేసుకుంటారా?" నేను ఒక్కసారిగా భగవాన్ వ్యక్తిగతమైన ప్రశ్న వేసే సరికి తికమకపడ్డాను. 'అవును' అని సమాధాన మిచ్చాను, భగవాన్ అప్పుడిలా కొనసాగించారు," మీరు గడ్డము చేసుకొనడానికి అద్దాన్ని ఉపయోగిస్తారు గదా. మీరు అద్దంలోనికి చూస్తూ గడ్డము చేసుకుంటారు. మీరు అద్దములోని ప్రతిబింబమునకు గడ్డము చెయ్యరు కదా, శాస్త్రగ్రంథములన్నీ గూడా మీకు సాక్షాత్కారమునకు మార్గము చూపుట కొరకు ఉద్దేశింపబడినవి. ఆచరించి, పొందటానికని అవి ఉద్దేశించబడినవి. కేవలము పుస్తక పరిజ్ఞానము, చర్చలు అద్దములోని ప్రతిబింబమునకు గడ్డము గియ్యడము వంటివే." దానితో నాకు పెద్ద భారము దిగిపోయింది. భగవాన్ ఆ మాటలు అన్న తర్వాత, నా ఆత్మనూన్యతా భావము శాశ్వతంగా నన్ను విడిచి పోయింది. భగవాన్ మాటల వలన జరిగిన మరొక ప్రయోజనమేమిటంటే, అప్పటినుండి, నేను నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండగలుగుతున్నాను. అది దాదాపు నాసొత్తు అయిపోయింది. నేను నారాయణ అయ్యర్ మాటలు వింటుండగా, నేను గూడా అటువంటి ప్రశాంత నిశ్చలత్వ స్థితిలోనికి గొనిపోబడ్డాను. నేను గూడా ఇంకా ఎక్కువ పరిజ్ఞానమును సంపాదించాలి అనే పిచ్చిని వదలిపెట్టి,లోనికి మునుగుట ప్రారంభించాను. ప్రశాంతంగా ఉండు. అదే సత్యము. నిశ్చలంగా ఉండు. అదే దైవము.

నారాయణ అయ్యర్‌కు సంబంధించినంత వరకు నేను సంతృప్తి చెందని పృచ్ఛకుణ్ణి, సంతృప్తి చెందకుండా ప్రశ్నలు అడుగుతూనే ఉండేవాడిని. ఆయన భగవాన్ నుండీ ఉపదేశమేమైనా పొందారా? అని, దాని ప్రకారము జీవించారా అని తెలుసుకోవాలనుకున్నాను. నారాయణ అయ్యర్ అన్నారు, "గణేశా! భగవాన్ నాకు ప్రత్యేకమైన ఉపదేశాన్ని ఇచ్చారు. భగవాన్ నాకు చేసిన వ్యక్తిగత బోధ, నాకు అత్యంతవిలువైనది. అది నా సహజ ప్రకృతిగా మారిపోయింది. ఆ తర్వాత ఆయన చెప్పినది చాలా విశేషమైనది. "నాకు వేదాంతము తెలియదు. నేను గృహస్థును కాబట్టి కొన్ని కఠినమైన నియమనిష్టలను పాటించలేను, " అని ఏడ్చాను. "నేను భగవాన్‌ను, సత్యానికి మార్గము చూపి నాకు సాయపడండి, లేదా సత్యాన్నే చూపండి, " అని ప్రార్థించాను. "నేను నిర్మొహమాటంగా భగవాన్‌కు చెప్పాను, "మీ ఆత్మ విచారణా మార్గము, నాకు చాలా కష్టముగా ఉంది" అని. భగవాన్ కరుణతో నా వైపు తిరిగి, "నారాయణ అయ్యర్, 'మీకు ఉళ్ళదునార్పదు తెలియునా? అది కేవలం సత్యాన్నే ఇస్తుంది. అది కేవలం సత్యాని కి సంబంధించినది. కేవల సత్యాన్నే వివరిస్తుంది. దానిని ఒక్కొక్క పద్యమే చదువుతుండు. ఆ పద్యాలలోని మాటలు కొన్ని రోజులకు మాయమై కేవలము సత్యమే ప్రకాశిస్తుంది. పాము కుబుసం వదలిన తర్వాత మెరిసిపోయినట్లుగా," అదే నా సాధన, గణేశన్, నేను మరల మరల దానినే చేస్తూ ఉన్నాను. నాకు తీరిక దొరికినప్పుడల్లా 'ఉళ్ళదునార్పదు' (ఉన్నది నలుబది) అనుకుంటూ (పాడుకుంటూ) ఉంటాను." నేను మంత్ర ముగ్ధుడనై వింటూ ఉండిపోయాను.

(కనకమ్మాళ్ అనే పాత భక్తురాలు జనవరి1, 2010 న భగవాన్ జయంతి రోజున భగవాన్ సమాధి హాలులో తనువు చాలించారు) కనకమ్మ గారిని నేనొకసారి, నారాయణ అయ్యర్ గూర్చి అడిగాను. ఆమె ఈవిధంగా చెప్పారు. నారాయణ అయ్యర్ సంపన్నకుటుంబానికి చెందిన వారు. కానీ సాధారణంగాను, అణకువతోనూ ఉండేవారు. ఆయన భార్యగూడా ఆయన ఆదర్శములలో పాలు పంచుకొని, ఆయన నడచుకోమన్న రీతిగా నడుచుకునేది. ఆయన ఇంట్లో ఉన్నపుడు 'ఉళ్ళదునార్పదు' (ఉన్నదినలుబది) ని గొంతెత్తి పాడుతుండేవారు. ఆవులను మేపటము, తోటపని చెయ్యటము అనేవి ఆయనకు చాలా ఆసక్తి ఉన్న పనులు. ఎప్పుడైనా ఆవు, దూడకు జన్మనివ్వడము జరిగితే, ఆయన ఆవునూ, దూడనూ కూడ ప్రత్యేక శ్రద్ధతో చూచేవారు. ఆవు దూడకు జన్మనిస్తున్న సమయాన ఆయన 'ఉళ్ళదునార్పదు' పాడుతుండేవారు. ఒకసారి అయ్యర్ భార్య కనకమ్మగారితో, "ఆవులు దూడలకు జన్మనిచ్చే సమయంలో, అయ్యర్‌చే వాటి పట్ల చూపించ బడే శ్రద్ధ ఎనిమిది మంది బిడ్డల తల్లినైన నా పట్ల ఎన్నడూ చూపబడలేదు."

భగవాన్ బోధల పట్ల, ఉపదేశాల పట్ల ఉత్తర్వుల పట్ల నారాయణ అయ్యర్ యొక్క అంకిత భావం, ఎంతో శ్రద్ధతో కూడినది. శక్తి వంతమైనదీ. "మీకేప్పుడైనా ఏదైనా సందేహము ఉండి, అది పూర్తిగా భగవాన్‌చే తుడిచివేయబడిన సందర్భమేమైనా ఉన్నదా?" అని నేనొకప్పుడు నారాయణ అయ్యర్‌ను అడిగాను. ఆయన దయతో ఈ క్రింది సంఘటన తెలిపారు, "నేను భగవాన్ సోఫా వద్ద కూర్చుని ఉన్నాను, 'నువ్వు చూచేదంతా మాయ', అని చెప్పే ఆర్యోక్తిని తలచుకుని నేను, సందిగ్ధంలో పడ్డాను. సోఫా పై కూర్చుని ఉన్న భగవాన్, ఆయనకు మాకు అడ్డుగా పెట్టబడిన చెక్క ఫ్రేము, నేను ఎలా కల్పితములు అవుతాము? ఎలా అసత్యము అవుతాము" నేను భగవాన్‌ను అడిగాను, మనమందరము 'అసత్యము', ఉనికి లేని వారమేనా? భగవాన్ నవ్వి ఆ ముందు రాత్రి నాకేమైనా కలవచ్చిందా? అని అడిగారు. నేను వచ్చిందనీ, అనేకమంది జనులు నిద్రపోతున్నట్లు ఆ కలలో చూశాను అన్నాను. "నేను మీరు వెళ్ళి ఆ కలలో కన్పించిన వారినందరినీ లేపి, వారికి మీరు అసత్యము అని చెప్పండి అంటే, అది, అనుచితంగానూ, అసంగతంగానూ ఉండదా? నాకిప్పుడు అలాగే ఉన్నది. కలకనేవాడు తప్ప మిగిలిన దేదీ లేదని రూఢిపరచుకొనండి. కాబట్టి కలలో ఉండేవారు వాస్తవమా, అవాస్తవమా అనే ప్రశ్నకు తావెక్కడ? వారిని లేపి, మీరు అవాస్తవమైనవారు అని చెప్పటం అనే ప్రసక్తి ఎలా ఉంటుంది? మన మందరమూ అవాస్తవమే. అసత్యమే. 'అది' ఒక్కటే సత్యము. ఆ వివరణ తర్వాత నాకు ఈ ప్రపంచం యొక్క అవాస్తవికతపైన ఏ సందేహాలూ లేకుండాపోయినవి. నేను ఎల్లపుడూ దాని అవాస్తవికతను అనుభూతి చెందుతున్నాను." మరొక రోజు భగవాన్, నారాయణ అయ్యర్‌తో, "అన్నీ కలలోని వస్తువులవలె అసత్యమైనవి. కానీ ఒక దశలో, సత్యమూ ఉంటుంది. అసత్య జగత్తూ ఉంటుంది. అక్కడ 'సాక్షాత్కారం' చెందిన వ్యక్తి చెయ్యవలసిన పని, 'ఇతరులకు' వారు చూసేదీ, అనుకునేదీ అంతా అసత్యమనేది వారికి తెలియ జెయ్యడమే. వారిలోని శుద్ధచైతన్యమే సత్యము అని చెప్పుటయే. దీనిని దేనితో పోల్చవచ్చునంటే, ఒక ఏనుగు, సింహమును గురించి కలకన్నట్లు. నిద్రలేచిన తర్వాత సింహము అవాస్తవమని, ఏనుగు మాత్రమే వాస్తవమనీ ఏనుగు గుర్తిస్తుంది. ఏనుగు, ఒక వ్యక్తి (జీవుడు), 'కల' అనిత్యమైన ప్రపంచం, సింహము జ్ఞాని లేదా గురువు, గురువు సత్యమునకు అసత్యమునకు మధ్య వారధి, మరొక సందర్భంలో నారాయణ అయ్యర్ నాతో ఇలా చెప్పారు, "భగవానొకసారి, అసలు జ్ఞాని గానీ సాక్షాత్కారము పొందిన వ్యక్తిగానీ లేదు. ఉన్నది కేవలము జ్ఞానమే" అన్నారు.

నారాయణ అయ్యర్, తిరువణ్ణామలై నుండి దూరంగా ఉన్న ఊరిలో సబ్‌రిజిస్ట్రార్‌గా నియమింప బడ్డారు. ఆయన కోరుకున్నపుడెల్లా భగవాన్ వద్దకు వెళ్ళ లేకపోయారు. ఆయన పాలుతాగే చంటిబిడ్డ, తల్లివద్దకు చేరుకోవాలని తహతహలాడినట్లుగా బాధపడ్డారు. అప్పట్లో బస్సులుగానీ, టాక్సీలు గానీ దరిదాపుగాలేవు. నారాయణ అయ్యర్ కొన్నిసార్లు, భగవాన్ వద్దకు రావటానికీ, తిరిగి వెళ్ళటానికీ, లారీలను పట్టుకుని వెళ్ళేవారు. ఒకరోజు ఆశ్రమానికి రాత్రి ఎనిమిదిన్నరకు వచ్చారు. ఆయనకు ఆశ్రమం ఎదురుగా ఇల్లు ఉన్నది. ఆయన స్నానం చెయ్యకుండా భోజనం చెయ్యకుండా హడావిడిగా ఆశ్రమానికి వెళ్ళారు. ఆయన నిరంజనానందస్వామిని మర్యాద పూర్వకంగా కలియుటకూ ఆశ్రమ ఆఫీసుకు వచ్చారు. ఆయన అప్పుడు కొంతమందితో దేనిని గురించో చర్చించుతూ ఉన్నారు. నారాయణ అయ్యర్‌కు ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే ఆశ్రమంలో అందరూ ఎనిమిది గంటలకల్లా నిద్రిస్తారు. సర్వాధికారి ఆయనను పిలచి, "నారాయణ అయ్యర్, ఇలా రండి. భగవాన్‌కు యాక్సిడెంట్ అయ్యింది, ఆయన మెడ క్రింద భుజమునకు కలిసే ఎముక (కాలర్‌బోన్) విరిగింది. అందుకని ఆయన పక్కను పాతహాలుకు చిన్న బావికి మధ్యలో వేశాము. ఆయనకు కొంతదూరం నుండే నమస్కరించుకుని వెళ్ళిపొండి. ఆయన విశ్రాంతి భంగంచెయ్యవద్దు. కదిలించవద్దు. భగవాన్‌కు ఎముక విరిగిందని తెలిసిన తర్వాత, నేనక్కడకు వెళ్ళకుండా ఎలా ఉండగలను? నిరంజనానందస్వామి చెప్పిన సూచనల ప్రకారం ఆయన పిల్లిలాగా చప్పుడు చెయ్యకుండా వెళ్ళి, భగవాన్‌ను దూరం నుండే నమస్కరించారు. భగవాన్ ఆయనను "నారాయణ అయ్యర్! ఇక్కడకురా," అన్నారు. ఆయన తానేమీ శబ్దం చెయ్యలేదు కనుక ఎవరూతనను గమనించలేదు, అనుకున్నారు. భగవాన్, తిరిగి అన్నారు." నారాయణ అయ్యర్, నువ్వేమీ చప్పుడు చెయ్యకుండా ఉండాలని ప్రయత్నించటము నేను చూడగలిగాను. అప్పుడు మంచం మీద పడుకునే చాలా వింత విషయాన్ని చెప్పారు. "నారాయణ అయ్యర్ వచ్చి నా ప్రక్కన కూర్చో," బహుశా అతను ఆయన ప్రక్కన కూర్చున్న రెండవ వ్యక్తి అయిఉంటారు. (మరొక వ్యక్తిని నేను, నా కప్పటికి ఒకటి లేదా ఒకటిన్నర సంవత్సరాల

వయసు ఉండవచ్చును.) భగవాన్, "ఈ ప్రకృతి వైద్యుడు ఈ కట్టు కదలకూడదన్నారు. నేను నిన్నుచూడాలి, మాట్లాడాలి." సర్వాధికారి తనను చూస్తే చీలికలు చేసేస్తారేమోనని అయ్యర్ భయపడ్డారు. కాని క్షణంలో, ఆ భయాన్ని ప్రక్కకు నెట్టి భగవాన్ చెంతకు వెళ్ళారు. ఆయన కూర్చోగానే, భగవాన్ చెప్పసాగారు, "ఈ ఉదయాన్నే నేను కొండపైకి వెళ్తుండగా, ఒక కుక్క ఒక ఉడుతను వెంటాడుతుంది. నేను నా చేతి కర్రను ఆరెండిటి మధ్యనుంచాను. అప్పుడు నేను జారిపడగా మెడ వద్ద ఉండే ఎముక (కాలర్‌బోన్) విరిగింది. భక్తుడైన ఒక ఎముకలకు కట్టుగట్టే ప్రకృతి వైద్యుడు ఏవో ఆకుపసర్లూ, మినపప్పూ, కలిపి పట్టీవేసి, మీరు దయచేసి చెయ్యి కదలించవద్దని చెప్పారు." నారాయణ అయ్యర్ ప్రాణాపాయస్థితిలో ఉన్న ఉడుతపైనా, తనకు కట్టుకట్టి చెయ్యి కదలించవద్దని ప్రార్థించిన భక్తుని పైనా నా ఒకే విధమైన శ్రద్ధ కనబరిచిన భగవాన్‌ను చూచి చలించిపోయారు.

భగవాన్ జయంతి నాడు ఆశ్రమానికి రావటాన్ని, సాధారణంగా మానేవారుకాదు అయ్యర్. ఒకసారి ఆయన అరువది మైళ్ళ దూరాన ఉన్నారు. ఒకలారీ తర్వాత మరొక దానిని ఎక్కి ఎలాగో అర్ధరాత్రి ఒంటిగంటకు ఆశ్రమానికి చేరుకున్నారు అయ్యర్. ఆయన అదేరోజు అయిదు గంటలకు బయలుదేరి వెళ్ళిపోవాలి. ఎందుకంటే, తొమ్మిది గంటలకల్లా, ఆయన కార్యాలయంలో ఉండాలి. ఆయన సెలవు తీసుకుంటూ, నమస్కరిస్తుండగా, భగవాన్ ఆయన చేతిని పట్టుకుని, "రండి, నారాయణ అయ్యర్ మీరు ఏమైనా (తిందురుగాని) తీసుకుందురు గానీ."అన్నారు భగవాన్, ఆయనను వంటగదిలోనికి తీసికువెళ్ళారు. వాళ్ళిద్దరూ కలసి గిన్నెలన్నీ వెదికారు కానీ, వారికేమీ కనపడలేదు. ఎందుకంటే, పాత్రలూ, గది నేలతో సహా ఆ ముందు రాత్రే చక్కగా నీటితో కడుగబడినవి. వంటశాలలోని మరొక చిన్న గదిలోనికి వెళ్ళి, భగవాన్ కుండలూ, తపేళాలు అన్నీ వెదికారు. అదృష్టవశాత్తు ఆయనకు కొద్దిగా సీమబాదం పప్పు కన్పించాయి. ఆయన బయటకు వచ్చేసరికి పొయ్యిలో మంట దాదాపుగా ఆరిపోయింది. ఆయన మరికొన్ని పుల్లలు పొయ్యిలో పెట్టి, ఒక బాండీని (మూకుడు) దానిపై ఉంచారు. అందులో కొంచెము నెయ్యి వేసి, ఆ బాదం పప్పుని వేయించారు. దానికి కొంచెం కారం, ఉప్పూ కలిపారు. ఒక ఆకులో (విస్తరి) వాటిని ఉంచి, ఏమీ తినకుండా ఎలా వెళ్తావు? అంటూ వాటిని అయ్యర్‌కు ఇచ్చారు. ఏమి జరుగుతుందోనమ్మలేకపోయినా, ఏదో స్వర్గంలో ఉన్నట్లుగా అన్పించింది. అయ్యర్‌కు, ఆయన అప్రయత్నంగానే భగవాన్ మాటనుపాటించారు. అప్పుడు భగవాన్ లేచి మరొక విస్తరాకునూ, దినపత్రికనూ తీసుకుని, మిగిలిన బాదంపప్పును అందంగా, హోటల్స్‌లో పార్శిల్ కట్టినంత పొందికగా పొట్లం కట్టి, అయ్యర్‌కు యిస్తూ మీరు ఇంటికి వెళ్ళేసరికి, లలిత, మీ పిల్లలూ కూడా, భగవాన్ వద్ద నుండి మాకేమి తెచ్చారు?" అని అడుగుతారు. దీనిని తీసుకుని వెళ్ళి వారికి యివ్వు." అన్నారు. ఇదంతా చెబుతూ, "నేను ఈ ప్రత్యేకమైన వాటిని ఎలా మరిచిపోగలను? నేను వాటిని చెబితే ఎవరు నమ్ముతారు?" అంటూ ఏడ్చేశారు.

నారాయణ అయ్యర్ పెద్ద కుమార్తె, వివాహం జరుపవలసి వచ్చినపుడు నిశ్చితార్థము జరిపించడానికి ఆయన వద్ద ధనము లేదు. హిందు ఆచారం ప్రకారం దానికి కొంత తతంగం, పూజా జరిపించాలి. కొన్ని వస్తువులు అవసరమవుతవి. అయ్యర్ భార్య, "మీరు భగవాన్ వద్దకు వెళ్ళి ఎందుకు భగవాన్‌ను అడగరు?" అని ప్రశ్నించారు. ఆయన, నేనెన్నడూ, భగవాన్ వద్దకు వెళ్ళి ప్రాపంచికమైన వస్తువులు కోరను", అన్నారు. ఆమె ఆ నిశ్చితార్థము ప్రాముఖ్యత తెలుపుతూ భగవాన్‌ను ప్రార్థించింది మౌనంగా. ఆ తర్వాత ఆ దంపతులు, భగవాన్‌ను దర్శించి నమస్కరించారు. వారు ఒక్క మాట కూడా ఆయనకు చెప్పలేదు. మర్నాడు ఉదయం పోస్టుమాన్, ఏబది యొక్క రూపాయల మనీ ఆర్డర్ తీసుకునివచ్చారు. (ఆ మనియార్డరు రసీదును నాకు కూడా చూపారు, అయ్యర్). అది తిరువణ్ణామలైకు, వెయ్యి మైళ్ళ అవతల ఉన్న అహమ్మదాబాద్ నుండి వచ్చింది. అందులో ఉత్తరము పంపుతున్నాము, అనే సందేశం వ్రాయబడి ఉన్నది. ఆ దంపతులు ఆ డబ్బుతో కావలసిన వన్నీ కొన్నారు. కాబోయే వరుడు వచ్చారు. మంచి అతిథి సత్కారములను అందుకున్నారు. వివాహం నిశ్చయమైనది. ఆ దంపతులు ఆ ఉత్తరం కొరకు ఎదురు చూస్తున్నారు. ఆ ఉత్తరం ఒక గుజరాతీ పెద్దమనిషి నుండి, వచ్చింది. వారికి ఆయన గురించి తెలియదు. ఆయన, ప్రియమైన నారాయణ అయ్యర్, భగవాన్ నా కలలో కన్పించి, నన్ను వెంటనే టెలిగ్రాఫ్ మనిఆర్డర్ ద్వారా ఏబదిఒక్కరూపాయిలు పంపించమని చెప్పారు. ఆయన మీ అడ్రస్ కూడా ఇచ్చారు. మీరెవరో

నాకు తెలియదు. ఈ పైకము ఎందుకో కూడా నాకు తెలియదు. దయచేసి ఈ డబ్బును తిరస్కరించవద్దు. దయచేసి స్వీకరించండి. (నేను, ఆ ఉత్తరాన్ని కూడా చూశాను) నారాయణ అయ్యర్, ఆయన భార్య, కుమార్తె గూడా భగవాన్ వద్దకు వెళ్ళి కన్నీటితో ఆయనకు నమస్కరించి, "భగవాన్, మీరు ఎటువంటి కరుణను మాపై కురిపిస్తున్నారు! అన్నారు, భగవాన్ ఎవరో అనుగ్రహం చూపినట్లుగా ఆ ఉత్తరాన్ని చదివారు. ఆయన తన దృష్టిని వారిపై నిలిపి, "సందేహమెందుకు? మీరు నన్నెందుకు అడుగరు? అన్నారు. ఇదేనేను మీకు చెప్ప దలచుకున్నది. "ఆయన మీకు అత్యున్నతమైన ఆత్మసాక్షాత్కారాన్నే ఇవ్వగలిగినపుడు, ఈ సాధారణమైన వాటిని ప్రసాదించరా?"

ఒకరోజు భగవాన్ పాతహాలులో, "కనపడేదంతా అసత్యమే, చూచే వాడు మాత్రమే సత్యము", అని దృఢంగా చెప్పారు. మరునాడు మధ్యాహ్నము, భగవాన్ వంటరిగా ఉన్నపుడు, నారాయణ అయ్యర్, ఆయన ఎదురుగా కూర్చుని, "భగవాన్, అంతా అసత్యమేనా? సాక్షాత్తూ పరమాత్మ అయిన మీరు కూడా అసత్యమేనా? ఈ హాలు అసత్యమేనా? మన ఇద్దరికి మధ్య నున్న ఈ కొయ్య చత్రము కూడా అసత్యమేనా? వీటన్నిటినీ చూస్తున్న నేను కూడా అసత్యమేనా?" అని ప్రశ్నించారు. శ్రీ భగవాన్ చక్కటి చిరునవ్వు నవ్వి అన్నారు, "సందేహానికి తావేది? చూడబడేదంతా అసత్యమే, అబద్ధమే, కానీ "మీలో ఉన్న వస్తువు, ఏదైతే దీని నంతటినీ చూస్తూన్నదో, అది మాత్రమే సత్యము. మిగిలిన దంతా అసత్యము."

నారాయణ అయ్యర్ ఒకసారి భగవాన్‌తో "భగవాన్, నేనిక్కడ ఎన్నో సంవత్సరముల నుండి ఉంటూ ఉన్నాను. జనులు ధ్యానం చేసి సమాధిలోనికి వెళ్తారు. నేను ఒక్కనిముషం కనులు మూసుకుని కూర్చుంటే నా మనసు పదిసార్లు ప్రపంచమును చుట్టివస్తుంది. ఎన్నో (ఎప్పుడో) మరచిపోయిన విషయాలు కూడా. గుర్తుకువస్తవి. నేను బాధపడుతున్నాను," అన్నారు. దీనిని వినటంతోనే భగవాన్, నువ్వు ఇతరుల గురించి ఎందుకు పట్టించుకుంటావు? వాళ్ళు ధ్యానం చెయ్యవచ్చును. నిద్ర పోవచ్చును. లేదా గురక పెట్టవచ్చును. మీరు మిమ్మలను గమనించుకొనండి, "మనసు బాహ్యంలోనికి వెళ్ళినపుడు, దానిని ఆత్మ వైపునకు మరలించండి. అశాంతితో నిండిన చంచలమైన మనస్సు ఎటువైపునకు పోయినా, దానిని మరల ఆత్మవైపుకు మరలించు" అని చెప్పే శ్లోకమొకటి భగవద్గీతలో ఉన్నది. కానీ అయ్యర్ భగవాన్ చెప్పిన దానితో తృప్తి నొందలేదు. అపుడు తల్లియైన భగవాన్ మరింతగా వివరించారు. నిద్రించిన శిశువుకు పాలు త్రాగించినా, అది మర్నాడు తల్లిని, రాత్రి నువ్వు నాకు పాలు యివ్వలేదు అంటుంది. అలాగే నువ్వు కూడా, పూర్తిగా పొందియే ఉన్నావు. భగవాన్ అయ్యర్‌కు ఇచ్చిన హామీ మనందరకూ వర్తిస్తుంది.

భగవాన్ మొదటి ఆరాధన ఉత్సవం జరిగినపుడు ఎంతో మంది పాత భక్తుల నడుమ ఉన్నాను. వారెంతగానో దుఃఖిస్తున్నారు. ప్రశాంతమైన భగవాన్ రూపము వారిని వదలి వెళ్ళిపోయిందని వారు బాధపడుతున్నారు. నారాయణ అయ్యర్ మిక్కిలి రోదిస్తున్నారు. నేను ఆయనను కౌగిలించుకుని, (మీరు ఏవిధంగా భావిస్తున్నారు) 'మీకు ఇప్పుడు ఏ విధంగా అన్పిస్తున్నది?' అని అడిగాను. 'నేనిప్పుడు చెప్పలేను' అన్నారు. ఆయన భావాలను వ్రాసి ఉంచమని చెప్పాను. ఆయన గిరిపాదము వద్ద కూర్చుని వ్రాశారు. ఆ వ్రాయబడ్డ ఆ ఆలోచనలు అన్నీ, 'మౌంటెన్ పాత్' అనే ఆశ్రమ ప్రతికలోనూ, 'మూమెంట్స్ రిమెంబర్డ్' (జ్ఞప్తికి తెచ్చుకొనబడిన క్షణము)లోనూ ప్రచురించబడినవి. ఈ క్రింది కదలించి వేసే వాక్యాలు, భగవాన్ మొదటి ఆరాధన ఉత్సవాల సమయంలో నారాయణ అయ్యర్ చేత వ్రాయబడ్డవి. "భగవాన్! భగవాన్! నా ప్రియమైన భగవాన్, మీరు మమ్ము విడచి వెళ్ళినరోజుయిదేనా? 1950 ఏప్రిల్ 14 వ తేదీ సాయంత్రం మురుగనార్, నేనూ క్యూలో (వరుస) నిల్చుని ఉండటము నాకు స్పష్టముగా గుర్తున్నది. మాణిక్యవాచకర్ వలెనూ, తాయుమానవర్ వలెనూ, నా రోమములు నిక్కబొడుచు కున్నవి అనగలనా? నేను, సిగ్గువిడచి ఏడ్చాను. నన్ను నేను, నిభాయించుకొనలేక ఏడ్చాను, దుఃఖం ఉవ్వెత్తున ముంచుకుని రాగా ఏడ్చేశాను. నా స్నేహితుడు, నేను, మురుగనార్ మాత్రమే అపుడు మీతో ఉన్నాము. మీరు బోర్లా పడుకుని యున్న శరీరాన్ని తల (బెడ్) ప్రక్కవైపు తిరిగి ఉన్నపుడు చూచి ఏమి చెయ్యాలో తెలియక ఉన్నాను. కానీ మీరు తిరిగి దుఃఖంతో నిండిన జనం వైపు దృష్టి సారించారు. తర్వాత మీరు వెనుకకు తిరిగి కనులు మూసుకున్నారు. మేమింకా అక్కడ దుఃఖిస్తూనే ఉన్నాము. అప్పుడు మీరు మావైపుకు తిరిగి చూశారు. ఓ ప్రభూ, అది (వీడ్కోలు పలుకు) సెలవు తీసుకుంటూ చూసిన చూపా? అదే చివరిది, చిట్టచివరి చూపా? మాకు ఉపశమనం కల్గించే విధంగా "నేనెక్కడకువెళ్ళగలను? నేను ఇక్కడనే

ఉన్నాను, అని పలికిన శాశ్వత సత్యము అయిన మీ పలుకులే మమ్ములను నిలిపి ఉంచినవి, మీ ప్రేమను అనుభవించ గల్గిన వేలకొలది అనుభవములను, నేనెట్లు మరువగలను? మీరు స్వయంగా పొయ్యి వెలిగించి ప్రత్యేకంగా వేయించి యిచ్చిన సీమబాదంపప్పులు, వెంకటరత్నంను నా కొరకు ఉంచమన్న వేరుశనగకూటుల యొక్క రుచి యింకా నా నాలుక మీదనే ఉన్నది. నన్ను నా కార్యాలయ సంబంధమైన (ఆఫీసు విషయమునకు సంబంధించిన) సమస్య నుండి బయట పడేటందుకు సహాయపడమని, నా స్నేహితుడు ప్రొఫెసర్ సుబ్బరామయ్యగారు, 'పాపం నారాయణ అయ్యర్, భగవాన్ ఆయనకు సాయం చెయ్యరా?" అని అడిగినప్పుడు, "అతనికి కొరత ఏమున్నది?" అని మీరు అనలేదా? మీ ఆఖరి రోజులలో "నాకు రక్షణ నివ్వండి, భగవాన్" అని సుబ్బరామయ్య ప్రార్థించినపుడు, మీరు ఒక్క మాటలో నేను ఇచ్చాను (ఇవ్వబడినది) అన్నారు. ఆ సమయంలో ఆయన చేతిని పట్టుకుని ఉన్న నన్ను ఆ అభయం నాకు కూడా వర్తిస్తుంది అన్నట్లుగా చూశారు. మీరు నాపై అనుగ్రహాన్ని కురిపించిన సంఘటనలెన్నో? ప్రభూ! అవి అన్నీ ఎలా వృధా అవుతవి? నేను వ్రాసిన పేజీలెన్నో నా కన్నీటితో మసకబారినవి అయ్యాయి. భగవాన్! మీకు నా ప్రణామములు. ప్రేమతోనిండిన ఆలోచనలతో నేనెపుడూ, మీ పవిత్ర పాదాలను అంటిపెట్టుకొనే ఉన్నాను. ఇక్కడ ఉన్న మిగిలిన వారి హృదయాలతో పాటు, నా హృదయం కూడా తపిస్తున్నది, దాని శాశ్వతమైన (చెక్కుచెదరని) ప్రేమను మీకు అర్పించుటకొరకు!"

అజ్ఞానముచే బాధలు పడుతున్న మన అందరినీ కాపాడుట కొఱకే భగవాన్ అరుణాచలమునకు వచ్చారు. మనము మన శరీరములతో తాదాత్మ్యము చెంది ఉన్నంత వరకూ బాధలు ఉంటూనే ఉంటవి. కానీ మీరు, 'నేనెవరు?' అని ప్రశ్నించుకుని, తద్వారా విన్పించే నిశ్శబ్దము వింటే, ఆ నిశ్శబ్దము (మౌనము) అరుణాచలుడు. ఆ మౌనమే రమణులు, ఆ మౌనమే (నిశ్శబ్దమే) మన నిజ స్వభావము.



డాక్టర్ టి.ఎన్. కృష్ణస్వామి

మిగిలిన అందరి వలె గాక డాక్టర్ కృష్ణస్వామికి, మాత్రము భగవాన్ భౌతికశరీరమే సర్వస్వము. అరుణాచలమంతా పవిత్రమైనదియేనని, అది కేవలం పరమాత్మయేనని, భగవాన్ ఆయనకు విశద పరిచారు. అది ఎలా జరిగిందో టి.ఎన్.కె మాటలలో చూద్దాము "ఒకరోజు, భగవాన్ వెనుక అరుణాచలము కొండపై నేను నడుస్తున్నాను. ఆయన నడుస్తూ, దారిలో నుండి ఒక చిన్న రాతిని తీసి నా ఎదుట పట్టుకుని, "గిరి పైన అత్యంత పవిత్ర ప్రదేశము నుండి, నాకొక చిన్న రాతిని తీసి యివ్వండి", అని విదేశీయులొకరు నన్ను అడిగారు. గిరి అంతయూ పవిత్రమైనదేనని, ఆయన ఎరుగరు. మనము, మనలను, మన శరీరాలతో ఐక్యపరచుకున్నట్లే (మన శరీరములతో తాదాత్మ్యము) చెందినట్లే, అరుణా చలుడు, తనను తాను ఈ గిరితో ఐక్యపరుచుకున్నారు. విశ్వాసంతో ఆయనను సమీపించినపుడు, ఆ నిశ్చలత్వమే స్వచ్ఛమైన జ్ఞానము (సత్యము). సాధకులపై కరుణతో వారి కనులకు గోచరమగునట్లు, పవిత్రమైన గిరి రూపములో వారు వెలిశారు. సాధకుడు గిరికి సమీపంలో ఉండుట ద్వారా, ఉపశమనమునూ, మార్గదర్శకత్వమునూ పొందుతారు. చెన్నైలో ప్రఖ్యాతిగాంచిన వైద్యులుగా ఉన్న డా.టి.ఎన్.కె. అరుణాచలుని గూర్చిన వివరణను భగవాన్ ద్వారా పొందుటకు మనకు సాయపడ్డారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న ఫోటోలలో ఎక్కువ శాతము, ఆయన తీసినవే. ఆయన భగవాన్ వైపు ఆకర్షించబడిన విధానం ఎంతో ఆసక్తి కరంగా ఉంటుంది. 1930 దశకంలో కృష్ణమూర్తి తన వైద్య విద్య ఆఖరు సంవత్సరము పరీక్షలకు చదువుకుంటున్నారు. సుదీర్ఘ కాలంగా కొనసాగిస్తున్న కఠోరమైన పరిశ్రమ నుండి (కష్టపడి చదవటం) చిన్నపాటి (స్వల్ప) విరామం తీసుకుందా మని, ఆయన తన స్నేహితులతో కలసి పురాతన మైన వెల్లూరు కోటకు వెళ్ళారు. తీరా అక్కడకు వెళ్ళిన తర్వాత, అక్కడ ఆయనకు ఫోటోలు తియ్యడానికి ఆసక్తి కరమైన అంశాలు ఏమీ కనబడలేదు. ఆయన నిరాశ చెందారు. అది చూసి అక్కడి స్థానికులొకరు, "ఎందుకు నిరుత్సాహపడతారు? తిరువణ్ణామలైకు వెళ్ళండి. అక్కడ ఒక పురాతనమైన (ఠీవిగా ఉండేటటువంటి) గొప్ప ఆలయమున్నది. అది మీ కళ్ళకు, మీ కెమేరాకు విందు చేస్తుంది" అన్నారు. అందుకని ఆయన స్నేహితులతో కలసి తిరువణ్ణామలైకు వెళ్ళారు. ఆలయంలో ఫోటోలు తీస్తుండగా, ఎవరో, "దగ్గరలో రమణాశ్రమము ఉన్నది. అక్కడ ఒక మహాత్ములున్నారు. ఆయన ఫోటోలు తియ్యవచ్చును గద," అన్నారు.

ఒక సాధువు ఫోటో తియ్యడానికి ఆసక్తికరమైన అంశంగా కృష్ణస్వామికి అన్పించలేదు. అయినప్పటికి ఆయన స్నేహితులతో కలసి ఆశ్రమానికి వచ్చారు. రమణాశ్రమంలో ఫోటోగ్రాఫర్ అనే వారు చాలా అరుదైన విషయం. ఆయనను చూసి ఆశ్రమవాసి యగు శేషు అయ్యర్, కొంచెంసేపు వేచియుండి, భగవాన్ ఫోటోలు తియ్యమని కోరారు. అంతలో కొండపైకి వెళ్ళిన భగవాన్ తిరిగి వస్తూ ఉన్నారు. శేషు అయ్యర్ ఆయనకు ఎదురువెళ్ళి, "వీరు మద్రాసు నుండి వచ్చారు. వారు మీ ఫోటోగ్రాఫ్ తీసుకొనడం కోసం వేచి ఉన్నారు" అన్నారు. భగవాన్ వారి వైపు, ప్రత్యేకించి కృష్ణస్వామి వైపు చూచి అలాగా, అయితే తీసికోనివ్వు అన్నారు. భగవాన్ ఫోటోతియ్యడానికి అనుగుణంగా నుంచున్నారు. అదే కృష్ణమూర్తి తీసిన భగవాన్ ఫోటో. తర్వాత సంవత్సరాలలో లెక్క లేనన్నిటిని తీశారు, కానీ, ఈ మొదటి ఫోటోనే కృష్ణమూర్తికి ప్రియమైనది.

ఆ బృందం వెళ్ళిపోతుండగా, ఒక కాషాయ వస్త్రములు ధరించిన సన్యాసి వారి వెనుక పరిగెత్తుకుంటూ వచ్చి కృష్ణస్వామితో, "మాకు ఆశ్రమంలో భగవాన్‌వి సరైన ఫోటోలు లేవు. మీరు కొన్ని ప్రింట్లు తీసి పంపినట్లైతే మేము భక్తులకు అందజేస్తాము," అన్నారు. కృష్ణస్వామి చెన్నై తిరిగి వచ్చి, ఫోటోలు డెవలప్ చేసి ఆ కాపీలను, ఆ సన్యాసికి పంపారు. కృష్ణస్వామి ఆ సన్యాసి యెడల ఇష్టంతో, ఆయన ఆజ్ఞలకు, విజ్ఞప్తులకు తన జీవితాంతము బద్ధులై ఉన్నారు. ఆ సన్యాసి ఎవరో కాదు, భగవాన్ సోదరులైన నిరంజనానందస్వామి, ఆశ్రమ సర్వాధికారి. ఈ మొదటి ఫోటోనే ఆయనకు ప్రీతిపాత్రమైనది అయి ఉండవచ్చును. అందుకనే దానిని తన ఆఫీసులో తగిలించుకున్నారు.

డాక్టర్ టి.ఎన్.కె ను నేను 1960 దశకంలో 'ఇంటర్వ్యూ' చేశాను. ఆయన భగవాన్ యొక్క ప్రథమ వీక్షణం గురించి యిలా చెప్పారు. "నేను భగవాన్‌ను ఈ లోహంతో చేసిన కెమెరాలో జయప్రదంగా బంధించాననుకున్నాను. కానీ భగవాన్, నేను

ఎన్నటికీ తప్పించుకుని పోలేని విధంగా తన హృదయంలో నన్ను బంధించారని నేను త్వరలోనే గ్రహించాను. "మీరు మహర్షిని మొదట చూచి నప్పుడు ఏ విధంగా అనుభూతి చెందారు?" అని నేనాయనను అడిగాను, "మహర్షి తన చుట్టూ ఉన్న వాటిని ఏమాత్రం పట్టించుకుంటున్నట్లు కనపడలేదు. ఆయన చూపు ప్రశాంతంగానూ, ఎక్కడో చూస్తున్నట్లూ ఉంటుంది. ఆయన కళ్ళు ప్రకాశవంతంగా ఉండి, ఆయన లో ఏదో దివ్యత్వము గోచరిస్తుంది" అన్నారు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి, తాను తీసిన భగవాన్ మొదటి ఫోటోను ఆశ్రమానికి పంపిన కొద్ది రోజులకు, ఆశ్రమానికి వచ్చి కొందరు భక్తులను భగవాన్‌తో కలిపి ఫోటో తియ్యవలసినదిగా అభ్యర్ధిస్తూ, ఆశ్రమం నుండి ఒక లేఖ వచ్చింది. "నేను అప్పటికి ఆ ఫోటో గురించి మర్చిపోయాను. ఎందుకంటే ఒక విద్యార్థిగా నాకు అనేక ఆకర్షణలు, వికర్షణలు ఉంటాయి గద. అందుకని ఆ లేఖ రాగానే, ఇదేదో, విసుగు కల్గించే విషయంగా మారిందే, అనుకున్నాను," అన్నారు కృష్ణమూర్తి కానీ, వింతగా ఆయన తన కెమేరాతో సహా రైలులో తిరువణ్ణామలైకు బయలుదేరారు. ఆయన ఆశ్రమంలోనికి ప్రవేశిస్తుండగానే, భగవాన్ ఆయనకు స్వాగతం పల్కుతున్నట్లుగా చక్కటి చిరునవ్వుతో ఆయనను చూచి, "వాళ్ళు గ్రూపు ఫోటో కావాలనుకుంటున్నారు. అది మీ చేత తీయించు కోవాలని వాళ్ళ కోరిక," అన్నారు. దానితో పొంగిపోయి, ఆయన సంతోషంగా గ్రూపు ఫోటో తీశారు.తర్వాత ఏదో ప్రేరణచే, "భగవాన్ దయచేసి మీ ఫోటోను తీసుకొననిస్తారా?" అని అడిగారాయన. భగవాన్, దానికి అంగీకరించి పద్మాసనములో కూర్చున్నారు. 1930, 1940 దశకములలో, అనేకమంది భక్తుల ఇళ్ళలో ఆ ఫోటో ఉండేది. తర్వాత కొద్ది కాలానికే కృష్ణస్వామి వైద్య విద్యను పూర్తి చేసుకుని, విజయవంతమైన, ప్రఖ్యాతిగాంచిన వైద్యునిగా చెన్నైలో స్థిరపడ్డారు. అప్పటినుండి అలవాటుగా, తరచు ఆశ్రమానికి రావటము ప్రారంభించారు. అలా ఒకసారి వెళ్లినపుడు, భగవాన్, "ఇప్పుడే మీ గురించి మాట్లాడుకున్నాము. వాళ్ళు మీకొక లేఖవ్రాశారు. ఇంకా పోస్టు చేసి ఉండరు. బహుశా అది నేరుగా మీ చేతికే అందజేయబడవచ్చును." అన్నారు. అలా కాకతాళీయంగా జరిగిన సంఘటన లెన్నో, "వారములూ, నెలలూ, సంవత్సరములూ అలా గడచిపోయాయి. నేను కెమెరా తీసుకుని ఆశ్రమానికి వెళ్ళటం, భగవాన్‌ను ఉదయం నుండి సాయంత్రము వరకూ ఫోటోలు తియ్యడము, జరిగేది," అన్నారాయన. (ఇవాళ మనకు లభ్యమవుతున్న భగవాన్ ఫోటోలలో ఎనుబదిశాతము ఆయన తీసినవే, తర్వాతి సంవత్సరములలో జి.జి.వెల్లింగ్స్ (బెంగుళూరు) వంటి ఇతర ఫోటోగ్రాఫర్లకు చాలా అరుదుగా మాత్రమే ఆ అవకాశం లభించేది. ఒక ఆధ్యాత్మిక అయస్కాంతము వలె, ఆయనను భగవాన్ తనవైపునకు ఆకర్షించారు. మిమ్ములను తరచు భగవాన్ వద్దకు రప్పించిన విషయమేమిటి?" అని నేనాయనను ప్రశ్నించాను. ఒక పసిబిడ్డను తల్లి వద్దకు రప్పించే విషయమేమిటి? నాకు భగవాన్ తల్లిలాంటి వారు. నాకు ఆవిధంగానే అన్పించి తరచు ఆయన వద్దకు వెళ్తుండేవాడిని.

డాక్టర్ టి.ఎన్.కె.ను ఆశ్రమ ఫోటో గ్రాఫర్ అనేవారు. "మీరు ఫోటోలు ఏ విధంగా తీసేవారు?" అనిప్రశ్నించగా ఆయన, "నేనెప్పుడు ఆశ్రమానికి వెళ్ళినా, ఉండేది కొద్ది సమయమే అయినప్పటికీ. నేను పనిగట్టుకుని భగవాన్‌ను ఉదయం నుండి సాయంత్రం వరకూ, అనుసరించి ఉండి, భగవాన్‌ను సాధ్యమైనన్ని ఫోటోలు తీసేవాడిని. అలా నేను మూర్ఖంగా వెంబడించడం. మహర్షికి విసుగొస్తుందేమోనని అనుకుంటుండేవాడిని. నేను ఆయన నడుస్తుండగానూ, కూర్చుని ఉన్నప్పుడూ, భోంచేస్తున్నపుడూ, ఆఖరికి కాళ్ళు కడుక్కుంటున్నపుడు కూడా ఫోటోలు తీశాను. అలాగే చిరునవ్వుతో ఉండగా, పెద్దగా నవ్వుతున్నపుడూ, చిన్నపిల్లవాడిని చూచి నవ్వుతున్నపుడూ, ధ్యానావస్థలో ఉన్నపుడూ, సమాధిలో ఉన్నపుడూ కూడా ఫోటోలు తీశాను. ఒకసారి కొండపైకి వెళ్తుండగా సన్నగా జల్లుపడసాగింది. ఆయనకు తాటి ఆకులతో చేసిన రైతులు వాడే ఒక విధమైన గొడుగు యివ్వబడినది. ఆయన దానిని తలపై ఉంచు కున్నపుడు నేనాయన ఫోటో తీశాను. ఆయన మామూలు గొడుగు వేసుకుని ఉన్నపుడు మరొక ఫోటో తీశాను. నేను ఆ ఫోటో తీసేటప్పుడు, ఆయన నన్ను జూచి బాగా నవ్వారు. ప్రతి ఫోటో వెనుక ఒక కథ ఉన్నది. అవి ఏవీ గ్రంథస్తము. చెయ్యబడలేదు. కావున ప్రతిసారీ, నేను టి.ఎన్.కె.ను కలసినపుడు, అటువంటి కథలు చెప్పమని విసిగిస్తుండే వాడిని.

ఒకసారి, ఆశ్రమము 'మహర్షి' అనే పేరుతో నూట పదిహేడు ఫోటోలు కల్గిన ఒక పుస్తకం ప్రచురించే ప్రయత్నంలో ఉన్నది. అప్పటికి భగవాన్‌వి, టి.ఎన్.కె. చేత తియ్యబడినవి అనేక ఫోటోలు ఉన్నవి. కాని గిరిది మాత్రం సరియైన ఫోటో

ఒకటి కూడా లేదు. అందుకని నిరంజనానంద స్వామి, డా.టి.ఎన్.కెను గిరి యొక్క ఫోటో తియ్యమని కోరారు. డా.టి.ఎన్.కె కు భగవానే తల్లి, తండ్రి, గురువు, దైవము, అన్నీ అందుచే డా.టి.ఎన్.కె, భగవాన్ వద్దకు వెళ్ళి, "వాళ్లు గిరియొక్క ఫోటో తియ్యమని అన్నారు. నేను ఏమి చెయ్యాలి?" అన్నారు. భగవాన్, "దక్షిణపు ప్రక్క నుండి రైల్వే లైను తిరువణ్ణామలైకు కలిసే ముందు, ఒక రైల్వే బ్రిడ్జి ఉన్నది. అక్కడి నుండి అరుణాచలమును చూచినట్లైతే, అరుణాచలుడు, అరుణాచల ఆలయ తూర్పు ద్వారము, ఒక సరళరేఖలో ఉన్నట్లు కనబడి, ఆ దృశ్యం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. దానిని ఫోటో తియ్యండి," అన్నారు. అది గుర్తు చేసుకుంటూ, డా.టి.ఎన్.కె, నన్నొక ప్రశ్న వైచి దానికి తానే సమాధానము చెప్పారు తర్వాత, "గణేశన్, భగవాన్‌కు ఆ విషయం ఎలా తెలిసి ఉంటుంది?" భగవాన్ స్థానంలో నువ్వే ఉండి చూడు, పదహారేళ్ళ వయసులో ఉండగా మితిమీరిన తన్మయత్వంలో తన తండ్రిని వెదుక్కుంటూ, రైలులో ఒకే ఒకసారి అటుగా వచ్చారు. అప్పుడు క్షణకాలమా దృశ్యాన్ని ఆయన చూచి ఉండవచ్చును. అయినప్పటికి, ఒక లిప్తపాటు చూసిన, తూర్పు ద్వారము, గిరి, ఆ బ్రిడ్జి(వంతెన) ఆయనలో ఎంత స్పష్టముగా ముద్రవేసినవంటే, దానిని యిన్ని సంవత్సరముల తర్వాత ఆదృశ్యాన్ని ప్రయత్నరహితంగా, అత్యంత స్పష్టంగా గుర్తు తెచ్చుకొనగలిగారు. మహానీయుని యొక్క ప్రతి కదలిక, మాట, సంజ్ఞలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఎందుకంటే మహర్షికి ప్రతిదీ ప్రస్తుతముగానే ఉంటుంది". డా.టిన్.కె. రమణ మహర్షి చరిత్రలో ఒక ముఖ్యమైన లంకె (గొలుసులోని రింగు) నేను చెన్నై వెళ్ళినపుడల్లా, ఆయన యింటికి వెళ్ళి, ఆయనకు సాష్టాంగ నమస్కారము చేసి, "భగవాన్ గురించి చెప్పండి", అని అడిగేవాడిని. దానికి తోడు ఆయన తీసిన అనేక భగవాన్ ఫోటోల నెగెటివ్‌లు (పోగు చేసుకునే వాడిని) అడిగి తీసుకునేవాడిని. అలాటి ఒక సందర్భంలో, వందల సంఖ్యలో భగవాన్ ఫోటోల నెగెటివ్‌లు పోగు చేసి, ఒక పెద్ద బట్టలో మూట కట్టి ఆశ్రమానికి తెచ్చాను. ఒక రోజు డా.టి.ఎన్.కె చాలా ఆనందంతో ఉన్నారు. ఆ రోజు ఆయన తన కోసము వేచి ఉన్న రోగులందరిని పంపించివేసి, నన్ను మేడపై నున్న తనగదికి రమ్మన్నారు. అక్కడ కళ్ళు ఆనంద బాష్పములతో నిండిపోగా, ఆయన భగవాన్ యొక్క మహిమను గూర్చి, ఔన్నత్యమును గూర్చి, ఆయన గంభీరతను గూర్చి మాట్లాడారు. ఆయన ఒక్కసారి గూడా, స్వయముగాకానీ, చిన్నస్వామి ద్వారాగాని, వేరే పరిచారకుని ద్వారాగాని, ఫోటోలు తియ్యవద్దని చెప్పలేదు. నేను ఇప్పుడు ఇలా చెబితే ఎవ్వరూ నమ్మరు. ఆయన ఏ మాత్రం తటపటాయించకుండ, నుంచొనుట గాని, కూర్చొనుట గానీ, నేను కోరిన భంగిమలో ఉండేవారు. నేను ఆయనను, "మీ ముఖం ఇటు ప్రక్కకు తిప్పండి, పైకి చూడండి, చేతులు క్రిందకు పెట్టండి, చేతులు ఈ విధంగా ఉంచండి," అని కోరేవాడిని. ఆయన వెంటనే నా కోరికను మన్నించేవారు. నేను కొండపై భగవాన్ ఫోటోలు తీస్తున్నపుడు, భగవాన్ పరిచారకులను తప్ప యితరులనెవ్వరినీ ఉండనిచ్చే వారముకాదు. అక్కడ ఎవరైనా ఉండినట్లయితే, భగవాన్ నా కోరిక (సూచనలు) మన్నించటము చూసి, ఆయనకు ఫోటోలు తీయించుకోవాలనే కోరిక ఉన్నట్లు భావించే అవకాశము ఉన్నది. అక్కడ సత్యమేమిటంటే నా గురువుగా ఆయన, నా కోరికలను, ఎన్నటికీ తనివితీరని, ఆయనను ఫోటోలు తీయవలెననే కోరికలను తీరుస్తున్నారు అంతే, ఆయన తన భక్తుల కోరికలనన్నింటిని, తన జీవిత పర్యంతము తీర్చిఉండలేదా!

ఒక్కసారి నిరంజనానందస్వామి, టి.ఎన్.కె.ను, భగవాన్‌ను దక్షిణామూర్తి వలె, ఒక కాలిపై మరొక కాలు ఉండే విధంగా ఫోటో తియ్యమని కోరినారు. భగవాన్ అంగీకరించారు. ఆయన కూర్చొనుటకు మేము ఒక రాతిని సరిచేసినాము. అరుణగిరి, వెనుక కన్పిస్తూ ఉండేటట్లుగా, ఆ రాతి మీద కూర్చునేముందు, "ఏకాలిని పైన ఉంచాలి, ఏ కాలిని క్రింద ఉంచాలి," అని భగవాన్ పరిచారకుడినీ, నన్ను అడిగారు. మేము సమాధానము చెప్పలేకపోయినాము. అప్పుడు భగవాన్, "ఫర్వాలేదు,రెండు ఫోటోలు తియ్యండి, కుడికాలుపైన ఉండునట్లు ఒకటి", ఎడమ కాలుపైన ఉండునట్లు ఒకటి అన్నారు. దానితో కృష్ణస్వామి, భగవాన్ సూచించిన విధంగా రెండు ఫోటోలు తీశారు.ఒకప్పుడు నేను ఆయనను, "మీరు భగవాన్‌కు తెలియకుండా దొంగతనంగా ఏమైనా ఫోటోలు తీశారా?" అని అడిగాను. ఒక్కసారి, తప్ప ప్రతిసారి ఆయన ఫోటో తీసేటప్పుడు నేను ఆయన అనుమతిని కోరాను. శాస్త్రములలో సద్గురువు యొక్క పవిత్ర పాదములు ఎంతగానో కొనియాడబడినవి కావున, నేను ఆయన పాదములను ఫోటో తియ్యదలచాను. భగవాన్, ఆయన శయ్యపై విశ్రమించి నపుడు ఆయన పాదములు వద్ద కొన్ని పువ్వులను ఉంచమని ఆయన పరిచారకుడిని కోరాను. నా కెమేరాను భగవాన్‌కు కనపడకుండా

ఉంచి, నేను సాష్టాంగ నమస్కారము చెయ్యడానికి వంగుతున్నట్లుగా నటించి, కిందకు వంగాను. ఒక్కసారిగా పైకిలేచి, ఫోటో తీశాను. భగవాన్ శరీరముపై కెమేరాను కేంద్రీకరించకుండా, ఆయన పాదములు స్పష్టంముగా కన్పించేటటుల పాదములపై మాత్రమే కెమేరా కేంద్రీకరింపబడింది. నేను మెల్లగా బయటకు జారుకుందామని చూడగా, భగవాన్, నన్ను తనవైపునకు రమ్మని సైగ చేశారు. ఆయన నా వైపు చూసినపుడు ఆయన ముఖంపై చిరునవ్వు లాస్యమాడింది. "మీరు చేసిన పని నాకు తెలియదా?", అనే భావం ఆయన కళ్ళలో తొంగిచూసింది. నేను ఈ సంఘటనను మొదటిసారిగా యిప్పుడు వెల్లడిచేశాను. నేను యిన్ని రోజుల నుండి ఈ ఫోటోను దాచి ఉంచాను. నేను ఆ ఫోటోను ఎంతో గౌరవముతో చూచుకుంటున్నాను. నేను ఇపుడు దీనిని నీకు ఇవ్వాలనుకుంటున్నాను. భగవాన్ తన పవిత్ర పాదాలు, తన భక్తుల ఇళ్ళలో అలంకరింపబడాలని కోరుకుంటున్నారేమో?" ఇది 1967లో జరిగింది. నేను చాలా సంతోషించాను. ఎందుకని అంటే ఆశ్రమము 'రమణ పిక్టోరియల్ సావనీర్' ను అచ్చు వేయించాలనుకుంటున్నారు అప్పుడు. అలా అనుకోకుండా జరిగిన అద్భుత సంఘటనల వలన, నేను అతి ముఖ్యమైన మొదటి పేజీలో, ఈ ప్రత్యేకమైన ఫోటోను ముద్రింపజేయగలిగాను.

నేను ఒకసారి ఆయనను, "కేవలము ఫోటోలను తీస్తేసరిపోదు", అని మీకెప్పుడూ అన్పించలేదా?" అని అడిగాను. అపుడు డా.టి.ఎన్.కె, "కొన్నిసార్లు, భగవాన్ బోధ "నేను శరీరాన్ని కాను" అని ఆయన ఉన్నపుడు ఆయన ఫోటోలను తియ్యటముపై అంత శ్రద్ధ కనబరచడము, హాస్యాస్పదము గాదా, నేను నీడ వెనుకపడి దానిని శాశ్వతముగా ఉండునట్లు చెయ్యాలను కొనుట లేదా? నేను ఆయనను నా కళ్ళతో చూడగలిగి నంతసేపూ, ఆయన బోధ యొక్క ప్రాముఖ్యత నాకు తట్టలేదు. ఆయన వ్యక్తి గానే కన్పించేవారు. ఆయనవైపు ఆకర్షింపబడేవాడిని. ఆయన ఫోటోలు తియ్యడము, నాకు అత్యంత సంతోషాన్ని ఇచ్చేది. ఆయన బోధ కంటె, ఆయనే నాకు ముఖ్యము, ఆయన యొక్క ప్రతి కదలిక, ప్రతిపనీ, నాకు అత్యంత విలువైనవి, ఎందుకంటే అవి ఏదోదివ్య పరిమళమును కల్గిఉండేవి. ఆయన ఏమి చేస్తున్నా సరే, ఆయనను చూస్తూ ఉండటమే గొప్ప సంతోషకరమైన విషయముగా ఉండేది" అన్నారు.

ముందు చెప్పిన విధముగా, డా.టి.ఎన్.కె గొప్ప ఫోటోగ్రాఫరేకాదు, చాలా గొప్ప వైద్యులు కూడా. చెన్నైకు చెందిన ప్రముఖ లెందరికో ఆయన వైద్యులు, ప్రత్యేకించి సినీనటులకు, ప్రఖ్యాతిగాంచిన శాస్త్రీయ గాయకులకు, ఇంకా ఇతర ప్రముఖులకు. కానీ భగవాన్ వద్దకు వచ్చి, ఆయనను సేవించిన తర్వాత, భగవాన్ ఆధ్యాత్మికంగా లాభము పొందకుండా వదలి పెడతారా? భగవాన్ ఆయనను కేవలము మంచి ఫోటోగ్రాఫర్‌గానూ, బాగా డబ్బు సంపాదించే గొప్ప వైద్యునిగా మాత్రమే వదలి వేస్తారా? అందుచే తన చివరిరోజులలో, భగవాన్, డా.టి.ఎన్.కె ను తన వద్దనే ఉండి సేవించేటట్లు చేశారు.

కొన్ని సంవత్సరముల తర్వాత, భగవాన్ జీవితంలోని చివరి క్షణాలను గూర్చివివరించమని కోరాను. ఆయన ఉద్వేగంతో కంపించి పోయారు. కన్నీరు కారసాగింది. ఆయన ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయారు. కాబట్టి, ఆ వివరాలను పేపరు మీద వ్రాసి ఇవ్వమన్నాను. ఆయన ఈ విధంగా వ్రాశారు. "మహర్షి చివరిదినాలలో, ఆయన వద్ద ఉండగలిగే మహద్భాగ్యము నాకు కలిగింది. ఆయన మరణం దగ్గరలోనే ఉన్నదని. నిశ్చయంగా తెలిసిన నేను, ఆయన మాకేదైన సందేశాన్ని ఇస్తారేమోనని ఆతృతతో ఉండేవాడిని. ఆయన ఉపశమనము కల్గించే మాటలను చెప్పరా? ఆయన మా కొరకు ఏమైనా సూచనలను వదలి వెళ్ళరా? ఆయన శారీరక బాధను చూడటం అంతులేని విచారాన్ని కల్గించేది. కానీ దాని పట్ల ఆయన వైఖరి అంతుపట్టేది కాదు. ఆయన ఆ నొప్పిని, బాధనూ ఎవరి శరీరానికో సంబంధించినట్లుగా చెబుతుండేవారు. అసలు ఆయన బాధపడుతున్నారా? లేదా? అన్పించేది. ఆయన నొప్పినీ, బాధనూ, శరీరములో ఎక్కడ ఉన్నదీ స్పష్టంగా వర్ణించగల్గి కూడా, దాని ప్రభావము తనపై ఏ మాత్రము లేనట్లుగా ఎలా ఉండగలిగే వారో? ఆయన మూత్రపిండములు పనిచెయ్యకుండా పోయినపుడు, చాలా తీవ్రమైన, భరించలేని తలనొప్పి ఉన్నది అన్నారు. మహర్షి ఆ బాధలు తనకు కల్గుతున్నట్లు చెప్పేవారు కాదు. చివరిరోజు సాయంత్రము, మహర్షి తనను లేపి కూర్చుండ బెట్టమని కోరి, పద్మాసనములో వలె కూర్చున్నారు. ఆయన శ్వాస పీల్చుకోవడము చాలా కష్టమైపోయింది. అక్కడ సేవలో ఉన్న వైద్యులు ఆక్సిజన్ మాస్క్‌ను ఆయన ముఖానికి అమర్చారు. మహర్షి దానిని ప్రక్కకు నెట్టేశారు. ఆ గది బయట, అరుణాచల శివ, అరుణాచల శివ అంటూ ముక్త కంఠంతో దివ్యంగా నామం పలుకబడుతున్నది. అక్కడ జేరిన వారందరూ, నోటమాటరాక నిలచియున్నారు.

మృత్యుదేవత ఆయనను తాకుటకు సాహసిస్తుందా? లేదు. అది అసాధ్యము. ఏదో అద్భుతము జరుగుతుంది. అని ప్రతివారూ భావించారు. ఆ వాతావరణము అంతయూగూడా, ఉద్వేగముతోనూ, భయంతోనూ, ఎదురుచూపుతోనూ నిండిఉన్నది. అక్కడ ఎవరిదో ఏడ్పువిన్పిస్తున్నది. చాలా నెమ్మదిగా భగవాన్ శ్వాస పీల్చారు. ఒక తోకచుక్క ఆకాశంలో దూసుకుని పోతూ కన్పించింది. మహర్షి తుది శ్వాసతో జతకలుపుతూ, ఏమి జరిగిందో మేము గుర్తించలేకపోయాము. ఆ భౌతిక రూపము మమ్ములను శాశ్వతముగా విడచివెళ్ళింది. ఆ సమ్మోహన కరమైన చిరునవ్వు మాకు ఇక ముందు ఆహ్వానం పలుకదు. ఆ అందమైన శరీరం ఆశ్రమానికి అలంకారంగా ఉండదు.

నేనెప్పుడు డా.టి.ఎన్.కె యింటికి వెళ్ళినా, ఆయన నన్ను మేడపైకి తీసికుని వెళ్లి భగవాన్ గురించి మాట్లాడేవారు. "భగవాన్ శరీరాన్ని వదలి వేసిన తర్వాత మీరేమి చేశారు?" అని నేనడిగాను. "నేనెంతగానో ఆరాధించిన భగవాన్ శరీరము ఇక కన్పించదు. అది నాకు పెద్ద అఘాతమైనది. నేను ఆవేదన చెందాను. ఆ జ్ఞాని నుండి, ఆయన ప్రత్యక్ష సూటి బోధను అవగాహన చేసుకునే అవకాశాన్ని నా జీవితంలో కోల్పోయానా? నేను ఆధ్యాత్మిక పరమైన సాధన యేమీ చేసి ఉండలేదు. ఆయన సన్నిధిలోనే ఆధ్యాత్మిక సాధన చేసుకొనగలిగిన అవకాశము ఉండి, ఆయన బోధనలను అవగాహన చేసుకుని ఆచరణలో పెట్టుటకు బదులుగా, ఫోటోలు తీస్తూ, నా సమయమునంతా వృధా చేసుకున్నానా? లేదు. అది నిజము కాదు. నేను తప్పనిసరిగా భగవాన్ అనుగ్రహాన్ని ఎంతో కొంత పొందాను. ఆయన ఇంకా ఇక్కడే ఉన్నారు. ఆయనను రూపరహితమైన 'ఆధారముగా' ఆయన సన్నిధిని అనుభవించడము. మనము నేర్చుకోవాలి. మనమెప్పుడు వదలివేయబడలేదు. ఎందుకంటే ఆయనే స్వయంగా తానెక్కడికీ వెళ్ళుట లేదని చెప్పారుగద. ఆయన సర్వజ్ఞులు, సర్వసాక్షి. అప్పుడు నేనాయన ఉపదేశములను చదవటము ప్రారంభించాను. వాటిలోని సత్యాన్ని చూడటం ప్రారంభించాను. వాటిలోని కొన్ని సత్యాలు నన్ను హత్తుకునిపోయి, నేను ఆయన సన్నిధిలోనే ఉండి, ఆయన మాటలను వింటున్న అనుభూతిని కల్పించినవి. నేను వాటిని హృదయంలో పదిలపరుచుకున్నాను. వాటిని చదువుతున్నకొద్దీ, భగవాన్ నాకు మరింత చేరువ కాజొచ్చారు. ఆయన ఉపదేశము నా జీవన స్రవంతితో పెనవేసుకునిపోయింది. నేను దానిని అర్ధము చేసుకోసాగాను. అది నాలో కలిసిపోయి నా స్వంతమై పోయింది. ఆయన అలా అనగానే, నేను ఆయనకు సాష్టాంపడి, డాక్టర్! నన్ను ఆశీర్వదించండి అన్నాను. ఆయన కాళ్ళు పట్టుకుని. ఆయన పాశ్చాత్యవేషధారణలో ఉండి (సూటు, బూటు ధరించి), మెడలో స్టెతస్కోపు ధరించి ఉన్నప్పటికీ, ఆయన ఆ మచ్చలేని, స్వచ్ఛమైన శాంతి, పరిపూర్ణత గానే నాకు గోచరించారు.

ఒకసారి, న్యూయార్క్ నుండి ఒక దంపతులు ఆశ్రమానికి వచ్చారు. భగవాన్ తర్వాత ఎవరైనా సాక్షాత్కారము పొందిన వారున్నారా అని తెలుసుకొనగోరారు. "నేను ఒకరిని చూపించగలను, కానీ ఆయనను మీరు సాక్షాత్కారము పొందిన వ్యక్తిగా గుర్తించగలరా?" అని నేను బదులిచ్చాను. "మా శాయశక్తులా ప్రయత్నిస్తాము అని వారు చెప్పారు. ఆయన రమణాశ్రమంలో లేరని, చెన్నైలో ఉన్నారని, ఆయన గుండు చేయించుకుని, కాషాయ వస్త్రములు ధరించి ఉండరని,చెప్పాను. ఆయన పాశ్చాత్య దుస్తులలో ఉంటారని కూడా ముందుగానే హెచ్చరించాను. ఏమీ పట్టించుకోకుండా, వారు నన్ను ఆయనను చూడటానికి తీసుకుని వెళ్ళమని కోరారు. నేను వారిని చెన్నైలో గల టి.ఎన్.కె. నివాసానికి తీసుకుని వెళ్ళాను. ఆ వైద్యుని చూడగానే నేను సాష్టాంగ నమస్కారము చేశాను. ఆయన గృహమంతా భగవాన్ ఫోటోలతో నిండి పోయి ఉన్నది. ఆయన వారికి అవి అన్నీ చూబించి వారికి కావలసిన ఫోటో తీసుకొనమన్నారు. రమణాశ్రమ ములో అంతకు ముందెన్నడూ లేనటువంటి ఫోటో వారు తీసుకున్నారు. డా.టి.ఎన్.కె. వెంటనే ఆ ఫోటోను గోడపై నుండి తీసి వారి కిచ్చారు. అప్పుడాయన మాతో, " ఆ ఫోటోవెనుక ఒక కథ ఉన్నది. "నా రెండవ కుమారుని నామకరణ మహోత్సవమునకు, పూజకు అన్ని ఏర్పాట్లు చెయ్యబడినవి. నేను అతనికి 'రమణ' అని పేరు పెట్ట దలచుకున్నాను. నా భార్య అందుకు అభ్యంతరం చెప్పారు. మీ తండ్రిగారి పేరు మొదటి కుమారునికి పెట్టారు గనుక, సంప్రదాయము ప్రకారము, ఇతనికి మా తండ్రి గారి పేరు పెట్టవలసిందే నని ఆమె అన్నారు. అయిష్టంగానే, నేను దానికి ఒప్పుకున్నాను. ఆ కార్యక్రమము జరుగుతూ ఉన్నది, సంప్రదాయము ప్రకారము నేను నా రెండవ పుత్రుని, ఒక వస్త్రముతో కప్పి అతని చెవిలో మా మామగారి పేరు చెప్పబోతున్నాను. అకస్మాత్తుగా, ఈ ఫోటో గోడపై నుండి నా వీపుపై పడింది. నాకు అది, భగవాన్ నన్ను వానికి, తన పేరు పెట్టమని సూచించినట్లు అనిపించింది. అందుకని నేను అతనికి, 'రమణ', అని పేరు పెట్టాను" అని చెప్పారు.

డా.టి.ఎన్.కె చివరి రోజులలో నేను ఆయనను చూడటానికి వెళ్ళాను. ఆయనను చూచి నేను ఏడ్చాను. ఆయన నన్ను మందలించారు. మీరు భగవాన్ ఉపదేశమును అర్థం చేసుకున్న దింతేనా? నన్ను చూడండి, నన్ను భగవాన్ రమ్మని సైగ చేస్తున్నట్లుగా చూస్తున్నాను. నేను ఆయన దగ్గరకు వెళ్తున్నాను. మీరెందుకు బాధపడాలి? మేలుకొండి, " అన్నారు. "డాక్టర్, నాకొక సందేహము మీరు కోటీశ్వరులు. మీరెన్నో ఆస్తులు సంపాదించారు. ఆయన కేవలం డబ్బుమనిషి, భక్తుని ముసుగు వేసుకొని మోసము చేస్తున్నారు. మీకు చెన్నైలో 60 బిల్డింగులు ఉన్నవి, చాలా బాంకులలో కోట్ల రూపాయల డబ్బు నిల్వలు ఉన్నవి అని కొందరు అంటారు," అన్నాను. డా.టి.ఎన్.కె. నా వైపు చూసి నవ్వి, "అవును నేను వాటన్నిటికీ యజమానిని, అవి నాకు యజమాని కావు. నీకు వెలుపల గల ఏ విషయంపైనా, నీ దృష్టిని ఉంచవద్దు. సంపద ఉండటము, లేకుండటము అనేది అసత్యము. నీలోన ఉండే 'నిశ్శబ్దము' (మౌనము) మాత్రమే నిజము. మీ దృష్టిని సత్యముపై నిలపండి. భగవాన్ నన్ను పిలుస్తున్నారు. భగవాన్ ఆశీస్సులు మీకుంటవి. గణేశన్," అన్నారు. ఆ తర్వాత ఆయన కనులు మూసుకుని కొంచెము సేపుఉండి, తర్వాత నా వైపు తిరిగి ఎంతో అప్యాయంగా అన్నారు, "ఆశ్రమానికి ఎదురుగా నాకు ఒక భవంతి ఉన్నది. అందులో ఉండమని మురుగనార్‌ను నేను కోరాను. ఆ బిల్డింగు మీకు సంక్రమించేటట్లుగా నేను వీలునామా వ్రాశాను. మీకు ఆధారంగా, ఏ విధమైన ధనంగానీ, ఆస్తిగానీ లేదని నాకు తెలుసును. మీరు భగవాన్‌కు శరణు చెంది, సేవ చేస్తున్నారు. మీరు భవిష్యత్తులో దేని కొరకూ బాధపడకూడదు. దయచేసి, దీనిని స్వీకరించండి," గౌరవంగా ఆయన ఇచ్చిన దానిని స్వీకరించి, నేను ఆయన పాదాలను తాకి, సెలవు తీసుకున్నాను. (ఈ మధ్యనే ఈ బిల్డింగును రమణాశ్రమానికి ఇచ్చేశాను), కొన్ని రోజుల తర్వాత భగవాన్ ఫోటోగ్రాఫర్ అయిన డా.టి.ఎన్.కె, పూర్తి స్పృహతో అరుణాచల రమణునిలో ఐక్యమైనారు.



శ్రీ భగవాన్ – డా॥ టి.ఎన్. కృష్ణస్వామి

ఫ్రేమ్‌జీ దొరాబ్జీ



ఫ్రేమ్‌జీ దొరాబ్జీ ఒక జొరాష్ట్రియన్. ఒక పార్శీ మతస్థుడు. ఆయనకు చెన్నైలో ఒక సినిమా థియేటర్ ఉన్నది. ఫ్రేమ్‌జీ కు చిన్నప్పటి నుండీ సాధువులన్నా సన్యాసులన్నా భక్తి. ఎక్కడైనా మహాత్ములున్నారని వినగానే, ఆయన వారి వద్దకు వెళ్ళి సాష్టాంగ పడేవారు. ఆయన పిచ్చిని కనిపెట్టి, ఆయన కుటుంబ స్నేహితులు, ఫ్రేమ్‌జీ, ఫలానా చోట ఒక గొప్ప మహాత్ముడు ఉన్నారు," అని చెప్పేవారు. ఆయన పూలూ, పండ్లూ వగైరాలు తీసికుని అక్కడకు వెళ్ళేసరికి, అక్కడ ఎవరూఉండేవారు కాదు. ఈ విధంగా వారు ఆయనను ఆటపట్టించేవారు. వారు ఆయనను ఆటపట్టించారని తెలిసినా, ఆయన కోపగించే వారు కాదు. తర్వాత వాటిని తలచుకుంటూ ఆయన, "నేనెప్పుడూ బాధ పడలేదు. కోపగించనూలేదు. నాకు ఆ క్షణాలు చాలా విలువైనవి ఎందుకంటే, ఒక మహాత్ముని చూడబోతున్నాననే భావనతో నేనపుడున్నాను కనుక" అన్నారు. ఒకసారి ఒక వ్యక్తిని నిజమైన మహాత్ముడని నమ్మి ఆయన మోసగించబడ్డారు. ఆ సాధువు ఒక అతీంద్రియ శక్తులు కలవాడు. (క్షుద్ర శక్తులు కలవాడు) ఆలోచనలను చదవటంలో దిట్ట. మొదటిసారి ఆయన సాధువును కలవటానికి వెళ్ళినపుడు, ఆయన కారులోనే ఉన్నారు. ఆయన స్నేహితులు ముందుగా సాధువు దగ్గరకు వెళ్ళారు. వారికి మిక్కిలి ఆశ్చర్యము కలిగేటట్లుగా ఆయన, "మీరు ఫ్రేమ్‌జీ దొరాబ్జీని కారులోనే ఎందుకు వదలి వచ్చారు? ఆయనను ఇక్కడకు తీసుకుని రండి," అన్నారు. ఫ్రేమ్‌జీ ఆయనను కలసినపుడు, సాధువు ఆయన ఆలోచనలను చదివారు. ఫ్రేమ్‌జీ చాలా సంతోషించి, ఆయనను గొప్ప మహాత్మునిగా భావించి, ఆయన వద్దకు తరచుగా వెళ్ళనారంభించారు. త్వరలోనే ఆ సాధువు, ఆయన వద్ద నుండి డబ్బు గుంజటము మొదలు పెట్టారు. ఒకసారి ఆయన ఫ్రేమ్‌జీ వల్ల సాధ్యపడనటువంటి పెద్ద మొత్తాన్ని ఇమ్మని కోరారు. అది నా కసాధ్యము అని, ఆయన చెప్పినపుడు, సాధువు, "మీరు ఆ సొమ్ము తీసికుని రాకున్నట్లైతే, నేను మిమ్ములను శపిస్తాను. మీ మొత్తం కుటుంబం నాశన మౌతుంది," అని బెదిరించారు. ఫ్రేమ్‌జీ ఇంటికి వచ్చేసరికి, ఆయన పెద్ద కుమార్తె, జబ్బుపడింది. రోజులు గడిచేకొద్దీ, ఆమె పరిస్థితి క్షీణించ సాగింది. ఆయన వెంటనే సాధువు వద్దకు వెళ్ళి, "దయచేసి, మీ శాపమును ఉపసంహరించుకొనండి. నా కుమార్తె చనిపోయేటట్లున్నది, " అన్నారు. సాధువు ఏ మాత్రమూ చలించలేదు. "మీరు డబ్బు యిస్తేగానీ, నేను శాపమును ఉపసంహరించను" అన్నారు ఆ సాధువు. ఆయన యింటికి తిరిగి వెళ్ళే సరికి, ఆయన కుమార్తె మరణించింది. ఆయన భార్య జబ్బుతో ఉన్నారు. ఆయన భయంతోనూ, దుఃఖంతోనూ తల్లడిల్లిపోయారు. (ఆయనను చూచి జాలిపడి), ఆయన అన్నగారైన దాదిబా, అప్పుడే దినపత్రికలో 'గుప్త భారతంలో నా అన్వేషణ' అనే పుస్తకంపై వ్రాయబడిన వ్యాఖ్యను చదివారు. ఆయన దొరాబ్జీపై జాలితో, "తమ్ముడూ, నేనిపుడే దక్షిణ భారతదేశంలో కల ఒక గొప్ప మహాత్ముని గురించి చదివాను. నువ్వు రక్షణకొరకై, ఆయన వద్దకు వెళ్ళు," అన్నారు.

ఆ విధంగా, 1937 లో ఫ్రేమ్‌జీ భగవాన్ వద్దకు వచ్చారు, భగవాన్‌తో ప్రత్యేకంగా మాట్లాడే అవకాశము లేదు, కానీ భగవాన్ కొండపైకి వెళ్ళేటపుడు ఒంటరిగా ఆయనతో వెళ్ళవచ్చును. భగవాన్ కొండపైకి వెళ్ళినపుడు, ఫ్రేమ్‌జీ ఆయనను అనుసరించి, తన కష్టాలన్నిటినీ వెళ్ళబోసుకున్నారు." భగవాన్ ! ఇదీ నా పరిస్థితి ఈపాటికి నా భార్య బ్రతికి ఉంటుందో లేదో కూడా నాకు తెలియదు." అన్నారు. భగవాన్ ఆగి, ఆయన వైపు కొంతసేపు చూసి, వాళ్ళు అంతవరకు మాత్రమే వెళ్ళగలరు. మీరు భయపడవలసిన అవసరమేమీ లేదు. ఎల్లప్పుడూ మీకు రక్షణ ఉంటుంది. ప్రశాంతంగా వెళ్ళండి," అన్నారు. ఒక వస్త్రము తనపై నుండి జారిపోయినట్లుగా, తన లోని భయాందోళనలు తొలగిపోవటం ఆయన గ్రహించారు. 'మాస్టర్!' అనే పదము ఆయన హృదయములోనుండి వెలువడింది. ఆయనే మొదటిసారిగా మహర్షిని, మాస్టర్ అని సంబోధించినది. అప్పటి నుండి ఆయన మాస్టర్, మాస్టర్ అని అనుకుంటూ ఉండేవారు. ఆయన యింటికి తిరిగి వెళ్ళేసరికి ఒక అద్భుతమే జరిగింది. జబ్బుతో ఉన్న ఆయన భార్య ఊహించని విధంగా కోలుకున్నారు. అప్పటినుండి ఫ్రేమ్‌జీ, ముంబై నుండి, భగవాన్‌ను దర్శించటానికి వస్తుండేవారు.

1942లో అదృష్టవశాత్తూ, ఆయన వ్యాపారము చెన్నైకు మారినది. ఆయన ఒక సినిమా హాలుకు స్వంతదారుడు అయ్యారు. దానితో ఆయనకు తలచుకున్నపుడల్లా భగవాన్ వద్దకు, వెళ్ళేందుకు వీలుకలిగింది. భగవాన్ సన్నిధిలో ఆయనకు సందేహాలూ, ప్రశ్నలూ ఉండేవి కావు. ఆయన భగవాన్ సన్నిధిలో, 'దివ్యత్వం ఈ క్షణంలో ఇక్కడనే ఉన్నది' అన్న భావంతో ఉండేవారు. ఆయన భగవాన్ వద్దకు వెళ్ళిన మరుక్షణమే, ఆయన మనసులో ఏదైనా సందేహముంటే, భగవాన్ యొక్క ఒక్క చూపుతోనే తొలగి పోయేది. కొన్నిసార్లు, ఆయన మనసులోని ప్రశ్ననే యితరులెవరో అడిగేవారు. భగవాన్ దానికి సమాధానము ఇచ్చేవారు. అందుకని, ఆయనకు ఎప్పుడూ భగవాన్‌ను ప్రశ్నలు అడగవలసిన అవసరముండేది కాదు. తానున్నది శరణాగతి మార్గములోనే నన్నది ఆయనకు అర్ధమయింది.

ఆయన భగవాన్ వద్దకు వెళ్ళినపుడు, జొరాష్ట్రియన్ సంప్రదాయానుసారము వల్ల టోపీని ధరించి ఉండేవారు. ఆ టోపీతోనే ఆయనకు నమస్కరించేవారు. భారతదేశంలో (బహుశా బ్రిటిష్‌వారి అనుకరణ అయిఉండవచ్చును) తన కంటె ఉన్నతుల వద్దకు వెళ్ళినపుడు, టోపీని తీసివేసే అలవాటు ఉన్నది. అందుకని మిగిలిన భక్తులు, ఫ్రేమ్‌జీతో భగవాన్ సన్నిధిలో టోపీ ధరించి ఉండటము ఆయనను అవమానించుటయే నని చెప్పారు. అది వినిన వెంటనే భగవాన్, "జొరాష్ట్రియన్ ఆచార ప్రకారము ఎవరైనా పెద్దల వద్దకు వెళ్ళినపుడు టోపీ ధరించి ఉండవలెను. ఫ్రేమ్‌జీ చేస్తున్న పని సరి అయినదే," అన్నారు. అప్పటికి కొంతమంది జొరాష్ట్రియన్‌లు భగవాన్ వద్దకు వస్తున్నప్పటికీ, వారెవరూ భగవాన్‌కు తమ అలవాట్లను గురించీ, ఆచారాలను గురించీ చెప్పలేదు.

ఫ్రేమ్‌జీ చెన్నైలో స్థిరపడుటకు నిశ్చయించుకున్నపుడు, ఆయన స్నేహితుడొకరు, చాలా విస్తీర్ణముగల స్థలమును, అందులోని బిల్డింగులతో సహా చాలా తక్కువ ధరకు ఆయనకు ఇచ్చేస్తానని చెప్పారు. అది ఒక వితంతువుకు చెందిన ఆస్థి. అది చాలా తక్కువ ధర అగుటచే ఫ్రేమ్‌జీ, దానిని కొనుటచే తాను, అత్యంత ధనవంతుడనవుతాను అనే భావనతో, ఆ స్థలమును కొనవలెనని కోరికతో ఉన్నారు. కానీ, దానికి భగవాన్ ఆమోదం పొందాలని ఆయన భావించారు. ఆయన ఆశ్రమమునకు వెళ్ళి, భగవాన్ సన్నిధిలో కూర్చుని, తనకు మార్గ నిర్దేశం చెయ్యమని మనసులోనే కోరుకున్నారు. కొంతసేపటి తర్వాత ఒక భక్తుడు, భగవాన్‌ను, ఒక ప్రశ్న అడిగారు. ఆ ప్రశ్నకు దీర్ఘమైన జవాబును ఇస్తూ, ఫ్రేమ్‌జీ వైపు నవ్వుతూ చూసి, "ఇప్పటికే గతంలో పోగుచేసుకున్న వాటి భారంతో సతమత మవుతూ, ఇంకా కొన్నిటిని కొనితెచ్చుకొనుట ఎందులకు? దాని వలన ఇంకా, భారములు పెరిగిపోతవి," అన్నారు ఫ్రేమ్‌జీ ఆ ఆస్తిని కొనాలనే ఆలోచనను విరమించారు. కొన్ని సంవత్సరముల తర్వాత దానిని కొన్న వ్యక్తి, అంతులేని బాధాకరమైన (లిటిగేషన్) లావాదేవీలతో బాధపడుతున్నట్లు తెలిసింది.

కె.కె.నంబియార్, ఒక మూవీ కెమేరాను తెచ్చి భగవాన్ చిత్రాలు తీయగా, ఫ్రేమ్‌జీ, మంచి ప్రాచుర్యము చెందిన మహాత్ములైన తుకారామ్, మీరా, నందనార్ అనువారి పైతీయబడిన భక్తి చిత్రాలను భగవాన్ చూచుట కొఱకై తెచ్చేవారు. మూవీ ప్రొజెక్టరు (కదిలే చిత్రములను తెరపై పడునట్లుచేసే యంత్రము), స్క్రీన్ (తెర) కల్గియున్న ఒక భక్తుని సాయంతో ఫ్రేమ్‌జీ, ఆ సినిమాలను ఆశ్రమ భోజన శాలలో రాత్రిపూట భగవాన్‌కు వేసి చూపేవారు. భగవాన్ ఆ సినిమాలు చూసేటప్పుడు, ఆయన ప్రక్కన కూర్చునే అదృష్టము నాకు దక్కింది. భగవాన్ హాస్యపూరితమైన సందర్భాలలో నవ్వుతూ, ఆనందిస్తూ, ఆధ్యాత్మిక ఆనందంలో ఆ భక్తులు ఓలలాడుతున్నపుడు, ఆయన తన్మయత్వంతో కన్నీరు కార్చడము, అది నిన్ననే జరిగినంత స్పష్టముగా నాకు జ్ఞాపకమున్నది. కానీ సినిమా అయిపోయిన తర్వాత, ఆయనలో లేశమాత్రమైనా సంచలనముగాని చూసిన వాటి యొక్క ప్రభావము ఉండేది కాదు. భగవాన్ చక్కటి దర్పణము వంటి వారు అని చెప్పుటకు అదియేగుర్తు. ఆయన తన ఎదురుగా జరిగిన ప్రతి దానినీ ప్రతిబింబింప చేసేవారు. ఇన్ని రోజుల తర్వాత దానిని గుర్తుచేసుకుంటే, ఒక జ్ఞాని యొక్క నిజస్థితిని, గ్రహించటానికి నాకీ అనుభవము తోడ్పడినట్లు అన్పిస్తుంది. అటువంటి పరిపూర్ణమైన ఆంతరిక స్థితిలో జ్ఞాని తనచుట్టూ జరిగే సంఘటనలతో ఏమాత్రం సంబంధంలేకుండా ఉండేవారు.

భగవాన్ చివరి రోజులలో ఫ్రేమ్‌జీ, అందరి వలెనే, భగవాన్ దర్శనము కొరకై వరుస లోనుంచుని, ఉన్నారు. ఆయన భగవాన్‌కు ఎదురుగా వచ్చినపుడు, జెండ్ అవెస్తాలోని పద్యాలను మననం చేసుకుంటున్నారు. భగవాన్, ఆయన వైపు తిరిగి

నవ్వుతూ, "అది ఉదయించే సూర్యుడుకాదు, అస్తమించే సూర్యుడు", అన్నారు స్వచ్ఛమైన పర్షియన్ భాషలో ఉండి తనచే మననం చెయ్యబడుతున్న ఆ పద్యములు ఉదయించే సూర్యుని ఉద్దేశించినవే అవటం వల్ల ఫ్రేమ్‌జీ ఆశ్చర్య పడ్డారు.

"మీరు పూర్తిగా వేరే మతాన్ని అనుసరించేవారుగా, మీకు భగవాన్‌ను అనుసరించటంలో ఏదైనా సందిగ్ధం తలెత్త లేదు?" అని నేను ఆయనను అడిగాను. "ఏ విధమైన సందిగ్ధతకు ఇచట తావులేదు. నిజానికి, మా మతము చెప్పే బోధలసారము, భగవాన్ బోధల సారము ఒకటే, " అన్నారు ఫ్రేమ్‌జీ. "అనుదినము భగవాన్‌తో", అనే పుస్తకము దీనికి వివరణ నిస్తుంది. "ఆ రోజు సాయంత్రము, పారాయణ అయిపోయిన తర్వాత మునగాల వెంకట్రామయ్య, భగవాన్ వద్దకు వచ్చి ఇలా చెప్పారు," శ్రీమతి తలైయార్ ఖాన్, మైసూరుకు చెందిన సర్ మీర్జా ఇస్మాయిల్ స్నేహితులొకరు, గిరిపైన కూర్చుని, భగవాన్ గురించి, గిరి గురించి మాట్లాడుకుంటున్నారు. తలైయార్ ఖాన్, "భగవాన్' నడిచే దైవము. మన ప్రార్థనలన్నిటికి ఆయన సమాధాన మిస్తారు. ఈ కొండ కేవలము భగవంతుడే అంటారు ఆయన. నేను ఆ విషయాన్ని అర్థం చేసికొనలేదుగానీ, భగవాన్ చెప్పారు కాబట్టి నేను దానిని నమ్ముతాను." అప్పుడామె పార్శీ స్నేహితుడు," మన పార్శీమత నమ్మకం ప్రకారము ఇపుడు వర్షం పడితే, అది నిజమని నమ్ముతాను," అన్నారు. వారికి సన్నని వర్షము శుభ సూచకము. వెనువెంటనే, వర్షపు జల్లులుపడి, వారు పూర్తిగా తడిసి ముద్దయి, కొండదిగి వచ్చేసి నాతో ఆ విషయమును చెప్పారు,"

ఫ్రేమ్‌జీ దొరాబ్జీ, ఎప్పుడూ మహాత్ముల గొప్పతనాన్ని గురించి నాకు చెబుతుండేవారు. మీరాబాయి, తుకారామ్, తులసీదాస్, సూరదాస్‌ల వంటి మహాత్ముల ఎడల గల భక్తితో ఆయన హృదయం నిండి ఉండేది. వారిలో ఎవరి గురించి ప్రసక్తి వచ్చినా, వారి పద్యములను చదివి, వాటిని అనువదించి చెప్పేవారు. ఆయన నా కెల్లప్పుడూ, మహాత్ముల అడుగుజాడల ననుసరించు, వారిని పూజించు అని చెబుతుండేవారు. బహుశ అందుకే నాకు మహాత్ములను వెదుక్కుంటూ, వెళ్ళే పిచ్చి కాస్త పట్టినట్లుంది.

1965లో ఒకరోజు ఫ్రేమ్‌జీ కుమారుడు దొరాబ్ ఫ్రేమ్‌జీ, ఆశ్రమమునకు వచ్చి నన్ను కారు ఎక్కమని అడిగారు. ఆయన తనతో పాటు నన్ను చెన్నై తీసికుని వెళ్ళారు. అక్కడ కాళ్ళు, చేతులు కడుక్కుని, టీ తీసుకున్న తర్వాత, మరల కారులో కూర్చొనమన్నారు. దారిలో, ఆయన, "ఆశ్రమంలో కారు ఎక్కమని చెప్పినపుడు,"మీరు నన్నెక్కడకు తీసుకుని వెళ్ళదలిచారు?" అని మీరు నన్ను అడగలేదు. ఇక్కడ కూడా, "ఎక్కడకు వెళ్తున్నాము?" అని అడుగకుండానే మీరు కారెక్కేశారు," ఎందుకని?" అని నన్ను అడిగారు. నేను అపుడు, "దొరాబ్, మీరు ఏదో ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని కల్గించే చోటుకే నన్ను తీసుకుని వెళ్తున్నారని నాకు తెలుసును," అన్నాను. నా జవాబుతో ఆయన సంతోషించి, "అవును, అడయార్ లోని వసంతవిహార్ అనే చోటుకు, గొప్ప మహాత్ముడైన జిడ్డు. కృష్ణమూర్తి ప్రసంగాన్ని వినుట కొరకే మిమ్ములను తీసికుని వెళ్తున్నాను," అని చెప్పారు. అది విని నాలో నేను నవ్వుకున్నాను. నాకు తెలిసినంతవరకు మహాత్ములు, బాబా అని, భగవాన్ అనీ, స్వామీ అనీ మహరాజ్ అనీ సంబోధింపబడతారు. తన యింటిపేరు తో సహా సంబోధింపబడే మహాత్ముని నేను చూడ లేదు. కానీ, పెద్ద వృక్షం క్రింద ప్లాట్‌ఫారం మీద కూర్చుని ఉన్న కృష్ణాజీ ని చూడగానే నా హృదయాంతరాళాలలో, "ఈయన ఒక జ్ఞాని", అని స్ఫురించింది. ఈ భావం నాలో తన్మయత్వంలో నిండిన విస్ఫోటనాన్ని కల్పించింది. ఆయన పల్కిన మొదటి వాక్యము నాలో రెండవ విస్ఫోటనాన్ని కల్గించింది. మీ లోపల గనుక సత్యము లేకుంటే మీ బయట కూడా సత్యము ఉండదు అనే విషయాన్ని నిశ్చయంగా గుర్తుంచుకోండి." ఈ ఒక్క వాక్యము పై తీవ్రముగా చింతన జరిపి, దానిలోని సారము, భగవాన్ చెప్పిన (అహం స్ఫూరణ అనేదే సత్యము) హృదయములో 'అహం' 'అహం' అని స్ఫురించేదే సత్యము అనే విషయము ఒకటిగానే ఉన్నట్లు అనుకున్నాను.

దొరాబ్ నన్ను జిడ్డు. కృష్ణమూర్తి వద్దకు తీసికుని వెళ్ళినట్లే, ఫ్రేమ్‌జీ కుమార్తె, బొంబాయి నివాసి సూనా నికొల్సన్ నన్ను మొదటిసారి నిసర్గదత్త మహరాజ్ వద్దకు తీసికుని వెళ్ళారు. సూనాను గౌరవ పురస్కరంగా కలవటానికి వెళ్లినపుడు, పది సంవత్సరముల క్రిందట వాళ్ళ సోదరుడు చేసిన విధంగానే, ఆమె కూడా కారులోనికి ఎక్కమని ఉత్తర్వు జారీ చేశారు. కారునడుపుతూ నన్ను నిసర్గదత్త మహరాజ్ అనబడే మహనీయుని వద్దకు తీసుకుని వెళ్తున్నానని, ఆమె చెప్పారు. నా కెంతో ఆనందం కల్గింది. 'అయామ్‌దట్' ('సోహం') అనబడే ఆయన బోధలను పదిలపరచిన పుస్తకం గురించి గొప్ప ప్రశంసలు

నేను విని ఉండుట చేత, నేను ఆయనను చూడవలెనని గొప్ప ఆసక్తితో ఉన్నాను. ఇప్పుడు అవకాశం దానంతట అదే వచ్చింది. ఆ మహాత్ముడే నన్ను పిలుస్తున్నట్లుగా భావించాను. మేము మెట్లు ఎక్కి, మొదటి అంతస్థులోని ఆయన నివాసానికి వెళ్ళాము. ఆయన ఒక్కరే కూర్చుని ఉన్నారు. నేను ఆయనకు సాష్టాంగనమస్కారము చేశాను. ఆ మహాత్ముని సన్నిధిలోని గాఢమైన ఆధ్యాత్మిక పరమైన ప్రశాంతత, ఖచ్చితంగా అనుభవంలోనికి వచ్చింది. ఆయన తన కుడిచేతిని పైకి ఎత్తి ఆశీర్వదించారు. ఆయన తలవెనుక గోడపై భగవాన్ యొక్క పెద్ద ఫోటో గోడకు తగిలించి ఉండటం నేను గమనించాను. ఒక ఆచారపరుడైన బ్రాహ్మణుడు, మాంసాహార వంటకమును చూసిన విధంగా, సాధకుడు దేహాత్మ బుద్ధిని చూడాలి. ఆయన ఆ వాక్యమును మూడుసార్లు పలికారు. కంచుకంఠంతో, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, సూనా,నేను తన్మయత్వంలో మునిగిపోయాము. ఆ తర్వాత చాలా సంవత్సరముల పాటు, మహరాజుతో నా అనుబంధం, క్రమం తప్పక కొనసాగింది.

మహనీయులకు నన్ను పరిచయం చెయ్యటమనేది వారి కుటుంబంలో అలవాటుగా మారి, ఫ్రేమ్‌జీ కుమారులైన దొరాబ్జీ, హ్యూయాంగ్‌పో, హ్యూయినెంగ్, మరియు ఇతర జెన్ మాస్టర్ల గురువుల బోధల గురించిన పుస్తకములను నాకు ఇచ్చి, వారి బోధలను నాకు పరిచయం చేశారు. దొరాబ్ చిన్నతనం లో భగవాన్ వద్దకు వచ్చినప్పటివి రెండు ఆసక్తికరమైన సంఘటనలున్నాయి. దొరాబ్‌ను వారి తండ్రిగారు భగవాన్‌కు పరిచయం చేసినపుడు, వారు కౌమార అవస్థలో ఉన్నారు. (13-19). ఉదయం ఆశ్రమ భోజనశాల లో ఇడ్లీలు వడ్డించినపుడు, అవి ఆయనకే మాత్రం రుచించలేదు. రెండవ రోజు ఉదయం ఫలహారమునకు భోజనశాలలోనికి వెళ్ళుటకు ఆయన అంగీకరించలేదు. కానీ ఆయన తండ్రి పట్టుబట్టగా, గొప్ప అయిష్టతతో వారి తండ్రిగారి ప్రక్కన కూర్చున్నారు. ఆశ్చర్యకరంగా ఇడ్లీలు వడ్డించినప్పుడు దొరాబ్జీ ఇష్టంగా తిన్నారు. విషయమేమిటంటే ముందు రోజు, దొరాబ్ ఇడ్లీలను ఏమాత్రం ఇష్టపడక పోవడం భగవాన్ గమనించారు. అందుకని ఆయన వంట వారితో ఇడ్లీలకు బాగా నెయ్యిరాసి, నిండుగా పంచదార చల్లమని చెప్పారు. అందుచే ఒకప్పుడు అయిష్టంగా అన్పించిన ఇడ్లీలు, ఒక ప్రఖ్యాత పార్శీ వంటకము లాగా అన్పించాయి. అటువంటి పార్శీ వంటకము గురించి భగవాన్‌కు ఎలా తెలియునో అని తండ్రీ కొడుకులు ఆశ్చర్యపోయారు.

మరొక పర్యాయము హాలుబయట, దొరాబ్ నిద్రిస్తున్నారు. భగవాన్ అటుగా వెళ్తున్నారు. దొరాబ్ భగవాన్‌ను దర్శించుకొని ఆయన ఆశీర్వాదము పొందవలెననే ఆతృతతో ఫ్రేమ్‌జీ కుమారుని మేల్కొలుపుటకై అతనివైపు వడివడిగా వెళ్ళసాగారు. అప్పుడు భగవాన్ ఆయనకు సైగ చేసి, నెమ్మదిగా చిన్న గొంతుతో "అతనిని మేల్కొలుపవద్దు. అతనంతట అతనినే మేల్కొననివ్వండి". అన్నారు. ఇది మనందరికీ ఉపదేశము కాదా? ఎవరూ మరొకరిని సత్యములోనికి మేల్కొలుపలేరు . ఎవరికి వారే హృదయములోనికి మునుగుట ద్వారా, సత్యమును గ్రహింపవలెను అనేది భగవాన్ బోధ.



హెచ్.సి.ఖన్నా

హెచ్.సి.ఖన్నా లేక హరిచంద్ ఖన్నా, కాన్పూరులోని ఒక పెద్ద కుటుంబమునకు చెందినవారు. భగవాన్‌కు విశిష్ట భక్తులు. తల్లితండ్రుల పదవ సంతాన మైన ఆయన చాలా చిన్నప్పటి నుండే, జీవితాన్ని జాగరూకతతో పరిశీలిస్తుండేవారు. ఆయన తండ్రి పిల్లలందరినీ చాలా బాగా చూసుకునేవారు. ఖన్నా చాలా సంతోషంతోనూ సంతృప్తి తోనూ ఉండేవారు. కానీ ప్రపంచంలో చాలా మంది జనులు చాలా దుఃఖముతో ఉన్నట్లుగా ఆయన గమనించారు. ఆయనకున్న కొద్దిపాటి అనుభవంతో, ధనవంతులు సుఖంగా ఉన్నట్లుగా భావించారు. అందుకని చాలా ధనం సంపాదించవలెనని నిశ్చయించుకున్నారు. ఆయన జీవిత భీమా ఏజంటుగా చాలా విజయవంతంగా పనిచేసి, చాలా ధనము సంపాదించారు. ప్రేమావతి అనబడే పుణ్యాత్మురాలిని వివాహం చేసుకున్నారు.సౌకర్యవంతమైన జీవితమును గడుపుతూ, తింటూ తాగుతూ కాలము గడుపుతుండుట వలన తాను చాలా సంతోషముగా ఉన్నట్లు భావించారు.

ఆయన విధి నిర్వహణలో చాలా ఎక్కువగా ప్రయాణములు చెయ్యవలసి వచ్చేది. ఆ రోజులలో హోటల్స్ ఉండేవికావు. ఎవరైనా బసచెయ్యవలసి వస్తే ప్రభుత్వము వారి అతిధి గృహాల్లో మాత్రమే ఉండగలిగే అవకాశమే ఉండేది. కానీ అవి కేవలము బ్రిటిష్‌వారికే కేటాయింపబడేవి. ఖన్నా ప్రాపంచిక వ్యవహారాలలో ఆరితేరిన వారు కనుక, డబ్బుతో తనకు కావలసిన అవసరాలు తీర్చుకొనడమెలా అనేది ఆయనకు బాగా తెలియును. ఆయన అతిధి గృహనిర్వాహకునికి (మేనేజర్) గానీ, పరిచారకుడికి గానీ లంచము ఇచ్చి, అందులో ఉండే అవకాశం పొందేవారు.

ఒకరోజు తన ఖాతాదారుల వద్ద నుండి, చాలా పెద్ద మొత్తము ధనము వసూలు చేసికొని చాలా ఉత్సాహంగా, తన డబ్బుపెట్టె నిండిపోగా, అతిధి గృహమునకు చేరుకున్నారు. అతిధి గృహమునకు రాగానే,అక్కడి కాపలాదారు, " మీరు ప్రతిసారి, నాకు ముప్పది రూపాయలు యిస్తారు. నా భార్య ప్రసవించబోతున్నది. ఆ వైద్యుడు, ఆమె పరిస్థితి విషమంగా ఉన్నదని, నేనామెను కాపాడుకోవలెనంటే తొంబది రూపాయలు తనకు చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. దయచేసి నాకు ఆ సొమ్ము ఇవ్వండి.మరల మూడుసార్లు మీరు వచ్చినా నేను మీ నుండి ఏమీ ధనము తీసికొనను", అని చెప్పారు. అది అప్పట్లో చాలా పెద్ద మొత్తము. ఎందుకంటే, అతని జీతము ఆ రోజులలో బహుశ పదిహేను రూపాయలు ఉండవచ్చును. కానీ ఖన్నా వేరొక విధమైన, మానసిక స్థితిలో ఉన్నారు. ఆయన కాపలాదారుపై మూడువందల రూపాయలు విసరివైచి, "వెళ్ళి నాకు త్రాగుటకు, మందు, తినుటకు మంచి రుచికరమైన మాంసాహార వంటకములు కొనితీసికొని రమ్మని", చెప్పారు. కాపలా దారు ఆవిధంగా చెయ్యగానే, ఖన్నా తన డబ్బు ఉంచే పెట్టెను తెరచి అతని ముందు ఊపి, "చూడు! నేనీరోజు ఎంత డబ్బు వసూలు చేశానో అన్నారు. ఆయన తన విజయం వల్ల ఎంతమైమరచి ఉన్నారంటే, తన పెట్టెను మూయటము మరచారు. అంతేగాదు, గది తలుపులు లోపల గడివేసుకొనటం కూడా మరిచారు.

ఆ రోజులలో ప్రభుత్వ అతిధిగృహములు, పట్టణం శివార్లలో ఉండేవి. అవి ఎక్కువగా నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో నిర్మించబడేవి. ఆ రాత్రి బాగా త్రాగి మర్నాడు ఉదయం నిద్రలేచేసరికి, తన తలుపులు వేసి ఉండటమూ, కాపలాదారు, బయట యధావిధిగా కూర్చుని ఉండటము ఖన్నా గమనించారు. "నీ భార్య ప్రసవించే సమయమని అన్నావు. నువ్వు ఇక్కడ ఎలా ఉన్నావు?" అని ఖన్నా, కాపలాదారును అడిగారు. కాపలాదారు, "మీరు ఆస్థితిలో ఉండగా, నేను మిమ్ములను ఏ విధంగా విడచి వెళ్ళగలను? నేను వెళ్ళి ఉన్నట్లయితే, దొంగలు మీసొమ్మంతటినీ దోచుకుని ఉండేవారు." అన్నారు. "మరి నీ భార్య సంగతి ఏమిటి?" అని అడిగారు ఖన్నా ఆశ్చర్యంతో. "నేను ఇప్పుడు వెళ్ళి ఆ సంగతి చూచుకుంటానండి," అని బదులు ఇచ్చారు. ఆ కాపలాదారు. ఆ జవాబుతో ఖన్నా నిర్ఘాంత పోయారు. అప్పటి వరకు, మనిషి అవసరములు, కోరికలు తీర్చుకొనుట లోనే, సంతోషము ఉన్నదని ఆయన అనుకున్నారు. కానీ, ఈ వ్యక్తి భార్య ప్రమాదకర పరిస్థితిలో

ఉన్నాదని తెలిసికూడా, అతనికి అవసరమైన ధనసహాయం చెయ్యటానికి తను నిరాకరించారు. కానీ తాను మత్తులో మునిగిపోయి ఉన్నపుడు కూడా డబ్బు కాజెయ్యాలనే ఆలోచన కూడా అతనికి రాలేదు. అందుకని తన వ్యక్తిగత అవసరములను సరదాలను తీర్చుకొనుట కంటే ఉదాత్తమైన విషయం ఏదో జీవితంలో ఉన్నదనిపించింది. అదేమిటో తెలుసుకొనవలెననే కుతూహలంతో ఆయన అన్వేషణ ప్రారంభమయింది.

ఆయన భగవద్గీత చదివారు. మహోన్నతమైన ఆధ్యాత్మిక సత్యమును అనుభవమునకు తెచ్చుకోవాలంటే గురువును కలిగి ఉండవలెనని నమ్మకము ఏర్పడింది. రాత్రిళ్ళు తన గృహంలోని కిటికీల తలుపులు, వాకిళ్ళ తలుపులూ అన్నీ మూసి వెయ్యటము ఖన్నాకు అలవాటు. తన పడకగది తలుపుకు కూడా తాళము వేసేవారు. ఒక రోజు, అర్ధరాత్రి సమయమున ఏదో వింత అనుభూతితో ఆయన నిద్రలేచారు. ఆయనకు తన గదిలో ఎవరో ఉన్నట్లు అన్పించింది. తనకు తెలిసిన ఒక సాధువు తన ఎదురుగా కూర్చుని కన్పించారు. ఆయన కాళ్ళు, వంకర తిరిగి పోయి ఉన్నవి. ఆ సాధువు ఖన్నాతో, తెల్లవారు ఝామున నాలుగు గంటలకు తన వద్దకు రమ్మని చెప్పారు. ఖన్నా తన భార్యను లేపి జరిగింది చెప్పారు. మర్నాడు ఉదయము ఆ సాధువును కలుసుకొన బోతున్నామని ఆయన చెప్పారు. అంతలో ఆ సాధువు తన శిష్యునితో, ఒక గొప్ప మహాత్ముడు వస్తున్నారని, కనుక తనను పైకి ఎత్తి, గేటు వెలుపల కూర్చోబెట్టవలసినదని కోరారు. ఖన్నా ఆ సాధువును చూసి, ఆయనే తన గురువు అని భావించి సంతోషించారు. కానీ కుంటివారైన ఆ సాధువు, నేను నీ గురువును కాను, 'రమణ మహర్షి'నీ గురువు అని చెప్పారు. ఖన్నా ఏనాడూ రమణ మహర్షి గురించి విని ఉండకపోవుటచే, ఆ మాటలకు నిరుత్తరులయ్యారు. (నోట మాటరాక ఉండి పోయినారు). అంతకు ముందు రాత్రి, ఊహించలేనివిధంగా, తన గదిలో ప్రత్యక్షమయిన ఆ సాధువుకు శరణాగతి చెందవలెనని, ఆయన అక్కడకు వచ్చారు. కానీ ఆ సాధువు, తాను, ఆయన గురువును కానని చెబుతున్నారు. ఖన్నా మహర్షి గురించి కొన్ని వివరములను సేకరించవలెననుకున్నారు. అప్పుడు ఆ సాధువు, యొక్కశిష్యులైన ప్రొఫెసర్ భట్నాగర్, "నాకు మహర్షి గురించి కొద్దిగా తెలుసును," అని ఖన్నాకు 'ఉపదేశ సారము' యొక్క ప్రతిని అందజేశారు. ఆ పుస్తకముపై రమణాశ్రమము చిరునామా ఉన్నది. ఖన్నా తండ్రిగారు, "నేను మీ బిడ్డల సంరక్షణ చూసుకుంటాను. నేను పాల్ బ్రంటన్ పుస్తకముపై వ్రాయబడిన సమీక్షను చదివి ఉన్నాను. రమణ మహర్షి నిజమైన మహాత్ముని వలెనే అన్పిస్తున్నారు. వెళ్ళిరండి", అన్నారు.

అందువలన **1941**లో ప్రేమవతి, ఖన్నా భగవాన్ వద్దకు వచ్చారు. మరికొందరు భక్తుల విషయములో జరిగినట్లుగానే, నా వద్దకు రావటానికి నీ కన్నేళ్ళు పట్టిందా? అన్నట్లుగా చూశారు రమణులు, ఖన్నా వంక "ఖన్నా కు ఒక్కసారిగా, ఆయనే తన గురువు అని తెలిసిపోయింది. ఆయన తరచుగ ఆశ్రమానికి రావటం ప్రారంభించారు. కానీ, ఆయన భగవాన్ స్వయంగా నేనే నీ గురువును, " అని చెప్పాలని కోరుకున్నారు. ఆయన భగవాన్‌తో, "భగవాన్! నాకు బాహ్యంలో ఒక గురువు కావాలి. మీరు, మీరే నా గురువు నని చెప్పండి, దయచేసి," అన్నారు. తన సహజ ధోరణిలో "గురువు లోపలనే ఉన్నారు," అని సమాధానమిచ్చారు భగవాన్. ఖన్నా విడువ కుండా భగవాన్ వెంట పడ్డారు. "లేదు భగవాన్, మీరే నా గురువు అని మీరు నాకు చెప్పాలి," అని. ఆ సందర్భంలోని ఔచిత్యాన్ని గమనించండి. శిష్యుడు తెలివిగలవాడైనపుడు, గురువు మరింత తెలివితో వ్యవహరిస్తారు. భగవాన్, "బాహ్య గురువే, గురువులోపలనే ఉన్నారని చెబుతున్నారు," అని అన్నారు. అది కేవలము తెలివిగల సమాధానము మాత్రమే కాదు, భగవాన్ ఆ మాటలను ఖన్నాతో చెప్పినపుడు, ఖన్నాకు ఆ అనుభవము కల్గింది. ఆయన తనలోని తీవ్రమైన తరంగాలను అనుభవించారు. భగవాన్ యొక్క లోతులోనికి సూటిగా చొచ్చుకునిపోయే నిశితమైన చూపు, ఖన్నా హృదయపు లోతులలోనికి చొచ్చుకొని పోయి, ఆయన లోని ఆధ్యాత్మిక చైతన్యాన్ని మేల్కొలిపింది. నిజానికి భగవాన్ బాహ్యంలో ఖన్నా వైపు చూస్తున్నారు. కానీ అనుభవమేమో లోపలనే జరుగుతున్నది. అంతరిక గురువే, 'నేను', అనే అనుభవమును ఇస్తున్నట్లుగా బుజువుచేస్తూ, భగవాన్ చూపులోని చమత్కార మది.

నేను ఆయన పట్ల ఆపేక్షతో ఉండేవాడిని. నేనిదివరకే చెప్పినట్లు ఆశ్రమనిర్వహణకు డబ్బు పోగు చెయ్యడము నాకు ఉద్యోగ విధులలో ఒకటి. ధనవంతులైన ఖన్నా, నేను ఆర్థిక సహాయము కొఱకు వెళ్ళినపుడల్లా సహాయము చేసేవారు. కానీ ఆయన ఎప్పుడూ, "మేలుకో గణేశన్! ఇది ఒక్కటే నీకర్తవ్యం కాదు. ఇది కేవలము నీ కర్తవ్యములో ఒక చిన్న భాగమే.

ఆత్మసాక్షాత్కారమును పొందటమనేది మన విద్యుక్త ధర్మము," అని చెబుతుండేవారు. నేను ప్రేమగా ఆయనను పితాజీ (తండ్రిగారు) అని పిలిచే వాడిని. నేను ఆయన కెంతో ఋణపడి ఉన్నాను. నేను పితాజీతో సన్నిహితంగా మెలుగుట వలన, నేను ఆయనను ఈ విధంగా ప్రశ్నించుటకు సాహసించాను. "మీరు ఎంత తరచుగ వస్తుండే వారు? మీకు దీక్ష, లభించిన తర్వాత మీకు భగవాన్ వద్దకు రావలసిన అవసరమేమిటి?" అని. ఆయన, "సద్గురువుచే వెల్లడి చెయ్యబడిన సత్యము ఎంత ఉదాత్తమైన దంటే, అది మనలోనికి ఇంకిపోయి, మన స్వంతము అవడానికి కొంత సమయము పడుతుంది. బాహ్యగురువు సాన్నిధ్యము అత్యవసరము. అందుకనే నాకు వీలున్నన్నిసార్లు వచ్చేవాడిని. నా సందేహములన్నీ నివృత్తి చెయ్యబడి, అంతరంగికమైన శాంతి గాఢ మవసాగింది. అదే సందేహములన్నీ తుడిచి వేయ బడుతున్నవనే దానికి ఋజువు.

నేను అపుడు పితాజీని, "మీకు భగవాన్‌కు మధ్య జరిగిన సంభాషణలను కొన్నిటిని నాకు తెలుపగలరా?" అని అడిగాను. అవి అన్నీ, "అనుదినమూ భగవాన్‌తో" అనే పుస్తకంలో వ్రాయబడినవి అన్నారాయన. కొంత తడవైన పిదప ఆయన, నేను నా బాధనంతా వెల్రగక్కుతూ వ్రాసిన చీటీని భగవాన్‌కు ఇచ్చాను. దానిని చదివిన తర్వాత, భగవాన్, "అది ఒక ఫిర్యాదు. నేను మీ దగ్గరకు వస్తూనే ఉన్నాను. ఈ పర్యాయము ఒక నెలరోజులు మీ పాదముల వద్దనే గడిపాను. నా పరిస్థితిలో ఏ మార్పు గోచరించటములేదు. నాలోని వాసనలు ఎప్పటి వలెనే బలంగా ఉన్నవి. నేను వెనుకకు తిరిగి వెళ్ళినపుడు, నా స్నేహితులు, నాలో ఏ మార్పులేదని, నేనిక్కడ యిన్నినాళ్ళు ఉండుటవలన కల్గిన ప్రయోజన మేమిటని నన్ను ప్రశ్నిస్తారు, అని ఆయన అంటున్నారు," అన్నారు. ఖన్నా వైపునకు తిరిగి భగవాన్ కరుణతో "జ్ఞానము లభించలేదని ఎందుకు నిస్పృహ చెందుతారు? వాసనలు నశించలేదని బాధ ఎందుకు? ఆలోచనలకు తావివ్వవద్దు. తన పద్యములలో ఒక దానిలో తాయుమానవర్, ఈ కాగితములో వ్రాయబడినదే వ్రాశారు," అని అన్నారు. తర్వాత భగవాన్, తమిళము రాని వారి కొరకు, ఆ పద్యాన్ని ఇంగ్లీషు లోనికి అనువదింప వలసినదిగా దేవరాజ మొదలియర్‌ను కోరారు. ఆ పద్యము యొక్క భావమిలా ఉన్నది." ఈ మనసు నన్ను ఎగతాళి చేస్తున్నది. నేను నీకు వెయ్యినొక్క సార్లు చెప్పినా సరే, నువ్వు పట్టించుకొనవు. అట్లైతే నేను శాంతిని, ఆనందమును పొందేదెలా? దేవరాజ మొదలియార్, ఖన్నాతో, "మీరొక్కరే భగవాన్‌తో ఈ విధంగా ఫిర్యాదు చేశామనుకోకండి నేను అనేకసార్లు ఈ విధంగానే భగవాన్‌తో ఫిర్యాదు చేశాను. ఇంకా చేస్తూనే ఉన్నాను. అయినా నాలో ఏ విధమైన అభివృద్ధి కన్పించుట లేదు"అన్నారు. దానికి బదులుగా ఖన్నా, "నాలో పురోభివృద్ధి కన్పించక పోవటమే కాదు, నేను ఇంకా దిగజారాను, " అన్పిస్తున్నది. వాసనలు ఇపుడు మరింత బలీయ మైనాయి. అది ఏమిటో నాకు అవగతము అవటము లేదు.

ఖన్నా అపుడు, "జ్ఞానము, మనసుల కలయిక జీవాత్మ, కేవల జ్ఞానము పరమాత్మ. అది సరియైనదేనా భగవాన్," అని అడిగారు. భగవాన్ అవునని తల ఊపారు. భగవాన్ తెల్లని తన తువ్వాళను చూపి, "దీనిని మనము తెల్లని వస్త్రము అంటాము. కానీ, ఈ వస్త్రము దాని తెలుపు వేరు చెయ్యబడలేవు. అదేవిధంగా చైతన్య ప్రకాశము, మనసు కలయిక వలన "అహంకారము ఏర్పడుతుంది. ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు, "ఈ క్రింద ఉదాహరణ తరచుగ గ్రంథములలో చెప్పబడుతున్నది. రంగస్థలం పైని దీపమును పరమాత్మయని లేదా చైతన్య ప్రకాశమని చెప్పవచ్చును. అది దానిని స్వయంగా వెలుగుతో కన్పింపజేస్తూ, రంగస్థలమునూ, నటులనూ గూడా, చూడగల్గుతున్నాము. కానీ అక్కడ నాటకము ప్రదర్శింపబడని సమయంలో కూడా, అది వెలుగును ఇస్తూనే ఉంటుంది. మరొక ఉదాహరణ ఇనుప ఊచ. మంటలో కాలినపుడు అది వేడిగా, ఎర్రగా మారుతుంది. అది ప్రకాశిస్తుంది. వస్తువులను మంట వలె కాల్చివేస్తుంది. కానీ మంట వలె గాక దానికొక ప్రత్యేకమైన ఆకారము ఉన్నది. మనము దానిని సుత్తితో కొట్టినపుడు ఆ దెబ్బలు, ఇనుప ఊచకు తగులుతవి, మంటకు కాదు. ఆ ఇనుప ఊచ జీవాత్మ, మంట పరమాత్మ".

భగవాన్ ఖన్నాకు మాత్రమే కాదు. ఆయన భార్య ప్రేమవతికి కూడా సాయపడ్డారు. ఒకరోజు మధ్యాహ్నము, హాలులో ఉన్నపుడు ప్రేమవతి, వ్రాతపూర్వకంగా భగవాన్‌కు ప్రాధేయపడ్డారు. నేను శాస్త్రములను పఠించలేదు. నాకు ఆత్మ విచారణ సాధన కష్టంగా అన్పిస్తున్నది. నేను ఏడుగురు బిడ్డల తల్లిని. గృహ నిర్వహణ బాధ్యతల తో నాకు ధ్యానము చెయ్యటానికి సమయము దొరకదు. నాకు ఏదైనా తేలికైన, సులభమైన పద్ధతిని సూచించ వలసినదిగా భగవాన్ ను ప్రార్థిస్తున్నాను,"

భగవాన్ అత్యంత కరుణతో ప్రేమావతి వైపు చూచి, "శాస్త్ర జ్ఞానముగాని, పాండిత్యముగానీ, సత్యమును తెలుసుకొనుటకు అవసరము లేదు. ఎందుకంటే మనిషికి తనను తాను చూచుకొనుటకు అద్ధముతో పనిలేదు కదా. తుదకు సంపాదించుకున్న జ్ఞానమునంతటిని, (అజ్ఞానముగా) అసత్యముగా భావించి వదలివేయవలసినదే. అట్లే గృహ కృత్యములు గానీ బిడ్డల పెంపకం గానీ ఆటంకము కాదు. మీరు ఏమి చెయ్యలేకపోతే, 'నేను', 'నేను' అని సర్వదా, మానసికంగా అనుకుంటూ ఉండండి, "నేను ఎవరను?" లో చెప్పబడినట్లుగా. మీరు ఏ పనిచేస్తున్నప్పటికి, నుంచున్నా కూర్చున్నా, నడుస్తున్నా 'నేను' అనుకొనండి. ('అహం') 'నేను' అనేది దేవుని పేరు. అదే మొదటిది. మంత్రములన్నిటిలోకి శ్రేష్టమైనది. 'ఓం' అనేది కూడా దాని తర్వాతదే.

పితాజీ, విశ్వాసము, పట్టుదల కలవారు. ఒకరోజున భగవాన్ సన్నిధిలో, భోజనశాలలో మధ్యాహ్న భోజనము చేస్తూ ఉండగా, భగవాన్ ప్రసాదమును తన కుటుంబ సభ్యులందరికీ తీసికుని వెళ్ళవలెనని గాఢమైన కోరిక కలిగింది. అలా చెయ్యాలంటే, భగవాన్ భోజనం చేసిన విస్తరిని తీసుకుని వెళ్ళుటయే సరియైనది అనుకున్నారాయన. ఆ రోజున భగవాన్ భోజనం చేస్తున్న అరటి ఆకు విస్తరి చాలా లేతగా ఉన్నది. భగవాన్ ఖాళీ విస్తరిని తాను కాజేస్తుండగా, భోజనశాలలో ఎవరూ ఉండకుండా ఉండేటట్లు చూడమని భగవాన్‌ను ఆయన ప్రార్థించారు. ఆయన కనులు మూసుకుని ప్రార్థించి, కనులు తెరిచేటప్పటికి భోజనశాలలో ఒక్కరు కూడా లేరు. ఆయన ఒక్క ఉదుటన తన స్థానములో నుండి పైకి లేచి, తన ఉత్తరీయముతో దానిని చుట్టి, గిరి వైపుకు త్వరత్వరగా వెళ్ళిపోయారు. ఒక పెద్ద రాతి వెనుక కూర్చుని, ఆ లేత అరటి ఆకులో నుండి ఒక చిన్న ముక్కను తుంచుకుని ప్రసాదముగా తినేశారు. మిగిలిన ఆకునంతటిని, ప్రసాదముగా కాన్పూరుకు తీసుకుని వెళ్ళుటకు ఉంచేశారు. ఆయన అతిథి గృహమునకు వచ్చి జాగ్రత్తగా పొట్లము కట్టిన ఆ ఆకును తన సూటుకేసులో అట్టఅడుగున దాచేశారు. ఇదంతా చేసేటపుడు ఎవరూ తనను చూడకుండా జాగ్రత్త పడ్డారు. తనలో పెరుగుతున్న అలజడిని అధిగమించుట కోసము (పోగొట్టు కొనుట కోసము) ఆయన టౌన్‌కు వెళ్ళిపోయారు.

సాయంత్రం ఆయన ఆశ్రమానికి తిరిగి వచ్చేసరికి, ఒక విచారణ ఆయన కొరకు వేచి ఉన్నది. భగవాన్ ఆకును ఎవరో కాజేశారు అనే విషయం సర్వాధికారికి తెలియజేయబడినది. ఆయన దాని గురించి (నిషేధాజ్ఞ ఉల్లంఘన) విస్తృతంగా విచారణ జరుపుతున్నారు. ఆ రోజు భోజనమును వడ్డించిన, పోస్టుమాస్టర్ రాజా అయ్యర్, ఖన్నా చివరగా భోజనశాల నుండి బయటకు వచ్చారనే విషయాన్ని చిన్నస్వామికి తెలియపరిచారు. ఖన్నా ఆఫీసుకు పిలిపించబడ్డారు. ఖన్నా మనసులో భగవాన్‌తో పోట్లాడసాగారు, "ఓ భగవాన్! మీరు దయతో, ఎవరూ చూడకుండా, నేను ఆ ఆకును కాజెయ్యాలనే కోరికను నెరవేర్చారు. ఇప్పుడు నన్ను వారికి దొరికిపోయేటట్లు చేస్తారా? ఇదేనా మీ అనుగ్రహము? దయచేసి నన్ను చిన్నస్వామికి దొరికిపోకుండా కాపాడి, నా దొంగతనాన్ని సంపూర్ణంగా విజయవంతం చెయ్యండి. చిన్నస్వామి ఖన్నాను స్వాగతించి, ఆ ఆకుదొంగ యొక్క దుర్మార్గాన్ని గురించి చెప్పారు. ఖన్నా ఆయనతో ఏకీభవిస్తూ, అవునండి, ఆ దొంగని పట్టుకుని గట్టిగా శిక్షించ వలసినదే అన్నారు, మనసులో అలా జరుగ కుండా కాపాడమని భగవాన్‌ను ప్రార్థిస్తూ. ఆయన పరుగెత్తుకుని భగవాన్ హాలుకు వెళ్ళి, ఆయనకు సాష్టాంగపడ్డారు. భగవాన్ నవ్వుతూ ఖన్నా వైపు చూశారు. "ఏమీ భయపడవద్దు. అన్నీ సరి అవుతవి", అని హామీ ఇస్తునట్లుంది ఆ నవ్వు. పితాజీ, 1970 దశకంలో ఈ ఉదంతమును ఎంతో గౌరవంతో తలుచుకుంటూ నాకు వివరించారు. దానిని ఇలా ముగించారు. "నేను, అదేరోజున ఆ పవిత్రమైన ప్రసాదమును తీసికుని కాన్పూరు వెళ్ళాను. నా కుటుంబములోని ప్రతి ఒక్కరికీ, దానిలో భాగాన్ని ఇచ్చాను. భగవాన్ పట్ల ఎంతో భక్తి కల్గిన నా పిల్లలు, మాలో ప్రతిఒక్కరము, ఆ ప్రసాదాన్ని కాజేయడానికి అవకాశము నిచ్చిన భగవాన్‌కు మేమంతా ఎంతో ఋణపడి ఉన్నట్లు భావించాము. అదంతా భగవాన్ కృప.

భగవాన్ జబ్బుపడి ఉన్న చివరిరోజులలో ఒకరోజు కాన్పూరులో 1950 మార్చిలో, భగవాన్ నన్ను పిలుస్తున్నట్లుగా అన్పించి, అకస్మాత్తుగా లేచి కూర్చున్నాను. నా భార్య నా చంటి బిడ్డతో కలసి, నేను అరుణాచలమునకు చేరుకున్నాను. నేను భగవాన్ ఎదుట నుంచుని ఉన్నపుడు, ఆయన స్వాగతం చెప్తున్నట్లు చిరునవ్వు నవ్వి, తన పరిచారకునివైపు వింతగా చూశారు. తర్వాత నేను ఆ పరిచారకుడిని ప్రశ్నించగా, ఆయన, "ఇవాళ ఉదయం, భగవాన్ కాన్పూరు ఖన్నా ఇక్కడ ఉన్నారా? అని

అడిగారు" అన్నారు. ఇవాళ నేను ఇలా ఉండటమంటే, భగవాన్ ఏకాగ్ర దృష్టిని నాపై నిలిపి, తమ అనుగ్రహాన్ని నాపై వర్షించటము వలననే" అన్నారు కన్నీరు కారుస్తూ పితాజీ.

భగవాన్ శరీరాన్ని వదలినపుడు మీరు ఆశ్రమంలో ఉన్నారా? అని ఆయనను నేనడిగాను. "అవును. భగవాన్ తన సమీపంలో ఉండే అవకాశాన్ని నాకు అనుగ్రహించారు. ఆ కాళరాత్రి, ఆ సంఘటన జరిగిపోయిన తర్వాత, భగవాన్ భౌతిక కాయమును, భక్తుల దర్శనార్థము కొత్త హాలులో ఉంచారు. నా గురువుగారి దేహాన్ని అలంకరించుట కోసము పెద్ద పూలదండ తెచ్చుట కొరకై నేను టౌన్‌కు పరుగెత్తాను. నా జీవితమంతా, నేనర్పించినదే మొట్టమొదట స్వీకరింపబడాలనే పట్టుదలతో ఉండేవాడిని. అదేవిధంగా, నేను హడావిడిగా, పూలదండను టౌన్ నుండి తీసుకుని వచ్చాను.పరిచారకుని సలహాతో నేను పూలదండను ఆయన చూపించిన మూలలో ఎంతో గౌరవంతో ఉంచాను. మర్నాడు పూలదండలు అలంకరించేటపుడు, నేను తెచ్చిన దండనే ముందుగా ఉంచుతామని, పరిచారకుడు చెప్పారు. మర్నాటి ఉదయం నేను కొత్త హాలుకు వచ్చేసరికి, నేను నివ్వెరపోయాను. నా పూలదండ, అదే విధమైన అనేక పెద్ద పూలదండల గుట్ట క్రింద, అడుగునెక్కడనో ఉన్నది. నేను భగవాన్‌ను గాఢంగా ప్రార్థించాను. "భగవాన్! మీరు నా మనసులోని ప్రార్ధనలను ఎల్లపుడూ తృప్తి కరంగా పూర్తి చేశారు. మీరు సజీవులై ఉండగా ఇపుడు, ఈ చిన్న కోరికను మన్నించి, నా పూలదండ, మొదటగా మీ శరీరాన్ని అలంకరించేటట్లు చూడండి." అని. కొంచెము సేపు ఆగి పితాజీ మరల, "సరియైన సమయంలో పరిచారకుడు వాటినన్నిటినీ మోసుకుని వెళ్ళారు. ఎంత అనుగ్రహమో చూడు. ఆ దండలను భగవాన్ శరీరమునకు దగ్గరగా ఉంచినపుడు, వాటిని (తలక్రిందులుగా) నా దండ పైకి వచ్చే విధంగా పేర్చారు. భగవాన్, నా పిల్ల చేష్ట వంటి ప్రార్ధనను కూడా అంగీకరించారు. పరిపూర్ణ సత్యస్వరూపులైన భగవాన్, ఎల్లపుడూ, తనకు అర్పించ బడిన ప్రార్ధనలను తీరుస్తూనే ఉంటారు. భగవాన్ నిజంగా కరుణా సముద్రులే," అన్నారు.

ఖన్నాకు ఎన్నో బాధ్యతలుండేవి. ఒకసారి కోట్ల విలువ చేసే, ఆస్తి వ్యవహార వివాదము కొరకు ఆయన ఢిల్లీకి వెళ్ళవలెనుకున్నారు. మేమిద్దరము మంచి స్నేహితులమైనందు వలన, ఆయన నా సలహాను కోరారు. ఒకరోజు ఆయన అన్నారు. "నేను ఢిల్లీకి వెళ్ళాలనుకుంటున్నాను. కానీ నేను అరుణాచలములో మరణించాలను కుంటున్నాను." నేను, ఆయనతో "పితాజీ, మీరు అరుణాచలమును వీడి వెళితే, మీరక్కడే చనిపోవుటకు అవకాశము ఉంటుంది." అన్నాను. మర్నాడు ఉదయం ఆయన నన్ను కౌగలించుకుని, "నేను, నా ప్రయాణమును రద్దుచేసుకున్నాను. నేను ఏ విధమైన సాహసం చెయ్యదలచుకోలేదు. ఆ కేసును, ధనమునూ కుక్కలపాలుగానివ్వు. నేనిక్కడనే ఉండి పోతాను. నేను నా శరీరాన్ని అరుణాచలములో మాత్రమే విడువవలెననుకుంటున్నాను." తర్వాత ఆయన నన్నిలా ప్రశ్నించారు, మీరు మీ తల్లిగారు చనిపోయినపుడు ఆమె ప్రక్కనే ఉన్నారుగదా, ఆమె మరణం ఎలా సంభవించిందో దయచేసి నాకు వివరించండి. మా తల్లిగారు పూర్తి ఎరుకతో, ఆనందంతో, మహత్వ పూర్ణంగా ప్రాణములు విడిచారు. చివరి క్షణములలో ఆమె కనులు మూసుకుని ఉన్నప్పటికీ, ఆమె ముఖంలో ఏదో గుర్తించిన భావం వ్యక్తమైంది. మేమందరమూ అక్షర మణమాల పాడినపుడు ఆమె భక్తి భావమును వ్యక్తపరిచారు," అన్నాను. అపుడు 1984, జూలై నెల చివరిలో ఆయన చనిపోతున్నట్లు ఆయనకు అకస్మాత్తుగా అన్పించింది. ఆయన తన భార్యను పిలిచి, ప్రేమవతీ, గణేశన్‌ను పిలువు. ఆయనను వెంటనే రమ్మని చెప్పు అన్నారు. ఖన్నా వెంటనే భగవాన్ ఫోటో ఎదురుగా ఒక కుర్చీ వేసుకుని అందులో కూర్చున్నారు. అందులోనే, పూర్తి చైతన్యంతో ప్రాణాలు విడిచారు. నేను వచ్చేసరికే, ఆయన చనిపోయారు. ఆయన అకస్మాత్తుగా చనిపోయారని వైద్యులుతేల్చి చెప్పినపుడు, పితాజీ పూర్తి స్పృహతో ఉన్నారనేది నాకు ఋజువు అయింది. నాకు వ్యక్తిగతంగా పితాజీ, ఒక హీరో (నాయకుడు). ఆయన శరీరము యొక్క కోరికలను పట్టించు కోకుండా, తన శారీరక రుగ్మతలకూ, అవసరాలకూ లొంగిపోకుండా, తన సద్గురువైన భగవాన్‌పై పూర్తి శ్రద్ధ నుంచి, శారీరక పరిధులను అధిగమించారు. పితాజీ శరీరానికి, ఆశ్రమ భూమిలో ఖననం చేయించుకునే హక్కు ఉన్నది. అందుకే దానికి వ్యతిరేకించిన వారినందరినీ వప్పించి, చాడ్విక్, కోహెన్‌ల సమాధుల ప్రక్కన ఆయన శరీరాన్ని ఖననం చేశాము. భక్తులు ఈ నాటికీ ఆ సమాధికి నివాళులు అర్పిస్తారు. రమణాశ్రమంలో ఖననం చెయ్యబడిన సాధువులు, సన్యాసులందరిలో ఆయన ఒక్కరే గృహస్తులు.

'సత్యము' అనేది దాని వెంట పరుగులు తీయవలసిన సూత్రము కాదు. మీరే నిజమైన సత్యము. భగవాన్ వేదాంత గ్రంథములలోని (పునుగు) ఒక విధమైన జింకను గురించి చెబుతుండే వారు. ఆ జింక తనలో నుండే ఆ దివ్యమైన పరిమళము వస్తుందని గ్రహించక, ఆ సువాసన పట్ల ఆకర్షింపబడి పరుగులు పెడుతుంది. కొన్ని జింకలు, దానిని వెతుక్కుంటూ పరిగెత్తి, పరిగెత్తి ప్రాణములు విడుస్తయ్యట. మనము ఆ జింక వలె సత్యము వెంట పరుగెత్తుట మెందుకు. మనమే సత్యము. బయటకు వెళ్ళుట ఎందుకు? మన హృదయములోని సత్యము గానే మనము నిలచి ఉందాము. భగవాన్ అనుగ్రహంతో అరుణాచలుడు మనలను, తనలోనికి కలిపేసుకుంటారు. సత్యములో నిలవటమే అరుణాచలునిలో కలవడము.

ఒకప్పుడు భగవాన్‌ను ఎవరో 'ధీరుడు' అంటే ఎవరు అని ప్రశ్నించారు. భగవాన్, "తానెవరో తెలిసిన వాడే ధీరుడు," అని బదులిచ్చారు. సత్యముగా నిలవటమే గొప్ప ధైర్యము. వీరత్వము. భగవాన్ పాత భక్తులందరికీ ఈ లక్షణము ఉన్నది. మనము కూడా ఎల్లప్పుడు ధీరులమేనని, గుర్తు చేసుకొనటానికి, మనము, ఈ భక్తుల గురించి తెలుసుకొనవలెను. ఈ విధమైన 'నిలచి ఉండుట' లేక 'కలసిపోవుట' అనేది ఎల్లప్పుడూ ఉంటుంది – అంటే వర్తమానంలోనే.

మనము అరుణాచలములో ఐక్యమవడానికే అరుణాచలమునకు వచ్చాము. భగవాన్, దీనినే 'ఐక్యమ్ అక్కికోల్' అన్నారు. "ఆమెను నీలో కలిపేసుకో," అని ఆయన తల్లి విషయంలో అరుణాచలుని ప్రార్థించినది, కేవలము తల్లి గురించి మాత్రమే కాదు, ఆయన మనలో ప్రతి ఒక్కరి గురించి ప్రార్థించారు. మనము మేల్కొనవలెను. ఇది మనలను జాగృతం చేయుట కివ్వబడిన పిలుపు. ఆ జింక వలె మనము సత్యము వెంట పరుగులు తీయవద్దు. 'సత్యము' మనలోనే ఉన్నదనే విషయమును మనము గ్రహించుదాము. ఆవిధంగా గుర్తించడమే ఐక్యమవడమంటే, అదే అరుణాచలము. భగవాన్, "హృదయమే నీ పేరు అరుణాచలా!" అని అరుణాచలుని స్తుతించారు. మనలోని అంతర్గతంగా దాగిన సత్యమే అరుణాచలుడు, తనలోనికి మునిగి, తానుగా నిలుచటయే. అరుణాచలునిలో ఐక్యము అవటము. ఈ స్థితి, దేశకాలములతో సంబంధము కలిగినది కాదు. అది శాశ్వతమైన వర్తమానము, లోనే ఉన్నది. ఏ వర్తమానములో అయితే మనము ఎల్లపుడూ ఉంటామో, ఆ వర్తమానములో.



శ్రీ భగవాన్ "నేనే నేను అని ఎల్లప్పుడూ పలుకుతూ ఉండమని" ప్రేమావతి కన్నాతో చెప్పారు.

శివరామ రెడ్డియార్

ఒక జ్వాల, తనను తాను కనిపింప చేసుకోనటానికి, వేరే దీపము యొక్క సాయము అవసరములేదు. దానికి ఒక ఉనికి ఉంటుంది. కన్నులు ఉన్న వారెవరైనా, దానిని చూడగలరు. ఆ జ్వాల, ఎవరైనా తనను చూచినా, చూడకున్నా ప్రకాశవంతంగా, జ్వలిస్తూనే ఉంటుంది. శివరామ రెడ్డిగారు, అటువంటి ఒక జ్వాల. ఆశ్రమంలో ఒక చిన్న గదిలో నిర్వహించబడే పుస్తక విక్రయశాల నిర్వాహకులుగా ఆయన ఉండేవారు. నేను 1960లో రమణాశ్రమమునకు వచ్చినపుడు, మా తండ్రిగారు, "నీకు ఈలోక వ్యవహారములు, ప్రత్యేకించి ఆర్థిక పరమైనవి అంతగా తెలియవు. అందుకని వెళ్ళి శివరామరెడ్డిగారి క్రింద పని చెయ్యి" అని చెప్పారు. నేను అప్పటికి, ఆధ్యాత్మిక విషయాలకు కొత్తవాడినైనప్పటికి, నేను ఆయన క్రింద పని చెయ్యటము ప్రారంభించిన కొద్దిగంటలలోనే, ఆయనలోని స్థిరమైన ప్రశాంతత వలన, ప్రకాశమువల్ల ప్రభావితుడనైనాను. దీంట్లో విశేషమేమంటే నేను ఆయన ఆధ్యాత్మిక స్థితిని అంచనా వెయ్యటానికి గాని, అర్థం చేసికోనటానికి గాని కనీసం ప్రయత్నం కూడా చెయ్యలేదు. అది దానంతటదే ఒకపువ్వు సహజంగా వికసించినట్లుగా జరిగిపోయింది.

శివరామరెడ్డిగారు చెన్నైకు, తిరువణ్ణామలైకు మధ్యలో ఉన్న 'ఆచారపాక్కమ్' అనే చిన్న టౌన్ (పట్టణము)నకు చెందినవారు ఆయన తలిదండ్రులు భూస్వాములు. శివరామరెడ్డిగారు స్వయంగా ఒక రైస్‌మిల్ (బియ్యంమర)కు యాజమాని, వారి కుటుంబము మొత్తము, అచ్యుతస్వామి అనే సాధువు ఎడల భక్తి కలిగి ఉండేవారు. మహాత్ముడు, కవి అయిన ఆయన రచించిన అద్వైత గీతములు బాగా ప్రాచుర్యము పొందాయి. అచ్యుత స్వామి, మొదటగా భగవాన్‌ను అరుణాచలేశ్వర ఆలయంలో దర్శించుకున్నారు. తన శిష్యులు కొందరితో కలసి, ఆలయంలోనికి ప్రవేశించిన, అచ్యుతస్వామి, చిన్న కుర్రవానిగా ఉండి, గాఢ సమాధి స్థితిలో మునిగి యున్న భగవాన్ పట్ల ఆకర్షితులైనారు. ఇలుప్పై (ఇప్ప చెట్టు) వృక్షముక్రింద నున్న శరీరము, వయసులో చిన్నదైనప్పటికి, దేశకాలాతీతమైన ఆనందంతో నిండి ఉన్నట్లు, వయో పరిణితి కల్గిన అచ్యుతస్వామి గుర్తించారు. మరుసటి సంవత్సరమే, దరిదాపు రెండు వందల మంది శిష్యులతో కలసి, ఆయన మరల వచ్చారు. ఇలుప్పై (ఇప్ప చెట్టు) వృక్షముక్రింద, భగవాన్‌ను కానక, వారు. ఆలయము మొత్తము వెదికారు. కానీ ఫలితం శూన్యము. ఆయన కొరకై వారు వాకబు చెయ్యగా, భగవాన్, ఆ కౌపీనమును ధరించవలెననే స్పృహ కూడా లేనంతటి గాఢమైన సమాధి స్థితిలో ఉండుటచే, కార్తీక దీపోత్సవము దగ్గరపడుటచే, కొందరు సజ్జనులు ఆయనకొక వస్త్రమును చుట్ట బెట్టి, ఉత్సవమునకు వచ్చే జనసందోహముచే ఆయన ధ్యానమునకు భంగము కలుగ కుండ ఉండగలందులకుగాను, టౌన్ శివార్లలో ఉన్న గురు మూర్తము అనే చిన్న గుడికి ఆయనను తీసుకుని వెళ్ళారు, అని తెలిసింది.

అప్పటికి భగవాన్ మహాత్మునిగా పేరు పొందనప్పటికీ, తన శిష్యులతో సహా భగవాన్ వద్దకు వెళ్ళారాయన. శేషాద్రిస్వామి తొలిసారిగా భగవాన్‌ను గొప్ప మహాత్మునిగా గుర్తిస్తే, ఆయన గొప్ప తనమును గుర్తించిన రెండవ వ్యక్తి, అచ్యుత స్వామి. గురుమూర్తము చేరుకోగానే, తన శిష్యులను బయటనే ఉంచి ఆయన ఒంటరిగా గుడిలోనికి వెళ్ళారు. సంపూర్ణ ఆత్మ నిష్ఠులై, ఒక (స్టూలు) బల్ల మీద కూర్చునియున్న భగవాన్‌ను చూస్తూనే, ఆయన పాదములపై వ్రాలి, "నేను ఆత్మనిష్ఠను గూర్చి, అద్వైత వేదాంతమును గురించి గీతములు వ్రాసినప్పటికి, ఆస్థితి నాకు అనుభవమునకు రాలేదు. నాకా స్థితిని అనుగ్రహించవలసినది, అని ప్రార్థించారు. ఆయన వెలుపలకు వచ్చి, శిష్యులతో పలికిన పలుకులు, ఆయనకు, ఆస్థితి ప్రసాదించబడినది. అనే విషయమును ఋజువు చేస్తున్నవి, ఆయన తన శిష్యులతో, అక్కడ కూర్చుని ఉన్నది, ప్రజ్వలిస్తున్న మహోజ్వల జ్వాల, దూరమునుండియే ఆ జ్వాలకు ప్రణమిల్లి, దాని యొక్క ఆశీస్సుల కొరకై ప్రార్థించండి.

అచ్యుత స్వామి గీతముల వలన ప్రభావితులైన శివరామరెడ్డి, చిన్నతనము నుండియే అద్వైతవేదాంతము పట్ల ఆసక్తి కలిగి ఉండేవారు. భగవాన్ తరుచుగా ఉదహరించే, యోగవాశిష్టము, కైవల్యనవనీతము అను రెండు ముఖ్యమైన తమిళ

వేదాంతగ్రంధములను శివరామరెడ్డి క్రమంతప్పక చదువుతుండేవారు. అచ్యుత స్వామి శిష్యులలో ఒకరు, శివరామరెడ్డికి, శ్రీరాముని తారక మంత్రమును ఉపదేశించి, షణ్ముఖి ఉపాసనా పద్ధతిలో దానినెలా జపించాలో నేర్పారు. శివరామరెడ్డి, దానిని, పది సంవత్సరముల పాటు ఆచారపాక్కంలోని తన ఇంటి వద్దను, దగ్గరలోని ఒక అడవిలోను, తీవ్రంగా అభ్యసించారు. (సాధన చేశారు). అలా చేస్తూ ఉండగా, షణ్ముఖి ఉపాసనలో చెప్పబడే మిక్కిలి ప్రకావంతమైన కాంతిని ఆయన చూడగలిగారు. అది ఆయనను, ఉత్సాహంతోనూ, ఆనందముతోనూ నింపివేసింది. కానీ ఆయన హృదయాంతరాళాలలో ఎక్కడో, తానుసాధించినది అంతిమ లక్ష్యము కాదని అనిపించింది. ఫలితంగా ఆయనలో సంతృప్తి కలుగలేదు. ఆ సమయంలోనే ఇరువది ఏళ్ళ వయసుగల. ఆయన భార్య, ఎవరినైతే ఆయన మిక్కుటముగా ప్రేమించే వారో, ఆవిడ చనిపోయారు. విధి ఆమెను ఆయన నుండి దూరము చేసినపుడు, ప్రపంచ మంతా శూన్యంగానూ, నిస్సంతోషంగానూతోచింది. రెడ్డికి, ఇది కొద్ది కాలమునకు సమసిపోయే బాధలా అనిపించ లేదు. ఆయన దానిని మరచిపోలేకపోయారు. కొన్ని సంప్రదాయములను అనుసరించి, తీర్ధయాత్రలు చేస్తే మానసిక శాంతి లభిస్తుంది. కొంతకాలమునకు, దుఃఖముపూర్తిగా తొలగిపోతుంది. ఆ నమ్మకంతో, ఆయన భారతదేశ సంచారానికి పాదయాత్ర ప్రారంభించి, పవిత్రప్రదేశములను మూడేళ్ళపాటు సందర్శించారు. ఆయన దుఃఖము లేశమాత్రము కూడా ఉపశమించలేదు.

ఆ తర్వాత, అచ్యుత స్వామికి ప్రత్యక్ష శిష్యుడై అప్పుడు రమణా శ్రమంలో నివసిస్తున్న తన పినతండ్రి గుర్తుకురాగా, ఆయన తిరువణ్ణామలైకు వచ్చారు. అరుణాచలేశ్వర ఆలయంలో ఉంటూ, ప్రతి ఉదయమూ గిరి ప్రదక్షిణ చేస్తూ ఉండేవారు. గిరిప్రదక్షిణ చేసే సమయమున, ఆయన రమణాశ్రమము మీదుగానే వెళ్తుండేవారు. 1931లో రమణాశ్రమము పెద్దదిగా ఉండేదికాదు అక్కడ తన పినతండ్రి క్రిష్టారెడ్డితో కలసి, పాతహాలు వెనుక ఆయనచే పెంచబడిన పూలతోటలో పూలు కోసేవారు. ఒకరోజు శివరామరెడ్డిపై జాలితో అతని పినతండ్రి ఆయనను భగవాన్ వద్దకు తీసుకుని వెళ్ళి, "భగవాన్, ఈయన నా అన్న కుమారుడు. మూడేళ్ళక్రిందట ఆయన భార్యచనిపోగా దుఃఖసాగరంలో మునిగిపోయి ఉన్నారు", అని చెప్పారు. భగవాన్ ఆయనపై దృష్టి సారించారు.

భగవాన్‌ను దర్శించుకున్న అనేకమంది భక్తులు, భగవాన్ చూపు తమలోనికి చొచ్చుకొనిపోయి, శరీరములోని ప్రతి అణువునూ, మనసునూ, హృదయన్నీ ఊఱట చెందించేదని చెప్పారు. భగవాన్ ఆయనవైపు కొద్ది క్షణములు చూడగానే శివరామ రెడ్డి దుఃఖము మాయమైపోయింది. ఆయనకు ఆమెపై ఇంకాప్రేమ అయితే ఉన్నది కానీ, ఆమె మరణం తాలూకు దుఃఖం మాత్రం లేదు. ఆయన హృదయంలో గొప్ప సంతోషమును అనుభవించి, ఆచారపాకంలోని తన వ్యాపారము చూచుకొనటానికి వెళ్ళిపోయారు. 1934లో ఆయనకు రమణాశ్రమము నుండి పిలుపు వచ్చింది". మీ పినతండ్రి (అంకుల్) చనిపోయారు. దయచేసి రండి". అని. తనగ్రామమునుండి తిరువణ్ణామలై కేవలము 90కిలో మీటర్ల దూరములోనే ఉండుట వలన, ఆ రాత్రే ఆయన అక్కడకు జేరుకున్నారు. అక్కడకు జేరుకొనగానే, ఆయన పినతండ్రి ఏ విధంగా చనిపోయారు అనే వివరాలు అన్నీ, కుంజుస్వామి ఆయనకు వివరించారు. అపుడు భగవాన్ సూచనలను అనుసరించి శివరామరెడ్డి, తన పినతండ్రి అంత్యక్రియలు జరిపారు. అపుడు ఆయన భగవాన్‌ను తన జీవిత మంతా సేవించాలి అనుకున్నారు.

నేను శివరామ రెడ్డిని, ఆయన పినతండ్రి గురించి చెప్పమని కోరాను. ఆయన 1896లో అచ్యుత స్వామితో పాటువచ్చిన శిష్యులలో ఒకరు అని చెప్పారు. ఆయన అచ్యుత స్వామిని సేవించేవారు. అచ్యుత స్వామి అంతిమ ఘడియలలో, కృష్ణా రెడ్డి, ఆయన పాదములను పట్టుకుని, తనకు మార్గము చూపమని కోరారు. అచ్యుత స్వామి, ఆయనతో, "రమణా శ్రమమునకు వెళ్ళి రమణమహర్షిని సేవించు. నేను ఆధ్యాత్మికముగా పొందినదంతా నీకు ఇచ్చేశాను. నీవు మరింత పొందవలసి ఉన్నది. అందుకని రమణమహర్షి వద్దకు వెళ్ళు", అని చెప్పారు. ఆవిధంగా శివరామరెడ్డి పినతండ్రి భగవాన్ వద్దకు వచ్చారు. ఆయన దృఢకాయుడు. కష్టించి పని చేసేవారు, ఆయన ఆశ్రమపూలతోటను పెంచి, ఆశ్రమ నిర్వాహకులకు పనులు చేసిపెట్టేవారు, ఒకరోజు ఆయన వారితో నేను,"మా గ్రామానికి వెళ్తున్నాను. త్వరలోనే వెనుకకు వస్తాను", అని చెప్పారు. తన గ్రామము చేరగానే, ఆయన తన బంధువులందరిని పిలిచి, వారితో, "ఒక వారము లోపల, నేను రమణాశ్రమములో, నా సద్గురువు పాదముల చెంత, ఈ శరీరాన్ని వదలి వేయబోతున్నాను. మీ అందరి వద్ద సెలవు తీసికొనుటకై యిక్కడకు

వచ్చాను," అన్నారు. క్రిష్ణారెడ్డికి జ్యోతిష్యము బాగుగా తెలియును. ఆయనకు తాను ఎప్పుడు మరణించేది తెలుసు. ఆయన తిరువణ్ణామలైకు తిరిగివచ్చే సరికి చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఎటువంటి ఆరోగ్యలోపము లేదు. కానీ ఏడవరోజున ఆయనకు కొద్దిగా జ్వరము వచ్చింది. సాయంత్రము అయ్యేసరికి, అది తీవ్రమై ఆయనకు నిలబడటానికి కూడా శక్తి లేకుండాపోయింది. రామకృష్ణ స్వామి, కుంజు స్వామి ఆయనను ఒక కుటీరములో ఉండమని కోరారు. ఆరోజులలో ఆశ్రమములో కొన్ని పూరి గుడిసెలు ఉండేవి. ఆయన కుటీరములో పడుకుని ఉండగా, రామకృష్ణ స్వామి, కుంజుస్వామి, భగవాన్ వద్దకు వెళ్ళి కృష్ణారెడ్డి గారిని గురించి చెప్పారు. భగవాన్, కృష్ణారెడ్డికి జ్యోతిష్యము తెలియును. ఆయన తన గ్రామమునకు వెళ్ళి, తన కుటుంబము వారి వద్ద సెలవు తీసికొని, అరుణాచలునిలో ఐక్యమగుటకు అరుణాచలమునకు తిరిగి వచ్చినారని వారితో చెప్పారు.

1914లో భగవాన్ తల్లి తీవ్రముగా జబ్బు పడినపుడు, భగవాన్ అరుణాచలుని గురించి నాలుగు పద్యాలు రచించారు. తన తల్లిని ఆయనలో ఐక్యము చేసికొనమని ఆయనను ప్రార్థించారు. మూడవ పద్యములో ఆయన ఇలా ప్రార్థించారు. "అరుణాచలా, ప్రచండ జ్వాలా రూపమైన సత్యజ్ఞానమా! మాతల్లిని నీప్రకాశముతోచుట్టి ఆమెను నీలో ఐక్యము చేసికొనుము". 1922లో భగవాన్ తల్లి నిర్యాణము చెందినపుడు ఆవిధంగానే జరిగింది. శివరామరెడ్డి పినతండ్రి విషయములోకూడా, అదే విషయాన్ని భగవాన్ ధృవీకరించారు. "ఆయన అరుణాచలునిలో ఐక్యము అగుటకు యిక్కడకు వచ్చారు" అని చెప్పి. తర్వాత రాత్రి ఏడుగంటలకు భోజనమైన పిదప, భగవాన్, బి.వి. నరసింహస్వామి, మరికొంతమంది తిన్నగా కృష్ణారెడ్డి గారి కుటీరమునకు వెళ్ళారు. భగవాన్ ఆయన ప్రక్కన కూర్చుని ఆయన తలను, తాకారు. బి.వి. నరసింహస్వామి భజన చెయ్యసాగారు. రామకృష్ణ స్వామి, కుంజు స్వామి ధ్యానముచెయ్యసాగారు. కొంచెము సేపైన తర్వాత, రామకృష్ణస్వామి, కుంజుస్వామి, భగవాన్‌ను, బి.వి. నరసింహస్వామిని, పొద్దు పోయిందని, వెళ్ళిపొమ్మని చెప్పారు. భగవాన్ కృష్ణారెడ్డి గారిని నిలకడగా కొంత సేపు చూసి వెళ్ళి పోయారు. తెల్లవారు జామున నాలుగుగంటలకు కుంజుస్వామి, రామకృష్ణస్వామి భగవాన్‌కు, కృష్ణారెడ్డి మరణమును గురించితెలిపారు. ఆయన దేహాన్ని ఎక్కడ, ఏవిధంగా సమాధి చెయ్యాలి అనే విషయంలో భగవాన్ చెప్పిన మాటలు పొల్లుపోకుండా ఆచరించబడ్డాయి. అదంతాచెబుతూ, మా పినతండ్రిగారి ఆశీస్సుల వలననే, నేను శాశ్వతంగా రమణాశ్రమములో ఉండిపోయి భగవాన్‌ను సేవించు కోగలిగాను, అన్నారు.

నేను, శివరామరెడ్డిని మీరు మౌనంగా ప్రశాంతంగా, ఏ మాత్రము తొణకకుండా, ఉండుట వలన, నాకు ఎల్లపుడు మిమ్ములను అంటిపెట్టుకుని ఉండాలనిపిస్తుంది. కానీ, అదేసమయంలో మీరు చాలాసామాన్య వ్యక్తి వలెకన్పిస్తారు. మీకు ఏమిజరిగింది? చెప్పవలసినది", అని అడిగాను. ఆయన, "ఏమీ లేదు, నేను యితరులందరి వలెనే చాలా సామాన్యుడిని" అన్నారు. నేను ఆయనను వదలిపెట్టలేదు. ప్రతి రోజూ, నేను, ఆయనను వత్తిడి చేసే వాడిని. "మీలో ఏదో ప్రత్యేకత ఉన్నది అది ఏమిటో చెప్పవలసినది", అని. ఆయన ఏమాత్రము సందు ఇవ్వనందున, నేను ప్రశ్నించే ధోరణిని మార్చాను.

"మీకు ఎన్నడూ ఆధ్యాత్మిక విషయములలో సందేహములు రాలేదా"? అని ప్రశ్నించాను. ఆ పద్ధతి పనిచేసింది. ఆయన," 1931 వరకు, నేను తారకమంత్రమును 20 ఏళ్ళపాటు శ్రద్ధతో జపిస్తూ ఉన్నాను. షణ్ముఖి ఉపాసనను పదేళ్ళపాటు చేశాను. దానిఫలితంగా, నా చుట్టు కాంతిని, ఒక విధమైన ఉత్సాహాన్ని పొందసాగాను ఆయనలోతుల్లో ఎక్కడో, ఆ స్థితి యొక్క సత్యత్వమును గురించి సందేహము ఉండేది. 1934లో నేను ఈ సందేహాన్ని గౌరవ పురస్కరంగా భగవాన్ ముందు ఉంచాను. భగవాన్ కరుణతో ఇలా సెలవిచ్చారు. "అవును, ఆ స్థితి నిధిధ్యాసన. మీరు గురువు మీకు ఉపదేశించటము విన్నారు. అది శ్రవణము. దానిని మీరు అర్థముచేసికొని తిరిగి తలచుకున్నారు. అది మననము ఇప్పుడు దానిని అనుభవిస్తున్నారు. అది నిధిధ్యాసన. కానీ ఇది ఇంకా త్రిపుటి స్థాయిలోనే ఉన్నది. ద్రష్టయొక్క త్రివిధమైన స్థాయిలోనే. ద్రష్ట, దృక్కు, దృశ్యముగా. మీరు దానిని అధిగమించి, దానిని అనుభవిస్తున్ననేనెవరు? ఆ శాంతిని, ఉత్సాహమును అనుభవిస్తున్న నేను ఎవరు? అని కనుగొనవలెను. ఎవరో ఒకరు అనుభవించేవారు లేదా అనుభవమును పొందేవారు ఉంటేగాని, కాంతి, ఉత్సాహము, ఆనందము అనుభవము లోనికిరావు, అది ఎవరో కనుగొనండి. శివరామరెడ్డి కొనసాగించారు. భగవాన్ నాకు వివరించక ముందే, నాకు త్రిపుటి గురించీ, దానిని అధిగమించవలసిన అవసరముగురించీ తెలుసును. కానీ సద్గురువు

సన్నిధానములో మాత్రమే, దానిని ఆచరణ పూర్వక సత్యంగా నిజమైన జీవన అనుభవంగా గ్రహించగలిగాను. 'నేను' త్రిపుటిని దాటుట అనే అనుభవము నాకు కల్గి, ఆ మహోన్నతమైన, శక్తివంతమైన నిశ్చల మౌనం నన్ను ఆవరించి చుట్టి వేసింది. అదినాకు కడపటి ఉపదేశము. ఆ ఆనందము, విరామము లేకుండ కొనసాగుతున్నది. 1934నుండి ముప్పది సంవత్సరముల పాటు ఆ పుస్తకముల షాపు మేనేజర్‌గా ఉన్న కొద్దిపాటి పనిని, అమ్ముట, కట్టలు కట్టుట వగైరాలను ఆయన స్వయంగాచేసేవారు. మామూలు కొవ్వొత్తి వలెకాదు. ఆయన ఆ అంతరంగిక ప్రకాశములో ఎల్లపుడు ఉండేవారు. నేను నాలుగేళ్ళపాటు ఆయనకు సహాయకుడిగా పనిచేశాను. పరిపూర్ణ సత్యములో, పూర్తి చైతన్యంతో జీవిస్తున్న వ్యక్తితో సన్నిహితంగా పనిచెయ్యట మనేది, నాకొక ప్రగాఢమైన గొప్ప అనుభవము, అలా సన్నిహితంగా ఉండుట వలన, భగవాన్ అనుగ్రహమును పొందిన ఆయన పట్ల, ఇంకా ఎంతో గౌరవం పెరిగింది.

నేను 1960లో రమణాశ్రమానికి వచ్చినపుడు, నాకు నేనుగా మూడు నియమాలు (ఒట్లు) పెట్టుకున్నాను. అవి ఆధ్యాత్మిక జీవనానికి అత్యంత అవసరమైనవని నేను భావించాను. "నేను డబ్బును ముట్టుకోను. నా పేరు నెక్కడా సంతకము చేయను. స్త్రీల వైపు కన్నెత్తి చూడను" అని. అప్పట్లో సందర్శకులు తక్కువగానే ఉన్నప్పటికీ, ఎవరైనా స్త్రీ గానీ, కుటుంబముగానీ పుస్తకములు కొనుటకువస్తే, నేను లేచి వెళ్ళిపోయే వాడిని. సాయంత్రము లెక్కలు పూర్తి చేయుటకు, నేను (పద్దులు) లెక్కలు వ్రాయటంలో సహాయపడేవాడిని, కానీ నేను ధనమును ముట్టు కోనందున, ఆయనే డబ్బు లెక్కించవలసివచ్చేది. ఏవైనా, రసీదులు, ఇతర వ్యావహారిక పత్రములు తయారు చెయ్యవలసివస్తే, వాటిలో వివరములను నేను నింపేవాడిని, కాని సంతకము చేసే పనిని ఆయనకే వదిలేవాడిని. ఆయన వీటి నన్నిటినీ గమనిస్తున్నారని నాకు తెలియదు. సాక్షాత్కారమును పొందినవారు త్వరపడి నిర్ణయాలను చెయ్యటము, ఇతరులను విమర్శించటము చెయ్యరు.

ఆయన మూడు నాలుగునెలలపాటు నన్ను గమనించారు. నేను భగవాన్ సమాధి ఎదుట ఆరుబయట పడుకునే వాడిని, ఆయన పుస్తక విక్రయశాల ఎదురు పాకలో పడుకునేవారు. ఆయన ఆప్యాయంగా నన్ను 'గణేశూ'! అని పిలిచేవారు. ఒక రాత్రి సుమారు తొమ్మిది గంటలకు, ఆయన "గణేశూ! ఇలా రండి", అని పిలిచారు. ఆయనకు తీవ్రమైన ఉబ్బసము తెరలు వస్తుండేవి. ఆయనకు అలావచ్చిపుడు, ఆయన నన్ను పిలుస్తుండేవారు. నేను వెళ్ళి, నాకు, చేతనైన సాయం చేసే వాడిని. అపుడు కూడా, అలాగే అనుకుని పరుగున ఆయన వద్దకు వెళ్ళాను ఆయన, "నా ప్రక్కన కూర్చోండి", అన్నారు. " నేను ఇన్ని నెలలుగా మిమ్ములను గమనిస్తున్నాను, మీరు ధనమును ముట్టుకోరు, పత్రములమీద సంతకము పెట్టరు. ఏ వయస్సులో ఉన్న స్త్రీ లైనా (పెద్ద, చిన్న) పుస్తకవిక్రయశాలకు వస్తే, మీరు పారిపోతారు. అసలు విషయమేమిటి?" అని ప్రశ్నించారు. నేను, నా ఆధ్యాత్మిక ప్రయాణములో సహాయకారిగా ఉండుటకు తీసికున్న ప్రతిజ్ఞలను గురించి చెప్పాను, "ఓ, అది బాగానే ఉన్నది, కానీ మీరు ఆచరించింది చాలును. ఇప్పుడు మీ పనులను గురించి ఆలోచించండి, ధనములో చెడు ఏమున్నది? డబ్బును ముట్టు కొనటం పాపం కాదు. డబ్బుపై మమకారము ఉండటము పాపము. దానిని ఆయన ఉపదేశముగా కానీ, వాదనగాకానీ చెప్పలేదు. హృదయ పూర్వకంగా తన అభిప్రాయములను నాతో పంచుకున్నారు. అందుకని అవి సూటిగా నా హృదయం లోనికి వెళ్ళాయి. ఆయన ఇంకా ఇలా కొనసాగించారు. మీ పేరును సంతకము చేయుటలో తప్పేమింటి? మీరు పేరుతో జన్మించారా? పేరును వదలి పెట్టినంత మాత్రమున, మీశరీరముపై అభిమానమును మీరు వదలు కొనలేదు. మీతల్లి దండ్రులు మీకు పేరుపెట్టారు. 'నేను ఈ శరీరమును', అనే భావమును వదలి వెయ్యి. మీకైతే గణేశూ, భగవాన్‌స్వయంగా మీపేరును పెట్టారు. ఆపేరు ఎంత పవిత్రమైనదో చూడు. ఆక్షణంనుండి, నేను, నాపేరును అంటిపెట్టుకుని ఉన్నాను. నా మూడవ ప్రతిజ్ఞ గురించి ఆయన ఇలా అన్నారు. మీరు స్త్రీలను నిర్లక్ష్యము చేస్తే (వారిపట్ల ఉపేక్షవహిస్తే), మీరు సృష్టి కర్తనే అవమాన పరచినట్లు కాదా? ఆ సర్వోత్కృష్టమైన శక్తే, జగత్తులోని, స్త్రీ, పురుష రూపములను సృష్టించింది. జంతువులలోను, పక్షులలోనూ, జీవులలోనూ, వృక్షములు, మొక్కలు, రాళ్ళలో కూడా. స్త్రీలకు విలువ ఇవ్వకుండ, మీరు సృష్టిలోని సగ భాగాన్ని నిరసిస్తున్నారు. ఇది సరియైనదేనా? ఇది అవసరమా? ఈ అవరోధమును అధిగమించటానికి, స్త్రీలందరినీ, ఎటువంటి బేధ భావము లేకుండా మాతృ భావంతో చూడండి. మీరు ఎంతగాఢమైన ప్రేమతో చూస్తే, ఆ సృష్టికర్తపట్ల భక్తి

భావము మీలో అంతగా ఉప్పొంగుతుంది. సృష్టిలోని సగభాగమును నిర్లక్ష్యము చెయ్యడము మీ ఆధ్యాత్మిక ఆచరణకు, పురోభివృద్ధికి ఆటంకముగా నిలుస్తుంది. అప్పటి నుండి, స్త్రీలందరిని, నా స్వంత తల్లుల వలె, సోదరిల వలె నిజంగా ప్రేమించసాగాను.

1965లో శివరామ రెడ్డి తీవ్రంగా జబ్బుపడ్డారు. ఆశ్రమమునకు భారంగా ఉండటము ఇష్టములేక, ఆశ్రమమును వదలి వెళ్ళదలచి తన కుమార్తెను పిలిపించుకున్నారు. ఆమె వచ్చి, ఆయనను, తన స్వగ్రామమైన ఉత్తరామెరూర్‌కు తీసికుని వెళ్ళారు. ఆయన ఆశ్రమాన్ని వీడి వెళ్ళిపోయేముందు నేనాయన పాదములను పట్టుకుని, "మీరు నన్ను వదిలేసి వెళ్ళిపోతున్నారా?" అని ఆక్రోశించాను. ఆయన నవ్వి అన్నారు. "అరుణాచలుడే సత్యము. సత్యము ఒక్కటే ఉన్నది. అరుణాచలునితోనే ఉండు. అన్ని ఆశీస్సులు నీకు లభిస్తవి"

ఆశీస్సులు, అనుగ్రహము ఎవరి స్వంత ఆస్థి కావు. అవి ప్రతి ఒక్కరితోనూ మనము పంచుకొనగలిగిన నిజమైన వస్తువులు. బాహ్యవస్తువులకు, పరిమితులు ఉంటవి, ఇంటిని ఒకరికి ఇవ్వవచ్చును, ధనమును వందమందికి ఇవ్వ వచ్చును. కానీ, ఆశీస్సులను, అనుగ్రహమును, ప్రేమను ప్రతిఒక్కరికి, ప్రతిచోట, ప్రతి సమయంలోను పంచ వచ్చును.



శ్రీ భగవాన్‌తో గోలక్ష్మి మరియు దూడ

జానకీ మాత

ఒకప్పుడు, ఒక గొప్ప మతాభి మానియైన క్రైస్తవుడు భగవాన్ ఎదుట నిలచి, చాలా నిజాయితీగా, "నాకు ఒక సజీవమైన గురువు కావలెను. మీరునాకు సజీవులైన గురువును చూపించగలరా?" అని అడిగారు. భగవాన్, తిరిగి ఆయన నిలా ప్రశ్నించారు. "జీసస్ చనిపోయారా? బుద్ధుడు చనిపోయారా?" ఆయన ఇంకా పెద్ద వివరణ ఇవ్వలేదు. ఎందుకంటే సద్గురువులు సూచన ప్రాయంగానే బదులిస్తారు. సద్గురువు, విస్తృతమైన వివరణల జోలికి వెళ్ళరు, ఎందుచేతనంటే, ప్రశ్నించిన వారే, ఆ పనిలో ఎక్కువగా భాగం పంచుకోవాలి, ఎందుకంటే ఆయనే సమాధానము కనుక, అంతేగాకుండా పృచ్ఛకుడు స్వీయాను భవముతో ప్రశ్నకు సమాధానమును తెలుసుకొనవలెనే కాని, శాస్త్రముల ద్వారాగానీ, ఇతరుల ద్వారాగాని సమాధానము పొందినచో ప్రయోజన ముండదు. ఇంకొక విధంగా చెప్పాలంటే, రమణమహర్షి సత్యమైతే, పృచ్ఛకుడు కూడా సత్యమే. అవ్వాలి.

మొదటగా, జీసస్‌గానీ, బుద్ధుడుగానీ, కేవలము ఒక ఆలోచన లేదా జ్ఞాపకమే. ఇపుడు అంతర అన్వేషణ ప్రారంభము కావాలి. కానీ మహాత్ములెవరైనా కేవలము ఒక ఆలోచన మాత్రమేనా? భగవాన్ ఒకసారి స్పష్టముగా చెప్పారు. సద్గురువు తప్ప మిగిలిన దంతా ఆలోచన మాత్రమే అని. ఆ అనుబంధమును, ఒకరికి తన తల్లితో గల (అనుబంధంతో) ప్రేమతో పోల్చవచ్చును. ఒక వ్యక్తి తన తల్లిని అమితంగా ప్రేమిస్తే, తల్లి కేవలము ఒక ఆలోచనగానే మిగిలి పోతుందా? దానిని దైనందిన జీవితంలో ప్రతిరోజూ వచ్చిపోయే క్షణికమైన ఆలోచనలతో పోల్చవచ్చునా? అలాగే, మీ బిడ్డను గూర్చి మీరు ఆలోచించినపుడు, ఆబిడ్డ అక్కడ లేకున్నా, అది ప్రేమతో నిండిన భావన కాదా? ఆలోచన సత్యము యొక్క మరొక తలము కాదా? అదే విధముగా, మనము మన మహాత్ముల గురించి, ఆధ్యాత్మికంగా పరిణితి చెందిన వారిని గురించి తలచుకున్నపుడు, మనము సత్యము యొక్క మరొక తలములోనికి తీసికొని వెళ్ళ బడుదుము. వారు భౌతిక కాయాన్ని వీడినప్పటికీ మనమధ్యనే జీవిస్తుంటారు. వారు ప్రేమ యొక్క ప్రతిరూపంగా, నిలచి, మన ధ్యాసను వారివైపునకు మళ్ళించినపుడల్లా, మనకు ఎల్లవేళలా మార్గము చూపుతూ ఉంటారు.

భగవాన్ రమణ తరచుగ, "ఉన్నది ఒకే గురువు, ఆయన నీ హృదయంలోనే ఉన్నారు", అని చెబుతుండే వారు. 'మహాత్ముడు' అంటే అర్థము ఏమిటి? మిక్కిలి పవిత్రతకల్గిన లక్షణమైన వ్యక్తి .దేవునిచే ఎంపిక చెయ్యబడినవారిలో ఒకరు, అని నిఘంటువులో ఉంటుంది. ఆధ్యాత్మిక రంగంలో, 'నేను', 'నాది' అనే భావము లేని వారిని మహాత్ములు అంటాము. అంతేగాకుండా వారు తమతో అనుబంధము పొందిన వారందరిలోనూ, 'నేను' 'నాది' అనే భావము నశించటానికి తోడ్పడతారు. వాళ్ళు ఆవిధంగా ఎలా చేస్తారు? వారు కేవలము ఒక కంటి చూపుతో, లేదా దర్శనముతో ఆ పనిని చేస్తారు. దానినే 'దైవము, దైవమును చూచుట', అంటారు.

రమణాశ్రమంలో నేనుండుటను ప్రారంభించిన రోజులలో నేను రమణుల దర్శన భాగ్యమును పొందిన దాదాపు నాలుగు వందల మందిని పశ్నించాను. (ఇంటర్వ్యూ చేశాను). నేను వారిని వేసిన మొదటి ప్రశ్న, "మీరు రమణమహర్షిని గురించి ఎలా తెలుసు కున్నారు?" అని ఆతర్వాత, "మహర్షిని మొదటిసారి దర్శించు కున్నపుడు ఏమిజరిగింది?" అని. మొదటి ప్రశ్నకు సమాధానము, ఒక వ్యక్తికీ, మరొక వ్యక్తికీ మారుతూ ఉండేది. కానీ రెండవప్రశ్నకు మాత్రము, వారి మతము, తెగ, దేశము, చదువు, సాంఘిక స్థితి, పురుషుడు, స్త్రీ అనే బేధము లేకుండా ఒకే విధముగా ఉండేది. "నేను మహర్షి సన్నిధిలో మొదటి సారి నిలచినపుడు, ఆయన నావైపు చూశారు. నేను ఇది వరకు ఎన్నడూ అనుభవించని శాంతిని అనుభవించాను" అనే సమాధానమును ప్రతి ఒక్కరూ చెబుతూండే వారు. కొంతమంది భక్తులు, నిశ్చల శాంతి, ఆనందము, సంతోషము, ప్రశాంతత, అని వేరు వేరు పదములు వాడినప్పటికి, అన్నిటి అర్థము ఒకటే. వారందరూ, "నేను ఇది వరకు ఎన్నడూ అనుభవించని శాంతిని పొందాను", అనే వారు, ఎన్నడూ అనుభవించని అంటే, అక్కడ అనుభవాన్ని జ్ఞాపకం చేసుకొనే 'నేను' లేకుండా పోయిందన్న మాట. 'నాది' అనేది అనుభవములను జ్ఞాపకములుగా పదిలపరచేది. ఆ 'దైవము, దైవమును

దర్శించుట', అనే స్థితిలో వ్యక్తికి సంబంధించిన 'నాది', అనేది పూర్తిగా తుడిచి వేయబడుతుంది. ఈ తుడిచి వెయ్యబడటము అనేది మహాత్ముని యొక్క ఒక చూపు, ఒక మాట, ఒక స్పర్శతో జరుగుట సంభవము. అది వెంటనే జరుగుతుంది.

ఋషికేశ్‌కు చెందిన ప్రముఖమహాత్ముడు శివానంద, తంజావూరుకు చెందిన జానకీ మాతను గురించి 'భారత దేశములోని మహనీయులైన స్త్రీలు' అనే పుస్తకములో "జానకీ మాత ఎపుడూ తన సద్గురువు అయిన రమణ మహర్షి జ్ఞాపకములోనే జీవిస్తారు" అని ప్రశంసించారు. ఆ గొప్ప మహనీయులు రమణభక్తురాలైన ఆమెను అంతగా పొగిడారు. జానకీ మా భగవాన్ వద్దకు వచ్చేసరికే ఆమె ఒక గొప్ప (మెజస్టిక్ మిస్టిక్) వేదాంతి. ఆమె అనేక అధి మానసిక అను భవములను కల్గిన ఒక మహనీయురాలు. ఈ గొప్ప స్త్రీ ఎవరు? జానకీ మాత, ఒక సంపన్న వేదాంత కుటుంబమునకు చెందినవారు ఒక రోజు, ఆమె తండ్రిగారి రాజప్రాసాదము వంటి పెద్ద ఇంటి వసారాలో ఆడుకొనుచుండగా, ఒక బక్క చిక్కిన సాధువు, ఆ గృహము వెలుపల నిలుచుని, "బిడ్డా! నాకు ఆకలిగా ఉన్నది. నాకు కొంచెము ఆహారము ఇస్తావా?" అని అడుగుట, చూచింది. ఆమె ఎవరేది అడిగినా ఇచ్చివేసే ఔదార్యము కలవారు. కానీ ఆమె తల్లిగారు ఒకసారి, పూజ పూర్తయి దేవునికి నైవేద్యము పెట్టేవరకు, ఆమె ఎవరికీ భోజనం యివ్వ రాదు అని చెప్పారు. ఆ సాధువు అడిగిన సమయమునకు పూజ అయిపోనప్పటికి ఆమె లెక్క చేయకుండ, ఇంటి లోనికి వెళ్ళి, ఇంటిలో దేవునికి నైవేద్యముగా అర్పించుటకొరకు తయారు చేయబడిన వానిలో కొన్ని రుచి కరమైన తినుబండారాలను తీసికొని వచ్చింది. ఆ ఆకలిగొన్న సాధువు వాటి నెంతో ప్రీతితో తినుటను చూచి పరమానందము చెందారు. భోజనము ముగించిన పిదప ఆ సాధువు, ఆమె నాలుకను బయటకు చాపమని చెప్పి తన వ్రేలితో ఆమె నాలుకపై పవిత్రమైన (బీజాక్షరాలు) అక్షరములను వ్రాశారు. అది జానకిని వెంటనే ఆనందములోను, తన్మయత్వంలోను ముంచి వేసింది. ఈ అనుభవము ఆమెను రెండు విధములుగా ప్రభావితము చేసింది. ఒక ప్రక్క ఆమె అతీంద్రియ సిద్ధులను, శక్తుల్ని కలిగి ఉండేది. రెండవ వైపు, ఆమె గొప్ప ఆధ్యాత్మిక ఆసక్తి కలిగి ఉండేది, మొదటిది ఆమెకు అద్భుతమైన శక్తుల నివ్వగా, రెండవది, ఆ ఆట పాటలతో గడిపే బాలికను, అంతర్ముఖమున జిజ్ఞాసువుగా మార్చింది. ఆ బాలిక అటుపై తోటి పిల్లలతో ఆడుకునే ఆసక్తిని కోల్పోయింది. ఆమె దైవోన్ముఖురాలు అయి ఉండుటకు ఇష్ట పడేది. అనతికాలంలోనే ఆమె ఔదార్యము, పవిత్రమైన అద్భుత శక్తులు, ఆమె చుట్టూ ఉన్న జనులను ఆకర్షించడము మొదలు పెట్టినవి. ఆమె సాంప్రదాయమైన హిందూ కుటుంబములో జన్మించుటచే, ఆమె తల్లిదండ్రులు, ఆమెకు బాల్యంలోనే వివాహం జరిపించాలనే సంకల్పంతో ఉన్నారు, ఆమె బాహ్యమైన బంధములను లెక్క చెయ్యక ఆధ్యాత్మిక ప్రపంచములోనికి రోజు రోజుకూ మరింతగా చొచ్చుకునిపోతు వివాహము కొరకు తెచ్చిన సంబంధములను తిరస్కరిస్తూ ఉండేవారు.అది ఆమె తల్లిదండ్రులకు ఆందోళనను కల్గించింది. ఆ స్థితిలో వారికి పరిచయమున్న ఒక వైద్యుని భార్య, ఇద్దరు బిడ్డల తల్లి, అకస్మాత్తుగా చనిపోయారు. జానకికి, ఆవైద్యుని వివాహమాడమని ఎవరో చెప్పినపుడు, ఆమె ఏమీ సందేహించ కుండా సరేనన్నారు. తర్వాత ఆమె ఆ సంబంధమునకు ఎలా తలఒగ్గారని అడుగగా! తాను ఆ ఇద్దరు పిల్లలను ఇష్టపడుట వలన, అందుకు ఒప్పుకున్నట్లు ఆమె చెప్పారు. ఒక ఆధ్యాత్మిక స్త్రీ మాతృ భావంలో మునిగిపోయి చేసిన కార్యము అది.

డాక్టర్. గణపతిఅయ్యర్, జానకి భర్త, ఒక వైద్యులు, వయసులో ఆమెకంటె బాగా పెద్ద వారు. ఆయన తరచు ఒక ఊరి నుండి వేరొక ఊరికి బదిలీ చెయ్య బడుతుండేవారు. దైవికంగా ఆయన 1935లో తిరువణ్ణామలైకు బదిలీ చెయ్య బడినారు. జానకి అప్పటి వరకు తనకు కలుగుతున్న దైవదర్శనములతో తృప్తి లభించక భౌతికమైన గురువు కొరకు తపించిపోతున్నారు. భగవద్గీతలో కృష్ణుడు, అర్జునునికి చేసిన ఉపదేశమును ఆమె గుర్తు చేసుకున్నారు, "ఎవరైతే భక్తి ప్రేమలతో నన్ను పూజిస్తారో, తన స్వధర్మానుసారము నిష్కామకర్మలతో ముందుకు సాగుతారో, అట్టివారికి, సద్గురువు అనుగ్రహముద్వారా, నన్ను నేను విశదపరచుకుంటాను".

ఆమె భర్త తిరువణ్ణామలైకు బదిలీ కావటము ఆమె సంక్షోభానికి ముగింపు పలికింది. భగవాన్ దర్శనము చేసుకొనగానే, తాను వెదుకుతున్నదేదో తనకు లభ్యమయినట్లుగా ఆమెభావించారు. ఒకనాటి ఉదయము, భగవాన్ తాను మామూలుగా వెళ్ళే ఉదయపు, నడకకు (వ్యాహ్యాళికి) వెళ్తుండగా, ఆమె అనుసరించి గోశాల వెనుక తన అంతరిక క్షోభను వెల్లడించారు.

భగవాన్ ఆమెవంక అపరిమితమైన కరుణతో చూచి "మీరు గృహస్థులు. ఒక గృహిణిగా మీ బాధ్యతలనన్నిటినీ, ముఖ్యంగా భార్యగా మీభర్త పట్ల నెరవేర్చవలసిన బాధ్యతలను. నెరవేర్చండి. శరీరము వలన తప్పేమీలేదు. 'దేహాత్మ బుద్ధిని', 'దేహమే నేను' అనే (బుద్ధిని) భావనను విడిచిపెట్టాలి. మీరు ఎప్పటికి అనంతమైన ఆత్మగానే ఉన్నారు. నేను మీతోనే ఎల్లపుడు ఉంటాను. అప్పటికి భగవాన్ తనకు ఆధ్యాత్మికంగా మార్గము చూపుతారని హామీ తిరిగి లభించినట్లు అయింది. తను ఆయన అనుగ్రహమును పొందానని ఆమెకు తెలిసింది. మిక్కిలి కృతజ్ఞతా భావముతో ఆమె, తీవ్రమైన ఆధ్యాత్మిక సాధనలో మునిగిపోయారు.

ఆమె అంతరంగములోనికి లోతుగా మునిగి హృదయములోనే ఎల్లవేళలా నిలచియుండే వారు. జీవితాన్నే మార్చి వేసే ఆ అనుభవము తర్వాత, ప్రాపంచిక జీవితము చిన్నపిల్లల ఆటవలె కనిపిస్తుండేది. పాపం ఇంతలోనే ఆమె భర్తకు బదిలీ అయ్యే సమయము దగ్గర పడింది. ఆమెకు భగవాన్‌కు దూరంగా వెళ్ళటం ఇష్టంలేక, బిగ్గరగా ఏడ్చేశారు. భగవాన్ కరుణతో, ఆమె వైపు చూసి, సున్నితంగా, "నేను ఎల్లపుడూ మీతోనే ఉంటాను", అని చెప్పారు.

ఆమె, తనకు అనేకమంది బిడ్డ లుండుటగానీ, ప్రాపంచిక జీవితముగానీ, తన దృష్టిని గమ్యమునుండి ఏవిధంగానూ మరల్చలేక పోయినవి. అని నాతో వ్యక్తిగతంగా చెప్పారు. ఆమె బాహ్యము లోనూ, అంతరంగలోనూ ఒకే విధంగా, శాంతి పూర్ణమైన జీవితాన్ని గడిపేవారు. అచిరకాలంలోనే ఆమె జానకీమాతగా పేరుపొందారు. భగవాన్ వద్దకు రాకపూర్వమే ఆమె కుండలిని అనుభవములను పొంది ఇతర సిద్ధులను కూడా పొందారు. కానీ భగవాన్ ఒక్కసారి మీరు ఆత్మయే అని చెప్పినప్పటినుండి, ఆమె వాటిని దూరంగా ఉంచి, అంతరంగములోనికి దృష్టి ప్రసరించారు. భగవాన్‌ను గురించి ఆలోచనయే ఆమె దృష్టిని ఆత్మవైపు మరల్చి, ఆమెను హృదయంలో నిలచి ఉండేటట్లు చేసేది. ఈవిధమైన ఏకాగ్రతవలన, ఆమె అన్ని రకముల అడ్డంకులను అధిగమించారు. ఆధ్యాత్మిక సాధనలో గమ్యము చేరుకొనే మార్గముతెలియని సాధకులకు, దారి చూపే జ్యోతివలె ఆమె ఉండేవారు. ఆమెవారికి ఏ విధముగ శరణాగతి చెందవలెనో, ఏవిధముగా ఆత్మవిచారణపై ఏకాగ్రత నొందవలెనో, తద్వారా ఎలా ఆత్మ నిష్ఠులవగలరో బోధించేవారు. భగవాన్, ఆమెతో ఎల్లవేళలా ఉండేవారని చెప్పుటకు అనేక సంఘటనలున్నవి. ఆత్మనిష్ఠులైన వారికి భగవాన్ పూర్తి సహకారమును అందించే వారు. ఆయన మహానిర్వాణము తర్వాతకూడా, మార్గమును చూపే ఆయన సన్నిధి, ఆధ్యాత్మిక సాధకులను, ఆత్మనిష్ఠులైన వారిని గుర్తించి, ఆరాధించేటట్లు నడిపేది. జానకీమాత అటువంటి వ్యక్తి.

భగవాన్‌ను తరచుగ దర్శించుకొనుట వలన ఆమె ఆధ్యాత్మిక పరిపూర్ణత శీఘ్రతరమైనది. మనసులోని ద్వంద్వాలన్నీ బయటకువచ్చి ఆ గొప్పమౌనంలో కలిసిపోయి, అన్నిటినీ అధిగమించిన శుద్ధచైతన్యముగా నిలిచిపోయే స్థితిని అనుభవంలోనికి తెచ్చేది భగవాన్ సన్నిధి. అందువలననే, తాను సదాభగవాన్‌తో అనుబంధంకలిగి ఉండవలెనని కోరుకునే దానినని ఆవిడ తెలిపారు. బాహ్య ప్రపంచము ఒక భ్రమ వలెనూ, ఒక శూన్యమైన కలవలెనూ, సర్వవ్యాపకమైన నిశ్చల మౌన మొక్కటియే నిత్యసత్యమని ఆమె భావించారు. గత జన్మలలో పోగుపడిన ప్రస్తుతం మరుగునపడి ఉన్న వాసనలన్నియూ, వరుసగా తుడిచి పెట్టుకుపోయి చివరకు, అనేకముగా కన్పించే ఆసద్వస్తువు యొక్క రూపాలన్నీ, శూన్యంలో కలసిపోయి, అన్నిటినీ అధిగమించిన ఆత్మమాత్రమే ప్రకాశించింది. ఆ ఆత్మలోనే ఆమె నిష్ఠులై యున్నారు. ఆమె భగవాన్ సన్నిధిలో మూడు నాలుగు గంటలు సమాధిస్థితిలో ఉంటుండేవారు. ఆమె తన సద్గురువుతో, ఎల్లవేళలా సంబంధము కలిగి ఉండేవారు. ఒక సారి ఆమె, వెండి కొనకల్గిన చేతికర్రను, వేరొకసారి వెండితో తాపడము చేసిన చెక్క పాదుకలను, తన శిష్యులైన నటరాజన్‌తో, భగవాన్‌కు పంపించారు. భగవాన్ ఆ రెండు వస్తువులనూ స్వీకరించి, పరిశీలించి, తిరిగి నటరాజన్‌కు ఇచ్చి, "వాటిని, తిరిగి జానకీ మాతకు ఇవ్వండి. ఆమె వాటిని పూజలో పెట్టుకుంటారు", అని చెప్పారు నటరాజన్ తర్వాతి కాలములో సాధు ఓంగా మారారు. జానకీమాత ఆరెండువస్తువులనూ, అంతులేని భక్తితో పూజించేవారు. సద్గురువు పవిత్రపాదములు, ఆమె హృదయంలో, అంతర గురువుగా నిలచిపోయినవి.

1966లో, 'మౌంటెన్‌పాత్' (గిరిపథము) (ఆశ్రమపత్రిక) ముద్రణ ప్రారంభించిన మూడవ సంవత్సరములో, ఆస్‌బోర్న్, ఒక ప్రత్యేకమైన జయంతి సంచికను, ముద్రించాలని తలచారు. ఈ సంచికలో ఇతర మహాత్ములు, యోగులు, గురువుల

గురించి వ్రాయవద్దు. ఈ సంచికను పూర్తిగా భగవాన్‌కే అంకితము చెయ్య వలెననుకున్నారు. అందుకని ఆ పత్రికకు మేనేజింగ్ ఎడిటర్'గా ఉన్న నన్ను సంప్రదించారు. నేను అంగీకరించాను. కానీ భగవాన్ ఆలోచనలు ఉద్దేశ్యము వేరే విధంగా ఉన్నవని స్పష్టమైంది త్వరలోనే ఆయన జానకీ మాతకు గుర్తింపు వచ్చేవిధంగా చేశారు. ఒకరోజు ఆస్‌బోర్న్ నాతో జానకీమాత పై ఒక వ్యాసమును, ఆ ప్రత్యేక సంచికలో ప్రచురించాలని పట్టుబట్టారు. ఆయనకు ఆమె తెలుసును అనికూడా నాకు తెలియదు. అందుచే నేను అవాక్కయ్యాను. ఆమెను గూర్చిన వ్యాసమునకు ఆస్‌బోర్న్ వ్రాసిన, చక్కగా సరిపోయే విశదీకరించే పరిచయ వాక్యములను చూసి నేను సంభ్రమాశ్చర్యములలో మునిగిపోయాను. ఆస్‌బోర్న్ ఇలా వ్రాశారు. "ప్రతి సంచికలోనూ, ఎవరో ఒక మహాత్ముని గురించిగానీ, యోగి గురించిగానీ, గురువు గురించి గానీ ప్రచురించడము మాకు ఆనవాయితీగా వస్తున్నది. కానీ ఈ సంచికను కేవలము భగవాన్‌కే అంకితము చెయ్యాలని భావించి, సంచికను ముద్రణాలయమునకు పంపేతరుణంలో, ఇంకా ప్రచురింపబడని, యోగిని అయిన జానకీమాత జీవిత చరిత్రలోని అధ్యాయములు మాచేతికి వచ్చినవి. ఆమెకు అనేకమంది శిష్యగణము ఉన్నప్పటికి, ఆమె హృదయ పూర్వకముగా, భగవాన్‌కు శరణాగతి చెందిన భక్తురాలు, కావున ఆమెజీవిత చరిత్రలోని కొన్ని ఘట్టములను ఏర్చి కూర్చి, ఒక వ్యాసముగా ఇందులో ప్రచురించాలని నిశ్చయించుకున్నాము".

1967లో భగవాన్ మందిరం పవిత్రీకరింప బడిన సందర్భంలో, భగవాన్ జానకీ మాతకు పూర్తి గుర్తింపు నొసగారు. హిందూ సంస్కృతి ప్రకారము, అటువంటి సందర్భములలో, ఆలయాన్ని తాకి, పవిత్రీకరించుటకు ఎవరైనా మహాత్ముని రప్పించుట పరిపాటి. ఆశ్రమ కార్యనిర్వహణకు, కొంతమంది సభ్యులుకల ఒక కమిటీ (నిర్వాహక సమితి) ఉన్నది. మాతంణ్రి గారు దానికి అధ్యక్షులు. ఆ కమిటీ నన్ను పిలిచి, భగవాన్ సన్నిధానములోని లింగమునకు పవిత్రీకరణ చెయ్య వలసినదని జానకీమాతను కోరవలసినదిగా చెప్పారు. జానకీమాత లింగమును తాకగానే, పారవశ్యంతో, పెద్దగా అన్నారు, "జై రమణేశా! రమణగురు! గురు రమణ! రమణ అప్పా! రమణ దేవా! అక్కడ హాజరైన వందలాదిజనాలు, అతిధులు, భక్తులు పారవశ్యంలో మునిగిపోయి, వేరే లోకంలోకి తీసుకుని పోబడినారు. ఆ మహోత్సవములలో, నేను ఆమెను కలసి, నాశిరమును ఆమె పాదముల పై ఉంచి, "ఓ మాతా! నన్ను ఆశీర్వదించండి. నాకు మార్గం చూపండి", అని ప్రార్థించాను, మార్గదర్శకాలైన ఆమె వాక్కులు నాకు పవిత్రమైనవి. దుఃఖంలో మునిగిన ప్రాణులను రక్షించే సద్గురు రమణుల పవిత్ర పాద ద్వయమును పట్టుకుని ఉండండి. ఆయన ఉపదేశములను ఆచరణలో పెట్టండి. ఆయన బోధలను ఆచరించుటయే ఆయన పాదములను పట్టుకొనుట, ఆపాదములెప్పుడూ నీ హృదయములో ప్రతిష్టింపబడి ఉండవలెను. హృదయమే రమణులు.



ఎలినార్ పాలిన్ నోయీ

ఒకరోజు నేను మూడు సంవత్సరముల ప్రాయములో ఉండగా, భగవాన్‌కు నమస్కరించి లేచినపుడు, భగవాన్, "గణేశా! వెళ్ళు, నీ నోయీ అక్కడ కూర్చుని ఉన్నారు. వెళ్ళి ఆమె ఒడిలో కూర్చో", అన్నారు. నేను సంతోషంగా పరుగులు తీసి, సంతోషంగా ఆ అమెరికా దేశమునకు చెందినస్త్రీ ఒడిలోనికి ఎక్కేశాను. ఆమె ఎలినార్ పాలిన్‌నోయీ, భగవాన్ అనుగ్రహం నన్ను ఆమెతో కలపటం, ఆఒక్కసారి మాత్రమేకాదు. అదే సంవత్సరము భగవాన్, భక్తులు, మధ్యాహ్న భోజనమునకు ఆసీనులై ఉండగా, నేను భోజనశాలలోనికి ప్రవేశించాను, తిన్నగా ఎలినార్ పాలిన్ నోయీ వద్దకు వెళ్ళి, ఆమె విస్తరిలో నుండి తింటానని పట్టుపట్టాను. వంటవారు, అక్కడ కూర్చుని ఉన్న ఆచారవంతులైన భక్తులు కొందరు భయపడి పోయారు. ఒక బ్రాహ్మణ బిడ్డ ఒక పాశ్చాత్యుని విస్తరిలో నుండి భుజించుట వారికి భరించలేని విషయం. వారు పరుగెత్తు కుంటూ వచ్చి నన్ను మైలపడకుండా కాపాడాలని చూచారు. నేను మొండికెత్తి హఠము చేయసాగాను. భగవాన్ దృష్టి ఈ నాటకము వైపు మళ్ళించబడింది. ఒక చూపుతో ఆయన పరిస్థితిని ఆకళింపు జేసుకున్నారు. ఏ మాత్రమూ చలించకుండా, ఆయన వంట వారితో, ఒక ప్లేటులో భోజనము పెట్టి అందులో ఒక చెంచా ఉంచి ఆ బిడ్డకు చూపించండి. అతడు మీతో వస్తాడు. ఆమె విస్తరిలో నుండి తిన వలెనని కాదు అతని పట్టుదల. గణేశన్, ఎవరూ చెంచాతో భోజనం చెయ్యటము చూడలేదుగనుక, తను కూడా చెంచాతో తినాలను కొంటున్నాడు. భగవాన్ చెప్పిన విధంగా వంటవారు చేశారు. నేను సంతోషంగా ఉన్న కుక్క పిల్లవలె వాళ్ళవెంట వెళ్ళాను. భగవాన్ నావైపు చూచి అన్నారు, "చూడు, నీకోరిక తీరింది", అని. భగవాన్ అపుడు వంటవారివైపు, ఇతరుల వైపు చూచి అన్నారు, "మరి మీసమస్య గూడా తీరింది", అని.

భగవాన్ వద్దకు దేశం నలుమూలల నుండి సాధకులు వచ్చేవారు, వారిలో నేను కలిసినవారందరినీ, నేను అడిగే ప్రశ్న, "భగవాన్ వద్దకు, అరుణాచలుని వద్దకు మీరు రావటానికి కారణమేమిటి"? అని. వాళ్ళు సాధారణంగా, ఎవరో భగవాన్ గురించి, అరుణాచలం గురించి, మాకు ఏదోవ్యాసము ఇచ్చారు. అదిచదివి మేమిక్కడకు వచ్చాము అంటారు. అపుడు నేను "మీరెన్నో ప్రదేశముల గురించి చదివి ఉంటారు. మీరు వాటన్నిటికీ వెళ్తారా? అని అడిగేవాణ్ణి, నేను తరచి అడగటము వలన, వారు లోతుగా ఆలోచించుట వలన, ఆ అచ్చులో ఉన్న విషయముకాదు, వారినిటకు రప్పించినది, అంతకన్నా ఉన్నతమైన శక్తి ఏదో, దానిని భగవాన్ అని పిలిచినా, వేరేమని పిలిచినా, వారినియిచటకు రప్పించింది, అనే విషయము వారికి అర్థము అయ్యేది, 1896లో భగవాన్‌ను అరుణాచలానికి ఆకర్షించిన శక్తే, భగవాన్ పట్ల ఆకర్షితుడైన ప్రతివ్యక్తినీ అదేశక్తి ఇక్కడకు రప్పించింది.

1939లో శ్రీమతి నోయీ, తన కవల సోదరితోకలసి కాలిఫోర్నియాలో ఉంటుండగా, ఆమెకు పెద్ద విపత్తు సంభవించింది. అది ఆమెకు ఎంతగా దుఃఖాన్ని కల్గించిందంటే, ఆమెకు కంటి మీద నిద్రకూడా కరువైంది. ఆమె బాధెంత మిక్కుటముగా ఉండేదంటే, ఆమె సంపన్నురాలు కాకపోయినప్పటికీ మనశ్శాంతికోసము ప్రపంచ పర్యటన చెయ్యదలచుకున్నారు. ఆమె ఆరోగ్యము సరిగాలేనందువలన, ఆమె వైద్యులు, ఆమెను ప్రయాణము చెయ్యవద్దని చెప్పారు, "ఈ పరిస్థితిలో మీరెందుకు ప్రయాణించ వలెననుకుంటున్నారు?" అని వైద్యులు ఆమెను ప్రశ్నించగా "నన్ను నేను తెలుసుకోవలెననుకుంటున్నాను", అన్నారామె, ఆమెకలుసుకొనబోయే గురువు గారి బోధకూడా అదే అయినందువల్ల, ఆమె భవిష్యవాణిని పల్కినట్లుయింది.

ఆమె కలకత్తాకు వెళ్ళవలెనని మొదట భావించినప్పటికీ, ఆమె ఏ కారణమూ లేకుండానే చెన్నైలో ఓడదిగేశారు. ఆమె హోటల్‌లో ఒకగదితీసుకుని ఉన్నారు. కానీ, ఎండ వేడిమిచే ఆమె అక్కడ ఉండలేకపోయారు. హోటల్‌సిబ్బంది, వేసవి విడిది అయిన పర్వత ప్రాంతము కొడైకెనాల్‌కు వెళ్ళమని సలహాయిచ్చారు. మర్నాడు, ఆమె కొరకై ఏర్పాటు చెయ్యబడిన టాక్సీలో కొడైకెనాల్ జేరుకున్నారు. అక్కడ హోటల్‌లో సుఖంగా ఉంటున్నపుడు, అక్కడి హోటల్ సిబ్బందిలో కొందరిని వారికి తెలిసిన మహాత్ములెవరైనా ఉన్నారా అని అడిగారు. వారిలో ఒకరు వెంటనే ఈ విధంగా సమాధాన మిచ్చారు,

"అవును, అరుణాచలంలో రమణమహర్షి అని గొప్ప మహాత్ముడు ఉన్నారు. ఆయన భారతదేశము మొత్తములోకి గొప్ప దార్శనికుడు", అని ఇందులో ఆశ్చర్యమేమిటంటే, ఆ సమాధానము హోటల్‌లోని ఒక సామాన్యమైన పనివాని వద్దనుండి వచ్చింది. ఏ పండితుడి నోటి వెంటనుండి గానీ, ఏ సాధకుని నోటి వెంటగానీ కాదు. 1939లో మహర్షి గురించి అంతగా ప్రపంచానికి తెలియదు. అయినా, ఆయన భారతదేశములోని గొప్ప దార్శనికుడుగా వర్ణింపబడ్డారు.

శ్రీమతి నోయీ వెంటనే అరుణాచలమునకు బయలుదేరారు. ఆమె ఆశ్రమమునకు చేరుకునే సరికి, నిరంజనా నందస్వామి, ఆశ్రమ సర్వాధికారి ఆమెను స్వాగతించి, నేరుగా భగవాన్ వద్దకు తీసికొని వెళ్ళారు. ఆమె ఈ విధంగా వ్రాశారు. ఆశ్రమ వాతావరణము మొత్తము భగవాన్ యొక్క పవిత్రతతోను, అనుగ్రహముతోను, నిండిపోయినట్లుగా నాకు అన్పించింది. మహర్షి సాన్నిధ్యంలోని దివ్యత్వాన్ని మనము గ్రహించవచ్చును. ఆయన చిరునవ్వు నవ్వినపుడు స్వర్గద్వారములు తెరచుకున్నట్లుగా అన్పించేది. ఆయన నన్ను ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమములు విచారించారు దానితో నాలోని బెరుకు పోయింది. ఆయన చూపులోని ప్రేమ, కరుణ, వలన కలిగిన ఆనందము ఉపశమనము నా గుండెలోనికి చొచ్చుకొని పోయింది. నాకు ఆయన అవసరము ఎంతగా ఉన్నదో, ఆయనకు తెలుసును. నేను ఆయనసన్నిధిలోనికి లాగబడ్డాను. ఆయన గొప్పదనము, దయ హృదయమునకు హత్తుకుని పోయేవిగా ఉండేది. ప్రేమ, కాంతి, మౌనంతోనిండిన ఆయన ప్రభావము, మాటలకంటె ఎంతో శక్తి వంతముగా ఉన్నది. ఆయన వద్దకు వచ్చిన ప్రతివారు ఆయన అనుగ్రహమును పొందేవారు, ఆయనలోని ఆంతరిక శాంతిని అందరూగ్రహించగలిగేవారు.

ఆ క్షణమునుండి, ఒక సంవత్సరము తర్వాత ఆమె భగవాన్ వద్దనుండి సెలవుతీసుకునే వరకు, ఆమె కళ్ళు ఎప్పుడలా కన్నీటిని వర్షిస్తూనే ఉండేవి. భగవాన్ దృష్టి ఆమెపై నిరంతరాయంగా ఉండేది. ఆమె ఆయన సాన్నిధ్యములోనికి రాగానే, ఆయన దృష్టి ఆమె వైపు మళ్ళేది. అటువంటి అద్భుతమైన అనుబంధం, భగవాన్ జీవిత పుటల్లో ఎంతో ప్రత్యేకమైనది అనే విషయం నమ్మ శక్యంగాని నిజము. ఆమె స్వచ్ఛమైన, సరళమైన నడత, కరిగించే ఆమె కన్నీరు, పాత భక్తులందరూ ఆమెను ఇష్టపడేలా చేశాయి. మొదట్లో బాధ, విచారము, కష్టముల వల్ల, ఆమె కన్నీరుకార్చే వారు. తర్వాత, వ్యక్తపరచలేని ఆనందమువలన, ఆధ్యాత్మిక సంతృప్తి వలన ఆమెకు కన్నీరు వాటంతట అవే ధారలు కట్టేవి. ఆమె భగవాన్‌ను కలిసిన తర్వాత, చాలా సంవత్సరములకుగాను కంటినిండా నిద్రించారు. అప్పటి నుండి, ఆమెచిరకాలంగా వాడుతూ వచ్చిన నిద్రమాత్రలను మానివేశారు. అది భగవాన్ అనుగ్రహమనే ఆమె తలచారు. ఎలా మాని వేయగలిగారని ఆమెను అడుగగా, మందులన్నిటిలోకి గొప్పమందు, భగవాన్ యొక్క నిరంతరమైన అనుగ్రహమే. దానిని నేను పొందాను" అన్నారు. భగవాన్ తాను వ్రాసిన ఒక పద్యములో, ఔషధములలోకెల్ల ఔషధము నీవు అని అరుణాచలుని స్తుతించారు. ఆమె మాటలు ఆవాక్యాన్నే ప్రతి ధ్వనించాయి.

కొన్ని నెలల తర్వాత ఆమె యాత్రలు చేసి భారతదేశమును దర్శించాలనుకున్నారు. తాను వెళ్ళేలోపుగా, భారతదేశములో సుదీర్ఘమైన యాత్ర చేసి, తిరిగి తన స్వదేశము జేరుటకు ఓడ నెక్కుటకై కలకత్తా ఓడ రేవు జేరుకున్నప్పుడు, అకస్మాత్తుగా, భగవాన్ వద్దకు అరుణాచలుని చెంతకు వెళ్ళాలనే బలమైన కోరిక కలిగింది. వేరే ఆలోచన లేకుండా, ఆమె ఆశ్రమానికి వెళ్ళారు. భగవాన్ చిరునవ్వుతో ఆమెకు స్వాగతము పలికారు. ఆశ్రమంలో తను రెండవ సారి గడపటం గూర్చి ఆమె ఇలా వ్రాశారు. నాప్రేమ గాఢమైన భక్తిగా మారింది. నేను ఎప్పుడూ చెదరిపోని శాంతితో ఉండేదానిని. ఇది వరకు ఎంతో ముఖ్యమైనవిగా కన్పించే వస్తువులు ఇపుడు నా దృష్టిలో విలువలేనివే అయినాయి. నేను (వస్తువులను) విషయములను వాని యొక్క సరియైన దృక్పథంతో చూడసాగాను. నిన్నటి హృదయ భారము, రేపటి గురించిన ఆలోచనలు, ప్రాముఖ్యతను కోల్పోయి చివరకు ఉనికే లేకుండాపోయినవి.

ఒకరోజు, ఆమె అందమైన గులాబీని పట్టుకుని ఉన్నారు. ఒక భక్తుడు దాని గురించి ప్రశ్నించగా, ఆమె, దానిని భగవాన్ కొరకు తెచ్చానని చెప్పారు. కాని హాలులోనికి ప్రవేశించినపుడు, దానిని నేరుగా భగవాన్‌కు ఇచ్చే ధైర్యము ఆమెలో లేకపోయింది. అందుకని, సాధారణముగా భగవాన్ ఎదురుగా ఉంచబడే పాద పీఠముపై దానిని ఉంచింది. భగవాన్ ఆమె వైపు చూసి, "అది ఏమిటి?" అని అడిగారు. 'అది కేవలము రోజా పువ్వే భగవాన్", అన్నారామె. "దాన్ని మీరు నాకు ఇస్తారా?" అని

అడిగారు. ఆమె దానిని తీసి భగవాన్‌కు ఇచ్చారు. భగవాన్, ఆ పువ్వును ఆమె నుండి తీసుకుని, దానిని తన కనులకు, శిరస్సుకు, హృదయమునకు తాకించుకున్నారు. ఆ సున్నితమైన, చక్కని చర్యను చూడగనే, భావోద్రేకముతో నిండిపోయి, ఒక మౌన ప్రార్థన ఆమె హృదయములో నుండి వెలువడింది, "ఓ భగవాన్! మీరు ఎల్లవేళలా నాతండ్రిగా ఉండాలి. మీరెల్లపుడూ నాతల్లిగా ఉండాలి. మీరెల్లపుడూ నా దైవముగా ఉండాలి. నేనెప్పుడూ మీబిడ్డనై ఉండాలి".

ఎనిమిది నెలలు భగవాన్ సన్నిధిలో గడిపిన తర్వాత, ఆమె కాలిఫోర్నియా వెళ్ళవలసిన రోజు వచ్చింది. సెలవు కోరుటకై భగవాన్ ఎదుట నిల్చున్న ఆమెకు దుఃఖం పొర్లి వచ్చింది. భగవాన్, "నేను ఎల్లపుడు నీతోనే ఉన్నాను", అని ఆమెకు హామీ ఇచ్చారు. ఆమె అమెరికాకు తిరిగి వెళ్ళిపోయిస తర్వాత, ఉత్తరముల ద్వారా, భగవాన్‌తో అనుబంధం కలిగి ఉండేవారు. ఆమె ఎప్పుడు వ్రాసినా, నాలుగు లేఖలు పంపేవారు. ఒకటి భగవాన్‌కు, ఒకటి నిరంజనా నందస్వామికి, ఒకటి భగవాన్ పరిచారకుడైన, తనను ఎంతో దయతో చూసుకున్న కృష్ణస్వామికి, నాలుగవదినాకు. ప్రతిసారి, శ్రీమతి నోయీ వ్రాసిన ఉత్తరమును చదివినపుడు, భగవాన్ కన్నీరు కార్చేవారు. ఎందుకంటే ఆమె, "భగవాన్, నేను కంటి వెంట నీరు ధారపాతంగా కారుతుండగా ఈ లేఖ వ్రాస్తున్నాను అని వ్రాసి ఉంటారు. ఆరోజులలో భారతీయులు, ఆమెరికాకు వెళ్ళటము తక్కువ. కానీ ఎప్పుడైనా ఎవరైనా భక్తుడు, అలా వెళ్తే, భగవాన్ వారికి, "వెళ్ళి, నోయిని కలవండి", అని చెప్పేవారు.

భగవాన్ నిర్వాణం తర్వాత, తాను వ్రాసిన లేఖలో "భగవాన్! మీరు నన్ను మీ హృదయంలోనికి తీసుకున్నారు. మీ హృదయంలో నేను ఉన్నాను", అని వ్రాశారు ఈ ఉన్నతమైన స్త్రీ, దుఃఖంతో, బాధతో, విచారంతో నిండి భగవాన్ చెంతకు వచ్చి ఆయన యొక్క ప్రేమ, కరుణలతో నిండిన అనుగ్రహంతో (కప్పబడి) తన ఆధ్యాత్మిక యాత్రను జయప్రదంగా పూర్తి చేసుకున్నారు.



సూరి నాగమ్మ



జనవరినెల మధ్యలో కనుమ పండుగనాడు భారతదేశంలోని జనులు, గోవులకు, వృషభములకు (ఎద్దులకు) తమ కృతజ్ఞతలు తెలియజేసుకుంటారు. వాటికి విశ్రాంతినిచ్చి, వాటిని కడిగి, కొమ్మలకు రంగులువ్రాసి, పూసలతోనూ, గంటలతోనూ అలంకరించి, వాటిని ప్రేమగా చూస్తారు. ప్రతిసంవత్సరము, ఆ దినమున నేను, భగవాన్ పాతహాలుకు, గిరికి మధ్య నున్న గోవు లక్ష్మి' సమాధిని దర్శిస్తాను. అప్రయత్నంగా, నామనసు గోవులక్ష్మి చివరిరోజును గుర్తు చేసుకుంటుంది. 1948లో ఆమె మరణించినపుడు నేను ఆ సంఘటన జరిగిన చోటనే ఉన్నాను. భగవాన్ లక్ష్మి ప్రక్కనే కూర్చుని, తన చేతులను ఆమెపై ఉంచి, ఆమె ఉపశమనమును, శాంతిని పొందే విధంగా అనుగ్రహమును కురిపించారు. భగవాన్ ఆప్రదేశాన్ని వీడి వెళ్ళగానే, లక్ష్మి నిశ్చలంగా కనులు మూసుకుని పడుకుని ఉన్నది. ఆవిధంగా అరగంటపైగా ఉన్నది. అప్పుడు సూరినాగమ్మ ఆమె తలను ప్రేమతో తన చేతులలోనికి తీసుకుని తన ఒడిలో ఉంచుకున్నారు. గోలక్ష్మి తుది శ్వాస విడిచిన పిమ్మట, సూరి నాగమ్మ ఆ విషయమును భగవాన్‌కు తెలిపారు.

గోవులక్ష్మి సంవత్సరీకమునకు కొన్ని రోజుల ముందు సూరి నాగమ్మ ఆమె గ్రామమునకు వెళ్ళవలసి వచ్చింది. లక్ష్మి సంవత్సరీకమునకు ముందురోజు భగవాన్ "సూరినాగమ్మ వచ్చారా?" అని పదే పదే, తన పరిచారకులను ప్రశ్నించారు. ఆమెకు రేవు లక్ష్మి సంవత్సరీకము అని తెలిపారా?" అని అడిగారు. ఆ మర్నాడుకూడా ఆయన అలాగే అడిగారు. సూరినాగమ్మ రానే వచ్చారు, కాని, కాస్త ఆలస్యంగా వచ్చారు. ఆమె నేరుగా, లక్ష్మి సమాధివద్దకు వెళ్ళి, తర్వాతే, భగవాన్ దర్శనమునకు వచ్చారు. ఆమెను చూడగానే", లక్ష్మి మందిరమునకు వెళ్ళారా?" అని భగవాన్ అడిగారు. భగవాన్, లక్ష్మి, సూరినాగమ్మ అనే త్రిభుజము నాహృదయంలో పదిలపరచబడింది.

సుమారు, నూరు సంవత్సరములక్రిందట, బాల్య వివాహములు, భారతదేశంలో వ్యాప్తి చెంది ఉండేని. వివాహమైన పిమ్మట ఒక బాలిక మృతి చెందితే, ఆమెను వివాహమాడిన బాలుడు (లేదా వ్యక్తి) పునర్వివాహము చేసుకునేవారు. కాని భర్త మృతి చెందితే మాత్రం, ఆబాలిక జీవితాంతం కఠోరమైన నియమ నిష్టలతో గడుపవలసి ఉండేది. ఆ బాలికకు గుండు చేయించి, తెల్లని వస్త్రములు కట్టబెట్టేవారు. ఆమె దాదాపు అంటరానిదిగా చూడబడేది ఎందువల్లనంటే ఆమెను గృహములోని (సాంఘిక పరమైన) శుభకార్యములలో కూడా ప్రాల్గొన నిచ్చేవారుకాదు, గృహమును దాటి బయటకు వెళ్ళనిచ్చే వారుకాదు. కావున, ఆధ్యాత్మిక జిజ్ఞాసగల వితంతువులకు, ఏ ప్రాపంచిక వ్యాపకములు లేకుండా, ఆధ్యాత్మిక మార్గములో ఉండుటకు తేలిక అయ్యేది. అందుకనే శ్రీరామ కృష్ణపరమహంస, నా మరుసటి జన్మలో బాల్య వితంతువుగా ఉండటానికి ఇష్టపడతాను అన్నారు. బాల్య వితంతువులు అన్ని ఆకర్షణల నుండి (కాపాడ) తప్పించ బడతారు. వారికి ఆధ్యాత్మిక సాధన నుండి మరల్చే ఆకర్షణలు, వికర్షణలు ఏమి ఉండవు.

సూరినాగమ్మగారి జీవితము అటు వంటిదే. సంపన్న కుటుంబంలో జన్మించిన ఆమె చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. ఆమెకు చాలా చిన్నవయసులోనే వివాహంజరిగింది. వివాహమైన పన్నెండుసంవత్సరముల లోపే ఆమె భర్తను పోగొట్టుకున్నారు. నాగమ్మగారు, శ్రీరాముని ధర్మపత్నియైన సీతమ్మ అడుగుజాడల్లో నడవాలనుకునేవారు. అందుచే ఈ విషాద సంఘటన, తట్టు కోలేనంత హృదయ విదారకంగా అన్పించింది. ఆమె ఎప్పుడూ తనగదిలో తలుపులుగడి పెట్టుకొని ఎవరినీ చూడటానికిగానీ, ఏమీతినుటకు గానీ ఇష్టపడకుండా ఉండేవారు. తత్ఫలితంగా ఆమె పోషకాహార లోపమువల్ల బలహీనంగా తయారైనారు. ఈ దురదృష్టము మధ్యలో, మహాత్ములగురించి ఎవరైనా పాటలు పాడినా, మాట్లాడినా, ఆమెకు ఎంతో ఉపశమనముగా ఉండేది. అందువలన ఆమె మహాత్ములను గురించిన గ్రంథములను చదువుతుండేవారు. మహాత్ములతోటి అనుబంధం కలిగి ఉండాలనే కోరిక ఆమెలో ఉత్పన్నమయింది. ఈ ఆధ్యాత్మిక బీజము. అచిరకాలములోనే వృక్షముగా మారటము కాదు, పెద్ద అందమైన పూలతోటగా మారింది.

పాఠశాల విద్యలేని నాగమ్మగారు, తన మాతృ భాషయైన తెలుగును స్వయంగా (స్వాధ్యయనం వల్ల)నే నేర్చుకున్నారు. ఆమె రామాయణ, భారత, భాగవతములను చదివారు. భాగవతములో భగవంతుడు కపిలుని రూపంలో బాలునిగా తన తల్లి దేవహూతికి, ఆత్మసాక్షాత్కారము పొందే విధానమును బోధించే ఘట్టము ఆమెను ఎంతగానో ఆకర్షించింది. అది నాగమ్మ గారి జీవితాన్ని మలుపుత్రిప్పింది. ఆమెలో ఆధ్యాత్మిక గ్రంధాలను చదవాలనే తృష్ణపెరిగింది. ఎవరైనా మహాత్ముని కలుసుకుని సేవించాలని ఆమె కోరుకున్నారు. ఒక రాత్రి నాగమ్మగారికి కలలో దక్షిణామూర్తిని పోలిన సిద్ధపురుషులొకరు కనిపించారు. ఆ సిద్ధపురుషుని చుట్టూ ఉజ్వలమైన కాంతి ఉన్నది. నాగమ్మ లేచి ఆయనకు సాష్టాంగ నమస్కారము చెయ్యవలెనను కున్నారు. కాని ఆమెకు హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. ఆమెచాలా నిరుత్సాహము చెందారు. ఆమెలో సత్పురుషులను సేవించాలనే కోరిక మెండయింది.

నాగమ్మగార్కి ముగ్గురు సోదరులు ఉండేవారు. ఒకరు వకీలు, రెండవవారు బ్యాంక్‌లో పనిచేసేవారు. మూడవ సోదరుడు పూర్తిగా అంగవైకల్యమువల్ల కదలలేని వారు. ఆ సోదరుడు మరణించే వరకు, ఆయనను కనిపెట్టుకుని ఉండే బాధ్యత నాగమ్మ గారిపైన పడింది. 1923లో ఆ సోదరుడు మరణించారు. ఆసమయంలో ఆధ్యాత్మిక సాధనలో పురోగమించాలనే కోరిక ఉన్నప్పటికీ, ఆమె బాధ్యతలు, ఆమెనుకట్టిపడవేసినవి. ఆ సోదరుని మరణము తర్వాత, వకీలుగా ఉన్నతన సోదరుని కుటుంబముతో పాటు ఆమె విజయవాడకు మారవలసి వచ్చింది. దీని వలన ఆవిడకు మేలు జరిగింది. ఎందుకంటే, అక్కడ ఆమెకు సాధకులతో సాంగత్యం కలుగటమేగాక, మరిన్ని తెలుగు ఆధ్యాత్మిక గ్రంధాలు లభించేవి.

1939లో, నాగమ్మ మరొక సోదరుడైన డి.ఎస్. శాస్త్రి, తన వ్యాపార పనులమీద అటువైపు వెళ్ళినపుడు, అరుణాచలమునకు వెళ్ళటము, అచట, రమణమహర్షిని దర్శించటము జరిగింది. ఆగొప్ప మహనీయుని దర్శించినపుడు తాను పొందిన అనుభూతిని, ఆయన దర్శనంతోటే తన జీవితము ఎలా పూర్తిగా మార్పు చెందిందో, ఆయన వివరించారు. ఆయన నాగమ్మగారిని రమణ మహర్షిని దర్శించుకుని కొంతకాలము అరుణాచలములో గడపమని ప్రోత్సహించారు. ఆమెకు అందుకు అవసరమైన ఆర్థిక మరియు ఇతర విధములైన తోడ్పాటును తాను అందిస్తానని చెప్పారు. (ఆయనే తర్వాతకాలంలో ఆమె తెలుగు రచనలను ఆంగ్లంలోనికి అనువదించారు.)

నాగమ్మ ఆ వింత సాధువును, గురించి కొంత అపనమ్మకంతో ఉన్నారు. కానీ ఆమె సోదరుని నిరుత్సాహపరచటము ఇష్టంలేక, ఆమె 1941 జులైలో రమణాశ్రమమునకు వెళ్ళారు. భగవాన్‌వైపు ఒక్కసారి చూడగానే, ఆమె నోట మాటరాక ఆశ్చర్యములో మునిగిపోయారు. భగవాన్ ఆమెవైపు నిశితంగా చూచి నపుడు, ఆమె అవ్యక్తమైన శాంతిని అనుభవించారు. అద్భుతములలోకెల్ల అద్భుతమేమిటంటే, సుమారు ముప్పది సంవత్సరముల క్రిందట, స్వప్నంలో కనిపించిన సిద్ధపురుషుడు రమణమహర్షి యేనని ఆమె గుర్తించారు. ఆమెలోని ఆశ్చర్యాన్ని గమనించి భగవాన్ ఆమెను చూచి, చిరునవ్వు నవ్వారు. సాక్షాత్తూ భగవంతుని ఎదుటనే తాను నిలచి ఉన్నానని భావించిన ఆమె, తిరువణ్ణామలై లోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆమె అక్కడకు తాత్కాలికంగా ఉండుటకే వచ్చినారు కనుక, శాశ్వతనివాసమునకు అవసరమైన వస్తువులను తెచ్చుకొనుట కొరకు, తిరిగి యింటికి వెళ్ళవలసి వచ్చింది. భగవాన్ వద్ద సెలవు తీసుకుంటూ ఆమె, ఆయనకు దూరంగా ఉండటము యిష్టము లేక ఏడ్చేశారు. "మీరు ఏమి చేస్తున్నా, ఎక్కడకు వెళ్ళినా, నేను ఎల్లపుడూ మీతోనే ఉన్నాను", అన్నారు భగవాన్. నాగమ్మ తన్మయత్వమునకు లోనై, అప్పటి నుండి ప్రతిదానిలోనూ, భగవాన్ నే దర్శించే వారు ఆమె ఆనందంతో నిండిపోయారు. ఇన్నాళ్ళు దుఃఖభారంలో మునిగి ఉన్న నాగమ్మ ఆఖరికి ఆనందంతో ఉండుటను ఆమె బంధువులు కూడా గుర్తించారు.

భగవాన్ నుండి దూరంగా ఉండుటను సహించలేని నాగమ్మ, మూడు నెలలలోపే అరుణాచలమునకు తిరిగివచ్చారు. ఆశ్రమము దగ్గరలో నివాస గృహములు లేకుండుట చేతనూ, ఆశ్రమములో సూర్యాస్తమయమైన పిదప స్త్రీలను అనుమతించకుండుట చేతనూ, ఆమె టౌన్‌లో ఉండవలసి వచ్చింది. అదృష్టవశాత్తూ ఎచ్చెమ్మాళ్ ఉండే ఇంటి ప్రక్కనే, ఆమెకు అద్దె ఇల్లు దొరికింది. ఎచ్చెమ్మాళ్, భగవాన్‌కు భోజనము వడ్డించిన తర్వాత మాత్రమే తాను భుజించేవారు.

అటువంటి మహాత్మురాలి పొరుగున ఉండుటవలన, ఆమెకు గొప్పసత్సంగం లభించి నట్లైంది. ఎచ్చెమ్మాళ్ ఆమెను, ఎటువంటి సంకోచములు లేకుండ, భగవాన్‌తో సంభాషించవలసినదిగా, ప్రోత్సహించారు. నిజానికి ఎచ్చెమ్మాళ్, నాగమ్మగారికి, భగవాన్‌ను ఆత్మసాక్షాత్కారము కంటే తక్కువైన దానిని దేనినీ కోరవద్దని చెప్పారు. ఒకరోజు భగవాన్‌కు నమస్కరించిన తర్వాత, ఆమె గద్గదస్వరంతో, భగవాన్, నేను. ముక్తిని పొందటానికి తోడ్పడండి, దయచేసి అని కోరారు. కరుణకు ప్రతిరూపమైన భగవాన్, ఆమెవైపు తిరిగి, అంగీకరిస్తున్నట్లుగా తల ఊపారు. భగవాన్ ఈ విధంగా ప్రతిస్పందించటము చాలా అరుదైన విషయం. భగవాన్ సాధారణంగా, ముక్తిని కోరుకుంటున్న దెవరు? ఈ ప్రశ్న అడుగుతున్నది ఎవరు? అని ఎదురు ప్రశ్న వెయ్యటవముగానీ, కేవలము మౌనంగా ఉండి పోవటముగానీ చేసేవారు. నాగమ్మ, ఎచ్చెమ్మాళ్‌తో ఈ విషయాన్ని చెప్పినపుడు, ఆమె, "ఎంత అదృష్టవంతులు మీరు, భగవాన్ మీకుయిప్పుడే అభయాన్ని ఇచ్చేశారు", అన్నారు. ఆమె అన్నమాటలకు అర్థమేమిటని నాగమ్మ, ఎచ్చెమ్మాళ్‌ను ప్రశ్నించారు. ఆమెకు ఇక జనన మరణములు ఉండబోవని, భగవాన్, ఆమెను తన రక్షణ పరిధిలోనికి స్వీకరించారని, ఆమెకు భయపడవలసిన విషయమేమియూ లేదని, అదే ముక్తి అనీ ఎచ్చెమ్మాళ్ వివరించారు.

భగవాన్ తన దృష్టిని నాగమ్మపై కేంద్రీకరించారు. ఒక మంచి విద్యార్థివలె నాగమ్మ భగవాన్ బోధయైన ఆత్మవిచారణలో మునిగిపోయారు. ఆమెకొన్నిసార్లు గాఢ ధ్యానము లోనికి వెళ్ళగలిగేవారు, కొన్నిసార్లు, ఆలోచనలు ఆమెను బాధించేవి. "ప్రత్యేకించి, భగవాన్ ఎదురుగా కూర్చుని ధ్యానము కొరకు కనులు మూసుకున్నపుడు ఈ ఆలోచనలు నన్ను చుట్టుముట్టేవి. నేను కనులు తెరచేటప్పటికి, భగవాన్ నావైపు ఏకాగ్రంగా చూస్తుండేవారు. "అని ఆమె చెప్పారు. భగవాన్ నా ఆలోచనలన్నిటిని, నానుండి దూరంగా పారద్రోలారు. అని తన కవిత్వధోరణిలో చెప్పారామె. నాగమ్మ మంచి కవయిత్రి, ప్రతిభకల రచయిత్రి. స్వయంగా భగవాన్, ఏ ఆంక్షలనూ విధించకపోయినా, ఆ రోజులలో స్త్రీలు భగవాన్‌కు సమీపములోనికి వెళ్ళి, ఆయనతో స్వతంత్రముగా మాట్లాడటానికి జంకేవారు. రద్దీగా ఉన్నరోజులో ఆయనతో సంభాషించే అవకాశము మరింత తక్కువగా ఉండేది. అటువంటి రోజులతో తనకు ధ్యానమును గూర్చిన సందేహములను, నాగమ్మ ఒక చీటీపై వ్రాసి, భగవాన్ వద్దకు పంపేవారు. "ఎందుకు ఈ సందేహములను పట్టించుకుంటారు? వాటిని గమనించేకొద్దీ, అవి బలపడతవి. లోనికి మునగండి", అని భగవాన్ ఆమెను మందలించేవారు. తన కవితా ధోరణిలో నాగమ్మగారిలా అనేవారు," ప్రతిసారీ, భగవాన్ నావైపు చూచి,నా అంతరంగ సాధనను పరిపుష్ఠమొనర్చినపుడు, ఆయన దానిని, ఏవిధమైన ముడుతలు లేకుండా సాఫు చేసేవారు. అది బీడుపడిన నేలలోనికి నీరుప్రవహించి, దానిలో మొక్కలు పుష్పించి, ఫలించేలా చేయడమువంటిది. నా ఆధ్యాత్మికజీవితము అలా ఉండేది.

సూరినాగమ్మగారు స్వయంగా, అమృత నాడిని గురించిన సంఘటనను వివరించారు. ఆనాడి యోగశాస్త్రములలోనూ, హిందూ ధర్మశాస్త్రములలోనూ, దానిని కుండలినితో పోల్చిగొప్పగా పొగడబడినది. 1942లో ఒక తమిళపండితుడు, ఆత్మసాక్షాత్కారముతో సంబంధం కలిగి ఉన్నదని భావింపబడే, ఈ అమృత నాడిని గురించి భగవాన్‌తో సుదీర్ఘమైనచర్చ జరిపారు. భగవాన్, కూడా ఆ చర్చయందు ఆసక్తి కనబరచి, ఆపండితుని ప్రశ్నలన్నిటికీ సమాధానమిచ్చి, అమృతనాడి చర్యలను గూర్చి వివరంగా తెలిపారు. నాగమ్మ గారికీ విషయం మీద, ఏపాటి పరిజ్ఞానమూ లేనందువలన, ఆమె ఆయోమయంలో పడిపోయారు. ఆపండితుడు వెళ్ళిపోయిన పిమ్మట, ఆమె భగవాన్ చెంతకు వెళ్ళి, ఆ చర్చకు సంబంధించిన వివరములను అడుగుటకు ప్రారంభించారు. ఆమె వాక్యమును పూర్తిచేసేలోపల, "మీరెందుకు, వీటన్నిటిని గురించీ చింతిస్తారు", అని భగవాన్ అడిగారు. "భగవాన్, మీరు గత నాలుగురోజులుగా, ఈవిషయాన్ని చర్చిస్తున్నారు. అందుకని, నేను కూడా దానిని గూర్చి కొద్దిగా మీనుండి తెలుసుకోవాలనుకున్నాను", అన్నారు నాగమ్మ, "ఆ పండితుడు శాస్త్రములలో వ్రాయబడిన విషయములను గూర్చి ప్రశ్నిస్తున్నారు. నేను వానికి సరియైన సమాధానములు ఇస్తున్నాను. మీరు దానిని గూర్చి ఎందులకు ఆలోచిస్తున్నారు? మీరెవరో మీలోనికి తరచి చూచుకుంటేచాలును," అని చెప్పి భగవాన్ కరుణా పూరితులై ఆమె వైపుచూసి చిరునవ్వు నవ్వారు. తిరిగి రెండు రోజులు తర్వాత అదేవిషయము చర్చకు రాగా, భగవాన్ అదికేవలము ఒక భావనయే అన్నారు. నాగమ్మగారు, అమృతనాడి గురించి తెలుపబడిన విషయములన్నియు భావన లేనా? అని ప్రశ్నించగా, భగవాన్ ఈవిధముగా నొక్కి వక్కాణించారు. "అవును కాకుంటే మరిఏమిటి? అదికేవలము భావనయేకదా? ఈశరీరమే ఒకభావన

అయినపుడు అది భావన కాక మరేమౌతుంది?" పిమ్మట భగవాన్, నాగమ్మగారిని కరుణా పూరితులై చూశారు. ఆ క్షణంలోనే ఆమె సందేహములన్నీ పటాపంచలైపోయినవి. ఆ సంఘటనను గూర్చి తెలుపుతూ నాగమ్మ, సందేహములు వచ్చినపుడు వాటిని లక్ష్యపెట్టకుండ, మూలమునకు జేరుకొనుట యే ముఖ్యమైన విషయము అని వెల్లడి చేశారు.

ప్రతిసాధకునికీ ఒక ప్రత్యేకమైన ఆంతరిక స్వభావము ఉంటుందని, అర్థము చేసుకున్న భగవాన్, ఒక సాధకుని పరిపుష్టుని గావించేటప్పుడు, అతని అంతర్గత స్వభావమును అనుసరించి సూచనలను ఇచ్చేవారు సూరినాగమ్మగారు ఒక కవయిత్రి, రచయిత్రి, కనుక ఈ విషయము పరిగణనలో ఉంచుకుని, భగవాన్ ఆమెను ఆధ్యాత్మిక పథంలోనడిపించారు. సూరినాగమ్మ, భగవాన్‌ను తన సద్గురువుగా గుర్తించగానే, గీతములు, పద్యములు, కవితలు వాటికవే అప్రయత్నంగా ఆమె కలం నుండి వెలువడ సాగినవి. మొట్టమొదట్లో తాను రచించిన వాటిని భగవాన్‌కు చూపుటకు సిగ్గుపడేవారామె. కానీ, వేరే తెలుగు మహిళ ఈ పద్యములను భగవాన్ ముందు పాడేవారు. ఆయన వాటిని బాగామెచ్చుకునేవారు. తన పద్యములను భగవాన్ మెచ్చుకున్నారని ఒక పరిచారకునిద్వారా విన్న నాగమ్మ, తన కవితలు మరికొన్నిటిని భగవాన్ ముందు ఉంచుటకు సాహసించారు. భగవాన్ సాదరంగా చిరునవ్వు నవ్వి, "అందులో నాలుగు పద్యాలు నన్ను ప్రార్థిస్తూ వ్రాయబడినవి ఉన్నయ్యి. అందులో రెండవది ఆశ్చర్యకరంగా ఉంటుంది. నేను స్కందాశ్రమమును వదలి ఇక్కడ స్థిరపడిన తర్వాత, నాకు సేవచేయటానికి కోతులు లేవు. నాగమ్మ, "కోతివంటి నా మనస్సును మిమ్ము సేవించుట కెందులకు అంగీకరించరు? దానిని కట్టివేసినా, సరే, అణకువతో ఉండునట్లు లొంగదీసినా సరే, కానీ అది మాత్రము మీకు సేవ చేసేటట్లు చూడండి". అది ఆపద్యము యొక్క సారాంశము. శివానంద లహరిలో ఆదిశంకరులు ఈవిధంగానే అంటారు. ఆది శంకరులు, "ఓ శివా? నువ్వు ఒక భిక్షువు. కోతివంటి నామనసును ఒక కర్రకు కట్టి నువ్వెందులకు బిచ్చానికి వెళ్ళవు? నీకు సమృద్ధిగా భిక్ష దొరుకుతుందిగదా?" అప్పుడు భగవాన్ ఆశ్రమాన్ని సందర్శించిన ఒక తెలుగు పండితుని గూర్చి చెప్పారు. ఆ పండితుడు, భగవాన్‌తో, సూరినాగమ్మ గారు వ్రాసిన, అనేక ఆధ్యాత్మిక వ్యాసములను తాను అనేక తెలుగు పత్రికలలో చదివానని చెప్పారు భగవాన్ ఆయనతో, మాగజైన్స్‌కు ఇతర పత్రికలకు, దినపత్రికలకు తన వ్యాసములను పంపుటద్వారా, నాగమ్మ ప్రజలకు ఆధ్యాత్మిక ప్రబోధమును చేస్తున్నారని అన్నారు. భగవాన్ ఎంత గొప్పగా నాగమ్మ గారిని ప్రోత్సహించారో గదా! ఒకరోజు, భగవాన్ హాలులో ఉన్నపుడు తెలుగు వ్రాత ప్రతులను గురించి శ్రద్ధ వహించేవారు కరవైనారని ఎవరో అనటము జరిగింది. వెంటనే భగవాన్, నాగమ్మ, ఆ భాషపై తనకుగల పట్టువలన, వానిని ఎత్తివ్రాయగలరని సూచించారు. ఒక పెద్ద బైండు నోటు పుస్తకము తెప్పించబడింది . భగవాన్, స్వయంగా దానిని నాగమ్మ కిచ్చారు. ఆ రోజునుండి, తెలుగు రచనలన్నిటినీ వ్రాయుటకు, కాపీ చేయుటకు, భద్రపరచుటకు, ఆమె అధీకృత వ్యక్తి అయినారు.

భగవాన్‌కు బాగా సన్నిహితంగా ఉండగలిగే అపురూపమైన అవకాశం నాగమ్మకు లభించుటవలన, భగవాన్‌తో ఆమె జరిపే ప్రశ్నోత్తరములను గ్రంథస్థము చెయ్యవలసినదిగా, కాలక్రమేణా నాగమ్మ బంధువులు, మిత్రులు సూచించసాగారు. మొదట్లో ఆమె నిరాకరించినప్పటికీ, చివరకు అంగీకరించారు. నాగమ్మ గారి సోదరులు డి.ఎస్. శాస్త్రి ఆశ్రమమునకు వచ్చినపుడు ఆమెకొక పెద్దనోటు పుస్తకమును ఇచ్చి, భగవాన్ చుట్టూ జరిగే విషయములన్నిటినీ వివరంగా లేఖరూపంలో వ్రాసి తనకు పంపమని కోరారు. నాగమ్మ ఈ వలలో చిక్కుకున్నారు, అలా లేఖలు మొదలైనవి. ఆమె నాలుగు లేఖలను పూర్తిచేసిన పిమ్మట, వాటిని భగవాన్‌కు చదివి వినిపించాలని, ఆమెకు కోరిక కలిగింది. భగవాన్ వాటిని బాగా మెచ్చుకున్నారు. ఆమె ఒక జలపాతం వలె లేఖలు వ్రాసి, ఆ నోటు పుస్తకములోనే భద్రపరిచారు. ఈ లేఖలు, తర్వాతికాలంలో 'రమణాశ్రమలేఖలు' పేరుతో గ్రంథరూపంలో ప్రచురింపబడ్డవి. భగవాన్‌ను ఒక మానవునిగా వర్ణిస్తూనే, సద్గురువుగా ఆయన వైశిష్ట్యాన్ని విశదపరుస్తుంది, కావున ఈ గ్రంథము ప్రతిఒక్కరూ తప్పకచదువ వలసినది. నాగమ్మగారు 'రమణాశ్రమలేఖలు' మొదటి భాగమును పూర్తి చేసి, రెండవ భాగమును వ్రాయుట ప్రారంభించినపుడు, ఆఫీసులో పనిచేసే వారు కొందరు, ఆమెను వ్రాయుట ఆపెయ్యమని చెప్పారు. అంతేకాకుండా, అప్పటి వరకు ఆమె వ్రాసిన వాటిని ఆశ్రమ యాజమాన్యమునకు అప్పజెప్పారు, నాగమ్మగారు కుప్పకూలారు. కానీ, ఆమెకు తలవంచక తప్పలేదు. వారికి వ్రాతప్రతులను ఇచ్చివేసేముందుగా నాగమ్మగారు వాటిని, భగవాన్ ముందు ఉంచి, వాటిని ఆయన ఇష్టము వచ్చినట్లు చేసుకొనమని చెప్పారు. భగవాన్,

రాజగోపాల అయ్యర్‌ను పిలచి వాటిని ఆఫీసులో ఇవ్వమని చెప్పారు. మురుగనార్, కుంజుస్వామి, విశ్వనాధస్వామి వంటి భక్తులు, నాగమ్మగారు వ్రాయటం నిలిపివేస్తారని బాధపడ్డారు. వారు ఆమెను, వ్రాయటం కొనసాగించమని ఎంతగానో చెప్పిచూశారు, కానీ ఆమె ఒప్పుకొనలేదు. ఒకరోజు కుంజుస్వామి, యాజమాన్యము వారి కఠోరనిర్ణయములా కనిపించే నిర్ణయము వెనుక గల కారణమును, నాగమ్మకు వివరించారు. ఆయన, "నాగమ్మ గారు, ఆశ్రమ యాజమాన్యము మిమ్మలను వ్రాయవద్దని చెప్పుటకు కావలసినన్ని కారణములున్నవి, వెనుకటి కాలములో పాల్‌బ్రంటన్, మునగాల వెంకట్రామయ్యగారు, మరి ఇతరులు వ్రాసినప్పుడు, ఇతరులు వారి రచనలను కాపీ చేసి, వారి స్వంత రచనలుగా వాటిని ముద్రించి సొమ్ము చేసుకున్నారు. కానీ మీకటువంటి స్వలాభాపేక్ష లేదుగదా! అటువంటప్పుడు మీరెందుకు సందేహిస్తారు? ఆ లేఖలు ఇప్పుడు తాత్కాలికముగా నిషేధింపబడినప్పటికీ ఈ లేఖలు, ముందుతరము వారికి, అంతులేనంత ఉపయోగకరముగా ఉంటవి. ఏమంచి పని చెయ్యాలన్నా అడ్డంకులను ఎదుర్కొనక తప్పదు. అనేది అసాధారణమైన విషయమేమీ కాదు కద. కేవలము ఈ అడ్డంకుల వలన మీరు వ్రాసే పనిని ఆపెయ్యకూడదు". అని చెప్పారు.

నాగమ్మగారు ఒప్పుకొనలేదు. ఆమె, చింతా దీక్షితులు, సీతారామశాస్త్రి అనే ఇరువురు ప్రముఖ తెలుగు పండితులను సంప్రదించారు. కుంజుస్వామి వలెనే వారు కూడా నాగమ్మగారిని బాగా ప్రోత్సహించారు. నిజానికి సీతారామశాస్త్రిగారు, భగవాన్ మాటలలోని అంతరార్థమును తెలుసు కొనగలిగిన సహజ చాతుర్యము ఆమెలో ఉన్నదనీ, అది అందరు భక్తులవలన, కానిపని అనీ, కావున భగవాన్ ఉపదేశములను, మిగిలిన ఆధ్యాత్మిక ప్రపంచమునకు అందజేయవలసిన బాధ్యత ఆమెపై ఉన్నదనీ, చెప్పారు. వారిలా ప్రోత్సహించగా నాగమ్మగారు తన రచనను పునఃప్రారంభించారు. అప్పుడుప్పుడు యాజమాన్యము వారు, "మీరింకా వ్రాస్తున్నారా?" అని ప్రశ్నించినపుడు, ఆమె లేదని చెప్పేవారు. కానీ అపరాధభావన ఆమెను బాధించి, ఒకరోజు భగవాన్ వద్ద జరిగినదంతా ఆమె వెల్లడించేయాలనుకున్నారు. ఆమె హాలులోనికి ప్రవేశించినపుడు, భగవాన్ కొందరు భక్తుల నడుమ కూర్చుని ఉండుట చూశారు. మధురైలో ఉండగా జరిగిన బాల్యంలోని సంఘటనను, ఆయన వారికి వివరిస్తున్నారు. తాను ఇల్లు వదలి వెళ్తున్నపుడు, తన పిన తల్లిగారితో అబద్ధము చెప్పినట్లు తెలిపారు. సరిగ్గా ఆ సమయంలో భగవాన్, నాగమ్మపై దృష్టిని కేంద్రీకరించి, "మనము అబద్ధము చెప్పటము కాదు. ఏదో, శక్తి, మనచేత అలా చేయిస్తుంది. ఆది శంకరులుకూడా సన్యసించేముందు, తల్లికి అబద్ధం చెప్పవలసివచ్చింది. నాగమ్మగారిలోని వ్రాయటం పట్లగల విముఖత పూర్తిగా తొలగిపోయి, నేటి 'రమణాశ్రమ లేఖలు' రూపుదిద్దుకున్నాయి.

భగవాన్ జీవితమలోని చివరి సంవత్సరాలలో, ప్రతి తెలుగు ఉగాది ముందురోజు సాయంత్రము, ఒక కౌపీనమును భగవాన్‌కు సమర్పించుట తన అలవాటుగా పెట్టుకున్నారు నాగమ్మ. ఆ విధంగానే, భగవాన్ జీవితంలోని చివరి ఉగాది ముందురోజున ఆమె అలవాటుగా ఇచ్చే కౌపీనమును, భగవాన్‌కు సమర్పించుటకు వెళ్ళారుకానీ, అంతులేని బాధలో ఉండి, అత్యంత బలహీనంగా ఉన్న ఆయన, అంగీకరిస్తారో లేదో అని ఆమె సందేహించారు. ఆ కౌపీనమును స్వీకరించి, తాను మరునాడు ఉదయం ధరించుటకు గాను, దానిని ఒక ప్రక్కన ఉంచమని చెప్పారు. మర్నాడు ఉదయం నాగమ్మ, భగవాన్ చూచుటకు వెళ్ళినపుడు, ఆయన ఆరోజు ఉగాది యేనా అని అడిగి, అది వికృతినామ సంవత్సరమా? అని అడిగారు.

అదే నాగమ్మ, భగవాన్‌తో జరిపిన చివరి సంభాషణ, భగవాన్ చివరిరోజున, అందరు భక్తుల వలెనే నాగమ్మ వరుసలో నుంచుని ఉన్నారు. దర్శనమునకు ఆమె వంతు వచ్చినపుడు ఆయన కనులు మూసుకుని ఉండుటచే, ఆయన అనుగ్రహమును పొందలేకపోతిని గదా, అని ఆమె బిగ్గరగా ఏడ్చారు. భగవాన్ కనులు తెరిచారు. "దయచేసి నన్ను వెళ్ళనివ్వండి, ఈశరీరము బాధపడుతున్నది", అని చెబుతున్నట్లుగా ఉన్నవి, ఆ కళ్ళు. భారమైన హృదయంతో, పట్టరాని దుఃఖంతో నాగమ్మ అంగీకారమును తెలిపారు. భగవాన్ ఆమె వైపు చూసి అనుగ్రహిస్తున్నట్లుగా చిరునవ్వు నవ్వారు. భగవాన్ సమాధి చెందిన తర్వాత, నాగమ్మ స్వగ్రామమునకు వెళ్ళారు.

1980లో ఆమెను తిరిగి ఆశ్రమానికి తీసికొనివచ్చి ఆమె తన జ్ఞాపకములను వ్రాయగలిగేలా చేసే భాగ్యము నాకు లభించింది. ఆమె వానిని తెలుగులో వ్రాయగా ఆమె సోదరుడు ఆంగ్లం లోనికి అనువదించారు. అదే 'నా రమణాశ్రమ జీవితము' అనే శీర్షికతో వెలువడింది. నాగమ్మ జబ్బుపడినపుడు ఆమె బంధువులు ఆమెను తమతో తీసుకుని వెళ్ళి, పిదప బెంగుళూరులోని ఒక ఆస్పత్రిలో చేర్చారు. నేను ఆ మాణిక్యము వలె విలువైన ఆమెకు భౌతికంగా సేవ చేయలేకపోయినా, నా స్నేహితుడైన ఎ.ఆర్. నటరాజన్‌ను ఆమెను గూర్చి శ్రద్ధ వహించ వలసినదిగా కోరాను. ఆయన ఆ బాధ్యతను ఎంతో గొప్పగా నిర్వహించారు. నాగమ్మ గారు బెంగుళూరులో మరణించినపుడు, నేను ఎ.ఆర్. నటరాజన్‌ను, రమణాశ్రమ ప్రతినిధిగా, ఆవిడ అంత్యక్రియలలో పాల్గొనమని కోరగా, ఆయన అలాగే చేసి, ఆమె భౌతిక కాయమును, స్మశానము వరకు మోయుటకు కూడా తోడ్పడినారు.

యావత్ప్రపంచములోని సాధకులు, నాగమ్మగారికి, ఆమె రచనలకు ఋణపడి ఉంటారు. గోవులక్ష్మి చివరి క్షణములలో, ఆమెపట్ల శ్రద్ధవహించినందుకు నేను శాశ్వతముగా ఆమెకు ఋణపడి ఉంటాను. లక్ష్మి భగవాన్‌కు, ప్రియమైన జంతువు. నాగమ్మగారు, భగవాన్‌కు ఇష్టమైన మనిషి (వ్యక్తి) కాబట్టి నాగమ్మగారి గురించి చెప్పేటప్పుడు, గోవులక్ష్మి గురించి కొన్ని మాటలు చెప్పకుండా ఉండలేను. భగవాన్ అన్ని విధములైన జంతువులను ఒకే విధమైన ప్రేమ, మృదుత్వము, అనుగ్రహములతో చూచేవారు. అయినప్పటికీ, మానవ జాతికి చెందని గోవులక్ష్మి ఆయన" సంపూర్ణ అనుగ్రహమునకు పాత్రురాలై, సంపూర్ణమైన మానసిక పరిపూర్ణతను, సమానత్వమును పొంది, ముక్తిని పొందిందని చెప్పటములో వింత ఏమీలేదు. గోవులక్ష్మి మహనీయమైన జీవి అనీ, ఎందుకంటే భగవాన్ ఆమెతో మమేకమై, ఆమెకు చివరి ఘడియలలో తన హస్తస్పర్శద్వారా ముక్తినిచ్చారనుటలో సందేహములేదు. అంతకు పూర్వము కొన్ని దశాబ్దముల క్రిందట స్కందాశ్రమములో తన తల్లి అళగమ్మగారికి ఆవిధంగానే చేశారు, భగవాన్.

గోవు లక్ష్మి విషయములో జరిగిన సంఘటనను గూర్చి నాగమ్మ ఈ విధంగా తెలిపారు. "లక్ష్మి చనిపోయేరోజున, భగవాన్ గోశాలకు వచ్చి, నేరుగా గోవు లక్ష్మి వద్దకు వెళ్ళి ఆమెప్రక్కన గడ్డిపై కూర్చున్నారు. తర్వాత ఆయన దాని తలను తన రెండు చేతులతో సున్నితంగా పైకి లేపి, తన ఒడిలో ఉంచుకున్నారు. ఆయన మృదువుగా, ప్రేమగా తన చేతితో ఆమె ముఖముపై నుండి మెడవరకు నిమురుతూ ఉన్నారు. తర్వాత తన ఎడమ చేతిని, ఆమె తలపై ఉంచి, కుడిచేతి వేళ్ళతో ఆమె మెడనుండి, హృదయము వరకూ నెమ్మదిగా నొక్కుతూ, ఉన్నారు. ప్రాపంచిక బంధనములను తెంచుకుని, బాధనుండి విముక్తి చెంది, సమాధి స్థితిలో ఉన్నదా! అన్నట్లుగా ప్రశాంతంగా ఉంది. "లక్ష్మి, ప్రాణములను విడిచింది", అని నాగమ్మ తెలిపినపుడు, భగవాన్ గోశాలవద్దకు వచ్చి, తనరెండు చేతులతో ఆమెతలను ఎత్తి, "లక్ష్మీ", "లక్ష్మీ" అని పిలిచారు. ఆయన అక్కడున్న భక్త సమూహముతో, "ఆమె వలననే నేడు మన కుటుంబము ఇలా విస్తరించింది", అన్నారు. 1926లో లక్ష్మి ఒకదూడగా భగవాన్ వద్దకు వచ్చింది. భగవాన్ ఆమెకు లక్ష్మి అని పేరు పెట్టారు. ఆమె భగవాన్ పట్ల ఎంతో ప్రేమతో ఉండేది. ఆమె వచ్చిన తర్వాత గోశాల నిర్మించ బడింది. ఆశ్రమము కూడా ఉత్తరోత్తరా అభివృద్ధి చెందింది. ఆమె చివరి రోజున, లక్ష్మిని చూస్తూ భగవాన్ గద్గస్వరంతో ఆమె కుడి చెవిపైకి లేచిఉండుటను మీరు గమనించారా?" అని ప్రశ్నించారు. ఆయన అలా ఎందుకన్నారంటే, కాశీలో మానవులు మరణించేటపుడు, ఈశ్వరుడు వారికుడి చెవిలో రామ మంత్రమును, ఉపదేశించి, ముక్తిని ఇస్తారని నమ్మకము. భగవాన్ ఉద్దేశము, 'లక్ష్మి నిజంగా ముక్తి నొందినది' అని. ప్రాచీన గ్రంథమైన 'తిరుమందిరం' లోని సూచనల ననుసరించి, భగవాన్ స్వీయ పర్యవేక్షణలో, గోవు లక్ష్మికి సమాధి నిర్మించబడింది. ఆ గ్రంథములో, ముక్తి నొందిన వారి దేహములను ఎలా సమాధి చేయాలో, సమాధిమందిరమును ఎలా నిర్మించాలో వివరింపబడి ఉన్నది. లక్ష్మి ముక్తి నొందిందని అర్థము వచ్చేలా, భగవాన్ తమిళంలో ఒక పద్యమును వ్రాశారు? దేవరాజముదలియార్, "ఆపదము (ముక్తి) మరణమును సూచించుటకు వ్రాశారా?" అని అడుగగా, లేదు, ఆపదము ఆమె అంతిమ సాక్షాత్కారమును సూచించుటకే వాడబడినది అని భగవాన్ నిశ్చయంగా చెప్పారు.

గోవులక్ష్మి, సూరినాగమ్మ గారు కూడా భగవాన్‌లో ఐక్యమైనారు. ఒకప్పుడు ఎవరో భగవాన్‌ను, భగవాన్! నేను మీ అనుగ్రహమును కోరుకొంటున్నాను, అని చెప్పగా, భగవాన్, "ఏదైతే ఉన్నదో, అది కేవలము అనుగ్రహమే", అని అన్నారు.

ఆర్ధర్ ఆస్‌బోర్న్



మా తండ్రిగారు నాగురించి ఈ విధంగా అనేవారు. "గణేశన్ ఎవరిని కలిసినా, వెంటనే, వారిని మహాత్ముడు, మహర్షి లేదా సిద్ధపురుషుడు అనేస్తాడు". ఏమి చెయ్యాలి? నేనెవరిని కలిసినా, వారిని సత్యమునకు ప్రతిబింబంగానే చూశాను. ఆర్ధర్ ఆస్‌బోర్న్, మురుగనార్, మునగాల వెంకట్రామయ్య, చాడ్విక్, సూరినాగమ్మ, ఇంకా అనేకమంది అటువంటి భక్తుల లోని సత్యమును గుర్తించలేకపోతే, వారిని మహాత్ములుగా భావించక పోతే, మనకు ఆధ్యాత్మిక లక్ష్యము సాధించుటకు అర్హత (తక్కువగా ఉన్నట్లే) లేనట్లే, మనమే దానివలన నష్టపోతాము. ఆర్ధర్ ఆస్‌బోర్న్, రమణమహర్షి వద్దకు 1945లో వచ్చారు. ఆయన సద్గురువుతో కేవలము ఐదు సంవత్సరములు మాత్రమే ఉన్నారు. కానీ ఎన్ని సంవత్సరములు ఉన్నారు అనేది పరిగణనలోనికి తీసికొన వలసిన విషయముకాదు. నా ఉద్దేశంలో శ్రీరామకృష్ణ పరమ హంసకు, వివేకానందునివలె, భగవాన్ రమణుల బోధను ప్రపంచమునకు ఆనాడూ, ఈనాడూ కూడా అందజేసే సారధివంటి వారు ఆస్‌బోర్న్, భగవాన్ బోధ, యావత్ప్రపంపచానికీ ఉద్దేశించబడినప్పటికీ, ఆంగ్లములోనూ, పాశ్చాత్యులకు అనువైన రీతిలోనూ, నవీన పద్ధతిలో భగవాన్ సూటి బోధఅయిన ఆత్మవిచారమును, ప్రపంచము మొత్తము వ్యాప్తి చెయ్యటానికి, ఆస్‌బోర్న్ ప్రముఖ పాత్ర వహించారు. భగవాన్, ఆయన నెలా, ఎంపిక చేసుకొని, ఆయనను ఆత్మవిచారణ మార్గములో పరిపక్వత, చెందేటట్లు ఏకాగ్రతతో ఎలా శ్రద్ధ వహించారో మనము తెలుసు కుందాము.

శరీరములో ఉండగా భగవాన్ తన దృష్టి (ప్రసారము) తోనూ, సాన్నిధ్యముతోనూ, ఇంకా అనేక ఇతర రీతుల లోనూ, ఆస్‌బోర్న్ ఆధ్యాత్మిక పరిపక్వత నొందుటకు సహాయ పడినారు. భగవాన్ నిర్యాణము తర్వాత, స్వప్నములద్వారా, ఈ కార్యమును కొనసాగించేవారు. ఆర్ధర్ ఆస్‌బోర్న్ బాల్యము నుండే, భగవాన్, కేవలము సూటిదైన తన ఆత్మ విచారమార్గమును, వ్యాప్తి చెందించుట కొరకే, తన స్వకీయమైన, గూఢమైన, సాధారణమైన, సులభమైన, వేదాంత పరమైన మార్గములో ఆయనను ఆకర్షించారు. వీరిద్దరి నాటకములో, నేను కూడా ఒక పాత్ర పోషించుటకు ఎంపిక చెయ్య బడినాననే సంగతి అప్పటిలో నాకు తెలియదు.

ఆర్ధర్ ఆస్‌బోర్న్ ఒంటరిగానే, భగవాన్ సూటి మార్గము యొక్క ఔన్నత్యమును, తన అద్భుతమైన రచనాశైలితో (తన జీవితమంతా) ప్రపంచమునకు చాటే బాధ్యతను తన భుజముపై వేసుకున్నారు. తానిది వరకే పొందిన అనుభవమును చక్కగా విశదీకరించుటకు అవసరమైన, మేధా పరమైన స్పష్టత, ఏ తార్కిక చర్చ అవసరము లేకనే, ఏ విషయాన్నైనా, అత్యంత సులభంగా అవగాహన చేసికొనగలిగే ఆంతరంగిక సామర్థ్యము, కవితా శక్తి, సమ పాళ్ళలో చక్కగా మేళవించి ఉన్నాయి. ఆయనలో. ఒక పట్టకముగుండా తెల్లని కాంతి కిరణము ప్రసారమైతేనే గాని, తెల్లని కాంతి, నిజమునకు, ఏడు రంగుల సమ్మేళన మని అందరికీ తెలియదు. ఆ విధముగానే, భగవాన్ సూటిబోధ ఈ ఎంపిక చేయబడిన శిష్యుని యొక్క 'నిజావగాహన' అనే 'పట్టకము' ద్వారా, విభజించబడి, సరళీకృతము గావింపబడి, భగవాన్ బోధను నేరుగా అవగాహన చేసుకునే సామర్థ్యము తక్కువగా ఉన్నవారికి అందజేయబడినది. భగవాన్ పట్ల, ఆర్ధర్ ఆస్‌బోర్న్ యొక్క భక్తి పరిపూర్ణమైనది. అనేక విషయములలో ప్రావీణ్యత కల్గియున్న ఆయన, తన శక్తినంతటిని, తన యావజ్జీవితమును, ఏమాత్రము దాపరికము లేకుండా, పూర్తి నిస్వార్థతతో, భగవాన్‌కు సమర్పించుకున్నారు.

1960లో అరుణాచలములో శాశ్వతముగా స్థిరపడుట కొరకు నేను వచ్చేశాను మూడు నెలలు జబ్బు పడి పూర్తిగా కోలుకొనిన తర్వాత, నేను నా జీవితమును సంపూర్ణంగా రమణాశ్రమమునకు, అంకితము చేస్తున్నట్లు చెప్పాను. 1960 దశకంలో, రమణాశ్రమము మొత్తంలో పదిమంది మాత్రమే ఉండేవారు సుమారుగా. నేను వచ్చినపుడు, ఆస్‌బోర్న్ ఇలుప్పాయ్ (ఇప్పచెట్టు) వృక్షము క్రింద చేతులు చాచి నిలబడి ఉన్నారు. అది చూస్తే, భగవానే, స్వయంగా, చిరునవ్వుతో, నా నిర్ణయాన్ని ఆమోదిస్తూ, సంతోషంతో నన్ను స్వాగతిస్తున్నట్లు అనిపించింది. ఆస్‌బోర్న్ యొక్క ఆ ఒక్క చూపే, ఒక్క చిరునవ్వే, ఆధ్యాత్మిక రంగమునకు,

నా జీవితం సంపూర్ణంగా అంకితమయ్యేటట్లు చేసింది. ఆయన ఇలా అన్నారు, "స్వాగతం గణేశన్! మీరు మీ స్వగృహమైన ఇచ్చటకు తిరిగి వస్తారని మాకందరకు తెలియును. అరుణాచలమే మన స్వగృహము. భగవానే మన తల్లి. అరుణాచలమును, భగవాన్‌ను ఒకటే కోరిక కోరండి, "నాకు ఆత్మ సాక్షాత్కారమును ప్రసాదించండి", అని మీరేది అడిగినా వారు ఇస్తారు. కానీ మీరు ప్రాపంచికమైన విషయములను కోరవద్దు. ఆయన గొప్పదాత భార్య, గృహము, సంపద, పలుకుబడి, సాంఘిక ఔన్నత్యము ఏదికోరినా, ఆయన తప్పకవాటిని మీకు ఇస్తారు. చాలా ఎక్కువ మోతాదులోనే ఇస్తారు. కానీ అపుడు మిమ్ములను అరుణాచలమునకు దూరముగా పంపివేస్తారు. కానీ ఆత్మసాక్షాత్కారమును తప్ప మరి దేనినీ మీరు కోరకుండినట్లైతే, ఆయన మిమ్ములను ఇచటనే నిల్పివైచి, తనను తానే మీకు ఇచ్చుకుంటారు. అరుణాచలమంటేనే ఆత్మసాక్షాత్కారము. జ్ఞానము యొక్క శిఖరాగ్రము. స్వగృహమునకు మీకు స్వాగతము, గణేశన్! సంతోషంగా ఉండండి" ఈ మాటలు అన్నది ఎవరు? ఒక అసాధారణ వ్యక్తి, ఒక మేధావి, ఒక విద్యావంతుడు, ఒక పాశ్చాత్యుడుకాదు. అరుణాచలము నందు కదలకుండా స్థిరముగా ఉండి, అరుణాచలమును స్థిరముగా తన హృదయములో ప్రతిష్టించుకున్న వారు. నిజానికి పైన చెప్పిన వన్నీ ఆయనకు చెందుతవి ఈ అద్భుతమైన పలుకులను మన హృదయాలలో భద్రపరచుకొనవలెను. మహాత్ముల పలుకులు అన్నివేళలో, అన్ని పరిస్థితులలోనూ, అందరికీ సత్యమై నిలుస్తవి.

ఆర్థర్ ఆస్‌బోర్న్ ఎవరు? ఆయన 1906లో లండన్‌లో జన్మించారు. ఆయన తండ్రి, ఒక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు. ఆయన తల్లి సామాన్యంగా ఉండే, కవిత్వమన్నా, తోటపని అన్నా ఆసక్తి కలిగి ఉండే, ఒక భక్తి పరురాలైన పుణ్యస్త్రీ. ఈ రెండు లక్షణములనూ, తల్లినుండి పుణికి పుచుకున్నారు ఆస్‌బోర్న్. ఆయన తన జీవితం మొత్తమూ, తోటమాలిగా, వ్యవసాయదారునిగా ఉండాలని కోరుకున్నారు. కానీ ఆయన తండ్రి ఆయనను ఆక్స్‌ఫర్డ్‌లో జేర్చారు. ఆయన ఎంతో ఉజ్వలమైన ప్రతిభనుచూపి పది బంగారు పతకములతో బయటకు వచ్చారు. ఆయన తన తల్లి తండ్రుల ఆశయలను నెరవేర్చారు – కానీ జీవితమంతా, కవిత్వము అన్నా తోటపని అన్నా ఎంతో మక్కువ కలిగి ఉండేవారు. భగవాన్ ఎదురుగా ఉన్నపుడు జరిగినవి తప్ప, మిగిలిన ఆధ్యాత్మిక అనుభవముల నన్నిటినీ, ఆయన తన తోటలోనే పొందారు. బాల్యమునుండి, జీవితము యొక్క అర్థము, పరమార్థము ఏమిటని, జీవితములో సాధించవలసిన ఉన్నతమైన గమ్యము ఏది? అని ఆయన అన్వేషిస్తూ ఉండేవారు. పసిబాలునిగా మైదానంలో ఆడుకొంటున్నపుడే, ప్రాపంచిక జీవితం అర్థము లేనిదిగా ఆయనకు అన్పించింది. ఆ భావమును ఎవరితోనూ పంచుకొన లేకపోయారు. "అన్వేషించిన వాడే కనుగొనగలడు", అన్న క్రీస్తు మాటలే ఆయనకు అండగా నిల్చాయి. ఆ వాక్యమే తనను తన జీవితమంతా సత్యాన్వేషకునిగా, నిల్పింది. ఒకానొక సమయంలో, ఆయన, ఫ్రాన్స్ దేశపువేదాంతి అయిన రీనీగ్యునెన్ రచనలను చదవటం తటస్థించింది, అవి ఆయన కెంతో సంతోషాన్ని కల్గించాయి, ఎందుకంటే, ఉన్నది ఒక్కటే అనేదే గ్యూనెన్ బోధ, ఆస్‌బోర్న్ ఆ బోధ నిక్కమైనదని వెంటనే భావించారు. ప్రాపంచిక జీవితము అర్థములేనిది, వ్యర్థమైనది అనే భావన వలన కల్గిన అసంతృప్తి, ఆవేదన తొలగిపోయినవి, జీవితమునకు కూడా ఒక అర్థముఉన్నది. అనే విషయమును గుర్తించుటతోటే. 'ఉనికి ఒక్కటే సత్యము' లేదా సత్యము ఒక్కటే ఉనికి కల్గి ఉన్నది, ఇతరమైనది ఏదీ లేదు అనినట్లైతే, నేను కూడా ఆ సత్యమే తప్ప అన్యము కాదు. తనలోని సత్యాన్ని గుర్తించాలంటే, తానూ ఆ పరమాత్మ కంటే భిన్నంగా లేననీ, పరమాత్మగానే ఉన్నాననీ గుర్తించటమే, అదే ఆయన అన్వేషణకు ప్రారంభము. ఆ అన్వేషణనుండి, ఆయన ఎన్నడూ వైదొలగలేదు. ఇదంతా కూడా, ఆస్‌బోర్న్, భగవాన్ గురించి తెలుసుకొనక ముందే జరిగింది.

పిమ్మట ఆయన లూసియాను కలుసుకున్నారు, ఆమెను ప్రేమించి వివాహమాడారు. ఆమె కూడా సత్యాన్వేషి అగుటవల్ల, వారిరువురి జీవితాశయములు ఒకే విధంగా ఉండటం జరిగింది. రీనిగ్యూనెన్ వారిని, వేరొక గురువు వద్దకు పంపారు. ఆయన ఏవో మంత్రములను ఉపదేశించి, వాటిని తీవ్రంగా జపించమని చెప్పారు. వారెంతో శ్రద్ధతో ఆ సాధన కొనసాగించారు. ఆ సమయంలోనే, సాధకుడేగాక, మేధావి, విద్యావేత్త అయినందువలన, ఆస్‌బోర్న్, సూఫీమతము, బౌద్ధమతము, క్రైస్తవమతము, వేదాంతములలో చెప్పబడిన సిద్ధాంతములనన్నిటిని, అధ్యయనము చేయుటయేగాక సాధన కూడా చేసి వానిలోని వేదాంత సారాన్ని లబ్ధిపొందారు. ఈ సాధన అంతా, ఆయనను గమ్యం చేరుకొనడానికి ఎంత చక్కగా సిద్ధం చేసిందో చూడండి.

ఆర్థర్ ఆస్‌బోర్న్



మా తండ్రిగారు నాగురించి ఈ విధంగా అనేవారు. "గణేశన్ ఎవరిని కలిసినా, వెంటనే, వారిని మహాత్ముడు, మహర్షి లేదా సిద్ధపురుషుడు అనేస్తాడు". ఏమి చెయ్యాలి? నేనెవరిని కలిసినా, వారిని సత్యమునకు ప్రతిబింబంగానే చూశాను. ఆర్థర్ ఆస్‌బోర్న్, మురుగనార్, మునగాల వెంకట్రామయ్య, చాడ్విక్, సూరినాగమ్మ, ఇంకా అనేకమంది అటువంటి భక్తుల లోని సత్యమును గుర్తించలేకపోతే, వారిని మహాత్ములుగా భావించక పోతే, మనకు ఆధ్యాత్మిక లక్ష్యము సాధించుటకు అర్హత (తక్కువగా ఉన్నట్లే) లేనట్లే, మనమే దానివలన నష్టపోతాము. ఆర్థర్ ఆస్‌బోర్న్, రమణమహర్షి వద్ధకు 1945లో వచ్చారు. ఆయన సద్గురువుతో కేవలము ఐదు సంవత్సరములు మాత్రమే ఉన్నారు. కానీ ఎన్ని సంవత్సరములు ఉన్నారు అనేది పరిగణనలోనికి తీసికొన వలసిన విషయముకాదు. నా ఉద్దేశంలో శ్రీరామకృష్ణ పరమ హంసకు, వివేకానందునివలె, భగవాన్ రమణుల బోధను ప్రపంచమునకు ఆనాడూ, ఈనాడూ కూడా అందజేసే సారధివంటి వారు ఆస్‌బోర్న్, భగవాన్ బోధ, యావత్ప్రపంపచానికీ ఉద్దేశించబడినప్పటికీ, ఆంగ్లములోనూ, పాశ్చాత్యులకు అనువైన రీతిలోనూ, నవీన పద్ధతిలో భగవాన్ సూటి బోధఅయిన ఆత్మవిచారమును, ప్రపంచము మొత్తము వ్యాప్తి చెయ్యటానికి, ఆస్‌బోర్న్ ప్రముఖ పాత్ర వహించారు. భగవాన్, ఆయన నెలా, ఎంపిక చేసుకొని, ఆయనను ఆత్మవిచారణ మార్గములో పరిపక్వత, చెందేటట్లు ఏకాగ్రతతో ఎలా శ్రద్ధ వహించారో మనము తెలుసు కుందాము.

శరీరములో ఉండగా భగవాన్ తన దృష్టి (ప్రసారము) తోనూ, సాన్నిధ్యముతోనూ, ఇంకా అనేక ఇతర రీతుల లోనూ, ఆస్‌బోర్న్ ఆధ్యాత్మిక పరిపక్వత నొందుటకు సహాయ పడినారు. భగవాన్ నిర్యాణము తర్వాత, స్వప్నములద్వారా, ఈ కార్యమును కొనసాగించేవారు. ఆర్థర్ ఆస్‌బోర్న్ బాల్యము నుండే, భగవాన్, కేవలము సూటిదైన తన ఆత్మ విచారమార్గమును, వ్యాప్తి చెందించుట కొరకే, తన స్వకీయమైన, గూఢమైన, సాధారణమైన, సులభమైన, వేదాంత పరమైన మార్గములో ఆయనను ఆకర్షించారు. వీరిద్దరి నాటకములో, నేను కూడా ఒక పాత్ర పోషించుటకు ఎంపిక చెయ్య బడినాననే సంగతి అప్పటిలో నాకు తెలియదు.

ఆర్థర్ ఆస్‌బోర్న్ ఒంటరిగానే, భగవాన్ సూటి మార్గము యొక్క ఔన్నత్యమును, తన అద్భుతమైన రచనాశైలితో (తన జీవితమంతా) ప్రపంచమునకు చాటే బాధ్యతను తన భుజముపై వేసుకున్నారు. తానిది వరకే పొందిన అనుభవమును చక్కగా విశదీకరించుటకు అవసరమైన, మేధా పరమైన స్పష్టత, ఏ తార్కిక చర్చ అవసరము లేకనే, ఏ విషయాన్నైనా, అత్యంత సులభంగా అవగాహన చేసికొనగలిగే ఆంతరంగిక సామర్థ్యము, కవితా శక్తి, సమ పాళ్ళలో చక్కగా మేళవించి ఉన్నాయి. ఆయనలో. ఒక పట్టకముగుండా తెల్లని కాంతి కిరణము ప్రసారమైతేనే గాని, తెల్లని కాంతి, నిజమునకు, ఏడు రంగుల సమ్మేళన మని అందరికీ తెలియదు. ఆ విధముగానే, భగవాన్ సూటిబోధ ఈ ఎంపిక చేయబడిన శిష్యుని యొక్క 'నిజావగాహన' అనే 'పట్టకము' ద్వారా, విభజించబడి, సరళీకృతము గావింపబడి, భగవాన్ బోధను నేరుగా అవగాహన చేసుకునే సామర్థ్యము తక్కువగా ఉన్నవారికి అందజేయబడినది. భగవాన్ పట్ల, ఆర్థర్ ఆస్‌బోర్న్ యొక్క భక్తి పరిపూర్ణమైనది. అనేక విషయములలో ప్రావీణ్యత కల్గియున్న ఆయన, తన శక్తినంతటిని, తన యావజ్జీవితమును, ఏమాత్రము దాపరికము లేకుండా, పూర్తి నిస్వార్ధతతో, భగవాన్‌కు సమర్పించుకున్నారు.

1960లో అరుణాచలములో శాశ్వతముగా స్థిరపడుట కొరకు నేను వచ్చేశాను మూడు నెలలు జబ్బు పడి పూర్తిగా కోలుకొనిన తర్వాత, నేను నా జీవితమును సంపూర్ణంగా రమణాశ్రమమునకు, అంకితము చేస్తున్నట్లు చెప్పాను. 1960 దశకంలో, రమణాశ్రమము మొత్తంలో పదిమంది మాత్రమే ఉండేవారు సుమారుగా. నేను వచ్చినపుడు, ఆస్‌బోర్న్ ఇలుప్పాయ్ (ఇప్పచెట్టు) వృక్షము క్రింద చేతులు చాచి నిలబడి ఉన్నారు. అది చూస్తే, భగవానే, స్వయంగా, చిరునవ్వుతో, నా నిర్ణయాన్ని ఆమోదిస్తూ, సంతోషంతో నన్ను స్వాగతిస్తున్నట్లు అనిపించింది. ఆస్‌బోర్న్ యొక్క ఆ ఒక్క చూపే, ఒక్క చిరునవ్వే, ఆధ్యాత్మిక రంగమునకు,

నా జీవితం సంపూర్ణంగా అంకితమయ్యేటట్లు చేసింది. ఆయన ఇలా అన్నారు, "స్వాగతం గణేశన్! మీరు మీ స్వగృహమైన ఇచ్చటకు తిరిగి వస్తారని మాకందరకు తెలియును. అరుణాచలమే మన స్వగృహము. భగవానే మన తల్లి. అరుణాచలమును, భగవాన్‌ను ఒకటే కోరిక కోరండి, "నాకు ఆత్మ సాక్షాత్కారమును ప్రసాదించండి", అని మీరేది అడిగినా వారు ఇస్తారు. కానీ మీరు ప్రాపంచికమైన విషయములను కోరవద్దు. ఆయన గొప్పదాత భార్య, గృహము, సంపద, పలుకుబడి, సాంఘిక ఔన్నత్యము ఏదికోరినా, ఆయన తప్పకవాటిని మీకు ఇస్తారు. చాలా ఎక్కువ మోతాదులోనే ఇస్తారు. కానీ అపుడు మిమ్ములను అరుణాచలమునకు దూరముగా పంపివేస్తారు. కానీ ఆత్మసాక్షాత్కారమును తప్ప మరి దేనినీ మీరు కోరకుండినట్లైతే, ఆయన మిమ్ములను ఇచటనే నిల్పివైచి, తనను తానే మీకు ఇచ్చుకుంటారు. అరుణాచలమంటేనే ఆత్మసాక్షాత్కారము. జ్ఞానము యొక్క శిఖరాగ్రము. స్వగృహమునకు మీకు స్వాగతము, గణేశన్! సంతోషంగా ఉండండి" ఈ మాటలు అన్నది ఎవరు? ఒక అసాధారణ వ్యక్తి, ఒక మేధావి, ఒక విద్యావంతుడు, ఒక పాశ్చాత్యుడుకాదు. అరుణాచలము నందు కదలకుండా స్థిరముగా ఉండి, అరుణాచలమును స్థిరముగా తన హృదయములో ప్రతిష్ఠించుకున్న వారు. నిజానికి పైన చెప్పిన వన్నీ ఆయనకు చెందుతవి ఈ అద్భుతమైన పలుకులను మన హృదయాలలో భద్రపరచుకొనవలెను. మహాత్ముల పలుకులు అన్నివేళలో, అన్ని పరిస్థితులలోనూ, అందరికీ సత్యమై నిలుస్తవి.

ఆర్థర్ ఆస్‌బోర్న్ ఎవరు? ఆయన 1906లో లండన్‌లో జన్మించారు. ఆయన తండ్రి, ఒక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు. ఆయన తల్లి సామాన్యంగా ఉండే, కవిత్వమన్నా, తోటపని అన్నా ఆసక్తి కలిగి ఉండే, ఒక భక్తి పరురాలైన పుణ్యస్త్రీ. ఈ రెండు లక్షణములనూ, తల్లినుండి పుణికి పుచుకున్నారు ఆస్‌బోర్న్. ఆయన తన జీవితం మొత్తమూ, తోటమాలిగా, వ్యవసాయదారునిగా ఉండాలని కోరుకున్నారు. కానీ ఆయన తండ్రి ఆయనను ఆక్స్‌ఫర్డ్‌లో జేర్చారు. ఆయన ఎంతో ఉజ్వలమైన ప్రతిభనుచూపి పది బంగారు పతకములతో బయటకు వచ్చారు. ఆయన తన తల్లి తండ్రుల ఆశయలను నెరవేర్చారు – కానీ జీవితమంతా, కవిత్వము అన్నా తోటపని అన్నా ఎంతో మక్కువ కలిగి ఉండేవారు. భగవాన్ ఎదురుగా ఉన్నపుడు జరిగినవి తప్ప, మిగిలిన ఆధ్యాత్మిక అనుభవముల నన్నిటినీ, ఆయన తన తోటలోనే పొందారు. బాల్యమునుండి, జీవితము యొక్క అర్థము, పరమార్థము ఏమిటని, జీవితములో సాధించవలసిన ఉన్నతమైన గమ్యము ఏది? అని ఆయన అన్వేషిస్తూ ఉండేవారు. పసిబాలునిగా మైదానంలో ఆడుకొంటున్నపుడే, ప్రాపంచిక జీవితం అర్థము లేనిదిగా ఆయనకు అన్పించింది. ఆ భావమును ఎవరితోనూ పంచుకొన లేకపోయారు. "అన్వేషించిన వాడే కనుగొనగలడు", అన్న క్రీస్తు మాటలే ఆయనకు అండగా నిల్చాయి. ఆ వాక్యమే తనను తన జీవితమంతా సత్యాన్వేషకునిగా, నిల్పింది. ఒకానొక సమయంలో, ఆయన, ఫ్రాన్స్ దేశపువేదాంతి అయిన రీనీగ్యునెన్ రచనలను చదవటం తటస్థించింది, అవి ఆయన కెంతో సంతోషాన్ని కల్గించాయి, ఎందుకంటే, ఉన్నది ఒక్కటే అనేదే గ్యూనెన్ బోధ, ఆస్‌బోర్న్ ఆ బోధ నిక్కమైనదని వెంటనే భావించారు. ప్రాపంచిక జీవితము అర్థములేనిది, వ్యర్థమైనది అనే భావన వలన కల్గిన అసంతృప్తి, ఆవేదన తొలగిపోయినవి, జీవితమునకు కూడా ఒక అర్థముఉన్నది. అనే విషయమును గుర్తించుటతోటే. 'ఉనికి ఒక్కటే సత్యము' లేదా సత్యము ఒక్కటే ఉనికి కల్గి ఉన్నది, ఇతరమైనది ఏదీ లేదు అనినట్లైతే, నేను కూడా ఆ సత్యమే తప్ప అన్యము కాదు. తనలోని సత్యాన్ని గుర్తించాలంటే, తానూ ఆ పరమాత్మ కంటే భిన్నంగా లేననీ, పరమాత్మగానే ఉన్నాననీ గుర్తించటమే, అదే ఆయన అన్వేషణకు ప్రారంభము. ఆ అన్వేషణనుండి, ఆయన ఎన్నడూ వైదొలగలేదు. ఇదంతా కూడా, ఆస్‌బోర్న్, భగవాన్ గురించి తెలుసుకొనక ముందే జరిగింది.

పిమ్మట ఆయన లూసియాను కలుసుకున్నారు, ఆమెను ప్రేమించి వివాహమాడారు. ఆమె కూడా సత్యాన్వేషి అగుటవల్ల, వారిరువురి జీవితాశయములు ఒకే విధంగా ఉండటం జరిగింది. రీనిగ్యూనెన్ వారిని, వేరొక గురువు వద్దకు పంపారు. ఆయన ఏవో మంత్రములను ఉపదేశించి, వాటిని తీవ్రంగా జపించమని చెప్పారు. వారెంతో శ్రద్ధతో ఆ సాధన కొనసాగించారు. ఆ సమయంలోనే, సాధకుడేగాక, మేధావి, విద్యావేత్త అయినందువలన, ఆస్‌బోర్న్, సూఫీమతము, బౌద్ధమతము, క్రైస్తవమతము, వేదాంతములలో చెప్పబడిన సిద్ధాంతములనన్నిటిని, అధ్యయనము చేయుటయేగాక సాధన కూడా చేసి వానిలోని వేదాంత సారాన్ని లబ్ధిపొందారు. ఈ సాధన అంతా, ఆయనను గమ్యం చేరుకొనడానికి ఎంత చక్కగా సిద్ధం చేసిందో చూడండి.

పిమ్మట ఆయనకు థాయ్‌లాండ్ లోని బ్యాంకాక్ యూనివర్సిటీలో, ఉద్యోగము లభించగా, తన భార్యతోనూ, ముగ్గురు బిడ్డల తోనూ అక్కడికి వెళ్ళారు. ఆయన ఎక్కడకు వెళ్ళినప్పటికి రీనిగ్యునెన్‌కు చెందిన సంఘంతో అనుబంధం కలిగి ఉండేవారు. ఆ సంఘ సభ్యులలో ఒకరైన డేవిడ్‌మెక్లైవర్, ఆయనకు భగవాన్ ఫోటో ఒకటి, రెండు పుస్తకములు పంపించారు. రమణ మహర్షి ఎవరికీ, దీక్ష ఇచ్చుటగానీ, ఎవరినీ శిష్యునిగా స్వీకరించుట గానీ చేయనందున, ఆయన గురువు కారు అని హెచ్చరించారు. కానీ, ఆర్థర్, లూసియా ఆస్‌బోర్న్‌కూడా, భగవాన్ ఫోటో చూసి, ప్రభావితులై, భారత దేశమునకు వెళ్ళి, రమణమహర్షిని కలుసుకొన వలెననే కోరికతో ఉన్నారు.

అది మండు వేసవి కావున వారు కాశ్మీర్ వెళ్ళారు. అక్కడ మెక్లైవర్ వారిని కలిశారు. ఆయనకు రమణాశ్రమమునకు ఎదురుగా ఒక కుటీరము ఉన్నది. అదృష్టవశాత్తూ, శ్రీమతి ఆస్‌బోర్న్‌ను, ముగ్గురు బిడ్డలను డేవిడ్ తన గృహమునకు ఆహ్వానించి, తిరువణ్ణామలైకు తీసికుని వెళ్ళారు. ఆస్‌బోర్న్ బ్యాంకాక్‌కువెళ్ళినపుడు రెండవ ప్రపంచ యుద్ధము మొదలైంది. జపాన్ దేశము వారు ఆస్‌బోర్న్‌ను బందీని చేసి జైలులో ఉంచారు. మూడున్నర సంవత్సరముల పాటు ఆయన జైలులో ఉన్నారు. ఆర్థర్ ఆస్‌బోర్న్ కున్న ఒకే ఒక ఉపశమనము, భగవాన్ ఫోటో, ఆయన రెండుపుస్తకములు. జపనీయులు, ఆయనను బందీగా తీసుకుని వెళ్ళుటకు విశ్వవిద్యాలయమునకు వచ్చినపుడు, ఏదో శక్తి ఆయనను ఈ మూడు వస్తువులనూ తన వెంట తీసికుని వెళ్ళవలసినదిగా ప్రేరేపించింది. "బందీగా కాంప్‌లో ఉన్నపుడు ఆయన ఒక చక్కని ఉద్యానవనమును పెంచారు. ఆయన వ్యక్తిత్వము, ఆయన మాటలు అక్కడ ఎంతో మందిని ఆకర్షించినవి, వారిలో లూయిస్‌హర్ట్స్ ఒకరు. ఆయన రెండవ ప్రపంచ యుద్ధము తర్వాత భగవాన్ వద్దకు వచ్చారు.

ఎక్కడో దూరంగా, తిరువణ్ణామలైలో ఉన్న శ్రీమతి ఆస్‌బోర్న్, అప్పటికే భగవాన్ దర్శనమును పొందారు. ఆమె భగవాన్ కనులవైపు చూడగానే, ఆయన ఏకాగ్రతతో ఆమెపై దృష్టిని నిలిపారు. ఆమె సంపూర్ణంగా మార్పు చెందారు. భగవాన్, శ్రీమతి ఆస్‌బోర్న్‌పట్ల, ఆమెబిడ్డల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ చూపేవారు. జైలులో ఉన్న ఆమె భర్తకు, భగవాన్ కనులు పసిబిడ్డ వంటి అమాయకత్వమును, ఒక మహర్షికి ఉండే అంతులేని ప్రేమనూ, అపారమైన జ్ఞానాన్నీ కలిగి ఉంటాయని శ్రీమతి ఆస్‌బోర్న్ తన లేఖలో వర్ణించారు. అంతలో వారి బిడ్డలు భగవాన్‌ను ప్రార్థించారు. "భగవాన్! మేము మాతండ్రిగారికి ఉత్తరములు వ్రాస్తున్నాము. కానీ ఆయన జీవించి ఉన్నారో లేదోమాకు తెలియదు. దయచేసి ఆయన సజీవులుగా ఉండి, త్వరలో మావద్దకు వచ్చేటట్లు చెయ్యండి", అని.

తాను జైలులో ఉన్నపుడు ప్రముఖులైన ఆంగ్లేయులను, బందీలుగా ఉన్నవారిని, కొన్ని కొన్ని సార్లు దూరముగా తీసికుని వెళ్ళి చంపివేసేవారని ఆస్‌బోర్న్ నాతో చెప్పారు. ఆస్‌బోర్న్‌ను తీసికొని వెళ్ళుటకు ప్రత్యేక బలగము వచ్చినపుడు, అందరూ ఆయనను కాల్చివేస్తారనే భావించారు. (తుపాకితో). ఆస్‌బోర్న్ ఈవిధంగా చెప్పారు. "నేను ఆఖరుగా చూసింది భగవాన్ ఫోటోను, ఆ రెండు పుస్తకములను. నేను ఆ తుపాకీలతో పేల్చే దళము ఎదురుగా తీసికుని వెళ్ళబడినపుడు, నేను కనులుమూసుకున్నాను. నేను భగవాన్‌ను ప్రార్థించలేదు, కానీ, భగవాన్ చిత్రము నామనసులోనికి వచ్చింది. ఏదో తెలియని కారణముతో వారు నన్ను కాల్చకుండా రాజకీయ ఖైదీలుండే శిబిరానికి నన్ను పంపించారు.

ఆయన అక్కడ బాధలు పడుతుండగా, ఆయన బిడ్డలు, తమ తండ్రి క్షేమంగా తిరిగి రావాలని భగవాన్‌ను ప్రార్థిస్తుండేవారు. యుద్ధము ముగిసేవరకూ, భగవాన్ ఏవిధమైన సమాధానమూ ఇవ్వలేదు. మొదటి సారిగా నలుబదిమంది ఖైదీల బృందమును విడుదల చేసినపుడు, భగవాన్, "అవును, ఆడమ్ తండ్రిగారు, వెనుకకు వస్తున్నారు", అని ఆస్‌బోర్న్ కుమారుడు ఆడమ్‌ప్రార్థనకు బదులిచ్చారు. ఆస్‌బోర్న్, ఖైదీలశిబిరములో అనుభవించిన చిత్రహింస వలన, మానసికంగా కృంగిపోయి ఉన్నారు. మేధావంతులను మేధాపరంగా నిర్వీర్యము చేయుట కొరకై వారిని మానసికంగా అమితంగా బాధించే వారు ఆ శిబిరములో, ఆస్‌బోర్న్‌రైలులో వస్తున్నారని విన్నపుడు, భగవాన్‌లో కనపడిన ఆదుర్దా చూసి, ఆయన పరిచారకుడైన టి.పి. రామచంద్రఅయ్యర్ "నేను కూడా వెళ్ళనా?" అని అడిగారు. "అవును మీరు కూడా వెళ్ళండి", అని బదులిచ్చారు భగవాన్, ఆస్‌బోర్న్ వెనుకకు తీసుకుని రాబడినపుడు, భగవాన్ ప్రతినిధి కూడా అక్కడ ఉన్నారు. ఆస్‌బోర్న్ తన దుర్బల మానసికస్థితిలో కేవలము తన

భార్యను మాత్రమే గుర్తించ గలిగారు. ఆమె దుఃఖిస్తూ భగవాన్ వద్దకు వచ్చారు. భగవాన్ ఆమెతో, దయచేసి, ఆస్‌బోర్న్‌ను ప్రతిదినము ఉదయము, సాయంత్రము ఇచ్చటకు తీసికుని వచ్చి, నేను ఆయనను చూడగలిగే విధంగా కూర్చోబెట్టండి. ఆస్‌బోర్న్ పూర్తిగా స్వస్థత చెందేవరకు, ఆపైన గూడా, ఆవిధంగానే జరిగింది. ఆస్‌బోర్న్ "నేను ఆయనకు కనిపించే విధంగా కూర్చునేటట్లు భగవాన్ శ్రద్ధవహించేవారు. ఒకరోజు ఇద్దరు ముగ్గురు వ్యక్తులు, నాకు, భగవాన్‌కు మధ్య కూర్చొనగా, భగవాన్ వారిని వేరొక చోట కూర్చుండ మని చెప్పి, తాము నన్ను చూచుటకు అవకాశం ఉండేట్లు చేశారు. ఆయన అలా చెప్పటము సామాన్యంగా జరిగే విషయము కాదు." అని నాతో చెప్పారు.

ఏమైనప్పటికి మొదటి రోజునే భగవాన్ తానేమిటో ఆస్‌బోర్న్‌కు విశదపరచలేదు. కొన్ని రోజుల పిమ్మట, ఏదో ఉత్సవ సమయంలో, భగవాన్ తన దృష్టిని ఆస్‌బోర్న్‌పై ఏకాగ్రపరచారు. ఆస్‌బోర్న్‌లో బలవత్తరమైన మార్పు సంభవించింది. దానిని ఆస్‌బోర్న్ ఈవిధంగా వర్ణించారు. "భగవాన్, నా ఎదురుగా కుర్చున్నారు. ప్రకాశవంతమైన ఆ కనులు నన్ను నిశితంగా చూస్తున్నాయి. ఆ చూపు, శక్తివంతంగా, వర్ణించలేని విధంగా నాలోనికి చొచ్చుకుని పోయింది. అపుడు అంతరంగంలో, ఒక ప్రశాంతత, గాఢమైన శాంతి, తేలికదనము, ఆనందము వర్ణింపశక్యము గాని విధంగా (ఉత్పన్నమైనాయి) కలిగాయి." పుస్తకములో ఈ విధముగా వ్రాయబడినది. ఆర్థర్ ఆస్‌బోర్న్ స్వయంగా నాతో చెప్పిన దేమిటంటే, రెండు అత్యంత ప్రకాశవంతమైన దీపాలు (సెర్చ్‌లైట్లు) నాలోనికి ప్రవేశించినవి. అవి నా శరీరములోని ప్రతి జీవకణమును, దివ్యత్వముతో నింపివేసినవి. అదే నాకు మొదటి దీక్ష, మొదటి సాక్షాత్కారము కూడా.

ఈ అనుభవము తర్వాత, సద్గురువు యొక్క ఆశీర్వాదము, అనుగ్రహము ఎటువంటిదో అవగాహన అవటం ప్రారంభమైంది. ఈదృక్ దీక్ష ఆయనలో నవ జీవాన్ని నింపి, భగవాన్ సూటి బోధ అయిన ఆత్మవిచారణను అనుసరించేలా చేసింది. మేధాపరమైన ఆయన స్వభావము, ఈ అన్వేషణకు పూర్తిగా అనుకూలమైనది భగవాన్ సదా ఆయనపై ప్రేమను, అనుగ్రహమును వర్షిస్తుండేవారు. ఆస్‌బోర్న్ అత్యంతశ్రద్ధతో, క్రమం తప్పక ప్రతి ఉదయము, భగవాన్ వద్దకు వెళ్తూ, సాధనలో హృదయంలోనికి, మరింత లోతులలోనికి వెళ్తుండేవారు. బాహ్యగురువు యొక్క ఒకే ఒక బాధ్యత అంతరంగములోని గురువును ఎరుక పరచుట యేనని, భగవాన్ చెప్పుటకు అర్థమేమిటో అప్పుడాయనకు పూర్తిగా అవగాహనకు వచ్చింది. ఆయన భగవాన్ వద్దకు వచ్చినపుడు మెక్లైవర్, మరల ఆయనకు, భగవాన్ గురువుకాదు. ఆయన ఎవరికి దీక్ష నివ్వటముకానీ, ఎవరినీ శిష్యులుగా అంగీకరించుటగాను చెయ్యరని చెప్పారు. భగవాన్ గనుక గురువు కానట్లైతే, గురువు అనే పదమునకు అర్థమేలేదని పించింది ఆస్‌బోర్న్‌కు ఇప్పుడు. భగవాన్ చూపు (దృష్టి) ద్వారా ఆయనకు దీక్షను ఇచ్చారు. అది ఆయనను పూర్తిగా మార్చివేసి శిష్యునిగా చేసింది. అందుకని భగవాన్‌కు శిష్యులు లేరనే ప్రసక్తి లేదు.

నిరంతరమైన ఆత్మవిచారణము, "ఆత్మ, బాహ్యములో భగవాన్ రూపములోనూ, అంతరికంగా హృదయంగానూ, ఉన్నదనే ఎఱుకను," ఆయనలో జాగృతం చేసింది. భగవాన్ యొక్క అనుగ్రహము అనబడే మహోజ్వలమైన కాంతిలో, 'భగవాన్ గురువుకాదు', అనే వాదన అంతరించి పోయింది. ఆ దీక్ష, దాని ఫలితములు ఆయన ఆధ్యాత్మిక జీవన పథాన్నే మార్చివేసినవి. ఇంతకు పూర్వము అనుసరిస్తున్న సాధనా పద్ధతులను, ఆయన ఇప్పుడు అనుసరించలేక పోతున్నారు. దీనివలన స్వల్పంగా కలత చెందిన ఆస్‌బోర్న్, వాటిని పూర్తిగా విడిచి పెట్టుటకు, భగవాన్ అనుమతిని కోరారు. ఇతరమార్గములన్నీ ఆత్మవిచారణకే దారితీస్తవి కనుక, వాటిని నిరభ్యంతరంగా ఇపుడు వదలి వేయవచ్చని అంటూ, భగవాన్ తన సమ్మతిని తెలియ జేశారు.

అంతిమ నిర్ణయం తీసికొన వలసిన సమయం ఆసన్నమైంది. ఆస్‌బోర్న్, భగవాన్‌తో ఉంటున్నారు. యుద్ధ ఖైదీలుగా తీసికొనబడి, తర్వాత విడుదల కావించబడి ప్రస్తుతము భారతదేశములో ఉంటున్న ఆంగ్లేయులకు, వారిస్వదేశమైన బ్రిటన్‌లో, సకల సౌకర్యములతో కూడిన ఆవాసము కల్పించబడుతుందని, ఆంగ్ల ప్రభుత్వము ప్రకటించింది. బ్రిటిష్ హై కమిషనర్, దానిని గురించి, ఆస్‌బోర్న్‌కు లేఖవెంట లేఖ వ్రాయసాగారు. వారు ఈ లేఖలను భగవాన్‌కు చూపను కూడా లేదు. ఆయన అభిప్రాయమును తెలుసుకొనుటకై ప్రయత్నించలేదు. భగవాన్‌ను వదలి ఎక్కడకూ వెళ్ళేప్రసక్తే లేదనే దృఢ నిశ్చయంతో

ఉన్నారు వారు. బ్రిటన్‌కు వెళ్ళటకు, ఆఖరి ఓడ, ప్రయాణమౌతుండగా బ్రిటిష్ హైకమిషనర్, వారిని జాగరూకులను చేయుటకు టెలిగ్రామ్ పంపారు. ఈ టెలిగ్రామ్‌ను భగవాన్‌కు చూపాలనే ఆలోచన కూడా తమకు కలుగలేదని, ఎందుకంటే, భగవానే తమకు రక్షణ, ఆశ్రయము అనీ, భగవాన్ వద్ద ఉండుటకంటే భిన్నమైన ప్రాపంచిక జీవితమేదీ లేదనీ వారికి ఏనాడో నిశ్చయంగా తెలిసిపోయింది కనుక. కానీ ఆస్‌బోర్న్ గృహస్థుడు కనుక కొద్దిగా ధనము సంపాదించవలసిన అవసరము ఉన్నది. కావున ఆయన చెన్నైలోని ఒక ప్రముఖ దినపత్రికకు సంపాదకునిగా చేరారు. అతనికి వెళ్ళాలని లేకపోయినా వెళ్ళక తప్పలేదు. ఆయన చెన్నైకు వెళ్ళేముందు ఆయన స్నేహితుడొకరు భగవాన్ యొక్క ఆయిల్ పెయింటింగ్‌ను ఆస్‌బోర్న్‌కు యిచ్చారు. ఆఫోటోను ఆయన భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళారు. భగవాన్, ఆ పటమును చేత నుంచుకుని, "ఆస్‌బోర్న్ స్వామిని తనతో తీసికొని వెళ్తున్నారు," అన్నారు. అది మిగిలిన అన్ని ఫోటోలకంటే, తనను సద్గురువు చూపే ప్రేమ, కరుణలతో తనవైపు చూస్తున్నట్లు ఉండేదనీ, ఆస్‌బోర్న్ నాతో చెప్పారు. ఆయన గదికి అలంకారముగా ఆఫోటో ఉండేదనీ, ఏదైనా నిర్ణయము తీసికునే ముందు, ఆ ఫోటో వైపు చూచి, ఆ తర్వాత మాత్రమే నిశ్చయించుకునే వాడినని ఆయన తెలిపారు.

ప్రతి సెలవుదినమున, ఖాళీగా ఉన్న రోజున, భగవాన్‌ను, తన కుటుంబమును కలసి కొనుటకై ఆయన వచ్చినపుడు భగవాన్ ఆయనపై ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచేశారు. ఒకసారి, భగవాన్‌కు రెండవ సారి శస్త్రచికిత్స జరిగిన తర్వాత, అనుకోకుండా, ఆస్‌బోర్న్ తన స్నేహితుని కారులో, అక్కడకు వచ్చారు. భగవాన్ వైద్యశాల వరండాలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సాధారణంగా తన అనుగ్రహమును భగవాన్ బాహ్యంగా (వ్యక్తీ కరించరు) వ్యక్తపరచరు. కానీ అనుకోకుండా వచ్చిన ఆస్‌బోర్న్ చూసి, భగవాన్ దొరికిపోయారు. ఆస్‌బోర్న్‌ను చూసి, ఆయన ముఖం, ప్రేమతోనూ, సంతోషంతోనూ, విప్పారింది. భగవాన్, ఆస్‌బోర్న్‌ను వర్ణనాతీతమైన ప్రేమతోనూ, అనుగ్రహంతోనూ చూశారు. ఆస్‌బోర్న్ వెనుక నుంచుని ఉన్న శ్రీమతి ఆస్‌బోర్న్, బోస్, భగవాన్ ఆవిధంగా ఎవరినైనా చూడటము తామింత వరకూ చూడలేదనుకున్నారు. ఆస్‌బోర్న్, తనలో గొప్ప మార్పు సంభవించి నట్లుగా భావించారు. భగవాన్ అంత అనుగ్రహంతో తనను ఆదరించటం ఆస్‌బోర్న్ హృదయాన్ని ద్రవింపజేసింది. తాను చేసిన స్వల్ప ప్రయత్నమునకు, అంతగొప్ప బహుమానమును పొందట మనేది ఆయనలో కృతజ్ఞతా భావాన్ని, ఆయన అనుగ్రహమునకు తగినంత ప్రయత్నమును తాను చెయ్యలేదు గదా అనే అపరాధ భావాన్ని కల్గించింది. దాని వలన ఆ అద్భుతమైన శిష్యుడు, ఆయన సద్గురువుల మధ్య అనుబంధం మరింత దృఢతరమైంది.

ఆస్‌బోర్న్, లోతుగానూ, స్థిరంగానూ, హృదయంలో స్థిరపడేటట్లు భగవాన్ తన అనుగ్రహమును ప్రసరిస్తూనే ఉన్నారు. బాహ్య గురువు ధ్యేయం అంతర గురువును జాగృత పరచుటయే, భగవాన్ నిర్యాణము చెందిన రోజున, ఆస్‌బోర్న్ అచటనే ఉన్నారు. అది ఆయనలో విచారమును నింపలేదు. పైపెచ్చు, ఆయన హృదయములోనికి చొచ్చుకుని పోయేటట్లు చేసింది, ఆస్‌బోర్న్ ,భగవాన్ అనుగ్రహమును మరింత పుష్కలంగా, ఆయన సహకారమును మరింత శక్తివంతంగా పొందినట్లు భావించారు. నిర్యాణమైన కొన్నిదినముల తర్వాత, భగవాన్ ఆయనకు స్వప్నంలో కనిపించారు. ఆ స్వప్నంలో, ఆస్‌బోర్న్ పాతహాలులో ఉన్నారు. భగవాన్ ఆయనను తన శయ్యకు దగ్గరగా రమ్మని పిలిచారు. ఆస్‌బోర్న్ భగవాన్ సమీపమునకు వెళ్ళి ఆయన ఎదుట మోకరిల్లారు. భగవాన్ తన చేతిని, ఆశీర్వాద పూర్వకంగా ఆయన తలపై ఉంచారు. భగవాన్ ఆయన చేతిని, తన శిరసుపై ఉంచినపుడు, ఆయన సూటి బోధను గురించి వ్రాయమని తనకు చెబుతున్నట్లుగా, ఆస్‌బోర్న్‌కు అనిపించింది. ఆయన అప్పుడు ఏడు వ్యాసములను వ్రాశారు. అవి తర్వాత, 'రమణ అరుణాచల' అనే పేరుతో ఒక గ్రంధంగా వెలువడినవి, ప్రతిసాధకుడు, మనలో ప్రతిఒక్కరూ చదువ వలసిన గ్రంథమిది, అదిప్రారంభము. అచిరకాలంలోనే ఆస్‌బోర్న్ కలంనుండి, ఒక ప్రవాహమువలె పుస్తకములు వెలువడ నారంభించాయి. 'రమణ మహర్షి అండ్ ది పాత్ ఆఫ్ సెల్ఫ్ నాలెడ్జ్,' (ఆత్మ జ్ఞాన మార్గము) 'కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ రమణ మహర్షి, (రమణ మహర్షి రచనల సంగ్రహము), 'ది టీచింగ్ ఆఫ్ మహర్షి ఇన్ హిజ్ ఓన్ వర్డ్స్' (ఆయన మాటలలోనే రమణులబోధ), ది ఇన్‌క్రెడిబుల్‌సాయి బాబా, ది రిధిమ్ ఆఫ్ హిస్టరీ, 'బుద్ధిజమ్ అండ్ క్రిస్టియానిటీ ఇన్ ది లైట్ ఆఫ్ హిందూయిజమ్', హిందూ మతము వెలుగులో బౌద్ధ మతము, క్రైస్తవ మతము, గౌతమ, దిబుద్ధ, క్వశ్చన్ ఆఫ్ ప్రోగ్రెస్, మరి కొన్ని ఇతర గ్రంధములు.

కొన్ని సంవత్సరములు చెన్నైలో పనిచేసిన తర్వాత, ఆస్‌బోర్న్ 1952లో కలకత్తాలో ఉద్యోగము చెయ్యవలసి వచ్చింది. సెలవు దినములలో కలకత్తా నుండి, భగవాన్ సమాధి వద్ద గడుపుటకు అరుణా చలమునకు వచ్చేవారు, ఆస్‌బోర్న్, కలకత్తాలో ఉండగా, ఆస్‌బోర్న్, రెండవసారి జాగృతమగుట (చైతన్యమును అనుభవించుట) జరిగింది. ఈ విధంగా ఆ అనుభవమును ఆయన వర్ణించారు. "నేను ఒంటరిగా, కలకత్తాలోని నాగదిలో ఉన్నాను. 'నేను' కేవలం (ఆత్మగానే) హృదయం గానే, అనాది ఐన, ఏవిధమైన మార్పులేని ఆత్మగానే ఉన్నాను. ఏ విధమైన ఉత్సాహమూ, సంతోషము, మైమరపులేదు. ఆసాధారణ సంపూర్ణత్వములో, విసుగు చెందుట అనే పదమునకు తావులేదు. ఆత్మ లేదా చైతన్యమును, కప్పివేసిన నల్లని తెరవంటి మనసు, చుట్టగా చుట్టి అవతలకు నెట్టి వేయబడినది. మనసే ఎల్లవేళలా, ఏదో ఒక కార్యక్రమములను కోరుతూ, అవి దొరకనపుడు, విసుగు జెందుతూ ఉంటుంది. ఆత్మ ఏకార్యకలాపముల వల్లనూ ప్రభావితముగాక, తన యొక్క స్వచ్ఛమైన సహజమైన ఆనందములో స్థిరమై ఉంటుంది. ఆ అనుభవం ఎంతకాలము ఉండినదో నాకు తెలియదు. ఏమైనప్పటికి ఆ అనుభవము సంభవించినపుడు, అది కాలాతీతమైనదీ, శాశ్వతమైనదీగూడా, కనిపించని విధంగానే, మనసు తిరిగి వెనుకకు వచ్చిందిగానీ, ఇదివరకు ఉన్నంత దట్టంగా చెతన్యమును కప్పి వేయలేదు. తర్వాత కూడా, ఆ ప్రకాశము కొన్ని వారముల పాటు నిలచి, నెమ్మదిగా కనుమరుగైంది.

ఆయన కలకత్తాలో ఉంటున్నపుడు, ఆయన స్నేహితులందరూ, షిర్డీ సాయిబాబాను గురించి మాట్లాడుతూ ఉండేవారు. బాబాగురించి ఒకటి రెండు రచనలను ఆయన చదివారు. ఆయన స్నేహితులు కొందరు ఆయనను, సాయిబాబాపై ఒక వ్యాసమును (రచనను) చెయ్యమని కోరారు కానీ, ఆయన నిరాకరించారు. ఆ రోజురాత్రి భగవాన్, ఆయన కలలో కనిపించి సాయిబాబాపై రచన చెయ్యమని ఆజ్ఞాపించారు. తనకు సాయిబాబా గూర్చి పెద్దగా తెలియదని ఆస్‌బోర్న్, స్వప్నంలోనే భగవాన్ ముందు చెప్పారు. భగవాన్ అపుడు ఆయనను సాయిబాబా గుడికి వెళ్ళమని, సాయిబాబా తనంతతానుగా, ఏమివ్రాయలో తెల్పెదరనీ అన్నారు, సాయిబాబా గురించి పాశ్చాత్యులకు తెలియవలెను. అందుకని మీరే వ్రాసి తీరాలి అన్నారు. ఆ స్వప్నమే ఆయనను షిర్డీకి వెళ్ళి, 'ది ఇన్‌క్రెడిబుల్‌సాయిబాబా' అనే పుస్తకము వ్రాయుటకు కారణమైనది.

1958లో ఆయన తిరిగి తిరువణ్ణామలైకు వచ్చి, తిరిగి ఆ ప్రదేశమును వీడలేదు. నాకు 1960లో ఆయనతో దాదాపు నిరంతరము ఉండే ప్రత్యేక అవకాశము లభించింది. భగవాన్ వలననే మేమిద్దరము చేరువైనాము. ఆస్‌బోర్న్ ఎప్పుడూ నా పట్ల అప్యాయతతో ఉండేవారు. 1950లో ఆయన 'రమణ మహర్షి అండ్ దిపాత్ ఆఫ్ సెల్ఫ్ నాలెడ్జ్' అనే గ్రంధమును వ్రాసినపుడు, 17 మంది సభ్యులుకల ఆశ్రమ కమిటీ, ఆ గ్రంధమును ప్రచురిస్తామన్నారు. చివరి నిముషంలో వారు వెనుకంజ వేశారు. ఆస్‌బోర్న్ చాలానిరుత్సాహ పడ్డారు. ఆయన కమిటీ వారితో సమావేశమై బయటకు వచ్చినపుడు, టి.కె. సుందరేశ అయ్యర్, నేను అక్కడ ఉన్నాము. ఆ గ్రంధము భారతదేశమునకు వెలుపల ప్రచురితమైతే, అది ఇంకా ఎక్కువ మంది సాధకులకు అందుబాటు లోనికి వస్తుందేమోననేది, భగవాన్ భావన అయి ఉండవచ్చునని మేమిద్దరము ఆస్‌బోర్న్‌తో అన్నాము. ఆ ప్రకారంగానే, ఆయన ఆ వ్రాత ప్రతిని, లండన్‌లోని 'రైడర్ అండ్‌కో' వారికి పంపగా, వారు ఆ గ్రంధమును ప్రచురించారు.

1963లో ఆశ్రమము ఆర్థిక దుస్థితి వలన క్లిష్టపరిస్థితిలో ఉన్నది. ఆశ్రమము సంక్షోభంలో ఇరుక్కున్నది. సుందరేశ అయ్యర్‌తోపాటు నేను కూడా ఆశ్రమ ఉత్తర ప్రత్యుత్తరములను జరుపుతుండే వాడిని. ఇంకా ఆశ్రమము కొనసాగుతున్నదా? భగవాన్ బోధ అనుసరింప బడుతున్నదా? (అమలులో ఉన్నదా?) అని చాలా మంది ఉత్తరములు వ్రాస్తుండేవారు, నేను ఇంతకు పూర్వము ముంబైలో పని చేస్తున్నపుడు, ఒక పత్రికను గనుక నడిపినట్లైతే, దానిలోని కంపెనీల నుండి ప్రకటనల ద్వారా, కొంత ధనమును సేకరించ వచ్చునని తెలిసింది. ఒక సాంవత్సరిక పత్రికను ప్రారంభించినట్లైతే, తద్వారా ఆశ్రమము గురించిన సమాచారమును తెలియజేయుట, బోధను వ్యాప్తిచెందించుట, నిధులు సమకూర్చుకొనుట అను వివిధములైన ప్రయోజనములు నెరవేరుతవని నాకు అన్పించింది. ఆస్‌బోర్న్ ప్రతిభా వంతుడైన రచయిత, స్నేహితుడుకావున, ఆయనను భాషలోని తప్పొప్పులను సరిచెయ్యమని, పత్రిక నిర్వహణలో తోడ్పడమని, నేను కోగవచ్చుననుకున్నాను. నేను ఆస్‌బోర్న్

గృహామునకు వెళ్ళి, ఒక సాంవత్సరిక పత్రికను గనుక నడిపినట్లైతే, ఆశ్రమమునకు ఆర్థిక వెసులుబాటు కలుగుటయేగాక, భక్తులకు ప్రస్తుత, ఆశ్రమ కార్యకలాపములను గురించి తెలియజేయవచ్చునని వివరించాను. నేను ఆయన ఆశీస్సులను, చక్కటి సహకారమును అందించమని కోరాను. ఆయన చాలా శ్రద్ధగా విని, చివరలో నా చేతులు పట్టుకుని, ఆనందబాష్పాలను రాల్చారు. ఆయన అంతగా ఉద్వేగంతో ఉండటం నేనెప్పుడూ చూడ లేదుకనుక, నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆయన, నాతో, "గణేశన్! మీరెటువంటి భాగ్యమును ఇవాళ నాకు కల్గించారో మీకు తెలియదు. కొద్ది వారముల క్రిందట, నాకలలో భగవాన్ కనిపించారు. నేను ఆయనకు మోకరిల్లినపుడు ఆయన ఏదో ఒక పత్రిక కాపీలను కొన్నిటిని నాచేతికి ఇచ్చి, తీసికొనమన్నారు. నేను ఆయన నన్ను సంపాదకునిగా ఉండమని చెబుతున్నారని అర్థము చేసికున్నాను. నేను నా సద్గురువు ఆజ్ఞను పాటించవలెను. ఏ భారతీయ పత్రికకు నేను పనికి వస్తాను? మా అన్నగారు ఒక ప్రముఖ బ్రిటిష్ ఆంగ్ల పత్రికకు సంపాదకులు. నేను ఆయన వద్ద ఉద్యోగములో చేరవలెనా? నాకు అరుణాచలమును వీడి వెళ్ళవలెనంటే బాధకలుగుతుంది. కానీ భగవాన్ ఉద్దేశము అదే అయితే, నేను అరుణాచలమును వీడుటకు గూడా సిద్ధమే. నాకిపుడు, భగవాన్ ఉద్దేశము తెలిసింది. ఎంత సంతోషకరమైన విషయమిది.

ఆస్‌బోర్న్, చాలా ఉత్సాహంగా కొనసాగించారు. "గణేశన్! నీకు తెలుసా? భగవాన్ జీవించి ఉన్నపుడు, ఆ పిమ్మట కూడా చాలామంది నన్ను ఒక ఆశ్రమ పత్రిక నడపించమని కోరారు. నేను పదే పదే తిరస్కరించాను. భగవాన్ బోధ ఆచరణ కొరకేనంటూ. అది చాలా క్లుప్తమైనది, సంగ్రహమైనది.దానిని గురించి వరుసగా నెలల తరబడి వ్రాయుట కష్టము. భక్తులను నిరుత్సాహ పరచానని తెలుసును, కానీ నేను ఆ విషయంలో స్థిరంగా ఉన్నాను, కానీ భగవాన్ తన ఆత్మవిచారణ మార్గమును ఈ పత్రిక ద్వారా, వ్యాప్తి చెందించమని ఆజ్ఞాపించారు. కావున గణేశన్, మనము ఆ పనిని ప్రారంభించ బోతున్నాము", ఆయన ఉత్సాహము చూసి నాకు సంతోషము వేసింది. ఆ పత్రిక పేరును ఆయనే నిర్ణయించారు. 'దిమౌంటెన్ పాత్' అని. 'మౌంటెన్' (కొండ) అనునది 'అరుణాచలమును,' 'పాత్' అనునది భగవాన్ యొక్క 'సూటిబోధను సూచించుచున్నవి. (గిరిపధము). అప్పుడు చందా రేటు ఎంత ఉంచాలీ అనే విషయంలో సందిగ్ధంలో పడ్డాము. నమ్మశక్యంకాని విధంగా, కలకత్తాకు చెందిన హెచ్. ఆర్. చద్దా అనే నూతన వ్యక్తి నుండి అయిదు రూపాయలకు మనీ ఆర్డర్ మాకు అందింది. దానిపై "ఆశ్రమ పత్రికకు సాంవత్సరిక చందా పంపబడినది. నా ఉత్తరంలో మరిన్ని వివరాలు తెలియజేయబడును", అని వ్రాసి ఉన్నది, అవును, భగవానే సాంవత్సరిక చందా ఎంత ఉండాలో నిర్ణయించారు. మేమింకా పత్రిక రూపురేఖలు ఎలా ఉండాలో నిర్ణయించు కొనక ముందే. కొన్ని దినముల పిమ్మట చద్దా వ్రాసిన ఉత్తరము అందింది. నాకు ప్రస్తుతము ఆశ్రమముతో ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరములు లేవు. నేను ముప్పదియవ దశకము చివరలో (1930 దశకము చివరలో) భగవాన్‌ను కలుసుకున్నాను. ఆయనే నాగురువు, ఇప్పటికీ, ఆయనే నా సర్వస్వము, మొన్న ఒకరోజున, ఆయన నా కలలో కనబడి, నాకు, ఒక పత్రికను చూపించారు. దానిపై, స్పష్టంగా '5రు' అని ఆ పత్రిక అట్టపై వ్రాయబడి ఉన్నది. నాకు అది ఆశ్రమ పత్రిక అని అనిపించింది. దయచేసి, నన్ను ఒక చందా దారునిగా జేర్చుకొనండి. తర్వాత మరొక భక్తుడు టి.యన్.కృష్ణస్వామి, పత్రికకు జీవిత సభ్యత్వము కొరకు, 100 రూ.లను,చెక్కు ద్వారా ఇచ్చినారు. ఈ విధంగా 'మౌంటెన్‌పాత్' అనబడే ఆశ్రమ పత్రిక ప్రారంభించబడింది. ఆస్‌బోర్న్, నేను, ఆ పత్రిక నిర్వహణలో చాలా సన్నిహితంగా మారాము. ఆయన ఎంతో శ్రమించి పత్రికకు వ్యాసములను సంపాదించేవారు. తాను గూడా, ఎన్నో వ్యాసములను వ్రాసేవారు. ఆశ్రమము కొరకు ప్రకటనల ద్వారా నిధులు సేకరించటానికి చేయబడిన నాప్రయత్నములన్నీ విజయవంతమైనవి.

ఆస్‌బోర్న్‌తో నేను జరిపిన సత్సంగమంతయు తీపి జ్ఞాపకములతో నిండి ఉండేది. ఒకరోజు, నేను ఆయన వద్దకు ఒక వ్యక్తిగత సమస్యతో వెళ్ళాను. నాకొక పీడకల వచ్చి, అందులో ఒక నల్లని దెయ్యము వంటిది నా గుండెలపై కూర్చుని, నాగొంతు నులిమి వెయ్య సాగింది. నేను ఒంటరిగా ఉన్నాను, నాకు ఊపిరి అందటము లేదు. నాకు ఏమి చెయ్యాలో పాలు పోలేదు. నేను భయపడనూలేదు. అది ఏమిటో తెలుసుకోవాలనే కోరికతోనూలేదు. దాని పట్టు అంత కంతకూ బిగుసుకుంటూ, గొంతుచుట్టూ ఇంకా ఎక్కువ బలంగానొక్కసాగింది. నాకు ఊపిరి అందక, నేను చనిపోబోతున్నానుకున్నాను. అంతలో అకస్మాత్తుగా, 'ఓం నమో భగవతే శ్రీరమణాయ' అనే మంత్రము దానంతట అదే, నా హృదయంలో పదే పదే వినిపించ

(ప్రతిధ్వనించ) సాగింది. నిజం చెప్పాలంటే, ఆ రోజులలో నేను, జపం అన్నా, మంత్రములన్నా విశ్వాసము కలిగి ఉండే వాడిని కాదు. ఇది తనకు తానుగా వచ్చింది. 'ఓం నమో భగవతే శ్రీరమణాయ' – భగవాన్ శ్రీమరణ మహర్షికి నావినమ్రపూరిత ప్రణామములు. ఆ నల్లని భూతము వంటిది అంతర్ధానమైనది. నాకు మెలకువ వచ్చినది. అది స్వప్నమో, నా ఊహయో, నిజమో నాకు అర్ధము కాలేదు. నేను పరుగున ఆస్‌బోర్న్ వద్దకు వెళ్ళి, ఆ మొత్తము అనుభవమునూ చాలా వివరంగా ఆయనకు తెలిపాను. అదంతా చాలా శ్రద్ధగా విన్న తర్వాత ఆస్‌బోర్న్, నవ్వుతూ, నా వీపు పై తట్టి, "గణేశన్! ఇది నిజమైన ఆధ్యాత్మిక అనుభవము. మీరు అదృష్టవంతులు. మీకు, ఓం నమోభగవతే శ్రీరమణాయ', అనే మంత్రము ఇవ్వబడినది. దీనినే 'అజపా జపము' అంటారు, నా స్వీయ అనుభవమును గురించి చెబుతాను వినండి", అన్నారు.

భగవాన్ శరీరంతో ఉన్నపుడు, 'రీని గ్యునన్' అనే ఆయన సంఘమునకు చెందిన సభ్యుల మంతా, ఒక శక్తి వంతమైన అయస్కాంతము వైపునకు, ఇనుపరేణువులు ఆకర్షింపబడిన విధంగా, భగవాన్ వైపునకు ఆకర్షింప బడినాము. ఈ సంఘములో డేవిడ్ మెక్లెవర్, ఒక్కరికి మాత్రమే భగవాన్ చెంతనే ఉండి, భగవాన్ పర్యవేక్షణలో, భగవాన్ రచనలను, త్రిపురా రహస్యము, అద్వైత బోధ దీపిక, ఇంకా భగవాన్‌చే సూచించబడిన కొన్ని గ్రంధములను అనువదించే భాగ్యములభించింది, తర్వాత కేరళలోని ఒక యోగి పట్ల ఆకర్షితులైన మెక్లెవర్, ఆ యోగిని, గురువుగా స్వీకరించి, అక్కడే స్థిరపడి పోయారు. నేను అన్నా, నాభార్య అనినా ఎంతోప్రేమ కల్గిన, మెక్లెవర్, మేమిద్దరమూ కూడా, ఆయన గురువు యొక్క శిష్యులుగా జేరాలని గాఢంగా వాంఛించారు. ఆయన వాదన ఏమిటంటే, ఆధ్యాత్మిక పరిపక్వతకు గురువు ఎంతగానో అవసరము. భగవాన్ తాను గురువునని ఎన్నడూ అంగీకరించరు గనుక, మేము ఆయనను వదలివైచి, మమ్ములను శిష్యులుగా అంగీకరించే గురువు వద్దకు జేరి ఆయనను గురువుగా స్వీకరించాలి. ఆవిధంగా, డేవిడ్‌కూ నాకు మధ్యన ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరముల వెల్లువ కొనసాగింది. డేవిడ్ నుండి వచ్చిన ఉత్తరములు, ఆయనకు బదులివ్వబడిన ఉత్తరములూ, ప్రతి ఒక్కటీ భగవాన్‌కు చూపబడేవి. భగవాన్ మాత్రమే నా ఏకైక గురువనీ, భగవానే కనుక గురువు కానట్లయితే, గురువు అనే పదమునకు అర్ధమే లేదనీ, నేను ఇచ్చిన ప్రత్యుత్తరములు అన్నిటినీ భగవాన్ తల ఊపటం ద్వారా ఆమోదించేవారు.

ఒక దినమున, నేను వెంటనే భగవాన్‌ను వదలివైచి, తన గురువు చెంతకు జేరనట్లైతే, తీవ్రమైన పరిణామములను ఎదుర్కొన వలసి ఉంటుందని హెచ్చరిస్తూ, ఒక అసహ్యమైన ఉత్తరమును నేను అందుకున్నాను, నేను ఈ లేఖను, భగవాన్‌కు చూపలేదు, కానీ, నేను దానివలన బాగా కలత చెందాను. నేను ఆ రోజు సాయంత్రము దానిని భగవాన్‌కు చూపవచ్చునులే అనుకున్నాను. ఆ రోజు మధ్యాహ్నము నేను నా తోటలో కలుపుతీస్తున్నాను. ఇంతలో నా వెనుక ఏదో బరువైనది హఠాత్తుగా దబ్బుమని పడినట్లు శబ్దము వినపడింది. ఏదో జంతువు వంటి ఆకారము, చెట్టు పై నుండి దూకి, వెనుక వైపు నుండి, నా సమీపమునకు రావటము ప్రారంభించింది. అంతలోకే, అది నా వీపు పైకెక్కి కూర్చున్నది. దాని వంటి నిండా చాలా వెంట్రుకలుండుటచే, అది ఒక ఎలుగు బంటి వలె నాకు అనిపించింది. అదిదాని వెనుక కాళ్ళతో, నన్ను గట్టిగా పట్టుకుని, వెనుకనుండి నా ఛాతీ చుట్టు తన చేతులతో గట్టిగా పట్టు బిగించసాగింది. గణేశన్! ఆ సమయంలో నాకు, అది ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి గానీ, ఏవిధమైన భయము గానీ కలుగలేదు. అక్కడ కేవలము ప్రశాంతతో కూడిన, అసంగత్వము మాత్రమే ఉన్నది. ఏ మాత్రము నా ఏకాగ్రత చెక్కు చెదరలేదు. నేను కలుపు తియ్యటము కొనసాగించాను. నా నిర్లక్ష్యమును గమనించిన ఆ జంతువు, దాని పరిమాణమునూ, బరువునూ హెచ్చించ సాగింది. త్వరలోనే నా వీపుపై భారము అధికమగుటచేత, నేను ముందునకు వంగ వలసి వచ్చింది. ఆభారము మోయలేనిదిగా మారింది. అయినప్పటికి, నేను కలత చెందలేదు. భయపడలేదు. అకస్మాత్తుగా అది నా మెడను, దట్టమైన వెంట్రుకలతో కూడిన దానిచేతులతో పట్టుకుని, నా గొంతును నులిమి వేయ సాగింది. దాని పట్టు బిగిసేకొలది, నాకు ఊపిరి అందటము చాలా కష్టమైనది. అది కూడా నాలో లేశమాత్రమైన భయమును కూడా కల్గించ లేకపోయింది. నేను పూర్తి చైతన్యముతోనూ, ఏమాత్రము తడబాటూ లేకుండా నిశ్చలంగా ఉన్నాను. నేను అటుపై ఊపిరి పీల్చుట చేయలేనని, నాకనిపించింది. ఆ పట్టు ఇంకా ఇంకా బిగుస్తూ ఉన్నది. నేను చనిపోబోతున్నానని నాకనిపించింది. నాకు లేశ మాత్రమైనా భయము కలుగలేదు. అప్పుడు ఒక అద్భుతము జరిగింది. మరణము యొక్క ఆలోచన రాగానే నాలోపల 'అరుణా చల శివ, అరుణా చలశివ, అరుణా చలశివ, అరుణాచలశివ'

అనే శబ్దము నాకు వినిపించింది. నేను ఆ శబ్దమును చెయ్యసప్పటికి, నాలోపల ఉన్నదేదో, ఆ శబ్దమును చేస్తున్నది. ఆ జపము యొక్క గాఢత, శబ్దపరిమాణము జపము యొక్క వేగమూ అంత కంతకూ వృద్ధి చెంద సాగినవి. మృత్యువు యొక్క కోరలలో చిక్కి యున్నామని, మనకు తెలిసి యున్నపుడు, ఆవిధమైన జపము యొక్క శబ్దము తనకు తానుగా మన అంతరంగములో వినిపించుట అనునది, మిక్కిలి ఆనందకరమైన అనుభవము. ఆ అజపా జపము కొనసాగుతున్న కొద్దీ, నామెడ చుట్టూ బిగిసి ఉన్న పట్టు, వదులుకాజొచ్చింది. ఆ జంతువు వంటి ఆకారము, నా వీపు పై నుండి క్రిందికి దూకి, వెనుకకు, ఆ చెట్టు వైపునకు పారిపోజొచ్చింది. అది వెనుకకు పరిగెడుతున్నపుడు దాని పదధ్వని నాకు వినిపించింది. అది ఆ చెట్టుపై కెక్కి అంతర్ధానమైంది, వెంటనే నేను బాహ్య స్పృహలోనికి వచ్చాను, నాలోని ఆ అజపా జపము నిరంతరాయంగా కొనసాగింది.

మర్నాడు, భగవాన్ కొండపై తన వ్యాహ్యాళి ముగించుకుని, తిరిగి వస్తుండగా, నేను ఆయనను కలుసుకుని, ఆ లేఖను చూపించి, ఆ ముందురోజు జరిగిన సంఘటనను, పూసగ్రుచ్చినట్లు పొల్లు పోకుండా వివరించాను, భగవాన్ నేను చెప్పిన దంతావిని, నేను చెప్పటము ఆపివెయ్యగానే చక్కని చిరునవ్వుతో, "వారు చెయ్యగలిగింది అంత మాత్రమే. అన్నీ సవ్యంగానే ఉన్నవి. 'వారు' అంటే, భగవాన్ ఉద్దేశ్యము, ఒకప్పుడు క్షుద్ర విద్యలలో ఆరితేరి ప్రస్తుతము డేవిడ్‌తో నాకు, ఆ బెదిరింపు లేఖ వ్రాసిన, ఆ గురువు అయి ఉండవచ్చును, భగవాన్ ఒక పూర్ణజ్ఞాని, పరిపూర్ణులైన మహర్షి. పరిపూర్ణులైన సద్గురువు రక్షణలోనికి మీరు గనుక జేరుకున్నట్లైతే, క్షుద్ర విద్యతో జరుపబడిన ప్రయోగము కూడా, ముసుగు చాటున వరము వలె, మీకు ప్రయోజనకారియే అవుతుంది. నేను నా మహద్భాగ్యముకొద్దీ 'అరుణాచలశివ' అనబడే 'అజపాజపము' దీక్షను పొందాను. మీరు 'ఓం నమో భగవతే శ్రీరమణాయ', అనబడే అజపాజపము యొక్క దీక్షను మీ భాగ్యము కొద్దీ పొందారు.

ఆస్‌బోర్న్‌కు, నాకు, మధ్యగల సాన్నిహిత్యము ప్రత్యేకమైనది. మేము పరస్పర సహకారముతో, ఆ 'మౌంటెన్ పాత్' అనబడే ఆశ్రమ పత్రికను విజయ వంతంగా నడప సాగాము. అది అతివేగంగా, ప్రఖ్యాతి చెందిన, ఆధ్యాత్మిక పత్రికగా, గుర్తింపును పొంది, గొప్ప పాండిత్యమును కల్గి యుండిన సాధకులైన, డగ్లస్ హార్డింగ్, రాబర్ట్ లిన్‌స్సెన్, జోయెల్ గోల్డ్ స్మిత్, వీ వూవీ, ధామస్ మెర్టన్, ప్రపంచము నలుమూలల నుండి ఇంకా అనేక మంది ప్రఖ్యాతి గాంచిన రచయితలను, రమణా శ్రమముతోనూ, భగవాన్ బోధలతోనూ, అనుబంధం కలిగి ఉండేటట్లు చేసింది, భగవాన్ యొక్క 'ఆత్మ విచారణ', అనే బోధను విశదీకరించటములో ఆస్‌బోర్న్‌కు గల విశిష్టమైన ప్రజ్ఞ, ఆయన వ్రాసిన సంపాదకీయములలోనూ, శాజిటేరియస్, అబ్దుల్లా కుతుబుద్దీన్, సెబాస్టియన్ క్విబ్బిన్, బోధిసిత్త, సాయిదాస్, ఎ.రావు, మొదలైన కలము పేర్లతో వ్రాయబడిన వ్యాసములలోనూ, స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన క్రైస్తవ మతము, బౌద్ధమతము, ఇస్లాంమతమునకు చెందిన వ్యాసములను పత్రికయొక్క ప్రతి సంచికలోనూ ప్రచురించేవారు. మౌంటెన్ పాత్‌ను, క్రైస్తవ మతమును, ఇస్లాం మతమును గూర్చి, ప్రబోధించుటకు వాడుతున్నారని నిందించబడినపుడు, ఆయన ప్రశాంతముగా, "గణేశన్! నేను ప్రగాఢ క్రైస్తవుడిని, ఇప్పటికి గూడా నేనంతే, కొంతకాలము పాటు నేను ఇస్లాం మతము పట్ల ఆకర్షింపబడి, ఇస్లాం మతములోనికి మారి, ఇతర ముస్లిమ్‌లతో పాటు, మసీదుకు వెళ్ళేవాడిని, నేను బౌద్ధమతమును గురించి అధ్యయనము చేసి, బౌద్ధ విహారములలో ఉండి, బౌద్ధమతమును గురించి బాగా ఆకళింపు చేసుకున్నాను. కావున నాకు భగవాన్ యొక్క సూటి బోధ అయిన ఆత్మవిచారణను అనుసరించుటలో, (ఆచరించుటలో) క్రైస్తవులు, బౌద్ధులు, ముస్లిమ్‌లు ఎదుర్కొనే సమస్యలు తెలుసును. అందుకని నేను అటువంటి వ్యాసముల ద్వారా, అందరూ మన ప్రియతమ సద్గురువును జేరుకుని, ఆయన సూటి మార్గమైన 'ఆత్మవిచారణ'ను అనుసరించుటకు, ఆయన మార్గదర్శకత్వమును పొందుటకు వీలగునట్లుగా వారధిని నిర్మిస్తున్నాను", అన్నారు. 'మౌంటెన్‌పాత్' ప్రపంచము నలుమూలలనుండి ప్రశంసలను గుర్తింపును పొంది చక్కగా నిలదొక్కు కున్నది. ఆశ్రమ పత్రికను స్థాపించుటలో గల ముఖ్య ఉద్దేశ్యమును అధిగమించి, అనేకమంది నూతన సందర్శకులు, ప్రత్యేకించి యువ సాధకులు, ఆశ్రమమునకు వచ్చారు. భగవాన్ యొక్క సమాధి మందిరము, ధ్యాన మందిరము, శత జయంతి ఉత్సవములు, అనేక వసతి గృహముల నిర్మాణము మొదలైన అనేక ప్రణాళికలు కార్య రూపము ధరించినవి. (కలలు సాకారమైనవి) మౌంటెన్ పాత్ పత్రిక ద్వారా, వ్యాప్తి చెందిన, అందించబడిన మంచి సమాచారమునకు అనేక ధన్యవాదములు.

1968లో నేను ఆస్‌బోర్న్ ఆధ్యాత్మికతలోని కొత్త కోణాన్ని కాంచగల్గాను. నేను దినములోని అన్ని సమయములలోనూ, ఆస్‌బోర్న్ గృహమునకు వెళ్తుండేవాడిని. కాని ఒకప్పుడు వారము రోజులపాటు నేను దూరముగా వెళ్ళ వలసి వచ్చినది. నేను తిరిగి వచ్చిన తర్వాత, నేను ఆయన ఇంటికి వెళ్ళినపుడు, ఆయన చిక్కి శల్యమైపోయి, మంచమునకు అతుక్కుపోయి ఉండుట గమనించటం జరిగింది. అంతా ఒక వారము రోజులలోపే జరిగిపోయింది. అపుడు, నేను ఆయన ముఖంలోని మార్పును గమనించి, ఆశ్చర్యంలో మునిగాను ఆయన ముఖము, ప్రకాశ వంతమైన, అందమైన వర్చస్సుతో మెరిసిపోతున్నది, నా అంతర్వాణి నాకు, ఆస్‌బోర్న్, సాక్షాత్కారమును పొందారు అని తెలిపింది. అది ఆయన అంతిమ సాక్షాత్కారవము. ఆయన కనులు తెరచి, ఒక ప్రకాశవంతమైన చూపుతో నాకు ఆదరపూర్వకమైన స్వాగతమును పలికారు ఆయన, "గణేశన్! నేను రక్షింపబడినాను. మౌంటెన్ పాత్‌కొనసాగుతుంది. చింతించ వలదు", అన్నారు. నేను సంతోషంతో పొంగిపోయి, ఆయన ప్రక్కనే కూర్చున్నాను. నేను ఆయన చేతిని, నా చేతులతో పట్టుకుని ప్రకాశవంతమైన ఆయన ముఖం వైపు తదేకంగా చూస్తూ ఉండిపోయాను. నేను అరగంటసేపు ఆయనతో గడిపి ఇంటికి వెళ్ళి, మా తల్లిగారితో, "అమ్మా! ఆస్‌బోర్న్ సాక్షాత్కారము పొందారు. దయచేసి వెళ్ళి మీరు ఆయనను చూడండి. ఆయన ముఖము ప్రకాశముతో వెలిగి పోతున్నది. ఆ రోజు సాయంత్రము ఆమె, ఆస్‌బోర్న్ 'గృహమునకు వెళ్ళి నేను ఆమెకు చెప్పినది నిజమేనని ధృవ పరిచారు. కొన్నిదినముల పిమ్మట ఆస్‌బోర్న్ శారీరక స్థితి మెరుగు పడినప్పటికి ఆయన ఎవరితోనూ మాట్లాడే వారు కాదు. ఆయన దృష్టి అంతా అంతరంగము లోనికి కేంద్రీకరించబడి ఉండేది. 'భగవాన్' అని గానీ 'అరుణాచలా' అనిగానీ వినిపించినపుడు మాత్రమే ఆయనలో ఆసక్తి కనపడేది. ఆయన 'ముద్దు బిడ్డ' ఆయిన 'మౌంటెన్ పాత్' పత్రిక పట్ల కూడా ఆయనకు ఆసక్తి లేకుండా పోయింది. "ఆధ్యాత్మిక సాధకుని జీవితంలో, అతని నుండి, కార్య శీలత వీడిపోయే సమయం వస్తుంది. అప్పుడతడు, సంపూర్ణంగా, అంతర్ముఖ మవగలడు" అని 'క్రాస్'కు చెందిన, సెయింట్ జాన్ పలికిన మాటలకు అనుగుణంగానే ఉన్నది ఆయన స్థితి, నేను, నా స్నేహితులందరికీ, ఆస్‌బోర్న్ లోని మార్పును గురించి తెలిపి, వెళ్ళి ఆయనను దర్శించు కొనమని చెప్పసాగాను. కొందరు సందేహించారు. కొందరు ఆనందించారు. నేను, టి.పి. రామచంద్ర అయ్యర్‌ను, మరి కొంతమందిని, ఆస్‌బోర్న్ వద్దకు తీసుకొని వెళ్ళాను, వాళ్ళందరూ, "గణేశన్! ధన్యవాదములు, ఆస్‌బోర్న్ సాక్షాత్కారమును పొందారని మీరు, నిస్సందేహంగా, మాకు ఋజువు చేశారు.

ఇది కేవలము, "ఒక సాధకుడు నిజాయితీగా ఉంటే, భగవాన్ యొక్క అనుగ్రహము అతనిని, ఇక్కడే, సంపూర్ణగా మార్చి వేస్తుంది", అనే విషయమును తెలియజేస్తున్నది. నేను వెళ్ళి, శ్రీమతి ఆస్‌బోర్న్‌తో ఆ విషయమును గూర్చి చెప్పినపుడు, ఆమె, "ఓ, ఆయనకు కేవలము వడదెబ్బ తగిలింది", అన్నారు. ఆయనకు జరిగినది సంపూర్ణమైన ఆత్మసాక్షాత్కారమని ఆమెకు తెలియలేదు. అది సంభవించుటకు ముందు, ఆస్‌బోర్న్ నన్ను పిలిచి 1970, జూలై వరకూ, (తొమ్మిది నెలల వరకూ) మౌంటెన్‌పాత్ పత్రిక తొమ్మిదిసంచికలకు పూర్తిగా సరిపోయే, వ్యాసములను అందజేశారు. బహుశా 1970 మే నెలలో, తాను శరీరమును వదలివేస్తానని ముందుగా తెలిసి ఉండే, ఆయన ఆ తొమ్మిది సంచికలకూ సంపాదకత్వమును పూర్తి చేశారు. ఆయన సాక్షాత్కారమును పొందుటకు పూర్వమే, తన ప్రారబ్దమును, సంపూర్ణముగా స్వీకరించిన జ్ఞాని ఆయన. ఆయన తన ప్రారబ్దమును అనుభవించుటను సంపూర్ణము గావించుకుని, ఇప్పుడు జ్ఞానములో స్థిరపడినారు.

ఆస్‌బోర్న్ సమక్షంలో, నేను బిడ్డవలె సంతోషంగా ఉండేవాడిని, "ఆస్‌బోర్న్ పట్ల వ్యక్తిగత ఆరాధనా భావాన్ని (హీరో వర్షిప్) అంత ఎక్కువ పెంచుకోకు" అని నామిత్రులు, నా కాలును పట్టుకుని నన్ను వెనుకకు లాగుతుండే వారు. ఆస్‌బోర్న్ యొక్క స్థితిని నేనెంతగా ఆనందిస్తున్నానో, వారికి తెలియదు కనుక, నేను వారి మాటలను పట్టించుకునే వాడిని కాను. చివరకు జీవితమునకు ఒక అర్థము, పరమార్థము ఉన్నవనే విషయము తెలిసింది. ఒకరి యొక్క స్వస్వరూపమును గూర్చిన ఎఱుకను పొందటము అత్యంత సంతోషకరమైన విషయము. ఆయన మాటలు, ఆయన జీవితము విషయములోనే సత్యమని ఋజువైనది. భగవాన్ పలికిన ప్రతి పలుకూ, పాత భక్తులనోటి నుండి వెలువడిన ప్రతిపలుకూ పరిపూర్ణ సత్యములని, నాకు బోధపడింది.

భగవాన్ ఆయన శరీరమును వదలి వేసే ముందు తన పరిచారకులతో 'సంతోషము' అన్నారు. దాని అర్ధము 'ధన్యవాదములు' అని. ఆస్‌బోర్న్ తన అంతిమ సమయంలో బెంగుళూరులో ఉన్నపుడు, ఆయన అసలు మాట్లాడలేక పోయారు. వీడ్కోలు తీసికునే సంప్రదాయము ననుసరించి శ్రీమతి ఆస్‌బోర్న్ ఆయన శరీరము చుట్టూ ప్రదక్షిణ చేశారు. అకస్మాత్తుగా 'ధన్యవాదములు' అనే పదములు ఆస్‌బోర్న్ కంఠమునుండి స్పష్టముగా ఆమెకు వినిపించినవి. ఆస్‌బోర్న్ పార్ధివదేహము, తిరువణ్ణామలైకు తీసికునిరాబడి ఆయన గృహములోనే ఖననము చెయ్యబడినది. ఆ సమయమంతా నేను అచటనే ఉన్నాను. నా హృదయము బాధతో ముక్కలైంది. జూలై 1970, సంచికే ఆస్‌బోర్న్ లేకుండా, నేను వెలువరించిన మొదటి సంచిక, ప్రతిసంచికనూ, వెలువడగానే, భగవాన్ మందిరములో ఉంచి, తర్వాతనే, తాను చదువుట, నాకు గానీ ఇతరులకు గానీ ఇచ్చుట చేసేవారు. ఆస్‌బోర్న్ అక్కడ లేకుండా వెలువడిన మొదటి సంచిక అది.

నేను ఆ సంచికను భగవాన్ మందిరంలో ఉంచినపుడు నేను రోదిస్తున్నాను. ఆరోజు, ఆస్‌బోర్న్, నా స్వప్నంలో కన్పించారు. "గణేశన్! నా పత్రికను, నాకు ఇవ్వు" అన్నారు. అప్పుడు ఆయన జూలై 1970 సంచికను తీసికుని, దానిలోని ప్రతిపేజీని చదివి (చూసి) ప్రశంసా పూర్వకంగా, నా వీపు తట్టారు. ఆస్‌బోర్న్, నేను అంత సన్నిహితంగా కలసిపని చేశాము ఆస్‌బోర్న్ గురు బోధకు అనుగుణంగా జీవించి, అంతిమ సత్యమైన ఆత్మ సాక్షాత్కారమును పొందారు. నేను 1960లో ఆశ్రమమునకు తిరిగి వచ్చినపుడు, "అడగండి. కానీ కేవలము ఆత్మ సాక్షాత్కారమును మాత్రమే అడగండి. అది మిమ్ములను అరుణాచలములో నిలిపి ఉంచుతుంది. అరుణా చలము భౌతికముగానే కాదు, హృదయములో కూడా ఉన్నది", అనేవి ఆయన పలికిన మొదటి పలుకులు.

ఆయన ఇలా వ్రాశారు, "తొలిసారిగా తన స్వస్వరూపమును గూర్చిన ఎరుకను పొందటము అనేది అత్యంత ఆనంద భరితమైన విషయము చివరకు జీవితమునకు ఒక అర్ధము, లక్ష్యము (పరమార్ధము) ఉన్నవని తెలిసింది. నీకంటే విడిగా దైవము ఉన్నారా? అనేది ప్రశ్న (సమస్య) కాదు. కానీ దైవము కంటే వేరుగా 'నీవు' ఒకరివి ఉన్నావా? అనేదే అసలు ప్రశ్న. మనము "నేను ఎవరిని?" అని ప్రశ్నించు కుంటాము, కానీ అసలు అలా ప్రశ్నించేందుకు 'నేను అని ఒకరు ఉన్నారా? మొదటగా, 'నేను' అనబడేవారు ఒకరు ఉన్నారని భావించుకుని, అటుపిమ్మట, 'నేను' ఎవరిని అని గాని, 'నేను' ఏమిటి అనిగాని ప్రశ్నించు కుంటాము. ఉన్నది కేవలము 'ఉనికి' మాత్రమే నేను, అతడు, ఇది కాదు కేవలము ఉనికి మాత్రమే, ఆ సామాన్యమైన 'ఉనికి'ని మనము, నేను, అతడు, నీవు, అది, ఇది, అని వివిధ సర్వనామములతో విభజించడానికి ప్రయత్నిస్తాము. కానీ 'దానిని' గుర్తిస్తాను. దానిని విభజించుట (జరిగే పనేనా?) సాధ్యమేనా? నేను ఉనికిని అనుభవిస్తాను లేక గుర్తిస్తాను. దానికి 'నేను' అనే పదమును వాడుతాను. అంతమాత్రముచేత అది విభజింపబడలేదు. 'నేను' అనునది 'ఉనికి' నుండి వేరుగా లేదు. అలాగే 'నువ్వు' కూడా, ఆ 'ఉనికి'ని గుర్తించిన వాడవై, దానిని 'నేను' అనే పదంతోనే చెబుతావు. ఎందుకంటే, ఉనికి ఒక్కటే గనుక. అన్వేషణ యొక్క అవసరము ఏమిటి? ఒక గుల్మము వలె లేదా ఓక్ వృక్షమువలె, మానవు డెందులకు తన సహజ స్థితిలోనికి ఎదుగలేడు? అన్ని జీవులలోనూ, ప్రత్యేకంగా మానవుడుమాత్రమే తన భౌతిక పరమైన, మానసికపరమైన శక్తి, సామర్ధ్యములను, అనుచిత రీతిలో ఉపయోగించాలని ఎందుకు ప్రేరణ చెందుతాడు. తన పూర్ణస్థితిలోనికి ఎదగటానికి, తన కోరికలను అణచివేయవలసిన అవసరమేమిటి? మానవుని, మిగిలిన జీవులన్నిటి కంటే, భిన్నమైన జీవిగా చేసేది ఏమిటి?" అనే ప్రశ్నను ఇది లేవనెత్తుతుంది. చాలా జీవులకు, మానవునికంటే ఏదో ఒక కోణములో ఎక్కువ శక్తి సామర్ధ్యములు ఉన్నవి. తాను మానవుడిగా ఉండుట మాత్రమేగాక, తాను మానవుడిని అనే స్పృహ కలిగి ఉండుటయే మానవుని, మిగిలిన జీవులనుండి ప్రత్యేకంగా ఉంచుతుంది. తాను మానవుడై ఉన్నాననే స్పృహను అతడు కలిగి యున్నాడు. కొన్నిసార్లు, తాను స్వచ్ఛమైన 'ఎఱుక' ను మాత్రమే అనే అనుభవము ఒక వ్యక్తికి జరుగుతుంది. (లభిస్తుంది). అతడు కేవలము 'ఉనికి'యే, అతడు తనను 'ఉనికి' గానే భావిస్తాడు. (ఆ తర్వాత అదే 'స్వచ్ఛమైన చైతన్యమును' అతడు ఆనందిస్తాడు కూడా) అదే స్వచ్ఛమైన చైతన్యమని అతడు, అటుపిమ్మట మెచ్చుకుంటాడు కూడా. ఆలోచనలు నిలిపివేయబడుతవి. ఆలోచనలు వచ్చినప్పటికి, అవి, చైతన్య ప్రవంతికి అడ్డుపడవు. కాని అతడు కొన్నిసార్లు దాని గురించి ఏమీ ఆనందమును పొందడు. అది అతడికి సమస్యగా అనిపిస్తుంది. బోధలోనో, తన లోనో ఏదో లోపము ఉన్నట్లుగా అతడు భావిస్తాడు. మనస్సు

రహస్యముగా ఇతరుల సంభాషణను వినుట అనునదియే దీనికి వివరణము. ఆనందమును పొందనిది ఎవరు? కానీ, ఆ 'నేను' కు అచట ఉండవలసిన అవసరమే లేదు. దైవముపై నిఘా ఉంచిన అశాశ్వతుడతడు. 'ఉనికి' ఆనందమును అనుభవించుటయే కాదు, 'ఉనికి'యే ఆనందము. కాని దానికి అవసరమైన షరతు 'నేను' అనబడే విలేఖరి లేకుండటయే. ఒక జీవితమంతయూ నిష్కామకర్మతో గడిపి నప్పటికీ గూడా, "అహంకారమును" రూపుమాపుటకు సరిపోదు. మరింత దృఢమైన,. శక్తివంతమైన లక్ష్యసాధన ప్రణాళిక దానిని (సాధనను) మరింత బలపరచవలసిన అవసరమున్నది. అదే 'శరణాగతి' లేదా 'ఆత్మవిచారణ?' యోగవాశిష్టములో వశిష్ట మహర్షి 'ఆత్మవిచారణ'ను పొందుపరచారు. భగవాన్‌ను ఎవరైనా, ఈ విషయమై ప్రశ్నించినపుడు, "అందులకు రెండుమార్గము లున్నవి. ఒకటి "నేను ఎవరను?" అని ప్రశ్నించుకొనుట. రెండవది, శరణాగతి చెందుట. తానే అన్ని శక్తి, సామర్థ్యముల యొక్క స్వంతదారును లేదా యజమానిని, అని 'మనస్సు' భావిస్తుంది. అది "తాను యజమానిని", అనే భావనను వదలి వేసి, ఆశక్తి సామర్థ్యములను, 'తనను' కూడా, స్వచ్ఛమైన ఎఱుకకు, లేదా ఆత్మకు శరణాగతి చెందించాలి. లేదా స్వస్వరూపమును లేదా శుద్ధ చైతన్యమును దర్శించుటకై అంతరంగములోనికి దృష్టి సారించాలి.

భగవాన్ మార్గమైన 'ఆత్మవిచారణ'ను అనుసరిస్తూనే, ఆస్‌బోర్న్ దానితో పాటు, నిజాయితీతో కూడిన భక్తినీ, నిష్కామ కర్మనూ కలగలిపారు. జ్ఞానము, భక్తితోనూ, నిష్కామ కర్మతోనూ చేతులు కలిపి ముందుకు సాగింది. భగవాన్, ఎదుట ఉదయమూ, సాయంత్రమూ జరిగే వేదపఠనమునుకు వినుటకు ఆయన క్రమం తప్పక హాజరయ్యేవారు. దానిని వినుట, ధ్యానమునకు, సహాయకారిగా ఉంటుందని, ఆయన నిశ్చయంగా చెప్పేవారు. ఒక గృహస్థజీవితం గడిపిన ఋషికి, ఆయన ఒక గొప్ప ఉదాహరణ. అన్ని సంవత్సరములలోనూ ఏ సమయంలోనూ ఎట్టి పరిస్థితులలోనూ, ఆయన కోపం చెందటము నేను చూడలేదు. అది నమ్మలేని విషయము. ఆయన ఎప్పుడూ సంపాదకునిగా, తనకొరకు, ఏ ప్రత్యేకమైన సౌకర్యమునూ కోరలేదు. నేను ఆయనకు అచ్చువేయబడిన నూతన సంచికను అందజేసినపుడల్లా, ఆయన ఆ తర్వాత సంచికకు అవసరమైన వ్రాతప్రతులను సిద్ధంగా ఉంచి, నాకు అంద జేసేవారు. ఆయన తన కుటుంబము కొరకు మూడు కాపీలకు, కాపీలు ముద్రించబడకముందే ధర చెల్లించేవారు, నేను, సంపాదకునిగా, మీరుసొమ్ము చెల్లించవలసిన అవసరము లేదని వాదించినా వినకుండా.

ఆయనకు చాలా వ్యతిరేకత ఉండేది. అది ఆయనకు రోజాపుష్పముల పాన్పు వంటిదికాదు. ఆయన ఒక పాశ్చాత్యుడు. ఆయనకు సంస్కృతము రాదు. హిందూ సంస్కృతి, ఆచార వ్యవహారములు తెలియవు. ఆశ్రమములోని వాతావరణము మొత్తము వాటితో నిండి ఉండేది. చాలా మంది పత్రికకు ఆయన సంపాదకత్వము వహించుటకు అంగీకరించలేదు. నాకు దారిచూపింది, మా తండ్రి గారిచేత అందుకు అంగీకరింపజేసిందీ భగవానే. ఆస్‌బోర్న్‌ను సంపాదకునిగా ఉండకుండా చూడమని, మా తండ్రిగారిని కొందరు ఎంతగానో బాధించేవారు. ప్రతి అడుగులోనూ, ఆస్‌బోర్న్, నేనూ అనేక సమస్యలను ఎదుర్కొనవలసివచ్చేది. ఒకసారి, నాకు రాజీనామ చెయ్యాలని ఉన్నదని, నేను ఆయనకు వ్రాశాను. దానికి ఆయన ఈ విధంగా బదులిచ్చారు, ప్రియమైన శ్రీగణేశన్! చెన్నైలో ముద్రణపని సజావుగా సాగిపోతున్నదని విని ఆనందించాను. మనము ఎప్పుడూ జనము యొక్క విమర్శలకు అతిగా కలత చెంద కూడదు. ఆ విమర్శలో ఏదైనా నిజము ఉన్నదేమోనని మనము తరచిచూడాలి. ఏదైనా మనలోని లోపము కనిపించితే సరిదిద్దుకోవాలి. భగవాన్ సేవగా ఈ పని కొనసాగింప బడుతున్నంత వరకూ, ఇతరులు సహాయపడినా లేకున్నా అది జరిగి పోతూనే ఉంటుంది. విమర్శించే జనులు బహుశ ఎంత పని జరుగ వలసి యున్నదో ఎరుగరు, నేను పత్రిక కొరకు చేసే పనిని ఆశ్రమములోని జనులు విమర్శించుట మాత్రమే మీరు ఎరుగుదురు. నిజానికి మీరు మూడు ఉద్యోగములను నిర్వహిస్తున్నారు. ఆఫీసు మేనేజర్‌గా, ప్రకటనలకు సంపాదకునిగా ప్రధాన సహాయ సంపాదకునిగా మూడు బాధ్యతలను నిర్వహిస్తున్నారు "వాటిని సంయుక్తంగా, అంత ఉత్సాహముతోనూ, శక్తిసామర్థ్యములతోనూ చెయ్యగలవారిని ఎవరినీ నేను చూడలేదు. (ఊహించనుగూడాలేను). కావున జనులు విమర్శించినా. లేకున్నా, మీరు భగవాన్ కార్యమును కొనసాగించ వలసినదే. మనకు ఆవశ్యకమైన దేమిటంటే, మన ఉద్దేశ్యమును నిరంతరమూ పరిశీలించుకొనుటయే, నేను, నా ప్రత్యేకతను, లేదా ఆధిక్యతను చాటుకోవాలనుకుంటున్నానా,

లేక భగవాన్ సేవ చెయ్యాలనుకుంటున్నానా? నేను ప్రశంసలను పొందాలని కోరుకొంటున్నానా? భగవాన్‌ను సేవించాలని కోరుకుంటున్నానా?అని. మీరు చేస్తున్న పనికి నా శుభాకాంక్షలు. మరొక ఉత్తరమునకు బదులుగా,. "కొంతమంది అసూయతో ఉన్నందు వలన అలాజరుగుతుందని భావించాను. మానవ స్వభావమే అంత. అసూయను జనింప చెయ్యకూండా, ఏపనీ జయప్రదమవదు. వారు మన మధ్య శతృత్వమును కల్గించుటకు కూడ ప్రయత్నించ వచ్చు. మనము అనుసరించవలసిన ఉత్తమమైన పద్ధతి ఏమిటంటే, దేనినీ పట్టించు కొనకుండా, భగవాన్ సేవపై మన దృష్టిని ఏకాగ్రపరచి, మన పూర్తి శక్తి సామర్ధ్యములను ఉపయోగించి, అన్ని విధములుగానూ ఉన్నత ప్రమాణములు పాటించి, జనుల విమర్శలకు తావు ఇవ్వకుండా ఉండాలి. శుభాకాంక్షలతో. భగవాన్ అనుగ్రహము మీ ప్రయత్నమునకు అండగా నిలవాలని కోరుకుంటున్నాను," అని వ్రాశారు.

రమణాశ్రమములో అటువంటి భౌతిక పరమైన, మానసిక పరమైన, వేదాంత పరమైన, ఆధ్యాత్మిక పరమైన అన్నీ అనుభవములనూ భగవాన్ అనుగ్రహంతోటే పొందిన అనుభవములు కల్గినటు వంటి వ్యక్తి మరొక రెవరూ, నాకు తారసపడలేదు. నేను ఆయనను ప్రశంసించి నపుడల్లా, "భగవాన్ వర్ధిల్లుగాక, అదంతా భగవాన్ చలవే" అని ఆయన బదులిచ్చేవారు, తాను వ్రాసిన వ్యాసమును చూపించినప్పుడు," అదంతా భగవాన్ వల్లనే వ్రాయబడింది," అనేవారు. నేను వ్రాయలేదు. నేను కేవలం కలము చేతిలో పట్టుకున్నాను. వ్రాసినది మాత్రము భగవానే అనేవారు. ఆయన ఆధ్యాత్మిక పరంగా గొప్ప వ్యక్తి. దానిని సాధించుటకు ఎంతో కష్టించుటయేగాక, ఆ విషయమును భగవాన్‌చే ధృవీకరింపజేసుకున్నారు. ఆయన నాకు, ఇతర భక్తులకు, తాను ఆస్థితిలోనే స్థిరముగా ఉన్నట్లుగా ఆచరణలో నిర్ధారణగా చూపారు. అది సాధ్యమేనని (ఆస్థితిలో స్థిరముగా ఉండుట అనునది) మన కందరకూ గొప్ప ఉత్సాహము కలిగేలా చేశారు. నేను ఆశ్రమములోని మరొకపాత భక్తునికి, అది సాధ్యమేనని ఆస్‌బోర్న్ జీవితం, నిశ్చయంగా తెల్పుతున్నది అని చెప్పగా, 'సాధ్యమేనని' మీరు వాడిన పద ప్రయోగము బలహీనంగా అనిపిస్తున్నది. 'ఆత్మ సాక్షాత్కారము నిశ్చయంగా కల్గుతుంది' అని బదులుపలికారు. అవును. నిజమే ఆత్మ సాక్షాత్కారము నిశ్చయంగా కల్గుతుంది.



వి. గణేశన్ - ఆర్థర్ ఆస్‌బోర్న్

పాపాజీ

ప్రతి ఒక్కరికి గులాబి గురించి తెలుసు. దాని గుణాన్ని ఆస్వాదించాలంటే, దానిగురించి విస్తృతమైన వర్ణన చెయ్యవలసిన అవసరములేదు. దాని పరిమళము వల్ల, తాజాదనము వలన, దానికి విలువ లభించింది. ఆ విధంగానే పాపాజీని గురించి అందురూ ఎరుగుదురు. నేను చెప్పబోయేదాంట్లో కొత్త విషయమేమీ ఉండకపోవచ్చును. కానీ ఒక గులాబీని, మీరెన్ని సార్లు చూచి నప్పటికి, అది దాని తాజాదనమును కోల్పోనట్లు, ఆసక్తిని కోల్పోకుండా, పాపాజీని గురించి ఎన్ని సార్లైనా మీరు చదువ వచ్చును.

అరుణాచలుని గురించిన సత్యము, 'నేను' యొక్క స్వరూపము ప్రపంచము అంతా వ్యాప్తి కావలసి ఉన్నది. ఇదియే తండ్రి అగు అరుణాచలునిచే, ఆయన కుమారుడైన రమణ మహర్షికి ఇవ్వబడిన ఆజ్ఞ. సెప్టెంబరు 1, 1896న, ఆయన తన వద్దకు వచ్చిన నాటి నుండి, ఆయనను పదిలంగా తన హృదయానికి హత్తుకునే ఉన్నారు, అరుణాచలుడు. మౌనముగా ఉండుట, తన స్థానము నుండి కదలక స్థిరముగా ఉండుటయే అరుణాచలుడు తనకిచ్చిన ఉపదేశముగా భావించారు, రమణులు. అందుచే ఆయన తాను శరీర త్యాగము చేసే వరకు, అనగా 14 ఏప్రిల్ 1950 వరకూ అక్కడే ఉండి పోయారు. విషయము ఇలా ఉంటే, ఆయన అరుణాచలుని సందేశమును ప్రపంచ వ్యాప్తము గావించే దెలాగు?

ఆయన పాత భక్తులే, వారి రచనల ద్వారాను, వారి భౌతిక ఉనికి ద్వారాను, ఆత్మ చైతన్యమైన "నేను" యొక్క స్వరూపమును ప్రపంచ వ్యాప్తము చేసే కార్యక్రమమును చేపట్టారు. భగవాన్ నిర్యాణము అనంతరము, ముగ్గురు ప్రముఖ వ్యక్తులు, ఈ సత్యమును ప్రపంచమంతటా వ్యాప్తి చెందించే కార్యక్రమమును చేపట్టారు. వెలుగులను విరజిమ్మే తన రచనల ద్వారా ఆర్థర్ ఆస్‌బోర్న్, ఆత్మ విచారణ ద్వారా ఆత్మసాక్షాత్కారమును పొందవచ్చుననే సత్యాన్ని వ్యాపింప జేశారు. రాబర్ట్ ఆడమ్స్, మరియు పాపాజీ, అనే ఇరువురు భక్తులు, భగవాన్ బోధలను తమ సత్సంగముల ద్వారా వ్యాప్తి చేశారు. అనుభవమును పొందేలా తోడ్పడినారు. లెక్క లేనంత మంది భక్తులు, 'అహం' స్ఫురణ అనుభవమును, 'నేనే సత్యమును' అనే అనుభవమును, పాపాజీ, ఆడమ్స్, మరియు కొందరు ఇతరుల సమక్షంలో పొందారు.

మానవుడు చీకటిలో తడుముకుంటూ, వెలుగే తానైయున్న భగవంతుని చేరుకొనుటకు, ఒక ఆధారము యొక్క అవసరము కలిగి ఉంటాడు. ఆ ఆధారమే సద్గురువు. ఆ సద్గురువే ఒక మహనీయుడు లేదా మహర్షి రూపంలో మానవాళికి, దైవత్వము యొక్క రుచిని తెలియ జేయుటయే తన ప్రధాన కర్తవ్యముగా కలిగి ఉంటారు. దైవము యొక్క దూతలు ఏసుక్రీస్తు, రామకృష్ణ పరమహంస, భగవాన్ రమణ, వంటి అనేక మంది మహనీయుల రూపములో వస్తారు. వారు మరికొందరు దూతల సాయముతో మానవులు దేవుని మరింత సులభముగా జేరుకొనునట్లు మరియు, మానవునికి దైవమునకు మధ్యన మరింత దృఢమైన బంధము ఏర్పడునట్లు, చూస్తారు. ఏసుక్రీస్తు, సెయింట్ పీటర్, సెయింట్ జాన్, మరియు ఇతరుల ద్వారా ఆ పనిని చేశారు. భగవాన్‌కు అనేకమంది భక్తులున్నారు. వారు 'నేను' లేదా 'అహం' యొక్క సత్యమును వ్యాప్తి చెందించి, భగవాన్, అరుణా చలుని పుత్రుడేయనే నిజమును నిర్ధారించారు. కఠోపనిషత్, చెప్పిన విధంగా, "ఎవరినైతే ఆత్మ ఎన్నుకుంటుందో, అతని చేత ఆత్మపొందబడుతుంది. అతనికే ఆత్మ తన నిజస్వరూపమును ఎఱుక పరుస్తుంది". ఆత్మ ఒక వ్యక్తిని ఎంపిక చేసుకుని అతనికి తన స్వరూపమును అతని లోపలే విశదపరుస్తుంది. కావ్య కంఠ గణపతి ముని, సూరి నాగమ్మ, ఆర్థర్ ఆస్‌బోర్న్, బాల్యము నుండియే ఎంపిక చేయబడినారు.

ఆత్మ, ఎంపిక చేసుకుని, తనను తాను అతనిలో విశదపరచుకొనిన మరొక వ్యక్తి, హెచ్. డబ్ల్యు.ఎల్. పూంజా. పాపాజీగా పేరు పొందిన ఆయన ఎనిమిది సంవత్సరముల చిరుప్రాయములోనే, ఆత్మాను భూతిని పొందారు. ఆ విషయాన్ని గూర్చి పాపాజీ ఇచ్చిన వివరణను ఆయన మాటలలోనే పొందుపరుస్తాను. "ఒక నాటి సాయంత్రము, నేను నాతల్లి గారితోనూ, మరికొందరు బంధువులతోను కలసి కూర్చుని ఉన్నాను. అకస్మాత్తుగా నాకొక అనుభవము కల్గింది. అదినాలో అత్యంత

ఆనందమును, శాంతిని నింపింది. నా కనులు మూతపడినవి. నా శరీరము చలనము లేకుండా ఉన్నది. బాహ్యములో నా చుట్టూ జరిగేదంతా, నాకు తెలుస్తూనే యున్నది. శబ్దములు వినిపిస్తూనే ఉన్నవి. నా చుట్టూ ఉన్న జనులు, నన్ను మామూలు స్థితికి తీసికుని రావటానికి ప్రయత్నములు చేశారు.అది ఎటువంటి పారవశ్యాన్ని కల్గించే అనుభవమంటే, నేను ఆ,ఆనంద తన్మయత్వంలో రెండు దినముల పాటు ఉండిపోయాను, నా చుట్టూ ఉన్న పరిసరముల గూర్చిన స్పృహ నాకు ఉన్నది కాని, నేను వెల్లడి చేసే శక్తి లేకుండా ఉన్నాను. నా అంతరంగములో సంపూర్ణమైన ఆనందము నిండి ఉన్నది.” పాపాజీ తల్లిగారు, కుమారుని యొక్క స్థితిని గుర్తించారు. ఆయనకు సాయపడాలనుకున్నారు. ఆయన ఆనంద పారవశ్యము నుండి బయటకు వచ్చిన పిదప, ఆయనకు శ్రీకృష్ణ పరమాత్మయొక్క చిత్ర పటమును ఇచ్చారు. ఆయన ఆ కృష్ణపరమాత్మ చిత్రంతో ప్రేమలో పడిపోయారు. ఆయన తల్లిగారు శ్రీకృష్ణుని పూజించమని చెప్పగా, త్వరలోనే ఆయన ఒక భక్తునిగా మారిపోయారు. ఆయన భక్తి ఎంత తీవ్రముగా ఉండేదంటే, ఆయనకు శ్రీకృష్ణుని దర్శనం లభిస్తుండేది. ఆయన తరచుగ కృష్ణునితో ఆడుకుంటున్నట్లు భావిస్తుండే వారు. పాపాజీ కోరినపుడల్లా, ఆ పటములో ఉన్న విధముగానే శ్రీకృష్ణుడు దర్శనమిస్తుండేవారు. ఆయన ఆటలు ఆడటము కుటుంబములోని వారు చూస్తుండేవారుగానీ, ఆయన ఎవరితో ఆడుతున్నారో, వారి నెన్నడు చూడలేకపోయేవారు. పాఠశాలయందు, బుద్ధుని చిత్రపటము ఆయనను ఆకర్షించింది. అది, ఆత్మసాక్షాత్కారమును పొందిన పిమ్మట, బుద్ధుడు చిక్కి శల్యావస్థలో ఉన్నప్పటి చిత్రము. పాపాజీ బుద్ధుని జీవితమును గురించి క్షుణ్ణంగా అధ్యయనము చేశారు.ఆయన కౌమార అవస్థలో (13-19సం॥) ఉండగా, ఆయనకు ఆధ్యాత్మిక అనుభవములు కలుగుతూనే ఉండేవి. ఎందుకంటే, ఆత్మ ఎవరిని ఎంపిక చేసుకుంటుందో, వారికి ఎప్పుడు ఏది ఇవ్వాలో దానికి తెలుసును కనుక. ఆయనకు, దేవతల దర్శనములు కలిగి, ఆయనను తన్మయత్వంలో పడవేసేవి. కానీ, ఎల్లప్పుడూ ఆయన, తాను ఎనిమిది సంవత్సరముల ప్రాయంలో పొందిన ప్రశాంతతను, ప్రగాఢశాంతిని గాఢంగా వాంఛిస్తుండేవారు,

అప్పటి హిందూ గృహములలో ఉండే సంప్రదాయం ప్రకారము, ఆయన తల్లిదండ్రులు ఆయనకు పదహారేళ్ళ ప్రాయంలోనే వివాహము జరిపించారు. వివాహము అగుట తోటే, కుటుంబ బాధ్యత నెత్తిన పడింది. ధన సంపాదన ప్రారంభించమని తండ్రి కోరిన కోరికపై, పాపాజీ 'మిలిటరీ అకాడమీ' (సైనిక శిక్షణ శిబిరము)లో అధికారిగా (ఆఫీసర్) శిక్షణ పొందుటకు జేరారు. కానీ చాలా సార్లు కృష్ణుని భక్తి వ్యామోహంలో పడి, ఆయనను పూజించవలెను, ఆయనతో ఆటలాడుకొనవలెననే, వ్యామోహముతో చదువుపై ఏకాగ్రతను కోల్పోయేవారు. పాపాజీ ఈ క్షణికానందంతో తృప్తి జెందక, భగవంతునిలో శాశ్వతంగా ఐక్యమై పోవాలనీ, శాశ్వతంగా ఆనందములో మునిగి ఉండాలనీ కోరుకునేవారు. దైవముతోశాశ్వతంగా ఉండిపోవాలనే కోరిక తీవ్రతరమై, ఆయన తన భార్యను, తన తండ్రిఇంటవదలి, దైవంతో శాశ్వత అనుసంధానం (లేదా నివాసం) కల్గించ గలవారి కొరకు వెతుక్కుంటూ వెళ్ళారు. ఆయన భారత దేశము మొత్తము పర్యటించి, సాధువులను, ఆశ్రమవాసులైన స్వాములను కలుసుకున్నారు. ఆయన ఎల్లపుడూ అడిగేప్రశ్న, మీరుదైవాన్ని దర్శించారా? మీరు నాకు దైవమును చూపించగలరా? ఆయన పొందిన సమాధానములు, ఆయన భ్రాంతిని తొలగించాయి.

విశ్వాసమును కోల్పోయి, ఆయన ఇంటికి తిరిగి వచ్చారు. కానీ, ఆయన లోని అగ్ని ఇంకా చల్లారలేదు. ఆయన తన గృహమునకు వచ్చిన సాధువులకు భోజనము పెట్టి వారిని ఈ ప్రశ్నలు అడుగుతూ వుండేవారు. ఒకరోజు ఒక సాధువు, వారి తలుపు తట్టారు. పాపాజీ, ఆ సాధువును సాదరంగా ఆహ్వానించి, చక్కటి భోజనం పెట్టారు. తాను సాధారణంగా అడిగే ప్రశ్ననే, ఆయనను అడుగగా, ఆయన నవ్వుతూ, “మీరు అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వగల స్వామిని మీకు నేను చూపించ గలను,” అని బదులిచ్చారు. పాపాజీ వెంటనే “ఆయన ఎక్కడ ఉన్నారు? ఆయన పేరేమిటి?” అని ప్రశ్నించారు. “ఆయన పేరు రమణ మహర్షి, ఆయన అరుణాచలములో, 'రమణాశ్రమము' అనేపేరు కల్గిన ఆశ్రమములో ఉంటారు”, అని చెప్పారు. ఆ సాధువు, రమణాశ్రమమునకు ఎలా జేరుకోవాలి అనే వివరములను, ఆయనకు తెలిపారు, ఎట్టకేలకు దైవమును చేరుకొనుటకు మార్గమును చూపగల స్వామిని కలుసుకొనబోతున్నానని పాపాజీ ఆనందం పట్టలేక పోయారు. ఆ సమయంలో పాపాజీ పేదరికంలో ఉండేవారు. ఒకరోజు, దినపత్రికను పరిశీలిస్తుండగా, చెన్నైలోని ఒక మిలిటరీక్యాంటీన్‌లో (సైనిక దళమునకు చెందిన భోజనశాల) మేనేజర్ ఉద్యోగమును గురించిన ప్రకటనను ఆయన చూశారు. పాపాజీ ఆ

ఉద్యోగమునకు చక్కగా సరిపోయే వ్యక్తి, ఆ ఇంటర్వ్యూకు పాపాజీ హాజరుకాగా, "మీరు వెంటనే ఉద్యోగములో జేరవలసిన అవసరము లేదు. మీ ప్రయాణ ఖర్చులను ఇప్పుడు చెల్లిస్తాము. ఒక నెల తర్వాత మీరు ఉద్యోగములో జేరవచ్చును" అన్నారు. చూడండి, ఆత్మ తాను ఎంపిక చేసుకున్న వారికి మార్గాన్ని ఎలా సుగమం చేస్తుందో!

1944లో చెన్నై చేరుకునేనాటికి, పాపాజీకి 34 సంవత్సరముల వయస్సు. తనను దహించి వేస్తున్న ప్రశ్నలకు సమాధానములను ఇచ్చి, తనకు దైవమును చూపగల స్వామిని చూడాలనే ఆతృతతోనూ, ఉత్సాహంతోనూ ఉన్నారాయన. రమణాశ్రమములో తన సామానును, విశ్రాంతిగదిలో వదలి, స్వామి కూర్చుని ఉన్న పాతహాలుకు వెళ్ళా రాయన, ఆయన కిటికీ గుండా తొంగి చూశారు. అక్కడ చూసిన దృశ్యంతో ఆయన ఎంతో నిరుత్సాహమును, ఆగ్రహమును పొందారు, ఆయన తనలో తాను ఈ విధంగా అనుకున్నారు. పంజాబుకు వచ్చిన సాధువే ఇక్కడ కూర్చుని ఉన్నారు. తన స్వంతపేరును చిరునామాను ఇచ్చి, ఇప్పుడు ఇక్కడ సోఫామీద కూర్చుని ఉన్నారు. ఆయన ఒక మోసగాడు, నేనిక్కడ ఒక నిమిషము గూడా ఉండను." ఆయన ఆగ్రహము ఆ విధంగా ఉన్నది. విసుగుతో, పొగలూ, సెగలూ కక్కుతూ, విశ్రాంతి గదికి వెళ్ళి, పాపాజీ హడావిడిగా తన మూటా,ముల్లే తీసుకుని వెళ్ళి పోబోయారు. కానీ ఫ్రేమ్‌జీ, దొరాబ్జీ అనే ఒక పాత భక్తుడు ఆయనతో, "మీరు ఒకగంట కూడా ఇచ్చట గడప లేదు. అంతదూరమునుండి వచ్చి ఎందుకంత హడావిడిగా వెనుకకు వెళ్ళి పోవాలనుకుంటున్నారు?" అన్నారు. పాపాజీ తాను చూసిన దంతా చెప్పి, "ఈ స్వామి మోసగాడు. తన స్వంత పేరును. అడ్రసునూ చెప్పి, అతడు నీకు దేవుణ్ణి చూబిస్తాడని చెప్పాడు, అతడు మోసగాడని నాకు తెలుసు. అతని సంగతి నాకు తెలుసు", అన్నారు. ఫ్రేమ్‌జీ కలత చెందిన స్వరంతో, "అక్కడేదో పొరపాటు జరిగింది. భగవాన్, గత నలుబది ఎనిమిదేళ్ళుగా అరుణాచలమును వీడి వెళ్ళ లేదు", అన్నారు. పాపాజీ ఆగ్రహం చల్లారలేదు, కానీ ఫ్రేమ్ జీ, ఆయనను మధ్యాహ్న భోజనమును, భగవాన్ ప్రసాదమును స్వీకరించవలసినదిగా కోరారు. మధ్యాహ్న భోజనము తర్వాత, భగవాన్ పాతహాలులో విశ్రాంతి తీసుకునే వారు, 12 గంటలు– 2గంటలు మధ్య కాలములో భగవాన్ విశ్రాంతికి భంగం కల్గించవద్దని నిర్వాహకులు, సందర్శకులకు చెబుతుండేవారు. పాపాజీ, మహర్షిని అనుసరించుటకు ప్రయత్నించారుకానీ, కృష్ణస్వామి అనే పరిచారకుడు, ఆయనను నిలిపి వేశారు. అప్పటికే హాలులోనికి ప్రవేశించిన భగవాన్, ఆయనను లోనికి రానివ్వమని కృష్ణస్వామికి చెప్పారు.

తర్వాత ఏమి జరిగిందో పాపాజీ ఇలా వివరిస్తున్నారు. "నేను ఆ స్వామిని శతృత్వ భావముతోను, కోపముతోనూ సమీపించాను, "మీరేగదా పంజాబులో మా ఇంటికి నన్ను చూడటానికి వచ్చింది?" అని ప్రశ్నించాను, మహర్షి మౌనంగా ఉన్నారు. నేను మరల రెట్టించాను. "మీరు మా ఇంటికి వచ్చి నన్నిక్కడకు రమ్మని చెప్పలేదా?" అని. దీనికి కూడా మహర్షి బదులివ్వలేదు. ఆయన సమాధాన మిచ్చుటకు ఏమాత్రము ఇష్టపడక పోవుటచే, నేను అక్కడకు వెళ్ళిన ముఖ్యకారణం వైపు మరలాను. నేను. ఏ ప్రశ్నలను అడుగుటకు అక్కడకు వచ్చానో, ఆ ప్రశ్నలు ఆయనను అడిగేశాను. "మీరు దేవుని చూచారా? చూచినట్లైతే, నాకు దేవుని చూచుటకు మీరు సాయ పడతారా? ఆ జవాబు కొరకు ఎటువంటి మూల్యాన్నైనా చెల్లించటానికి నేను సిద్ధంగా ఉన్నాను. నా ప్రాణాలనైనా సరే. కానీ ఈ బేరంలో మీరు చెయ్యవలసిందేమిటంటే, మీరు నాకు దేవుని చూపించి తీరాలి", స్వామి ఇలా బదులిచ్చారు. "లేదు నేను మీకు దేవుని చూపించలేను, నేను మీరు దేవుని చూచుటకు సాయపడలేను. ఎందుచేతనంటే, దేవుడు చూడబడే వస్తువుకాదు గనుక, దేవుడే కర్త. ఆయనే ద్రష్ట (చూచేవాడు). చూడబడే వస్తువుల గురించి పట్టించు కొనవద్దు. చూచే వారెవరో తెలుసుకొనండి. అప్పుడు ఆయన యింకా ఇలా అన్నారు.మీరొక్కరే దైవము. తర్వాత ఆయన దైవమును చూడవలెననే గాఢమైన కోరికగల ఆ 'నేను' ఎవరో తెలుసుకొనమని చెప్పారు. మాట్లాడుట ముగించిన తర్వాత, ఆయన నా కనులలోకి ఎంత లోతుగా చూశారంటే, నాదేహం యావత్తూ, (ఆ చూపుతో) కంపించిపోసాగింది. నా శరీరములోని ప్రతి అంగుళములో నుండి వణుకు బయల్దేరింది. నా రోమములు నిక్క బొడుచుకున్నవి. ఆ తీవ్రత అలా ఉన్నది. నన్ను నమ్మండి. నాకు ఆధ్యాత్మిక హృదయం యొక్క ఎఱుక కలిగింది. నేను చెప్పేది 'భౌతికమైన హృదయం' గురించి కాదు. ఈ ఉనికి గల్గిన దాని కంతటికీ (విశ్వమంతటికీ) జన్మ స్థానము, ఆధారముకూడా అయి ఉన్న 'హృదయం' గురించి.

ఏమైనప్పటికి, ఈ అనుభవం కూడా పాపాజీలో దీర్ఘకాలంపాటు విశ్వాసమును (కల్గించ లేకపోయింది) నిలిపి ఉంచలేక పోయింది. ఈ ఆధ్యాత్మిక అనుభవము పొందిన తర్వాత కూడా, ఆయన దేవుని భౌతికంగా చూడాలనే కోరికతోనే ఉన్నారు. ఆయన స్వంతమాటలలోనే చెప్పాలంటే "నేను మధువుగా ఉండదల్చుకోలేదు. నేను మధువును రుచి చూడ దలిచాను". కావున ఆయన రమణాశ్రమమునువీడి, గిరికి ఆవలనున్న ఆది అన్నామలైకు వెళ్ళారు. తాను చెన్నైలోఉద్యోగములో జేరునంత వరకు, అక్కడ, ఆయన కృష్ణ పరమాత్మతో ఆటలాడారు. (కేవలము) వయస్సులో పెద్దవారు గనుక మహర్షి వద్ద మర్యాద పూర్వకంగా సెలవు తీసికుందామని ఆయన రమణాశ్రమమునకు వెళ్ళారు. గురుశిష్యుల అనుబంధంలోని చక్కదనం చూడండి. పాపాజీ, భగవాన్ ఎదుటకు వెళ్ళినపుడు, "మీరు ఎక్కడకు వెళ్ళారు? మీరు ఎక్కడ బస చేశారు?" అని అడిగారు భగవాన్. భగవాన్ సాధారణముగా అటువంటి ప్రశ్నలను అడుగరు, 'గిరికి ఆవల వైపున' అని పాపాజీ బదులిచ్చారు", మీరు "అక్కడ ఏమి చేస్తున్నారు?" అన్నారు భగవాన్, "నేను, నాదైవమైన కృష్ణునితో ఆటలాడుతున్నాను అన్నారు", పాపాజీ. తాను మాట్లాడుతున్న వ్యక్తికి, తనకు కల్గినటువంటి గొప్ప అనుభవములు ఎప్పుడూ కలిగియుండవనే అభిప్రాయంతో, ధైర్యంగా, గర్వంతోనూ, తన ఆధిక్యతను వెల్లడి చేసే ధోరణిలో బదులిచ్చారు పాపాజీ, "అలాగా!" అన్నారు భగవాన్ ఆసక్తితోనూ, ఆశ్చర్యంతోనూ", చాలా బాగుంది", "ఇప్పుడు కూడా మీరు ఆయనను చూస్తున్నారా?" అని ప్రశ్నించారు భగవాన్. "లేదండి, నేను చూడటములేదు", "నాకు దర్శనములు కల్గినపుడు మాత్రమే ఆయనను చూస్తాను", అన్నారు.అప్పటికి కూడా పాపాజీ తన ఆధిక్యత పట్ల ఆనందంతో ఉన్నారు. ఎందుకంటే, మహర్షికి తనకు కల్గినటు వంటి దర్శనములు ఎన్నడూ లభించి ఉండవు అనే నిశ్చయంతో, అయితే, కృష్ణుడు వచ్చి మీతో ఆటలాడి, తర్వాత అంతర్ధాన మౌతారన్న మాట, అప్పుడు గంభీరమైన వాక్యము వెలువడింది. "ప్రత్యక్షమవుతూ, అంతర్ధాన మౌతూ ఉండే దేవుని వల్ల ప్రయోజనమేమిటి? ఆయన నిజమైన దైవమే అయితే, ఆయన అన్ని వేళలా మీతో పాటే ఉండాలి". ఈ వాక్యము వెనక ఉన్న గాంభీర్యముకూడ, పాపాజీని ఒప్పించలేకపోయింది.

ఆయన చెన్నై వెళ్ళి ఉద్యోగంలో జేరారు. ఆయన అప్పటికీ, బాహ్యంలో కనిపించేదైవం పట్ల ఆకర్షితులై, తన కృష్ణుని తో ఆటలు ఆడుతూనే ఉన్నారు. ఆయన పని ముగించుకుని ఇంటికి రాగానే, ఒంటరిగా కూర్చుని, కృష్ణ నామమును పాతిక వేలసార్లు జపించేవారు. ఆయన, తర్వాత దానిని రెట్టింపుజేశారు. ఒకరోజు ఉదయాన్నే ఎవరోతలుపు తట్టారు. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు ప్రత్యక్షమై, దర్శన మిచ్చారు. కొద్ది సేపటికే వారు అంతర్ధానమైపోయారు. తర్వాత, తాను అంతకు ముందు జేసినట్లుగా ఏకాగ్రతతో జపము చెయ్యలేక పోతున్నట్లు, ఆయన కనుగొన్నారు. తాను అంతకు ముందు పారాయణచేసే గ్రంథములను కూడా ఆయన చదువ లేకయారు. ఎందుకంటే, ఆయన మనసు ఏ ఆలోచనలూ లేక నిశ్చలంగా ఉండుటచే, ఆ నిశ్చల మానసిక స్థితి ఆయనకు ఆశ్చర్యము కల్గించింది. తర్వాత ఆయన పూజగదిలో రమణులు నవ్వుతూ కనిపించారు, అప్పుడాయనకు గుర్తుకు వచ్చింది. మహర్షి సన్నిధిలో ఇటువంటి ప్రశాంతతనే తాను అనుభవించినట్లు, ఆయన తనలో తాను అనుకున్నారు. "నేను వెళ్ళి, ఆయనను అడుగుతాను, నాకు ఏమి జరిగిందని. నేను ఇదివరకు చేసే మతపరమైన సాధనలేమీ ఇపుడుచేయలేక పోతున్నాను".

ఆయన అరుణా చలమునకు వెళ్ళారు. మళ్ళీ అదే విధంగా జరిగింది. మధ్యాహ్న భోజనమైన పిదప ఆయన మహర్షిని కలవాలనుకున్నారు. కృష్ణస్వామి ఆయనను మరల నిలిపి వేశారు. మరల భగవాన్, ఆయనను లోనికి రానివ్వమని చెప్పారు. ఆయన భగవాన్ ముందు కూర్చున్నపుడు ఈ విధంగా జరిగింది, "నేను భగవాన్ ఎదురుగా కూర్చుని, నా జీవిత కథను చెప్పసాగాను. గత పాతిక సంవత్సరములుగా నేను సాధన చేస్తున్నాను. నేను కృష్ణ నామాన్ని రోజుకు యాభై వేలసార్లు వరకు కూడా జపించాను. నేను చాలా ఆధ్యాత్మిక గ్రంథములను కూడా చదువుతున్నాను, శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు నాకు వారి దర్శన భాగ్యమును ప్రసాదించిన తర్వాత, నేను నా సాధనను కొనసాగించ లేకపోతున్నాను, నేను ధ్యానము చెయ్య లేక పోతున్నాను, నేను గ్రంథములు కూడ చదువ లేకపోతున్నాను, నేను అంతరంగము లోతులలో ప్రశాంతతను అనుభవిస్తున్నాను. ఏమైనప్పటికి, దేవుని వెదకాలనే కోరిక లేకుండా పోయింది. దైవ చింతనలో లగ్నమై

ఉండుటకు నా మనసు అంగీకరించుట లేదు. నాకేమి జరిగింది? నేనేమి చెయ్యాలి?" అని నేను మహర్షిని అడిగాను. మహర్షి నావైపు చూసి, మీరు చెన్నై నుండి ఇక్కడకు ఎలా వచ్చారు? అని అడిగారు. ఆ ప్రశ్న ఎందుకు అడుగవలసి వచ్చిందో నాకు అర్థం కాలేదు. అయినా మర్యాదగా "రైలులో" అని బదులిచ్చాను, "మీరు తిరువణ్ణామలై స్టేషన్‌కు వచ్చినపుడు ఏమి జరిగింది?" అని ఆయన అడిగారు, "నేను రైలు నుండి దిగగానే, టికెట్టు ఇచ్చివేసి, ఆశ్రమమునకు తీసికుని వెళ్ళుటకై ఒక ఎద్దుల బండిని మాట్లాడుకున్నాను", "మీరు ఆశ్రమమునకు జేరుకుని బండివానికి పైకము ఇచ్చిన తర్వాత ఏమి జరిగింది?" అని అడిగారు మహర్షి "అతడు తిరిగి టౌన్‌కు వెళ్ళిపోయి ఉంటాడు", అని నేను బదులిచ్చాను, ఈ ప్రశ్నలన్నీ ఎటువైపుకు తీసుకుని వెళ్తున్నాయో? అనే సంభ్రమంతో," ఆ రైలు మిమ్ములను మీ గమ్యమునకు జేర్చింది. మీరు ఆ రైలు నుండి క్రిందికి దిగేశారు ఎందుకంటే, ఆ రైలుతో మీకిక పని లేదుగనుక. ఎద్దుల బండి విషయంలో గూడా అవిధంగానే జరిగింది. అది మిమ్మలను ఆశ్రమము వద్దకు జేర్చగానే, దానినుండి మీరు దిగేశారు. ఇప్పుడు ఇక్కడ ఉన్నారు గనుక మీకు 'రైలుతోనూ, బండితోనూ పనిలేదు, అవి మిమ్ములను ఇక్కడకు జేర్చటానికి సాధనములుగా ఉపయోగపడినవి. అదే విధంగా మీ సాధన, ధ్యానము, జపము విషయములోనూ జరిగింది. మీకు ఇక వాటితో అవసరములేదు. మీరు వాటిని వదలి వెయ్యలేదు. వాటంతట అవే, వీడి వెళ్ళినవి, ఎందుకంటే వాటి కార్యమును అవి నెరవేర్చటము పూర్తి అయినది గనుక మీరు ఇచ్చటికి జేరుకున్నారు.

ఆయన నావైపు శ్రద్ధగా చూశారు. నా శరీరము, మొత్తమూ, మనస్సు గూడా, కడగబడి పరిశుభ్రంగావించబడినట్లు నాకు అనిపించింది. ఆయన నా హృదయము లోనికి నిశితంగా చూస్తున్నట్లు అనిపించింది. సమ్మోహనపరిచే ఆయన యొక్క దృష్టితో, నా శరీరములోని ప్రతి అణువూ, శుద్ధి చేయబడినట్లు అనిపించింది. శరీరములో ఏదో మార్పు సంభవించింది. పాత శరీరములోని ప్రతి అణువూ నశించిపోయి, దాని స్థానములో నూతన శరీరము సృష్టించబడింది. నాతో మాట్లాడిన అవ్యక్తే, నిజానికి నేనేదై ఉన్నానో, అదేనని, నేను ఎల్లప్పుడూ (అనాదిగా) ఏదిగా ఉన్నానో అదే నని అప్పుడు నేను అర్థం చేసుకున్నాను. నాకు నా స్వస్వరూపము యొక్క ఎఱుక కలుగగానే, ఆ గుర్తింపు యొక్క ప్రభావం వెంటనే తెలిసింది. 'గుర్తింపు' అనే మాటను నేను ఉద్దేశపూర్వకముగానే వాడాను, ఎందుకంటే, ఆ అనుభవము నాకు విశదపడగానే, ఎనిమిది సంవత్సరముల ప్రాయములో, లాహోర్‌లో నేను పొందిన అనుభవము వంటిదే, ఇది అని నాకు తెల్సింది. అది అప్పుడు కాకతాళీయంగా జరిగి ఉండవచ్చును, మహర్షిచేత పంపబడిన మౌన తరంగములు, నన్ను తిరిగి అదే స్థితిలో (ఆ పూర్వ) నిలిపాయి. కానీ ఈసారి, ఆ స్థితిలో శాశ్వతంగా నిలచి పోవటం జరిగింది.

తిరిగి ఆ పూర్వపు బాల్య స్థితిలోనికి వెళ్ళవలెననెడి కోరికతో, దైవమును బాహ్యములో దర్శించాలని కోరుకున్న ఆ 'నేను', మహర్షి నాకు విశదపరచిన, ఆత్మ యొక్క ప్రత్యక్ష జ్ఞానము, ప్రత్యక్ష అనుభవముతో అంతరించిపోయింది. ఆ స్పష్టమైన అనుభవమును నేను వర్ణించలేను, ఎందుకంటే, ఆ విషయంపై వ్రాయబడిన గ్రంధములన్నీ కూడా, ఆ అనుభవమును మాటలు వర్ణింపజాలవని పేర్కొనిన విషయం నిజమే. అసలైన ఆ అనుభవము వర్ణనకు అతీతమైనది. దాని ఉపరితల విషయములను గురించి మాత్రమే నేను మాట్లాడగలను.

నా శరీరములోని ప్రతి జీవకణమూ, ప్రతి అణువు గూడా, వాటికి ఆధారభూతమై నట్టి చైతన్యము యొక్క ప్రత్యక్ష జ్ఞానమూ, అనుభవమూ లభించుటచే, ఒక్కసారిగా జాగృతమైనాయి. నా ఆధ్యాత్మిక అన్వేషణ ముగిసినదని నాకు తెలిసినది. ఏమైనప్పటికీ, ఆ జ్ఞానము యొక్క మూలము ఎల్లపుడూ వర్ణనకు అతీతముగానే ఉంటుంది. ఇదే పాపాజీ యొక్క నిజమైన, అంతిమమైన సాక్షాత్కారము. ఆ అనుభవము సంభవించినపుడు, దైవము యొక్క దర్శనమును లక్ష్యపెట్ట వద్దని (పట్టించు కొనవద్దని), ఆ దేవుని చూడవలెననుకునే వాని స్వభావమును, వాని మూలమును గురించి అన్వేషించమని మహర్షి, పాపాజీకి సలహా నిచ్చారు. బాహ్యములో దైవమును దర్శిచాలనే కోరిక దాని కదే తొలగి పోయింది.

పాపాజీ ఎంతో దయతో, ఈ అనుభవమును సాధకులమైన మనతో పంచుకున్నారు, పాపాజీ ఇలా అన్నారు, "ఇప్పుడు వెనుదిరిగి చూసుకొంటే, 'నేనెవరను?' అనే ప్రశ్నను, ఎన్నో సంవత్సరములకు ముందే నేను వేసుకుని ఉండవలసిందని

అనిపిస్తున్నది. నాకు ఎనిమిదేళ్ళ ప్రాయము లోనే 'చెతన్యము' యొక్క ప్రత్యక్ష అనుభవము కలిగినది. మిగిలిన జీవితమంతా తిరిగి ఆస్థితికి జేరుకోవాలనే ప్రయత్నంలో గడిచి పోయింది. మా తల్లిగారు, నేను కృష్ణపరమాత్మ ఎడల భక్తి కలిగి ఉంటే, ఆ భక్తి నాకు తిరిగి ఆ అనుభవమును కలిగిస్తుంది, అని భావించారు. కానీ అది నా మనస్సు యొక్క స్వభావమును పూర్తిగా మార్చివేసి, నేను బాహ్యములో దైవమును అన్వేషించునట్లుగా చేసింది. ఆ బాహ్యములోని దైవము, నేను పొందాలని ఆరాటపడే ఆ ఒక్క అనుభవమును ప్రసాదిస్తారని, ఆమె నమ్మారు. నా ఆధ్యాత్మిక అన్వేషణలో, నేను వందలాది మంది సాధువులను, స్వాములను, గురువులను కలిసాను. కానీ వారెవ్వరు కూడా, ఆ సరళమైన సత్యాన్ని, మహర్షి విశదపరచిన విధంగా విశదపరచలేక పోయారు. వారిలో ఏ ఒక్కరూ కూడా దైవము నీలోనే ఉన్నారు. ఆయన నీకంటే వేఱుగా లేరు. నీవే దైవముపు "నేనెవరను?" అని నిన్ను నీవు ప్రశ్నించుకుంటూ, మనోమూలమునకు జేరుకుంటే, ఆయనను నీ హృదయములోని చైతన్యముగానే తెలుసుకొన గలవు" అని చెప్పలేదు. నేను గనుక మహర్షిని, నా జీవితంలో ముందుగానే కలుసుకుని ఉన్నట్లైతే, ఆయన బోధలను విని ఆచరణలో పెట్టి నట్లైతే, సంవత్సరముల తరబడి, నిష్ఫలమైన 'బాహ్య అన్వేషణ' అనే శ్రమ నుండి తప్పించుకునే వాడిని", ఇది మన కందరకూ వర్తిస్తుంది. మనము వెంటనే, "నేనెవరను?" అనే ప్రశ్నతో అంతర అన్వేషణలోకి మునగాలి.

మహర్షి, పాపాజీకి సద్గురువు అయినారు. పాపాజీ చెన్నైలోనూ, ఇతర ప్రాంతములలోనూ, ఉద్యోగము చేస్తూ ఉన్నారు. సెలవు దినములలో, ఆయన మహర్షి సన్నిధి, సామీప్యములలోని ప్రయోజనములను పొందుటకై ఆశ్రమమునకు వచ్చేవారు. ఆయన భగవాన్‌ను ప్రతిచోటుకు అనుసరిస్తూండే వారు, గోశాలకు, కొండపైకి, మహర్షి ఎక్కడకు వెళితే అక్కడకు ఆయన వెంట వెళ్ళేవారు. ఎందుకంటే సద్గురువు సాన్నిధ్యము యొక్క ప్రాముఖ్యతను ఆయన అర్థము చేసుకున్నారు కనుక. ఒక భక్తునికీ, భగవాన్‌కు జరిగిన సంభాషణను వినుట ద్వారా, తాను, సద్గురువు సన్నిధి యొక్క విశిష్టతను తెలుసుకున్నానని, పాపాజీ, నాకు తెలిపారు. ఒక భక్తుడు, భగవాన్‌ను, "ఆత్మ సాక్షాత్కారమును పొందవలెనంటే, ఏఏసాధనలు ఉపకరిస్తవి?" అని అడిగారు. భగవాన్, "పవిత్ర గ్రంధములలోని బోధలు, సాక్షాత్కారమును పొందిన వారి యొక్క బోధలు అందులకు ఉపకరిస్తవి "అని బదులిచ్చారు. ఆ భక్తుడు మరల, "ఆ బోధలు, చర్చలు గానూ, ఉపన్యాసములుగానూ, ధ్యానముగానూ ఉండవచ్చునా?" అని ప్రశ్నించినపుడు, మహర్షి, "అవి అన్నియూ రెండవతరగతికి (నిమ్నశ్రేణికి) చెందిన ఉపకరణములే. అత్యంత ఆవశ్యకమైన ఉపకరణము సద్గురువు యొక్క అనుగ్రహమే". నేను దీనిని పూర్తిగా అవగాహన చేసుకున్నాను. అందుకే మహర్షి సాన్నిధ్యమును పూర్తిగా ఉపయోగించుకుంటున్నాను". అని ముగించారు, పాపాజీ.

1947లో భారతదేశమునకు స్వాతంత్ర్యము వచ్చింది. భారతదేశమునకు, పాకిస్తాన్‌కు మధ్య విభజన జరిగింది. ఆవిభజనకు, ఒక నెల ముందుగా, పాపాజీ, తన స్నేహితుడైన దేవరాజ మొదలియార్‌ను, ఆశ్రమంలో కలిశారు. ఆయన పాపాజీతో, ముందుగానే అనుకున్నట్లు విభజన జరిగితే, పాపాజీ కుటుంబము నివసించే ప్రదేశము, పాకిస్తాన్‌కు చెందుతుంది. వారి ప్రాణములకు అపాయము సంభవించ వచ్చును. అందువలన, వారిని భారతదేశములోనికి తీసుకుని రావలసినదని,(మొదలియార్) సలహా ఇచ్చారు. పాపాజీ, "నా కుటుంబముతోటి నా అనుబంధము ఒక స్వప్నము వంటిది. నేను వెనుకకు వెళ్ళను. నేను మహర్షి సన్నిధిని వీడను" అన్నారు . దేవరాజ మొదలియార్, వృత్తి రీత్యా వకీలుగావున, తన పట్టును విడువక, మహర్షికి ఆ సంగతిని తెలిపారు. భగవాన్, పాపాజీని పిలిచి ఆయనతో మాట్లాడారు.

పాపాజీ మాటలలోనే చెప్పాలంటే, 1947లో భారతస్వాతంత్ర్యమునకు, ఒక నెల ముందు, దేవరాజ మొదలియార్, పంజాబ్‌లో నా కుటుంబము నివసించేప్రాంతము, త్వరలోనే పాకిస్థాన్‌కు చెందిన భూభాగముగా మారనున్నదని తెలిపారు. "మీరు అక్కడకు వెళ్ళి, ఎందుకు మీ కుటుంబమును వెనుకకు తీసికునిరారు?" అని ఆయన నన్ను ప్రశ్నించారు. "నేను వెళ్ళబోవుట లేదు. నేను నా సద్గురువైన మహర్షి సన్నిధి విడిచి వెళ్ళలేను," అన్నాను. దేవరాజమొదలియార్ అపుడు భగవాన్‌తో చెప్పారు. మహర్షి నన్నుపిలిచి, "మీ స్వస్థలములో చాలా అల్లర్లు జరుగనున్నవి. మీరు వెంటనే అక్కడకు వెళ్ళి, మీ కుటుంబమును ఎందుకు వెనుకకు తీసికునిరారు?"అని భగవాన్ ప్రశ్నించారు. "నేను దృఢ విశ్వాసముతో బదులు పలికాను, "భగవాన్, నా

పాత జీవితము ఒక స్వప్నము వంటిది. నేను నాకు ఒక భార్య ఉన్నదని, ఒక కుటుంబము ఉన్నదని కలగన్నాను. మిమ్ములను కలసినపుడు, ఆ కలను అంతము చేశారు. నాకు ఇక కుటుంబము ఎంత మాత్రమూ లేదు. నా కున్నది మీరొక్కరే. మహర్షి "నీకు నీ కుటుంబము ఒక స్వప్నము వంటిదైతే, ఆ స్వప్నములోనే నిలచి మీరు మీ బాధ్యతను నెరవేర్చుటలో తేడా ఏమున్నది. అది 'కేవలము స్వప్నమే అయితే, వెళ్ళటానికి మీ రెందుకు భయపడతారు?" అని అడ్డుకున్నారు. అచటికి వెళ్ళుటకు నా అసమ్మతికి వెనుక గల అసలు కారణమును, నేను వివరించాను. "భగవాన్! నేను మీ భౌతిక రూపముతో ఎక్కువ మమకారమును పెంచుకున్నాను. నేను మిమ్మలను వదలి వెళ్ళలేను. నేను మిమ్ములను ఎంతగా ప్రేమిస్తున్నానంటే, మీ పైనుండి, నాచూపును గూడా మరల్చలేను. నేను మిమ్ములను ఎలా వదలి వెళ్ళగలను?" మహర్షి నావైపు నిశ్చలంగా చూసి, అపుడు, "మీరెక్కడ ఉన్నా, నేను మీతోనే ఉన్నాను." అన్నారు. మహర్షి ఆ మాటలను పలికిన తీరును చూసి, ఆయన, నేను వెళ్ళితీర వలెననెడి నిశ్చయంతో ఉన్నట్లు నాకనిపించింది. ఆ చివరి వాక్యము, నేను చేయబోయే ప్రయాణమునకు, నా భావి జీవితమునకు ఒక ఆశీర్వాదమువలె అనిపించింది. నా సద్గురువు స్వస్వరూపమైన 'అహమ్' లేదా నాలోని 'అంతర సత్యమే', నేను నా 'హృదయం చైతన్యము' నుండి విడిగా ఎలా ఉండగలను? నేను, నా సద్గురువు నిర్ణయమును అంగీకరించి, ఆయనకు ప్రణమిల్లాను, ఒకే ఒక్కసారి,గౌరవము, ప్రేమలతో ఆయన పాదములను తాకాను. ఆయన సాధారణముగా ఎవరినీ, తన పాదములను తాక నివ్వరు, కానీ ఇది ఒక ప్రత్యేకమైన సందర్భము కనుక ఆయన నివారించలేదు. పైకి లేచే ముందు, ఆయన పాదములక్రింద నుండి కొంత ధూళిని తీసికుని, ఒక పవిత్రమైన జ్ఞాపికగా, నా జేబులో భద్ర పరచుకున్నాను.

పాపాజీ పెషావర్‌కు వెళ్ళారు. అది ఒక అద్భుతమైన ప్రయాణము. నా హృదయమునకు చేరువగా ఉన్న ప్రసాదము, నన్ను కాపాడి, అడుగడుగునా, నాకు మార్గ దర్శకమైంది. అప్పటికే అలజడులూ,అల్లర్లూ పాకిస్థాన్‌లోరాజుకుంటున్నవి. రైళ్ళు కిటకిటలాడుతున్నవి. హిందువులు, ముస్లింలు, విభజింపబడి, వేరు వేరు బోగీలలోకి ఎక్కించబడుతున్నారు. పాపాజీ హిందువుల బోగీలోనికి ఎక్కి కూర్చున్నారు. భగవాన్ ఆయనకు ముస్లిమ్‌ల బోగీలోనికి వెళ్ళి కూర్చొన వలసినదిగా ప్రేరేపణ కల్గించారు. ఆ బోగీలో ఎక్కువ మంది జనులు లేరు. మరొక స్టేషన్ వచ్చేసరికి హిందువుల బోగిలో ఉన్న వారందరూ, నిర్దాక్షిణ్యంగా చంపివేయబడ్డారు. పాపాజీ సురక్షితంగా, తమ గమ్యం జేరి, తన కుటుంబమును వెనుకకు తెచ్చారు. అందులో ముప్పది అయిదు మంది స్త్రీలు ఉన్నారు. మరల ఒక అద్భుతము సంభవించింది. దానిని కూడా ఆయన ఆ ప్రసాదమునకే ఆపాదించారు. ఆయన, ఆయన కుటుంబ సభ్యులు, భారతదేశపు సరిహద్దును చేరుకునే, సరికి, పాకిస్తాన్‌ను వదలి వెళ్ళే ఆఖరిరైలు అదేనని, రైలు మార్గములు విధ్వంసముగావింపబడినవని, వారికి తెలిసింది. పాపాజీ తన కుటుంబముతో లక్నోకు వెళ్ళారు. అక్కడ ఒక మిత్రుని సాయముతో, ఒక ఇల్లు కనుగొన్నారు. 1966వరకు, తనకుటుంబ సంరక్షణ కొరకు కష్టపడి పనిచేశారు. ఆయన ఆత్మలో స్థిరముగా స్థితులై ఉన్నారు. కానీ బాహ్యములో కుటుంబ సంరక్షణకొఱకు, రేయింబవలు పని చెయ్యసాగారు. హిందూ శాస్త్రము ప్రకారము, కేవలము ఒక పూర్ణజ్ఞాని మాత్రమే, ఒక ఆత్మ సాక్షాత్కారమును పొంది ఆత్మ నిష్ఠుడై ఉన్నవాడు మాత్రమే, ఒక నిజమైన కర్మ యోగికాగలడు. పాపాజీ, "ఆత్మమాత్రమే సత్యమైనది. మిగిలిన దంతా కేవలమూ స్వప్న తుల్యమే", అని భావించేవారు.

పాపాజీ ఆధ్యాత్మిక సాధన కొరకై ఏకాంతము కొరకు, గంగానదికి వెళ్తుండేవారు. ఇంటిలో ఉన్నపుడు సత్సంగము చేస్తుండేవారు. ఒక చిన్న కూటమిగా ఉన్నది కాస్తా పెద్ద సముదాయముగా మారిపోయింది. జ్ఞానము ద్వారాగానీ, కఠోర నియమ నిష్ఠలద్వారా గానీ, ఆధ్యాత్మిక సాధనల ద్వారాగానీ ఆత్మను తెలుసుకొనలేరని, వేదములు ఘోషిస్తున్నవి. ఆత్మను కేవలము ప్రత్యక్ష అనుభవము ద్వారా మాత్రమే పొందగలరు. భగవాన్ నుండి అదృష్టవశాత్తూ ఈ జ్ఞానమును పొందగల్గిన పాపాజీ, దానిని తనతో అనుబంధములోనికి వచ్చిన వారికి పంచసాగారు. ఇంకొక విధంగా చెప్పాలంటే, తన గురువు తనకు ఇచ్చిన దానిని, తాను ఇతరులకు ఇవ్వసాగారు. అందుకే ఆయన గొప్ప గురువు, తన గురించి తాను అలా వెల్లడి చెయ్యపోయినా. ఆయనకు ఎటువంటి సంస్థ లేదు. ఆయన ఎపుడూ ధనము వసూలు చెయ్యలేదు. అందుకు బదులుగా తాను కష్టించి సంపాదించిన దానితో పేదప్రజలకు భోజనం పెట్టేవారు.

1993లో నేను 'దిమౌంటెన్‌పాత్' పత్రికకు సంపాదకునిగా ఉన్నపుడు, భగవాన్ నుండి నేరుగా ఆత్మ సాక్షాత్కారము పొందిన వారి నుండి, వ్యాసములను సంగ్రహించుటకు, ఆతృతతో ఉన్నాను. రామకృష్ణ మఠమునకు చెందిన, స్వామి ఏకాత్మానంద కూడా, వ్యాసములను సేకరించి, వానిని పత్రికలో ధారావాహికలుగా ప్రచురించమని ప్రోత్సహించారు. కానీ ఆశ్రమములోని కొందరు ఈ అభిప్రాయమును వ్యతిరేకించారు. వారు పాపాజీ పై వ్యాసమును ప్రచురించుటకు వ్యతిరేకించారు. నా స్నేహితురాలు, అనురాధకూడా, నా నిర్ణయమును ప్రశ్నించారు. ఆ సమయంలో డేవిడ్ గాడ్‌మన్,నాడియాసుతారా, నా పనిలో సహకరిస్తున్నారు. అనురాధ ఈ ప్రశ్నను లేవనెత్తారు. "మీరు కుంజుస్వామిగురించి, అన్నామలై స్వామి గురించి వ్రాయవచ్చును, ఎందుకంటే వారితో మీకు ప్రత్యక్ష అనుభవమున్నది గనుక. పాపాజీతో మీకు ఏవిధమైన అనుభవమైనా ఉన్నదా? ఇంత వ్యతిరేకత మధ్య ఆ వ్యాసమును ఎందుకు ప్రచురించ బోతున్నారు?" అన్నారు.

"మీ అంతట మీరే వెళ్ళి ఎందుకు తెలుసుకొనరాదు?" అని నేను బదులిచ్చాను. అనురాధ చాలా ధైర్యముగల స్త్రీగనుక, నేరుగా పాపాజీ వద్దకు వెళ్ళారు. అక్కడ ఏడుదినములు గడుపదలచి, తన తిరుగు ప్రయాణమునకు కూడా టికెట్టు బుక్ చేసుకున్నారు. ఆ నృత్యములను, గీతములను, పాటలను, భజనలతోనూ ఆవిడ ఆనందించి నప్పటికి, ఆమెకు పాపాజీతో ఎటువంటి అనుబంధమూ ఏర్పడలేదు. ఆమె వెళ్ళి పోవలసిన రోజు వచ్చింది కానీ, ఆమెకు ఏమీ అనుభవం కాలేదు. వెళ్ళిపోయేముందు అనూరాధ ఆల్‌మీరాను, పాపాజీ యొక్క మీరాను కలుసుకున్నారు. ఆల్‌మీరా, అనూరాధ పట్ల ఎంతో అప్యాయతతో ఉన్నారు. ఆమె, అనూరాధ, పాపాజీ గురించి అనుకున్నదంతా విని, మీరు ఒక మహనీయునితో 21 రోజులు గడిపితే తప్ప, ఆయనను అర్ధము చేసుకొనలేరు". మీరు మరికొంతకాలము ఉండవచ్చును గదా?" అన్నారు.

అనూరాధ స్టేషన్‌కు వెళ్ళారు. కాని దైవలీల చూడండి. ఆ రైలుగార్డు, అనూరాధకు అనుమతించబడిన టికెట్ ఉన్నప్పటికి, ఆమెను రైలు ఎక్క నివ్వలేదు. ఆమె పాపాజీ సత్సంగ గృహమునకు తిరిగి వచ్చినపుడు, పాపాజీ తన గాయకులను చివాట్లు పెట్టటము విన్నారు. "అనూరాధ ప్రతిదినమూ రమణ సద్గురు పాటను పాడినారు. నాకది చాలా ఇష్టము. ఎందుకని ఎవ్వరూ ఆమె వద్ద ఆ పాటను నేర్చుకొనలేదు?" రమణ సద్గురు పాట పాడిన పిమ్మట, అనూరాధ, పాపాజీకి ప్రణమిల్లారు. పాపాజీ, అనూరాధను, అతిథి గృహములో ఉండమన్నారు. తర్వాత, పాపాజీ, డాక్టరు. యమున ఆమెగదికి వచ్చారు. పాపాజీ కరుణతో ఆమెవైపు చూసి, "అనూరాధా! రమణ మహర్షి తన స్వప్నములను గురించి ఏమని చెప్పారు? అన్నారు. ఆమె,పాపాజీ ! భగవాన్‌కు చాలా అరుదుగా కలలు వచ్చేవి. అవి ఏదో ఆలయము లోనికి ప్రవేశిస్తున్నట్లో, లేక అరుణాచలములో ప్రవేశిస్తున్నట్లుగానో ఉండేవి". అన్నారు. "పాపాజీ ఆమె వైపునకు వంగి, ఆమె బుగ్గపై చిన్నగా తట్టి, "నీకు బాహ్యంగా నీవు చూసేది, చేసేది, అంతా కూడా ఒక స్వప్నమేనని ఆయన చెప్పలేదా? అన్నారు. అది ఆమె మనస్సును అంతరంగములోనికి నెట్టి, ఏవిధమైన ఆలోచనలూ లేకుండా "నిశ్చల ప్రశాంత స్థితిలో ఉండేటట్లు చేసింది. పాపాజీ, యమున వెళ్ళి పోయిన తర్వాత కూడా, ఆమె ఆ నిశ్చల ప్రశాంత స్థితిలో మూడు గంటల పాటు ఉన్నారు. తర్వాత ఆమె రమణాశ్రమమునకు తిరిగి వచ్చినపుడు, పాపాజీని గురించిన వ్యాసమును, పత్రికలో ప్రచురించుటకు ఆనందంతో అంగీకరించారు.

1995, సంక్షోభము, అలజడితో కూడి ఉన్నది. చాలా విమర్శలు, వ్యతిరేకత చోటు చేసుకున్నవి. నేను ఆశ్రమ నిర్వహణ నుండి, తప్పుకొనదలచి, ఒకరి తర్వాత ఒకరుగా పాత భక్తులందరి సలహాను కోరాను. వారిలో ప్రతి ఒక్కరూ, అన్నామలై స్వామి, యోగి రామసూరత్ కుమార్, లక్ష్మణ స్వామి, ఇతరులు ఆశ్రమములో నేను చేస్తున్న పనిని ఆపివేసి, అంతరంగములోనికి ప్రయాణము చేపట్టమన్నారు. నేను పాపాజీని కూడా సంప్రదించాలనుకున్నాను. నేను లక్నోకు ప్రయాణమైనాను. అప్పటికి అది, ఆధ్యాత్మిక సాధకులకు, ఎడారులలోని నిజమైన నీటి మడుగు వలె ఉన్నది. పాపాజీ కరుణకు గొప్ప ఉదాహరణ. ఈ కరుణలో విమర్శలు, చివాట్లు, కూడా భాగమేనని చెప్పక తప్పదు. ఎందుకనగా సాధకులను జాగృతము చెయ్యటానికి, నేను పాపాజీకి ప్రణమిల్లి అక్కడ ఎంతో వ్యతిరేకత ఉన్నది అన్నాను. పాపాజీ, నావైపు అప్యాయతతోనూ, స్థిరంగానూ చూసి, "గణేశన్! ఈ ప్రపంచంమొత్తం మిమ్ములను వ్యతిరేకించినా ముందుకు సాగండి, ఈ ఆధ్యాత్మిక మెట్టుకు మీరు పంపబడినారు. మేమంతా, మీతోపాటే ఉన్నాము. అన్నారు ఆయన నన్ను కౌగలించుకుని, "అంతరంగములోనికి, లోతుగా మునగండి. ఆ

నిశ్చల స్థితిలోనికి మునిగి, హృదయములో నిష్ఠులై ఉండండి". అన్నారు ఆ క్షణముననే, నాకున్న ఒకే ఒక గొప్ప అనుబంధం, రమణాశ్రమముతోటి నాకు గల గొప్ప అనుబంధము, శరీరముపై నుండి ఒక వస్త్రము జారిపోయినట్లు జారిపోయింది. ఇప్పుడు నేను ఎక్కడకు వెళ్ళినా అరుణాచలుని అనుభూతి పొందుతూనే ఉంటాను. ఏ దేశములో నేను ఉన్నప్పటికి, ఏ స్థితిలో నేను ఉన్నప్పటికీ, అది ఆనందమైనా, విచారమైనా, లోపలి నిశ్చలత్వము చెక్కు చెదరకుండా ఉంటుంది. మీకు అంతరంగము వైపునకు మరలుటకు, ఏ విధమైన అర్హత, పరిపక్వత అవసరము లేదు. మీ అంతరంగములోనికి వెళ్ళి "నేను ఎవరను?" అని ప్రశ్నించుకొనండి, అప్పుడు అరుణాచలుడు పూర్తిగా మీ బాధ్యతను తీసేసుకుంటారు.

1990నుండి నేను ప్రపంచ వ్యాప్తంగా పర్యటించసాగాను. అప్పుడు, మున్నెన్నడు ఆశ్రమములో నేను చూడని, కలుసుకొనని భక్తులను కలుసుకొనుట, వారి ఇళ్ళలో బసచేయుట జరిగింది. వాళ్ళల్లో చాలామంది ఇళ్ళలో మూడు ఫోటోలు ప్రముఖంగా కనిపించేవి. అరుణాచలునిది, భగవాన్‌ది, పాపాజీది. ఆ భక్తులలో ఎక్కువ మంది, పాపాజీ తమకు హృదయంలో 'అహం స్ఫురణ' అనుభవాన్ని కల్గించారని చెప్పారు. అరుణాచలుడు తన సత్యమైన 'నేను' అనబడే 'ఆత్మచైతన్యము'ను గురించిన జ్ఞానము ప్రపంచమంతటా వ్యాప్తి చెందవలెనని ఆదేశించుట గుర్తున్నది కదా. సద్గురువైన రమణమహర్షి దైవత్వమునకు మానవాళికి మధ్య గొలుసు వలె నిలిచారు. ఆ గొలుసు ఇంకొంత పొడిగింపబడవలసి ఉన్నది. ఆ పొడిగించబడినదే పాపాజీ. ఆస్‌బోర్న్, మొదలైన ఇతరులు చేసినపని కూడా ఆయన చేశారు. అదే సత్యముతోటి లేదా దైవముతోటి అనుబంధము కల్గించుట అది తిరుగులేని నిజము.

ఇక్కడ నా స్నేహితురాలు లతాజీ గురించి కొన్ని విషయములు చెబుతాను, ఆమె తన తండ్రి స్నేహితుని ప్రోద్బలంతో పాపాజీ వద్దకు వచ్చారు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె తండ్రి ఆమెను వైద్య వృత్తి చేపట్టమని కోరటంతో ఆమెకు తన తండ్రితో చిన్న గొడవ జరిగింది. ఆమె పాపాజీ సలహాను కోరుతూ సుదీర్ఘమైన లేఖ వ్రాశారు. ఆ రోజు పాపాజీ గృహము వద్ద జరిగిన సత్సంగములో, పాపాజీచేత లతాజీ లేఖ ఎంపిక చెయ్యబడినది (తియ్యబడినది). ఎవరి లేఖనైతే పాపాజీ తీస్తారో ఆ లేఖ వ్రాసిన వారు, పాపాజీ ఎదురుగా కూర్చొనుట ఆచారముగా వస్తున్నది. పాపాజీ సత్సంగహాలు గోడలనిండా, 'నిశ్చలంగా ఉండు' వంటి సూక్తులతో గూడిన పోస్టర్లు (పెద్ద పటములు) ఉండేవి. ఎందుకంటే, ఆయన అందించాలనుకున్న బోధ యొక్క సారము అదే కనుక. పాపాజీ లేఖలోని విషయమును గూర్చి ప్రశ్నిస్తారని లతాజీ ఎదురు చూస్తున్నారు. కానీ, ఆయన ఆ లేఖను ప్రక్కన పెట్టి, "ఏదైనా నన్ను అడగండి", అంటూ ఆమె వైపు చూశారు. ఆమెకు ఇరుకున పడినట్లైంది. ఏమి అడగాలో తోచలేదు. ఆమె గది చుట్టూ కలయ చూచింది. 'నిశ్చలంగా ఉండు' అనే పోస్టర్ (గోడకు అంటించబడిన పెద్ద దళసరికాగితము) ఆమె దృష్టిని ఆకర్షించింది. అందుకని ఆమె" నిశ్చలంగా ఉండుట ఎట్లు?" అని అడిగారు. నిజానికి, ఆమె ఆ ప్రశ్న అడగాలనుకోలేదు. కానీ పాపాజీ చూపు ఆమెను అలా అడిగేలా చేసింది. "ఉండుటఎలా?" అనేది వదిలెయ్యండి. పాపాజీ అన్న ఆ మాటలు తననూ, అక్కడి శ్రోతలలో చాలా మందినీ ఆ అంతరంగ నిశ్చలతలో నిలిపినవని, అది కూడా వారేమాత్రమూ ఎదురు చూడని (ఊహించని) సమయంలో, అని లతాజీ తర్వాత నాతో చెప్పారు.

ఒక చాలా ధనవంతుడైన వ్యక్తి, పది లక్షలడాలర్లు పాపాజీకి విరాళముగా ఇవ్వాలనుకున్నారు. ఆయన ఎంతో నిజాయితీతో పాపాజీని సమీపించి, "నేను మీకొక కానుక ఇవ్వాలను కుంటున్నాను. దయచేసి దానిని స్వీకరించి నన్ను ఆశీర్వదించండి" అన్నారు. పాపాజీ, "సరే, స్వీకరిస్తున్నాను", అన్నారు ప్రతివారూ నవ్వేశారు. ఎందుకంటే, అది ఎంతో పెద్ద మొత్తము కనుక, పాపాజీ ఆ చెక్కు తీసుకుంటున్నపుడు, ఆయన ముఖం వెలిగిపోయింది. ఆయన దానిని ముక్కలుగా చించి వేసి, ఆ వ్యక్తితో, ఇది నా ఆశీర్వాదము అని చెప్పారు.

పాపాజీ, భగవాన్‌కు వారసుడని చిన్నస్వామిని ఇష్టపడేవారు. ఒకసారి మా తండ్రిగారు ప్రయాణము చేస్తూ చెన్నైలోని సెంట్రల్ స్టేషన్‌లో ఉండగా, పాపాజీ అనుకోకుండా ఆయనను కలిశారు. ఆయన మా తండ్రిగారికి సాష్టాంగపడి ఆయన పాదముల వద్ద రెండు వందల రూపాయలు సమర్పించారు. ఆయన అటువంటి వినయశీలి. నేను లక్నో వెళ్ళినపుడు, ఆయన ఎంతో ఆదరంతో స్వాగతం పల్కారు. సత్సంగములో ఆయన, "ఇప్పుడు గణేశన్ మాట్లాడతారు", అన్నారు. పాపాజీ

కరుణకు, అప్యాయతకు మారుపేరు. నిశ్చలంగా ఉండు (బి స్టిల్) అనే పుస్తకంలో ఇవ్వబడిన పద్యము అరుణాచలుని యొక్క ఈ విశాల హృదయమును చక్కగా వర్ణిస్తుంది"

ఈ కలియుగమనే నాటకములో,
శ్రీరమణులు, మౌనము, ఆత్మవిచారణలను స్థాపించారు, (నిలబెట్టారు)
సత్వగుణ పరిధిలో
అందువలననే ఆయన మహర్షి అనబడినారు.
శ్రీపూంజాజీ (పాపాజీ) మౌనమనే జ్వాలను (కాగడాను)
మార్కెట్టు స్థలంలోనికి విసరివేశారు.
నిర్మలత్వమనే కనపడని జ్వాలను,
క్రియా శీలత్వముతో నిండిన నేలపై (విచ్చల విడిగా) స్వేచ్ఛగా వదిలారు.
ఇపుడు జగత్తే రాజుకుంటున్నది.
అందుకే ఆయన పాపాజీ అని పిలువబడినారు, అందరికీ ప్రీతిపాత్రుడైన తండ్రి.



పూలమాలతో గణేశన్‌ను ఆహ్వానించుచున్న పాపాజీ

వోల్టర్ కీర్స్



భగవాన్ యొక్క కొనియాడదగిన భక్తులలో ఒకరైన వోల్టర్ కీర్స్ హాలెండ్ దేశమునకు చెందిన వారు. 1985లో వోల్టర్, తన స్నేహితులను తన ఇంటికి ఆహ్వానించి, భగవాన్ సూటి బోధపై ఉపన్యాసము ఇచ్చారు. వారందరూ తిరిగి వెళ్ళిపోబోతుండగా, "దయచేసి ఆగండి", అని చెప్పారు. ఆయన వారికి తాను శరీరమును విడిచి పెట్టబోతున్నానని తెలిపారు. ఊహించండి. ఇది ఏ గుహలోనో, తిరువణ్ణామలై లోనో గాదు. హాలెండ్‌లో జరిగింది. వోల్టర్, ఒక పెద్ద భగవాన్ ఫోటోను నేలపై నుంచో బెట్టారు. తర్వాత, ఆ ఫోటో ఎదురుగా ఒక దిండును ఉంచి దానిపై తలపెట్టి పడుకున్నారు, సంతోషంతో చిరునవ్వు నవ్వుతూ, చిటికెలో ప్రాణం వదిలేశారు. అక్కడ జేరియున్న వారు, వోల్టర్ తల, ఫోటోలోని భగవాన్ పాదములను తాకుతూ ఉండటం గమనించారు. ఒక పూర్తి శరణాగతి చెందిన జీవితం ఎంత అందంగా ముగిసిందోకదా.

వోల్టర్ చాలా ఉత్సాహము, పట్టుదల గలవ్యక్తి. ఆయన విదేహముక్తుడు వదలి వేసినట్లు, శరీరమును వదలి వేశారు. హిందూ ధర్మశాస్త్రములు ఆత్మ సాక్షాత్కారమును రెండు విధములుగా పేర్కొంటవి. ఒకటి జీవన్ముక్తి, రెండు విదేహముక్తి, ఒక వ్యక్తి, జీవన్ముక్త స్థితిలో ఉన్నపుడు, ఆయన జీవించి ఉండగనే పూర్ణచైతన్యంతో ఐక్యమౌతారు. ఆయనను చూసిన జనులు, ఆయన సాక్షాత్కారము చెందిన వ్యక్తి అని, అంతర జ్ఞానము (లేదా సహజ జ్ఞానము) వలన తెలుకుంటారు. విదేహముక్తుడు, శరీరమును వదలివేసే సమయములో పూర్ణమైన చైతన్యస్థితిలో, ఆనందములో నిలకడ చెంది, శరీరమును వదలివేస్తారు.

మౌంటెన్ పాత్ పత్రికకు సంపాదకునిగా, నేను వోల్టర్‌తో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుతుండే వాడిని. 1970లో పత్రిక సంపాదకులైన ఆర్థర్ ఆస్‌బోర్న్ చనిపోయిన తర్వాత, విద్యావేత్తలైన మిగిలిన భక్తులు, దాని సంపాద కత్వమును నిర్వహించుచుండగా నేను సంచికలకు కావలసిన వ్యాసములను సంపాదించే (పోగుచేసే) బాధ్యతను తీసికున్నాను. ఆ విధంగా వోల్టర్‌తో నా అనుబంధము వృద్ధి చెందింది. ఆయన చక్కగా సమయానికి వ్యాసమును అందిస్తూ నాకు సహకరించేవారు. ప్రతి వ్యాసము పూర్ణ చైతన్యములో మునిగియున్న ఆయన స్వానుభవముతోను, ప్రత్యేకమైన వ్యక్తిగత అనుభవముతో నిండి యుండేది. వోల్టర్‌కీర్స్ గురించి మనకు తెలిసిన విషయములన్నీ ఆయన వ్రాసిన వ్యాసముల ద్వారా తెలిసినవే. వాటిని చక్కగా సంగ్రహపరచి, సరిదిద్దిన డేవిడ్ గాడ్‌మన్‌కు మనము ఋణపడి ఉన్నాము.

భగవాన్ చెప్పేదాని ప్రకారము, దైవము, ఆత్మ, గురువు ఒకే అర్థముకలవి, ఒకరినే సూచిస్తవి. (ఈశ్వరో గురురాత్మేతి) ఈశ్వరుడు లేదా ఆత్మ, ఒక పాత్రను ఎంపిక చేసుకుని, దానిని దివ్యజ్ఞానముతో నింపుతారు. అది భక్తుని బాల్యము నుండే జరుగుతుంది. ఆ విషయమును మీరు ఇంతకు ముందు అధ్యాయములలో గమనించి ఉండవచ్చును. అక్కడ చెప్పబడిన వారందరూ కూడా, ఏదో ఒక విధముగ సత్యము పట్ల, లేదా దైవము పట్ల ఆకర్షితులై, శరీరమును, మనస్సును అధిగమించిన అనుభవము గల్గిన వారే. ఆత్మచేత ఎంపిక చేయబడిన వారిలో వోల్టర్ కీర్స్ ఒకరని నిశ్చయంగా చెప్పవచ్చును.

వోల్టర్ కీర్స్, హాలెండ్ లోని ఒక మతాధికారుల కుటుంబమునకు చెందిన వారు. వారు ఎంతో భక్తిపరులైన క్రైస్తవులు. అటువంటి కుటుంబములు చాలా అరుదుగా ఉంటవని, వోల్టర్ స్వయంగా చెప్పారు. అయిదేళ్ళ ప్రాయంలో వోల్టర్‌కు ఒక విశేషమైన అనుభవము కల్గింది. పెద్ద అయిన తర్వాత అది ఆధ్యాత్మిక అనుభవమని ఆయన గుర్తించారు. వారి కుటుంబ మిత్రులొకరు వారి ఇంటికి వచ్చి, వారితో సంభాషిస్తున్నారు. చిన్నపిల్లవాడు కనుక వోల్టర్ ఆ సంభాషణలో ఆసక్తి చూపలేదు. కానీ ఆ మాటలలో 'బ్రిటిష్ ఇండియా' అనేమాటలు వినగానే ఆయన చెవులు నిక్కబొడుచుకున్నవి. అందులో ఏదో నిగూఢమైన విషయం ఉందని గుర్తించారు గనుక, ఆయన చెప్పలేని ఆనందంతో నిండిపోయారు. ఆయనకు ఆ పదముల అర్థము తెలియక పోయినప్పటికి, అది ఒకరకమైన ఆధ్యాత్మిక అనుభవమే.

ఆయన అయిదేళ్ళ వయసులో ఉన్నపుడు, బయట మైదానంలో ఇసుక దిబ్బలలో ఆడుకుంటున్నారు. ఆయన గులాబీరంగు పూలతోనూ, గుండ్రని నూగుతో నిండిన బంతులవంటి వానితోనూ నిండియున్న ముళ్ళపొదను చూశారు. అకస్మాత్తుగా ఆముళ్ళపొద, ఆ పువ్వులు, ఆఖరికి తన శరీరమూ, అన్ని వస్తువులూ అంతర్ధానమైనపోయి, అంతటా వెలుగుతో నిండిపోయింది. తన చుట్టూ ఉన్న ప్రతిదీ కూడా ఉజ్వల కాంతి ప్రకాశముగానే ఉన్నది. వేదాంతపరమైన కుటుంబమునకు చెందినప్పటికీ, కుటుంబములోని ఎవ్వరినీ ఆ బిడ్డ ఆ సంఘటనకు అర్థము అడుగ లేకపోయారు. ఇరువది ఒక్క సంవత్సరముల వయస్సు వచ్చేవరకు, అవి ఆధ్యాత్మిక అనుభవములని వోల్టర్‌కు తెలియదు. ఒక రోజు ఆయన, ఒక వయస్సులో పెద్ద వారైన వ్యక్తి ప్రక్కన ఒక బెంచీ మీద కూర్చుని ఉన్నారు. ఆయన ఏదో పుస్తకము చదువుతున్నారు. అకస్మాత్తుగా, ఏకారణము లేకుండగనే, ఆయన ఒకపేరాను బిగ్గరగా చదివారు. వోల్టర్ ఆ మాటల అర్థముపై శ్రద్ధ ఉంచలేదు కానీ, తిరిగి ప్రతివస్తువూ కాంతిలో కలసిపోయి, మొత్తం ఉజ్వల కాంతితో నిండిపోయి, ఆయనకు అయిదు సంవత్సరముల వయసులో జరిగినట్లుగానే జరిగింది.

హిందు శాస్త్రములలో ప్రపంచమును, దేశకాలములను అధిగమించేస్థితిని నిర్వికల్ప సమాధి అంటారు. వోల్టర్ 21 సంవత్సరముల వయస్సు వచ్చే సరికి ఈ అనుభవమును మూడుసార్లు పొందారు. ఈసారి ఆయన ధైర్యం చేసి, తన కుటుంబ సభ్యులను (అడిగారు) వాటిని వివరించమని కోరారు. ఆయన వారితో ఈవిధమైన అనుభవములు నాకు తరచుగా కలుగుతున్నవని చెప్పారు. వారి కుటుంబ సభ్యులు, "ఇవి అన్నీ అసాధారణమైన, వింత అనుభవాలు వాటిని ఏ మాత్రము పట్టించుకొనవద్దు," అని చెప్పారు. తాను ఎంతో నిజాయితితో ఆసక్తితో ప్రశ్నించినపుడు, వారివద్ద నుండి లభించిన ప్రతిస్పందన చూసి వోల్టర్ నిరాశచెందారు. తర్వాత తన స్నేహితులను అడిగారు. వారెవరూ వాటిని అర్థము చేసుకొన లేక పోయారు. పైపెచ్చు ఆ అనుభవములను విశ్లేషించి తెలుసుకోవాలని ఆయనకున్న జిజ్ఞాస వారికి లేక పోయింది. ఆయన ఇంకా వీటిని గురించి తెలుసుకోవాలని అనేక గ్రంథములను చదువ నారంభించారు. ఏ పుస్తకములో కూడా, ఆయనకు తగు సమాధానము లభించ లేదు. ఆ అనుభవములలో ఏదోసత్యము ఉన్నదని ఆయనకు గట్టిగా అనిపించ సాగింది. ఒకని యొక్క ఉనికికి, ఒకని శరీరము యొక్క ఉనికికి, అవి మూలము అని ఆయనకు అనిపించింది. అదే మూలమునకు ఆధారభూతమై యున్నదని, దాని మీదనే ఉనికి అంతా, ఈ విశ్వము, దానిలో నిండి ఉన్నవన్నీ గూడా, నిలచిఉన్నవనీ ఆయన అర్థము చేసుకున్నారు. ఆ శక్తే మౌనము యొక్క కాంతి.

వాటి వివరణ కొరకు, ఆయన చేసిన ప్రయత్నములు ఫలించలేదు. ఆయన అంతర్వాణి, ఆయనకు, బహుశ నీకు సహాయ పడగల గురువును నీవు వెదుకు కొనవలసి ఉన్నది అని మెల్లగా చెప్పింది. ఆయనలో ఈ అంతర ప్రబోధము జరిగినపుడే ఆయన గురువు కూడా, చురుకైన పాత్రను పోషించడం ప్రారంభించారు. ఈ భావన కల్గిన కొద్ది రోజుల లోనే, ఒక పెద్దావిడ, ఆయన ఇంటికి వచ్చి ఆయనకు చదువు కొనుటకు రెండు పుస్తకములు ఇచ్చారు. ఆమె, "వోల్టర్, ఈ పుస్తకములను చదువు," అన్నారు. వోల్టర్ అదివరకే అనేక పుస్తకములు చదివి తగు సమాధానములు దొరకక నిరాశ చెంది ఉన్నారు. కానీ ఆ మహిళపైగల గౌరవము కొద్దీ, ఆయన ఆ పుస్తకములను తీసుకున్నారు. ఒకటి స్వామి వివేకానంద యొక్క 'జ్ఞానయోగము,' రెండవది పాల్‌బ్రంటన్ వ్రాసిన 'సీక్రెట్‌పాత్' (రహస్య మార్గము) మొదటి పుస్తకము చదువగానే ఆయన తన్మయత్వంలో మునిగి పోయారు. ఎందుకంటే మొదటి సారిగా, ఆయన ఆధ్యాత్మిక అనుభవములోని సత్యము, ధృవీకరింపబడినది, హిందూసన్యాసిచే అది వ్రాయబడినప్పటికీ. ఆయన గొప్ప ఉత్సాహంతో, ఆ పుస్తకము చదవడంలో మునిగిపోయారు. ఆ పుస్తకము, ఆయన అనుభవము ఆధ్యాత్మిక సంబంధమైనదేనని తెలుపుటయేగాక ధృవ పరచింది. అది ఆయన బంధువులు గానీ మిత్రులు గానీ చెయ్యలేకపోయారు. నిజమైన ఆధ్యాత్మిక సాధకులకు, బాల్యము నుండియే ఇటువంటి, ఆధ్యాత్మిక జిజ్ఞాస ఉండటము అనునది సర్వ సామాన్యమైన విషయమని, ఆ గ్రంథము విశదపరచింది. దానిలోని గొప్ప విశేషమేమిటంటే, ఈ నాటికి కూడా, మహాత్ములు, మహర్షుల, మహనీయుల సంప్రదాయము భారత దేశములో కొనసాగుతున్నదని వివేకానందులు నిశ్చయంగా తెలుపుటయే. వోల్టర్, "నా గురువు భారతదేశములోనే ఉన్నారని నాకు తెలుసును. నేను ఇంకా ఇతర ప్రదేశము లేవీ వెదుకనక్కరలేదు", అని భావించారు.

అంతులేని ఈ విజయోత్సాహంతో ఆయన, రెండవ పుస్తకము చదవటము ప్రారంభించారు. అందులో ఆయనకు భగవాన్ ఫోటో కనిపించింది. మొదటి కొద్ది పేజీలు చదువగానే, ఆయనకు, భగవాన్ తన గురువు, సద్గురువు అని తెలిసింది. ఆయన ఆ భగవాన్ ఫోటోను తీసి, తనకు కనిపించే చోట పెట్టుకుని, తాను చేస్తున్న అనేక రకములైన ధ్యానసాధనలను, ఆ పటము ఎదురుగా కూర్చుని చేసేవారు. ఆ ఫోటోనుండి అనుగ్రహము, శక్తి, ప్రసారిత మవుతున్నట్లు, ఆయన అనుభూతి చెందే వారు, మానవ శరీరములో, ఛాతీలో కుడివైపున, ఆధ్యాత్మిక కేంద్రము లేక ఆధ్యాత్మిక హృదయము ఉన్నదని, సాధకులు దానిపై దృష్టి కేంద్రీకరించవలెననీ, ఆ పుస్తకములో వ్రాయబడినది. వోల్టర్ ఆ ప్రకారముగానే సాధన చేసి, మంచి ఆధ్యాత్మిక తరంగములను అందుకుని, రమణ మహర్షే తన సద్గురువని ధృడ పరచుకున్నారు. కానీ ఆయనకు ఒక విషయంలో ఆదుర్దాగా ఉండేది. ఆ పుస్తకము చాలా సంవత్సరముల క్రిందట వ్రాయబడినది. తన సద్గురువు ఇంకా సశరీరులుగా ఉన్నారోలేదో అనే సంభ్రమంతో ఆయన ఉన్నారు. అదొక్కటే ఆయనకున్న కోరిక. భగవాన్‌ను భౌతికంగా దర్శించాలి. ఆయన హృదయ కేంద్రముపై (దృష్టిని ఏకాగ్రపరచి) ధ్యానించిపుడు, ఆ భగవాన్ ఫోటో ఏదో నిగూఢమైన విధంగా, "నేను ఇక్కడ ఉన్నాను. మీరు నావద్దకు వస్తారు. దిగులు చెందవద్దు", అని హామీ ఇచ్చి, ధైర్యము కలిగించినట్లు అనిపించింది. అనేక కారణములవల్ల వోల్టర్ వెంటనే వెళ్ళలేకపోయారు. రెండవ ప్రపంచ యుద్ధము, జర్మనీ ఆక్రమణ, ఆయన వద్ద ధనము లేకుండుట మొదలైన వాటివలన వెళ్ళలేక పోయారు. 1950 ప్రారంభములో మాత్రమే ఆయన భారతదేశమునకు బయల్దేరగలిగారు భారత భూభాగంపై అడుగు పెట్టగానే, అరుణాచలమునకు ప్రయణమైనారు. రోడా మెక్లైవర్ ఆయనకు ఆతిధ్య మిచ్చారు. ఆమే, ఆయనను భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళారు. ఆయన సంభ్రమాశ్చర్యములతోనూ, గౌరవముతోనూ, దైవమును కలుసు కొనవలెననే తీవ్రమైన కోరికతోనూ, ఆశ్రమములోనికి ప్రవేశించారు. భగవాన్ ఎదురుగా నిలబడినప్పుడు మిక్కిలి ఆనందంతోనూ, కృతజ్ఞత తోనూ నిండిపోయారు. ఆయన భగవాన్ ఎదురుగా వెళ్ళి, "భగవాన్! ధన్యవాదములు మీరు నా ప్రార్ధనలనన్నింటిని అంగీకరించారు. నేను మిమ్ములను సశరీరులుగా చూడాలనుకున్నాను," అన్నారు.

తర్వాత ఆయన తాను మొదటి సారిగా భగవాన్‌ను దర్శించినప్పటి అనుభవమును వివరించారు." తనగదిని హాలుకు కలుపుతూ ఉండే నడువాలో (సన్నని బాటవంటిదానిలో) కుర్చీలో కూర్చుని ఉన్నారు, భగవాన్. అక్కడే ఆయన సందర్శకులను, భక్తులను కలుసుకునేవారు. ఆయనను చూడగానే, నా శరీరము మొత్తము కంపించ నారంభించింది. అది ఇబ్బంది వలననో, భయము వలననోకాదు. అది నేను దైవమునకు ఎదురుగా నిలుచుండుటవలన కల్గినది. ఆ గుర్తింపు నన్ను ఎంతగా ప్రభావితం చేసిందంటే, నా శరీరం దానంతట అదే వణకసాగింది. నేను ఇన్నేళ్ళుగా, నా కలలకు, ఆశలకు, ఆశయాలకు కేంద్రమైన ఆ దివ్యమైన ఉనికిని చూశాను. నేను ఏదో ఒక సామాన్యమైన వ్యక్తి కుర్చీలో కూర్చుని ఉండటం చూశాను అనే నిరాశ పూరితమైన గుర్తింపుగానీ, నిర్లక్ష్య ధోరణిగాని నాలో కలిగి యుండవచ్చును. కానీ, నాకలా అనిపించలేదు. నేను భగవాన్ వంక తదేకంగా చూసినపుడు, దైవమే అక్కడ కూర్చుని ఉన్నట్లు నాకనిపించింది. ఆ ఉదయాన్నే, ఒక మహోజ్వలమైన కాంతి, మానవాకృతిని ధరించి, కాంతిని, మంచితనమును, ప్రసరింప జేస్తున్నట్లు నాకనిపించింది. చాలా కాలం నుండి ఈ చిన్ననాటి విశ్వాసాన్ని, నమ్మేపిల్లలకు చెప్పబడే కల్పిత గాధవలె కొట్టిపారేసే వాణ్ణి. అది అంతకు ముందు నేను దర్శించిన వాటన్నిటి కంటే, మహోజ్వలంగా ఉన్నది."

భగవాన్, తన దృష్టిని వోల్టర్ వైపునకు మరల్చి మందహాసం చేశారు. "ఓ, ఎట్టకేలకు మీరు ఇక్కడకు వచ్చి చేరుకున్నారన్నమాట", అనేది ఆ చిరునవ్వుకు అర్ధంగా వోల్టర్‌కు అనిపించింది. తాను హాలెండ్‌లో స్వగృహములో ఉన్నప్పటి నుండియే, భగవాన్, ఆ ఫోటో ద్వారా తనను నడిపిస్తున్నట్లు ఆయనకు నిశ్చయమైంది, 'పారవశ్యపు తరంగములు నన్ను ముంచెత్తినవి. ఆయన రూపాన్ని చూస్తూ నా కళ్ళకు విందు చేసుకున్నాను. నేను అలా చూస్తూ, చూస్తూ ఆ కాంతివెల్లువలో తడిచి ముద్దైపోయాను. చాలాచాలా కాలము క్రిందట, దైవము ఒక గొప్ప ఉనికి కల్గి, మానవ రూపము ధరించి, కాంతిని, మంచితనాన్ని వెదజల్లుతుంటారని విశ్వసించేవాడిని. కానీ అటు పిమ్మట అదికేవలము నమ్మకముకల్గిన పిల్లలకు చెప్పబడే కల్పిత గాధగా కొట్టి పారేసే వాడిని, కానీ నా చిన్ననాటి విశ్వాసమే సత్యమై నిల్చింది. నాకంటి ఎదురుగా, మహోజ్వల కాంతితో తయారైన

దేహము ఉన్నది. ఆ తొలినాటి ఉదయం నాకు కలిగిన అనుభవమును నేనెట్లు వర్ణించగలను? దైవమే నా కళ్ళముందు రూపుదాల్చి నిలచారు. ఒక మహోజ్వలమైన, కాంతిని ఎక్స్‌రే కిరణములవలె, సూటిగా చొచ్చుకుని పోయే కాంతిని ప్రసారం చేస్తూ, తన ఉనికిని వెల్లడి చేశారు.

ఈ కాంతిని గురించీ, ఈ అనుభవమును గూర్చీ మాట్లాడే ముందు వోల్టర్‌కు, పవిత్రమైన అరుణాచలగిరియే అగ్ని లింగము లేదా తేజోలింగము అనునది తెలియక పోవుటయే ఈ వర్ణనలోని గొప్పదనము. అరుణా చలుడే జ్ఞానమునకు ప్రతిరూపమని సంప్రదాయము తెలుపుతున్నది. భగవాన్ అదియే ఆత్మ అని రూఢిచేసినారు. అదే 'నేను' అను చైతన్యము. అది తేజస్సు లేదా అగ్ని రూపములో యున్నది. జీసస్, అగ్ని గురించి మాట్లాడారు. మోజెస్, అగ్ని గురించి మాట్లాడారు. ఎందుకంటే అది స్వచ్ఛమైన జ్ఞానము, అంతర జ్ఞానము. అరుణాచలుడు కూడా అగ్ని, జ్ఞానము అయిన గిరి. మానవాళి, ఈ జ్ఞానమును మరచుటచే, అరుణాచలుడు, మానవరూపమును ధరించి, భగవాన్‌గా అవతరించి, అరుణాచలము యొక్క సత్యమును, 'నేను' (అహం) అనబడు శుద్ధ చైతన్యము యొక్క జ్ఞానమును ప్రపంచమంతటా వ్యాప్తి చేయుటకై వచ్చినారు.

ఈ జ్ఞానమనెడి అగ్నిని వ్యాప్తి చెందించుటలో, తానుకూడా ఒక దూతనై సాయపడతానని, అప్పటిలో వోల్టర్‌కు తెలియదు. పశ్చిమ యూరప్‌లో భగవాన్ గురించి తెలిసినది వోల్టర్ వల్లనే. అదే ఆయన కర్తవ్యమైనది. తనకు దాని గురించి తెలియకుండానే ఆయన మాట్లాడారు. ఏ రచయితకైనా, సంపాదకుని కైనా గురువును గూర్చి అలంకారములతో కూడిన పరిభాషను ఉపయోగించగల సామర్థ్యము ఉంటుంది. వోల్టర్, "నేను పలికే ప్రతిమాటా నా నిజమైన స్వానుభవము నుండి వచ్చినదే. నా మెదడులో నుండి వచ్చేది కవిత్వము వ్రాయలేదు. (ఇది తెలివి తేటలను ఉపయోగించి వ్రాసిన కవిత్వము కాదు. స్వాను భవమునుండి తనకు తానుగా వెలువడినదే). కేవలము వోల్టర్ మాత్రమే ఇటు వంటి మాటలు వ్రాయగలరు.

తాను దైవ సన్నిధిలో ఉన్నానని సంపూర్ణంగా తెలుసుకునే, వోల్టర్ భగవాన్ సన్నిధిలో ఉన్నారు. "ఆ మొదటి కొద్ది రోజులో, నేను ఇన్నాళ్ళుగా తెలుసు కొనగోరినవన్నీ నెరవేరినవి నిజానికి అంతకంటే ఎక్కువే. నా సాధనా కాలంలో, సంవత్సరాలుగా నాకు స్పష్టమైన, కాంతివంతమైన క్షణములు ఉన్నవి కానీ, వాటిలో ఏదీ కూడా, నన్ను కళ్ళు మిరుమిట్లు గొలిపే, ఈ మహోజ్వల కాంతిలోని ఒక చిన్నభాగంతో 'నైనా కూడా, అనుబంధం కలిగి ఉండుటకు అవకాశము పొందటానికి నన్ను సిద్ధం చెయ్యలేదు. అటువంటి అనుభవము సాధ్యమేనని, నా ఊహకు కూడా ఏనాడూ తట్టలేదు. భగవాన్ సన్నిధిలోని ప్రకాశవంతమైన శక్తి, ప్రయత్న రహితంగా, నా మనసులోనూ శరీరంలోనూ వ్యాపిస్తుండేది. ఆయన అనుగ్రహము నా మనసును నిశ్చల మగునట్లు చేసి, నా హృదయమును నింపి, ఈ భౌతిక ప్రపంచము హద్దులను అధిగమించి, అనంతదూర తీరములకు నన్ను తీసికుని వెళ్ళింది. ఆయన తేజోవంతమైన సన్నిధిలో నేను ఈ శరీరమును కాదు, అహంకారమును (వ్యక్తిత్వమును) కాదు, అని స్పష్టమగుటయేగాక అటువంటి విభజన యొక్క అవసరమే లేకుండా పోయింది. భగవాన్ నుండి వెలువడే కాంతి, నన్ను పూర్తిగా నింపివైచి, నాలోని చీకటిని ఒక్క దెబ్బతో పారద్రోలింది." కొన్ని వారముల పాటు, ఆయన భగవాన్ సన్నిధిలో కూర్చుని ఈ పారవశ్య తరంగములను అనుభవిస్తుండేవారు. కానీ ఆయన తన కుటీరమునకు తిరిగి వెళ్ళగానే, అవి తగ్గిపోతుండేవి. (కనుమరుగయ్యేవి) "నేను భగవాన్‌ను, ఈ ప్రకాశము లేదా పారవశ్యము నాలో శాశ్వతంగా నిలచిపోవాలని అడిగి తీరాలి. భగవాన్, ఈ అనుభవము హెచ్చుట, తగ్గుటలను లేదా ఉండుట, లేకుండుట అను వానిని స్వయముగా తొలగించి ఈ ప్రకాశమును స్థిరపడేలా చెయ్యాలి, అని వోల్టర్ దృఢంగా అనుకున్నారు.

కావున ఒకరోజు, ఆయన భగవాన్‌కు కొంత దూరంలో, కానీ ఆయనను చూడగలిగే విధంగా కూర్చున్నారు. ఆయన ఈ ఆలోచనలనే అస్త్రాలను భగవాన్‌పై వేయసాగారు. "భగవాన్ మీ ప్రకాశము మీ సన్నిధిలో మాత్రమే నాకు లభ్యమై, మీ సన్నిధి వీడగానే తొలగిపోతే, దాని వలన ప్రయోజన మేమిటి? నాకు చెప్పండి". భగవాన్, అంతతేలికగా ఈ అధికారపూర్వకంగా కోరే కోర్కెలకు సందు ఇవ్వరు (లొంగిపోరు) వోల్టర్, మాటల యుద్ధంకాక, హృదయముల మధ్యనే యుద్ధము జరిపారు. వోల్టర్, తన చిన్నతనము నుండియే కల్గియున్న తీవ్రమైన పట్టుదలతో గూడిన దీక్షతో, పోరాడారు. (వోల్టర్ నుండి దీనిని మనం నేర్చుకోవాలి. పట్టుదల అనేది మనకు ఉండి తీరాలి. ఆ అనుభవము కేవలం కొద్దిరోజులు లభించేతే సరిపోదు.) కొంత సేపటి తర్వాత, భగవాన్ నెమ్మదిగా తన దృష్టిని వోల్టర్ వైపునకు త్రిప్పి చిరునవ్వు నవ్వారు. (మీకు ఏమి కావాలి అని

అర్థము వచ్చేటట్లు) వోల్టర్‌కు కళ్ళనీళ్ళ పర్యంతమైంది. ఎందుకంటే ఆయనకోరిక సవ్యమైనదీ, నిజాయితితోకూడుకున్నదీ గనుక, కొంచెము సేపటి తర్వాత భగవాన్ మరల ఆయన వైపు చూచి, తన దృష్టిని ఏకాగ్రపరచి, తన దృష్టిని, తన ఆశీస్సులను, తన అనుగ్రహమును ఎంత శక్తి వంతంగా ప్రసరింప జేశారంటే అవి వెళ్ళి, సూటిగా వోల్టర్ హృదయాన్ని తాకినవి. (స్పృశించినవి) "వోల్టర్! నీ ముక్కు మీదున్న కళ్ళద్దాల కోసం ఊరంతా వెదుకుతున్నావు." అన్నట్లుగా అతని వైపు చూశారు భగవాన్, ఈ అనుభవంతో ఆయన మిక్కిలి ఆనందించి, తెరలు తెరలుగా పారవశ్యాన్ని అనుభవించారు. "ఈ శాశ్వతత్వము అనేది ఎప్పటికీ బాహ్యము నుండి పొంద బడేదికాదు. బాహ్యమునకు చెందిన దేదైనా సరే అశాశ్వత మైనదే. అది వస్తూ పోతూ ఉంటుంది. నీవు వెదికే శాశ్వతమైనది. నీలోనే ఉన్నది. నీ గురువైన భగవాన్ చెప్పినట్లు రోజువారీ అనుభవము వంటివైన కళ్ళద్దములను ముక్కుపై ఉంచుకుని చుట్టూ తా వెదకునటు వంటిది. నీవు చేయుచున్న పని, అని వోల్టర్ (భావించుకున్నారు). భావించారు. ఆ సమాధానము తన అంతరగురువు నుండి వచ్చినట్లు ఆయనకు అనిపించింది. కానీ భగవాన్ కూడా ఆయనవైపు నిశితంగా చూస్తూ ఉన్నారు. (అప్పుడు)

వోల్టర్ ఈవిధంగా భావించారు." అకస్మాత్తుగా, భగవాన్ నేత్రములు నాపై కాంతిని, అగ్నిని ప్రసరింపజేశాయి. ఆయన దృష్టి (దృక్కు)లోని తీవ్రమైన విస్ఫోటనమును, నేను మరే విధముగానూ వర్ణించలేను. ఆయన శక్తి వంతమైన చూపు, సూటిగా నాలోనికి చొచ్చుకుని వెళ్ళి, నేను, ఆయన కంటే వేరుగా ఉనికి కలిగి ఉన్నాననే భావనను కల్గించేవి ఏవైతే నాలో ఉన్నవో, వాటినన్నిటినీ కాల్చి వేయసాగింది. నా ఛాతీలో కుడివైపున ఉన్న హృదయ కేంద్రము వేడెక్కుట ప్రారంభించినట్లు నా కనిపించింది. ఆయన నన్ను, తదేకంగా చూస్తున్నకొలదీ, నా హృదయకేంద్రము ఇంకా, ఇంకా వేడెక్కుతూ, ఒక అగ్నిగోళము మండుతూ నాలో ఉన్నట్లు, నా కనిపించేటట్లు, చేసింది. భగవాన్, అత్యంత శక్తి వంతమైన ఆధ్యాత్మిక విద్యుచ్ఛక్తితో దానిలో శక్తిని నింపుతున్నారా? అని నాకు అనిపించింది. ఎందుకంటే, ఆయన నావైపు చూస్తున్న కొలది, నా హృదయకేంద్రము ఒక విద్యుదుత్పాదక యంత్రముగానూ, అది శక్తి, వెలుగుల యొక్క రవ్వలను వెదజల్లుతున్నట్లు సుస్పష్టమైన అనుభూతి నాలో కలిగింది. ఏదో అత్యంతశక్తి వంతమైన విద్యుత్ పరికరము అకస్మాత్తుగా, నా ఛాతీలోనికి ప్రవేశపెట్టబడి అక్కడ అమర్చబడినట్లుగా అనిపించింది. నేను తిన్నగా కదలిక లేకుండా కూర్చున్నాను. నా కన్నులు ఆయన కన్నులకు అంటుకుని పోయాయి. నా ఉనికి యొక్క కేంద్రములోనికి, ఆయన వెలిగే కన్నుల నుండి, అగ్ని ప్రవహించింది. ఈ ప్రసారము ఎంత కాలము జరిగినదో నేను చెప్పలేను. అది (ఆ అనుభవము) చాలా అందంగా ఉన్నది. నేను దేని కొరకు వచ్చానో దానిని పొందాను, లోపలను, వెలుపలను సంపూర్ణమైన పరిణామము (మార్పు) సంభవించింది. ఒక్కమాట కూడ మాట్లాడవలసిన అవసరములేకుండా, ఇదంతా సంభవించింది. మౌనము ద్వారా సంభవించిన ఆ పరిపూర్ణత, ఏ మాటల చేతనైనా ఇవ్వ బడగలిగిన వివరణ కంటె, అత్యంత సూటిగా, స్పష్టంగా ఉన్నది. నాకు ఎంత వరకు అప్పటికి యోగ్యత ఉన్నదో, లేదా నేను ఎంతవరకు ఆయన అనుగ్రహమును పొందుటకు సిద్ధముగా ఉన్నానో, అంతవరకు నన్ను తీసికుని వెళ్ళారు. భగవాన్ చేత నాలోనికి నింపబడిన (చొప్పింపబడిన) అనుగ్రహము, దాని పనిని అది, దానికి తగిన సమయములో తగినట్లుగ చేసుకుని పోతుందని నాకు అనిపించింది. నేను వెళ్ళిపోయేముందు వీడ్కోలు బహుమతిని ఆయన నుండి అందుకున్నాను. అంతకంటె విలువైన దానిని దేనినీ నేను ఆయనను కోరగలిగి ఉండే వాడిని కాను.

భగవాన్ శరీరమును వదలి వేయబోతున్నారని తెలిసి గూడా వోల్టర్, తన దేశమునకు తిరిగి వెళ్ళిపోయారు. భగవాన్ ఆ భౌతిక శరీరము కాదు. అని ఆయన తెలుసుకున్నారు కనుక, ఆయన ఇక్కడ ఉండలేదు. భగవాన్ హృదయమునుండి ఎల్లవేళలా వెలువడే కాంతి వెల్లువ. తర్వాత ఆయన భారత దేశమునకు వచ్చి, కేరళలోని ఒక గురువు వద్ద కొన్ని సంవత్సరములు ఉన్నారు. కానీ ఎల్లవేళలా, భగవానే ఆయనకు వెన్నెముకగా, వెన్నుదన్నుగా, తన అన్ని కార్యములకూ ఆధారభూతమై నిలిచారు. 1970 దశకంలోనూ 1980 దశకంలోనూ, ఆయన నిసర్గదత్త మహరాజును సందర్శించి, ఆయన అద్వైత బోధను వింటుండే వారు. అయినప్పటికీ, తన సద్గురువైన భగవాన్‌ను ఆయన అంటిపెట్టుకునే ఉండేవారు. తన హృదయములోని (చైతన్య) ప్రకాశముగా ఆయన తన సద్గురువు రమణులను భావించేవారు. ఆయన యూరప్‌లో విస్తృతంగా పర్యటించి, అనేక ఉపన్యాసములు ఇచ్చారు. ఆయన ఎన్నో ఆధ్యాత్మిక పత్రికలకు, ప్రచురణకర్త గానూ, సంపాదకుడు గానూ ఉండి,

ఆధ్యాత్మికత యొక్క ఆచరణ అనే పార్శ్వమును తెలియచెప్పారు (చూపారు.) బాహ్యకార్యకలాపము లేవీకూడా, హృదయములోనికి మునిగి ఆత్మనిష్ఠులై మనసహజ స్థితిలో ఉండుటకు అవరోధములు కావనే సత్యానికి ఆయన గొప్ప ఉదాహరణగా నిలచారు.

అటువంటి చక్కని భక్తునితో ఉత్తర ప్రత్యుత్తరములు జరపట మనునది నాకు లభించిన భాగ్యము. నేను ఒకప్పుడు ఆయనను, "వోల్టర్, భగవాన్ అంటే మీకు ఏమని అనిపిస్తుంది?" అని అడిగాను. ఆయన ఇలా వ్రాశారు. "భగవాన్ అంటే నాకేమని అనిపిస్తుంది? నన్ను నేనే ఆ ప్రశ్న వేసుకుంటున్నాను? ఆయనను నేను ఏవిధంగా భావించాను? ఇప్పటికీ ఏ విధంగా భావిస్తున్నాను? ఈ ప్రశ్నకు సంగ్రహమైన సమాధానము ఇవ్వటము కష్టము అని నాకు అనిపిస్తున్నది. సరే ఇదే సరిగ్గా అది. ఆ సత్యమే రమణ మహర్షి రూపములో ఉన్న శుద్ధ చైతన్యము. రమణ మహర్షి అప్పుడూ, ఇప్పుడూ కూడా, ఊహకు అతీతులు (ఊహకు అందని వారు) అందుకనే వర్ణనాతీతులు. భగవాన్, నేను చూసినటు వంటి బలహీనమైన, వృద్ధాప్యములో మరణమునకు సమీపములో నుండి సోఫాలో దిండుకు చేరబడి యున్న నా చేత దర్శించబడిన శరీరముకాదు. కానీ ఊహాతీతమైనవారు. ఆయన ఏమాత్రము అహంకారములేని శుద్ధ చైతన్య ప్రకాశము. మరి ఆ శరీరమో, మనమెంతగా దాని ఆకారమును ప్రేమించినప్పటికి, అది ఆయన స్వస్వరూప తేజమును (ప్రకాశమును), పరివర్తన చెందించే ఒక మెరిసే వజ్రము వంటిదే కేవలము. నేను మొదట అక్కడకు వచ్చినపుడు ఇదంతా అర్థము చేసికొన లేదు. నాకు ఆయన ఒక దివ్య పురుషుడు. నాకు ఆయనను ఏసుక్రీస్తుతోగాని, బుద్ధునితోగాని పోల్చాలని అనిపించేది. కాని ఏసుక్రీస్తుగానీ, బుద్ధుడు గానీ, నేను పెరిగిన వాతావరణములోని విశ్వాసముల ఆధారముగా, నేను వినిన కథల ఆధారంగా, తర్వాత నేను చదివిన గ్రంధముల ఆధారముగా, నాలో ఏర్పరచుకున్న ఊహా చిత్రములు మాత్రమే. కానీ రమణ మహర్షి నేను మొదటి సారి చూసినప్పటి నుండి ఒక ఊహాచిత్రము ఎంత మాత్రమూ కాదు. ఆయన నా జీవితమనే భ్రమను, కొద్ది నిముషములలో, ఒక్క మాటతో కూడా నిమిత్తము లేకుండా, విస్ఫోటనము చెందించిన బాంబువంటి వారు. ఆయన ప్రసిద్ధిచెందిన ప్రశ్న, "నేను ఎవరను?" అనునది వెంటనే కొత్త రూపము సంతరించుకున్నది. కేవలము మూడు లేక నాలుగు సంవత్సరముల తర్వాత మాత్రమే ఆయన మౌనము యొక్క పూర్తి ప్రభావము, నాకు ఏమి తెలియ జెప్పిందో స్పష్టమైనది. 'నా స్వంతము' అనే రెండు మాటలు సమస్యను సూచిస్తున్నవి. భగవాన్ ఎప్పుడూ, ఎవరికీ, తాను ఒక వ్యక్తిగా ఉండి ఆత్మసాక్షాత్కారమును చెందగలను అనే నమ్మికకు ఆస్కారము ఇవ్వలేదు. ఆయన మనలోని చాలా మందికి సూచించిన సాధనకు ఇరుసు (అక్షము) లేక కేంద్ర బిందువు, ఈ ప్రశ్నలు అడుగునదెవరో పరిశీలించండి అని కోరుటయే. ఇక్కడకు ఆయనను చూచుటకు వచ్చినదెవరు? సాక్షాత్కారము పొందవలెనని కోరుకుంటున్నది ఎవరు? ఈ విషయమును పరిశీలించమని ఆయన చెప్పేవారు. చివరకు మనోమూలమునకు చేరుటయే దాని ఆంతర్యము.

ఒకప్పుడు భగవాన్ ఎవరినో, "మీరు సాక్షాత్కారమును పొందలేదనిమీకెలా తెలుసును?" అని ప్రశ్నించారు. ఆ వ్యక్తి, "నేను సాక్షాత్కారమును పొందలేదు," అని అన్నపుడు, భగవాన్ ఈ ఎదురు ప్రశ్నను వేశారు. దాని గురించి ఆలోచించితే, ఆ ప్రశ్న ఒక భూకంపము వంటిదని నీకు తెలుస్తుంది. నిజానికి ఎవరు అలా అంటారు? కాబట్టి ఈ ప్రశ్నను గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తే (విచారిస్తే), "ఆత్మ ఎప్పుడూ తెలియబడే ఉన్నది", అనే సరళమైన, సూటియైన భగవాన్ చే చెప్పబడిన సత్యమును ఒప్పుకుని తీరవలసినదే. ఇంద్రియముల ద్వారాగానీ, మనసు ద్వారాగానీ గ్రహింపబడిన ప్రతి విషయమూ, చైతన్యములోని ఒక కదలికగానే, చూడబడినపుడు, గ్రహించబడిన ప్రతిదీకూడా, ఈ స్పష్టత యొక్క వైభవమును స్తుతిస్తుంది. సముద్రములోని అల, సముద్రము యొక్క పాటవలె కనపడినట్లు ఇంద్రియముల ద్వారాగానీ, మనసు ద్వారాగానీ, గ్రహించబడిన ప్రతివిషయమునూ చైతన్యములోని ఒక అలవలెచూడగలిగితే, ఆ క్షణమునుండీ, గ్రహింపబడిన ప్రతివిషయము కూడా, ఈ సత్యాన్నే స్పష్టపరుస్తుంది. సముద్రములోని ఏ అల అయినా, సముద్రము పాడే పాటలాగే అనిపించినట్లు. నా జీవితములోని అనేక సందర్భములలో సరియైన వ్యక్తిని, సత్యమునకు ప్రతిరూపమైన వారిని, సరియైన సమయంలో కలవ గలగటం నా అదృష్టం. (ఇప్పుడు నేను అర్థము చేసుకోగలిగినదంతా కూడా నేనువారిని అట్లా కలవటం వలననే) అలా వారిని నేను కలుసుకున్నందువలననే, నేను ఇదంతా అర్థము చేసుకొన గలుగుతున్నాను. నేనుదాని నంతటినీ ఎటువంటి రుసుమూ చెల్లించకుండానే పొందాను. నేనెప్పుడూ ఒక రూపాయికూడా (పెన్నీ) చెల్లించవలసి రాలేదు. నిజమైన, ప్రామాణికమైన

బోధ ఎప్పుడూ ఉచితంగానే లభ్యమవుతుంది. కానీ దానికి నీవు వేరే మూల్యమును చెల్లించుకోవాలి. అదేమిటంటే, నీ వ్యక్తిత్వమును సమర్పించుకొనుటయే. 'నీవు' అని నీవు దేనినైతే భావించుకున్నావో, దానినంతటినీ వదలి వేయడానికి నీవు సిద్ధంగా ఉండాలి.

భగవాన్ నాకు ఎప్పుడూ ఏమీ ఇవ్వలేదు. నేను నన్ను ఒక పేదవానిగా భావించుకుని, ఆయన సాయముకోరి వచ్చినపుడు, ఆయన నేనొక కోటీశ్వరుని కంటె ధనికుడనని, అన్ని జీవుల ఉనికికి ఆధారముననీ విశదపరచారు. భగవాన్ నా నుండి ఏమీ కోరలేదు. కనీసము ప్రేమ, గౌరవములను కూడా. కేవలము ఆయన సన్నిధియే నాలో ప్రేమ, గౌరవము అని మాటలతో వర్ణింప లేని దానికి తెరతీసింది. అది, లోతైన భావనలన్నిటి కంటె ఇంకా లోతుకు వెళ్ళింది. నేను ఆయనను కలుసుకొనుట అనునది ఏ మాత్రము ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంగా జరుగలేదు. చాలా కాలముపాటు, "ఆయన నాకు తన ప్రేమను ఇచ్చారు. నేను ఆయనకు నాహృదయమును ఇచ్చాను", అని భావించినప్పటికీ, అది సత్యము, భ్రమ పరస్పరము ఎదుర్కొనుట వంటిది. అందు భ్రమ నిలువలేకపోయినది. అది తుడిచిపెట్టుకుని పోయింది. ఆయన అది అలా పోవాలని కోరలేదు. ఆయన దేనినీ కోరకుండగనే నన్ను ఉన్నవాడిని ఉన్నట్లుగానే స్వీకరించారు. ఆయన నన్ను మార్చాలని కోరుకొనలేదు. ఆయన నన్ను ఒక కాంతి సాగరంలో, కాంతి సుడిగుండము వలె చూచారు.

ప్రకాశించే సత్యమే అయిన ఆయన, నా భయములను, కోరికలను పోగొట్టి, నా ఊహాజనితమైన లేదా కల్పితమైన వ్యక్తిత్వమును, సుసంపన్నముచేసుకోవాలనే కోరికను కూడా నేను వదిలించు కోగలిగేటట్లు చేశారు. భగవాన్ తానేదో అదిగానే అప్పుడు ఉండినారు. తానేదో అదిగానే ఇప్పుడూ ఉన్నారు. అందుకనే నేను ఇప్పుడు నిశ్చయంగా చెప్పగలను. నేను ఏదో అదే నేను. (నేను నేనైన నేను)

వోల్టర్ ఈ విధంగా చెప్పారు :

నేను మొదటి సారి భగవాన్ వద్దకు వచ్చినపుడు నేనొక ఆధ్యాత్మికసాధకుడిని అనుకున్నాను. ఎందుకంటే నేను సంవత్సరముల తరబడి, గ్రంథపఠనము, అభ్యాసము, ధ్యానములలో గడిపాను గనుక. "నేను ఆధ్యాత్మికత అనుకుంటున్నది, కేవలము నా మనసుచే సృష్టించబడిన (కల్పితమైనటువంటి/వాస్తవముకానటువంటి) సమస్యలను, నా మనసే గొప్ప న్యాయవర్తనము కలదాని వలె, (తాను కలిపించిన ఆ సమస్యలకు) పరిష్కారములు వెదుకుట," అని భగవాన్ చూపు నాకు తెలియపరచింది. భగవాన్‌ను కలుసుకొనక పూర్వమే నేను ఆత్మ విచారణ జరిపాను. కానీ, దానిని నేను నా మనస్సుతో సంఘర్షణపడుతున్నట్లుగా యుద్ధము చేస్తున్నట్లుగా చేసేవాడిని. భగవాన్, నేను ఈ విధమైన అభ్యాసము చేయుటను నిరుత్సాహ పరచలేదుకానీ, కరుణాపూరితమైన, కొన్నిసార్లు ఆశ్చర్యముతో కూడిన ఆయన చూపు నాకు ఈవిధంగా చెప్పేది, "ఎందులకు మిమ్ములను మీరు అనేక సమస్యలు, ప్రశ్నలు ఉన్న వ్యక్తిగా భావిస్తారు?"

ఆయన ఎప్పుడూ నా ప్రయత్నములను నిరోధించుటగానీ, విమర్శించుటగానీ చేయనప్పటికి, ఆయన సన్నిధానములో ఏదోశక్తి, నాదృక్పధాన్నే పూర్తిగా మార్చివేసింది. పరిశుభ్రపరచేటటువంటి ఆయన చూపు నా యొక్క అభిప్రాయముల నన్నిటినీ కబళించి వేయగా, ఆయన ఆశ్చర్యంగా నాతో ఇలా అంటున్నట్లుగా నాకు స్పష్టంగా అనిపించింది, "మీకొక అహంకారము ఉన్నదనీ (వ్యక్తిత్వము ఉన్నదనీ) దానికేదో విలువ ఉన్నదనే, తప్పుడు అభిప్రాయము మీకెలా కలిగింది? వ్యక్తిత్వము లేదా, అహంకారము అనునది, కేవలము మూర్ఖత్వము, ఊహజనితమైన భావము అయిఉండగా, మీరు దానిని గురించి ఆనందిస్తూ, విలువైన ప్రశ్నలు, సమస్యలతో దానిని పోషిస్తూ దానిని బలోపేతము చేస్తున్నారు. మీలోని (మీమనసులోని) ఒక భాగము సమస్యను సృష్టిస్తూ, వేరొక భాగము దానికి తరుణోపాయమును అన్వేషిస్తూ ఉంటవి. ఇప్పటి వరకు మీ జీవితము యావత్తు, ఉనికేలేని వ్యక్తిత్వాన్ని నమ్మిగడిచిపోయింది."

ఇటువంటి మూర్ఖపు అభిప్రాయములను కలిగి ఉన్నందుకు ఆయన నన్ను కరకుగా విమర్శించలేదు. సున్నితంగా, ప్రేమగా, ఈసమస్యలన్నిటినీ నాకుగానేనే సృష్టించుకుని ఎలా నెత్తికెత్తుకున్నానో కళ్ళకు కట్టినట్లు చూపారు. తర్వాత ప్రేమతో కూడిన దయను ప్రసారము చేస్తూ, సత్యాన్ని, ఎక్కడైతే, ఇటువంటి అజ్ఞానపు ఆలోచనల ఉత్పత్తికి స్థానము లేదో ఆ సంతోషనిలయమైన

స్థానమును చూపించారు. ఈ విధానము నన్ను విస్మయములోనూ, పూర్తి ఆశ్చర్యములోనూ ముంచి వేసింది. నేను భగవాన్ వద్దకు ఒక పర్వతమును అధిరోహిద్దామని వచ్చాను. అందులకు సాయపడమని నేను చేసిన ప్రార్థనలను విన్న తర్వాత, అసలక్కడ పర్వతమే లేదు, అధిరోహించుటకు అని ఆయన నవ్వుతూ తెలియజేశారు.

ఆయన సన్నిధి ఇన్నాళ్ళు నేనెంత మూర్ఖత్వంతో నిండి ఉన్నానో, నాకు తెలియపరచింది. ఈ జగత్తు పట్ల నాదృక్పథమును, ఆయన మాటల ద్వారా విమర్శించ లేదు. ఖండించ లేదు. ఆయన సరళముగానూ, ఎటువంటి విమర్శలను చేయకుండా, ఆయన కాంతిని నాపై ప్రసరింపజేశారు. ఆ కాంతినన్ను విమర్శించలేదు. నా అభిప్రాయములను ఖండించలేదు. నన్ను మార్చవలెనని ప్రయత్నించలేదు. అది ఎటువంటి షరతులనూ విధించనటువంటి శక్తి, మరియు అనుగ్రహముల ప్రసారము, కేవలము ఈ కాంతి నన్ను సమీపించి, నాతో అనుసంధానింపబడగానే, నాలోని అజ్ఞానము అనే చీకటి నాకు విశదపరచబడింది. నేను ఒక దుఃఖముతో (సమస్యలతో) నిండి ఉన్న వ్యక్తిననీ, నేను కాంతిని అందుకోవలెనంటే చాలా కష్టపడి ప్రయత్నము చెయ్యవలెను, అనే భావన నిలువ జాలకపోయింది. తుడిచి పెట్టుకునిపోయింది. నేను కూడా కాంతినేనని గుర్తించాను. ఆ గుర్తింపుతో నాకు, నా అజ్ఞానమును తొలగించుకొనుటకు నేను ఏమి చెయ్యనవసరము లేదు అను విషయము అర్థమైనది. నేను చీకటితో నిండి ఉన్నానని, ఆ చీకటిని పారద్రోలి నన్ను వెలుగుతో నింపాలనీ భగవాన్ ఎన్నడూ భావించలేదు. ఆయన నన్ను ఎప్పుడూ కాంతిగానే చూశారు. నన్ను గురించి నేను ఆవిధంగా భావించకపోయినప్పటికీ, కేవలము తన ప్రకాశవంతమైన సహజ స్థితిలో నిష్ఠులై ఉండి, ఆయన, (నేను కూడా కాంతినే అని) నన్ను నేను కాంతిగా అనుభవించేటట్లు చేశారు.

ఆయన సన్నిధిలో నా వ్యక్తిత్వము పూర్తిగా అంతరించి పోయినదని నేను చెప్పను. దాని ప్రాముఖ్యత తగ్గిపోయింది. అంతే. అది ఒక కాంతి సముద్రములోని, కాంతితోనే తయారైన సుడిగుండంలాగా ఉన్నది. తనకు తానే ప్రాముఖ్యతను ఆపాదించుకుని, ఇప్పటి వరకూ నా జీవితాన్ని మొత్తాన్ని నడిపించిన, నావ్యక్తిత్వము (అహంకారము/వ్యక్తిగతనేను) దానితో అదేఘర్షణపడసాగింది. ఈ జగత్తుతో కూడా ఘర్షణ పడసాగింది. అది తనను తాను, సర్వజీవులకు ఆధారమైన చైతన్యముగా (ఆత్మగా) భావించుకున్నది.

భగవాన్ మౌనము యొక్క ప్రభావము నాలో స్థిరపడి, నా స్వంతమవడానికి (ఈ పదము 'నా స్వంతము' అనేదానిని వాడగలిగితే). మూడు లేక నాలుగు సంవత్సరములు పట్టింది. ఒక వ్యక్తిగా సత్యమును గ్రహించగలరని, గ్రహించ వచ్చునని, భగవాన్ ఎవరినీ, ప్రోత్సాహ పరచలేదు. వ్యక్తి అంతర్ధానమైపోయి, (వ్యక్తిత్వము అంతరించిపోయి) సత్యము ప్రకాశిస్తుంది. (లేదా) వ్యక్తి నిలచి (వ్యక్తిత్వ భావనను వదులుకోకుండ) సంకుచిత పరిధులలో చిక్కుకుని బాధలను అనుభవిస్తాడు. భగవాన్ ఆత్మవిచారణ ద్వారా, 'ఎవరు సాక్షాత్కారమును పొందగోరుతున్నారు?' 'ఎవరు సంతోషముతోగానీ దుఃఖముతోగాని ఉన్నారు?' 'ఎవరికి కోరికలు కలుగుతున్నవి?' 'కోపముతో ఉన్నదెవరు?' అని పరిశీలించమని ప్రోత్సహించుతారు. దాని అర్థము ఏ వ్యక్తికి ఈ భావములు కలుగుతున్నవో గ్రహించమనికాదు? అసలు వాస్తవమునకు అటువంటి వ్యక్తి అనేవారు లేనే లేరని తెలుసుకొనమని ఆయన ఉద్దేశ్యము.

ఆయన సన్నిధిని జ్ఞప్తిలో ఉంచుకుని, భగవాన్ అంటే నా ఉద్దేశము ఏమిటి? అని ప్రశ్నించుకుంటే, నేను నిశ్చలత్వమునే, మౌనమునే అని ఆయన స్పష్టంగా తెలియపరుస్తారు. ఆయన ఎటువంటి నిశ్చలత్వమో, నేను కూడా అదే నిశ్చలత్వము. అన్నిటి అర్థమూ నిశ్చలత్వమే, మౌనమే. ఈ నిశ్చలత్వమును కనుగొనుటకు జనులు అనేక కార్యక్రమములు చేస్తారు. అవి తమకు ఆనందము నిస్తవని భావించుకుని. ఈ సంపూర్ణమైన సమత్వస్థితిని, ఈ అగాధమైన శాంతిని సంతోషమునకే మూలమైన ఈ స్థానాన్నీ, ఈ నిశ్చలత్వమును, ఎక్కడైతే ఏవిధమైన కోరిక ఉండదో దాని కొరకు అందరూ ఆతృతతో ఉంటారు.

ఆ నిశ్చలత్వములో, అన్నిటి యొక్క అర్థము నేనేనని నేను కనుగొంటాను. తెరపై కదలాడే బొమ్మల వెనుక కదలని నిశ్శబ్దమును నేనే. అన్నీ ఒకే వస్తువును సూచించుతున్నవి. అన్నిటికీ ఆధారము నేనే, నా నుండే వాటి అర్థము ఉత్పన్నమౌతుంది.

జీవిత మనే చిత్రంలో దాని అంతటి అర్థము నేనే అని విశదపడిన తర్వాత, ఆ అర్థమే మారిపోతుంది. ప్రేమ, ప్రేమకొరకు అన్వేషించదు. అది దానిని సర్వత్రాగుర్తిస్తుంది. అత్యంత లోతులో నిగూఢంగా ఉన్న భావనే ప్రేమ అంటే. నిజానికి అది భావన కాదు, ఆలోచన కాదు. ప్రేమ తనను తాను అన్వేషించుకోవడాన్నే 'మానవుడు' అంటాను నేను.

ఈ ముక్తపురుషుడైన వోల్టర్ ఎ. కీర్స్ యొక్క గొప్పదనము ఏమిటంటే బాల్యము నుండియే ఆయన సత్యము కొఱకు జీవించారు. దానికోసమే కష్టపడి ప్రయత్నించారు. ఆయన దాని కొరకు అన్వేషించినపుడు గురువు లభించారు. సీక్రెట్ పాత్ (రహస్య మార్గము) అనే పుస్తకములో ఒక వాక్యము ఈ విధంగా ఉంటుంది. "ఎప్పుడైతే శిష్యుడు పరిపక్వము చెంది సిద్ధంగా ఉంటాడో అప్పుడు గురువు ప్రత్యక్షమవుతారు. వోల్టర్ చేసినట్లుగానే మనము కూడా అంతర్ముఖమవుదాము. ప్రతిఒక్కరి ఛాతీలో కుడివైపున చైతన్యము (కాంతి/జ్యోతి) ఉన్నది. మీ కనులు మూసుకుని అక్కడి ప్రకాశమును చూడండి. అదే ఆత్మ యొక్క ప్రకాశము. (అదే ఆత్మ నుండి వెలువడే కాంతి).

నాగలక్ష్మి

నా తల్లిగారైన నాగలక్ష్మి, ఒక సామాన్యమైన గ్రామీణ బాలిక, ఆమె అరుణాచలమునకు చాలా దూరములో ఉండేవారు. ఆమె ఆటపాటలతో గడిపే బాలిక. ఆమె బహశ మూడు లేదా నాలుగవ తరగతి వరకు చదివి ఉండవచ్చును. ఆమెకు పదమూడేళ్ళ వయసులో మా తండ్రిగారైన టి.ఎన్. వెంకటరామన్ గారితో వివాహమైనది. మా తండ్రిగారు భగవాన్‌కు తమ్ముని కుమారులు. మా తల్లిగారు కూడా భగవాన్‌కు బంధువే. కానీ ఆ సంగతి అప్పట్లో ఆమెకు తెలియదు. (మా మాతామహులు భగవాన్‌కు మేనమామ). మా తండ్రిగారికి పెంపుడుతల్లి, భగవాన్‌కు సోదరి అయిన అలమేలు అమ్మాళ్, భగవాన్ గొప్పతనమును గురించి ఆమెకు విశదపరిచారు. నాగలక్ష్మి, తన వివాహ సమయంలో, భగవాన్‌ను చూడవలెనని కోరికగా ఉన్నదని అలమేలు అమ్మాళ్‌కు చెప్పింది. అలమేలు అమ్మాళ్ ఆమెకు తమిళములో సంగ్రహముగా ఉన్న "భగవాన్ రచనల సంగ్రహము" కాపీని ఇచ్చి, "నువ్వు ఇందులోని పద్యములన్నీ కంఠతా చదివినపుడు, నేను, నిన్ను భగవాన్‌ను చూచుటకై అరుణా చలమునకు తీసికుని వెళ్తాను," అన్నారు.

ఆ మాటలను మనసునకు పట్టించుకుని, వాటిని కంఠస్తము చేసేపనిని కొద్ది వారములలోనే పూర్తి చేశారు, మా తల్లి. వాటిలోని వేదాంత భావమును అర్ధము చేసుకొనలేక పోయినప్పటికీ, అది ఒక ఆధ్యాత్మిక తీగను (తంత్రిని) కదిలించింది (ఆమెలో), 1930లో, ఆమె వివాహమైన సంవత్సరము తర్వాత, ఆమెకు భగవాన్‌ను దర్శించే అవకాశము లభించింది. భగవాన్ ఆమెను దీర్ఘంగా చూశారు. ఆ చూపు, "నా వద్దకు రావటానికి, నీకిన్నాళ్ళు పట్టిందా." అన్నట్లుగా అనిపించిందని తర్వాత, ఆమె నాతో చెప్పారు. కొంతమంది ఎంపిక చేయబడిన మిగిలిన భక్తులు కూడా, మొదటి సారి భగవాన్ ఎదుట నిలబడినపుడు, ఇదే విధమైన అనుభవమును పొందారు. వారంతా ఆయన పరిధికి చెందిన వారనే దానికదే సూచన. కానీ ఆయన అందరిని ఒకే విధంగా చూసేవారు. ప్రతి ఒక్కరూ ఆయనకు బంధువులే. భగవాన్ ప్రత్యేకత ఆయన ఆధ్యాత్మిక స్థాయిలోనేగాక, ఆయన మనుషుల పట్ల వ్యవహరించే తీరు, కనబరచే ఆప్యాయతలలో గూడా కనిపిస్తుంది. భగవాన్ ఆశీస్సులు ఆయన ఆధ్యాత్మిక సన్నిధికి గుర్తు. ఆయనకు తన సోదరి అంటే తండ్రికి బిడ్డపై ఉండే వాత్సల్యము వంటి గొప్ప వాత్సల్యము, తల్లి ఎడల గొప్ప గౌరవము ఉండేవి. ఇక మనుమ సంతానం విషయానికి వచ్చేసరికి ఆయన భగవాన్ వలెనో, ఉపాధ్యాయుని వలెనోగాక, సహజమైన తాతగారివలెనే నెమ్మదిగా, (అది చెయ్యి, ఇది చెయ్యి అని చెబుతుండే వారు.) ఏమి చెయ్యాలో చెబుతుండే వారు. ఆ రోజులలో ఇంటి కోడలు మామగారి తోనూ, మామగారు ఇంటి కోడలితోనూ, చాలా తక్కువగా మాట్లాడుతుండేవారు. భగవాన్ కూడా అట్లే మా తల్లిగారితో చాలా తక్కువగా మాట్లాడే వారు కానీ, తన చూపు ద్వారాను, తన సన్నిధి ద్వారాను, ఆమెకు ఆధ్యాత్మిక ఆనందమును కలుగజేసి, ఆమెలో ఆధ్యాత్మిక పరిపక్వత కల్గించారు.

మా తండ్రికి దక్షిణాదిన ఉద్యోగం రావటంతో, మా తల్లిగూడా సహజంగానే ఆయన ననుసరించి వెళ్ళారు. ఆయన సన్నిధిని తనకు ఎల్లవేళలా ప్రసాదించ వలసినదిగా, ఆమె భగవాన్‌ను ప్రార్ధించారు. 1934లో ఆమెకు తొలిమగ బిడ్డ కలిగినపుడు అతనిని భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళారు. అతనికి ఆయన 'సుందరం' అని పేరు పెట్టారు. సుందరం ప్రస్తుతము రమణాశ్రమ ప్రెసిడెంటుగా ఉన్నారు. ఆ తర్వాత నేను పుట్టాను. నేను 1936లో పుట్టాను. నన్ను భగవాన్ వద్దకు తీసికుని వెళ్ళినపుడు, "ఇతడు నాకు పేరు పెట్టే పనిని తప్పించాడు. ఎందుకంటే ఇతడు పేరుతోనే జన్మించాడు," అన్నారు ఆయన. అదినిజమే, ఎందుకంటే నేను గణేశుని జన్మదినమైన గణేశ్ చతుర్ధి రోజుననే పుట్టాను. అలా నాకు 'గణేశన్' అని పేరు పెట్టారు. అలాగే భగవాన్ నా తోడ బుట్టిన వారందరికీ గూడా నామకరణం చేశారు. నా తమ్ముని పేరు సుబ్రమణియన్. నా నలుగురు చెల్లెళ్ళ పేర్లు, లక్ష్మి, అళగమ్మాళ్, మంగళం, సరస్వతి.

1938లో నాకు రెండేళ్ళవయస్సు ఉన్నపుడు మా కుటుంబము మొత్తము అరుణాచలమునకు వచ్చేసింది. మేము టౌన్‌లో ఉండేవాళ్ళము. మా తల్లిగారు ఇంటి పని, కుటుంబ బాధ్యతలు అనే సుడిగుండములో చిక్కుకుని ఉన్నప్పటికీ, ఆమె ఎలాగో

వీలు చేసుకుని కొంత సమయం సాధనలో గడిపేవారు. ఆమె మాకు భగవాన్‌ను దైవము వలె చూడమని, ఆయన ఆధ్యాత్మిక సన్నిధిలో చేతనైనంతగ్రహించమని చెప్పేవారు. ఆమె చెప్పేమాటల పూర్తి అర్థము అప్పట్లో మాకు తెలిసేదికాదు. హాలులో కూర్చుని ఉన్నపుడు భగవాన్, మా తల్లితో ఎక్కువగా మాట్లాడే వారు కాదు. గంభీరంగా ఉండేవారు.

వంటగదిలో వంట చేసే మహిళలు, భగవాన్ ఆశీస్సులను పొందాలనే ఆతృతతో ఉండేవారు. వారు టౌన్ నుండి ఉదయం అయిదుగంటల కల్లా వచ్చేవారు. వారు పని ముగించుకునే సరికి సాయంత్రం ఆరుగంటలయ్యేది. అందువల్ల భగవాన్ వద్ద హాలులో ఉండుటకుగానీ, జ్ఞానముతో నిండిన ఆయన మాటలు వినుటకుగానీ, వారికి అవకాశము ఉండేది కాదు. కావున భగవాన్ పన్నెండూ, రెండూ మధ్యన ఏదో ఒకటైములో, రాత్రికి ఏమి వంట చెయ్యాలో చెప్పే మిషతో వంటగదిలోనికి వచ్చేవారు, కానీ నిజానికి ఆయన వచ్చేది వారికి ఆధ్యాత్మిక బోధ చెయ్యటానికే, ఆ స్త్రీలు, మాతల్లి కూడా వాటిని అందుకోవాలనుకునేవారు గనుక ఆమెను ఉండిపొమ్మని అడిగే వారు. భగవాన్ వంటగదిలోనికి రాగానే, ఆ స్త్రీలు, ఆమెను భగవాన్‌కు సాష్టాంగ పడమని చెప్పేవారు. చాలా సంవత్సరముల తర్వాత భగవాన్‌చే తనకివ్వబడిన మూడు ఆచరణ యోగ్యమైన సలహాలను నాకు తెలిపారామె.

ఎప్పుడైనా కుటుంబములు రమణాశ్రమమునకు వస్తే, ఆడవారు, పిల్లలు రాత్రి పూట మా ఇంట్లో గడిపేవారు. ఎందుకంటే చీకటి పడినతర్వాత వారిని ఆశ్రమంలో ఉండ నిచ్చేవారు కాదు. మా తల్లిగారు వారి అవసరములను చూసుకునే వారు. (కొంత మంది స్త్రీలు ఎచ్చెమ్మాళ్ ఇంట్లో కూడా ఉండేవారు.) ఒకప్పుడు, మా తల్లిగారు బాగా చిన్నవయసులో ఉన్నపుడు, ఒక యువతి, ఆమె తల్లిదండ్రులు మా ఇంటికి వచ్చారు. ఆ స్త్రీకి 19 ఏళ్ళ వయసు. దాదాపుగా మా తల్లిగారి వయసే. దురదృష్టవశాత్తూ, ఆమె ఆ చిన్నవయసులోనే భర్తను కోల్పోయారు. మా తల్లిగారు, ఆమె మంచి స్నేహితులైనారు. ఒకసారి



నాగలక్ష్మి - గణేశన్ - స్వామి శాంతానంద - టి.ఎన్. వెంకటరామన్ (ఎడమ నుండి కుడికి)

వారిద్దరూ ఆశ్రమ కోనేటికి స్నానమునకు వెళ్ళారు. స్నానము తర్వాత ఆ స్త్రీ కట్టుకున్న చీర చాలా బాగున్నదని మా అమ్మ అనుకున్నారు. ఆమెతో మెచ్చుకోలుగా, "మీ చీర చాలా బాగుంది," అన్నారు. అది కేవలము ప్రశంసే, మరేమీ కాదు.

కానీ, ఆ యువతి తిరిగి వెళ్ళిన తర్వాత మా తల్లిపేరుతో ఒక పార్శెల్ పంపారు. అందులో రెండు అటువంటి చీరలు ఉన్నవి, ఆ రోజులలో పోస్టులో వచ్చినవన్నీ, అవి వ్యక్తి గతమైన పేర్లతో ఉన్నప్పటికీ, భగవాన్‌కే అందజేయబడేవి. భగవాన్ అప్పుడు వాటిని, వాటి స్వంతదారుల కివ్వగా, వాళ్ళు కృతజ్ఞతతో ప్రసాదంగా భావించి తీసుకునే వారు. ఆ రోజు మధ్యాహ్నం, భగవాన్ వంటగదిలోనికి వెళ్ళి నపుడు చాలా గంభీరంగా (కోపంగా) ఉన్నారు. మా తల్లి ఆయనకు నమస్కరించినపుడు, ఆయన, "మనము ఆశ్రమములో ఉండుటకు వచ్చాము. మనకున్న వాటితో మనము తృప్తి చెందాలి. చాలామంది ధనవంతులు ఖరీదైన దుస్తులూ, నగలూ ధరించి ఆశ్రమమునకు వస్తుంటారు. మనము వాటి అందము చూచి ఆకర్షితుల మవరాదు. వారు వాటిని ధరించినపుడు మనమే వాటిని ధరించినట్లుగా భావించాలి. ఏ కోరికలు లేకుండా ఉండుటయే ఇక్కడ నివసించుటకు ఉత్తమమైన పద్ధతి. అప్పుడు ఎవరికీ బాహ్యమైన ఆకర్షణలు, వికర్షణలు, కూడికలు, తీసివేతలూ ఉండవు. సంతృప్తితో ఉండు. నీది కాని దానిని ఎప్పుడూ ఆశించకు." అన్నారు. గుండెపగిలినంతపనై, మా తల్లి ఏడవటం ప్రారంభించారు. ఆ వంట చేసే స్త్రీలు, ఆమెకు బాసటగా నిలచి, భగవాన్‌తో మాట్లాడారు. "నాగు తప్పేమీ లేదు. ఆమె చీరలు అడుగలేదు. వాళ్ళంతట వాళ్ళే వాటిని పంపించారు. భగవాన్, ఆమె ఏడుస్తున్నది అన్నారు. "అదిసరే అంతా మీ మంచి కోసమే చెప్పటం జరిగింది" అన్నారు భగవాన్ మా అమ్మ వైపు తిరిగి, మా అమ్మ జీవితాంతము ఈ బోధను గుర్తుపెట్టుకుని అది మాకు కూడా నేర్పారు. భగవాన్ అలా వంటగదిలో ఉత్తర్వులు ఇచ్చేవారు. మా అమ్మ తన భర్తను (పనులను) చూసుకుంటూ, పిల్లలను పెంచుకుంటూ, ఇంటికివచ్చిన వారి అవసరాలు కూడా చూస్తుండేవారు. అయినప్పటికీ ఆమె భగవాన్ బోధలకు తన జీవితమును శృతి చేశారు. ఆమె శరీరము, మనసు, ప్రాపంచిక బాధ్యతలను నెరవేరుస్తున్నప్పటికీ, ఆమె హృదయ మెప్పుడూ, భగవాన్‌తో సదాశృతి కలిగి ఉండేది. అదే మా తల్లిగారి పద్ధతి. పాత భక్తులైన కుంజుస్వామిగారు, కనకమ్మగారు కూడా దానిని నిర్ధారించారు.



మనవళ్ళతో నాగలక్ష్మి, టి.ఎన్. వెంకటరామన్

ఒకరోజు భగవాన్, మా అమ్మతో, మహాత్ములు, సన్యాసులు, ఋషులు అరుణాచలమును తరచుగ సందర్శించి గిరిప్రదక్షిణ చేస్తుంటారు. వారి ఆధ్యాత్మిక ప్రకాశము, జనమును వారివైపునకు ఆకర్షిస్తుంది. దానిని తప్పించుకుని, తమ ఏకాగ్రతకు భంగం కలుగకుండా ప్రదక్షిణచేయుటకు, వారు పిచ్చి వారి వేషములోనో, యాచకుల రూపములోనే తిరుగు తుంటారు. కాబట్టి, ఎప్పుడైనా సరే, ఎవరైనా ఇంటి ముందు నిలబడి భోజనం కోసము చప్పట్లు కొడితే, నీకున్న దేదో, ఏమాత్రమూ సందేహించకుండ, ఆలస్యము చెయ్యకుండ ఇచ్చివెయ్యి, యాచకులకు గానీ, సాధువులకు గాని, మనఇంటిలో ఎప్పుడూ లేదుపొమ్మని చెప్పలేదు. వాళ్ళని విమర్శించవద్దు. వారిపట్ల నువ్వు న్యాయ నిర్ణేతగా మారవద్దు. మా అమ్మ, భగవాన్ యొక్క ఈ బోధను శ్రద్ధగా పాటించేవారు. బిచ్చగాళ్ళని గాని, సాధువులను గానీ, మా ఇంటినుండి ఎప్పుడు లేదుపొమ్మని చెప్పలేదు.

మూడవ ఉపదేశము ఇంకా ప్రత్యేకమైనది. అది ఆమెకు మాత్రమే ప్రత్యేకముగా ఇవ్వబడినది. ఒకరోజు వంటగదిలోకి భగవాన్ విచారవదనంతో ప్రవేశించారు. భగవాన్ మాములుగా లేకుండా ఎప్పుడైనా, గంభీరంగా ఉన్నపుడు, పాత భక్తులు ఆయన దరిదాపులలోకి వెళ్ళుటకు కూడా జంకేవారు. ఆ రోజు వంటవారు ఆయన ముందుకు వెళ్ళుటకు జంకారు. విష్ణుమూర్తి నరసింహావతారము దాల్చి ఉగ్రరూపములో ఉన్నపుడు, అందరూ ఆయన ఎదురుగా వెళ్ళుటకు జంకి, బాలుడగు ప్రహ్లాదుని ఆయన ముందుకు తోసినట్లు, వంటవారు, మా అమ్మను భగవాన్ ముందుకు తోశారు (పంపారు). భగవాన్ చెప్పటం ప్రారంభించారు, "ఎవరైనా, స్పృహలేని స్థితిలో చనిపోతే, వారి ఆత్మ తప్పక మరొక శరీరమును ధరిస్తుంది. అంటే వారికి పునర్జన్మ తప్పదు. ఎవరైనా స్పృహలో ఉన్నప్పుడు (చైతన్యంలో ఉండి) చనిపోతే వారు ముక్తి నొందే అవకాశమున్నది. అంటే దాని అర్థం, స్పృహలో ఉండి చనిపోయినవారంతా జన్మరాహిత్యం పొందుతారని కాదు. ఓపికగా జీవించి ఉన్నపుడే, అనుక్షణం చనిపోయేటప్పుడు స్పృహలో ఉండాలని గుర్తు చేసుకుంటూ ఉండాలి. అలా జరగాలి, అంటే ఎవరైనా పట్టువిడవకుండా శరణాగతితో జీవితం గడపాలి. పూర్తి శరణాగతి చెందిన వారిని గురువు ఎన్నడూ విడిచి పెట్టరు."

మా తల్లిగారు, భగవాన్ వద్దనుండి పొందిన మూడు ఉపదేశాలలో, మొదటిది ఎలా జీవించాలి అనే దాని గురించి రెండవది, మనకు తెలిసిన మంచి విషయములను జీవితంలో ఎలా ఆచరించాలి, మూడవది, మనము ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళేటపుడు ఎలా ఉండాలి అనేది. ఈ మూడు ఉపదేశములు కూడా, అత్యంత విలువైనవి. సాధకులదరికీ ప్రయోజన కరమైనవి. వంటవారు, ఆ రోజు వారు భగవాన్ ద్వారా తెలుసుకున్న విషయమును గురించి ఎంతో సంతోషించినవారై, మా తల్లిగారితో, "మీ వలన, మేము కూడా ఈ రోజు ఈ ప్రత్యేకమైన బోధను వినగలిగాము. భవాన్ ఈ విషయమును ఇంతకు ముందు ఎవరికీ చెప్పి యుండలేదు. అది ప్రత్యేకించి మీకొరకే చెయ్యబడిన బోధ. దానిని మీ హృదయంలో పదిల పరచుకొనండి. మా తల్లిగారు జీవించి ఉన్నంతవరకూ భగవాన్ బోధలను అంటి పెట్టుకునే ఉన్నారు. మా అమ్మ, భగవాన్ బోధలను రెండు విధాలుగా అర్థం చేసుకున్నారు. మొదటిది, రమణ మహర్షి రచనల సంగ్రహంలోని పద్యములన్ని కంఠస్థం చేశారు. ఆమె, సద్గురువు మాటలలోని శక్తిని అర్థం చేసుకున్నారు. అందుకే ఆ పుస్తకం చదవమని మాకు కూడా చెప్పేవారు. రెండవది ఆమె గిరి ప్రదక్షిణ యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నారు. బాగా జబ్బుపడి, మంచాన పడేవరకు, ఆమె గిరి ప్రదక్షిణ క్రమం తప్పక చేస్తూ ఉండేవారు.

నేను 1960లో ఆశ్రమముకు వచ్చేసిన తర్వాత, రాత్రి ఎనిమిది గంటల వరకు ఆశ్రమంలో పని చేసే వాడిని, అప్పుడు ఇంటికి వెళ్ళి, అమ్మ చేత అన్నము పెట్టించుకుని తిని, గిరి ప్రదక్షిణకు వెళ్ళే వాడిని. చాలా సంవత్సరముల పాటు, నేను ఒంటరిగా వెళ్ళేవాడిని. మా తల్లిగారే నా ఉపగురువు. ఎందుకంటే (ఊయలలో ఉన్నపుడే) చిన్నవయసులో ఉన్నపుడే, ఆమె నాకు భగవాన్‌ను చూపింది. రమణుల గీతాన్ని జోలపాటగా పాడుతూ. (రమణ స్తుతి పంచకములోని మూడవపాట).

తప్త కాంచన విగ్రహమా, పూర్తిగా విరిసిన తామరపువ్వు వంటి ముఖము కలవాడా! (రమణస్తుతి పంచకము) అరుదైన ఆత్మసాక్షాత్కారమునకు ప్రతిరూపమా. ప్రపంచమంతా నీ కొరకు గాలించి చివరికి ఇక్కడ నిన్ను జేరుకున్నాను. అనుగ్రహమూర్తి వైన నా గురుదైవమా జ్ఞాన రమణా, కాంతి పర్వతమా (శిఖరమా)

శోణగిరి అని పిలువబడే పవిత్రమైన అగ్ని పర్వతముపై విరూపాక్ష గుహలోవసించెడి బ్రాహ్మణుడా, ఓ అనాదియైన శాశ్వత నిధి నిక్షేపమా! ఓ మచ్చలేని స్వచ్ఛమైన రమణా, పరీక్షించక నన్ను నీ స్వంతం చేసుకో మీరే నిజమైన మహోన్నత దివ్య స్వరూపము

మీ పవిత్రమైన మెత్తని పాదమును నా తలపై మోపుకుని ఈ క్షణముననే, బాధలులేని జీవితమును, ఈ జనన మరణచక్రములో ఉండుట అనుజబ్బును నయంచేసుకోనీ, రమణా! ఆత్మలో తిరిగి జన్మించిన వాడా, అరుణాచలములో మౌనముగా ఉండువాడా! దేవతలకు కూడా అంతు చిక్కని వాడా, నా కంటి పాపా! నిన్నెలా జేరుకోవాలో తెలుపుమా!

రమణ ప్రభూ! నీ పవిత్ర పాదములకై వెదికాను. మీరు అంతులేని జ్ఞానము, మౌనము, భావాతీతమైన దివ్య స్వరూపము. మీ హృదయమే జీవాత్మను, పరమాత్మను ఐక్యపరచే కేంద్రము. జనన మరణముల కతీతమై శాశ్వతమై, నిలచిన పరమసత్యమే మీరు.

ఆ సమయంలో నేను భగవాన్‌ను గురించి గాని, గురువును గురించి గాని, ఆత్మని గూర్చి గాని ఎరుగను, కానీ ఈ అందమైన జోలపాట, భగవాన్‌ను ప్రశంసిస్తూ పాడబడిన పాట, ఆయన గుణించిన ఎఱకకు నాలో బీజం వేసింది. చివరగా, నన్ను నా సద్గురువు పాదపద్మముల చెంత నిలచి ఉండేటట్లు నడిపించింది.

నేను దాదాపు ఒకటిన్నర సం॥ముల ప్రాయములో ఉన్నపుడు, మేము భగవాన్ హాలులో ఉండగా, మా తల్లి ఎప్పుడూ నన్ను తన ఒడిలో కూర్చుండ బెట్టుకునేవారు. అపుడు నెమ్మదిగా నన్ను భగవాన్ సోఫా వైపునకు నెట్టేవారు, నేను పాకుకుంటూ ఆయన వైపునకు వెళ్ళే విధంగా. నేను సోఫా ఎక్కుటకు ప్రయత్నం చేసేవాడిని, కానీ పరిచారకుడు నన్ను పట్టుకుని (లాగేసి) మా తల్లి ఒడిలో ఉంచేవారు. అది ప్రతిరోజూ జరుగుతుండేది. ఒక రోజు నేనే సోఫా వైపునకు పాక్కుంటూ వెళ్ళి, సోఫా ఎక్కేశాను. ఇదంతా గమనిస్తూ వచ్చిన భగవాన్, నేను పడిపోకుండా, తన ఎడమ కాలు నాకు అడ్డు పెట్టారు. ఆయన తన కుడి పాదమును నా తలపై ఉంచి, దీనిని సాధించాలని ఇతడు ప్రతిరోజూ ప్రయత్నిస్తున్నాడు. ఇవాళ అడ్డంకులేమీ లేకపోవుటచే, విజయాన్ని సాధించాడు. మా తల్లిగారి వలననే భగవాన్ పవిత్రమైన పాదాలు నా తలపై ఉంచబడ్డవి. నిజమైన భగవాన్‌ను నాకు చూపించిన నా తల్లిగారు, ఎప్పుడూ నాతో, నేను కేవలం నీ శరీరానికి మాత్రమే జన్మ నిచ్చాను. భగవాన్ నీ అసలు తల్లి అనేవారు. ఈ విధంగా, భగవాన్ యొక్క స్పృహలో సదానిలచి ఉండేటట్లు నాకు శిక్షణ నిచ్చారు.

1965లో మా తండ్రి గారికి గుండెపోటు వచ్చింది. ఆయన శరీరములోని కుడి భాగము చలనము లేకుండా అయిపోయింది. డాక్టర్ టి.ఎస్.కృష్ణస్వామి, ఆయనను పరీక్షించి, వైద్యం చేశారు. ఆయన నన్ను ప్రక్కకు పిలిచి, "గణేశన్, ఇది ఆయనకు రెండవ సారి వచ్చిన హార్ట్ ఎటాక్, మొదటి సారి ఆయనకు హార్ట్ ఎటాక్ వచ్చినపుడు నేను మీ కెవ్వరికీ చెప్పలేదు. మూడవసారి ఎటాక్ (గుండెపోటు) గనుక వస్తే ప్రాణాంతక మౌతుంది. దయచేసి ఆయన గురించి బాగాశ్రద్ధ తీసికొనండి," అని చెప్పారు. ఒక్కసారిగా ఆకాశంలోనుండి పిడుగు మీద పడ్డట్లై, నేను పరుగెత్తుకుంటూ మా తల్లిగారి వద్దకు వెళ్ళి ఈ విషయం ఆమెకు చెప్పాను. ఏమాత్రం కలత చెందకుండా ఆమె నిదానంగా, "భగవాన్ మందిరం వద్దకు వెళ్ళి, అక్కడ ప్రార్థించు," అన్నారు. నేను ఆమె చెప్పినట్లే చేసి భగవాన్‌కు జరిగిందంతా చెప్పాను. ఆ రోజులలో భగవాన్ మందిరము కేవలం పూరిగుడిసే. చాలా ఖాళీ స్థలము మధ్యలో కుటీరము ఉండేది. నేను, ఆ మందిరము వెలుపల, ఒక చాపను పరచుకుని దుప్పట్లు, దిండ్లు లేకుండా పడుకునే వాడిని. అలా ఉండుటకు నాకు ఇష్టంగా ఉండేది. భగవాన్ అప్పటికి నాకు మూడు, నాలుగు సార్లు స్వప్నంలో కనిపించారు. ప్రతిసారీ మెలకువలో ఉన్నంత స్పష్టంగా కనిపించారు. ఈ సారికూడా అటువంటి స్పష్టమైన కలవచ్చింది. భగవాన్, "గణేశా! నువ్వు ఎందుకు బాధపడుతున్నావు?" అని అడిగారు. నేను, భగవాన్‌తో మా తండ్రిగారు మరణించే అవకాశము ఉన్నదనీ అది నేను తట్టుకొన లేననీ చెప్పాను. భగవాన్, "దిగులు చెందవలసిన దేమీ లేదు," అన్నారు. పిదప తన చేతిని ముందుకు జాపారు. అందులో మూడు వెలగ పండ్లు ఉన్నవి. ఒక వెలగపండు నా చేతిలో ఉంచుతూ, దీనిని వెంకటూ (మాతండ్రిగారు)కు ఇవ్వు. ఆయనను తినమని చెప్పు. తర్వాత రెండవ పండును ఇచ్చి దీనిని నాగుకు (మా తల్లిగారు) ఇచ్చి, ఆమెను తినమని చెప్పు," అన్నారు మూడవ పండును నా చేత ఉంచుతూ, "దీనిని

నువ్వు తినేసెయ్యి. అంతా బాగానే ఉంటుంది." అన్నారు. నాకు నిద్రనుండి మెలకువ వచ్చింది. అప్పుడు తెల్ల వారుఝాము రెండు గంటలైనది. కానీ నేను పరుగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళి మా అమ్మతో స్వప్నం సంగతి చెప్పాను. మర్నాడు ఉదయం మేము వెలగపండ్లు కోసం ప్రయత్నం చేశాము కానీ అవి మాకు దొరకలేదు. కొద్ది రోజుల పిదప వాటిని మేము కొనగలిగాము. భగవాన్ సూచనలను అనుసరించాము. మా తండ్రిగారికి మూడవసారి గుండెపోటురానే లేదు. నిజానికి ఆయన 93 ఏళ్ళ నిండు జీవితము జీవించి ఈ మధ్యనే చనిపోయారు. నేను డాక్టర్. టి.ఎన్.కృష్ణస్వామికి, ఈ కలగురించి చెప్పినపుడు, అటువంటి బాధలు (జబ్బు) ఉన్న వారందరికీ, మిగిలిన మందులతో పాటు, వెలగ పండ్లు తినమని చెబుతుండే వారు. ఈ ప్రాణాలు కాపాడే స్వప్నము నాకు నచ్చుటకు, మా తల్లిగారి సలహానే ఒక ఉపకరణము అయింది.

1980లో మా తల్లిగారికి, కార్డియాక్ ఆస్థమా వచ్చింది. (హృదయమునకు సంబంధించిన ఉబ్బసము.) ఆమె తీవ్రమైన నొప్పితో బాధపడుతుండుటతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాము. అక్కడ ఆమె పరిస్థితికి అనువైన వైద్యం అందించుటకు అవకాశము లేదు. ఆక్సిజన్ సిలిండర్లు కూడా ఆస్పత్రిలో అందుబాటులో లేవు. నేను అప్పుడు గిరిప్రదక్షిణకు వెళ్ళకుండా, రాత్రిపూట ఆస్పత్రిలో పడుకుని, తెల్లవారు ఝామున నాల్గింటికి, ఆశ్రమమునకు వచ్చేవాడిని. అలా ఒక రోజురాత్రి, ఆస్పత్రి ప్రధానవైద్యుడు నన్ను ప్రక్కకు పిలచి, "మీ తల్లిగారి పరిస్థితి బాగా లేదు. ఆమె జీవించరు. ఆమెను చెన్నైలో పెద్ద ఆస్పత్రికి తీసుకుని వెళ్ళండి," అన్నారు. ఆయన లోగొంతుకతో చెప్పినప్పటికి, ఆయన నాతో ఏమి చెప్పారో మా తల్లిగారికి కొంత వరకు అర్థము అయినది. ఆమె నన్ను పిలిచి, "డాక్టర్ ఏమన్నారు?" అని అడిగారు. నేను ఆమెకు విషయమంతా చెప్పక తప్పలేదు. ఆమెనాతో, "నాకు రెండు విషయములను గురించి మాట ఇవ్వు," అన్నారు. నేను తల ఊపాను. "మొదటిది ఎటువంటి పరిస్థితిలోనూ, నన్ను అరుణాచలమునుండి దూరంగా తీసికుని వెళ్ళవద్దు. నా సద్గురువైన రమణులు అరుణాచలమునకు వచ్చి, తాను శరీరమును వీడునంత వరకు గూడా, ఈ ప్రదేశమును వీడి వెళ్ళలేదు. అదే విధంగా పరిస్థితి ఎలా ఉన్నాసరే, ఎవరినీ నన్ను ఇక్కడి నుండి దూరంగా తీసుకువెళ్ళనివ్వకు. రెండవది నేను పూర్తి స్పృహలో ఉన్నపుడే ప్రాణములు వదలాలి. దయచేసి అలా జరిగేటట్లు చూడు. అలా స్పృహలో ఉండి చనిపోతే నాకు, మళ్ళీ జన్మ ఉండక పోవచ్చును. నేను మిక్కిలి బాధతో అరచి కేకలు వేసినప్పటికీ, వైద్యులు మార్ఫిన్ గానీ ఇతర మత్తు మందులు కానీ ఇవ్వకుండా చూడు. నా శరీరము బాహ్యంలో బాధపడనీ. అంతరంగంలో నేను మౌనంలో లీనమై ఉంటాను. డాక్టర్లు నన్ను నిందించి నప్పటికి, నేను నామాట నిలబెట్టు కున్నాను. డాక్టర్లు నన్ను, "మీరొక చదువుకున్న మూర్ఖులు. మీకు తల్లిగారి మీద ప్రేమ ఉన్నట్లు చెబుతారు, కాని మీరు రాక్షసులు, దెయ్యము. ఆవిడ దయనీయమైన పరిస్థితిని చూడండి," అని నిందించారు. నేను మారు మాట్లాడకుండా వాటి నన్నిటినీ భరించాను.

ఆమె మమ్ములను వీడే ముందు, ఆమెకు సాష్టాంగ పడి, నేను, 'అమ్మా! నన్ను వదలివేసి వెళ్తున్నారా? నేను ఏమి చెయ్యాలి?" అని పట్టలేని దుఃఖంతో ఏడ్చాను. ఆమె నాకు ఉపశమనం కల్గించటానికి ప్రయత్నించారు. ఆమె, "ఏడవకు, సంతోషంగా ఉండు. ఎప్పుడో ఒకరోజు ఈ శరీరము పోవాల్సినదే. ఈ శరీరమునకు ఎక్కువ ప్రాముఖ్యము ఇవ్వకు. నీ దృష్టిని నా శరీరముపై నుండి, నా చైతన్యము (హృదయము/ఆత్మ) మీదకు మళ్ళించు. ఈ చైతన్యము శరీరమును, మనసును గూడా అధిగమించినది. (అతీతమైనది) ఎప్పటికీ స్వేచ్ఛగా ఉండే ఆ చైతన్యమును అంటిపెట్టుకుని ఉండి, ఈ తనువునూ, మనసునూ, వాటి ధర్మము ప్రకారము వాటిని నశించిపోనీ. వాటిని ముద్దు చెయ్యకపోతే అని నీకు బానిసలుగా ఉంటవి. నీ దృష్టిని పూర్తిగా నీలోని చైతన్యముపై నిలబెట్టుట ప్రారంభించినపుడు, నీవు యజమాని అవుతావు. నీకు నా ఆశీస్సులు". మా తల్లిగారు ఇంకా ఈ విధంగా నన్ను ఆశీర్వదించారు. "భగవాన్ ఆశీస్సులు నీకు ఉంటవి. నేను నీ దేహమునకు మాత్రమే జన్మనిచ్చాను. భగవాన్ బోధను ఆచరించటం ద్వారా, ఆయనను సేవించు. ఆయన బోధే, ఆయన అనుగ్రహము" నేను (ఆపలేకుండా) దుఃఖించినపుడు, ఆమె, "గణేశా! నేను నిరంతరము భగవాన్ పవిత్ర ఉనికిని అనుభవిస్తూ ఉంటాను. అది నాకు చాలు" ఆమె తనకు కావలసిన వారందరి మధ్యన, అరుణాచలములో, పూర్తి స్పృహతో ప్రాణాలు వదిలారు. (తనువు చాలించారు) నేను ఆమె శరీరమును మొయ్యడానికి సాయపడ్డాను. మేము ఆమె అంత్యక్రియలు జరిపాము. మా తల్లిగారు భక్తురాలు, నిజముగా సాక్షాత్కారము పొందిన వ్యక్తి.

భగవాన్‌కు శ్రద్ధాళువు అయిన భక్తుడైన కుంజుస్వామి, నాతో, "ఆశ్రమములోని ప్రతివారు, చిన్న, పెద్ద అనే తేడాలేకుండా, ఆమెను తల్లివలె చూచేవారు, నిజానికి 1938లో ఆమె ఆశ్రమములో అడుగిడిన తర్వాతనే, ఆశ్రమ సంపద వృద్ధిచెందింది. అందుకే ఆమె మాకు మహాలక్ష్మి. ఒక ఫ్రెంచి మహిళ, వేదాంతి, అప్పట్లో కొండపైన ఉంటున్నారు. ఆమె తర్వాత నాతో, "మీతల్లి గారు చనిపోయిన రోజున, నేను కొండపైన ఉన్నాను. నేను అనుకోకుండా (అకస్మాత్తుగా) మీ తల్లిగారిని తలచుకున్నాను. అప్పుడు ఒక ప్రకాశవంతమైన కాంతి నన్ను చుట్టు ముట్టేసి చుట్టూతా వ్యాపించింది. అప్పుడు ఆమె అరుణాచలములో ఐక్యమై ఉంటారని నాకు అనిపించింది. నాగలక్ష్మి శాశ్వతచైతన్యమైన అరుణాచలునిలో ఐక్యమైనారు.

కృతజ్ఞతలతో...

ఈ హృదయము డెబ్బది మందికంటె ఎక్కువగల పాత భక్తుల ఎడల కృతజ్ఞతతో నిండి పోయింది. వారిగురించి గూడా వారు నాతో చెప్పినప్పటికి, వారి సంభాషణలోని ముఖ్యాంశము అంతా, భగవాన్ రమణుల యెడవారికి గల భక్తి, అంకితభావము, పూర్ణశరణాగత భావము గురించే అయి ఉండేది. అలా వారితో వ్యక్తిగతంగా ముఖాముఖి జరిపిన సంభాషణల నన్నిటిని, ఈ పేజీల ద్వారా మీతో విజయవంతంగా పంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉన్నది. భగవాన్ పాద పద్మముల చెంతకు చేరుకున్న వెలలేని రత్నముల వంటి ఈ విశిష్టమైన భక్తుల యెడ, నా హృదయంలో ఎప్పుడూ గొప్ప కృతజ్ఞతా భావం ఉంటుంది. వీరిలో చాలా మందితో నాకు సన్నిహితమైన అనుబంధము ఉన్నది. ఈ పేజీలలో నేను వారి గురించి వ్రాయనప్పటికీ, ఇతర పాతభక్తులకు గూడా నా కృతజ్ఞతలు. నిజానికి, నేను వ్రాసిన వారికంటే, వారేమీ తక్కువ వారుకాదు. ఎవరిగురించైతే నేను వ్రాయలేదో, వారి పేర్ల పట్టిక చాలా పొడుగుగా (దీర్ఘంగా) ఉన్నది. గ్రాంట్ డఫ్, డేవిడ్ మెక్లైవర్, డాక్టర్ మీస్, డంకన్ గ్రీన్‌లీస్, మిస్ మెర్‌స్టన్, శ్రీమతి రోడామెక్లైవర్, సేన్, అరవింద బోస్, దిలీప్ కుమార్ రాయ్, హరీంద్ర నాథ చటోపాధ్యాయ, కుంభకోణం రంగ స్వామి అయ్యర్, వాసుదేవ శాస్త్రి, రాజుశాస్త్రి, కపాలిశాస్త్రి, రమణ పాదానంద, మాధవస్వామి, క్రిష్ణస్వామి, కుమారస్వామి రంగస్వామి, వాడి ఉండయార్‌స్వామి, హాలునటేశ అయ్యర్, మంగలి నటేశన్, పారాయణ్ వీరన్, పోలూరు రంగా రావు, గోపాలరావు, శేషు అయ్యర్, ఎన్.ఎన్.రాజన్, గిద్దలూరు సుబ్బారావు, గిద్దలూరు సాంబశివరావు, స్వామి రాజేశ్వరానంద, డా.టి.ఎమ్.పి. మహదేవన్, ప్రొఫెసర్. కె.స్వామినాథన్, సాధు ఓం, డాక్టర్ ఎస్.నాథ్, మృణాళినీ శారాభాయ్, డాక్టర్. ఎస్.శ్రీనివాసరావు, గుడిపాటి వెంకటాచలం, సౌరిస్.

ఆఖరుగా, ప్రాముఖ్యతలోను గొప్పతనంలోను వారి కంటె ఏమాత్రము తక్కువగాకపోయినట్టి కనకమ్మాళ్ 2009, జనవరి, 1న తనువు చాలించారు, భగవాన్ జయంతి రోజున, భగవాన్ సమాధి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, నాకు తెలిసినంతలో, అనుగ్రహరూపమే అయిన భగవాన్ మందిరంలో, అరుణాచలునిలో ఐక్యమయ్యే ప్రత్యేకమైన భాగ్యము మరెవ్వరికీ లభించ లేదు. వారి గురించి నేనిందులో వ్రాయలేక పోయినప్పటికీ, నా హృదయము వారందరికీ, గాఢమైన కృతజ్ఞత తెలియ జేస్తున్నది. బహుశ మరొక గ్రంథములో వారిని గురించి వ్రాసేలా వారు నన్ను అనుగ్రహిస్తారేమో, భగవాన్ అనుగ్రహము వల్ల.

శ్రీ రమణార్పణమస్తు.



జ్ఞానమనునది బయట నుండి పొందబడేది కాదు. మరొకరిచే ఇవ్వబడేది కాదు. అది ప్రతి ఒక్కరిచే, వారి హృదయము నందే గుర్తింపబడుతుంది. ప్రతిఒక్కరి యొక్క జ్ఞాన గురువు, ఆ దివ్య చైతన్యమే. 'నేను', 'నేను' అనే అహం స్ఫురణ ద్వారా, ప్రతి హృదయములోను తన ఉనికిని తానే వ్యక్తపరచుకునే సత్యమైన ఉనికియే అది. దానిచే ఒసగబడే (సత్యమైన) ఎఱుకయే జ్ఞాన దీక్షను ఇచ్చుట. తన స్వస్వరూపము యొక్క ఎఱుకయే, గురువు అనుగ్రహము'. తన ఉనికిని నిరంతరము వ్యక్తపరచే, అమరచైతన్యమదియే. ఈ దివ్య ఉపదేశమే నిత్యమూ (అనుక్షణమూ) ప్రతివారిలోనూ సహజంగా జరిగిపోతుంటుంది.

– భగవాన్ శ్రీరమణ మహర్షి